శ్రీ రామ సేవ

# శ్రీ మదాంధ్ర
# వాల్మీకి రామాయణము
## (మందరము) సుందరకాండము

గ్రంథకర్త:
వావిలికొలను సుబ్బారావు



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీమదాంధ్ర

# వాల్మీకి రామాయణము

## (మందరము) సుందర కాండము

రచన

వావిలికొలను సుబ్బారావు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# SRI MADANDHRA VALMIKI RAMAYANAMU

## (MANDARAMU) SUNDARA KANDAMU

T.T.D. Religious Publication Series No:
© All Rights Reserved

e_Book Edition : 2023

Copies:

*Published by :*
**Sri A.V. Dharma Reddy,** IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# - : మున్నుడి : -

శ్లో॥ యావత్ స్థాస్యంతి గిరియః, సరితశ్చ మహీతలే !

తావద్రామాయణ కథా, లోకేషు ప్రచరిష్యతి !!

ఈ విశాల ప్రపంచమున కొండలు, నదులు ఉన్నంతవరకు, శ్రీమద్రామాయణమున వివరింపబడిన రామకథ లోకములో ప్రచారములో ఉంటుందని చతుర్ముఖ బ్రహ్మచేత వరమును పొందినది. వాల్మీకి మహర్షి విరచిత 24000 శ్లోక సహిత, సప్తకాండ విభజిత శ్రీమద్రామాయణ పారాయణ, పఠన, శ్రవణాదులు భక్తజనుల పాపరాసుల రూపుమాపి, శ్రీమన్నారాయణుని దివ్య చరణ సాన్నిధ్యమును ప్రసాదించుననుట నిర్వివాదాంశము.

సంస్కృత భాషరాని వారల సౌకర్యార్థము "ఆంధ్రవాల్మీకి" బిరుదాంకితులై, శ్రీశ్రీశ్రీ వాసుదాస స్వామిగా విఖ్యాతి నొందిన కీ॥శే॥ వావిలికొలను సుబ్బారావు గారు వాల్మీకి మహర్షి విరచిత శ్రీమద్రామాణమును "యథాతథ" పద్యానువాదముగా "ఆంధ్ర వాల్మీకి రామాయణము" అనుపేర తెనుగున రచించిరి. అంతియేగాక పఠితల విశేష గ్రాహ్యార్థము స్వీయరచిత పద్య ప్రతి పదార్థ తాత్పర్య విశేష వివరణ సహిత వ్యాఖ్యానమును "మందరము" అనుపేర శ్రీవాసుదాస స్వామి వారే అనుగ్రహించిన విషయము ఆంధ్రులెఱింగినదే.

శ్రీమద్రామాయణమున "సుందరకాండ" మణిపూస వంటిది. సర్వ అరిష్ట నివారణకు, సమస్త అభీష్టప్రాప్తికి "సుందరకాండ" పారాయణ విశిష్టమైనది.

శ్రీశ్రీశ్రీ దాసశేషస్వామి వారి వద్ద మంత్రోపదేశమును పొంది, శ్రీ కోదండ రామసేవక ధర్మ సమాజ కార్యనిర్వాహక వర్గ కోశాధికారిగా చాలా కాలము సేవ లందించిన కీ॥శే॥ కొత్తూరు శ్రీరామమూర్తి మరియు ధర్మపత్ని జానకిల కుమార్తె శ్రీమతి భోగరాజు అరుణ (W/o. శ్రీ భోగరాజు కృష్ణమూర్తి) మఱియు దత్తు కుమారుడు శ్రీ కొత్తూరు వేంకట సుబ్బారావులు (Rtd. Branch Manger, Central Bank of India, Vijayawada) కీర్తి శేషులైన తమ తల్లి దండ్రుల స్మృత్యర్థముగను, మఱియు శ్రీ కొత్తూరు వేంకట సుబ్బారావు తన సతీమణి కీ॥శే॥ శ్రీమతి లలిత స్మృత్యర్థముగను "శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము - సుందరకాండ మందరము" స్వల్పప్రతులే యున్నందున పునర్ముద్రణ గావించి భక్తజనులకు సంతోషకారకులైరి.

దాసకుటీస్థ శ్రీ వైదేహీ, రామానుజ, సంజీవ రాయ సహిత కోదండ రామ ప్రభువు గ్రంథ పునర్ముద్రణ దాతలకు మఱియు వారి కుటుంబ సభ్యులకు ఎల్లరకు యితోఽధిక శ్రేయః పరంపరలను ఒసంగుదురు గాత !

ఖర ఆషాఢ శుద్ధ పూర్ణిమ

"గురు పూర్ణిమ" **రామానుజ దాసుడు**

తేది : 15-07-2011

శ్రీరామాయ నమః.

# శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణము

## సుందరకాండ పీఠిక.

"యదా యదా హి ధర్మస్య, గ్లానిర్భవతి భారత!
అభ్యుత్థాన మధర్మస్య, తదాత్మానం సృజామ్యహమ్."
పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే."

ద్వి. ఎప్పు డెప్పుడు ధర్మ మెడరు చెందెడినో, యెప్పు డధర్మంబు వృద్ధిచెందెడినో
యప్పు డప్పుడ నేన యవని సృజింతుఁ, దప్పక నన్ను నో ధర్మజావరజ!
సాధుజనంబుల సంరక్ష పలుప, బాధింప దుష్కృతిపరు లైనవారి
జగతి ధర్మంబు సంస్థాపన సేయ, యుగ యుగంబునఁ బుట్టుచుండుదు నేను.

—ద్విపద భగవద్గీత.

అను నియమము ప్రకారము రావణాది రాక్షసులచే హీనస్థితిని జెందుచున్న ధర్మము నుద్ధరించుటకును, ప్రత్యక్ష దర్శనముఁ గోరుచున్న భరద్వాజ శరభంగ సుతీక్ష్ణాద్యరణ్యవాసుల యభీష్టముఁ దీర్పను, దుష్టరాక్షసులఁ గడతేర్పను భగవంతుఁడు శ్రీరామచంద్రమూర్తిగ నవతరించెను.

శ్లో. అవజానంతి మాం మూఢా, మానుషీం తను మాశ్రితమ్
పరం భావ మజానన్తో, మమ భూత మహేశ్వరమ్.

ద్వి. భూతనియామకమున సమర్థంబు, నాతతమగు నా మహాభావ మెదను
దెలియంగఁ జాలని ధీవిరహితులు, వలనుగ మనుజసంబంధ దేహమును
జేకొన్న నన్నుపేక్షింతురు పార్థ! —ద్విపద భగవద్గీత.

అన్నట్టు చెప్పినను దుర్యోధనునివంటి మూఢులు దీనిఁ దెలియంగఁజాలరు గాని భరద్వాజ వాల్మీకి ప్రముఖులగు ఋషీశ్వరులు జ్ఞానులు భక్తులు స్వభావముగనే యెఱుంగుచుందురు. మహాత్ము లాత్మార్థ మేలాభమును గోరరు. లభించెనా దానిని లోకమునకంతయు వినియోగపడు మార్గమును ఘటింతురు. కావున వాల్మీకిమహర్షి నారదోపదేశముచేతను జ్ఞానదృష్టిచేతను శ్రీరామాదుల తత్త్వమెఱింగి యంతటితో సంతుష్టిలేక లోకమును దరింపఁజేయఁ దచ్చరిత్రమును గావ్యరూపముగ రచించుచు దానియం దెక్కువ పటిమయుఁ బఠనమువలన నెక్కుడు ఫలముఁ గూర్పఁగోరి దానిని వేదబృంహితముగావించి ప్రణవగాయత్ర్యష్టాక్షరాది మంత్రపూరితముఁ గావించెను.

౧. శ్రీమద్రామాయణము నందలి కాండము లేడిటియందు సుందరకాండ ముత్తమోత్తమమనియు, సకలాభీష్టప్రదమనియు నార్యులు విశ్వసించి శ్రద్ధాభక్తియుక్తముగ ననుదినము పఠించి కృతార్థు లగుచుండుట జగద్విదితము.

శ్రీరామాయణమున నొక్కొక్క కాండమున నొక్కొక్క విశేషము గలదు. వ్యాధులు, కారాగృహ బంధనములు, గ్రహపీడలు, అనపత్యతలు, దారిద్ర్యములోనైన సంకటములన్నియు సుందరకాండ పారాయణమువలనఁ దొలఁగుటయే గాక భుక్తిముక్తులును గలుగును. ఇది పారంపర్యముగ వచ్చిన మూఢవిశ్వాసము గాదు. పరీక్షితము. సిద్ధాంతితము. ప్రత్యక్షము. సహేతుకము.

శ్లో. త్రివర్గఫల కామేన, విపదుత్తరణేచ్ఛునా
శ్రీమత్సుందర కాండస్య, పాఠః కార్యో విజానతా.
శాంతికర్మణి సర్వత్ర, తథా దుస్స్వప్న దర్శనే
గ్రహపీడాసు చోగ్రాసు, రోగేషు విషమేషు చ
అరణ్యే ప్రాంతరేవాపి, శస్త్రచోరాగ్ని పీడనే
సర్వాస్వాపత్సు, ఘోరాసు, నైతస్మాత్తారకం పరమ్.
శ్రీమత్సుందర కాండస్య, సప్తసర్గ్యభిపాఠతః
మహారాజ్యాది సంపత్తి, ర్లభ్యతే దుర్లభాపి వా,
ఆయుష్కామో లభే దాయు, ర్ధనకామో ధనాన్యపి
శ్రీకామః శ్రియ మాప్నోతి, క్షితికామ స్తథా క్షితిమ్.
విద్యాకామ స్తథా విద్యాం, స్త్రీకామశ్చ తథా స్త్రియమ్
ఆరోగ్యకామ స్త్వారోగ్యం, సప్తసర్గ్యభిపాఠనాత్.
యదా యదా హి రామస్య, వృత్తం విపఠిపేద్బుధః
తదా తదాతు "ధర్మా" త్మేతన్మాల మనుం జపేత్.
శ్రీరామచరణాంభోజ, ద్వంద్వం ధ్యాయన్ప్రసన్నధీః
సకృదేవేతి చరమ, శ్లోకం చ శుభదం జపేత్.

అను పురాణవాక్యములు ప్రమాణములు.

3. దక్కిన యందఱు దేవతలకంటెను, దక్కిన యన్ని యవతారమూర్తులకంటెను శ్రీరామమూర్తి క్షిప్రముగఁ బ్రసాదించును. వాత్సల్యము, అభయప్రదాన కరణము, సౌశీల్యము, కరుణ, సత్యసంధత యివి యన్నియు శ్రీరామునందు విశేషముగఁ గలవు.

శ్లో. అనన్యాశ్చింతయంతో మాం, యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమం వహామ్యహమ్
సర్వధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో, మోక్షయిష్యామి మా శుచః.

ద్వి. ఇతర మెయ్యదియైన, హృదిఁ దలంపక యు, క్షితిని నన్నెవ్వరు సేవింతు రట్టి
సతతాభియుక్తులౌ జనముల కైన, హితత యోగక్షేమ మేన వహింతు.

అన్నిధర్మంబులఁ ద్యజియించి లెస్స, నన్ను నొక్కని శరణంబును జొరుము, పన్నగ సర్వపాపంబులవలన, నిన్ను ముక్తు నొనర్తు నిర్వేదపడకు.

—ద్విపద భగవద్గీత

అను శ్రీకృష్ణవాక్యములను

శ్లో. మిత్రభావేన సంప్రాప్తం, న త్యజేయం కదాచన
దోషో యద్యపి తస్యస్యాత్, సతా మేత దగర్హితమ్
సకృ దేవ ప్రపన్నాయ, తవాస్మీతి చ యాచతే
అభయం సర్వ భూతేభ్యో, దదా మ్యేతద్వ్రతం మమ.

తే. మైత్రి భావించి తానసంప్రాప్తుఁడైన, వాని నెటు లేని చేపీడు వాఁడఁగాను
వాని యెడనుండెనేని నేదేని దోష, మద్ది గర్హ్యంబు గాదు సదాళులకును.

క. నీవాఁడని యొకపరియే, యేవాఁడేన్ శరణు వేఁడెనేని సకల భూ
తావళి కభయంబును నే,వావిరి ఘటియింతు నిదియ వ్రతమగు నాకున్.

అను రామవాక్యములను

"స్మరణమాత్ర సంతుష్టాయ" యని శ్రీరామకవచమునందలి వాక్యములను బోల్చి చూచిన పై విషయము స్పష్టమగు.

ఇట్టి శ్రీరాముని కంటెను ప్రేమస్వరూపిణి సీతాదేవి క్షిప్రప్రసాదిని.

శ్లో. ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా.

కం. ప్రణతి ప్రసన్న జానకి.

శ్లో. న పరః పాప మాదత్తే, పరేషాం పాపకర్మణాం
సమయో రక్షితవ్యస్తు, సంతశ్చారిత్ర భూషణాః
పాపానాం వా శుభానాం వా, వధార్హాణాం ప్లవంగమ!
కార్యం కరుణ మార్యేణ, న కశ్చిన్నాపరాధ్యతి
లోకహింసా విహారాణాం, రక్షసాం కామరూపిణామ్.
కుర్వతా మపి పాపాని, నైవ కార్య మశోభనమ్.

క. తన కపకార మొనర్చిన, మనుజున కపకృతి నొనర్ప మదిఁ దలఁపడు స
జ్జనుఁ డీనియతిం బ్రోవఁగఁ, బొనరున్; సజ్జనులు శీలభూషణు లెందున్.

క. కపివర! పుణ్యులలోఁ బా,పపు జనములలోన వధకుఁ బాత్రుల పట్లన్
గృపఁ జూపవలయు సజ్జనుఁ; డపరాధముఁ జేయనట్టి యతఁడుం గలఁడే.

తే. పాపములె చేయుచును గామరూపులగుచు,భువనహింసావిహారులై పొలుచుచున్న
యసురులకుఁ గీడు సేఁతకార్యంబుగాదు,సుమ్మటన్న హనుమయా సుదతికనియె.

అను వాక్యములఁ బరిశీలించిన సీతారాములకుఁగల యంతరము స్పష్టమగు.

ర. రావణాసురుఁడు దేవతాస్త్రీలను మనుష్యస్త్రీలను జెఱపట్టి పతివ్రతల కెఱిచి దుఃఖపెట్టుచుండ, శ్రీమహాలక్ష్మి సహింపఁజాలక, వేదస్వరమునుండి వేదవతి

యన నయోనిజయై జనియించి, రావణాసురు శపించి, మరల నయోనిజయై సీతయై పుట్టి శ్రీరాముఁ జేపట్టిఁ నాయన వెంట నడవులకు మెట్టి, రావణాసురుని మట్టు పెట్టింపఁ గారణముఁ గల్పింప జింకను బట్టితేర భర్తనంపి రావణునకుఁ జిక్కి, వానిని భస్మీకరింపఁ గలిగియు, భస్మీకరింప నొల్లక, భర్తచే నతని సపుత్రమిత్ర బాంధవముగఁ జంపించి లోకమున కానందము గలిగించెను. ఎంతదయావతి గాక పరులకై తాను గష్టపడి వారి కష్టముఁ దప్పించునా? లోకమునఁ దండ్రికంటెను దల్లి దయావతిగదా. ఇఁక జగన్మాతవిషయ మేమి చెప్పవలయును.

౫. రాముని భజించి విసిఁగి "ననుఁ బ్రోవుమని చెప్పవే ఓ సీతమ్మా"యని గోపన యేడ్చువఱకు నాయనకుఁ గారాగృహముక్తి కలుగకపోయెను. భక్తుల కెల్లనిది యనుభవవిదితము.

౬. రామాజ్ఞప్రకారము లక్ష్మణుఁడు సీతాదేవిని వాల్మీకి యాశ్రమమున విడిచి పోయెను. పటిమొఱ్ఱున నామె యొంటిగ దుఃఖించుచుండ వాల్మీకిశిష్యు లెవ తెయో యేడుచున్నదని వాల్మీకికిఁ జెప్పిరి. ఆయన యోగదృష్టిచేత సర్వము దెలిసికొని పావుకలైన ధరింపక రిత్తకాళ్ళఁ బరువెత్తివచ్చి యామెను బూజించి తోడ్కొనిపోయి మునిస్త్రీల కప్పగించెను. ఆమె మహిమయు నామెకు వచ్చిన నిందయుఁ జూడ వాల్మీకికిఁ గలిగిన పరితాప మింతంత యనరాదు. ఇట్టి పతివ్రత కిట్టి నింద లోకమున నిలువనిచ్చుట సరిగాదనియు, నామె వృత్తము జగద్విదితము చేయవలయుననియు నాలోచించి తద్విధానము నరహస్యముగ నారదుచే నుప దేశము నొంది రామాయణముగ రచించి యామె పుత్రులకే నేర్పి సభలయం దెల్లఁ బాడించి యామెను బరీక్షకు నిలువంజేసి యామె యశఃకీర్తి నొలఁగించి యామె యవతారమూర్తి యని లోకమున బ్రసిద్ధి చేసెను. కావుననే శ్రీరామాయణమును వాల్మీకి "సీతాయాశ్చరిత మ్మహత్" అనెను. రామాయణ మేడు కాండములు తుదముట్ట హెచ్చరికతోఁ జదువువారికి వాల్మీకికి రామునియందున్న భక్తి గౌరవముకంటె సీతాదేవియం దెక్కువభక్తి గౌరవము లుండెనని స్ఫురింపక మానదు. కావుననే యామె నధికరించి చెప్ప సుందరకాండము నన్ని విధముల సుందరముగను సారవంతముగను వాల్మీకి యొన ర్చెను. సుందరమూర్తి వినాయకుఁ డన్నట్లే సుందరహనుమంతుడని పరాశర సంహితయందుఁ గలదు. నామైకదేశే నామగ్రహణమ్మని భీమసేనుని భీముఁ డనియు, సత్యభామను భామయనియు ననునట్లే సుందరహనుమంతుని సుందరుఁడనఁ దగు. అతిరూపవతీ సీతాయన్నట్లు సీత త్రిలోకసుందరి కావున సుందరీ సుందర శబ్దముల కేకశేషయందు సుందరయనియే నిలుచును కావున సుందరుల నధికరించి చెప్పిన కాండము సుందర కాండము, భగవత్సౌందర్యముగూడ నిందు వర్ణితము.

౩. ఈ కాండమున నాయాఘట్టములను బఠించుటవలన ఫలము తత్త్వ సంగ్రహ రామాయణమం దిట్లు చెప్పఁబడినది.

శ్లో. "సుందరాదివు సర్గస్థ, హనుమద్విక్రమాదికమ్
శ్రుత్వాపస్మార కుష్ఠాది, భూతభేతాళ నాశనమ్.
సనిర్జిత్య పురీం శ్రేష్ఠా, మితి శ్లోకాది మాక్షరమ్
శ్రుత్వా బంధాద్విముక్తస్సన్, బ్రహ్మ భూయాయ కల్పతే
సీతా సందర్శనం శ్రుత్వా, వీతశోకో భవిష్యతి.
శ్రుత్వాతు త్రిజటాస్వప్నం, దుస్స్వప్నం నశ్యతి ధ్రువమ్
శ్రీరామ ముద్రికాదానం, యే శృణ్వ న్త్యాదరేణతు
నిర్జిత్య శత్రూన్ సంగ్రామే, స్థిరం రాజ్యం వ్రజంతి తే.
ధన్యా దేవా స్సగంధర్వా. స్సిద్ధా ఇత్యత్ర చాదిమమ్
శ్రుత్వా చతుర్దశం వర్ణ, మసంగో వాయువ చ్చరేత్
హనూమద్గ్రహణం శ్రుత్వా, బంధా న్ముచ్యేత మానవః
లంకా దాహాద్యనుశ్రుత్వా, తాపత్రయ హతిర్భవేత్.
మంగళాభిముఖీ త్యస్మిన్, శ్లోకే యత్ప్రథమాక్షరమ్
తద్గాయత్ర్యాః పంచదశం, శ్రుత్వా మద్రూప భాగ్భవేత్
శ్రుత్వాతు పంచమం కాండం, హనుమద్విజయాంకితమ్
ఆంజనేయ ప్రసాదేన, బ్రహ్మలోకం స గచ్ఛతి."

ర. ఉ. ఎవ్వనిచే జనించు జగ, మెవ్వనిలోపల నుండు, లీనమై
యెవ్వని యందు డిందుఁ, బరమేశ్వరుఁ డెవ్వఁడు, మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు, సర్వముఁ దాన యైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మవిభు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

క. నర్తకునిభంగిఁ బెక్కగు, మూర్తులతో నెవ్వఁడాడు మునులున్ దివిజుల్
గీర్తింప నేర రెవ్వని, వర్తన మొరు లెఱుఁగ రట్టివాని భజింతున్. భాగ.

అని గజేంద్రుఁడు ప్రార్థింప భగవంతుఁడు సాక్షాత్కరించి యతని బాధ తొలఁగించెను. అట్లులే దేవతలు ప్రార్థింప భగవంతుఁడు శ్రీరాముఁడుగ భూమిపై నవతరించెను. మీఁదఁ జెప్పఁబడిన యనంతకల్యాణగుణములన్నియు శ్రీరాముని యందుఁ గలవని వాల్మీకి యా యా కాండముల నందందు వర్ణించియున్నాఁడు. ఈ సుందరకాండమందు జగత్సంహారకశక్తి రామునందే కలదని,

తే. అధిప! బ్రహ్మస్వభువు చతురాస్యుఁడైనఁ
త్ర్యంబకుఁడు రుద్రుఁడును బురహరుఁడునైన
నింద్రుఁడు మహేంద్రుఁడును సురాధీశుఁడైనఁ
గలన శ్రీరామవధ్యునిఁ గావలేరు.

ఇత్యాది వాక్యములచే స్థాపింపఁబడినది.

౯. 'అజాయమానో బహుధా విజాయతే' యను శ్రుతిప్రకారము భగవంతుఁడగు విష్ణువు "సంభవా మ్యాత్మమాయయా" యన్నట్లు తన మాయచేత నానా రూపములు వహింపగలఁడను విషయము.

తే. అకట! యవ్యక్త మేక మనంత మగు న,చింత్య విష్ణుని తేజంబు స్వీయమాయ
వానరాకృతిఁ గైకొని వచ్చెనేమొ, యఖిల రాక్షసకుల వినాశార్థ మిపుడు.

ఇత్యాది వాక్యములచే స్థాపింపఁబడినది. మాయ యనఁగా నద్భుతశక్తి

౧౦. అర్థపంచకజ్ఞాన మాచార్యువలననే కలుగునని హనుమంతునిచర్యవలన బోధింపఁబడినది. ౧. ప్రాప్యమగు బ్రహ్మస్వరూపము, ౨. జీవాత్మస్వరూపము, ౩. ఉపాయస్వరూపము, ౪. ఫలస్వరూపము, ౫. విరోధిస్వరూపము. ఈ యైదింటికి నర్థపంచకమని పేరు.

౧౧. దశేంద్రియాధిష్ఠితమైన దేహమే లంక. అహంకార మమకారములు రావణ కుంభకర్ణులు. ఇంద్రజిదాదులు కామక్రోధాదులు. ఇందు బంధింపఁబడిన చేతనుఁడే సీత. (స్త్రీప్రాయ మితరత్సర్వమ్మనునది ప్రమాణము) వివేకముతోడ్పాటుగల చేతనుఁడే యింద్రియములకు వశుఁడుగాక భగవంతుని భక్తిచే సేవించి సాయుజ్యము నొందఁగలఁడు. ఈ వివేకమే విభీషణుఁడు. భగవంతుఁడు తన్ను రక్షించునో రక్షింపఁడో యనుసందేహముచేఁ బరితపించుచున్న చేతనునికి నాచార్యుఁడర్థపంచక జ్ఞానము గలిగించి యతని నుజ్జీవింపఁ జేసెనని హనుమచ్చర్యవలన విశదమగుచున్నది. ఆచార్యుని చర్యయుఁ జక్కఁగ నిందు బోధింపఁబడినది.

౧౨. ద్వయ మంత్రములోని శరణ శబ్దార్థ రహస్యమంతయు నిందు వివరింపఁబడినది.

౧౩. గాయత్రీమంత్రములోని 'దేవ' శబ్దార్థ మిందు శ్రీరామ దివ్యమంగళ విగ్రహవర్ణనముచే వర్ణింపఁబడినది.

౧౪. ఈ కాండమందు సంసారసాగరము తరింపఁగోరి యాత్మవిచారముఁ జేయు యోగి యభ్యాసాదివిధము హనుమంతుని చర్యవలనఁ దెలియఁదగియున్నది. హనుమత్కపియే మనస్సు. యోగమున కంగము లెనిమిది. యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి. ఇందు మొదటియైదు బాహ్యాంగములు.

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అనునవి యమములు. శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ప్రణిధానము అనునవి నియమములు. పద్మాసనాదులు ఆసనములు. శ్వాసబంధము ప్రాణయామము. ఇంద్రియములు విషయములయందు వ్యాపింపనీక లోపలి కాకర్షించి చిత్తమున నిలుపుట ప్రత్యాహారము.

యమనియమములు హనుమంతునియం దుండుట సుప్రసిద్ధము. ఆసన ప్రాణాయామములు 3-30 పద్యములయందుఁ గనవగు. ఇవి చదువునపుడు భగవ ద్గీతయందలి యీ శ్లోకముల ననుసంధించునది.

శ్లో. సమం కాయ శిరోగ్రీవం, ధారయన్న చలం స్థిరమ్.
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం, దిశశ్చా నవలోకయన్
ప్రశాన్తాత్మా విగతభీ,ర్బ్రహ్మచారివ్రతే స్థితః
మనస్సంయమ్యమచ్చిత్తో, యుక్త ఆసీత మత్పరః.

అభ్యాసమందుఁ బ్రాణాయామముకంటెను బ్రత్యాహారము కష్టసాధ్యము. ప్రాణాయామదశయందుఁ దా నింత లావు పొడుగు గలవాఁడనను స్థూలదేహజ్ఞాన ముండవచ్చునుగాని ప్రత్యాహారదశకు వచ్చునప్పటికి దేహ మత్యల్పమైనట్టుగ భావించి (హనుమంతుఁడు పిల్లి యంత యగుట) దేహసంధు లన్ని సడలించినఁ గాని ప్రత్యాహారము సాధ్యముగాదు. శనైశ్శనై రుపరమే త్తన్నట్టు లెంత మెల్లగా మనస్సును లోపలికిఁ బ్రవేశింపఁ జేయవలయుననినను వ్యాధిలోనగు ప్రతిబంధకములలో నేదోయొకటి (లంకారాక్షసి) యడ్డుపడుచునే యుండును. దానిని జయింపక యాత్మ దర్శనము సాధ్యముగాదు. ఆత్మసాక్షాత్కారము నొందిన పెద్దలవలనను (సంపాతి) శ్రుతివలనను, ఆత్మ హృదయగుహాయం దున్నట్టు తెలిసినను దానిని గనులారఁ గనుఁగొనుటకై హనుమంతుఁడు రాత్రి యందు శ్రమించినట్టు మరల మరల శ్రమింపవలయును. ఇందును భ్రాంతిదర్శనము (మండోదరీ దర్శనము) లోనగు విఘ్నములు కలుగును. ఈ గండము లన్ని గడ చిన నాత్మదర్శనము కలుగును. ఇట్టులే పోల్చిచూచిన సీతాసంభాషణము, లంకా దహనము, వానరులతో సీతావృత్తాంతము చెప్పుట సీతాదేవియందలి భక్తి- యిట్టివన్నియు యోగాభ్యాసరతుల కనుభవగోచరములు. అభ్యాసు లీ కొంచెము సూచించుటవలననే సర్వము గ్రహించి యానందింపఁ గలరు. కావున నింతతో నీ విషయము విరమించెదను.

౧౨. శ్లో॥ యే తు సర్వాణి కర్మాణి, మయి సన్న్యస్య మత్పరాః
అనన్యే నైవ యోగేన, మాం ధ్యాయంత ఉపాసతే
తేషా మహం సముద్ధర్తా, మృత్యుసంసారసాగరాత్
భవామి న చిరాత్పార్థ!, మయ్యావేశితచేతసామ్
మయ్యేవ మన ఆధత్స్వ, మయి బుద్ధిం నివేశయ
నివసిష్యసి మయ్యేవ, అత ఊర్ధ్వం న సంశయః.

ద్వి. అన్ని కర్మముల నాయందున యునిచి, నన్నె పరుఁడుగ ననన్యయోగము
నన్ను ధ్యానించుచు నన్ను పాసించు, చున్నారో వారల నోపి నాయందు
మనసుంచువారల మరణంబుతోడ, మొనయు సంసార సముద్రమునుండి
చెచ్చెరఁ దరియింపఁ జేయుదుఁ బార్థ, నిచ్చలు నాయందె నిలుపు మనంబు

నాయందె నిలుపు మనయమును బుద్ధి, నాయక యిఁకమీఁదఁ బార్థ! నాయందె నిలువంగఁ గల విది నిక్కంబు సుమ్ము, వలదు సందేహంబు వసుధేశతనయ.

....ద్విపద భగవద్గీత.

అను భక్తియోగవిషయమైన భగవద్గీతా వాక్యములను సీతాదేవిచర్యతోఁ బోల్చిచూచిన పరభక్తి విషయము స్పష్టపడును.

౧౬. సీతాదేవిచర్య ప్రపత్తియు సూచించుచున్నది.

శ్లో॥ అనన్యసాధ్యే స్వాభీష్టే, మహా విశ్వాసపూర్వకమ్
తదేకోపాయతా యాచ్ఞా, ప్రపత్తిశ్శరణాగతిః.

అని శరణాగతి లక్షణము.

సీతాదేవికోరిక రామసమాగమము అనన్యసాధ్యము. రాముఁ డెట్లయినఁ దన్ను రక్షించుననుట సీతాదేవికి నమ్మకము. కావుననే యితరోపాయము (హనుమంతుని వెంటఁబోవుట) యను మార్గ మంగీకరింపదయ్యె.

౧౭. భక్తియోగ ముద్యానసంచారమువలె మనోహరమైన మార్గమనియు యోగమార్గము నిరాలంబనముగ సముద్రము దాఁటుటవంటి దుస్సాధ ఘోర కార్యమనియు నీ కాండమువలనఁ దెలియఁ దగియున్నది.

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు, కశ్చిద్యతతి సిద్ధయే
యతతా మపిసిద్ధానాం, కశ్చిన్మాం వేత్తి తత్త్వతః.

అన్నట్లు లన్నికోట్లకపులలోఁ హనుమంతుఁ డొకఁడే కార్యసిద్ధి నొందఁగలిగెను.

యోగమార్గ సంచరిష్ణువునకు "ధైర్యము స్మృతియు వారక దాక్ష్యము ధృష్టి" దృఢముగఁ గలిగినఁ గాని కడచేఱ లేదు. ఇట్టివానికి మొదటివిఘ్నము తన హితుల వలననె కలుగును వీని మార్గకష్టము తెలిసిన మిత్రులితఁడింత దుస్సాధ కార్యమునకుఁ బూనెనే యెట్లగునో యను సందేహముచే వీని దృఢ వ్యవసాయమునకు సాహాయ్య రూపకవిఘ్నము కలిగింతురు. అది విఘ్నమే కావున దాని నభ్యాసి యంగీకరింపఁ దగదు. (మైనాకచరిత్ర) అది గెలిచిన తరువాత వీని శుద్ధశక్తిఁ బరీక్షింప దేవతలే విఘ్నములు కలిగింతురు. (సురస). వానికిని లోఁబడరాదు. ఇదియైనపిమ్మట భూతగ్రహములు వీనిని బీడించును. (సింహికా వృత్తాంతము). దీనిని జదువువారు జరిగిన కార్యమునకుఁ దగిన కారణములు కల్పించి వ్రాయుచున్నారని భ్రమింపవచ్చును. అభ్యాసపరు లట్లు తలఁపరు. ఈ విషయమై వివేకానందస్వాములవారి జీవితములోని యీ వాక్యముల ననువదించుట యప్రస్తుతము గాదు.

**"Tradition has it that the tree is protected, as it were, by a *Bhairava* ora powerful spirit, who prevents any one who is not pure from meditating there. Even Totapuri and Noren experienced great difficulty, as it is said, in concentrating of their minds on Reality there. Some powerful force seemed bent on driving them forth..........................................**

In the instance of Noren, however, it was diffrent. Finding that something opposed him in his desire to centre his mind upon God, he took a flaming brand from the meditation fire before him and struck the ground, with such violence and with such intensity of emotion that he swooned. When he emerged from thas state, however, he found that he could meditate with ease.

Later another man endeavoured to do that which saints had done, and he became mad. He could not endure the forms which came in the course of the meditation upon the Terrible one, who dances the Dance of Death and Destruction."

ఇట్టి యోగసిద్ధిని హనుమంతుఁడు పరభక్తికి సాధనముగఁ జేసికొనెను.

౧౮. సుందరకాండమునఁ బ్రథమాక్షరము 'త'. కాండము నందలి కడపటి యక్షరము 'త'. ఇది 'తత్' అనుదానిని బోధించుచున్నది.

మొదటి శ్లోకము.

శ్లో. తతో రావణనీతాయాః, సీతాయాశ్శత్రుకర్శనః.
ఇయేష పద మన్వేష్టుం, చారణా చరితే పథి.

క. తరువాత రావణాసుర, వరనీత ధరాత్మజాతపదము న్వెదకన్.
గురుచారణమార్గంబున, నరుగఁగ నృపదూత గర్శితారి దలంచెన్.

కడపటి శ్లోకము.

శ్లో. తతో మయా వాగ్భి రదీన భాషిణా, శివాభి రిష్టాభి రభిప్రసాదితా
జగామ శాంతిం మమ మైథిలాత్మజా, తవాపి శోకేన తథాభిపీడితా.

తే. తత భవద్దుఃఖమునకును ధరణిగోత్ర,
వార్ధిచంద్రమ! యట్లు తాఁ బాధపడుచు
శుభము నిష్టంబు నగు నాదు సూక్తి ధృతి నొ,
సంగ శ్రీరామ వహియించెఁ శాంతి సీత.

ఇదిగాక సుందరకాండమునఁ బ్రతిసర్గమున మొదటి యక్షరము సకారమో తకారమో యుండును. లేదా యా శ్లోకమున సీతయను శబ్దముగాని తత్పర్యాయ పదముగాని యుండును. అదియుఁ దప్పిన రెండవశ్లోకము మొదటి యక్షరము స, త, తప్పదు.

ఈ స,త-లు సీతయని సూచించుట స్పష్టమేకదా. సీతయేకదా సుందర కాండమున కధిష్ఠాన దేవత. సీతాయా శ్చరితం మహత్తన్నట్టు శ్రీరామాయణ మంతయు సీతామాహాత్మ్యమే తెలిపినను నందు సుందరకాండము నాయకరత్నము కదా. సీత=ఓమ్ అని సాంఖ్యశాస్త్రప్రకార మగుచున్నది. ఈ ఓం తత్ సత్ ల ప్రయోజనము భగవద్గీతయం దిట్లు చెప్పఁబడినది.

శ్లో. ఓం తత్స దితి నిర్దేశో, బ్రహ్మణ స్త్రివిధస్స్మృతః
బ్రాహ్మణా స్తేన వేదాశ్చ, యజ్ఞాశ్చ, విహితాః పురా.

తస్మా దోమిత్యుదాహృత్య, యజ్ఞదానతపఃక్రియాః
ప్రవర్తన్తే విధానోక్తాః, సతతం బ్రహ్మవాదినామ్.
తదిత్యనభిసంధాయ, ఫలం యజ్ఞ తపఃక్రియాః
దానక్రియాశ్చ వివిధాః, క్రియంతే మోక్షకాంక్షిభిః.

ద్వి. ఓమ్మని తత్తనియును సత్తటంచు, నిమ్మూఁడువిధముల నెసఁగుచునుండు
బ్రహ్మనిర్దేశంబు; పరఁగఁ దద్వ్యక్తి బ్రాహ్మణుల్ క్రతులునధ్వరములుపూర్వ;
మట్టులుగాన నోమ్మని మున్ను పల్కి, పట్టుగ నా బ్రహ్మవాదుల విధులఁ
బలుకంగఁ బడినతపంబు దానంబు, కలితయజ్ఞము నెల్లకాలంబు జరగు;
తత్తని ఫలకాంక్షఁ దవులక ముక్తి, హత్తఁ గోరినవారు యజ్ఞముల్ తపము
వివిధ దానక్రియా విసరంబు లెల్ల, నవనీశనందన! యాచరించెదరు.

—ద్విపద భగవద్గీత

దీనిని బర్యాలోచించి చూచినచో సుందరకాండ పఠనమువలన భుక్తి ముక్తులు కలుగుట యేమి వింత! శ్రద్ధయు భక్తియు నుండినఁ జాలును.

అల్పశక్తుఁడను కించిజ్జ్ఞుఁడనైన నా మనస్సునకు గోచరించినవఱకు పరివర్తన మందు నాకు సాధ్యమైనవఱకు మూలమునఁ గల విశేషరహస్యము లాంధ్రమునను బొందు పఱిచితిని. లోపములున్నచోఁ దెలుపు మహాత్ములపాదములకు నమస్కరించి వానిని గ్రహించి కృతార్థుఁడ నయ్యెద. సంస్కృతరామాయణము సర్థము గ్రహించి పారాయణ మొనర్చుట సర్వశ్రేయస్కరము. ఏతద్గ్రంథకర్తను కృతార్థునిఁ జేయఁ గాఁ బోలుఁ గొందఱు పుణ్యు లాంధ్రవాల్మీకి రామాయణమునే పారాయణమొనర్చితి మనియు, దానివలననే తమకోరికలుకొనసాగినవనియు వ్రాసిరి. అర్థము తెలియని చదువు వ్యర్థము. అర్థము తెలియక మనసు రంజిల్లదు మనసు రంజిల్లక భక్తి కుదురదు.

క. ఆయా దేశమువారికి, నాయా దేశంబుభాష నమరినకావ్యం
బాయతపురుషార్థంబులఁ, బాయక సమకూర్చు దేవభాషయుఁబోలెన్.

క. సురభాషార్థము తెలియని, తరుణులకును శూద్రులకును దమతమ సీమం
బరఁగినమాటలఁ జెప్పిన, వరకావ్యము పఠనమున కవశ్యంబయ్యెన్.

—అప్పకవి.

అని యుండుటచే సుబోధమగు నీ గ్రంథము పఠించుటచే వీరికి సత్ఫలము కలుగుట ధర్మమే కదా. మూలమునందున్న మంత్ర, బీజాక్షరాదు లిందు నుండుటయే దానికిఁ గారణము.

భగవంతుఁ డిట్టివారికి సకల శ్రేయస్సులు నొసంగునుగాక. దైవభక్తి లోకమునఁ బరిల్లుఁగాక.

ఇట్లు ప్రార్థించు,
శ్రీరామచరణారవిందమిళిందుఁడు, భక్తచరణపరిచరణుఁడు,
వాసుదాసుఁడు.

శ్రీలక్ష్మీ నృసింహాయ నమః.

# అథ శ్రీ ఆపదుద్ధారక హనుమత్ స్తవరాజమ్.

శ్రీ గురుభ్యో నమః। హరిః ఓం। వసిష్ఠ ఉవాచ। సాధు శ్రుతం హనుమతశ్చరితం దురితాపహమ్। హనూమత్ స్తవరాజం మే వద దేవర్షి సత్తమ। శ్రీ౦ర౧)

శ్రీ నారద ఉవాచ। ఆపదుద్ధారకం నామ స్తవరాజ మిమం మునే। కథయామి హనూమంతం నత్వాహం వేధసా కృతం।

అస్య శ్రీఆపదుద్ధారక హనుమత్స్తవరాజ మహామంత్రస్య బ్రహ్మాఋషిః। ప్రకృతిచ్ఛందః। ఆపదుద్ధారకో భగవాన్మారుతి ర్దేవతా। రం (ఓం శ్రీం రం) ఇతిబీజం। లం ఇతి శక్తిః। క్లీం ఇతి కీలకం। శ్రీహనుమదంతర్గత శ్రీసీతాపతి శ్రీరామచంద్ర ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః। ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం హనుమతే అంగుష్ఠాభ్యాం నమః. ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం వృషాకపయే తర్జనీభ్యాం నమః। ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం మారుతాత్మజాయ మధ్యమాభ్యాం నమః। ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం అంజనాసూనవే అనామికాభ్యాం నమః। ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం ఏకవీరాయ కనిష్ఠికాభ్యాం నమః। ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం పంచముఖాయ కరతలకరపృష్ఠాభ్యాం నమః। ఏవం హృదయాది న్యాసః। భూర్భువస్సువరోం। ఇతి దిగ్బంధః। అథ ధ్యానం। ఆద్యాది లక్ష్మీపతి పాదజాత మహానుభావ ర్తి కృతాదిచర్యమ్। శ్రీపారిజాత ద్రుమమూలవాసం క్లేశాపహం సంకలయామి చిత్తే।

బ్రహ్మా ఉవాచ। ఆద్యాది శ్రీరమేశాంఘ్ర్యమలకమలజాంగుష్ఠమూలాభిజాతో।
యో ఘోరాదీ ననేకాన్ క్షపయదతిరుషాన్ రాక్షసా న్వీక్షయన్ స్వాన్।
యస్నాహస్రాననాదీ నఖిలసురగణా నుద్ధరా రాపదోగ్ర్యం। తం వందే వజ్ర
కాయం హరివరతనయం మారుతిం స్వేష్టసిద్ధ్యై। ౧

రోగానంతాఖ్యాసనాంతర్మణిగణఖచితామోదనీయే చ పూర్వే।తీరే కల్పద్రు
మధ్యమ్యమణిమణితామాం లసచ్చిత్రవేద్యాం।ఆనందాఖ్యాభిరామే రమయ
దతితరాం సంస్తువన్సంగరాజం। తం వందే। ౨

యస్మైర్వరం తాపసాఖ్యే ద్విజవరజఠరే జాతమాత్రో వివస్వాన్। ఆత్మానందీప్య
మానః స్థిర (శిర) కృతవపుషా క్రోధితే నాత్మసిత్రా।సంశప్తో దృప్తరూపం
హరివరవదనం ప్రాప్య శ్రీశాంఘ్రి మాప్తః। తం వందే। ౩

య శ్శ్వేతద్వీపమధ్యే సురవరనికరై రీడ్యమానం రమేశం। ధ్యాయన్ కృత్వా
తపోగ్రం తదుచిత వచసా ప్రాప్యలోకా ననేకాన్। ఈశస్యాదేశినస్యా జనన
జనన (విజయ) తాం నందయన్నంజనాయాః। తం వందే।

యో. లోకద్యోతనాయ ప్రభవతి తరుణో వారుణో వీక్ష్యభానోః। యంత్రం మం
త్రార్ఘ్య కాలే ఫలమితి సుధియా ధావమానో త్తరేణ। వజ్రేణాతాడితో
ద్రాగపత దితిమతిం ఖ్యాపయిత్వాచ భద్రాం॥ తం వందే॥ ౫

యోధాత్రా సంస్మృతో వా ఉరుతరగిరిమా సానుజాతో వనాంతం। వీక్ష్యాబ్జం
స్వావనాబ్జం హ్యురుతరకుపితో వజ్రసంజ్వాలనాసే। బధ్వా మజ్జోదధౌ తద్గురు
యువతి కృతో మోచయంతం కృపాంతం॥ తం నందే॥ ౬

య స్సుగ్రీవేణ సాకం తరువరనికటే ఋశ్యమూకే వసన్ సన్। సంప్రాప్తో రాఘ
వేశం కపివరవసనే తేన సంయోజ్య సఖ్యే। విఖ్యాతం వాలినం తం రఘుకుల
రమణే నార్దయామాససంతం॥ తం వందే॥ ౭

యో ముద్రాం రామదత్తా మపి చలితమనాస్సన్నిధాయ స్వమూర్ధ్ని। ప్రాప్యాం
బోధిం తమబ్ధిం గురుతర వపుషా మేషమాత్రాదతీత్య। గత్వా లంకా మశోకే
విశకలిత మతిం తోషయామాస సీతాం॥ తం వందే॥ ౮

యో హత్వాక్షం పరోక్షే క్షుభితమభిగతాన్ రాక్షసాన్ ప్రాక్షఘాతైః। విక్షిప్యో
ఒక్షోభ్యరక్షః శరకృతరశనాం ప్రాప్య స్వేచ్ఛావశేన। పుచ్ఛాగ్రే దీపితేన
జ్వాల దనలరుచా దీపయామాస లంకాం॥ తం వందే॥ ౯

యో గత్వాథాంతరంగే రఘుపతి దయితాం తోషయిత్వాచ వృత్తం। దత్తం
చిహ్నం గృహీత్వా పునరమర పథా (విరమతా) లంఘయిత్వా తమ (దా)
బ్ధిం। ప్రాప్యేశం ప్రత్యయాయ జ్వలదనలనిభం ప్రార్పయామాస చిహ్నం॥
తం వందే। ౧౦

యో లబ్ధ్వా రామ సీతాం ప్రతి రఘుపతినా ప్రేషితః ప్రాప్య లంకాం। నిశ్శంకం
రావణేన ప్రతిగిర మురుణా చోత్తరేణ ప్రభాష్య। తద్భాషాం ప్రేక్ష్య
రోషాదథపునరపత త్ఖేచరై రేకవీరః ॥తం వందే॥ ౧౧

యో గత్వైకోరువీరః పథి నరవపుషం మర్దయిత్వా సురారీన్। గత్వాద్రిం
ద్రోణభద్రం తదుపరి దితిజాం శ్చాను (శు) రోషాత్ప్రిహార్య। తం గృహ్యా
గత్యభానా ఉదయతి సుధియా జీవయామాస శేషం ॥తం వందే। ౧౨

యో లింగం వారణాశ్యాః చిరమితిహారిసం (స్థిరమనుపనయన్) స్థాపితే
వాలుకేతం దృష్ట్వా తూష్ణీం నివిష్టో హరిధరకృపయా తత్పురస్థాపయిత్వా।
తద్యాత్రాపూర్ణపుణ్యం దిశతి భువిసతాం సర్వదా ద్యాపి దేవః ॥తం
వందే॥ ౧౩

యో దేహం త్యక్తుకామో జ్వలదనలనిభం శ్యామసుఖ్యాతయిత్వా రామోద్వా
ఖ్యాగమిష్య త్యహహా ప్రియసఖే మాత్యజామక్షమస్వ। ఇత్యుక్త్వా శ్రీశ
వాక్యం భరతమతియశాః రక్షయామాస శిష్టః। తం వందే॥ ౧౪

యో యోధ్యాం పాలయిత్వా రఘుకులతిలకే స్వీయధామప్రవిష్టే ప్రస్థం విశ్వం
పురోధాః పథితబహుమనాః భక్తిభావేన రామే। ఖండే కిం పూరుషాఖ్యే
హృదయ సరసిజే ధ్యాయమానోఽస్వతస్థే (నావితస్థే)॥ తం వందే॥ ౧౫

యో భీమం చాశ్వమేధే దృఢతరవపుషా పూరుషాఖ్యం మృగేంద్రం హ్యానేతుం
గమ్యమానం తనురుహత్రితయం తస్య దత్వాకృపావాన్। తత్పాతోద్భూత
లింగార్చనజనమిమతో రక్షయామాస తోషాత్॥ తం వందే॥ ౧౬

యో హ్యేవం ద్వాదశాబ్దానివ లఘుగణితాన్ బ్రహ్మకల్పావతీత్య। ప్రీత్యా శ్రీ
శాంఘ్రిసేవానవరతమహిమాహ్యక్షలబ్ధబ్రహ్మచర్యం గార్హస్థ్యం ప్రాప్య
బ్రహ్మాసకల జననకృద్వర్ధ్మవిమ్యత్యనీహః॥ తం వందే॥ ౧౭

యః పాటీరోదరాఖ్యే శిఖరి శిఖరగే కాననేదత్తవాక్యాత్. అగ్రేహస్తిధ్వజిన్యాం
స్ఫుటతరరభ సేనాట్టహాసేన సైన్యం। కృత్వాస్తబ్ధం మహాత్మా రిపుగణ
విజయం చాకరోద్దుర్జయం వై॥ తం వందే॥ ౧౮

యస్త్రేధం న్యాయమార్గం నిజనియమమనాః సంవ్రజన్నిర్గమాయ। వానప్రస్థా
శ్రమస్థః శతధృతిరఖిలంచాశ్రమంసంప్రపూర్య। పారివ్రాజ్యాశ్రమేణ క్షుభిత
తనుభవేద్యద్విముక్తో భవేత॥ తం వందే॥ ౧౯

యో భక్తా సన్నవే త్యభవభయమపహాయాతికష్టంచ కష్టాత్। సంతార్యాభీష్ట
సిద్ధింహరిగురుభజనే భావశుద్ధించ దత్వా। కృత్వాశ్రీశాంఘ్రిభక్త్యాన్వితరతి
నియతిజ్ఞానవైరాగ్యధర్మాన్॥ తం వందే॥ ౨౦

నారద ఉవాచ॥ ఇదం హనుమతస్తోత్రం ఆపదుద్ధారనామకం। కృతం యద్బ్రహ్మణాపూర్వం ప్రత్యహం యఃపఠేత్కలౌ। స్నాత్వా శుచిస్సమాసీనః త్రివారం నియమాన్వితః। నతస్యాభిభవం క్వాపి శ్రీహనూమత్ప్రసాదతః। సంకటే విషమే ప్రాప్తే కారాగారప్రవేశనే। శత్రుమధ్యే సభామధ్యే సింహవ్యాఘ్రాది వేష్టితే। మహదాపత్సముత్పాతే ప్రాప్తే రాజభయేపి చ। శతవారం పఠేదేత త్సప్తాహాన్ముచ్యతే నరః। ప్రసూతికాలే నారీణాం సంకటే చ సుమంత్రితం। ప్రాశయేదుదకం సాపి సుఖప్రసూర్భవతి క్షణాత్। పుమాన్మృతుమతీం నారీం ఆమాసం స్నానకాలతః॥ త్రివారం మంత్రితం తీర్థం పాయయిత్వాప్నుయా త్సుతం।

విప్రో వినయసంపన్నో బాహుజో౽తి పరాక్రమం॥ వైశ్యో హ్యతిధనాఢ్యస్స్యాత్ శూద్ర స్సుఖమవాప్నుయాత్। విద్యాకామో లభేద్విద్యాం రోగీ రోగాత్ప్రముచ్యతే। జపం మంత్రసహస్రేణ జపసిద్ధి ర్భవేద్ధ్రువం। శతవారం పఠేన్మంత్రం ఆదావష్టాక్షరం పునః। ఏకవారం త్రివారం వా యావన్మంత్ర మనన్యధీః॥ ఓం హనూమతే స్ఫట్ స్వాహా॥ ఇత్యష్టాక్షరమంత్రతః॥ ఏవం చ సంపుటీకృత్వా స్తవరాజమిమం మునే। తేనసిద్ధి మవాప్నోతినాన్యథాసిద్ధిమేష్యతి। దశాంశం తర్పణం కుర్యా త్పునశ్చర్యాపరో౽న్వహం। తర్పణస్య దశాంశేన పరమాన్నాహుతిః స్మృతా॥ ప్రతిశ్లోకం చజుహుయా త్పాయసం గోఘృతేనచ। ప్రతి శ్లోకం యథైకైకం తర్పయేత్ శుద్ధవారిణా। భోజయేచ్చ శతం విప్రాన్ శక్త్యా భావేకవింశతిం। ఋత్విగ్భ్యోదక్షిణాం దద్యా దాచార్యాయచగాంవరాం। నవరాత్రం జితాహారో దృఢభక్తిర్జితేంద్రియః। శ్రీహనూమత్ప్రసాదేన తస్యలక్ష్మీ స్థిరాభవేత్॥ హనూమా నంజనాసూనుర్మారుతిశ్చ వృషాకపిః॥ వజ్రకాయ స్తపస్వీచ సీతాశోక వినాశనః। లక్ష్మణప్రాణదాతా చ రామకార్యధురంధరః ॥మాసకల్పబ్రహ్మచారీ। పంచాస్యో భక్తవత్సలః (రక్షకః)। ద్వాదశై తానినామాని భక్త్యా నిత్యం హనూమతః॥ యః పఠేత్ప్రయతో భక్త్యా సదేవై రపిపూజ్యతే। ప్రాతస్స్నాత్వాభానువారే హనూమత్స్తవరాజకం। యః పఠేత్సతతం భక్త్యా సర్వసిద్ధిమవాప్నుయాత్॥

ఇతి శ్రీ బ్రహ్మాండపురాణే బ్రహ్మ నారద సంవాదే ఆపదుద్ధారక
హనుమత్ స్తోత్రం సంపూర్ణం.

శ్రీ కృష్ణార్పణ మస్తు.

శ్రీ సీతాపతయే శ్రీరామచంద్రాయ నమః.

# అథ శ్రీ రామాష్టకమ్.

శ్రీగురుభ్యోనమః ॥హరిః ఓం॥ శ్రీమత్కాకుత్స్థవంశే యో లక్ష్మీపతి రభూత్స్వ
యం దీనబంధు ర్దయాసింధు స్స రామో మే ప్రసీదతు॥ ౧

దేవేంద్రప్రేరితో యేన జీవితం దత్తవా న్పురా। వనేచరాణాం భృత్యానాం
స రామో॥ ౨

ధన్వంతరి రితిఖ్యాతో నిర్జరాణాం సుధాందదౌ। యోభక్తవత్సలశ్శ్రీమంస రామో॥ ౩

విశ్వామిత్రాభీష్టసిద్ధిం యో కరో త్ప్రార్థిత స్సదా। ప్రసన్న హృదయోభూత్వా
స రామో॥ ౪

విభీషణోఽసురస్వామీ లంకాసామ్రాజ్యవైభవమ్। యేనాభయంచ సంప్రాప్త
స్స రామో॥ ౫

యస్య కారుణ్యలేశార్థం బ్రహ్మాదిసురపుంగవాః। శ్రేయసేఽజస్రమిచ్ఛంతి
స రామో॥ ౬

భ్రాతృభిః పూజిత స్సీతాయుక్త స్త్రైలోక్యరంజకః। సర్వసంపత్కరో నిత్యం
స రామో॥ ౭

భయేభ్య స్త్రాయతే సద్య సిద్ధిం ప్రాప్నోతి మానవః। యస్యస్మరణ మాత్రేణ
స రామో॥ ౮

ఏతద్రామాష్టకం భక్త్యా యో జపేద్భూసురోత్తమః। స వశీకృతబ్రహ్మాండ స్తస్యా
ఽసాధ్యం కిమత్రహో॥ ౯

ఇతి శ్రీ బ్రహ్మకైవర్తే వసిష్ఠేంద్రద్యుమ్నసంవాదే

రామాష్టకం సంపూర్ణం.

శ్రీ కృష్ణార్పణ మస్తు.

శ్రీః.

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణే నమః.

శ్రీహయగ్రీవ ప్రసన్న

శ్రీ శారదాయై నమః.

శ్రీమతే రామానుజాయ నమః.

# శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

## సుందరకాండము

శరణ! యాజవంజవ
దాశరథి గురుతరికర్ణ • ధారా! శ్రద్ధా
శ్రీశస్త భక్తి తరవ
ణ్యా! శర్మద జానకీ మ • నోంబుజధామా! ౧

## మందరము

సీ॥ పదియు నొకొండన • భావ వత్సరమున, మాతండ్రి మముఁ బాసి • మరణ మొందఁ
చిన్నజనకుచేతఁ • బ్రేమ రక్షింపించెఁ, బదియు మూఁడవయేఁట • భయద మగుచు
నేఁటికి విడువని • నిష్ఠుర రోగానఁ, జావక యుండఁగఁ • జక్కఁగాచె
నలువ దేడవయేఁటఁ • జలుపుచు విధురుఁగా, యోగమార్గంబున • బాగుపఱిచె

గీ. నేఁబదెనిమిది యేఁటఁ దా • నెలమిఁ బిలిచి, తనదు కైంకర్యమున యంద • తద్దనిలిపె
జన్మసార్థకముగ రామ • చంద్రవిభుఁడు, నేఁడు వ్రాయించుకొనుచున్న • వాఁడు దీని

కం. డెందంబున రఘుపతి పద, వందారుఁడ నగుచు స్వాంధ్ర•వాల్మీకి కృతిన్
సుందర కాండము వ్యాఖ్యను, మందరము రచింతు రామ•మాధవు కరుణన్.

అర్థము. శ్రీ సుందరకాండమును శ్రీరామచంద్రమూర్తికిఁ గవి వినిపింప వారిని సంబోధించుచున్నాఁడు.

శ్రీ శబ్దము కాండాదియందు మంగళ కరము గావునఁ బ్రయోగింపఁబడెను.

శ్రీ=నిత్యానపాయినియై యే కాలమందైనను భర్తను వదలియుండని లక్ష్మీదేవికి- శరణ=నివాసస్థాన మైనవాఁడా! శ్రీనివాసుఁడా యనుట- 'శరణం గృహ రక్షిత్రో:'యని యమరకోశము. "రాఘవత్వే భవేత్సీతారుక్మిణీకృష్ణజన్మని" యను విష్ణుపురాణ వాక్యము నిట ననుసంధించునది. ఇచ్చట శరణ శబ్దము మంత్ర రత్న మందలిది. ఈ కాండమందు నా శబ్దార్థమే విశదీకరింపఁ బడునని యీ పద ప్రయోగము సూచించుచున్నది. అజవంజవ=సంసారమనెడి, దాశరథి=సముద్రము నకు, దాశ=బెస్తల, రథి=వాహనములైన యోడలఁగలది రథములు గలది రథి. అనఁగా సంసార సముద్రమునకు గురు=(౧) గొప్పదగు (౨) ఆచార్యుఁడనెడి, తరి=ఓడకు, కర్ణధారా=ఓడనడుపువాఁడా! —సముద్రమును దాఁటఁ గోరినవారికి బెద్దనావ నడుపు వానివలె సంసారమును దాఁటఁగోరిన వారికి నాచార్య ముఖ మున సద్‌జ్ఞానము గలిగించి వారి నందుండి దాఁటించు వాఁడా, గురువనువాఁడు- ఓడ-ఓడలభించి నంతమాత్రముననే మనము సముద్రమును దాఁటలేము. దాని నడుపువాఁడుండవలెను. అతఁడే భగవంతుఁడు. నావ యెట్లోడవాని స్వాధీనమై వాఁడు నడుపునట్లు నడచునో గురువు భగవదాజ్ఞాబద్ధుఁడై భగవదాజ్ఞ లగుశ్రుతి స్మృతి శాసనముల ప్రకారము వర్తించువాఁడై యుండవలెను గాని భగవదా శ్రితుఁడు గానివాఁడు, శాస్త్రజ్ఞానము లేనివాఁడు గురువుగా నుండరాదు. దేశి కుఁడు భగవత్ప్రేరితుఁడై యుండవలెనని భావము. శ్రద్ధా శ్రీ=శ్రద్ధయనఁగా మహా విశ్వాసము. నన్నువశ్య మావలియొడ్డు చేర్చును గాని చేర్పకపోఁడను దృఢ మైన నమ్మకము. అట్టి శ్రద్ధయనెడి సంపద - శస్త=ప్రశస్తమైన- భక్తి=ప్రేమ పూర్వకమైన సేవ యనెడి - శ్రద్ధాసంపత్తి - శస్తభక్తి-పరమభక్తి చెప్పఁబడు టచేఁ బ్రపత్తిభక్తి చెప్పఁబడెను.

ఈ కాండమున సీతాదేవియందుఁ గానవచ్చునవి ప్రేమయుఁ, బ్రపత్తియుఁ గదా. తరవణ్యా=దాఁటించుట కీయఁబడు కూలి గలవాఁడా - ఓడ నడుపువానికి ధనరూపకమైన కూలి యిచ్చినచో భగవంతుని కిచ్చుకూలి శ్రద్ధాభక్తులనిభావము. అవి తప్ప మఱి యే కూలియు నాయన యాశింపఁడు. ఆ కూలి యీయ కుండిన నాయన దాఁటింపఁడు. ఇట్లు దాఁటిపోయిన వాఁగల లాభమేమి యనిన,శర్మము= మోక్షసుఖము, శర్మద=సుఖము నిచ్చువాఁడా! జానకీమనోంబుజధామా = సీతా

దేవి మనస్సనెడి కమలమే గృహముగాఁ గలవాఁడా – ఆమెచే నెప్పుడు స్మరింపఁ బడువాఁడా– ఈ కాండమందు సీతాదేవి చేసిన కార్యమిదియె కదా–ఏ విధమైన శర్మము గలుగునందురా–భగవ ద్దంపతి ప్రాప్తియే సుఖమని భావము. అంతకు మించిన సుఖసంతోషములు లేవు. హనుమంతుఁడు మహాయోగియు, మహాజ్ఞానియు నగుట నిర్వివాద విషయము. అంతటివాఁడు కూడ పోవునపుడు రామ ముద్రికయు వచ్చునపుడు సీతా చూడామణియు ధరించి సముద్రమును దాఁటెను. లంకలో నున్నప్పుడు తా నంతటి గొప్పవాఁడయ్యు భగవద్దాస్యము యోగమున కంటె జ్ఞానమునకంటె గొప్పది యగుట యెఱింగినవాఁ డగుటచే లజ్జ విడిచి 'దాసోహం కోసలేంద్రస్య' దాసుఁడ రామచంద్రున కని రహస్యముగఁగాదు, దిక్కులు మాఱు మ్రోగునట్లు చాటించెను. రామదాసుఁడ నని యెప్పుడు హనుమంతుఁడు చెప్పెనో యప్పుడే రక్షాభరము తమయందున్నదని యంగీకరించినదై 'శీతో భవ హనూమతః' అగ్నిహోత్రుఁడా! హనుమంతునకుఁ జల్లగాఁ గావలసినదని యాజ్ఞాపించెను. అగ్ని వెంటనే చల్లపడెను. రామచంద్రమూర్తిలో సముద్రుఁడు 'అవని నభోఽనిలానలపయస్సులు శాశ్వతమైన మార్గమున్ దవిలిస్వభావమేమియును దప్పవ యట్టులఁనే నగాధ మప్లవమును నోటనాసహజభావము దీనిని దప్పరాదు' అనఁగలిగెనుగాని, 'శీతోభవ' చల్లన గమ్మని సీత యనఁగానే నాస్వభావము దాహక గుణమును నేను వదలలే నని చెప్ప నంతటి ధైర్య మగ్నిహోత్రునకు లేదయ్యెను. దీనివలన రామబాణములకన్నను సీతాదేవి వాక్కు మోఘ మని యేర్పడుచున్నది. ఈస్వభావములు, గిభావములు చూచుచుండిన దాసోహమ్మను వారు తమయందు వైచిన భారము నెట్లు సీతారాములు నిర్వహింపఁగలరు. 'యత్ర రామో భయంనాత్ర నాస్తి తత్ర పరాభవ' యను వాక్య మెట్లు సార్థక పడఁగలదు? ఒకని కొక యధికార మిచ్చినప్రభు వా యధికారమును మరలఁ దీసికొనలేఁడా? అట్టులే యగ్నికి దాహకగుణ మిచ్చినవారు మరల ననివార్య సందర్భముల నివారింపలేరా?

శ్రీరామ దాసోహమ్మను షడక్షరీమంత్రముచే హనుమంతుఁడు లంకయందే బాధయు రాక్షసులచేఁ జెందఁడయ్యె. అట్టులే జీవాత్మయు దేహమున నుండువేళ 'శ్రీరామ' దాసోహమ్మనె నేని దేనివలనను బాధ చెందఁడు.సుఖముగ సంసారము దాఁటి రామ పాదసన్నిధిఁ జేరఁగలఁడు. ఈ పంచాక్షరియందలి కడపటి వర్ణము ప్రథమాగ్ని బీజముతోను, ప్రథమ ద్వితీయ దీర్ఘస్వరములతోను గలిసిన నసాధ్యసాధనమునకు, సర్వభూతోచ్చాటనమునకు సమర్థము లగుచుండ షడక్షర మంత్ర మహిమ నెఱుఁగ నెవ్వరితరము?

సాంఖ్యశాస్త్రప్రకారము రామశబ్దమును శోధించి తెలియవచ్చిన విశేషములు బాలకాండమున వ్రాయఁబడెను. అట్టులే శ్రీ,సీతాశబ్దములను శోధింతము.

రామ ౨, ౫ అనియు ౨+౫=౭ ప్రణవ మనియు నీ లోనగు విషయములు పూర్వము వ్రాయఁబడెను. ఆ ప్రకారము చూచిన శ్రీ=శ + ర = ౫ + ౨=౭ ఆ యంకెలే యీ పర్యవసానముగా నేర్పడి శ్రీ=రామ యని సూచించుచున్నది. అనఁగా నిరువురయందు సమత్వము ద్యోతితము. ఈ సందర్భమున, "యథా మయా జగద్వ్యాప్తం; స్వరూపేణ స్వభావతః। తయా వ్యాప్త మిదం విశ్వం, నియంత్రీచ తథేశ్వరీ" స్వరూపముచే, స్వభావముచే నాచే నెట్లు ప్రపంచము వ్యాపింపఁబడి యున్నదో యట్లులే యామెచేతను వ్యాపింపఁబడియున్నది. ఆమెయే ప్రపంచమునకు నియంత్రి, ఆమెయే యీశ్వరి, 'నిత్యైవేషా జగన్మాతా, విష్ణోః శ్రీరనపాయినీ। కిమత్ర బహునోక్తేన, సంక్షేపేణేద ముచ్యతే। దేవతిర్యఙ్మనుష్యేషు, పున్నామా భగవాన్ హరిః। శ్రీ నామ్నీ లక్ష్మీ మైత్రేయ, నానయో ర్విద్యతే పరమ్॥' ఈ జగన్మాత విష్ణువునకు నిత్యానపాయిని. పెక్కుమాటలవలన లాభమేమి? సంక్షేపముగాఁ జెప్పెదను. దేవతలందు, మనుష్యులందు, పశుపక్ష్యాదులందు మగవారిపేర్లు గలవి విష్ణువు, స్త్రీపేర్లు గలవి లక్ష్మి. ఈ యిరువురకంటెఁ బరమైనది లేదు. 'సర్వేషామేవ లోకానా మీశ్వరీ మమ వల్లభా। అస్యా మమచ శేషం హి, విభూతి రుభయాత్మికా॥ అన్ని లోకములకు నాప్రియురాలే యీశ్వరి నిత్యవిభూతి, లీలావిభూతి (ప్రపంచము) యను రెండు విభూతులు ఆమెకు నాకు శేషములై యున్నవి. 'అస్యేశానా జగతః, ఈ ప్రపంచమునకు నీశానయగు నీమె 'ఈశానాం జగతా మధీశ దయితాం' ఇత్యాది ప్రమాణములచే లక్ష్మీనారాయణులు సీతారాములిరువురు సమానులని యేర్పడుచున్నది.

లోకే స్త్రీవాచకం యావత్, తత్సర్వం జానకీ శుభా। పున్నామ వాచకం యావత్, తత్సర్వం త్వం హి రాఘవ। తస్మాల్లోకత్రయే దేవయువాభ్యాం నాస్తికించన॥ అధ్యాత్మ, 3.

రామా! లోకమున పురుష వాచకములన్నియు నీవు, స్త్రీవాచకములన్నియు సీతాదేవి. కావున మూఁడు లోకంబులందు మీ యిరువుర కంటె వేఱైనది లేదు.

రామ=౫౨. శ్రీ=౫౨–౨౭+౨౫=౫౨. ఇరువదియేడవ వాఁడు భగవంతుఁడు. ౨౫=చేతనాచేతనాత్మక మగు (౨౪ + ౧=౨౫) తత్త్వము. ౨౭+౨౫=౫౨ రామయైనట్లే శ్రీ=౫౨ తెలుపుచున్నది. ఇదియును లక్ష్మీనారాయణుల సమత్వము తెలుపుచున్నది. ఈయర్థమునే సీతయను శబ్దము సుస్పష్టముగ దెలుపుచున్నది. సీ+త=౭+౬=౧౩=వర్ణ సమామ్నాయ మందలి పదుమూఁడవ యక్షరము ప్రణవము. ఈ౭౬ను ముందు చెప్పిన ప్రకారము విభజించితిమేని ౨౭+౨౫+౨౪=౭౬ అగుచున్నది. ఇది చిదచిదీశ్వర తత్త్వముల మూఁటిని దెలుపుచు

వీని శేషీభావమును సూచించుచున్నది. ఇంతకంటెఁ బరమై, మాహాత్మ్యము కలది మఱేది కలదు?

సీతాశబ్దము 'రసో వైస' యను శ్రుత్యర్థమును బోధించుచున్నది. 'రసో వైసః' అనఁగా భగవంతుఁడు ఆనందము నిశ్చయము అని యర్థము. అట్టులే సకారమునకు స్త్రీలింగ రూపము సీ-కావున సీ శబ్దమునకు భగవతి లక్ష్మీదేవి యని యర్థము- 'సా చ లక్ష్మీః బుధైః ప్రోక్తా' యని ఏకాక్షర కోశమునందుఁ గలదు. అట్టులే తకారమునకు నిశ్చయ మని యర్థము.

'కరుణాయాంతు తా స్త్రియా'మ్మని నానా, ర. యందుఁగలదు తా శబ్దమునకు దయ యని యర్థము కలదు.

కావున సీతా శబ్దమునకు లక్ష్మీదేవి కేవల దయావతియని యేర్పడుచున్నది "లక్ష్మ్యా సహ హ్యసీకేశో దేవ్యా కారుణ్యరూపయా। రక్షక స్సర్వ సిద్ధాంతే వేదాంతేపిచ గీయతే' యని ప్రమాణము గలదు.

సీతాదేవి యెట్టి దయావతియో రామాయణము చదివినవారికిఁ జెప్ప వలసిన పనియే లేదు.

సీతాశబ్దమునందువలె సకార తకారములు గల శబ్దములు సతీ, సత్, సేతు, సత్య యను నవి కానవచ్చుచున్నవి. వీని యర్థమునకు సీతాదేవికి సంబంధముగల దేమో చూతము. సతీ='సతీ సాధ్వీ పతివ్రతా' అమరకోశము. సతీశబ్దము సాధారణముగఁ బతివ్రతకుఁ బేరు. దర్శనా దేవ పాపం స్యతీతి సతీ=దర్శనమాత్రముననే పాపములు పోఁగొట్టునది సతి. ఇది సామాన్యసతుల లక్షణము. అందు సీతాదేవి యెటువంటిసతియో రామాయణజ్ఞులకుఁ జెప్పవలసిన పనియే లేదు. ఒకసారియామె కటాక్షము మనమీఁదఁ బడినను, ఆమె దర్శనము మన కొకసారి కలిగినను మన పాపములెల్ల నశించి కృతకృత్యుల మగుటయందు నేమి సందేహము గలదు. ఆమె దర్శనప్రాప్తిలేనప్పుడు అట్టి పుణ్యాత్మురాలి చరిత్ర పఠించుటయు సర్వ పాప హరము.

సేతు=నీళ్ళుపోకుండ రెండొడ్డులకు నడుమ నడ్డముగఁ గట్టఁబడుకట్టకు సేతు వనిపేరు. ఈయన కట్టలు కట్టుట యం దుద్దేశ్యమేమి? (౧) నీళ్ళు వ్యర్థముగఁ బోకుండ మరలించి పైరుపచ్చలు వృద్ధిచేసికొని బాగుపడుట. అట్టులే సీతాదేవిని మన మాశ్రయించితిమేని మనజన్మ ప్రవాహములు వ్యర్థములై పోక ఫలించునట్లు చేసి యైహికసుఖములు గలిగించును. (౨) రెండవయుద్దేశ మీయొడ్డున నుండువా రావలి యొడ్డునకుఁబోవుటకు నిరపాయమైన సదుపాయము. ఒక గొప్పనదిని మన మీఁదియో, నడిచియో దాఁటిపోవచ్చును.ఇది యాబాల గోపాల మందఱకుసాధ్య మగునది కాదు. అపాయముతోఁ గూడినది. ధన పరజన సాహాయ్య మపేక్షించునవి

పడవలు, సేతు వట్టిది గాదు. ఇది నిరపాయము. ఇది యాబాలగోపాలము బాలురకు, వృద్ధులకు, స్త్రీలకు, బురుషులకు, ధన పరజన సాహాయ్య మపేక్షింపని సుసాధనమై నమ్మకమైన యుపాయము. సీతాదేవియు భగవత్ప్రాప్తికోరి తన్నాశ్రయించు వారి కిట్టిదే. కావుననే యామెను బురుషకారముగా భక్తులు ప్రపన్నులు నాశ్రయింతురు. ఈ సందర్భమున నుపనిషద్వాక్యములు స్మరణీయములు.

అమృతస్య పరం సేతుం = ఈ పరబ్రహ్మము సంసారసముద్రమును దాటించి మోక్షము బొందించుట కొఱకు సాధనభూత మగు గొప్పసేతు వని తెలిసికొనుము.

అమృతస్యైష సేతుః। ఏషాం లోకానా మసంభేదాయ=సినోతి, బధ్నాతి స్వస్మిన్ సర్వం చిదచిద్వస్తు జాత మితి సేతుః=చిదచిద్విశిష్ట మగు సర్వమును దన యందు బంధించు కొనునది సేతువు.

ఏతం సేతుం తీర్త్వా=ఈ సేతువు నాశ్రయించి దానిని దాటవలయునే కాని యన్యోపాయముచేఁ గాదు.

ఇఁక సత్యమనఁగా నేమియో చూతము. సకారో జీవ నిర్దేశ- స్తకారః పర వాచకః। తయో స్సంసర్గ శక్తిర్య స్తస్మా త్సత్య ఉదాహృతః॥ సకారమునకు జీవుఁడనియు, తకారమునకుఁ బరబ్రహ్మ మనియు యకారము ఈ రెంటిని జేర్చుశక్తి యనియు నర్థము. ఈ యాకారమునకు లక్ష్మియని యర్థము. కావున లక్ష్మీదేవియే జీవాత్మను బరమాత్మతోఁ బొందించునది.

సత్=ఈమె యెవతె? ఇట్టి ప్రభావ మీమెయందుఁ గలుగఁ గారణమేమి? ఈమె నమ్మకముగ నద్దరిచేర్చుననినమ్ముటెట్లు? ఉపనిషత్తులందు, ఆకులు,కొమ్మలు, కాయలు, పండ్లతోడ మహావృక్ష మగు శక్తి మఱ్ఱివిత్తనమం దెట్లున్నదో; యట్లు చిద చిదాత్మక ప్రపంచమంతయు నామరూపములచే వేర్పఱుపరాని భగవంతుని యందు లీనమైయుండు దశ సత్తనియు, నామరూప భేదములతోఁ బ్రపంచముగఁ బరిణమించిన దశ సత్తనియుఁ జెప్పఁబడెను. సూక్ష్మ చిదచిద్విశిష్టుఁ డగు బ్రహ్మ మసత్తు, స్థూల చిదచిద్విశిష్ట బ్రహ్మము సత్తు. మనకు గోచరించునది యంతయుఁ జిదచిద్విశిష్టమే- అనఁగా జీవులతోను బ్రకృతితోను గూడి యుండునదే ఈ రెంటికిని నంతర్యామిగా నుండు వాఁ డీశ్వరుఁడు, ఆయన మన కన్నులకుఁ గానరాఁడు. అయినను మనము చేరవలసిన దాయననే- ఈ పద్యమున జానకీమనోంబుజధామా యను వాక్య మీయర్థమునే సూచించుచున్నది. ఎట్లు చేరుట? ఆయన గృహస్థుని వంటివాఁడు జీవ ప్రకృతులు గృహము. ఆయన గృహాంతర్భాగమునఁ దన యిష్టులతో, శిష్టులతో సంతోషముగఁ గాలక్షేపము చేయుచుండును. గృహకృత్యములు పుత్రమిత్ర భృత్య పోషణాదు లాయన భార్య విచారించుచుఁ బతివ్రత

కావున భర్తకే విచారము లేకుండునట్లు లానందముతోఁ గాలము గడుపు నట్లు సర్వకార్యములు నిర్వహించు చుండును. అట్టి భార్యయే లక్ష్మీదేవి- భర్తనువిడక సర్వదా యాయనకు నానందము గలుగ వ్యవహరించును. ప్రపంచ వ్యవహారము నిర్వహించును. జీవప్రకృతులు రెండును ఆమె యాజ్ఞానుసారము వర్తించునవే. ఇందు జీవులు బిడ్డలు, ఇల్లు, ఇంటిచుట్టు తోఁటయందలి వినోదవస్తువులు ప్రకృతి. బిడ్డలు తోఁటలో వినోద వస్తువులతోఁ గ్రీడించుచుండ నామె తనపనిలోఁ దానుండును. ఎప్పుడు బిడ్డ లాఁకలిగొని యాటవస్తువు లావలఁ బాఱవైచి యమ్మా యని బిగ్గనేడ్తురో యప్పు డమ్మ వచ్చి వాకిలి దీసి వారిని లోపలికి రానిచ్చి పాలిచ్చి పోషించును. కావుననే యీామెను చైతన్యస్తన్యదాయిని యని గ్రంథములు చెప్పుచున్నవి. ఈ బిడ్డలు మఱల నాటలకుఁ బోరాదని తలఁచి భక్తిగల వారై మాతాపితృ సేవాపరాయణు లగుదురేని మఱల నాటలకుఁ బంపక తండ్రి కప్పగించి యాసేవయందే యుండుఁడనును. ఈ బిడ్డల కపాయము పాముల వలననో పులులవలననో, దొంగలవలననో శత్రువుల వలననో కలిగి వారు ఘోషించిరేని యప్పుడు తండ్రి దానిని వారింపఁగల వారిని దనవారిని బంపనైనఁ బంపును. ఇదే యంశావతారము. లేకయంతటి గొప్పకార్యమైన యెడలఁ దానే బయలు దేఱి కావలసిన యుడుపులు, పరికరములు తన భార్య యొసఁగఁగాఁ బరిగ్రహించి సందర్భోచిత వేషముతో నంతఃపురము విడిచి సోపానములు దిగి యిల్లు విడిచి బిడ్డల యొద్దకు వచ్చి యపాయముఁ దప్పించి బిడ్డల రక్షించి మఱల లోపలికిఁబోయి యావేషముదీసి వేయును. ఇది పూర్ణావతారము. భర్త యొద్దకుఁ బోఁదలఁచిన వారి కెవ్వరికైనను నామె యనుగ్రహించి తలుపుదీయు వఱకు లోపలఁ బ్రవేశింప సాధ్యపడదు. ఈతలుపు దానే తీయనైనఁ దీయును. లేక భర్తచేఁ బంపఁబడిన వానిచేనైనఁ దీయఁజేయును (వీఁడేయాచార్యుఁడు)అంతియ కాని మనమై స్వశక్తిచే నెన్ని కల్పములకైనఁ బోఁజాలము. మన యేడుపులు విని మనస్సు కరఁగి యామె తలుపులు దీయవలె, మనము లోపలికిఁబోవలె. ఇది తప్ప వేఱు మార్గములేదు. మీఁదఁజెప్పిన తలుపులనే నామరూపములచే వ్యాపించియుండు దీనినే మాయయని, ప్రకృతియని, కర్మమని నానావిధములఁ బిలుతురు. ఇదియంతయు శ్రీదేవి చిద్విలాసము, భగవచ్ఛక్తియే. అన్యముగాదు. కావున భగవత్ప్రాప్తి కోరువారికి శ్రీదేవి యనుగ్రహ మనివార్యము. భగవంతుఁడు పంపిన యాచార్యుఁడైనను ఈమె యనుగ్రహము లేదేని యేకార్యముఁ జేయఁజాలఁడు. వెలికి, బోనులేఁడు. లోపలికి రానులేఁడు. ఇట్లున్ననుశ్రీదేవిభర్త సంకల్పప్రకారమే సమస్తకార్యములు చేయునుగాని యతిక్రమించి యేమియుఁ జేయదు. కావుననే భగవత్సంకల్పమే శ్రీ, శ్రీయే భగవత్సంకల్పమందురు. భగవద్వ్యవహార మంతయు నీమెమూలమున జరుగవలసినదే. "మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరమ్।మమ యోనిర్మహద్బ్రహ్మతస్మిన్ గర్భందధామ్యహమ్।

హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే, భ. గీ. ౯-౧౦ భగవత్కారుణా స్వరూపిణియైన యీశక్తినే సాత్త్వికులు శ్రీయని, లక్ష్మియని కొలుతురు. ఈ పద్యమందలి శ్రీ శరణమను వాక్య మీ యర్థమునే సూచించుచున్నది. తామసులు వారి చిత్తవృత్తి ననుసరించి ఘోరరూపిణిగా కాళీచండీత్యాది నామములఁ బిలుతురు. ఆమె తృప్తికని హింసాది ఘోరకార్యములను జేయుదురు. కాకాసురుని ప్రత్యక్ష పురుషకారముచేతను, జటాయువు సేవచేతను, సుగ్రీవుని నాభరణములు వైచుటచేతను, సకుటుంబముగ విభీషణుఁ డానుకూల్యము వహించి ప్రాతికూల్యము విసర్జించుటచేతను, సీతానుగ్రహమునకుఁ బాత్రులైరని యెఱిఁగియే రామచంద్రమూర్తియు వారల ననుగ్రహించెను. ఆమె యనుగ్రహింపని వారిని దండించెను. కావున రామకటాక్షప్రాప్తికి సీతానుగ్రహ మావశ్యకమగుచున్నది. ఓయీ! "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" యని బ్రహ్మయొక్కఁడే సర్వకారణ మని చెప్పుచుండఁగా నీవు లక్ష్మీనారాయణులని యిద్దఱఁ జెప్పుచున్నావే. అది శ్రుతి విరోధము గాదా? యందురేమో-కాదు. నీవు చేసిన యర్థము శ్రుతి విరోధము. ఏక మను శబ్దమే నేను జెప్పిన యర్థము బోధించుచున్నది. అ-ఇ-ఉ ల వంటిది కాదు, ఏకారము. ఈ మూఁడక్షరములను నీవు విభజింపలేవు. అవి సంధిగతములు గావు. ఏకారము అ+ఈ కారముల సంధిచేనైనది. అకారమునకు విష్ణువు, ఈకారమునకు లక్ష్మియని యర్థము. అట్లులే ప్రణవమందలి ఓకారము అ+ఉలచేనయినది. లక్ష్మీనారాయణులనే తెలుపుచున్నది. అట్లైన ప్రపంచమున కిరువురు ప్రభువులైరి గదా యందురేమో. ఒక రాష్ట్రమునకు నిరువురు స్వతంత్ర రాజు లుండిన హానికరము గాని, రాజు యువరాజులుండిన నేమి హాని కలదు. సూర్యుఁడు, ఎండ యుండిన లోకమున కేహాని గలిగినది. లక్ష్మీదేవి పతివ్రత గావున భర్తృ సంకల్పము ననుసరించి పోవుచుండును గాని యాయనను ధిక్కరించిపోదు. కావున నే హానియు లేదు. ఎండలేని సూర్యుఁడున్నాఁడని నీవు చెప్పెదవు. ఎండతోడ సూర్యుఁ డున్నాఁడనియు నెండలోకి పోక సూర్యదర్శనము కలుగదనియు నేను చెప్పుచున్నాను. ఎండచే లోకతంత్ర మంతయు జరుగుచున్నది కాని యెండలేని సూర్యబింబముచే గాదు. మన కారోగ్యకారణ మెండయే కాని యెండలేని సూర్యుఁడుకాఁడు. ఈ కాండమును బఠించువారు:—

(౧) బద్ధజీవ తారతమ్యము.

(౧) లంకలోనుండు రాక్షసస్త్రీలు. (౨) చెఱయందుంపఁబడి తప్పించుకొనిపోవ నిష్టము కలిగియుఁ బోలేని దేవతాస్త్రీలు. (౩ సీతాదేవి కర్మవశమునఁ బ్రవేశించియు నందు లగ్నగాక ప్రసన్నయై భగవత్సహాయముచేఁ దప్పించుకొన్నది. (౪) హనుమంతుఁడు స్వేచ్ఛగాఁ బ్రవేశించి యందుఁ దగులు కొనక దానిని దగ్ధముచేసి వచ్చినవాఁడు. ఇట్టివారు మహాత్ములు, ఋషులు. ఈనాలుగు విధములైన జీవాత్మలు సుందరకాండమున వివరింపఁబడినారు.

(౨) జీవాత్మ పరమాత్మలకుఁ గల సంబంధము సీతారాముల సంబంధము వంటిది

(౩) జీవాత్మ తరుణోపాయము- ఇది సీతాదేవి చర్యవలన నెఱుఁగనగు.

(౪) శిష్యాచార్య లక్షణములు-సీతాంజనేయ చర్యవలన నెఱుఁగనగు.

(౫) జీవాత్మలకు సేవ్యుఁడు నిర్విశిష్టరాముఁడా? సీతావిశిష్టరాముఁడా? హనుమంతుని చర్యవలన నెఱుఁగనగు.

(౬) ఆత్మావలోకన పరుఁడైన యోగిలక్షణము హనుమంతుని చర్యవలనఁ దెలియనగు.

(౭) సీతాదేవి యుపాయమా? ఉపేయమా? రెండునా?

(౮) యోగికిఁ బ్రపన్నునకు భేదమేమి?

ఈ ముఖ్యవిషయములకుఁ బ్రత్యుత్తరము గోరి చదువవలయును. ఇన్నిటికిఁ బ్రత్యుత్తరము లిందుఁగలవు. ఈ విషయములు బాగుగ మనస్సున నాటుటకై దీని నెన్ని మార్లైనఁ బారాయణము చేయవలయును. మీఁద వ్రాసినదంతయు నప్రస్తుత ప్రసంగ గాదు. సీతా హనుమంతుల విషయము- వీరి నిరువుర విడిచినవారికి రామచంద్రానుగ్రహప్రాప్తి లేదు. సుందరకాండ మీ యిరువుర చరిత్రమే చెప్పుచున్నది. కావుననే యీ కాండము తక్కిన కాండములకంటె నెక్కువగా జనులచే నాదరింపఁబడు చున్నది. ఆ కారణముచేతనే దీనికి సుందరకాండ మని పేరు. సుందరశబ్దమునకు "సుతరాం ఆద్రియత ఇతి సుందరం, దృఙ్ ఆదరే. మిక్కిలి సంతోష పెట్టునది" యని లింగాభట్టీయము. పారాయణరూపముగా జనులచే నాదరింపఁబడునది. వారి వారి యిష్టార్థములు నెఱవేర్చి సంతోష పెట్టునది సుందరకాండమే కదా. కావున సుందర శబ్దమునకు ధాత్వర్థము సంపూర్ణముగా సరిపోవుచున్నది. ఈ విశేషము దీనియందుఁ గలదని తెలుపుటకే తక్కిన కాండములకు స్థలమును బట్టియో కార్యమును బట్టియో బాలకాండమని, యయోధ్యాకాండమని, యరణ్యాకాండమని, కిష్కింధాకాండ మని, యుద్ధకాండ మని, పేరు పెట్టినట్లు పెట్టక వాల్మీకి సుందరకాండ మనియెను.

మీఁద వ్రాసిన విషయములు మనస్సునందుంచుకొని ఈ పద్యము చదివినచోఁ దాత్పర్యము సుస్పష్టమగును.

### తాత్పర్యము

శ్రీదేవికి వాసస్థానమైనవాఁడా! సంసారసముద్రము దాఁటుటకు గురువను గొప్పపడవను నడుపు నారకాటీ! అట్లు సంసారసాగరము దాఁటించుటకుఁ గేవుగా శ్రద్ధాభక్తు లనుగ్రహించు వాఁడా! శాశ్వత సుఖము నిచ్చువాఁడా! జానకీదేవి హృదయ కమలమందు వాసము చేయువాఁడా!

ఈ కాండాది పద్యమునందు నీ కాండమునఁ బ్రతిపాదింపఁ బడిన యర్థము గలదు. భగవంతుఁడు సంసారిచేతనుని రక్షించుటకై యాచార్యుని సంపాదించె ననుట పూర్వకాండార్థము.సంసారిచేతను నుద్ధరింప నాచార్యుఁడు చేయుప్రయత్న మీ కాండమునఁ జెప్పఁబడినది. ఈ యర్థమును నాజవంజవాది వాక్యము సూచించును. గుసుతెరి హనుమంతుఁ డనియుఁ, గర్ణధారుఁడు శ్రీరామచంద్రమూర్తి యనియుఁ నెఱుఁగనగు. శ్రీశరణ యనుటచే శ్రియః పతిత్వ మనెడి బాలకాండార్థము, కల్యాణగుణాకరత్వ మనెడి యయోధ్యాకాండార్థమును, సజ్జన రక్షకత్వ మనెడి యరణ్య కాండార్థమును సూచితము. ఆజవంజవేత్యాది పూర్వకాండార్థము నీ కాండార్థము సూచించును. శ్రద్ధేత్యాది పదము యుద్ధకాండార్థమైన ప్రపత్తిని దెలుపును. శర్మద యనునది ప్రపత్తి ఫలమును, జానకీత్యాది పదము ప్రాప్య స్వరూపమును సూచించును. కాఁగా నీ పద్యమునందు నేతత్కాండార్థము ప్రధానముగను బూర్వోత్తర కాండార్థములు తత్సహకారులుగను వివక్షితములు.

అవతారిక:—శ్రీరామచంద్రమూర్తి పరాత్పరుఁ డనుటకు నసాధారణముగు సమస్తకల్యాణగుణాకరత్వము కిష్కింధాకాండమందుఁ జెప్పఁబడెను. ఈ కాండమున నాయనకుఁగల సర్వసంహారకత్వ మనెడి గుణము 'అధిప బ్రహ్మ స్వభువు చతురాస్యుఁడైన' నను పద్యంబునఁ జెప్పఁగలఁడు అని కొందఱు చెప్పుచున్నారు. పూర్వకాండమున మిత్ర రక్షణము సర్వథా చేయవలయు నని చెప్పఁబడెను. ఈ కాండమందు దూతకృత్యము, పతివ్రతా లక్షణము చెప్పఁబడుచున్నదని మఱికొందఱు, ఆత్మావలోకన తత్పరుఁడైన యోగి చర్యయు, ఆత్మ చేయు భగవదనుసంధాన విధము ఆత్మదర్శనము గల యోగి దేహాభిమాన త్యాగము ధ్వనితము.

మొదటి సర్గమందుఁ జిక్కఁబఱుప వలసిన శిష్యుని నాచార్యుఁడు వెదకు విధము చెప్పఁబడుచున్నది.

—♦ హనుమంతుఁడు మహేంద్రపర్వతంబున విహరించుట ♦—

క. తరువాత రావణాసుర, వరసీత ధరాత్మజాత•పదము న్వెదకన్
గురుచారణమార్గంబున, నరుగఁగ నృపదూత గర్వి•తారి తలంచెన్. ౧

అర్థము. తరువాతన్=జాంబవంతునిచేఁ బ్రేరింపఁబడి సముద్రోల్లంఘనము చేయ నుత్సహించి మహేంద్రనగమునఁ జేరిన తరువాత, రావణ+అసురవర+సీతన్=రావణుఁ డనెడి రాక్షసశ్రేష్ఠుని చేతఁ దీసికొని పోఁబడిన, ధరాత్మజాత=భూదేవియందుఁ జనించిన సీతాదేవియొక్క, పదమున్=ఉన్నస్థలమును, గురు=గొప్పదగు, చారణ=ఆకాశమందు సంచరించు చారణు లను దేవజాతుల యొక్క, మార్గంబునన్=త్రోవయందు, నృపదూత = రామచంద్రమూర్తి దూతయగు

హనుమంతుఁడు; ఈయన యెట్టివాఁడన, కర్శితారి=నశింపఁజేయఁబడిన శత్రువులు గలవాఁడు: అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమానభూతము లగు. సు.వ్యా. వాక్య. ౪౧ సూ. "మదర్థే త్యక్తజీవితాః" 'హా హతోస్మి' అన్నట్లు, దీనిచే నీయన శత్రుసంహారముచేసి పూనిన కార్యము సాధింపఁగలఁ డని సూచితము.

తరువాత కర్శితారి నృపదూత రావణాసురవరనీత ధరాత్మజాతపదము వెదకన్ గురుచారణ మార్గంబున నరుగఁదలచెను అని యన్వయక్రమము.

ఆచార్యపరమైన యర్థము:- శిష్యుఁ డున్నచోటు వెదకునట్టి యాచార్యస్వరూపముకూడ నిందుఁ జెప్పఁబడెను. తరువాతన్=భగవంతుఁ డనుజ్ఞ యిచ్చి పంపిన పిదప, భగవదాజ్ఞలేక యెవఁడును నాచార్యత్వము వహింపరాదని దీని వలన నేర్పడుచున్నది. ఈ యర్థమును నృపదూత యను శబ్దము స్థాపించుచున్నది. నృప=నృ=నరులను, జీవకోటులను, ప=పాలించువాఁడు. అనఁగా జీవాత్మల కీశ్వరుఁడై వానియం దంతర్యామియై ప్రేరకుఁడై యుండువాఁడు. అట్టివాఁడు భగవంతుఁడు. ఆయన దూత- 'సందేశహరో దూత' యని యమర కోశము. సందేశ మనఁగా నోటిమాట. దానిని గొనిపోవువాఁడు సందేశ హరుఁడు. వీనికే దూతయని పేరు. 'దూతః దూఙ్ పరితాపే' వీనిచేత శత్రువు తపింపఁ జేయఁబడును. అనుటచే దూతయగువాఁడు తన స్వామి చెప్పిన మాట చెప్పుటయేకాక, శత్రువులు నిరోధించినను వారిని బాధించి మరల వచ్చి తాను జేసిన కార్యము చెప్పఁగలవాఁడై యుండవలెను. ఇట్టివానికి దూతయని పేరు. అటుగాక యచ్చటికిఁ బోయి శత్రువులచేతఁ జిక్కి చచ్చువాఁడు దూతగాఁ బోరాదు. గురు విట్టివాఁడై శిష్యసందేహముల నెల్లఁ దీర్పఁగలవాఁడై యుండవలెఁ గాని శిష్యున కెక్కడ సందేహమో గురువున కక్కడనే నట్టన్నట్టుండ రాదు. అట్టివాఁడు గురువుగా నుండ యోగ్యుఁడుకాఁడు. భగవంతునిచే నాజ్ఞాపింపఁబడిన గురు వెట్టి లక్షణములు గలవాఁడై యుండుననిన: కర్శిత+అరి=(౧) కృశింపఁ జేయఁబడిన కామక్రోధాదు లను నరిషడ్వర్గము గలవాఁడై యుండును. (౨) గురువు సార్థక నామధేయుఁడై యుండవలెను. "గుశబ్దస్త్వంధకార స్స్యాత్। రుశబ్ద స్తన్నిరోధకః। అంధకార నిరోధిత్వా, ద్గురు రిత్యభిధీయతే." గు శబ్దమునకు నజ్ఞాన మను చీఁకటియని యర్థము. రు శబ్దమునకు దాని నిరోధించువాఁడని యర్థము శిష్యు నజ్ఞానాంధకారముఁ బోఁగొట్టువాఁడు గురువని యర్థము. మఱియు గురువెట్టివాఁడై యుండవలయుననిన గురుచారణమార్గంబున నరుఁగదలఁచువాఁడుగా నుండవలయును. గురువులయిన చారణులు పోయిన మార్గమునఁ బోవువాఁడుగా నుండవలయునుగాని తద్భిన్న మార్గమున వర్తించువాఁడుగా నుండరాదు. చారణు లనఁగా, చారయంతి ఇతిచారణాః=ధర్మము ననుష్ఠించువారు కావునఁ జారణులు అని వ్యుత్పత్తి. అనఁగాఁ బూర్వాచార్యులని యర్థము. వారి మార్గంబునన్=వా

రనుష్ఠించిన విధమున, 'పోవందగుఁ బెద్దవారు పోయెడి త్రోవన్' అన్నట్లు శిష్టుల సదాచారమునం దున్నవాఁడని యర్థము.

ఈ విధముగ గురు లక్షణము చెప్పఁబడెను. భగవదాజ్ఞ కలదనుటకు రామ ముద్రికయుఁ గర్శితారి యనుటకు దిసమొలల సుందరుల రావణాంతఃపురమునఁ జూచినను మనసు చలింపమియు, లంకాదహనాక్షకుమారాది వధయు గురుచారణ మార్గమున ననుటచే దూతకృత్యము ధర్మశాస్త్రమున కవిరోధముగఁ జేయుటయుఁ దెలిపెడిని.

ఇందుఁ బూర్వాచార పరాయణత్వమునకే ప్రాధాన్య మీయఁబడెనని తలంపరాదు. ధర్మనిర్ణయమందుఁ బరాశరుఁడు.

కల్పే కల్పే క్షయోత్పత్తౌ బ్రహ్మవిష్ణు మహేశ్వరాః, శ్రుతిస్మృతి సదాచార నిర్ణేతారశ్చ సర్వదా. మనువు, ౨, ౬. "వేదోఖిలో ధర్మమూలం స్మృతిశీలేచ తద్విదామ్, ఆచారశ్చైవ సాధూనా మాత్మన స్తుష్టి రేవచ.

వ్యాసులు:- ధర్మమూలం వేద మాహుః. గ్రంథరాశి మకృత్రిమమ్, తద్విదాం స్మృతిశీలేచ, సాధ్వాచారం మనః ప్రియమ్.

శ్రుతిస్స్మృతిస్సదాచారః స్వస్యచప్రియమాత్మనః, సమ్యక్సంకల్పజః కామో, ధర్మమూల మిదం స్మృతమ్॥ యాజ్ఞవల్క్యుఁడు.

ఈవిధముగ శ్రుతి-స్మృతి-సదాచారము, మనువు చెప్పిన శీలమే యాజ్ఞవల్క్యుఁడు చెప్పిన సమ్యక్సంకల్పజకామమని వీరమిత్రోదయుఁడు సమర్థించెను.

కావున శ్రుతి, స్మృతి, సదాచారము, స్వప్రియము, శీలము ననునవి ధర్మనిర్ణయమునందుఁ బ్రమాణములు. 'శ్రుతి స్మృతి ర్మమైవాజ్ఞా'యను ప్రమాణము చొప్పున హనుమ ద్విషయమున రామాజ్ఞ కలదు. అది రాజాజ్ఞ కావున వేదానుశాసనమే. సదాచార మనునది గురుచారణ మార్గ గమనముచేఁ జెప్పబడెను. శీలమనునది అస్ఖలిత బ్రహ్మచర్యముచేఁ జెప్పఁబడెను. ఇచ్చట స్వప్రియమునకుఁ గారణము లేదు. ఏలన- ఈ మార్గముల దేనిచేతను బరిష్కారముగాక యటుచేసిన బాగా యిటు చేసిన బాగా యను ధర్మసందేహము వచ్చినపుడు కామక్రోధ లోభములకుఁ బాలుపడని తన పరిశుద్ధాంతఃకరణము ప్రమాణము. ఇచ్చట నట్టి సందేహము లేదు.

శిష్టాచార మనఁగా:-

ధర్మేణాఽధిగతో యైస్తు, వేదః సపరిబృంహణః ।
తే శిష్టా బ్రాహ్మణా జ్ఞేయాః శ్రుతి ప్రత్యక్ష హేతవః. ౧౨-౧౦౯

ధర్మమార్గమున ననఁగా గురు ముఖముగానో, వృద్ధసేవ చేసియో, మీమాంస, ధర్మశాస్త్రము, ఇతిహాస పురాణములతోడ వేద మెఱింగి దానిని

బత్యక్షము చేసికొని యర్థజ్ఞానము గలిగి చెప్పఁగలవారు శిష్టులు. ఈ విధముగ నాచార్య లక్షణ పరిపూర్తి హనుమంతునందుఁ గలదనియు, నట్టివాఁడు శిష్యాన్వేషణ మందు దర్శ్హాఁడనియుఁ జెప్పబడెను.

ఇఁక శిష్య లక్షణము చెప్పఁబడును. శిష్యుని ప్రథమ లక్షణము సీతవలె నుండుట. స్త్రీ యేల చెప్పఁబడె నన, 'స్త్రీప్రాయ మితర త్సర్వం, జగద్బ్రహ్మ పురస్సర' మ్మన్నట్టు భగవంతుఁ డొక్కఁడే పురుషుఁడు. తక్కిన జీవకోటు లన్నియు భర్తకు భార్య పరతంత్రయైనట్లు భగవంతునకుఁ బరతంత్రములే. ధారణ పోషణాదుల కాయనపై నాధారపడి యుండునవే. ఇట్లు చెప్పుటచే భగవత్ప్రాప్తికోరు జీవాత్మ తాను స్వతంత్రుఁడ నని తలఁపక తాను సర్వవిధముల భగవంతునకుఁ బరతంత్రుఁడనని యాయనపై యోగక్షేమముల కన్నిఁటికి నాధారపడి యుండవలయును, 'నిర్యోగక్షేమ ఆత్మవాన్' అని కదా భ. గీ. చెప్పుచున్నది. ఇట్టిభావము లేని జీవాత్మకు భగవత్ప్రాప్తి లేదు. హనుమంతుఁడు నేను వీఁపుపైఁ గూర్చుండఁ బెట్టుకొని పోయెద రమ్మని పిలిచినపుడు పోక యుండుటయు, రావణాసురుని రామాజ్ఞ లేక నిన్ను భస్మముచేయుదునని చెప్పుటచేతను, స్వరక్షణ భారము రామచంద్రమూర్తిపై వైచి యుండుటచేతను సీతాపారతంత్ర్య మెఱుఁగనగు. ధరాత్మజాత=ఈ విశేషణము మీఁదఁ జెప్పిన జీవాత్మ యొక్క స్వరూప స్వభావములఁ దెలుపుచున్నది. భూమియందుఁ బుట్టిన దనుటచే నయోనిజత్వము దెలుపుటయ్యె. అట్టులే జీవుఁడు నయోనిజుఁడే కదా. ఆ కారణముచే జీవుఁడు నిత్యుఁ డనియు నేర్పడెను. సీత యనఁగా నాఁగటిచాలు. ఇది భూజాత భూమియందుఁ బుట్టినదే కదా. అంతియేకాక భూమియే యాధారముగాఁ గలదై భూమిని విడిచి యుండ లేనిదియు, విడిచిన స్వరూపనాశమై పోవునదియుఁగదా. అట్టులే జీవుఁడును దనకుఁ గారణమై యాధారమైన భగవంతుని విడిచెనేని స్వరూప నాశమై పోవునని భావము. ధరాత్మజాత యనునది వృక్షమును దెలుపును. వృక్షము భూమి యందుఁబుట్టి భూమియే యాధారముగఁ గలదై భూమికిఁ బరతంత్రమై యుండును గదా. అట్టులే జీవుఁడును. ఈ విషయమున ముండకోపనిషత్తునందలి యీ మంత్రము స్మరింపనగు.

'యథోర్ణనాభి స్సృజతే గృహ్యతేచ, యథాపృథివ్యా మోషధయ స్సంభవంతి, యథాసతః పురుషః కేశలోమాని। తథాక్షరా త్సంభవతీహ విశ్వమ్॥' ప్రకారము సాలెపురుగు తంతువులను దన దేహమునుండి విడుచునో మరల గ్రహించునో యేప్రకారము భూమినుండి వృక్షములు జనించునో, యెట్లు పురుషునందు వెంట్రుకలు పుట్టునో యట్లు భగవంతునుండి ప్రపంచము పుట్టుచున్నది. ధరాత్మజాతపద మీ యర్థమునే మఱియొక విధముగను దెలుపుచున్నది. ఎట్లన:—ఆత్మశబ్దమునకు విష్ణువని యర్థము. 'ఆత్మాయత్నె,ధృతి, స్వాంత, స్వభావ, పరమాత్మసు-జీవబుద్ధి శరీరేషు॥' నానా. 'బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి కథ్యతే. దీనికిఁ బ్రయోగము

"దత్తం దూర్వాససం సోమ మాత్మేశబ్రహ్మసంభవాన్" దత్తాత్రేయుఁడు దుర్వాసుఁడు, చంద్రుఁడు ఆత్మకు, శివునకు, బ్రహ్మకు సంభవించిరి. ఇచ్చట నాత్మ యనఁగా స్పష్టముగ విష్ణువే. కావున ధర+ఆత్మజాత, యన్నప్పుడు సర్వము ధరించు విష్ణువునకు జనించినవాఁడు జీవుఁడని యర్థము. ఇట్లు చెప్పుటచే వృక్షము లెట్లు భూమికిఁ బరతంత్రములో, యాధేయములో యట్లులే జీవకోటులు భగవంతున కనియర్థము. పదమును=స్థానమును, సంసారమండల మందీ జీవుఁ డెచ్చట నున్నాఁడాయని వెదకఁబోవఁ దలఁచెను. పద శబ్దమునకుఁ జిహ్నమనియు నర్థము గలదు. ఓయి! జీవాత్మలన్నియు భగవ దంశములే కదా. ప్రపంచము జీవకోటితో నిండి యున్నది కదా! ఇఁక వెదకనేల యందురేమో. లోకములో నందఱు నాత్మనంతులే. అయినను వాఁడాత్మవంతుఁడై నాఁ డన్నప్పుడు తా నాత్మయని దేహము గాదని యాత్మజ్ఞానము గలవాఁడని యెట్టు లర్థమో యట్టులే ధరాత్మజాత యన్నప్పుడు తనకు భగవంతుఁ డాధార మనియుఁ దా నాధేయ మనియుఁ బరతంత్రుఁడనియు జ్ఞానముగల జీవుఁడు చెప్పఁబడెను. ఇట్టి జ్ఞానము గలిగి భగవత్ప్రాప్తి గోరు జీవుఁ డెచ్చట నున్నాఁడా యని యాచార్యుఁడు వెదకు నని భావము. పద మనఁగాఁ జిహ్నమని యర్థము. కావున నట్టి చిహ్నములు సజ్జన సంభాషణము, సాంగత్యము, భగవన్నామోచ్చారణము లోనైన చిహ్నములు. "విష్ణోః కటాక్షశ్చాద్వేష ఆభిముఖ్యం చ సాత్త్వికైః। సంభాషణం షడేతాని త్వాచార్యప్రాప్తిహేతవః॥" అనువాక్య మిచ్చట ననుసంధింపవగు. ఇట్టి చిహ్నము లెవని యందుఁ గలవని యాచార్యుఁడు వెదకును. ఇట్టి జీవుఁడు తన స్వరూపము మఱచి రావణాసురవర సీతుఁ డయ్యెనని చెప్పఁబడెను. రావయతి=చెడుమాటలఁ జెప్పించునది. ఇట్టివాఁడు రావణుఁడు. కామ క్రోధములకు వశుఁడై తెలివిలేని మాటలాడు వాఁడు అనఁగా యుక్తాయుక్త పరిజ్ఞానము లేని వాఁడని భావము. వీఁడు అసురవరుఁడు; అసురుఁడు అనఁగాఁ బ్రాణములఁ గొనువాఁడు. అసూన్=ప్రాణాన్, రాంతి=గృహ్ణంతి, రా=ఆదానే, అట్టివారిలో శ్రేష్ఠుఁడు. అసురవరుఁడు అవివేకముచేఁ బరుల హింసించువాఁడని భావము. ఇట్టి వానిచే, సీత=స్వాధీన పఱచుకొనఁబడినది. భగవత్పరతంత్రుఁడై భగవంతునకు నాశ్రితుఁడై యుండవలసిన జీవుఁడు కామముచే హింసాస్వభావుఁడగు నవివేకికి లోపడె నని భావము. ఇట్లు లోపడి తన యవివేకమునకై యేడ్చు జీవుని వెదక నాచార్యుఁడు ప్రయత్నించు నని భావము.

### తాత్పర్యము

జాంబవంతుఁడు ప్రేరించిన పిమ్మట హనుమంతుఁడు వానరులతో మహేంద్రనగ మెక్కి లంకకుఁ బోవ మనస్సుచే సంకల్పించిన దానిని గార్యరూపముగాఁ బరిణమింపఁజేయ రావణాసురునిచే హరింపఁబడిన భూపుత్రియగు సీత యుండుస్థానమును వెదకుటకై రామచంద్రమూర్తి దూతయు శత్రుసంహారకుఁడునగు హనుమంతుఁడు

చారణ సంఘములు సంచరించు నాకాశమార్గంబునఁ బోవఁదలఁచెను. ధరాత్మజాత పదము వెదక ననుటచే నటువంటి పతివ్రతాశిరోమణి పాదదర్శనమైనను దాను గృతకృత్యుఁడ నని హనుమంతుఁడు తలఁచె నని సూచితము. దీనివలన సీతామాహాత్మ్యము, హనుమంతుని భక్తివినయములు తేటపడు చున్నవి. కావున భక్త ప్రపన్నులకు సీతారాము లిరువురు సేవ్యులే.

ఈ కాండము తకారముతోఁ బ్రారంభించి తకారముతో సాంతముచేయఁబడెను. ఈ పద్యమునందు గాయత్రియందలి పండ్రెండవ యక్షరము గలదు.

క. నిక్కించి తలయు మెడయును, జక్కఁగ నాఁబోతువోలెఁ • జారుతరుండై
యెక్కడ నెవరి కశక్యము, నుక్కడ మగుపని నొనర్ప • నూహించిమదిన్. 3

అర్థము. నిక్కించి=పొడుగగునట్లు సాఁచి, ఆఁబోతు=ఆవుపోతు, కోడె, చారుతరుండై=మిగుల మనోహరుఁడై, ఉక్కడము=గొప్పది. అశక్యము=ఇతరులకుఁ జేయ సాధ్యముగానిది. దీనికిఁ గర్త నాలుగవ పద్యమందలి కపికులేశ్వరుఁ డనునది. ఆ పద్యముతో నేకాన్వయము.

తాత్పర్యము

తాను బోవలసిన మార్గముఁ జూడఁజూచుటకుఁ గాను దల మెడ నిక్కఁబెట్టి మదించిన కోడెవలె మిక్కిలి మనోహరుఁడై యేకాలమందే దేశమందెవ్వరికైనను జేయుటకు సాధ్యము గాని గొప్పపని చేయవలయు నని మనస్సునఁ దలఁచినవాఁడై.

కం. మెచ్చఁగు వైడూర్యము రుచి, నచ్చపుఁజలినీటిఁబోలి • యందం బగుచున్
హెచ్చినపచ్చికపట్టుల, నిచ్చగ విహరించెఁ గపికు•లేశ్వరుఁ డెలమిన్. ౪

అర్థము. రుచిన్=కాంతితో, పచ్చికపట్టు=కొంచెము తెలుపుతోఁ గూడిన యాకుపచ్చరంగు కలది, కావున వైడూర్య వర్ణము కలది యనుట. చలినీటిఁ బోలెన్=అను నుపమానముచేఁ బచ్చిక పట్టునకు శైత్య మార్దవములు వివక్షితములు, పచ్చిక పట్టులన్=పచ్చిక మొలచిన చోటులందు, కపికులేశ్వరుఁడు=వానర జాతియందు శ్రేష్ఠుఁడు.

తాత్పర్యము

వానర శ్రేష్ఠుఁ డగు హనుమంతుఁడు నిర్మలమైన చల్లని నీటివలె శైత్యము, మార్దవము గలిగి శ్రేష్ఠమైన వైడూర్యముల కాంతి గలిగి యందముచే నతిశయించిన పచ్చిక పట్టులందు సంతోషముతో నిటునటు ముందు వెనుకకుఁ బచారము సలిపెను.

ఈ తిరుగుట ప్రొద్దుపోక వ్యర్థముగఁ దిరుగుట గాదు. దీర్ఘముగ నాలోచించు వారిటు తిరుగుట గలదు.

కం. బెదరించుచు వికిరంబుల, చదలించుచు మృగగణంబు • నక్కున నేలం
బొదలించుచుఁ దరువుల మలఁ, గదలించుచు రేఁగు వెలిమెు•కం బనఁ దిరిగెన్. ౫

అర్థము. వికిరంబులన్=పక్షులను, అక్కజనన్ = అబ్బురముచే, తరువులన్= చెట్లను, రేఁగు=విజృంభించు, వెలిమెకము=సింహము. మలన్=పర్వతమును, పొదలించుచున్=విఱుఁగఁ ద్రోయుచు; ఇప్పుడు మనుష్యులవలె రెండుకాళ్ళచేఁ గాక వానరుని వలె నాలుగు పాదముల నడచెనని తోఁచుచున్నది.

తా త్ప ర్య ము

హనుమంతుఁడు పక్షుల బెదరించుచు, మృగసమూహమును నదలించుచు, అబ్బుర పార్శ్వభాగంబులచేఁ జెట్లు విఱిగి నేలఁబడ హుమ్మని గ్రాఁచుచుఁ, గొండను నూఁగులాడించుచు విజృంభించిన సింహమువలెఁ దిరిగెను.

చం, అసితము లోహితంబును సి•తాసితవర్ణము నాకుపచ్చనై
పొనఁగెడి పెక్కురంగులను • బొంపిరిపోయెడి ధాతుకోటిచేఁ
బసగల యక్షకిన్నరసు•పర్వసుపర్వనిభాహినిర్ఝరీ
విసరపరిష్క్రియావితతి • విస్తృతిచే హృదయంగమంబునై. ౬

అర్థము అసితము=నలుపు, లోహితము=ఎఱుపు, సితాసిత వర్ణము= తెలుపు నలుపు కలిసిన చిత్రపువన్నె, పొంపిరిపోయెడి = అతిశయించెడి, ధాతుకోటిచేన్=పర్వత సంబంధ ధాతువులచే (లోహాదులచే) సుపర్వ = దేవతలయు, సుపర్వనిభ=దేవతలతో సమానములగు, అహి=పాములయు, నిర్ఝరీ = దేవతా స్త్రీలయు, విసర=సమూహముల చేతను, పరిష్క్రియా=వారు ధరించిన యలంకారములయొక్క, వితతి=సమూహముల, విస్తృతిచేన్=విస్తారముచేతను, హృదయంగమంబునై=మనస్సు నాకర్షించునదియై, (మహేంద్రనగముతో నన్వయము) ఇది మహేంద్రపర్వతవర్ణనము తా త్ప ర్య ము

నలుపు, తెలుపు, నలుపు దెలుపు గలిసిన చిత్రవర్ణము, ఆకుపచ్చగల పెక్కు రంగులచే వృద్ధిచెందిన లోహాదుల చేతను, మృత్తికాదులచేతను, మిగుల కాంతిగల యాభరణముచే నలంకరించుకొన్న యక్షులు, కిన్నరులు, దేవతలు. దేవతాసములైన పన్నగులు, దేవతాస్త్రీలు వీరి గుంపులచేతను మనోహరమై,

క. మత్తిలి నాగవరంబులు, నెత్తఱిఁ జరియించు నామ•హేంద్రనగమునన్
జిత్తమిగురొత్తమదువున,హత్తిన నాగంబువోలె నతఁడు వెలింగెన్. ౭.

అర్థము. మత్తిలి=మదించి, నాగవరంబులు=శ్రేష్ఠము లయిన యేనుఁగులు, ఎత్తఱిన్=ఏకాలమందును, ఇగురొత్తన్ = సంతోషముచే నతిశయింపగా, హత్తిన=ఉండిన, నాగంబు=ఏనుఁగు.

తా త్ప ర్య ము

మదించిన యేనుఁగులు సర్వకాలములందు సంచరించుచు నా మహేంద్ర పర్వతమునందు సంతోష మతిశయించుచు నుండ మదుఁగులోని యేనుఁగువలె నిచ్చలవిడి సంచరించుచు హనుమంతుఁడు ప్రకాశించెను.

**The Mahendra range,** so called from Indra, **the tutelary god of the East, is identified** with the Eastern Ghats, which run in a **succession of** ranges from **Orissa in a South and** Westerly direction almost along the Eastern Coast of the Deccan until they lose themselves in the Malaya range to which it is linked by the Nilagiris and **Palni** hills on the South. According to Valmiki both Hanuman and Rama passed **on form the Malaya to the Mahendra Range,** on the sea coast opposite which, on the other side of the channel, was Lanka. It is thus evident that the Southern extensions of the Mahendra Range. known at present under various names such as **Kumbhakamdrug** (opposite lake Pulicat) **Nagari** Nose, Jawadi Hills, Kalrayan, **Pachmalais,** Kolla-malais and **Alagar hills** (near Madura) formed the natural Eastern barrier of the Deccar, which kept off the Bay; and that the low irregular tracts which now lie between the hills and the Sea, as the deltas of the **Pennar** (Pinakini) and the Vellar, the **Coleroon,** the Kaveri and the Viaga, were. like lower **Bengal, subsequent formations due to alluvial deposits** of the rivers and **recess of the sea.** The channel which seperated Lanka from the main land probably extended at that time up to the spurs of the Mahendra range (Alagar hills) near modern Madura. and was 100 Jojans (nearly 150 miles) in extent and was studded whth islets and shoals. as described in the Ramayana. **The causeway** constructed by Rama would thus appear to have been **very nearly** along the lower course of the Vaiga (not mentiond in the Ramayana) which flows through Ramnad into the **sea,** opposite Ramaswaram. The distance between India and **Ceylonc at present is about** 60 miles [The Ancient, **Geography of Asia P.P. 43 and 44]**

క. రవికిని బాకవిరోధికిఁ, బవనునకు స్వాయంభువునకు ✦ బలు వేల్పులకున్
సవినయముగనతి యొనర్చి, పవమానసుతుండు చనఁగ ✦ బయనంబగుచున్. ౮

అర్థము. రవికిని=సూర్యునకు, పాక విరోధికిన్=పాకుఁడను రాక్షసుని జంపిన యింద్రునకు, పవనునకున్=వాయు దేవునకు, స్వాయంభువునకున్=బ్రహ్మకు, పలు వేల్పులకున్=నానా దేవతలకు, నతి=నమస్కారము, పవమానసుతుండు=వాయుపుత్రుఁడు, ఆంజనేయుఁడు పయనము=ప్రయాణశబ్దభవము, రవి=ఈయన విద్యాగురువు. కావునఁ దొలుత నమస్కరించెను. దీనిచే నేకార్యము నందైనను గురునమస్కారము గావించియే తరువాత దేవతాది నమస్కారము గావింపవలె నని సూచితము. పాకవిరోధి=తాను రాక్షసులతో విరోధింపఁ బోవు చున్నాఁడు కావున రాక్షసవిరోధి యగు నింద్రుని సాహాయ్యము గోరి నమస్కరించెను.

తండ్రి గావున నాయన బలవేగములు గలుగ వాయుదేవునకు నమస్కరించెను. బ్రహ్మాస్త్రమువలన బాధలేకుండ బ్రహ్మను బ్రార్థించెను. ఇచ్చటనొకవరుస

గాన వచ్చెడిని, బాల్యమందుఁ దాను సూర్యుని గ్రహింపఁ బోవ నింద్రుఁడు వజ్రాయుధముతోఁ గొట్టఁగా వాయువు స్తంభించి నపుడు బ్రహ్మాదులు వచ్చి వరము లిచ్చిరి. కావున నానలుగురి పేర్లు వరుసగాఁ జెప్పబడెను. ఆనాఁడు వీరిచ్చిన వరము లీనాఁడు ఫలింప ననుగ్రహింపుఁడని వారిని బ్రార్థించెను. దీనిచేఁ గార్యారంభమందు గురువులకు నిష్టదేవతలకు నమస్కరించుట విధియని యేర్పడు చున్నది.

తాత్పర్యము

సూర్యునకు, నింద్రునకు, వాయుదేవునకు, బ్రహ్మకు, దక్కిన దేవతలకు సణఁకువతో నమస్కరించి యాంజనేయుఁడు ప్రయాణమై.

కం. తూరుపుముఖమై తండ్రికి, మారుతునకు నంజలిని సమర్పించి క్రియా
  శూరుఁడు దక్షిణదిశగా, నీరనిధి న్దాఁట మేను నెఱి నిగిడించెన్. ౯

అర్థము. మారుతునకున్=వాయుదేవునకు, క్రియాశూరుఁడు=ఇంతవఱకు నేమాటలు చెప్పెనో దానిని సాధింపఁ గలవాఁడు, నీరనిధిన్ = సముద్రమును, నిగిడించెన్=పెంచెన్, మీఁది పద్యమందు వాయుదేవునకు దేవతాభావముతో నమస్కరించెను. ఈ పద్యమం దాయన తండ్రి కావున జనకభావముతో నమస్కరించెను. కావుననే 'తండ్రికి' యను పదము చేర్పఁబడెను.

దీని వలన గురుదేవతలకు వలెఁ బ్రత్యక్షదేవత తండ్రికిని నమస్కరింపవలెనని సూచితము తానిప్పుడు దక్షిణముఖమై యున్నాఁడు. దక్షిణాభిముఖుఁడై నమస్కరింపరాదు. గావున దూర్పుతిరిగి నమస్కరించి మరల దక్షిణ ముఖముగఁ దిరిగెను. శుభకార్యములన్నియుఁ దూర్పు ఉత్తరము తిరిగి చేయవలెను. అశుభ కార్యము దక్షిణముఖమై చేయవలెను, నిద్రకు నుత్తరము నిషిద్ధము.

తాత్పర్యము

తూరుపుదిక్కు తిరిగి తండ్రి యగు వాయుదేవునకు నంజలిజోడించి నమస్కరించి కార్యసాధన మందు సమర్థుఁడగు హనుమంతుఁడు మరల దక్షిణ ముఖము తిరిగి సముద్రమును దాఁటుటకు దేహమును బెంచెను.

క. ప్లవనకృతనిశ్చయుండై, పవమానసుతుండు రాముపనికై తన్నుం
  బ్లవగతతి గనఁగఁ బర్వపు, దివసంబున జలధి యనఁగ దేహము బెంచెన్. ౧౦

ప్లవన=దాఁటుటయందు, కృత=చేయఁబడిన, నిశ్చయుండు=నిశ్చయముగలవాఁడు, ప్లవగ తతి=వానర సమూహము, పర్వపు దివసంబునన్=పున్నమనాఁటియందు.

తాత్పర్యము

హనుమంతుఁడు రాముని కార్యము సాధింప సముద్రమును దాఁట నిశ్చయించుకొన్నవాఁడై వానరు లందఱుఁ జూచుచుండఁ బున్నమనాఁటి సముద్రము వలె దేహమును బెంచెను.

—• హనుమంతు విక్రమమునకు మహేంద్రాద్రి చీకాకుపడుట •—

కం. కొలఁదికి మీఱు శరీరము, పొలుపారఁగ నబ్ధి దాటు•పూనికను మహా
బలసుతుఁడు పర్వతముఁ జే, తులతోఁ జరణములతోడఁ•దూఁగాడించెన్. ౧౧

అర్థము. మహాబలసుతుఁడు=వాయువు కుమారుఁడు, తూఁగాడించెన్=ఊఁగులాడించెను. ఇది శబ్దపల్లవ క్రియ తూఁగు+ఆడు=తూఁగాడు.

తాత్పర్యము

మితిమీఱిన శరీరముతో, సముద్రమును దాటు పూనికతో హనుమంతుఁడు రెండుచేతులతోను గాళ్ళతోను గొండను నూఁగులాడించెను.

క. అచలం బయ్యె మహా ర్తము, ప్రచలిత మయ్యెం గవీంద్ర•పరిపీడిత మై
యచలారుహములు సుమనో, నిచయంబుల నెల్ల రాల్చె•నిండం గొండన్.

అర్థము. అచలము=కదలనిది, పర్వతము ప్రచలితము =మిగులఁ గదలినది. పరిపీడితము=మిగుల బాధింపఁబడినది. బలవంతముగ నూఁచుటచే నని భావము. అచలారుహములు=వృక్షములు, అచలా=భూమి, సుమనోనిచయంబులన్=పూలగుంపును.

తాత్పర్యము

ఆ మహేంద్రపర్వతము కదలని దయ్యె హనుమంతుఁడు బలవంతముగా నూఁచుటచే మిగుల గదలినదయ్యెను. పర్వతము ముందు వెనుకకు నూఁగుటచే దానియందలి చెట్లన్నియుఁ బూలను గొండనిండ జలజల రాల్చెను.

క. అమ్మహిజమ్ములఁ రాలిన, ఘుమ్మను క్రొత్తావి బుగులు•కొను కుసుమసమూ
హమ్ముల పెల్లునఁ బుష్పమ, యమ్ముగ శైలమ్ము దనరె•నతిరమ్యంబై. ౧౩

అర్థము. మహిజమ్ములన్=చెట్లనుండి, క్రొత్తావి=క్రొత్తవాసన, క్రొత్త+తావి=క్రొత్తావి, బుగులుకొను=పరిమళించు, కుసుమ =పూవులు, పెల్లునన్=అతిశయముచే, పుష్పమయమ్ముగన్=పూలతో నిండినదిగ.

తాత్పర్యము

ఘుమ్మని క్రొత్తవాసనలచేఁ బరిమళించు పూలు విస్తారముగఁ జెట్లనుండి రాలుటచే నా పర్వతము పూలపర్వతమువలె మిగుల నందమై యుండెను.

కం. ఉత్తమవీర్యుం డగు కపి, సత్తముచేఁ బీడ చెంది • శైలంబు జలం
బత్తఱిఁ గార్చెను మదమును,మత్తమతంగజము కార్చు•మాడ్కిం బెలుచన్. ౧౪

తాత్పర్యము

ఉత్తమ పరాక్రమముగల కపి నాయకునిచే బీడింపఁబడి యా పర్వతము మదించిన యేనుఁగు మదము కార్చునట్లు నీళ్ళవంకలు పాఱునట్లు చేసెను.

కం. వడ వడ వడఁకెడి శైలము, నడుమను మడికాసు పైఁడి•నవ్యాంజన ముం
డెడి పొరలచాళ్లు కానం, బడియెను దరతరము ముసుఁగుఁ•బాపిన భంగిన్. ౧౫

అర్థము. మడికాసు=వెండి, నవ్యాంజనము=క్రొత్తకాటుక, ఇది మిగుల నలుపై యుండును.

తాత్పర్యము

గడగడలాడుచున్న కొండనడుమ వెండి బంగారు క్రొత్తకాటుకవంటి లోహము లుండెడి పొరల చాళ్ళు ముసుఁగు దీసివేసిన కానవచ్చునట్లొకటివెంట నొకటి కానవచ్చెను. ఆయారాలు పగులు నప్పటికి వానిలోనుండి యీవిధము లైన చాఱలు కనఁబడిన వని భావము.

క. ధగ ధగ మను నడిజ్వాలను, బొగఁ గ్రక్కెడి వహ్నిభంగిఁ • బోరిమణిసిలలన్
దగు పెనుబండలఁ ద్రోచెను, దిగువబడ మహేంద్రనగ మ • తిద్రుతరీతిన్. ౧౬

అర్థము. వహ్ని=అగ్ని అతిద్రుతరీతిన్ = మిగులవేగముతో, నడిజ్వాల= అగ్నిహోత్రునకు కాళి, కరాళి, విస్ఫులింగిని, ధూమ్రవర్ణ, విశ్వరుచి, లోహిత, మనోజవ యని యేడువిధముల జ్వాలలు గలవు. దానిలో నడిమిది ధూమ్రవర్ణ యని కొందఱు, అగ్నిహోత్రము మండునపు డంచున నుండు జ్వాలలు పొగతోఁ గూడియుండును. నడిమిజ్వాల పొగలేక యుండును. దానివలె నని కొందఱు.

తాత్పర్యము

మండెడు నగ్నిహోత్రము నడిమిజ్వాలచే భగభగమని మండు మంటలంచు జ్వాలలచేఁ బొగను నెట్లు క్రక్కునో యట్టులే పర్వతము నడుమ మణిసిలలను నంచునఁ బెద్దబండలను గ్రక్కెను.

క్రక్కుట వాంతి చేసికొనుట యివి ముఖ్యార్థమున జుగుప్సాకములు కావునఁ బ్రయోగింపరాదు. గౌణార్థమునఁ బ్రయోగింప నగు.

నిష్ఠ్యూతోద్గీర్ణ వాంతాది గౌణవృత్తివ్యపాశ్రయమ్
అతిసుందర మన్యత్ర గ్రామ్యకక్ష్యాం విగాహతే.

కం. గడగడ టాడఁగ శైలము, వడఁబడి గుహాలందుఁ బొదలు • వనసత్త్వంబుల్
దొడిఁబడియడలెడు రవములఁ, బుడిబుడి నిగిడించె దెసలుఁ • బుడమియునిండన్.

అర్థము. వనసత్త్వంబుల్=అడవిమృగములు, వడఁబడి=బాధపడి, తొడిఁ బడి=తొట్రుపాటుచెంది, అడలెడు రవములన్ = ఏడ్పుధ్వనులను, బుడిబుడిన్= తత్తఱపాటులో, నిగిడించెన్=వ్యాపింపఁజేసెను.

తాత్పర్యము

ఆ కొండ గడగడ వడఁకఁగా బాధపడి గుహాలందున్న యడవిమృగములు తొట్రుపడి యేడ్పు ధ్వనులచే భూమి యాకాశము వ్యాపింపఁజేసెను.

చం. ప్రకటమహేంద్రసానునగ • భాగచరిష్ణుభుజంగకోటి స్వ
స్తికవరలక్షణోల్లసిత • తీవ్రఫణంబులు వీచ్చి యుగ్రపా
వకనిభమౌ విషంబు నట • వారక హూత్కృతిఁ గ్రక్కి గుండులన్
వికటరదంబులం గొఱుకఁ • బెట్లఁ బఱిలున వేయితున్కలై. ౧౭

అర్థము. ప్రకట=ప్రసిద్ధమైన, మహేంద్రపర్వతము యొక్క, సాను నగ=చఱియల యందును, పర్వతప్రదేశమందును, చరిష్ణు=సంచరించు, భుజంగకోటి=పాముల సమూహము, భుజగము రూ. భుజంగము. స్వస్తిక=పాము పడగపై నర్ధచంద్రాకారముగ నుండు మచ్చయనెడి, వరలక్షణ=గొప్పగుర్తుచేత, ఉల్లసిత=ప్రకాశింపఁ జేయఁబడిన, తీవ్రఫణంబులన్=భయంకరములైన పడగలను, హూత్కృనన్=ఇది వాంతియందలి యనుకరణధ్వని, వికటరదంబులన్=వంకరలగు కోఱలచేన్ కొఱుకన్=కోపముచే గట్టిగఁ గఱవఁగా, పెల్లైన్=ఎగిరిపడెను.

## తాత్పర్యము

ఆపర్వతము చఱులయందును దక్కినప్రదేశములందు సంచరించు పాములు స్వస్తిక చిహ్నములచేఁ బ్రకాశించు పడగలు విచ్చి భయంకరమైన యగ్నితో సమానమైన విషమును హూత్కృన సమీపమందున్న గుండులను గోపముచేఁ దమ దంతములచేఁ గొఱుకఁగా నవి విషము వేఁడిమికి వేయితునకలై యెగిరిపడెను.

కం. విషమవిషమేని నొక్కని, మిషమున నగమూలికలు శమింపఁగ నై యా
విషముం బాపఁగ నోపవు, విషధరవిష మౌర! యెంత విషమవిషంబో. ౧౯

అర్థము. విషమ విషమేని=మిక్కిలి క్రూరమైన విషమునైనను, నగమూలికలు=పర్వతము నందలి వేళ్లు, శమింపఁగనై=హరింప శక్తి కలిగియు, విషధర విషము=పాముల విషము, విషమ విషమంబో=క్రూర విషమో.

## తాత్పర్యము

ఆ పర్వత మందలి యోషధు లెంత క్రూరమైన పాము విషమునైనను నిమిషములో హరింపఁగలవు. అట్టులయ్యు నా పాముల విషము నణఁప లేని వయ్యెను. ఆ పాముల విష మెంత క్రూరమో.

ఉ. బ్రద్దలువాఱు నోటు కుధరం బను నివ్వెఱఁ గాందిశీకులై
గ్రద్దనఁ బానపాత్రకరక ప్రకరంబులు భక్ష్యలేహ్యముల్
పద్దఱఁ బైఁడిపళ్ళ మొలబాకుల నార్షభచర్మఖేటముల్
రద్దు చెలంగ సర్వముఁ గలంక యథాస్థితి వీడి కోనలన్. ౨౦

అర్థము. ఓటు=సందేహార్థము, కుధరము=పర్వతము, నివ్వెఱన్=నిండు వెఱన్=నిండు భయముచే, కాందిశీకులై=పరువెత్తుచున్నవారై, పానపాత్ర=మద్యము త్రాగెడి పాత్రము, కరక=గిండివంటి పాత్రలయు ప్రకరంబులు=సమూహములు, లేహ్యముల్=నాలుకతో నాకి తినునవి, పద్దు+అఱన్=పంతము చెడునట్లు, ఆర్షభచర్మఖేటముల్=ఎద్దుతోళ్ళతోఁ జేయఁబడిన డాలులు, రద్దు=అల్లరి, కలంకన్=కలవరపాటుచే, యథాస్థితి=ఉన్నవున్నట్లు.

తాత్పర్యము

కొండ బ్రద్దలుగాఁ బగులునో యేమో యను భయముచే వారువారు మద్యముల్ద్రాగు పాత్రములను, గిండీలను. భక్ష్యములను లేహ్యములను బంగారు పిడులుగల మొలయందుఁ జెక్కుకొను బాకులు, ఎద్దుచర్మముతోఁ జేయఁబడిన డాలులు, కలవరపాటుచే వీనినన్నింటి నున్నవున్నట్లు కొనలందు వదలి సందడిగాఁ బరువెత్తువారై. పై పద్యముతో నన్వయము.

కం. హారంబులు కంకణ కే, యూరంబులు ఘల్లులార•వోద్భటపటుమం
జీరంబులు నవసుమనో, హారంబులు ధగితపారిహార్యము లమరన్. ౨౧

అర్థము. కేయూరంబులు=బాహుపురులు, ఘల్లులారవ=ఘల్లు ఘల్లు మను ధ్వనిచే, ఉద్భట=అతిశయించిన, పటు=దృఢములైన, మంజీరంబులు=అందెలు, నవ=క్రొత్తవగు, సుమనోహారంబులు=పూలసరములు. ధగిత=ధగ ధగమను, పారిహార్యంములు=కడియములు, అమరన్=ఒప్పఁగా.

తాత్పర్యము

హారములు, కంకణములు, భుజకీర్తులు, ఘల్లు ఘల్లుమను కాలియందెలు, క్రొత్తపూలదండలు, ధగధగమని ప్రకాశించు కడియము లొప్పుచుండఁగా, దేహముమీఁద నుండునవి తప్పఁ దక్కిన వన్నియు విడిచి పోయి రని భావము.

తే. అంగనలు కూడరాఁగ వి•ద్యాధరులును, రక్తమాల్యానులేపన•రక్తనయన
పుష్కరాక్షులుహారముల్•పొదలమెడల, నభ్రమునకుద్గమింత్రుమ•త్తాత్మలగుచు

అర్థము. రక్తమాల్యానులేపన=ఎర్రని పూలదండలు, మైపూఁతలు; రక్తనయన=తాగుటచే నెఱ్ఱనయిన కన్నులుగల, పుష్కరాక్షులు=స్త్రీలు, అభ్రమునకున్=ఆకాశమునకు, ఉద్గమింత్రు=ఎగసిపోయిరి, మత్తాత్మలు=మత్తుచే దేహములు దెలియనివారు.

తాత్పర్యము

వారి వారి స్త్రీలుకూడ రాఁగా, విద్యాధరులును, ఎఱ్ఱనిపూలదండలు, ఎఱ్ఱని మైపూఁతలు, ఎఱ్ఱని కన్నులుగల స్త్రీలు మెడలందు హారములు కదలు చుండ మత్తుచే దేహము లెఱుఁగక యాకాశమున కెగిరిరి.

కం. సస్మితలై రమణులతో, విస్మితలై వానరేంద్రు • వికటపుఁగృతికిన్
విస్మృతలై సురశాత్రవ, ఘస్మరునిం గనిరి వాలుఁ•గంటులు మింటన్. ౨౩

అర్థము. సస్మితలై=చిఱునవ్వుతోఁగూడినవారై, రమణులతో=ప్రియులతో, విస్మితలై=ఆశ్చర్యపడినవారై, వికటపుఁగృతికై = భయంకరమైనకార్యమునకు విస్మృతలై=దేహములు మఱచినవారై, సురశాత్రవ=దేవతలకు విరోధులగు, రాక్షసుల-ఘస్మరునిన్=భక్షించువానినఁగాఁ జంపువానిని, వాలుగంటులు=స్త్రీలు.

### తాత్పర్యము

ఆ స్త్రీలాకాశమందుఁ దమ ప్రియులతో నిలిచి నవ్వుచు, హనుమంతుని భయంకర కార్యమున కాశ్చర్యపడుచు, దేహములు మఱచినవారై రాక్షస హంతయగు హనుమంతుఁ జూచిరి.

కం. విద్యాధరపమర్షులు, విద్యలవిభవంబు వెలయ ♦ బృందంబులుగా
నై ద్యోవీథిని నిలఁబడి, చోద్యంబుగఁ గనిరి నగము♦చొప్పావేళన్. ౨౮

అర్థము. బృందంబులుగా=గుంపులుగా, ద్యోవీథిని=ఆకాశమార్గమందు, 'ద్యోవాహిని'యని ఎలకూచి బాలసరస్వతి దశావతారస్తోత్రములందుఁ బ్రయోగించియున్నాఁడు. 'ద్యూత్తంభద్గిరికల్పితావతరణద్యోవాహినీసంగమో, యని కూర్మావతార వర్ణనము. విద్యాధర పరమర్షులు=గొప్పఋషులవలె శ్రేష్ఠులగు విద్యాధరులు. ఇచ్చటఁ బరమర్షి శబ్దము శ్రేష్ఠార్థకము. ఉపమిత సమాసము. విద్యాధరులు, పరమర్షులు, అని ద్వంద్వము చెప్పరాదు. విద్యాధరు లాకర్షించిరని మీఁది పద్యంబునఁ గలదు.

### తాత్పర్యము

గొప్పఋషులవలె శ్రేష్ఠులగు విద్యాధరులు తమ తమ యణిమాది విద్యల బలముచే గుంపులు గుంపులుగా నాకాశమున నిలువఁబడి యప్పుడు పర్వత ముండు విధమును జూచిరి.

శా. ఆకర్ణించిరి సిద్ధచారణసమూ♦హంబుల్ వచింపంగ శై
లాకారుం డదె యంజనాసుతుఁడు రా♦మార్థంబుఁ గీశార్థ మ
స్తోకాశూర్ధతి దుష్కరంబుఁగృతికై ♦ దుష్ప్రాప మా వార్ధిదా
నా కూలంబును జేర నెంచెఁ గనుఁగొం♦డా యంచు విద్యాధరుల్. ౨౯

అర్థము. ఆకర్ణించిరి=వినిరి, దీనికిఁ గర్తృపదము విద్యాధరులు, శైలాకారుఁడు=పర్వతమంత దేహము గలవాఁడు, కీశార్థంబు=వానరుల కొఱకు, హనుమంతుఁడు సీతకై సముద్రము దాఁటి పోవుట కేవల రాముని నిమిత్తమే కాదు. వానరుల ప్రాణరక్షణము చేయవలసి యున్నది. కావున నిపు డిది వారి కార్యమే యయ్యెను. అస్తోక=గొప్పది యగు, ఆశూర్ధతి=వేగాతిశయముచే, దుష్కరంబుఁ గృతి=చేయ మిగులఁ గష్టమైన కార్యము, దుష్ప్రాపము=సులభముగాఁ బొంద రానిది, నాలుగవ పాదంబునఁ బ్లుతయతి ఇట్లు సిద్ధచారణ సమూహములు చెప్పఁగా విద్యాధరు లాకర్ణించి రని యన్వయము.

### తాత్పర్యము

ఆంజనేయుఁడు పర్వతాకారము గలవాఁడై రామునియొక్కయు, వానరుల యొక్కయు, గార్యార్థము మిగులఁ గష్టసాధ్యమైన సముద్రమును దాఁటి యావలి యొడ్డునకు మహావేగముతోఁ బోవుట యను నసాధ్యకార్యము చేయఁబూనెను. చూడుఁ డీయని సిద్ధులు చారణులు చెప్పుచుండ విద్యాధరులు వినిరి.

తే. ఆ మహాత్ముల మాటల నాలకించి, పర్వతాగ్రమునం దున్న ప్లవగవరుని
నప్రమేయునిఁ గాంచి వి ద్యాధరాళి, యద్భుతైకరసాతివ శాత్మమయ్యె. ౨౭

అర్థము. అప్రమేయుని=ప్రమాణము చెప్పరాని దేహముగల వానిని, అద్భుతైకరస=ఆశ్చర్యమే ప్రధానముగాఁగల రసమునకు, అతివశాత్మము=మిగుల వశేపడిన మనస్సు గలది.

తాత్పర్యము

ఆ మహాత్ముల మాటలు విని పర్వతముపైనున్న కొలఁది చెప్పరాని శరీరముగల హనుమంతుని గని విద్యాధరులు మిగుల నాశ్చర్యపడిరి.

తే. కొండవలె నుంపు నాకపి కుంజరుండు. మేను విదలించి రోమవి తానములను
విడ్రుచి వర్షాగమాభ్రంబు విధముదోఁప, బిట్టుఱిమె నిస్వనము దిశల్ వట్టుచుండ. ౨౮

అర్థము. రోమవితానములను=వెండ్రుకల సమూహమును, వర్షాగమాభ్రంబు=వానకాలమందలి మబ్బు, నిస్వనము=ధ్వని.

తాత్పర్యము

కొండవలె దేహము పెంచిన యాకపిశ్రేష్ఠుఁడు దేహము విదలించి వెండ్రుకలు రాల్చి వానకాలమందలి మేఘమువలె ధ్వనిని దిక్కులు నిండునట్లు గర్జించెను.

కం. రోమాంకురసంచితమై, భీమంబై యానుపూర్వీ వృత్తంబయి యు
ద్దామం బగు లాంగూలముఁ, బాముసు గరుటాలమంతు భంగి విదిర్చెన్. ౨౯

అర్థము. రోమాంకురసంచితమై=మొలకలవలె నిలువఁబడియున్న వెండ్రుకలచే నిండినదై. అనుపూర్వీవృత్తంబయి=మొదటినుండి తుదదాఁక గుండ్రమై, ఉద్దామంబు=గొప్పది, లాంగూలము=తోఁక, గరుటాలమంతుభంగిన్ = గరుత్మంతునివలె, విదిర్చెన్=విదలించెను.

తాత్పర్యము

మొలకలవలె నిట్టపొడిచిన వెండ్రుకలచే నిండినదై భయంకరమై మొదటి నుండి తుదదాఁక వట్రువయై గొప్పదియగు తోఁకను గరుత్మంతుండు పామును విదలించినట్లు విదలించెను.

కం. భీమజవు భగ్నవాలము, దామోదరహయగృహీత దర్వీకరమో
నా మహనీయుని వీఁపునఁ, దా మెఱయుచు నుండె నద్భుతం బగురీతిన్. ౨౯

అర్థము. భీమజవు=భయంకరమైన వేగముగల హనుమంతుని యొక్క, భగ్నవాలము=వంగిన తోక, దామోదర హయ=విష్ణువాహనమైన గరుత్మంతునిచే, గృహీత=పట్టుకొనఁబడిన, దర్వీకరమో=పామో. ఉత్ప్రేక్షాలంకారము.

తాత్పర్యము

భయంకర వేగము గల హనుమంతుని వంగిన తోఁక గరుత్మంతుఁడు పట్టుకొన్న పామువలె నాయన వీఁపుపై నాశ్చర్యకరముగ మెఱయుచుండెను.

—♦ హనుమంతుఁ డాకాశంబున కెగిరి కపులచే మెప్పు దీసికొనుట ♦—

సీ. పరిఘనిభంబులౌ♦బాహువుల్ స్తంభించి, భుజములు మెడయును♦బోరిముడించి
మోఁకాళ్లు లర్ధంబు♦ముంగలగా వంచి, పాదముల్ జోడించి♦వడిఁ గుదించి
వీనుల స్రుక్కించి ♦ పెదవుల బిగియించి, కటిభాగమును లోను♦గాఁగఁ గుంచి
కనుఱెప్ప లెగయించి♦కడుదవ్వు దిలకించి, యుర్వీధ్రమునఁ గాళ్లు♦లూఁదియుంచి
యూర్పు బిగియించి తమిమీఱ ♦ నురవడించి,
బయలఁ జూపు రహించి ని♦ర్భయత మించి
కార్యముఁ దలంచి తన పరా♦క్రమము నెంచి
పెంపు వహియించి యట్టె కు♦ప్పించి యెగసె. ౩౦

అర్థము. పరిఘనిభంబులు=ఇనుపకట్ల గుదియలతో సమానములు, పోరి=మిక్కిలి, ముడించి=ముడుఁచుకొనునట్లు చేసి, కుదించి=కుదియఁజేసి, స్రుక్కించి=ముడుఁచుకొని, తిలకించి=చూచి, ఉరవడించి=వేగిరపడి, స్వభావోక్త్యలంకారము.

తాత్పర్యము

హనుమంతుఁడు సముద్రము దాఁట నుద్యుక్తుఁడై యినుపకట్ల గుదియల వంటి రెండుబాహువులు కదలకపట్టి భుజములు మెడ ముడిఁచికొని సగము మోఁకాళ్లు ముందరివైపు వంచి రెండుపాదము లొక్కచోనుంచి కుదియఁజేసి చెవులు స్రుక్కఁజేసి పెదవులు బిగించి నడుము లోపలికిఁదీసి కంటి ఱెప్పలు పైకెత్తి దూరమునందు దృష్టినిలిపి పర్వతమునందుఁ గాళ్లు బిగఁదన్ని, శ్వాస బిగించి సముద్రముదాఁటు కోరికతో వేగిరపడి బయలఁ జూపు నిలిపి చేయవలసిన కార్యము దానికిఁదగిన తన పరాక్రమము యోజించి భయము లేదు కార్యము సాధింపఁగలనని ధైర్యము గలవాఁడై గొప్పతనము వహించి యట్టె చివ్వున గుప్పించి యెగయఁబూనెను.

కం. ఎగయుచు నచ్చట నుండెడు, నగచరనాయకులతోడ♦హర్షంబున నా
శుగతనయుం డిట్లనుఁ దన, మగతనపుం బలిమిఁ దెలుపు♦మాటలతోడన్. ౩౧

అర్థము. ఆశుగతనయుఁడు=వాయుపుత్రుఁడు, మాటలతోడన్+అనున్=తృతీయ కభేద మర్థము, ప్రకృత్యాచారుః అను సంస్కృత ప్రయోగము వంటిది. అనున్=ఈ క్రియకు ముఖ్యకర్మము వక్ష్యమాణవృత్తాంతము.

తాత్పర్యము

ఇట్లెగయుటకై పూని యచ్చటనున్న వానర ముఖ్యులతో సంతోషముతోఁ దన పౌరుషబలము దెలియునట్లిట్లనియె.

ఉ. చెచ్చెర వాయువేగ మగు ♦ శ్రీరఘురాముశరంబునట్లు నేఁ
జొచ్చెద లంక, నందు నృప ♦ సుందరి గన్పడకున్న నాకముం
జొచ్చెద నిట్లె నందు సతిఁ ♦ జూడమి గల్గినఁ గట్టి రావణుం
దెచ్చెద, నెట్టులైన నృపు ♦ దేవిని దోడ్కొనివచ్చెదం జుఁడీ. ౩౨

అర్థము. శ్రీరఘురాము శరంబునట్లు = రామచంద్రమూర్తి బాణమువలె, ఈ దృష్టాంతముచే దనకు వేగాతిశయము గలదనియుఁ దన ప్రయత్నము వ్యర్థము కాదనియుఁ దన కడ్డములేదనియు ఆవలియొడ్డు చేరువఱకు నడుమ నిలువ ననియు సూచితము. ౨౭వ పద్యమునందు 'ప్రతిన సల్పితిఁ బ్రోవను నిల్వనంచు, నని చెప్పిన వాక్యమున కిదియే ప్రమాణము. ఇది వాల్మీకి శైలి విధానము.

## తాత్పర్యము

మిత్రులారా! వాయువేగముగల రామచంద్రమూర్తి బాణమువలె లంకఁ బ్రవేశించెదను. అచ్చట సీతాదేవి కనఁబడదాయెనా యిదే విధముగా స్వర్గము నకుఁ బోయెదను. అక్కడ సీతాదేవి కానరాకున్న రావణుఁ గట్టి తెచ్చెదను. ఏవిధముగనైన సీతాదేవిని బిలుచుకొని వచ్చెదను.

కం. తెచ్చెద లంకను నిచటికిఁ, ద్రొచ్చెద రావణునిఁబట్టి క్రూరతమై నే
వచ్చెద సెల విచ్చెదరే, హెచ్చెదఁ గృతకృత్యతను గపీశ్వరులారా! 33

అర్థము. త్రొచ్చెదను=నేల గుంతఁదీసి పాఁతిపెట్టెదను. వచ్చెదను=పోయి వచ్చెదను. ఆంధ్ర లోకోక్తి.

## తాత్పర్యము

వానర శ్రేష్ఠులారా! నేనొకఁడనే సీతాదేవిని లంకయందు వెదుక జాగగు నట్లుండిన లంకనే యిచ్చటికిఁ దెచ్చెదను. రావణుఁ డడ్డము వచ్చెనా వానిని దయ లేక గోతిలో వేసి పాతిపెట్టెదను. పోయివచ్చెదను సెలవిచ్చెదరా. ఎట్లైనను గార్యము సాధించెదను.

## — హనుమద్గమన వేగ వర్ణనము —

చ. అనుచుఁ జివుకుక్కన న్నెగసి యాత్మను దన్వినతాత్మజాతుఁగా
నను కొని పోవు వేగమున కాతనితోన ద్రుమంబులెల్లఁ జ
య్యన సుమపక్షి యుక్తముగ నభ్రపథంబున కుద్గమించి తోఁ
జనె దవు పోవుచుట్టమును సాగఁగ నంపెడి బంధులో యనన్. ౩౪

అర్థము. ఆత్మను=తన మనస్సునందు, వినతాత్మజాతుఁగాన్=గరుత్మంతు నిఁగా, ద్రుమంబులు=చెట్లు, సుమ పక్షి యుక్తముగన్=పూవులతో, పక్షులతో అభ్రపథంబునకున్=ఆకాశ మార్గమునకు, తోఁజనెన్=వెంటఁబోయెను. దవు= దూరము. రూ. దవ్వు.

## తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి చివాలున నెగసి తన్ను గరుత్మంతునిఁగాఁ దలఁచుచు వేగముగఁ బోఁగా నా వేగమునకు గొండనిండి చెట్లు పూలతోఁ బక్షులతో నాకాశమున కెగిరి దూరముపోవు చుట్టమును సాగనంప వెంటఁబోవు బంధులవలె నతని వెంటఁబోయెను.

కం. దళవాయిని వెనుకొనియెడి, దళము లనన్ సాలవృక్ష•తతు లవ్వేళన్
దళముగ వెన్నంటె మహా•బలసుతమహితోరువేగ•భగ్నము లగుచున్. ౩౫

దళవాయి=సేనానాయకుఁడు, దళములు=సేనలు, దళముగన్=దట్టముగ, మహాబలసుత=వాయుపుత్రుని, మహిత=గొప్పదగు, ఊరువేగ=తొడలవేగముచే, భగ్నములు=విఱిగినవి.

తా త్ప ర్య ము

సేనానాయకుని వెంటఁబోవు సేనలవలె మద్దిచెట్లగుంపులు దట్టముగ నా సమయమందు నాంజనేయుని తొడల వేగముచే విఱిగి వెంబడి పోయెను.

కం. దండిగఁ బూచిన కొమ్మల, కాండంబులతోడ నొప్పు•ద్రుమ్మారుహవితతుల్
దండ నరుదేరఁ గపివే, తండము గిరివోలె నద్భు•తంబుగఁ దోఁచెన్. ౩౬

అర్థము. కాండంబులతోడన్=సమూహములతో, ద్రుమ్మారుహ వితతుల్=చెట్లసమూహములు, దండ=సమీపమున, కపివేతండము=కపిశ్రేష్ఠుఁడు వేతండము. రూ. వేదండము-భామినీ విలాసము. ౧-౬ ౨.

తా త్ప ర్య ము

విస్తారముగఁ బూచిన కొమ్మల గుంపులు గల చెట్ల సమూహములు తన సమీపమున రాఁగా హనుమంతుఁడు కొండవలె నాశ్చర్యకరముగఁ గానవచ్చెను.

క. దంభోళిధరునిపటుసం,రంభంబున జలధి మునుఁగు•గ్రావము లటు లా
యంభోధిఁ బడి గుభాలున, నంభస్సుల సారవద్ద్రు•మాళి మునింగెన్. ౩౭

అర్థము. దంభోళిధరుని=వజ్రాయుధము ధరించిన యింద్రుని, పటు సంరంభమునన్=అధిక వేగముచే, గ్రావములు=పర్వతములు, అంభస్సులన్=నీటియందు, సారవద్ద్రుమాళి=సారవంతములైన చెట్లగుంపులు.

తా త్ప ర్య ము

తమ ఱెక్కల ఖండింపఁ బూనిన యింద్రుని వేగమునకు వెఱచి సముద్రములో మునుఁగు కొండలవలె సారవంతములై భారము గల చెట్లు సముద్రములో గుభాలున బడి మునిగెను.

క. జలధరనిభుఁ డగు తత్కపి, కలికాంకురయుక్తకుసుమ•గణములతోడన్
విలసించె మిణుంగురుపు,ర్వులతో నిశారాణ మీఱు•భూధర మనఁగన్. ౩౮

అర్థము జలధర నిభుఁడు=మేఘముతో సమానుఁడు, కలిత+అంకుర+యుక్త=మొగ్గలతోను, మొలకలతోను గూడిన, కుసుమ గణముల తోడన్=పూల గుంపులతో.

తా త్ప ర్య ము

మేఘమువంటి యా హనుమంతుఁడు మొగ్గలతో మొలకలతోఁ గూడిన పూలతో మిణుఁగురు పురువులతో రాత్రియందుఁ బ్రకాశించు కొండవలె నుండెను.

కం. ఉరవడిఁ జన లేకెడలిన, ధరణీరుహకోటిముక్తతతపుష్పంబై
తోరఁగ జలంబుల నుదకపు, టిరవువరకు సాగనంపుహితచయ మనఁగన్. ౪౬

అర్థము. ఎడలిన=వేగము తగ్గిన, ధరణీరుహకోటి = చెట్లసమూహములు, ముక్తతత పుష్పంబై=విడువఁబడిన విస్తారమగు పువ్వులుగలదై, ఉదకపుటిరవు నఱకున్=నీళ్లుండు స్థలమువఱకు, చెఱువు, కాలువ, ఏఱు మొదలైనవి. బంధువులను, హితులను సాగనంపువారు నీళ్లడ్డము వచ్చుటవఱకే పోవలయును. ఆవల బోరాదు 'ఉదకాంతాత్ స్నిగ్ధో బంధు మను వ్రజే' త్తని శాస్త్రము.

తాత్పర్యము

భారమగుట వేగముగఁ బోలేక వెనుకఁబడిన చెట్లగుంపులు రాలిపోయిన పూలు గలవై నీళ్ళడ్డము వచ్చువఱకు బంధువుల సాగనంపి కన్నీళ్లు గార్చుచు నిలిచిపోవు హితులవలె నీళ్ళలోఁబడెను.

ఉ. ఆ కపిగాలి నుత్థితములై బడి నేగియుఁ దేలికొటచే
స్తోకసుమంబు లెల్ల వడిఁ దోయధిఁ గూలెఁ బరస్సహస్రమై
ప్రాకటతారకాశతవిరాజితమైన నభంబుపోల్కి నీ
రాకర మప్పు డొప్పెఁ బ్రసవౌఘము లెల్లెడ నిండియుండుటన్. ౪౭

అర్థము. ఉత్థితములై=ఎగిరినవై, బడి=వెంబడి. స్తోకసుమంబులు=చిన్న పూలు, పరస్సహస్రము=వేయికి మించినవి; 'పరశ్శతాద్యాస్తే యేషాం పరా సంఖ్యా శతాధికాత్' అమరుఁడు. 'బ్రహ్మదయో బ్రహ్మహితాయ తప్త్వా పరస్సహస్రం శరద స్తపాంసి' భవభూతి. ప్రాకట=స్పష్టముగాఁ బ్రకాశించు, తారకాశత=అనేక నక్షత్రములచే, విరాజితము=ప్రకాశించునది, నభంబు=ఆకాశము, నీరాకరము=సముద్రము, ప్రసవ+ఓఘము=పూలగుంపు

తాత్పర్యము

బరువుగానుండు చెట్లు ముందుగాఁ బడిపోఁగాఁ దేలికయైనవి పూవులుగాలి కెగసి హనుమంతుని వెంబడి మఱి కొంతదూరముపోయి యందు వేల కొలఁది పూవులు సముద్రములో రాలఁగా నప్పుడా సముద్రము పూలచే నిండినదై నక్షత్రములచేఁ బ్రకాశించు నాకాశమువలె నుండెను.

క. నానావర్ణవిరాజిత, సూనావృతుఁడైన వాయుసూనుఁడు పొలిచెన్
మానుగ మెఱపులతోడ న, నూనం బగు తోయదము నుద్దిగ నగుచున్. ౪౮

అర్థము. నానావర్ణ = పెక్కువన్నెలచే, విరాజిత=ప్రకాశించు, సూన=పుష్పములచే, ఆవృతుఁడు=కప్పఁబడినవాడు, అనూనము=కొఱఁతలేని, తోయదము=మేఘము.

తాత్పర్యము

పెక్కురంగుల పూలతోఁ గప్పఁబడిన హనుమంతుఁడు మెఱపులతో నిండిన మేఘమువలె నుండెను.

క. మారుతసుతవేగంబున, వే రాలెడు వివిధపుష్ప•బృందముతోడన్
నీరధి యుదయత్తారా, వారమనోహారనభంబు•వడువున నొప్పెన్. ౪౨

అర్థము. ఉదయత్=ఉదయించుచున్న. తారావార=నక్షత్రసమూహముచే మనోహార=ఇంపైన, నభంబు=ఆకాశము.

తాత్పర్యము

ఆంజనేయుని వేగముచే వెంటవెంటరాలుచున్న నానావిధములైన పుష్ప సమూహములతో సముద్ర ముదయించుచున్న నక్షత్రముల గుంపుతోఁ బ్రకాశించు నాకాశమువలె నుండెను.

తే. ఉడుపథంబునఁబోవువా•యుజునిచాఁ పఁ•బడిన కేల్దోయిగన్పట్టె•భయదమగుచుఁ
బర్వతమునుండి తలనిక్కఁ•పఱచి పఱచు,నైదుతలలమహోఫణు•లట్టులగుచు. ౪౩

అర్థము. ఉడుపథము=నక్షమార్గము, ఆకాశము. ఇది హనుమంతుని హస్త వర్ణనము.

తాత్పర్యము

ఆకాశమునందుఁ బోవుచుండు హనుమంతునిచేఁ జాఁపబడిన రెండుచేతులు పర్వతమునుండి తల నిక్కఁబెట్టి పరువెత్తు నైదుతలల పాములవలె నుండెను. అయిదు వ్రేళ్ళు ఐదు తలల వలె నుండె నని పోలిక.

క. తివ్వనఁ దరించి చనుచో, నవ్వనచరుఁ డూర్మిసహిత•మంబునిధిం దా
నవ్వియదధ్వముఁ ద్రావెడు, నవ్వడువునఁ దోఁచు చుండె•నయ్యోగతులన్. ౪౪

అర్థము. ఊర్మిసహితము=అలలతోఁగూడినది. వియత్+అధ్వము=ఆకాశ మార్గము.

తాత్పర్యము

అలలతోఁ గూడిన సముద్రమును తివ్వనదాఁటి యాకాశమునఁ బోవు హనుమంతుఁడు ఆకాశమును, సముద్రమును ద్రావుచుఁ బోవుచున్నాఁడాయేమి యున్నట్టు లుండెను. ఆయన వేగమునకు నవి రెండును గడచి పోవుచుండెను.

ఉ. మండుచు నుండు కొండ పెను•మంటలు నా, యుగపత్సముద్భవో
ద్దండదివానిశాకర వి•ధంబున, మించులఁబోలి గుండ్రనై
వెండియుఁ బింగళంబు లయి•వెల్గెడి నేత్రము లొప్పె వాయుపు
త్రుండు సురాధ్వగామి యయి•తోరపువీఁకను బోవుచుండగన్. ౪౫

అర్థము. యుగపత్=ఏకకాలమున, సముద్భవ=పుట్టిన, ఉద్దండ=(ప్రకాశముచే) అతిశయించిన, దివానిశాకరవిధంబునన్, దివాకర నిశాకరవిధంబున= సూర్యచంద్రులవలె, మించులన్=మెఱుపులను, పింగళములు=ఎఱుపు పసుపు గలిసినవి, సురాధ్వగామి=ఆకాశమునఁ బోవువాఁడు. తోరపు• వీఁకను=అధిక పరాక్రమముచే, పింగళతయందు మాత్రమే పెనుమంటలు, మించులు ఉపమాన

ములు. దివాకర నిశాకరులు వర్తులత పింగళతయం దుపమానములు, ఇది యభూతోపమ ఉదయించువేళ సూర్యచంద్రులు ఎఱ్ఱగానే యుందురు. ఇది హనుమంతుని నేత్రవర్ణనము

తాత్పర్యము

హనుమంతుఁడు మిగుల వేగమున నాకాశమున బోవునపు డాయనకన్నులు నందుచున్న కొండల యందలి పెద్ద మంటలో యేకకాలమం దుదయించిన సూర్య చంద్రులో యన్నట్లు గుండ్రమై పింగళ వర్ణములై యుండెను.

తే. ఎఱ్ఱడాలున మెఱయు క • పీంద్రువదన, బింబ మెఱ్ఱని నాసిక • బెనుపుమీఱె
సంజకెంజాయ సోఁకున • నవురు మిగులు, నరుణదీధితిమండల • మనఁగ నపుడు.

అర్థము. అరుణదీధితి=సూర్యుని, ఇది హనుమంతుని నాసికవర్ణనము.

తాత్పర్యము

ఎఱ్ఱని కాంతిగల హనుమంతుని ముఖమందు నెఱ్ఱని ముక్కు సంజకెంజాయలు వ్యాపింపఁగా నందు గానవచ్చు నెఱ్ఱని సూర్యబింబమువలె నుండెను.

క. పవమానతనూభవుఁ డిటు, ప్లవమానుం డగుచు నార్ప • లాంగూలంబున్
దివి నది వెలిఁగె సముచ్ఛ్రిత, దివిజాధిపతిధ్వజంబు • తీరుగ గురుతన్. ౪౭

అర్థము. ప్లవమానుండు=దాఁటుచున్నవాఁడు, ఆర్పన్=ఆడింపఁగా లాంగూలంబున్=తోఁకను, గురుతన్=గొప్పతనమందు, సముచ్ఛ్రిత=ఎత్తఁబడిన, దివిజాధిపతి=ఇంద్రుని, ధ్వజంబు=జెండా, ఇది హనుమంతుని తోఁక వర్ణనము.

తాత్పర్యము

ఈ ప్రకార మాంజనేయుఁడు సముద్రము దాఁటిపోవుచుఁ దోఁక నాడింపఁగా గొప్పతనమునందునాకాశమందది యెత్తఁబడిన యింద్రధ్వజమువలెఁ బ్రకాశించెను.

క. వెలిఁగెడి నెలికోఱలతో, వలయాకారంబు గొనిన • వాలముతో ని
స్తులమతియగు హనుమంతుఁడు, జలజాప్తుఁడు పరిధినున్న • చందముఁ దాల్చెన్.

అర్థము. వలయాకారంబు=గుండ్రము, జలజాప్తుఁడు=సూర్యుఁడు,పరిధిన్=పరివేషమునందు.

తాత్పర్యము

వెలుపలఁ బ్రకాశించు కోఱలతోను గుండ్రముగాఁ దన్నుఁ జుట్టుకొన్న తోఁకతోను హనుమంతుఁడు పరివేషము నడుమ నున్న సూర్యునివలె నుండెను.

క. నెఱమెఱుపుడాలు పిఱుఁదుల, ముఱికంబున నొప్పెఁ గీశ • ముఖ్యుఁడు దాఁ జే
గుఱుధాతువులను శైలము, తెఱపలు తెఱపలుగ నైన • తెఱఁగులు దోఁపన్.

అర్థము. నెఱ=పూర్ణమైన, డాలు=కాంతి, ముఱికంబునన్=నిక్కుచేత. జేగుఱు=ఎఱ్ఱని.

తాత్పర్యము

పూర్ణమైన ఎఱ్ఱని కాంతిగల పిఱుఁదుల నిక్కుచే హనుమంతుఁడు ఎఱ్ఱని

ధాతువులచే బర్వతము, తెట్టెలు తెట్టెలుగా నున్న విధముఁ దోఁపఁజేయు చుండెను.

క. ఒడిసెలతావలె దివిఁ జను, నెడికరువలిముద్దుఁగోడుకు•నిరుమడిసందిన్
వెడలెడిగాడుపు మేఘము, బెడిదపుటుఱు మనఁగ మొరసె•భీమఁణభంగిన్. ౯౦

అర్థము. ఒడిసెల=ఱాలు విసరివేయుటకై యల్లబడిన త్రాడు, రూ. వడిసెల కరువలి=గాలి, ఇరుమడి సందిన్=రెండు చంకల నుండి.

తా త్ప ర్య ము

ఒడిసెలతో వేసిన తివ్వఁబోవు రాయివలె, బోవుచున్న హనుమంతుని రెండు చంకల నుండి వెడలు గాలి మేఘముల యుఱుములవలె భయంకరముగ ధ్వనించెను.

తే. ఉత్తరమునుండిదక్షిణం•బొత్తికొనుచు,నుక్కకరిగెడి పెనుఁదోఁక•చుక్కవోలెఁ
దాను బెనుఁదోఁకతోడ నె•మ్మేను వెలుఁగ,లంకవై పుగఁ బఱ ని•శ్శంకమతిని. ౯౧

అర్థము. ఒత్తికొనుచున్=ఆక్రమించుకొనుచు.

తా త్ప ర్య ము

ఉత్తరము నుండి దక్షిణమునకై పోవు తోఁకచుక్కవలె నాంజనేయుఁడు పెద్దతోఁకతో దేహము ప్రకాశించుచుండ లంకవైపుగ జంకులేక పోయెను. తోఁకచుక్క యుపమానము లంక కనిష్ట సూచకము.

తే. నింగి తెరువునఁ జనెడి ప•తంగునట్లు, పొంగిపఱచుచు నున్న•ప్లవంగుఁ డొప్పె
నడుమునను ద్రాటఁ గట్టంగఁ•బఱుట దీర్ఘ,భూతమైన మదోత్కట•రీతి నవర.

అర్థము. నింగి=ఆకాశము, పతంగునట్లు సూర్యునివలె, దీర్ఘభూతము=నిడివిగా సాఁగినది, మదోత్కటము=ఏనుగు.

తా త్ప ర్య ము

ఆకాశమార్గమునఁ బోవుచున్న సూర్యునివలె వేగముగఁ బరువుపాఱుచున్న వానరుఁడు నడుమునకుఁ ద్రాడు గట్టఁగా నిడివిగా సాఁగు నేనుఁగువలె దీర్ఘకాయుఁడై తోఁచెను.

క. అంబువులం బ్రతిబింబం, బంబరమున రూపు వెలయ•హనుమంతుం డ
ర్ధంబు జలంబుల మునిఁగి జ,వంబున గాలికిని బోవు•ప్లవ మనఁ దోఁచెన్ . ౯౩

అర్థము. అంబువులన్ = నీటియందు, అంబరమునన్ = ఆకాశమందు, ప్లవము=పడవ.

తా త్ప ర్య ము

ఆకాశమున రూపము, దాని నీడ సముద్రము నీళ్ళయందుండుటచే హనుమంతుఁడు సగము నీళ్ళలో మునిఁగి సగము వెలికి గానవచ్చు పడవవలె నుండెను.

తే. గాడ్పుకొడుకఁడు చనినమా•ర్గంబు సర్వ, మతని మహితోరువేగంబు•కతనఁజేసి
యల్లకల్లోల మగుచు వా•రాకరమునఁ,బొలిచె సోన్మాద భంగిని•గలఁగఁబడుచు.

అర్థము. గాడ్పు కొడుకు=వాయుకుమారుఁడు, కొడుకు శబ్దము బిడ్డాదు లలోఁ జేరినది, బిడ్డాదులకు డుజ్జును విభాషనగు, సు. వ్యా. ఆచ్ఛిక. ౫ సూ. కతనఁజేసి=కారణముచేత.

తాత్పర్యము

వాయుపుత్రుఁడుపోయిన మార్గమంతయును సముద్రమున నాయన తొడల వేగముచేఁ గ్రిందు మీఁదు మీఁదు క్రిందుగఁ దాఱుమాఱై పిచ్చిపట్టిన వాని వలె నుండెను. పిచ్చిపట్టిన వాఁడు తల దిరిగి పడుచు లేచుచు నోట నురుగు గ్రక్కుచుఁ బెద్దగా శబ్దించుచుండునట్లు సముద్రము భ్రమణ ఫేన ఘోషణములఁ గలదై యుండెనని భావము.

క. మి న్నప్పళింప నెగిరెడి, మున్నీటికరళ్ళఁ బ్లవగ•ముఖ్యుఁడు తనమే
న న్నిగిడెడి కరువలిచేఁ, దన్నుచు వడిఁ బోవుచుండె•దారుణభంగిన్. ౫౫

అర్థము. అప్పళింపన్=తాఁకుటకు, కరళ్ళన్=అలలను, కరువలిచే=గాలిచే.

తాత్పర్యము

ఆకాశ మంట నెగురు సముద్రముయొక్క యలలను హనుమంతుఁడు తన దేహమునుండి కలిగిన గాలిచేఁ దన్నుచుఁ బోవుచుండెను

ఉ. వానరవర్యవేగభవ•వాయువునున్ జలదాశుగంబు సం
తానము నొక్కటై జలధిఁ•దద్దయుఁ దాఁ గలగుండు వెట్టెఁ బెం
పాన నభంగభంగనిచ•యంబుల లాగెడి నాఁగ, నంజనా
సూనుఁడు మింటి మంటిగరు•సున్ విభజించెడి నాఁగ దాఁటుచోన్. ౫౬

అర్థము. వేగభవ=వేగముచేఁగలిగిన, జలదాశుగంబు=మేఘములవలనఁ గలిగిన వాయువు, కలగుండు వెట్టెన్=కలవర పఱిచెన్, పెంపానన్=పెంపు గలుగ, అభంగ=భంగములేని, భంగ నిచయంబులన్=అలల సమూహములను, గరుసున్=ఎల్లను. పొలిమేరను.

తాత్పర్యము

వానర శ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు పోవుటచేఁ గలిగిన వాయువు మేఘములు పోవుటచేఁ గలుగు వాయువు రెండు నేకముగఁ గలసి సముద్రమును గలవర పఱిచెను. హనుమంతుఁడు సముద్రము దాఁటునపుడు గొప్పతనము గలుగునట్లు నిండు తరఁగల గుంపులను లాఁగు చున్నాఁడో, యాకాశమునకు భూమికి నెల్ల యేర్పాటు చేయుచున్నాఁడో యన్నట్లుండెను.

క. ఉన్నతి మేరువు మందర,ము న్నగు మున్నీటియలల•మునుకొని వడిఁ దా
నెన్నుచుఁ బోయెడినో యనఁ, గ్రన్నన తెరియింపసాగెఁ•గడిమి దలిర్పన్. ౫౭

అర్థము. మున్నీటి=సముద్రముయొక్క, మును+నీరు=మున్నీరు, తొలుత సృజింపఁబడిన నీరు, అప ఏవ ససర్జాదౌ(౨) ఆకాశము నుండి పడు వాననీళ్లు.

వళ్ళనీళ్లు, ఊటనీళ్ళు గలసినది యని యైన జెప్పవచ్చును. మూఁడు+నీరు=మున్నీరు ఎన్నుచున్=లెక్కపెట్టుచు, క్రన్నన=శీఘ్రముగ, కడిమి=పరాక్రమము, తలిర్పన్=అతిశయింపఁగా.

తాత్పర్యము

ఎత్తునందు మేరు మందర పర్వతములతో సమానము లయిన సముద్రపు టలల లెక్కపెట్టుచుఁ బోవుచున్నాఁడేమో యనునట్టు అలల మీఁదుగ హనుమంతుఁడు వేగమునఁ బోయెను.

క. పవనజజవనజపవనము, దివికిని మున్నీటినీటి ♦ తెలిబిందులుగా
సవురుగ నెగఁజిమ్మిన నవి, సవనధరము లగుచుఁ దోఁచె♦శరదభ్రములై. ౬౮

అర్థము పవనజ=వాయుపుత్రునియొక్క, జవనజ=వేగమువలనఁబుట్టిన, పవనము=గాలి, తెలిబిందులుగాన్=తెల్లనితుంపురులుగా, సవనధరములు=మేఘములతో గూడినవి, శరదభ్రములై=శరత్కాలమేఘములై.

తాత్పర్యము

హనుమంతుని వేగమువలనఁ గలిగిన వాయువు సముద్రము నీటిని దెల్లని తుంపరలుగా నాకాశమునకు నెగఁజిమ్మఁగా నవి శరత్కాలమేఘములవలె మేఘములతోఁ గూడినవై కానవచ్చెను.

క. చేలము దొలంప దేహికి, వాలాయము దోఁచు నవయ♦వంబులభంగిన్
నీటులు చనఁ దిమికచ్ఛప, పాళియు ఝషనక్రవితతి ♦ స్పష్టం బయ్యెన్. ౬౯

అర్థము. ఝష=చేఁపలయు, నక్ర=మొసళ్ళయు, వితతి=సమూహము.

తాత్పర్యము

మనుష్యునకు వస్త్రము దీసివేయఁగా నవయవములు గానవచ్చునట్లు సముద్రమునందలి నీళ్లాకాశమున కెగిరిపోఁగా దిములు, తాఁబేళ్లు, చేపలు, మొసళ్లు గానవచ్చెను. తాఁబేళ్ళు మీఁగాళ్లు, చేఁపలు కన్నులు, మొసళ్లు పిక్కలు.

క. నింగిని జనియెడి వానర, పుంగవుఁ గని కడలిలోని♦భుజగంబులు భీ
తిం గదురఁగ గరుడుం డనుచుం గళవళ మంది కుంది♦సొమ్మలుబోయెన్. ౭౦

అర్థము. సొమ్మలు=మూర్ఛలు.

తాత్పర్యము

ఆకాశమునఁబోవు హనుమంతునిఁ జూచి సముద్రములోనిపాములు గరుత్మంతుఁడు పోవుచున్నాఁ డని భయపడి కలవర పాటుచెంది మూర్ఛపోయెను. (ఈ యభిప్రాయము ననుసరించి కాఁబోలు నాముక్తమాల్యదయందుఁ గృష్ణదేవరాయట 'ఘనతటత్పయోబ్ధి వీక్ష్యరసాతలానోర్భన్య పిండీకృతాంగ భీతాండజము'లని వ్రాసెను.

క. పదియామడ వెడలుపు ము,ప్పదియామడ నిడివి యగుచుఁ♦బరఁగి రుచిరమై
యుదధిని బావని నీడ వి,శదఘనఘనపంక్తి యనఁగఁ♦జనుచుండె బడిన్. ౭౧

అర్థము. ఉదధిని=సముద్రమందు, పావని=ఆంజనేయుని, విశద=నిర్మలమై, ఘన=దట్టమైన, ఘనపంక్తి=మేఘము చాలు, బఱిన్=వెంబడి.

తాత్పర్యము

ఆంజనేయుఁడు సముద్రము దాఁటునపుడు ఆయన నీడ సముద్రమునందుఁ బదియామడ వెడలుపు, ముప్పది యామడ పొడుగై నిర్మలమై, దట్టమైన మేఘము చాలువలె నాయన వెంబడి పోయెను.

ఇందుఁ జెప్పఁబడినది నీడ పరిమాణమే కాని ప్రతిఫలించిన దేహపరిమాణముగాదు. ముప్పది యామడ దేహము గలవాఁడు మూఁడంజలలో లంక చేరి యుండవచ్చునుగదా యని సందేహింపరాదు. ఇది యుదయకాలము కావున నీడలు దీర్ఘములై యుండును. నీటికి సమీపమునఁ బోయి యుండిన నీడ యంత పెద్దదై యుండదు. గాన చాల నెత్తునఁ బోవుటచే నీడయుఁ జాల పెద్దదై యుండును.

క. అంబరభాగంబున నా, లంబవిహీనతను గపికు • లప్రవరుఁడు పో
వం బక్షయుక్తభూమిధ, రం బన నొప్పారియుండె • రభసోద్ధతి మై. ౭౭

అర్థము. ఆలంబ విహీనతను=నిరాధారముగ, పక్షయుక్త భూమిధరంబు=ఱెక్కలుగల పర్వతము, రెండు చేతులే ఱెక్కలు

తాత్పర్యము

ఆకాశమునందు నిరాధారముగఁ బోవు హనుమంతుఁడు ఱెక్కలు గల పర్వతము వేగముగ బోవునట్లు కానవచ్చెను.

సీ. బలశాలి వడి నేగు • వార్ధిమార్గం బెల్ల, ద్రోణీకృతం బయి • తోఁచు చుండెఁ
బక్షుల నడుమను • బక్షిరాజునఁ బోవు, కపి మొగుల్ దూలించె • గాఢ్పునట్లు
వలిముఖాకృష్టాభ్ర • ములు సితాసితరక్త, మాంజిష్ఠవర్ణముల్ • మలసి మింట
మఱుఁగుచు మెఱయుచు • మబ్బుల నడుమను, జంద్రుడోయనఁగిశ • చంద్రుఁడమరె

తే. వనధి జవమున లంఘించు • ప్లవగుమీఁద
సురలు దనుజులు గంధర్వ • వరులు విరులు
గురిసి రర్కుండు తాపంబుఁ • గూర్పఁడయ్యె
హనుమ కనిలుండు వీచె రా • మార్థముగను ౭౮

అర్థము. ద్రోణీకృతము=దోనెవలెఁ జేయఁబడినది. వలిముఖ=వానరునిచే, ఆకృష్ట=ఆకర్షింపఁబడిన, అభ్రములు=మేఘములు, సిత+అసిత+రక్త+మాంజిష్ఠ వర్ణముల్=తెలుపు, నలుపు, ఎఱుపు, ఎఱుపు తెలుపు కలిసిన వన్నెలు, మఱుఁగుచు=చాటుగఁబోవుచు, మెఱయుచు=ప్రకాశించుచు, దీనివలన మేఘములకంటె నెత్తుగఁబోయె నని సూచితము. విరులు=పుష్పములు.

తాత్పర్యము

బలవంతుఁడైన హనుమంతుఁడు వేగమునఁబోవు నామార్గమంతయుఁ దోనెవలె

నడుమ పల్లము ఈవలావల నెత్తుగాఁగలదై కానవచ్చుచుండెను. (కదలని నీటి మీఁద మనము గట్టిగ నూఁదితే మేని నీటియందు గుంత యేర్పడును. ఆవిధముగ) పక్షులనడుమ గరుత్మంతునివలెఁ బోవు హనుమంతుఁడు పెద్ద వాయువువలె మేఘములను జెదరఁదోలెను. వానరుచే నాకర్షింపఁబడిన మేఘములు తెలుపు, నలుపు, ఎఱుపు నానావర్ణములు గలవయ్యెను. మేఘముల నడుమఁ బోవునపుడు చంద్రునివలెఁ గొంతసేపు కానవచ్చి కొంతసేపు కానరాక యుండెను. ఆంజనేయుమీఁద, దనుజులు, గంధర్వులు, దేవతలు పూలు గురియించిరి. రాక్షసులకు దానవులకు విరోధము కలదు. వారలను గూడ రావణుఁడణఁగఁ ద్రొక్కెను. సూర్యుఁడు వేఁడిమి చూపఁడయ్యె. (మధ్యాహ్నసమయము) రామకార్యము సుఖముగ హనుమంతుఁడు చేయుటకై యాయనకు శ్రమము దోఁపకుండునట్లు వాయువు చల్లగా వీచెను. నిర్వంచనముగా భగవత్కైంకర్యము చేయువారికి దేవతలందఱు సాహాయ్యము చేయుదురని సూచితము.

చ. బళి బళి యంచు మెచ్చిరి సుపర్వులు, బాపురె యంచు స్తోత్రముల్
చలిపిరి కిన్నరుల్, మునులు • చాఁగురె యంచుఁ బ్రశంస చేసి, రా
త్మల సయిఁసైఁ యటంచు విబుధప్రకరంబు పొగడ్త గూర్చె య
క్షులు కడుమేలు మే లనిరి కొంకక యబ్ధిఁ దరించు కైసరిన్. ౭౮

అర్థము సుపర్వులు=దేవతలు, సయిఁసైఁయటంచున్=ఇం దనునాసికోచ్చారణము సూచింప నర్ధానుస్వారము లుంపఁబడియె, కైసరిన్=కేసరి కుమారుని కైసరిన్, ఈ ద్వితీయ మెచ్చిరి యను క్రియతో నన్వయించు నపుడు కారక విభక్తి; తక్కిన క్రియతో నన్వయించునపుడు 'కూర్చి' యను దానిని జేర్చుకొని యుపపద విభక్తి యగును.

## తాత్పర్యము

జంకు కొంకు లేక సముద్రమును దాఁటుచున్న కేసరిపుత్రునిఁ జూచి దేవతలు బళిబళియని మెచ్చుకొనిరి. మునులు చాఁగురెయని శ్లాఘించిరి. సైఁసైఁయని దేవతా సమూహము స్తుతించెను. యక్షులు మేలు మేలని నుతించిరి.

—• సముద్రుఁడు హనుమంతునకుఁ దోడ్పడ యోజించుట •—

క. అరిగెడు కపికేసరిఁ గేసరిసుతుఁ గని వనధి యెట్లు•సలుపవలయు నీ
తరుణంబున సాహ్యము నీ,హారి కని యిక్ష్వాకుగౌర•వార్థి దలంచెన్. ౭౯

అర్థము. కపికేసరి=కపిసింహము, తరుణంబునన్=సమయమందు, సాహ్యము=తోడుపాటు, ఇక్ష్వాకు గౌరవార్థి=ఇక్ష్వాకు వంశమువారి గౌరవము కోరువాఁడు, వనధి=సముద్రుఁడు.

## తాత్పర్యము

ఈ ప్రకారము పోవుచున్న కపిశ్రేష్ఠునిఁ జూచి యిక్ష్వాకువంశమువారి గౌరవముఁ గోరు సముద్రుఁడు ఇక్ష్వాకువంశ సంభవుఁడైన శ్రీరామచంద్రమూర్తి

కార్యార్థమై యీయన పోవుచున్నాఁడే. రామకార్యము నేను జేయఁజాలకున్నను చేసెడి మహానుభావులకైన సాహాయ్యము చేయవలయును గదా. ఈసమయమున నే నీయన కేవిధముగఁ దాను దోడు పడఁగల నని యాలోచించెను.

ఉ. పోఁడిమిఁ గాంచితిన్ సగర•భూమిధవర్షభుచేత నేను మున్
వీఁడును దత్కులోద్భవుఁడు • విశ్రుతుఁడౌ రఘునాథుకార్యమై
వాఁడిచెలంగ నేగెడి న•వారణలీల, శ్రమంబు వాయఁగా
నేఁ డిట మేలు చేయనగు•నిర్మలరాగపురస్సరంబుగన్. ౮౮

అర్థము. ఇక్ష్వాకు గౌరవార్ధి యనుటకుఁ గారణము చెప్పుచున్నాఁడు.

పోఁడిమిన్ = అభివృద్ధిని, భూమిధవ + ఋషభుచే = భూమిధవర్షభుచే=రాజశ్రేష్ఠునిచే, తత్కులోద్భవుఁడు=ఆ వంశమునందుఁ బుట్టినవాఁడు, విశ్రుతుఁడు=ప్రసిద్ధుఁడు, వాఁడి=పరాక్రమము, అవారణలీలన్=అడ్డములేని క్రీడగా, రాగపురస్సరంబుగన్=అనురాగపూర్వకముగా.

తాత్పర్యము

నేను బూర్వము సగర చక్రవర్తిచే బాగు పడినవాఁడను. వీఁడా! యావంశమందే పుట్టి ప్రసిద్ధికెక్కిన రామచంద్రమూర్తి కార్యము చేయ నడ్డము లేక పరాక్రమించి పోవుచున్నాఁడు. కావున వీనికి గష్టము దోఁపకుండునట్లు గాసి దీరునట్లు ప్రేమపూర్వకముగఁ జేయుట మేలు.

క. అక్కమలాక్షుని దూతకుఁ, జక్కనిసాయంబు నేను•జలుపన యేనిన్
ఛీకొట్టదె జగ మెల్లను, నక్కటికము లేని 'జడధి'•యంచును నన్నున్ ౮౯

అర్థము. కమలాక్షుని దూతకున్=కమలములవంటి కన్నులుగల శ్రీరామచంద్రమూర్తి దూతకు, ఇది పుండరీకాక్ష శబ్దము స్ఫురింపఁజేసెడిని. అనఁగా భగవంతుని దూత కని భావము సాయంబు=తోడుపాటు, సాహాయ్యశబ్దభవము. చలుపను+అ+ఏనిన్ =చేయక యే పోయినయెడల, ఛికొట్టదె=చీచీ యని నిందింపదా? రూ, ఛీకొట్టు, అక్కటికము=దయ, జడధి=మందబుద్ధి, లడల కభేదము గావున జలధి జడధి యయ్యె. "జడనిధి యను తెరమఱుఁ గటు వెడలి నిలిచినట్టి యాట వెలఁదియ పోలెన్" ప్రభా. ప్ర.

తాత్పర్యము

ఆ పుండరీకాక్షుని దూతకు నేను సరియైన సాహాయ్యము చేయకనే పోయినయెడల లోకమంతయు సముద్రుఁడు దయ, బుద్ధి లేనివాఁడని నిందింపదా? భగవత్కార్యమునకుఁ దోడుపడ శక్తి గలిగియుఁ దోడుపడఁడేని కృత్యాకరణ దోషము ప్రాప్తించుటయేగాక లోకనిందలకుఁ బాలుపడి యపకీర్తి పాలుగావలసి వచ్చునని భావము.

క. బడలిక నిచ్చటఁ బాసినఁ, గడు సుకరం బితఁడు దాఁటఁ ♦ గడమ న టంచున్
జడనిధి దలఁచుచుఁ దనలోఁ, నడఁగిన మైనాకుఁ జూచి♦యాదటఁ బలికెన్. ౯౮

అర్థము. ఆదటన్=ప్రీతితో.

తాత్పర్యము

ఇచ్చట బడలిక పాపుకొనెనా తక్కినదంతయు సులభముగా దాఁటవచ్చును. అని తలఁచుచుఁ దనలో దాగియున్న మైనాక పర్వతమును జూచి యిట్లనెను. మైనాకుఁడు మేనకకు కుమారుఁడు. హిమవంతునకు జన్మించినవాఁడు. పార్వతి తోడఁ బుట్టువు.

—♦ సముద్రుఁడు మైనాకునితో సంభాషించుట ♦—

ఉ. ఓయి హిరణ్యనాభ! విను ♦ మొక్కటి చెప్పెద మర్త్యలోకమున్
డాయక యుండఁగా నసుర♦నాథు లధోభువనంబునుండి, ని
న్నాయనభీకరోరుపరి♦ఘాకృతి నిల్పినవాఁడు వేలుపు
ఱ్ఱాయఁడు, నీవ నేర్తు నలు♦ప్రక్కఁ బతంగ మనంగఁ బోవఁగన్. ౯౯

అర్థము.హిరణ్యనాభ=హిరణ్యమయములైన నాభులు గలవాఁడా; అనగా బంగారు శిఖరములు గలవాఁడా, నాభి=అధ్యక్షుఁడు, ప్రధానుఁడు, పర్వతమున కధ్యక్షము శిఖరము కావుననిది నాభి శబ్దార్థమయ్యెను. "నాభి రధ్యక్ష కస్తూర్యోః" అని దర్ప నిఘంటువు. "నాభిః ప్రధానే ప్రాణ్యంగే కస్తూర్యాం క్షత్రియే నృపే" నానా. ర. ఒక్కటి=చెప్పఁబోవు వృత్తాంతము, అధోభువనము=పాతాళము, ఆయస=ఉక్కుచేఁ జేయఁబడిన, భీకర=భయంకరమైన ఉరు=గొప్పదగు, పరిఘ+ ఆకృతి=ఇనుపకట్ల గుదియవలె, వేలుపుఱ్ఱాయఁడు = దేవతల ప్రభువు, దేవేంద్రుఁడు, స్థిరము పరమగునపుడును నగాగమము గలదు, గరువపు న్మారువువలె, పతంగము=పక్షి.

తాత్పర్యము

ఓయి! బంగారు శిఖరములు గల మైనాకా? నీకొక వార్త చెప్పెద వినుము పాతాళలోకము నుండి రాక్షసులు భూలోకమునకు రాక యుండునట్లు నిన్నింద్రుఁడు ఉక్కుగుదియవలె నడ్డముగా నుంచెను. పక్షివలె నే ప్రక్కనైనఁ బోవ నీకు సామర్థ్యముగలదు.

సీ. రామకార్యార్థమై♦భీమకర్ముఁడు హనూ, మానుండు చనెడి నం♦బరము నొరసి
నాకు సంపూజ్యులి♦క్ష్వాకుకులోద్భవుల్, పరమపూజ్యులు నీకుఁ♦బర్వతేంద్ర!
నెయ్యంబునైన నీవు ♦ తియ్యఁదనంబున, సాచివ్య మొక్కటి♦చలుప వలయుఁ
గావింపఁ దగుపనిఁ♦గావింప కుండినఁ, గోపింత్రు సజ్జనుల్♦గూళి యనుచు
తే. లెమ్ము జలములయందుండి♦లీల నీవు, మనకు నతిథియుఁబూజ్యుండు♦మారుతాత్మ
భవుఁడు గావున నెదు రేగి♦బడలిక చన,నతని ధరియింపు శిరమున♦హర్షమునను.

అర్థము. సాచివ్యము=సాహాయ్యము.

### తాత్పర్యము

రామచంద్రమూర్తి కార్యము సాధింప భయంకర కర్మము చేయు హనుమంతుఁ డాకాశమంటి పోవుచున్నాఁడు. ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవారు నాకుఁ బూజ్యులు. నాయందు నీవు సుఖముగా నుండుటచే నేను నీకుఁ బూజ్యుఁడనుగదా. ఆ కారణముచే నిక్ష్వాకువంశము వారు నీకుఁ బరమ పూజ్యులు. స్నేహముచేతను సౌమ్యభావమునను నీ సమయంబున నీవు నాకొక సాహాయ్యము చేయుము. చేయవలసిన పని చేయని వాని దుష్టుఁ డని సత్పురుషులు కోపింతురు. కావునఁ జేయక తప్పదు. హనుమంతుఁడు మన కతిథి, పూజ్యుఁడు కావున నీవు నీళ్ళలో నుండిలేచి యాయనకు నెదురుగఁబోయిగాసి దీరునట్లు శిరమున ధరింపుము. దీనివలనఁ దాను భగవత్కార్యము చేయు నాశక్తి యుండియుఁ జేయలేనివాఁడు చేయఁగల వానిని బ్రేరించి వానిచే నా కార్యము చేయింపవలెను అతిథిని మఱి యేవిధముగ నుపచరింప లేనివాఁడు మంచి మాటలచేతను కూర్చుండుట కాసన మిచ్చుటచేతను, దాహమునకు మంచి నీళ్ళిచ్చుటచేతనైన నాదరింపవలె నని సూచితము.

ఉ. ఇంచుక సేదదేఱి మఱి • యేగెడిఁ గాక కొదం దరింప, యో
జించి రఘూత్తమోత్తము సు•శీలతయున్ సతి గోలుపోక రా
త్రించను వీటకై చనెడి•ధీరకపీంద్రుని పెన్ శ్రమంబు మో
దించుచు నీటనుండి యరు•దెమ్మిఁక లెమ్ము శుభమ్ము నీ కగున్. ౭౧

అర్థము. సేద=గాసి, కొదన్=కొఱత సముద్రమును.

### తాత్పర్యము

ఇట్లు నీవు చేసితి వేని కొంచెము బడలిక తీర్చుకొని తరువాతఁ దక్షిణ సముద్రము దాఁటిపోవును గాక. రామచంద్రుని మంచి నడవడి, ఆయన భార్యను బోఁగొట్టుకొనుట, రావణాసురు పట్టణమునకై పోయెడి ధీరుఁడైన వానరేంద్రుని శ్రమము నాలోచించి సంతోషముతో నీటినుండి రమ్ము, లెమ్ము, నీకు మేలగును గాక.

### —• మైనాకుఁ డాంజనేయున కెదురుగ వచ్చుట •—

చ. అను లవణాంబురాశినుడు • లా నగవల్లభుఁ డాలకించి తీ
వ్వన మొగులుం బగల్చు రవిఁ • బోలుచు నీ రిరుపాయ చీలఁగా
ఘనతరనాగకిన్నరని•కాయసమంచితబాలభానుబిం
బనిభసుకూటకాంతి నసి•వర్ణనభంబు సువర్ణతం గనన్. ౭౨

అర్థము. ఇరుపాయ=రెండుచీలికలుగా, నికాయ=సమూహముచే, సమంచిత=ఒప్పుచున్న, బాలభానునిభ=లేఁతసూర్యునితో సమానమైన, సుకూట=మంచి శిఖరముల, ఘనతర, సమంచిత, నిభ; ఇవి కూట విశేషణములు, అసివర్ణనభంబు=కత్తివన్నెగల యాకాశము, కత్తులు నలుపని కవి సమయము. సువర్ణతన్ బంగారుతనమును, బంగారుకాంతి.

### తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుచున్న లవణసముద్రముమాట లా పర్వతశ్రేష్ఠుఁడు విని చివాలున మేఘములను బగలఁదీసికొని వచ్చు సూర్యునివలె నీళ్లు రెండు ఖండములుగాఁ జీలఁగా నాగులు కిన్నరులు వీరల సమూహముచేఁ బ్రకాశించు నదియు లేత సూర్యుని కాంతిగలదియు గొప్పదియు నగు శిఖరము కాంతి నల్లని యాకాశము బంగారువన్నె కలదికాఁగా.

ఉ. ఉప్పరవీథికి న్నెగయ ♦ నుగ్రమరీచిశతంబుపోల్కిఁ దా
నొప్పుచు మార్గమధ్యమున ♦ నుండు మహాగిరిఁ గాంచి విఘ్న మి
ట్లుప్పతిలెం గదే యనుచు ♦ నుగ్రభయంకరవేగ యుక్తుఁడై
యొప్పి ఢికీలునందగిలె ♦ నోలుచు సోలుచుఁ గొండ స్రుక్కఁగన్. ౭౩

అర్థము. ఉప్పర వీథికిన్=ఆకాశమునకు, ఉగ్రమరీచిశతంబు=నూర్వురు సూర్యులు, ఉప్పతిలెన్=కలిగెను, ఒప్ప=హుమ్మనిధ్వనించి, ఓలుచు=విలపించుచు, సోలుచున్=పడుచు, స్రుక్కఁగన్=బాధపడఁగా.

### తాత్పర్యము

ఆకాశమున కెగయఁగాఁ ద్రోవ కడ్డముగ నూర్వుర సూర్యుల కాంతితో నిలువగా విఘ్నము వచ్చెరా యని తలంచి వేగ మతిశయింపఁజేసి హుంకరించి ఢికీలున ఢీకొట్టగా మైనాకుఁడు విలపించుచు శోషిల్లుచు స్రుక్కెను.

క. పిడుగు వలెఁ దాఁకఁ గళవళ, పడి గాలికి మబ్బురీతిఁ♦బఱచియు మోదం
బడి పొంగి యెత్తఁగి యాతని, వడిఁ బ్రీతిని బర్వతంబు♦వనదాధ్వమునన్. ౭౪

అర్థము. వనద + అధ్వమునన్=మేఘమార్గమున=ఆకాశమందు.

### తాత్పర్యము

హనుమంతుఁడు పిడుగు దాఁకినట్లు తాఁకఁగా మైనాకుఁడు కళవళించి గాలికి మబ్బువలె దూరము కొట్టుకొని పోయియు, నాయన వేగము బలము నెఱిఁగి మనస్సులో సంతోషించి పైకిఁ బొంగుచుఁ బ్రీతుఁడై యాకాశమునందు.

క. మానవరూపంబున నిజ,మానితశిఖరమున నిలిచి♦మారుతతనయా!
వానరవల్లభ! దుష్కర, మైన పనిం జలిపి తీ వహా! యే మందున్. ౭౫

అర్థము. మానవ రూపంబునన్=మనుష్యాకారముతో

### తాత్పర్యము

మనుష్యస్వరూపముతోఁ దన శిఖరమందు నిలిచి యిట్లనియె. 'వాయునందనా! వానరశ్రేష్ఠా! యెంతటి యసాధ్యమైన పని చేసితివి. ఆహా! నీశక్తి నేనేమని పొగడుదును.

పర్వతములకు నదులకు మొదలైనవానికి వెలుపలఁగానవచ్చు రాలునీళ్లు మొదలైనవి శరీరములనియు, నధిష్ఠానదేవత వేఱుగానందే యుండుననియు నెఱుఁగవలెను.

ఉ. నిర్మలతేజ! నీ బలము ♦ నీ వడిఁ జూచిన మెచ్చు వచ్చె; నా
భర్మసుకూటపాళి దగ ♦ పాయఁగ నిల్చి యథేచ్ఛ మేగుమీ
శర్మముఁ గూర్చు వారలకు ♦ శర్మము సేఁత సనాతనంబు నా
ధర్మము గాన సాగరుఁడు ♦ తద్దయుఁ బ్రత్యుపకారచిత్తుఁడై. ౭౬

అర్థము. భర్మసుకూట, పాళిన్=బంగారు శిఖరముల సమూహమందు, దగ=శ్రమము, శర్మము=మేలు సనాతనంబు=శాశ్వతము, ప్రత్యుపకారచిత్తుఁడై=మఱు మేలు చేయ మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

శుద్ధమైన తేజస్సుగలవాఁడా! నీ బలము నీ వేగము చూచి మెచ్చుకొంటిని. నా బంగరు శిఖరము లందు నీ శ్రమము పోవునట్లు నిలిచి యావల నీయిష్టమువచ్చినట్లు పొమ్ము. నా మీఁద నీ కింత ప్రేమ యెట్లు గలిగెనందువా? మేలు చేసిన వారికి మఱు మేలు చేయుట సనాతన ధర్మము. కాఁబట్టి సముద్రుఁడు మఱుమేలు చేయఁ గోరినవాఁడై.

ఉ. ఆ రఘువంశజాత వసు♦ధాపతిచేఁ బరివర్ధితాత్ముఁడై
పేరిమిఁ గంట, నీవు రఘు♦వీరుని కార్యము దీర్పఁ బోవుటన్
గూరిమి నీకు సాయ మొన♦గూర్చి బహూకృతి నొందఁ గోరి నన్
జేరి సగౌరవోక్తి నగ♦శేఖర! యల్లదె మింటఁ గంటివే. ౭౭

అర్థము. బహూకృతి=గౌరవము.

తాత్పర్యము

ఆయన మఱుమేలు చేయుటకు నేనేమియు నాయనకు ముందుపకారము చేయలేదుగదా యందువేమో. సముద్రుఁడు తాను రఘువంశమునఁ బుట్టిన సగరుఁడనుఁ రాజుచే వృద్ధిపొంది, యా నిమిత్తమున సాగరుఁడను పేరువహించి యుండుటయు నీవు రఘువంశమునఁ బుట్టిన రామచంద్రమూర్తి కార్యము చేయఁ బోవుచుండుటయుఁ జూచి, నీకు సాహాయ్యము చేసిన, వారికిఁ జేసినట్లగు ననితలఁచి యా విధమున సాగరుఁడు కృతజ్ఞుఁడను గౌరవము నొందఁగోరి నన్నుఁ బిలిచి సగౌరవ వాక్యముల నిట్లనియె. పర్వతోత్తమా! యదిగోఁ జూచితివా యాకాశంబున.

క. అనఘుఁడు కపివీరుఁడు యో,జనశతముం దాఁటఁ బూనె♦జయ్యన నీవుం
జను మెదురుగ నీ శిఖరా,వని బడలిక వాసి కడమ♦వడగొనక చనున్. ౭౮

అర్థము. కడమ=తక్కినదూరము, వడగొనక=గాసిలేక.

తాత్పర్యము

రామకార్య ధురంధరుఁ డగుటచేఁ బుణ్యాత్ముఁడైన వానర వీరుఁడునూఱు యోజనముల దూరము దాఁట బ్రయత్నించి పోవుచున్నాఁడు. నీవుగా త్వరగా

నెమరుగఁబోయి నీ శిఖరమునందు నిలువుము. అందు విశ్రమించి గాసి దీఱిన పిదప తక్కినది కష్టములేక దాఁటును.

ఉ. అచ్చపుఁ బ్రేమ నిట్టు లతఁ • డాడిన మారుతపుత్ర! నీకుఁగా
వచ్చితి, నిందు నిల్చి ఫల•వర్గముఁ దియ్యని కందమూలముల్
మచ్చిక నారగింపుము, శ్ర•మం బఱ హాయిగ విశ్రమింపుమీ
ర్రచ్చఱ వెండి యేగ సుక•రం బగు శేషము వానరేశ్వరా! ౩౯

అర్థము. సుగమము.

## తాత్పర్యము

వాయు నందనా! ఆయన యీ ప్రకారము నిర్మలమైన ప్రేమచేఁజెప్పఁగా నీ నిమిత్తమై నేను వచ్చితిని. ఇచ్చట నిల్చి ఫల సమూహములను, తియ్యని కంద మూలములను నాయందలి ప్రేమచే నారగింపుము.బడలిక దీఱునట్లు విశ్రమింపుము. ఆవల నీవు తక్కిన దూరము వేగముగా, సులభముగాఁ బోవ సాధ్యపడును.

ఉ. క్రొత్తల నైన సజ్జనులఁ • గూరిమిఁ బూజ యొనర్చుటల్ సుధీ
సత్తము లెల్ల మెత్తురు ప్ర•శస్త మటం చది యిట్టులుండ దే
వోత్తముఁడున్ మహాత్ముఁడు బ•లోగ్రుఁడు నౌ పవమానుపుత్ర! నా
కిత్తఱి విందవైతివి గ్ర•హింపుమ యింపుగ నాతిథేయమున్. ౪౦

అర్థము. క్రొత్తలనైనన్=క్రొత్తవారినైనను, విందవు=అతిథివి, ఆతిథేయమున్=అతిథి సత్కారమును.

## తాత్పర్యము

క్రొత్తవారినైనను సత్పురుషులను ప్రేమతోఁ బూజించు కార్యములను బుద్ధిమంతులగు సత్పురుషులు శ్లాఘ్యమైన దని మెచ్చుకొందురు. అతిథి గుణవంతుడగునేని క్రొత్త ప్రాతఁ విచారము చేయరాదు. అదట్టులుండనీ, ఆ కారణము గాక నేను బూజించుటకు వేఱొక కారణము గలదు. దేవతలందు శ్రేష్ఠుఁడును (త్వమేవం ప్రత్యక్షం బ్రహ్మాసి) మహాత్ముఁడును బలమున భయంకరుఁడు నగు వాయుదేవునకు నీవు పుత్రుఁడవు నీ యోగ్యత నాకుఁ దెలిసినను దెలియకపోయినను నీతండ్రి యోగ్యతను బట్టియైన నేను నిన్నుఁ బూజింపవలెను. అట్టి మహానుభావుని కొడుకవైన నీవు మా కతిథివైతివి. కావున నే నిచ్చు నతిథిసత్కారము గ్రహింపుము. ఎట్టివాఁడైనను అతిథిపూజ్యుఁడు. అందు సజ్జనుఁడు విశేషపూజ్యుఁడు. అందు సద్వంశప్రసూతుఁడు పరమపూజ్యుఁడు, ఈ మూఁడును నీయందుఁగలవు కావున నీవు నాకుఁ బూజ్యుఁడవు.

తే. ధర్మజిజ్ఞాసువులకును•ధర్మవిదుల,కతిథి సామాన్యుఁ డయ్యుఁబూ•జార్హుఁడగును
జెప్ప నేటికి నీవంటి•శిష్టు, మనకు, బాంధవం బొప్పునేఁ గ్రొత్త•వాఁడఁగాను.౪౧

అర్థము. దీనినే చెప్పుచున్నాఁడు. ధర్మజిజ్ఞాసువులకున్=ధర్మ మెఱుఁగఁ గోరిక గలవారికిని; ధర్మవిదులకు=ధర్మము తెలిసినవారికిని, సామాన్యుఁడయ్యు=గొప్పవాఁడు కాకున్నను.

### తాత్పర్యము

ధర్మమిట్టిదని తెలియకపోయినను, దెలిసికోనఁ గోరిక గలవారికిని, ధర్మము చక్కఁగా తెలిసినవారికిని సామాన్యుఁడైన యతిథియుఁ బూజ్యుఁడే. అట్లుండ నీవంటి సాధుపురుషుఁడు పూజ్యుఁ డని వేఱుగఁ జెప్పవలెనా? మన యిరువురకు సంబంధ మింతమాత్రమే గాదు. నేను గ్రోత్తవాఁడఁగాను. నీకుఁ గావలసిన వాఁడనే.

క. ఆశుగమనమునఁ బోలెద, వాశుగమనములను నిన్ను ♦ నర్చించినచో
నా శుభచరితునిఁ బవనుని, నే శశ్వద్గతిని బూజ ♦ నెఱపిన యటు లౌ. ౬౨

అర్థము. ఆశు+గమనమునన్=త్వరగాఁ బోవుటయందు, ఆశుగ+మనములు=వాయువును, మనస్సును.

### తాత్పర్యము

నీవు వాయువేగ మనోవేగములఁ బోఁగలవు. నిన్ను నేను బూజించితినా లోకక్షేమకరమైన నడవడిగల వాయుదేవుని బూజించిన వాఁడ నగుదును.

—♦ మైనాకుఁడు తన పూర్వవృత్తాంతము హనుమకుఁ దెల్పుట ♦—

సీ. కలదు దీనికి నొండు ♦ కారణం బది విను, మనఘాత్మ! నాతండ్రి! యాంజనేయ
పూర్వము కృతయుగం ♦ బున గిరుల్ ఱెక్కలు వెలయఁ దార్క్ష్యానిల ♦ వేగయుక్తి
విచ్చలవిడి విను ♦ వీధిఁ జరింపఁగఁ, దలలపైఁ బడు నంచుఁ దలఁకె నెదల
మునులును దేవతల్ ♦ మున్నుగాఁ గల భూతి, కోటి యంతట శత ♦ కోటిఁ బూని

తే. వాసవుఁడు క్రుద్ధుఁ డగుచు గ్రా ♦ వముల ఱెక్క
లెల్లఁ దుత్తునియలు చేసి ♦ యొసఁగి నాదు
వంకఁ గవియుడు మీతండ్రి ♦ పరమకరుణఁ
జిమ్మి కొనివచ్చి ననుఁ ద్రోచె ♦ సింధువునను. ౬౩

అర్థము. తార్క్ష్యానిల వేగయుక్తిన్=గరుడుని యొక్కయు, వాయువు యొక్కయు వేగము వంటి వేగముతోఁ గూడినవి. తార్క్ష్యుఁడు=తృక్షుఁడను ముని కొడుకు తార్క్ష్యుఁడు, శతకోటి=నూఱంచులు గలది వజ్రాయుధము. గ్రావముల=పర్వతముల యొక్క, తుత్తునియలు=తునియలు+తునియలు తుత్తునియలు=తునకలు తునకలు, సింధువునను=సముద్రమునందు.

### తాత్పర్యము

నేను నిన్నుఁ బూజించుటకు మఱియొక కారణముగలదు. వినుము. పూర్వము కృతయుగంబునఁ గొండలకెల్ల ఱెక్కలుండెను. అవిగరుడానిల వేగమున నాకాశ

మున విచ్చలవిడి సంచరింపఁగా నవి తమ తలలమీఁదఁ  బడునేమో యని మును లును, దేవతలు చాల భయపడుచుండిరి. అది యెఱిఁగి యింద్రుఁడు  వజ్రాయుధ ముచే వాని ఱెక్కలనెల్ల తునుకలుగా నఱికి నా ఱెక్కలు ఖండించుటకు  నాదెస వచ్చెను. అప్పుడు మీ తండ్రి వాయుదేవుఁడు నన్నుఁ జిమ్ముకొని వచ్చి సముద్ర ములో వైచి రక్షించెను.

క. ఎఱుకలపోఁడిమి దఱుఁగక, వఱలెద నిట నీదు తండ్రి•వాత్సల్యముచే
నెఱిఁగితె మనసంబంధము, నెఱిఁ బూజ్యుఁడు నీదు తండ్రి•ని న్నాకతన.  ౪౪

అర్థము. ఎఱకల=ఱెక్కల యొక్క, పోఁడిమి=అందము.

తాత్పర్యము

ఆ కారణముచే నేను ఱెక్కల యందము చెడక యుండి యిచ్చట నున్నాను. దీనికి మీతండ్రి వాత్సల్యమే కారణము. మన సంబంధము తెలిసినదా? ఈకారణ ముచే నీ తండ్రి నాకుఁ బూజ్యుఁడు. నిన్నా కారణముచేఁ(గౌరవించెదను.)

ఉ. పావని! గౌరవించెదను • బాయక కూరిమి నాదుమైత్రి సం
భావనఁ జేసి, నాయిఁడు స•పర్యల నెల్ల గ్రహించి ప్రీతిమై,
వావిరి సేద దేఱి, నను, • వారినిధిం బరితుష్టచిత్తులం
గా వెలయింపు, ప్రీతుఁడవు•గమ్ము, ఘటింపుము ప్రీతి మాకునున్.  ౪౫

అర్థము. సపర్యలు=శుశ్రూషలు, సత్కారములు.

తాత్పర్యము

వాయు కుమారా! యీ కారణముచే నిన్ను  గౌరవించెదను.  నా మైత్రిని వ్యర్థపుచ్చక నీవు గౌరవింపుము. నేను జేయు సత్కారముల గ్రహించి  బడలిక తీర్చికొని నన్ను, సముద్రుని సంతోషింపఁ జేయుము. నీవును ప్రీతుఁడవు కమ్ము.

క. నా చేయుపూజఁ గొనుమీ, పాచుకొనుమి గాసి గాడ్పు•పట్టీ! నిన్నుం
జూచుటచే ముద మందితి, యాచించెద నాదు ప్రీతి•సార్థకపఱుపన్  ౪౬

తాత్పర్యము

నేను జేయు పూజ గ్రహింపుము.  నీవు బడలిక  పాపుకొనుము. నిన్నుఁ జూచుటచే సంతోషము గలిగి నా ప్రీతి సార్థకము చేయ యాచించెదను.

చ. అన నగరాజ! నీ వొసఁగు•నట్టి సపర్యలు వచ్చె, మోదముం
గనితి, నిలంగరాదు, ననుఁ గార్యము కాలము తీవరించెడిన్
జనియెడిఁ బ్రొద్దు, నేఁ బ్రతిన•చల్పితిఁ ద్రోవను నిల్వనంచుఁ, గా
వునఁ జనెదన్ మదిం గినియఁ•బోకుము నిల్వనటంచు మిత్రమా!  ౪౭

తాత్పర్యము

ఈప్రకారము మైనాకుఁడు చెప్పఁగా హనుమంతుఁ డిట్లనియె. పర్వతోత్తమా! నీవు చేయు సత్కారము లంగీకరించిన వాఁడ నేనైతిని అన్నరసము కన్న నాదరణ రసము మేలు గావున నీమంచి మాటల చేతనే సపర్యల నంగీకరించిన ఫలము నీకుఁ

గలవయ్యెను. సంతోషించితిని. నేను నిలువఁగూడదు. ఏలనఁ గార్యము కాలము నన్నుఁ దొందర పెట్టుచున్నది. చేయవలసిన కార్యము చాల నున్నది. ప్రొద్దా గ్రుంకఁబోవు చున్నది. ఇక్కడ నాలసించితి నేని నేను గార్యము చేయుటకుఁ జాలినంత ప్రొద్దు లేదు. అదియును గాక నేను త్రోవలో నిలువ నని వానరులతోఁ బ్రతిజ్ఞ జేసితిని. (చూ.వ. ౩౭) కావునఁ బోయెదను. నేను నిల్వ లేదని మిత్రమా! కోపింపకుము.

చ. అని పవమాననందనుఁడు • నాదర మారఁగ శైలరాజమున్
దనకరపల్లవంబునను • దద్దస్పృశించి హసన్ముఖాబ్జుఁడై
చనియెద నంచు వీడ్కొని భృశత్వర నూర్ధ్వము దాటి వేగియై
వననిధిశైలరాజశుభ•వాక్కులు గైకొని పూజితుండునై. ౮౮

అర్థము. కరపల్లవంబునను=చిగురువంటి చేతితో, హసన్ముఖాబ్జుఁడై=నవ్వు చున్న ముఖాబ్జముఁగలవాఁడై. భృశత్వరన్=అతివేగమున వననిధి=సముద్రుని యొక్కయు, శైలరాజ=మైనాకుని యొక్కయు.

తాత్పర్యము

ఇట్లు చెప్పి హనుమంతుఁడు ప్రీతితో మైనాకునిఁ దనచేతితోఁ దాఁకి నవ్వు మోము గలవాఁడై పోయి వచ్చెదనని సెలవు తీసికొని మిగుల వేగమున నంతరిక్షమున కెగిసి సముద్రమైనాకుల యాశీర్వచనములు పొందినవాఁడై.

క. అంబరమార్గమున నిరా•లంబనముగ వాయుసూతి • లక్షించుచు భూ
ధ్రంబును జనె; రెండవ కా•ర్యంబును దుష్కరముఁ జూచి•యమరులు పొగడన్.

తాత్పర్యము

ఆకాశమునందు నిరాధారముగ నాంజనేయుఁడు మైనాకుని జూచుచుఁ బోయెను. రెండవ యసాధ్య కార్యమును జూచి దేవతలు పొగడిరి.

మొదటి కష్టకార్యము, సముద్రము దాఁటుట. రెండవది కొండ యడ్డుపడి నను భేదించుకొని నిలువక పోవుట.

క. మైనాకు డొనర్చిన స్నే•హానూనకృతిం దలంచి • యంబరవీథిన్
గానఁగ నిలిచిన నాకౌ•కోనికరము పొగడె నద్రి•కుంజరు నంతన్. ౯౦

అర్థము. స్నేహానూనకృతిన్=స్నేహముచేసైన గొప్పకార్యమును, నాకౌకోనికరము=దేవతా సమూహము, అద్రికుంజరున్=పర్వతశ్రేష్ఠుని, మైనాకుని.

తాత్పర్యము

మైనాకుఁడు చేసిన స్నేహపూర్ణమైన కార్యమును జూచి యాకాశ మందు నీ వినోదము చూడ నిలిచిన దేవతాసమూహము మైనాకుని బొగడిరి.

ఉ. నాకవిభుండు దానికి స•నంతతముదంబును బొంది వెండి మై
నాకునిఁ జూచి యో కనక•నాథ! నినుం గని సంతసించితిన్

నీ కభయం బొసంగితి వి◆నిర్మలనీతి యథాసుఖంబుగా
లోకమునం జెలంగు భయ◆లోలత మానుము మానసంబునన్. ౯౧

తాత్పర్యము

ఆ మాటలు విని యింద్రుఁడు మిగుల సంతోషపడి వచ్చి మైనాకునిఁ జూచి యో సువర్ణనాభ, నిన్నుఁజూచి మిగుల సంతోషించితిని. నావలన నీకిఁక భయము లేకుండ వరమిచ్చితిని. నీవు సంకోచము లేక లోకంబున సుఖింపుము. మనస్సునందైన భయపడ వలదు.

చ. ఎటు లొకొ నూఱుయోజనము ◆ లీతఁడు వార్ధిఁ దరించు నంచు లోఁ
దటతట గగ్గె మాకు నెఱ◆ధైర్యము మైనతఁ డేగుచుండినన్
దిటముగ రాముకార్యమును ◆ దీర్పఁగ దూతగఁ బోవు మారుతిన్
దటుకున నాదరించితివి ◆ తద్దయు మెచ్చితి నీకు నెచ్చెలీ. ౯౨

అర్థము. తటతట=భయముచే గుండెలు కొట్టుకొనుట యందు ధ్వన్యను కరణము=భయము, నెఱ=నిండు, నీకు మెచ్చితిన్=నిన్ను మెచ్చితిని, ద్వితీయకు మాఱు షష్ఠి. షష్ఠీ స్థానకం బగు కువర్ణకం బొకొకకచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులఁ జూపట్టెడిఁ (త్రికా.౧౭సూ)

తాత్పర్యము

హనుమంతుఁడు నిండుధైర్యముతోఁ బోవుచుండినను నీతఁడెట్లు నూఱు యోజనముల సముద్రము దాఁటగలఁడని భయముచే మా గుండెలు కొట్టుకొను చుండెను. ఆ విధముగ రాముని కార్యముఁ దీర్ప దూతగఁ బోవుచున్న హనుమంతుని నాలస్యము లేక సమయమున నాదరించితివి, నీకార్యము స్నేహితుఁడా! మెచ్చితిని.

క. అనుచు శచీవల్లభుఁ డిటు, తనుఁ బల్కిన లబ్ధవరుడు ◆ ధరవల్లభుఁ డా
త్మను నలరి వెలసెఁ బదపడి, హనుమంతుఁడు పోవు చుండె◆నంబరవీథిన్. ౯౩

అర్థము. లబ్ధవరుఁడు=వరముపొందినవాఁడు, ధరవల్లభుఁడు=పర్వతశ్రేష్ఠము.

తాత్పర్యము

అని యీ ప్రకారము దేవేంద్రుడు తనతోఁ జెప్పఁగా మైనాకుఁడు వరము పొందినవాఁడై భయము విడిచి సంతోషించెను, హనుమంతుఁ డాకాశమునఁబోవు చుండెను. దీనిచే భగవత్సేవకులకు దేవతలు సాహాయ్యపడుదురు. 'శ్రేయాంసి బహువిఘ్నాని' శ్రేయస్కర కార్యములకు విఘ్నములు మెండు. సంసారమును దరింప నాత్మావలోకనపరుఁడై యోగ మభ్యసించువానిఁ జూచి నిద్రాహార ములు మాని వాఁడు చేయు కృషి చూచి యిట్లయిన వీఁడు చెడునేమో యని భయపడి ప్రేమచేతనే వానికి నిషిద్ధ వస్తువులు తినఁబెట్టి భోగములు మఱపి తమ వలె నుండఁ జేయ నేవేవియో కుచేష్టలు వాని యాప్తబంధువులే తొలుతఁ జేయు దురు. కారణము ప్రేమయైనను విఘ్నము విఘ్నమే. కావున వీరిని లక్ష్యము

చేయరాదు. మంచిమాటలతోనే వారిని సమాధాన పఱిచి బెదరించి తాను దిరిగి చూడక వెనుకంజ పెట్టక కృషిచేయవలెను. భాగవతుల నిష్ఠ యిట్టిదై యుండవలెను. అది విఘ్నకారుల విషయమున దయాదాక్షిణ్య మెఱుఁగదు.

—♦ హనుమంతునకు సురస యడ్డుపడుట ♦—

చ. సురఋషిసిద్ధు లెల్లఁ గపి♦సూరు బలంబు నెఱుంగఁ గోరి భా
స్కరనిభ నాగమాత సుర♦సం గని యల్లదె కంటె వాయుజుం
డురుతరవేగయుక్తిని మ♦హోదధి దాఁటెడి, దైత్యరూపవై
సరగున నేగి యడ్డపడి ♦ జాగొనరింపు ముహూర్తమాత్రమున్. ౧౪

అర్థము. భాస్కరనిభ=సూర్యునితో సమానమైనది, నాగమాత=నాగులకుఁ దల్లియైనది, ఉరుతరవేగ యుక్తిని=మిగుల గొప్పదగు వేగముతో, విఘ్నముచేఁ గాలహరణమైన కారణముచే హనుమంతుఁడు మునుపటికంటె వేగముగఁ బోవఁ బూనెనని భావము.

తా త్ప ర్య ము

దేవతలు, ఋషులు, సిద్ధులు మొదలగు వారీయన యట్లొంటరిగా సాహసించిపోవు చున్నాఁడే రావణుని గెలిచి రాఁగలఁడా? సముద్రమైన నంతయు దాటఁగలఁడా? యీయన బల మే మాత్రిమో తెలిసికొందమని యాలోచించి సూర్యకాంతిగల నాగమాతను సురసను జూచి యదిగోఁ జూచితివా? హనుమంతుఁడు మిగుల వేగముతో సముద్రము దాఁటు చున్నాఁడు. నీవు దైత్య స్త్రీవై పోయి యతని కడ్డపడి ముహూర్త మాత్ర మాలస్య మగునట్లు చేయుము.

క. కోఱలు, నాకాశంబును నూఱెడువక్త్రింబు, కావి ♦ నుఱు మిడిగ్రుడ్లై,
మాఱొడ్డి నిలుము యుక్తిని. మీఱెడినో కాక చిక్కి♦మిడుకాడెడినో. ౧౫

అర్థములు. నూఱెడు=రాచుకొను, స్పృశించు, వక్త్రింబు=నోరు, కావి=ఎఱ్ఱని, నుఱు=నాశముచేయు, మాఱు+ఒడ్డి=ఎదిరించి.

తా త్ప ర్య ము

కోఱలు, నాకాశము నంటు నోరు ఎఱ్ఱనివై చూపులచేతనే యెదుటివారిని జంపు మిడిగ్రుడ్లు కలదానవై త్రోవకడ్డముగ నెదిరించి నిలువుము. యుక్తిచే నిన్ను దాఁటిపోవునో, లేక నీచేఁ జిక్కి పోలేక మిణకరించునో.

ఉ. చూతము గాక యన్న సుర♦సుందరి వల్లె యటంచుఁ గంధిపై
భూతభయావహం బగు న♦పూర్వవికారవిరూపమైన రూ
పాతతరీతి రక్కసియు♦యట్లు ధరించి చరించుచున్ జవో
పేతముగాఁగ వాయుసుతుఁ ♦ జేగెడి మార్గము నడ్డకట్టుచున్. ౧౬

అర్థములు. వల్లె=అట్లే కానిండు, ఇది యంగీకారము సూచించును. కంధిపై=సముద్రముమీఁద, భూత భయావహంబు=ప్రాణులకు భయము కలిగించునది.

అపూర్వ=మును పెన్నఁడు విన్నది కన్నది కానిది. వికారము = చూడభయంకర మైనది, విరూప=వంకరటింకరయైనది, రక్కసియ యట్లు=రాక్షసివలెనే, జవో పేతముగాఁగ=వేగముతోఁగూడినట్లుగ.

తాత్పర్యము

చూత మని చెప్పఁగా నా దేవతా స్త్రీ సరియని యంగీకరించి ప్రాణికోటికి భయంకరమై మును పెవ్వరు నెన్నఁడు వినని కనని వికారము విరూపము నగు పెద్ద రూపము ధరించి యాకాశమునందుఁ దిరుగుచు వేగముగఁ బోయి యాంజ నేయుఁడు బోవు మార్గమున కడ్డముగ నిలిచి,

ఉ. ఇట్లనువానరేంద్ర! యెట • కేగెదు నిల్వుము, నాకు నిన్ను నీ
పట్ల విధించినారలు సు•పర్వులు భోజ్యము గాఁగ, నన్ను నీ
వెట్లును మీఱ లేవు, చొరు•మీ వదనంబును, మ్రింగి వైతు, ము
చ్చట్లిఁక సాగ వన్న సుర•సం గని పావని మోడ్పుఁ గేలునన్. ౯౭

తాత్పర్యము

ఇట్లు చెప్పెను. వానర శ్రేష్ఠా! యెందుఁబోవుచున్నావు. నిలువుము. ఏలం దువా? దేవతలు నిన్ను నా కాహారముగాఁ గల్పించినారు. కావున నన్ను మీఱి నీవు పోలేవు. నానోరఁ జొరఁబడుము. మ్రింగెదను. ఇఁక ముచ్చటలతోఁ బని లేదు. అని సురస చెప్పఁగా నామె వేషము చూచి యిది సహజ రాక్షసి గాదు. కృత్రిమ రాక్షసి. ఎవతెయో నన్నుఁ బరీక్షింప వచ్చినది. నిజముగా నిది నన్నుఁ దినుటకై వచ్చియుండినఁ దానే నన్నెత్తి నోట వేసికొని యుండునుగాని నన్ను నోటిలోఁ జొరఁబడు మని కోరునా? ఈమెతో మనము విరోధింపరాదని తలఁచి యాంజ నేయుఁడు రెండు చేతులు జోడించి నమస్కరించి.

శా. దేవీ! శ్రీరఘురామచంద్రుఁ డటవీ•దేశంబునన్ భార్య సీ
తావామాక్షియుఁ దోడు లక్ష్మణుఁడు రాఁ • దానుండఁ గ్రవ్యాదవై
రావిష్టుండును నన్యకార్యరతుఁ డౌ•నా రాము నిల్లాలి ర
క్షోవర్యుండు హరించె రావణుఁడు; నేఁ•జూడంగ సాధ్వీమణిన్. ౯౮

అర్థములు. క్రవ్యాద వైరావిష్టుండును=మాంసభక్షకులగు రాక్షసులందు విరోధభావము గలవాఁడు. (దీనిచే ఖరసంహారాది సూచితము) అన్యకార్య రతుఁడు = మఱియొక పనియందు మనస్సుంచినవాఁడు (ఇది మారీచవధ సూచించును).

తాత్పర్యము

దేవీ! శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణులతో నరణ్యమందు సంచరించు చుండఁగా రాక్షసులందు ద్వేషబుద్ధిగల రామచంద్రమూర్తి కార్యాంతరాసక్తుఁడై యున్న సమయంబున నాయనభార్యను సీతను రావణాసురుఁడు హరించెను. ఆపతి వ్రతను నేను జూడఁ బోయెదను.

ఉ. రామునియాజ్ఞఁ బోయెదను ♦ రామునిరాజ్యమునందు నుండుటన్
రామరో! నీకునుం దగవు ♦ రాముని కార్యముఁ దీర్పఁ గావునన్
నేమముగాఁగ నేఁ జనఁగఁ ♦ జేయుము, కా దని తేనిజానకీ
క్షేమముఁ దెల్పి రామునకుఁ ♦ జెచ్చెర నీ వదనంబుఁ జొచ్చెదన్. ౯౯

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి యాజ్ఞచొప్పున నేను బోవుచున్నాను. నీవును ఆయన దేశమం దున్నదానవు కావున నీవు నాయన కార్యముఁ జక్కఁజేయఁ దగును. ఏమిచేయు మందువా నన్ను క్షేమముగాఁ బోనిమ్ము. ఆసాహాయ్యము చాలును. అట్లు కాదందువా జానకీదేవిని జూచి యామె కుశలవార్త రామునకు దెలిపి వచ్చి నీ నోరఁ బ్రవేశించెదను.

క. నిక్కము నమ్ము మటంచన, నెక్కుడిమాటలు కపీంద్ర♦యిప్పుడు నాచేఁ
జిక్కియుఁ బోవం గలవే, గ్రక్కున జీవంబుతో వ♦రం బిది నాకున్. ౧౦౦

అర్థము. నిక్కము=నిజము.

తాత్పర్యము

నిజము నమ్ముమని చెప్పఁగా నామె యివేటి మాటలు. ఇప్పుడు నాచేఁ జిక్కియు నీవు తప్పించుకొని ప్రాణముతోఁ బోఁగలవా? ఇది నాకు వరము.

ఇది మొదలు ౧౦౭ వఱకుఁ బ్రక్షిప్తము. ఏలన నిందు సురసయు, ఆంజనేయుఁ డిరువురు నూఱామడ వెడలుపున నోరు దేహము పెంచినట్లు చెప్పఁబడెను. సముద్రము వెడలుపు నూఱామడ. వీరి నోరు దేహము నూఱామడలైన వీరిదేహము లెంతలై యుండవలెను. ఇప్పుడు వీరు సముద్రమధ్యమున నున్నవారు. వీరు నూఱామడ పెరిగియుండిన నాప్రక్క రాక్షసులకు నీప్రక్క వానరులకుఁ గూడఁ గనఁబడి యుండవలెను, అట్లయిన ననర్థకము తప్పదు. కావున నిది యెవరో తెలివి మాలినవాఁడు వ్రాసినదిగా గ్రహింపవలెను.

ఈప్రక్షిప్తములకుఁ గారణ మేమని యాలోచింపఁ గొందఱ యభిప్రాయమేమన :—

ప్రక్షిప్తములకుఁ గారణములు రెండు. స్వమతాభినివేశము, పౌరాణిక వినోదక్రీడ. భారతము "నారాయణకథా మిమా"మ్మని వ్యాసులు చెప్పినను దమతమ మత ప్రశస్తికై యితర మతముల వారు తమ తమ యిష్టదేవతలకుఁ బరత్వము చెప్పుచుఁ గొన్ని యధ్యాయము లందందు నిఱికించిరి. భారతమందలి ప్రక్షిప్తముల కిది ముఖ్యకారణము. రామాయణ విషయమున నట్లు చేయ సాధ్యపడక యా యా మతములవారు వారి వారి మతానుసారముగ వాల్మీకి పేరుపెట్టి యితర ఋషుల పేరుపెట్టి వేలు వేలు రామాయణముల వ్రాసికొనిరి. కావున నట్టివి రామాయణమందు లేవు. రామాయణమును వాల్మీకి

రచించిన పిమ్మటఁ జాలకాలము వేదమువలెనే దానియందు శ్రద్ధగలవారు ముఖస్థము చేసి యుండిరిగాని లిఖిత రూపమున లేదు. ఒకవేళ యుండినను ఎందో యపురూపముగ నుండెడిది. రామాయణము సర్వజనీనగ్రంథ మగుటచేఁ బౌరాణికులు లోకులకు దానిఁ జెప్పసాగిరి. ఇట్లు చెప్పుటయందు వినెడి వారి కింపుగ నుండి వారి మనస్సు నాకర్షించుట రావణ సీతారామ హనుమదాదుల మహిమ విశేషముగ లేనివి పోనివి యూ యూ పౌరాణికుల బుద్ధి చమత్కారము కొలఁదియో, బుద్ధిహీనత కొలదియో, క్రొత్తవి కల్పించి చెప్పుచుండిరి. ఆవల నెవరో మహానుభావులు రామాయణమును లిఖితరూపమున లోకమున వెలయింప నందందుఁ గలవి చేర్చి యన్నిఁటియందు సమానముగా నున్న భాగములను మూలముగాఁ జేసి కొన్ని కొన్ని ప్రతులందున్న వానిని ప్రక్షిప్తము లని చెప్పిరి. ఈ సురస విషయము, కాలనేమివిషయము పౌరాణికులు వర్ణించి చెప్పునపుడు పామర జనము లెంతయానందింతురో చెప్పవలసినపని లేదు. ఈ ప్రక్షిప్తశ్లోక కారులు తెలివి తక్కువవారగుటచే వారి దొంగతనము కనిపెట్ట సాధ్యపడుచున్నది, ఈ ప్రక్షిప్తములు అధిక పాఠము ఉత్తర కాండమున దండిగఁ గలవు. పూర్వ వ్యాఖ్యాతలు ప్రక్షిప్తముల నెల్ల వేఱు పఱచిరి.

చ. అని యిటు కామరూపిణి సు•రాంగన పల్కఁ దనంత నిచ్చమైఁ
జనియెడి యాంజనేయుఁ గని • సత్త్వ మెఱుంగఁగ గోరి యోరి వే
చనియెద వెందు? నా వదన•పద్మమునం జొరఁబాఱు, మిట్లుగా
వనజభవుం డొసంగే మును • వానరనాథ! వరంబుఁ బ్రీతితోన్. ౧౦౧

క. అని బిఱబిఱ జని వదనం,బును దెఱచి మరుత్తనూజు•ముంగల నిలువం
గని కోపంబున నేదీ, నను మ్రింగెడినోరు చూపు•నారీ! యనుచున్. ౧౦౨

చ. ఒక పదియామడల్ నిడివి•యొప్పఁగ దేహముఁ బెంచి నిల్చినన్
వికటకరాళవక్త్రిమను•నెల్తుక యిర్వదియామ డొప్పఁగా
నకుటిలరీతిఁ జేయ నమ•రాంగనయుం; గని వాయుసూనుఁడున్
దికమిక లేక పెంచెఁ దన•దేహము ముప్పదియోజనంబులన్. ౧౦౩

క. నలువదియామడ పేర్పుం, జెలువయు వా దెఱవఁ గీశ•సింహుఁడు పెంచెన్
వలనుగ నేఁబదియామడ, నల సతి నో ర్విచ్చె నఱువ•దామడ గాఁగన్. ౧౦౪

క. డెబ్బదియామడ క్రోఁతుల,గబ్బియు మెయి పెంచె నమర•కాంతయు విచ్చెన్
గొబ్బున నెనుబదియామడ, నబ్బలియుఁడు తొంబదామ•డాయత మగుచున్.

క. ఒప్పఁగ మెయిఁ బెంచిన సతి, యప్పుడ నూఱామడగను•నాస్యకుహరమున్
విప్పఁగ విచ్చెను నన్నుం, దప్పించుకొనంగ సఱుఁ•దరమా క్రోఁతీ] ౧౦౬

౧౦౧ మొదలు ౧౦౬ వరకుఁ దాత్పర్యము. ఈ ప్రకారము కామరూపిణి యగు దేవతాస్త్రీ చెప్పిన తన త్రోవను తాను నిలువక పోవుచున్న హనుమంతుని బల మెఱుఁగ గోరి 'యోరీ! నీ వెందుఁబరా పోయెదవు; నా నోర నీవు చొచ్చవలసి

నట్లు బ్రహ్మ నాకు వరమిచ్చెను' అని శీఘ్రమున నడ్డముపోయి నోరు తెఱచికొని యాంజనేయుని ముందు నిలువఁగా హనుమంతుఁడు కోపించి నన్ను మ్రింగఁగల నీ నోరేదో చూపుమని యొక పది యామడ నిడివిగాఁ దన దేహము పెంపఁగా నది తన నోరిర్వది యామడ వెడలుపుగాఁజేసెను. హనుమంతుఁడు తన దేహమును ముప్పది యామడ నిడివి గలదిగాఁ జేసెను. అది దాని నోరు నలువదామడ వెడలుపు చేసెను. ఆయన యేఁబదామడ పొడవయ్యెను. దాని నోరు నలువదామడ వెడలుపు చేసెను. ఆయన యేఁబదామడ పొడవయ్యెను. దాని నోరు అఱువది యామడ వెడలుపయ్యెన. ఆయన దేహము డెబ్బది యామడ దీర్ఘమయ్యెను. దాని నోరు ఎనుబది యామడ వెడలుపయ్యెను. ఆయన తొంబది యామడ దీర్ఘముగ దేహము పెంచెను. అది నూఱామడగాఁ దన నోరు విచ్చి నన్నుఁ దప్పించుకొని నీవెందుఁ బోయెదవురా క్రోఁతీ యనెను.

తే. అనుచు విచ్చిన వదనంబు ◆ ననిలసుతుఁడు, బుద్ధిమన్వర్యుఁడు [సమస్త ◆ భూతనిచయ భయదనరకాభదీర్ఘజి ◆ హ్వాయును] గాంచి, తత్క్షణముకొంచెపఱుచుఁ ◆ దనదుమేను.

## తాత్పర్యము

అని సురస నోరు తెఱవఁగా బుద్ధిమంతుఁడైన యాంజనేయుఁడుచూచి తత్క్షణమే తన దేహము కొంచెముగాఁ జేసెను. దీనివలన హనుమంతునందు నణిమాది సిద్ధులు గలవని యేర్పడుచున్నది.

### —◆ హనుమంతుఁడు సురసనోటఁ జొచ్చి వెడలుట ◆—

క. అంగుటమునంత యయి కపి, పుంగవుఁడు తటాన ◆ జొచ్చి ◆ పొలఁతుక నోరన్
జంగున వెలి వచ్చెను రయ, చంగుం డభ్రమున నిలిచి ◆ సతి కిట్లనియెన్. ౧౦౪

అర్థములు. అంగుటము నంత=బొటనవ్రేలియంత, అంగుష్ఠ శబ్దభవము అంగుటము, రయ చంగుఁడు=వేగమున సమర్థుఁడు.

## తాత్పర్యము

వానర శ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు బొటనవ్రేలంత రూపము ధరించినవాఁడై వేగమున సమర్థుఁడగుటచేఁ దటాలున నామె నోరఁజొచ్చి యామె నోరు మూసికొను లోపలఁ జంగున బయటికి వచ్చి యాకాశమున నిలిచి యిట్లనెను.

శా. తల్లీ! నీవదనంబుఁ జొచ్చితిని, స ◆ త్యం బయ్యె నీ కోరిక, చం
చల్లీలం గరుణించి నాదగు నమ ◆ స్కారంబుఁ గైకొమ్మ, నే
నుల్లాసంబుగ జానకి న్వెదకు ను ◆ ద్యోగంబునం బోదు, నీ
యుల్లంబందు శుభంబు సంఘటనగా ◆ నూహింపు దాక్షాయణీ. ౧౦౫

అర్థములు. వదనంబు=నోరు, దాక్షాయణీ=దక్షుని కూఁతురా! హనుమంతుఁడిట్లు సంబోధించుటచే నామె తాను దక్షుని కూఁతురని చెప్పియుండవలెను. ఈ యొక్క మాట చేతనే హనుమంతుఁడు నీవెవ్వతె వని యడుగుట

లోనగు ప్రశ్నలు నేను దక్షుని కూఁతురని యామె చెప్పుటలోనగు సంభాషణ మూహ్యము, గావున ముందు చెప్పలేదు. ఈ కారణము చేతనే హనుమంతుఁ డామెను రాక్షసి యని భావింపక సగౌరవముగ నమస్కరించి సంభాషించెను. ఇది వాల్మీకి శైలిఫక్కి.

తాత్పర్యము

తల్లీ! దాక్షాయణీ! నీవు కోరిన ప్రకారము నీ నోరఁ బ్రవేశించితిని. నీకు బ్రహ్మ యిచ్చిన వరము సత్యమయ్యెను. నా యందు దయయుంచి నా నమస్కార మంగీకరింపుము. నేను సంతోషముతో సీతను వెదకు పనిమీఁదఁ బోయెదను. నీ మనస్సునందు నేను బోవుకార్యమున మేలు కలుగునట్లు సంకల్పింపుము.

క. పలుక నిటు రాహువదనము, వెలువడు శశి యట్లు నోరు•వెడలుచు వేల్పుం
జెలువ హనుమంతుఁ గనుఁగొని, యలరుచు నిట్లనియె నైజ•మగు నాకృతితోన్.

తాత్పర్యము

ఈ విధముగ హనుమంతుఁడు చెప్పగా రాహువు నోరఁబడి వెడలిన చంద్రునివలెఁ దన నోటఁబడి వెలుపలరాఁగా నా దేవతాస్త్రీ మిగుల సంతోషించి తన సహజ స్వరూపమును ధరించినదై.

క. పొమ్మా హనుమ! యథాసౌ, ఖ్యమ్మగ నీ కెల్ల పనులుఁ•గడుసుకరము లౌ
నిమ్మగ రాముని ముద్దుం, గుమ్మను బతితోడ వేగ•కూర్పుము వత్సా! ౧౧౧

తాత్పర్యము

నాయనా! హనుమంతా! సౌఖ్యముగఁబోయిరమ్ము. నీ కన్ని కార్యములు మిగుల శ్రమము లేకయే ఫలించును. రామచంద్రమూర్తి భార్యను భర్తతోడ వేగకూర్పుము.

తే. అనుచు వచియించి చనియె న•య్యమరవనిత, దేవతాదులుచూచిత్రై•తీయమైన
యాంజనేయుని దుస్సాధ•మైన పనిని, మేలు మే లని మిక్కిలి•మెచ్చి రపుడు.

అర్థములు. దుస్సాధము=సాధింపఁ గష్టమైనది.

తాత్పర్యము

అనిచెప్పి యా దేవతా స్త్రీ పోయెను. దేవతలు మొదలగువా రాంజనేయుని దుష్కరమైన యా మూఁడవ పనిని జూచి మేలుమేలని మిక్కిలిమెచ్చిరి.

ముముక్షువగు యోగిని భాగవతుని దేవతలు పరీక్షించుటకై విఘ్నములు కల్పింతురు. వీనిని భక్తిచేతనే తప్పించుకొనవలెను.

క. ఆవల నదృశ్య మగు పా, రావారము వదలి విహగ•రాధిపజవుఁ డై
ద్యోవీథికి లంఘించి భ, యావహ మగురీతిఁ జనియె•నంజనసుతుఁడున్. ౧౧౩

అర్థములు. ఆవల=సురస వెడలిపోయిన తరువాత, అదృశ్యము=అలక్ష్య పెట్టరానిది, పారావారము=సముద్రము, విహగరాధిపజవుఁ డై=పక్షిరాజగు గరుత్మంతుని వేగమువంటి వేగము గలవాఁడై, ద్యోవీథికిన్ = ఆకాశమార్గమునకు, భయావహము=చూచువారికి భయము కలిగించునది.

## తాత్పర్యము

సురస పోయిన తరువాత నలక్ష్యము చేయరాని సముద్రమును వదలి గరుడ వేగుఁడై యాకాశమునకు లంఘించి భయంకర విధముగా నాంజనేయుఁడు చని యెను. సముద్రము వదలి యాకాశమునకు లంఘించి యనుటచే సురసతోడి వ్యవహారము నీటి మట్టమునకుఁ బైగా జరిగెను గాని మేఘమండలమునఁ గాదని యేర్పడు చున్నది.

సీ. దొంతరగా నున్న•తోరంపుమబ్బులు, పరువులు పాఱెడి•పక్షికులము
సంగీతసుకళావి•శారదాచార్యులు, రాణ నొప్పారు నై•రావతంబు
బెబ్బులి యేనుంగు•బొబ్బ మెకంబులు, నెక్కిరింతలు గాఁగ•నెసఁగువారు
మహనీయ మైన వి•మానంబు లశనివ, జ్రోద్భవశిఖిశిఖా•ప్రోచ్చయములు
తే. నాక మరిగెడి కృతపుణ్యు • లౌ మహాను
భావజనములు సందడి•బాటగములు
హవ్యమును మోసికొని చను•హవ్యవహుఁడు
చంద్రసూర్యగ్రహోడున•క్షత్రములును. ౧౧౪

అర్థములు. దొంతరగాన్=దొంతులు దొంతులుగా నొకదానిపై నొకటి, తోరంపు=గొప్పవగు, సంగీత సుకళా విశారదాచార్యులు=సంగీత విద్యయందు, నేర్పుగల తుంబురుఁడు మొదలుగాఁ గల యాచార్యులు, ఐరావతంబు= ఇంద్ర ధనుస్సు. "ఇంద్రాయుధం త్వింద్ర ధనుస్తు దీర్ఘ మృజు రోహితం ఐరా వతం చ విద్యుత్తు చంచలాచపలాపిచ' అని వైజయంతి. ఋజువు, దీర్ఘమైన యింద్రధనుస్సు ఐరావత మనఁబడును. బొబ్బ మెకంబులు=సింహములు, ఎక్కి రింతలు=వాహనములు, అశని వజ్రోద్భవ శిఖిశిఖా ప్రోచ్చయములు = పిడుగు వజ్రాయుధము కలియుటచేఁ బుట్టిన నిప్పుమంటల సమూహములు, కృత పుణ్యులు=పుణ్యము చేసినవారు, మహానుభావ=గొప్పమహిమగల, సందడి= క్రిక్కిరిసిన జనులు గుంపుగల, హవ్యవహుఁడు=అగ్నిహోత్రుఁడు, చంద్రసూర్యా దులు గ్రహములు, ఉడు=తక్కిన సామాన్య నక్షత్రములు, అశ్విన్యాదులు నక్షత్రములు.

## తాత్పర్యము

దొంతులు దొంతులుగా నొకదానిపై నొకటియున్న గొప్ప మబ్బులు పరువెత్తుచున్న పక్షులు, సంగీత విద్యానిపుణులైన తుంబురుఁడు లోనగువారు, కాంతిచే వెలుఁగు నింద్ర ధనుస్సు, పెద్దపులి యేనుఁగు సింహము వీనిని వాహన ములుగాఁ గలవారు, గొప్ప విమానములు, వజ్రము పిడుగులు వీని రాపిడిచేఁ బుట్టిన మంటలు స్వర్గమునకుఁబోవు పుణ్యాత్ములు, వీరిచే నెడము లేకుండు బాటలు దేవతలకు హవ్యమును మోచికొనిపోవు నగ్నిహోత్రుఁడు, చంద్ర సూర్యాది గ్రహములు, సామాన్యములైన చుక్కలు, అశ్విన్యాది నక్షత్రములు, ఇదియును రాఁబోవు రెండుపద్యంబులు ఆకాశవర్ణనము.

ఉ. దేవమునిప్రకాండములు • దివ్యనభశ్చరనాగయక్షవి
శ్వావసు కిన్నరాదులు ది•శాగజముల్ రవిచంద్రు లేగు మేల్
త్రోవలు మీఱఁగా నఖిల•లోకవితానవితానమై శివం
బై వనజాసనాకలిత • మై రహిఁ మించు నభఃపథంబునన్. ౧౧౫

అర్థములు. దేవముని ప్రకాండములు=దేవర్షిశ్రేష్ఠులు, నభశ్చర=ఆకాశమందు సంచరించువారు, విశ్వావసువు=గంధర్వరాజు, దిశాగజముల్=దిక్కులయందుండు నైరావతాదు లేనుఁగులు, అఖిలలోక వితాన వితానమై=సమస్తలోకమునకు మేల్కట్టు (చాందినీ) వంటిదై, శివంబై=శుభకరమై, వనజాసన+ఆకలితము=బ్రహ్మచే సృజింపఁ బడినది, నభఃపథంబునన్=ఆకాశమార్గమున.

తాత్పర్యము

దేవర్షిశ్రేష్ఠులు, దేవతలు, ఆకాశసంచారులు, నాగులు, యక్షులు, విశ్వావసువు లోనగు దేవగంధర్వులు, కిన్నరులు లోనగువారు దిగ్గజములు, సూర్యచంద్రాదులు పోవుమార్గములు అతిశయింపఁగా నన్నిలోకములకు మేల్కట్టు వంటిదై బ్రహ్మనిర్మితమై ప్రకాశించు నాకాశమార్గమున.

క. గరుటామంతునిపోలిక, పరగున ఱెక్కలు గలట్టి • శైలం బనఁగా
సరిగ నిరాలంబనగతి, మరుదాత్మజుఁ డుఱక దివిజ•మార్గము వెలుఁగన్. ౧౧౬

అర్థములు. ఉఱక=లక్ష్యము లేక, దివిజమార్గము=ఆకాశము.

తాత్పర్యము

గరుత్మంతునివలె ఱెక్కలు గల కొండవలె నిరాధారముగ లక్ష్యము లేక యాకాశమును బ్రకాశింపఁజేయుచు హనుమంతుఁడు పోయెను.

—• ఆంజనేయుఁడు సింహికను వధించుట •—

క. రంహోజృంభితవానర, సింహుం డరుగంగఁ జూచి•చింతించె మదిన్
సింహిక యను పెనురక్కసి, యంహోభావమున నెంత•యనఘాత్మికనో. ౧౧౭

అర్థములు. రంహోజృంభిత=రంహస్=వేగముచే, జృంభిత=అతిశయించిన, అంహోభావమునన్=పాపిష్ఠమగు మనస్సుచేత, మధ్యమపదలోపి కర్మధారయము.

తాత్పర్యము

వేగాతిశయము గల వానరశ్రేష్ఠుఁడు పోవుచుండుట చూచి సింహిక యను రాక్షసి పాపబుద్ధిచే నిట్టు లాలోచించెను. ఆహా! నేనెంత పుణ్యాత్మురాలనో.

ఉ. ఎన్నిదినంబులో కడచె • నింతయుఁ గూడు లభింప కయ్యో నా
కిన్నిదినాల కేన్ దొరకె • నిట్టిమహాద్భుత సత్త్వ మంచు నాఁ
కొన్నతనంబునం బెరిఁగి • క్రూరపురక్కసి యాంజనేయుఛా
య న్నతి నిగ్రహింపఁ బవ•నాత్మజుఁ డాత్మసా విద మూరఁగన్. ౧౧౮

అర్థములు. సత్త్వము=జంతువు, ఆఁకొన్నతనంబునన్=ఆఁకలిచే, 'పెల్లాఁకొన్న తనాన నేనొకఁడనే భిక్షానకున్ వత్తునో'. భీమేశ్వర.

తా త్ప ర్య ము

కొంచెమైన నాహారము దొరకక యెన్నిదినములో యాయెను, ఇన్నాళ్ళకైనను నిట్టి యత్యాశ్చర్యకరమైన జంతువు లభించెను, అని యాఁకలిచేఁ బెరిఁగి క్రూర రాక్షసి తన నీడను బట్టుకొనఁగా హనుమంతుఁడు మనస్సులో దుఃఖ మతిశయింపఁగా.

తే. ఓరుగాలికి నెదురేఁగు నోడ నైతి
 గుంటు పడియెను వేగంబు కూలె బల మి
 దేమి యొకో యంచు నటు నిటు లెల్లఁ జూచి
 కనియెఁ బెనుభూత మొక్కండు కడలి లేవ. ౧౭౯

తా త్ప ర్య ము

ఓరుగాలికి నెదురుగాఁ బోవు నోడవలె నైతిని. నా వేగము తగ్గెను.బలము చెడెను. దీనికేమి కారణ మని నాలుగు ప్రక్కలఁ జూచి యొక పెద్ద భూతము సముద్రములో నుండి లేచు చుండఁగా జూచెను.

క. సుగ్రీవుఁడు చెప్పిన ఛా,యాగ్రాహియ దీన సంది యం బేమి య టం
 చుగ్రుండై మెయి వెంచె మ,హాగ్రావము నట్లు ప్రావృ డంబుద మనఁగన్. ౧౮౦

అర్థములు. ఛాయాగ్రాహి=నీడను బట్టునది, గ్రావము=పర్వతము, ప్రావృట్ + అంబుదము=వానకాలమందలి మేఘము.

తా త్ప ర్య ము

ఈ సముద్రమున నీచోట నీడను బట్టు నంగారక యను గ్రహ మున్నదని సుగ్రీవుఁడు చెప్పెను గదా.అదియే యిది సందేహము లేదు, అని కోపించి భయంకరుఁడై పెద్దకొండవలె, వానకాలపు మబ్బువలె దేహము నెత్తుగా వెడలుపుగాఁ బెంచెను.

ఉ. వ్రీలక మేను పెంచు కపి వీరవరుం గని దైత్యకాంత పా
 తాళగుహాంతరాభ మగు దారుణవక్త్రము విచ్చి కార్మొయిల్
 లీలను గర్జ సేసి యవ లీలగఁ దగ్రసియింప రాఁగ న
 య్యాలరిభూతమున్ భయద మా మెయియున్ వివృతాస్యమర్మముల్. ౧౮౧

అర్థములు. వ్రీలక=వెనుదీయక, పాతాళగుహాంతరాభము=పాతాళ గుహ లోపలి భాగముతో సమానమైనది, వక్త్రము=నోరు, కార్మొయిల్ లీల=వాన మబ్బువలె, గ్రసియింపన్=భక్షించుటకు, ఆలరి=చెడ్డ, మెయి=దేహము, వివృత=తెఱవఁబడిన. ఆస్య=నోరు, మర్మముల్=ప్రాణస్థానములు.

తాత్పర్యము

దేహమంత కంతకు వదలక పెంచుచున్న హనుమంతుని జూచి రాక్షసి పాతాళ గుహవంటి భయంకరమైన నోరు తెఱచి వానమబ్బులవలె గర్జించి సునాయాసముగఁ దన్నుఁ దినుటకు రాఁగా నా పెద్దభూతమును భయంకర దేహమును విచ్చిన నోరును మర్మస్థానములు.

దేహము నోరు ప్రాణస్థానములఁ బరిశీలించుట శీఘ్రవధోపాయమున నెచ్చట నేమిచేసిన నది వెంటనే చచ్చునని చూచుటకే.

క. కని వజ్రకాయుఁ డల్పపుఁ, దనువునఁ దద్వివృతవక్త్ర◆దరిఁ బడ; దివిజుల్
ఘనుఁ డితఁడు పర్వమున రా, హునివాతను బడెడి చంద్రు◆నొప్పున నకటా. ౧౨౨

అర్థములు. వజ్రకాయుఁడు=వజ్రమువలెఁ గఠినమైన దేహము కలవాఁడు. అది మ్రింగినను దానికిఁ బ్రాణాపాయమే కాని జీర్ణమునకు రానివాఁడు. వజ్రము తాఁకునఁ గొండలైన నెట్లు పిండియగునో యట్టి తాఁకు గలవాఁడు, అల్పపుఁదనువున్=చిన్న దేహమున, తత్=ఆ రాక్షసియొక్క, వివృత=తెఱవఁబడిన, వక్త్ర=నోరనెడి, దరిన్=గుహయందు, పర్వమునన్=పున్నమనాఁడు.

తాత్పర్యము

ఇట్లు చూచి వజ్రమువంటి దేహముగల యాంజనేయుఁడు చిన్నశరీరముగలవాఁడై దాని తెఱచిన నోరను గుహయందుఁ దటాలునఁ బడెను. దేవతలదిచూచి పున్నమనాఁటి చంద్రుఁడు రాహువు నోటఁబడినట్లు లయ్యో యింతటి గొప్పవాఁడు.

క. రక్కసివాతం బడియెనె, యుక్కఱి యని వగవఁ బేవు◆లుగ్రనఖాళిన్
గ్రక్కున మనోజవంబున, వెక్కసముగఁ జెఱికి కపియు◆వెలికిన్ దూఁకెన్. ౧౨౩

అర్థములు. ఉక్కఱి=ఉక్కు+అఱి=పరాక్రమము చెడి, మనోజవంబునన్=మనస్సువేగమువంటి వేగముతో, వెక్కసమునన్=సహింపరానట్లుగ.

తాత్పర్యము

రాక్షసి నోటఁబడియెఁగదా యని వ్యసనపడుచుండఁగా దాని ప్రేవులను వాఁడియైన గోళ్ళచే మనోవేగమున నతిశీఘ్రముగ దానికి సహింపరాని విధముగఁ జెఱికి యది నోరు మూయులోపల హనుమ బయటకు దూఁకెను.

ఉ. ధీరత నేర్పుచూపులను◆ దిగ్గన దానిమదం బడంచి, యా
కారము తొల్లియట్ల కొని◆ క్రమ్మఱఁ బోవుచు నుండె, మర్మసం
వారము ద్రెవ్వ రక్కసియు◆ వారిధిఁ బడి బిద్దినన్ నభ
శ్చరులు వాయుసూనుఁ గని◆చాఁగు బళీ యిను లెస్సచేసితౌ. ౧౨౪

అర్థములు. ధీరతన్=ధైర్యముచేత, నేర్పు=బుద్ధి చమత్కారము చేత, చూపులన్=దూరమునుండియే యెదుటివారి మర్మము నొక్కసారి చూచుటచేతనే తెలిసికొనఁగల చూపుచేత, దిగ్గన=తటాలున, తొల్లియట్ల=పూర్వమున్న విధముగ,

పెద్దదేహమును, మర్మసంవారము=ప్రాణస్థానముల సమూహము, త్రెవ్వన్=తెగి పోఁగా, బిద్దినన్=చావఁగా, నభశ్చ్చరులు=ఆకాశమున సంచరించువారు, చాఁగు బళీ=ఇది ప్రశంసార్థకము.

తాత్పర్యము

ఎదుటి వారు దిగ్భ్రమ గొనునట్లు చేయుధైర్యము బుద్ధి చమత్కారము దృష్టి బలము వీనిచే నా రాక్షసి గర్వమణఁచి పూర్వమున్న యాకారము మరల గ్రహించి మునుపటివలెఁ బోవుచుండెను. మర్మస్థానములు దెగిపోవుటచే రాక్షసి సముద్రములోఁ బడి చచ్చెను. అది చూచి దేవతలు లోనగు నాకాశ సంచారులు హనుమంతునిజూచి బలే బలే చక్కఁగాఁ జేసితివి. సరి సరి.

ఉ. వానరలోకనాయక! భ♦వత్కృత మన్యదురాసదంబు, నీ
యానిన కార్యముం జలుప ♦ నొయ్యనఁ బొమ్ము శుభంబు గల్గు, నె
వ్వానికి ధైర్యము స్మతియు ♦ వారక దాక్ష్యము దృష్టి నీవలెన్
జానుగఁ గల్గు వానికి న♦సాధ్యము లే దది యెట్టి కార్యమేన్. ౧౯౧

అర్థములు. భవత్+కృతంబు=నీచేఁ జేయఁబడినది, అన్యదురాసదంబు=ఇతరులకు సాధ్యము కానిది, దాక్ష్యము=సామర్థ్యము, దృష్టి=ఎదుటివారిమర్మము తెలిసికొనఁగల సూక్ష్మదృష్టి.

తాత్పర్యము

కపీంద్రా! నీవు చేసిన కార్య మితరులకు సాధ్యమగునది కాదు. నీవుపూనిన పని నెఱవేర్ప నిఁక వేగముగఁ బొమ్ము. నీకు మేలుగలుగును. ఎట్లుచేసినకార్యము సాధ్యమగునా యని యాలోచించు బుద్ధి చమత్కారము, ఆయాలోచనను గొన సాగించు సామర్థ్యము ఎదుటివారి రహస్యము తెలిసికొనఁగల చూపుగల వానికి నే కార్యమైన నసాధ్యముకాదు. ఈరాక్షసి (సింహిక=అంగారక) చరిత్రము ముము క్షువునకు దుష్టగ్రహ భూతములచేత దుష్టజనులచేతఁ గలుగు బాధను సూచించు చున్నది. ఇట్టి విరోధ భావము గలవారి యందు దయాగౌరవములు చూపరాదు. వారిని హతము చేయుటే తగిన కార్యము.

—♦ హనుమంతుఁడు లంకాతీరంబును జూచుట ♦—

చ. అన విని వారిభాషణము ♦ లంజనపుత్రుఁడు స్వప్రయోజనం
బును స్మరియించుచుం జనుచుఁ ♦ బుల్గులతేనివిధాన నంబరం
బున దిగుచుం గనుంగొనియె ♦ భూనితరోచమనోజ్ఞ భూమిజా
తనివహసుందరంబును ని♦తాంతఫ లమున్ బ్రా ప్తతీరమున్. ౧౯౨

అర్థములు. పుల్గులతేని విధానన్=గరుత్మంతునివలె, దిగుచున్=ఆకాశమున నుండినచోఁ రాక్షసులకుఁ గానవత్తునని యాలోచించి నీటిమట్టమునకుసరిగాదూరము

నుండియే దిగ నారంభించెను. భూరితర=గొప్పవై, ఉరుమనోజ్ఞ=మిగులనందమైన, భూమిజాతనివహ=చెట్లసమూహముచే, సుందరమున్=అందమైనదానిని, నితాంత విశాలము=మిగుల వెడలుపైనది, ప్రాప్తతీరమున్=సమీపమందుండు గట్టును, స్వప్రయోజనము=ఎక్కడ నెట్లుచేసినఁ దనకార్యము కొనసాగునో యట్లు వర్తించుట. కావుననే సురసా సింహికలయందు స్త్రీత్వదోషము సమానమైనను సురసను జయింపవలె నని తలఁచెను. సింహికను జంపఁదలఁచెను.

## తాత్పర్యము

వారిమాటలు విని హనుమంతుఁడు తానువచ్చిన కార్యము నెరవేర్చు నుపాయ మాలోచించుచు గరుత్మంతుఁడు నేలవ్రాలునపుడు దిగునటు లాకాశము నుండి దిగుచు గొప్పచెట్లచే నందమై మిగుల విశాలమై తాను దిగవలసిన తీరమును సమీపమందుఁ జూచెను.

చ. కనుఁగొని తత్ప్రదేశమునఁ ♦ గ్రమతరంబుఁ దదంతరీపమం
దును మలయాద్రిపొంతఁ గల ♦ తోరపుఁదోఁపులు గల్గునీములున్
వనచరవీరవల్లభుఁడు ♦ వారిధిఁ దీరముఁ దీరజాగముల్
వనధిసతుల్ పతిం గలయ ♦ వచ్చిన వారిముఖప్రదేశముల్. ౧౨

అర్థములు. తదంతరీపము=ద్వీపము, నీటి నడుమనుండు మిట్ట ప్రదేశము, నాలుగు ప్రక్కల నీళ్లుగల భూమి, తీరజాగముల్=తీరమునందుఁ బుట్టిన చెట్లు, వనధిసతుల్=సముద్రము భార్యలు, ఏఱు, పతిన్=భర్తయగు సముద్రుని, వారి ముఖప్రదేశముల్ = నదీ ముఖద్వారములు, ఏఱు సముద్రములోఁ గలియు ప్రదేశములు.

మలయ మను నొక పర్వతము లంక యందును గలదు. నదు లనియో ఏఱులనియో యొకచిన్నమాటఁ జెప్పినఁ జాలునే 'వనధిసతుల్ పతింగలయవచ్చిన వారి ముఖప్రదేశముల్' అని యింత దీర్ఘముగఁ జెప్పనేల? భర్తలను గలియఁ గోరి వచ్చిన వారి యనఁగా ముత్తైదువుల ముఖదర్శన మయ్యె ననుట శుభశకునము సూచించుచున్నది. నదులు వచ్చి సముద్రములోఁ గలిసినట్లు సీతాదేవి భర్తతోఁ గలియు నని సూచితము. వచ్చినవారి=వచ్చినట్టి స్త్రీలయొక్క యనియు నర్థము గ్రహింపనగు.అప్పుడు 'వారి' తెనుఁగు పదమగును ఏరు సతులు అనఁగాఁ బతివ్రతలు కావున భర్తనే కలియవచ్చి రని భావము.

## తాత్పర్యము

చూచి యాప్రదేశమందు మిగుల మనోహరమైన ద్వీపమందుఁ గల మలయ పర్వతము సమీపమునఁ గల గొప్ప తోఁపులు గల ప్రదేశములును సముద్రమును దానియొడ్డును నొడ్డునందుఁగల చెట్లను నదులు సముద్రమును గలయుచోటులు పై పద్యముతో నన్వయము.

సముద్రమున కావలియొడ్డున నీవలియొడ్డున మలయ పర్వతము లున్నట్లు చెప్పుటచే నొకానొక కాలమున లంకయు దక్షిణ హిందూస్థానము నేకమై నడుమ సముద్రము లేక యుండెనను వారి యభిప్రాయము సాధువని తోఁపఁజేయు చున్నది.

**"The islands of Rameswaram and Mannar, and the chain of islets and sand banks between them, called Adam's Bridge, appear to be remnants of the natural land connection between the main land of India and Ceylon, which existed in some recent geological epoch. There is no doubt of the fact that Ceylon once formed a part of the Deccan. The existence in Ceylon of Indian elephants (elephas Indicus) and other animals and vegetables, natural to southern India, proves the former connection of Ceylon to India. If that were not the case, elephants and other land animals, could not have crossed the sea to make the island of Ceylon their habitat The Esstern Archpelago once formed a part and parcel of the Continent or Asia. But by the gradual subsidence of land, from volcanic action, to the bottom of the sea portion of the south and south Eastern Asia got detached from the mainland and became islands. The separation of Ceylon, and the islands of the Archipelago took place, I think, at the same geological epoch and by the same cause or causes, It will appear from a study of the map of Asia that the subsidence took place in a latitudinal belt almost Parallel to the Equator. on both sides of it. seperating Ceylon, Sumatra, Java, Borneo, Celibes and a host of smaller islands from the manland of Asia, It will also appear that the Malaya Peninsula very narrowly escaped complete detachment from this volcanic disturbance, It will also appear from a study of geographical distribution of animal and vegetable life in the suoth and south eastern parts of the Asiatic continent, and the islands that most of them, got detached from the mainland by subsience and that some of them on the other hand. have spung up from the bottom of the sea by upheaval (vide Wallace, Malay Archipelago; Island life and Geographical distribution of animals 2 Vols. Hackils, History of Creation. 2 Vols.**

క. అంగుమెయి నాకసంబును, గ్రమింపఁగ గమకించు తనశరీరంబు మహో
భంగురతయుఁ గని తనలో, నం గాడుపుపట్టి యోజనాపరుఁ డయ్యెన్. ౧౭౭

అర్థములు. అంగుమెయిన్=చక్కఁగా గమకించు=యత్నించు, మహోభంగురత=మిగుల నభివృద్ధి, యోజనాపరుఁడయ్యెన్=ఆలోచించిన వాఁడయ్యెను. 'యోచన' యను శబ్దము సంస్కృతమున లేదని పండితు లందురు. యకారాదులు తెనుఁగున లేవు కావున యోచన యనునది తెలుగు శబ్దమును గాదు.

తాత్పర్యము

చక్కఁగా నాకాశంబును గ్రమింపుటకై యత్నించు తన శరీరముయొక్క యభివృద్ధి చూచి హనుమంతుఁడు తనలో నిట్లు లాలోచించెను.

ఉ. ఈ మెయిపెంపు నా దగున•హీనజవంబును గాంచి రాక్షసుల్
దా మొకవింతగాఁగ ననుఁ • దద్దయుఁ జూడఁగఁ గోరుచుంద్రు, నే
నేమెయిఁ గార్యముం జలుప•నేర్పడు నంచు మహాద్రిసన్నిభం
బౌ మెయి వానరాధిపుఁడు • నా క్షణమందున సంగ్రహించుచున్. ౧౨౯

అర్థములు. మెయిమెంపు=దేహముయొక్క గొప్పతనము, అహీనజవంబు=మిగులవేగము, వింతగాఁగ=ఆశ్చర్యకరమైన క్రొత్తవస్తువుగా.

తాత్పర్యము

ఈ నా పెద్ద శరీరము నా యీ వేగము రాక్షసులు చూచిరా నన్నొక వింత జంతువువలెఁ జూడ మిగుల వేడుక పడుచు నా చుట్టు తిరుగుచుందురు. అప్పుడు నేనెట్లు సీతాన్వేషణ కార్యము చేయగలను, అని కొండవలె నున్న తన దేహమును హనుమంతుఁడు తత్క్షణమే చిన్నదిగాఁ జేసెను.

ఆ. వీతమోహుఁ డగుచు•వెలసిన యాత్మజ్ఞు, పోల్కి స్వస్వరూప•మునుధరించె
బలిని నడఁగఁ ద్రొక్కి•ప్రబలు త్రివిక్రముఁ, డాత్మరూపధారి•యయిన యట్లు.

అర్థములు. వీతమోహుఁడు=అజ్ఞానము వదలినవాఁడు, ఆత్మజ్ఞు పోల్కి=ఆత్మజ్ఞానము కలవానివలె.

తాత్పర్యము

ఆఱడుగుల పొడుగుగల యీ దేహమే నేనను నజ్ఞానము కలవాఁడు ఆత్మలక్షణ మెఱిఁగి యీ దేహము నేను గాను, నే నణుస్వరూపుడను అని తనయథార్థస్వరూపజ్ఞానమున నిలిచినట్లు త్రివిక్రమావతారంబున బలినణఁగఁద్రొక్కి విష్ణువు మరలఁ దన స్వరూపమును గ్రహించినట్లు హనుమంతుఁడు తన స్వస్వరూపమును ధరించెను.

ఉత్సాహము. చారువివిధరూపధారి•సాగరప్రతీరమున్
జేరి దుర్జయుండు పూని•నైజరూపుఁ గార్యమున్
సారె దలఁచి తనదురూపుఁ • జిక్కఁ జూచి కేతకే
లారుహాళి సొంపు నింపు • లంబభూధరంబునన్. ౧౩౧

అర్థములు. చారు వివిధరూపధారి=మనోహరమై యనేక విధములైనరూపములు ధరించువాఁడు, ఇచ్చటనేగాక యింతకుఁ బూర్వము కూడ హనుమంతుని రూపము సుందర మనియే చెప్పఁబడెను. హనుమంతుఁడు సుందరుఁడగుటను, సీతాదేవి సుందరి యగుటచే సుందరశ్చే, సుంగరీచ=సుందరాయని యేకశ్లేష చే వీరికి సంబంధించినది కావున దీనికి సుందరకాండ మని పేరు పెట్టఁబడెనేమో! సాగర ప్రతీరమున్=సముద్రపు టావలి యొడ్డును 'ప్రతిముఖే స్థితం తీరం ప్రతీర'మ్మని వ్యుత్పత్తి. దుర్జయుఁడు=జయింపరానివాఁడు, నైజరూపు=తన సహజస్వరూపమును కేతక ఇలారుహాళి=మొగలిచెట్లు, లంబ భూధరంబునన్ = లంబపర్వతమునందు

ఉత్సాహమునకు నేడు సూర్యగణములు, నొక గురువు. ఐదవ గణము మొదటి యక్షరము యతి. హనుమంతుని యుత్సాహము దెలుప నుత్సాహము వ్రాయఁబడెను.

పంచచామరము. సుకూటవాటికాగ్రసీమఁ • జూచి దూఁకి యొడ్డునన్
త్రికూటభూధరాగ్రసీమ • దేవతాధిరాట్పురీ
నికాశమైన లంకనున్ వ•నీసమూహరాజి పా
వకాత్మమిత్రపుత్రుఁ డప్డు•పాఱఁజూచెఁ జక్కఁగన్. ౧౩౨

అర్థములు. సుకూట వాటికాగ్ర సీమన్=మంచి శిఖర ప్రదేశముల కొన యందు, దూఁకి=దుమికి, ఆకాశమునుండి, త్రికూట భూధరాగ్ర సీమన్=త్రికూట మను పర్వతము యొక్క పై భాగమందు, దేవతాధి రాట్ పురీ నికాశము= ఇంద్రుని పట్టనముతో సమానము, వనీ సమూహ రాజిన్=వన సమూహములచేఁ బ్రకాశించు దానిని.

తా త్ప ర్య ము

మంచి శిఖర ప్రదేశముల కొనను జూచి యొడ్డున దూఁకి త్రికూట పర్వతము కొన యందు దేవేంద్రు పట్టనముతో సరియైన వనసమూహములచేఁ బ్రకాశించు లంకను హనుమంతుఁడు పాఱఁజూచెను.

పంచ చామరమునకు జర జర జగలు, తొమ్మిదింట యతి, రామార్థమై సముద్రలంఘనము చేసిన మహానుభావునకుఁ బంచచామర సేవ కవి చేసెను.

—• ౨-వ సర్గము. హనుమంతుఁడు లంకాపురి వెలుపలి యుద్యానంబుల విహరించుట •—

క. తరియింపరానిరత్నా, కరముం దరియించి సుఖము•గాఁగఁ ద్రికూటో
ద్ధరశిఖరాగ్రంబునఁ గే,సరిసూనుఁడు లంకఁ గాంచి•స్వస్థత నొందెన్. ౧౩౩

తా త్ప ర్య ము

దాఁటుట కితరులకు సాధ్యముకాని సముద్రమును సుఖముగా, దాఁటి త్రికూట పర్వత శిఖరంబున నుండు లంకఁగాంచి హనుమంతుఁడు కుదుటఁబడిన మనస్సుగల వాఁడయ్యెను.

హనుమంతుఁడు సముద్రమును నాకాశమార్గమున లంఘించెనని స్పష్టముగ రామాయణము చెప్పుచున్నను నెగిరి దాఁటలేదు, ఈది పోయినాఁడని వాదించు మూఢులుకూడఁ గలరు.

క. లలితోద్యానస్థలముల, జలజలఁ బయి రాల్చు భూజ•సంతానము పు
వ్వులు వలపులు వెదచల్లుచుఁ, బొలిచె న్వానరవరుండు•పుష్పమయుండై. ౧౩౪

అర్థములు. లలిత+ఉద్యానస్థలములన్=మనోహరములయినతోఁటలయందు,

భూజసంతానము=చెట్లసమూహము, భూజ (సీత) యొక్క దుఃఖము బాపుటకై పోవు హనుమంతునిమీఁద భూజ సంతతి=పుష్పములు, చల్లుట సముచితమే కదా, వలపులు=వాసనలు.

తాత్పర్యము

అరబయలఁ దిరిగిన రాక్షసులు చూతురను తలంపుతో నుద్యానవృక్షముల మాటునఁదిరుగుచున్న యాంజనేయునిపై వృక్షములు జలజల పూవులు రాల్పఁగా వాని సువాసనల వ్యాపింపజేయుచుఁ బూలతో నిండినవాఁడై యాయన యొప్పుచుండెను. పుష్పాభిషేకము శుభసూచకమే.

క. ఇట్టులు నూఱామడ యొక, పెట్ట నడిం దాఁటి బాహు•విక్రమపరుఁడై
నిట్టూర్పైనను విడువఁడు, కొట్టఁబడఁడు గాసిఁ గీశ•కుంజరుఁ డంతన్. ౧3॥

తాత్పర్యము

ఈ ప్రకారము నూఱుయోజనము లొక్కసారిగ నడుమ విశ్రమింపక బాహుబలముచేతనే వేగముగ దాఁటి హనుమంతుఁడు హుస్సబ్బాయని నిట్టూర్పైన విడిచిన వాఁడు కాఁడు. అలసిన వాఁడును గాఁడు. హనుమంతుఁడు నూఱు యోజనముల సముద్రమును దాఁటెనని స్పష్టముగ రామాయణమునఁ గలదు.

ఇప్పుడు సముద్రమంత వెడలుపు లేదు. కావున రావణాసురుని లంక యిది యగునా యని కొందఱ సందేహము.

**"There is a place called *Vikumbhila* about 40 mills from Colombo. It is associated with a Jagna or sacrifice performed by *Indrojit*. The Asoka forest of Ravana where Sita is kept is still in existence and I was told by a Brahman of Jaffna that there is an image of Sita, which is still worshipped. There is a rock in the waters ar Point-de-Gallh which goes by the name of Ravana Kotta-" D. N. Gangli's trip to Colombo.**

**Buddhist Text Society's Journal Vol. III Pt. I Ap. 2.**

దీనివలన నింద్రజిత్తు హోమము చేసిన నికుంభిలయు సీతాదేవి యుంచిన యశోక వనము నేఁటికి నున్నట్టును నందు సీతాదేవి పూజింపఁబడుచున్నదనియు రావణకోట యను స్థలమున్నట్టు స్పష్టమగుచున్నది. దీనివలన నిప్పటి సింహళ ద్వీపమే మునుపటి లంకయని నమ్మఁదగి యున్నది.

ఇప్పుడు సింహళ ద్వీపమునకు మన దేశమునకు నడుమ సముద్రము వెడలుపు అఱువది మైళ్ళే యున్నది. నూఱు యోజనము లెక్కడ? అఱువది మైళ్ళెక్కడ యని సందేహము బాధింపకపోదు. యోజనము కొలతఁ యెంతైనది నిష్కర్ష లేక యున్నది. కొన్ని చోటుల నాలుమైళ్లు, కొన్నిచోటుల నెనిమిదిమైళ్లు, కొన్ని చోటుల రెండున్నర మైలున్నట్టు కొందఱు వ్రాసి యున్నారు. తెనుఁగున ఆమడయు కొన్ని దేశములఁ బదిమైళ్లు, కొన్ని మండలముల నెనిమిది మైళ్లకొలతగల్గదై

యున్నది. క్రోశమిట్టిదేయై యున్నది. ఇప్పటిమైళ్ళు (1760 గజములు మైలు అను పరిమాణము) గలవి పూర్వమందు లేవు. కావున యోజనమున కిన్ని మైళ్ళని నిర్ధారింప సాధ్యము కాకున్నది. ఇప్పుడు సముద్రము అఱువది మైళ్ళే యన్నను రామాయణ కాలమున సముద్ర మింత మాత్రమే కాదు. ఇప్పటి మధురకుఁ గొంచెము దూరములోనే దక్షిణమున సముద్ర ముండినది. సముద్రభాగము విశేషముగఁ బూడి యిప్పుడు నేలయైనది యని తచ్ఛాస్త్రవేత్తలు వ్రాసియున్నారు.

**"It thus appears that rocks and islets and fordable shoals existed in the channel, even at that time. The feat of connecting the gaps to construct a cause-way was not impossible with Sugriva, who had almost all the resources of Southern India at his command"**

ఇప్పటి రఘునాథపురమునకు దక్షిణభాగమంతయుఁ బూర్వము సముద్రముగానే యుండెను. కావునఁ సుగ్రీవుఁ డంగదాదులకుఁ జెప్పునపుడు "పాండ్యకవాటావనిఁ బరికింపుఁడీ" యని చెప్పి వెంటనే 'వననిధి తీరముం గదిసి" యని చెప్పెనుగాని యడవులఁగాని కొండలఁగాని యూళ్ళఁగాని చెప్పినవాఁడు కాఁడు. మఱియొక విషయము. తూర్పుననుండు దీనితో సమానముగ బడమట నుండు నిప్పటి మళయాళ దేశము తిరువాన్కూరు లోనైనది సముద్రమున మునిఁగియుండెననియు బరశురాముఁడు కోరఁగా సముద్రుఁ డా ప్రదేశమును నాయన కిచ్చెననియుఁ బురాణములఁ గలదు. కావున నిప్పటి తిరువాన్కూరు పూర్వము సముద్రములో మునిఁగియుండెనేని యిప్పటి తిరునల్వెల్లి, మధురమండలమున దక్షిణభాగమున సముద్రమున మునిఁగియుంకుట యేమిచిత్రము? అదియును గాక రామాయణమునఁ జెప్పఁబడిన త్రికూటము, లంబపర్వతము సువేల యనునవి లంకకు దక్షిణభాగంబున నున్నవికాని యుత్తర భాగంబున లేవు. కావున నిప్పటి లంకయందలి యుత్తరభాగముకూడ సముద్రమున మునిఁగియే యుండవలెను. లేదా హనుమంతుఁ డీ ప్రదేశమును విడిచి చక్కఁగా వచ్చుటకైనఁ బోయియుండవలెను. ఈ పర్వతముచుట్టు సముద్రము చెప్పఁబడెనేకాని నేల గ్రామము లున్నట్టు వాల్మీకి చెప్పలేదు. సువేల యను పదమే సముద్రతీర దేశమని తెలుపుచున్నది. లంకయందలి యిప్పటి యుత్తరపు రేవునకుఁ ద్రికూటమునకు నూఱు మైళ్ళకుఁబైగా నున్నది. కావున హనుమంతుఁడు దాఁటినది రెండువందల యేఁబది మైళ్ళని యేర్పడుచున్నది. కావున నూఱు యోజనము లనఁగా రమారమి రెండు వందల యేఁబదిమైళ్ళని గ్రహింపనగు. దీనివలన నిప్పుడు మహేంద్రనగరము రామాయణమునకు సంబంధించిన మఱి కొన్ని ప్రదేశములు తీర్థవాసులచేఁ జూపఁబడునవి కృత్రిమము లని స్పష్టపడుచున్నది. ఇచ్చట నింకొక విషయ మాలోచింప వలసియున్నది. అకంపనుఁడు శూర్పణఖ లోనగు రాక్షసులు లంకకుఁ బోవుచు వచ్చుచు నుండిరి. రావణుఁడు పంచవటి నుండి లంకకు బోయెను. వీరి కార్యము

ప్రశంసింపఁబడలేదు. హనుమంతుని కార్యము మాత్రము ప్రశంసింపఁబడుచున్నది. ఏల?

రాక్షసులు స్వభావమునఁ గామచారులు. వారు విద్యాబలముచేఁ బోవుచు వచ్చుచుండిరి. అది గొప్ప కార్యముకాదు. హనుమంతుఁడు కేవల భుజబలముచేతనే దాఁటినవాఁడు అని రామాయణమునఁ జెప్పఁబడెను. కావున నిది ప్రశస్తము. రావణాసురుఁ డొక ముసలి గ్రద్ద యుద్ధము రాఁగానే తికమకలాడెను. హనుమంతుఁడు మూఁడు గండములు తప్పించుకొనెను. హనుమంతుఁడు సంజీవనికై పోయిన దూరము చూచినపు డిది యొక లెక్కగాదు. తరువాతఁ జేసినది యసాధ్య కార్యము.

ఉ. ఆమడ లెన్నివే లయిన • నశ్రమలీలఁ దరింప నేర్తు నూ
ఱామడ యేమి లెక్క యని • యాత్మ దలంచుచు మంజువాసనా
స్తోమము నింపుతోఁటలును • జొక్కపుఁబచ్చిక పట్లు స్వల్పపుం
భూమిధరంబులు న్గనుచుఁ • బోయి నగాగ్రమునుండి కన్గొనెన్. ౧౩౬

అర్థములు. మంజువాసనాస్తోమము=మనోహరమైన పరిమళముల సమూహము.

తాత్పర్యము

ప్రయాసము లేక యెన్నివేల యామడ లయిన దాఁటఁగలను. నూఱామడ లక్ష్యమా యనుకొనుచుఁ బరిమళించు తోఁటలును నిర్మలమైన పచ్చిక ప్రదేశములను జిన్న చిన్న గుట్టలను జూచుచుఁబోయి హనుమంతుఁడు కొండమీఁది నుండి చూచెను.

ఉ. గోఁగులు దేవదారులును • గొండవిసెల్ చిటునిమ్మ మల్లియల్
రేఁగు లరంట్లు గన్నెరులుఁ • బ్రేంకణముల్ కడుముల్ మొగళ్ళునున్
వీఁగఁగ బూచి కాచి యక • విచ్చిన మొగ్గలఁ బూపపిందెలన్
వ్రేఁగున నేలఁ బ్రాఁకు పృథి • వీరుహపాళులు నాటతోఁటలున్. ౧౩౭

అర్థములు. పూప పిందెలు=లేఁతపిందెలు, వ్రేఁగున=బరువుచే, పృథివీరుహపాళులు=చెట్లవరుసలు, ఆటతోఁటలు=ఉద్యానవనములు; (తాత్పర్యము, స్పష్టము)

క. రెమ్మలుఁ గొనకొమ్మలుఁ బవ, నమ్మునఁ జలించు నవియు • నవ్యములు శకుం
తమ్ములు నిండఁగఁ గడుహృ, ద్యమ్ములునగు పాదపముల • హనుమఁడుగాంచెన్.

అర్థములు. శకుంతమ్ములు=పక్షులు, కడున్=మిక్కిలి, హృద్యమ్ములు=మనోహరములు, పాదపములన్=చెట్లను.

తాత్పర్యము

గాలికిఁ గదలు రెమ్మలు కొనకొమ్మలు క్రొత్తలై చూడ నింపైన పక్షులు గల వృక్షముల హనుమంతుఁడు చూచెను.

హనుమఁడు=హనుమచ్ఛబ్దతత్సమము. హనుమ, హనుమఁడు తద్భవము అనుమ, అనుమఁడు.

ఉ. అంచలుఁ గన్నెలేళ్లు♦నళినావళి కల్వలచాలు లొప్ప న
భ్యంచిత మైన డిగ్గియలు ♦ నైకవిధంబులు నాటపట్టులున్
మంచిమడుంగు లెల్లపుడు ♦ మానక పూచుచుఁ గాచు చెట్లచే
మించువనాళిఁ బద్మముల♦మేలిమి గన్న యగడ్తలుం గనెన్. ౧౩

అర్థములు నళినావళి=కమలముల గుంపులు, డిగ్గియలు=దిగుడు బావులు, నైక విధంబులు=అనేక విధములగు.

తాత్పర్యము

హంసలు, కన్నె లేళ్లు కమలములు కలువలు గల దిగుడు బావులును అనేక విధములైన క్రీడాస్థములును మంచి మడుఁగులు, ఎప్పుడు పూచు కాచు చెట్లు గల తోఁటలు కమలములచే నిండిన యగడ్తలు హనుమంతుఁడు చూచెను.

సీ. సీతను బ్రుచ్చిలిం♦చినకారణంబున, రావణుం డెంతయు♦రక్ష నునుప
నెల్లచోటుల మార్గ♦ణేష్వాసపాణు లై, నడయాడు రాక్షస♦నాయకులును
గనకమయంబు ప్రా♦కారంబు చుట్టంగ, గ్రహముల శారదా♦భ్రముల నెనయ
నగుగృహంబులు పాండు♦రాంచత్ప్రతోళులు, నట్టశతము వైజ♦యంతిపంక్తి
తే. వింత లగు పైడి తీఁగల♦వేడ్కఁ గొలుపు, తోరణంబులు గలిగి ని♦స్తుల్యమగుచు
గగనమున స్వర్గ మనఁగ లం♦కాపురంబు, కొండశిఖరంబు పేటున♦నుండుకతన.

అర్థములు. మార్గణ+ఇష్వాస+పాణులై =బాణములు విండ్లు చేత ధరించిన వారై, నడయాడు=సంచరించు, శారదాభ్రముల = శరత్కాలమేఘములను, ఎనయు=సరిపోవు, పాండుర=తెల్లని, అంచత్=ప్రకాశించు, ప్రతోళులు = పెద్ద వీథులు, అట్టశతము=ప్రాకారములపై యుద్ధార్థము కట్టఁబడిన యెత్తుప్రదేశము లనేకములు, వైజయంతి పంక్తి=టెక్కెముల వరుస, పైడితీఁగలన్=తీఁగలవంటి బంగారు రేఖలచే.

తాత్పర్యము

సీతను దాను దొంగిలించి తెచ్చిన కారణముచే రావణుఁడు మిక్కిలిఁ గాపుంచఁగా సమస్తప్రదేశముల విల్లు బాణములు ధరించి తిరుగు రాక్షసశ్రేష్ఠులును బంగారు మయమైన ప్రాకారము చుట్టుకొనఁగా గ్రహములను శరత్కాల మేఘములను బోలు నిండును తెల్లని పెద్దవీథులును,నూర్లకొలఁది యట్టములును వానిమీఁద ధ్వజములును తీఁగలవలె బంగారుతోఁ జేయఁబడినతోరణములుగలదై యసమానమై యాకాశమున వ్రేలు స్వర్గమో యన్నట్టు లుండు లంకాపురము కొండశిఖరము పేటున నుండుటచే.

అయోధ్యకు సాకేత మను పేరు లంకకు సింహళ మను పేరు ఇటీవల వచ్చినవేకాని ప్రాఁతపేర్లుకావు. లంకకు సింహళమను పేరువచ్చిన కారణము, అది యిప్పుడు సిలోన్ అయిన కారణ మిట్లు చెప్పఁబడెను.

"In the seventh century of our era, Ceylon was known by the name of Seng Kia-lo or Sinhala, which was said to be derived from the lion-descended Sinhala. Whose son Vijaya is fabled to have conquered the island on the very day of Buddha's death, in B. C. 543.........................Its existence was first made known to the European world by the expendition of Alexander, under the name of Taprabane..................The true form however would appear to be Tambapanni or red-leaved from the Sanskrit Tampra-parni. Ptolemy calls the Island Salika (corrupt from Simhalaka). Ammianus calls it Serendives, which is the same as the Sieladiba of Kosmas, derived Sihala-dipa, the Pali form oJ Simhal dvipa. Abe Rahin gives the form Singal-dib, or Sirindib, which is the Serendie of European Sailors. From the same source came the Arabic Lilan and our own Ceylon" Cum. Geo. An. India P. 557.

—♦ హనుమంతుఁడు లంకఁ జూచుట ♦—

ఉ. వ్రేలెడి నేమొకో గగన♦వీథి నటంచు నెవ్వరేని, నీ
లీల నభంబునందు నవ♦లీలఁగ నేగుచు నున్నదేమొ నాఁ
జాలగుదాని, సంతతని♦శాచరనాయక గాఢరక్షితం
బై లలి మీఱు పట్టణవ♦రాద్యము దుర్గచయానవద్యమున్. ౧౮౧

అర్థములు. సంతత=ఎడఁదెగక, నిశాచరనాయక=రావణుచే, గాఢ= మిక్కిలి, రక్షితంబు=కాపాడఁబడునది, పట్టణవరాద్యము=శ్రేష్ఠమైన పట్టణములందు మొదటిది, దుర్గచయ=కోటల సమూహములచే, అనవద్యము = లోపము లేనిది.

తాత్పర్యము

ఆకాశమున వ్రేలాడుచున్నదో, యాకాశమున నవలీలగా నెగిరిపోవుచున్నదో యన్నట్టులుండు దానిని, రావణుఁడు విడువని కాపు పెట్టుటచే రక్షింపఁబడుచుఁ గోటల లోపము లేక గొప్పపట్టణములందు మొదటిదని యెంచఁబడఁదగిన దానిని.

క. తొలుదొల్తఁ గుబేరునకున్, నిలయంబై యున్నదని♦నెఱి యిట్లనుచున్
దలఁపున నైనను నెన్నఁగ, నలవిపడనిదాని సుకృత♦మై స్పష్టంబై. ౧౮౨

అర్థములు. తొలుదొల్తన్=మొట్టమొదట, నిలయము = వాసస్థానము, నెఱిన్=అందమునందు, సుకృతమై=చక్కఁగా నిర్మింపఁబడినదై, విశదమై.

తాత్పర్యము

తొలుత విశ్వకర్మచే నిర్మింపఁబడి కుబేరునకుఁ దొలుత వాసస్థానమై యందమున నిట్టిదని మనస్సుచేనైన నూహింపరానిదై యున్నదానిని.

క. ప్రాకారజఘనయును న, స్తోకజలనవీనపటయు ♦ శూలగురుశత
ఘ్నీకుంతలపాశయు న,ట్టాకలితవతంస యగుచు♦నంగనకరణిన్. ౧౮౩

అర్థములు. ప్రాకార జఘన=ప్రాకారమనెడి మొలగలది. అస్తోక=అధికమైన, జల=అగడ్తయందలి నీళ్ళనెడి, నవీనపటయు=క్రొత్తచీరగలది, శూల గురుశతఘ్ని కుంతలపాశయు=శూలములు గొప్పశతఘ్నులనెడి కొప్పుగలది, పాశ శబ్దము క్షుత్రాది శబ్దములకుఁ బరముగా నుండెనా నిందను దెలుపును. క్షుత్రపాశుఁడనఁగా క్షుత్రియాధముఁ డని యర్థము, కర్ణశబ్దము పై నుండెనేని బంగారు సొమ్మని యర్థము. కర్ణపాశము అనఁగా కర్ణభూషణము, కచము కేశము కుంతలములకుఁ బరముగా నుండిన కొప్పని యర్థము. కచపాశము, కేశపాశము, కుంతలపాశము అనఁగాఁ గొప్పు, అట్ట+ఆకలిత+వతంస = అట్టములచేతఁ జేయఁబడిన శిరోభూషణము గలది. అట్టములే శిరోభూషణము లని భావము. ఇట్టి దగుటచే స్త్రీవలెను నున్నదని భావము.

తాత్పర్యము

కోట గోడ యను మొలయు దానిని జుట్టి యగడ్తల నీళ్ళనెడి చీరయు శూలములు శతఘ్నులు అనెడి కొప్పును అట్టము లనెడి శిరోభూషణము గలిగి స్త్రీవలెనై.

ఉ. తీరుప విశ్వకర్మయు మ♦దిన్ సురవైరులచేత వాయుభు
గ్వారముచేత భోగవతి♦కైవడి నొప్పు పురంబు నుత్తర
ద్వారముఁ జేరి రౌప్యధర♦తద్విధి మింటిని రాయు నున్నతా
గారము లొప్పు భీకరవి♦కారసురారిచమూసమూహముల్. ౧౪౪

అర్థములు. తీరుపన్=నిర్మాణము చేయఁగా, వాయుభుక్+వారము=పాముల సమూహము, భోగవతి=పాతాళములోని సర్పముల ముఖ్యపట్టనము, రౌప్యధర తద్విధిన్=వెండికొండవలె, ఉన్నతాగారములు=ఎత్తైన యిండ్లు, భీకర=భయము కలిగించు, వికార సురారి=అసహ్యములైన రూపములు గల రాక్షసుల, చమూసమూహముల్=సేనల గుంపులు,

తాత్పర్యము

విశ్వకర్మ నిర్మింపఁగాఁ బాములచే నిండిన భోగవతివలె రాక్షసులచే నిండిన లంకానగరము నుత్తర ద్వారముఁ జేరి కైలాస పర్వతమువలె నాకాశమును దాఁకుచున్న యెత్తైన యిండ్లు గలిగి భయంకరాకారములు గల రాక్షస సేనా సమూహములు.

ఉ. పట్టిసశూలపాణు లయి ♦ పాములు పెన్గుహఁ గాచు భంగిగా
నెట్టన కాచులంకను వి♦నిర్మలమై సొబగారు లంకకున్
బెట్టనికందకం బనఁగఁ♦బేర్మి నెసంగు మహార్ణవంబునున్
జుట్టును జూచి నిర్భరని♦షూదను రావణుశౌర్య మెంచుచున్. ౧౪౫

అర్థములు. పట్టిస శూల పాణులయి=అడ్డకత్తులను శూలములను జేతియందు

ధరించి, పెట్టని కందకంబు=మనుష్యులు నిర్మింపని యగడ్త, మహార్ణవము=పెద్ద సముద్రము, నిర్జర నిషూదను=దేవతల హింసించిన వానియొక్క.

తా త్ప ర్య ము

చేతులందు ఖడ్గకత్తులు శూలములు ధరించి పాములు గుహానుగాచు విధముగ రాక్షసులు కాచుచున్న లంకను, దానికి మనుష్యులు నిర్మింపని యగడ్తయై చుట్టియుండు పెద్ద సముద్రమును జూచి దేవతల జయించిన రావణుని శౌర్య మింతటిదిగదా యని తలంచుచు తనలోఁ దానిట్లనుకొను చున్నాఁడు.

—♦ హనుమంతుఁడు లంకను జూచి నివ్వెఱఁగొనుట ♦—

క. ఏలీలఁ గపులు వత్తురు, వాలాయము వచ్చి రేని ♦ వ్యర్థశ్రమ లై
తూలఁగలవారు తరమే, యీ లంకన్ వేల్పుగముల♦కేనియు గెలువన్. ౧౭౬

అర్థములు. వాలాయము=నిర్బంధముగ.

తా త్ప ర్య ము

ఈలంకకు వానరులందఱు నేవిధముగ రాఁగలరు. ఇంత సముద్ర మందఱు దాఁటి రాగలరా? ఒకవేళ నిర్బంధముగా రాఁగలరని తలంచినను వారి ప్రయాసము వ్యర్థమై వారు చిన్న పోవలసినవారే. ఏలన నీ లంక దేవతాసమూహముల కైన గెలువ సాధ్యమా? కాదు.

క. అనుపమబలుఁ డా రాముఁడె, చను దెంచియు నిటకు నేమి♦చలుపం గలుగున్
ఘనదుర్గము విషమము రా, వణపాలితమైన నగర♦వర్యము లంకన్. ౧౭౭

తా త్ప ర్య ము

వానరుల మాట యటుండ నీ యసమానబలుఁ డగు రామచంద్రమూర్తియే యిచ్చటికి వచ్చిన వాఁడనుకో, వచ్చి ప్రవేశింపరాని సంకట స్థలమందుండి రావణుఁడు రక్షించు లంక నేమి చేయఁగలడు?

ఉ. మంచితనంబుమాటలకు♦మానుగ లే దవకాశ మేనియున్
లంచము లిత్త మన్న విఫ♦లంబ యగున్, మఱి వారిలోనఁ గ
ల్పించి పరస్పరంబుఁ గడు♦వేఱిమి చూడ నసాధ్య, మెంత యో
జించిన రాక్షసావళులఁ ♦ జివ్వను గెల్వ నశక్య మేరికిన్. ౧౭౮

అర్థములు. అవకాశము=ఎడము, వేఱిమి=భేదము. చివ్వను=యుద్ధమందు.

తా త్ప ర్య ము

మనలో మనకేల విరోధము సీత నీయుఁడని మంచి తనముగా మాటలాడుటకు సందు లేదు. మంచిమాటలకు వీరు చెవి నిచ్చువారు కారు. ఏలన బలమదోన్మత్తులు సామమునఁ జిక్కబడుదురా? అదిగాక దానముచే వశపఱచుకొంద మనిన లంచము లిచ్చుటయు వ్యర్థమే. ఏలన ధనకాంక్ష గలవారుగదా లంచము

లాశింతును. వీరి కైశ్వర్యము పుష్కలముగా నున్నది. ఒకరి డబ్బుతో వీరికేమి పని? ఒకవేళ యిత్తమన్నను నింతకంటె నెక్కువ యైశ్వర్యము రామచంద్రు నొద్ద నేమి గలదు? అటుగాకున్న భేదోపాయముచే వారిలో వారికిఁ గలహము పెట్టుద మన్న నదియు నసాధ్యమే. ఏలన భేదములు కల్పించుటకువారి మర్మములు లోపా లోపములుముందు తెలియవలె. వారిలోఁ గొందఱు పరిచితులుకావలె.వీరిమర్మము లెఱుంగు టెట్లు? అవి తెలిసికొనుటకు వీరిలోఁ గలసిమెలసి యుండుటెట్లు? అది యెన్నాళ్ళ కార్యము? నన్ను జూడఁగానే యందఱు నేకకలహమునకు వత్తురే కాని యూరక యుండ నిత్తురా! కావున భేదోపాయము వ్యర్థమే. పోనీ యుద్ధ ములో గెల్తమనిన నెంత యోజించినను నదియు సాధ్యముకాదు. ౧౦౦౬.పద్యము సూచునది. క్రమక్రమముగ నభిప్రాయ మెట్లు మాఱెనో తెలియును.

క. నీలుం డంగదుఁ డేన్ మతి, శాలి ప్రభువు సూర్యసుతుఁడు•జలనిధి దాఁటం
గా లంకాపురిఁ జేరఁగ, జాలెద మా మాత్ర నేమి•సాధ్యము సేయన్. ౧౪౯

తాత్పర్యము

ఏ యుపాయము చేయుటకైన నిచటికి రాఁగల వారెవ్వరు? నీలుఁడు, అంగ దుఁడు, నేను, బుద్ధిశాలి ప్రభువు సుగ్రీవుఁడు యీనలుగురము సముద్రము దాఁట గలము. లంకకు రాఁగలము ఈ నలుగురితో నే కార్యము కాగలదు?

క. ఇంతకు శ్రీరఘురాముని, కాంతామణి జీవయుతయొ•కాదో యా వృ
త్తాంత మెఱిఁగి సీతను గని, చింతించెదఁ గాక యవలి•చేఁత లెఱుంగన్. ౧౫౦

తాత్పర్యము

ఇంతకు నీ లంకను సాధించు నుపాయ మిప్పుడాలోచించి మేమి చేయను ఇందు సీత యున్నదో లేదో, ఉండినఁ బ్రాణముతో నున్నదో లేదో? ఆ విష యము నిశ్చయము చేసికొనికదా యావల సీతాదేవి యిందుండిన లంక సాధించు నుపాయ మాలోచింపవలె. ఇప్పుడు నేను జేయవలసిన యాలోచన యదికాదు. సీతాదేవి నెట్లు చూతునా యాలోచింపవలె. ఆ నిమిత్తమై లంకలో నెట్లు ప్రవే శింపవలె. ఇది నేను జేయవలసిన యాలోచన.

—♦ హనుమంతుఁడు లంకలోఁ జొచ్చు నుపాయంబు యోజించుట ♦—

సీ. ఎటులు ప్రవర్తింప•నెంతయు మేలగు, రాముని కార్య మా•క్రమముఁగూర్చి
శృంగాగ్రసీమ నా•సీనుఁడై యొక్క ముహూర్తంబు చింతించి•యుగ్ర మిట్టి
రూపంబుఁ దాలిచి•క్రూరరాక్షసమహా, వాహినీగుప్తమై•పఱలు లంకఁ
జొఱఁగ నసాధ్యంబు•సురవైరు లందఱు, వీర్యవంతులు మహా•భీమబలులు

తే. జానకిని రోయుచోట నీ•సర్వదైత్య, తతుల వంచించి విదితావి•దితము లైన
వేషములఁ గొని మాపటి•వేళ యందుఁ, జొచ్చి కార్యంబుఁ దీర్పఁగ•వచ్చు నాకు.

అర్థములు. మహావాహినీ గుప్తము=గొప్పసేనచే రక్షింపఁబడినది, విదితావిదితములు=వెలికిఁ దెలియవచ్చునవి తెలియరానివి.

తా త్ప ర్య ము

నేనే యాలోచన చేసినను రామచంద్రమూర్తి కార్యము మేలగునో యట్టి యాలోచన చేయవలె. ఆ విధముగా నడువవలె. అది యెట్లగునా యని శిఖరము కొనభాగమునఁ గూర్చుండి కొంచెమునే పాలోచించి లంకలోకిఁ బోక తప్పదు. ఎట్లు పోదును? ఈ భయంకరరూపముతోఁ గ్రూరులగు రాక్షసుల సేనలచే రక్షింపఁబడు లంకఁ బ్రవేశించుటే యసాధ్యమగును. నన్నుఁ జూడఁగానే కలహమునకు వత్తురు. లోనలికి రానిత్తురా? రానీయరు. జయించి పోద మనిన నందఱు రాక్షసులు మహా బలపరాక్రమములు గలవారు. కావున బహిరంగముగాఁ బోవుట నీతిగాదు. వీరికిఁ దెలియ రాకుండునట్లు వీరిని వంచించి లోపలికిఁ బోయి కానఁబడవలసిన చోటఁ గానఁబడుచు, గానఁబడరాని చోటులఁ గానరాక యుండు వేషముల ధరించి రాత్రివేళ కార్యము చక్కఁ జేసికొనుట బాగు.

వాలివధ విషయమున రామచంద్రు నధిక్షేపించు మహానుభావులు హనుమంతుఁడు పిఱికి, మోసగాఁడు, దానివలన నిట్టి కుట్రాలోచన చేసెను. పౌరుషశాలియైన బహిరంగముగా నున్న రూపునఁ బోఁడా యని యేలొకో యింకను నాక్షేపింప కున్నవారు. ఈ విషయము ముందు వ్రాయఁబడును.

మ. అని చింతించు, దురాసదం బయినదై త్యాధీశు తత్పట్టనం
 బును దా నట్లె గనుంగొనుం, బిదప నూర్పుల్ పుచ్చుఁ బల్మాఱు, నా
 హనుమానుం డెటు కన్నుఁ బ్రామి ఖలు రక్షోధీశు. ధాత్రీసుతన్
 గనఁగా నొంటిగ నుంటిదాని, నెటు లేఁగార్యంబు సాధింతునో. ౧౫౨

అర్థములు. దురాసదము=ప్రవేశింప రానిది, ఊర్పుల్ పుచ్చున్ = నిట్టూర్పులు విడుచును, అంత సముద్రముదాటి నిట్టూర్పు విడువని వాఁడిప్పుడు నిట్టూర్పులు విడుచుటచే దానికంటె నిది కష్టతర కార్య మని యాయనకుఁ దోఁచెను. కన్నుఁ బ్రామి=కన్నులు, మూసి=మోసగించి.

తా త్ప ర్య ము

ఈ ప్రకార మాలోచించును. ప్రవేశింప సాధ్యముగాని యా రాక్షసేశ్వరు నగరమును దా నూరక తెప్పవాల్పక చూచును. చూచి చూచి మిగులఁ గష్ట కార్యమని తోఁపఁగా బలుమాఱు నిట్టూర్పులు విడుచుచు రావణాసురుని కన్నులలో నెటులు మిరపపొడి కొట్టి కన్నులు మూసి మోసగింతును. ఒంటరిగానుండు సీత నే నెట్లు చూడఁగలను. నే నెట్టు లీకార్యము సాధింపఁగలను?

క. ఏనట్టు తోఁచు పనులేన్, భానుని గనుఁగొన్న తమము పగిదిం జెడెడున్
 వానిని దేశము కాలము, జ్ఞానము లేనట్టిదూత సలుపఁ గడఁగినన్. ౧౫౩

### తాత్పర్యము

కాలదేశముల జ్ఞానములేక యేకాలమున నే దేశమున నెట్లు ప్రవర్తింపవలయునో యోచింపక పనిచేయు దూత యతని జ్ఞానహీనతచే సక్రమప్రయత్నముచే సాధ్యమని శోధించిన పనికూడ సూర్యుని యెదుట చీఁకటి చెడునట్లు చెడఁజేయును.

క. దీని నిటు సల్ప సఫలం, బౌ నని ప్రాజ్ఞులు విధించి♦నట్టిది కార్యం
బైనను జెఱుచును బండిత, మాని యయినదూత శక్తి♦మంతుఁడుగామిన్. ౧౫౪

అర్థములు. పండితమాని=పండితుఁడు కాకున్నను బండితుఁడ నని తలఁచువాఁడు.

### తాత్పర్యము

ఈ కార్య మీప్రకారము చేసినఁ దప్పక ఫలించునని బుద్ధిమంతులు నిశ్చయించి విధించిన కార్యము కూడ పండితమాని యగువాఁడు కార్యము చేయు సామర్థ్యము లేనివాఁడై కార్యమును ప్రాజ్ఞుల యాలోచనమును గూడ విఫలము చేయును. నే నెట్లు కార్యము సాధింతును? ఈ నింద నాకెట్లు రాకుండును? అని హనుమంతుఁడు మఱియు నాలోచించు చున్నాఁడు.

దూతం చైవ ప్రకుర్వీత, సర్వశాస్త్రవిశారదమ్
ఇంగితాకార చేష్టజ్ఞం, శుచిం దక్షం కులోద్గతమ్.

ఐహికాముష్మిక శాస్త్రముల నెల్ల నెఱిఁగిన వాఁడును, ఇతరుల మనస్సు నెఱుఁగుమాటలనేర్పు స్వభావము ఆకారము చేష్టలు మొదలగువాని సంజ్ఞలు నెఱిఁగిన వాఁడును, అర్థదాన స్త్రీ విషయంబులఁ బరిశుద్ధుఁడును, నేర్పరియు, సద్వంశమునఁ బుట్టినవాఁడును, నగు వానిని దూతగాఁ బంపవలెను.

'అనురక్తః శుచిర్దక్షః స్మృతిమాన్ దేశకాలవిత్ వపుష్మాన్ వీతభీ ర్వాగ్మీ దూతో రాజ్ఞః ప్రశస్యతే' అందఱయం దనురాగము గలవాఁడును, ధన స్త్రీ విషయంబుల శుచియును నేర్పరియు జ్ఞప్తిగలవాఁడు దేశకాలముల నెఱిఁగినవాఁడు చక్కని దేహముగలవాఁడు భయములేనివాఁడు మాటలయందు నేర్పరియగు వాఁడు దూతగా నుండఁదగును. ఇన్ని గుణములు హనుమంతునందుఁ గల వనుట యా యా సందర్భముల నెఱుఁగనగు. మను ౭-౬౩-౬౪ శ్లో.

సీ. కార్య మేరీతిని♦గావింప మే లగుఁ, దెలివి పాయక యెట్లు♦దీర్పఁ గలనొ
లవణార్ణవంబును ♦ లంఘించు టది యెల్ల, నే రీతి వ్యర్థమై♦యేగ కుండుఁ
జూచిరా నన్ను నీ♦సురవైరు లంతతోఁ, గాకుత్థ్స కార్యంబు♦గాకు చెందు
నసురరూపముఁ గొన్న ♦ నైన గుర్తింతురు, నరరూపములమాటఁ♦బలుక నేల

వే. రాక్షసాళికిఁ దెలియంగ♦రాక యుండు,నట్టి దొకటియు లేదు య♦థార్థమింక
గాలియైనను వీరలు♦కాన కుండ, మలయు ననుమాట కల్ల నా♦మతికిఁజూడ.

అర్థములు. కాకుచెందున్=వ్యర్థమగును.

తా త్ప ర్య ము

ఏవిధముగఁ గార్యము చేసిన నా ప్రయత్నము సఫలమగును. ఈ పగటి వేళనే ప్రవేశింతునా? రాత్రివేళఁ బ్రవేశింతునా? ఈరూపముతో బ్రవేశింతునా? రూపము మార్తునా? దీనిని వివేకము చెడకుండ నెట్లు నెఱవేర్పఁగలను? ఏవిధముగ నేను బ్రవర్తించిన సముద్రము దాటివచ్చుట వ్యర్థము కాకుండును. ఇట్లు దాఁటివచ్చిన వాఁడ నే కార్యము చేయక యెట్లుండ వచ్చును? ఇప్పుడే యీ రూపముతోనే పోదునా? నన్ను రాక్షసులు చూచిరా రాముకార్యము సీతను వెదుకుట యనునది చెడిపోవును. రాక్షసరూపము ధరించి పోదునా? లంకలోని వారందఱు వారికిఁ దెలిసినవారే. వీఁడెవఁడో క్రొత్తవాఁడు వచ్చి నాఁడని శోధించి బాధించి వాస్తవము నెఱుఁగఁ గలరు. ఇఁక మఱియొక రూపముతోఁ బోయినవారు తెలిసికొనుటయందు సందేహమేమి? ఇప్పుడు నేనే విధముగఁ బోయి నను రాక్షసులకుఁ దెలియనిదిలేదు కావున నవశ్యము తెలిసికొందురు. ఈరాక్షసు లకుఁ దెలియకుండ గాలియు లంకలో సంచరింప లేదని నా యభిప్రాయము. అంత హెచ్చరిక గలవారై యున్నారు.

క. నా యాకృతితో నిచ్చట, నే యుండినయట్లులైన•నేఁ జెడుట నిజం
 బాయనఘరామకార్య, మపాయంబును బొందుఁ గానఁ•బని యది యగునే.

తా త్ప ర్య ము

ఇప్పుడు లంకలోనికిఁ బోవలదు. ఈ రూపముతో నిచ్చటనేయుందునా? అట్లున్నను వారెవరైన నన్నుఁ గనిపెట్టుదురు. నాకు వారు గానవచ్చినప్పుడు నేను వారికిఁ గానరాకుందునా? కావున వారికి నేఁ గనబడుటే నిజము. వారిచ్చ టికి వచ్చుటే నిజము. నేను, రాముకార్యముకూడఁ జెడుట నిజము. కావున సరి యగు కార్యము కాదు.

ఉ. కావున నిర్లు గ్రమ్మెడును•గైకొని గుజ్జుప్లవంగ రూపమున్
 రావణు పట్టణంబును దు•రాపదమున్ వెసఁ జొచ్చి యందు ర
 క్షోవసథంబుల న్నెమకి • యా జనకాత్మజ, రాముకార్యసం
 భావన మీఱువాఁడ నని • పావని దాఁ దలపోసి యాత్మలోన్.        ౧౪౭

అర్థములు. ఇర్లు=చీఁకట్లు, గుజ్జు=పొట్టి, ప్లవంగరూపము=క్రోతియాకారము, రక్షోవసథంబులన్=రాక్షసులయిండ్లను, నెమకి=వెదకి.

తా త్ప ర్య ము

ఇప్పు డీ రూపముతో లంకలోనికిఁబోవుట తప్పు. ఇక్కడ నుండుట తప్పు, కావున జీఁకటి క్రమ్మినవఱకు నిందే మాటునయుండి యావలఁ బిల్లక్రోతినై సులభ ముగఁ జొరరాని, రావణుపట్టణంబునఁ బ్రవేశించి సీతను రాక్షసుల యిండ్లయందు వెదకెదను. అట్లైన రాముకార్యముచేసినవాఁడ నను గౌరవముచే నతిశయింపఁ గలను, అని హనుమంతుఁడు తనలో నాలోచించి.

తే. ఎప్పు డెప్పుడు గ్రుంకునో ♦ యీదినేశుఁ
డెప్పుడెప్పుడు వై దేహి♦నేను జూతు
ననుచు నెదురు చూచుచు నుండ ♦ నస్తమించెఁ
బద్మినీబాంధవుం డంతఁ ♦ బశ్చిమాద్రి ౧౫౮

అర్థములు. పద్మినీ బాంధవుడు=సూర్యుఁడు, సూర్యుడు పద్మినీ బాంధవుఁడగుటచేతను సీతాదేవి పద్మిని యగుటచేతను నేనింక నుండిన నామె కార్యము నెఱవేఱదని తలఁచి సూర్యుఁ డస్తమించెను.

## తాత్పర్యము

ఆలోచన కుదురుటచే నిఁక నా యాలోచన కార్యరూపముగఁ బరిణమింప జేయఁ దొందర పడుచున్నాఁడు. ఎప్పు డీ సూర్యుఁడు గ్రుంకునా ఎప్పుడు నేను సీతను జూతునా యని ప్రొద్దుగ్రుంకుట కెదురుచూచుచుండగా సూర్యుఁడు పడమటి కొండపై నస్తమించెను.

౮ వ పద్యమందుఁ దూర్పు తిరిగి సూర్యునకు నమస్కరించి హనుమంతుఁడు లంక దాఁట యత్నించె ననుటచే నుదయ మేడెనిమిది గంటల ప్రొద్దైన నైయుండవలెను. అభిజిత్తునందు బయలుదేఱె నాఁడనినచో మధ్యాహ్నము నీడ ౬౧ వ పద్యమునఁ జెప్పినంత యుండఁజాలదు. పడమటి సూర్యుని జెప్పుదమా యనిన నంత నీడ పడుటకు నాలుగుగంటల ప్రొద్దైన నై యుండవలయును. తీరమున దిగి వనములందు సంచరించి కొండ యెక్కి యింత యాలోచనచేసినను ఇంకను ప్రొద్దు గ్రుంక లేదని చెప్పుటచేఁదీరమున దిగునప్పటికి నాలుగు గంటలప్రొద్దై యుండును. కావున నుదయ మెనిమిది గంటలకు బయలుదేఱి నాలుగు గంటలకుఁ దీరమున దిగెనని చెప్పవచ్చును. అటయిన నెనిమిది గంటల కాలము సముద్రము దాఁటుట యందుఁ బట్టెనని యెంచనగు. ఇందొక గంటకాలమైన విఘ్నములచే వ్యర్థమై యుండు ననుకొన్నను నేడుగంటల కాలములో రెండువందల యేఁబది మైళ్ళు ప్రయాణించెనని యెంచనగు. అనఁగా సరాసరి గంటకు సధమపక్షమున ముప్పది యాఱుమైళ్ళు పోయెనని చెప్పనగు. ఇది గొప్పగామి. మరలి వచ్చునప్పు డింత దూర మొక గంటలో వచ్చెను.

తే. సూర్యుఁ డస్తగతుండైన♦జూచి పిదప, హనుప యద్భుతగతిఁబిల్లి♦యంతరూపు
గొని ప్రదోష కాలంబున♦దనుజపురముఁ, జొచ్చెనొకగంతు వెసవైచి♦చూచెదాని.

అర్థములు. ప్రదోష కాలంబునన్="త్రిముహూర్తం ప్రదోషస్స్యా ద్భానా వస్తంగతే సతి" సూర్యాస్తమానానంతరము మూఁడు ముహూర్తముల కాలము ప్రదోష మనఁబడును. "ప్రదోషో స్తమయా దూర్ధ్వం ఘటికాద్వయ మిష్యతే" ఇది గాడమతము. చొచ్చెన్=ప్రవేశింపఁ బ్రయత్నించెను. లంకా ప్రవేశము ౧౫౮ వ

పద్యంబునఁ జెప్పఁబడును గావున నిచటఁ దత్ప్రయత్నమున దానికి సమీపమునకుఁ బోయె నని గ్రహింపవలయును.

### తాత్పర్యము

సూర్యుఁ డస్తమింపఁగాఁ జూచి పిదప హనుమంతుడు పిల్లియంతరూపము ధరించి ప్రదోష కాలంబున లంకఁ బ్రవేశించుటకై దానికి సమీపప్రదేశమునకు నొక గంతు వైచెను. అనఁగాఁ గొండదిగి నడచిరాలేదని భావము.

"భోజనం మైథునం యాన, మభ్యంగం హరిదర్శనమ్
అన్యాని శుభ కార్యాణి, ప్రదోషే నైవకారయేత్."

భోజనము, మైథునము, ప్రయాణము, తలంటు, హరిదర్శనము మొదలగు శుభకార్యములను బ్రదోష వేళ చేయరాదుకదా! ఎట్లు హనుమంతుఁ డీ కార్యము చేయఁబూనెను ?

'అర్చకాన్ పరిచారాంశ్చ, వైష్ణవాన్ జ్ఞానినో యతీన్
దాసీదాసాదికాంశ్చైవ, ప్రదోషో నతు బాధతే.'

అర్చకులను, బరిచారకులను, వైష్ణవులను, జ్ఞానులను, సన్న్యాసులను, దాసీ దాసులను,బ్రదోషము బాధింపదను నపవాదముండుటచే హనుమంతుఁడు జ్ఞానియు వైష్ణవుఁడు రామదాసుఁడు నగుటచే స్వామికార్యమందుఁ బ్రదోషబాధ యాయనకు లేదు.

—♦ హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశించుట ♦—

సీ. నలుచదరంబులై ♦ నలువొందుబాటలు, ప్రాసాదమాలావి♦రాజితములు
స్వర్ణరాజతమహా♦ స్తంభశోభితములు, శాతకుంభగవాక్ష♦సంయుతంబు
లగుచు నేడెనిమిది♦యంతస్తు లేపారు, గంధర్వనగరసీ♦కాశసౌధ
పాళులు గలిగి స♦త్స్ఫటికసుసంకీర్ణ, కనక వైడూర్యము♦క్తాప్రవాళ

తే. భూషితాసురమందిర♦పుంజ మమరఁ, జిత్రతోరణ పంక్తులు♦చెలువు మీఱ
నెపుడు సమలంకృతం బయి♦యాఢ్యశౌర్య, నిష్ఠురోదగ్రరాక్షసా♦న్వితమగుచు.

అర్థములు. ప్రాసాద మాలా విరాజితములు=ఇది బాటలకు విశేషణము= మేడల వరుసలచేఁ బ్రకాశించునవి, ఇది నాలవపాదమందలి కలిగితో నన్వయము. స్వర్ణ రాజత మహా స్తంభశోభితములు=బంగారు వెండితోఁ జేయఁబడినగొప్ప స్తంభములచేఁ బ్రకాశించు నవియు, శాతకుంభ గవాక్షసంయుతములు=బంగారు కిటికీలతోఁ గూడినవియు, గంధర్వనగర సీకాశ=గంధర్వనగరములతో సమానమైన, సౌధపాళులు=మేడల వరుసలు, గంధర్వనగరము = రత్నమయములైన గోపురముల మేడలవలె నాకాశమున నొకప్పుడు మబ్బులు కనఁబడును. అట్టి సన్నివేశమునకు గంధర్వనగర మని పేరు. అది చూచుటకు మిగుల నాశ్చర్యకరముగ నుండును

"అనేక రత్నాకృతి ఖే విరాజితే, పురం పతాకాధ్వజ తోరణాన్వితమ్,
యదాతదా హస్తి మనుష్యవాజినాం పిబత్యసృక్పూర్భరి రణే వసుంధరా."
యను వాక్యము ప్రమాణము.

అది కనఁబడె నేని భూమినెత్తుటఁ దడియును. సత్ + స్ఫటికము=మంచి స్ఫటికములతో, సుసంకీర్ణ=బాగుగా వ్యాపించిన, కనకవైడూర్య ముక్తాప్రవాళ భూషిత=బంగారు, వైడూర్యములు, ముత్యములు, పగడములు వీనిచే నలంకరింపబడిన, అసుర మందిర పుంజంబు=రాక్షసుల యిండ్ల గుంపులను, ఈడ్య=కొనియాడఁదగిన, శౌర్య=పరాక్రమముచే, నిష్ఠుర=కఠినులును, ఉదగ్ర=భయంకరులు నగు, రాక్షస=రాక్షసులచే, అన్వితము=కూడినది.

తాత్పర్యము

మేడలవరుసలచే ప్రకాశించుచు నలుచదరంబులైన బాటలును, బంగారు వెండి స్తంభములచేఁ బ్రకాశించుచు బంగారు కిటికీలు గలిగి ఏడెనిమిదియంతస్తులు గలవై గంధర్వ నగరములవలె నుండు మేడలును గలిగి స్ఫటికములు పఱువఁబడినవై బంగారు, వైడూర్యములు, ముత్తెములు, పగడములు వీనిచే నలంకరింపఁబడిన రాక్షసుల యిండ్లవరుస లొప్పుచుండఁగాఁ జిత్రములైన తోరణములు గలిగి సర్వదా యలంకరింపఁబడి శ్లాఘింపఁదగి పరాక్రమము గల కఠినులైన రాక్షసులచేఁ గూడినదై.

తే. అద్భుతంబు నచింత్య మై♦యసురనాథ
రక్షితం బైన లంకాపు♦రంబుఁ జక్కఁ
గాంచి దైన్యంబు నొందియు♦త్క్రాంతనూజఁ
గనఁగఁ గోరుట సంతోష♦కలితుఁ డయ్యె. ౧౬౧

అర్థములు. అద్భుతంబు = ఆశ్చర్యకర మైనది, అచింత్యము=ఇట్టిదని యూహింప రానిది- చక్కఁగాంచి=ఇదివఱకు దూరమునుండి చూచిన వాఁడు ఇప్పుడు సమీపమునకు వచ్చి చూచుచున్నాఁడు కావున బాగుగఁ గనఁబడెను.

తాత్పర్యము

ఆశ్చర్యకరమై యిట్టిదని యాలోచించి తెలిసికొన రానిదై రావణాసురు చేత రక్షితంబైన లంకాపురమును సమీపమునకు వచ్చినవాఁ డగుటచేఁ జక్కఁగా జూచి దీని నేమి? సాధించుట యన నేమి? ఇది సాధ్యమగునదిగాఁ దోఁపలేదేయని వ్యసనపడిన వాఁడయ్యు సీతాదేవి యిందున్నదికదా. ఆమెను నేను దర్శింపవలెఁగదా యను కోరికతో సంతోషించిన వాఁడయ్యెను.

క. కువలయ బాంధవుఁ డప్పుడు, ప్లవగునకుం దోడుపడెడి♦భావంబున నా.
భువి దివిఁ గాంతులఁ గప్పుచు,నబ్బాపురుగఁ దోఁచెంచెఁ జుక్క♦చాలులనడుమన్
అర్థములు. కువలయ బాంధవుఁడు= కలువలచుట్టము, చంద్రుఁడు.

### తాత్పర్యము

అప్పుడు చంద్రుడు సముద్రమైనాక సూర్యులవలె హనుమంతునకు దోడు పడుటకై వచ్చెనా యేమి యన్నట్లు భూమిని నాకాశమును గాంతులచేఁ గప్పుచుఁ జుక్కలనడుమఁ జక్కఁగా గానవచ్చెను. ఇది ఫాల్గుణశుద్ధ త్రయోదశీ తిథి. రాత్రి పదున్నర గంటలకాలము. ఆశ్వయుజ శుద్ధ త్రయోదశి రాత్రి యెనిమిది గంటల వేళఁ జంద్రునిఁ జూచుచు నీ వ్యాఖ్య వ్రాయఁబడెను. చంద్రబింబము నిర్మలముగా నున్నది. వెన్నెలయు శుభ్రముగా నున్నది.

తరలము. జలజకాంతియుఁ బాలడాలుబిసంబు డంబును నింబుగాఁ
  గలికిరూపునఁ గానవచ్చి ప్రకాశమానుఁడు నా శశిన్
  వలిముఖాగ్రణి సారసాకరవారిఁ గ్రీడఁ జరించు నా
  జలజసంభవు తేజి యట్టులు సంతసంబునఁ గన్గొనెన్. ౧౮౩

అర్థములు. జలజకాంతియు=శంఖముయొక్క కాంతి, పాలడాలు=పాల కాంతి, బిసంబు డంబు=తామరతూఁడు కాంతి, ఇంబుగన్=మనోహరముగా, కలికి రూపునన్=ఒప్పిదమైన యాకారముచే, సారసాకర వారిన్=తామరకొలని నీటి యందు, జలజసంభవు తేజి=బ్రహ్మవాహనము హంస.

### తాత్పర్యము

శంఖము, పాలు, తామర తూఁడు వీనివంటి తెల్లని కాంతి గలవాఁడై మనోహరరూపంబునఁ గాన వచ్చి ప్రకాశించు చంద్రుని వానర శ్రేష్ఠుఁ డగు హనుమంతుండు తామరకొలని నీటియందుఁ గ్రీడించు హంసవలె సంతోషముతోఁ గనుఁగొనెను.

తరలము-నభరసజజగ-పండ్రెండవయింట యతి. "కౌముదీ వితానము నంబర మంత వెదఁజల్లుచు విష్ణుపద మధ్యగతుండగు వంశుమతునిఁ జూచె ననియు గలదు గాన నస్తమయ పర్యంతము వెలుపల నుండియు ప్రదోషసమయమున లంకను బ్రవేశించు వఱకు చంద్రుఁడు విశేష కాంతి గలవాఁడుగా నుండెననియు, మీఁది మీఁదికిఁ బోవుచుండె ననియు, శంఖక్షీర సమాన వర్ణములు గలవాఁ డనియు, వర్ణించినందున నస్తమయమునకుఁ బూర్వమే యుదయింపని యెడల ప్రదోషసమయము (రాత్రి 4 గడియల) వఱకు మధ్యంగతుఁడుగ నుండఁజాలఁడు గాన పగ లిరువదినాలుగు గడియలకు నుదయించిన యెడ చంద్రోదయానంతరము 10 గడియలకు (రాత్రి 4 గడియలకు) ఖగోళమున మీఁది మీఁదికి రాఁగల వాఁడుగ నుండును. కాంతియు విశేషముగ నుండును గాన నదియు వసం॥ ఫాల్గున శుద్ధ త్రయోదశి యని నిర్ణయింప వచ్చును. ఒకవేళ తత్పూర్వము దశమి మొదలగు తిథులనుగాని తత్పరము చతుర్దశి మొదలగు తిథులనుగాని గ్రహించితిమా యొక విధమున వ్యవధాన మధికముగను, ఇంకొక విధమున వ్యవధానము లేకుండుటయుం

గలుగును. లంకనుండి వాయుసూనుఁడేతెంచిన మఱుదినము యుద్ధయాత్ర నిర్ణయమునకు విరోధము రాకుండ విచారించినచో నీ త్రయోదశి తిథియే యుక్తము గాన స్థిరపఱుపనైనది" (శ్రీరామ కాలనిర్ణయ బోధిని పు. ౫౯.)

### ౩-వ సర్గము.

సీ. లంబమానాంబుద♦లంబలంబాగ్రంబు, నందుండి రేయి వ♦నావళులను
జారుతోయంబుల♦శారదాబ్దప్రఖ్య, భవనంబులను నబ్ధి♦పవనములను
సాగరోపమమహా♦చటుల ఘోషంబుల, రమ్యసుద్వారతో♦రణచయముల
మందమారుతముల♦మహితజాంబూనద, మయగృహప్రాకార♦మంటపములఁ

తే. గింకిణీజాలరవములఁ ♦ గీర్తితేంద్ర
నగరనిభ మయి నిస్తుల ♦ నాగరాజ
రక్షితాహిపురాభమై ♦ రమణ మీఱు
పట్టనము జొచ్చెఁ గన్గొంచుఁ ♦ బ్రాజ్ఞవరుఁడు. ౧-౪

అర్థములు. ౧౯౯ పద్యమందు హనుమంతుఁడు లంకాప్రవేశమునకు యత్నించి పురము సమీపమునకుఁ బోయెనని చెప్పఁబడెను. దానినే విపులీకరించుచున్నాఁడు.

లంబమాన=వ్రేలాడుచున్న, అంబుద=మేఘమువలె, లంబ=దీర్ఘమైన, లంబాగ్రమునందుండి=లంబపర్వతము కొననుండి, శారదాబ్దప్రఖ్య = శరత్కాల మేఘములవంటి, భవనంబులను=మేడలచేతను, సాగరోపమ = సముద్రధ్వనితో సమానమైన,అబ్ధిపవనములను=సముద్రపుగాలిచేతను,మహాచటులఘోషంబులన్= గొప్పదై సర్వత్రవ్యాపించిన శబ్దముచేతను, రమ్య=మనోహరములయిన, సుద్వారతోరణచయములన్=మంచివాకిండ్లు తోరణములచేతను, మందమారుతములన్= మెల్లనిగాలిచేతను, మహిత=గొప్పవగు, జాంబూనదమయ=బంగారుతో నిండిన, గృహప్రాకారమంటపములన్=ఇండ్లుప్రాకారములు మంటపములచేతను,కింకిణీజాలరవములన్=చిఱుగజ్జెలగుంపుల ధ్వనులచేతను, కీర్తిత=పొగడ్తకెక్కిన, ఇంద్రనగర నిభము=అమరావతి సమానము, నిస్తుల=అసమానమైన, నాగరాజరక్షిత= సర్పరాజగు వాసుకిచే రక్షింపఁబడిన, అహిపురాభమై = భోగవతీపట్టణముతో సమానమై, ప్రాజ్ఞవరుఁడు=బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడు. ఇది కర్తృపదము.

### తాత్పర్యము

బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు రాత్రికాలమున వ్రేలాడుచున్న పర్వతమువలె దీర్ఘమైనలంబపర్వత శిఖరమునుండి వనములవరుసలను, మనోహరములైన నీళ్ళచేతను శరత్కాల మేఘమువలెఁ దెల్లనగు నిండ్లచేతను సముద్ర ఘోషముతో సమానమైన గొప్ప ధ్వనుల చేతను, ఇంపైన వాకిండ్లతోరణముల చేతను మెల్లగా వీచు గాలులచేతను, బంగారుమయములైన గొప్ప యిండ్లు చుట్టుగోడలు,

మంటపముల చేతను, చిఱుగజ్జెల రవళిచేతను పొగడ్తకెక్కిన యమరావతీ భోగవతీ పురములతో సమానమైన యందముచేత నతిశయించు లంకాపట్టణమును బ్రవేశింప నారంభించెను.

క. అలకాపురముం బోలుచు, సలలిత మై పుష్టసైన్య•సంఘుష్టం బై
కలితతటిద్ఘన మై గ, జ్జెలరవళుల మీఱె నౌర • చిత్రం బనుచున్. ౧౬-౧౭

అర్థములు. సలలితమై చక్కఁదనముతోఁ గూడినదై, పుష్టసైన్య సంఘుష్టంబై=బలసిన సేనలచే ధ్వనింపఁబడినదై, కలితతటిత్ ఘనమై=మెఱుపులతోఁ గూడిన మేఘము వంటిదై.

తాత్పర్యము

అలకాపురముతో సమానమై, యందమై బాగుగఁ బోషింపఁబడుటచే బలసిన సేనల ధ్వని గలదై, మెఱుపులతోఁ గూడిన మేఘము వంటిదై, గజ్జెల ధ్వనులచే నతిశయించి యున్నది. ఏమీ చిత్రము. ఇది హనుమంతుని స్వగతము. కవి వాక్యము గాదు.

— • హనుమంతుఁడు ప్రాకారంబునఁ జేరి యాలోచించుట —

సీ. చని యిట్లు ప్రాకార•సన్నివేశముఁ జేరి, కలయంగఁ గాంచె లం•కాపురంబు
స్వర్ణకవాటముల్ • వైడూర్య వేదికల్, గురువజ్రముక్తాశ్మ•కుట్టిమంబు
లపరంజి మెఱుగు దిం•డ్లములసోపానముల్, మింటి కెగురు మాడ్కి • మెఱయుచున్న
వరచతుశ్శాలలు•వరహంసమాయూర, కలకలార్భటులు నా•కసము నిండఁ

తే. దూర్యభూషణరవములు•తోరములుగఁ, గలిమి వస్వౌకసార నాఁ•గ్రమమైన
విబుధశాత్రవనగరంబు•పెంపునకును,మదిని హర్షించి యా పావ•మానిదలఁచు.

అర్థములు. ప్రాకార సన్నివేశము=ప్రాకార సమీపమున నున్న బయలు, వేదికల్=అరుఁగులు, గురువజ్ర ముక్తాశ్మ కుట్టిమంబులు=గొప్పవగు వజ్రములు ముత్తెములు వీనిచేతను నితరరత్నముల చేతను గట్టఁబడిన నేలలును, వరచతుశ్శాలలు=శ్రేష్ఠములై నలు దిక్కులయందు నభిముఖముగా నడుగు నెడము విడిచి కట్టిన యిండ్లు. "సంజవనం త్విదమ్ చతుశ్శాలమ్" అని యమరకోశమున చతుఃశాల శబ్దము నపుంసకముగాఁ బఠింపఁబడినను పా. చతుశ్శాలా యని లింగాభట్టీయము. ఆబంతో వా ఇతి వాక్యే బత్వమ్ అని సుధా. తూర్య=వాద్యముల,'వస్వౌకసారా=ఇంద్రపురము శక్రస్య పూర్వస్యాం దిశివై పురీ' తూర్పుదిక్కున నుండు ఇంద్రునిపురము, "వస్వౌకసార" అను పురాణ వచనము, వస్వౌకసారా శక్రస్య యామ్యా సంయమినీ తథా, సుఖా జలేశస్య, సోమస్య చ విభావతీ" యను విష్ణుపురాణ వచనము స్మరించునది.

ఇంద్రుని పట్టనము పేరు వస్వౌకసార, యముని పట్టనము సంయమని, వరు

ణుని పట్టనము సుఖ, సోముని పట్టనము విభావతి, అలకాపురిని వస్వౌకసార యను పేరుగలదు, పావమాని=ఆంజనేయుఁడు, పవమానపుత్రుఁడు = పావమాని. అపత్యార్థకతద్ధితము.

తాత్పర్యము

ఇట్లు మనస్సులో ననుకొనుచుఁబోయి ప్రాకారసమీపమున నున్న బయలు చేరి లంకాపుర మంతయుఁ బాఱఁజూచెను. బంగారు తలుపులు, వైడూర్యపు టరుఁగులు, గొప్ప వజ్రములచే ముత్యములచే నితర రత్నములచేఁ గట్టఁబడిన నేలలు, బంగారు టొఱగు దిండ్లు, శుభ్రములైన సోపానములు, ఆకాశమున కెగిరి పోవుచున్నట్లుండు బలవంతులు, హంసలయు, నెమిళ్ళయుఁ గలకల ధ్వనులు నాకాశమునిండ, వాద్యములయు భూషణములయు చప్పుడులు నతిశయింపఁగా నింద్రుని పురమనఁదగి మనోహరమైన రావణుని పట్టనము గొప్పదనమునకు మిగులి సంతోషించి హనుమంతుఁ డిట్లు తలఁచెను.

ఉ. ఎప్పుడు విచ్చుకత్తులు వహించి చరించు బలంబు గావఁగా
నిప్పురి గెల్వ శక్య మగు నే పరు లేరికి నైన బల్మిపై
జొప్పడు నంగద ద్వివిద సూర్యజ మైంద సుషేణ ఋక్షులున్
దప్పక తూఱఁగాఁ గుముద తత్కుశపర్వులుఁ గేతుమాలుఁ డేన్. ౧౬-౭

అర్థములు. బలంబు=సేన, తూఱఁగాన్=ప్రవేశింపఁగా.

తాత్పర్యము

ఒఱఁదూసిన కత్తులు చేతఁబట్టుకొని తిరుగుచున్న సేన రక్షించుచున్న యీ పట్టనము బలముచే గెల్వ నెవరికి సాధ్యముగాదు గాని దీనిని నంగదుఁడు ద్వివిదుఁడు సుగ్రీవుఁడు మైందుఁడు సుషేణుఁడు ఋక్షుఁడు కుముదుఁడు కశోపర్వుఁడు కేతుమాలుఁడు వీరు ప్రవేశింపఁగలరు. తొలుత లంకాపురిని జూడఁగానే హనుమంతుఁ డధైర్యపడి నలుగురు మాత్రము (౧౮౯ వ.) సముద్రము దాటి లంకయొద్దకు రాఁగలరని తలఁచెను. ఇప్పుడు తొమ్మిదిమంది లంకలోఁ బ్రవేశింపఁ గలరని తలఁచుచున్నాఁడు. కార్యభార మెఱుంగని మూఢుఁడు తొలుత నుత్తరకుమార ప్రజ్ఞలు పలికి తీరావలఁ గార్యము చేయవలసి వచ్చినప్పుడు వెల్లకిలఁబడును. ఆలోచనగల బుద్ధిమంతుఁడు కార్యభార మాలోచించి యీ కార్యము మనవలన నగునా యని తొలుత జంకును. కార్యము చేయక తప్పదు కావునఁ బనిలో దిగి కొంచెము కొంచెము చేయసాగి క్రమక్రమముగా ధైర్యము తెచ్చుకొని కార్యమంతయు సాధించును. ఇన్ని యాలోచనలు చేసిన వాఁడు తుదకుఁ దా నొక్కఁడే రాక్షసుల నందఱను జయించి లంక కాల్చి వచ్చెనుగదా. ఇది కార్యసాధకుల లక్షణము.

క. అని బలశాలుల వానరు, లను నెన్ని సుమిత్రసుతుం బలంబును శ్రీరా
ముని శౌర్యగరిమ దలఁచుచు, ననఘుఁడు సంతుష్టచిత్తుఁడగుచుం బిదపన్.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము లంకకు రాఁగల బలవంతు లగు వానరుల లెక్కించి లక్ష్మణుని బలము శ్రీరామచంద్రమూర్తి శౌర్యము నాలోచించి భయములేదు, వారు వచ్చిన జయింపఁగలరని సంతోషించిన వాఁడయ్యెను.

రామ లక్ష్మణులైనను నిచ్చట నేమిచేయఁగల రని యధైర్యము పడినవాని కిప్పుడు కొంచెము ధైర్యము వచ్చెను.

క. వెండియుఁ గనె మణివాసో, మండిత గోష్ఠావతంస ♦ మఱి యంత్రసభా
కాండ స్తని భూషితవే, తండగమన యట్లు వెలయు♦దశకంఠపురిన్. ౧౬౯

అర్థములు. మణివాసస్ మండిత=రత్నములను వస్త్రములచేతను నలంకరింపఁ బడినది. గోష్ఠావతంస = పశువుల కొట్టము లనెడి యలంకారముగలది, యంత్రసభాకాండ స్తని=యంత్రగృహ సమూహము లనెడి స్తనముల గలది. కావుననే; భూషిత వేతండగమన=అలంకరింపఁబడిన స్త్రీ.

తా త్ప ర్య ము

మఱియు సమీపించి పోయి మణులను వస్త్రములచేఁ గప్పఁబడినదియుఁ బశువుల కొట్టము లనెడి శిరోభూషణముల గలదియు యంత్రశాల లనెడి స్తనములు గలదియునై యలంకరింపఁబడిన స్త్రీవలె నుండు రావణుని పట్టనమును జూచెను.

లంకా నగరమును స్త్రీగా వర్ణించుట లంకాధిదేవత రాక సూచించుటకే. లంక స్త్రీవలె నున్నది గదా యనుకొనఁగానే లంక స్త్రీయై రానేవచ్చెను.

—♦ హనుమంతుఁడు లంకాధిదేవతను జయించుట ♦—

క. నవరత్నకలితశాలా, నివహనిరస్తాంధకార♦నిచయం బగు నా
దివిజారిపురముఁ జొచ్చెడి, ప్లవగు నిజాకార మూని♦లంకయుఁ జూచెన్. ౧౭౦

అర్థములు. నవరత్నకలిత=నవరత్నములతో నిర్మింపఁబడిన, శాలానివహ= ఇండ్లసమూహముచే, నిరస్తాంధకార నిచయంబు=కొట్టివేయఁబడిన చీఁకటి గుంపు గలది, నిజాకారము=తన స్వస్వరూపము.

తా త్ప ర్య ము

నవరత్నములచేఁ గట్టఁబడిన యిండ్ల సమూహములచేఁ జీఁకటి యనునది లేకుండఁ జేయుచున్న యా రావణాసురుని పురము నందుఁ బ్రవేశించు వానరుని లంకాధి దేవత లంక యను పేరు గలది తన స్వస్వరూపముతోఁ జూచెను. లంకను హనుమ చూచెను. హనుమను లంక చూచెను.

చ. కనుఁగొని కింక లంకయు వి♦కారముఖంబును ఘోరరూపముం
బెనఁగొన లేచి, యా ప్లవగ♦వీరున కడ్డము నిల్చి, గర్జలన్
నినుచుచుఁ బల్కెనోరి విను♦సిల్గక మున్నె యెవండ వీ వహో
వనచర యేమి కార్యముగ♦వచ్చితి విచ్చటికి న్వచింపరా. ౧౭౧

అర్థములు. కింకన్=కోపముచే, లంక యనునది గ్రామదేవత. గ్రామము రక్షించుచు నూరివెలుపల నుండును.

తాత్పర్యము

ఇట్లుచూచి లంక కోపించి చూచుట కసహ్యమైన ముఖము భయంకర రూపము దాలిచి హనుమంతున కడ్డమువచ్చి నిలఁబడి సింహనాదములు చేయుచు నిట్లులనెను. ఓరీ! నీ వెవ్వఁడవు? ఏమిపనిగా నిచటికి వచ్చితివి? నీవు చావకముందే చెప్పుము.

క. ఏ వేళల నేచోటుల, రావణబలగుప్త మగుచుఁ ♦ గ్రాలెడులంకన్
నీవా చొచ్చెడివాఁడవు, దేవాదులు చొచ్చి బ్రదుకు♦ తెరువుం గలదే. ౧౭౨

అర్థములు. రావణబలగుప్తము=రావణుసేనలచే రక్షింపబడునది.

తాత్పర్యము

అన్ని వేళలందును నన్ని స్థలములందును రావణుని సేనలు రక్షించుచున్న లంకను నీవా ప్రవేశింపఁ గలవాఁడవు. దేవతలు లోనగువారు ప్రవేశించి బ్రదుకఁగలరా?

చ. అనిన వచించు నా చరిత ♦ మంతయు నైన విరూపనేత్రవై
పని యెది గల్గి యీ నగరి♦వాకిట నుండెద? వేల యొప్పుచున్
నను నిటు లడ్డగించెదవు ♦ నా కిది తెల్పు మ టన్న నా మరు
త్తనయునిఁ గాంచి లంక యనె ♦ దారుణభాషలఁ గ్రోధదీప్తయై. ౧౭౩

తాత్పర్యము

అని యిట్లు లంక యడుగఁగా హనుమంతుఁ డిట్లనెను. ఓసీ! నా కథ చెప్పెదను గాని యీ వికారపుఁగన్నులతో నీపట్టనము వాకిటనుండు నీ వెవతెవు! ఏల యిం దున్నావు? ఏల యీప్రకారము నొప్పుచు నా కడ్డము వచ్చెదవు? ఊరనియుండిన నెవ్వరైన రాక పోక యుండురా? చెప్పవలసిన దని యడుగఁగా నా మారుతిని జూచి భయంకరవాక్కులచేఁ గోపముచే మండిపడుచు లంక యిట్లనియె.

ఉ. రావణునాజ్ఞ మోచి నగ♦రం బిది కాచెద నెల్ల వేళలన్
నీ విటు కన్నుఁ బ్రామి నను ♦ నేరుతె దీనిఁ జొరంగ? నిప్పుడే
చావఁ గలాఁడ వోరి వన♦చారి! స్వయంబుగ నేన లంకరా
నా విధ మింత, నీకథ వి♦నన్ వచియింపు మ టన్న నాతఁడున్. ౧౭౪

అర్థములు. కన్నుఁబ్రామి=మోసగించి.

తాత్పర్యము

రావణాసుర నాజ్ఞ శిరసావహించి నే నీ పట్టనము సర్వకాలముల రక్షించె దను. నన్నుఁ గన్నులు కప్పి నీవు ప్రవేశింప సాధ్యమా? ఓరీ క్రోఁతీ! నీ విప్పుడే చావఁగలవు. నేనే లంకనురా. ఇది నా చరిత్రము. నీ వెవ్వఁడవో యిఁకఁ జెప్పుము.

ఉ. లంక వచించినట్టి నుడు•ల న్విని కొండవ నిల్చి యింతయేన్
 జంకక యోషిదాకృతి నె•సంగెడు దానిని జూచి వాహినీ
 సంకులితాట్టగోపురవి•శాల గృహాంగణనిష్కు టోత్కరా
 లంకృత యై తనర్చు పురి • లంకఁ గనుంగొను వేడ్క వచ్చితిన్,    ౧౭౫

అర్థములు. నుడులన్=మాటలను, యోషిదాకృతిన్ = స్త్రీరూపమును, వాహినీ=సేనలతో, సంకులిత=సంకులమైనదై, (సమ్మర్దమైనదై) అట్ట=యుద్ధార్థము వాకిటి మండపము మీఁదఁగాని, కోత్తళముమీఁదఁగాని యేర్పడిన గదుల చేతను, అంగణ=ముంగిళ్ళచేతను, నిష్కుట=ఇంటిచుట్టు నుండు తోఁటలచేతను, అలంకృతయై=అలంకరింపఁబడినదియై.

తాత్పర్యము

లంకిణి చెప్పినమాటలు విని హనుమంతుఁడు కొండవలెఁ గదలక ధైర్యమున నిలిచి కొంచెమైనను సందేహింపక స్త్రీ యాకారముతో వచ్చినదానిని జూచి సేనలతోఁ గూడిన యట్టకులచేతను గోపురములు వెడలుపాటి యిండ్లు ముంగిళ్లు తోఁటలు వీనిచేతను నందమైన లంకను జూచి పోవు కోరికతో వచ్చితిని.

క. నావుడు నను నిర్జింపక, యే వడువున నీవు దుర్మ•తీ! చూచెద వీ
 రావణపాలితపుర మని, యీ విధమునఁ బరుష భాష•లింతి యనంగన్. ౧౭౬

అర్థములు. నిర్జింపక=గెలువక, ఏవడువున=ఏవిధముగ.

తాత్పర్యము

అని హనుమంతుఁడు చెప్పఁగా నదియును నన్ను గెలువక యేవిధముగా నో ద్రోహబుద్ధి గలవాఁడా! రావణుఁడు రక్షించు పురములోనికిఁ బోఁగలవు, అని యీవిధముగా నది కఠినముగా మాటలాడఁగా.

క. రక్కసిఁ గనుగొని యిట్లను, నక్కపివీరుండు పురము•నంతయుఁ గని నే
 గ్రక్కున వచ్చినత్రోవం, ద్రొక్కెద నన లంకిణి భయద•రోషార్భటులన్. ౧౭౭

తాత్పర్యము

ఆ రాక్షసిని జూచి హనుమంతుఁ డిట్లనియె. ఓసీ! నే నీ పట్టణమంతయుఁ జూచి శీఘ్రముగా వచ్చిన త్రోవఁబోయెదను, అని చెప్పఁగా లంకిణి భయంకరమైన రోషముచేఁ గలుగు ధ్వనులు చేయుచు.

క. అరచేతఁ గొట్టె వానర, వరునిం గపి యిట్లు దెబ్బ•పడి బొబ్బిడుచున్
 దరుణి యని తీవ్రరోష, స్ఫురితుఁడు గా కెడమముష్టిఁ•బొడిచెం గినుకన్. ౧౭౮

తాత్పర్యము

అరచేతితో వానరశ్రేష్ఠుని గొట్టెను. ఇట్లు దెబ్బదిని బొబ్బపెట్టి యిది యాఁడుది, దీనిమీఁదనా నా బలము చూపవలె నని తలఁచి విశేషము కోపింపక యెడమచేతి పిడికిట దానిని బొడిచెను.

### —• లంకిణి నన్ను రక్షింప హనుమంతుని వేఁడుట •—

క. ఆముష్టిఘాతముననే, భూమింబడ వివృతవక్త్రి • బోలఁతుక ననుకం
పామతిఁ గనెఁ బావని యా, భామిని గతగర్వ యగుచుఁ • బలికె నతనితోన్.

అర్థములు. వివృతవక్త్రి=నోరు తెఱచుకొనినది.

తాత్పర్యము

ఆ పిడికిటి పోటుననే యది నోరు తెఱచికొని నేలమీఁదఁ బడఁగా హనుమంతుడు దానిని దయతోఁ జూచెను. అదియును గర్వ ముడిగినదై యాయనతో నిట్టు లనెను.

క. కరుణింప వయ్య వానర,వర! కావుము నన్ను వీర్య•వంతుఁడ వెంచన్
దరుణులఁ జంపఁగ రా దను, మరియాదను దాఁట రెపుడు•మహితబలాఢ్యుల్.

తాత్పర్యము

వానరేంద్రా! నన్నుఁగావుము. నా యందు దయ దలఁపుము. నీవు విశేష పరాక్రమ వంతుఁడవు. విశేషబల సంపద గలవారు స్త్రీలను జంపరాదను మరియాదను దాఁటరు.

చ. అగచరలోకపుంగవ! స్వ•యమ్ముగ లంకను నేను, పోరిలోఁ
దెగి నను గెల్చి తీవు భవ•దీయపరాక్రమ మేర్పడంగ; ని
న్నగచరుఁ డెవ్వఁ డే గెలుచు • నాఁడు మొదల్ సురవైరికోటికిం
దెగుదలకార్య మబ్బెడి న•నెన్ విధి మున్న వరంబు లిచ్చుచోన్. ౧౮౧

అర్థములు. అగచరలోకపుంగవ=వానరశ్రేష్ఠా, తెగుదల=నాశమైపోవు, విధి=బ్రహ్మదేవుఁడు.

తాత్పర్యము

వానరశ్రేష్ఠుఁడా! నేనే లంకిణిని యుద్ధమునందు సాహసించి నీ బలపరాక్రమములచే నన్నే గెల్చితివంట ఇఁక రాక్షసులు నీ కడ్డమా? నాకు బ్రహ్మదేవుఁడు నగరప్రతిష్ఠయందు వరములిచ్చు సమయంబున నిన్ను నేనాఁడు సీతాదేవిని వెదకుచు గ్రోఁతివచ్చి గెలుచునో యానాఁడు మొదలు లంక నాశమగునని చెప్పెను.

ఉ. సత్యముఁ జెప్పితి న్విధియు • సత్యమ పల్కెను దప్ప దేమిటన్
దైత్యులకున్ దశాస్యునకు • ధారిణికన్యక కారణంబుగా
మృత్యువు దాపరించె నిఁక • నేఁగుము పట్టన మెల్లఁ జూడుమీ
కృత్యము లెల్లఁ దీర్చుకొను•మీ మది చొప్పునఁ గీశపుంగవా. ౧౮౨

తాత్పర్యము

వానరశ్రేష్ఠుఁడా! నేను సత్యము చెప్పితిని, బ్రహ్మదేవుఁడు యథార్థమే చెప్పెను. అది యేమి చేసినను తప్పదు. సీతాదేవి కారణంబుగా రాక్షసులకు

రావణునకు చావు సమీపించెను. ఇఁక నీవు పురములోనికిఁ బొమ్ము. పట్టన మంతయుఁ జూడుము. నీయిష్టప్రకారము నీకుఁ గావలసినపను లన్నియుఁ జేయుము'

క, శాపోపహతం బగు లం, కాపురముం జొచ్చి జనక•కన్యకఁ గన ని
ఛ్ఛాపూర్తి నొందవఁ గపికుల, దీప! యథాసుఖముగాఁగ•ద్రిమ్మరు మనినన్·

అర్థములు. శాపోపహతము=నందికేశ్వరుని యొక్కయు, పతివ్రతల యొక్కయు శాపముచేఁ గొట్టఁ బడినది.

## తాత్పర్యము

పతివ్రతలు లోనగు వారి శాపముచేఁ గొట్టఁబడిన లంకాపురము, ప్రవేశించి సీతను జూచుటకై నీకోరిక దీర యథాసుఖముగఁ దిరుగుము. అని చెప్పఁగా; లంకిణియును హనుమంతుఁడు బొబ్బలు పెట్టిరి. ఒకరినొకరు కొట్టిరి. ఇది రాక్షసులకేల తెలియలేదు. గ్రామ దేవతల యాలయము లూరికి వెలుపలనుండును. ఆ దేవతలు రారాని వారు గ్రామపు పొలిమేర దాఁటి రాకుండఁ బొలిమేర గాచి యుందురు. ఇది యూరి వెలుపలి వృత్తాంతము. దానిలో రాత్రివేళ. ఊరివారి యఱపులలో నీ యఱపులు వారికి వినఁబడి యుండవు. అదియును గాక యెవ్వరు లేనిచోటఁగదా హనుమంతుఁడు ప్రవేశింప యత్నించెను. హనుమంతుఁడు చెప్పక పోయినను బ్రహ్మదేవుని వాక్యముల వలన హనుమంతుఁడు సీతాదేవికై వచ్చె నని లంకిణి తెలిసికొనెను.

లం. ఇది పృథివీ బీజాక్షరము. కావున పృథివీ తత్త్వమును దెలుపుచున్నది· అది కలది లంక=అనఁగా దేహము. హనుమంతుఁడు లంక జయించె ననుటచేఁ దనయందాత్మను వెదకు వాఁడు తొలుత దేహమును జయింపవలె నని యేర్పడు చున్నది. దేహమును జయింపని వాని కాత్మావలోకనము లేదు. ఈ యర్థ మీ క్రింద పద్యమునఁ గాననగును.

—• ౪-వ సర్గము. హనుమంతుఁడు లంకలో సంచరించుట •—

తే. సత్యవిక్రముఁ డైన కే•సరిసుతుండు, కామరూపిణి లంకిణి•గడిమి గెలిచి
తడయకాపత్తనంబున•ద్వారమునను,జొచ్చెఁబ్రాకారమును దాఁటి•శూరవరుఁడు.

అర్థములు. సత్యవిక్రముఁడు=వంచనములేని పరాక్రమము గలవాఁడు, సత్యమే పరాక్రమముగాఁ గలవాఁడు. కామరూపిణిన్=కోరిన రూపమెత్తఁ గలదానిని.కడిమిన్=పరాక్రమముచే. అద్వారమునను=వాకిటిలోనుండి గాక యితరమార్గమున, దీనివలనహనుమంతుఁడు రాక్షససంచారములేనిచోట లంకలోఁబ్రవేశింప యత్నించెననియు, ఆకారణముచే లంకా పరాజయము రాక్షసు లెఱుంగరనియుఁ దెలియనగు.శత్రుస్థానమును నద్వారముగఁ బ్రవేశింపవలెనని రాజనీతి.కాన హనుమంతుఁడును నద్వారమున లంకఁ బ్రవేశించెనుగాని వెఱచికాదు. గ్రామంవా నగరం,వాపి

పత్తనం వా పరస్యహి, విశేషాత్సమయే సౌమ్య, నద్వారేణ విశేన్నృప' యని ప్రమాణము. జరాసంధుని మీఁదికి యుద్ధమునకుఁ బోయినపుడు శ్రీకృష్ణ భీమార్జునులు నద్వారములనే కదా ప్రవేశించిరి. 'అద్వారేణ రిపో ర్గేహం, ద్వారేణ సుహృదో గృహాన్, ప్రవిశంతి నరా ధీరా, ద్వారాణ్యేతాని ధర్మతః, భార.సభా.

ఇందు ముముక్షు వగు యోగిచర్య సూచితము. ఎట్లన.— ఆత్మావలోకన పరుఁడు సత్యవిక్రముఁడై యుండవలయును. ఇచ్చట సత్యమనునది యమములకన్నిఁటికి నుపలక్షణము. 'సత్యేన లభ్య స్తపసా హ్యేష ఆత్మాసమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యం, అంతశ్శరీరే జ్యోతిర్మయోహి శుభ్రో యం పశ్యంతి యతయః క్షీణదోషాః॥ సత్యమేవ జయతే నానృతం, సత్యేన పంథా వితతో దేవయానః' అను ముండకోపనిషత్తు ప్రకారము ఆత్మ సత్యముచేత తపస్సుచేత జ్ఞానముచేత బ్రహ్మచర్యముచేత లభించును ఇన్నియు హనుమంతునందుఁ గలవు. కావున సత్యమనునది యన్నిఁటికి నుపలక్షణము. విక్రమశబ్దము='నాయమాత్మా బలహీనేన లభ్యః' బలహీనులకు నాత్మ లభింపదు అను శ్రుత్యర్థమును బోధించుచున్నది. కేసరిసుతుండు=సింహపుఁ బిల్ల. ఇది సాహసము కలిమి తెలుపుచున్నది.

లంకయగు దేహము ప్రకృతి పరిణామము అది కామరూపిణి గదా. లంకా రక్షః పురీశాఖా శాకినీ కులటాసుచ ॥నానా॥ లంకా శబ్దమునకు అంకుటాలనియు నర్థము గలదు. ఈ జీవుని నీ జన్మమున ననుసరించియున్న దేహము మఱుజన్మంబున మఱియొక జీవు నాశ్రయించును. ఈ విధముగ జన్మజన్మమున వేఱువేఱు జీవుల నాశ్రయించును గావున నీదేహము అంకుటాలి వంటిదే. కడిమిన్=బలముచే నిర్బంధ పెట్టి యనఁగా తపస్సుచే దేహమును గెలువవలయును గాని సౌమ్య మార్గమున గెలువరాదనుట సూచితము. పత్తనము=దేహము. పత్ఌ గతౌ అను ధాతువువలన బుట్టినది. దీనికిఁ బోవునది యని యర్థము. దేహమునశించునదియేకదా.

అద్వారమునను=దేహము లోనికిఁ బోవుటకు నవద్వారములు గలవు. ఆత్మ యందు మనస్సు పోవుట కీ ద్వారములు పనికిరావు గదా.

ప్రాకారమును దాఁటి=ప్ర+ఆకారము=స్థూలదేహమును భేదించెనని భావము.

క. అగచరపతిహితకరణుం, డగచరవరుఁ డరులమూర్ధమందున్ బలిమిన్
దగఁ దన డాకాలిని మున్నుగ నుంచి నశాస్యపురము నం జొచ్చె నిసిన్. ౧౮౫

అర్థములు అగచరపతి=సుగ్రీవునకు, హితకరణుండు=మేలుచేయువాఁడు, అగచరవరుఁడు=వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు, అరుల=శత్రువులయొక్క, మూర్ధమందున్=తలలయందు, బలిమిన్=బలముచే, డాకాలిని = ఎడమకాలిని, మున్నుగనుంచి=ముందుగాఁ జెట్టి, నిసిన్=రాత్రివేళ, ఒకఁడు శత్రుదేశమును ప్రవేశించునపుడెడమకాలు ముందుంచవలెను. మేలుకోరువారియింటఁ బ్రవేశించునపుడు కుడికాలు ముందుంచవలెను. హనుమంతుఁడీ నీతి ననుసరించెను.

'ప్రయాణ కాలేచ గృహ ప్రవేశే, వివాహకాలేపిచ దక్షిణాంఘ్రిః కృత్వాఽగ్రతః శత్రుపురప్రవేశే, వామం నిదధ్యా చ్చరణం నృపాలః।' అని బృహస్పతి వాక్యమిచ్చటఁ బ్రమాణము.

క. పూవులచే ముత్తెంబుల,చే వెలసెడిరాచబాటఁ • జేరి మనోజ్ఞం
బౌ నీకు నాల్గుప్రక్కలఁ, బావని తిలకించి మెచ్చె•భాగ్యోన్నతికిన్. ౧౪౬

తాత్పర్యము

ఊరిలోనికిఁ బోవుటకై పూవుల చేతను, ముత్తెములచేతను నొప్పుచున్న రాచబాట చే మనోహరమైన యా పట్టనము నాలుగు ప్రక్కల జూచి దాని భాగ్యాధిక్యమునకు నాంజనేయుఁడు మెచ్చుకొనెను.

సీ. తోరంబుగా మ్రోయు•తూర్యనాదంబులఁ, బకపకనవ్వులఁ బ్రాభవముల
వజ్రాంకుశనికాశ•వజ్రజాలవిభూష,ణాంచితగృహపయో•దాళికలన
మేఘాళిచే నొప్పు•మిన్నునా విలసిల్లి, మఱి సితాబ్దాభమై•మహిమమీఱు
స్వస్తికపద్మాఖ్య•వర్ధమానాకృతిఁ, గొమరొప్పు రాక్షస•కూటవితతి.
తే. చిత్రమాల్యాభరణములఁ • జెన్నుమీఱు
పురిని గనుఁగొని సంతోష•భరితుఁ డగుచు
సూర్యభవహితకరణుండు • చొచ్చి చూడఁ
గడఁగి శ్రీరాఘవార్థంబు • కరము నలరె. ౧౪౭

అర్థములు. నవ్వుల ప్రాభవములన్=నవ్వుల యతిశయములచే, వజ్రాంకుశనికాశ=(౧) వజ్రాయుధాకారము కలవియును, అంకుశముల వంటివియును, (౨) వజ్రములతోఁ జేయబడిన యంకుశములు. (౩) వజ్రమంకుశముగాఁ గల యైరావతము వంటివి, దానివలె శుభ్రమైనవి, వజ్రజాల=వజ్రమణుల సమూహముచేతను, విభూషణ=సొమ్ముల చేతను, అంచిత=ఒప్పిన, గృహపయోద = గొప్ప యిండ్లయొక్క, పయోద శబ్దము శ్లేష వాచకము, ఉపమిత సమాసము, ఆళి=సమూహముయొక్క, కలనన్=కూడిక చేత, సిత+అబ్ద+ఆభమై=తెల్లని మబ్బుతో సమానమై, స్వస్తిక, పద్మాఖ్య వర్ధమానాకృతిన్=స్వస్తికమని, పద్మమని వర్ధమానమని రాజగృహముల పేర్లు, యాకారముల పేర్లు, నలు చదరముగా నున్న రాచ నగరికి స్వస్తికమని పేరు. 'చతుశ్శాలా చతుర్ద్వారా సర్వతోభద్రసంజ్ఞితా పశ్చిమద్వార రహితా మధ్యావర్తా హయాననా! దక్షిణ ద్వార రహితా వర్ధమానా ధనప్రదా। ప్రాగ్ద్వారరహితా స్వస్తికాఖ్యా పుత్రధనప్రదా॥' యను వాక్య మిటఁ బ్రమాణము. పడమటి వాకిలి లేనిది మధ్యము, దక్షిణ ద్వారము లేనిది వర్ధమానము, తూర్పు ద్వారము లేనిది స్వస్తికము. కూట వితతి=ఇండ్ల సమూహము. శ్రీరాఘవార్థంబు=శ్రీరామచంద్రమూర్తి కార్యార్థమై.

తాత్పర్యము

విశేషముగ ధ్వనించు పిడుగులయు, తాళములయు, మేఘములయు ధ్వనుల చేతను, బకపక నవ్వుల యతిశయములచేతను, వజ్రాంకుశ సమానములైన వజ్రములచేతను, సొమ్ములచేతను నొప్పుచున్న మేలియిండ్ల చేతను, మేఘములచే నొప్పు నాకాశమో యనునట్లు ప్రకాశించి తెల్లని మేఘకాంతి కలిగి యతిశయ మహిమగల స్వస్తికము. పద్మము, వర్ధమానము నను నాకారములు గల రాక్షసుల యిండ్ల సమూహముల చేతను, చిత్రములైన మాల్యముల చేతను, భూషణముల చేతను కాంతిగలపట్టనమును జూచి మిగుల సంతోషించి సుగ్రీవునకు మేలు చేయగోరు హనుమంతుఁడు శ్రీరామ కార్యార్థమై లోపలికిఁ బోయి చూడఁ బ్రయత్నించి మిగుల సంతోషించెను.

తే. ఈగతిని నింటి కింటికి నేగుచోటఁ, గనియె నానావిధాకృతుల్ గలిగి వెలయు
మందిరంబులు ననమాన సుందరములు, నయనపర్వంబుగా వాయు నందనుండు.

తాత్పర్యము

ఈ విధముగ నింటింటికిఁ బోవుచుఁ బెక్కు రూపములు గలిగి యసమానములు సుందరంబులునగు నిండ్లను గన్నుల పండువుగా వాయుపుత్రుఁడుచూచెను.

ఉ. పీనుల కింపు గూరుప దివిన్ సురకన్యలుబోలె నందుఁ ద్రి
స్థానమనోహరస్వరయుతంబుగ మాదసమృద్ధదైత్యకం
జానన లోలి గానరస మాదట నించుట హారిరత్నకాం
చీనినదంబు నూపురవిశిష్టఝుళంఝుళి శింజితంబులున్. ౧౮౯

అర్థములు. త్రిస్థాన=బొమ్మ, కంఠము, శిరము, ఈమూఁడు స్థానములఁ బుట్టిన, మనోహర=మనస్సు నాకర్షించు, స్వరయుతంబుగన్=మంద్ర మధ్యమ తార స్వరములతో, మాద.రూ. మదము=మదముచే వృద్ధిపొందిన, దైత్యకంజాననలు= రాక్షసస్త్రీలు, ఆదటన్=ప్రేమతో, హారి=మనోహరమైన, రత్నకాంచీనినదంబు= రత్నములు చెక్కిన యొడ్డాణముల ధ్వని, నూపుర=అందెల, విశిష్ట=శ్రేష్ఠమైన, ఝుళంఝుళి శింజితంబులున్= ఝుళంఝుళి ధ్వనులు, వీరు చిత్రిణీజాతి స్త్రీలు. "వ్రజతి రతిసుఖార్థం చిత్రిణీ మగ్రయామే, భజతి దినరజన్యో ర్హస్తినీం చ ద్వితీయే గమయతిచ తృతీయే శంఖినీ మార్ధరిభావం రమయతి రమణీయాం పద్మినీం తుర్యయామే." రాత్రి మొదటి యామమున రతి గోరునది చిత్రిణి రెండవ జామునఁ గోరునది హస్తిని, మూఁడవజామునఁ గోరునది శంఖిని, నాలుగవజామునఁ గోరునది పద్మిని.

తాత్పర్యము

స్వర్గమునందు దేవతాస్త్రీలవలె లంకయందు బొమ్మ కంఠము శిరము నను మూఁడు స్థానములయందుఁ బుట్టిన మనోహరమైన మంద్ర మధ్యమ తారములను స్వరములతోఁ గూడినట్లు పూర్ణమదము గల రాక్షస స్త్రీ లాసక్తితోఁ జేయుగాన ధ్వనులును మనోహరములయి రత్నములు చెక్కఁబడిన యొడ్డాణములందలి చిఱుగజ్జెల ధ్వనులును, అందెల ఝుళంఝుళి ధ్వనులును.

సీ. సోపాననాదముల్ • శూరభుజాస్ఫాల,నంబులు భీమకం•ఠరవములును
జాపకమాంత్రిక•స్వనము లాకర్ణించె, స్వాధ్యాయరతుల ని•శాచరేంద్ర
సంస్తవశీలురఁ • జక్కఁగఁ గనుఁగొని, రాజమార్గస్థచ•క్రముల రాజ
చారుల గర్జన్ని•శాటుల దీక్షిత, జటిలముండుల వృష•చర్మధరుల
తే. దర్భముష్టిప్రహరణుల • దహనకుండ
సాధనులఁ గూటముద్గర • శస్త్రధరుల
నొంటి కన్నొక్క చెవియు లం•బోదరములు
వ్రేలుఁగొమ్ములుఁ గలవారి • వేడ్కఁగనియె. ౧౯౦

అర్థములు. సోపాననాదముల్=స్వర్ణరత్నమయములైన మెట్లకు నందెలు లోనైనవి తగులఁగాఁ గలిగిన ధ్వనులును, సోపానము రూ. సౌపానము. శూర భుజాస్ఫాలనంబులు=శూరులు భుజము లప్పళించు ధ్వని, భీమకంఠరవములును= భయంకర కంఠధ్వనులును, జాపక మాంత్రికస్వరములు = జపముచేయువారి యొక్కయు, వేదాది మంత్రము లుచ్చరించు వారియొక్కయు ధ్వనులును, స్వాధ్యాయరతులన్=వేదాధ్యయనము చేయువారలను, నిశాచరేంద్ర సంస్తవ శీలురను=రావణుని బొగడువారిని, రాజమార్గస్థ చక్రములను=రాచబాటలయందు నడుమ గుంపులుగఁ జేరినవారిని, రాజచారులన్=వేగువాండ్రను, గర్జన్నిశాటులన్=సింహనాదముచేయు రాక్షసులను, దీక్షిత జటిలముండులను=దీక్షవహించిన జడదారులను; బోడులను, వృషచర్మధరులన్=ఎద్దుచర్మమును ధరించిన వారిని, దర్భముష్టి ప్రహరణులన్=దర్భలను బిడికిళ్ళలో నాయుధములుగా నుంచుకొన్న వారిని, దర్భను చేత నుంచుకొని సత్కార్యానుష్ఠానము చేసిన శత్రువులు నశింతురు.

యథావజ్రం హరేః పాణౌ, తథా విప్రకరే కుశః
ఇంద్రునిచేతి వజ్రాయుధ మెట్టిదో బ్రాహ్మణునిచేతి దర్భయట్టిది. దహనకుండ సాధనులన్=నిప్పుగుండమే యాయుధముగాఁ గలవారిని, శత్రునాశార్థము నిప్పు గుండమున హోమము చేసి కృత్యను గలిగింతురు గావున వాని నాయుధముగాఁ జెప్పెను. లంబోదరములు=వ్రేలాడు పొట్టలు.

## తాత్పర్యము

అందెలు మెట్టెలు పాముజీలు లోనగు కాలియాభరణములు మెట్లకుఁ దగులఁగాఁ బుట్టిన చప్పుడులు శూరులు భుజములు తట్టుకొనఁగాబుట్టిన ధ్వనులువీరుల భయంకరములైన సింహనాదములు జపములు చేయు వారియొక్కయు మాంత్రికులయొక్కయు ధ్వనులను వినెను. వేదాధ్యయనము చేయువారలను, రావణు పొగడు స్వభావముగలవారలను(వీరు రాక్షస వందిమాగధులు)రాచబాటలనడుమ నిలఁబడిన గుంపులను, వేగువాండ్రను, గర్జించు రాక్షసులను, దీక్ష గొన్నవారిని జడలు పెంచుకొన్నవారిని, బోడి తలల వారిని (రాక్షస సన్యాసులు)ఎద్దు చర్మ

ములను ధరించిన వారిని దర్భ పిడికిళ్లు నగ్నికుండములు నాయుధములుగాఁ గలవారిని, సమ్మెటలు ఇనుపగుదియలు ధరించిన వారిని, ఒంటికన్ను, ఒంటిచెవి, వ్రేలాడు పొట్టలు, వ్రేలాడు ఱొమ్ములు గలవారిని హనుమంతుఁడు చూచెను.

సీ. వికటకరాళుల♦విపులకోదండుల, వామనులను భుగ్న♦వక్త్రియుతుల
ఖడ్గుల ముసలులఁ♦గవచులఁ బరిఘాయు,ధులను శతఘ్న్యాయు♦ధులను మఱియు
నాధికస్థూలుల ♦ నాతికృశాంగుల, నాతిదీర్ఘుల నాతి ♦ హ్రస్వకులను
నాతిగౌరాంగుల ♦ నాతికృష్ణాంగుల, నాతివామనులను ♦ నాతికుబ్జ

తే. కులను బహురూపులను వి♦రూపుల సురూపు
లను సువర్చసులను బతా♦కినిచయముల
ధ్వజుల వివిధాయుధుల శ♦క్తికుజధరులను
బట్టిసాయుధులను గాడ్పు♦పట్టి గనియె. ౧౯

అర్థములు. వికట కరాళులన్=భయంకరములైన మిట్టపండ్లవాండ్రను, విపుల కోదండుల=పెద్దవిండ్లను ధరించినవారిని, వామనులను=పొట్టివారిని, భుగ్న వక్త్రియుతులన్=వంకరయగు నోళ్ళతోఁగూడిన వారిని, ఖడ్గులన్=ఖడ్గముల ధరించిన వారిని, ముసలులన్=రోఁకండ్లను ధరించినవారిని, కవచులన్=కవచముల దొడిగిన వారిని, పరిఘాయుధులను=ఇనుపకట్ల గుదియలు ధరించినవారిని, శతఘ్న్యాయుధులను=శతఘ్నులాయుధముగాఁ గలవారిని, 'అయః కంటక సంఘన్నా శతఘ్నీ పరికీర్తితా' వైజయంతి. నూఱుమేకుల యినుపగద శతఘ్ని యనఁబడును నాధిక స్థూలులన్=మిక్కిలి స్థూలములు కాని దేహములు గలవారిని, నాతికృశాంగులన్=మిక్కిలి కృశింపని దేహములు గలవారిని, నాతిదీర్ఘులన్=మిక్కిలి పొడవు కాని వారిని, నాతిహ్రస్వులను=మిక్కిలి పొట్టిగాని వారిని, నాతిగౌరాంగులన్= మిగులఁ బచ్చని కాని శరీరము గలవారిని, నాతికృష్ణాంగులను=మిగుల నలుపుగాని వారిని, నాతివామనులను=మఱుగుజ్జులు కానివారిని, నాతికుబ్జకులను = విశేషము గూనిలేని వారిని, బహురూపులను=అనేకవిధములైన యాకారములు గలవారిని, సురూపులను=చక్కఁదనము గలవారినిఁ సువర్చసులను=మంచి కాంతిగల వారిని, పతాకినిచయములను=చిన్నధ్వజములు పట్టుకొన్నవారిని, ధ్వజులన్=పెద్ద జెండాలను బట్టుకొన్న వారిని, వివిధాయుధులను = పెక్కు తెగల యాయుధములను ధరించినవారిని, శక్తి కుజధరులను=శక్తులను చెట్లను ధరించినవారిని, పట్టిసాయుధులను=కటారు లాయుధములుగాఁ గలవారిని, గాడ్పుపట్టి = వాయుపుత్త్రుఁడు, కనియెన్=చూచెను.

## తాత్పర్యము

మిట్టపండ్ల వాండ్రను, పెద్దవిండ్ల వాండ్రను, పొట్టివాండ్రను, వంకర నోటి వాండ్రను, బాకులు రోఁకండ్లు గుదియలు ఇనుపముండ్ల గదలు ఆయుధములుగఁ

గలవాం(డ్రను, కవచములు దొడిగినవాం(డ్రను, మిక్కిలి లావులేనివాం(డ్రను, మిక్కిలి కృశించినవారుగాని వాం(డ్రను, మిగులఁ బొడవుగానివాం(డ్రను, మిగులఁ బొట్టిగాని వాం(డ్రను, మిక్కిలి పసిమిలేని దేహములని వాం(డ్రను, కాలు నలుపు గాని వాం(డ్రను మిక్కిలి పొట్టిగాని వాం(డ్రను, మిక్కిలి గూనులుగాని వాం(డ్రను అనేక రూపములు, గల వారిని వికార రూపములుగల వాం(డ్రను, సుందరులను, సుకాంతులును, గుర్తులు లేని టెక్కెములు గలవాం(డ్రను, గుర్తులుగల టెక్కెముల వాం(డ్రను, నానాయుధముల వాం(డ్రను, శక్తులు వృక్షములు ధరించినవాం(డ్రను, కటారులను గలవారిని వాయునందనుఁడు చూచెను.

తే. క్షేపణీపాశకరుల నా॰లేపరతుల, మాల్యవిలసితతనుల న॰మూల్యభూరి
భూషణుల స్వైరుల ననేక॰వేషయుతుల, వేలకోలఁదులఁ గనియెనా॰భీమబలుఁడు.

అర్థములు. క్షేపణీ పాశకరులను=వలలను పాశాయుధములను జేత ధరించిన వారిని, ఆలేపరతులన్ = గంధము పూసికొనుటయం దాశగలవారిని, మాల్యవిలసిత తనులన్ = పూలదండలచేఁ (బకాశించు దేహములు గలవారిని, అమూల్య=వెలలేని, భూరిభూషణులను = గొప్పసొమ్ములు ధరించిన వారిని, స్వైరులన్=స్వేచ్ఛగా సంచరించువారిని, అనేక వేషయుతులన్ = పలువిధము లయిన వేషములు వేసినవారిని.

తాత్పర్యము

వలలు, పాశములు చేతగల వారిని దండిగ గంధము పూసికొన్న వారిని, పూలదండలు ధరించిన వారిని, వెలలేని గొప్పయాభరణముల నలంకరించు కొన్నవారిని నిష్టముకొలఁది తిరుగువారిని, నానావిధాలంకారములు చేసికొనిన వారిని, వేలకొలఁదులను నా భయంకరబలము గల హనుమ చూచెను.

ఆ. భయదశూలధరుల॰వ(జహస్తకులను, బంక్తికంఠు నాజ్ఞఁ॰బట్టనమున
నడిమిగుల్మ మగుచుఁ॰గడుహెచ్చరిక నింటి,ముందు (గాలఁగనియె॰మూలబలము.

అర్థములు. భయదశూలధరులన్=భయంకరములైన శూలములను ధరించిన వారిని, వ(జహస్తకులను=వ(జాయుధములను ధరించిన వారిని(ఇవి యిం(దుని వ(జములు గావు, ఆ యాకారముగ సిద్ధము చేసినవి) జూచెను. నడిమిగుల్మము= పట్టనము నడుమ నున్న సైన్య సమూహము.

తాత్పర్యము

భయంకరములైన ముమ్మొనయాయుధముల ధరించిన వారిని ఇం(దుని వ(జము వంటి యాయుధములు చేతియందుఁ గలవారిని జూచెను. మఱియు రావణుని యాజ్ఞ(పకారము పట్టనము నడుమ రావణుని యింటిముందు హెచ్చరికగల మూలబలము (Reserved force) ను జూచెను.

క. బంగరుతోరణములను జెలంగుచు గిరిశిఖరసీమ॰లన్ వెలిదమ్ముల్
రం గగు నగ ద్దతోడ వెలింగెడి(పాకారమున ల॰లిం గొమ రొప్పన్. ౧౯౪

అర్థములు. వెలిదమ్ముల్=తెల్ల తామరలు, రంగగు=అందమైన, ఈ మూఁడు పద్యము లేకాన్వయము; ఇందలి విశేషణములకు రాణివాసము (౧౭ వ. ప.) విశేష్యము.

తాత్పర్యము

బంగారు తోరణములు గలిగి కొండ శిఖరములందుఁ దెల్లఁదామరలు గల యగడ్తలతో వెలింగెడి ప్రాకారము కలదై.

చ. అమరనివాసతుల్య మయి ♦ హారినినాదయుతంబునై తురం
గమపటుహేషితంబు నయి ♦ కమ్రవిభూషణశింజితంబునై
విమలవిమానయానరథ♦విశ్రుతవారణమత్తపక్షిసం
ఘమృగమనోహరంబు నయి♦కాలు మహాబలయోధగుప్తమున్. ౧౯

అర్థములు. అమరనివాస తుల్యమయి=స్వర్గముతో సమానమై, నినాదము=ధ్వని, తురంగమ పటుహేషితంబు నయి=గుఱ్ఱముల గొప్ప సకిలింపులుగలదై, కమ్రవిభూషణ శింజితంబునై=మనోజ్ఞములైన యాభరణముల ధ్వనులు గలదై, విమానము=ఆకాశమున సంచరించు వాహనము, యానము=పల్లకి మొదలయినవి, వారణ=ఏనుగులు, మహాబల యోధగుప్తమున్=మిగుల బలముగల యోధులచే రక్షింపఁబడినది.

తాత్పర్యము

స్వర్గముతో సమానమై మనోహర ధ్వనులతోఁ గూడినదై గుఱ్ఱముల గట్టి సకిలింతలు గలదై, మనోహరమైన భూషణ ధ్వనుల గలదై, ఆకాశ యానములు పల్లకులు తేర్లు ప్రసిద్ధి కెక్కిన యేనుఁగులు మదించిన పక్షులసంఘములు జింకలు వీనిచే నందమై మిగుల బలవంతులగు యుద్ధభటులచే రక్షింపఁబడినదై.

వంశస్థము. సహేమరత్నోజ్జ్వల♦చక్రవాళమున్, మహార్హముక్తామణి ♦
మండితాంతమున్
మహాఽసితాభ్రాగురు♦మంజుగంధమై;రహించు రక్షోధిపు♦రాణివాసమున్.

అర్థములు. సహేమ రత్నోజ్జ్వల చక్రవాళమున్=బంగారుతోఁగూడిరత్నములచే వెలింగెడి ప్రాకార వలయము గలదానిని, మహార్హ=మిక్కిలి వెలగల, ముక్తామణి=ముత్యములచే, మణులచే మండితాంతమున్=అలంకరింపఁబడినలోపలి భాగముగల దానిని, మహాఽసిత=మిగుల నలుపైన, అభ్ర=మబ్బువంటి రంగుగల, అగురు=అగురు చెక్కమొక్క, మంజుగంధమై = మనోహరమైన వాసనగలదై, రహించు=ప్రకాశించు, రాణివాసమున్ = అంతఃపురమును, పై పద్యములోని కనుఁగొనితో నన్వయము. వంశస్థము. జతజరగణములు ఎనిమిదింట యతి.

తాత్పర్యము

బంగారుతోఁగూడిన రత్నములచేఁ బ్రకాశించు ప్రాకారవలయము గలదియును, మిగుల వెలగల ముత్యములచేతను రత్నములచేతను నలంకరింపఁబడినమధ్య

భాగము గలదియును, కారుమబ్బువలె నల్లనైన యగురు చెక్కలకమ్మని వాసన గలదియు నయిన రావణుని అంతఃపురమును జూచెను.

## —♦ ౫-వ సర్గము. చంద్రవర్ణనము ♦—

క. కనుఁగొని కేసరిసూనుఁడు, చనె లోనికి రామచంద్రు♦సతి నెమకంగా
వినువీదిని మధ్యంబున, జనలోచనపర్వముగను♦జంద్రుఁడు వెలిఁగెన్. ౧౯౭

అర్థములు. లోనికిఁజనెన్=లోపలికిఁ బోయెను. అనుటచే నింతవఱకుఁ బట్టణమున సంచరించెననియు రావణు నంతఃపురము వెలుపలి నుండి చూచి యిప్పుడు లోపలఁ బ్రవేశించెననియు నెఱుఁగనగు. వినువీదిని మధ్యంబునన్ = ఆకాశమధ్యమందు, జనలోచన పర్వముగను=జనుల కనుల పండువుగ, శుద్ధత్రయోదశినాఁడు ఆకాశ మధ్యంబునఁ జంద్రుఁడు వెలిఁగె ననుటచే నిప్పుడు సరిగా తొమ్మిదిన్నర గంటయని యేర్పడు చున్నది.

లయగ్రాహి. అంత హనుమంతుఁడు న♦భోంతరమునం గనియె
వింత లగు వెన్నెలల♦కాంతులు వెలుంగన్
గాంత మగుమంద వృష ♦ కాంతునిగతిన్ మలయు
చంతట జగంబున ని♦తాంతరుచి మీఱన్
స్వాంతములు హాయి గొన ♦ సంతసమునన్ జలధి
కాంతుఁడు తరంగముల ♦ గంతులిడున ట్లా
శాంతముల నంటునటు ♦ లెంతయును జేయు నుడు
కాంతు జనసంచయదు♦రంతదురితాంతున్. ౧౯౮

అర్థములు. అంత హనుమంతుఁ డుడుకాంతుని నభోంతరమునం గనియె నని యన్వయము, తక్కిన పదములలోఁ గొన్ని క్రియాంతములు గలవి. మఱికొన్ని యుడుకాంతునితో నన్వయించును. వెలుంగన్, మీఱన్ — ఇవి మలయుచు నను దానితో నన్వయించును. మలయుచున్ — చేయుయొ నన్వయించును. చేయు — ఉడుకాంతుని విశేషణము. నభోంతరమున=ఆకాశమధ్యమందు, మందన్=మంద యందు, వృషకాంతునిగతిన్=పెద్దయెద్దువలె, నితాంతరుచి=మిగులఁ గాంతి, స్వాంతములు=మనస్సులు జలధికాంతుఁడు = సముద్రరాజు, తరంగములన్=అలలచే, ఆశాంతములన్=దిక్కులకొనలయందు, ఉడుకాంతున్=నక్షత్ర పతిని, చంద్రుని, జనసంచయ=మనుష్యసమూహముల, దురంత=అంతములేని, దురితాంతున్=పాపముల నాశముఁ జేయువానిని.

### తాత్పర్యము

అంతట హనుమంతుఁడు ఆకాశ మధ్యమందుఁ జంద్రుని జూచెను. ఎట్టి చంద్రుని ననిన-వినోదకరమైన వెన్నెల కాంతులు వెలుఁగఁగ నందమైన మంద

యందు వృషభమువలె సంచరించుచుఁ బ్రపంచ మందంతట తన విశేషకాంతి వ్యాపింపఁగా నా కారణమున జనముల మనస్సులు సుఖపడఁగా సముద్రుఁడుప్పొంగుటచే నృత్యమాడు చున్నాఁడా యన్నట్లు ఆతని పెద్దయలలచే దిక్కుల నంటుచున్నట్లు చేయుచు జన సమూహముల యంతము లేని దుఃఖము నాశము చేయుచుండు చంద్రుని జూచెను. చంద్రుఁడు సంతోషకారి గావున నాయనను జూచిన వారికి సంతోషము కలుగునని భావము. లయగ్రాహి:— భజసన, భజసన భయ గణములు, ఈపద్యమందుఁ బ్రాస యతియే కాని యతిలేదు. ఇది సమ వృత్తములందుఁ జేరినది కాదు, మాలికా వృత్తములందుఁ జేరినది.

ఇంబడరఁగా భజసనంబులతుదన్ భజసనంబుల పదంపడి భయంబులు లయ గ్రాహిం బరఁగు బ్రాసవిరమంబు నలుమాఱు గుదురం బటుకవీశులు తిరంబుగ వచింతుర్. క॥ ముప్పదితొమ్మిది మాత్రల, ముప్పది యక్కరముల పదముల యంఘ్రులు నాల్గొప్ప యతిప్రాసంబులు, గుప్ప లయగ్రాహి యనఁగఁ గొమ రొందు హరీ, అప్పకవీయము. ౪ అ.

చారుమతి. ఏ కాంతి పొల్చునో మ•హీస్థలి మందరస్థ మై
యే కాంతి సంజ రహి•యించు నదీశ్వరస్థ మై
యే కాంతి యొప్పు సర•సీద్ధసరోరుహస్థ మై
యాకాంతి యప్డు పొలు•పారె నిశాకరస్థ మై ౧౯౯

అర్థములు. మందరస్థము= మందర పర్వతమందుండునది, సంజన్ = సాయంకాలమందు. నదీశ్వరస్థము = సముద్రమందుండునది. సరసీద్ధ సరోరుహస్థము= సరసులందుఁ బ్రకాశించు కమలములందుండునది. నిశాకరస్థము = చంద్రునియందుండునది, పదార్థవృత్తి నిదర్శనాలంకారము, ఉపమానగుణమే యుపమేయ మందుఁ జెప్పఁబడెను.

తాత్పర్యము

భూమియందు మందరపర్వతంబున నెట్టి కాంతి యుండునో, సాయంకాలమున సముద్రమునం దెట్టి కాంతి యుండునో, సరస్సులందలి కమలంబులం దే కాంతి యుండునో యటువంటి కాంతి యప్పుడు చంద్రునం దుండెను.

ఉ. రాజతపంజరస్థ మగు•రాజమరాళము భంగి, మందర
భ్రాజితకందరస్థమృగ•రాజము వైఖరి, భూరిమర్మదో
ద్వేజకకుంజరస్థుఁ డగు•వీరువిధంబునఁ, జంద్రుఁ డయ్యెడన్
రాజిలె నంబరస్థుఁ డయి •రాజముఖీవదనాభిరాముఁడై. ౨౦౦

అర్థములు. రాజత పంజరస్థమగు=వెండి పంజరమందున్న, రాజమరాళము భంగిన్=రాజహంసవలె, వెన్నెలచే నాకాశము తెలుపైయందుచంద్రుఁడుండుటచే

నీ యుపమానము సార్థకము. పంజరములందుఁ జిలుకలు గోరువంకలు లోనైన వానినేగాక హంసలనుగూడ నుంతురు.

"కృష్ణత్వదీయపద పంకజ పంజరాంత మద్యైవ మేవిశతు మానసరాజహంసః" ముకుందమాల. వెండి పంజరమందలి తెల్లని హంస యనుటచే ననుగుణాలంకారము. మందరప్రభాజితకందరస్థ = మందర పర్వతమందుఁ బ్రకాశించు గుహ యందున్న, మృగరాజము వైఖరి=సింహమువలె, సింహము తెలుపు, మందరము తెలుపు కావున నీ యుపమానము. భూరి=గొప్పదై, దుర్మద=చెడ్డ మదముచే, ఉద్వేజక=భయము కలిగించు, కుంజరస్థుఁడు=ఏనుఁగుపైనుండు వాఁడు, వీరు విధంబునన్=వీరునివలె, ఆకాశము స్వభావమున నలుఁపు గావున నీయుపమానము, అంబరస్థుఁడయి=ఆకాశమందున్నవాఁడై, ఇందు సాధారణ ధర్మము చెప్పలేదు కావున లుప్తోపమాలంకారము. రాజముఖీ వదనాభిరాముఁడై - రాజముఖీ=(చంద్రునివంటి ముఖముగల) స్త్రీల, వదన=ముఖమునవలె, అభిరాముఁడై =మనోహరమైన వాఁడై, స్త్రీలముఖమువంటివాఁడు చంద్రుఁ డనుటచే నుపమేయోపమాలంకారము. ఉపమానోపమేయములు పర్యాయంబునఁ గల్పించిన నుపమేయోపమయగు. ఇందు చంద్రునివంటి ముఖము, ముఖమువంటి చంద్రుండని కల్పింపఁబడెను.

## తాత్పర్యము

వెండి పంజరమందలి హంసవలె, మందర గుహయందున్న సింహమువలెఁ నేనుఁగుపై నున్న వీరునివలె నాకాశమునఁ జంద్రుఁడు, చంద్రముఖుల ముఖమువలె మనోహరుఁడై యుండెను.

చ. బలిసినతీక్ష్ణశృంగవృష♦భంబువరంబు విధంబు దోఁపఁగా
సలలితహేమశృంగ మగు♦సామజరాజము నోజఁ బాండురో
జ్జ్వలితమహోచ్చ శృంకర♦సాధరనాథు విధానఁ జంద్రుఁడున్
వెలసెను బూర్ణశృంగుఁ డయి ♦ విశ్వమనోజ్ఞవిభానుషంగుఁడై. ౨౦౧

అర్థములు. తీక్ష్ణశృంగ వృషభంబు=వాఁడికొమ్ములుగల యెద్దు, హేమశృంగమగు=బంగారుకొమ్ములుగల, సామజరాజము నోజన్=గొప్ప యేనుఁగువలె, పాండురోజ్జ్వలిత=తెల్లగాఁ బ్రకాశించెడి, మహోచ్చ=మిక్కిలి యెత్తైన. శృంగక=శిఖరము గల, రసాధరనాథువిధానన్=శ్రేష్ఠమగు పర్వతమువలె, పూర్ణశృంగుఁడయి=నిండిన కొమ్ములుగలవాఁడు, పాడ్యమి విదియ తదియలందు చంద్రుని కొనలు తెలిసినట్లు త్రయోదశినాఁడు స్పష్టముగాఁ దెలియవు. కొంచెము తక్కువగాఁ బూర్ణబింబమువలె నుండును. ఇచ్చట శృంగ మనఁగా గిరణము లని చెప్పుట సరిగాదు. విశ్వ=లోకులకు, మనోజ్ఞ = ఇంపైన, విభా=కాంతిచే,

అనుషంగుఁడై=కూడినవాఁడై, ఉత్తర శృంగమని, దక్షిణశృంగమని చంద్రుని కొనలకుఁ బేర్లు. ఇట్టి శృంగములు గల వాఁ డిప్పుడు శృంగములు లేనివాఁడై ప్రకాశించె నని భావము.

తాత్పర్యము

బలసిన వాడికొమ్ములుగల యెద్దువలె బంగారు కొమ్ములు గల యేనుఁగు వలె తెల్లని యెత్తైన శిఖరములు గల కొండవలె నుండు చంద్రుఁ డిప్పుడు పరిపూర్ణశృంగుఁడై లోకముల కింపైన కాంతి గలవాఁడై ప్రకాశించెను.

వంశస్థము. వినష్టశీతోదక•బిందుపంకుఁడున్, ఘనగ్రహ గ్రాహవి•నష్టపంకుఁడున్
వినోదలక్ష్మ్యాశ్రయ•నిర్మలాంకుఁడున్, వినిద్రరుగ్యు క్తిఁజ•నెన్ శశాంకుఁడున్.

అర్థములు. వినష్ట=నశించిన, ఇది పంక విశేషణము, శీతోదక=మంచుయొక్క, బిందు=తుంపరలను, పంకుఁడు=మాలిన్యము కలవాఁడు, అట్టి మాలిన్యము లేదని భావము. ఇది చంద్రునియందు సూర్యకిరణ సంబంధము చేత నని యెఱుఁగునది. ఇట్లు చెప్పుటచే మంచుకాలము పోయినదని భావము కావున నిది ఫాల్గునమధ్యమే. ఘనగ్రహ గ్రాహ వినష్టపంకుఁడున్=(౧) ఘనగ్రహ = గొప్పగ్రహములైన బృహస్పత్యాదులను, గ్రాహ=తనకిరణములచేఁ గప్పుటచేత, వినష్ట=నశించిన, పంకుఁడున్=కాంతి హీనత కలవాఁడు,తన కిరణములచే నితరగ్రహములను గాంతి తగ్గించి, తాను జక్కఁగ వెలుఁగుచున్నాఁడని భావము. (౨) ఘనగ్రహ=గొప్ప గ్రహమైన సూర్యుని యొక్క, గ్రాహ=కిరణ సంబంధముచే, వినష్ట=నశించిన, పంకుఁడున్=చీఁకటి గలవాఁడును. సూర్యకిరణ సంబంధముచేఁదాను వెలుఁగుచుఁ జీఁకటిని దొలంగించుచున్నాఁడని భావము. 'సలిలమయే శశిని రవే ర్దీధితయో మూర్ఛితా స్తమోనైశం। క్షపయంతి దర్పణోదర నిహితా ఇవమందిరస్యాంతః॥' అను వరహామిహిరాచార్యుని వాక్యము ప్రమాణము. సూర్యకాంతి యద్దముపైఁ బడి నేని యెట్లు ప్రతిఫలించునో యట్లే జలమయమైన చంద్రునియందుఁ బడిన సూర్యకాంతి ప్రతిఫలించి వెన్నెలగా వ్యాపించును.

వినోద లక్ష్మ్యాశ్రయ నిర్మలాంకుఁడున్=వినోద=ఆశ్చర్యకరమైన,లక్ష్మి= కాంతి విశేషమునకు, ఆశ్రయుఁడు కావున నిర్మలమైన కళంకముగలవాఁడు, అంకము=చిహ్నము, కళంకము తెల్లగా నున్న చంద్రునియందు నతని కళంకము పరభాగము చెంది వెలుఁగుచున్నదని భావము. శశాంకుఁడున్=కుందేటివంటి మచ్చగలవాఁడు, చంద్రునియందు భూచ్ఛాయ కుందేటివలెఁ బ్రతిఫలించు చున్నది. "లోకచ్ఛాయమయం లక్ష్మ తవాంకే శశసన్నిభమ్" అని హరివంశము. 'భూచ్ఛాయ మైచ్ఛవప్పరే' బిల్హణుఁడు. వినిద్రరుక్+యుక్తిన్=అధికకాంతితోఁ గూడిన వాఁడయి.

తాత్పర్యము

నశించిన మంచు బిందువుల మాలిన్యము కలవాఁడును,తన కాంతిచే బృహ

ష్పతి మొదలగు పెద్దగ్రహములకాంతి గప్పినవాఁడును, ఆశ్చర్యకరమైన కాంతి కాశ్రయమై నిర్మలమైన యంకము గలవాఁడునై విశేషకాంతితోఁ జంద్రుఁడు పోయెను.

క. చంద్రుఁడు విపులశిలాస్థమృ, గేంద్రుఁడునా, భీమసమర♦పృథ్వీగతనా
గేంద్రుఁడునా, రాజ్యాప్తిన, రేంద్రుఁడునా, వెలసె సితఖ♦గేంద్రునిమాడ్కిన్.

అర్థములు. విపుల శిలాస్థ మృగేంద్రుఁడు=విశాలమైన రాతిమీఁద నుండు సింహము, భీమసమరపృథ్వీగత=భయంకరయుద్ధభూమియందున్న, నాగేంద్రుఁడు=పెద్దయేనుఁగు, సితఖగేంద్రుని మాడ్కిన్=తెల్లని పక్షిరాజమువలె, హంసవలె.

తాత్పర్యము

విశాలమైన బండపైఁ గూర్చుండిన సింహమో, భయంకర యుద్ధభూమి యందున్న పెద్దయేనుఁగో, (ఐరావతము) రాజ్యము లభించిన రాజో యనునట్లు, హంసమువలెఁ బ్రకాశించెను.

దీనివలనఁ జంద్రబింబము నిర్మలముగా నుండె నని భావము.

శా. రాజద్రాజవినష్టదోషము సురా♦రాతిప్రవారామిష
భ్రాజద్భోజనవృత్తదోషము, లస♦ద్రామాభిరామేరితో
ద్వేజన్మానసదేశ దోష, మగుచున్♦వేడ్కం బ్రదోషంబు స్వా
రాజావాససమానతోషణము నై ♦ రాజిల్లెఁ దేజంబునన్. ౨౦౮

అర్థములు. రాజత్=ప్రకాశించుచున్న, రాజ=చంద్రునిచే; వినష్ట=నాశమైన, దోషము=చీఁకటి కలది, సురారాతి ప్రవార=రాక్షస సమూహములయు, ఆమిషభ్రాజత్+భోజన = మాంసమును జక్కఁగా భుజించువారియు, వృత్త దోషము=కలిగిన దోషము గలది, సంచార మనెడి దోషము గలది, రాత్రులందు రాక్షసులయు, మాంసభక్షకము లయిన మృగములయు సంచారము కలది. లసత్=ప్రకాశించు, రామా+అభిరామ=స్త్రీ పురుషుల, ఈరిత=ప్రేరింపఁబడిన, ఉద్వేజత్=మన్మథతాపముచే భయ పడుచున్న, మానస దేశ=మనస్సునందు, దోషము=దోషము, ప్రణయ కలహము గలది. చంద్రుఁడు విరహిణీ విరహులకు భయంకరుఁడు గదా. ప్రదోషంబు=ప్రదోష కాలము. ఈ దినము త్రయోదశి.

“త్రయోదశీ యదా రాత్రౌ, యామ స్తత్ర నిశాముఖే ప్రదోష ఇతివిజ్ఞేయో, జ్ఞానార్థీ మానమాచరేత్।” అను వాక్యమునుబట్టి యిప్పుడు తొమ్మిదిన్నర గంటయే యగుటచేఁ బ్రదోషమున్నది కాని పోలేదు. కొందఱు తలఁచి నట్లులది యర్ధరాత్రముగాదు. స్వారాజ=స్వర్+రాజ=స్వారాజ=ఇంద్రుని, ఆవాస=నివాసమైన స్వర్గముతో సమానముగా, తోషణము=సంతోషము కలిగించునది.

తాత్పర్యము

ఆ ప్రదోష కాలము ప్రకాశించు చంద్రునిచే నాశమైన చీఁకటి గలదియు, రాక్షసులయు, మాంసము భుజించు మృగములయు సంచారము గలదియు స్త్రీపురు

షుల మదన తాపముచేఁ గలిగిన మనస్సునందలి ప్రణయకోపము గలదియునై స్వర్గలోక సంతోషము వంటి సంతోషమును తన తేజస్సుచేఁ గలిగించెను.

ఉ. అత్తఱిఁ దంత్రినాద మలరారెను కర్ణసుఖప్రవృత్తమై
బిత్తరి మొత్తముల్ నిదుర పెల్చన నొప్పె హృదీశ వృత్తమై
హత్తెను క్రూరశీలపిశితాశనసంఘము రౌద్రవృత్తమై
తత్తఱచే వియుక్తవనితాతతి గుందె సుమేషుకృత్తమై. ౨౦౫

అర్థములు. అత్తఱిన్=ఆ సమయమందు, తంత్రినాదము=వీణెలు వాయింపఁగా బుట్టిన నాదము, కర్ణసుఖ ప్రవృత్తమై=చెవులకు సుఖము కలిగించినదియై, బిత్తరి మొత్తముల్=స్త్రీల గుంపులు, పెల్చన=అతిశయముచే, హృదీశవృత్తమై=భర్తల ననుసరించునదియై, క్రూరశీల=హింసాస్వభావముగల, పిశితాశనసంఘము=మాంసము భక్షించు వారి సమూహము, రౌద్రవృత్తమై=భయంకర వ్యాపారము గలదై, హత్తెను=ఒప్పెను, వియుక్త వనితాతతి=భర్తల విడిచియుండు స్త్రీజనము, సుమేషు కృత్తమై=మన్మథుని పూల బాణములచేఁ జీల్పఁబడినదై, కుందెన్=దుఃఖించెను.

తా త్ప ర్య ము

ఆసమయంబునఁ గర్ణరసాయనంబుగా వీణానాదము వినవచ్చెను. శృంగార చేష్టలు గల యువతులు నిద్ర యతిశయముచే భర్తల ననుసరించిరి. హింసాశక్తి గల మాంసభక్షక సంఘము రౌద్రకార్యములు చేయసాగెను. భర్తలను విడిచి యుండు స్త్రీలు మన్మథతాపముచే తత్తఱలాడి దుఃఖించిరి.

క. గృహములు మత్తోన్మత్తని,వహములు రథగజతురంగభద్రాసనసం
గ్రహములు శుభవీరరమా,వహములు గనుఁగొనియెఁ బ్లవగవల్లభుఁడచటన్.

అర్థములు. మత్త+ఉన్మత్త+నివహములు=మత్త=మద్యపానముచే దేహములు తెలియని వారలయు, ఉన్మత్త=చేయవలసిన కార్యముల మఱచిన వారలయు, నివహములు=సమూహములు, భద్రాసన=శుభకరములయినవాని సంపాదన కలది, శుభ=క్షేమకరములైన, వీరరమా=వీరలక్ష్మిని, ఆవహములు=కల్గినవి. గృహములకు విశేషణములు. త్రిప్రాసకందము.

తా త్ప ర్య ము

మత్తులు నున్మత్తులు గలవియు, తేరులేనుఁగులు గుఱ్ఱములు శుభాసనములు వీని సంపాదన గలవియు, వీరలక్ష్మిని గలవియు నగు గృహములను వానరపతి కనుఁగొనియెను.

— హనుమంతుఁడు లంకలో రాక్షస స్త్రీ పురుషులఁ జూచుట —

క. ఆక్షేపంబుల గురుభుజ, విక్షేపంబులను మత్తవివిధాలాపా
ధిక్షేపంబుల నన్యాధిక్షేపంబులఁ జెలంగు దితిజులఁ గాంచెన్. ౨౦౬

అర్థములు. ఆక్షేపంబులన్=పరిహాసములచేతను, భుజవిక్షేపంబులను= ఒకరిపై నొకరు చేతులు వేసికొనుట చేతను, మత్త=మద్యపానముచే దేహము తెలియక చేసెడి, వివిధాలాపాధిక్షేపంబులన్=నానావిధములైనమాటలు చెప్పుట చేతను, అన్యాధిక్షేపంబులన్=ఇతరులను బెదరించుట చేతను.

తాత్పర్యము

ఒకరినొకరు పరిహాసమాడుచు నొకరిపైనొకరు పూలో రాలో వేసికొనుచు మత్తతచేత నోరికి వచ్చినట్లు నానాభాషణము లాడుచు నితరులను బెదరించు రాక్షసులఁ జూచెను.

ఉ. ఱొమ్ములు విచ్చి దేహము లెఱుంగక కూర్కెడివారి, స్త్రీలగా
త్రమ్ములఁ గాలుఁ జేయి రుచిరమ్ముగ వైచి పరున్నవారి, రూ
పమ్ములు పెక్కురీతులుగ భాసిలువారిని, సారభూరిచా
పమ్ములు మీటువారిఁ, గనెఁ బావని పౌరనిశావిహారులన్.   ౨౦౮

తాత్పర్యము

ఱొమ్ములు తెఱచుకొని వెల్లకిలఁ బండుకొని నిద్ర పోవువారిని స్త్రీల దేహమ్ములపై నొక కాలు నొక చేయి వైచి ప్రక్కఁదిరిగి పండుకొన్నవారిని, నానావిధముల నలంకరించుకొన్నవారిని దృఢములైన పెద్ద విండ్లను మీటు వారిని పురవాసులైన రాత్రించరు లగు రాక్షసులను మారుతి జూచెను.

ఉ. ముచ్చట లాడువారి, నగుముద్దు మొగంబులవారి, నిద్రక
న్గ్రొచ్చెడివారిఁ, జందనమనోహరలేపముఁ బూయువారి, లో
నెచ్చిన నర్మకోపమున నెంతయు నూర్చుచు నున్నవారి, సొం
పచ్చు వడంగఁ గాంతులను బ్రార్థన చేసెడివారిఁ గన్గొనెన్.   ౨౦౯

అర్థములు. నర్మకోపము=భార్యాభర్తల ప్రేమ రూపక కోపము, ప్రణయ కోపము.

తాత్పర్యము

ముచ్చట లాడుచున్న వారిని, నవ్వు ముద్దుమొగము గలవారిని నిద్రచే తెప్పలు మూఁతలు పడువారిని తమ భర్తలకు గంధము మొదలగు మనోహరము లైన లేపములఁ బూయువారిని, భర్తలమీఁదఁ గోపగించి వారు పలుకరింపలేదని శ్వాసములు పుచ్చువారిని (కలహాంతరిత నాయిక) భర్తలను రతికై ప్రార్థించెడి వారిని స్త్రీలను హనుమంతుఁడు చూచెను.

క. వినదద్గజములు సభ్య, ప్రణమత్పూజ్యులు హ్రదాంతరస్థితపూపూ
నినదత్పక్షులను బోలెడి, వినిశ్వసద్వీరభటులు వెలయఁగఁ బురిలోన్.   ౨౧౦

అర్థములు. వినదత్+గజములు=ధ్వనించుచున్న యేనుఁగులు, సభ్య ప్రణమత్ పూజ్యులు=పెద్దలకు నమస్కరించు పెద్దలు, హ్రదాంతర స్థిత=మడుఁ

గులోనుండు, ఘూఘూనినదత్ఫణులను=ఘూఘూ యను చున్న పాములను, వినిశ్వసత్=బుసలు పుచ్చుచున్న, వీరభటులు=వీరులగు భటులు.

తాత్పర్యము

విశేషముగ ఘీంకారములు చేయు నేనుఁగులు పెద్దలకు నమస్కరించు పెద్దలు, మడుఁగులో నుండి ఘూత్కారములు చేయు పాములవలె నూర్పులు పుచ్చు వీరభటులు, వీరిని బురమందు హనుమంతుఁడు చూచెను.

సీ. సంవిత్ప్రధానుల ♦ సంశ్రద్ధధానుల, రుచిరాభిధానుల ♦ రూఢిమీఱు
విశ్వప్రధానుల ♦ వివిధవిధానులఁ, బురి యాతుధానులఁ ♦ బురుమనోజ్ఞ
రూపుల స్వగుణానురూపుల లనమాన,రూపుల బహుగుణ♦దీపితులను
మఱియు విరూపుల♦మానితపరిశుద్ధ, భావలను మహాను♦భావురాండ్రఁ

ఆ. బావనాధిసక్త♦భావలఁ దారకా,పటలలసితసుప్ర♦భావలను స
మీరసుతుఁడు గాంచె♦సారతరానంద,యుక్తి సౌధరాజి♦నుప్పరిగల. ౨౧౧

అర్థములు. సంవిత్ప్రధానులన్=గొప్ప బుద్ధిగలవారిని, సంశ్రద్ధధానుల=శాస్త్రములందు మిగుల శ్రద్ధగలవారిని; సంవిత్ప్రధానులని వెంటనే సంశ్రద్ధధానులనుటచే సంవిత్ప్రధానులనఁగా వేదబాహ్యులగు శూన్యవాదులగు బౌద్ధులనియు, సంశ్రద్ధధానులనుటచే శాస్త్ర విశ్వాసము గల యాస్తికులనియుఁ దోఁచుచున్నది. శూన్యవాదులగు బౌద్ధుల సంవిత్తు శుష్కాద్వైత వేదాంతుల వ్యావహారిక సత్యము రెండు సమానములు. జాబాలి చేసిన యీ వాదమునే శ్రీరామచంద్ర మూర్తి ఖండించి యాయనను జీవాట్లు పెట్టెను. ఈ కారణముచేనిది బౌద్ధమతాంతరమని వ్రాయఁబడెనని తలఁపరాదు. కడపటి శాక్య బుద్ధుఁడు తానేడవ బుద్ధుఁడనని తనకు ముందు తనవంటి వారార్గురు పోయిరని చెప్పెను. (చూ. అయో. ౨౮, ౫-౨౮౬-౨౮౭ ప) రుచిరాభిధానులన్=మంచిపేర్లు గలవారిని, విశ్వప్రధానులన్=ప్రపంచమున మేటులను వీరు సాంఖ్యులని తోఁచెడి, వివిధ విధానులన్=అనేకాకారములు గలవారిని, యాతుధానులన్=రాక్షసులను. పురుమనోజ్ఞరూపులన్=మిగులనందమయిన యాకారములఁ గలవారిని, స్వగుణానురూపులన్=తమగుణమునకుఁ దగిన వ్యవహారములు గలవారిని, అసమాన రూపులన్=ప్రకాశించు రూపములు గల వారిని, బహుగుణదీపితులన్=అనేక గుణములచే వెలుఁగు వారిని, విరూపులన్=వికారరూపములఁ గలవారిని, యాతుధానులఁ గనుఁగొనెనని యన్వయము. ఇఁక స్త్రీలు వర్ణింపఁబడు చున్నారు. మానిత పరిశుద్ధభావలను=గౌరవింపఁబడు నిర్మలమైన మనస్సులు గలవారిని, మహానుభావురాండ్రన్=పాతివ్రత్యమను గొప్పమహిమగల వారలను, పావనాధి సక్తభావలన్=భర్తలయందుఁ బరిశుద్ధమైన ప్రేమగలవారిని, తారకాపటల=నక్షత్రసమూహములవలె, లసిత=

ప్రకాశించు, సుప్రభావలను=దొడ్డవైభవము గలవారిని, ఉప్పరిగలన్=మేడల యందు, ఉపరిగృహము=తద్భవము ఉప్పరిగ.

తా త్ప ర్య ము

గొప్పబుద్ధి గలవారిని శాస్త్ర విశ్వాసము గలవారిని మంచిపేర్లు గలవారిని ప్రపంచమున మేటులను, అనేకాకారములు గలవారిని తమ గుణములకుఁ దగిన కార్యములు చేయువారిని ప్రకాశించు రూపములు గలవారిని అనేక గుణములచే వెలుఁగు వారిని వికార రూపములుఁగల వారిని రాక్షసులను జూచెను. మఱియు నిర్మల మనసు గలవారలును పాతివ్రత్య మహిమ గలవారలును భర్తలందుఁ బరిశుద్ధమైన ప్రేమ గలవారును నక్షత్రములవలె వెలుఁగు వారలును నగు స్త్రీలను సౌధముల మేడలయందు హనుమంతుఁడు చూచెను.

చ. భరితత్రపోపగూఢలను ♦ భాస్వరమోహరసైకరూఢలన్
వరరమణోపగూఢలను ♦ వల్లభమోహనకార్యమూఢలన్
సురుచిసుమోపగూఢకవి♦సుందరలం బ్రమదోపగూఢలన్
వరమతిభర్తృపోఢలను ♦ వానరనేత గనె న్నవోఢలన్. ౨౧౨

అర్థములు. భరితత్రపా+ఉపగూఢలను=సంపూర్ణమైన సిగ్గుచే నావరింపఁ బడిన వారిని, వీరు ముగ్ధనాయికలు, భాస్వర=ప్రకాశించు, మోహరసైక రూఢలన్=ప్రేమరసమే ప్రధానముగాఁ గలవారిని, వీరు మధ్యనాయికలు, వర రమణోపగూఢలను = అందముగల తమ భర్తలచేఁ గౌఁగిలింపబడిన వారిని, వీరు ప్రౌఢ నాయికలు, వల్లభ మోహన కార్యమూఢలన్=తమ భర్తలను మోహింప జేయు విధము తెలియని వారిని, వీరు బాలనాయికలు. సురుచి=మంచి కాంతిగల, సుమోపగూఢ=పువ్వులచేఁ గప్పఁబడిన, కవిసుందరలన్=ఆడు పక్షులవలె సుంద మైన వారిని, ప్రమద+ఉపగూఢలన్=సంతోషముచేఁ గ్రమ్ముకొనఁబడిన వారిని, వరమతి భర్తృ+ఉపోఢలను=గొప్పబుద్ధిగల భర్తలచేఁ బోషింపఁబడు వారిని, నవోఢలన్=స్త్రీలను.

ముగ్ధా మధ్యా ప్రౌఢా నాయికల లక్షణము నీ పద్యంబున నెఱుఁగనగును.

నవనవకామ యౌవన సనాథయు నల్పరతంబు గల్గు న
య్యువిదయె ముగ్ధ; మధ్య సదృశోదిత యౌవనకామయై రతాం
త వివశయౌ లతాంగి; సతత ప్రథితోల్బణ కామ యౌవనో
త్సవయు రతాది మోహమును దాల్చుతలోదరి ప్రౌఢ దానగున్. నరస భూ.

తా త్ప ర్య ము

సంపూర్ణమైన సిగ్గుచే నావరింపఁబడిన వారిని, ప్రేమరసము ప్రధానముగాఁగల వారిని, ప్రియముగల భర్తలచేఁ గౌఁగిలింపఁబడిన వారిని, భర్తలను మోహింపఁ జేయు విధము దెలియని వారిని,చక్కని కాంతిగల పువ్వులచేఁ గప్పబడిన యాఁడు

పక్షులవలె సంద మైన వారిని మిగుల సంతోషముచే గ్రమ్ముకొనఁబడిన వారిని, బుద్ధిమంతులగు భర్తలచేఁ బోషింపఁబడు వారిని, వయస్సు స్త్రీలను, మారుతి చూచెను.

చ. కనకగృహోపవిష్టలను • గాంతధవాంకసుఖోపవిష్టలన్
వినయకృతాత్మనాథసమ•భీష్టల ధర్మకళావిశిష్టలన్
ఘనమదనాభివిష్టల వి•కారవిదూరమనోజ్ఞ చేష్టలన్
గనియె నివిష్టలం బవను•గాదిలిపట్టి నితాంతహృష్టలన్. ౨౧౩

తా త్ప ర్య ము

కనకగృహ+ఉపవిష్టలను = బంగారు మేడలలోఁ గూర్చుండిన వారిని, కాంతధవాంక సుఖోపవిష్టలన్=అందముగల భర్తలయొడిలోఁ గూర్చుండినవారిని, వినయ కృతాత్మనాథ సమభీష్టలన్ = అణఁకువచేతఁ జేయఁబడిన తమ భర్తల కోరికలఁ గలవారిని, ధర్మకళావిశిష్టలన్ = ధర్మశాస్త్రజ్ఞానమందు గొప్పవారిని, ధర్మకార్యములఁ జేయువారిని, ఘన మదనాభివిష్టలన్=విశేషించి మదనునిచే నావేశింపఁ బడిన వారిని, వికార విదూర మనోజ్ఞ చేష్టలన్=వికార విదూర= చెడనివి, మనోజ్ఞ=ఇంపైన, చేష్టలన్=చేఁతలుగలవారిని, నివిష్టలన్=పెండ్లి కాఁబడిన స్త్రీలను, 'నివేశ శిబిరోద్వాహన్యాసేషు' అని విశ్వనిఘంటువు.

తా త్ప ర్య ము

బంగారు మేడలందుఁ గూర్చుండినవారిని, భర్తల యొడిలోఁ గూర్చుండిన వారిని, అణఁకువచేత పతుల యిష్టకార్యములఁ జేయువారిని, ధర్మశాస్త్రమందుఁ బ్రవీణలై ధర్మకార్యములు చేయువారిని, కామావేశము గలవారిని, నిలుకడ యయినవియు నింపైనవియునగు చేష్టలు చేయువారిని, వివాహములైన వారిని, మిగుల సంతోషించి యుండువారిని హనుమంతుఁడు చూచెను,

ఉ. కాంతసువర్ణవర్ణలను • గాంతవియోగవళక్షవర్ణలన్
గాంతవకేళ్యుదీర్ణలను • సత్కుసుకంచుకగౌరవర్ణలన్
గ్లాంతిగళత్స్వవర్ణలను • నాయకవిద్ధసుగంధిచూర్ణలన్
శ్రాంతవికీర్ణచూర్ణకచ•చారుస్రగబ్జనిగారకర్ణలన్. ౨౧౪

అర్థములు. కాంతసువర్ణ వర్ణలను=అందమైన బంగారువంటి వన్నెగల వారిని, కాంత వియోగ=భర్త నెడఁబాసి యుండుటచే, వళక్షవర్ణలన్=తెల్లని వన్నెగలవారిని, ఇది వైవర్ణ్యమను సాత్త్వికభావము. కాంతవకేళి=కంతు సంబంధము కాంతవము, సంబంధార్థక మత్వర్థీయము. అనఁగా మన్మథ సంబంధమైన యాటలందు, ఉదీర్ణలను=గొప్పవారిని, సత్కుసుకంచుక గౌరవర్ణలన్ = సత్కుసు = జాతివ, కుచాంశుక = పైఁటలు గలవారగుటచే, గౌరవర్ణలన్ = తెలియవచ్చు కుచ ప్రదేశమందలి పచ్చని కాంతిగల వారిని, దీనివలన రాక్షస స్త్రీలకు రైకలు లేవని యేర్పడుచున్నది.

సీతకును రవిక లున్నట్లు ప్రమాణము గానరాదు. కావుననే మళయాళ స్త్రీలు తమదనాది యాచార్యాచార మను చున్నారు. క్లాంతి=రతిశ్రమచే, గళత్=చెదరి పోయిన, కరఁగిపోయిన,సుపర్ణఁను=చెంపలందు స్తనములందు వ్రాయఁబడిన మకరికా పత్రములు గల వారిని, ఇప్పుడు కొందఱుస్త్రీలు పచ్చపొడిపించు కొన్నట్లు పూర్వకాలమందు కస్తూరి కుంకుమపువ్వు మొదలయిన వాని లేపముతో చెంపలందును స్తనములందును మొసళ్ళవలెఁ జేపలవలె స్త్రీలు చిత్రములు వ్రాసికొను చుండిరి. నాయక విద్ధ=భర్తలచే విసరి చల్లఁబడిన, సుగంధి చూర్ణలన్ = మంచి వాసనగల గంధపొడి గలవారిని, శ్రాంత వికీర్ణ చూర్ణ కచలను, చారుదృగబ్జ నిగార కర్ణలన్; అని విశేషణోభయ పదము. శ్రాంత=సురతశ్రమ కలవారు గనుకనే, వికీర్ణ=చెదరిన, చూర్ణకచ=ముంగురులు గలవారిని, చారు=అందమైన, దృగబ్జ=కమలములవంటి కన్నులచే; నిగార=మ్రింగఁబడిన, కర్ణలన్=చెవులుగల వారిని, కన్నులు దీర్ఘములై చెవుల దాఁక వ్యాపించి యున్నవని భావము. పై పద్యముతో నేకాన్వయము.

### తాత్పర్యము

అందమైన బంగారు వంటి దేహకాంతిగల వారిని, భర్త నెడఁ బాసిన విరహతాపముచే తెల్లబాఱిన వారిని, మన్మథకేళియం దాఱితేఱిన వారిని, పైఁటలు జాఱి పోవుటచేఁ గానవచ్చు పచ్చని స్తనములుఁ గలవారిని, రతిశ్రమముచేఁ గరఁగిపోయిన మకరికా పత్రములు గలవారిని, భర్త గంధపొడి చల్లిన వారిని, రతిబడలికచేఁ జిందరవందరలైన ముంగురులు గలవారిని చెవులదాఁక వ్యాపించిన నిడుపాటి కన్నులుగల వారిని.

ఉ. రామలఁ బ్రాప్తనాథపరి • రంభణహృష్టమనోభిరామలన్
శ్యామల నాత్మమందిరవి • హారకళాపరమాభిరామలన్
గోమలగాత్రవల్లులగు • కోమలఁ బ్రేమరసైకధామలన్
రాముని దూత గన్గొనియె • రాక్షసకేళిగృహాళిసీమలన్. ౨౧౫

అర్థములు. ప్రాప్తనాథ=స్త్రీలచే స్వయముగాఁబోయి పొందఁబడిన, భర్తల యొక్క, పరిరంభణ=కౌఁగిలింతలచే, హృష్టమనోభిరామలన్ = సంతోషించిన మనస్సుచే నొప్పినవారిని, శ్యామలన్=నడిమి వయస్సువారిని, 'శ్యామా యౌవన మధ్యస్థా' అమరుఁడు. ఆత్మమందిర=తమ యిండ్లయందే విహారకళా=విహరించు వారగుటచే, పరమాభిరామలన్=మిగుల మనోహరలైన వారిని, వీరు సంపదచే నెండకన్ను వానకన్నెఱుఁగక యున్నవారో, లేక ఘోషాలో(పరదా పద్ధతిచేనిల్లు విడిచి వెలుపల బోని కులపాలికలో) తాము వెలుపలఁబోక తమ యిండ్ల కేవిటుల రప్పించుకొను వేశ్యలని కొందఱయభిప్రాయము. కోమలగాత్ర వల్లులగు=మృదువైన తీఁగలవంటి దేహముగల, కోమలన్=స్త్రీలను, రూ. కొమ్మ. ప్రేమరసైకధామలన్=

ప్రేమరసమునకే స్థానములైనవారిని,ఇట్టి రామలన్=స్త్రీలను, రాక్షసకేళి గృహాళి సీమలన్=రాక్షసకేళి గృహ ప్రదేశములందు, రాముని దూత=హనుమంతుఁడు, కన్గొనియెన్=చూచెను.

### తాత్పర్యము

భర్తలయొద్దకు దామే పోయి వారిచేఁ గౌఁగిలింపఁబడి సంతోషించిన మనస్సు గలవారిని, నడి ప్రాయపు వారిని, తమ యిండ్ల యందే విహరించువారిని, తీఁగవలె మృదువైన దేహములు గల స్త్రీలను, విశేష ప్రేమకు స్థానమైన వారిని, రాక్షసుల పడకటిండ్లయందుఁ గ్రీడామందిరంబులందు హనుమంతుఁడు చూచెను.

క. బాలికలన్ శశినిభముఖ, మాలికలన్ వక్రపక్ష్మ♦మంజులతరదృ
క్పాళికలం గనె భూషణ,మాలికలం జంచలార♦మాజాలకలన్. ౨౧౮

అర్థములు. బాలికలన్ = పడుచులను, శశినిభ ముఖ పాలికలన్=చంద్రునితో సమానమైన ముఖముల వరుసలు గలవారిని, వక్రపక్ష్మ=ముత్తెపుఁ జిప్పలవలె వంకరమైన కనుఱెప్పల వెండ్రుకలచే, మంజులతర=మిగుల సందమైన, దృక్+పాళికలన్=కన్నుల సమూహములు గలవారిని, భూషణ మాలికలన్=ఆభరణముల వరుసలు గలవారిని, చంచలారమా జాలకలన్=మెఱుపు కాంతుల సమూహము గలవారిని.

### తాత్పర్యము

లేత ప్రాయపు పడుచులను, చంద్రునివంటి ముఖములు గలవారిని, వంకరలగు కనుఱెప్పల వెండ్రుకలు గల కన్నులు గల వారిని భూషణముల ధరించిన వారిని మెఱుపు తీఁగల వంటి వారిని స్త్రీలను హనుమంతుఁడు చూచెను.

సీతను వెదకుచున్న హనుమంతుఁడు స్త్రీల ముఖనేత్రములఁ జూచుట వీరు దేవజాతులా, మనుష్యులా, రాక్షసస్త్రీలా, యని పరీక్షించుటకును, ఆభరణపరీక్ష, సీతాభరణ స్వరూపము నిర్ధారించుట కనియును దెలియవగు. సీతాదేవిని జూచినపుడు ఈమె సీతయని నిర్ణయించుట యందామె యాభరణము లొక ముఖ్యవిషయముగా హనుమంతుఁడు గ్రహించె నని 'జానకి సొమ్ము లటంచును, మానవవిభుదేవి పలికె మా కపియెల్లన్, గానఁగ నయ్యెడిఁ గుజశాఖానికరము లందు వ్రేలి కలికికి నఱుతన్,' అని చెప్పఁగలఁడు.

క. సీతను రాజాన్వయసం,జాతను బరమాభిజాత♦సద్వ్రతపూతన్
స్ఫీతస్ఫుటలతికానిభ,జాతను గపి మానసాభి♦జాతఁ గనండున్. ౨౧౯

అర్థములు. రాజాన్వయ సంజాతను=రాజవంశమునఁ బుట్టిన దానిని, పరమాభిజాత=మిక్కిలి మనోహరమగు దానిని, సద్వ్రత పూతన్=మంచివ్రతముచేఁ బవిత్రురాలిని; భర్తృవియోగమందు బతివ్రతయగు స్త్రీ యెట్టులుండవలెనో యట్టులుండు దానిని; స్ఫీత స్ఫుటలతికానిభ జాతను=కొంచెము లావై స్పష్టముగఁ

గనఁబడెడి సన్నని తీఁగవంటి దేహము గలదానిని, జాతబద్ధము జన్మాశ్రయ దేహ లాక్షణికము. మానసాభిజాతను=(౧) అయోనిజను (౨) వేదవతీ జన్మమున సీతగాఁ దాను బుట్టవలెనని సంకల్పించుకొని పుట్టినదానిని(చూ. ఉత్తర. ప ౩౯౫ ౩౬౦ ప.)

'సంభవా మ్యాత్మ మాయయా'యని భగవంతుఁడు తన సంకల్పముచేఁ దాను జనించినట్లు లక్ష్మియును దన సంకల్పముచే జనించునని భావము.

తా త్ప ర్య ము

తానుజూచిన స్త్రీలయందు హనుమంతుఁడు రాజవంశమునఁ బుట్టినదానిని ఒకవేళఁ బుట్టినను అంతటి మనోహరను, ఒకవేళ నంతటి మనోహర యయినను భర్త సమీపమున లేనపుడు పతివ్రత యెట్టులుండవలెనో యట్టులుండు దానిని దీఁగవంటి దేహము గలదానిని స్వసంకల్పముచే నయోనిజగా బుట్టినదానిని జూడలేదు.

సీ. వరసనాతనపథ•స్థిరసన్నివిష్టను, బ్రాణేశముఖలోక•నైకహృష్టఁ
గామాభివిష్ట సు•కాంతావిశిష్టను, నాత్మవల్లభహృద•యప్రవిష్ట
విరహతాపోద్భవా•విరళాశ్రుకంఠిని, రమ్యపక్ష్మల నభి•రక్తకంఠిఁ
దరుణిఁ బురావరో•త్తమనిష్కకంఠిని, నిష్కుటసంచర•న్నీలకంఠి
తే. నబ్జరేఖనుబోలె న•వ్యక్త రేఖ, పాంసుపరిదిగ్ధ మగు నవ•భర్మ రేఖ
వ్రణమునను లెస్సనాటిన•బాణరేఖ, యనిలభిన్నాభ్ర రేఖనాఁ•దనరుదాని.

అర్థములు. వర=శ్రేష్ఠమైన, సనాతన=శాశ్వతమై, యనాదియైన, పథ=మార్గమున. పతివ్రతల మార్గమున, స్థిరసన్నివిష్టను = స్థిరముగా నుండుదానిని, ప్రాణేశముఖ లోకనైకహృష్టన్=భర్తముఖము చూచుటచేతనే సంతోషించునది, తక్కినదేదియు నామెకు సంతోషకరము గాదని భావము, కామాభివిష్టను=కనుక నే భర్తతో గలియవలెనను పట్టుదల గలదానిని, సుకాంతావిశిష్టను=చక్కని యందగత్తెలలో గొప్పదానిని, ఆత్మవల్లభ హృదయ ప్రవిష్టను=తన భర్త హృదయమందుఁ బ్రవేశించియుండు దానిని, విరహతాపోద్భవ = వియోగతాపముచేఁ గలిగిన, అవిరళ=దట్టమైన, అశ్రు=కన్నీటిచే నడ్డగింపఁబడిన, కంఠిని=కంఠముగల, లేక, తడిసినకంఠము గలదానిని, రమ్యపక్ష్మల=అందమైన ఱెప్పలుగలదానిని, అభిరక్తకంఠిన్ = రంజకమైన కంఠధ్వని గలదానిని, తరుణిన్ = ప్రాయపు దానిని, పురా + వర + ఉత్తమనిష్క కంఠిని = పూర్వము భర్తయొద్ద నున్నప్పుడు కోరఁబడునదియు శ్రేష్ఠమైన పతకము మెడయందుఁ గల దానిని, నిష్కుట సంచరన్నీలకంఠ = వనమునందు సంచరించునాఁడు నెమలి వంటి దానిని, అబ్జరేఖనుబోలెన్ = చంద్రరేఖవలె, పాడ్యమినాఁటి చంద్రునివలె. అవ్యక్తరేఖన్ = స్పష్టముగాఁ గానరాని యాకారముగల దానిని, పాంసు పరిదిగ్ధమగు=దుమ్ముచేఁ గప్పఁబడిన, నవభర్మరేఖ=క్రొత్త బంగారు సలాకు వంటి దానిని, పారిశుద్ధ్యము స్వభావము, మాలిన్య మాగంతుక మని యీ యుప

మానము దెలిపెడిని, వ్రణము=పుండు, అనిల భిన్న=గాలిచేఁ జెదరఁగొట్టబడిన, అభ్ర రేఖ=సన్న మేఘము.

తా త్ప ర్య ము

శ్రేష్ఠమైన సనాతన ధర్మమార్గమందు స్థిరముగా నుండుదానిని, భర్త ముఖము చూచుట చేతనే సంతోషించుదానిని, కావుననే ఆయనను గూడుట యందుఁ బట్టుదల గలదానిని,అందగత్తెలలో శ్రేష్ఠురాలైన దానిని, భర్తహృదయ మందుఁ బ్రవేశించి యుండుదానిని. విరహతాపముచే జనించిన కన్నీటిచేఁ దడిసిన కంఠము గలదానిని, అందమైన రెప్పలు గలదానిని, రంజకమయిన కంఠస్వరము గలదానిని, ప్రాయపుదానిని, పూర్వమునందుఁ గోరఁబడిన శ్రేష్ఠమగు పతకము గల దానిని, వనమునఁ దిరుగు నాఁడు నెమలివంటి దానిని, పాడ్యమినాఁటిచంద్రుని వలెఁ గాంతి హీనమై శుష్కించి స్పష్టముగఁ గానరాని దానిని, ధూళిగప్పిన క్రొత్త బంగారుకడ్డివంటి దానిని, పుండునందు గ్రుచ్చుకొన్న బాణమువంటిదానిని, (అంత బాధపడు దానిని,) గాలికిఁ జెదరవందరయైన సన్న మేఘమువంటిదానిని, సీతాదేవిని హనుమంతుఁడు చూచిన వాఁడు కాఁడయ్యెను.

దోదకము. సీతను రాముని♦శ్రీతరళాక్షిన్, వాతతనూజుఁడు♦పట్టనమందున్
భీతిల కారసి♦వేదిజ లేమిన్, జాతమహావ్యథ♦సంకటమందెన్. ౨౧౯

అర్థములు. ఆరసి=వెదకి, వేదిజ=సీత, వేది రూపాంతరము వేదీ. యజ్ఞము చేయుచోటఁ బుట్టినది. దోదకమునకు మూఁడు భగణములు, రెండు గురువులు, ఏడింట యతి.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రమూర్తి భార్యయగు సీతాదేవిని భయపడక యన్ని రహస్య స్థలము లందుఁ గూడ వెదకియుఁ గానరామిని మిగుల సంకట పడెను.

—♦ ౬-వ సర్గము. హనుమంతుఁడు రావణాలయంబుఁ జూచుట. ♦—

తే. వెదకి వెదకియు రాక్షస♦నిలయములను
సీతఁ గానక సవిషాద♦చిత్తుఁ డగుచుఁ
గామరూపంబుఁ దాల్చి లా♦ఘవము మెఱయ
వెండి నొకమాటు పావని ♦ వెదకఁ దొడఁగె. ౨౨౦

తా త్ప ర్య ము

రాక్షసుల యిండ్లయందు సీతాదేవిని వెదకి వెదకి గానక దుఃఖిత హృదయుఁడగుచుఁ గోరిన రూపము ధరించి మునుపటికంటె హెచ్చరికగాను వేగముగను మఱియొక సారి వెదక నారంభించెను.

క. కేసరులు గావ నెల్లెడ, భాసిల్లు మహావనంబు♦భాతిని దుష్పూ
రాసురసంఘము గావఁగ, వాసిం గని యర్కవర్ణ♦వప్రావృత మై. ౨౨౧

అర్థములు. అర్కవర్ణప్రావృతమై=సూర్యకాంతిగల ప్రాకారముచేఁ జుట్టఁబడినదై, ఇది దివిజారి భవనమునకు విశేషణము.

### తాత్పర్యము

సింహములు గావఁగా నిరపాయముగా నుండు వనమువలె మిగులఁ గ్రూరులగు రాక్షసులు గాచుటచేఁ గీతిన్‌గని సూర్యునికాంతిగల ప్రాకారముచేఁజుట్టఁబడి-

సీ. దేదీప్యమాన మా♦దివిజారిభవనంబుఁ, గని ముక్కునను వ్రేలు♦గదియఁ జేర్చి
రూప్యకోపహితాభి♦రూపమణీహేమ,భూషితతోరణ♦పుంజ మగుచుఁ
జిత్రకక్ష్యంబులఁ♦జెలువారి రుచిర మా,ద్వారపంక్తులచే సు♦దార మగుచు
వారణారూఢు లా♦బరికాండ్రచేతను, శ్రమ మెఱుంగని శూర♦రాజిచేత

తే. శోభితం బయి త్రొక్కని♦చోట్లు త్రొక్కు
యుగ్యములచేతఁ బులులయు ♦ నుగ్రసింహ
ములయుఁ జర్మములను గప్పి ♦ మొనసి దాంత
కాంచనాంచిత మగు రథ♦గణముచేత. ౨-౧-౨

అర్థములు. దివిజారి భవనంబుఁ గని=రావణునింటినిఁ జూచి, రావణు గృహము హనుమంతుఁడు ప్రవేశించినట్లు ముందు చెప్పఁబడెను. మఱల నిప్పుడు చూచెనని చెప్పుటేలయనిన మొదట రావణాంతఃపురమందు సీత యున్నదని చెప్పుటచేత నందు వెదకుద మని ప్రవేశించెనుగాని జాముఱాత్రియే యయి యుండుటచే నందఱు నిద్రింపక మేలుకొనియుండిరి. ఆ కారణముచే మఱల వెలుపలికివచ్చి లంకాపురమున వెదకెను. గనుకనే లంకాపుర స్త్రీలు మొదల యినవారు వర్ణింపఁబడిరి. ఇప్పు డంతకంటెఁ బ్రొద్దు పోయిన కారణముచే మఱల రావణు గృహమునొద్దకు వచ్చెనని గ్రహింపవలయును.

దేదీప్యమానము=తళతళ ప్రకాశించునది. రూప్యక+ఉపహిత=వెండిచేఁ జేయఁబడినదియు, అభిరూపమణీ హేమభూషిత=మంచిరత్నములచేతను, బంగారు చేతను నలంకరింపఁబడినది, తోరణపుంజము=తోరణముల సమూహము గలది, చిత్రకక్ష్యంబులు=వింతలగు తొట్టికట్లు, వారణారూఢులు=ఏనుఁగుల నెక్కినవారు బరికాండ్రచేతను=మావటివాండ్రచేతను, త్రొక్కనిచోట్ల త్రొక్కు=మిగుల వేగముగఁబోవు, యుగ్యములచేత=తేజీకిగట్టెడి గుఱ్ఱములచేత, దాంతకాంచన అంచితమగు=దంతములచేతను బంగారుచేతను ప్రకాశించునదియు.

### తాత్పర్యము

ధగద్ధగాయమానముగ వెలుఁగుచున్న రావణు గృహముఁ జూచి యాశ్చర్యమున ముక్కుపై వ్రేలుంచుకొని వెండితోఁ జేయఁబడినవియు, మేలైన రత్నములు బంగారు చేతను నలంకరింపఁబడినదియు నగు తోరణ సమూహము కలిగివింతలగు తొట్టికట్లు కలిగి యందమయిన ద్వారములచే, విశేషించి యేనుఁగు లెక్కిన మావ

టీల చేతను, కష్టము తెలియని శూరుల చేతను, శోభించి యతివేగముగఁ బోవు తేరి గుఱ్ఱముల చేతఁ బులులయు సింహములయుఁ జర్మములచేఁ గప్పఁబడి దంతము బంగారుతోఁ బ్రకాశించు తేర్ల గుంపుల చేత.

సీ. రహిమీఱుచు నమూల్య♦రత్నసమాకీర్ణ, మై పరార్ధ్యాసన♦మగుచు మఱియు
నతిరథావాస మై♦ యతులరథంబులు, నతులపీఠంబులు ♦ నమర బహుళ
విధమృగంబులచేత♦వికిరసంఘముచేతఁ బరిపూర్ణమగుచు ని♦ర్భయత రేఁగు
నంతపాలురచేత ♦ నభిరక్షితంబయి, యాత్మకెక్కన మెచ్చు♦లాఁడు లొప్ప

తే. బలుపు వెన్నెలపులుఁగుల♦బవిసి యార్చు
కన్నుఁగవ లొప్పు ప్రమదల♦కనకరత్న
భూషణంబుల రాపున♦ బొడము నులివు
లబ్ధిరావంబు నటు లుండు♦మనుచు నుండ. ౨౩

అర్థములు. రహిమీఱుచు=బాగుమీఱుచు, అమూల్యరత్న సమాకీర్ణమై=వెలలేని మణులచేఁ గూడినదై, పరార్ధ్యాసన=గొప్పపీఠములు గలది, అతిరథ+ఆవాసమై=అతిరథులకు స్థానమై, పెక్కు విలుకాండ్రతోఁ బోరెడి యోధుఁడు అతిరథుఁడు, వికిర=పక్షుల, అంతపాలురచేతన్=గృహము వెలుపల రక్షించు వారిచేత, ఉలివులు=ధ్వనులు, అటులుండు మనుచు=తిరస్కరించుచు.

“స్పర్ధతే, జయతి, ద్వేష్టి, ద్రుహ్యతి, ప్రతిగర్జతి, ఆక్రోశ త్యవజానాతి, కదర్థయతి, నిందతి, తస్య చానుకరోతీతి శబ్దాః సాదృశ్యవాచకాః। ఉపమాయా మిమే ప్రోక్తాః కవీనాం బుద్ధిసంపదాః॥” దండి. కావున నిది యుపమావాచక మని యెఱుఁగునది.

## తాత్పర్యము

బాగు మీఱి వెలలేని రత్నములచే నిండినదై పెద్దపీఁటలు గలిగి, యతిరథులకు వాసస్థానమై యసమానములైన తేర్లు, పీఁటలు నొప్పుచుండ, అనేక విధములైన మృగములచేతను, పక్షుల గుంపులచేతను, నిండి భయములేక విజృంభించు వెలుపలి కావలివారిచేఁ జక్కఁగఁ గాపాడఁబడి మనస్సునకుఁ దృప్తిని గలిగించు మెప్పులకుప్పలగు స్త్రీలను గలదై, బలసిన చకోర పక్షులతో సమానములైన కన్నులుగల స్త్రీల బంగారు, మణుల భూషణముల రాపిడిచేఁ బుట్టిన ధ్వనులు సముద్రధ్వనులను బోలియుండ.

తే. చందనాగరుధూపవా♦సనలు నిండ, భేరికామర్దలధ్వనుల్♦బోరుకొనఁగ
నిశిచరావిరతాభ్యర్చ♦నీయ మగుచు, నబ్ధిగంభీర మగు రావ♦ణాలయంబు. ౨౪

అర్థములు. నిశిచర=రాక్షసులచే, అవిరత=ఎడఁదెగక, అభ్యర్చనీయ మగుచు=పూజింపఁబడినదై, అబ్ధి గంభీరము=సముద్రమువలె గంభీరమైనది.

తా త్ప ర్య ము

చందనము, అగరు పీని ధూపముల వాసనలు నిండఁగా భేరులయు, మద్దెలలయు ధ్వను లతిశయింప, రాక్షసులచే సర్వదా పూజింపఁబడుచు సముద్రమువలె గంభీరమైన రావణ గృహము.

క. పొంకంబుగ హయవారణసంకులమై వివిధరత్న•జాలక వేశ్మా
లంకృత మవుదానిని గని, లంకాభరణంబుగాఁ దఁ•లఁచి నికటమునన్. ౨౨౫

అర్థములు. హయవారణ సంకులమై=గుఱ్ఱములచే, నేనుఁగులచే నిండినదై; వివిధ రత్నజాలక=నానావిధములయిన మణులు, గవాక్షములు గల యిండ్లచే నలంకరింపఁబడిన దానిని;నిది లంకకు నలంకారమైనదని తలఁచి దాని సమీపమున

చ. వెదకెను రాక్షసావళుల•వీడును వీడును వాడ వాడయున్
వదలక తోఁట తోఁటయును • వానరవర్యుఁడు దొడ్డి దొడ్డియున్
గొదకొని మేడ మేడయును • గూటము కూటము మూల మూలయున్
మది వెఱలేక తా విసివి • మానక కార్యభరంబు పెంపునన్. ౨౨౬

అర్థములు. రాక్షసావళుల=రావణు సోదరులు మున్నగు రాక్షసుల, గొదకొని=త్వరపడి, వెఱలేక=భయముపడక, విసివి మానక=విసుఁగుచే వదలక.

తా త్ప ర్య ము

సులభము.

—•హనుమ రాక్షసముఖ్యుల యిండ్లయందు సీతాదేవిని వెదకుట,•—

సీ. వేగ ప్రహస్తుని•వీటికి లంఘించి, యెలమి మహాపార్శ్వు•నిక్కఁ కెగిరి
కందతుల్యము కుంభ•కర్ణసౌధముఁ జొచ్చి, యల విభీషణువాస•మధిగమించి
యట మహోదరవిరూ•పాక్ష విద్యుజ్జిహ్వ, లిండ్లు విద్యున్మాలి•గృహమునరసి
వజ్రదంష్ట్రునిశాల•వలనొప్పఁగా రోసి, శుకసారణులసభల్ సారిది • నెమకి
తే. యింద్రజిత్తునివేశ్మంబు•నెల్ల వెదకి, జంబుమాలి సుమాలుల•సదనములను
రశ్మికేతువుసూర్యశ•త్రువుల నెలవు, వజ్రకాయునిగేహంబు•వరుసజూచి. ౨౨౭

అర్థములు. ఇక్క=ఇల్లు, కందతుల్యము=మేఘముతో సమానము. కం+ద=నీళ్లు నిచ్చునది, శాల=గృహము, వేశ్మంబు=గృహము.

తా త్ప ర్య ము

శీఘ్రమునఁ బ్రహస్తునింటికి దాఁటి, మహాపార్శ్వ నింటికి నెగిరి, మేఘముతో సమానమైన కుంభకర్ణ గృహము ప్రవేశించి విభీషణు నిల్లుఁజొచ్చి, మహోదర విరూపాక్ష విద్యుజ్జిహ్వ విద్యున్మాలి వజ్రదంష్ట్రి శుకసారణులయు, నింద్రజిత్తుజంబుమాలి సుమాలి రశ్మి కేతువు సూర్యశత్రువు వజ్రకాయుఁడు వీరల యిండ్లు వెదకి.

సీ. బలులు ధూమ్రాక్షసం•పాతినామకులు విద్యుద్రూపభీములు•నుగ్రులైన
ఘనుఁడు విఘనుఁడు వి•కటుఁడు వక్రుండును, శరశుకనాస రా•క్షసప్రవరులు

బ్రహ్మకర్ణుండు దంష్ట్రిధ్వజగ్రీవయు ద్ధోన్మత్తమత్తులు♦నుదుటు మీఱు
రోమశుండును మఱి♦క్రూరవిద్యుజ్జిహ్వ హస్తిముఖేంద్రజి♦హ్వప్రవరులు
తే. శోణితాక్షపిశాచులు♦శూరు లైన, యా కరాళుండు నివసించు♦నాలయముల
వరుస దప్పక యా గంధ♦వహసుతుండు,తగవు మఱవక వెదకు సీ♦తావధూటి.

అర్థములు. ఉదుటు=గర్వము.

తాత్పర్యము

బలవంతులైన ధూమ్రాక్షుండు, సంపాతి, విద్యుద్రూపుఁడు, భీముఁడు, ఘనుఁడు, విఘనుఁడు, వికటుఁడు, వక్రుఁడు, శఠుఁడు, శుకనాసుఁడు, బ్రహ్మకర్ణుఁడు, దంష్ట్రిధ్వజ, గ్రీవ, యుద్ధోన్మత్త మత్తులు, రోమశుఁడు, విద్యుజ్జిహ్వ హస్తి ముఖేంద్రజిహ్వులు, శోణితాక్షుఁడు, పిశాచుఁడు, కరాళుఁడు, వీరుండు, గృహముల నన్నిఁటిని వరుస దప్పక హనుమంతుఁడు వెదకెను.

—♦ హనుమంతుఁడు రావణగృహంబుఁ జొచ్చుట ♦—

ఉ. ఈ విధి వారు వారు వసి♦యించు గృహంబుల నెల్ల రోసి యా
పావని పాశతోమరకృ♦పాణసుముద్గరశూలహస్తలై
కావలికాచు స్త్రీల నుప♦కంఠమునన్ శయనించువారి ర
క్షోవిభుమందిరంబునను♦జూచి తదంతరసీమలోపలన్. ౨౯

అర్థములు. తోమర=చిల్లకోలయను నాయుధము, కృపాణ=కత్తి.

తాత్పర్యము

ఈ ప్రకారము వారు వారు కాపురముండు నిండ్లయందు వెదకి యాంజనేయుఁడు పాశములను, చిల్లకోలలను, కత్తులను, ముద్గరములను, శూలములను, చేతియందు ధరియించి కావలియుండు స్త్రీలను సమీపమున శయనించువారిని రావణు గృహమందుఁజూచి దాని లోపలి ప్రదేశమందు.

క. నానావిధసాధనముల, మానుగ ధరియించు యుద్ధ♦మర్మజ్ఞుల ర
క్షోనిచయము రక్తసితా,జానేయంబులను జూచె♦జవనాఢ్యములన్. ౩౦

అర్థములు. రక్తసిత+ఆజానేయములను=ఎఱ్ఱని, తెల్లని యుత్తమజాతి గుఱ్ఱములను.యుద్ధమర్మజ్ఞుల,రక్షోనిచయము=మహత్సమూహార్థక శబ్దం మహతాకార్యయుక్తంబయ్యె తద్విశేషణ క్రియలు మహతాకార్య యోగ్యంబులు విభావనగు, త్రి. శ. ౧౬. జవనాఢ్యములన్=వేగసంపత్తిగలవి.

తాత్పర్యము

అనేకవిధము లయిన యాయుధముల ధరించి యుద్ధరహస్యము తెలిసిన రాక్షస సమూహములను, అతివేగముగఁ బోఁగల ఎఱ్ఱని, తెల్లని యుత్తమజాతి గుఱ్ఱములను హనుమంతుఁడు చూచెను.

క. పరగజపీడాకరములఁ, బరసేనామర్దనముల ♦ వరకులజములన్
హరిహయగజనిభములఁ గే,సరిసూనుఁడు గాంచె రూప♦సంపన్నములన్. ౨౩౧

అర్థములు. పరగజపీడాకరములన్=శత్రువుల యేనుఁగులను బాధించునవి, పరసేనా మర్దనములన్=శత్రుసేనలఁ జంపునవి వరకులజములన్ = గొప్పకులము లందుఁ బుట్టినవి; హరిహయగజ=ఇంద్రుని యేనుఁగగు నైరావతముతో, నిభములన్=సమానములైనవి, రూపసంపన్నములన్=ఆకార సంపత్తి గలవానిని.

తాత్పర్యము

శత్రువుల యేనుఁగులను, శత్రుసైన్యములను నాశము చేయునవియు, నుత్తమజాతిఁ బుట్టినవియు, నింద్రుని యైరావతముతో సమానమైనవియు, నాకార పుష్టి గలవియు నగు నేనుఁగుల హనుమంతుఁడు చూచెను.

క. కురిసెడు జలదములో యనఁ, దొరఁగెడినిర్ఝరచయంబు♦తోడి గిరు లనన్
గురుగర్జన్మేఘము లనఁ, బరఁగెడి పరదుర్జయముల♦వారణమణులన్. ౨౩౨

అర్థములు. నిర్ఝరచయంబులు=కొండవంకలు, గర్జత్+మేఘములు= ఉఱుముచున్న మేఘములు, పరదుర్జయములు=ఇతరులకు జయింపరానివి, వారణ మణులన్=ఉత్తమ గజములను.

తాత్పర్యము

వాన కురిసెడి మేఘములో, సెలయేళ్లు పాఱిన కొండలో యనునట్లుమదము కాఱుచున్నట్టివియు గొప్పగా నుఱుము మేఘములవలె ఘీంకరించునవియు, వేఱు గజములకు, శత్రువులకు జయింపరానివి యగు శ్రేష్టములైన యేనుఁగులను మారుతి చూచెను.

సీ. తతకాంచనపరిష్కృ♦తంబులౌ తరుణార్క,సన్నిభ వాహినీ♦సంఘములను
నైకాకృతుల నొప్పు♦నాందోళికలను వి,చిత్రలతాగేహ♦చిత్రనిలయ
కేళీగృహంబులఁ♦గ్రీడింప దారుప,ర్వతములఁ గామకా♦రణ గృహముల
మంజుదివాగృహ♦మందరప్రఖ్యమ,యూరతలంబుల;♦నొప్పు నిఱు
తే. లొక్కములల దండములను బా♦టించి చూడఁ
దగిన నిధిజాలముల నొప్పి♦ధగధగాయ
మాన మగుచుఁ గైలాసస♦మాన మైన
రావణుని వీడు గనుఁగొనె ♦ రాముదూత. ౨౩౩

అర్థములు. పరిష్కృతంబులు=అలంకరింపఁబడినవి, తరుణార్కసన్నిభ=లేత సూర్యునితో సమానములైన, వాహినీ=సేనల,నైకాకృతులన్=అనేకాకారములను ఆందోళికలన్=పల్లకులను, దారు పర్వతములను=కొయ్యలోఁ జేయఁబడినకృత్రిమ క్రీడా పర్వతములను,కామకారణ గృహములన్=కామము గలిగించు నిండ్లను,దివా

గృహ=పగలు క్రీడింపఁ గట్టఁబడిన యిండ్లను, మందరప్రఖ్య=మందరపర్వతముతో సమానమైన, మయూర తలంబులన్=పెంపుడు నెమిళ్ళ నివాసస్థలములను.

తాత్పర్యము

విస్తారముగ బంగారుచే నలంకరింపఁబడి బాలసూర్యునితో సమానములైన సేనల సమూహములను, అనేక రూపములు గల పల్లకీలను, చిత్రముగా నల్లిన తీఁగలచే నిర్మింపఁబడిన యిండ్లను, చిత్రములైన క్రీడాగృహంబులను క్రీడించుటకై కొయ్యలచే నిర్మింపబడిన పర్వతములను, కామము వృద్ధిచేయు నిండ్లను, పగటివేళఁ గ్రీడింప ననువైన యిండ్లను, పెంపుడు నెమిళ్లుండుటకై కట్టఁబడిన మందరముతో సమానమైన ప్రదేశములను, ధ్వజదండములను, నిధుల సమూహములను గలిగి ధగ ధగ మని ప్రకాశించుచుఁ గైలాసముతోఁ సమానమైన రావణుని యింటిని రాముదూత చూచెను.

క. సురశాత్రవు తేజముచేఁ, బరమమణీనికరదీప్తి♦పటలంబులచే
భరితం బయి రావణుమం,దిరము వెలింగెను గరాళి♦దినకరుమాడ్కిన్. ౨౩౪

అర్థములు. సురశాత్రవు=దేవవిరోధియగు రావణునియొక్క, పరమమణీనికర=ఉత్తమములైన రత్నసమూహముల యొక్క, దీప్తి పటలంబులచేన్=కాంతి సమూహములచే, భరితంబయి=నిండి, కరాళిన్=కిరణములచే, దినకరుమాడ్కిన్=సూర్యునివలె.

తాత్పర్యము

కిరణములచే సూర్యుఁడు ప్రకాశించునట్లు దేవవిరోధి తేజముచేతను, జాతి రత్నముల కాంతుల సమూహములచేతను, రావణుమందిరము ప్రకాశించెను.

క. ప్రాసాదసంఘయుతమై, భాసురమణిభాజనాళి ♦ భరితంబై మ
ధ్వాసవసుపరిక్లిన్నం, బై సరసమృదంగనాద♦మై కడువిరివై. ౨౩౫

అర్థములు. భాజనాళి=పాత్రల సమూహముచే, భరితంబై=నిండి, మధ్వాసవ=తియ్యని సారాయముచే, పరిక్లిన్నంబై =తడిసినదై, మృదంగనాదమై=మర్దల ధ్వనులు గలదై, విరివై=వెడల్పై.

తాత్పర్యము

మేడల, యిండ్ల గుంపులు గలదై ప్రకాశించు రత్నములచేఁ జేయఁబడిన పాత్రములతో నిండి తియ్యని సారాయములతోఁ దడిసి యానందకరమైన మద్దెల ధ్వనులు గలదై వెడల్పై.

ఉ. బంగరుసెజ్జలుం దళుకు♦బంగరుపాత్రలుఁ జిత్తచోరమ
త్తాంగజఘోటికానిభవ♦రాంగనలున్ మణికాంచినూపురా
భంగరవంబులుం గలిగి ♦ బాధమనోరమమై విశాలమై
యంగగు రావణాసురగృ♦హంబువరంబును గాంచి దానిలోన్. ౨౩౬

అర్థములు. సెజ్జ=పానుపు, శయ్యా శబ్దభవము (సజ్జ=ఇల్లు) మత్త=మదించిన, అంగజఘోటికానిభ=మన్మథుని యాఁడు గుఱ్ఱములతో (చిలుకలతో) సమానలైన, వరాంగనలున్=ఉత్తమ స్త్రీలును, మణికాంచి=మణులు చెక్కిన మొలనూళ్ళయొక్కయు, నూపుర=అందెలయొక్కయు, అభంగరవంబులు=విడువని ధ్వనులు,(లక్ష్మణునకు కిష్కింధలోఁ బట్టిన దశ హనుమంతునకు లంకలోఁబట్టెను) బాఢమనోరమమై=మిగుల మనోహరమై. కాంచీ-కాంచి యని రెండు రూపంబులు గలవు, (చూ. కుమా. సం. 1-37-3-55; మేఘ. 28-శిశు. 9-82, రఘు. 6-43) "కాంచిదామ పిహితైక కరోరుః" అని మాఘుఁడు. 'క్వచిత్ కాంచిః ఇత్యపిపాఠః' అని త్రికాండ శేషవ్యాఖ్య. ఏకయష్టి ర్భవేత్కాంచీ, మేఖలా త్వష్టయష్టికా, రసనా షోడశసరా కలాపః పంచవింశకః" ఒంటి సరము మొలనూలు కాంచి, ఎనిమిది సరములది మేఖల, పదాఱుసరములు గలదిఁ రసన) ఇరువదియైదుసరములు గలది కలాపము, అని మొలనూళ్ళ భేదములు.

తా త్ప ర్య ము

బంగారు పానుపులు, మెఱుఁగు బంగరు పాత్రములు, మనస్సును దొంగిలించు చిలుకలవంటి యుత్తమ స్త్రీలు, వారి మొలనూళ్ళయు, నందెలయు ధ్వనులు, (ఇది పురుషాయిత క్రీడ తెలిపెడిని) గలిగి మిగుల మనోహరమై విశాలమై యందమైన రావణాసురుని యుత్తమ గృహములఁ జూచి దానిలో పానుపులు, పానపాత్రములు, వరాంగనలు, రతిక్రీడలు తెలుపుటచే స్త్రీలు పురుషు లందఱు తమ పడుకటిండ్లలోఁ బండుకొని యున్నారనియు వెలుపలఁ దిరుగువారు లేరనియు సూచన.

—♦ ౭-వ సర్గము, హనుమంతుఁడు నగళ్ళలో సంచరించుట ♦—

మధురగతిరగడ.

మారుతి గన్గొనె ♦ మందిరజాలము, హారివిదూరజ♦హాటకజాలముఁ
జపలాలతికా♦శకునవిహారము, నిపుణప్రావృ♦ణ్ణీరదవారము
వలెఁ బలుదెఱఁగుల ♦ భాసిలు శాలలఁ, గలితాంబుజఘన♦కార్ముకశాలల
రమణీయం బయి ♦ క్రాలు విశాలల, విమలగృహోపరి♦విలసచ్ఛాలలఁ
బరమసురత్న♦భ్రాజిత మగుచును, బురుహూతాదిక♦పూజిత మగుచును
వరమును దోషవి♦వర్జిత మగుచును, నరయఁగ నాత్మబ♦లార్జిత మగుచును
మయదానవ వర♦మతి నిర్మితమై, మణిమయభూషా♦మండిత మగుచును
భాసిలు గృహముల♦బావని గాంచెను, వీసముఁ గొంకక♦వేడ్కఁ జరించెను.

అర్థములు. మందిరజాలము=ఇండ్లసమూహము, హారి=మనోహరమైన, విదూరజ=వైడూర్యములతోను, హాటక=పైఁడితోను జేయఁబడిన, జాలము=కిటికీలు గలదియు, చపలాలతికా = మెఱుపులవంటి తీఁగలు గలదియు, శకున=పక్షులయొక్క; విహారము =సంచారము గలదియు; ప్రావృట్ =

వానకాలమందలి, నీరదవారమువలె=మేఘసమూహమువలె, కలితాంబుజ ఘన కార్ముక శాలలన్=శంఖములతోను,గొప్ప విండ్లతోనుగూడిన శాలలను, విమల=శుద్ధమైన, గృహోపరి=ఇండ్లమీఁద, విలసత్=ప్రకాశించు, శాలల=బవంతులను, పురుహూతాదిక=ఇంద్రుడు మొదలగు వారిచే, ఆత్మబలార్జితము=తన భుజబలముచే కుబేరుని జయించి సంపాదించినది, మయదానవ=మయుఁడను దానవుని యొక్క, వరమతి=బుద్ధి చాతుర్యముచే, నిర్మితమై=కట్టఁబడినదై, పూర్వము లంక విశ్వకర్మ కృతమని చెప్పఁబడెను. ఇప్పుడు మయదానవకృత మని చెప్పఁబడెను. లంకానగరమును తొలుతఁ గుబేరునకై విశ్వకర్మ నిర్మించెను. ఆవల రావణుఁడు దాని నాక్రమించిన తరువాత వాని కనుకూలముగ వాని యాజ్ఞచే మయుఁడు తన బుద్ధి చమత్కారము కొలఁది నెక్కువ గృహములు కట్టెను. ఈ యిల్లు తన యిష్టానుసారము రావణుఁడు స్వయముగఁ గట్టించుకొన్నది.

మధురగతి రగడ- "నాలుగు మాత్రలు నాటిన గణములు నాలుగు రెంటికి నవి విరమణములు గలసి మధురగతికి నలును జగణము తొలఁగిన ధృత కౌస్తుభక విరమణము" అప్ప.

## తాత్పర్యము

మనోహరములైన వైడూర్యములచేతను బంగారుచేతను, నిర్మింపఁబడి నవియు, మెఱపుఁదీఁగలవంటివై పక్షులు విహరించునవియు నగు నిండ్ల సమూహములను, గొప్ప వర్షాకాల మేఘమువలె నానావిధముల నొప్పు శాలలను, శంఖములు పెద్దవిండ్లుగల శాలలను, మిగుల విశాలములైనవానిని, ఇండ్లమీఁదఁ గట్టఁబడిన బవంతు లను, హనుమంతుఁడు చూచెను. జాతిరత్నములచేఁ బ్రకాశించుచు, ఇంద్రాదులచేఁ బూజింపఁబడుచు, నెట్టి వాస్తుదోషము లేనిదై, తన భుజబలముచేఁ గుబేరుని గెలిచి సంపాదించినదై మయుఁడను దానవునిచే నతని బుద్ధి చమత్కారము కొలఁది నిర్మింపఁబడినదై రత్నములచే నిండిన భూషణములచే నలంకరింపఁబడి ప్రకాశించు గృహములను వాయుపుత్రుఁడు చూచి వానియందు జంకు గొంకు లేక విహరించెను.

### —♦ హనుమంతుఁడు పుష్పకవిమానముఁ జూచుట ♦—

### వృషభగతిరగడ.

ఘనఘనాఘనకలితరూపము ♦ కాంచనాంచిత చారురూపము
దనుజనాథబలానురూపము ♦ ధాత్రి నృపతిరూపరూపము
ధారిణీగస్వఃప్రకీర్ణము ♦ తతవిభాబహురత్నకీర్ణము
చారుతరకుసుమావకీర్ణము ♦ క్షౌద్ర మనఁగ రజోవికీర్ణము
చంచలాంగిదీప్యమానము ♦ చంచలాయుతఘనసమానము
అంచితసితఖగోహ్యమానము ♦ నగు విమానమునకు ననూనము
నగ మనన్ బహుధాతుచిత్రము ♦ నైకవర్ణపయోదచిత్రము

గగన మన గ్రహచంద్రచిత్రముఁ ♦ గనె విమానము రత్నచిత్రము
ధరణి పర్వతరాజిపూర్ణము ♦ ధరము వృక్షవితానపూర్ణము
ధరణిరుహము సుమౌఘపూర్ణము ♦ తతసుమావళి పత్రపూర్ణము
భాసురసుమగపుష్కరంబులు ♦ పక్షికలయుతనిష్కుటంబులు
కేసరాన్వితపుష్కరంబులు ♦ గృహము లచ్ఛ త్విట్కరంబులు
ఆకుపచ్చవిహంగమంబులు ♦ హారిజాత్యతురంగమంబులు
నైకరత్నభుజంగమంబులు ♦ నవ్యరుచి నభసంగమంబులు. ౨౩౮

ఇటఁ గుబేరుని జయించి తెచ్చిన పుష్పక విమానము వర్ణింపఁబడుచున్నది

ఘన=గొప్పదియగు, ఘనాఘన=వర్షాకాలమేఘమువలె, కలితరూపము= ఒప్పిన యాకారము గలది, కాంచనాంచిత = బంగారుచేఁ బ్రకాశించు, చారు రూపము=మనోహరమైన రూపము గలది, దనుజనాథ=రావణునియొక్క బల= బలమునకు, అనురూపము=తగినది. అప్రతిరూప=ఎదురులేని, రూపము=సౌంద ర్యముగలది, ధారిణీగస్వః ప్రకీర్ణము=దైవవశమున భూమి మీఁద జాఱిపడిన స్వర్గము వంటిది. తతవిభా=విస్తార కాంతిగల. రత్నకీర్ణము = రత్నములతోఁ గూడినది,చారుతరకుసుమ=మిగుల మనోహరమయిన పుష్పములచే, అవకీర్ణము= వ్యాపించినది; క్షౌద్రమనఁగనే=తేనెయో యన్నట్లు, రజోవికీర్ణము = పుప్పొడిచే నిండినది. "మాక్షికం తైలవర్ణంస్యాత్, ఘృతవర్ణంతు పౌత్తికమ్, విజ్ఞేయం భ్రామరం శ్వేతం, క్షౌద్రంతు కపిలం మతమ్"మాక్షికమను తేనె తైలవర్ణముగలది. పౌత్తికమనుతేనె నేతివర్ణము గలది. భ్రామరమను తేనె తెలుపువన్నె గలది. క్షౌద్రమను తేనె కపిలవర్ణము గలది. చంచలాంగీ = మెఱుపువంటి దేహముగల స్త్రీలచే, దీప్యమానము=ప్రకాశింపఁ చేయఁబడినది. చంచలాయుత = మెఱుపు లతోఁ గూడిన, ఘనసమానము=మేఘముతో సరిపోయినది. అంచిత=ప్రకాశించు సితఖగ=హంసలచే. ఊహ్యమానము=మోయఁబడుచున్నది. అగు విమానము నకు, అనూనము=తక్కువకానిది, అనఁగా సమానమైనది, నగమనన్=పర్వతము వలె, నైకవర్ణపయోద చిత్రము = నానావర్ణములు గల మేఘమువలె వింతయైనది, గ్రహచంద్ర చిత్రము=సూర్యచంద్రులు చిత్రింపఁబడినది, ధరము= పర్వతము, వితాన=సమూహము, సుమౌఘ = పూలరాశి, భాసుర+సుమగ+ పుష్కరంబులు=కాంతిగల పుష్పములతోఁ గూడిన జలములు, కల=అవ్యక్త మధుర ధ్వని, నిష్కుటంబులు=ఉద్యానవనములు, కేసరాన్విత పుష్కరంబులు= అకరువులతోఁ గూడిన కమలములు, అచ్ఛ=నిర్మలమైన, త్విట్కరంబులు=కాం తుల కిరణములు గలది, విహంగమంబులు=పక్షులు, హారి=ఇంపైన, జాత్య తురంగమంబులు=ఉత్తమాశ్వములు, నైకరత్న భుజంగమంబులు=అనేక రత్న ములతోఁ జేయఁబడిన పాములు, నవ్యరుచి=మనోజ్ఞ కాంతిగల, నభసంగమం

బులు=పక్షులు, నభసి+గచ్ఛంతి=ఆకాశమునఁ బోవునవి కావున నభసంగ మములు.

## తాత్పర్యము

గొప్ప వర్షాకాల మేఘమువంటి యాకారము గలది, బంగారుచేఁ బ్రకాశించు మనోహరాకారము గలది, రావణాసురుని బలమునకుఁ దగినది, కావుననే భూమియందు దానికి సమానమైనది లేనిది, ఆకాశమునుండి జారిపడిన స్వర్గమా యేమి యనదగినది. విస్తారకాంతిగల యనేక రత్నములతోఁ గూడినది, మనోహరములైన పుష్పములచే వ్యాపించినది, తేనెవలెఁ బుప్పొడిచే నిండినది, మెఱుపులతోఁ గూడిన మేఘమువలె మెఱుపుఁదీఁగలవంటి దేహములు గల స్త్రీలచేఁ బ్రకాశించునది. హంసలు మోసికొనిపోవు బ్రహ్మవిమానమునకు సమానమైనది. పర్వతమా యన్నట్లు లనేకగైరికధాతువులచే వింతయైనది, గనుక నానావర్ణములుగల మేఘమువలెఁ జిత్రమైనది. ఆకాశ మనునట్లు సూర్యచంద్రులు చిత్రింపఁబడినది, ఇట్టి రత్నచిత్రమైన విమానమును హనుమంతుఁడు చూచెను. అందుభూమి పర్వతముల వరుసలచే నిండినది, పర్వతములు వృక్షసమూహములచే నిండినది, వృక్షములు పూల రాసులచే నిండినవి, పూలరాసు లాకులతో నిండినవి భూమి-పర్వతములు లోనైనవి చిత్తరువులని గ్రహింపవలెను. (ఈ రెండు పాదములందు నేకావళి యలంకారము) పూర్వ పూర్వ వస్తువునకు నుత్తరోత్తర వస్తువు విశేషణ మయ్యేనేని యేకావళి యగును. పూలతో నిండిన నీళ్లు; పక్షి కలకలధ్వానులతో నిండినతోఁటలు, అకరులతోడి కమలములు, కాంతులు వెదజల్లు గృహములు, ఆకుపచ్చ పక్షులు, ఉత్తమ జాతి గుఱ్ఱములు, అనేకరత్నములతోఁ జేయఁబడిన పాములు, ఆయా పక్షివర్ణమునకు దగినట్లు రత్నములతోఁ జేయఁబడిన పక్షులు అందుఁ జిత్రింపఁబడెను. వృషభగతి రగడ=ఇరువది యెనిమిదిలఘువులు, పదునేనిట విశ్రాంతియు; గూర్చిన నిరవగు వృషగతి పద్మాధిప, యది విను మాదరమున ముదమునఁ ఇందు లఘువు లనుటచే నన్నియు లఘువు లుండవలెనని యెంచరాదు. గురువునకు రెండు లఘువులవంతున లెక్కింపవచ్చును.

క. సాక్షాత్సుమనస్సాయక, పక్షములు ప్రవాళకనక•పక్షములు లస
త్పక్షములు కుసుమకీలిత, పక్షములు సలీలవక్ర•పక్షము లమరన్. ౨౩౯

అర్థములు. మీఁదఁ గడపటఁ జెప్పిన పక్షు లిందు వర్ణింపఁబడు చున్నవి. సాక్షాత్ సుమనస్సాయక పక్షములు=ప్రత్యక్షముగ మన్మథునకు సహాయములగునవి, వానిని జూడఁగానే కామము జనించునని భావము. ప్రవాళకనక పక్షములు = పగడములతోను; బంగారుతోను దీర్పఁబడిన ఱెక్కలు గలవి. ఱెక్కల కొనలందు బంగారు కూర్పఁబడినదని భావము. "కం, ఱెక్కల కొనలం గలిగిన, యుక్కాంచన మాసపడియెడే నృప నీ కే యక్కఱ దీనం దీరెడు" నని

శృంగారనైపథము, కుసుమ కీలిత పక్షములు=పూలతోఁ జేసిన, కూర్పఁబడిన తెక్కలు గలవి. సలీలవక్రపక్షములు=విలాసముగా వంకరగా నుండు తెక్కలు గలవి. పూర్తిగా ముడుచుకోక పూర్తిగా చాఁచుకోక కొంచెముగా విచ్చిన తెక్కలని భావము.

తాత్పర్యము

కామ ముద్దీపింపఁ జేయుటయందు మన్మథునకు సహాయపడునవి, తెక్కల కొనలందు పగడములు బంగారు కూర్పఁబడినవి, ఆ కారణముచేఁ బ్రకాశించునవి. బంగారుతోను, పగడములతోను జేయఁబడిన పూలు చెక్కఁబడినవి. మీఁదఁ జెప్పఁబడిన పక్షు లిట్లున్నవని భావము.

క. తమయంతఁ గరులు నునుఁదొంౙడములన్ నెఱవిఱియు కలువ•నవలఁ గొలని నీ
రము గొని యభిషేకింపఁగఁ, గమలాంచితహ స్తయైన•కమలాసతితోన్. ౨౪౦

తాత్పర్యము

ఏనుఁగులు తమ తమ తొండములతో దమంతఁదామే బాగుగ విచ్చిన కలువ పూలను నీరు తీసికొని యభిషేకింపఁగాఁ గమలము చేత ధరించిన లక్ష్మిదేవితో ఈ ప్రకారము శిల్పము చేయఁబడి యున్నదని భావము.

క. కమ్మనివలపులు గల వృ,క్షమ్మన మాధవదరీధ్ధ•శైల మ్మన హృ
త్సమ్మితపుష్పవిమానం, బమ్మరుదాత్మజుఁడు గాంచి•యబ్బురపడియెన్. ౨౪౧

అర్థములు. అమరన్ —అనునది పూర్వ పద్యమునుండి గ్రాహ్యము,అమరన్ హృత్సమ్మిత పదముతో నన్వయము, వలపులు=వాసనలు, మాధవ=వసంతకాల మందలి, దరీధ్ధ=గుహాలచేఁ బ్రకాశించు, శైలమ్మనన్=పర్వతమో యనునట్లు, హృత్సమ్మిత=హృదయమున కిష్టమైన, అబ్బురపడియెన్=ఆశ్చర్యపడియెను.

తాత్పర్యము

సువాసనలు గల వృక్షమో, వసంతకాలమున గుహాలచే నొప్పు పర్వతమో యనఁదగిన, హృదయమున కిష్టమైన పుష్పక విమానమును హనుమంతుఁడుచూచి దాని రచన కాశ్చర్యపడెను మాధవ కాలమందలి గుహయనుటచే వాకాలమందలి పుష్పవాసనతోఁ గూడి యుండుట వివక్షితము. దానిచుట్టి యెంతదిరిగినను రావ ణుఁడు స్త్రీలతో నుండు స్థలము కానరాలేదు. ఆ విమానము పరిమితి తెలియ లేదు కావున నాశ్చర్యపడె నని భావము.

క. ఎంతయు వింతలు పురమం, దంతటఁ గనుఁగొనుచు నరిగి•యరిగి మహీజా
--నఁ గనక సునేత్రుఁడు, చింతాయుతుఁ డయ్యె నేమి•చేయుదు ననుచున్.

అర్థములు. సునేత్రుఁడు=(౧)బహు దూరముననున్న సూక్ష్మ వస్తువునైనఁ జక్కఁగాఁ జూడఁగల దృష్టిపాటవము గలవాఁడు, దగ్గఱకుఁబోయి తిరుగవేసి మరవేసి చూడవలసిన పనిలేదని భావము. ఈదృష్టి పాటవ మీాయనయందు విశేషించి

యున్నటు ౧౩౫ వ పద్యమునఁ జెప్పఁబడెను, (౨) ఒకసారి చూచిన మాత్రాన సమస్తవస్తువులనుమఱలఁ జూడవలసిన పని లేక కరతలామలకముగా గ్రహించును.

తాత్పర్యము

ఆ పట్టనమందు సమస్త ప్రదేశములు తిరిగి తిరిగి యెన్ని వింతలో చూచెను గాని యా సునేత్రుఁడు సీతాదేవి గానరామిని నిఁకనేమి చేయుదునా యని మిగుల విచార గ్రస్తుఁడయ్యెను.

—♦ ౭-వ సర్గము. పుష్పక విమాన వర్ణనము ♦—

ఉ. ఆ నిలయంబులోన నడు♦మంతరమందు విచిత్రరత్నసం
తానధగద్ధగాయితసు♦తప్తసువర్ణమనోహరంబు వై
మానికమార్గసంచరణ♦మానిత మప్రతిమం బమేయమున్
భానుపథైకలక్ష్యమును ♦ బావని గాంచె విమానరత్నమున్. ౨౪౩

పుష్పకవిమాన వర్ణనమే యింకను జేయుచున్నాఁడు. ఆ నిలయంబులోనన్=పుష్పకాధారమైన రావణగృహంబు లోపల, సుతప్తసువర్ణ=పుటము వేయఁబడిన బంగారు, వైమానికమార్గ=దేవతలు సంచరించు నాకాశమందు, సంచరణ=సంచరించుటచేత, మానితము=గౌరవింపఁబడినది. అప్రతిమము=అసమానమైనది, అమేయము=పరిమితి చెప్పరానిది, భానుపథైకలక్ష్యము=సూర్యుఁడు సంచరించు మార్గమే తనకుఁ బ్రధాన లక్ష్యముగాఁ గలది. విశేషముగ నాకాశమందే సంచరించునది యని భావము. ఆకాశసంచారము గలది యా యింటి నడుమ గలదనుటచే నా విమానము భూమి మీఁద నాకాశమునఁ గూడ నుండఁ గలదని భావము, దేవతల విమానములు కొన్ని భూమి మీఁదికి రాఁజాలవు. భూమి యందలివి యాకాశమునకుఁ బోలేవు. ఇది యట్లు గాదు అని భావము.

తాత్పర్యము

పుష్పకాధారమైన యా యింటిలో నడిమిభాగంబున వింతవింతలైన మణుల గుంపులచే ధగద్ధగ మని మెఱయు పుటము వేసిన బంగారువలె మనోహరమై యాకాశమార్గమునఁ బోఁగల దగుటచే గౌరవింపఁబడు నదియై యాకారణముచే నసమానమై పరిమాణమందు విస్తారమై యాకాశమందే విశేషముగ సంచరించు శ్రేష్ఠమైన విమానమును హనుమంతుఁడు చూచెను.

ఉ. అందు నమేయకౌశలసు♦యత్నముతోడ నొనర్పనట్టి దే
దెందును లేదు దివ్యమణి♦హీరవినాకృతి మెంను లేదు త
త్సుందరతాగుణంబు గన ♦ ద్యోచరయానములందుఁ గల్గ దెం
దెందుఁ గనంగ నబ్బ ముద♦యింపక పోదు నితాంత మేరికిన్. ౨౪౪

అర్థములు. అమేయకౌశల=మిగుల నేర్పుతోను, సుయత్నముతోడ=విశేష

ప్రయత్నముతోడను, హీరవినాకృతము=వజ్రములు లేనిదిగాఁ జేయఁబడినది, ద్యోచర యానములందు=దేవతల విమానములందు.

తా త్ప ర్య ము

ఆ విమానములందు మిగుల నేర్పుతోను, నతి ప్రయత్నముతోను జేయఁబడనిది యేదియు లేదు. ఎందును లేదు. దేవతాసంబంధమైన మణులు వజ్రములు గూర్పనిదియు లేదు. దాని సౌందర్యము దేవతల విమానమందును లేదు. ఏ ప్రదేశమును జూచినను చూచినవారికి మిగుల నాశ్చర్యము గలిగింపక పోదు.

సీ. విపులతపంబున • విక్రమంబున నార్జి,తం బయి హృత్సమా • ధానముగను
జరియించుచు ననేక • సంస్థాననిర్మితం, బై సర్వతో మనో • హరము నగుచు
దుర్వార మై వాయు • తుల్యజవంబు నై, కృతపుణ్యమహితాత్మ • గేహ మనఁగ
నొప్పుచుఁ జిత్రకూ • టోత్కరమండితం, బై హృద్యమై శర • దంబుజారి

తే. ధవళ మై కుండలాలంకృ • తముఖ గగన, చరనిశాచరచారువి • శాలనయన
భూరిజవనదురాధర్ష • భూతగణస,హస్రవాహిత మయి యొప్పు • నట్టి దాని. ౪-౭

అర్థములు. హృత్సమాధానముగను=మనస్సునకుఁ దృప్తికరముగ, అనేక సంస్థాన నిర్మితంబై =గోపురములు, ప్రాకారములు లోనగు ననేక సన్నివేశములచే నేర్పఱుపఁబడి, సర్వతోమనోహరము=అన్ని ప్రదేశముల నన్ని విషయముల మనస్సు నాకర్షించునది. దుర్వారము=గమనమం దడ్డము లేనిది, వాయుతుల్యజవంబునై =వాయువేగముతోఁ బోఁగలదై, కృతపుణ్య=పుణ్యము చేసిన, మహితాత్మ=గొప్పమనస్సుగల యుత్తమ పురుషుల,గేహము=ఇల్లు, అనఁగా స్వర్గమో యనునట్లు, చిత్రకూటోత్కర మండితంబై = చిత్రములైన యనేక శిఖరములచే నలంకరింపఁబడి, హృద్యమై=హృదయమునకు సంతోషకరమై, శరదంబుజారి ధవళమై=శరత్కాల చంద్రునివలెఁ దెల్లనై, కుండలాలంకృత ముఖ=కుండలములచే నలంకరింపఁబడిన ముఖములను, గగన చరనిశాచర=దేవతలు రాక్షసులు గలవియు, చారు విశాల నయన=మనోహరమైన వెడలుపాటి కన్నులు గలవియును, భూరి జవన=అధిక వేగము గలవారివలెఁ గానవచ్చునవియు, దురాధర్ష =తిరస్కరింపరాని, భూతగణసహస్ర=గోపురములను మోయు బొమ్మలవలెఁ బ్రతిమారూపముగ నున్న పిశాచములచే, వాహితము=మోయఁబడునది, ఇందుఁ జెప్పఁబడిన భూతగణములు ప్రాణములతో నుండునవి కావు. ఆకాశమునఁ బోవుఁదాని నొకరు మోయనేల? అదియును గాక రావణుని యంతఃపురమున జీవించి యుండు మగవారుండరాదు.కావున నివి నిర్జీవములైన బొమ్మలనియే గ్రహింపనగు.ప్రయాణమై పోవునపు డెవరైన మోయవలసిన పని యుండును గాని కదలక యొక చోట నుండునపు డెవరు మోయవలసిన పని యేమి యున్నది? ఈ విమానము యంత్రబలమున నడచునుగాని భూతములు మోచికొని పోవుటచేఁ గాదు. దీనిని

నడపువాఁడును గలఁడు. ఉత్తరకాండమునఁ జూచునది. (వ. ౯౦౬)ఇదియిప్పటి యంత్రసాధ్య విమానముల వంటిది.

తాత్పర్యము

గొప్ప తపస్సువలన గలిగిన పరాక్రమముచే సంపాదింపఁబడి హృదయ సమ్మతముగఁ దిరుగఁ గలదై, గోపుర ప్రాకారాదులు గలిగి యెందుఁ జూచినను అన్ని ముఖముల మనోహరమైన వాయువేగము గల దగుటచే నివారింపరానిదై, స్వర్గమో యనునట్టు లొప్పుచుఁ జిత్ర శిఖరములచే నలంకరింపఁబడి శరత్కాల చంద్రునివలెఁ దెల్లనై, కావుననే యింపై, కుండలములచే నలంకరింపఁబడిన ముఖములు గలిగి దేవతా రాక్షసాకారములు పెద్దకన్నులు నధిక వేగము గలిగి తిరస్కరింపరాని వేలకొలఁది భూత సమూహములచే మోయఁబడు దానిని.

క. సురభిసుమసుందరంబై, సురభిత మై సురభికంబు • సుందర మగుచున్
సురశిల్పివినిర్మిత మై, పరఁగెడి పుష్పకవిమాన•వరముం గనుచున్, ౨౪౬

అర్థములు. సురభిసుమ సుందరంబై=వసంతకాలపుష్పమువలె నందంబై, సురభితమై=మంచి వాసనగలదై, సురభికంబు = వసంతకాలముకంబు, సురశిల్పి వినిర్మితంబై=విశ్వకర్మచే నిర్మింపఁబడినదై.

తాత్పర్యము

వసంతకాల పుష్పమువలె సుందరమై, పరిమళముగలదై, వసంతకాలము కంబు సుందరమై, విశ్వకర్మ నిర్మితమైన విమానశ్రేష్ఠమును జూచుచు.

—• ౯-వ సర్గము. హనుమంతుఁడు రావణుని యంతఃపురంబు జూచుట. •—

తే. ఆ విమానంబుమధ్యంబు•నందునర్ధ, యోజనమువిస్తృతియునొక్క•యోజనంబు
నిడివిగల పంక్తికంఠుమం•దిరముఁ జొచ్చి,యాయతాక్షిని వెదకె హ•తారికుఁడు. ౨౪౭

అర్థములు. హతారికుఁడు=చంపబడిన శత్రుసమూహము గలవాఁడు.

తాత్పర్యము

ఆ విమానము నడుమ నర్ధ యోజనము వెడలుపు, ఒక యోజనము నిడుపు గల రావణాసురుఁడు కాఁపురము చేయు నిల్లు సొచ్చి యందు హనుమంతుఁడు సీతాదేవిని వెదకెను.

క. పెక్కులు మాడుగు లొప్పెడి, రక్కస నాయకులనగరు•గ్రమముగఁ గని పే
రుక్కు గల సోఁకులిండ్లను,గ్రక్కున తేఁకుంకు వీటఁ•గనఁగఁ దొడంగెన్. ౨౪౮

అర్థములు. మాడుగులు=మేడలు, సోఁకులు=రాక్షసులు.

తాత్పర్యము

పెక్కులు మేడలు గల రావణుని నగరు నందు వరుసగ బలవంతులగు రాక్షసుల యిండ్ల యందు రావణుఁ డుండు నింటియందును వెదక నారంభించెను.

సీ. మూఁడును నాల్గు కొ•మ్ములు గలయేనుఁగు, లెడ మెడముగఁ గట్టఁ•బడుచునుంట
యుద్ధృతాయుధు లైన•యోధులు గాచుట, యసురనాయకుని భా•ర్యాళిచేత
విక్రమాహృతపృథి•వీధవకన్యకా, బృందంబుచేఁ బరి•వృతము నగుట
తిమితిమింగిలనక్ర•దీర్ఘఝషాకులో, దధి నాఁగఁ గల్లోలి•తంబు నగుట
ఆ. శ్రీదు లక్ష్మి, యింద్రు•సిరియును; సర్వంబు, పాయ కుంట వాని•బంధులిండ్ల
యమకుబేరవరుణ•రమయు నంతకు మిన్న, వై యుండుటఁ గనియె•వీరవరుఁడు.

అర్థములు ఉద్ధృతాయుధులు=ఎత్తఁబడిన యాయుధములు గలవారు; విక్రమ=పరాక్రమముచే, ఆహృత=అపహరింపఁ బడిన, పృథివీధవ కన్యకాబృందంబుచే=రాచకన్నియల సమూహముచే, పరివృతము=ఆవరింపఁబడినది, తిమింగిల=తిమినిమ్రింగెడి పెద్దచేఁపచేత, దీనిని మ్రింగెడి చేఁపకు తిమింగిల మని పేరు, నక్ర=మొసళ్ళచేత, దీర్ఘఝషా=నిడివి చేఁపలచేత, ఆకుల=కలఁతచెందిన, ఉదధినాఁగన్=సముద్రమో యనునట్లు, కల్లోలితంబు=అల్లకల్లోలమైనది. శ్రీదు=కుబేరుని యొక్క, రమ=సంపద, మిన్న=హెచ్చుగ.

తాత్పర్యము

ఆ యింటియందు మూఁడుకొమ్ములు, నాలుగు కొమ్ములు గల యేనుఁగులు దూరము దూరముగఁ గట్టఁబడి యుండుటను, యుద్ధమునకు సిద్ధపడి యెత్తఁబడిన యాయుధములు గల యోధులు గాచుచుండుటను, రావణుని భార్యలచేత, వాఁడు బలాత్కారముగ నపహరించి తెచ్చిన రాచకన్నెలచేత నావరింపఁబడి యుండుటను, తిమితిమింగిలము మొసళ్ళు నిడుపాటి చేఁపలు వీనిచేఁ గలఁత నొందిన సముద్రమువలె నల్లకల్లోలమై యుండుటను, కుబేరుని సంపదయు, నింద్రుని యైశ్వర్యము, సర్వ దిక్పాలుర లక్ష్మి వాని యింటను, వాని బంధువుల యిండ్లయందు యమ కుబేర వరుణుల సంపద యొక్కొక్కరి యింట నొక్కొక్క దిక్పతి సంపద వదలక యంతకంటె నెక్కువగా నుండుటయు హనుమంతుఁడు చూచెను.

ఉ. ఆ సొబగారుమేడ నడు•మంతర మం దొగి విశ్వకర్మ దా
వాసిగ మింటఁ బొల్దొలుత • వారిజగర్భున కై రచించె నా
నాసుమణీయుతంబుగ న•నంతర మా ధనదుండు నీరజా
తాసను గొల్చి చేకొనియె; నాతని గెల్చి రణాంగణంబునన్. ౭౧౦

పుష్పకవిమానము పూర్వచరిత్ర చెప్పఁబడుచున్నది.

తాత్పర్యము

ఆ యందమైన మేడ నడుమ నుండు పుష్పకమును దొలుత విశ్వకర్మ బ్రహ్మదేవునకుఁ గాను మంచి రత్నములచే నాకాశమున నిర్మించెను. దాని నాయన యావలఁ దన్ను సేవించిన కుబేరున కిచ్చెను. ఆయనను యుద్ధభూమి యందు గెల్చి

సీ. రావణుఁ డుగ్రత • గ్రహియించినదియు నీ, హామృగయుక్తమై • యమరు నదియుఁ
గార్తస్వర స్తంభ • కమనీయ మగునది, ధగధగ త్కాంతులఁ • దనరు నదియు
మేరుమందరముల • మేలిమి గగనంబు, రాయుకూటాలయ • రాజిచేత
సమలంకృతం బయి • నపుడు మిం చెడునది, నడిమింటిసూర్యుని • నవ్వు నదియుఁ
తే. గనకసోపాన పంక్తులఁ • గ్రమ వేది, కలను వాతాయకంబులఁ • గలితనీల
విద్రుమాంచితమౌక్తిక • వితతిస్థగిత, మైనపుష్పకతల మెక్కె హనుమ యపుడు.

అర్థములు. ఈహామృగయుక్తమై=కృత్రిమములైన జింకల యాకారము గల బొమ్మలతోఁ గూడినది, కార్తస్వర స్తంభకమనీయము=బంగారు కంబములచే నందమైనది, మేలిమి=ఎత్తైన, కూటాలయరాజిచేతన్ = కొలువుకూటముల సమూహముచేత, క్రమవేదికలన్=అందమైన యరుఁగులచేతను, వాతాయనంబులన్=కిటికీల చేతను, నీల ఇంద్రనీల మహానీల నీలమణులచేతను నీలములు ఇంద్రనీలము లని మహానీలములని నీలమణులని మూఁడు తెగలు గలవు. అందు పాలను నీలముగఁ జేయునది ఇంద్రనీలము. దీనిని పాలలో వేసినచోఁ బాలు నీలముగాఁ గనబడును. దీనికి క్షీరగ్రాహి యని పేరు. నీలము మీఁద పచ్చిగడ్డి పోఁచగాని, పొట్టుగాని, గసగసాలుగానియుంచి యూఁదిన దల క్రిందుగఁ ద్రిప్పినను పడిపోవ దేని దానిని తృణగ్రాహి యందురు. సింహళ ద్వీపమునఁ బుట్టినది మహానీలము. 'క్షీరమధ్యే క్షిపే న్నీలం క్షీరంచే న్నీలతాం వ్రజేత్ । ఇంద్రనీల మితి ఖ్యాతమితి చాగస్త్య భాషితమ్। సింహళాకరసంభూతా మహానీలా ఇతి స్మృతాః' అని రత్నశాస్త్రము. విద్రుమము=పగడము.

ఇంద్రనీలము నెమలి కంఠచ్ఛాయ గలదై యుండును. మహానీలము వెన్న వెదురాకు పూవువలె నుండును? నీలమణి నల్లవిష్ణుక్రాంతమువలె నుండును.

పగడములు సముద్రము నీటిలో దీఁగలవలె నల్లుకొని యుండును.

స్థగితము=చెక్కఁబడిన నేలగలది.

## తాత్పర్యము

రావణుఁడు గ్రహించినదియుఁ గృత్రిమపు జింకలవంటి బొమ్మ లమర్పఁబడినదియు, బంగారు కంబములు గలదియు, ధగ ధగ మను కాంతులు గలదియు, మేరు మందరపర్వతముల వలె నెత్తుగుటచే నాకాశమును రాచుకొను కొలువు కూటములచే నలంకరింపఁ బడినదియు మిట్టమధ్యాహ్నమున సూర్యునివలెఁ బ్రకాశించు నదియు, బంగారు మెట్లు అరుఁగులు కిటకీలు గలదియు, నీలములు, పగడములు, మంచి ముత్యములు వీనిచేఁ జెక్కఁబడినదియు నగు పుష్పక ప్రదేశము మీఁద హనుమంతుఁ డెక్కెను.

ఉ. ఆ యెడ భక్ష్యపానవివి • ధాన్న వినిర్గతక్రమవాసనల్
వాయుతనూభవుం గదిసి • స్వాంతము రంజిల బంధురీతిగా

నీయెడ నున్నవాఁడు దనుజేశ్వరుఁ డిట్టిటు రమ్ము రమ్మటం
చాఁ యతిపీరునిం బిలుచునట్టులు రాజిలె సోఁడు ముట్టుచున్. ౨౫.౨

అర్థములు. భక్ష్యపానవివిధాన్న వినిర్గతకమ్రవాసనల్=భక్ష్యములనుండియు పానముల నుండియు వివిధాన్నముల నుండియు బయలు వెడలిన కమ్మని వాసనలు సోఁడు=నడినెత్తి.

## తాత్పర్యము

ఆ సమయమందు పిండివంటలు, అప్పచ్చులు, పాకములు, పులిహోర, దధ్యోదనము, కేసరీభాత్, వాంగీభాత్ లోనగు వివిధములైన యన్నములు-వీని నుండి వెలువడిన కమ్మని వాసనలు హనుమంతుని యొద్దకు వచ్చి యతని మనస్సు సంతోషపఱచునట్లు బంధువువలె రావణాసురుఁ డిచ్చట నున్నవాఁడు మా వెంట రమ్ము చూపెదమని పిలుచునట్టులు తలకెక్కునట్లు వ్యాపించి యుండెను. వాయు వశమున వాసనలు కొట్టును. వాయువు హనుమంతునకుఁ జుట్టమే కదా. ఇది మొదలు నాలుగు పద్యములు కలాపకము.

సీ. అట కేగి వరశుభాయత మయి కాంత నాఁ, గాంత మై ప్రియనిజకాంతవోలె
సమరారికిని మనోహర మయి రత్న సోఁపానవికృత మయి పైఁడిజాల
కంబుల నీటయి కడుఁబటికపురాల, నిమ్మయి దంతపుబొమ్మ లమరి
పవడముల్ ముత్యముల్ బంగారు వెండియుఁ, బటిమఁదీర్చిన స్తంభపటలిగలిగి

తే. సమము చక్కన యెత్తును జాను మీఱు,కంబముల మింటి కెగిరెడి కరణి వెలసి
యిలను గలిగినచిత్రంబు లెల్లవ్రాయఁ, బడిన చిత్రకంబళములై పఱపు గలిగి.

అర్థములు. కాంతనాన్=స్త్రీవలె, వికృతము=కట్టఁబడినది. పవడముల్ ముత్యముల్ బంగారు వెండియుబటిమ=ఇది సమస్తపదము, చక్కన=వంకరలేనిది, పఱపు=వెడలుపు, ముత్యములు—ఇవి మేఘములందు, పాము పడగలందు, వెదుళ్ళయందుఁ, జేఁపలందు. ఏనుఁగు కుంభములందుఁ జెఱకులందు శంఖము లందు, పందికోఱలందు. ముత్తెపు జిప్పలందుఁ బుట్టును, మేఘమునందుఁ బుట్ట నవి మనుష్యులకు లభింపవు.

"నీరదమాల్ దిగంతములు నిండి పటుస్ఫుటగర్జితంబు లే
పార మహోగ్రవృష్టి గురియం బ్రభవించు నిశాంతకాంతితో
నారయఁ గుక్కుటాండ సమమై పడు ముత్యము లంతరిక్ష సం
చారులు పట్టుకొందురు వెసన్ వసుధం బడకుండ నేర్పునన్॥"

పాము పడగలోని ముత్తెము గురిగింజ వన్నెగలది. వెదురునందుఁ బుట్టునది నక్షత్రకాంతిగలది ఇది స్త్రీ వశీకరణమం దుపయోగపడును. ఇది మినుపగింజంత యుండును. చేఁపలల యందుండునది వెండివలె తెల్లమల్లె పూవువలె నుండును. దీనికి నిష్ప్రభయము లేదు. ఏనుఁగు కుంభములందుండునది యుసిరికకాయయంత

యుండును. వెదురుచెట్టు నందుఁ బుట్టునది ప్రేంకణపుఁబూవు చాయగలది. పంది కొమ్మునందుండునది రేగుఁ బండంత యుండును, కుంకుమ చ్ఛాయగలది. వెదురు ముత్తెములు కోడిగ్రుడ్డంత యుండును. ఇది మంత్రసాధకులకు లభించును. స్వాతి యందు ముత్తెపుఁ జిప్పలలోఁబడిన వానచినుకులు మంచి ముత్యములగును. వర్ష బిందువు కొలఁది ముత్తెము. ఇందు శృంగళశుక్తులందుఁ బుట్టినవి యెఱ్ఱగాను, రావణ శుక్తులందుఁ బుట్టినవి బంగారు వన్నె కలవిగా నుండును. తామ్రపర్ణి శుక్తియందలివి తెల్లగా నుండును. పూర్వకాలమున నానాదేశములవారు పాశ్చాత్యులు వీని వ్యాపారమునకై యీ దేశమునకు వచ్చుచుండిరి. వీనిలో ఆణి, సుతారము, సుపాణి యనునవి మంచి జాతులు.

తా త్ప ర్య ము

ఆ వాసనజాడపట్టి పోయి యందు మిక్కిలి యింపై పొడవై సుందరివలెఁ బ్రియమై రావణాసురునికి దన ప్రియభార్యవలె మనోహరమై రత్నసోపానములు బంగారు కిటికీలు దంతపు బొమ్మలు పగడములయు ముత్యములయు బంగారు వెండులయు పటుత్వముచేఁ దీర్చిన స్తంభములు గలదై సమమై వంకరలేనిదై ఎత్తైన కంబములచే నాకాశమున కెగిరిపోవుచున్న దానివలె నొప్పి భూమి యందు గల చిత్రములన్ని వ్రాయఁబడిన కంబళ్ళు గలిగి వెడలుపై.

ఉ. ఘుమ్మని కమ్మవాసనలు • గ్రమ్మ నితాంతశకుంతనాద మ
భ్రమ్మును ముట్టఁగా మృదువు•పాన్పులు వన్నెలు మీఱ శుభ్రమై
నెమ్మది రావణాసురుఁడు • నిచ్చ చరించెడి ధామ మాచు ధూ
పమ్ముల ధూమ్రమై శబల•భంగి విచిత్రసువర్ణ జాతమై. ౨౭౮

అర్థములు. నితాంతశకుంతనాదము=అతిశయించిన పక్షులధ్వని, అభ్రము= ఆకాశము, ధూమ్రము=నలుపు ఎక్కువగాఁ గలసిన యెఱుపు, శబలభంగిన్= కామధేనువువలె, దీనివలననిది చిత్రవర్ణముగలదియెగాక సర్వకామముల నిచ్చునదియని సూచితము. విచిత్ర సువర్ణజాతము=చిత్రమైన మంచి రంగులు గలది.

తా త్ప ర్య ము

ఘుమ్మని కమ్మని వాసనలు వ్యాపింపఁగాఁ బక్షులధ్వనులు విశేషించి యాకాశమును దగులు చుండఁగా మెత్తని పఱుపులు తెల్లనై కాంతు లీను చుండఁగా రావణాసురుఁడు సంతోషముతోఁ దిరిగెడి యిత్తె సాంబ్రాణి యగరు దశాంగము వీని పొగలచే ధూమ్రవర్ణము గలదై శబలవలెఁ జిత్రమై మంచి రంగులు గలదై.

క. మదికిని నతిసంహ్లాద, ప్రద మై రంగులకు మేలి•రం గొసఁగుచు శో
కదళనసమర్థ మై స, మ్మదమై కాంతులను జనన • మందిర మగుచున్. ౨౭౯

అర్థములు. అతి సంహ్లాదప్రదము=మిగుల సంతోషము గలిగించునది, శోకదళన సమర్థము=శోకమును బాపుటయందు శక్తి గలదై.

### తాత్పర్యము

మనస్సునకు మిఁగుల సంతోషము గలిగించునదియై వన్నెలకు వన్నెగలిగించునదియై సమ్మద మగుటచే శోకించు వారిశోకము నణఁచునదియై కాంతులకుఁ బుట్టినిల్లై.

క. రావణపాలిత భవనము, పావని పంచేంద్రియముల • పాలికి నపుడై
దా విషయంబులచే మోదావాప్తిం గూర్చెఁ దల్లి • యనువున నతఁడున్. ౨౫౬

అర్థములు. రావణపాలిత భవనము=రావణుఁడు రక్షించు గృహము, పంచేంద్రియముల పాలి=త్వక్కు, కన్నులు, చెవులు, నాలుక, నాసిక, వీనికి, ఐదా విషయంబులచే=స్పర్శ, రూప, శబ్ద, రస, గంధము లను నైదింటిచే.

### తాత్పర్యము

రావణుఁడు రక్షించు నా యిల్లు హనుమంతునికి వినుట కింపైన ధ్వనులచేత వీనులకును, కనుట కింపైన రూపములచేఁ గన్నులకును, తాఁకుటకు నింపైన వానిచేఁ జర్మమునకును, సువాసనలచే నాసికకును నోట నీ రూరించుటచే నాలుకకును దల్లివలెఁ దృప్తి కలిగించెను. ఈ పంచేంద్రియ సుఖములు భార్యవలనఁ గలుగవచ్చును. అటుగాక తల్లివలె ననుటచే హనుమంతుని జితేంద్రియత్వము ప్రకటితము.

ఈ నాలుగుపద్యములు కలాపకము.

'కులకం బహుభిః శ్లోకైః, సాకాంక్షై రేకవాక్యతా
ద్వాభ్యాంతు యుగ్మకం నామ, తుల్యార్థాభ్యాంతు చుంబకమ్."

అని యు

'ద్వాభ్యాం యుగ్మ మితి ప్రోక్తం, త్రిభిః శ్లోకైర్విశేషకమ్
కలాపకం చతుర్భి స్స్యాత్, తదూర్ధ్వం కులకం స్మృతమ్.'

ఏకాన్వయము గల రెండు పద్యములకు యుగ్మకమనియు మూఁటికి విశేషకమనియు నాల్గింటికి కలాపకమనియు నంతకుఁ బైపడిన కులకమనియుఁ బేర్లు.

క. నాకమొ కాకుండిన సుర,లోకమొ హరిహయునిపురమొ • లోకేశుమహా
లోకమొ యగు సిద్ధం బని; యా కపి యటు చనుచు నెదుట • నద్భుతకాంతిన్.

అర్థములు. నాకమొ=సామాన్యముగా స్వర్గలోకమో, సురలోకమొ=అందు ముఖ్యులయిన ముప్పది మువ్వురు దేవత లుండు స్థలమో, హరిహయుని పురమొ=అందు నింద్రుఁడు స్వయముగా నుండు ప్రదేశమో, లోకేశు మహాలోకమొ=బ్రహ్మలోకమో, సిద్ధము=నిశ్చయము.

### తాత్పర్యము

ఇది యేమి? పుణ్యము చేసినవారు పోయియుండు సామాన్య దేవలోకమా? అటుగాక ముఖ్యదేవతలు ముప్పదిమువ్వు రుండు స్థలమా? అటుగాక యింద్రుఁడు స్వయముగా నివసించునిల్లా? కాక బ్రహ్మలోకమో నిశ్చయమని హనుమంతుఁడాలో

చించుచుఁబోయి యెదుట నాశ్చర్యమైన కాంతిచే 'కనుఁగొనె'తో నన్వయము.

మానిని. జూదమునం బెనుజూదరి కోడి వ♦సుల్ దెసదోఁపక చింతిలు నా
జూదరియట్టులు నిశ్చలతం గను♦సొన్ను ప్రదీపములున్ జగతిన్
మాదిరి లేక వెలుంగు మణీకృత ♦ మంజులదీపులు సెమ్మెలుఁ దా
మోదము మీఱఁ గనుంగొనె వానర♦ముఖ్యుఁడు తద్భవనాంతమునన్.

అర్థములు. వసుల్=ధనములను, సొన్ను ప్రదీపములు=బంగారు దీపములు స్వర్ణశబ్దభవము సొన్ను రూ, సొన్నము. సమాసంబున సొన్నా యునియు రూపముగలదు. సొన్నాటంకములు, మణీకృత మంజుల దీపులు = రత్నములతోఁ జేయఁబడిన యందమైన దీపములు. దీపము లనఁగా దీపపు స్తంభములనియైనఁ జెప్పవచ్చును లేకరత్నములనే దీపాకృతులుగా నేర్పఱిచిరనియు జీవమణులు కావున నవియే కాంతులు ప్రసరింపఁ జేయుచుండె ననియు గ్రహింపనగు, సెమ్మెలను శబ్దసాహచర్యముచే నీయర్థమే గ్రాహ్యము.

మానిని:—ఏడు భగణములు గురువు. పదుమూఁడవ స్థానమున యతి.

## తాత్పర్యము

నేర్పరియగు జూదగానికిఁ దన సర్వస్వ మోడిపోయి యేమిచేయుటకు దిక్కుదోఁపక చింతలో మునిగిన జూదరివలెఁ గదలక మెదలకుండు బంగారు దీపములును ప్రపంచమునందు సమానమైనవి లేక ప్రకాశించు మణులచేఁ జేయఁబడిన దీపములును సెమ్మెలును హనుమంతుఁ డా యింటి యందుఁ గనుఁగొనెను.

సుగంధి. దీపకాంతి దైత్యకాంతు ♦ దేహకాంతిఁ దద్వపు
స్తాపనీయభూషణాళి ♦ సారకాంత కాంతులన్
బాపు! మండు చుండునట్లు ♦ ప్రజ్వరిల్లె శాల, యా
యేపుఁ జూచి మెచ్చె నంజ ♦ నేయపుత్రుఁ డాత్మలోన్. ౩౩

అర్థములు. తద్వపుః = రావణాసురుని దేహమందు ధరింపఁబడిన, తాపనీయ=బంగారుతోఁ జేయఁబడిన, భూషణాళి=సొమ్ముల వరుసలయొక్క, సారకాంత=సత్తగలిగి, మనోహరమైన, కాంతులన్=కాంతులచేతను, బాపు=ఔరా ఆశ్చర్యార్థకము రూ. బాపురే.

## తాత్పర్యము

దీపములకాంతి రావణాసురుని దేహకాంతి వాఁడు ధరించిన బంగారు సొమ్ములకాంతి యివి యన్నియు గలిగి యాశాల మండుచున్నట్లు వెలుఁగుచుండెను. ఆవిశేషముఁ జూచి హనుమంతుఁ డౌరా యని తనలో మెచ్చుకొనెను.

సుగంధి:— రజరజర గణములు. తొమ్మిదింట యతి, ఉత్సాహమునకు దీనికి విశేషము భేదములేదు. సుగంధులన్నియు నుత్సాహములేకాని యుత్సాహములన్నియు సుగంధులుకావు. అందు నగణమున కెడమున్నది. ఇందులేదు.

—♦ నిద్రించు రావణుని యంతఃపురస్త్రీలను హనుమంతుఁడు చూచుట ♦—

రసమంజరి. పరిపరి విధముల ♦ భాసిలుచేలల్, సరగలుఁ బలుపలు♦చందపులీలల్
పరఁగెడియువతలు♦పానసుకేళీ, పరతను నిదురను ♦ బండఁగఁ జూచెన్.

అర్థములు. సరగలు=హారములు.

తాత్పర్యము

నానావిధములుగఁ బ్రకాశించు చీరలు హారములు నానావిధ విలాసములు గల వయస్సు స్త్రీలు పానక్రీడాసక్తలై బాగుగఁ ద్రాగి నిద్రపోవుచుండ హనుమంతుఁడు చూచెను, రసమంజరి. ననససగురువు గణములు. తొమ్మిదింట యతి.

స్రగ్విణి. సద్దు లేకుండఁగా ♦ జారుభూషాతతుల్
ముద్దియల్ నిద్దురన్ ♦ మున్గి వర్తింపఁగా
దద్ద యంచల్ మిళిం♦దంబులున్ లేనిమేల్
ముద్దుఁబద్మాకరం ♦ బో యనన్ రాజిలెన్, ౨౬౧

అర్థములు. మిళిందంబులు=తుమ్మెదలు.

తాత్పర్యము

స్త్రీలు బాగుగ నిదురించుటచే వారు ధరించిన సొమ్ములు సద్దుచేయకుండఁగా హంసలు తుమ్మెదలు లేని యందమైన కొలనివలె నా మందిర ముండెను.

హంసలు – స్త్రీలు, తుమ్మెదలు – వారి యాభరణము,

స్రగ్విణి. నాలుగు రగణములు – ఏడింట యతి.

క. ముకుళితనయనంబులు నిం చుకయున్ వెలిఁ దోఁపనట్టి ♦ సొబగు రదంబుల్
ప్రకటసరోజాతామోద కలితవదనములు గలుగు♦తరుణులఁ జూచెన్. ౨౬౨

అర్థములు. ముకుళిత—ముడుచుకొనిన, మూసికొనిన రదంబుల్=దంతములు, సరోజాత=పద్మముల, ఆమోద కలిత=వాసనగల, వదనములు = ముఖములు, తరుణులన్=స్త్రీలను.

తాత్పర్యము

మూసికొనఁబడిన కన్నులు, కొంచెమైన వెలికిఁ గానరాని యందమైనదంతములు విస్తారముగ పద్మముల వాసనగల ముఖములుగలఁ స్త్రీలఁ జూచెను.నోళ్ళు తెఱచుకొని పండ్లు వెళ్ళఁబెట్టి నిదురించుట యధమస్త్రీల లక్షణము. పద్మవాసన చెప్పుటచే వీరు పద్మినీజాతి స్త్రీలని యేర్పడుచున్నది. పద్మినీ పద్మగంధా.

క. తామరలువోలె వారల, మోములు వికసించు నుదయ♦మున రుచిరముగన్
యామిని యగుడున్ చుణి తా,మే ముకుళితదళము లయిన♦యొలమింగార్చెన్

అర్థములు, యామిని=రాత్రి, ముకుళితదళములు=ముడుచుకొనిన ఱేకులు.

తాత్పర్యము

వారి కన్ను లుదయమున వికసించి రాత్రి కాఁగానే తమంతఁదామే ముడుచు కొను కమలములవలె సంతోషము గలిగించెను.

క. వీరల మోములు నిజముగ, సారసములు గాక యున్న • షట్చరణంబుల్
నీరజములవలె నేలా, సారెకు నీవదనములను సంప్రార్థించున్. ౪౮

తాత్పర్యము

వీరలముఖములు నిజముగ, గమలములే. అటుగాకయున్నఁ దుమ్మెదలు కమలములనువలె నేల వీని చుట్టు తిరుగుచున్నవి.

క. అందము చందము మఱి చ,ల్లందనమును బరిమళంబు•లలితాకృతులున్
సుందరము లగుటఁ బంకజ,బృందముపో ముఖము లనుచు•నెంచెను గపియున్.

తాత్పర్యము

అందముయొక్క విధము చల్లఁదనము సువాసన మనోజ్ఞమైన యాకారము ఇవియన్నియు సుందరములేయైన కారణముచే వారి ముఖములు నిజముగఁ బద్మములే యని తలఁచెను. 'పో' యనునది నిశ్చయార్థమును తెలుపును.

కమల ముకుకమృద్వీ ఫుల్ల రాజీవగంధ
స్సురత పయసి యస్యా స్సౌరభం దివ్య మంగే
చకిత మృగ దృగాభే ప్రాంతరక్తేచ నేత్రే
స్తనయుగళ మనర్ఘ్యం శ్రీఫలశ్రీవిడంబి ॥
తిల కుసుమ సమానం బిభ్రతీ నాసికాగ్రం
ద్విజ గురు సురపూజాశ్రద్ధధానా సదైవ
కువలయ దళకాంతిః కాపి చాంపేయగౌరీ
వికచ కమలకోశాకార కామాతపత్రా
వ్రజతి మృదుసలీలం రాజహంసీవ తన్వీ
త్రివళి లలితపద్మా హంసవాణీ సువేషా
మృదుశుచిలఘు భుంక్తే మాలినీ గాఢలజ్జా,
ధవళ కుసుమవాసో వల్లభా పద్మినీస్యాత్.

అని పద్మినీ జాతి స్త్రీ లక్షణము.

పద్మినీ జాతి స్త్రీలు తొలి మూఁడు జాములందు భర్తలతోఁ గలియరు. ఈ కాలమందు వీరు నిద్రించుచున్నారని చెప్పుటచేతను వీరు పద్మినులనియే చెప్పనగును. 'రమయతి రమణీయాం పద్మినీ తుర్యయామే' యని లక్షణము.

క. తారాగణరాజిత మగుశారదతారాపథంబు • చందంబున దే
వారివరమందిరము కాం,తారత్నగణంబుచేతఁ•దద్దయు వెలిఁగెన్. ౪౯

అర్థములు. తారాగణరాజితము=నక్షత్రసమూహముచేఁ బ్రకాశించునది. శారద తారాపథంబు=శరత్కాలమందలి యాకాశము.

తాత్పర్యము

నక్షత్ర సమూహముచే శరత్కాలమందలి యాకాశము ప్రకాశించునట్లు స్త్రీ

రత్నములచే రావణాసురుని యిల్లు ప్రకాశించెను. రావణాసురుఁడు చంద్రుఁడనియు స్త్రీలు నక్షత్రము లనియు గ్రహింప వగు.

శా. ఆ రాజీవవిలోచనాపరివృతుండై రాక్షసాధీశుఁడున్
దారాసంవృతకైరవాప్తుఁ డన నత్యంతంబు శోభిల్లె బా
లారత్నంబులఁ బుణ్యవిచ్యుతిని నేలన్ వ్రాలు తారాళిగా
ధీరాగ్రేసరుఁ డా మరుత్తనయుఁ డెంతే నెంచెఁ జిత్తంబునన్. ౨౫౮

అర్థములు. రాజీవ విలోచనా=కమలములవంటి కన్నులుగల స్త్రీలచే, పరివృతుండై=చుట్టఁబడినవాఁడై, తారాసంవృత=నక్షత్రములచేఁ జుట్టఁబడిన, కైరవాప్తుఁడనన్=చంద్రుఁడోయన్నట్లు, పుణ్యవిచ్యుతిని=పుణ్యము క్షయించిన కారణమున, ధీరాగ్రేసరుఁడు=ధైర్యము గలవారిలో మొదటివాఁడు.

తాత్పర్యము

కమలములవంటి ముఖములుగల యా స్త్రీలచేఁ జుట్టఁబడిన రావణుఁడు నక్షత్రములచేఁ జుట్టఁబడిన చంద్రుఁడో యను నట్లుండెనుగాని పుణ్యము క్షయించి పోఁగా నేల రాలిన నక్షత్రముల వలె నా స్త్రీలను ధైర్యవంతులలో శ్రేష్ఠుఁ డగు హనుమంతుఁడు తలఁచెను. వీరు శీఘ్రకాలమందే విధవలు కాఁబోవుచున్నారు. కావున హనుమంతుఁడట్లు తలఁచెను.

౨౪౯ వ పద్యమందు బలవంతముగ హరింపఁబడిన స్త్రీలు రావణునింట నున్నట్లు చెప్పఁబడెను. ఇది వారి స్థితి తెలుపుచున్నది. ఉత్తమజాతి క్షత్రియ స్త్రీలు రాక్షసునితో సంభోగింపవలసి వచ్చుట వారి పుణ్యక్షయముచేతనే కదా. దీనివలన నుత్తమజాతి స్త్రీ లధమజాతి పురుషులతోఁ గలియరాదని సూచితము. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' యనికదా భగవంతుఁడు చెప్పెను.

క. తళుకు తళుక్కను బెనుఁదారలవన్నె ప్రసాదగరిమ ప్రభయును ఘనమై
చెలువారుచుండె రావణునిలయంబునఁ గూర్కుచున్న నెలఁతుకలందున్.

తాత్పర్యము

తళుకు తళుక్కను నక్షత్రముల గొప్ప రూపము వారి నైర్మల్యము వాని కాంతి ఘనమై రావణునింట నిద్రించుచున్న స్త్రీల యందుఁ గానవయ్యెను.

క. పానవ్యాయామంబుల, మీనాంకుని యుద్ధమునను మెయి స్రగ్భూషల్
పేనుకొన రాలిపడినను, మే నెఱుఁగక కూర్కె నందు మెలఁతలపింఛుల్. ౨౫౯

అర్థములు. పానవ్యాయామంబులన్=మద్యపానానంతరము జరుగు కార్యములందు, మీనాంకుని యుద్ధమునను=రతియందు, స్రక్ + భూషల్ = హారములు సొమ్ములు.

తాత్పర్యము

పానానంతరము జరిగిన రతికేళులందుఁ దమ దేహమందున్న హారములు

ఆభరణములు పెనవేసికొని నేలరాలినను దేహము తెలియక స్త్రీసమూహము నిమరించెను. హనుమంతుఁడు సంచరించు నీ కాలము రెండవజాము. కావున నీ స్త్రీలు హస్తినీజాతి స్త్రీలని సూచన.

'భజతి దినరజనో ర్యామ హస్తినీంచ ద్వితీయే' యని రతిశాస్త్రము.

సీ. జాఱఁగ దిలకంబు•సవు రొప్ప నారులు, నందియ లూడిన•యబ్జముఖులు
ప్రక్కల రాలిన • వలమాల్యములచెలుల్, చీరలు సడలిన • చేడియలును
ద్రెస్సిన మంచిము•త్తియపుఁబేరులసతుల్, తునిఁగిన మొలనూళ్ళ•తోయజాస్య
లలసట దీఱంగ • నల్లఁ బండినగుఱ్ఱపుం బిల్లలను బోలు • పువ్వుఁబోండ్లు

తే. తళుకుఁగమ్మలుదాల్చిన•తలిరుఁబోండ్లు, నలఁగి తెగియుండుదండల•చెలువమీరి
కానఁ గరి ద్రెంచి వైచినఁ•గ్రాలు పూల, తీగలనఁబోలి కొందరు•తేజరిలిరి.

అర్థములు. త్రెస్సిన=తెగిపోయిన, కానన్=అడవియందు, నారులు అబ్జముఖులు, చెలులు, చేడియలు, సతులు, తోయజాస్యలు, పువ్వుఁబోండ్లు ఇవి యన్నియు స్త్రీపర్యాయ నామములు.

## తా త్ప ర్య ము

కొందఱ స్త్రీలకుఁ జెమటవలనఁ దిలకము కరఁగిపోయెను. కొందఱకుఁ గాలియందె లూడెను. కొందఱకు మెడలోని దండలు ప్రక్కల రాలియుండెను. కొంద ఱకు చీరలు వదలుపడి జాఱి యుండెను. కొందఱు మెడలోని ముత్యాలదండలు తెగి నేలరాలి యుండెను. కొందఱ మొలనూళ్ళు తునిఁగి యుండెను. కొందఱు అలసిన గుఱ్ఱపు బిల్లలవలెఁ బండికొని యుండిరి. కొందఱు తళుకుఁగమ్మలు ధరించి యుండిరి. రతిశాస్త్రప్రకారము చుంబనప్రదేశములలో చెవులు చేరవు. కావునఁ జెవులకే హానియు లేదు.అవి రతియందు దుపయోగపడునవి కావు. కావున కమ్మలు హానిలేక యథాప్రకారమున్నట్లు చెప్పఁబడెను. ఈ సందర్భమున నీ శ్లోకము స్మరింపవగును. "కమలే కమలం తదుపరి కమలం తస్మిన్ కమలం విమలం భాతి, అమునా యమునా కరధృత వదనా చుంబన సమయే శ్రుతిరివ భాతి" కొందఱు దండలు తెగియుండుటచే నడవియందు నేనుఁగు త్రెంచివేయఁగా నొప్పు పూల తీఁగలవలె నుండిరి.

క. ముద్దియలు గూర్కెఁ గొందఱు, ముద్దుఁజనుంగవలఁ దఱచు•ముత్తెపుఁబేరుల్
తద్దయు రవిశశికరముల, కుద్దిగ నయి కూర్కునంచ•లొప్పుం జూపెన్. ౨౬౧

## తా త్ప ర్య ము

కొందఱు స్త్రీలు నిద్రించునపుడు వారి యందమైన చనుఁదోయి యందలి హెచ్చు ముత్యాలదండలు సూర్యచంద్రకిరణముల కాంతిగలవై నిద్రించు హంసల వలె నుండెను. మిట్టలు, వర్తులములు, శ్వేతములు నగుటచే నీ యుపమానము.

క. ఇంబుగఁ గొండల వైదూ,ర్యంబులు కాదంబపక్షు•ల ట్లొప్పఁ, రథాం
గంబులగతిఁ గొండల గ్రీ•వంబులఁ దనరారు చుండె • బంగరుసరడుల్. ౨౭౨

అర్థములు. కాదంబపక్షులు=పొగచాయగల ముక్కు కాళ్లు రెక్కలుగల హంసలు, రథాంగంబులు=చక్రవాకములు.

తా త్ప ర్య ము

కొండలు స్త్రీలు ధరించిన వైదూర్యంబులు కాదంబపక్షుల వలె నుండెను. కొండల మెడల యందున్న బంగారు సరడులు చక్రవాకములవలె నుండెను.

వైదూర్యలక్షణము. గీ. పగలు గొందిఁ గానఁబడిన బిడాలంపుఁ గన్ను వోలె వెలుఁగు గలిగి నూలు । తిరిగినట్లు మీఁది రెలబారు వైదూర్య రత్నమున కతి ప్రయత్నమునను॥

క. కొండలు మెడలం దాల్చిన, యందపు వైదూర్య వితతు•లంచలరీతిన్
గొండల బంగరుసరడులు, సుందరచక్రముల రీతి • సొబగున వెలసెన్. ౨౭౩

అర్థములు. చక్రములు=చక్రవాకములు.

తా త్ప ర్య ము

సులభము,

క. అంచలచేఁ గారండవ, చంచచ్చక్రములచేత • సైకతములచేఁ
బ్రాంచన్నదు లన జఘనో,దంచిత లయి సతులు వెలసి•రా భవనమునన్. ౨౭౪

అర్థములు. అంచలచేన్=హంసలచేతను, కారండవ = కన్నెలేళ్ళచేతను, చంచత్+చక్రములచేతను=చలించుచున్న చక్రవాక పక్షులచేతను, సైకతముల చేతన్=ఇసుక దిబ్బలచేత, ప్రాంచత్+నదులనన్=ప్రకాశించు నదు లనునట్లు, జఘనోదంచితలయి=నడుముల ముందటి భాగము గలవారై, 'జఘనం కామినీ శ్రోణి పురోభాగే కటిస్థలే' వై జయంతి. భవనమునన్=ఇంటియందు చక్రములకు స్తనములకు, ఇసుక దిబ్బలకు, పిఱుదులకు నుపమానోపమేయములు.

తా త్ప ర్య ము

హంసలచేతను, గన్నెలేళ్ళచేతను, చక్రవాకములచేతను, ఇసుకదిబ్బల చేతను నొప్పునదులవలె జఘనములచే నొప్పుస్త్రీలా యింట నుండిరి. ఈ యర్థ మునే క్రింది పద్యమున వివరించుచున్నాఁడు.

చ. ప్రకట సువర్ణభూషణసు•పద్మచయంబులుఁ జారుకింకిణీ
ముకుళములున్ మనోగ్రసన • మోహనశీల విలాసనక్రరు
క్ప్రకరతటంబు లై నిదురఁ • గ్రాలెడు బాలలు పోల్ప నేఱు ల
ట్లొకలుమరీతి గ్రాలిరి వి•హారభరశ్రమ నష్టచిత్తలై. ౨౭౫

అర్థములు. ప్రకట సువర్ణ భూషణ=స్పష్టముగాఁ దెలియుచున్న బంగారు సొమ్ములనెడి, సుపద్మచయంబులు=మంచి కమల సమూహములు, చారు కింకిణీ

ముకుళములు=అందములైన చిఱుగజ్జెలనెడి మొగ్గలు: మనోగ్రసన = మనస్సును హరించునట్టియు, మోహనశీల = మోహింపఁజేయు స్వభావము గలట్టియు; విలాస=శృంగారచేష్టలనెడి, నక్ర=మొసళ్ళను మొసళ్ళు జంతువుల వశపఱుచుకొనునట్టు లీ శృంగారచేష్టలే పురుషుల వశపఱుచుకొనునవి కావున నవి మొసళ్ళ వంటివి. ఈ చేష్టలే భావములు. సుందరు లే దశయందున్నను ఏ చేష్టలు చేసినను జేయకున్నను నది యొక్క విలాసముగనే పురుషులకుఁ దోఁచును. మధురవాణి లేడ్చినను శ్రవ్యముగా నున్నట్లు సుందరుల యే వికారములైనను విలాసముగానే తోఁచును. రుక్ప్రకర తటంబులై =కాంతి సమూహము లొడ్డులై; స్త్రీలునిదురించుచున్నను వాసనావశమున నిట్టివి కలుగును. విహారభరశ్రమ నష్టచిత్తలై=క్రీడాతిశయముచేఁ గల్గిన శ్రమముచే స్వాధీనము తప్పిన మనస్సు గలవారై.

## తాత్పర్యము

బంగారు సొమ్ములనెడి వికసించిన కమలములు, నొడ్డాణము లందలి చిఱుగజ్జెలనెడి మొగ్గలు, మనస్సును మ్రింగునట్టి మోహింపఁజేయు స్వభావముగల శృంగారచేష్ట లనెడి మొసళ్ళను, కాంతులనెడి యొడ్డులుగలిగి నిద్రించు బాలికలు క్రీడాతిశయముచే నలసి పరవశలై యేఱులవలె నుండిరి.

బాలలు- 'బాలా స్యాత్ షోడశాబ్దాత్తదుపరి తరుణీ వింశతే ర్యావదూర్ధ్వం ప్రౌఢాస్యా త్పంచపంచాశదవధి పరతో వృద్ధతా మేతి నారీ' పదునాఱు సంవత్సరములకుఁ బైపడినది బాల యనియు నిరువది యేండ్లకుఁ బైపడినది తరుణి యనియు; ఆపై నేఁబదియైదు వఱకుఁ బ్రౌఢయనియు ఆపై వయస్సుది వృద్ధ యనియు జెప్పబడును. ముప్పది యేండ్లవఱకుఁ దరుణి యని యొకపాఠము గలదు. ఇట్లు చెప్పుటచేఁ బదునాఱు సంవత్సరములకుఁ దక్కువ వయస్సుది రతికి యోగ్యురాలు కాదని శాస్త్రాభిప్రాయము. ప్రథమ రజస్వల యెప్పుడైనను బదునాఱవ సంవత్సరము వచ్చువఱకు గర్భాధానము చేయరాదు.

చ. గురుకుచ చూచుకంబులను ♦ గోమలహృద్యతరాంగ పాళులన్
సరసమణీమయాభరణ♦సంఘము లెంతయు నొప్పు మీఱఁగ న
త్తరుణులు నిద్ర వోవు నెడ ♦ దర్పకదర్ప వినష్టచిత్తులై
పురుషులు మీఁద సోలిపడు♦పొల్పువహించి మనోహరంబుగన్. ౨౬

అర్థములు. గురు=గొప్పవగు, కుచ చూచుకంబులన్=చన్నులందు, వాని ముక్కులందు. కోమల=సుకుమారమైన, హృద్యతర=మిగుల మనోజ్ఞమైన, అంగపాళులన్=అవయవ ప్రదేశములందును, సరస=శృంగారముతోఁ గూడిన, మణీమయాభరణ సంఘములు=రత్నములతోనిండిన సొమ్ములగుంపులు, ఎంతయున్=మిక్కిలి, దర్పక దర్పవినష్టచిత్తులై=మన్మథుని ప్రతాపముచే నశించిన మనస్సుగలవారై.

### తాత్పర్యము

గొప్పవగు స్తనములందును, చనుముక్కులందును, కుసుమారములై మిగుల మనోహరములైన యవయవములందును ధరింపఁబడిన యందములైన రత్నాభరణముల సమూహములు ఆ స్త్రీలు నిద్రపోవునపుడు వారిని జూచిన మగవారు మదన వికారముచేఁ బరవశులై వారిమీఁదఁ బడునంతటి యొప్పుగలవై యుండెను.

ఈకారణముచేతనే స్త్రీలు నిదురించునపుడు పురుషులు చూడరాదను నియమ మేర్పడెను స్త్రీలును వెల్లకిలఁ బరుండరాదు.

క. ఆయ్యెడ నిదురించెడు నత్తొయ్యలులముఖములనుండి•తొలఁకెడి యూర్పుల్
పయ్యెదచెంగులచేఁ దా. మొయ్యన వీచోపు లిడెడు•యోషాస్యములన్. ౨౭౭

అర్థములు. తొయ్యలుల=స్త్రీలయొక్క, ఒయ్యన=మెల్లగా, వీచోపులు= వింజామరలు, యోషాస్యములన్ ఆ స్త్రీల ముఖములందు.

### తాత్పర్యము

ఆ సమయమున నిదురించు స్త్రీల ముఖముల నుండి వెలువడు నూర్పు గాలులచేఁ గదలుచున్న పైఁటకొంగులు ఆ స్త్రీల ముఖములపై వింజామరలు వేయుచున్నట్లు లుండెను.

వీరి కెవ్వరికి రైకలు లేవనుట స్పష్టము.

క. నానావర్ణసువర్ణస, తీనవ్యముఖాబ్జములను•దీవ్యచ్ఛుభపై.
రానివహము మదనపతా, కానికరము నట్లు వెలిఁగెఁ•గమనీయంబై. ౨౭౮

అర్థములు. నానావర్ణ సువర్ణ=పలుతెగలగు మంచి కాంతులు గల, సతీ= స్త్రీలయొక్క, నవ్యముఖాబ్జములను = అందమైన ముఖకమలములను, దీవ్యత్= ప్రకాశించు, శుభపైరానివహము=అందమైన పైఁటల సమూహములు, మదన పతాకానికరము నట్లు=మన్మథుని ధ్వజముల గుంపువలె.

### తాత్పర్యము

పలుతెగలగు మంచి కాంతులు గల స్త్రీల యందమైన ముఖకమలములందు బ్రకాశించుచున్న పైఁటలు మదనుని ధ్వజములవలె నందములై యుండెను.

పైపద్యమునందలి యీ పద్యమునందలి వర్ణనమును బట్టి యీ స్త్రీలు ముఖములపై పైఁటలు కప్పుకొని నిదురించు చుండిరని యేర్పడుచున్నది. అటు గాకున్న ఆ మొమ్ముల మీఁది పైఁట లూర్పుగాలికిఁ గదలుటగాని ముఖములకు వీచోపు లిడుటగాని తటస్థింపదు.

క. ఇందుముఖీ ముఖనిర్గత, మంద సుగంధవహాసర్గ • మండిత మగుచున్
మందంబుగఁ గదలెను గుచ్ఛ,వింధమణీరుచిరము లగు•వెలఁగల కమ్మల్. ౨౭౯

అర్థములు. ఇందుముఖీ=చంద్రునివంటి ముఖముగల యా స్త్రీలయొక్క, ముఖ=ముఖములనుండి,నిర్గత=బయలు వెడలిన, మంద=మెల్లనైన, సుగంధవహ=

మంచిగాలియొక్క, సర్గ=కూడికచే, మండితము = అలంకరింపఁబడినది, మందముగ=కొంచెముగ, కురువిందమణిరుచిరములు=కెంపులచే సందములు.

## తాత్పర్యము

ఆస్త్రీల ముఖమునుండి వెడలుచున్న కమ్మని వాయువుచే నలంకరింపఁబడినవై వెలగల కెంపులు కమ్మలు కొంచెముగఁ గదలెను.

కురువిందము పద్మరాగములందు భేదము.

సీ. ఉదయార్కబింబ సముజ్జ్వల ప్రభగల్గి, కరమొప్పు పద్మరాగంబు పొదలు
అసమాన దాడిమీ కుసుమ మంజరిచాయ, గలిగి శోభిల్లు సౌగంధికంబు
సలలిత మత్తకోకిల లోచనద్యుతి, నలరారుఁ గురువింద మనెడి కెంపు
మండిత శశమాంస ఖండంబు గతి నున్న, మందతేజంబగు మాంసగంధి

గీ. నలుపు నెత్తురుదనము మిళితమై నెగడెడు, వాలు గలిగినదియు నీలగంధి
లాలు లేక కోమలం బను సంజ్ఞలు, గ్రాలు కెంపు చాల రంగు లేక.

క. ధరఁ బద్మరాగమెందును, దొరకదు కలియుగమునందుఁ దోచిన వేఁగై
నిరుపమ రుచి నిర్మలమగుఁ, గురువిందపుఁ గెంపు గలదు గోరి భజింపన్.

(రత్న పరీక్ష.)

క. చక్కెరకల్వాలపులు వెలఁ గ్రక్కెడు నచ్చిగుఱుఁబోండ్ల కమ్మనియూర్పుల్
మిక్కిలి రావణుమీఁదను, జక్కఁగ విహరించెఁ గైపుసంపద లోలయన్. ౫౭౦

అర్థములు. చక్కెరకల్వాలపులు=చక్కెరతో జేసిన కల్లువాసనలు, చక్కెరయొక్కయు, కల్లుయొక్కయు సువాసనలు, చిరుగుబోండ్ల=స్త్రీలయొక్క, కైపుసంపద=మదాతిశయము.

## తాత్పర్యము

చక్కెర కల్లువాసనలు గొట్టుచున్న యాస్త్రీల కమ్మని శ్వాసములు మదాతిశయముచే రావణుమీఁద వ్యాపించెను. దీనివలన హనుమంతుఁడు రావణు సమీపించు చున్నాఁడని సూచన.

సీ. రావణాననము లన్ భ్రాంతిని సవతుల, ముఖముల ముద్దిడు ముద్దరాండ్ర
నధిపుఁడే ముద్దిడె న భ్రమ మత్తున, సవతాండ్రఁ జుంబించు ధవసురతలఁ
బడుకలు పైఁటలు కడియాలచేతులు, దిండ్లుగా నిదురించు తీఁగఁబోండ్లఁ
దమయురంబుల నుంచి తలలు నిద్రించు చెల్వాల ఱొమ్ములను జేయి వైచుసతుల

తే. నొఱపు మెఱయంగ నొక్కర్తు కుచవుమీఁద
శిరము ఘటియించి కూర్కెడి చెలువఱొమ్ము
నందుఁ గేలెత్తిచి నిదురించు నిందుముఖుల
నందుఁ గనుఁగొనె నంజనా నందనుండు. ౫౭౧

## తా త్ప ర్య ము

కన్నులు మూసికొని నిదురించుచుండుటచే రావణుని ముఖములను భ్రాంతిచే సవతుల ముఖములను గొందఱు ముద్దుపెట్టుకొనుచుండిరి. వారిట్లు ముద్దుపెట్టుటచేఁ దమ మగఁడే ముద్దిడెనని తలఁచి మత్తువలనఁ గలిగిన భ్రమచే నది మఱియొక సవతిని ముద్దుపెట్టెను. నిద్దురమబ్బు విశేషించి పీడించుటచే పఱుపులు పఱచుకొనుట కవకాశములేక వానినే తలక్రింద దిండుగాఁ బెట్టుకొని కొందఱు-పైఁటలు పఱచుకొని కొందఱు-కడియాలచేతులు తలక్రిందఁ బెట్టుకొని కొందఱు నిదురించుచుండిరి. తమ ఱొమ్ములమీఁదఁ దలయుంచి కొందఱు స్త్రీలు నిదురింపఁగా వారి ఱొమ్ములపైఁ జేతులువైచి కొందఱు నిద్రించిరి. ఒకదాని తొడమీఁద మఱియొకతె తలయుంచి నిద్రింపఁగా దాని ఱొమ్ముమీఁద నది చేయివైచి నిద్రించెను, ఇట్టి స్త్రీల నెల్ల హనుమంతుఁడు చూచెను.

ఉ. సారెకుఁ ద్రావి మేను లవ◆శంబుగ నొండొరుమీఁదఁ బార్శ్వపృ
ష్ఠోరుకటీ ప్రదేశముల ◆ నుంచి సుమాంబకరాగమగ్నలౌ
వారును సూత్రబద్ధమద◆బంభరశోభితమాలికారుచిన్
వారక యొక్కొకర్తుకను ◆ బాహులఁ గట్టి పెనంగు కేశినుల్. -౨౮౨

అర్థములు. పార్శ్వ=ప్రక్కలు, పృష్ఠ=వీఁపులు, ఊరు=తొడలు, కటి=నడుము, సుమాంబకరాగ=మన్మథకామమునందు, మగ్నలు = మునిఁగినవారు, సూత్రబద్ధ=దారముచేఁ గట్టఁబడినదియు, మద=మదించిన, బంభర=తుమ్మెదలచే, శోభిత=ప్రకాశించునదియు, మాలికారుచిన్=పూలసరముయొక్క కాంతితో, ఒక్కొకర్తుకను=ఒకతె మఱియొక్క దానిని, కేశినుల్=నల్లని యందమైన తలవెంట్రుకలు గల స్త్రీలను.

## తా త్ప ర్య ము

పలుమాఱు ద్రావి దేహములు తమ స్వాధీనము తప్పిపోఁగా నొకతె మీఁద నింకొకతె ప్రక్కలు వీఁపు తొడలు నడుము లుంచి మన్మథకామమున మునిఁగినవారిని, నారచేఁ గట్టఁబడి తుమ్మెదలచేఁ బ్రకాశించు పూలదండలవలెఁ జేతులు చేతులు కలిసియున్నట్లు పెనవేసికొనిన కబరీవతులను హనుమంతుఁడు చూచెను. చేతులు పెనవేయుట సూత్రముచేఁ గట్టఁబడుట, కొప్పులు తుమ్మెదలు, మాలికలు స్త్రీలు.

చ. సలలితమందమారుతవ◆శంబునఁ గూడి పెనంగుతీఁగలన్
గలసిన స్కంధసంతతుల ◆ నవ్యసుమౌఘములన్ మిళిందపం
క్తులఁ జెలువారి చైత్రమున, ◆ దోరపుఁగాంతిని మీఱు నద్వనీ
విలసనము న్వహించె సుర◆వీరవిరోధివధూవనం బటన్. ౨౮౩

అర్థములు. సలలిత మందమారుతవశంబున = ఇంపైన మెల్లని గాలి

కారణముగా, స్కంధసంతతులన్ = చెట్లబోదెల, సుమ+ఓఘములన్=పూల సమూహములను, మిళింద=తుమ్మెదల, సద్వనీవిలసనమున్=మంచి యుద్యానము యొక్క చక్కఁదనమును, సురవీర విరోధి=రావణునియొక్క, వధూవనము=స్త్రీ వనము.

తా త్ప ర్య ము

రావణుని స్త్రీలను వనము మనోహరమైన పిల్లని గాలిచే నొకదానితో నొకటి పెనవేసికొనిన తీఁగలతోఁ గలసిన బోదెలను పూలసమూహములను దుమ్మెద గుంపులను గల చైత్రమాసమున వికాసముతోఁ గూడిన వనమువలె నుండెను.

ఇచ్చట మన్మథోద్రేకము మందమారుతము తీఁగలు, చేతులు, స్కంధ ములు భుజములు నడుములు గల దేహభాగములు సుమములు వారు ధరించిన పూవులు, తుమ్మెదలు తలవెండ్రుకలుగా నుపమానోపమేయంబుల గ్రహించునది.

ఆ. మెలఁత లచట నత్తిమిల్లిన లీలలు, చూడ నవయవములు సొబగుమీఱు
వస్త్రమాల్యములును వారి వారి వ టంచు, వేఱుపఱుప రాక బెరసియుండె.

అర్థములు. అత్తిమిల్లిన=పరుండిన, లీలలు=విధములు, బెరసి=కలసి.

తా త్ప ర్య ము

స్త్రీలచట బండుకొనిన విధము చూడఁగా కాళ్లు చేతులు వస్త్రములు మాల్యములు ఇది దీనిది అవి దానివి యని వేఱు వేఱుగఁ జెప్పరానట్లు కలిసి యుండెను.

క. ఆ మందిరమణిదీపము, లామునితలరూపు జెప్ప లార్పక జగతీ
స్తోమభయదుండు గూర్కఁగఁ, గామముచనఁ జూచు మాడ్కిఁ గ్రాలెనచలతన్.

అర్థములు. ఆ మందిర=ఆయింటియందలి, జగతీస్తోమభయదుండు = లోక ములకన్నిఁటికి భయము కలిగించువాఁడు. కామముచనన్ = కోరికదీరునట్లు, ఉత్ప్రేక్షాలంకారము.

తా త్ప ర్య ము

ఆయింట మణి దీపములు చలింపక యేకాగ్రముగ వెలుఁగుచుండు విధము చూడ లోకభయంకరుఁడైన రావణుఁడు నిద్రించుచున్న కారణముచే భయము దీఱి కోరికదీర నవి వాని స్త్రీలను జూచుచున్నవా యేమి యన్నట్టులుండెను.

ఇట్లు చెప్పుటచే రావణుఁడు మేలుకొని యున్నప్పుడా స్త్రీలను దీపములు కూడ నిర్భయముగాఁ జూడఁజాలవని భావము.

ఉ. కాముని బారి కోహటిలి కైవసమైన నృపర్షి దైత్యక
న్యామణులున్ సురాంగనలు నాహవకాంక్షను దెచ్చినట్టి కాం
తామణులున్ స్మరాశుగహతి ప్రమదల్ సురవైరి చుట్టు ని
ద్రామదపారవశ్యమున రంజిలు చుండిరి తత్స్థలంబునన్. ౭౦

అర్థములు. ఈ స్త్రీ లందఱు రాక్షసస్త్రీలు, రావణాసురుఁడు యథావిధి వివాహ మాడినవారా యనినఁ గాదను చున్నాఁడు. కాముని బారికి=మన్మథుని దాడికి, ఓహటిలి=భయపడి, కైవసము=స్వాధీనము. నృప=రాజులయొక్కయు, ఋషి=ఋషులయొక్కయు నృపర్షి = రాజర్షులయొక్కయు, దైత్య=దైత్యుల యొక్కయు, కన్యామణులన్=కన్యకలు, సురాంగనలు=దేవతాస్త్రీలు, ఆహవ కాంక్షను=యుద్ధమందలి కోరికచే, అనఁగా గొందఱు యుద్ధమునకు రాక ముఖము తప్పించుటచే వారిని యుద్ధమున కీడ్చుటకై వారి స్త్రీల నపహరించి తెచ్చెనని భావము. స్మరాశుగహత ప్రమదల్=మదన బాణములచేఁ గొట్టఁబడిన స్త్రీలు, నిద్రామదపారవశ్యమున=నిద్రమబ్బుచే దేహములు తెలియని వారై.

తాత్పర్యము

ఆ ప్రదేశమందు మన్మథతాపము సహింపలేక స్వాధీన పడిన రాజుల ఋషుల దైత్యుల కన్యకలును దేవతాస్త్రీలును యుద్ధమునందలి కోరికచేఁ దెచ్చిన స్త్రీలును కామముగల స్త్రీలును నిద్రమబ్బుచేదేహము తెలియక రావణాసురుని చుట్టు పడియుండిరి.

ఇట్లు చెప్పుటచే నీ గుంపులోఁ గొందఱు స్త్రీలు తమంతటఁ దామే రావణు వరించి వచ్చిరి. కొందఱు బలాత్కారముగఁ దేఁబడి మరల వారు తమ బంధువుల గలిసికొను ప్రాప్తి లేమిచే వ్రతము చెడినను సుఖము దక్కవలెఁ గులము చెడినను గూడు పుట్టవలె నన్న సామెత చొప్పున పస్తులఁ జావలేక వానిబాధపడలేక కామము వ్యర్థము చేయనొల్లక వానికి వశపడిరని యేర్పడుచున్నది. కాని మండో దరివలె ధర్మపద్ధతిని వివాహ మాడినవారు కారని భావము.

క. ప్రమదలలో సురారి ప్రస•భంబున దెచ్చిన దన్యకామ ము
న్నమగనిఁ బొందినట్టి చెలి • యక్కడ లే దొకసీత దక్కఁగా
సమరవిరోధిఁ గాంచి తమ • యంతన తాము తదీయ శౌర్యమున్
రమయు గుణంబు మెచ్చి తమి•రాములు వచ్చిరి వానిఁ గూడఁగన్. ౭౨

అర్థములు. ప్రమదలలో=స్త్రీలలో, ప్రసభంబునన్ = బలాత్కారముగ, అన్యకామ=ఇతరపురుషులందుఁ గామముగలది.

తాత్పర్యము

ఆ స్త్రీలలో బలాత్కారముగఁ దేఁబడినది, ఇతర పురుషునందు మోహము గలది, పూర్వము మగనితోఁ గలిసినది సీతదక్క వేఱొక్కతెయు లేదు. అచ్చట నున్నవా రందఱు రావణుఁజూచి వాని శౌర్యము సంపద గుణము మెచ్చి వానిని గూడ వారంతటవారే వచ్చిరి.

ఇట్లు చెప్పుటచే నా గుంపులో నిట్టివారు లేరని యర్థమేకాని రావణుఁ డెవ్వతెను బలాత్కరించి తేలేదని యర్థముగాదు. ఏలన:—

౧. రావణాసురుఁడు పరస్త్రీలను గాముకుఁడై బాధించె ననుటకు వేదవతీ చరిత్రము ప్రమాణము.

౨. దశరథుని యజ్ఞకాలమున దేవతల శరణాగతియందు రావణుఁడు దేవతాస్త్రీల హింసించెనని ప్రమాణము.

3. రావణుఁడు రంభాది స్త్రీలను జెఱచుట నలకూబర బ్రహ్మలచే శాపగ్రస్తుఁడగుట ప్రమాణము.

౪. మండోదరీ విలాపంబున

'దేవాసుర నృకన్యానా మాహర్తారం తతస్తతః

దేవతల, అసురుల, మనుష్యుల కన్యల హరించినవాఁడని యుండుట ప్రమాణము.

౫. అన్నను విడిచి వచ్చితివని యింద్రజిత్తు విభీషణు నాక్షేపించినపుడు:—

పరధనములఁ బరదారల హరియించుట,

పరవిత్తమపహరించుట - పరదారలఁ గోరుచుంట.

యివి రావణు దోషములని యతఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

హింసా పరస్వహరణే పరదారాభిమర్శనం

పరస్వానాంచ హరణం పరదారాభిమర్శనం

ఏతే దోషా మమభ్రాతు ర్జీవితైశ్వర్యనాశనాః.

యుద్ధ. ౮౭౪ సర్గము.

౬. ఉత్తరకాండమున ౪౯3 మొదలు పద్యములఁ జూచునది.

చ. చనుచును రావణుండు బల•సంపద పొంపిరివోవుచుండఁ గ్రొ
వ్వునఁ దనమార్గమందు నృప•పుష్కరనేత్రల మాని కన్యలన్
దనుజ కులాంగనామణుల • దైవతకాంతల వీరు వారటం
చన కగపడ్డ సుందరుల • యావతముం గులకన్యకాతతిన్. ౪౯3

చ. బలిమిని ముట్టి యడ్డపడు • బంధువులం బడఁగొట్టి కేలుఁ గొ
ప్పులు బిగఁబట్టి యచ్చెలులు • బ్రుయ్యఁగఁ దిట్టఁగ మొత్తుకోఁగ నీ
డ్గిలఁబడ నీడ్చికొం చరిగి•తెక్కువఁ బెక్కువ బుష్పకంబునన్. ౪౯౪

క. ఈ నెఱిఁ బన్నగకన్యల, మానవభామలను నసుర•మానినులన్ ర
క్షోనారుల యక్షసతుల, దానవ యోషల విమాన•తలముం జేర్చెన్. ౪౯౫

౭. అరణ్యకాండమున 3౨ వ సర్గమందు.

"పురీం భోగవతీం ప్రాప్య పరాజిత్యచ వాసుకిం। తక్షకస్య ప్రియాం భార్యాం పరాజిత్య జహార యః" యని చెప్పఁబడెను.

౮. రావణుఁడు సీతాదేవితో,

'పరదారగమనకేళియుఁ బరదారాపహరణంబు పద్మదళాక్షీ పరఁగుఁ గుల ధర్మమయి' యని చెప్పెను. (సుందర. ౫౧౯ వ ప.)

అచ్చటచ్చట నాఁచికొనుచుఁ దెచ్చిన నాయెల్ల తెఱవలలో నగ్రమహిషివి గమ్ము. (సుందర. ౫-౨౭)

'బహ్వీనా ముత్తమ స్త్రీణా మాహృతానా మితస్తతః సర్వాసామేవ భద్రంతే మమాగ్రమహిషీ భవ. (సుందర. ౨౦ వ స. ౧౬ శ్లో.)

౯. రావణుని శూర్పణఖ చూచినపుడు వాని గుణవర్ణనమందు 'పరదారాభిమర్శన'మ్మని చెప్పఁబడెను.

౧౦. పంక్తికంఠుఁడు బలిమిని బట్టినట్టి నాగకన్యలలోన జానకియ లేదు. (సుందర. ౩౫౭ వ. ప.)

ఇత్యాద్యనేక ప్రమాణములచే రావణుఁడు పరస్త్రీల నంటని సదాచార సంపన్నుండని తలఁపరాదు. కావున నిచ్చటి మాటకేమి యర్థమనిన నా పడుక టింటిలో వాని నొల్లని స్త్రీలు లేరనియేకాని యట్టివారు వేఱు స్థలమునందు లేరని యర్థము కాదు. ఈ స్త్రీలలోనే వానియందుఁ బ్రేమలేనివారు లేకపోలేదు. చూ. సుం. ౫౭౬.

రావణుఁడు సీతాదేవిని బెదరించినపుడామె దుఃఖింపఁగా నీ స్త్రీలలోఁ గొందఱు సీతాదేవికి ధైర్యము వచ్చునట్లు కన్నులచే ముఖములచేఁ బెదవులచేఁ దల యాడించుటచే లోఁబడవలదని సైఁగలుచేసిరి. వానియందు నిజమైన కామము గలవారట్లు చేయుదురా? వేఱు రక్షకులులేక గతిలేక వీనికిఁ జిక్కితిమి, అనుభవింతమని వారు వాని కనుకూలలుగా నుండిరి కాని వాస్తవపు మక్కువచేఁగాదు. అట్లు లోఁబడనివారిని వాఁడనేక హింసలఁ బెట్టెను.

ఉ. లేదు కురూప యందు నకు•లీనయు లే దుపచారసత్క్రియా
మోదితచిత్త గాని యొక•ముగ్ధ యదక్షిణ లేదు చూడఁగా
లేదు విహీనసత్త్వయును • లీలల భర్త కకామనీయయున్
లే దల రావణాసురుని•లేమలయం దొకభార్య యేనియున్. ౨౭౭

అర్థములు. అకులీన=మంచి వంశమందుఁ బుట్టనిది, ఉపచార సత్క్రియా మోదితచిత్త=ఉపచారముచే సంతోషింపని మనస్సుగలది, అదక్షిణ=సామర్థ్యము లేనిది, విహీనసత్త్వ=బలములేనిది, అకామనీయ=కామింప రానిది.

తాత్పర్యము

ఆ రావణు భార్యలందు నొకతెయైన కురూపగాని యుత్తమ వంశమందుఁ బుట్టనిదికాని యుపచారములచే సంతోషింపని ముగ్ధగాని భర్తను వశపఱుచుకో లేని మధ్యగాని బలములేనిది ప్రౌఢగానిది గాని శృంగారచేష్టలచే భర్తకుఁ గామింప దగనిది గాని లేదు.

లీల=అధిపుని యలఘు గుణానుకృతి లీల యనఁబడును. ఇచ్చట లీల లను నది శృంగారచేష్టల కన్నిఁటికి నుపలక్షణము. అవి యేవన :—

కం. ఇల భావ హావ హేలా, విలాస మాధుర్య ధైర్య విభ్రమలలా,
కిలికించిత మొట్టాయిత, లలితాదులు చేష్టలగుఁ దలంపఁగ మఱియున్.

గీ. వెలయు బిబ్బోక విచ్ఛిత్తి విహృతి చకిత,హసితకుట్టమిత కుతూహలాదులనఁగఁ
గలవుమఱియందు భావంబువెలయుచుండుమహిరసజ్ఞానయోగ్యతామాత్ర
మగుచు. నర. భూ.

క. ఈ రావణు భార్యలవలె, శ్రీరాముని ధర్మపత్ని చేరినచో దే
వారాతి సుకృతి యనెడు వి,చార బుదయించె హరికి సద్బుద్ధి కటన్. -౨౨౮

## తాత్పర్యము

(౧) ఈ రావణున్ వాని భార్యలవలె శ్రీరాముని నాయన ధర్మపత్ని సీతాదేవి చేరినచో రావణుఁ డర్పించుటచేఁ గలిసికొనెనేని, ఈ దేవారాతి=రావణుఁడు, సుకృతి=మంచికార్యము చేసినవాఁడగును, హనుమంతుఁడు సద్బుద్ధి=మంచి బుద్ధిగలవాఁడగుటచే నిట్టి యాలోచన దోఁచెను. రావణుఁడు సీతను రామున కిచ్చి యామెను సుఖ పఱిచెనేనితాను బుణ్యవంతుఁ డగునని హనుమకుఁ దోఁచెనని భావము.

(౨) చేరినచో=రామచంద్రుని వివాహము కాకముందే వీని యొద్ద జేరి యుండినచో ననఁగా వివాహమాడి యుండినచో నని యర్థము అనఁగా సీతాదేవి యీ స్త్రీలవలె శ్రీరామచంద్రుని దాను వరింపకముందే యీ రావణుని వరించి యుండెనేని వీఁడు పుణ్యాత్ముఁడై యుండునుగదా యని సుబుద్ధియైన హనుమకుఁ దోఁచెను. ఇచ్చట సుబుద్ధి యను ప్రయోగముచే నిది కపిత్వమువలనఁ గలిగిన చపలతయే గాని స్వభావ సిద్ధము గాదని భావము. ఇట్టి దుర్బుద్ధి పుట్టినందునకు హనుమ పశ్చాత్తాప పడుచున్నాఁడు.

వ్యసనపడి ఇత్యాదిగాఁ బై పద్యమున కవతారిక, అవనిజ, అసదృశగుణ విశిష్ట=సాటిలేని పాతివ్రత్యముచే నందఱ మించినది (అని తలఁచి)అతఁడు వ్యసన పడి=ముందు కలిగిన దురాలోచనకుఁ బశ్చాత్తాప పడి, మఱియున్ అయ్యో! అనమాత్ముఁడు=విషమబుద్ధిగల రావణాసురుఁడు, ఆమె యెడ, అసత్కర్మంబున్=దుష్కార్యమును జేసెఁ గదాయని చింతించెనని పై పద్యముతో నన్వయము.

(౩) రావణు భార్య లితరులచే నపహరింపఁబడక సదా భర్తతోఁ గూడి యెట్లు సుఖపడుచున్నారో యట్లే సీతయు సదా భర్తతోఁగూడి సుఖించు చుండినచో రావణునైశ్వర్యము చెడకుండును గదా యని, సుబుద్ధికిన్ = శత్రువులకును మేలుకోరు హనుమంతునకుఁ దోఁచెను. మఱియు నాలోచించు చున్నాఁడని పై పద్యమున కవతారిక. అవనిజ యసదృశ గుణవిశిష్టగదా, అయ్యో, మహాలకు

జాతుఁడయ్యును విషమబుద్ధిగల రావణుఁడు ఆమెయెడ ననత్కార్య మొనరించెఁ గదా యని వ్యసనపడి చింతించుచు నని యన్వయము,

సీత దృఢమనస్కురాలు గావున నామె పాతివ్రత్యమునకే లోపముగలుగదు కాని యామెకు లేనిపోని యపవాదము మాత్రము వీఁడు కలిగించెఁగదా యని వ్యసనపడుచు నాలోచించె నని భావము,

(౮) రావణు భార్యలవలె సీత రావణుచే నపహరింపఁబడక సదా భర్తతోఁ గూడి యుండినచో రావణుఁడు సుకృతియై యుండు నని హనుమ మొదట నాలోచించెను. నిరతిశయ సౌందర్యవంతురాలైన సీతను రాక్షసస్త్రీ సామ్య మెంచి నందునఁ దా నామెకు హీనోపమాన మిచ్చినట్లనుకొని హనుమ దుఃఖించు చున్నాఁడు. అని పై పద్యమున కవతారిక. అవనిజ అసదృశ గుణ విశిష్టగదాయని యాతఁడు పశ్చాత్తాపముచే వ్యసనపడి మఱియుఁ జింతించు చున్నాఁడు.

అయ్యో యిత్యాదిగా, అయ్యో సీతాపహరణముచే నీలని రాజ్యమంతయు నశించునుగదా యని యన్వయము.

ఇది గోవిందరాజీయము ననుసరించి వ్రాయఁబడెను.

హనుమంతుఁడు సద్బుద్ధి యయ్యు నాయన కొక దుర్బుద్ధి పుట్టెను.

ఈ రావణుని భార్యలవలె, రావణుని యీభార్యవలె, శ్రీరాముని ధర్మపత్నియుఁ జేరి యుండినచో నీ దేవారాతి పుణ్యాత్ముఁడై యుండును గదా యను నాలోచన గలిగి.

క. వ్యసనపడి మఱియు నాతం, డసదృశసద్గుణవిశిష్ట•యవనిజ యయ్యో
యసమాత్ముఁ డామె యెడ రా, క్షసరా జొనరించెఁగా య•సత్కర్మంబున్. ౨౯౦

తాత్పర్యము

అట్టి యాలోచన గలిగిన దానికై అసమానమైన పాతివ్రత్యమున గొప్పదియు అవనిజ-అయోనిజ-భూమియందుఁ బుట్టినది, ఆప్రకారము చేయునాయని పాపాలోచనము నాకేల గలిగెనని వ్యసనపడి యట్టి పతివ్రతయందు వీఁడు తన నాశము కొఱకు విషమబుద్ధి గలవాఁడై చేయరానిపని చేసెఁగదా యనుకొనెను.

—• ౧౦వ సర్గము. హనుమంతుఁడు నిద్రించు రావణునిఁ జూచుట. •—

క. అని చింతించుచుఁ జూచుచు, జనుచుం బలుఁగులను రత్న•సమితుల గొనబై
కనకవిదూరజదాంతా, సనములఁ జిత్రాంగములను•సవు రగుదానిన్. ౨౯౧

అర్థములు. పలుఁగులను=స్ఫటికములను, కనకవిదూరజ దాంతాసనములన్=బంగారు వైడూర్యములు ఏనుఁగు దంతములతోఁ జేయఁబడిన యాసనములను, చిత్రాంగములను=చిత్రాసనములచేలిను, సవురు=అందము.

తాత్పర్యము

అని యాలోచించుచుఁ జూచుచుఁ బోవుచు స్ఫటికములచేతను బంగారు

వైడూర్యములు, దంతములు, వీనిచేతను జేయఁబడిన యాసనములచేతను జిత్రాంగముల చేతను నందమైనదానిని,ఇదియు ముందుపద్యము రావణుని శయ్యా వర్ణనము.

సీ. పఱపైన పఱపులుఁ • బట్టుదిండ్లును గల్గి,మహిత మై దేదీప్య • మాన మగుచు
నొకచోట నవ్యమా • లోదారహరిణాంక,సన్నిభ పాండరచ్ఛత్ర మమర
జాతరూపఖచిత • సారసాప్తప్రభా,శోకమాలాపంక్తి • సుందర మయి
వీవనల్ విసరెడి • వెలఁదిబొమ్మల నొప్పి, వరధూప పంక్తులఁ • బరిఢవిల్లి
తే. మేఁకపిల్లల చర్మముల్ • మీఁద బఱచి, పూలదండల నల్లెడఁ • బొనరు పఱచి
కనఁగ సురనాథశయ్యాని • కాశమైన, యసురపతిమంచము గనె • హనుమ యచట.

అర్థములు. పఱపు=వెడలుపు, నవ్యమాలోదార = విశేషముగఁ గ్రొత్త మాలికలచే నలంకరింపఁబడి, హరిణాంక సన్నిభ=చంద్రునితో సమానమైనదై, పాండరచ్ఛత్రము = తెల్లగొడుగు, జాతరూపఖచిత=బంగారుచేఁ జెక్కఁబడిన, సారసాప్తప్రభా=సూర్యకాంతిగల, అశోకమాలాపంక్తి = అశోక పుష్పముల మాలికలచే నందమై, వెలఁదిబొమ్మలు=ఆఁడుబొమ్మలు, యంత్రము బలమున బొమ్మలు వీవనలు విసరుచున్నవని భావము. శిల్పచమత్కారము శ్లాఘింపఁదగినది కదా. ఇవి బొమ్మలేకాని రాక్షసస్త్రీలుగారు. స్త్రీలేమైయుండిన హనుమ సమీపించుటకుఁ జూచుటకు సాధ్యమైయుండదు. వరధూప పంక్తులన్ = శ్రేష్ఠమైన ధూపములచే నొప్పి.

## తాత్పర్యము

వెడలుపాటి పఱుపులు పట్టుదిండ్లు గలిగి గొప్పదై ప్రకాశించునదై యొక చోట పూలమాలలచే నలంకరింపఁబడిన చంద్రబింబమువలెఁ దెల్లనైన శ్వేతచ్ఛత్ర మొప్పుచుండఁగా బంగారుతోఁ జెక్కఁబడిసూర్యకాంతిగల యశోకపుష్పముల పంక్తులచే నందమై విసనకఱ్ఱలు విసరుచున్న యాఁడుబొమ్మలు గలిగి అగరు మహిసాక్షి ధూపములచే నొప్పి మేఁకపిల్లల చర్మములు మీఁదఁ బఱచి చుట్టు పూలదండలు గట్టి చూచుటకు నింద్రుని పానుపుతో సరిపోలుచున్న రావణుని మంచమును హనుమంతుఁడు కనుఁగొనెను.

సీ. ఆ మహనీయశ • య్యాతలంబునయందుఁ, గారుమేఘము నవ్వు • కాంతివాఁడు
క్రొత్తతళుకులఁ దేఱు • కుండలంబులవాఁడు, కావిపాఱిన పెద్ద • కనులవాఁడు
సంజకెంజాయ స • శంపాంబుదమురీతి, బొరి నెత్తుగందంపుఁ • బూఁతవాఁడు
దివ్యపరిష్కార • దేదీప్యమానుండు, రూపసియును గామ • రూపధరుఁడు
తే. అసురకన్యలకును బ్రియుం • డైనయాతఁ
డాడి మాపట మిక్కిలి • యలయువాఁడు
మేలిసొమ్ముల మెఱసెడి • మేనివాఁడు
రావణుఁడు నిద్దురింప మ • ర్కటుఁడు గనియె. ౹౬౹

అర్థములు. సశంపాంబుదము=మెఱుపులతోఁ గూడిన మేఘము, పరిష్కార=ఆభరణములచే, రూపసి=అందగాఁడు, ఆడి=క్రీడించి, మాపటన్=రాత్రివేళ.

తాత్పర్యము

ఆ పెద్ద పానుపు మీఁద వర్షాకాలమేఘమువలె నల్లని దేహకాంతి గలవాఁడును క్రొత్తకాంతులచేఁ దేటయగు కుండలములు గలవాఁడును, ఎఱ్ఱనైన పెద్ద కన్నుల వాఁడును, సంధ్యాకాలపు రాగము మెఱుపుతోడి మేఘమువలె విస్తారముగ నెఱ్ఱ గంధమును బూసికొన్నవాఁడును, దివ్యాభరణములచేఁ బ్రకాశించువాఁడును, సుందరుఁడును, కోరిన రూపము ధరించువాఁడును, అసుర స్త్రీలకును బ్రియుఁడైనవాఁడును, రాత్రివేళ యాడి యలసిన వాడును, శ్రేష్ఠములైన సొమ్ములచే మెఱయుచున్న దేహముగలవాఁడును నగు రావణుఁడు నిదురింపఁగా హనుమంతుఁడు చూచెను.

తే. రజతచేలంబువాని దీర్ఘంబులైన, బాహువులవాని భూరుహ•వనకుడుంగ
సహితమందర మనఁగను•జాలువాని, నెల్లరాక్షసులకు సుఖ•మిడెడువాని.

అర్థములు. రజతచేలంబువానిన్=వెండిసరిగ వస్త్రము ధరించినవానిని, భూరుహవన=చెట్లతో నిండిన వనములతోను, కడుంగ=పొదలతోను, సహిత=కూడిన, మందర మనఁగను=మందరపర్వత మనునట్లు.

తాత్పర్యము

వెండిసరిగ గల వస్త్రమువాని నిడుపాటి చేతులవాని చెట్లు దట్టముగాఁగల వనముతోను పొదలతోను గూడిన మందరము వంటి వాని రాక్షసుల కెందఱకు సుఖమిచ్చువాని.

ఉ. పెద్దగ దంతివోలె బుస•పెట్టెడువానిని, పానమత్తతన్
నిద్దురఁగొన్నవాని, రణ•నిష్ఠురు, రావణు డాసి భీతిమైఁ
దద్దయు దద్దరిల్లె హరి•దయ్యముఁ జూచి వణంకు కోఁచ నా
నొద్దకి కేల వచ్చితి న•హో యని పానుపు డిగ్గి యంతటన్. ౨౬౭

అర్థములు. దంతి=ఏనుగు, దద్దరిల్లెన్=తబ్బిబ్బుపడెను, కోఁచ=పిఱికి.

తాత్పర్యము

ఏనుఁగువలెఁ బెద్దగ బుసపెట్టుచున్న వానిని, త్రాగిన మత్తుచేత నిదురించువానిని యుద్ధమందుఁ గఠినుఁడైనవానిని, రావణు సమీపించి భయపడి దయ్యమును జూచి వణఁకు పిఱికివానివలె మిగులఁ దబ్బిబ్బుపడెను. అయ్యో! యీ పాపిదగ్గఱ కేలవచ్చితి నని పానుపుదిగి తరువాత.

దీనివలనఁ బాపాత్ముల సమీపింపరాదని యేర్పడుచున్నది.

ఉ. చెచ్చెర వేదికాంతరముఁ • జేరి కనుంగొనె నిదురించు నా
కుచ్చితు, దచ్ఛయంబు మద•కుంజరయుక్తఘురీప్రకాశమై

మెచ్చులు గొల్పె, నయ్యెడ న • మేయపరాక్రమకీర్తి యుక్తముల్
నిచ్చలుఁ గాంచనాంగదమ • ణీమయభూషణ భూషితంబులున్. ౨౯౬

అర్థములు. వేదికాంతరము=వేదికయరుఁగు, తచ్ఛయనము = ఆపానుపు, మదకుంజరయుక్త=మదించిన యేనుఁగులతోఁ గూడిన, ఝరీప్రకాశమై = ప్రవాహము యొక్క కాంతిగలదై, నిచ్చలు=ఎల్లప్పుడు, నిత్యశబ్దభవము-రూ-నిచ్చ.

తాత్పర్యము

శీఘ్రముగ మణియొక్క యరుఁగుమీఁదికిఁబోయి నిద్రబోవుచున్న యాకుచ్చితుని జూచెను. మదించిన యేనుఁగుతోఁగూడిన ప్రవాహమువలె వాని పానుపు శ్లాఘ్యమైయుండెను. విస్తారమైన పరాక్రమము వలనఁ గలిన కీర్తితోఁగూడిన వియు బంగారు భుజకీర్తులు రత్నమయములైన యాభరణములచే నలంకరింపఁబడినవియు.

సీ. అగుచును నింద్రధ్వ • జాభంబు లగువాని, నైరావతవిషాణ • హతులచేతఁ
గాయ గాచినవాని • ఘనశతారాహతి, నొప్పు నంసంబుల • నొప్పువాని
విష్ణుచక్రక్షతి • వెలయుచుండెడివాని, సబలసంగతసమాం • సము లవాని
నమలచిహ్నిత్తన • ఖాంగుష్ఠములవాని, గుదియలఁ బోలిన • కొమరువానిఁ
తే. గరికరాకృతి గల గరి • గరికవాని, నైదుపడగల పాముల • యట్లు పొన్పు
నెరసి పడియుండు వానిఁ గుందేటినల్ల, బోలు కమ్మనిగందంపుఁ • బూతవాని.

అర్థములు. ఇంద్రధ్వజాభంబులు=ఇంద్రధ్వజముతో సమానములు, ఐరావత విషాణహతులచేత=ఐరావతము యొక్క కొమ్ముల దెబ్బలచే, ఘనశతారాహతి=గొప్ప వజ్రాయుధము దెబ్బలను, అంసంబులు=మూఁపులు, విష్ణుచక్రక్షతి=విష్ణుచక్రము యొక్క గాయములచే, సబల సంగత=బలముతోఁగూడిన, సమాంసములవానిని=సమములైన మూఁపులవానిని, అమలచిహ్నిత్త = నిర్మలములైన లక్షణములు గల నఖాంగుష్ఠములవానిన్ = గోళ్ళు బొటనవ్రేళ్ళు గలవానిని, గరగరికవాని=అందముగలవాని, ఐదుపడగల పాములట్లు=చేతి యైదువ్రేళ్ళునైదు పడగలని భావము. నల్ల=నెత్తురు.

విష్ణుచక్రక్షతి యనుటకు శ్రీమహావిష్ణువుయొక్క సుదర్శనము వలననైన గాయమనియు రావణుఁడు విష్ణువును జయించెననియుఁ గొందఱు చెప్పుదురు. రావణునకు విష్ణువునకు యుద్ధము జరిగినట్లు రామాయణమున లేదు. అంతియ కాక యింద్రుఁడు తన్నుఁదోడుపడ రమ్మని పిలిచినపుడు నేను యుద్ధమునకు వచ్చితినేని జంపికాని రాను, ఇప్పుడు వాని జంప వలనుపడదు. కాలాంతరముననే చంపెదనని సమాధానము చెప్పి పంపిన ట్లుత్తర రామాయణమున ౬౦౭-౬౦౮-౬౦౯ పద్యంబులఁ జూడుఁడు. ఈ కారణముచే విష్ణుని సుదర్శన మిచటఁ జెప్పరాదు విష్ణుచక్రమను నస్త్రమును విశ్వామిత్రుఁడు శ్రీరామచంద్రమూర్తి కుపదేశించినట్లు బాలకాండము ౬౭౩ పద్యమునఁ గలదు. ఈ విష్ణుచక్రమును విశ్వామిత్రుఁడు

వసిష్ఠునిపైఁ బ్రయోగింపఁగా వ్యర్థమైపోయినట్లు బాల. ౧౦౭౦ వ పద్యంబునఁ గలదు. కావుననిది యాయుధమే కాని సుదర్శన చక్రము గాదు. సుదర్శన మనునది భగవత్సంకల్పరూపకము. అది విశ్వామిత్రునకెట్లు లభించె. వసిష్ఠునిచే హతమెట్లయ్యె. నామసామ్యముచేఁ బ్రమాద పడరాదు,

తా త్ప ర్య ము

అగుచు నింద్రధ్వజముతో సమానము లగునవియు, ఇంద్రుని వాహనమైన యైరావతము కొమ్ముల పోట్లచే కాయలు గాచినవియు, గొప్పవజ్రాయుధము దెబ్బల సహించిన మూఁపురములు గలవియు, విష్ణుచక్రమను నాయుధముచే గాయపడినవియు, బలము గలిగి సమములైన మూఁపులు గలవియు, నిర్మల లక్షణములు గల గోళ్లు బొటనవేళ్లు గలవియు గుదియలఁ బోలినవియు నేనుఁగు తొండములవంటి యందము గలవియు, నైదుపడగల పాములఁ బోలునవియు, పానుపుపై నావరించి పడియుండునవియు, కుందేటి నెత్తురువంటి యెఱ్ఱని గంధము పూయఁబడినవియు.

సీ. మృగవిలోలాక్షీవి♦మృదితంబు లగువాని, మంచిగందపుఁబరిమళమువాని
యక్షపన్నగనిర్జ♦రాసురగంధర్వ, పటలి హా హా యనఁ♦బబలువాని
మందరాచలశృంగ♦మధ్యసీమను గూర్కు, క్రుద్ధాహు లన భీతి♦గొలుపువానిఁ
గ్రవ్యాదనాథుక♦రంబుల రెంటిని, బావని కనుఁగొనె ♦ బాహుయుగము

తే. కలిమి సశిఖరమందర♦క్ష్మాధ్ర మనఁగఁ గ్రాలు రావణు వదననిర్గతములైన
చూతపున్నాగవకుళాన్న♦సురభితములు, శ్వాసపవనముల్ నిండా రె♦సదనమునను.

అర్థములు. మృగవిలోలాక్షి=జింక కన్నులవలెఁ జలించు కన్నులుగల స్త్రీలచే, విమృదితంబులు=ఆలింగనాదులు చేసికొనఁబడినవి, క్రుద్ధాహులు=కోపించిన పాములు, క్రవ్యాదనాథు=రాక్షసపతియొక్క, క్ష్మాధ్రము = పర్వతము, నిర్గతములు=బయలువెడలినవి, సురభితములు=సువాసన గలవియు.

తా త్ప ర్య ము

స్త్రీలచేఁ గౌఁగిలింపఁబడినవియు, మంచిగంధము వాసనగలవియు, యక్షుల పన్నగుల దేవతల యసురులగంధర్వుల సమూహము విలపింపఁజేసినవియు మందర పర్వతము శిఖరము నడుమ నిద్రించు కోపించిన పాములవలె భయపెట్టునవియు, నగురాక్షసేశ్వరుని రెండుచేతులను హనుమంతుఁడు చూచెను. రెండు బాహువు లుండుటచే శిఖరములతో గూడిన మందర పర్వతమువలె నుండు రావణుని నోర నుండి వెడలుచున్న మామిడి పున్నాగము పొగడ వీనితోఁ జేయబడిన సారాయము ద్రాగుటచే నా వాసన గల యూర్పు లిల్లు నిండియుండెను.

ఈ పద్యమునందు రావణున కొక తల, రెండు చేతు లున్నట్లు చెప్పఁబడెను. ఈ తలల, చేతుల విచారము ౧౧౩౪ వ్యాఖ్యయందుఁ జేయఁబడును.

సీ. ఒకయోర నొఱఁగిన యుజ్జ్వలన్మౌక్తిక, కాంచనమకుటంబు♦మించువానిఁ
గుండలజ్వలితాస్య♦మండలంబుఁ గలానిఁ, గ్రూరసర్పమువోలె♦రోఁజువాని
రక్తచందనదిగ్ధ♦రమణీయహారసం, సక్త విశాలవ♦క్షంబు వాని
నొకవంక వ్రాలిన♦యొఱపైన వెలిపట్టుఁ, బుట్టంబు ముంగొంగు♦పొలుచువాని
ఆ. విలువ లేని పైఁడి♦వలువఁ గట్టినవాని, మినుపపెద్దకుప్ప♦నెనయు వాని
గంగ నడుమ నిదుర♦నంగం బెఱుంగని, ద్విపము నాఁగ మిగులఁ♦వెలుఁగువాని.

అర్థములు, కాంచనమకుటంబు=బంగారు కిరీటము, కుండల=చెవి పోగులచే, జ్వలిత=ప్రకాశించు, ఆస్యమండలము=ముఖబింబము, రక్తచందనదిగ్ధ = ఎఱ్ఱ గందముచేఁ బూయఁబడిన, రమణీయ = మనోహరమైన, హారసంసక్త హారములతోఁ గూడిన, విశాలవక్షంబువాని=వెడలుపాటి ఱొమ్ముగలవాని, ద్విపము= ఏనుఁగు.

### తాత్పర్యము

పండుకొన్న కారణముచే నొకప్రక్కకు నొఱగిన- ప్రకాశించు ముత్యములుగల బంగారు కిరీటంబు గలవాఁడును, చెవుల కుండలములచేఁ బ్రకాశించు ముఖమండలము గలవాఁడును, క్రూరమైన పామువలె బుసగొట్టువాఁడును, ఎఱ్ఱ గందపుఁ బూఁత గలిగి యందమైన హారములతోఁ గూడిన వెడలుపాటి ఱొమ్ము గల వాఁడును, నొకప్రక్క వ్రేలిని యందమైన తెల్లని పట్టువస్త్రము ముంగొంగు గలవాఁడును, వెలలేని బంగారు సరిగ వస్త్రముగట్టినవాఁడును, మినుములరాశి వలె నున్న వాఁడును, గంగనడుమ నిద్దురగొని దేహము దెలియని యేనుఁగువలె నుండువాఁడును.

క. నాలుగు దిక్కులఁ దమరుచి, వాలాయము నిండ వెలుఁగు♦వరదీపములన్
నాలుగిట మెఱయ మెయి శం, పాలలితాబ్దంబు పగిది♦భాసిలువానిన్. ౩౦

అర్థములు. శంపాలలితాబ్దంబు=మెఱపుచే నందమైన మేఘము.

### తాత్పర్యము

నాలుగు దిక్కులందుఁ దమకాంతి వ్యాపింపఁజేయు నాలుగు దీపములచే మెఱయుచున్న దేహముతో మెఱుఁగులతోఁ గూడిన మేఘమువలె నున్నవానిని.

—♦ హనుమంతుఁడు నిద్రించు రావణుభార్యలఁ జూచుట. ♦—

తే. అసురవల్లభు నాతని♦యంఘ్రిమూల, మునను బండినయాతని♦ముద్దరాండ్ర
రాక్షసాధీశు దివ్యహ♦ర్మ్యంబునందుఁ, గాంచెఁ బవమానసూతి ని♦ష్కలుషమతిని.

అర్థములు. అంఘ్రిమూలమునను=పాదముల కడ, నిష్కలుషమతిని= పాపములేని మనస్సుతో.

### తాత్పర్యము

రావణాసురుని, వాని కాళ్ళయొద్దఁ బండుకొనిన యాతని స్త్రీలను, రావణాసురు నింట నిర్మల మనస్సుతో నాంజనేయుఁడు చూచెను.

క. కమ్మలతో వాడని మా,ల్యమ్ములతో నిండునెలను • హసియించెడు నా
స్యమ్ములతో నట ముద్దుం, గుమ్మలఁ గనుఁగొనియె గాలి•కొడుకవ్వేళన్. ౩౦౨

తాత్పర్యము

ఈ స్త్రీలు వర్ణింపఁబడుచున్నారు. కమ్మలతోను, వాడిపోని పూలదండలతోను, పున్నమ చంద్రుని నవ్వు ముఖములతోను నుండు స్త్రీలను హనుమంతుఁడు చూచెను.

క. ఇంబుగఁ దాలిచి యాభర ణంబుల వీణాదివాద•నంబుల శుభనృ
త్తంబులఁ జతురలఁ బత్యం,కంబులపై నిదురగొనెడి•కాంతలఁగనియెన్. ౩౦౩

తాత్పర్యము

మనోహరముగ నాభరణంబుల ధరించి వీణాదుల వాయించుట యందును, నృత్యములందును నేర్పుగలవారిని, పతి తొడలపైఁ బండుకొనియుండగాఁజూచెను.

ముందుఁ జెప్పఁబడినవారు రావణునకు దూరముగా నేఁలబడియుండినవారు, వీరంతకంటె నుత్తములు గావున రావణు సమీపంబున వానిని తొడలమీఁదనే తలయుంచి పండుకొనిరి.

క. అంగనల వీను లందు• జెలంగెడి వైదూర్యకుండ•లంబులు మఱి యా
చెంగట వెలుంగు బంగరు,టంగదములు గాంచె వాన•రాగ్రణి యచటన్. ౩౦౪

తాత్పర్యము

ఆ స్త్రీల చెవులందు వైదూర్యముల కుండలంబులు వారి సమీపమున బంగారు భుజకీర్తులు హనుమంతుఁడు గనుఁగొనెను.

క. ఇందురుచిఁ గేరు ముఖములు,సుందరతఁ దళుక్కు మనెడి•చొక్కపుఁగమ్మల్
మందిరమును దారాగణ,తుందిల గగనంబుమాడ్కిఁ•దోఁపించెఁ గడున్. ౩౦౫

తాత్పర్యము

చంద్రుని పరిహసించు ముఖములు. సౌందర్యముచేఁ దళుక్కు మను కమ్మలు ఆ యింటిని నక్షత్రసమూహములచే నిండిన యాకాశమును బోలి యుండఁజేసెను.

క. హాలారతిఁ గేళీగతి, లీలారతిఁ దేలినట్టి • లీలావతు ల
వ్వేళను మే నెఱుఁగక కడుఁ,దూలిరి యిం దందు నిదుర•తోరముగాఁగన్. ౩౦౬

అర్థములు. హాలారతిన్=మద్యపానాసక్తిని, కేళీగతిన్=క్రీడలందు, లీలారతిన్=విలాసముతోఁ గూడిన రతియందు, లీలారతి యనుటచే,చౌశీతి బంధములు సూచితము. లీలావతులు=శృంగారవతులు. స్త్రీలు.

తాత్పర్యము

మద్యము బాగుగఁ ద్రావి, నృత్యాదులు సలిపి, ధేనుకాది బంధములభర్తతో రతిసలిపిన స్త్రీలు నిదుర పెల్లున దేహములు తెలియక యందందుఁ బడినిద్రించిరి.

క. మత్తచకోరాంబక వర,నృత్తకళాశీల యగుట•నేయభినయ సం
పత్తిమును వెలసె నిద్రా,యత్తయునై తదభినయమె•యనువుగఁ దాల్చెన్.

అర్థములు. మత్తచకోరాంబక=మదించిన చకోరములవంటి కన్నులుకలది, వరనృత్తకళాశీల=నాట్యము చక్కఁగా నాడుట స్వభావముగాఁ గలది.

తాత్పర్యము

నాట్యమునందు సామర్థ్యముగల యొకతె యాడునపుడే హస్తగ్రీవాభినయము చూపెనో నిద్రించి నపుడును నా యభినయమే చూపించుచుండెను.

క. వెల్లువఁ బోవుచుఁ బోతము, ఫుల్లనళిని యాశ్రయించు•పోలుపున నిదురన్
హల్లకపాణి యొకతె కర,పల్లవములఁ గౌఁగిటన్ వి•పంచిం గూర్చెన్. ౩౭

అర్థములు.పోతమును=పడవను, ఫుల్లనళిన=వికసించిన తామరతీఁగ, హల్లకపాణి=చెంగలువ వంటి యఱచేయి గలది, విపంచిన్=వీణెను.

తాత్పర్యము

ఏటివెంటఁ బోవు వికసించిన తామరతీఁగ పడవను చుట్టుకొన్నట్టు లొక హల్లక పాణి తన చిగురువంటి చేతులతో వీణెను గాగిలించి పండుకొనెను.

క. కక్షంబున నొక కంజా,తేక్షణ మడ్డుకము నుంచి•యెలమిని శిశువున్
గక్షమునఁ జేర్చి పండు మృ,గేక్షణ యన నిద్దురించె•నెలమిం గొనుచున్. ౩౮

అర్థములు. కక్షంబునన్=చంకయందు, మడ్డుకము=తుడుము.

తాత్పర్యము

ఒకతె చంకయందుఁ దుడు ముంచుకొని శిశువును జంక నుంచుకొని నిదురించు స్త్రీవలె సంతోషముతోఁ బండుకొనెను.

క. చిరకాలాగతు వల్లభుఁ, గరముల బిగిఁ గౌఁగిలించు•కామిని కరణిన్
గురుకుచయొకర్తు పటహముఁ,గరముల బిగిఁ గ్రుచ్చినిదుర•కైపునఁ జొక్కెన్.

అర్థములు. చిరకాలాగతున్=దీర్ఘకాలమునకు వచ్చినవానిని, పటహము=తప్పెట, కైపునన్=మత్తుచే.

తాత్పర్యము

దేశాంతరము పోయి యుండి చాలఁగాలమునకు వచ్చిన భర్తను గౌఁగిలించు కామినివలె గొప్ప స్తనములు గల స్త్రీ యొకతె తప్పెటను గట్టిగఁ గౌఁగిలించుకొని నిద్దుర మత్తున పడియుండెను.

క. కామమదంబున నొర్తుక, కామిని ప్రియతమ రహస్య•గ్రహియించినటుల్
తామరసాక్షి యొకర్తుక, ప్రేమంబునఁ గౌఁగిలించి•వేణువుఁ బండెన్. ౪౦

అర్థములు. రహస్య=రహస్యాంగము, లింగము.

తాత్పర్యము

కామాతిశయమున నొక కామిని తనకు మిక్కిలి ప్రియుఁడగు వాని లింగమును

జేతఁబట్టుకొని నిద్రించునట్లు లొకతె పిల్లంగ్రోవిని జేతఁ బట్టుకొని నిదురించెను.

క. కాంతునితోడఁ బరుండిన, కాంతామణి నా విపంచి•గౌఁగిట నొసరన్
దంతిగమన నృత్తకళా,త్యంతనిపుణ యొర్తు నిదుర•నంగము వ్రాల్చెన్. ౩౧౩

తాత్పర్యము

మగనితోడఁ బండుకొనిన కాంతవలె నృత్తమునందు మిగుల నేర్పుగల యొకతె వీణెను గౌఁగిలించి నిదురచే దేహము వ్రాల్చి పరుండెను.

నిద్దుర మబ్బుచే వీరికి నీ కొఱముల్లు దూరముగ నుంచి పండుకొనుటకు నవకాశము దొరికినది కాదు. ఎవరిపని వారు చేయుచు నట్టులే పడి నిద్రించిరి.

క. బంగరుజిగి మృదువును హృద,యంగమమును బీవరంబు•నగు నంగములన్
రంగార నొత్తియొక్క,మృ,దంగ మొక కురంగనయన•తద్దయుఁ గూర్కెన్.

అర్థములు. పీవరము=బలిసినది, మృదంగము=మద్దెల.

తాత్పర్యము

బంగారు కాంతి, మృదుత్వము, మనోహరత్వము బలుపుగల యవయవములచే నొకతె మృదంగమును నొత్తుకొని పండుకొని నిదురించెను.

క. మద్దెల మొరయించుచు నొక,ముద్దియ శ్రమ నొంది బాహు•మూలంబులచేఁ
దద్దయుఁ గక్షంబున నది, గ్రద్దన బిగియించి సోలె•గాటపు నిదురన్. ౩౧౪

తాత్పర్యము

ఒకతె మద్దెల వాయించుచు బడలి దానిని చంకలచే బిగించి గాఢనిద్రచే సోలెను.

క. డిండిమముఁ గ్రుచ్చి వెనుకను, నొండొక డిండిమము గ్రాల•యువవల్లభుతోఁ
గొండొక బిడ్డనితోడఁ బ,రుండిన కకుభోరు వనఁ బ•రుండెను నిదురన్. ౩౧౫

అర్థములు. డిండిమము=రాయిడి గిడిగిడి, ఢక్క. కొండొక=చిన్న, కకుభోరువు=కకుభమువంటి తొడగలది.

తాత్పర్యము

ఒకతె ముందొక ఢక్కా, వెనుక నొక ఢక్కా యుంచుకొని చిన్నబిడ్డను ముందు, వయస్సుమగని వెనుక నుంచుకొని పరుండిన స్త్రీవలెఁ బరుండెను.

క. మదనమదభృశవిమోహిత,మదకలమదిరాక్షి యొర్తు•మతి తెలియక తా
మృదుకరముల నాడంబర,ము దగఁ గవుంగిటను జేర్చి•మునిఁగెను నిద్రన్. ౩౧౬

అర్థములు. మదన మద=కామమదముచే, భృశవిమోహిత=మిక్కిలి మోహము చెందిన, మదకల=మదముచే నందమైనది, మదిరాక్షి=మద్యమువలె నెదుటివారిని మత్తుఁగొనఁజేయు కన్నులుగలది. ఆడంబరము = తూర్యవిశేషము.

ఆడంబర స్సమారంభే గజగర్జిత తూర్యయోః విశ్వము.

తా త్ప ర్య ము

కామ మదమున మిగుల మోహము చెందిన యొకతె దేహము తెలియక తన మృదుకరములఁ నాడంబరమును గౌఁగిలించి నిదురలో మునిఁగెను.

క. జలకలశ మొ క్కర్తు వసుధా,తలమున దొరలించి దానఁ దడిసెన్ సురభిన్
  జెలువఱి వాడమికై ని,ర్మలజలసిక్త మగు శబల•మాల్యము మాడ్కిన్. ౮౧౨

అర్థములు. జలకలశము=నీటిపాత్ర, సురభిన్ = వసంతకాలమందు, చెలువఱి=అందముచెడి, వాడమికై=వాడిపోకయుండుటకై, శబలమాల్యము = నానా వర్ణములు గల పూలదండ, మాడ్కిన్=వలె.

తా త్ప ర్య ము

రావణాసురునకు నీళ్లుపోసెడి పనికత్తె నీటిపాత్ర నిద్ర మబ్బున నేల దొరలించి యా నీటియందే పండుకొని వసంతకాలమున వాడిపోకుండుటకై నీళ్ళచేఁ దడుపఁ బడిన పెక్కురంగుల పూలదండవలె నుండెను.

శబల శబ్దస్వారస్యముచే నీళ్లు వట్టివేరు మొదలైన వాని వాసన గలవై కుంకుమ పూవుతోఁ గలసి యుండె నని భావము.

క. బంగరు గిండుల మేలిహొ,రంగులు గల నిజపయోధ•రంబులఁ గేలన్
  భృంగీకురళ యొకర్తుక, పొంగుగ బిగఁ బట్టికొనుచుఁ బొందెన్ నిదురన్. ౮౧౩

అర్థములు. భృంగీకురళ=ఆఁడు తుమ్మెదలవంటి ముంగురులు గలది.

తా త్ప ర్య ము

బంగరు గిన్నెలవంటి శ్రేష్ఠమగు విలాసము గల తనకుచములను సంతోషముతో గట్టిగాఁ బట్టికొనుచు నొక యాఁడుతుమ్మెదలఁబోలు ముంగురులు గల సుందరి నిద్రించెను.

క. మదవిహ్వల యగు నొకపొ,మద శారదపూర్ణ చంద్రు•మఱపించెడి న
  ద్వదనముఁగలయొకహరికటి, నిదురను బిగియారఁ గ్రుచ్చె•నెఱమోహమునన్.

అర్థములు. మదవిహ్వల=మదముచే వికలమైన మనస్సుగలది, హరికటిన్= సింహమధ్యను.

తా త్ప ర్య ము

మదముచేఁ జెదరిన మనస్సుగల యొకపడుచు శరత్కాల చంద్రునితో సమానమైన ముఖముగల యొక సింహమధ్యను నిండు మోహముచే నిదురఁ బోవుచు గట్టిగాఁ గౌఁగిలించుకొనెను.

తే. కామినులు కామమదమునఁ గాముకులను,జన్నులను బిగ్గ నొత్తెడి•చందమునను
  తతఘనానద్ధసుషిరవా•ద్యములఁ గ్రుచ్చి, మత్తకాశిను లయ్యెడ•నత్తమిలిరి.

అర్థములు. తత=వీణాదిక వాద్యము-తంతెలుగల వాద్యము, ఘన=తాలాదికము-వాయించునవి - కాంచుతాలములు, ఆనద్ధము = మద్దెల మొదలయినవి,

సుషిరములు=పిల్లఁగ్రోవులు-మేళములు మొదయినవి. మత్తకాశినులు=మదముచేఁ బ్రకాశించు స్త్రీలు, అత్తమిలిరి=పండుకొనిరి.

తాత్పర్యము

కామముగల స్త్రీలు కామముగల తమ భర్తలను గాఢాతిశయమునఁ జన్నులచే గట్టిగా నొత్తువిధముగాఁ గొందఱు స్త్రీలు వీణెలను మద్దెలలను, తాళములను, వెదురుగొట్టములతో వాయించు పిల్లఁగ్రోవులు మొదలగు వాద్యములను గట్టిగాఁ గౌఁగిలించుకొని పండుకొని నిద్రపోయిరి.

రావణాసురుని యంతఃపురస్త్రీ లందఱుసొమ్ము లూడిపోయినవారుగను, చీర లూడిపోయిన వారుగను, ముఖముమీఁదఁ బైఁటకొంగు వేసికొనినవారుగను వర్ణింపఁబడిరి. ఇందు శృంగారరసము వర్ణితమైనను నివన్నియు రాఁగల వైధవ్య చిహ్నములని ధ్వనితమని యెఱుంగ నగు.

క. వారల నెల్లరఁ జూచుచు, వీరుఁడు కపివరుఁడు పోయి వే ఱొకచోటన్
జారుతరరూపవిభవో, దారను నేకాంతసీమఁ దరుణిని గాంచెన్. ౩౧౧

తాత్పర్యము

వీరుఁడగు నాంజనేయుఁడు వారి నందఱఁ జూచుచు బోయి పోయి వేఱొక చోట నేకాంతస్థలమున మిగుల మనోహరమైన సౌందర్యాతిశయము గల యొక వయస్సు స్త్రీని జూచెను.

ఇచట వీరుఁ డనఁగా నింద్రియజయము గలవాఁడని భావము. ఇందఱ నందగత్తెలఁ గామమత్తల నేకాంతమునఁ జూచినను ఆయన మనస్సు చలింపలే దని భావము. ఈమె పట్టపుదేవి గనుక ఈమూకలో గలియఁక వేఱుగ నొంటిగఁ బండుకొనెను.

—♦ హనుమంతుఁడు మందోదరిని జూచుట. ♦—

శా. రాణన్మించిన మంచిముత్తియపు హారాల్ దూల వక్షస్థ్సలిన్
మాణిక్యప్రకరప్రభాపటలశుంభన్మండనోద్దీప్తయై
రాణింపన్ శయనంబునం గనియె నిద్రాసక్త స్వర్ణాంగి మ
త్తైణీలోచనఁ జారురూపిణిని శుద్ధాంతేశ మందోదరిన్. ౩౨౨

అర్థములు. తూలన్=వ్రేలాడఁగా, మాణిక్యప్రకర=మాణిక్యసమూహములయొక్క, ప్రభాపటల=కాంతి సమూహముచే, శుంభత్=ప్రకాశించు, మండన=అలంకారములచే, ఉద్దీప్తమై=మిగుల వెలుఁగునదియై, నిద్రాసక్తన్=నిద్రించుదానిని, స్వర్ణాంగిన్=బంగారువలెఁ బచ్చనైన దేహము గలదానిని, మత్త+ఏణీలోచనన్=మదించిన యాఁడుజింక కన్నులవంటి కన్నులు గలదానిని, చారురూపిణిని=మనోహరమైన సౌందర్యము గలదానిని, శుద్ధాంతేశ= అంతఃపుర ప్రభ్విని-పట్టపురాణిని, మందోదరిన్=మందోదరియను పేరు గలదానిని, మందో

దరి=పలుచని కడుపుకలది. మండోదరి యనియు రూపము గలదు. అప్పుడు మీఁగడవంటి కడుపుగల దని యర్థము. చూ. ౧౩౧౭ పద్యము.

తాత్పర్యము

మంచి ముత్తియముల హారములు అొమ్మున వ్రేలాడఁగా మాణిక్యముల కాంతులచేఁ బ్రకాశించు నలంకారములచేమిగుల వెలుఁగునదియై నిద్రించుదానిని, బంగారువలెఁ బచ్చనైన దేహము గలదానిని మదించిన యాఁడుజింకకన్నులవంటి కన్నులు గలదానిని, మనోహరమైన సౌందర్యము గలదానిని, పట్టపురాణి యగు మండోదరిని పడుక యందొప్పుచుండఁ జూచెను.

ఉ. హత్తినమేలిరూపమును♦యౌవనసంపదఁ జూచి కంటి నే
నత్తరళాక్షి సీత నని ♦ హర్షమునన్ భుజ మప్పళించు, ము
ద్దొత్తును దోఁక, నాఁడు, ముద♦మొందును, గంబము లెక్కు, దూఁకు, గిం
చిత్తుగఁ బాడు, నైజ మగుచేష్టలు సేయుచు వావరుండటన్. ౩-౨౩

అర్థములు. హత్తిన=పొందిన. మేలి రూపమును=గొప్ప సౌందర్యమును, అప్పళించున్=తట్టుకొనును, ముద్దు+ఒత్తును=ముద్దు పెట్టుకొనును, కించిత్తుగ=కొంచెముగ, 'కించిత్తు నల్లి గఱచిన, యని సుమతి శతకము, నైజము=సహజము.

తాత్పర్యము

ఆమెయొక్క గొప్ప సౌందర్యమును బ్రాయమును జూచి, చూచితిఁజూచితి సీత నని సంతోషాతిశయముచే భుజములు తట్టుకొనును. తోఁకముద్దు పెట్టుకొనును. గంతులు పెట్టును. సంతోషించుచు స్తంభము లెక్కి దూఁకును. మెల్లగఁ బాడును. (హనుమంతుఁడు సంగీతవిద్వాంసుఁడు) క్రోఁతులకు స్వభావమైనచేష్టలు చేయును.

వాస్తవపు సీతాదేవిని జూచినపు డీ చేష్టలను జేయలేదు. ఏల? తన కష్ట మంతయు ఫలించెగదా యన్న సంతోష మంతయుఁ బొంగి పొరలిపోయెను.

—♦ ౧౧-వ సర్గము. హనుమ సీతాదేవిని పానశాలయందు మరల వెదకుట ♦—

ఉ. కొంచితిఁగా రఘూత్తముని♦కామిని నంచును స్వస్థచిత్తుఁడై
యించుక యుండి యా హనుమ ♦ యెట్లగు నీ సతి సీత? సీత ని
ద్రించునొ? యారగించునొ? ము♦దించునొ? సొమ్ములు మేనఁ దాల్పఁ గాం
క్షించునొ? పాన మామెకు రు♦చించునొ? రాముఁడి బాసి యుండుటన్. ౩-౨౪

అర్థములు. స్వస్థచిత్తుఁడై = కుదుటఁబడిన మనస్సుగలవాఁడై, ఇంచుక=కొంచెము, ముదించునో=సంతోషించునా?

తాత్పర్యము

అబ్బా! యిప్పటికి చూచితిని శ్రీరామచంద్రమూర్తి భార్యను అని కొంచెము సేపు మనస్సు కుదురుగా నుంచుకొని యీయామె సీత యగునా యని వితర్కించి సీతయైనయెడల నామె పతివ్రతగదా! భర్తను విడిచియుండు సమయంబున నామె

నిద్దురపోవునా? ఆహారము తీసికొనునా? సంతోషించునా? దేహమున సొమ్ములు ధరించునా? పానము, తుదకు మంచి నీళ్ళయినను ఆమెకు రుచించునా? ఇవన్నియు నీమె యొద్ద నున్నవి కావున నీమె సీత యెట్లగును? కాదు.

క. రామునిఁ దక్కఁగ నాసు, త్రామునినేన్ భూమికన్య • తగఁ గనఁగొనునే?
రామునితోఁ దుల్యుఁడు స్వ, ర్ధాములనేన్ లేఁడు నిశ్చి • తం బిది యనుచున్.

అర్థములు. సుత్రామునినేన్=ఇంద్రునైనను, స్వర్ధాములనేన్ = దేవతల యందైన.

### తాత్పర్యము

సీతాదేవి రామచంద్రమూర్తిని దప్ప నింద్రుని నైనఁ గన్నెత్తియైనఁ జూచునా? చూడఁ జాలదు, ఏల? ఆమె పతివ్రత. ఎట్టి నికృష్టుఁడైనను ఆ పతియే దైవమని పరు లెట్టివారైనను దన పతికంటె నికృష్టులని యుండునది కదా పతివ్రత. అట్టు లుండ రామచంద్రమూర్తితో సమానుఁడు దేవతలందైన లేఁడే. ఇఁక నీ రాక్షసుని మాట చెప్పనేల, ఉత్తమోత్తమ వస్తువు లభించిన వారధమ వస్తువు నాశింతురా? కావున నీమె సీత గాదు. ఇది నిశ్చయము, అనుచు.

సీ. ఆవల నరిగి పా • నాలయంబునయందు, వెదకంగఁ దొడఁగె నా • వీరవర్యుఁ
డాటలఁ బాటలఁ • నలసినవారిని, మధుపానమున మేను • మఱచువారి
మర్దలమురజముల్ • మఱి పీఠికాతతి, తలదిండ్లు గాఁగను • దనరువారి
నంచితాస్తరణాళి • నత్తమిల్లినవారి, వాలుఁగంటులఁ గాంచి • వానరేంద్రుఁ

తే. డమలమణిభూషణాలంకృ • తాంగులైన, రూపసల్లాపశీలతా • రూఢలైన
కాలదేశాభియుక్త లౌ • కాంత లెల్ల, బలియఁగ రతాభిరతసుప్తు • వాసవారిఁ జూచె

అర్థములు. పానాలయంబు=మద్యపానము చేయు నిల్లు, మర్దలమురజముల్ = మద్దెల మృదంగములు, ఆస్తరణాళి=నేలఁ బఱచిన కంబళ్ళు మొదలయినవి, అత్తమిల్లినవారిని=పండుకొనిన వారిని, రూపసలాపశీలతా రూఢలు=సౌందర్య విషయమైన ముచ్చటలు చెప్పు స్వభావమందుఁ జేఱినవారు, కాలదేశాభియుక్తలు= యుక్తమైన దేశకాలముల నెఱిఁగినవారు, రతాభిరతసుప్తున్=సురతమున నిష్టము గలవానిని, నిద్రించిన వానిని, విశేషణోభయపదము. రతశబ్దము బాహ్యసురతమును, అభిరతశబ్దము కరణ బంధాదులను సూచించునని కొందఱు, రతాభిరతసుప్తు=స్నాతావలిప్తశబ్దమునందువలె రతాభిరతశ్చ అసౌ సంసుప్తశ్చేయని సమాసము గ్రహింపనగు. 'బాహ్య మాభ్యంతరం చేతి ద్వివిధం రతముచ్యతే తత్రాద్యం చుంబనాశ్లేష నఖదంతక్షతాదికం, ద్వితీయం సురతం సాక్షాన్నానా కరణ కల్పితమ్. ఆదౌ రతం బాహ్య మిహ ప్రయోజ్యం తత్రాపి చాలింగనమేవ పూర్వమ్'రతిరహస్యే. బాహ్యమనియు అభ్యంతరమనియు రతి రెండు విధములు. ముద్దుపెట్టుకొనుట, కౌఁగిలించుట. నఖక్షత,దంతక్షతములు లోనైనవి బాహ్యమనఁ

౨౬ నానాబంధకల్పిత సాక్షాత్సురతము అభ్యంతర మనఁబడును, బాహ్యముతో నందు నాలింగనముతో రతి నారంభింపవలయును. ఇం దీ రెండు తెగల వారు చెప్పఁబడిరి. వాసవారిన్=ఇంద్రద్వేషిని-పై పద్యములో నన్వయము.

తా త్ప ర్య ము

మండోదరిని దాఁటి యూవలఁ బోయి మద్యము ద్రాగు నింటియందు హనుమంతుఁడు వెదక నారంభించెను. ఆట లాడి పాటలు పాడి, యలసిన వారిని, మద్యము ద్రావి దేహములు మఱచినవారిని, మద్దెలలు, మృదంగములు, పీటలు, తలదిండ్లుగాఁ గలవారిని కంబళ్ళు. తివాచీలు పఱచుకొని పండుకొనినవారిని, స్త్రీలను జూచి నిర్మలమైన రత్నాభరణములచే నలంకరింపఁబడినవారై, సౌందర్య లక్షణ ముపన్యసించు స్వభావము గలవారై, దేశకాలముల యుచిత జ్ఞానము గల వారైన స్త్రీలు చుట్టుకొన బాహ్యాభ్యంతర రతుల నలసి నిద్రించు రావణుని,

ఉ. ఆవుల మందలో వృషమునట్టులు కానలలోఁ గ రేణుపూ
గావృత మైన దంతిగతి నబ్జముఖీపరివారకీర్ణునిన్
రావణుఁ గాంచ దాఁటి చని రమ్యసమస్త సువస్తుపూరితం
బౌ వరపానభూమి, గదియం జని యందు సమీరసూతియున్. ౩_౨౭

అర్థములు. వృషము=ఎద్దు, క రేణుపూగావృతము=ఆడేనుఁగల సమూహముచేఁజుట్టఁబడినది, దంతి=ఏనుఁగు అబ్జముఖీ పరివారకీర్ణునిన్=స్త్రీ పరివారముతో గూడియుండువానిని.

తా త్ప ర్య ము

ఆవుల మందలో నెద్దువలె, ఆఁడేనుఁగుల గుంపులో నేనుఁగువలె స్త్రీ పరివారములో నుండువానిని రావణుఁ గాంచి దాఁటిపోయి, మనోహరమైన సమస్త వస్తువులచే నిండిన మద్యపాన గృహప్రదేశము చేరఁబోయి యందు హనుమంతుఁడు.

సీ. మహిషసూకరమృగ మాంసంబు లచ్చట, నచ్చటఁ బ్రోవులై హెచ్చి యుండ
మీఁగడ పెరుఁగున మేలిమి సౌవర్చలమునఁ దీరిచిన కోళ్ళయు నెమిళ్ళ
కిరుల ఖడ్గంబుల వరశల్యముల లేళ్ళ, క్రకరచకోరసంఘము నెఱచుల
సామిభక్షితకలశంబుల బహువిధ, పక్వలేహ్యసుభోజ్య పటలములను

తే. నప్పుపులుసుల వండుట నొప్పు మీఱు, రాగషాడబములను దోరంగ వైవఁ
బడినసరగలు నందెలుఁ దోడవు లెల్లఁ బానభాజననిక్షిప్త ఫలచయములు. ౩_౨౮

అర్థములు. సౌవర్చలము=సౌవర్చ మను పేరుగల లవణము, శల్యము=పందు పంది, క్రకరము=కక్కెర, ఎఱచులన్=మాంసములను, సామిభక్షిత=సగముతినఁబడిన, రాగషాడ్బములన్; రాగ=తెల్లయావాలు, 'రాగసిద్ధార్థకో జ్ఞేయః'అనిపాకశాస్త్రము. షాడబము=మద్రసములుగల యట్లు చేయఁబడిన భక్ష్యము(౨)రాగ=పలుచగా నున్న మధురరసము-షాడబము=చిక్కఁగా నున్న మధురాదిరసము.

చక్కెర తేనె ద్రాక్ష దానిమ్మ-వీని రస మని భావము. సితా మధ్వాదిమధురో ద్రాక్షా దాడిమయో రసః। విరళశ్చేత్ కృతో రాగః సాంద్రశ్చేత్ షాడబ స్స్మృతః॥ పానకం ద్రాక్షమాధూకం ఖార్జూరం తార మైక్షవం। మధూత్థం శీధుమాధ్వీకం మైరేయంనారికేళజమ్। అర్ణవము. అను వాక్యము ప్రమాణము. తోరంగన్=దోరలునట్లు, సరగలు=హారములు, తొడవులు=ఆభరణములు, పాన భాజన=పానపాత్రములందు, నిక్షిప్త=ఉంచఁబడిన.

## తాత్పర్యము

దున్నపోతులు-పందులు-జింకల మాంసము లందందుఁ గుప్పలు కుప్పలు గాఁ బడియుండెను. మీఁగడ పెరుఁగులో సౌవర్చలవణము కలిసి సిద్ధము చేసిన కోళ్ళ-నెమిళ్ళ పందుల-ఖడ్గముల ఏదుల-లేళ్ళ-కక్కెరల-చకోరముల మాంసము లను సగము భక్షింపఁబడిన పాత్రములందు నానావిధములుగఁ బాకము చేసిన లేహ్యములను, భోజ్యములను ఉప్పు పులుసు వేసి వండిన రాగషాడబములను తోరలిపడిన హారములను, నందెలను అన్నివిధముల యాభరణములను, పాన పాత్రలందుంచఁబడిన ఫలములను హనుమంతుఁడు చూచెను.

తే. అచ్చటచ్చట నునిచిన • హరువునీరు
  నవ్య కనకమణీశయ • నముల నాన
  నమల కాంతులఁ బానగే•హము కృశాను
  రహిత మయ్యుఁ బ్రదీప్త మా•రమణఁ దోఁచె.          ౩౨౯

అర్థములు. కృశాను రహితమయ్యున్ = అగ్నిహోత్రము లేకున్నను, ప్రదీప్తము=మండుచున్న, రమణ=విధము.

## తాత్పర్యము

అక్కడక్కడ నుంచిన యందముచే నతిశయించు క్రొత్తబంగారు రత్నము లచే జేయఁబడిన శయ్యలయు నాసనములయుఁ గాంతులచే నా గృహము నిప్పు లేకున్నను గాలు చున్నట్టు లుండెను.

క. వెరవరులగు నడబాలలు, సరసంబుగఁ దీర్చ నామి•షంబులు సుమశ
  ర్కరలను మధుఫలములచే, సురుచిరముగఁ దీర్చినట్టి•సురలం గాంచెన్.          ౩౩౦

అర్థములు. వెరవరులు=వెరవు+అరి=ఉపాయశాలులు, అడబాలలు=వంట వాండ్రు. ఆమిషంబులు=మాంసములు, సుమశర్కరలను = పూలరసము చేతను చక్కెరచేతను, మధుఫలములచేన్=ద్రాక్ష మొదలగు తీయని పండ్లచే, సురలన్= సారాయములను.

## తాత్పర్యము

పాకము చేయు నుపాయము తెలిసిన వంటవాండ్రు రుచిపుట్టునట్లు వండిన

మాంసంబులను పూలచేతను చక్కెరచేతను ద్రాక్ష ఇప్పపూవు లోనగుతియ్యని ఫలములచేతను ఇంపుగ సిద్ధముచేసిన సారాయములను జూచెను.

క. బుకాఁమలు పలు తెగ లగు, ప్రకరములు బంగారు వెండి స్ఫటికంబులఁ జెం
పెక్కిన కలశంబులు రుచి, పెక్కువ పానీయముల, గపిప్రభువు గనెన్. ౩౩౧

అర్థములు బుకాఁములు=గందవొడులు, ప్రకరములు=హారములు.

తా త్ప ర్య ము

గందవొడులు నానావిధములైన హారములు బంగారు వెండి స్ఫటికంబుల జేసిన పాత్రములు విశేషము రుచి గల పానీయములను హనుమంతుఁడు చూచెను.

క. అఱద్రావిన నెఱ ద్రావిన, కొఱగానని కమ్మరసముఁ గూడినపాత్రల్
నెఱమెక్కిన యఱ చిక్కిన, కొఱ దక్కిన భక్ష్యములయుఁ గుప్పలు గాంచెన్

అర్థములు. నెఱద్రావిన=పూర్ణముగఁ ద్రావిన, కొఱగానని=కొఱఁత లేక నిండియున్న, కమ్మరసము=సారాయము, నెఱ=పూర్ణముగ, మెక్కిన=తినిన అఱచిక్కిన=సగము మిగిలిన, కొఱదక్కని=కొదువ లేక నిండియున్న.

తా త్ప ర్య ము

కొన్ని పాత్రము లందలి సారాయము సగము త్రావఁబడియుండెను. కొన్నిఁటి యందుఁ బూర్ణముగఁ ద్రావఁబడి యుండెను. కొన్నిటియందు నేమియుఁ ద్రావఁబడక నిండియుండెను. భక్ష్యములు కొన్ని సగము దినఁబడినవి, పూర్ణముగఁ దినఁబడినవి, ఏమియుఁ దినఁబడనివి కుప్పలు కుప్పలుగాఁ బడియుండెను. ఇవియన్నియు హనుమ చూచెను.

మనోరంజని. పగిలిన గిన్నెలు దొరలెడి కుండలుఁ బాఱు జలంబులు దండలుఁ బల్
తెగ లగు పండులు బిగి గల కౌఁగిటఁ దేల్చుచు నొండొరు నిద్దుర మై
వగ గల కన్నెలచెలు వగుచిన్నెలు వారక వేఱొక తొయ్యలిచీ
ర గరిత యొక్కతె నిదురను లాగి యురంబునఁ గప్పికొనంగనియెన్.

తా త్ప ర్య ము

పగిలిన గిన్నెలు, పొరలుచున్న కుండలు, నేలఁ బాఱుచున్న నీళ్ళు, దండలు, నానావిధములయిన పండ్లు నిద్దురచే గట్టిగా నొకరి నొకరు గౌఁగిలించుచున్న సుందరుల బిబ్బోలు, నొకదాని చీర తీసికొని వేఱొకతె ఈడ్చుకొని తొమ్ములపైఁ గప్పుకొనుటను హనుమంతుఁడు చూచెను.

మనోరంజని: నజవలు నైదు సగణంబులు, పదేనింట యతి.

క. సుందరుల మేనివలువలు,నందపుసరములును నూర్పుటనిలమున దర
స్పందము లయి మందానిల,కందళముల సుఖముఁ జెందు గైవడినయ్యెన్. ౩౩౪

అర్థములు. దరస్పందములు=కొంచెముగాఁ గదలినవి, మందానిల కందళ ములన్=మందమారుతము యొక్క మొలకలు అనఁగా మెల్లఁగా వీచుపిల్లగాలులు.

### తాత్పర్యము

అందగత్తెలు దేహముల ధరించిన చీరలు సాగసైన దండలు వారి వారి యూర్పుగాలిచేఁ గొంచెముగాఁ గదలుచు మెల్లని పిల్లగాలులచే సుఖించు విధముగ నుండెను.

ఉ. కమ్మని చందనంబు కసు•గందని పూలసరాలు శీధుపా
 నమ్ములు స్నానలేపములు•నవ్యసుధూపము లీనుచున్న ఘం
 ఘుమ్మను కమ్మఁదావు లెస•కంబునఁ గైకొని తన్మహావిమా
 నమ్మున నించె సౌరభము•నవ్యముగాఁగ మరుత్కిశోరముల్. ౩౩౫

అర్థములు. కసుగందని=వాడిపోని, శీధుపానమ్ములు=సారాయము త్రాగుటలు, 'శీధు రిక్షురసైః పక్వై రపక్వై రాసవో భవేత్, మైరేయం ధాతకిపుష్ప గుడధాన్యాంబు సంహితమ్. చెఱకు పాలతోఁ గాచిన సారాయము శీధువనియు, కాఁచక సిద్ధము చేసినది ఆసవమనియు,ఆరెపూలు బెల్లము ధాన్యము(ధనియాలు) నీళ్ళు కలిపి కాఁచినది మైరేయ మనియుఁ బేరు. స్నానలేపములు = స్నానము చేయునపుడు రుద్దుకొను నలుగుపిండులు, ఎసకంబుగన్=విస్తారముగ, సౌరభము= పరిమళము, మరుత్కిశోరముల్=గాలిపిల్లలు.

### తాత్పర్యము

మంచి వాసనగందము, వాడని పూలదండలు, సారాయి రసములు, సున్నిపిండి మొదలగు నలుగు పిండులు, క్రొత్త మంచి ధూపములు-వీనివలనఁ గలుగు మంచి వాసనలను విస్తారముగఁగొని పిల్లగాలు లా విమానమ్మును మంచి సువాసనలతో నించు నుండెను.

క. నల్లని తెల్లని పచ్చని, మొల్లంబగు వన్నె లొప్పఁ•మోహానవతు లం
 దెల్లెడఁ గూర్చియుఁ గూర్చిన, హల్లకలత లట్టు లొప్పి•రంగజు గాసిన్. ౩౩౬

అర్థములు. నల్లని తెల్లని పచ్చని మోహానవతు లనుటచే నానా దేశస్త్రీలు చెప్పఁబడిరి. హల్లకలతలు=తామరతీగలు.

### తాత్పర్యము

నల్లని-తెల్లని-పచ్చని వర్ణముగల స్త్రీ లందందుఁ గామకేళియం దలసిన వారై నిద్రించు తామరతీఁగలవలెఁ బడి నిద్రపోవుచుండిరి.

—• పరాంగనాదర్శనంబునకు హనుమంతుఁడు చింతించుట •—

క. అంతయు దశకంధరు నే, కాంతగృహం బిటులు కడిగి•గాలించియు భూ
 కాంతాత్మజ యడపొడ గన, కెంతయుఁ జింతించె వాన•రేశ్వరుఁ డాత్మన్. ౩౩౭

అర్థములు. ఏకాంతగృహము = అంతఃపురము, కడిగి గాలించి=చక్కఁగాఁ బరిశోధించి, అడపొడ=ఆకారముజాడ.

తా త్ప ర్య ము

రావణాసురుని యంతఃపురమంతయు నిటుల చక్కఁగా శోధించి సీతాదేవి రూపముగాని యామె యుండు స్థలము జాడగాని తెలియక హనుమంతుఁడు నిగుల జింతించెను.

ఉ. అచ్చట నిద్దురించు కమ♦లాక్షుల నెల్లరఁ జూచి యయ్యయో
వచ్చెను ధర్మహాని పర♦వారిజలోచన లందు నాదుమా
పెచ్చట నేని వర్తిలద ♦ యిచ్చటిమేడలఁ గూర్కు కాంతలన్
బొచ్చెము మీఱఁ జూచితిని♦బోవఁగఁ ద్రోచితి ధర్మమార్గమున్. ౩౩౬

తా త్ప ర్య ము

అక్కడ నిదురించుచున్న స్త్రీలను పైటలు దొలఁగిన వారిని చీరలు దొలఁగిన వారిని తక్కిన వారి నందఱను జూచి యయ్యో నే నెంతటిధర్మ విరుద్ధమైన కార్యము చేసితిని. పరస్త్రీలయందు నాదృష్టి పాఱునదిగాదు. అటులుండ నిప్పుడు మేడలందు నొడ లెఱుఁగక నిద్రించు స్త్రీలను గపటవిధముగఁ జూచితిని. నిద్రించు స్త్రీలను నందుఁ బరస్త్రీలను అందు దేహము తెలియక చీరలు తొలఁగిపడి యుండు స్త్రీలను జూడరా దను ధర్మమునకు హాని కలిగించితిని. 'నేక్షేతార్కం న నగ్నాం స్త్రీమ్'.

క. పరదారల నెయ్యెడనే, నరసి కనుట ఘోరపాప♦మందును నిద్రా
పరవశలై యొడ లెఱుఁగని, పరసతులం గంటి నెంత♦పాపం బకటా. ౩౩౭

అర్థములు. దారలను=భార్యలను.

తా త్ప ర్య ము

మేలుకొని తిరుగుచున్నప్పుడే పరుల భార్యలను మోహకాటికి మీఁదఁ బాలించి చూడరాదు. అది మహా పాపకార్యము. అటు లుండ నిద్రచేఁ బరవశలై దేహము లెఱుఁగకయుండు పరస్త్రీలను జూచితిని. అయ్యో! యెంత పాపము చేసితిని.

తే. అనుచుఁ దలపోయుచున్న మ♦హాత్మకునకు, నిశ్చితైకాంతమతికి ని♦ర్నిద్రగతికిఁ
గార్యనిశ్చయదర్శన♦క్షమము నైన, బుద్ధి జనియించెఁ గ్రమ్మఱఁ♦బూతగతిని. ౩౩౮

అర్థములు. మహాత్మకునకు=గొప్పమనస్సు గలవానికి, జితేంద్రియునకు, నిశ్చిత+ఏకాంత+మతికిన్=నిశ్చయించుటే స్వభావము గాఁగల మనస్సుగల వానికి, 'వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన' యన్నట్టు-ఏకాంతము=ఏక+అంతము=ఒకటే అంతముగాఁగలది. అనఁగా నిటునటు చలింపని,మతికిన్=మనస్సు గలవానికి. సీతాదేవిని జూచుటయందే మన స్సంతయు నిశ్చయమైయుండుటచే నెవతెను జూచినను 'ఈమె సీతయా, ఆమె సీతయా'యని సీతాదేవియందుదృష్టి, సీతాదేవి స్మరణము తప్ప వేఱు భావము వేఱుదృష్టి లేనివాఁడని భావము. ఆ కారణము చేతనే, నిర్నిద్రగతికి=హెచ్చరికతోఁ గూడిన గమనము గలవానికి, అనఁగాఁ బ్రతిస్త్రీయొద్దకుఁబోయి యవయవ పరీక్ష చేయలేదు. అవును గాదని నిశ్చ

యించుకొనుటకు నెంతకావలయునో యెంతవఱకుఁ బోవచ్చునో యంతమాత్రమే పోవుచుండెను. కార్యనిశ్చయ దర్శన క్షమము=చేయవలసిన కార్యము నిశ్చయించి తీర్మానింప సామర్థ్యము గలది. ఈ సందేహముచేఁ బని చాలించిన యెడలఁదాను బూనిన కార్యము చెడిపోవును. అట్లు కార్యము చెడిపోకుండఁ జేయు బుద్ధి-పూత గతిని=పవిత్రమైన విధముగ.

తాత్పర్యము

అని యాలోచించు గొప్పమనస్సుగలట్టియు, నిశ్చయింపబడిన యేకాంతమైన మనస్సుగలట్టియు, హనుమంతునకుఁ బవిత్రమైన మార్గమున నిది చేయఁదగినది, యిది చేయరానిది యని నిశ్చయించి తీర్మానింప సామర్థ్యము గల బుద్ధి మరలఁ గలిగెను. చేసిన పని తప్పా యొప్పా యని మనస్సు సందేహించును. దానిని నిర్మలబుద్ధి నిర్ణయించుచున్నది.

ఉ. కాంచితి రావణాసురుని♦కాంతల నెల్లర నైన నేమి నా
కించుకయైన బుద్ధి చలి♦యింపద; యింద్రియవర్తనంబు సా
గించుఁ గదా మనంబు గడుఁ♦గీడున కేనియు మేలు సేఁతకే
నెంచఁగ నట్టి నా మన మొ♦కింతయుఁ గ్రాలదు సాభిలాషమై. ౩౪౧

తాత్పర్యము

రావణాసురుని స్త్రీల నందఱను జూచితిని. చూచుటచే వచ్చిన హానియేమి? నా బుద్ధి కొంచెమైనఁ జలించినది కాదు. పాపకార్యమందో పుణ్యకార్యమందో యింద్రియ వ్యాపారము జరుపునది మనస్సు, చూచినంత మాత్రమున వినినంత మాత్రమునఁ బుణ్యముగాని, పాపముగాని రాదు. మనసు పాపాభిలాషగల దయ్యేనేని ప్రత్యక్షముగఁ జూచినను జూడకున్నను బాపము వచ్చును. పుణ్యాభిలాషగల దయ్యేనేని పుణ్యమువచ్చును. ఏ యభిలాష లేకున్న వారి కేదియు రాదు. 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో' యని కలదు గదా. కావున మనో వ్యాపారము ప్రధానము, గాని యింద్రియ వ్యాపారము మాత్రము ప్రధానము గాదు. అట్టి నా మనస్సునందు నభిలాష యనునది లేదు. నేను వీరిని గామాసక్తిని జూడను లేదు. చూచిన కారణముచేఁ గామ ముదయింపను లేదు. ఇఁక నాకేమి భయము.

ఉ. ఇయ్యెడఁ గాక యింకెచట♦నే వెదకం దగు భూమికన్యకన్ ?
దొయ్యలులందుఁ గాకెచటఁ♦దొయ్యలి యుండఁగ నేర్చుఁ జూడఁగా?
నెయ్యది జాతి దేని కది♦యేర్పడ నందులఁ గాదె గోయ నా;
నెయ్యెడ నష్టకాంత నగు♦నే నెమకం జని జింకమందలన్. ౩౪౨

తాత్పర్యము

ఈ విచారమేల. ఇది విడిచి మఱియొకచోట వెదుకుదమందునా? ఆఁడుది యాఁడువారి యందుండక మఱి యెందుండఁ గలదు? ఏజాతి వస్తువును ఆజాతిలో

వెదకవలయును గాని వేఱొక జాతిలో వెదకిన లాభ మేమి? పోయిన యావును నాలమందలోఁగాక మఱి యే పశువుల మందలో వెదకిన దొరకును. అట్టిదే కావన రాని స్త్రీ స్త్రీల గుంపులోఁ గాక జింకమందలో వెదకవచ్చునా? కావున గ_్తవ్య మును జేయవలయును, మానరాదు. నిష్కాముఁడనై చేయవలయును. అది యకార్యమైనను బాపము రాదు. శ్రీకృష్ణభగవానుఁడు అర్జునున కుపదేశించిన దాని సారాంశమిదియే. అకార్యమో సుకార్యమో చేయవలసివచ్చినప్పుడు చేయవలయును. నిష్కాముఁడై చేయవలయునుగాని కర్మము స్వరూప త్యాగము చేసెద ననరాదు. పరస్త్రీ దర్శనము పాప మను సామాన్యశాస్త్రవిధి ననుసరించి హనుమంతుఁడు సీతాన్వేషణ కార్యము చాలించియుండిన నేది యెట్లయి యుండునో యూహింపవచ్చును. కావునఁ గామము త్యాజ్యము గాని కర్మము త్యాజ్యముగాదు.

క. శుద్ధం బగు మనమున నే, శుద్ధాంతం బెల్ల వెదకి•చూచితి నధిక
శ్రద్ధను నెచ్చటఁ గానను, నద్ధారిణితనయ ననుచు•నాతఁడు మఱియున్. ౪౩

అర్థములు. అద్ధారిణి తనయ-అద్ధారిణి, ఇబ్బంగి యని రూపము రాదు. రావలయు నని కొందఱు సందేహించిరి గాని యీ విషయము తొలుత సులభ వ్యాకరణము పరిష్కరించెను. తరువాతఁ బండితులు దానినే తమ వ్యాఖ్యానాదుల నామోదించిరి. చూ. సు. వ్యా. సమాస. ౩౬ సూ.

తాత్పర్యము

నేను నిష్కల్మషమైన మనస్సుతో నంతఃపురమంతయు మిగుల శ్రద్ధతో వెదకితిని. సీతాదేవి యెచ్చటను గానరాలేదు. అనుకొని మఱియు హనుమంతుఁడు.

తే. నాగకన్యల యందును•నాకకన్య,లందు గంధర్వకన్యల•యందు వెదకెఁ
గాని కానక సీతఁ ద•త్పానశాల,విడిచి యంఃపురంబున•వెదకె మరల. ౪౪

తాత్పర్యము

నాగకన్యక లందును, దేవతాస్త్రీలయందును, గంధర్వ స్త్రీల యందును మరల వెదకెఁ గాని సీత గానరాలేదు. కావున నా పానశాల విడిచి మరల నంతః పురంబున వెదకెను.

—• ౧౨-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవిని గానక విచారపడుట. •—

క. ఆ యంతిపురము నడుమ ల, తాయతనంబుల విచిత్రి•తాయతనములన్
వాయుతనూజుఁడు వెదకియు,మాయు రె! కనఁ డయ్యెరాము•మహిళామణినిన్.

అర్థములు. లతాయతనంబులన్=తీఁగెల యిండ్లయందును, విచిత్రితాయ తనములన్=చిత్రముల నలంకరింపఁబడిన యిండ్లయందును, మాయు రే=ఆశ్చర్యార్థ కము.

తాత్పర్యము

ఆ యంతఃపురము నడుమ తీఁగెలచే నేర్పఱుపఁబడిన యిండ్లయందును, చిత్ర

ములచే నలంకరింపఁబడిన యిండ్లయందును నెంత వెదకినను ఓరా! సీతాదేవి కాన రా లేదు.

క. స్వాంతమునం దీ విధమున, జింతించెను రాముదేవి♦సీతను గన నే
నెంతయు వెదకితిఁ దత్సతి, యంతముగనెఁ గాక యున్న♦నగపడ కున్నే? ౩౮౬

తా త్ప ర్య ము

ఆప్పుడు హనుమ తన మనస్సున నిటు లాలోచించెను. శ్రీరామచంద్ర మూర్తి భార్యను సీతాదేవిని జూడవలయు నని నే నెంతో వెదకితిని. కానరా లేదు. ఆమె మరణించెనేమో, అటుగాకున్నఁ గానరాక యుండునా?

క. కాకున్న రాక్షసేంద్రుం, డాకట! నిజశీలరక్ష♦ణాసక్తను న
ల్లోకనుత సుగుణ, సీతఁ జి, రాకున వధియించె నేమొ♦క్రౌర్యరతుండై. ౩౮౭

అర్థములు. నిజశీల రక్షణాసక్తను=తన పాతివ్రత్యమును రక్షించుకొనఁగోరు దానిని, చిరాకునన్=కోపముచే.　తా త్ప ర్య ము

ఆమె నై యాత్మహత్య చేసికొని యుండునా? ఉండదు. అటుకానియెడల నయ్యో! తన పాతివ్రత్యమును రక్షించుకొనుట యందు దాసక్తి గలదియు, ఆ కారణముచే సత్పురుషులచే స్తోత్రము చేయఁబడు సుగుణములను గలదియును, నగు సీతను తన కోర్కె నెఱవేర్ప లే దను కారణముచేఁ గ్రూరుఁడై రావణుడు చంపెనేమో!

చ. కనుఁగొన ఘోర మా వికృత♦కాయములం బెదపెద్ద మోములన్
ఘనములు దీర్ఘముల్ గడువి♦కారము లై భయపెట్టు కన్నులన్
దనరిన రాక్షసాంగనల♦దైన్యమునం గని బెగ్గడిల్లి యా
జనకతనూజ దేహమును♦జయ్యన వీడెనొ యేమి చేయుదున్. ౩౮౮

తా త్ప ర్య ము

కామాసక్తుఁడై తెచ్చినవాఁడు దన కామమును నయభయములఁ నెట్టులైన దృప్తిపడఁ జేసికొనఁ గోరునుగాని, హింసించిన నేమిలాభము పొందఁగలఁడుకావున వాఁడు హింసించి యుండఁడు. భయంకరములై, వికారములైన దేహములును, పెద్దపెద్ద ముఖములును, పెద్దవియు దీర్ఘములు నైన కన్నులునుగల రాక్షసస్త్రీలఁ జూచి భయపడి సీతాదేవి ప్రాణములు వదలిపెట్టెనేమో, నే నేమి యిప్పుడు చేయుదును.

ఉ. సీతను జూడ లేక మను ♦ చెప్పిన బీరము లెల్లఁ దీర్ప కే
రీతినిఁ గ్షప్తకాలముఁ బొ ♦ రింబోరి మీఱఁగ భానుపుత్రు మో
మే తగ వెంచి చూచుటకు ♦ నేగుదునో? బలియుం డతండు నా
జ్ఞాఽతిచరిష్ణులం గినిసి ♦ యంతన దండన చేయకుండునే. ౩౮౯

అర్థములు. బీరములు=పౌరుషవాక్యములు, అజ్ఞాతి చరిష్ణులన్=ఆజ్ఞమీఱి చరించువారిని, కినిసి=కోపించి.

### తాత్పర్యము

సీతను జూడలేక మునుపు చెప్పిన పౌరుష వాక్యముల నెల్ల నెఱవేర్పక సుగ్రీవుఁడు పెట్టిన గడువుమీఱి యాయనను జూచుటకు నేమి ధర్మము ననుసరించి పోనును? పోయితినిబో యతఁడు బలవంతుఁడు; తనయాజ్ఞ మీఱి వర్తించిన వారిని దండింపక విడుచునా?

క. చూచితి నంతిపురంబును, జూచితి దశకంఠు సకల♦సుందరులను సీ
తాచపలాక్షీమణి దా, నే చోటను లేదు శ్రమము♦వృథ వోయెఁ గదే. ౩౧౦

### తాత్పర్యము

అంతఃపురమును జూచితిని, రావణాసురుని స్త్రీల నందఱఁ జూచితిని. ఎక్కడ సీతాదేవి కానరాలేదు. నేను జేయవలసిన కృషియంతయు జేసితిని. శ్రమ మంతయు వ్యర్థమయ్యెఁ గదా.

ఉ. ఏమి యొనర్చితో హనుమ! ♦ యేది ధరాసుత! యన్నఁ గ్రోఁతు లే
నే మని యుత్తరం బిడుదు ♦ నేగి సురారిపురంబుఁ జొచ్చి శ్రీ
రాముని దేవిఁ గాన కిటు♦గ్రమ్మఱితిన్ వృథ యంచు నందునా?
హా! మరణించు వానరచ♦యంబులు నే నిట నాలసించినన్. ౩౧౧

### తాత్పర్యము

వానరుల యెదుట నన్ని పౌరుషములు పలికితిని గదా! ఇప్పుడు నేను మరల పోఁగానే హనుమంతా! యేమి చేసి వచ్చితివి? సీతను దెచ్చెద నంటివే. ఏదీ సీత యని క్రోఁతులందఱ అడిగిన నే నేమని ప్రత్యుత్తర మిత్తును. పోయితిని, లంకలో వెదకితిని, కానరాలేదు, పోయినవాఁడను బోయినట్లు మరలి వచ్చితి నందునా? ఎట్లందును? కావున నేను బోను. ఇందే యుందును. ఇందు నెంతకాలమని యుందును? నేను ఆలస్యము చేసితినా? హనుమంతుఁడు రావణుచే హతుఁ డయ్యెనో మఱి యేమయ్యెనో, కావుననే రాలేదు. మనము బ్రతికి లాభ మేమి? సుగ్రీవుని చేతిలోఁ జచ్చుటకు మాఱు ప్రాయోపవేశమున నిందే మరణింత మని యందఱు నిశ్చయముగఁ జత్తురు.

ఉ. ఆవలియొడ్డు చేరఁ గపు♦లందఱు గుంపుగఁ గూడి జానకీ
దేవిని గాన నైతి ననఁ♦ దెల్పుచు నా జననంబు భంగిఁ దా
వావిరి మెచ్చినట్టి గుణ♦వంతుఁడు వృద్ధుఁడు జాంబవంతుఁడున్
శ్రీవిభవుండు నంగదుఁ డి♦సీ యనరే ప్లవగాగ్రగణ్యులున్. ౩౧౨

### తాత్పర్యము

కావున నే నిచ్చటఁ దడయ రాదు. మరలిపోవలసినదే పోయితినిబో–అందఱు వానరులు గుంపులై వచ్చి జానకీదేవిని నేను జూడలేదు అని చెప్పగానే నేనుబుట్టిన

విధము-అప్పుడు నేను జేసిన కార్యము శ్లాఘించి శ్లాఘించి చెప్పిన గుణవంతుఁడు పెద్దవాఁడు నగు జాంబవంతుఁడు అంగదుఁడు ఇంకను వానర ముఖ్యులు ఛీ ఛీ యనరా.

—♦ హనుమ యుత్సాహంబు వహించి మరల సీతాదేవిని వెదకుట. ♦—

శా. ఉత్సాహంబె సిరిన్ ఘటించు మఱి యా♦యుత్సాహమే సౌఖ్య మా
నుత్సాహంబె సతంబు నెల్ల కెలనం♦బొప్పారఁగాఁ దీర్చు నా
యుత్సాహంబునె యాశ్రయించి పనికై ♦ యుంకింతు నిం కొక్కమా
టుత్సాహంబుఁ ద్యజింతురే పనికి ను♦ద్యోగించు ధీరాత్మకుల్. ౩౫౩

అర్థములు. కెలనము=కార్యము, ఉంకింతున్=ప్రయత్నింతును, త్యజింతురే=వదలుదురా, ధీరాత్మకుల్=ధైర్యవంతులు.

తాత్పర్యము

కావున నే నిందుండను రాదు. వ్యర్థుఁడనై పోనురాదు. ఈవిధముగ నే నధైర్యపడనురాదు. కార్యమెట్టులైన సాధింపవలెను. కార్యసాధనమునందుత్సాహము ప్రథమసాధనము, దానిని విడిచి నే నేమి చేయఁగలను. సంపద సంపాదించి యిచ్చునది యుత్సాహమే ఉత్సాహమే సౌఖ్యము. ఆ యుత్సాహమే సకల కార్యముల నెఱవేర్చును. కావున నా యుత్సాహము నాశ్రయించి మఱియొకసారి ప్రయత్నించెదను. కార్యము చేయు ధీరులుత్సాహమును వదలుదురా.

"క్లైబ్యం మా స్మగమః పార్థ, నైతత్త్వయ్యుపపద్యతే
క్షుద్రం హృదయ దౌర్బల్యం, త్యక్త్వోత్తిష్ఠ పరంతప."

అను భగవద్వాక్యము స్మరించునది.

ఉ. చక్కఁగఁ జూతు వెండి యొక♦సారి సురారిసురక్షితంబు లౌ
నిక్కువ లెల్లఁ బానగృహ♦మేల్తెఱఁ జిత్రగృహాళి తోఁటలున్
జక్కనికేళిశాలలును ♦ సందులు వీథులు నవ్విమానముల్
దక్కక యుండ నొక్కటియుఁ ♦ దత్పరవృత్తి నటంచు నెంచుచున్. ౩౫౪

అర్థములు. ఇక్కువలు=ప్రదేశములు.

తాత్పర్యము

రావణాసురుఁడు రక్షించు ప్రదేశము లన్నియు మఱియొకసారి చూచెదను. అని పానగృహములు చిత్రగృహములు తోఁటలు కేళిశాలలును సందులు వీథులు విమానములు నన్నియు నొక్కటియైన విడువక నదియే పనిగా వెదకెదను అని యాలోచించుచు;

చం. వెదకుటకుం గడంగెఁ బృథి♦వీగృహవర్గము చైత్యగేహముల్
సదనసమీపకేళివన♦శాలలు నొండొకచోట నెక్కు వే
అదలల డిగ్గఁ దాఁ బలుమ♦ఱుం జనుచోటికె పోవు ద్వారముల్
వదలిచి దల్పులుం దెఱచి♦వచ్చును బోవును నెక్కు దూఁకెడిన్. ౩౫౫

అర్థములు. పృథివీ గృహవర్గము = భూమిలోనుండు నిండ్ల సమూహము, నేల మాళిగలు. చైత్యగేహములు=నాలుగు వీథులు కలియుచోట నుండు నిండ్లు-సదన సమీపకేళి వనశాలలు=రావణు నింటికి సమీపమున నుండు నాటపట్టులు.

### తాత్పర్యము

వెదుకఁ బ్రారంభించెను. నేలమాళిగలు, నాలుగువీథులు కలియుచోట నుండు మందిరములు, రావణుని యింటి సమీపమున నుండు నాటపట్టులు. చూడ నారంభించి యొకచోట మెట్లెక్కును, ఒకచోట దిగును. పోయినచోటికే పోవును, వాకిండ్లు గడియలుదీసి తలుపులు దెఱచి వచ్చును, బోవును, నెక్కును, దూఱును

తే. కొంచెమైనను విడక శోధించె హనుమ, రావణాసురు నంతిపురంబునందు
నాలుగంగుళముల యేనిఁగాలికొఱకు, చొచ్చి చూడని దేశ మచ్చోట లేదు.

### తాత్పర్యము

ఈ ప్రకారము వదలక రావణుని యంతఃపుర మంతయు శోధించెను. ఆయంతఃపురమున హనుమంతుఁడు చొచ్చి చూడని ప్రదేశము నాలుగంగుళముల మాత్రమైనను లేదు.

సీ. ప్రాకారములు నడిబాటలు వేదికల్, దిగుడుబావులు సరస్తీరములును
వివిధవికారరూపవిశేషలను సోఁకుఁ, జెలువలఁ గనె నందు సీత లేదు
అసమానసౌందర్యలసమానవిద్యాధ, రీతతు లందు శ్రీసీత లేదు
పూర్ణచంద్రాస్యలౌ భోగినులం దంద, గత్తెలలోన భూకన్య లేదు

తే. పంక్తికంఠుఁడు బలిమిని బట్టి నట్టి, నాగకన్యలలోన జానకియ లేదు
సుందరుల నటఁ బెక్కురఁ జూచెగాని, కమలలోచన మైథిలిఁ గానరాదు. ౩౫౭

అర్థములు. సరస్+తీరములు=కొలఁకులయొడ్డులు, సోఁకుచెలువలన్=రాక్షసస్త్రీలను.

### తాత్పర్యము

ప్రాకారములు, ఇండ్లకు నిండ్లకు నడుమ నుండు వీథులు, అరుఁగులు, దిగుడుబావులు, కొలఁకుల యొడ్డులు, నానావిధ వికారవేషములు గల రాక్షస స్త్రీలను జూచెఁగాని యందును సీత లేదు. అసమానమైన చక్కఁదనముచేఁ బ్రకాశించు విద్యాధరస్త్రీలను జూచెఁగాని, వారియందు సీత లేదు. నిండుపున్నమ నాటి చంద్రునివంటి ముఖములుగల భోగినీస్త్రీల యందుఁ దందగత్తెలలో సీత లేదు. రావణుఁడు బలాత్కారముగాఁ బట్టి తెచ్చిన నాగకన్యక లందు సీతమాత్రమే లేదు. అందు సుందరుల నెందఱినో మరున్నందనుఁడు చూచెఁగాని భూనందన గానరాలేదు. ఇందుఁ జెప్పఁబడినవారు మునుపు చెప్పబడిన రావణున కనుకూల లగు స్త్రీలుగారు. బలాత్కారముగఁ దెచ్చి, వారు వశపడమిని నందఱ వేఱొకచో వేసియుంచె నని యేర్పడుచున్నది. రెండవపాదమునఁ జెప్పఁబడినవారు కావలి యుండు స్త్రీలు.

ఉ. ఇంతయుఁ జూచి యా హనుమ • యెంతయు దుఃఖవిషాదసంభ్రమ
స్వాంతత నంది కుందుచును • వానరవర్యుల యెత్తికోలు వి
క్రాంతి సముద్రలంఘనము • గాంచి వృథా చనుటల్ మనంబులో
మంతన ముండి డిగ్గెను వి•మానవరంబుఁ దటిజ్జవాఢ్యుఁడై. ౩౫౮

అర్థములు. ఎత్తికోలు=ప్రయత్నము, విక్రాంతి=పరాక్రమముచే, మంతన ముండి=ఆలోచించి.

## తాత్పర్యము

ఈ విధముగ రావణునికి ననుకూలలైన స్త్రీలను, ప్రతికూలలైన స్త్రీలను, అందఱనుజూచి సీత గానరామిచే మిగుల దుఃఖము, శోకము, సంభ్రమము చెందిన మనస్సు గలవాఁడై వ్యసనపడి వానరశ్రేష్ఠుల ప్రయత్నము, పరాక్రమించి తాను సముద్రమును దాఁటుట యంతయు వ్యర్థమైపోవుట యాలోచించి మెఱుగు మెఱసినట్లు శీఘ్రముగ నా విమానము దిగెను.

౧౩-వ సర్గము. హనుమ ప్రాకారంబుఁ జేరి సీతాదేవి గానరామికివ్యసనపడుట

క. ప్రాకారము మీఁదికి జని, కాకుత్థ్సకులాభరణుని•కాంతామణి నా
లోకింపఁగఁ గానక చిం, తాకులితమనస్కుఁ డగుచు•నంజనసుతుఁడున్. ౩౫౯

## తాత్పర్యము

ప్రాకారము మీఁదికిఁబోయి సీతాదేవిని జూడలేక హనుమంతుఁడు చింతచే గలఁత నొందిన మనస్సుగలవాఁ డయ్యెను.

తే. కడిగి గాలించి చూచితిఁ గాని లంక
గుంటలును, జెవ్వులును, గొలం•కులును, నదులు
వంకలును, వాఁగులును, మలల్ • డొంక లెల్ల
తలములును దిమ్మఁదిరుగుచు • ఫలములేను. ౩౬౦

## తాత్పర్యము

లంకలో నుండు గుంటలు, చెఱువులు, సరస్సులు, నదులు, వంకలు, వాగులు, కొండలు డొంకలు సమస్తప్రదేశములు దిమ్మఁదిరుగుచుఁ గడిగి గాలించి చూచితిని గాని వ్యర్థ మయ్యెను.

క. కానను గావై దేహిని, దానవవరు నింటఁ గలదు•ధరణిజ యనుచుం
దా నాడఁడె సంపాతియు, జానకి యిట లేద యేమి • సలుపుదు నింకన్. ౩౬౧

## తాత్పర్యము

సీతను జూడలేకపోయితిని. సీతాదేవి రావణు నింట నున్నది యని సంపాతి నమ్మకము చెప్పెను. ఇచ్చటఁ గాన రాలేదు. ఏమి చేయుదును? అతఁ డసత్య మాడె నందునా? అంతటి యకార్య మతని కేల కలిగెను? దాని వలన నతనికి రాఁగల లాభమేమి? కాఁబట్టి యిందే యామె యుండవలె; నెందున్నదో!

క. జనకజ మైథిలి రాముని, వనిత విదేహాభవ సీత•వశ మతి దుష్టున్
దనుజున్ మనుజాశను నే, మనుచుం బ్రాపించు నట్టి•యాగడ మున్నే. ౩౮-౨

అర్థములు. జనకజ=జనకరాజుకూఁతురు, 'కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయ, యన్నట్లు సదాచార సంపన్నులలో నుత్తముఁడైన వానిఁకూఁతురు. కులముఁ బట్టి గుణములు. అట్టివాని కూఁతురు రావణునకు లోఁపడునా? మైథిలి= ఆయన యొకఁడే కాదు 'యథా రాజా తథా ప్రజా' యన్నట్టులా దేశము వారందఱు నట్టివారే. అట్టి మిథిలయందుఁ బుట్టినది. అట్టి సదాచార సంపన్ను లుండెడి చోట దుష్టస్త్రీ పుట్టునా?

పుట్టిన యింటి సమాచార మిటుండ మెట్టిన యింట రామునివనిత. ధర్మ విగ్రహామగు రామచంద్రుని భార్య. గుణవత్సంబంధము చేతఁ బరుసవేదిచే నినుము బంగారమైనట్లు చెడువారుకూడ మంచివారగుచుండ బంగారినుమగునా? విదేహా భవ=విదేహులు=దేహాభిమానము లేనివారు, బ్రహ్మజ్ఞాన పరాయణులు. అట్టి దేశము విదేహ దేశము. అట్టి దేశమందుఁ బుట్టిన సీత, తుచ్ఛమైన దేహసౌఖ్యము నకై చేయరాని పని చేయునా? సీత=అందు మనుష్యస్త్రీలు పుట్టినట్లు పుట్టినది కాదు. అయోనిజ కావుననే అమానవి-అట్టిది యకార్యము చేయఁబూనుకొనునా? వశమతి=తన మనస్సును దన స్వాధీన మందుంచుకొనలేక-దుష్టున్ =దోషకార్య ములే చేయువానిని, దనుజున్=రాక్షసుని, మనుజాశనున్=మనుష్యులను బీఁకి తిను వానిని,దుష్టు ననుటచే దుష్టస్వభావము-దనుజున్-అనుటచే దుష్టజాతి-మనుజాశనుని అనుటచే క్రియయుఁ, జెడ్డది. మనుష్య స్త్రీ మనుష్యులఁ దినువానిని గామించునా? ఆగడము=విపరీతవర్తనము, ఉన్నే=ఉండునా?-ఉండదు.

## తాత్పర్యము

రావణాసురునకు వశపడుటచే వాఁడామెను పిరిలోఁ గలుపక మతియెందైన నుంచినాఁడనుకొందునా? ఛీ ఛీ యది యేమి యాలోచన. జనకరాజు కూఁతురు, మిథిలయందుఁ బుట్టినది, రామునిభార్య, విదేహాసంబంధముగలది, భూమియందుఁ బుట్టినది, సీత యను పేరు గలది, కామవశురాలై గుణమున దుష్టుఁడు, జాతిచే నీచుఁడైన దనుజుఁడు, క్రియలచేఁ గ్రూరుఁడై మనుష్యులఁ దినువాఁడు నగు వాని నే మనికామించును? అట్టి విపరీతముకూడా నుండునా? ఎప్పటికి నుండదు.

క. సీతఁ గొని రామమార్గణ, భీతి న్వడి నెగుర నసుర•వీరుఁడు నీరే
జాతాక్షియు నడి త్రోవను, భీతిం బడిపోయె నోటు•భీరువుగానన్. ౩౮-౩

అర్థములు. మార్గణ=బాణములవలని, భీతిన్=భయమున, భీరువు=పిఱికిది.

### తాత్పర్యము

సీతాదేవి యిందు లేదాయె, నందు లేదాయె, నదుమ నెక్కడ బోయె నందునా, రావణుఁడు రామ బాణములకు భయపడి సీత నెత్తుకొని యాకాశమున నెగురునప్పుడు భయశాలిని కావున సీత సముద్రములోఁ బడిపోయె నేమో.

ఉ. అట్టులుగాక యున్న ఖచ • రాధ్వమునం జనుచోట రావణుం
డిట్టల మైన భీతి మిథి • లేశ్వరుకన్యక యబ్ధిలోన లోఁ
దొట్టిన నివ్వెఱం బడెనొ • తోరపు వేగము సైఁప లేక తా
నెట్టన మే న్వణంక ధృతి • నిల్పఁగ నేరక మేను వాసెనో? ౩౬౮

అర్థములు. ఖచరాధ్వమునన్=ఆకాశమార్గమున, ఇట్టల మైన=అధిక మైన, దృఢ మైన, 'తలఁకెడువాఁడు గాఁడు భగదత్తుఁడు భీమతనూజుతోడ నిట్టలముగఁ బోరఁజాలు నకటా కరియొరువ దేమి సేయు' భార. నివ్వెఱన్=పారవశ్యముచే.

### తాత్పర్యము

అట్లు సముద్రములోఁ బడిపోక యుండినచో రావణుఁ డాకాశమార్గమునఁ బోవునపుడు సీత నిండారు భయముచే సముద్రమును జూచి భయపడి పరవశురాలై దానిలోఁ బడిపోయెనేమో? అటుగాక యుండెనా, వాఁడు పోవు వేగమును సైరింపలేక ధైర్యము విడిచి వణఁకుచు నాకాశమందే దేహమును విడిచెనేమో.

క. రాముని రాకా వేళా, సోముని నిరసించు ముఖము • సురుచిరకంజా
తామలదళనయనములను, వేమఱు స్మరి యించుకొనుచు • విడిచెనొ మేనిన్.

అర్థములు. రాకా వేళా సోముని=నిండుపున్నమనాఁటి చంద్రుని, రాక=పదునాఱు కళలు గల చంద్రుని గల రాత్రి.

### తాత్పర్యము

అటుగాక యుండెనా, రాముని నిండు పున్నమనాటి చంద్రునిఁ దిరస్కరించు ముఖమును, మనోహరములైన కమలముల రేకులవంటి కన్నులను స్మరించుచు ప్రాణము విడిచినేమో.

సీ. చుట్టపక్కములు లే • నట్టి సాధ్వి సుశీల, సీత రావణుఁడు భ • క్షించె నేమొ?
యీసున రావణు • నిల్లాండ్రు రసఘాత్మ్నఁ, బట్టి భక్షించిరో • పాపరతులు?
హా! రామ! హా! లక్ష్మ • ణా! హా! యయోధ్య! య, టంచు నేడ్చుచు మర • ణించెనొక్కొ?
పంజరంబున గోరు • వంక నా నసురుండు, నేలమాళిగ నుంచి • యేలు నేమొ?

ఆ. జనకరాజతనయ • సాధ్వి సుమధ్యమ, రాము పత్ని సీత • రావణాసు
రాధిపతికి నెట్లు • స్వాధీన యయ్యెడు? నట్టి దెన్నఁడైన • నగుట గలదె. ౩౬౬

అర్థములు. చుట్టపక్కములు=చుట్టములు+పక్కములు. ఒకానొకచో ద్వంద్వంబునఁ బూర్వపదంబు క్లీబసమం బగు అగుచో నాముపర్ణకమునకు లోపం

బగు (త్రి.స. అసూ) పక్షశబ్ద భవము పక్షము. అసున=సవతిమాత్సర్యముచే, సుమధ్యమ=సన్నని నడుము గలది.

తా త్ప ర్య ము

సుగమము,

ఉ. దానవుఁ డింద యెవ్వెడనొ • దాఁచెనొ, కాక సుశీల మిత్తికిన్
లోనయి పోయెనో వనధి•లోఁ బడి భీతి? హృదీశకూటమిన్
మాని మనంగ లేక మర•ణంబుఁ నె తా శరణంబుఁ గాంచెనో
మానిని, యిష్టభార్యునకు • మానుగ రామున కేమి చెప్పుదున్. ౩౮౭

అర్థములు. మిత్తికిన్=మృత్యువునకు, మనంగలేక=బ్రదుకలేక, ఇష్టభార్యునకు=భార్యయందుఁ బ్రేమ గలవానికి, ఇష్టురా లగు భార్యగలవానికి.

తా త్ప ర్య ము

రావణు డిందే యెందైన సీతను దాఁచెనో లేక పతివ్రత గావున రావణునకు వశపడక సముద్రములోఁబడి నశించెనో, భర్త, సాంగత్యమునువిడిచి బ్రదుకలేక తానే మరణించెనో, భార్యయందుఁ బ్రేమఁగల రామునకు నే నేమని చెప్పుదును?

— { సీతాదేవి లేదని శ్రీరామునితోఁ జెప్పినఁ గలుగు ననర్థంబుల హనుమంతుఁడు యోజించుట } —

క. చెప్పిన ననర్థకం బగు, జెప్పమినిం దోష మెట్లుఁ•జేకుఱుఁ గానన్
జెప్పుదున; చెప్పకుండిన? యి ప్పగిది ఘటిల్లె విషమ•మే మొనరింతున్.

తా త్ప ర్య ము

సీత కానరాలేదని చెప్పితినా కీడు తప్పదు. చెప్పకుందునా దోషముతప్పదు. చెప్పినను గీడే, చెప్పకున్నను గీడే, చెప్పుదునా చెప్పకుందునా? విషమ సంకటము ప్రాప్తించెనే, యేమి చేయుదును?

క. అని యన్యోన్యవిరుద్ధము, గను దోఁప సమర్థ మగుచుఁ•గాలార్హం బౌ
ఘననీతి యెద్ది యంచును,మనమునఁ దలపోయఁ దొడఁగె•మారుతి మఱియున్

అర్థములు. అన్యోన్యవిరుద్ధము=ఒకదాని కొకటి సరిపడనిది.

తా త్ప ర్య ము

ఏ యాలోచన చేసినను మనస్సునకు సమాధానము కుదిరినది కాదు. ఒక యాలోచనను బాధించు నాలోచన వేఱొకటి తోఁచుచున్నది. ఇట్టి సందర్భమందుఁ గాలయోగ్యమై కార్యసాధక మైన నీతి యెద్ది యని హనుమంతుఁడు మఱియు నాలోచింపసాగెను.

ఉ. ఏమిఫలంబు గల్గుఁ దర•శేక్షణఁ గానక నేను వానర
స్వామి పురంబుఁ జేరఁ జన • వారిధి దాఁటుట, లంకఁ జొచ్చుటల్

భూమిజ రోయుటల్, దనుజ-పుంగవులం గనుటల్, వృథా చనన్
భూమిజఁ గాన కే మనుచుఁ బోవుదుఁ బుణ్యమొ పూరుషార్థమో. ౩౨౦

అర్థములు. తరళేక్షణ=చలించు కన్నులు గలది-సీత.

తాత్పర్యము

నేను కిష్కింధకుఁ బోయెద ననుకో, దానివలన రాఁగల లాభమేమి? సముద్రము దాఁటుట, లంకఁ బ్రవేశించుట, సీతను వెదకుట, రాక్షస శ్రేష్ఠులఁ జూచుట యివన్నియు వ్యర్థమై పోవఁగా సీతను జూడక యక్కడికిఁ బోయిన పుణ్యమా, పూరుషార్థమా? ఫలహీనమైన కష్ట మేటఁ జేసిన కృషియే గదా.

ఉ. ఏ మన యందురో వనచరేశ్వరులున్ రవిజుండు నేఁ జనన్
రాముఁడు లక్ష్మణుండుఁ గనరాదు సుడీ జనకాత్మజాత నా;
రాముఁడు ప్రాణముల్ విడుచుఁ గచ్చఁ, గ్రూరము తీక్ష్ణ మింద్రియ
స్తోమసుతాపనంబు చెవిసూఁడు నుడుల్ వినియున్ సహించునే? ౩౨౧

తాత్పర్యము

నేను బోయి సీత గానరాలేదు అని చెప్పఁగానే వానరవీరులు సుగ్రీవుఁడు రాముఁడు లక్ష్మణుండు నన్నేమందురు? లేని వస్తువును జూడ లేదని నన్ను దండింతురా? దండింపరు గాని రామచంద్రమూర్తి యామాట చెవిలోఁ బడఁగానే వెంటనే ప్రాణము విడుచుట సిద్ధము. క్రూరమై తీక్ష్ణమై ఇంద్రియములకు సంతాపకరమై చెవులలో కరగించి పోసిన సీసమువంటి మాటలు విని యేమని ప్రాణము పట్టుకొని యుండఁగలఁడు?

క. మరణకృతనిశ్చయాత్ముని వరగుణునిన్ రాముఁ జూచి భ్రాతృసుహృత్త్వ
స్ఫురితుం డగు సౌమిత్రియు, మరణంబును బొంద కేల మతి జీవించున్. ౩౨౨

అర్థములు. మరణకృతనిశ్చయాత్మునిన్=మరణింప నిశ్చయము చేసికొనినవానిని; భ్రాతృసుహృత్త్వస్ఫురితుండు = అన్నయందు స్నేహభావముచే నిండియుండువాఁడు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి మరణింపవలె నని నిశ్చయము చేసికొనఁగానే యాయనకంటె ముందుగ నాయన యందు నిండారు సోదరప్రేమగల లక్ష్మణుఁడు మరణించును గాక యేల జీవించును. రాముని మరణమని వినుటకు కనుటకు ముందే యాయనప్రాణములు పోవును.

క. అన్నయుఁ దమ్ముఁడుఁ జచ్చిన, యన్నుడి విన్నంతమాత్ర నట భరతుండున్
మున్నుగఁ బ్రాణము విడుచును, సన్నుతశత్రుఘ్నుఁడు బసిఁ జను దేరంగన్. ౩౨౩

తాత్పర్యము

అన్నయుఁ దమ్ముఁడు మరణించిరని వినఁగానే యయోధ్యలో భరతుఁడు శత్రుఘ్నుఁడు తోడరాఁగా ముందుగనే ప్రాణము విడుచును.

క. కొడుకులమరణము విని వగఁ,బడి కౌసల్యయు సుమిత్ర•భరతుజననియున్
విడుతురు వెంటనె ప్రాణముఁ, బుడమిని జీవింప నెట్లు•బుద్ధియుఁబుట్టున్. ౩౨౪

తా త్ప ర్య ము

కొడుకులచావు విన్నంత మాత్రముననే కౌసల్య సుమిత్ర కైకేయియుఁ జత్తురు. వారు కొడుకులఁ బోఁగొట్టుకొనియు బ్రదుక నెట్లు బుద్ధి పుట్టును?

క. కృత మెఱుఁగును సత్యముఁ దన,మతిఁ బాయఁడు కపివిభుండు•మార్తాండజుఁడున్
క్షితితనయావల్లభుఁ డా,గతిఁ బట్టుటఁ జూచి తాను • గాలముఁ జెందున్. ౩౨౫

తా త్ప ర్య ము

పరులు తనకుఁ జేసినమేలు మఱువనివాఁడు, చెప్పినమాట, దప్పనివాఁడు నగు సుగ్రీవుఁడు రామచంద్రుని గతిఁజూచి తాను మరణించును.

క. శోకోపహతయు భృశదుః, ఖాకులిత యపాస్తనిర్భ•రానందమహా
శోకాకుల యయి రుమ పతి, శోకంబున మేను విడఁగ•జూడక యున్నే. ౩౨౬

అర్థములు. శోకోపహత=మగఁడు చచ్చిన శోకముచేఁ గొట్టఁబడినది, భృశదుఃఖాకులిత=మిగుల దుఃఖముచేఁ గలఁత నొందిన మనస్సు గలది, అపాస్త=పోయిన, నిర్భర=అధికమైన, ఆనంద=సంతోషము కలిగినది.

తా త్ప ర్య ము

మగఁడు చచ్చిన శోకదుఃఖములచేఁ గలఁత పడిన మనస్సు గల రుమాదేవి దేహము వదలు నాలోచన చేయకయుండునా?

తే. వాలిమరణంబునకె కడు•వగఁ గృశించు, తార సుగ్రీవుగతిఁ జూచి•తా నశించుఁ
దల్లియును దండ్రియును బిన్న•తండ్రిచావఁ,జూచి యంగదుఁ డేటికిఁ•బ్రోచుమేను.

తా త్ప ర్య ము

వాలి చచ్చినాఁడని యేడ్చు తార సుగ్రీవుఁడుకూడఁ జచ్చుట చూచి తాను నశించును. తలిదండ్రులు పిన్నతండ్రి మరణించుట చూచి యంగదుఁడు నశించును.

చ. వనచరవీరు లెల్ల నిజ•వల్లభసంస్థితి దుఃఖతప్తులై
ఘనతరముష్టిగాఢతల•ఘాతములన్ నిహతోత్తమాంగులై
చనఁ జిరసాంత్వనాదృతులు•చత్తు రరణ్యచరుల్ సపుత్రకుల్
వనచరు లార్తిఁ గూరి భృగు•పాత మొనర్చి నిజప్రియాళితోన్. ౩౨౭

అర్థములు. నిజవల్లభ సంస్థితిన్=తమ ప్రభువు మరణించుటచే, ముష్టిఘాతములన్=పిడికిళ్ళ గ్రుద్దులచే, తలఘాతములన్=అఱచేతి దెబ్బలచే, నిహతోత్తమాంగులై=పగులఁ గొట్టఁబడిన శిరస్సులు గలవారై, చిర=దీర్ఘకాలముగ సాంత్వన=మంచిమాటలచే, ఆదృతులు=ఆదరింపఁబడినవారు, అరణ్యచరుల్=అరణ్యమం దుండువారు, భృగుపాతము=కొండమీఁదనుండి క్రిందఁబడుట, నిజప్రియా+ఆళితోన్=తమ ప్రియురాండ్రతో.

తా త్ప ర్య ము

కిష్కింధ యందుండు ముఖ్యవానరు లంకలు తమ రాజు చచ్చినాఁడన్న వార్త విన్నంతమాత్రముననే దుఃఖముచేఁ దపించినవారై గట్టిపిడికిళ్ళచేతను దృఢమైన యఱచేతి దెబ్బలచేతను దమ తలలు పగులఁగొట్టుకొని మరణింపఁగా నరణ్యమందుఁ జిరకాలముగ మంచిమాటలచే నాదరింపఁబడుచుండినవారు ఇఁకఁ దమ్ము నాదరించు వారు లేమిని కొఁమకులతోను శ్రీయురాంద్రతోను గొండల మీఁదినుండి క్రిందఁబడి మరణింతురు.

క. శైలంబుల వివిధవనీ, జాలంబులఁ గీశవరులు • సంఘము లగుచున్
హాళిఁ జరింపరు తమి వా, హ్యాళిం గ్రీడలను దుఃఖ • తాత్ములు లగుచున్. ౩౯

అర్థములు. శైలంబులన్=పర్వతములందును, వివిధ వనీ జాలంబులన్= నానావిధములయిన యడవుల గుంపులందును, కీశవరులు=వానరశ్రేష్ఠులు, కీశ= 'కః' యనఁగా వాయువు. ఆయన కుమారుడు 'కి' యనఁగా హనుమంతుఁడు. ఆయనను ముఖ్యుఁడు గాఁగలవారు కీశులు, గురుబాలప్రబోధికయం దిట్లుత్పత్తి వ్రాయఁబడెను గాని కీస్, కీస్ అనువారు గనుక కీసులయిరేమో యని తోఁచు చున్నది. వాహ్యాళి=వినోద సంచారము, తద్భవము వయ్యాళి.

తా త్ప ర్య ము

అట్లు చావఁగా మిగిలిన క్రోఁతులు కొండలందు నడవులందు గుంపులై దుఃఖముచే మునుపటివలె విలాసముగా సంచరింపరు.

క. ఉరిపోఁతలఁ బెనుమంటలఁ, బరుషవిషంబులను నిరాహారముల • పాసంబులచే
మరణింతు రొండె నుసులు, తరవారుల నుతికి యెుండెఁ • దలఁగుదురు కపుల్.

అర్థములు. నిరాహారపాసంబులు=శుష్కోపవాసములు, తరవారులు=కత్తులు 'తరవారి ర్మండలాగ్రః ఖడ్గః కౌక్షేయక స్సమాః' యాదవ.

తా త్ప ర్య ము

కొందఱు ఉరిపోసికొని చత్తురు. కొందఱు మంటలలో దూఁకి చత్తురు. కొందఱు విషము ద్రావి చత్తురు. కొందఱు కత్తులపైఁబడి ప్రాణములు విడుతురు.

సీ. కిష్కింధ కిప్పు డేఁ • గితి నేని యెయ్యెడ, హా యను నేడుపు • లులివు వినఁగఁ
బడు నంతె, యిక్ష్వాకు • వంశనాశంబును, గపికులనాశంబుఁ • గలుగు నిజము
కావునఁ గిష్కింధ • కడకు నే నిట నుండి, చన కుండుటయె చూడ • సమ్మతంబు
చూతు నే నెట్టులు • సుగ్రీవుముఖమును, జానకిపోఁబడిఁ • గాన లేక

తే. నేను బోకుంటి నేని వ • నేచరులును, దాశరథులును బ్రాణముల్ • దాల్చువార
లాశచే నైనఁ గొన్నాళ్ళ • లట్టుగాన, నటకుఁ బోకుండు టే మేల • టంచుఁ దోఁచె.

అర్థములు. ఏడుపు+ఉలివు=ఏడుపులులివు=ఏడుపుధ్వని.

## తాత్పర్యము

ఇప్పుడు నేను కిష్కింధకుఁ బోయితినా యెక్కడఁ జూచినను నేడుపు ధ్వనులే వినవచ్చును. అంతమాత్రమే ప్రయోజనము. ఏల? ఇక్ష్వాకు వంశనాశంబు, వానర కులనాశము తప్పక కలుగును. కావున నిచ్చటనుండి కిష్కింధకుఁ బోకుండుటే సమ్మతమైన కార్యము. జానకి పోఁబడి తెలిసికొనలేక పోయి సుగ్రీవు ముఖమేమని చూతును. అంత సిగ్గు బిడియము లేని వాఁడనా? కావున నేను పోకుండితినేని హనుమంతుఁ డింకను వచ్చును, రేపు వచ్చును, ఎల్లుండి వచ్చును, అను నాశచే నింకను గొన్ని నాళ్లైన జీవించి యుందురు. కాఁబట్టి నేను బోకుండుటే మేలు.

హనుమంతుఁడు సీతాదేవిని జూడకయే యుండెనేని యెంత కీడు మూఁడి యుండునో చూచుటచే నెంతకీడు తొలఁగెనో పాఠకు లూహింపవచ్చును. అయినను నొక సందేహము. ఇంత కీడు సీత కానరాలేదనఁగానే రాముఁడు మరణించు నను నూహమీఁద నాధారపడి యున్నది. ఆయన సీతావియోగముచే మరణించిననే యింత యనర్థము సంభవించును గాని యాయన జీవించి యుండిన నింత యనర్థము పొసఁగదు. భార్యకానరాలేదనఁగానే రామచంద్రమూర్తి ప్రాణము విడుచునా? సీతాదేవి రెండవసారి శపథము చేసి భూమిలోనికిఁ బోయిన తరువాత రామచంద్రమూర్తి మరణించెనా? ఆవల నెన్నియో నూర్ల సంవత్సరములు బ్రతికియుండెఁ గదా. కావున రామచంద్రమూర్తి సీతకై ప్రాణము విడుచు నను నూహ సరియైనది కాదు. కావున నీ యూహాపరంపర నిరాకరము. సమాధానము రెండవసారి సీతావియోగము స్వబుద్ధి పూర్వకముగఁ జేసిన కార్యము. అందు దుఃఖ మతిశయించి యుండదు. భార్య మరణించిన నేడుచువాఁడు తాను సన్న్యాసియై భార్యను వదలెనేని యేడువఁడు. అబుద్ధి పూర్వకముగ నొక రూపాయ పోఁగొట్టుకొనినవాఁడు దేవురు లాడినట్లు బుద్ధిపూర్వకముగ వందరూపాయలు దానముచేసిన వాఁ డేడువఁడు. కావున రెండవసారి సీతా వియోగమున రామచంద్రమూర్తికి వ్యసనము తక్కువ. ఇంత తీవ్రవ్యసనము లేదు. సీతాదేవి భూమిలోఁ బ్రవేశించుటకు ముందు పండ్రెండు సంవత్సరముల నాఁడే భార్యాభర్తృవియోగము సంభవించెను. ఇన్ని సంవత్సరములు వియోగము ననుభవించిన వాని మనస్సున శోక మెంతమాత్ర ముండఁగలదు. వాల్మీకి రామాయణము వ్రాయకుండిన నామె యావజ్జీవమ ట్లుండవలసినదే కదా. వియోగ మట్లైన నేమి? ఇట్లైన నేమి? వియోగము వియోగమే. ఇప్పటిస్థితి యట్టిదికాదు. కావున హనుమంతుని యూహ తప్పన రాదు.

మఱియొక విధముగ నాలోచింతము. హనుమంతుఁడు సీతను గానక మరలి పోయి వానరులకీ వార్త చెప్పఁగానే వానరులందఱు సుగ్రీవు భయమున ప్రాయోపవేశము చేసియుందురు హనుమంతుఁడు మాత్రము బ్రహ్మ వరబలమున జీవించి యుండి కిష్కింధకుఁ బోయి యీవార్త చెప్పియుండవలసి వచ్చును. అప్పుడెంతటి

యల్లకల్లోలము పుట్టియుండునో. అటుగాక వానర లూరకపోయిరా రాజాజ్ఞ మీఱిన వా రని వీరినందఱ సుగ్రీవుఁడు దండింపఁ బూనిన నెంత యనర్థము పుట్టియుండునో? ఇక్కడ సీత యేమై యుండునో? ఇవన్నియు హనుమంతుఁ డాలోచించిన విషయములే. ఈ కారణముచేఁ బోయి యనర్థకారి యగుటకంటెఁ బోకుండుటే మే లని తీర్మానించుకొనెను. ఇట్లు తీర్మానించుకొనిన తరువాతఁ జేయవలసిన కార్య మాలోచించుచున్నాఁడు.

—♦ హనుమంతుఁడు ప్రాణత్యాగముఁ జేయ నాలోచించుట. ♦—

శా. ఏ సింహం గన నైతి నేని మిథిలా♦ధీశాత్మజాతం గరా
దానుండన్ నియతవ్రతంబుగ ముఖా♦దానుండ నై యింద యెం
దేనిన్ భూరుహమూలవాసి నయి జీ♦వేచ్ఛన్ విసర్జించుచున్
వానప్రస్థుఁడ నై చరించుటయె భ♦వ్యం బైన మార్గం బగున్. ౩౪౨

అర్థములు. కరాదానుండన్=చేతిలోఁబడిన దానిని దినువాఁడను, ముఖాదానుండను=నోటిలోఁబడిన దానిని దినువాఁడను, భూరుహమూలవాసిని=చెట్టు క్రిందఁ బడియుండువాఁడను, జీవేచ్ఛన్=బ్రదుకునందలికోరికను.

తాత్పర్యము

నేను మరలిపోను. ఇందే యెందో యుండెద ననుకో. ఉండి చేయవలసిన దేమి? ఇంక నుండి సీతాదేవిని కనుఁగొనలేక పోయితినా యొక చెట్టుక్రింద బ్రదుకు మీఁది యాశ వదలి దోసిలి పట్టుకొనియో నోరు తెఱచికొనియో కూర్చుందును. చేతిలోఁ బడినదో నోటిలోఁ బడినదో కాయో పండో తినుచును పడకుండిన నూరకుందును. ఈ విధముగ వానప్రస్థుఁడనై యుండుటే క్షేమంకరమైన మార్గము.

క. మెచ్చగు ఫలమూలంబుల, హెచ్చగు జలనిధితటంబు♦నే నరిగి యటన్
జిచ్చుఱికెదఁ జితి పేరిచి, చచ్చుట మేల్ సీతఁ గనక♦చనుకంటె నిటన్. ౩౪౩

అర్థములు. చిచ్చు+ఉఱికెదన్=సప్తమ్యర్థమునఁ బ్రథమ-చనుకంటెన్=చనుటకంటె, భావార్థక ట వర్ణలోపము.

తాత్పర్యము

ఫలములు,మూలములు విశేషముగ నుండు సముద్రతీరముఁ జేరి యచ్చటఁ జితి పేరిచి దానిలో దూఁకి చచ్చుట మేలుగాని సీతనుజూడక మరలిపోవుట మేలుగాదు.

క. అంగములు వ్యాఘ్రకాకప,తంగంబులు దినుచు నుండఁ♦దలఁగక స్మృతిమీ
ఱంగ మరణోపవిష్టత, లింగిని సాధించువాఁడ ♦ లీలగ నిచటన్. ౩౪౪

అర్థములు. వ్యాఘ్రకాకపతంగంబులు=పులులు, కాకులు లోనగు పక్షులు, మరణోపవిష్టత=మరణము నిమిత్తమై కూర్చుండుట, లింగిని=లింగ మనఁగా సన్న్యాసము=నిరాహారము అది కలది లింగిని.అనఁగా నిరశన వ్రతము, లీలగన్=అవలీలగ.

### తాత్పర్యము

చెట్టుక్రిందఁ గూర్చుండి కాయలు పడునా, పండులు పడునా యని దేహాభిమానముచేఁ గాచి యుండుట యెవఁడు చెప్పిన పని. అదియు సరిగాదు. ఒక చెట్టుక్రింద మరణము నిమిత్తమైనిరాహారినై ధీరుఁడనై నా దేహమును పులులు' కాకులు గ్రద్దలు లోనగు పక్షులు తినిపను గదలక కూర్చుందును.

తే. అవనిసంభవ నిటఁ గానఁ • నైతి నేని,నీళ్ళ నుఱికి త్యజించెద • నేను మేని
నిట్టినిర్వాణగతికి ము • నీంద్రు లెల్ల,సమ్మతింతుర యని తోఁచె • స్వాంతమునను.

### తాత్పర్యము

సీతాదేవిని నే నిందుఁ జూడఁజాలక పోయితినా నీళ్ళలో దూఁకి దేహము వదలెదను. ఇట్టి కార్యము రామార్థమై చేయుట మునీశ్వరు లెల్ల సమ్మతింతురనియె తోఁచుచున్నది. స్వామికార్యమునకై అందు రామకార్యమునకై ప్రాణము విడుచుట పాపకార్య మగునా? జటాయువువలె నందునా? జటాయువు కార్యము చేయలేక బుద్ధి పూర్వకముగ మరణింపలేదు. ఆయనది వీర మరణము. నాస్థితి యట్టిది కాదుగదా.

ఉ. హా యెటు సేయుదున్ వరశు • భావహశాలిని యై మనోజ్ఞ చం
ద్రాయతచంద్రికాసుభగ • యాచు యశోవిభవాభిరామ యై
పాయుట నిద్ర దీర్ఘయయి • బాధసుకీర్తిద యైనరాత్రి వే
పోయెడిఁగా వృథా జనక • పుత్రిఁ గనంగొను భాగ్య మేదఁగన్. ౬౦౮

అర్థములు. వరశుభావహశాలిని=మేలైన శుభమును గలుగఁజేయు దానితోఁ గూడినది, మొట్టమొదట లంకాధి దేవతా జయము, శుభ సూచకము, చంద్ర= చంద్రునియొక్క, ఆయత=గొప్పదియగు, చంద్రికా=వెన్నెలచేత, సుభగ= సుందరమైనది. ఇట్లు చెప్పుటచే నిప్పటికి వెన్నెల దట్టముగా నున్నది. కాని పలుచఁబాఱలే దని భావము. యశోవిభవ=కీర్తి సంపదనలె, అభిరామమై=మనోహరమై, కీర్తి తెలుపని కవిసమయము. ఈ రాత్రి గదా హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశించె నని కీర్తిగలది, పదఁగన్=క్షయింపఁగా.

### తాత్పర్యము

అయ్యో! నేనేమి చేయుదును. ప్రారంభమందు లంకా జయముతో శుభము గలిగించి మనోజ్ఞమై చంద్రుని విస్తారమైన వెన్నెలచే నంద మయిన యశస్సువలె దెల్లనైనిద్ర లేకుండుటచే దీర్ఘమై యీరాత్రి లంకయందు హనుమంతుఁడు ప్రవేశించెనను కీర్తి తెచ్చునదియైన రాత్రి సీతాదేవిని జూచు భాగ్యము లేకయే వృథాగాఁ బోవుచున్నది గదా.

క. వ్రతి నై భూరుహమూల, క్షితిపైఁ బడి యుండువాఁడ • సీతం గనకే
మతి లేక చనిన నంగద, పతిముఖ్యులుఁ గీశవరులు • బ్రతుకం గలరే. ౩౦౯

అర్థములు. భూరుహమూలక్షితిపై=చెట్టుమొదట నుండు నేలమీఁద.

తాత్పర్యము

నేను జేయఁదగిన దేదియు నాకుఁ గానరాలేదు. కావున వ్రతము పూని చెట్టు మొదళ్ళఁబడి యుందును. అటుగాక బుద్ధిలేని వాఁడనై పోయితినా యంగదుఁడు మొదలగు వానరులు బ్రదుకఁజాలరు.

ఆ. ప్రాణములను విడువ ♦ బహుదోషములు గల్గు
బ్రదికి యున్నఁ గాదె ♦ పడయు శుభముఁ
గావఁ దాల్చువాఁడ ♦ మేనఁ బ్రాణంబులు
బ్రదికి యున్న భద్ర ♦ మొదవు నిజము. ౩౮౮

తాత్పర్యము

ఆహారము లేక దేహము విడిచెద మనుకో, చచ్చి సాధించునది యే మున్నది? ప్రాణములను వదలితినా పెక్కుదోషములు గలవు. బ్రదికియుండినఁగదా మేలనుభవింప వచ్చును. చచ్చిన తరువాత మే లేమి గలదు. కావునఁ బ్రాణముల విడువరాదు. బ్రదికి యుండిననే శుభము గలదు.

జీవితం మరణా చ్ఛ్రేయో జీవన్ ధర్మ మవాప్నుయాత్.' (భారత. విశ్వామిత్ర చండాల సంవాదము)

శరీరం ధర్మసర్వస్వం, రక్షణీయం ప్రయత్నతః
శరీరాత్ స్రవతే ధర్మః, పర్వతా త్సలిలం యథా. శంఖుఁడు

బ్రదికియుండిన శుభములు బడయవచ్చు. భార.

'శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్' కాళిదాసుఁడు.

ఈ కారణముచేఁ దానై దేహము విడువ రాదు. ధర్మార్జనము కొఱకై జీవింపఁగోరవలయును గాని కామార్థములకై కాదు.

చ. అని యిటు మాటిమాటికి దుఃరంతపుఁజింతలఁ జిక్కి దుఃఖసా
రనిధికి వేల గాన కెదఁ ♦ గ్రమ్మఱ యోజనసేయు, ధారిణీ
తనయ యెటైన నౌత, మఱి ♦ దానవనాథునిఁ బట్టి త్రుంతునా?
దనుజాని నుష్కృతంబునకుఁ♦దద్దయు నయ్యది పాచితం బగున్. ౩౮౯

అర్థములు. దురంతపు=అంతములేని, వేల=చెలియలికట్ట, పాచితంబు=ప్రాయశ్చిత్తము.

తాత్పర్యము

అని యీప్రకారము పలుమా రాలోచించి యంతములేని చింతలకు లోనై దుఃఖసముద్రమునకుఁ దీరము గనలేక బ్రతికి నే నేమి చేయవలయును అని మరల నాలోచించి సీత బ్రదుకనీ చావనీ-ఇందుండనీ-లేక పోనీ-ఆమె యెటైనఁగానీ ముందు రావణాసురునిఁ బట్టుకొని చావఁ దన్నుదునా? ఏలన వాఁడు చేసిన పాప కార్యమునకు నదియే ప్రాయశ్చిత్తము.

క. రావణుని నీడ్చికొనుచుం, బోవుదునా జలధిమీఁద • భూపతికడకున్
వేవేగమ పశుపతికై, వావిరిఁ గొనిపోవు పశువు•వడువున బలిమిన్. ౩౯౦

అర్థములు. పశుపతి=అగ్నిహోత్రుఁడు, "ఇమం పశుం పశుపతే తే అద్య బధ్నా మ్యగ్నే" ఇది శ్రుతి. పశువు=మేక.

తాత్పర్యము

రావణునిఁ జంపిన రాఁ గల లాభ మేమి? రామచంద్రమూర్తి తాను జంపెద ననెనే. అట్టివాని నేనెట్లు చంపుదును. కావున నది సరియైన యాలోచనకాదు. యజ్ఞము చేయునపు డగ్ని యొద్దకు మేఁకను నీడ్చికొని పోయినట్లు రావణునిఁ బట్టుకొని సముద్రముమీఁద వేసి యీడ్చితీసికొనిపోయి రామచంద్రమూర్తి యెదుటఁ బెట్టెదను. ఆవలఁ జేయవలసిన కార్య మాయనయే చేయుఁ.

ఉ. సారెకుఁ గుందు, వందు, నిట • జానకి గానఁగ రా దిఁ కేదిరా
తీ రగు నంచు నెంచు, సుద•తీమణిఁ గన్గొనుదాఁక నీ పురిన్
వారక చూతుఁగాక యను•బాఢపరాక్రము రాము గృధ్రరా
డ్భారతి నమ్మి యిందుఁ గొని•వచ్చితినా సతిఁ గానకే యెడన్. ౩౯౧

అర్థములు. గృధ్రరాట్+భారతి=గ్రద్ధరాజు సంపాతి వాక్కు.

తాత్పర్యము

పలుమా అధైర్యపడి విచారించును. వ్యసన పడును. ఇచ్చట జానకి కానరాలేదే, ఇఁక నేమి చేయ నగు ననుకొనును. సీత కనఁబడు దాఁక వెదకెద ననుకొనును. సంపాతి మాట నమ్మి రామచంద్రమూర్తిని దోడి తెచ్చితినా యిచ్చట సీత లేక పోయెనా,

క. దారుణ మగు రోషంబున, మారణహోమంబు నేయు•మార్గణవహ్నిన్
వీరకపివారముల రఘు, వీరుఁడు పోవిడుచు నెట్లు•వృథ వంచకులన్. ౩౯౨

అర్థములు. మార్గణ వహ్నిన్=బాణాగ్నియందు.

తాత్పర్యము

భయంకర మగు కోపంబుచే వానర వీరుల నందఱను బాణాగ్ని యందు మారణహోమము చేయును. మోసగించినవారి నటుచేయక రామచంద్రమూర్తి యూరకవిడచునా?

క. నియతాహారుఁడ నగుచును, నియతేంద్రి యవృత్తినిం దె•నివసించెద నా
కయి యేల మడియవలయును, నయగుణులగునృపతివరులు•నగచరవర్యుల్?

అర్థములు. నియతాహారుఁడను=ఆహారనియమము గలవాఁడను, నియతేంద్రియ వృత్తి=ఇంద్రియవ్యాపారముల నియమించిన వాఁడనై, మడియవలయును=చావవలయును.

తాత్పర్యము

ఆహారనియమము, ఇంద్రియవ్యాపార నియమము గలవాఁడనై యిందే యుండెదను. నేను వ్యర్థుఁడనై పోనేల? సుగుణ సంపన్నులగు రామలక్ష్మణులు వానరులు చావనేల?

—॥ హనుమంతుఁ డశోకవనంబును జూచుట ॥--

క. అదిగో మహాద్రుమమాన్విత, మది యొక్క యశోకవాటి॥యం దిందనుకన్
వెదకంగ లేదు సీతను, వెదకెదఁ గాకందు నేల॥ విడువఁగ వలయున్. ౬౪

అర్థములు. మహాద్రుమాన్వితము=పెద్దచెట్లతోఁ గూడినది, అదిగో=దూరమునందుఁ గానవచ్చుచున్నదని భావము.

తాత్పర్యము

ప్రాకారము మీఁద నుండు హనుమంతుఁడు నలువంకలు పాఱఁజూచి యదిగో నచటఁ బెద్దచెట్లుగల యశోకవన మొకటి గానవచ్చుచున్నది. దాని యందు నిందనుక వెదకలేదు. అక్కడఁగూడ వెదకెదను. ఏల విడువవలయును.

క. మ్రొక్కెద వసురుద్రులకును, మ్రొక్కెద నాదిత్యులకును॥ మ్రొగి మరుతులకున్
మ్రొక్కెద నశ్వులకు నేఁ, గ్రక్కించెద సోఁకుకండ॥గరువం బెల్లన్. ౬౫

అర్థములు. సోఁకు=రాక్షసుని యొక్క-కండగరువంబు = బలముగలవాఁడనను గరువము. రాము కార్యమందుఁ దనకుఁ దోడుపడుటకై దేవతలఁ బ్రార్థించుచున్నాఁడు. ఏలన వారును రామకార్యమునందు రామక్షేమమందు నాసక్తిగలవారే.

కం. రాముఁడు సుఖియగుఁ గావుత
రాముఁడు చిరజీవి యగుచు రంజిలు గాతన్
రాముఁడు నిరామయుండగు
రామునకును దేహబలము-గ్రాలెడి నెపుడున్. అయో. ౭౩

కం. అనివేల్పులు గంధర్వులు
జనములుఁ బన్నగులు రాష్ట్ర-జనపదములఁ బ
ట్టనములఁ బరదేశంబుల
మనసీమను గోరుచుంద్రు-మహీపా! సతమున్. ౭౪

ఉ. రాముని మేలు కోరి నగ॥రంబున రాష్ట్రమునందుఁ బక్కణ
గ్రామములందు నిత్యముఁ॥ద్రికాలములందును నెల్ల వేల్పులన్
నేమమునన్ భజింత్రు తరు॥ణీమణులున్ ముదుసళ్ళు స్త్రీలునున్
గ్రామజనాదినాగరులు॥ రామునిఁ దప్ప స్మరింప రెవ్వనిన్. ౭౫

ఏకకార్యాసక్తు లగుటచే నొకరి కొకరు సహాయపడుట యొకరి నొకరు సహాయము కోరుట యుక్తమే కదా!

తా త్ప ర్య ము

వసువులకు, రుద్రులకు, ఆదిత్యులకు, మరుత్తులకు అశ్వులకు నమస్కరించి పోయి రావణుని బలగర్వమును వదలించెదను.

క. మక్కించి రక్కసుల నే, నుక్కున వా రెల్లి నేడ్వ • హా యని సీతన్
మక్కువగల పతిఁ గూర్కెదఁ, జిక్కఁగఁ దపసికి ఫలంబొ • సంగెడురీతిన్. ౫౭

అర్థములు. మక్కించి=బాధపెట్టి, ఉక్కున=పరాక్రమముచే, ఎల్లి=రేపు.

తా త్ప ర్య ము

రక్కసుల నందఱను నా పరాక్రమముచే బాధించి వారందఱు హా యని యేడ్చుచుండ సీతాదేవిని నామె ప్రేమగల భర్తతోఁ దపసికి ఫలము నర్పించి నట్లు కూర్చెదను.

ఈ యుపమానము కార్యసాఫల్యమును సూచించుచున్నది.

క. అని చింతాసందానిత, మనమున నొండొకముహూ ర్త • మాత్రము నాలో
చన యొనరించి యుత్సాహం,బున లేచి మరు త్తనూభ • వుం డిటు పల్కున్.

అర్థములు. చింతాసందానితమనమునన్ = ఆలోచనలతోఁగూడిన మనస్సుతో.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చింతచేఁ గుందిన మనస్సుతోఁ గొంచెముకాల మాలోచించి యీ వనమున సీత యుండును, దప్పదు, అని నిశ్చయించుకొని యుత్సాహవంతుఁడై లేచి.

ఉ. మ్రొక్కెద రామచంద్రునకు • మోడ్చెదఁ గేలు సుమిత్ర పట్టికిన్
మ్రొక్కెదఁ దద్విదేహపత • నూజకు శ్రీరఘురాముదేవికిన్
మ్రొక్కెద ధర్మవాసవమ • రుద్గణ మారుత రుద్రపాళికిన్
మ్రొక్కెద సూర్యచంద్రులకు • మ్రొక్కెదఁ దామరనా ప్తసూతికిన్. ౫౮

అర్థములు. విదేహప=విదేహ రాజ్యపతియొక్క, తనూజకు=సీతాదేవికి.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తికి నమస్కారము. లక్ష్మణస్వామికి నమస్కారము. విదేహ రాజపుత్రికయు శ్రీరామచంద్రమూర్తి ధర్మపత్ని యగు సీతాదేవికి నమస్కారము. ధర్మరాజునకు ఇంద్రునకు మరుత్తులకు వాయువునకు రుద్రులకు సూర్యచంద్రులకు సుగ్రీవునకు నమస్కరించెదను. హనుమంతుఁడు లంకను జయించుట, యోగి దేహమును జయించుట యని ముందు చెప్పఁబడెను. దేహము వశీకృతఁగానే యాత్మావలోకనము లభింపదు. లంక యందు హనుమంతుఁడు విసుగు వేసట లేక 'అన్వేషితవ్యమ్' అని యుపనిషత్తులు చెప్పినట్లు శోధించి యన్నిఁటిని బరిహరింపవలెను. ఇట్లు శోధించుట

యందు కొన్ని స్థలములందు శోధించు సమయంబున ఆత్మజ్యోతివంటి తేజస్సు గాన వచ్చును. మందోదరిని జూచి సీత యనుకొన్నట్లు ఆ తేజస్సే యాత్మయని భ్రమింపరాదు. సకారణముగ దానిని బరిహరింపవలయును. ఇట్లు మిక్కిలి హెచ్చరికతో నిష్కాముఁడై జితేంద్రియుఁడై వెదకవలయును. ఇట్లు వెదకుట యందు స్వప్రయత్న సాధ్య మను భావ ముండువఱకు ఆత్మదర్శనము లభింపదు. కావునఁ గార్యసిద్ధికై సీతారామలక్ష్మణులకుఁ దొలుత నమస్కరించి భారము వారిపై వైచి దేహాధిష్ఠిత దేవతలకు మ్రొక్కి కార్య మారంభింపవలెను. దేవతలకు నమస్కరించుట న్యాయమే, సుగ్రీవున కేల నమస్కార మనిన సుగ్రీవు నాశ్రయము కలుగుటచేఁగదా హనుమంతునకు సీతాదర్శనము రామచంద్రమూర్తి దర్శనము లభించెను. కావున నెవరి యాశ్రయమువలనఁ బ్రత్యగాత్మ దర్శనము పరమాత్మ దర్శనము లభించెనో యట్టివారికిఁ గృతజ్ఞుఁడై నమస్కరింపవలెను. కావున ముముక్షువు లగు నే యోగుల కయినను బోధకులు వందనీయులే యగుదురు. సంపాతి రావణు నంతఃపురంబున సీతాదేవియున్నది యని చెప్పెను. హనుమంతుఁ డామాట యందు శ్రద్ధగలవాఁడై సీతను వెదకినట్లు సాధకుఁడు గురువాక్యము నందు శ్రద్ధగలవాఁడై దేహమునం దాత్మాన్వేషణము చేయవలయును. కానరాకుండుట ప్రయత్నలోపమేకాని యాత్మలేమిని గాదు. కానఁ గానవచ్చువరకు వెదకవలయును. నిరుత్సాహపడరాదు. సం+పాతి= చక్కఁగాఁ బాలించువాఁడు, గురు వని యర్థము.

చ. అని ప్రణతుల్ ఘటించి దిశ ♦ లన్నియుఁ జూచి యశోకకాననం
బునఁ దనదృష్టి నిల్పి చనఁ బూని మతిన్ మది నెంచు నీగతిన్
వనచరలోకనాథుఁడు ధ్రు♦వంబు నిశాచరకోటిరక్షితం
బును బరిసంస్కృతంబుఁ బరు♦భూరుచిరంబు నశోకవాటికన్. ౩౯౯

అర్థములు. ప్రణతుల్=నమస్కారములు.

## తాత్పర్యము

ఈ ప్రకార మందఱకు నమస్కరించి దిక్కులన్నియుఁ బాఱఁజూచి యశోకవనమునందుఁ దనదృష్టి నిల్పి హనుమ యిట్లనుకొనెను. ఈ వనమందు సీత యుండుట నిశ్చయము ఏలన—అనేకులు రాక్షసులు దీనిని గాపాడుచున్నారు. మిగుల సంస్కరింపఁబడి చక్కఁజేయఁబడి యున్నది. పరిశుద్ధముగా నుంచఁబడి యున్నది. నే నిదివఱకుఁ జూచిన వనములకంటె నిది మిగుల మనోహరమై యున్నది. ఈ యశోక వనమును.

ఉ. కావలివారు వృక్షములఁ ♦ గాచుచు మిక్కిలి యున్నవార, లం
దా విభుఁ డైన మారుతుఁడు ♦ సల్లన వీచుచు నున్నవాఁడు, సీ
తావిభు నర్థ మై తనువు ♦ దానవనేత కగోచరంబుగా
వావిరి సంగ్రహించి రఘు♦వల్లభు వల్లభ నందు రోసెదన్. ౪౦౦

తాత్పర్యము

కావలివారు విశేషముగఁ జెట్లను రక్షించుచున్నారు. ఆ వనమందు సర్వ వ్యాపియైన వాయుదేవుఁడు మెల్లగా వీఁచుచున్నాఁడు. కావున నిందు సీత తప్పక యుండును. రావణునకుఁ గాన రాకుండు నట్లు దేహ మింతకంటె సంగ్రహపఱిచి సీతాదేవిని వెదకెదను.

చ. మునులును వేల్పులున్ దివిజ•ముఖ్యుఁడు వజ్రి స్వభుండు బ్రహ్మవా
 య్వనలశశిప్రభాకరజ•లాధిపశర్వమరుత్తులశ్వులున్
 గనులకుఁ దోఁచువారు మఱి•కానివారును సర్వభూతముల్
 ఘనతరభూతనాయకుఁడుఁ • గార్యము సిద్ధి యొనర్తు రియ్యెడన్. ౧౮౦

అర్థములు అనల=అగ్ని, ప్రభాకర=సూర్యుఁడు, జలాధిప=వరుణుఁడు, శర్వ=రుద్రుఁడు, ఘనతరభూతనాయకుఁడు = వీరి కందఱికంటె మిగుల గొప్ప వాఁడును, వీరికందఱకు నాయకుఁడు నైన పరాత్పరుఁడు, భగవంతుఁడు, పరిశేష న్యాయముచే విష్ణువు.

తాత్పర్యము

మునులును, సామాన్యదేవతలు, వారిలో ముఖ్యుఁడు వజ్రధరుఁడైన యింద్రుఁడు స్వయంభు వగు బ్రహ్మ, వాయువు, అగ్ని, చంద్రుఁడు, సూర్యుఁడు, వరుణుఁడు, రుద్రుఁడు, మరుత్తులు, అశ్వులు, కన్నులకుఁ గానవచ్చువారు, కానరానివారు సమస్త భూతములు, వీరి కందఱకు నాయకుఁడగు పరాత్పరుఁడు భగవంతుఁడు కార్యము ఫలింపజేయుదురు గాక. తోఁచువారు కానరానివారు అన్న చోట, "యచ్చ కించిత్ జగత్సర్వం దృశ్యతే శ్రూయతేపి వా। అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అను శ్రుతి యనుసంధించునది. శర్వ శబ్దము ముందు చెప్పఁబడియుండుటచే నిచట భూతనాయకశబ్దము రుద్రపర్యాయము గాదు.

సీ. ఎప్పుడు చూతునో•యే నున్నసంబును, బాండురదంత మ•వ్రణము నగుచు
 మందహాసాంకూర•సుందరం బయి పద్మ, దళలోచనంబులఁ•జెలువు గాంచి
 నిర్మల తారేశ • నిభదర్శనం బగు, పద్మహా దేవి యా•స్యమ్ము నేను
 వగతిఁగందునో•హీనుండ ఛుద్రుండఁ,బరమ పాపియుఁ గ్రౌర్య•పరుఁడుదులువ
తే. దారుణుండయ్యునుసువేష•ధారియయిన,యసురపతి చేబలాత్కృతి•నపహరింప
 బడిన సాధ్విఁ దపస్విని • బడమిహూఁతు, రామదేవుని దేవి స•తీమతల్లి. ౧౮౧

అర్థములు. ఉన్నసము=ఉన్నత నాసిక గలది. ఉన్నసము బహువ్రీహి సమాసము. ఉన్నత నాసిక కలది యేదో యది ఉన్నసము. అజ్ నాసికాయాః సంజ్ఞాయాంనసం చాస్థూలాత్. ఉపసర్గాచ్చ. పాణిని. V. 4.118-119. ఇచ్చట ఉత్ ఉపసర్గ కావున నాసిక నస మయ్యెను. పాండుర దంతము=తెల్లని దంతములు గలది, అవ్రణము=ఏ కొఱఁతయు లేనిది, మందహాసాంకూర సుందరము=

చిఱునవ్వు మొలకలచే నందమైనది. పద్మదళలోచనంబులన్=తామర రేకులవంటి కన్నులచే, నిర్మల=మలినములేని, తారేశనిభ=చంద్రునితో సమానముగ, దర్శనము=కానవచ్చునది. ఆస్యమ్ము=ముఖము.

## తాత్పర్యము

సీతామహాదేవియొక్క యున్నతమైన నాసికయు, తెల్లని దంతములును గలిగి యే లోపమును లేక చిఱునవ్వు మొలకలచే నందమై తామరరేకులవంటి కన్నులుగల కళంకము లేని చంద్రుని వంటి ముఖారవిందమును నే నెప్పుడు చూతునో కదా! గుణహీనుఁడు, నీచుఁడు. పరమపాపి, క్రూరుఁడు, తులువ, నిర్దయుఁడయ్యును సాధువగు సన్న్యాసివేషమును ధరించిన రావణుచే బలాత్కారముగ నపహరింపఁబడిన పతివ్రతను, ఖిన్నురాలిని, భూపుత్రిని, శ్రీరామచంద్రమూర్తి దేవిని, స్త్రీలయందుత్తమురాలిని నేనెట్లు చూతునో కదా.

## —♦ ౧౪-వ సర్గము. హనుమంతుఁ డశోకవనంబునఁ బ్రవేశించుట ♦—

క. అని యీగతి మనమునఁ బా,వని యించుకసేపు లోన♦నరుచు నాలో
చన మొనరించిఁ యా ప్రమదా,వని ప్రాకారమున కంత♦నలనుగ దాఁటెన్.

## తాత్పర్యము

ఈవిధముగ నాంజనేయుఁడు తన మనస్సులోఁ గొంతసేపు వగచి యాలోచించి యా యుద్యానముయొక్క ప్రాకారము మీఁదికి దాఁటెను.

సీ. ప్రాకారమున నిల్చి♦పావని సంహృష్ట, సర్వాంగుఁ డగుచును♦సంతసమునఁ
జూడ వసంతాది♦సురుచిరవికసిత, శాఖలైనట్టి భూ♦జములతోడ
సాల తమాల త♦క్కోల హింతాల కో,ద్దాల కాశోకర♦సాల చంప
క కపిముఖానేక♦కమనీయతరలతా,భవ్యాగయుతివృక్ష♦వాటిఁ గాంచి
తే. యల్లె విడిచిన బాణంబు♦ననుకరించి, చివ్వనను దాఁటి యచటికిఁ♦జేరఁబోయి
చారునీడజనిస్వనో♦దార మగుచుఁ, గనకరాజతపాదపా♦క్రాంత మగుచు.౪౭౪

అర్థములు. సంహృష్ట సర్వాంగుఁడు=గగ్గురు పొడిచిన యన్ని యవయవములు గలవాఁడు, వసంతాది=వసంతారంభమున, కొందఱు పున్నమ మొదలు నెల గణింతురు. కావున వసంతకాలము ఫాల్గున శుద్ధ పూర్ణిమతోనే ప్రారంభము దీనికిఁ బ్రపూర్వ దిన మని గోవింద రాజీయమునఁ గలదు. పున్నమకుఁ బూర్వ దినము చతుర్దశి. ప్రపూర్వదినము త్రయోదశి కావున నీ దినము త్రయోదశి యని నిశ్చయము.

సురుచిర=అందముగా, వికసిత=వికసించిన, శాఖలై = కొమ్మలుగలవై, సాల=మద్ది, తమాల = చీఁకటిమ్రాఁకులు, హింతాల=గిలక తాటిచెట్లు, ఉద్దాలక = విరిగి మ్రాను, రసాల=తియ్యమామిడి, చంపక = సంపెఁగ, కపిముఖ=క్రోఁతిమూఁతి గల కాయలు గాచు చెట్లు, అనేక = నానావిధములైన, కమనీయతర=మిగుల నందమైన, లతా=తీఁగలచే, భవ్య=శుభమైన, అగ=

చెట్లచే, యుత=కూడిన, వృక్షవాటిన్=తోఁటను, చారు=అందమైన, నీడజ=పక్షులయొక్క, నిస్స్వనోదారము=గొప్పధ్వనులు గలది. కనక రాజత పాదప+ఆక్రాంతము=బంగారు వెండి చాయ గల చెట్లచే నిండినది.

తాత్పర్యము

ఆయశోకవనముయొక్క ప్రాకారమందు నిలఁబడి యాంజనేయుఁడు దేహమంతయు సంతోషముచేఁ బులకరింపఁగా పాఱఁజూడఁగా వసంతము మొదట పూలచే వికసించు కొమ్మలుగల చెట్లతోడను, మద్దులు, చీకటి మ్రాఁకులు, తక్కోలములు, గిఱకత్రాటిచెట్లు, విరిగిమ్రాఁకులు, అశోకములు, తియ్యమామిడి చెట్లు, సంపెఁగలు, క్రోఁతిమూఁతి కాయలు కాచుచెట్లు, అనేకము లయినమిగుల నందమయిన చెట్లతోఁగూడిన తోఁటనుజూచి యల్లెత్రాడు విడిచిన బాణమువలె సూటిగ వేగముగ నచ్చటికిఁ జివ్వున దాఁటి పోయి పక్షుల కలకల ధ్వనులతోను, బంగారు వెండి చెట్లతోను నిండినదై.

సీ. వింతవింతలు గొల్పు♦విహగమృగంబులఁ, దవు రయి యుదయభా♦స్కరనిభంబు
 నగచుఁ జిగుళ్ళు లే♦యాకులు పూవులు పూపలు పిందెలు♦పొలుపు మీఱు
 పసరుగాయలు దోర♦పండులు పండులు, గల పెక్కు తెగలవృ♦క్షముల వెలసి
 కోకిల హిందోళ ♦ కేకిరవంబుల, నానాశకుంతసం♦తానకలన
తే. నవ్యమైన యశోకవ♦నంబునందు,
 ధారిణీసుత వెదకుచో ♦ మారుతాత్మ
 జుండు సుఖసుప్తములను బ♦క్షులను మేలు
 కొలుప నవి యెల్ల గలకల ♦ కూయఁ దొడఁగె. ౪౦౫

అర్థములు. విహగమృగంబులన్=పక్షులచే, మృగములచే, ఉదయభాస్కరనిభంబు=ప్రాతఃకాల సూర్యునితో సమానము, హిందోళ=తుమ్మెదలు, 'బంభరశ్చ మిళింద శ్చ హిందోళ భసలౌ సమౌ' అని నిఘంటువు. సుఖసుప్తములు=సుఖముగా నిద్రించునవి.

తాత్పర్యము

క్రొత్త క్రొత్త యాశ్చర్యములు గలిగించు పక్షులచే, మృగములచేనందమై, ప్రాతఃకాల సూర్యునిఁబోలి చిగుళ్లు, లేఁతయాకులు, పూవులు, లేఁతపిందెలు, పసరువిడిచినపిందెలు. పసరుగాయలు, దోరపండులు, పండులు, గల బహువిధ వృక్షములు గలిగి కోకిలలు, తుమ్మెదలు, నెమిళ్లు-వీని ధ్వనులచేతను అనేకవిధములైన పక్షిజాతులచేతను మనోహరమైన యశోకవనముఁ జూచి యందు సీతను వెదకుచు నాంజనేయుఁడు నిద్రపోవు పక్షులను మేలుకొలుపఁగా నవి కలకల కూయ నారంభించెను.

పక్షులను నిద్రలేపె ననుటచే హనుమంతుఁడు చెట్టునుండి. చెట్టునకు దాఁటుచు జెట్లమీఁదనే సంచరించెనని యేర్పడుచున్నది. వలన-కొండలు రాక్షసులు తోఁట

కావలి కాచుచున్నట్లు ముందు చెప్పఁబడెను. సీతాదేవి యుండెనా, యామె మేలు కని యుండునే కాని నిద్రించుచుండదు. ఆమె నిమిత్తమై మఱి కొందఱు కావలి కత్తెలు మేలుకని యుందురు. తాను నేల నడిచిపోయిన నెవరో వచ్చిరని వారు గుర్తించి కలవరపడుదురు. ఆ నిమిత్తముగఁ జెట్లమీఁదనే సంచరించెను. ఆకారణ ముచేఁ బక్షులు నిద్ర లేచుట సంభవించెను. నేల నడిచిపోయిన నవి మేలుకొను టకుఁ గాని, యెగిరి పోవుటకుఁగాని కారణ ముండదు.

సీ. నింగికి నెగురు ప•తంగకోటుల యెఱకల తాఁకునను జల•జల మటంచు
రాలఁ బూవులు వాని•రాసుల నడుమను, బుష్పమయాద్రినాఁ•బోలి చెఁగపియు
దిక్కు దిక్కుల నున్న•యక్కుజంబుల కేగు,కపి వసంతుని గాఁగఁ•గనియె భూత
తతులు భూమీరుహా•పతిత పుష్పాకీర్ణ,వసుధ,భూషితయోష•పగిది వెలిఁగె
తే. గంధవహసుతగమనవే•గప్రకంపి, తావనీరుహపాళి వా•తాత్మజాతు
మీఁద వర్షించెఁబుష్పముల్•మేలిమిగను,బుష్పపర్ణఫలావళుల్•పొనుఁగుపడియె.

అర్థములు. నింగికిన్=ఆకాశమునకు, పతంగ=పక్షులయొక్క, ఎఱకల= ఱెక్కలయొక్క, పుష్పమయాద్రి=పూలకొండ, భూమీరుహపతిత = చెట్లనుండి రాలిన,పుష్ప=పూలచే, ఆకీర్ణ=వ్యాపింపఁబడిన, వసుధ=భూమి, భూషితయోష= అలంకరించుకొన్న స్త్రీ, గంధవహసుత=వాయుపుత్రునియొక్క వేగ=వేగముచే, ప్రకంపిత=మిగులఁ గదలింపఁబడిన, అవనీరుహపాళి=చెట్ల సమూహము, వతాత్మ జాతు మీఁదన్=వాయుపుత్రుని మీఁద, పొనుఁగు పడియె=రాలిపోయెను.

## తాత్పర్యము

హనుమంతుఁ డొక చెట్టునుండి మఱియొక చెట్టునకు దాఁటునపుడు కొమ్మలు కదలఁగా నందు నిద్రించు పక్షులు లేచి కలకల కూయుచు నాకాశమునకు నెగు రఁగా వాని ఱెక్కల తాఁకున పూవులు జలజల రాలఁగా వాని నడుమ నున్న హనుమంతుఁడు పూలకొండవలె నుండెను. మఱియు నన్ని ప్రక్కల నుండు చెట్లకై యొక్కొక్క చెట్టునకై పోవు హనుమంతుఁడు వసంతునివలె భూతకోటు లకుఁ గానవచ్చెను. చెట్లనుండి రాలినపూలచే నిండిన భూమి యలంకరించుకొన్న స్త్రీవలె నుండెను. వాయుపుత్రుని వేగముచేఁ గదలిన చెట్లు హనుమంతునిమీఁదఁ బుష్పవర్షము గురిపించెను. పూలు, పండ్లు, నాకులు రాలిపోయెను. పుష్పవృష్టి అలంకృత స్త్రీ దర్శనము లొనైనవి శుభ శకునములు.

క. రాలిన యాకులతో నిలఁ, దూలిన పూవులను బండ్ల•తుటుములతోఁ బై
చేలలు పొమ్ములు నోడిన, యాలరిజూదరియుఁ బోలె•నమరె నగంబుల్. ౮౦౭

అర్థములు. తుటుములు=సమూహములు, చేలలు=వస్త్రములు ఆలరి= దుష్టుఁడు, ఈ యాలరి శబ్దమే కాఁబోలు నిప్పు డల్లరి యయ్యెను. నగంబుల్= చెట్లు.

తాత్పర్యము

రాలిన యాకులతోఁ, నేలరాలిన పూవులతోఁ, బండ్లతోఁ జెట్లు చూచుటకు పైగుడ్డలు సొమ్ములు నోడిన చెడు జూదరివలె నుండెను.

ఆ. శకునినికర మేది • స్కంధమాత్రాశ్రయ, ద్రుపు లసేవ్యము లయి • తోఁచెనపుడు
సకలమిత్రబంధు • సంపరిత్యక్తమా, నవుల పగిది నింపు • మివుల లేక ౪౦౭

అర్థములు. శకుని నికరము=పక్షిసమూహము, ఏది=లేకుండుటచే, స్కంధ మాత్రాశ్రయద్రుపులు=బోదెలు మాత్రము మిగిలిన చెట్లు, ద్రు=చెట్టు, తెనుఁగున=ద్రుపులు.

తాత్పర్యము

పక్షులన్నియు నెగిరిపోయి బోదెలు మాత్రము మిగిలినచెట్లు బంధువు లందఱు వదలిపెట్టి పోఁగా మిగిలిన మానవునివలె సేవింపరానివై యుండెను.

చ. విరిసిన కేశపాశముల • వీడిన కుంకుమపత్ర రేఖలన్
ఖరనఖరాంకురక్షతయు • గాఢరదక్షతి విహ్వాలాత్మయున్
వరపరిపీతశుభ్రరద • వచ్ఛద మా జవరాలిఁ బోలె వా
నరవరవాలహస్త చర • ణంబులఁ దద్వని యప్డు రాట్పడెన్. ౪౦౮

అర్థములు. విరిసిన కేశపాశముల=విరియబోసికొనిన వెండ్రుకలచేతను, వీడిన=వదలిపోయిన, కుంకుమపత్ర రేఖలన్=కుంకుమ రసముతోఁ వ్రాయఁబడిన మకరికా పత్రరేఖలతోను, ఖరనఖరాంకుర=వాఁడి గోళ్ళ మొనలచేనైన, క్షత= గాయములు గలదియు, గాఢ రదక్షతి=గొప్ప దంతక్షతముచే, విహ్వాలాత్మ యున్=విరివిరఁబోయిన మనస్సు గలదియు, వర=వరునిచే, పరిపీత=చక్కఁగా ముద్దిడఁబడినది, గనుక నే, శుభ్ర=తెల్లనైన, రదచ్ఛద=పెదవులు గలదియు, జవరాలు=వయసు స్త్రీ, జవ్వని+ఆలు=జవరాలు, జవ్వని శబ్దమునకు ఆలు శబ్దము పరమైనపుడు జవ ఆదేశ మని యొఱుంగునది. 'ఏకాంతమునందునున్న జవరాండ్ర నెపం బిడి' యని మనుచరిత్ర. కర్మధారయ సమాసము గావున 'ఆలు' శబ్దము పరం బవునపుడు రుగాగమంబగు. సు.వ్యా. సంధి ౫౭. వానరవర=వానరశ్రేష్ఠుని యొక్క, వాల హస్తచరణంబులన్=తోఁకచేతను, చేతులచేతను, కాళ్ళచేతను, ఆ వని=తోఁట, రాట్పడెన్=ఉపద్రవ పడెను.

ఇది రతాంత స్త్రీ వర్ణన మని కొందఱ అభిప్రాయ పడిరి. కాని యిదిలంకకు, అశోకవనమునకు రాఁబోవు దుస్థితి సూచించు చున్న దని తోఁచుచున్నది. తల విరియఁబోఁతలు, కుంకుమ పత్రభంగములు తెల్లని పెదవులు దంతనఖాయుధు లగు వానరులచేఁ గలుగు బాధలు, విహ్వాలత్వము, ఇవి వన భంగము, లంకా వైధ వ్యము సూచించెడి ననుట సమయోచితము. అస్థానవర్ణనము వాల్మీకి చేయఁడు.

—♦ హనుమంతుఁ డశోకవనంబున విహరించుట ♦—

క. వింజము శిఖరంబుల వృష్టిం జెలఁగెడి యాగడపలఁ♦జెదరంగ ననిలుం
డుం జిమ్మిన వడుపునఁ గపి, కుంజరుఁడును జెదరఁదీఁగ♦గుంపులఁ జిమ్మెన్.

అర్థములు. వింజము=వింధ్యపర్వతము, వృష్టిన్=వానచే, ఆగడపలన్=మేఘముల గుంపులచే.

తాత్పర్యము

వింధ్యపర్వత శిఖరంబు లందు వాన గురిసెడి దట్టపు మబ్బులను వాయువు చెదరఁ జిమ్మునట్లు హనుమంతుఁడు తీఁగ గుంపులను జిమ్మెను.

సీ. అయ్యెడ మగరాల♦నమరైన భూముల, వెండియుఁ బైఁడియు♦వెలయు స్థలుల
మంచినీళ్ళల నింపు♦మించిన బావుల, మణిమయసోపాన♦మండలముల
మౌక్తికవిద్రుమ♦మంజులసికతాసు,కూలముల్ స్ఫాటిక♦కుట్టిమములఁ
దీరజకనకమ♦హీరుహాన్వితములఁ, బద్మినీకుముదినీ♦భాసురములఁ

తే. జక్రచక్రాంగ నత్యూహ♦సారసాళి
కూజితంబుల వాహినీ♦రాజితముల
నమృతనిభతోయములఁ గుసు♦మావృతవ్ర
తతుల నగు నూతులను గనెఁ ♦ దరుచరుండు. ౩౧

అర్థములు. మగరాలన్=వజ్రములచే, సికతాసుకూలముల్=ఇసుక గట్టులు, తీరజ=ఒడ్డునందుఁ బుట్టిన, కనక మహీరుహ=బంగారు వన్నెగల చెట్లచే, అన్విత ములన్=కూడినవానిని, పద్మినీ=తామర తీఁగలచే, కుముదినీ=కలువ తీఁగలచే, భాసురములన్=ప్రకాశించు వానిని, చక్ర=చక్రవాకములయొక్కయు, చక్రాంగ=హంసలయొక్కయు, నత్యూహ='నత్యూహో జలరంకు స్స్యాత్,' నీటి యిఱ్ఱుల యొక్కయు, సారస=బెగ్గురులయొక్కయు, ఆళి=పంక్తులయొక్క, కూజితంబులన్=ధ్వనులచేతను, వాహినీ=ఏళ్ళచే, రాజితములన్=ప్రకాశించునవియు, అమృత నిభతోయములన్=అమృతముతో సమానమైన నీళ్ళను, కుసుమావృత=పూలచే నిండిన, వ్రతతులన్=తీఁగలను, అగు=కల, నూతులను=బావులను.

తాత్పర్యము

ఆ చోట వజ్రాలు బంగారు వెండి గల స్థలములను, మంచినీళ్ళబావులను, వాని లోనికి దిగిపోవుటకుఁ గట్టఁబడిన మణిమయములైన మెట్లను, వానికి ముత్తెములచేఁ బగడములచే నేర్పరుపఁబడిన యిసుక యొడ్డులను, వానికిఁబ్రక్కనఁ గూర్చుండుట కయి యేర్పఱుపఁబడిన స్ఫటిక ప్రదేశములను, వానియొడ్డునందుఁబుట్టిన బంగారు వన్నె చెట్లను ఆబావులయందుఁగల తామరతీఁగలను.కలువ తీఁగలను, అందుఁగూయు చున్న హంసలను చక్రవాకములను, నీటియిఱ్ఱులను, బెగ్గురులను, వానిలోనుండి

పాలు నేళ్ళను, వానియందలి యమృత తుల్యమైన నీళ్ళను, చుట్టు వల్లఁబడిన పూల తీఁగలను హనుమంతుఁడు చూచెను.

క. ఆ యారామతోఁటలోపల, వాయుతనూజుండు గాంచె • వరశిఖరవిచి
త్రాయతకూటాగయుతశి,లాయతనం బైన కేళి • కాననిధరమున్. ౪౧-౨

అర్థములు. ఆటతోఁట=కేళీవనము, ఉద్యానవనము; వరశిఖరవిచిత్రమును= ఇంపైనశిఖరములచే నలంకరింపఁబడినది, ఆయతకూట = దీర్ఘములైన యిండ్లు గలదియు, అగయుత=చెట్లుగలదియు, శిలాయతనము=రాతిగృహముగల, కేళికా వని ధరమున్=ఆట మలను-క్రీడాపర్వతమును.

తా త్ప ర్య ము

ఆ యుద్యానవనము నందు నింపైన శిఖరములు గదులు, చెట్లుగల రాతి యిల్లు గల క్రీడాపర్వతమును హనుమంతుఁడు చూచెను.

సీ. ఆ నగాగ్రమునుండి • యవనికి నరుదెంచు, సెలయేటిచొప్పుఁ గాం • చిననునచట,
బతిమీఁదఁ గినిసి యం • కతలంబు డిగి యేగు, కోపనవైఖరి • కొమరు మీఱ
నందు వ్రేలాడు శా • ఖాగ్రంబు లా క్రుద్ధ, వారించు చుట్టాల • పగిదిఁ దోఁచె
ఝర మప్డు వెనుకకు • మరలెడివహి చూడఁ, గినుక చల్లారఁ గాం • తుని గనంగ

తే. మెల్లఁ గ్రమ్మఱి పోయెడి • మెలఁతఁ బోలె
దానికి నలంతి దవ్వునఁ • దతశకుంత
రాజిరాజితకాసార • మోజఁ గాంచె
మారుతసుతుండు భృశహర్ష • మాణుఁ డగుచు. ౪౧౩

అర్థములు. కినిసి=కోపించి, అంకతలంబు=తొడ, కోపన=కోపము గల స్త్రీ, క్రుద్ధన్=కోపించిన దానిని, ఝరము=ప్రవాహము. వహి=విధము, అలంతి= కొంచెము, తత=విస్తారమైన, శకుంతరాజ=పక్షిసమూహములచేత, రాజిత= ప్రకాశించు, కాసారము=కొలను, హర్షమాణుఁడు=సంతోషించుచున్నవాఁడు.

తా త్ప ర్య ము

ఆ పర్వతము మీఁది నుండి క్రిందికి నొక సెలయేఱు పాఱుచుండెను. అది చూచుటకు మగనిపైఁ గోపించి వాని తొడనుండి దిగిపోవు కోపించిన స్త్రీ వలెఁ దోఁచెను. ఆ నది వ్రేలాడు కొమ్మలచే నడ్డగింపఁబడిన నీళ్ళెదురెక్కిపోవుట చూడఁగా నా నాయిక బంధువులు సమాధాన పెట్టి వారింపఁగా శాంతిపడి మగని యొద్దకుఁ బోవు నట్లుండెను. దాని సమీపమందు విస్తారముగఁ బక్షులు గల కొల నుండెను. దానిని సంతోషముతో హనుమంతుఁడు చూచెను.

క. చిత్రపురతనపుమెట్లు ప,విత్రశిశిరజలము వివిధ • విహగమృగంబుల్
కృత్రిమవనములు గల పలు,కృత్రిమదీర్ఘికలఁ ద్వష్టృ • కృతసౌధములన్. ౪౧౪

అర్థములు. వికిరమృగంబుల్=పక్షులు, మృగములు, కృత్రిమ దీర్ఘికల= కల్పితము లయిన దిగుడు బావులను, త్వష్టృకృత=విశ్వకర్మచేఁ జేయఁబడిన, సౌధములన్=మేడలను.

తాత్పర్యము

రతనపుమెట్లు, నిర్మలమై చల్లనైన నీళ్ళు, నానావిధములైన పక్షులు, మృగములు, కల్పితములైన వనములు గల కల్పితములైన దిగుడు బావులు విశ్వకర్మ నిర్మించిన మేడలు.

క. ఫలపుష్పభరితకుజపా,ళులు గోడుగులు పసిఁడి జగతు♦లున్ సోపానం
బులు గ్రాల నందు వల్లీదళమేదురశింశుపోరు♦తరువు నొకండున్. ౪౧౫

అర్థములు. కుజపాళులు=చెట్ల సమూహములు, జగతులు=అరుఁగులు, వల్లీదళ=తీఁగలచేతను, ఆకులచేతను, మేదుర=దట్టమైన, శింశుపా+ఉరుతరువు= పెద్ద యిరుగుడు చెట్టు.

తాత్పర్యము

ఫలములచేఁ బుష్పములచే నిండిన చెట్లవరుసలు గోడుగులు, బంగారు టరుఁగులు, మెట్లు ప్రకాశింపఁగా నందు హనుమంతుఁ డొక పెద్ద శింశుపావృక్షమును జూచెను.

క. బంగరుటరుఁగు లోలిఁ జెలంగఁగఁ దనచుట్టు కడువి♦లసితము గాఁగన్
బొంగుచుఁ దనలో వానర, పుంగవుఁ డటఁ గాంచె వహ్ని♦బోలు తరువులన్.

తాత్పర్యము

ఆ ప్రదేశమందు బంగారువన్నెగల యరుఁగులు తమ చుట్టునుండఁగ నెఱ్ఱని పూవులు చిగుళ్లుగల అగ్నివంటి చెట్లను హనుమంతుఁడు సంతోషముతోఁ జూచెను.

ఉ. గుంటల మిట్టలన్ సమలఁ ♦ గ్రొందళుకుం గనకంపుఁ జెట్లు మి
న్నంటు వెలుంగుతోడఁ దన♦రారఁ గనుంగొని వీని డాలు మై
నంటుటఁ బైఁడిగుంటి రుచు ♦ లంటిన వేఁడి వెలుంగు నట్లు నే
నుంట లభించెఁగా యనుచు ♦ నూహ యొనర్చెఁ గపీంద్రుఁ డాత్మలోన్. ౪౧౭

అర్థములు. గుంటల మిట్టలన్ సమలన్=దీనికిఁ గ్రియ ౪౧౬ వ పద్యములోని కాంచెను అనునది. క్రొందళుకున్=క్రొత్త+తళుకు= క్రొందళుకు, క్రొత్త కాంతిగల, మిన్నంటు=ఆకాశము దాఁకు, డాలు=కాంతి, మైన్=దేహమునందు, అంటుటన్=తగులుటచే, పైఁడిగుంటి=బంగారు కొండ, రుచులు=కాంతులు, వేఁడి వెలుంగు=సూర్యుఁడు.

తాత్పర్యము

క్రొత్తమెఱుఁగు గల బంగారు చెట్లు ఆకాశము తగులు కాంతులతో నుండుట

చూచి వీని కాంతులు నాపైఁబడుటచే నేను బంగారు కొండ కాంతులు పడిన సూర్యునివలె నుండుట లభించెఁగదా యని హనుమ తలంచెను.

క. అచ్చెరుపడెఁ దనచుట్టును, నచ్చపుటపరంజిచాయ♦నమరు కుజంబుల్
హెచ్చఁగ బంగరుగజ్జెలు, నిచ్చ మొరయు శింశుపావ♦నీరుహవరమున్. ౪౧౮

## తాత్పర్యము

తనచుట్టు బంగారు చాయ గల చెట్లు చుట్టుకొనఁగా బంగారు గజ్జెలు ధ్వనించు శింశుపావృక్షమును జూచి హనుమంతుఁ డాశ్చర్య పడెను.

సీ. సురుచిర కోమలాం♦కురపల్లవంబుల, నవ్యమౌ శింశుపా♦నగము నెక్కి-
యిచ్చట నుండి నే ♦ వీక్షింతుఁగాక శ్రీ,రామదర్శనలోల ♦ రమ్యశీల
నిట నట నలమట ♦ నటమట గొను బాల, జనకేశ్వరునిపుత్రి ♦ చారుగాత్రి
ధూర్త రావణు వని ♦ తోరంపుఁజందన, చంపకవకుళవృ♦క్షములచేత

తే. సొంపు నింపెడి పక్షుల ♦ గుంపుచేతఁ
గ్రమతర మైన వరతటా♦కములచేత
నింపు నిండారఁ గూర్చెడి ♦ హృదయమునకు
త్వన్మతనూభవ యిందు రా♦గలను నిజము. ౪౧౯

అర్థములు. అంకుర=మొలకలెత్తు, పల్లవంబులన్=చిగుళ్ళచేతను. అలమటన్=చింతచే, అటమట=దుఃఖము, ధూర్తరావణు వని=దుష్టుఁడగు రావణునుద్యానము, ధూర్తశబ్దము వృద్ధాదులలోఁ జేరినది. కావున డుక్ విభాషనగు. సు. వ్యా. తత్సమ. ౨౦ సూ.

## తాత్పర్యము

మిగుల మనోహరములు, మృదువులునై, మొలకలెత్తు చిగుళ్ళచేతను మనోహరమైన శింశుపావృక్షము నెక్కి యిచ్చటనుండి శ్రీరాముని జూడఁ గోరిక గలదియు మంచి స్వభావము గలదియు, చింతచే దుఃఖించు నదియు జనకరాజు కూఁతురు మనోహర మగు దేహము గలదియు నగు సీతాదేవిని నేను జూతును గాక. ఏలన:— ధూర్తుఁడైన రావణుని యీ యశోకవనము చందనవృక్షముల చేతను సంపెంగ పొగడ వృక్షములచేతను, మనోహరముగఁ గూయు పక్షుల చేతను, అందమైన కొలఁకుల చేతను మిగుల సంతోషము గలిగించుచున్నది. కావున సీత యిచ్చటికి రాఁగలదు. ఇది నిజము.

క. ఆరామ రాముదేవేరి, శ్రీరాముఁడు గూర్చు సాధ్వి ♦ శ్రీరాఘవ చిం
తారత మృగలోచన కాం,తారవిహారచణ యిటకుఁ♦దప్పక వచ్చున్. ౪౨౦

### తాత్పర్యము

సీతాదేవి యిచ్చటకు వచ్చుట యేమి నిజమందువా. సుందరియు, రాముని రాణియు, శ్రీరామచంద్రమూర్తి ప్రేమించు పతివ్రతయు, శ్రీరామునే ధ్యానించు నదియు నగు సీత, జింకకన్నులవంటి కన్నులు గలది, వనములయందుఁ దిరుగు నేర్పుగలది, యిచ్చటి కెట్లు రాకుండును?

క. శ్రీరామశోకతప్తయుఁ, జారువిలోచన యరణ్య♦సంచారిణి కాం
తారవిహారాసక్త మ,హీరమణీతనయ సత్య ♦ మిట కరుదెంచున్. ౪-౧

### తాత్పర్యము

శ్రీరామచంద్రుని విడిచి యుండుటచేఁ దపించునది, అందమైన కనులుగలది యడవులందుఁ దిరుగునది, అడవులందు దిరుగు నాసక్తి గలది, భూదేవి కూఁతురు సత్యముగా నిచ్చటికి వచ్చును.

క. మున్నీ యుద్యానంబున, నున్న వనేచరుల సేమ♦ముల్లంబునఁ దా
నెన్నుచు నున్నది సత్యము, సన్నుతరఘురాముదేవి జానకి యిచటన్. ౪-౨

### తాత్పర్యము

తక్కిన యన్నిఁటికంటె ముందుగ సీతాదేవి యీ యుద్యానవనమున సంచరించు మృగాదుల సేమమును దాను విచారించుచున్నది. ఇది నిజము కావున నిచటికి వచ్చును;

క. సంధ్యాకాలంబునఁ దా, సంధ్యావందనముఁ జలుపఁ ♦ జనుదెంచును ని
ర్వ్యంధ్యోదక యీనది కడ,కుం ధ్యాన మొనర్చికొనుచుఁ♦గూర్మిహృదీశున్.

అర్థములు. నిర్వంధ్యోదక=ఎడఁదెగని నీరు గలది. ౪-౩

### తాత్పర్యము

సంధ్యావందన మింటికి వెలుపల చెఱువునందో, గుంటయందో, నదియందో వార్చవలయును గావున సంధ్యవార్చుటకై యెడఁదెగక పాఱు నీ నది యొద్దకుఁ దన భర్తను శ్రీరామచంద్రమూర్తిని స్మరించుకొనుచు రాఁగలదు.

పూర్వయుగములందు స్త్రీలకు సంధ్యావందనము ఉపనయనము గలదు. స్త్రీల యుపనయనము గుఱించి వైద్యనాథీయంబున వర్ణాశ్రమాచారకాండమం దీ వాక్యములు గాన నగు.

'స్త్రీణాం వివాహ ఏవ ఉపనయన మిత్యాహ మనుః'

శ్లో॥ వైవాహికో విధిః స్త్రీణా మౌపనాయనికః స్మృతః

పతిసేవా గురౌ వాసో, గృహార్థోఽగ్ని పరిక్రియా. మను. ౨-౬౭.

వివాహమే స్త్రీల కుపనయనము. పతిసేవయే గురుకులవాసము, గృహ కృత్య నిర్వాహకమే యగ్నిహోత్రము. గనుక వారికి వివాహములే యుపనయ నాదులు. ఇది యిప్పటి కాలమున విధి. కల్పాంతర విషయమున హారీతుఁడు 'ద్వివిధాః స్త్రియో బ్రహ్మవాదిన్య స్సద్యో వధ్వశ్చ। తత్ర బ్రహ్మవాదినీనా ముప నయన మగ్నీంధనం వేదాధ్యయనం స్వగృహే భిక్షాచర్యేతి। సద్యోవధూనాం తూపస్థితే వివాహే కథంచి దుపనయనం కృత్వా వివాహః కార్యఇతి తత్క ల్పాంతరాభిప్రాయం', స్త్రీలు రెండు విధములు, (౧) బ్రహ్మవాదినులు. (౨) సద్యోవధువులు. అందు బ్రహ్మవాదినుల కుపనయనము, అగ్నీంధనము, వేదాధ్య యనము, స్వగృహమందు భిక్షాచర్య- వీరికి వివాహము లేదు. ఇఁక సద్యోవధువు లకు వివాహకాలమం దేదో యొక విధముగ నుపనయనము చేసి యావల వివా హము చేయవలయును. ఇది కల్పాంతర వ్యవస్థ. మంగళసూత్రధారణము స్మార్తము గావున నుపవీతములకు బదులు మంగళ సూత్రము లేర్పడినవి.

యమస్మృతి యం దిట్టులే యున్నది. "పురా కల్పే కుమారీణాం మౌంజీ బంధన మిష్యతే। అధ్యాపనంచ వేదానాం, సావిత్రీవచనం తథా పితా పితృవ్యో భ్రాతావా నైనా మధ్యాపయే త్పరః॥ స్వగృహే చైవ కన్యాయా భైక్షచర్యం విధీయతే, వర్జయే దజినం చీరం జటాధారణ మేవ చ॥

పూర్వకల్పమందుఁ గన్యకలకు మౌంజీబంధనము చెప్పఁబడెను. వేదాధ్య యనము గాయత్రీజపము గలదు, గాని తండ్రి పినతండ్రి, అన్న మాత్రమే యివి చెప్పవచ్చును గాని పరుఁడు చెప్పరాదు. కన్య తన యింటి యందే భిక్ష మెత్త వలయును. కృష్ణాజినము నారచీరలు ధరింపరాదు. జడలు మాత్రము ధరింప వలెను. ఈ కారణమునఁ ద్రేతాయుగ మందలి సీతాదేవికి సంధ్యావందనము గలదు.

క. ఆ యంబకు రఘురాముని, బ్రేయసికిన్ రాజవర్యు ♦ ప్రియ కనురూపం
  బై యమరె సమ్మతం బై, యీ యతులాశోకవనము ♦ హృదయంగమ మై.

తాత్పర్యము

అటువంటి తల్లికి రఘురాముని ప్రియురాలికి రాజవర్యుఁ డగు రామునందుఁ బ్రీతిగలదానికి నీ యసమానమైన యశోకవనము తగి యున్నది. కావున నిందు సీత యుండఁ గలదు.

క. జీవిత యేనియు రాముని, దేవియుఁ దా నిందు నరుగు ♦ దెంచుట నిజ మం
  చీ విధిఁ దలచుచుఁ బావని, యావృక్షంబునను డాఁగి ♦ యటు నిటు గనుచున్.

తాత్పర్యము

సీతాదేవి ప్రాణములతోనే యుండెనా యిచ్చటికి వచ్చుట నిజము, అని యీవిధి నాలోచించుచు. ఆ చెట్టునందు డాఁగి యీప్రక్క నా ప్రక్కఁ జూచెను.

—♦ ౧౫ వ సర్గము. హనుమంతుఁ డశోకవనంబున సీతాదేవిని వెదకుట. ♦—

సీ. సంతానకలతోరు♦సంతానములచేత, రాజిత భూరుహా♦రాజిచేత
దివ్యగంధరసాఢ్య♦భవ్యాకృతులచేత, నందనతుల్య సుం♦దరతచేత
సలలితమృగపక్షి♦కులచయంబులచేతఁ, బ్రాసాదహర్మ్యాగ్ర♦పాళిచేతఁ
గోకిలాలాపన♦కోలాహలముచేతఁ, గనకాంబుజోత్పల♦గణముచేతఁ

తే. బలువిధంబులు మేలికం♦బళులచేత, నతులితవిశాలభూమిగృ♦హాళిచేత
సర్వఋతుపుష్పఫలగభూ♦జములచేత, మీఱెడు నశోకవనిని సా♦మీరి గనియె.

అర్థములు. సంతానకలతా=తీఁగలుగా నున్న కల్పవృక్షములయొక్క, ఉరు సంతానములచేత=గొప్పసమూహముచే, రాజిత=ప్రకాశించు, భూరుహరాజి చేత=చెట్లసమూహముచే, దివ్య=దేవలోక సంబంధమైన, గంధ=సువాసనగల, రస=పండ్లరసముచే, ఆఢ్య=నిండినదియు; భవ్యాకృతులచేతన్=శుభకరములయిన యాకారములచే, నందనతుల్య=ఇంద్రు నుద్యాన వనమగు నందనముతో సమాన మైన, సుందరతచేతన్=అందముచే, సలలిత=అందముగల, మృగపక్షికుల చయం బులచేతన్=మృగములయు, పక్షులయు జాతుల సమూహములచే, ప్రాసాద హర్మ్యాగ్రపాళిచేత=రాజులయు, ధనికులయు, శ్రేష్ఠములయిన యిండ్లచేత, కోకిలాలాపన కోలాహలముల చేత=కోకిలధ్వనుల సందడిచే, కనకాంబుజోత్పల గణముచేతన్=బంగారు కమలములచేత, కలువల సమూహముచేత, సామీరి= హనుమంతుఁడు.

తాత్పర్యము

శింశుపా వృక్షముపై నుండి చూడఁగాఁ గనఁబడిన యశోకవన మున్న విధము చెప్పుచున్నాఁడు.

తీఁగలుగా నున్న కల్పవృక్షములతోను, ప్రకాశించు చెట్లచేతను, దేవలోక సంబంధమైన పరిమళము గల ఫలరసముతోఁగూడి శుభాకారములైన వానితోను నందనవనమువంటి సౌందర్యముతోను అందములైన మృగపక్షిజాతులతోను మంచి మిద్దెలు మేడలతోను, కోకిలల కూఁతల సందడితోను బంగారు కమలముల తోను కలువలతోను నానావిధములైన గొప్పకంబళ్ళతోను అసమానమై విశా లములైన నేలమాళిగల చేతను అన్ని ఋతువులందు పూచు కాచు చెట్లచేతను, నతిశయించు నశోకవనమును హనుమంతుఁడు చూచెను.

క. ఫుల్లాశోకప్రతతులఁ, బెల్లగు నెఱడాలు మించె ♦ వేకువప్రొద్దు
న్నొల్లపుఁగాంతుల నగుచుం, గొల్లగ నెఱమంటఁ జిక్కి♦కొనియె ననంగన్.

అర్థములు. ఫుల్లాశోకప్రతతులన్=వికసించిన యశోకవృక్షసమూహముల చేతను, ఉత్ప్రేక్షాలంకారము.

తాత్పర్యము

వికసించిన యశోకవృక్షముల యధికమైన యెఱ్ఱకాంతి ఉదయవేళ సూర్యుని కాంతులను బోలి పెద్దమంటలోఁ జిక్కుకొన్నదో యన్నట్లుండెను.

ఉ. రాలెడు పూలు సొమ్ములనఁ • గ్రాల శిరంబుల నన్ని యొక్కచో
కాలమునందుఁ బక్షులెఱ • కల్ నెఱవిచ్చికొనం దదీయ ప
క్షాళివిలీనపుష్పదళ • మై ద్రుమపాళి విహీనపత్త్రశా
ఖాళియుతంబు నట్లు గన • నయ్యె మరుత్సుతు కన్నుదోయికిన్. ౭౨౮

తాత్పర్యము

పూవులు పక్షుల శిరంబులం బొక్కసారిగ రాలఁగా నా పక్షులు వానిని బోఁగొట్టుకొన రెక్కలు విప్పగా ఆ ఱెక్కల సందున డాఁగిన పూలు నాకులు గలవై చెట్లు ఆకులుపూలు లేనివానివలె హనుమంతునకుఁ గన్నులకుఁ గాన వచ్చెను.

క. ఆమూలపుష్పనిచితం, బై, మంజులతరంబు నయి వ్య • థాపహ మగుచున్
శ్రీమత్కుసుమభరంబున, భూమని సోకెడు నశోక • భూరుహ శాఖల్. ౭౨౯

అర్థములు. ఆమూల=మొదలువఱకు, అవ్యయీభావసమాసము. పుష్ప నిచితంబై=పూలతో నిండినదై, వ్యథాపహము=వెత పోఁగొట్టునది, శ్రీమత్కుసుమభరంబునన్=శోభకల పూవుల యాధిక్యముచే.

తాత్పర్యము

వేళ్ళవఱకుఁ బూచినవై ఆ కారణముచే మిగుల నందమై ఆ కారణముచే చూచువారి మనస్సులోని సంతాపము పోఁగొట్టునవియై కాంతిగల పూల బరువుచే అశోకవృక్షముల కొమ్మలు నేల తాఁకుచుండెను.

చ. కుసుమితకర్ణికారములుఁ • గ్రొన్ననలం గల కింశుకంబులున్
బసగల సప్తపర్ణములు • బాగగుపొన్నలుఁ జంపకంబులున్
పసి గల శాతకుంభనిభ • చారునగంబులుఁ గొన్ని కొన్ని య
గ్గిసిగలఁ బోలు చెట్టులను • గేసరిసూనుఁడు చూచె నయ్యెడన్. ౭౩౦

అర్థములు. కుసుమిత=పూచిన, ఇది తారకాదిగణములలోఁ జేరినది. 'సంజాతాని కుసుమా న్యేష్వితి కుసుమితాః' అని వ్యుత్పత్తి. ఇతచ్ప్రత్యయాంతము కర్ణికారములు=కొండగోఁగులు, కింశుకములు=మోదుగులు, సప్తపర్ణములు= ఏడాకుల యరఁటిచెట్లు, శాతకుంభనిభ=బంగారుతో సమానమైన, చారునగంబులు=మనోహరములైన చెట్లు, అగ్గిసిగలన్=అగ్నిశిఖలను.

తాత్పర్యము

పూచిన కోఁగులను క్రొత్తపూలుగల మోదుగులను, సారవంతము లయిన మేడాకుల యరఁటులను, పొన్నలను, సంపెఁగలను, బంగారు కాంతిగల చెట్లను, అగ్నిజ్వాలలవలె నెఱ్ఱనైన కొన్ని చెట్టులను నాంజనేయుఁ డంతఁ జూచెను.

సీ. కాటుకడాలునఁ • గ్రాలు చెట్టులు కొన్ని, వేవేలుగ నశోక • వృక్షములును
నవురొప్ప నందన • చైత్రరథంబుల. నతికరించిన కాంతి • నంద మగుచు
వాక్కున కందని • ప్రాప్తరూపం బయి, కుసుమతారావళిఁ • గొమరు గనుట
రెండవయాకాశ • మండలం బనఁ బుష్ప,మణుల నేనవ పెను • మడుఁ గనంగ

తే. సర్వఋతుఫలనిచిత మై • చారుగంధి, పాదపంబులఁ దనరారి • బహుమృగాళి
కలితమగుచును రెండవ • గంధమాద,నాద్రియనఁ బుణ్యగంధ మై • యమరుదాని.

అర్థములు. అతికరించిన=అధఃకరించిన, తక్కువగాఁ జేసిన, ప్రాప్తరూపం బయి=సౌందర్యము గలిగి, 'ప్రాప్తరూప సురూపాభిరూపాః పండిత సౌమ్యయోః' నానా॥ ర॥ కుసుమతారావళి=పూలనెడి నక్షత్రసమూహములు = పుష్పమణులన్=పూలనెడి రత్నములచే, ఏనవ పెనుమడుఁగు=ఐదవ రత్నాకరము, సముద్రము అనునట్లు, సర్వఋతుఫలనిచితమై=అన్నిఋతువుల యందుఁ బండు పండ్లు గలదై, చారుగంధి=కమ్మవాసన గల, పాదపంబులన్=చెట్లచే.

తాత్పర్యము

నల్లని కాంతిగల వేనవేలశోకవృక్షములును, ఇంద్రు నుద్యానమగు నందనము. కుబేరుని యుద్యానమగు చైత్రరథమును మించిన సౌందర్యమును, వాక్కుచే వర్ణింప సాధ్యముగాని సురూపము గలిగి, పూలనెడి నక్షత్రములను గల దగుటచే రెండవ యాకాశమో యనునట్లును పూలనెడి రత్నములచే నిండియుండుటచే నైదవ రత్నాకరమో యనునట్లును నొప్పి, యన్ని ఋతువు లందు ఫలించు ఫలములతో నిండి, సువాసనగల చెట్లు లనేకములును జింకలు లోనగు మృగములు గలదై రెండవ గంధమాదన పర్వతము వలె మంచి వాసనలఁ గలదానిని.

తే. ఆ యశోకవనంబు వా • తాత్మజుండు. చూచి నడుమను గైలాస • శుద్ధమగుచుఁ
బగడపు న్మెట్లు తప్తసు • వర్ణవేది, కలుగు నెలయుఁగ లక్ష్మీప్రకాశ మొనరి.

తాత్పర్యము

అటువంటి యశోకవనమును హనుమంతుఁడు చూచి, దాని నడుమఁ గైలాస పర్వతమువలెఁ దెల్లనై, నిర్మలమై పగడాల మెట్లు, బంగారు టరుఁగులు గలిగి లక్ష్మీదేవివలెఁ బ్రకాశము గలదై.

సీతాదేవి యందుండుటచే లక్ష్మీప్రకాశము చెప్పఁబడెను.

ఈయశోక వనము నేటికి నున్నదని చూచిన వారు వ్రాసిన వాక్యములిది వఱకే యనువదింపఁ బడినవి.

క. మిన్నొరయుచు రమ్యంబై, కన్నులకును మేలి విందు ♦ ఘటియించుచు సం
పన్నస్తంభసహస్రము, చెన్నారెడు నొక్క మేడఁ ♦ జేరువఁ గాంచెన్. ౪౩౩

అర్థములు. మిన్ను + ఒరయుచు=ఆకాశముతో రాచుకొనుచు, స్తంభ సహస్రము=వేయి స్తంభములు.

తాత్పర్యము

ఆకాశమంటుచు రమ్యమై కన్నుల పండుగై వేయి స్తంభములుగల యొక మేడను సమీపమందే చూచెను.

— ♦ హనుమంతుఁడు సీతాదేవిని జూచుట ♦ —

ఉ. మాసిన చీరతోడ, ధృతి ♦ మాలిన చిత్తముతోడ, నింతయేన్
గ్రాసము లేమిఁ జిక్కిన సు ♦ కాయముతోఁ, బయిపై నిగుడ్చు ని
శ్శ్వాసచయంబుతో; గుఱుతు ♦ పట్టఁగరాని స్వరూపకాంతితో,
గాసి నొసంగు రాత్రిచర ♦ కాంతలచేఁ బరివేష్టమాన యై. ౪౩౪

తాత్పర్యము

మాసిన చీరతో, ధైర్యము చెడిన మనస్సుతో, కొంచెమైన నాహారము లేకుండుటచే శుష్కించిన దేహముతో, మీఁద మీఁద వెలువరించు నిట్టూర్పులతో నీమె సీత యని గుర్తింపరాని దేహకాంతితో, బాధపెట్టుచున్న రాక్షసస్త్రీలతోఁ జుట్టఁబడినదై.

ఆహారము కొంచెమైన లేదనుటచేఁ గిష్కింధాకాండమందు ఇంద్రుఁడు పాయస మిచ్చె నను కథ కల్పితము.

ఉ. క్రొన్నెలవోలె నున్న యొక ♦ కోమలగాత్రిని, హోమధూమసం
ఛన్నహుతాశనార్చి గతి ♦ జానఱి యుండెడిదాని, నైజమా
యున్నతిరూప మంచు మది ♦ నెంతో విచారముఁ జేసి కాని లో
నెన్నఁగరాని దానిని, న ♦ హీనతరవ్యథితాత్మ, సుందరిన్. ౪౩౫

అర్థములు. క్రొన్నెల=క్రొత్తచంద్రుఁడు, హోమధూమ = హోమము పొగచే, సంఛన్న=కప్పఁబడిన, హుతాశనార్చిగతిన్ = అగ్నిశిఖవలె, జానఱి= అందముచెడి, నైజము=స్వభావసిద్ధము, అహీనతర=మిగుల నధికమైన, వ్యథితాత్మన్=బాధపడు మనస్సు గలదానిని.

### తాత్పర్యము

క్రొత్తచంద్రుని వలెఁ గోమలమైన దేహముగలదానిని, ఇట్లు చెప్పుటచే నిది మొదలుకొని కాంతి హెచ్చునని భావము. హోమధూమముచేఁ గప్పఁబడిన యగ్ని శిఖవలె నంగము చెడినదానిని, వెలుపలికిఁ దెలియ రాకున్నను లోపల నంతఃకరణము శుద్ధముగా నున్నదని భావము. ఈమెకీ రూపము స్వభావమున వచ్చినదా లేక, కారణాంతరమున వచ్చినదా యని మిక్కిలి యాలోచించిగాని తీర్మానింప రాని దానిని, మిక్కిలి బాధపడుచున్న దానిని, సుందరిని.

ఉ. ధూళిని గ్రుంగియున్న మెయిఁ తోఁ గమలంబులు లేని కొల్కు నా
వ్రీళ నలంకృతిం బోఁ ఁగి ♦ పీతరుచిం గల నొంటిచీరతో
వాలిని దుఃఖభారమున ♦ వాడి తపస్విని యై కుజగ్రహం
బోలిని బట్టుకొన్న చెలు ♦ వ్వాడిన రోహిణి నాఁగ నొప్పుచున్. ౨౩౬

### తాత్పర్యము

పదినెలలుగా స్నానము లేక దుమ్ములో మునిఁగిన దేహముతోఁ గమలములు లేని కొలనువలె సిగ్గుచే నలంకారమును విడిచి పచ్చని యొంటి చీరతో నతిశయించిన దుఃఖాతిశయముచే వాడి శుష్కించి యంగారకుఁడు పట్టుకొనుటచేఁ గాంతిచెడిన రోహిణి వలెనై.

ఓయి! పదినెలలుగా స్నానము లేదంటివే. స్నానము చేయక సంధ్యవారువ రాదుగదా, ఎట్లు చేసెను? ఇది యాపద్ధర్మము. ఆతురవిధి యామెకు నన్వయించును. స్నానముచేసినచో రెండవ చీర లేదాయె. తడిచీరతో సంధ్యవారువరాదాయె. దేహముమీఁదనే చీర యిరుపూఁట నాఱు టెట్లు? సంధ్యవార్చుటెట్లు? కావున మానసిక-మాంత్రికస్నానములు చేసెనని యెఱుఁగ నగు.

సీ. కాలువలై పాఱు ♦ కన్నీళ్లు మొగ మెల్ల, నావరింపఁగాఁ గడు ♦ వడలుదాని
దలపోఁతలకుఁ జిక్కి ♦ తతశోకమున గ్రుక్కి, యెప్పుడు వెకివెక్కి ♦ యేడ్చుదాని
దనవారి మొగములఁ గనలేక రక్కసి, పిండుమోములు చూచి ♦ బెగడుదాని
వేఁటకుక్కలలోన ♦ వేర్పడి చిక్కిన, యాఁడుజింకవలెఁ గ నల్లాడుదాని

తే. నల్లత్రాఁచవలె దిగి జఘనంబు నొరయు, నొంటిజడతో శరత్తునను దయవేళఁ
గాఱుటడవుల నొప్పారు క్ష్మాతలంబుఁ, బోని దానిని నెఱమాపు ♦ మేనిదాని.

### తాత్పర్యము

మొగమెల్ల నావరించునట్లు కాలువలుగాఁ గన్నీళ్ళు కార్చుదానిని, ఆలోచనలకు వశపడి మిక్కిలి దుఃఖమున శోకించి యెప్పుడు వెక్కి వెక్కి యేడ్చుచుండు దానిని, తన బంధువుల ముఖములు చూడఁజాలక రాక్షసస్త్రీ సమూహములు

చూచుచుండు దానిని, ఒంటిగా వేటకుక్కలలోఁ జిక్కిన యాఁడు జింకవలె వల్లాడుదానిని, నల్లని త్రాచుపామువలె వ్రేలాడి నడుము వంటుచున్న యొంటి జడతో శరత్కాలము నుదయంబునఁ గా ఆడవులందలి భూమిని బోలుదానిని, స్నానము లేమిచేఁ బూర్ణముగ మాసిన దేహముగల దానిని.

క. వ్యసన మెఱుంగనిదానిని, వ్యసనంబున మాఁడుదానిఁ ♦ బరమసుఖార్హన్
బస దోఁటిగి ధ్యానపరయై, వసివాడినదాని దీన♦వనజదళాక్షిన్. ౪౩౦

## తాత్పర్యము

ఇంతవరకు వ్యసన మెట్టిదో తెలియని దానిని ఇప్పుడు తీవ్రవ్యసనముచే మాఁడిపోవు చున్నదానిని, మిగుల సుఖమునకు యోగ్యమగు దానిని, పసచెడి చింతలకుఁ జిక్కి మిగుల వాడి దుఃఖించుస్త్రీని,

—♦ హనుమంతుఁడు సీతాదేవిని జూచి తనలో వితర్కించుకొనుట. ♦—

క. కని యీ కృశమలినాంగియె, ఘనుఁ డగు జనకుని తనూజ♦గాఁబోలు నాకో
యని యీ కారణముల నా,హనుమ వితర్కింపఁ దొడఁగె♦స్వాంతమునందున్.

## తాత్పర్యము

హనుమంతుఁడు చూచి యీ యాహారము లేక శుష్కించి పదినెలలుగా స్నానము లేమిని మాసిన దేహము గలది సీతగా నుండునా? యని యీ కారణములచే నాలోచింపసాగెను.

క. ఏ రూపముఁ గల సుందరి, నా రావణుఁ డపహరించి ♦ యరుగుచు నుండన్
వారక కంటిమొ యానాఁ, డా రూపవ యీమెయందు♦నయ్యెంగనఁగన్.

## తాత్పర్యము

ఈమె సీతాదేవియే యని నిశ్చయించుటకుఁ దగినకారణములఁ జెప్పుచున్నాఁడు. మొదటిది ప్రత్యభిజ్ఞ మొదటఁ జూచిన జ్ఞప్తితో మరలఁ జూచి సరిపోల్చుట ప్రత్యభిజ్ఞ.

౧. ఆనాఁడు ఋశ్యమూకమం దుండి మేము రావణుఁ డపహరించుకొని పోవుచున్న సుందరి రూపము చూచితిమి గదా. ఆ రూపమే యీమె యందుఁ గాన వచ్చుచున్నది.

సీ. నిండుఁజందురుఁబోలు♦నెమ్మోముఁ గలదానిఁ, బొలుపులీనెడి కను♦బొమలదాని
లలివృత్త యౌవన♦లక్షణంబుల దాని, నిడుద లౌ నీలంపు♦నెఱులదాని
నిరుల ద్రిమ్మంగెడికాంతి♦నెసఁగుచుండెడిదాని, బింబంబు డంబగు♦పెదవిదాని
సింహమధ్యంబు హా♦సించుమధ్యముదాని, నొప్పఁదీర్చిన పాద♦యుగముదానిఁ

తే. దోయజంబులఁదోలు కన్దోయిదానిఁ, బుష్పబాణుని యలివేణిఁబోలుదానిఁ
నిండు నెలడాలునాఁగను నిఖిలజగతి, కనుపమానేష్ట యగుచును జనెడుదాని.

అర్థములు. యౌవన లక్షణంబులు=స్తనములు. 'లావణ్యేచ స్తనే చ స్యాత్ స్త్రీణాం యౌవన లక్షణం॥ నానా॥ర॥ పుష్పబాణుని యలివేణి=రతీదేవి. నెలడాలు=చంద్రకాంతి, అనుపమాన+ఇష్ట=అనమానమైన ప్రీతిగలది. లోకమున నామె యందు ప్రియము గలవారు లేరని భావము.

తాత్పర్యము

పూర్ణచంద్రుని వంటి ముఖము, అందములైన కనుబొమలు, వట్రువ లగు స్తనములు, నిడుపారు నల్లని తల వెంట్రుకలు, చీకటిని హరించు దేహకాంతి, దొండపండువంటి పెదవులు, సింహము నడుమువంటి సన్నని నడుము, తీర్చినట్లుండు పాదములు, తామరలవంటి కన్నులు గలిగి రతీదేవివలె సుందరమై నిండు చంద్రుని వలె సర్వజనులకు నభీష్టమై యుండుదానిని.

అవివేకు లందును రామచంద్రునిఁ దప్పుపట్టెడువారు గలరుగాని సీతాదేవిని దప్పుపట్టువారు లేరు.

ఉ. తాపసిఁబోనిదాని, వసుధం బడియుండెడిదాని, నూరుపుల్
పై పయిఁ బాఁపలేమ యనఁ బర్వఁగఁజేసెడిదాని, ధూమమా
లాపరితాగ్ని నాఁగ విపులవ్యథ సొంపఱి యుండుదాని, మి
థ్యాపరిభూతకీర్తి నిహతం బగు నాశను బోలు తొయ్యలిన్. ౨౨౭

అర్థములు. తాపసిఁ బోనిదాని=తపస్సు చేయుచుండుదానివలె నుండుదానిని, పాఁపలేమ=ఆఁడు పాము, సమాసంబుల నొప విభక్తికంబుల దీర్ఘపూర్వకద్విత్వ మువర్ణంబులకు ఖండపూర్వబిందుపూర్వకంబుగను లఘుపూర్వక మువర్ణంబునకుఁ గేవలమును పవర్ణం బగు. పాము+లేమ=పాఁపలేమ. వేము+చెట్టు=వేఁపచెట్టు. మొ॥ ధూమమాలా=పొగగుంపుచే, పరితాగ్ని=సర్వత్ర కప్పఁబడిన యగ్ని, మిథ్యాపరిభూతకీర్తి=అసత్యపు టపవాదముచేఁ జెఱుపఁబడిన కీర్తి, తొయ్యలిన్=స్త్రీని. ఇది మొదలు కులకము.

తాత్పర్యము

తపస్సు చేసికొను దానివలె, తివాచీలు చాపలు లేక నేలఁబడి యుండు దానిని, ఆఁడుపాము బుసకొట్టు నట్లు మీఁద మీఁద నిట్టూర్పులు విడుచుదానిని, పొగ గ్రమ్ముటచేఁ దెలియరాని యగ్నివలె విస్తారతాపముచే సొంపుచెడి యుండు దానిని, అసత్యమైన యపకీర్తిచేఁ జెడిన యాశవంటి దానిని, నొకస్త్రీని.

తపస్సుచేసికొను స్త్రీ యనుటచే యను సంపత్తి జితేంద్రియత్వము భోగవిరా

గము, తపశ్శక్తియు, బుసకొట్టు నాఁడు పామనుటచే, కోపించిన పాముచు జెనకు వాఁడెట్లు జీవింపఁడో యట్లామెను జెనకువాఁడు జీవింపఁజాలఁడనియు, ధూమ మాలా పరీతాగ్ని యనుటచే పైన కాంతి కానరాకున్నను మనస్సగ్నివలె పరి శుద్ధమై యున్నదనియు మిథ్యాపవాదముచేఁ జెడిన కీర్తి యనుటచే నీమెయందు నింద యారోపించువా రసత్యవాదు లని సూచన—

ఆ. కుదుటఁ బడని శ్రద్ధ•మదికి సందిగ్ధమౌ, స్మృతియు, క్షీణమైన•సిరియుఁ గలుష
యుక్తమైన బుద్ధి, •యుపహతిఁ గూడిన, కార్యసిద్ధి నాఁగఁ•గ్రాలుదాని. ౪౪౩

అర్థములు. కుదుటఁబడని శ్రద్ధ=స్థిరపడని శాస్త్రవిశ్వాసము, శాస్త్రమందుఁ జెప్పిన యీ పని చేసిన నీ ఫలము గలుగు నను నమ్మకమునకు శ్రద్ధ యని పేరు. అట్టి శ్రద్ధ దృఢముగాఁ గుదురదేని శాస్త్రప్రకారము చేయుదుమా, వలదా; ఫలము వచ్చునో, రాదో యనుకొనుట. హనుమంతుని విషయమున నిట్లే. మునుపు నేను జూచిన స్త్రీవలెనే యున్నది. అయినను ఆమె యౌనో కాదో. ఒక స్త్రీ వంటిది మఱియొకతె లోకమున నుండ రాదా? యని సందేహము. సందిగ్ధమౌ స్మృతి=మనుస్మృతి లోనగువాని యందలి వాక్యములకు అది సరియైన అర్థమా, యిది సరియైన యర్థమా యని సందేహించుట. ఇదియు హనుమంతుని సందేహ మునే తెలుపుచున్నది. అనఁగా సీతాదేవి స్థితి యట్లున్న దని యెఱుఁగవలయు. క్షీణమైన సిరి=క్షయించిన సంపద, ఒకఁ డైశ్వర్యయుక్తుఁడై యున్నప్పటి వేషము దరిద్రుఁడైనప్పు డుండదు. అప్పుడు చూచినవా డిప్పుడు చూచినచో వేషము మాఱుటచే వాఁడు వీఁడగునా కాదా యని సందేహము తోఁచును. కలుష యుక్తమైన బుద్ధి=బుద్ధి నిష్కల్మషమై యుండినసే నిశ్చయజ్ఞానము తోఁచును. కల్మషముతోఁ గూడినప్పుడు యథార్థజ్ఞానము కలుగదు. సందేహమే తోఁచును. ఉపహతిఁగూడిన కార్యసిద్ధి=విఘ్నముచేఁ జెడిన కార్యఫలము. ఒక కార్యము చక్కఁగాఁ జేసిన ఫలహాని లేదు. అది విఘ్నమై పోయిన నా కార్యము చేసినవాని కా ఫలము ప్రాప్తించదు. అట్టులే సీత సీతాత్వమున కే హానియు లేదు. ఆమె సీత యని తెలిసికొనలేని లోప మా మూఢునిదే. ఆత్మానలోకన మగుటకు ముందు నాత్మజ్యోతివలె వెలుతురు హనుమంతునకు మండోదరివలెఁ గానవచ్చును. దానిని భ్రమపడరాదు. అదియే యాత్మ యనుకొని సంతోషించువాఁడు భ్రష్టుఁడే కావున నాచార్యుఁడు శాస్త్రములు చెప్పిన యుక్తులచే స్వబుద్ధి బలముచేఁ దర్కించి యూహించి నిశ్చయించుకొనవలెను.

## తాత్పర్యము

స్థిరపడని శ్రద్ధ, సందేహము కలిగించు స్మృతి వాక్యము, క్షయించిన సంపద. కల్మషముతోఁగూడిన బుద్ధి, విఘ్నమైన కార్యఫలము వలె నుండుదానిని.

సీ. కౌసలేయునిఁ జూడఁ ♦ గానక తపియించి, యసురచేఁతకుఁ జిక్కి ♦ యడలుదాని
వచ్చునా నా ప్రియ ♦ వల్లభుం డంచును, నలుదెసల్ పరికించి ♦ తలరుదానిఁ
బొదలుచు నొంటిమై ♦ బెదరి చూచెడి లేడి, కన్నె కన్నులఁ బోలు ♦ కనులదానిఁ
గాలువలై పాఱు ♦ కన్నీటి వఱదతోఁ, బలుకు ఫుల్కును గను ♦ పొలుపుదాని

తే. వాడుపాఱిన మోమున ♦ వగచుదాని, వేఁడినిట్టూర్పు పైపయి ♦ విడుచుదాని
ధూళి గ్రుంగిన మేనను ♦ దూలుదాని, ఖిన్నఁదనమున మలమల ♦ వేఁగుదాని.

అర్థములు. కౌసలేయుఁడు=కౌసల్యాకుమారుఁడు, పొలుపు=అందము,

తాత్పర్యము

శ్రీరామచంద్రుని జూడఁ జాలమిని తపించి రావణాసురునిచేతఁ జిక్కి వ్యసన పడు దానిని, నా భర్త వచ్చునా యని నాలుగు దిక్కులు చూచుదానిని, ఒంటరిగాఁ జిక్కి బెదరుచుఁ జూచుచున్న యాఁడులేడి కన్నులవంటి కన్నులు గల దానిని, కాలువలుగాఁ గన్నీరు పాఱుచుండఁగా తెప్పలమీఁద మీఁద మీఁద మూయుచుఁ దెఱచుచుఁ జూచుచుండు దానిని, వాడిపోయిన ముఖముతో దుఃఖించుదానిని, వేఁడి నిట్టూర్పులు మీఁద మీఁద విడుచు దానిని, దుమ్ములో మునిఁగిన దేహముగల దానిని, శోకముచే మలమలమాఁడుచుండు దానిని.

సీ. ఉత్తమాలంక్రియా ♦ యోగ్యయయ్యును మేన, మండనంబులు లేక ♦ యుండుదాని
గారుమబ్బుమఱుంగుఁ ♦ గనిన చుక్కలఱేని, వడువున మాసిన ♦ ప్రభలదాని
నభ్యాస మెడలుట ♦ నాత్మ విస్మృతి గన్న, చదివిన చదువు నాఁ ♦ బొదలుదాని
విగతసంస్కారమై ♦ వే అర్థ మొసఁగెడి, పదము నా వికటమై ♦ పరఁగుదాని

ఆ. నగునొ కాదొ సీత ♦ యనుచు శంకించుచుఁ, గలఁగి చూచి చూచి ♦ కష్టమునను
గారణంబు లెల్లఁ ♦ గలయ నాలోచించి, నెలఁత సీత యనుచు ♦ నిశ్చయించె. ౪౪౫

అర్థములు. ఉత్తమాలంక్రియా యోగ్య=శ్రేష్ఠమైన యలంకారమునకు నర్హురాలు, మండనంబులు=ఆభరణములు, విస్మృతి=మఱపు, విగత సంస్కారమై=వ్యాకరణ ప్రకారము శుద్ధముగాక గ్రామ్యమై, వికటమై=వికారమై.

తాత్పర్యము

శ్రేష్ఠమైన యలంకారమునకు నర్హురాలయ్యునాభరణములు లేకయుండు దానిని, వానమబ్బు చాటున నుండు చంద్రుని వలె ప్రభ మాసినదానిని (చంద్రుని ప్రభ మాయలేదు. చూచువారి కాప్రభ యను భావము లేదు. అట్టులే యిచ్చట) అలవాటు తప్పిపోవుటచే మఱపు దగిలిన చదువు వంటి దానిని (కష్టముపై మరల స్మృతికిఁ దేఁదగిన దానిని) వ్యాకరణ శుద్ధము గాకుండుటచే మఱియొక యర్థ మిచ్చెడి మాటవలె విరుద్ధము నుండుదానిని, హనుమంతుఁడు చూచి

యీామె సీత యగునో, కాదో రావణాసురుఁడు బలాత్కారముగఁ దెచ్చి యిక్లిందఁనో బాధించుచున్నాఁడు. వారిలో నెవతెయో యేమో యని సందేహించి సందేహించి చూచి చూచి యీామె సీతయే యనుటకుఁ గారణముల నాలోచించి తుద కీమె సీతాదేవియేయని నిశ్చయించెను. ఆకారణము లీక్రింద పద్యముల వివరింపఁబడును.

—♦ హనుమ తాను జూచిన శ్రీ సీతాదేవి యని నిశ్చయించుకొనుట ♦—

క. జానకి సొమ్ములటంచును, మానవవిభుఁ డేవి పలికె ♦ మా కవి యెల్లన్
గానఁగ నయ్యెడిఁ గుజశా, ఖానికరములందు వ్రేలి ♦ కలికికి నఖిలన్. ౪౪౬

## తాత్పర్యము

తొలుత రావణాసురుఁ డెత్తికొని పోవుచుండఁ దాము చూచిన స్త్రీవలె నీమె యున్నది కావున సీతయై యుండునని తలఁచి, నొకతెను బోలి మఱియొకతె యుండవచ్చును, కావున నది నిశ్చయింపఁ జాలునంత ప్రమాణము కాఁజాలదని తర్కించి యితర ప్రమాణములచే నిశ్చయించుచున్నాఁడు. దీనివలనఁ గేవల ప్రత్యక్ష ప్రమాణము ప్రమాణముగాదని యేర్పడు చున్నది. రామచంద్రమూర్తి యివి జానకి సొమ్ములని వేనిని మాకుఁ జూపెనో యవి యన్నియు నీమె సమీపమునఁ జెట్ల కొమ్మలందు వ్రేలాడు చున్నవి.

సీతాదేవి యాభరణములు కపులముందటఁ బాఱవైచినపు డొక ప్రక్కవి మాత్రమే తీసి మూఁటగట్టి వైచెను. ఇచ్చట రెండవ ప్రక్కవి తీసి కొమ్మలకుఁ దగిలించినవి. ఎవరైనఁ దన్ను వెదకుచు వచ్చినయెడల వారు వీనిని బట్టి తన్ను గుర్తింతురుగాక యని యామె యభిప్రాయము. ఈమె సీతయే యనుట కిది రెండవ కారణము. దీనినే వివరించు చున్నాఁడు. ప్రత్యక్షమును ననుమానప్రమాణముచే బలపఱుచు చున్నాఁడు?

ఉ. చక్కని చేఁతకమ్మలును ♦ జానగు మేల్ బొగడల్ సుకాంతిఁ బెం
పెక్కిన రత్నవిద్రుమమ ♦ హిష్ఠవిభాకరభూషణంబులున్
మక్కియు నల్లపాఱియును ♦ మానక పెక్కుదినాలు దాల్చుటన్
జక్కఁగ గుర్తు తేర్పఱిచె ♦ స్వామి వచించిన సొమ్ములివ్వగున్. ౪౪౭

అర్థములు. చక్కని చేఁత=నాణెపుఁబని చేసిన, రత్నవిద్రుమ=రత్నములయుఁ బగడములయు, మహిష్ఠ=మిక్కిలి గొప్పదగు, విభాతి=కాంతికి, ఆకర=స్థానమైన, భూషణంబులన్=సొమ్ములు, మక్కియు=ముఱికి యయ్యును.

## తాత్పర్యము

చెట్లకొమ్మలందు సొమ్ములు వ్రేలాడుచున్నవి నిజమే, అవి యీామెవియే

యని యెట్లు నిశ్చయింప వచ్చును? అని సందేహించి దాని నివర్తి చేసికొను చున్నాఁడు. నానెముగాఁ బనిచేసిన కమ్మలు, బొగడలు, రత్నములు, పగడములు వీనిచేఁ బ్రకాశించు భూషణంబులు ఇవి మిక్కిలియయి నల్లపాటి కూడ చాలదిన ములు ధరించుటచే నవి యీయామె దేహముమీఁద గుర్తు లేర్పఱిచినవి.

అనఁగా నచ్చట శ్రీరామచంద్రమూర్తి సీత సొమ్ము లివి యని వేనిని జెప్పెనో యవి ధరించియుండిన దేహమునం దెట్టి గుర్తులు పడియుండునో యాగుర్తు లీమె దేహమునం దున్నవి. పనిలేనప్పుడు సొమ్ములు దీసిపెట్టుటకుఁ బెట్టెలు లేకుండుటచే దేహమునందే విడువక ధరించి యుండుటచే దేహమునఁ గాయలు కాచె నని భావము. సీతాదేవి పాఱవైచినవి కాక యప్పుడు తొందరకుఁ దీయుటకు సాధ్యము గానివి దేహమందే యుంచుకొనెను. రామచంద్రమూర్తి తాను జూచిన నగలు గాక సీతాదేవి దేహముమీఁద నింకను నీ యీ సొమ్ము లుండెనని చెప్పెను. ఆ సొమ్ము లిందున్నవి. ఇది యాప్తవాక్యము.

క. అక్కడ నేఁ జూచిన నగ, లిక్కడఁ గనరావ; యున్న • విట నచ్చోటన్
జిక్కని సొమ్ములె; దీనికి, నొక్కింతయు సందియంబు•నొనరదు చూడన్.

తాత్పర్యము

అక్కడ నే నేయే నగలు చూచితినో యా నగ లిచ్చట లేవు. ఇక్కడ నుండు నవి యచ్చట లేవు. ఇందు సందేహము లేదు. అనఁగా నక్కడ నెడమ చెవి, ఎడమ ముక్కు, ఎడమచేయి, ఎడమ కాలికిఁ బెట్టుకొను సొమ్ములుండిన నిక్కడనవి లేవు, ఇక్కడ కుడి ప్రక్కవే యున్నవి.

మఱి యెవ తెయైనఁ దన సొమ్ములు చెట్లకుఁ దగిలించె ననిన నిట్లుండుటకుఁ గారణము లేదు. కావున నందు నేను జూచిన సొమ్ము లీమె ధరించినవే.

చ. పసిమికడానిడాలున శుం•భం బయి యప్పుడు పోవువేళ నా
కసమున నుండి రాలుచు న•గంబునఁ గొంచ దొక చిక్కి త్రెస్సి తా
వెసఁ గపిపంక్తి చూడఁగను • ప్రీలిన చీరయు మేలిసొమ్ములున్
వసుమతి నీమెయే విడిచె•వంచనలే దొకయింత యేనియున్. ౪౪౯

ఇఁక మూఁడవ కారణ మూహించు చున్నాఁడు.

అర్థములు. పసిమికడాని డాలు = పచ్చని బంగారు కాంతి, కొంచదొక = కొంచెము

తాత్పర్యము

ఈమె యిప్పుడు పోవు సమయంబున నీమె వైచుటచే నాకసంబున నుండి పడుచు చెట్లకొమ్మలకుఁ దగులుకొని కొంచెము చినిగి క్రోఁతులు చూచుచుండఁగా పడిన పచ్చని బంగారు వన్నెగల యుత్తరీయము సొమ్ములు నీమెయే విడిచెను.

ఇందును మోసములేదు. సుగ్రీవుఁడు సీతాభూషణములను శ్రీరామునకుఁ జూపి నపుడవి చెడకయుండెను. ఆకాశమునుండి కొండమీఁద వైచి నపుడు సొమ్ములు విఱిగి తునుకలై పోకుండునా యను సందేహమును వాల్మీకి యిచ్చటఁ బరిష్కరించుచున్నాఁడు. సీతాదేవి బండలమీఁదఁ బాఱ వైవ లేదు. చెట్టుమీఁదఁ బడునట్లు మూటను వేసెను. అది చెట్టు కొమ్మలకుఁ దగిలి యచ్చటనుండి నేలఁ బడెను, గావున సొమ్ములు తునుకలు గాలేదు.

క. చిరకాలం బీ వసనము, ధరియింపంబడుట మాపు ♦ తగిలియు రంగుల్
   బరికింపఁగ నా చీరకు, సరియై యొప్పారె కాంతి ♦ సంపద వన్నెన్. ౪౯౦

తాత్పర్యము

అది యెట్టులందువా? అక్కడ చీరకొంగే పచ్చని వన్నెగలదో యా పచ్చని వన్నెగలది గానే యీయామె చీరయున్నది. అయినను ఇది చిరకాలము ధరింపఁబడుటచే నతుకుట లేకుండుటచే నీచీర రంగు మాసినను కాంతియందు వన్నెయందు నా చీరకు సరిపోలి యున్నది.

ఉ. ఈ కనకాంగి రాము హృద♦యేశ్వరి దేవెరి దూరవిప్రవా
   సాకుల యయ్యె రాముహృద♦యంబున నెప్పుడుఁ బాయ కున్న, ద
   స్తోకము రామచంద్రు నెడఁ ♦ దోఁచు సురూపము నంగసౌష్ఠవం
   బీ కువలాక్షి యందుఁ బరి♦దృశ్యము లయ్యెను యుక్తమే కదా? ౪౯౧

   బీ కువలాక్షి యందుఁ బరి♦దృశ్యము లయ్యెను యుక్తమే కదా? ౪౯౧

ఈమె సీతయే యనుటకు మఱికొన్ని కారణములుములు చెప్పుచున్నాఁడు.

అర్థములు. దూర విప్ర వాసాకుల=దూర దేశమున మగని విడిచి కలఁత చెందినది, సురూపము=సౌందర్యము, అంగసౌష్ఠవము = అవయవ పరిపూర్తి, పరిదృశ్యములయ్యెను=చక్కఁగాఁ గానవచ్చుచున్నవి, యుక్తము = న్యాయము, రాము హృదయంబునన్ = రాముని దన హృదయంబున-అనియు, తాను రామునియొక్క హృదయము నందుండి యనియు నర్థము గ్రహింపవలెను. ఇట్లు చెప్పుటచే బరస్పరానురాగము చెప్పఁబడెను. ఈ యర్థము బాలకాండమున ౧౩౭౪వ పద్యము నందు 'శ్రీరఘురామ చంద్రుఁడును.... మనం బా రమణీలలామ పయి నారని కూరిమి నిల్పి యామెయున్ గూరిమిఁ బేరిమిం జెలఁగఁ గూర్చె మనంబు సదా హృదీశుపై" అని చెప్పఁబడెను.

ఇట్లు చెప్పుటచే శ్రీరామచంద్రునకు హృదయేశ్వరి సీతాదేవి, శ్రీసీతాదేవి హృదయేశ్వరుఁడు శ్రీరామచంద్రమూర్తి యని యేర్పడెను. ఈ కారణమున నిరువురు నేకాభిప్రాయము గలవారే యని యేర్పడు చున్నది. ఆమె యానని ఆయన కాదనఁడు. ఆయన యౌనననిది యామె కా దనదు. సీతానుగ్రహము వచ్చిన రామానుగ్రహము వచ్చినట్లే. రెండవ వారి యందసూయలేక యుండవలెను.

ఈమె సీతయే యనుటకు నాలుగవ కారణ మే మనిన;--ఈమె రామునకు హృదయేశ్వరి. రాణి కావున దూర దేశమందు మగని విడిచి యుండినను రామచంద్రమూర్తి హృదయమునందు వదలక నిలిచియున్నది. రాముని యొక్క హృదయమునందు నీమె యెడఁబాయకున్నది. ఇఁక నైదవ కారణమేమన-సాముద్రిక శాస్త్రప్రకారము రామునం దేయవయవసౌష్ఠవము గలదో యట్టి సౌష్ఠవము గలవానికి నట్టి యవయవ సౌష్ఠవము గలది భార్యగా నుండవలయునో, యట్టి యవయవసౌష్ఠవ మామె యందుఁ గానవచ్చుచున్నది, కావున శాస్త్రప్రకార మాయన కీమెయే భార్యయయి యుండవలె, నీమె కాయనయే భర్తయై యుండవలెను. ఇది న్యాయ్యమే కదా. ఇది శాస్త్రప్రమాణము.

ఈ పద్యమందు శ్రీరామచంద్రు నెడఁ దోఁచు నంగసౌష్ఠవము లీ కువలాక్షి యందుఁ బరిదృశ్యము లయ్యెనని సీతారాముల కైక్యము చెప్పఁబడెను. మగవాని చిహ్నము లాఁడుదానియందు, నాఁడుదాని చిహ్నములు మగవాని యందున్నవని చెప్పరాదు. కావున నిక్కడ సామ్యమే గ్రహింపవలెను.

క. శ్రీరాఘవుఁ డీమెకుఁగాఁ, గారుణ్యం బానృశంస్య♦గరిమయుఁ గడు దు
ర్వారపుశోకము మదనుఁడు, గావింపఁగ వేఁగునట్టి♦కాంత యిదే యూ. ౪౫౨

అర్థములు. కారుణ్యము=దయ, ఆనృశంస్యము=క్రూరత్వము లేకుండుట, వేఁగు=పరితపించు.

మీఁద వివరించిన యైదుకారణములచే నీమె రాముని భార్య సీతాదేవియే యని నిశ్చయించుచున్నాఁడు. శ్రీరామచంద్రమూర్తి యేమి నిమిత్తము దయ, యక్రూరత్వము, వారింపరాని శోకము, కామము బాధింపఁగాఁ బరితాప పడుచున్నాఁడో యామె యామెయే. రామచంద్రమూర్తి భార్య నిమిత్తమై శోకించుట కీ నాలుగు కారణములు. ఇవి క్రింది పద్యమున వివరింపఁబడుచున్నవి.

సీ. ఆపదవేళల♦నంగన నొక్కర్తుఁ బ్రోవలే దనెడి కా♦రుణ్యమునను
నన్ను నమ్మినదాని♦కిన్ని పాట్లబ్బెన, పైఁచితి నను నానృ♦శంస్యమునను
నర్ధాంగలక్ష్మిని♦నకట కోల్పడితిఁగా, సుందరి ననియెడి♦శోకమునను
నొద్దలే దాయెఁగా♦నొప్పులకుప్ప నా, ప్రియ యన్న నెర వేఁకి♦వేఁకరమున

తే. నకట యీ నాలుగింటను ♦ నడలుచుండు
రామచంద్రుండు హృదయ మీ ♦ రామయంద
నిలిపె నీమెయుఁ బతియంద ♦ నిలిపె మనముఁ
గాన బ్రదికిరి వీరలు ♦ గడియ యైన. ౪౫౩

అర్థములు. అర్ధాంగలక్ష్మిని=తన దేహమునందు సగభాగమైన దానిని, కోల్పడితిఁగా=పోఁగొట్టుకొంటిని, రూ. కోలుపోవు-కొల్లపోవు-కోల్పోవు. వెర వేఁకి వేఁకరమునన్=విరహజ్వరముచే.

అర్ధాంగలక్ష్మి- లోకే వేదే చ శాస్త్రే చ ధర్మశాస్త్రేషు చైవ హి, శరీరార్థం స్మృతా జాయా, పుణ్యాపుణ్యఫలే సమే.

లోకవ్యవహార మందు వేద మందు స్మృతులందు ధర్మశాస్త్ర మందు భర్తృదేహములో సగము భార్య. అట్టులే పుణ్యపాపములందు నని యర్థము.

అర్థోవా ఆత్మనో యత్పత్నీ॥
శాస్త్రప్రయోగా ద్వివిధాచ్ఛ వేదా
దాత్మాహ్యనన్యః పురుషస్య దారాః॥

ద్వేధాకృత్వాత్మనో దేహ, మర్ధేన పురుషోఽభవత్। అర్ధేన నారీ తస్యాం, సవిరాజ మసృజత్ప్రభుః॥ మను వైనైవ రేమే తస్మా దేకాకీ నరమతే। సద్వితీయ మైచ్ఛత్। సహైతావా నాస యథా స్త్రీపుమాంసౌ సంపరిష్వక్తౌ। స ఇమేమేవా త్మానం ద్వేధా పాతయత్తతం పతిశ్చపత్నీచాభవతాం తస్మాదిద మర్ధబృగల మినన్వ ఇతిహస్మాహ యాజ్ఞవల్క్యస్తస్మాదయ మాకాశః స్త్రియా పూర్వత ఏవతాగ్ం సమభవత్తతో మనుష్యా అజాయంత। బృహ. దా. ౪. బ్రా, ౩ వ మంత్రము.

యో భర్తా సా స్మృతాంగనా। మను ౯. ౪౫.
యోభర్తా సైవ భార్యా స్మృతా-వాజసనేయ బ్రాహ్మణము.

కస్సవితా? కా సావిత్రీ? పురుషఏవ సవితా, స్త్రీ సావిత్రీ।సయత్ర పురుష స్తత్ స్త్రీ। యత్రవాస్త్రీ సపురుష। స్తేద్వే యోనీ తదేకం మిథునమ్॥ సావిత్ర్యు పనిషత్తు.

ఈ ప్రమాణములు పురుషునిలో సగము భార్య యని చెప్పుచున్నవి. కావున భార్యా భర్తృ సంబంధము జన్మాంతరను లందును తప్పదు. ఈ విషయ మయోధ్యా కాండము నందుఁ గిష్కింధాకాండము నందుఁ జర్చింపఁ బడెను.

## తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి సీతాదేవికై దుఃఖించుటకు హనుమంతుఁడు నాలుగు కారణములు చెప్పుచున్నాఁడు,

౧. పురుషుఁ డగువాఁడు ఆఁడుకుయిలు ఆలకుయిలు విన్నంత మాత్రమున దన ప్రాణమిచ్చియైన వారిని రక్షింపవలయును. ధర్మశాస్త్రమిట్లుండఁగా నాపద వేళ నొక్క యాఁడుదానిని నేను క్షత్రియుఁడనై యుండియుఁ గాపాడలేక పోయి తిని గదాయను సర్వ భూతదయ.

౨. ఆ స్త్రీయైనను అన్యస్త్రీ గాదు. నేను దన్ను రక్షింపఁ గలనని నమ్మి తన రక్షణభారము నామీఁద వైచి వేఱు రక్షణము గోరక సర్వసౌఖ్యములు వదలి యన్ని కష్టములు పడుచు నా వెంట వచ్చినది. అట్టి దానికి నెట్టి కష్టము రానీయక కాపాడవలసి యుండఁగా నిన్ని కష్టము లామె పడుచుండినను ఆశ్రయమగు నేను దేరగాని వలె సహించితిని. నేనెంత క్రూరుఁడను?

౩. నన్ను నమ్మి వచ్చినది దాసిన కాదు. రక్త బంధువు కాదు. నా దేహములో సగమైనది. నా కుడిభాగము నేను రక్షించుకొను విధముగా నెడమభాగము రక్షింపవలయును. అట్లు రక్షింపకుండిన నాకే హాని? అంతటి భారము నాయందుండియు నటువంటి సుందరిని బోఁగొట్టుకొంటిని. నా దేహము నే కాపాడుకొనలేనివాఁడను. నే నేమి మగవాఁడను, నే నేమి క్షత్రియుఁడను?

౪. మాకుఁ బరస్పరానురాగ ముండినను, లేకుండినను అది భార్య-భర్తవ్య యని, నేను భర్త-పతి యని యుండుట వలన దానిని భరింపవలసిన పాలింపవలసిన భారము నాయం దున్నది. అంతమాత్రమే కాదు. సీతాదేవి యొప్పుల కుప్ప. నమస్తసద్గుణరాశి. అవగుణము లేనిది. ప్రియురాలు. నాయందు ప్రేమగలది. ఇట్టిది సమీపమం దుండినను 'ఒవరభార్యాసమేతుఁడై యున్న వానికెంత లాపద లయ్యును నొఱకపడవు' అన్నట్లు లామె సాన్నిధ్యమాత్రమే నాకష్టములు కష్టములుగాఁ దోఁపనీయదు. విశేషము లేకున్నను ఆమెతో నింపుగా మాటలాడుచుండినను జాలు. అదియు లేకుండఁ జేసికొంటిని గదా. లక్ష్మణునకు వలె వెంట లేకుండిన నే వ్యసనము లేదు, ఉండిపోయిన దుఃఖమెక్కువ. ఈ వియోగము నే నెట్లు సహింతునని యెడి మదన తాపమునను.

ఈ నాలుగింట రామచంద్రమూర్తి బాధపడుచున్నాఁడు. ఈ నాలుగవది లేకుండిన రామచంద్రమూర్తి నపుంసకుఁడో, మందుఁడో, మనుష్యస్వభావశూన్యుఁడోయని చెప్పవలసి యుండును. ఈ కారణములచే రామచంద్రమూర్తి కేవల కాముకుఁడై దుఃఖింపలేదని యేర్పడుచున్నది. రామచంద్రమూర్తి యీయామె యందుఁ దన మనస్సు నిలిపెను. ఈమె రామచంద్రమూర్తి యందు మనస్సు నిలిపెను. కావున వీరి మనస్సు లెచ్చట న్యాయముగా నుండవలయునో యచ్చటనే యున్నవి. దేహములు మాత్రము వేఱుగా నున్నవి కాని మనస్సు లేకముగా నున్నవి. కావుననే వీరిరువురు బ్రతుకఁ గలిగిరి. ఆయన మనస్సు ఈమె యందు లేకుండినను ఈమె మన స్సాయన యందు లేకుండినను ఇరువురును మరణించి యుందురు. జీవాత్మ పరమాత్మలకీ సంబంధము నెఱుంగునది.

౫. ఎంతటి దుష్కరమును భూ, కాంతుఁడు ఘటియించె నీమెఁ గనకయు బ్రదికెన్ జింతావ్యథఁ జిక్కుండును, వింత గదే మిగుల రామవిభు చరితంబుల్. ౪౫౪ అర్థములు. దుష్కరము=చేయుటకు మిగులఁ గష్టమైనది.

## తాత్పర్యము

ఈమెతో సరస సల్లాపము లాడకుండిన బోనీ, సంభోగింప కుండినను మాననీ, కనులనైనఁ జూడక యీమెను విడిచి యిన్ని దినములుగ బ్రదికి యున్నాఁడే. బ్రదికి యుండుటే కాదు, చింతచే బాధపడకున్నాఁడే, రామచంద్రమూర్తి యెంతటి యసాధ్య కార్యమును జేసెను.

ఆయుస్సు తన స్వాధీనము గాదు, కావున బ్రదికియున్నాఁ డనుకొందునా. చింతచేతఁ గూడ శుష్కింపకున్నాడే. ఏడువలేదా యందునా. ఏడుపున కేమి. ఏమాత్రము ప్రీతిగలవారు పోయినను దుఃఖము వచ్చును. అంతియకాని యట్టి దానిని బోఁగొట్టుకొని యీమెవలె నిద్రచాలించెనా? ఆహారము చాలించెనా? పడుకపెట్టెనా? ఈ వియోగమునకుఁ దగినంత కార్యమేమి చేసెను. రామచంద్రమూర్తి నడవడి మిగుల నాశ్చర్యకరమైనదే. ఏమి యీయన యింద్రియజయము. ఋశ్యమూకమందు రామచంద్రమూర్తి యీమెకై యేడ్చుచుండుట చూచి యయ్యో యింతటి ధీరోదాత్తుఁడు మహానుభావుఁడు ఒకయాఁడుదానికిఁ గా నిట్లేడ్చుచున్నాఁడే. ఎంత కామదాసుఁడు, ఎంత యింద్రియజితుఁ డని తలఁచితిని గాన యీమెను జూచిన తరువాత రామచంద్రమూర్తి పాషాణ హృదయుఁ డనియే చెప్పవలసి యున్నది.

రాముఁడు భూకాంతుఁడు గనుక బ్రదికెను. 'నిండు మనంబు నవ్యనవనీత సమానము, పలుకు దారుణాఖండల శస్త్రతుల్యము, జగన్నుత విప్రులయందు నిక్కమీ రెండును రాజులందు విపరీతము' రాజులకు వాక్కుతీపేగాని, మనస్సు వజ్రకఠినము. కావున బ్రదికెను. భూకాంతుఁడు అచేతనమైన భూమిని అశ్వగజ రథాదుల నామోదింపఁజేయుఁవాఁడే కాని ప్రథమ ప్రణయపాత్రమైన భార్యను రంజింపఁజేయు నంతటి రసికుఁడు గాఁడు కావున బ్రదికెను.

బ్రదికెన్=బ్రదికియున్నాఁడే. అది యాశ్చర్యము. సీతాదేవిని విడుచుట వలన నెంత దుఃఖము కలుగవలయునో యంత దుఃఖము రామున కున్న యెడల బ్రదికియుండునా? బ్రదుకక యేమిచేయు ననెదవు? ఆత్మహత్య చేసికొను మనెదవా? అక్కఱలేదు. ఈమెను విడుచుటవలన నెంతదుఃఖము కలుగవలయునో యంత దుఃఖము కలవాఁడయ్యెనేని ప్రాణములు తమంతటఁ దామే యీశరీరమును విడిచి కాలుచున్న యింటిలో మనుష్యు లుండక పోవునట్లు పోయి యుండును. ఈయన ప్రయత్న మక్కఱయే లేదు. అట్లైన సీత ప్రాణ మేల పోలేదు. ఆమెకు దుఃఖము లేమికదా యందువేమో? సీత పరతంత్ర, భర్త యాజ్ఞలేక మరణించుటకు నధికారములేదు. ఆమెదేహము, ప్రాణము రాముని సొత్తే. ఆమె యెట్లుపోఁగొట్టం గలఁదు. అవి పోయెద మన్నను నామె బిగఁబట్టవలెను. రాముఁడు స్వతంత్రుఁడు. దేహము వదలిపెట్టవలసి యుండెను. వదలిపెట్టక బిగఁబట్టి యున్నాఁడే. అదియే యసాధ్యకార్యము.

అన్యత్ర భీష్మాద్గాంగేయా। దన్యత్ర చ హనూమతః
హరిణీఖురమాత్రేణ। చర్మణా మోహితం జగత్.

గంగానందనుఁడైన భీష్ముఁడు హనుమంతుఁడు వీ రిరువురు తప్ప దక్కిన ప్రపంచ మంతయు నాఁడు జింకగిట్టంత చర్మమునకు మోసపోయియున్నదియని జితేంద్రియుఁడని ప్రసిద్ధిగన్న హనుమంతుఁడుకూడ రామచంద్రమూర్తి సీతాదేవిని విడిచియుండుట చెడుకార్య మని నిందించుచున్నాడు. ఎంతటి దుష్కారమును రామవిభుఁడు సలిపెను. ఎంతటి దుష్టకార్యమును రామభూవిభుఁడు చేసెను. ఏమి చెడుకార్యము చేసెనందువా? ఎట్లీమెను విడిచి యల్పకాలమైన మాయామృగమువెంటఁ బోయెను. సీతాదేవి కోరినఁగదా పోయెను, అందువా? సీతాదేవి స్త్రీ. బుద్ధి చపలత స్త్రీ స్వభావము. 'పెసతెలనుండుఁగా యువతి బృందముకెల్లను బుద్ధి' యన్నట్లు వారు కోరికలు కోరుదురేకాని దానివలన నచ్చుమేలు కీళ్ళ నాలోచింప శక్తిగలవారు గారు. నిజముగ నీమె మీఁదఁ బ్రేమయే యుండిన నీమెను విడిచి తుచ్ఛమృగమునకై పోవునా? ఆమె కోరిక నెఱవేర్పవలసి యుండినఁ దానే పోవలయునా? లక్ష్మణుని బంపరాదా? అది మూర్ఛపోయి పడునట్లు అచ్చటినుండియే కాకిమీఁద వైచినట్లు సమ్మోహనాస్త్రము వేయరాదా? అటు చేయక, యిటుచేయక యీమెను విడిచిపోయెనే. అదియే చెడ్డకార్యము. అట్లు చేసినకదా యిప్పు డీమె నింత కష్టపెట్టుచున్నాఁడు. రాముఁడు గనుకఁ జేసెను. రాముఁడనఁగా పైకి రమణీయమైన యాకారము గలవాఁడే కాని లోపలఁ దెలివి తేటలు గలవాఁడు కాఁడు. కనుకనే కదా నీవు పురుషవేషము వేసికొన్న యాఁడుదాని వని సీత చెప్పెను. అంతటి తెలివిలేనివాఁడైనచో భూకాంతుఁ డెట్లయ్యె నందువా. విభుఁడు గదా. వి + భు=భూ సత్తాయాం అన్నట్లు సామర్థ్యము లేని వాఁడు గదా విభుఁడు. అదియే మట్టు లనెదవు? ప్రేమము తెలివి తేటలు సామర్థ్యము లేనివాఁడు తన తోడ నరణ్యమునకుఁ బిలుచుకొని వచ్చెనా యందు వేమో? ప్రేమగలవాఁడయ్యేనేని నే నరణ్యమునకుఁ బోయెద ననఁగానే నేను వచ్చెద నని సీతాదేవి చెప్పినట్లు చెప్పక నీవు నావెంట రావల దనునా? ఇది ప్రేమగలవాని లక్షణమా? ఆమె యీయనయం దత్యంత ప్రేమగలది కావున నీయనను విడిచి యుండలేక వెంట వచ్చెదనని పోరాడి బలాత్కరించి సాధించెను. ఆమె పోరాటము పడలేక పిలుచుకొని వచ్చెనుగాని లేకున్నఁ బదునాలుగేండ్లామెను విడిచియుండ ప్రయత్నించెను గదా ఇదియా ప్రేమలక్షణము. పదునాలుగేండ్లుండఁ గలవానికిఁ బదినెల లేమి లెక్క? కావున రాముఁడు చేసినది చెడుకార్యమే. అక్కడ రాముఁ డేడ్చుటఁజూచి యీయన నిజమైన నిండారుప్రేమ గలవాఁడని తలఁచితిని గాని యీమె యుండు స్థితిఁజూచిన నాకు నిప్పుడాయన దయలేనివాఁ డనియే తోఁచుచున్నది.

ఘటియించెన్ =ఎంత మతిమాలినవాఁడైనను దనసంసారమును దాను

తెలుసుకొనునా యందువేమో? తెలుసుకొనునా యని సందేహమేల? ఘటి యించెన్=చేయనే చేసెనుగదా. ముంజేతి కంకణాని కద్దమేల? తన తెలివిలేమికిం దా ననుభవించునుగాక! నిష్కారణముగ నిటువంటి నిష్పాపను నింత కష్టముల పాలు చేసెఁగదా. దానికై నే నేడ్చెదను?

తన తండ్రి కాముకుఁడై భార్యకు వశపడి తన్నిట్లు కష్టపెట్టె ననికదా రాముఁడు చెప్పెను. (అయోధ్య ప. ) తానో భార్యయం దుంచవలసిన ప్రేమ యుంచకకదా నిష్కారణముగ నీమె నింత కష్టపఱచెను. తమ్ముఁడు, పెండ్లా మిరువురు తనకు సేవ చేయ నుండినను ఊరువిడిచి రావలయుననిన నంత కష్టపడిన వాఁ డొంటరిగ మనుష్య ముఖదర్శన ప్రాప్తిలేక రాక్షసులచేతిలోఁ జిక్కి యెంత కష్టపడుచున్నదో యాలోచించెనా? కావున రామచంద్రమూర్తి చేసినది చెడు కార్యమే. ఏల యిట్లు చేసెను? ప్రణయవిద్యయందు నాయనకు ఓనమాలుకూడ రావు. గనుక ప్రణయ మనునది తెలియక చేసేనేకాని తెలిసి చేసినవాఁడుకాఁడు.

దుష్కరమును=భార్యను విడిచియుండుట దుష్కరమేని లోకములో భార్యలులేనివా రెందఱు లేరు. వారందఱును దుష్కరమును జేసినవారా? కారు. 'అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా' సూర్యునకు నెండవలె సీత నా కనన్య; నన్ను విడిచి యుండదు; ఆమెను విడిచి నే నుండను అని చెప్పిన వాఁడు కదా రాముఁడు. ఎండను విడిచి సూర్యుఁ డుండుట సుకరమా? ఎండను విడిచి సూర్యునివలె సీతను విడిచి రాముఁ డుండుట దుష్కరము కాదా. ఎండలేని సూర్యుఁడు తేజోహీనుఁడు, పూజ్యుఁడు కాఁడు. ఎండవలని మేలునకై కదా లోకులు సూర్యుని బూజించుట. ఎండలేని సూర్యుని నెవరు పూజింతురు. అట్టులె సీతాదేవి తనతోడ లేదేని దాను దేజోహీనుఁడు, అపూజ్యుఁడు అని కూడ నాయనకుఁ దోఁచినది కాదు కదా. అట్లయిన నెట్లు విడిచి యున్నాఁడనిన, భూకాంతుఁడు గనుక భూమి (రాజ్యము) ఆయనకుఁ గాంతము=ప్రియమైనట్లు సీత కాలేదు. కావున మృగముమీఁది కాంక్షచే సీతను విడిచి పోయినట్లు రాజ్య కాంక్షచే సీత నుపేక్షించెను.

క. ఎంతటి దుష్కరమును దుర్దాంతపరాక్రముఁడు సల్పె • రాముఁడు సీతా
కాంత మదిరాయతాంబక, చెంతను లేకున్నఁ ద్రుటియు • జీవముఁ దాల్చెన్.

అర్థములు. దుర్దాంత పరాక్రముఁడు=అణఁపరాని విక్రమము గలవాఁడు, మదిర+ఆయత+అంబక=సారాయము వలె మోహింపఁజేయు దీర్ఘములైన నేత్రములు గలది. త్రుటియు=అల్పకాలమైనను.

తాత్పర్యము

రామచంద్రమూర్తి నిజముగ దుష్కరకార్యమే చేసెనని దృఢపఱుప, దానినే మఱియొక విధముగఁ జెప్పుచున్నాఁడు. 'ఆదరా ద్విరక్తి' యని కలదు గదా.

దుర్దాంత పరాక్రముఁడు=అణఁపరాని పరాక్రమము గలవాఁడు. ఇచ్చట శత్రువుల కని చెప్పుట యప్రస్తుతము. ఇచ్చట శత్రువు లింద్రియములే. ఇంద్రియములకు నణఁపరాని మనోబలము కలవాఁడు కావుననే కామమునకు వశపడక బ్రదుకఁ గలిగెను.

**మదిరాయతాంబక:—** మదిరా=సారాయమువలె, మత్తును గలిగించు, ఆయత+అంబక=దీర్ఘములైన కన్నులు గలది. మదమనఁగా సంతోషము. సంతోషాతిశయముచే దేహము దెలియకుండఁ జేయునది మదిర, అట్టి గుణముగల దీర్ఘనేత్రములుగలది. సారాయము త్రావిన వానికి దేహము తెలియకపోవునట్లు లామెకన్నులు చూచిన నంతటి సంతోషము గలుగు నని భావము. సారాయమువలెఁ ద్రాగ వలసిన పని లేదు. దగ్గఱ నుంచుకొని చూచుచుండినఁ జాలును. దానివలె నల్పకాల ముండునది కాదు శాశ్వతముగ నుండునది. చెంతను లేకున్న=అనుభవింపక పోయినను ఊరక సమీప మందుండినను జాలును. త్రుటియున్=మత్తువస్తువులు సేవించువారు దానిని వేళకుఁ దీసికొనక క్షణ మాలసించినను వెఱ్ఱి యెత్తినట్లయి మిగుల బాధపడుదురు. విశేషాభ్యాసము గలవారు చావనే చత్తురు. అట్లుండ నిన్ని సంవత్సరము లనుభవించుచుండి యిప్పుడు తటాలున నీమెను వదలి క్షణమైన నెట్లు బ్రదుకు చున్నాఁడు. ఇది దుష్కరమే కదా. సారాయము మనుష్యుఁడైన వానికెట్టివానికైన దేహవిస్మృతి కలిగించి తబ్బిబ్బు పడఁజేయును. బండమీఁద బోసిన నేమగును? అట్టులే యీమె కన్నులాయనకు మత్తు కలిగింపలేదు. కావున ఆయన హృదయము గుండో, రాయియో యైయుండవలెను.

జీవముఁ దాల్చెను=జీవుని ధరించెన్. జీవితేశ్వరి యగు నామె పోయిన పిమ్మట నాకేమిపనియని జీవుఁడు పోవఁదలఁచినను బోనీయక బిగఁబట్టెను. ఇది దుష్కరమేకదా. ఇంతటి యసాధ్యకార్యములు సాధించు రామచంద్రమూర్తి సామాన్యుఁ డని యెట్లు చెప్పవచ్చును. ఇది చేయఁగలిగినవాఁ డెంత యసాధ్యమైన కార్యమైనను జేయఁగలవాఁడే.

దుష్కరమును హేమాహేమీలు ఘటాఘటీలగు వానరు లందరు మాచేతఁ గాదు మాచేతఁగాదని చెప్పినదానిని సముద్రముదాఁటి లంకఁ బ్రవేశించి రావణునకు దెలియకుండ లంకయంతయు శోధించి సీతనుజూచి నేనే యసాధ్యకార్యమును జేసితి నని గర్వించితిని కాని రామచంద్రమూర్తి చేసిన కార్యము నెదుట నేను జేసినది గొప్పగాదు.

క. అని జానకిఁ గని పావని, మనమున సంతోషమగ్న◆మానసుఁ డగుచున్
ఘనుఁ బ్రభుని రాము నెంతయుఁ, గొనియాడె నదెంతవాఁడొ◆కో యతఁ డనుచున్.

తా త్ప ర్య ము

అని తలఁచుచు జానకీదేవిని జూచి మాసినచీరతో స్నానములేని దేహముతో నిద్రాహారములు విడిచి భర్తనే ధ్యానముచేయు నిట్టి పరమపతివ్రతను జూచు సదృష్టము నాకుఁ గలిగెఁగదా. వానరు లందఱు బ్రదికిరిగదా. సుగ్రీవుఁడు కృతజ్ఞుఁ డయ్యెఁ గదా. రామలక్ష్మణుల కార్యము నెఱవేఱెఁ గదా యని సంతోషములో మునిఁగిన మనస్సు గలవాఁడై ఘనుఁడును ప్రభువును నగు రామచంద్రమూర్తిని 'ఆహా యాయన యెంత గొప్ప వాఁడో, గాకున్న నిట్టిస్త్రీకి భర్తయగునా? ఎంతటి జితేంద్రియుఁడు గాకున్నసీమెను విడిచి బ్రతుకునా? ఎంతటి ప్రభువు = సమర్థుఁడు గాకున్నఁ బోనున్న ప్రాణముల నిలుపఁ గలుగునా? ఇంత కార్యము చేయఁగలుగునా? ప్రభుః=ప్రభవతి సమర్థో భవతీతి ప్రభుః-భూసత్తాయాం - సమర్థుఁడగువాఁడు ప్రభువు. అని రామచంద్రమూర్తి సామర్థ్యమును బొగడెను.

—♦ ౧౬-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవి స్థితికి దుఃఖించుట. ♦—

ఉ. రాము గుణాభిరాము నల♦రామ నుతించి ప్రశంసితవ్యఁ జిం
తామథితాత్ముఁడై పవన♦నందనుఁ డశ్రులు గ్రమ్మ కన్నులన్
రాముని దేవిఁ గూర్చి యవు♦రా యనుచున్ విలపించి మూర్తమి
ట్లా మహిమాఢ్యుఁ డుండి తద♦నంతర మి ట్లని యేడ్చె దుఃఖియై. ౮౫౭

అర్థములు. గుణాభిరామున్=గుణములచే నభిరాముఁ డగు వానిని, అల=ప్రసిద్ధికెక్కిన, ప్రశంసితవ్యన్=గుణములచేఁ బొగడఁ బడఁదగినదానిని, ఆయన రాముఁడు, ఈమె రామ; ఆయన గుణాభిరాముఁడు, ఈమె ప్రశంసితవ్య కావున నిరువురు సమాను లని భావము. సీతారాములు గుణము లందు సమానులు. వాత్సల్య సౌలభ్యముల యందు సీత రామునికంటె శ్రేష్ఠురాలు కావున నిరువురు కలసిననే గుణసంపూర్తి. లేకున్నఁ గొఱఁతయే. పరతంత్రతగావున రామునికంటెఁ దక్కువ. చింతామథితాత్ముఁడు=చింతచేఁ జిలుకఁబడిన మనస్సుగలవాఁడు. అశ్రులు=కన్నీళ్లు, మహిమాఢ్యుఁడు=మహిమ యను సంపత్తిగలవాఁడు. గొప్ప గుణములనునవి లోకమున నేవికలవో యవి యన్నియు హనుమంతునందుఁ గలవు. దుఃఖియై=దుఃఖము గలవాఁడై.

తా త్ప ర్య ము

గుణాభిరాముఁ డగు రాముని గుణములచేఁ బ్రశంసింపఁదగిన ప్రసిద్ధికెక్కిన సీతను హనుమంతుఁడు పొగడి చింతచే వ్యాకులపడిన మనస్సుగలవాఁడై యాంజనేయుఁడు కన్నీళ్లు కారఁగా రామచంద్రమూర్తి భార్యయగు సీతాదేవి నుద్దేశించి యౌరా యీయామె యెటువంటి యుత్తమురాలు. ఇటువంటి యీయామె కెటువంటి కష్టము వచ్చెను, అని యేడ్చి యీప్రకార మీగొప్ప గుణసంపత్తిగల హనుమంతుఁడు కొంచెము సే పుండి మరల దుఃఖము సైఁపలేక యిట్లేడ్చెను.

క. శీలవతి గురువినీతుం, డా లక్ష్మణునకును మాన్య•యతని గురునకున్
మేలిప్రియ సీత వగచిన, గాలము దురతిక్రమంబె•కా యెవ్వారికిన్. ౪౫౧

అర్థములు. శీలవతి=పతివ్రత, గురువినీతుండు=మిక్కిలి జితేంద్రియుఁడు. (౨) మిక్కిలి వినయము గలవాఁడు (3) గురువులచే శిక్షింపఁబడినవాఁడు, లక్ష్మణునకును=లక్ష్మణు నంతవానికిని, మాన్య=పూజింప నర్హురాలు. దురతిక్రమంబెకా=అతిక్రమింపరానిదే కదా. ఎవ్వారికిన్=ఎంతటివారికైనను.

తాత్పర్యము

ఈమె మహాపతివ్రత. ఆ కారణముచేతనే యీమె కెట్టి యాపదయు రాఁగూడదు. అంతియగాక, మిక్కిలి జితేంద్రియుఁడు 'తరుణీ కుణప' మన్నట్లు పర స్త్రీలను శవములవలెఁ జూచువాఁడు. అటువంటి లక్ష్మణునకు మాన్య- పెద్ద లగు జ్ఞానులచేఁ జక్కఁగా శిక్షింపఁబడిన మనస్సు గలవాఁడు కావున పరిపక్వమైన మనస్సుగలవాఁడు. అటువంటి లక్ష్మణునకును మాన్య, 'యస్య దేవే పరాభక్తి ర్యథా దేవే తథా గురౌ' అన్నట్లు భగవంతునం దెంత భక్తియో యంతభక్తి యన్న యందుఁ గలవాఁడు. అటువంటి వానికిని మాన్య. అంతియకాదు. అటువంటి లక్ష్మణుని గురువునకు మిక్కిలి ప్రియురాలు. అంతటివాని గురు వీమె యందెంత గొప్పతనము లేనిదే యీమె యందుఁ బ్రియము గలవాఁ డగునా? అటువంటి సీత. ప్రకృతి కతీత. అందఱవలెఁ బాంచభౌతికమైన గర్భమునుండి కర్మానుభవమునకై పుట్టినది కాదు. అట్టి యీమెకే వ్యసనము ప్రాప్తించిన నిఁక లోకమునందుఁ గాలము నతిక్రమించువాఁ డెవఁడు? అది యెవ్వని కెంతవానికి సాధ్యము గాదు.

కాలము దురతిక్రమం బను నీతి రామాయణమునఁ బలుతావుల బోధించుచున్నది. కావున నా నీతిని నెక్కుఁవగ మనస్సునం దుంచుకొని సర్వము కాలాధీనము గదా యని దుఃఖ సంతోషములకుఁ బాలుపడ రాదు. జగద్రక్షకులైన రామ లక్ష్మణులు రక్షించు నప్రాకృతయైన సీతకే యీ లోకమునకు వచ్చిన కారణమున నిన్ని కష్టములు ప్రాప్తించెనే, ఇఁక మన మనఁగా నెంత యని సముద్రమున పైపై నలలు కదలిన లోతున నీళ్లు కదలనట్లు మనస్సు పరితాపపడినను బుద్ధిని వ్యాకుల పడనీయరాదు. సహింపవలెను. యుద్ధ. ౨౬-౨౫ పద్యము జూచునది.

క. రాముని వ్యవసాయంబును, ధీమత్సౌమిత్రిమతముఁ•దెలియుట సీతా
భామామణి కలఁకం గన, దేమియు వాసలకు వేల్పు•లేటి విధమునన్. ౪౫౨

అర్థములు. రాముని వ్యవసాయంబును=రామచంద్రమూర్తి నిశ్చయమును, రామచంద్రమూర్తి తన యాశ్రితులను వారి ప్రయత్నము నపేక్షింపకయే తానే సర్వప్రయత్నములుచేసి వారి నేవిధముగనైన రక్షించువాఁడు 'వ్రతమిదినాకున్ విడిచెద బ్రాణము లైనను' అని యాశ్రితరక్షణమును దనప్రాణ మిచ్చియైన

జేయువాఁడు రాముని నిశ్చయమిట్టిదని తెలియును గావునను, ధీమత్=బుద్ధిమంతుడైన, ఇచ్చట మత్ అనునది మతుప్ ప్రత్యయము, 'భూమ నిందా ప్రశంసాసు, నిత్యయోగేతిశాయినే సంబంధోఽస్తి వివక్షాయాం, భవంతి మతుబాదయః॥' సిద్ధాంతకౌముది. 'తదస్యాస్త్యస్మిన్నితి మతుప్' పాణిని. V. 2-94 ధ్యాయంత్యనయేతి ధీ దీనిచేఁ జక్కఁగా ధ్యానము చేయుదురు కావున ధీ=బుద్ధి. కావున ధీమంతుఁడనఁగాఁ బ్రశంసింపఁదగిన చక్కని యాలోచనతో నిత్య సంయోగము గలవాఁడు. అనఁగా నాయనబుద్ధి ప్రమాదపడదని యర్థము. మాయామృగము విషయమున సీతారాములిరువురు ప్రమాద పడినను లక్ష్మణుఁడు ప్రమాదపడలేదు. అది మాయామృగ మనియే చెప్పెను. మారీచుని కూఁత విషయములో సీత పొరపడినను లక్ష్మణుఁడు ప్రమాద పడలేదు. తన రక్షణమందుఁ దానవివేకముగ సీతవర్తించెను గాని లక్ష్మణుఁడు తన్ను రక్షింపఁ బట్టు పట్టియే యుండెను అందు సౌమిత్రి, సుమిత్ర కొడుకు. తన్నుఁ దల్లివలెఁ జూచుకొమ్మని కదా యామె చెప్పెను. ఆమాట ప్రకారము తన యందు మాతా పితృ గౌరవమే కాని ద్వేష బుద్ధి గలవాఁడు కాఁడు. లక్ష్మణుఁడట్టి వాఁడని సీతకుఁ దెలియును. వేల్పుటేటి విధమునన్=గంగానదివలె, గంగానది వానకాలమందు బురద నీళ్లు వచ్చి పడినను నలుపై పోదుగదా.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి నిశ్చయము, బుద్ధిమంతుఁడగు లక్ష్మణు నభిప్రాయము దెలిసిన దగుటచే సీతాదేవి వానకాలమున మడ్డినీళ్ళు పడినను స్వభావ శ్వేత గుణముల నదలని గంగవలె నీమెయు గుండె నిబ్బరము గలదై యున్నది. లేకుండిన నెప్పుడో గుండె పగిలి చచ్చియుండును.

క. రామునకీ యసితేక్షణ, రాముఁడు నీ సతికిఁ దగును ♦ ప్రాయమునందున్
 శ్రీమానిత శీలంబుల, సాముద్రికలక్షణముల ♦ సద్వంశమునన్. ౨౬౦

అర్థములు. అసితేక్షణ=కాటుక కన్నులది, ప్రాయము=వయస్సు, శ్రీమానిత శీలంబులన్=సంపత్కరమై గౌరవింపఁబడఁ దగిన స్వభావ గుణములచేత.

## తాత్పర్యము

రామచంద్రమూర్తికి కాటుక కంటి సీతయు, రాముఁడీ పతివ్రతకును వయస్సునందు శోభాకరములై గౌరవింపఁదగు స్వభావగుణములందు సాముద్రిక లక్షణములందు సద్వంశమునఁ బుట్టుట యందుఁ దగియున్నారు. అది యెట్లనఁ—

రాముఁడు నసితేక్షణుఁడే, సీతయు నసితేక్షణయే. ఒకరు సీత మాత్రమే యసితేక్షణ, రాముఁడు కాఁడు, ఆ కారణమున సీతయందది యాధిక్యమని వ్రాసిరి కాని యది సరికాదు. కిష్కింధా కాండము ౧౦౦౦ వ పద్యమందు "వికసితమేచక

కంజతుల్య దర్శనీయుఁ డని రామచంద్రమూర్తి చెప్పఁబడెను. కావున నిరువురు నసితేక్షణులే. అయినను స్త్రీలయందు స్వభావసిద్ధమైన సౌందర్యమొకటి యతిశయించి యుండుటచేతను సీతకన్నులు తన కన్నులకంటె మోహజనకంబు లని రామచంద్రమూర్తి 'నీ నాకక్షణంబసితేక్షణ లేక మేని పొందిక బ్రదుకంగ నేర' నని (సుందర. ౧౭౧౩ ౪) చెప్పుటచే సీతాదేవి కన్నులే సౌందర్యమున నతిశయించె నని భావము. అట్టి కన్నుల కరుణార్ద్ర దృష్టి నాపై నెప్పుడు పడునో కదా. ప్రాయమునందున్=వయస్సునందు, వివాహకాలమునకు రామచంద్రమూర్తికిఁ బన్రెండేండ్లు. సీతాదేవికి నారేండ్లు.రాముని యేండ్లలో సగము సీతాదేవికిఁ గలవు. కావునఁ దగిన వయస్సే. ఈడులేని పెండ్లి రసాభాసము, శాస్త్రవిరోధము. 'వర్షైరేకగుణాం భార్యా ముద్వహే త్త్రిగుణోవరః । ద్వ్యష్టవర్షోష్టవర్షాం వావయోమాత్రావరాచ యా' విష్ణుస్మృతి. అనఁగా కన్యక యెనిమిది యేండ్ల దగునేని వరుఁడు పదునారేండ్ల వాఁడై గాని యిరువది నాలుగేండ్లవాఁడై గాని యుండవలెను.

ఈ లెక్క వివాహ సమయమందే గాని యావలఁగాదు. ఇప్పుడు శ్రీరామచంద్రమూర్తికి ముప్పది తొమ్మిది సంవత్సరములు. సీతాదేవికి ముప్పది రెండు సంవత్సరములు విష్ణుపురాణము కూడ వరునివయస్సులో మూఁడవ వంతు వధువున కుండవలె నని చెప్పుచున్నది.

సీతారాములు వయస్సునం దెట్లు తగి యున్నారో శీలమునం దట్టులే తగి యున్నారు. ఎట్లులనిన:— రామచంద్రమూర్తి 'వానియెడ నుండెనేని యేదేని దోష మద్ది గర్హ్యంబుగాదు సదాళుల, కని చెప్పెను. సీతాదేవియో'

వధకుఁ బాత్రుల పట్లన్ గృపఁ జూపవలయు సజ్జనుఁ డపరాధము చేయనట్టి యతఁడుం గలఁడే,యని చెప్పెను.

సాముద్రిక ప్రకారము సార్వభౌముఁడు కాఁగలవాని చిహ్నములు రామచంద్రు నందుఁ గలవు. అట్టివానికి భార్యగా నుండఁదగిన దాని కెట్టి చిహ్నము లుండవలయునో యట్టివి సీతయందు దున్నవి. వంశము నందు నొకరు సూర్యవంశమునఁ బ్రసిద్ధికెక్కినవారి కుమారుఁడు. సీతాదేవి చంద్రవంశమున జగత్ప్రసిద్ధి గన్న జనకుని కూతురు.

ఈ సందర్భమున నీ స్తోత్రము పఠనీయము.

అయోధ్యాపురనేతారం, మిథిలాపురనాయకీం
రాఘవాణా మలంకారం, వైదేహానా మలంక్రియామ్,
రఘూణాం కులదీపంచ, నిమీనాం కులదీపికామ్
సూర్యవంశే సముద్భూతం, సోమవంశే సముద్భవామ్

పుత్రం దశరథస్యాఽపి, పుత్రీం జనకభూపతేః
వసిష్ఠానుమతాచారం, శతానంద మతానుగామ్
కౌసల్యా గర్భసంభూతం, వేదిగర్భోదితాం స్వయమ్.
పుండరీక విశాలాక్షం, స్ఫురదిందీవరేక్షణామ్,
మత్తమాతంగ గమనం, మత్తహంసవధూగతామ్.

♦ ♦ ♦ ♦ ♦

సర్వలోక విధాతారం, సర్వలోక విధాయినీమ్
లోకాభిరామం శ్రీరామం అభిరామాంచ మైథిలీం
అన్యోన్య సదృశౌ వేతౌ త్రైలోక్య గృహదంపతీ.

(హనుమద్విరచిత సీతారామ స్తోత్రమునుండి సముద్ధృతము.)

'స్మరణమాత్ర సంతుష్టాయ' యన్నట్లు స్మరణముచే సంతోషించు వాఁడు రామచంద్రమూర్తి. ఒక్క నమస్కారముతో సంతోషించునది జానకి. 'ప్రణతి ప్రసన్న జానకి' యని యీ కాండమే చెప్పుచున్నది.

ఇట్టి యనురూప దాంపత్యము లోకమునందుఁ గలదా యని హనుమంతుఁ డాశ్చర్యపడుచున్నాఁడు.

ఇచ్చట నీ శ్లోకార్థము గ్రాహ్యము.

యువత్వాదౌ తుల్యేఽప్యపరవశతా శత్రుశమన
స్థిరత్వాదీన్ కృత్వా భగవతి గుణాన్ పుంస్త్వసులభాన్
త్వయి శ్రీ త్వైకాంతాన్ ప్రమదిమ పదిపారార్థ్య కరుణా
క్షమాదీన్ వా భోక్తుం భవతి యువయో రాత్మని భిదా॥

తల్లీ! యౌవనములోనైన గుణములు మీాయిద్దఱి యందు సమానములే, అయినను స్వాతంత్ర్యము శత్రు సంహారము స్థిరత్వము(స్వకార్యము నుండి చలింపకుండుట) యీా మొదలగు పురుషులయం దుండఁ దగు గుణములు నీ భర్తయం దున్నవి. నీ యందో మృదు హృదయము, భర్త విషయమున పారతంత్ర్యము, కరుణ, (ఇతరుల దుఃఖముల సహింప లేకుండుట) క్షమ (అపరాధముల సహించుట) గలవు. ఈ యీా మొదలగు గుణములు మీా స్వరూప విగ్రహములను వను భవించుట యందు భేదము గలదు. ఈ కారణముచే భర్తల కిరువురును సేవ్యులే కాని యొకరు మాత్రము గారు. ఈ సందర్భమున వీరి యిరువుర సామ్యము గుఱించిన ఈ ప్రమాణ వాక్యంబులు స్మరణీయంబులు. "నిత్యైవైషా జగన్మాతా, విష్ణోః శ్రీ రనపాయినీ। యథా సర్వగతో విష్ణు, స్తథైవేయం ద్విజోత్తమ" జగన్మాత యగు శ్రీదేవి విష్ణువునకు నిత్యానపాయిని. ఇరువురకు వేఱుపాటు లేదు. ఒకరున్న చోట రెండవవారు తప్పక యుందురు.

త్వం మాతా సర్వలోకానాం, దేవదేవో హరిః పితా
త్వయా చ విష్ణునా చాంబ ! జగద్వ్యాప్తం చరాచరమ్.

అమ్మా! సర్వలోకములకు నీవు తల్లివి; దేవదేవుఁడగు హరి తండ్రి; మీ యిరువురిచేఁ బ్రపంచ మంతయు వ్యాపింపఁబడినది.

లక్ష్మ్యా సమస్తం చిదచిత్స్వరూపం
వ్యాప్తం తదీశస్య తు సాఽపి సర్వమ్
తథాపి సాధారణ మీశితృత్వం
శ్రీ శ్రీశయో ర్ద్వ్యాచ సదైకశేషీ ।

చిద చిత్స్వరూపము సమస్తము లక్ష్మీదేవిచే వ్యాప్తము. దానిని నియమించునది యామెయే. అయినను యీశత్వము శ్రీ శ్రీశులయందు ఇరువురయందు సమానము. సర్వదా ఏకశేషులే.

ఒక మాటచే నిరువురఁ దెలుపునది యేకశేషము. జనని+జనకుఁడు=ఈ యిరువురను జెప్పవలసి వచ్చినపుడు జనకులు అనిననఁజాలును. ఇట్టులే భ్రాతలు= అన్న, చెల్లెలు, అక్క తమ్ముఁడు. పుత్రులు=కొడుకు, కూఁతురు.

ఇట్టులే భగవంతుని పేరు చెప్పినపుడు భగవతి లక్ష్మికూడ నున్నట్టులే భావింపవలయును.

ఈ విధముగ సర్వకారణత్వము సర్వవ్యాపకత్వము సర్వనియంతృత్వము లక్ష్మీనారాయణు లందు సీతారాములయందు నిరువురయందుఁ గలదు.

భగవంతుని విషయమై 'సర్వస్య వశీ-సర్వస్యేశానః॥' అనియు 'విశ్వస్యాత్మేశ్వరగ్ం' వాక్యము లుండిన లక్ష్మీవిషయమై 'అస్యేశానా జగతో విష్ణుపత్నీ, ఈశ్వరీగ్ం సర్వభూతానా, మిత్యాది వాక్యములు గలవు.

కావుననే న్యాసవిద్యయందు శరణాగతి యిరువురకుఁ జెప్పఁబడెనే కాని యొకరికి మాత్రమే చెప్పఁబడ లేదు."లక్ష్మీంచ మాం సురేశేశ, ద్వయేన శరణం గతః మల్లోక మచిరా ల్లబ్ధ్వా మత్సాయుజ్యం న గచ్ఛతి। నిరుపాధిస్వతంత్ర శ్చ స్వామినః కరుణానిధిః నిరుపాధిస్వతంత్రాచ స్వామినీ నః కృపానిధిః । త్వమేవ సర్వశాస్త్రేషు శరణత్వేన। నీయసే। ఆత్మాత్మీయం చ యత్కించ దుర్భరం దుస్త్యజం మమ । తత్సర్వం తవ విన్యస్తం శుభయోః పాదపద్మయోః। ఉపేయస్య తవ ప్రాప్త్యై త్వా ముపాయత్వేయా వృణే। ఉపాయో భవ మేదేవ శరణం భవ మేఽచ్యుత। ఉపాయో భవ మే దేవి, శరణం భవ మేఽం బుజే।

• • • •

సకృదేవం ప్రపన్నస్య, కృత్యం నైవావశిష్యతే ।
చంద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం
శ్రియం లోకే దేవజుష్టా ముదారాం
త్వాం పద్మనేమీం శరణ మహం ప్రపద్యే
అలక్ష్మీ ర్మే నశ్యతాం త్వాం వృణే.

ఈ విధముగ శ్రుతు లిరువురకు శరణాగతి విధించుచున్నవి. ఇరువుర యం దుపాయత్వము గలదు. ఉపేయత్వము గలదు. హనుమంతుఁడు చంపఁబూనిన రాక్షస స్త్రీలను తనకు శరణాగతలైన స్త్రీలను దానే స్వతంత్రించి రక్షించెఁగదా. ఇత్యాది కారణములచే సీతారాము లిరువురు సమానులుగ సేవ్యులనియే హను మంతుఁడు గ్రహించెను.

క. అని బంగరు బొమ్మనఁ ద్రిభు,వనములకు న్వేల్పుసాని•వరలక్ష్మి వలెన్
గన నగుసీతను గనుఁగొని, మనమున రాముని దలంచి•మఱియుం బలికెన్.

తా త్ప ర్య ము

అని బంగారు బొమ్మవలె, లేక మూఁడులోకములకు వేల్పుసాని=ఈశ్వరి యగు, వరలక్ష్మివలె=శ్రీ మహాలక్ష్మివలె నుండు సీతాదేవిని జూచి మనస్సున రాముని దలఁచి యి ట్లనుకొనెను.

బంగారు బొమ్మ యనుటచే సుగుణముల రాశి యనియు హేయగుణ రహిత యనియు లోకుల యందఱిచేతఁ గోరఁబడునది యనియు భావము. 'హిర ణ్మయీం లక్ష్మీ'మ్మని కదా, శ్రీసూక్తము. త్రిభువనములకు వేల్పుసాని యను టచే మూఁడు లోకములలోని వా రామె యాజ్ఞాబద్ధు లని భావము.

'యథా మయా జగద్వ్యాప్తం స్వరూపేణ స్వభావతః తయా వ్యాప్తమిదం విశ్వం నియంత్రీ చ తథేశ్వరీ। సర్వేషా మేవ లోకానా మీశ్వరీ మమ వల్లభా॥' నేనెట్లు స్వరూపగుణములచే లోకమున వ్యాపించి యున్నానో లోకముల కెల్ల నీశ్వరి యగు నా వల్లభయు నట్లే వ్యాపించి యున్నది. ఆమె యీ లోకములకు నీశ్వరి యను శ్లోకార్థ మిట ననుసంధించునది.

యథా సర్వగత స్త్వంహి, తథై వేయం రఘూత్తమ. ప. పు. నీ వెట్లు సర్వత్ర వ్యాపించి యున్నావో రామచంద్రా! యీమెయు నట్లే వ్యాపించి యున్నది.

లోకేశ్వరి యనిన శచీ సరస్వతీ పార్వతీత్యాదు లందెవరో యని సందే హము గలుగకుండుటకై వరలక్ష్మి యనియె స్పష్టముగఁ జెప్పుచున్నాఁడు. సంస్కృతమున ఇవ శబ్దము ఏవార్థమున గ్రహించి నట్లు ఇచ్చట వలె ననునది నిర్ధారణమందు గ్రహింపనగు.

పై పద్యమునందు సీతాదేవిని మనుష్యభావమునఁ జెప్పెను. ఆమెను మఱియుఁ బరీక్షించి యమానుష లక్షణము లుండుట గ్రహించి దేవతా స్త్రీలలో నీమె యెవతెయై యుండు నని విచారించి లక్ష్మీదేవియే యని తీర్మానించుకొను చున్నాఁడు. హనుమంతుఁడు రామచంద్రమూర్తిని తొలుత దర్శించి నపుడు రామచంద్రమూర్తి నాలుగు చేతులతోఁ గనఁబడఁగా నీయన సామాన్యమనుష్యుఁడు గాఁడు, భగవదవతారమూర్తి యని గ్రహించెను. ఇచ్చట లక్ష్మీత్వము సుస్పష్టముగా సీతయందుఁ గాన వచ్చెను.

వేల్పుసాని యనుచో "బ్రహ్మేశాది సురవ్రజ స్సదయితః త్వద్దాసదాసీగణా" యను శ్లోకార్థము గ్రహింపనగు.

స్వరూపం స్వాతంత్ర్యం భగవత ఇదం చంద్రవదనే
త్వదాశ్లేషోత్కర్షా ద్భవతి ఖలు నిష్కర్షసమయే
త్వ మాసీ ర్నాత శ్రీ కి మితు రిద మిత్థం స్త్వవిభవ
స్తదంతర్భావా త్త్వాం న పృథ గభిధత్తే శ్రుతి రపి ॥

తల్లీ! భగవంతుని స్వరూపము స్వాతంత్ర్యము ఎట్టిది యని విచారించి నిష్కర్ష చేయవలసి వచ్చినపుడు నీ సంయోగాధిక్యమును బట్టి యాయన కవి గలుగుచున్నవని చెప్పవలసి యున్నది. అనఁగా సకల సమృద్ధి స్వరూప వగు నీవున్న చోటనే యాయన యుండును గనుకనే శ్రీనివాసుఁ డని పేరుగల వాఁ డయ్యెను, అని నిన్నుఁ బట్టి యాయన గుణములు స్వరూప స్వభావములు తెలియవలసి యున్నవి. కనుక శ్రుతులు నీవు భగవంతునికంటె భిన్నమని చెప్పవు.

సీ. ఈ కాంతకై కదా ♦ యిషువున నొక్కంట, బలశాలి యవ్వాలి♦భంగపడియె
నీ వెలందికె కదా ♦ రావణతుల్యవీ,ర్యుండు గబంధుఁడు ♦ రూపు మాసె
నీ మానినికె కదా♦భీమవిక్రముఁ డైన, యనిరోధుఁడు విరాధుఁ♦డంత మొందె
నీ నెలంతకె కదా♦కానలోఁ బదునాల్గు, వేలరక్కసులకుఁ♦బేరు మాసె

తే. నీమెకై కాదె ఖరఖలు♦నామ మణఁగె, నీ సతికిఁ గాదె త్రిశిరుండు♦నీల్గిచనియె
నీ సుదతికయి దూషణుం♦డే పడంగెఁ,బటుపరాక్రముఁ డగు రామ♦భద్రు చేత.

ఈ ప్రకార మీయామెయే రామచంద్రమూర్తి భార్య సీతాదేవి యని నిశ్చయించుకొని యీయామె మహాత్మ్యము మనస్సునకుఁ దెచ్చుకొని మఱియు నిట్లనుకొను చున్నాఁడు.

అర్థములు. ఇషువు=బాణము, అనిరోధుఁడు=అడ్డము లేనివాఁడు.

రామచంద్రమూర్తి చేయు కార్యముల కన్నిఁటికి మూలకారణ మీయామెయే కదా యనుకొనుచున్నాఁడు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి బలశాలి యగు వాలిని నొక్క-బాణముచే జంపుట యీమె కొఱకే కదా. ఈమె కొఱకే కదా రావణునితో సమానమైన బల వీర్యములు గల కబంధుఁడుఁ రూపు మాసిపోయెను. యుద్ధమునం దెదురులేని భయంకరమైన పరాక్రమము గల విరాధుఁడు చచ్చుట కీమె కదా కారణము. ఈమె నిమిత్తముగాఁ గదా జనస్థానమందుఁ బదునాలుగువేల రాక్షసులు నాశమైరి. ఖరుఁడు-త్రిశిరుఁడు-దూషణుఁడు రామచంద్రమూర్తిచేఁ జచ్చుటకు నీమె కదా కారణము.

ఇన్నిఁటి యందుఁ గారణము సీతాదేవి. కర్త శ్రీరామచంద్రమూర్తి. ఇవన్నియు మనస్సునం దుంచుకొనియే రావణు విషయము నందును నిమిత్తము శ్రీరామచంద్రమూర్తి యనియు నిమిత్తమ కారణము సీతాదేవి యనియు ౧౩౩౬ వ పద్యమున హనుమంతుఁడు వానరులకుఁ జెప్పెను. చేయించునది సీతాదేవి. చేయువాఁడు రామమూర్తి. నిగ్రహానుగ్రహముల రెంట నిదే నియమము.

ఉ. ఈమెకు నై దురాలభకపీశ్వరపాలితపూజ్యసంపదల్
శ్రీమహితార్క-సంభవునిఁ జేరె నిమేషములోన, సాగరం
బీమెకుఁ గాదె నేను దరియించితి, నీ పురిఁ గంటి, నీమెకై
రాముఁడు లోక మెల్ల మహిఁగ్రాఁచిన యుక్తమ నాకుఁ జూడఁగన్. ౪౬౩

అర్థములు. దురాలభ=లభింప సాధ్యముకానిది. అర్క-సంభవునిన్=సుగ్రీవుని, గ్రాఁచినన్=కాల్చినను.

తాత్పర్యము

ఈమెకుఁగాను గదా దుర్లభమైన వానరరాజ్యసంపద నిమిషములో సుగ్రీవునికి లభించెను. ఈమె నిమిత్తమై కదా నేను సముద్రము దాఁటితిని. ఈ పట్టనము జూచితిని. ఈమెను దక్కించుకొనుటకై రామచంద్రమూర్తిగాని నేనుగాని చేసిన యీ కార్యములు క్షుద్రములు. ఇవి యవి యననేల? ఈమె నిమిత్తమై రామచంద్రమూర్తి మూఁడులోకములు దహించినను దోషముగాదు. ఎల?

క. మేలో త్రిభువన రాజ్యము, మేలో జానకి యటన్న మేదినిసుతకున్
త్రైలోక్యరాజ్య మెల్లను, జాలదు పోయొక్క-కళకు సరిపోలంగన్. ౪౬౪

తాత్పర్యము

సీతాదేవి లేక మూఁడులోకముల ప్రభుత్వము వచ్చిన మేలా? మూఁడులోకముల ప్రభుత్వము లేక యొక సీతాదేవి లభించుట మేలా? యని యాలోచించిన సీత కళలలో నొక్క- కళకైనను నీ మూఁడులోకములు సరిపోఁజాలవు. సీతాదేవి

యొక్కటే యుండెనా? నా యిటువంటి ముల్లోకములు కోటానఁగోట్లు లభించును. ఆమె లేకున్న, యీ మూఁడులోకములు కూడ దక్కవు. కావున సీతను దక్కించుకొనుటకై యీ మూఁడులోకములను భస్మము చేసినను దోషము గాదు.

భగవంతుఁడనేక కోటి బ్రహ్మాండ నాయకుఁడు. లక్ష్మీదేవి యీ యఖిలాండకోటి బ్రహ్మాండములకు నాయకి. ఈ యనంత బ్రహ్మాండములామె వలననే నామరూపవంతములై స్థితిగలవై యున్నవి. అట్టి యీమెకీ మూఁడు లోకము లేమి లెక్క? ఇట్లు చెప్పుటచే లక్ష్మీదేవి (సీతాదేవి) సహధర్మచారిణియై భగవత్సంకల్పానుసారముగఁ దదాజ్ఞా వశవర్తినియై యాయనకుఁ బరతంత్రయై యుండు నని భావము.

ఆ. ఈమె ధర్మశీలుఁ • డెంతో మహాత్ముండు, మిథిలనాథుఁ డగుచు • మేల్మిగన్న
ప్రథితజనకుతనయ • భర్తృదృఢవ్రత, యల్ల సీత సంది • యంబు లేదు. ౭౬౧

అర్థములు. ప్రథిత=కీర్తి కెక్కిన.

తాత్పర్యము

ఈమె ధర్మగుణము గలవాఁడును నింతయని చెప్పరాని మాహాత్మ్యముగలవాఁడును నగు మిథిలాధినాథుఁడగు జనకునికూఁతురు. పరమ పతివ్రత యగు సీతయే, సందేహము లేదు. ఆమె యందుఁగాకున్న నిట్టి లక్షణములు మఱియొకతె యందుండవు.

సీ. తమ్మిపుప్వులయం • దం బైన మడిదుమ్ము, రేఁచునాఁగటికొనఁ • దోఁచెధాత్రి
సత్యశీలుం డైన • జనకావనీశుని, ముద్దులకూఁతు రై • తద్ద పెరిఁగె
అతివీరుఁ డార్యుండు • నపరాజితుండైన, యాజికిఁ దొలికోడ • లగుచు నెగడె
విదితాత్ముఁడునుగృత • విదుఁడు ధర్మజ్ఞుఁడౌ, రాముని మోహంపు • రాణియయ్యెఁ
తే. గాంతుపై భక్తిఁ గష్ట మన్ • చింత లేక, సౌఖ్యములఁ బాసి పోచ్చెని • ర్జనవనంబు
నాకులలములు దిని యింటి • యందుఁ బోలెఁ, బతిని సేవించు నతిదైత్య • సతులఁ జిక్కె.

అర్థములు. తమ్మి=తామర, ధాత్రి=భూమి, దాది. సత్యశీలుఁడు=సత్యము పలుకుటే స్వభావముగఁ గలవాఁడు, అపరాజితుఁడు=జయింపరానివాఁడు, ఆజికి=దశరథునకు, తొలికోడలు=పెద్దకోడలు; విదితాత్ముఁడు=ఆత్మజ్ఞానము గలవాఁడు, కృతవిదుఁడు=కృతజ్ఞుఁడు, మోహంపురాణి=ప్రియురాలు.

తాత్పర్యము

తామర పుష్పములచే నందంబైన పొలము దుమ్మును రేఁగునట్లు చేయు నాఁగటి కొనవలన భూమియందు, పుష్పొడిచే నందమైన తామరల దుద్దునందుఁ దోఁచు లక్ష్మీదేవివలె జనించి ధాత్రిని లోకమున కంతయు ధాత్రి జేసెను.

ఆ పిమ్మట సత్యమైన శీలము, సత్యమే శీలముగాఁ గలిగిన జనకునకు ముద్దు కూతురై తనకు జనకుఁడగుటచే లోకమునకంతయు జనకుఁడను పేరువచ్చునట్లు చేయుచుఁ బెరిగెను. (తనతోఁ బుట్టిన కారణమున చంద్రుఁడు లోకమున కంతయు మామయైనట్లు) ఆవల నతి పరాక్రమవంతుఁడును ఆర్యుఁడను సార్థకనామధేయము గలవాఁడును యుద్ధమునందుఁ బరాజయ మెట్టిదో యెఱుఁగనివాఁడును, నగు దశ రథునకు బెద్దకోడ లయ్యెను. ఆత్మజ్ఞానము గలవాఁడును కృతజ్ఞుఁడును శరణాగత రక్షణ ధర్మ మెఱిఁగినవాఁడును, నగు రామచంద్రమూర్తికి ముద్దులరాణి యయ్యెను. ఇటువంటి మహానుభావురాలు భర్తపైగల భక్తిచేతఁ గష్టమను విచారమే లేక సౌఖ్యములనెల్ల సమూలముగ వదలి పతిసేవ యథేచ్ఛముగఁ జేయ వచ్చునని జనులులేని యడవికివచ్చి యాకలములుదిని స్వగృహమందువలె సంతుష్ట చిత్తయై పతిని సేవించు మహాభాగ రాక్షసస్త్రీల నడుమఁ జిక్కుపడి యున్నది. సీతాదేవికి నడవియందలి కష్టములు కష్టములుగాఁ దోఁపకుండుట కేమి కార ణము? భక్తిపూర్వకముగ మనస్సంతయు భర్తపై నుంచినది కావున. ఱాతిని ద్రొక్కితినా కంపను ద్రొక్కితినా యని మనస్సు దానిపై నుండినఁ గదా కష్టము తెలియును. మనస్సు మఱియొక విషయమున నానందించునపుడు తక్కిన వెట్లు మనస్సునకు రాఁగలవు.

ఉ. సుందరిఁ గష్టదూర దర•సుస్మితభాషిణి స్వర్ణవర్ణ రా
కేందునిభాస్య రాక్షసకు•లేశ్వరపీడిత సీరువట్టుచే
వందురువాఁడు పెంజలువ•పందిరి డాయఁగఁ గోరునట్టు లీ
కుందరదం గనంగ రఘు•కుంజరుకోరుట యుక్తమే కదా. ౮౬౭

అర్థములు. కష్టదూర=కష్టములకు దూరముగ నుండఁదగినది, దరసుస్మిత భాషిణి=కొంచెపుఁ జిఱునవ్వుతో మాటలాడునది, 'స్మిత మిహ వికాసి నయనం, కించిల్ల క్ష్యద్విజం హసితం। మధురస్వనం విహసితం సాంగశిరఃకంప ముద్ధసితమ్। అపహసితం సాస్రాక్షం విక్షిప్తాంగం భవత్యతిహసితం ద్వే ద్వే హసితే చైషా ముత్తమ మధ్యమాధ మాభిధే క్రమశః.

పెదవులు కదలింపక కన్నులచే నవ్వుట హసిత మనఁబడును. కొంచెముగా దంతములు కనపడఁ బెదవులు తెఱచుట హసిత మనఁబడును. ఇవి రెండుత్తమ స్త్రీల లక్షణము. మధురముగ స్వరము వినవచ్చునట్లు నవ్వుట విహసితము. దేహము శరీరము కదలునట్లు నవ్వుట ఉద్ధసితము. దీనినే యపహసితమందురు. ఈ రెండును మధ్యమ స్త్రీల లక్షణములు. కన్నీళ్ళు కాఱునట్లు నవ్వుట అపహ సితము. విశేషముగ దేహమంతయు గదులునట్లు నవ్వుట అతిహసితము. పకపక వికవిక నవ్వులు దీనిలోఁ జేరినవే. ఇది యధమ స్త్రీల లక్షణము. స్వర్ణవర్ణ= బంగారు చాయగలది. రాకేందునిభాస్య=పూర్ణచంద్రునివంటి ముఖము గలది,

రాక్షసకులేశ్వర పీడిత=రావణుచే బాధింపఁబడునది, నీహవట్టుచే=దప్పిచే, వందురు వాఁడు=బాధపడువాఁడు, రఘుకుంజరు కోరుట=రాముఁడు కోరుట, షష్ఠీసమాసంబునఁ బ్రత్యయలోపము.

తా త్ప ర్య ము

సీతాదేవి సౌందర్యముచేతనే యాదరింపఁదగినది. కష్టములెట్టివో యెఱుఁగక సుఖము లనుభవింపదగినది ఉత్తమ స్త్రీ గావునఁ గొంచెపుఁ జిఱునవ్వుతో మాటలాడునది, బంగారు చాయగల దేహము గలది, నిండు చందురుని వంటి ముఖము గలది. రావణుచే బాధింపఁబడునది. ఇట్టి దానినిదప్పి గొన్నవాఁడు పెద్ద చలువపందిరి యొద్దకుఁ బోవఁ గోరునట్లు రామచంద్రమూర్తి చూడఁగోరుట యేమి యాశ్చర్యము? చూడఁగోరఁదేని దోషమాతనిదేకాని యామెది కాదు. చలువపందిరి యొద్దకు దప్పి గొన్నవాఁడు పోకుండిన దోషమెవరిది? దుఃఖమెవరికి?

క. రాజ్యపదభ్రష్టుఁడు దన, రాజ్యము లభియింప నలరు ♦ రహిని ద్రిలోకీ
పూజ్య యగు సీత మరలం, బ్రాజ్యంబుగఁ బొంది ముదము♦పడు రాముండున్.

తా త్ప ర్య ము

రాజ్య సింహాసనమును బోఁగొట్టుకొన్నవాఁడు తన రాజ్యమును మరల సంపాదించుకొని సంతోషించు నట్లు మూఁడు లోకములకు త్రివిధ జీవకోటులకు (బద్ధ ముక్త-నిత్య) పూజ్యురాలగు సీతను రామచంద్రమూర్తి మరలఁ బొంది సుఖించును, సంతోషించును.

దప్పిగొన్నవాఁడు-చలువపందిరి. రాజ్యము భ్రష్టరాజు-ఈ రెండుపమానములు రామచంద్రమూర్తియే సీతను బొందుటకై కృషిచేసి యామె యున్న చోటికి వచ్చి యామెను గ్రహింపవలయు నని సూచించుచున్నది. ఆ విషయమున సీతాదేవి చేయవలసిన ప్రయత్న మేమియు లేదు.

ఉ. చుట్టములం దొలంగినను ♦ జూఁటలు వోయినఁ గామభోగముల్
నిట్టల మైన కష్టముల ♦ నెవ్వగఁ దాను మునింగి యుండినన్
నెట్టన ప్రాణహానిఁ గన ♦ నిల్పి మనం బనయంబు నోర్పుతో
గిట్టక యున్న దీమె పిడి♦కింట నయో బిగఁబట్టి ప్రాణముల్. ౨౬౫

అర్థములు. తొలంగినను=వదలినను, జూఁటలు=కొల్లలు, నిట్టలము=అధికము, నెవ్వగన్=నెఱ+వగన్=నిండు దుఃఖమునందు, అనయంబు=సర్వదా, గిట్టక=మరణింపక.

తా త్ప ర్య ము

దప్పిగొన్నవాఁడు చలువపందిరికై రాఁగా, నందు నీళ్లు లేకుండెనేని యెట్లు పరితపించునో యట్లు రామచంద్రమూర్తి తన నిమిత్తమై యెంతో కృషిచేసి వచ్చి

నపుడు సీత తాను మరణించి యుండిన నెంత సంతాపపడునో యను భావముతో నాయన కట్టి సంతాపము కలిగింప నిష్టము లేక బంధువులందఱు విడిచినను, ఇష్ట సౌఖ్యములు కొల్లపోయినను, ఎన్ని దీర్ఘకష్టములలో మునిఁగినను, సర్వకాల సర్వావస్థల మనస్సు తన భర్త యందే నిలిపి పోనున్న ప్రాణములను బోనీయక బిగఁబట్టి యున్నది. ఆమె చేయఁదగినది యింతమాత్రమేగాక మఱియేమి చేయఁ గలదు.

ఈ పద్యము మొదలు సీతాదేవి వృత్తాంతము ఏకమై, అనన్యమై, భగవత్ప్రాప్తి యెప్పుడో యెప్పుడో యనియే కోరు పరమభక్తుని ప్రపన్నుని చరిత్రము ననుకరించుచున్నది. లంకయందు స్త్రీలు.

౧. జన్మకర్మములచే రాక్షసు లయి రావణు వలచియుండువారు.

౨. జన్మకర్మములచే రాక్షసులు గాకపోయినను రావణుచే నపహరింపఁబడి లంకకు వచ్చిన పిమ్మట వానికి వశపడి యుండుటే సుఖమని యుండువారు.

౩. రావణుచే బలాత్కారముగ నపహరింపబడి లంకనుండి రావణుబారి నుండి తప్పించుకొని పోవు మార్గము తెలియక రక్షించువారు లేక క్షుద్ర సహవాసమని వాని సాంగత్యము రోసి వానికి విముఖులై లంకయందే పడియుండువారు.

౪. బలాత్కారముగ లంకకుఁ దేఁబడినను రామచంద్రమూర్తిని నమ్మి యాయనయే రక్షకుఁడని విశ్వసించి యాయననే ధ్యానము చేయుచు లంకను, రావణుని సపరివారముగ దగ్ధముచేసి పోవలయునని యుండు సీతాదేవి.

ఈ లోకమునం దీ నాలుగు తెగల మనుష్యులే కానవచ్చుచున్నారు.

౧. మొదటి తెగవారు పాపములోఁ బుట్టి పాపములోఁ బెరిఁగి యింద్రియ పరమార్థమని తలఁచి పరలోక విచారమే లేనివారు.

౨. ఉత్తమవంశములలోఁ బుట్టినను స్వధర్మమునుండి చెడి కామదాసులై యింద్రియ సుఖములకుఁ బాలుపడినవారు.

౩. ఉత్తమ జన్మము లెత్తియు సంసారమునఁబడి కామమునఁ జెడ నొల్లక సంసారమునుండి తప్పించుకొను మార్గము తెలియక రక్షకులు లేక పరితపించు జీవులు.

౪. ఏదియో యల్పపాపముచే సంసారమునఁ బడితి మని తలంచి నిర్వేదపడుచు దీనినుండి తప్పించువాఁడు భగవంతుఁడు తప్ప వేఱొకరుఁడు లేఁడని విశ్వసించి తక్కిన యుపాయము లన్ని వదలి పరమభక్తినో, ప్రపత్తినో యాశ్రయించి యుండువారు.

సీతాదేవి తాను చెఱనుండి తప్పించుకొని పోవుటయేగాక తనవలె దుఃఖించుచున్న దేవ గంధర్వ నాగ కాంతలను, విడివడఁజేసి నట్లు ఈ నాలుగవవారు తాము తరించి తమతోడి వారిని దరింపఁజేయుదురు. వీరికిఁ గావలసినదే రామాయణంబున సీతాచర్య నేర్పునది. దేహమునందుండు బద్ధ... కామక్రోధాదులు, ఇంద్రియ

ములు తన్ను బాధించుచున్నను వానిని లక్ష్యపెట్టక దుఃఖములవలె సుఖంబులను గోరక భగవత్ప్రాప్తికై యెదురుచూచుచు భగవత్ప్రాప్తితప్ప వేఱు స్వర్గాది ఫలము గోరక భగవత్ప్రాప్తికి భగవంతునిఁ దప్ప, కర్మజ్ఞాన, యోగసాధన భక్తులను నుపాయముల వెదకక దేహాభిమానము స్వాతంత్ర్యము వదలి స్వరక్షా భారము భగవంతుని మీఁదనే వైచి, అనన్యార్హ శేషత్వము, అనన్యశరణత్వము, అనన్యభోగ్యత్వము నను నాకారత్రయ సంపూర్తిగలిగి సంసారమం దుండియే తరింపఁ గోరి ప్రపత్తిచేతనో, పరమ భక్తిచేతనో సాయుజ్యము పొందవచ్చునని సీతాదేవి చరిత్రమువలన మన మెఱుంగవలసి యున్నది. మీఁదఁ జెప్పిన విషయము లన్నియు సీతాదేవి చరిత్రయందు గమనింప నగు. సాయుజ్య లక్షణము యుద్ధకాండమునఁ జెప్పఁబడును. కావున భగవత్ప్రాప్తి కోరువాఁడు ఆయన యనుగ్రహప్రాప్తికై సీతాదేవివలె భగవన్నామోచ్చారణము చేయుచు స్వధర్మము వదలక మీఁదఁ జెప్పినట్లు వర్తించుట తప్ప మఱియేమియుఁ జేయ వలసిన పనిలేదు. సీతాదేవి ప్రతిదినము సంధ్యవార్చుచుండెననుటచే పరమభక్తుఁడైనను, ప్రపన్నుఁడైనను, జ్ఞానియైనను యావజ్జీవము నిత్యకర్మముల వదలరాదు. కామ్యకర్మములతోఁ బనిలేదు. ప్రపన్నుఁడు పరమ భక్తుఁడు యజ్ఞాదులు చేయ వలసిన పనిలేదు. ప్రాణాయామ మభ్యసింప వలసిన పనిలేదు. ఆసన సిద్ధి పనిలేదు. సన్న్యాస విషయము తలంపవలసిన పనిలేదు. సర్వ భూతదయ వదలరాదు. శత్రువులం దైనమైత్రేయే చూపవలయును. ఇవన్నియు సీతాదేవి చర్యవలన మనము నేర్చుకొని బాగుపడవలసిన విషయములు. ఈ ప్రకారము వర్తించు వానికి జన్మాంతమునందే ముక్తి సిద్ధించును. సందేహము లేదు.

ఉ. చూడదు రాక్షసాంగనలఁ ♦ జూడదు పుష్పఫలద్రుమంబులన్
 జూడదు రమ్యహర్మ్యముల ♦ సుందరి డెందమునందు నెప్పుడున్
 జూడఁగఁ గోరుచున్ భువన♦సుందరు రాముని నొక్కని న్మదిన్
 వేడుక సేయ దయ్యో నవ♦నీసుత, యుక్తమెకా తలంపఁగన్. ౪౭౦

అర్థములు. ద్రుమంబులన్=చెట్లను.

తాత్పర్యము

సుందరి యగు సీతాదేవి భువన సుందరుఁడైన శ్రీరామచంద్రు నొక్కని మాత్రమే చూడఁగోరుచు సర్వవేళల మనస్సంతయు నాయన యందే నిలిపి తన్ను బాధించు రాక్షసస్త్రీలను జూడదు. పూలచే పండులచే నిండి మనోహరమైన చెట్లను గాని యింపైన మేడలను గాని చూడదు. ఇది తగినకార్యమే కదా. చూడదనుటకుఁ గన్నులుమూసికొని కూర్చుండినదని యర్థముగాదు. వానిని మనస్సులోనికి రానీయలేదని భావము. రాక్షసాంగనలఁ జూడలేదనుటచే వారు పెట్టు బాధలను లక్ష్యము చేయలేదని భావము. పండ్లు పూలచెట్లను జూడలేదనుటచే ప్రియములమీఁద మనస్సు పోనీయలేదని భావము. ప్రియాప్రియములు

రెండు వదలె నని భావము. సుందరి భువనసుందరుఁ గోరె ననుటచే నపహత పాప్మాది గుణములు శుద్ధాత్మయందుఁ బరమాత్మయందుఁ గలవనియు జీవునం దల్పముగను పరమాత్మయందుఁ బూర్ణముగను సంకోచ వికాసములు లేకయున్న వనియు శేష శేషిత్వ భావమును దెలుపుచున్నది. రాముని నొక్కని ననుటచే నేక భక్తిని నేకాగ్రభక్తిని అనన్యత్వమును జెప్పఁబడెను. యుక్తమెకా యనుటచేఁ బ్రపన్నునకుఁ బరమభక్తునకు నిట్టిచర్య తగును గదాయని భక్తాగ్రగణ్యుఁడగు హనుమద్దాసుఁ డామోదించుచున్నాఁడు. తాను బండితుఁడైనవాఁడే కదా యెదుటివాని పాండిత్యము నెఱుఁగఁ గలఁడు. ఈ పద్యము భక్తుఁడు,ప్రపన్నుఁడు చాతకమువలె నుండవలయు నని బోధించుచున్నది. భూమియందెన్ని చెఱువులు నదులున్నను జాతకము వానిలోని నీరు త్రావక మేఘములో నుండి పడు నీటి బొట్టునకై కాచియుండును. అట్టులే భక్తుఁడు దేవత లెందఱున్నను దన యిష్ట దైవమునే నమ్మి యేకభక్తి గలవాఁడై యుండును. అట్టులే పతివ్రతయుఁ దన భర్తకంటె ధనవంతులు, విద్యావంతులు, రూపవంతులు, బలవంతులు లోకమున నుండినను వారినెల్లఁ దన భర్తకంటె నధములుగానే యెంచును గాని వారిని బ్రేమించదు. వారివలన నొకటి యాశింపదు. ఈ సందర్భమున నీశ్లోకము స్మరింప నగు పూర్వార్థము దండి చెప్పినది. ఉత్తరార్థము కాళిదాసు చెప్పినది.

'కేవా న సంతి భువి వారిరుహావతంసహంసావళీవలయునో జలసన్నివేశాః। కిం చాతక ఫల మపేక్ష్య సవజ్రపాతాన్ పాయోధరం (పౌరందరం) కలయతే నవవారిధారాః'.

క. వరభూషణములకంటెను, బరమం బగు భూషణంబు ♦ భర్తయె సతికిన్
దరుణీమణి తద్భూషా, విరహితయై వనరుకతన ♦ వెలుఁగదు కంటే. ౭౭౧

## తాత్పర్యము

శ్రేష్ఠములయిన యాభరణములకంటె పతివ్రతకు శ్రేష్ఠమైన భూషణము భర్తతోడ నుండుటయే. ఆభర్త యను భూషణము సమీప మందులేమిని నీమె యువతులలో నెంత గొప్పదైనను బ్రకాశింపక యున్నది.

భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్......వాగ్భూషణమే సుభూషణము-భూషణముల్ నశియించు నన్నియు నన్నట్లు భూషణముల కంటె గొప్పదియు యావజ్జీవముండునదియు నిహపర తారకమగునది యగు విద్య లోనయిన వన్నియు భగవద్భక్తి లేకున్నచో వ్యర్థములు. భక్తిలేని పండితుఁడు చాకిమూటమోయు గాడిదవంటివాఁడు. జీవునకు భర్త భగవంతుడే.

క. ఎంతటి దుష్కరమును భూ,కాంతుఁడు ఘటియించు నీమెఁ ♦ గనకయు బ్రదికెన్
జింతావ్యథఁ జిక్కండు, న్వింతగ దే మిగుల రాము ♦ నిస్తులచరితల్. ౭౭౨

అర్థములు. నిస్తుల చరితల్=అసమానమైన నడివడి. దీని తాత్పర్యమునకు ౪౬౪-౪౬౫ పద్యములు చూచునది. మరల నదియే చెప్పవలసిన కారణ మేమన: ఇందుఁ గ్రియభేదము. 'మమ ప్రాణాహి పాండవాః' 'సాధుల ప్రాణము నాయది సాధుల ప్రాణంబు నేను' అని చెప్పినవాఁడు తన ప్రాణము నొకచోట నుంచి తా నొకచోట నెట్లుండఁ గలిగెను? లోకమున దేహము ప్రాణము నొకచోఁ గూడి యుండును గాని వేఱువేఱుగా నుండుట గలదా? ప్రాణ మొకచో నుంచి తా నొకచో జీవించుట మపక్కరము గదా. ఇట్టి యసాధ్యకార్యము రామచంద్రమూర్తి చేయుచున్నాఁడే, ఏమి వింత? ముందీ విషయము భార్యాభర్తృ న్యాయము ననుసరించి చెప్పఁబడెను. ఇప్పుడు భక్త భగవన్న్యాయము ననుసరించి చెప్పఁబడెను.

క. అళినీలకుంతలాంతను, నళినీదలతుల్యనయన ♦ నవ్యసుఖార్హన్
గలకంఠి దుఃఖితం గనఁ, బలు కేటికి నాకుఁ గూడ ♦ వ్యథ పైకొనియెన్. ౪౭౩

అర్థములు. అళి=తుమ్మెదలవలె, నీల=నల్లనైన, కుంతలాంతను=వెండ్రుకల కొనలు గలదానిని, తల వెండ్రుకలు తెల్లనగుటకు కొనలయందుఁ బ్రారంభమగును. ఆకారణముచేఁ దక్కిన భాగమందుండు నలుపుకంటెఁ గొనలయందు నలుపు తక్కువ. అట్టి కొనలే నల్లనివని చెప్పినపుడు తక్కిన భాగముల నలుపు చెప్ప వలసిన పనిలేదు. నల్లని వెండ్రుకలు మోహాకారులు.

గీ. ఇరుల గెలిచిన యంతఃపు ♦ రేందుముఖుల
కరుల మరుఁ డను వేటకాఁ ♦ డురులు చేసి
మరులు గొలుపంగ లేఁడయ్యె ♦ మనుజవిభుని
సరులు లేని దృక్ఖంజన ♦ శాబకముల.

శృం. నైష.

ఇట్లు చెప్పుటచే సీత తల విరియఁబోసికొని యున్నదని సూచన.

నళినీకళితుల్య=తామర రేకులవంటి, నయన=కన్నులు గలదానిని, ఇట్లు చెప్పుటచే కలువకంటియగు సీత కన్నులయందుఁ బద్మముల సౌందర్యము గల దనియు నా కారణమున బద్మాక్షుఁడగు రాముని వశపఱుచుకొనఁ గలిగె ననియు భావము. నవ్యసుఖార్హన్=క్రొత్తక్రొత్త సౌఖ్యములకు యోగ్యమైనది. కలకంఠి=మధురమైన కంఠస్వరము గలది. ఈమె దుఃఖించునపుడే యీమె కంఠస్వర మింత యవ్యక్త మధురముగా నున్నదే, సంతోషముతో మాట్లాడిన నెట్లుండునో కదా యని భావము, దుఃఖితన్=దుఃఖించుదానిని, వ్యథ=సంతాపము, పైకొనియెన్=తనంతటఁదానేవచ్చి మీదఁబడెను. నా ద్వంద్వ జయము కూడ వ్యర్థమై పోయెను.

తాత్పర్యము

తుమ్మెదలవలె నల్లని వెండ్రుకల కొనలు గలది, తామర రేకులవంటి కన్నులు

గలది, సాముద్రిక లక్షణములఁ బట్టి యెంతో సుఖింపఁదగినది, మధురమైన కంఠస్వరము గలది, ఇట్టిదికూడ వ్యసనముల పాలగుటచేత, జితేంద్రియుఁడ నని ద్వంద్వాతీతుఁడనని గర్వముగల నాకుఁగూడ నా సమ్మతి లేకయే దుఃఖము తనంతఁదానే వచ్చుచున్నది. రామాంజనేయు లిరువురు విజితేంద్రియులే. నిర్ద్వంద్వులే, ఇరువురు సీతాదేవికై దుఃఖించినవారే. ఏల? పామరత్వముచేతనా? కాదు. పరుల దుఃఖము తన దుఃఖముగా నెంచుట దయ. అట్టిదయ కారణము. బ్రహ్మచారిని, జ్ఞానిని, యోగిని, విరాగిని, క్రోఁతిని కావున మృగమను, సీతాదేవికి నాకు నింతకుఁ బూర్వ మెట్టి సంబంధములేదు. అట్టి నాకే యీమె స్థితి దుఃఖము బలవంతముగాఁ గలిగింపఁగా భర్తయు ప్రియుఁడు రక్షాభారము వహించినవాఁడు. ఈమెచే సేవితుఁడు, ఆనందమనుభవించువాఁడు నగు శ్రీరామచంద్రమూర్తి తనలో సగమగు నీమెకై వ్యసనపడిన నేమివింత? అది స్వభావ విరుద్ధము గాదు. ఇట్టులే “జీవే దుఃఖాకులే విష్ణోః కృపా కాప్యుపజాయతే” అన్నట్లు తన యంశమైన జీవునకుఁ దాను భర్తగాను స్వామిగాను ఆధారముగను, శరణ్యుఁడుగ నుండియు నట్టి జీవుఁడు సంసారములోఁబడి దుఃఖించుచుండ జగత్పితయు, కరుణానిధియు వాత్సల్యసాగరుఁడైన భగవంతునకు దయపుట్టకుండునా? వ్యసనపడకుండునా?

ఉ. రాముఁడు లక్ష్మణుండుఁ దను ♦ రక్షణసేయ సుఖించుచుండు నీ
వామ క్షమన్ క్షమాతరుణిఁ ♦ బద్మవిలోచన రాక్షసాంగనల్
భీమవిలోకనల్ బెదరు ♦ పెట్టుచుఁ గావఁగ వృక్షమూలమం
దీమెయి నున్న దౌర! విధి ♦ కేది యసాధ్యము తప్పఁ జూచినన్. ౮౨౮

అర్థములు. క్షమన్=ఓర్పునందు, క్షమాతరుణి=భూదేవి, భీమ విలోకనల్=భయంకరములైన చూపులు గలవారు.

### తాత్పర్యము

రామచంద్రమూర్తియు లక్ష్మణుఁడు తన్ను రక్షించుచుండ సుఖపడవలసిన యీమె యోర్పునందు భూదేవి వంటిది, కమలముల వంటి కన్నులు గలది, చూచుటకే భయంకరములైన కన్నులు కల రాక్షస స్త్రీలు బెదరు పెట్టుచు రక్షింపఁగా చెట్టు మొదట నీ విధముగా నున్నది. భగవంతుఁడు దయతప్పి ప్రతికూలించినపుడు ఆయన కేది యసాధ్యము. అర్థాంతరన్యాసాలంకారము.

రాముఁడు, భగవంతుఁడు, లక్ష్మణుఁడు—ఇది యనంత గరుడ విష్వక్సేనాది

నిత్య భాగవతుల కుపలక్షణము. ఇట్టి వారిచే రక్షింపఁబడు ప్రత్యగాత్మ; వామ= సంకోచ వికాసములకు లోనగు జ్ఞానముగలిగి భ_క్తిలేమిని ప్రతికూలముగవ_ర్తించి; క్షమన్=ప్రకృతి త_త్వమునంమఁబడి స్త్రీవలె పరవశమై, పద్మవిలోచన=ప్రపంచ పదార్థములందు దృష్టిగలదై; లంక యనెడి దేహములోఁ బడఁగా భయంకరము లైన కామక్రోధలోభాదులు పీడించుచు ప్రకృతి విడిచిపోకుండునట్లు రక్షింపఁగా వృక్షమూలమందు 'సమానవృక్షే' యను శ్రుతి, వృక్ష మనఁగా దేహమని బోధించుటచే వృక్షమూలమందనఁగా దేహమునకు మూలమైన హృదయ స్థాన మందు నీ విధముగ దుఃఖించుచున్నది. శుద్ధాత్మ యిట్లు బద్ధాత్మ యగుటకు భగ వత్సంకల్పమే కదా కారణ మని భావము.

తే. మంచు సోఁకిన నెత్తమ్మిమాడ్కిఁగాంతి,దఱఁగి దుఃఖపరంపరఁదప్తయగుచు
నంటుకానిని బాసినపెంటిచక్ర, వాక మన సీత దీనతఁబొనరు టయ్యె. ౮౭౫

అర్థములు. నెత్తమ్మి=అందమైన కమలము. తఱఁగి=క్షీణించి, శరదృతు వునఁ గళకళ లాడుచున్న తామరపువ్వు మంచుకాలమురాఁగానే కాంతి క్షీణించిన దగును. అట్లీమె పండ్రెండు సంవత్సరము లయోధ్యలో సమ_స్త సౌఖ్యము లనుభ వించుచుండి యిప్పు డాగంతుకముగ నిట్టికష్టము లనుభవించు చున్నది. కాన కాంతిహీనయై యున్నదని భావము. మంచుసోఁకిన నెత్తమ్మి యనుటచే మంచు కాలము శిశిరఋతువు, నేఁడు రేపటితో వెళ్ళిపోవును. ఆవల వసంతము రాఁగానే యథాపూర్వము కాంతియు_క్తమగును. అటులే యీమెకును దుఃఖము త్వరలోనే తొలఁగిపోవు నని సూచన. దుఃఖపరంపరత_ప్త=ఒకటి వెంబడి నొకటి విరామము లేక దుఃఖముమీఁద దుఃఖమే వచ్చుటచే నెంత దుఃఖము సహింప నాధ్యమో యంతకు మించిన దుఃఖముచే బాధింపఁబడుచున్న దని భావము. కమలములు రాత్రి వచ్చిననే ముడుచుకొనిపోవును. దానికిఁదోఁడు మంచుకూడఁ గురిసిన నే మగును? అంటుకానిని=భ_ర్తయగు చక్రవాకమును, పెంటిచక్రవాకము=ఆఁడు జక్కవపక్షి. చక్రవాక దంపతులకు రాత్రివేళ వియోగము. కావున నెడబాసి రెండును విరహవేదనఁ దపించును.

"ఆయాతి యాతి పునరేవ జలం ప్రయాతి
పద్మాంకురాణి విచినోతి ధునోతి పక్షౌ
ఉన్మ_త్తవ ద్భ్రమతి కూజతి మందమందం
కాంతా వియోగ విధురో నిశి చక్రవాకః."

అన్నట్లు మగచక్రవాకమును బాసిన యాఁడుచక్రవాకము ఎట్లు తపించునో యట్లు తనభ_ర్తను విడిచి యీమెయు దుఃఖించి యీమెయు దుఃఖించు చున్నదని భావము. చక్రవాకికి రాత్రివేళ భ_ర్తృవియోగము కలిగినను మరల నుదయము

కాఁగానే భర్తతోఁ గలిసికొందు నను నాశగలదు. అట్టులే యీమెయు నాపదలు కాఁపురములు సేయదు, మంచికాలమువచ్చును,తన భర్త తన్నుఁ గలిసికొను నను నాశతో జీవించుచు ప్రకృతము దుఃఖపడుచున్నది. ఈయుపమానములందుదుఃఖాశయము గ్రాహ్యమేకాని తక్కినవి గ్రాహ్యములు కావు.

## తాత్పర్యము

మంచు సోఁకుటచేఁ గాంతి పోయిన కమలములవలె దుఃఖముమీఁద దుఃఖము వరుసగాఁ బ్రాప్తింపఁగా మిగులఁ బరితాప పడుచు తన భర్తయగు చక్రవాకమును బాసిన చక్రవాకి వలె సీతాదేవి దుఃఖించుచున్నది.

మానిని. పూవులవ్రేఁకన వ్రాలిన కొమ్మలఁ•బొల్చు నశోకమహా•తరువుల్
తావులు నించుచు మాధవచారుసు•ధాకరకాంతులు రేఁగుచు దుః
ఖావిలఁ జేయుచు నున్నవి యీ తర•ళాక్షి నటంచు మనంబున నీ
దేవియ సీత యటంచుచు నిశ్చయ•ధీయుతుఁ డుండె ద్రుమంబుపయిన్.

అర్థములు. వ్రేఁకన=భారముచే, తావులు=వాసనలు, మాధవచారుసుధాకర కాంతులు=వసంతకాలమున మనోహరమైన చంద్రకాంతులు, రేఁగుచున్=విజృంభించుచు, దుఃఖావిలన్=దుఃఖముచే వ్యాకుల పడిన దానిని, ద్రుమంబుపైన్=చెట్టుమీఁద. మానిని=ఏడు భగణములు, గురువు. పదుమూఁడింట యతి.

## తాత్పర్యము

పూవుల బరువుచే వంగినకొమ్మలు గల యశోకవృక్షములు సువాసనలు వ్యాపింపఁ జేయుచు వసంతకాల చంద్రుని మనోహరకాంతులు విజృంభించుచు నీమె విరహాగ్నిని మఱింత ప్రజ్వరిల్లఁ జేసి బాధపెట్టుచున్నవి, అని తనలో నను కొనుచు నీమెయే సీతాదేవియని నిశ్చయబుద్ధిగలవాఁడై రాక్షసస్త్రీలు మేలుకొని యుండుటచే చెట్టు మీఁదనే యుండెను. పూచిన యశోకములు, వసంతకాలము, వెన్నెలకాంతు లివి యుద్దీపనములు, కావున దుఃఖకరములు.

## సీతాదేవిని నశోకవృక్షము క్రింద నుంచవలసిన కారణమేమి?

దీనికే సీతాశోకవృక్ష న్యాయ మనిపేరు. ఏ చెట్టుక్రింద నుంచినను ఆ చెట్టు క్రింద నుంచవలసిన కారణ మేమని ప్రశ్న పుట్టును. ఈమె కూర్చుండిన చెట్టునకు సమీపమందే మేడ యున్నట్లు హనుమంతుని వాక్యముల వలనఁ దెలియనగు. రావణుఁడు దాని యందామె నుంచ వలయుననియే తలఁచెను. గాని యామె నిరాకరించి సమీపమందున్న చెట్టుక్రిందఁ గూర్చుండెను.

—౧౭వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవికిఁ గాపున్న రాక్షసస్త్రీలఁ జూచుట—

క. అంతట నీలాంబువులం, గాంతం బగు హంసయట్లు ♦ గగనాపరభా
గాంతరమున వెలికలువల, కాంతి నిశాకాంతుఁ డమరెఁ గడు నిర్మలుఁడై.

అర్థములు. నీలాంబువులన్=నల్లని నీటియందు, కాంతంబగు = మనోహరమయిన, గగనాపరభాగాంతరమునన్=ఆకాశముయొక్క వెనుకటి భాగమున, పడమటిభాగమున, వెలి=తెల్లని, నిశాకాంతుఁడు=చంద్రుఁడు, కడు నిర్మలుఁడై= మిగుల స్వచ్ఛకాంతి గలవాఁడై.

ఈనాఁడు శుద్ధ త్రయోదశి కావునఁ దొమ్మిదిన్నర గంటలకే చంద్రుఁడు నడినెత్తిమీఁదికి వచ్చెనని ముందు చెప్పఁబడెను. ఈనాఁడు చంద్రాస్తమానము. ఇఱువది యాఱు గడియలకు అనఁగా నాలుగున్నర గంటలకు. ఇప్పుడాకాశము నలుపని చంద్రుఁడు తెల్లకలువవలె నున్నాఁడనుటచే మూఁడు గంటల ప్రొద్దై యుండవలెను.

క. వాసిగ సీతను వెనుకఁగ, బాసట యై వెలసె నేమొ ♦ పావని కనఁగా
భాసురనిర్మల తేజో, రాసులఁ దాపంబుఁ బాపె ♦ రా జాతనికిన్. ౪౭౪

అర్థములు. బాసటయై=తోడై, భాసుర నిర్మల తేజోరాసులన్=ప్రకాశించు నిర్మలమైన కాంతి పుంజముచే, రాజు=చంద్రుఁడు, అతనికిన్=హనుమంతునికి.

హనుమంతుఁడు సీతను వెదక నారంభించినప్పుడు లంకా ప్రవేశకాలము మొదలుకొని యామె కనఁబడు వఱకు హనుమంతునకు సహాయుఁడై చంద్రుఁడు ప్రకాశించెను. పూనిన కార్యము నెఱవేఱినది కావున నిఁకఁ దానుండ రాదని చంద్రుఁడు వెడలి పోవుచున్నాఁడని భావము.

### తాత్పర్యము

హనుమంతుఁడు సీతాదేవిని చక్కఁగా వెతుకుటకుఁ దోడై యుండెనేమో యన్నట్లు నిర్మల కాంతులచేఁ బ్రకాశించి చంద్రుఁ డాయనకు మనస్తాపం బణఁచెను

క. ప్రేఁగున మునిగెడియుడుపము, నాఁ గడుదుఃఖమున పేర్మి ♦ నవయుచు నుండం
గాఁ గనుఁగొనె రాముని యెలనాఁగను నాఁగటిచాలు ♦ నవలామిన్నన్. ౪౭౫

అర్థములు. ప్రేఁగునన్=బరువుచే, ఉడుపము=తెప్ప, నాన్=అనునట్లు, వలె; నాఁగంటిచాలునవలామిన్నన్=సీతాదేవి యనెడి స్త్రీరత్నమును.

### తాత్పర్యము

బరువుచే మునిఁగిపోవుచున్న పడవవలె మిక్కిలి దుఃఖాతిశయముచే సీతాదేవి దుఃఖపడుచుండఁగా హనుమంతుఁడు చూచెను.

సీ. ధరణీసుతను జూచి • తన్నికటంబున, ఘోరదర్శనల సు•రారిసతుల
నేకాక్షిని నకర్ణ • నేకకర్ణను శంకు, కర్ణను దనుదీర్ఘ •కంధరలను
నెగయు ముక్కులదాని • దిగ వ్రేలు చెవిదాని, ధ్వస్త కేశిని బోడి•తలలవారి
నతికాయ మగు నుత్త•మాంగంబుఁ గలదాని, గడ్డంబు నంటు ప•ల్కుప్పదాని

తే. లంబకర్ణలలాటను • లంబకుచను, గేశకంబళధారిణిఁ • గీశవరుఁడు
లంబజానుక లంబాస్య • లంబజఠర, లంబరదనాంశుకలయుఁ గ•దంబములను.

అర్థములు. నికటంబునన్=సమీపమందు; ఘోరదర్శనల్=భయము గలిగించు నాకారముగల వారిని, ఏకాక్షి=ఒంటికన్ను గలది, అకర్ణ=చెవులు లేనిది, ఏకకర్ణ=ఒక చెవిగలదానిని, శంకుకర్ణ=మేకువంటి చెవిగలదానిని, తను దీర్ఘ కంధరలను=సన్నమై పొడుగైన మెడగలదానిని, ధ్వస్తకేశిని = స్వల్పకేశములు గలదానిని, అతికాయము=దేహమునకు మించినది, పెద్దది, ఉత్తమాంగంబు=తల పల్కుప్ప=పెదవి, లంబకర్ణ లలాటను=వ్రేలు చెవులు నొసలు గల దానిని, లంబ కుచను=వ్రేలుచన్నులదానిని, కేశకంబళ ధారిణి=కంబళివంటి వెండ్రుకలు గల దానిని, కీశవరుఁడు=వానర శ్రేష్ఠుఁడు. కిసకిస=కిచకిచ మనునవి గావునఁ గీశము లనఁబడెనేమో-లంబజానుకన్=వంగిన మోఁకాళ్ళుగల దానిని, లంబాస్య= వ్రేలాడు ముఖముగల దానిని, లంబజఠర=వ్రేలాడు పొట్టగలదానిని, లంబరద నాంశుకల=వ్రేలాడు పెదవులుగల దానిని, వీరి కదంబములను=సమూహములను, చూచెను.

## తాత్పర్యము

ఈ ప్రకారము సీతాదేవిని జూచి యామె సమీపంబునఁ జూచిన దిగులు కలిగించు రాక్షసస్త్రీలను ఒంటికంటిదానిని, ఒక చెవిదానిని, చెవులులేని దానిని, మేకుచెవులదానిని, సన్నని నిడుపాటి మెడగల దానిని పైకి నెగదీసికొనిపోయిన ముక్కుబొక్కులదానిని, భుజముల మీఁదికి వ్రేలాడు చెవులదానిని, పొట్టి వెండ్రుకల దానిని, బోడితలలవారి, పెద్దతలకాయదానిని, గడ్డము తాఁకు పెదవిగల దానిని, వ్రేలాడు చెవులుగల దానిని, వ్రేలాడు నొసలు గలదానిని. వ్రేలాడు చన్నులదానిని, కంబళివంటి వెండ్రుకలు గలదానిని, వంగిన మోఁకాళ్లు గల దానిని, వ్రేలాడు ముఖము గలదానిని, వ్రేలాడు పొట్టగలదానిని, వ్రేలాడు పెదవి కలదానిని వీరిని గుంపును జూచెను.

సీ, గిటకలఁ బొడవుల ♦ నట మఱుగుజ్జుల, వికటల వామనా♦నికరములను
　మిట్టపండ్లులదానిఁ ♦ బొట్టయుబ్బినదాని, ముక్కుఁడిఁ బింగాక్షి♦బొక్కునోటి
　వికృతను గాళిని ♦ బింగళేఁ గ్రోధన, గాలాయసమహోరు ♦ శూలకూట
　ముద్గరహస్తల ♦ మొగిఁ గలహప్రియ, నజమృగమహిషశి♦వాస్యతలల
తే. వ్యాఘ్రముఖనుష్ట్రి గజఘోట ♦ కాంఘ్రి మఱి ని
　ఖాతమూర్ధను నేకాంఘ్రి ♦ కర్ణకరల
　నశ్వకర్ణిక ఖరకర్ణి ♦ హస్తికర్ణి
　మఱియు గోకర్ణి హరికర్ణి ♦ మండలముల.　　౭౭౧

అర్థములు. వికటలన్=పెద్దపిక్కలు గలవారిని, వామనానికరములను=పొట్టివారి సమూహములను, ముక్కుఁడిన్=ముక్కులేని దానిని, అభావంబున ఇడి ప్రత్యయము. వికృతను=వికారముఖముగల దానిని, పింగళ=గోరోచనము వన్నె గలదానిని, క్రోధన=మిగుల కోపము గలదానిని, కాలాయసమహోరుశూల=ఉక్కుతోఁ జేయఁబడిన పెద్దశూలములను, కూట=కత్తి, అజ=మేఁక, శివా=నక్క, వ్యాఘ్రముఖ=పులిముఖమువంటి ముఖము గలది, ఉష్ట్రి=ఒంటెయు, ఘోట=గుఱ్ఱముమొక్కయు, గజ=ఏనుఁగుమొక్కయు, అంఘ్రి=కాళ్ళుగలది, నిఖాతమూర్ధను=గుంతపడిన తలగలదానిని, ఏకాంఘ్రి=ఒంటికాలుది, ఏకకర్ణ=ఒంటిచెవిది, ఏకకర=ఒంటిచేయిది, అశ్వకర్ణిక=గుఱ్ఱపుఁజెవులు గలది, ఖరకర్ణి=గాడిద చెవులు గలది, హస్తికర్ణి=ఏనుఁగు చెవులు గలది, గోకర్ణి=ఆవు చెవులు గలది, హరికర్ణి=క్రోఁతి చెవులు గలవారి, మండలములన్=సమూహములను.

తాత్పర్యము. స్పష్టము

సీ. అతినాసను నసాన ♦ చ్యుతనాస నుద్గతనాస, దిర్యఙ్నాన ♦ నాగనాసఁ
　బాదచూడిక హస్తి ♦ పాదగోపాద మ,హాపాద దీర్ఘజి♦హ్వానఖలను
　బెద్దతలలవారిఁ ♦ పెద్దమెడలవారిఁ, బెద్దపొట్టలవారిఁ ♦ బెద్దకనుల
　వారిఁ బెంజన్నుల♦వారిఁ గరేణుకా,ముఖి నజాముఖి హస్తి♦ముఖిని నాడు
తే. పందిమోమున దానిని ♦ వాజి వక్త్రి, నుష్ట్రివక్త్రిను ఖరవక్త్రి♦నుగ్రదర్శ
　నలను ముద్గరశూలహ♦స్తలను గ్రోధ,నలఁ గరాళలఁ గన్గొనెఁ ♦ గలహరతల.

అర్థములు. అతినాసను=మిఱి మించిన ముక్కుగల దానిని, అనాసను=పుట్టువు నుండి ముక్కులేని దానిని, చ్యుతనాస=ఊడిపోయిన ముక్కు గలదానిని, ఉద్గతనాస=నొసటి దగ్గఱ ముక్కు బొక్కలు గలదానిని, తిర్యక్+నాస=అడ్డముక్కు గలదానిని, నాగనాస=తొండమువంటి ముక్కుగలదానిని, పాద చూడికన్=పాదములందు జుట్టు గలదానిని, హస్తిపాద=ఏనుఁగు కాలుగల దానిని, గోపాద=ఆవుకాలు గల దానిని, మహాపాద = పొడుగాటి కాళ్ళుగల దానిని, దీర్ఘ.

జిహ్వానఖలను=పొడుగు నాలుక గోళ్ళు గల వారిని, కరేణుకాముఖ=ఆడేనుఁగు ముఖము గలదానిని, అజాముఖ=మేకముఖము గలదానిని, హస్తిముఖ=మగ యేనుఁగు ముఖము గల దానిని, వాజివక్త్రి=గుఱ్ఱపు ముఖము గలదానిని, ఖర వక్త్రి=గాడిదముఖము గలదానిని, కరాళల=మిట్టకోఱలవారిని, కలహారతల=కలహ మాడుచున్నవారిని.

తాత్పర్యము. సులభము.

ఉ. కొల్లగఁ గల్లు ద్రావి, వెఱ♦కూఁతలు రోఁతలు గొల్ప, నంజుడుల్
నల్లయు నాని, వెక్కసపు ♦ లాగున నై గలయంగఁ బూసి యు
త్ఫుల్లసరోజనేత్ర యగు ♦ భూసుత యుండు కుజంబుచుట్టు నం
పిల్లఁగఁ గాంచె రక్కసుల ♦ మేఁ బులకింప సమీరసూతియున్. ౨౨౩

అర్థములు. నంజుఁడు=మాంసము, నల్ల=నెత్తురు, ఆని=త్రావి, అంపిల్లఁగన్=విజృంభింపఁగా, రక్కసులన్=రాక్షసస్త్రీలను, మేన్=దేహము, పులకింప=గగ్గురపాటుచెందఁగా.

తాత్పర్యము

కడుపారఁ గల్లుద్రావి విన నసహ్య మగునట్లు వెఱ్ఱికూఁతలు గూయుచు మాంసము దిని, నెత్తురుద్రావి, చూచినవారికి వెక్కసము తోఁచునట్లు దేహము నంతయు నెత్తురు పూసికొని వికసించిన కమలములవంటి కన్నులు గల సీతయుండు చెట్టుచుట్టు అఱచుచుఁ, గేకలువేయుచు నుండు రాక్షసస్త్రీలను హనుమంతుఁడు తన దేహము పులకరింపఁ జూచెను. వారిని జూచునపుడు ఆయనకుఁగూడ భయము దోఁచెనని భావము.

— ♦ హనుమంతుఁడు సీతాదేవిని జూచి సంతోషించుట. ♦ —

సీ. ఆచెట్టు క్రీనీడ ♦ నమలినచారిత్ర, వనటచేఁ దపియించి ♦ వగచుదానిఁ
బెనఁగొన్న మాపుడు♦నును వెండ్రుకలదాని. నెఱి మీఱునడవడి♦నెగడుదాని
గాంతిఁ బాసినదాని ♦ గాంతుఁ గానఁగలేని, దాని మేల్సొమ్ములు♦లేనిదాని
భర్త్రనురాగంబె♦వరభూష యవుదానిఁ, బుణ్యహీనతఁ జేసి♦పుడమిఁబడిన

తే. ఱెక్కయునుబోనిదాని రేఁ♦ద్రిమ్మరీఁడు, పట్టి బంధింపఁ జొట్టాల ♦ పట్టు లేక
సింగమాఁగినగుంపునఁ ♦ జిలి యొంటి, యైనయాఁడేనుఁగునుబోలె♦నడలుదాని.

అర్థములు. క్రీనీడ=క్రిందు+నీడ=క్రీనీడ, క్రిందు శబ్దమునకుఁ బరుషేతరంబులు పరంబులగు నపుడు లుప్తశేషంబునకు దీర్ఘంబు మాత్ర మగు. సమాసంబునఁ బ్రాఁతాదుల తొలియచ్చు మీఁది వర్ణంబుల కెల్లలోపంబు బహుళంబగు.సు.వ్యా.

సంధి. ౧౧-౧౪- మాపుఁడు=మాసిన, భర్తృని రాగంబె=భర్తృ+అను రాగంబు+ఏ=భర్తయందలి ప్రేమయే, రిక్క=నక్షత్రము, ఋక్షశబ్దభవము, రేద్రిమ్మరీఁడు=నిశాచరరాజు, రాక్షసరాజు=రావణుఁడు.

తాత్పర్యము

ఆ చెట్టు క్రింద నీడలోఁ బవిత్రమైన స్వభావము గలదియు, దుఃఖముచేఁ దపించునదియు, మాసి పెనవేసికొనిన వెండ్రుకలు గలదియు, చక్కని నడవడి గలదియు, కాంతి తొలఁగినదియు, మగని జాడ లేనిదియు, మంచి సొమ్ములు ధరింపనిదియు, పతిభక్తియే సొమ్ముగాఁ గలదియు, పుణ్యము క్షయింపఁగా నేల మీఁదఁబడిన నక్షత్రమువలె నుండునదియు, రాక్షసుఁడు పట్టుకొని వచ్చి బంధింపఁగా జుట్టముల తోడుపాటు లేక సింగ మడ్డగింపఁగా తోడి యేనుఁగులన్నియుఁ జెదరిపోవ నొంటరిగాఁ జిక్కిన యాఁడేనుఁగువలెఁ దపించునదియు నగు దానిని.

తే. వాడుకొనమని దంత్రులు ♦ వదలు పాటి, ధూళిమాసినవీణనాఁ♦దోఁచుదానిఁ
ప్రీతిభరమున మగని స్మ♦రించుదాని, రక్కసులపల్కుఁ బెడచెవిఁ♦జెక్కుదాని.

తాత్పర్యము

వాడుకొనకుండుటచేఁ దంతెలు వదులై దుమ్ముక్రమ్మిన కారణమున మాసిన వీణవలె నుండుదానిని, ప్రీతి యతిశయముచే మగని స్మరించుదానిని, రాక్షసస్త్రీలు చెప్పుమాటలు లక్ష్యము చేయనిదానిని.

సీ. శారదవేళను ♦ నీరదావృతమైన, పూవచందురు రేకఁ ♦ బోలుదానిఁ
క్రూరగ్రహావృత ♦ రోహిణిచాడ్పున, నసురాంగనావృత ♦ యైనదానిఁ
బూవులు లేనట్టి♦తీవ, బోలినదాని, ధూళి గ్రుంగియు రుచిఁ♦దోఁచుదానిఁ
నసలు పైక్రమ్మిన ♦ యబ్జినివలెఁ గాంతి, నెగడియు నెగడక ♦ నెగడుదానిఁ

తే. దీరమాసిన చినిఁగిన ♦ చీరదాని, జింకపిల్లలకన్నుల♦చెలువు నవ్వ
కన్నుఁగవదానిఁ జూపఱ♦కడుపుఁ జేతఁ, గలఁచిన ట్లొనరించెడి♦కలికిఁగనియె.

అర్థములు. శారదవేళను=శరత్కాలమందు, నీరద+ఆవృతము = మేఘముచేఁ గప్పబడినది, పూవచందురు రేక=గీఁతవలెనున్న లేఁతచందురువలె నున్న దానిని, ఇది క్రమాభివృద్ధిని సూచించుచున్నది. క్రూరగ్రహావృతరోహిణి= క్రూరగ్రహముచే నావరింపఁబడిన రోహిణీనక్షత్రము, అసురాంగనావృత=రాక్షసస్త్రీ ...చేఁ జుట్టఁబడిన, గ్రుంగియు=మునిఁగియు, రుచి=కాంతిచే, అసలు=బురద, నే... ...మునల్ దెచి ...నుచరిత్ర, అబ్జినీ=తామర తీఁగ, తీర=పూర్ణముగ, చూ... ...చువారి... ... కలికిని=స్త్రీని

### తాత్పర్యము

శరత్కాలమందు మేఘముచే నడ్డగింపఁబడిన పాడ్యమి చంద్రుని వలె నుండు దానిని, క్రూరగ్రహములైన బుధాంగారకులచే బాధింపఁబడు రోహిణి యను నట్లు రాక్షస స్త్రీలచేఁ జుట్టఁబడిన దానిని, పూవులు లేని తీఁగను బోలిన దానిని, దుమ్ములో మునిఁగియుఁ గాంతి కనఁబడు దానిని బురదపైఁ గప్పిన తామర తీఁగవలె కాంతి కానవచ్చి కానరాక యుండుదానిని, పూర్ణముగ మాసి చినిఁగిన చీర గలదానిని, జింకపిల్ల కన్నులవంటి కన్నులు గలదానిని, చూచువారి కడుపులోఁ జేయి పెట్టి కలఁచు నట్లుచేయు స్త్రీని హనుమ చూచెను.

ఆ. భర్తృతేజమునను ♦ బరమధీరత గల్గు, దీనమైన మోము ♦ దానిఁ దనదు
శీలమహిమఁ గాపు ♦ చేసికొంచు చెడలేదు, దాని సీతఁ గనియె ♦ వానరుండు.

### తాత్పర్యము

దుఃఖముతోఁ గూడి కాంతి మాసిన ముఖముగల దయ్యును భర్తపరాక్రమముఁ దలంచి యాయన తన్నుఁ దప్పక రక్షించునను ధైర్యముతో నుండు దానిని, మగఁడు వచ్చి రక్షించువఱకు నామె నెవ్వారు రక్షించుచున్నా రనినఁ దన పాతివ్రత్యము చేతనే తన్నుఁ దాను గాపాడుకొనుచున్న దానిని, సీతాదేవిని వానరుఁడు చూచెను.

దీనివలన భక్తులు ప్రపన్నులు వెలుపలి కష్టము లెన్ని వచ్చి పీడించినను మహా విశ్వాసము వదల రాదనియు భగవంతుఁడు రక్షించువఱకుఁ దమ భక్తి ప్రపత్తులే వారినిఁ గాపాడఁగలవనియు భావము.

క. 'నా తేజము సాధులలో, నాతతమై యుండు వారి నలఁచు జనులకున్
హేతిక్రియ భీతి నిచ్చును, జేతోమోదంబు చెఱచు సిద్ధము సుమ్మీ.'
భాగ. ౯. ౧౨౮.

సీ. బెగడొందు కంపిల్లు ♦ మృగకన్యకయుఁబోలె, దిక్కులు చూచుచు ♦ సుక్కుదాని
వేఁడినిట్టూర్పుల ♦ వృక్షపల్లవములఁ, గ్రాఁచెడి నేమొనాఁ గ్రాలుదాని
నాంతరదుఃఖాబ్ధి ♦ యందందఁ బొంగిన. యలలయట్టూర్పులు ♦ వెలలుదాని
నవసిన యంగముల్ ♦ నాగెంబుతో వినా, కృతభూషమైయె శోభ ♦ నెసఁగుదాని,

ఆ. మదిరనయన సీత ♦ మారుతి గనుఁగొని, పమ్మ దాశ్రు లురల ♦ జాలుగాఁగ
రామచంద్రుననుజ ♦ సౌమిత్రికిని గేలు, మోడ్చి శాఖయందు ♦ ముడిఁగియుండె.

అర్థములు. కంపిల్లు=వణఁకు, మృగకన్యక=ఆఁడుజింక, పల్లవములన్=చిగుళ్ళను, క్రాఁచెడి=కాల్చెడి, ఆంతర దుఃఖాబ్ధి=లోపలనుండు దుఃఖ మను

సముద్రము, వినాకృత భూషయై = ఆభరణములు లేనిదై, భూషయై=భూషయయ్యు, మదిర నయన=మద్యమువలె మత్తు గలిగించు కన్నులు గల దానిని, జాలు=ప్రవాహము, అంగముల్ నాఁగెంబుతో=అంగముల నాఁగెముతో, షష్ఠీ సమాసమందలి నిలలమీఁది యచ్చులకు హల్లుపరంబగుచోఁ గొన్ని యెడల లోపంబుగానం బడియెడి. ప్రౌ. వ్యా. సంధి ౧౭౮ వ సూత్రము. వినాకృత భూషయై; భూషయయినను "న్యూనవచో వాక్యంబునఁ దద్వచనంబు లధ్యాహారంబులగు. ప్రౌ. వ్యా. వాక్య. ౧౩ సూత్రము.

## తాత్పర్యము

భయపడి వడఁకుచున్న యాఁడులేడివలెఁ దన్ను రక్షింప రాముఁడు వచ్చెనా యని దిక్కులు చూచుచున్న దానిని తనవేఁడి శ్వాసములచేఁ జెట్ల యందలి చిగుళ్ళను గాల్చుచున్నదా యేమి యన్నట్లున్న దానిని, హృదయమున నుండు దుఃఖమను సముద్రము పొంగి పొరలి రాఁగా నలలవలె నిట్టూర్పులు విడుచు దానిని, శుష్కించి యాభరణములు ధరింపకుండినను సహజకాంతి పాయని దానిని, చూచిన వారిని మైమఱవఁజేయు సౌందర్యము గల దానిని హనుమంతుఁడు చూచి యిప్పటికిఁ గృతార్థుఁడనైతి నని సంతోషముచేఁ గన్నులనీరు ప్రవహింపఁగా నిదియంతయు రామలక్ష్మణుల యనుగ్రహముచేఁగదా లభించెనని వారికి నమస్కరించి చెట్టుకొమ్మయందే మాట లాడుటకు సమయము వేచి ముడుచుకొని యుండెను.

దీనివలన యోగికి నాత్మావలోకన ప్రాప్తి భగవత్కటాక్షముచేఁ గలుగు నని భావము. 'యమేవైష వృణుతే తేన లభ్యః ధాతుః ప్రసాదా' త్తని శ్రుతులు చెప్పెడిని గదా.

## —♦ ౧౮-వ సర్గము. రావణుఁడు శోకవనంబునకు వచ్చుట. ♦—

క. చంచత్పల్లవకుసుమో,దంచితవనిఁ గలయఁ జూచి ♦ యనిలజుఁ డక్కాం
గాంచఁగ మారుతి దలఁపఁగ, నించుకదక్కువగ రేయి♦యెల్లం గడచెన్.

అర్థములు. చంచత్=కదలుచున్న, చెంచు అను శబ్దము దీనివలనఁ బుట్టినదే. చెంచు లనఁగా దిరుగుచుండువా రని యర్థము. వారి స్త్రీలు చెంచితలు, పల్లవ=చిగుళ్ళచేతను, కుసుమ=పూలచేతను, ఉదంచిత=మిగులఁ బ్రకాశించెడి, వనిన్=వనమును, ఇంచుక తక్కువగ రేయి యెల్లం గడచెన్=అనుటచే చంద్రాస్తమానమైన దని సూచన. నాలుగున్నర గంట ప్రొద్దయ్యెనని భావము.

## తాత్పర్యము

ప్రాతఃకాల వాయువుచేఁ గదలుచున్న చిగుళ్ళ చేతను, పూలచేతను ప్రకాశించు వనమునంతయుఁ బాఱఁజూచి సీతాదేవిని నింకను బాగుగఁ జూడవలయునని

యాంజనేయుఁడు తలఁచు చుండఁగా గొంచెము తక్కువగా రాత్రి యంతయుఁ గడచెను.

ఉ. అంతట నాలకించెను ష•డంగక వేదవిదుల్ మఖక్రియా
స్వాంతులు వేగుజాము సమ•యంబున మేల్కని బ్రహ్మరాక్షసుల్
మంతు వొకింత లేక శుచి•మద్విధి నించెడి బ్రహ్మఘోషముల్
వింతగ వాద్యనాదములు • వీనులవిందుగ మ్రోయు చుండఁగన్. ౪౯౦

అర్థములు. షడంగక వేద విదుల్=శిక్షా వ్యాకరణాదులగు నాఱంగములతోఁ గూడిన వేదము నెఱింగినవారు, మఖక్రియా స్వాంతులు=యజ్ఞకార్యములందు మనస్సు గలవారు, బ్రహ్మరాక్షసులు = రాక్షసులందు బ్రాహ్మణులు, వీరు బ్రాహ్మణులు-రావణాదులు క్షత్రియులు, కావున వర్ణాశ్రమ విభాగము రాక్షసులందుఁ గలదని యేర్పడు చున్నది. బ్రాహ్మణ బీజోద్భవులగు పౌలస్త్యులు కొందఱు తలఁచున ట్లనార్యులు గారు. క్రూరకర్మలగుటచే రాక్షసులైరి. మంతువు=స్వరదోషము, కర్మాంగదోషములేక, శుచిమత్ + విధి=పరిశుద్ధమైన విధముగ, బ్రహ్మఘోషముల్=వేదధ్వనులు, 'పరమాత్మా తపో వేదో బ్రహ్మా, బ్రహ్మాబ్జజే ద్విజే.' నానా. ౪.

తాత్పర్యము

హనుమంతు డిట్లాలోచించు సమయంబున బ్రహ్మరాక్షసులు ఆఱంగములతోడ వేదములు తెలిసినవారలు యజ్ఞకార్యముల మనస్సుగలవారలు, వేకువ జామున బ్రహ్మముహూర్తమున మేల్కని యే తప్పు లేకుండునట్లు శుచిర్భూతులై నించెడి వేద ఘోషములను వీనులకింపుగ వాయింపఁబడు వాద్యముల ధ్వనులును వినవచ్చెను.

క. ఆ మంగళరవములఁ బూ,ర్వామరపతి మేలుకాంచి • యంబరసుమనో
దామంబు లెడల సీతా, వామాక్షిం దలఁచె రాగ•పరవశుఁ డగుచున్. ౪౯౧

అర్థములు. పూర్వామరపతి=రావణుఁడు, దేవతలకంటెఁ బూర్వులు కావున రాక్షసులు పూర్వ దేవత లనబడుదురు. అంబర=వస్త్రములు, సుమనోదామంబులు=పూలదండలు, ఎడలన్=జాఱిపోవు చుండఁగా, రాగపరవశుఁ డగుచున్=కామముచే స్వాధీనత తప్పినవాఁడై.

తాత్పర్యము

ఆ మంగళ ధ్వనులు విని రావణుఁడు మేల్కని, పట్టు వస్త్రములు ధరించిన పూలదండలు జాఱుచుండఁగా లేచి కామవశుఁడై సీతఁ దలంచెను.

క. మదనమదోత్కటుఁ డయి దశ•వదనుఁడు గాఢముగ మనము•వనజాక్షిపయిన్
బదిలముగ నిల్పి కామము, హృది నణఁపఁగ నేరఁ డయ్యె•నించుక సైపన్.

అర్థములు. మదన మదోత్కటుఁడు=కామ మదముచే నతిశయించినవాఁడు.

### తాత్పర్యము

అతిశయించిన కామమదముచే రావణుఁడు తనమనస్సును దృఢముగ సీత యందుఁ బదిలముగ నిల్పి హృదయమునందుఁ గామమును గొంచెమైన నణఁప లేఁడయ్యెను.

ఇది మొదలు రావణుని మాటలు చేష్టలు కాముకునివో భక్తునివో పాఠకులు గమనింతురు గాక.

సీ. తనకును గల యను•త్తమలక్ష్మి శోభిల్ల, సర్వాభరణములు•సరగఁ దాల్చి
కుసుమితఫలితస•త్కుజసంతతులచేతఁ, గందోయి కెంతయు • విందు లిడుచు
విచ్చిన తమ్ముల, • బెచ్చు మీఱినకొలంకులు శకుంతలంబుల•కలకలములు
సొబగార నద్భుత•సుందరం బయి పెక్కు, లీహామృగంబుల•వ్యూహములను
తే. దృఙ్మనోహర మగుచును • దేజరిల్లి, రత్నకాంచనతోరణ•రాజి వెలసి
బహుమృగాకీర్ణ మయి గళ•త్ఫలచయ మయి, నవ్యమైన యశోకవనంబుఁజొచ్చె.

అర్థములు. అనుత్తమలక్ష్మి=అత్యంత ముత్తమసంపద, దేనికంటె నుత్తమమైనది లేదో యది యనుత్తమము, కుసుమిత=పూచిన, ఫలిత=పండిన, సత్కుజసంతతులచేతన్=మంచి వృక్షసమూహములచే, కందోయికి = రెండుకన్నులకు, కన్ను+దోయి=కందోయి, ఈహామృగంబుల=కృత్రిమముగాఁ జేయఁబడిన జింకల దుప్పుల వ్యూహములను=సమూహములను, ఇచ్చటఁ గొందఱు తోడేళ్ళ సమూహములని వ్రాసిరి. స్త్రీలు సంచరించు ప్రమదావనంబులందుఁ దోడేళ్ళ గుంపులుండునా? దృఙ్మనోహరము=కంటికింపు, గళత్ఫలచయము=రాలుచున్న పండ్లగుంపులు.

### తాత్పర్యము

తనకుఁగల మహాసంపద ప్రకాశించునట్లు సమస్త భూషణములు ధరించినవాఁడై పూచిన, పండిన చెట్లు కన్నులకు సంతోషము గలిగింపఁగా వికసించిన కమలముల నతిశయించిన సరస్సులు, పక్షుల కలకలములు నింపు గూర్పఁగా నద్భుతము సుందరమునై కృత్రిమపు జింకల, దుప్పుల సమూహములు గలిగి కంటికింపై, ప్రకాశించి రత్నములయు, బంగారు తోరణములు అనేక విధములైన మృగములు రాలుచున్న పండ్లు గలిగిన యశోక వనమునఁ బ్రవేశించెను.

తే. వేయిగన్నుల వేల్పును • వెంబడించు, నమరగంధర్వసతు లట్టు•లసురసతులు
వందమంది సురేంద్రుని•వైరి వెంట, నరిగిరి ప్రదీపచామర•హస్తలగుచు. ౮-౮

అర్థములు. వేయి గన్నుల వేల్పు=ఇంద్రుఁడు, ప్రదీప చామర హస్తలు=పెద్ద దీపములు, చామరలు చేతియందుఁ గలవారై, దీపములు పట్టుకొని వచ్చిరనుటచే చంద్రాస్తమానమైనది, చీఁకటి వ్యాపించిన దనుట స్పష్ట పడియె.

తాత్పర్యము

ఇంద్రుని వెంటఁబోవు దేవ గంధర్వ స్త్రీలవలె వందమంది రాక్షస స్త్రీలు చేతఁ గాఁగడాలు, చామరలు ధరించి రావణు వెంబడి పోయిరి.

సీ. రంగారుబంగారు♦భృంగారువుల నీళ్ళు, కొందఱు గైకొని♦ముంద అరుగ
మండలాగ్రంబులు ♦ మణిమయాసనములు, గొని కొందఱంగనల్♦వెనుక రాగ
జాణ యొక్కతె మణి♦స్థాలిఁ బానంబునఁ, బూరించి కుడికేలఁ♦బూని నడువ
రాజహంసను బూర్ణ♦రాజబింబముఁబోలు,గొడుగు నొక్కతె వెను♦కడను బట్టఁ
తే. బైఁడిదండంబు నొక్కతె ♦ పట్టుచుండఁ
గూర్కు కన్నులఁ దనప్రియ♦కులసతులును
మబ్బుతోఁ జను మెఱుఁగుల♦మాడ్కి నడవఁ
బంక్తికంధరుఁ డుద్యాన♦వనముఁ జొచ్చె. ౮౯౨

అర్థములు. రంగారు=అందమైన, భృంగారువులన్=గిండ్లయందు, మండలాగ్రంబులు=కత్తులు, ఆసనములు=పీఁటలు, మణి స్థాలిన్=రత్న పాత్రమునందు పూర్ణ రాజ బింబము=నిండు చంద్ర మండలము.

తాత్పర్యము

అందమైన బంగారు గిండులతో నీళ్ళు తీసుకొని కొందఱు ముందు పోఁగా, కత్తులు, మణిమయములైన పీఁటలు తీసికొని కొందఱు స్త్రీలు వెనుక రాఁగ, నొక నేర్పరి కత్తె రత్న పాత్రమును పానంబుతో నింపించి, దానిని గుడిచేతఁ బట్టుకొని నడువ, రాజ హంసను నిండు చంద్రబింబమును పరిపోలు శ్వేతఛ్ఛత్రమును నొకతె పట్టుకొని రాగా, బంగారు దండ మొకతె పట్టుచుండ, నిద్ర మబ్బు కన్నులతోఁ దన భార్యలు మబ్బువెంటఁ బోవు మెఱుపులవలె నడచి రాఁగ, రావణుఁడుద్యానవనముఁ బ్రవేశించెను.

శ్వేతచ్ఛత్ర లక్షణము—

నిచితంతు హంస పక్షైః కృకవాకు మయూర సారసానాంచ, దౌకూలేన నవేనతు సమగ్రత శ్ఛాదితం శుక్లమ్। ముక్తాఫలైరుపచితం। ప్రలంబ మాలావిలం స్ఫటిక మూలమ్। షడ్ఢస్తశుద్ధ హైమం నవ పర్వ నగైకదండంచ। దండార్థ విస్తృతం తత్ సమవృత్తం రత్నభూషిత ముకుగ్రమ్। నృపతేస్తదాతపత్రం కళ్యాణకరం విజయదంచ. (బృహత్సంహిత)

సీ. ప్రీలినకొప్పులు ♦ రాలినపూఁతలు, దూలినసరములుఁ ♦ గ్రాలువారు
నిద్దురమంపులు ♦ నెఱిమత్తుకంపులుఁ, జెమ్మటమోములుఁ♦జెలఁగువారు
శ్రమవారిఁ దడిసిన♦సుమహారములవారు, మాలికాకులచికు♦రాళివారు
జేవుఱుఁగన్నులుఁ ♦ జెలువంపుఁజిన్నెలు, మే లగువన్నెలు ♦ మెఱయువారు

తే. రాఁగ రాగంబునను వెంట ♦ రామవిభుని
కాంత మది నుంచి తమిఁ బెంచి ♦ కళవళించి
మూఢ్యము వహించి మర్యాద ♦ మట్టగించి
క్రించు టసురుండు వనముఁ జో ♦ చ్చెంచుటయును. ౪౬

అర్థములు. మంపులు=మత్తు, శ్రమవారిన్=చెమటనీళ్ళచే. మాలి కాకుల=పూలదండలు తాఱుమాఱుగా నున్న, చికురాళివారు=తలవెండ్రుకలు గలవారు, జేవుఱు=ఎఱ్ఱనైన, క్రించు టసురుండు=దుష్టరాక్షసుఁడు.

తా త్ప ర్య ము

వీడినకొప్పులు, రాలిపోయిన గంధపుఁ బూఁతలు, వ్యత్యస్తముగాఁ దోలఁగిన సరములు, నిద్దుర మబ్బులు, మద్యము వాసనలు చెమటగాఱు ముఖములు, చెమట నీళ్ళచేఁ దడిసిన పూలదండలు, పూలదండలు కలసి చిక్కుపడిన వెండ్రుకలు, ఎఱ్ఱని కన్నులు, అందమైన సొగసులు, మేలైన కాంతులుగల స్త్రీలనురాగముచేఁ దనవెంటరాఁగా దుష్టుఁడగు రావణుఁడు సీతాదేవిని దలఁచుకొని కామాతిశయముచేఁ దత్తఱలాడి సీత తనకు వశపడు నని మూఢుఁడై తలంచి పరస్త్రీల విషయమున నుండవలసిన మర్యాద వదలి వనము ప్రవేశింపఁగా.

క. అంజనతనయుఁడు రావణ, కుంజరగమనావళీ ని♦కూజత్కాంచీ
శింజితములు శ్రవణపుటీ, రంజక హంసకనికాయ♦రవములు వినియెన్. ౪౭

అర్థములు. రావణకుంజర గమనావళీ=రావణాసురుని స్త్రీసమూహముల యొక్క, నికూజత్కాంచీ=ధ్వనించుచున్న మొలనూళ్ళ, శింజితములు=ధ్వనులు, శ్రవణపుటీ రంజక=చెవులకు నింపైన, హంసక నికాయరవములు=అందెల సమూహముల ధ్వనులు.

తా త్ప ర్య ము

హనుమంతుఁడు సీతాదేవి సమీపమునకుఁ బోవలె నని యాలోచించు సమయమందు రావణాసురుని స్త్రీల యొడ్డాణముల యందలి గజ్జెలధ్వనులు, విన నింపైన యందెల నాదము వినవచ్చెను.

ఉ. ద్వారము డాసి యున్న♦సురవైరికులేశ్వరు, గంధతైలసి
క్తోరుసుదీపికల్ గొని త♦లోదరు లేగ వెలుంగు కామిని

స్తారుని, వక్రలోహితవి ♦ శాలవిలోచనుఁ, జాపహీనుఁ డౌ
మారునిమాఱుమూర్తి యన ♦ మంజులరూపు వహించు వీరునిన్. ౨౪

అర్థములు. గంధతైలసిక్త=వాసనచమురుతోఁ దడిసిన, ఉరుదీపికల్=పెద్ద దీపములు, దివ్వెటీలు; కామవిస్తారుని=విశేషించినకామము గలవానిని, వక్ర=వంకరయు, లోహిత=ఎఱ్ఱనయు, విశాల=విరివియు నగు, విలోచనున్=కన్నులు గలవానిని, చాపహీనుఁడు=విల్లులేనివాఁ డగు, మారుని=మన్మథుని, మాఱట మూర్తి=ప్రతిరూపము, మంజులరూపు=మనోహరమైన యాకారము.

తాత్పర్యము

సువాసన తైలముతోఁ దడిసిన దివ్వెటీలు దీసికొని స్త్రీలు రాఁగాఁ గామాతిశయము గలవాఁడును వంకరయు, నెఱ్ఱనయు, విశాలములగు కన్నులు గలవాఁడును విల్లుపట్టని రెండవ మన్మథుఁడును, సుందరుఁడు, వీరుఁడును తోఁట వాకిట వచ్చియుండు రావణాసురుని.

తే. అంగదంబులఁ దగిలిన ♦ యమృతఫేన, సన్నిభోత్తమవిమలవ ♦ స్త్రమును లీలఁ
గేల సవరించువాని దోర్బ్లల నిట్టిఁ, డంచు నెన్నంగరాని యా ♦ యసురఁ గనియె.

అర్థములు. అమృతము=ధారోష్ణం త్వమృతం పయః=అప్పుడు పిండి వేఁడి చల్లారని పాలు.

తాత్పర్యము

భుజకీర్తులకుఁ దగులుకొన్న ధారోష్ణముల నురుగువలెఁ దెల్లనైన వస్త్రమును సవరించుకొనువానిని భుజబలమునం దింతవాఁడని చెప్పరానివానిని రాక్షసునిఁజూడఁ దలయెత్తెను.

ఇట్టిఁడు=ఇట్టివాఁడు, అట్టి యిట్టి యెట్టి శబ్దంబుల మీఁది తచ్ఛబ్ద వకారంబునకు లోపంబు విభాషనగు. ప్రౌ. వ్యా. స. ౯ సూ.

క. కాంచెను గాంచన కాంచీ, చంచన్మణికింకిణీల ♦ సన్మధ్యల రూ
పాంచితయువతుల మారుతి, పొంచి నగంబందు నుండి ♦ పూవుంబోండ్లన్.

అర్థములు. కాంచన కాంచీ=బంగారు మొలనూళ్ళయందు, చంచత్=కదలుచున్న, మణి కింకిణీ=రత్నములు చెక్కిన చిఱుగజ్జెలచే, లసత్=ప్రకాశించు, మధ్యలన్=నడుములు గలవారిని, సౌందర్యముచేఁ బ్రకాశించు ప్రాయపు స్త్రీలను.

తాత్పర్యము

బంగారుటొడ్డాణముల యందలి రత్నములగజ్జెలు గల నడుములుగల సుందరులగు ప్రాయపు స్త్రీలను చెట్టునందుఁ బొంచియుండి హనుమంతుఁడు చూచెను.

ముందు వెలుతురు గనఁబడెను. ఏమి యీ వెలుతురని తలయెత్తి నిక్కిచూడఁగా రావణుఁడు, ఆవల వాని వెనుక వచ్చు స్త్రీలు గానవచ్చిరి.

ఉ. తారలు గూడియున్న యల • తారకరాజును బోలి సుందరీ
వారము చుట్టు గొల్వఁగను • వచ్చెడివాని లసత్పరిష్క్రియా
హారవిలాసునిం బటుమ • హాబలభాసునిఁ గామదాసునిన్
హారిశరీరు విశ్రవసు • నాత్మకుమారునిఁ గాంచి యాత్మలోన్. ౧౦౧

అర్థములు. తారకరాజు=చంద్రుఁడు, నక్షత్ర పర్యాయమున తారకశబ్దము పుంలింగమందును గలదు. లసత్=ప్రకాశించు, హార=సరములయొక్కయు, పరిష్క్రియా=ఆభరణములయొక్కయు, విలాసునిన్=సౌందర్యము గలవానిని.

తాత్పర్యము

నక్షత్రములతోఁ గూడిన చంద్రునివలె స్త్రీలు తన్నుఁ జుట్టుకొనఁగా వచ్చుచున్నవానిని, ప్రకాశించు హారములు, ఆభరణములు వీనిచే సుందరుఁడైన వానిని, మహాబలవంతుని, కామమునకు దాసుఁడైనవానిని, మనోహరమైన శరీరము గలవానిని, విశ్రవసు కుమారునిఁజూచి హనుమంతుఁడు తనలో నిట్లనుకొనెను.

మ. అగుఁబో యితఁడ రావణుం డనుచు ర • క్షోధీశుఁ గానంగ వీ
లగు తానంబును జేరి భూరిబలుఁడై • యా వీరు తేజంబునన్
విగళత్తేజుఁడు నొచ్చుఁ గొమ్మలను డా • వెన్ వాడునున్ సుస్తనిన్
జిగురుంబోఁడి సుగాత్రి డాయ నరుదెం • చెం జూడఁ గాంక్షించుచున్. ౧౦౨

అర్థములు. తానము=ప్రదేశము, విగళత్తేజుఁడు=జాఱిపోయిన తేజము గలవాఁడు, డావెన్=డాఁగుకొనెను. క్వచిద్గకారోవః అను సూత్ర ప్రకారము గకారమునకు వకారము వచ్చెను. అగుఁబో=నిశ్చయముగా నగును.

తాత్పర్యము

నిశ్చయముగా వీఁడు రావణుఁడే యని తలఁచి వానిని జక్కఁగాఁ జూచుటకు ననువైన స్థలముఁ జేరి అనఁగా వానికి నెదురు ముఖముగా నుండునట్లు విస్తారబలము గలవాఁ డయ్యును వాని తేజస్సు ముందర తేజోహీనుఁడై కొమ్మలనందున డాఁగుకొనెను. వాఁడును సీతను జూడ సమీపించి వచ్చెను.

—• ౧౯-వ సర్గము. రావణుఁడు సీతాదేవిని జేరఁబోవుట. •—

చ. తడయక సీత గాంచి దవు • నవ్వుల భూషణభూషితాంగుఁడై
పడఁతులతోడ వచ్చు సుర • భంజను యౌవనరూపవైభవున్
వడఁకుచు నూరుగాలికి వ • ణంకు ననంటినిబోలి యూరులన్
గడుపును బాహులం జనులు • గ్రక్కన మాటుచు నేడ్చుచుండఁగన్. ౧౦౩

### తాత్పర్యము

ఆభరణములచే నలంకరించుకొని యోఁడువారితో వచ్చుచున్న రావణుని యౌవన సౌందర్య సంపత్తి గలవానిని దూరమునందే చూచి సీతాదేవి పోరు గాలికి నరఁటి చెట్టువలె గడగడ వడఁకుచు నాలస్యము లేక తొడలచేఁ గడుపును చేతులచే స్తనములను గప్పుచు నేడ్చుచుండెను.

సొమ్ములు మూటఁగట్టి యుత్తరీయమును బాఱవైచిన కారణముచేఁ బైఁటయు లేక యుండుటచేఁ గడుపు గానరాకుండఁ దొడలను రొమ్ములు గానరాకుండ మోఁకాళ్ళను నడ్డముంచి ఆ కాళ్ళను రెండుచేతులు కట్టుకొని బిగించెనని భావము.

సీ. దశకంధరుం డంత • దర్శించె రాకాసి, మూఁకఁ గావఁగ నార్తి • మునుఁగుదాని
జలనిధి నవిసిన • కలముఁబోలినదాని, నుత్తనేలను గూరు • చున్న దానిఁ
గొట్టి వైచినపూవుఁ • గొమ్మ దీటపుదాని, నతులితసంశిత • వ్రతముదానిఁ
బంకపు నగను బల్ • వన్నె లీనెడు దాని, నొంటి నేడ్చుచు జింత నొందుదాని

ఆ. బురద గ్రమ్మియున్న • సరసిజం బనఁగను, మెఱసి మెఱయకుండు • మేనిదాని
మండనార్హ యయ్యు • మండనంబులు ద్రోచి, యడలుదాని నవయు • నొడలిదాని.

అర్థములు. అవిసిన=పగిలిన, కలము=ఓడ, అతులిత=అసమానమైన, సంశిత=మిగులఁ దీక్ష్ణమైన, వ్రతన్=వ్రతము గలదానిని, నిద్రాహారములు రెండును విడిచి కటికి నేలపైఁ గూర్చుండిన తీవ్ర వ్రతము గలదానిని, పంకపు నగను = దుమ్మునిండి యాభరణముచే, మండనార్హ=అలంకారమునకు యోగ్యురాలు, మండనంబులు=ఆభరణంబులు.

ఈ పద్యము మొదలు పండ్రెండు పద్యములు కుళికము.

ఈ పద్యము నారంభమున దశకంధరుఁడనియుఁ గడపటి పద్యంబున దశాస్యుఁడనియుఁ బ్రయోగించుట, కర్తృ పదము మఱవకుండుటకై దూరాన్వయము నివారించుటకై యని తెలియునది. ఈ నడుమ నుండిన వన్నియు సీతాదేవి విశేషణములు.

### తాత్పర్యము

రాక్షస స్త్రీల గుంపు తన్ను రక్షింపఁగా దుఃఖించుచుండు దానిని, సముద్ర మధ్యమున పగిలిన యోడవలె దరిగానక యుండు దానిని, కటికి నేలపైఁ గూర్చుండిన దానిని, తెగఁగొట్టివైచిన పూవు దీఁగవలె నుండుదానిని నిద్రాహారములు మాని మిగులఁ దీవ్రమైన వ్రతము పట్టినదానిని, దుమ్ము గ్రమ్మిన దేహము గల దానిని, తన వారెవ్వరు లేక యొంటిగ దుఃఖించుచుండు దానిని, బురద సోఁకిన కమలమువలె కాంతి గలిగి లేకున్న దానిని, ఆభరణములు ధరింప యోగ్యురాలయ్యు ధరింపని దానిని, శుష్కించిన దేహము గల దానిని.

చ. కసుఁగొన లేక మేర దన♦కాఁతియకుం బరివేష్టమానభో
　గిని యన నుండుదాని, గుణ♦కీ ర్తితధార్మికవృ త్తశీల మా
　ఘనకుల మందుఁ బుట్టియును ♦ గాపురుషాధము దుష్కులోద్భవున్
　బెనిమిటిఁ జేసికొన్న యలి♦వేణినిఁబోని పతివ్రతామణిన్. ౧౦౫

అర్థములు. కాఁతియ=బాధ, మేర=అంతము, పరివేష్టమాన భోగిని=పొరలాడుచున్న ఆఁడుపాము; గుణకీ ర్తిత=గుణములచేఁ బొగడఁబడిన, ధార్మిక వృత్త శీలము=ధర్మాత్ముల నడవడి, యాచారము, కాపురుషాధమున్=నీచుడగు దుష్ట పురుషుని, దుష్కులోద్భవున్=నీచపుఁ గులమందుఁ బుట్టినవానిని.

ఆఁడుపా మనుటచేఁ దాఁకిన మరణము సిద్ధమని భావము.

తా త్ప ర్య ము

తన దుఃఖ మెపుడు ముగియునో తెలిసికొనలేక నేలపైఁ బొరలుచున్న యాఁడుపామువలె నుండుదానిని, గుణములచే, ధర్మముచేత, నడవడిచేత, సదాచారముచేతఁ బ్రసిద్ధి కెక్కిన వంశమునఁ బుట్టియు, నీచకులమందుఁ బుట్టిన నీచ పురుషుని దనభ ర్తగా జేసికొన్న దానివలె నుండుదానిని, ప్రతివ్రతారత్నమును.

క. అంకరహితవిదితాత్మునిఁ, బంకజదళనేత్రు రామ♦భద్రుని డాయన్
　సంకల్పహయంబులచేఁ, బొంకంబుగ హృద్రథమునఁ♦బోయెడిదానిన్. ౧౦౬

అర్థములు. అంకరహిత=(౧) సమీపమందు లేనివానిని, (౨) కళంకము లేనివానిని, హేయగుణ మొక్కటియైన లేనివానిని, విదిత+ఆత్మని=తెలియఁబడిన స్వభావము గలవానిని, సంకల్పహయంబులచేన్ = తలంపులనెడి గుఱ్ఱములచే, హృద్రథమునన్=హృదయ మను రథమునందు; విరహిణియుఁ, బరమ భక్తుఁడు, ప్రపన్నుఁడు సమానులు. వీరల దేహ మెందున్నను హృదయము, సంకల్పము విరహిణికి భ ర్తయందును, భక్తులకుఁ బ్రపన్నులకు భగవంతుని మీఁదను నుండును. ఆ విషయమే యిందుఁ దెలుపఁబడెను. అంకరహిత=పతివ్రతకు భ ర్త యందు నెట్టి కళంకము గానరాదు. ఆయన నిగ్రహములనుగూడ ననుగ్రహము లనియే తలంచుచుండును, విదితాత్మని= తెలియఁబడిన మనస్సు; స్వభావము గల వాఁడు, ఆయన మనస్సు స్వభావ మెట్టిదై నది యనఁగాఁ దనయందు విశేషాను రాగము గలవాఁడని, ఆశ్రిత రక్షణ యాయన స్వభావ మని సీతకుఁ దెలియు నని భావము. కావుననే కదా కౌసల్య యందుండు ప్రేమకంటెఁ దనయం దెక్కువ ప్రేమ రామచంద్రమూ ర్తికిఁ గల దని హనుమంతునితోఁ జెప్పెను. (చూ. ౭౬౭ వ ప.) పంకజదళనేత్రున్=పంకము=పాపము, పాపములోఁ బుట్టినదానిని ఛేదించు చూపుగలవాఁడు. ఆయన దృష్టి సోఁకినంత మాత్రముననే యెల్లపాప ములు హరించును. అంతటి మహానుభావుఁడు కావుననే కదా యాశ్రితు లందలి దోషము సహింపవలె దని చెప్పెను. ఆయన దృష్టి తగులఁగానే దోషనివృత్తి కాఁగా నిఁక దండింపఁ గారణ మేమున్నది? కావున నాయం దే దయిన దోష

ముండినను క్షమించి తన్ను రామచంద్రమూర్తి రక్షించుననని భావము. రామభద్రునిన్=''భద్రశబ్దేన దేవస్య నిత్యనిర్దోష తోచ్యతే' (అహి.౫-౨౯) నిత్య నిర్దోషత్వము గల రాముని నని భావము. సంకల్పము=ప్రాణము,'ప్రాణోమాయా క్రియాశక్తిర్భావ ఉన్మేష ఉద్యమః। సుదర్శనంచ సంకల్పః శబ్దాః పర్యాయ వాచకాః॥ (అహి. ౧౨ అధ్యా.1) హయ=త్వరగాఁ బోవునది, త్వరగాఁ బోవు నట్టి ప్రాణవాయువులచే, పొంకంబుగన్=దృఢముగ, చలింపకుండ నని యర్థము. రథశబ్దమునకు=దేహము-మనోరథము, రథము, వాహనము నని యర్థము. హృద్రథమనఁగా హృదయ మను రథము. (౨) హృదయ మను శరీరము-పోయెసి దానిన్=పోవుచున్న దానిని, ఇక్కడ లేదని భావము.

### తాత్పర్యము

ఎట్టి కళంకము లేనివాఁడును, తల్లియందుండు ప్రేమకంటె నెక్కువ ప్రేమ తనయందుఁ గలవాఁడును, తనయందు దోషముండినను దానిని హరింపఁ జేసి స్వీకరించువాఁడును, నిత్య నిర్దోషియునగు రామచంద్రమూర్తి యొద్దకు సంకల్పము లను గుఱ్ఱములను గట్టిన హృదయ మను రథము నందుఁ గూర్చుండి పోవుచున్నదానిని.

హృదయమునే శరీరముగాఁ గల ప్రాణము లతివేగమునఁ బోవుచున్న వని యైనఁ జెప్పవచ్చును. అనఁగా సీతాదేవి శరీరమం దున్నదే కాని ఆమె హృదయము, ప్రాణము, భావము, సర్వము రామునొద్దకుఁ బోయిన వని భావము. భక్తులు, పతివ్రతలు నిట్టివారై యుందురు.

క. అపవాదముచేఁ దేరకు, నిపతిత మగు కీర్తిఁ బోని♦ నెలఁతుక మిన్నన్
వ్యాపకలితాభ్యాసం బగు, కృపణుని విద్యయునుబోలెఁ♦గీడ్పడు దానిన్. ౫౦౭

అర్థములు. నిపతితము=పడిపోయినది, వ్యాపకలితాభ్యాసము = అలవాటు తప్పినది, చింతనలేనిది, కృపణుని=లోభివానియొక్క.

### తాత్పర్యము

నిష్కారణ నిందచేఁ జెడిన కీర్తివలె నున్నదానిని, ధనము మీఁదనే దృష్టి గలిగి లోభియై గురువున కేమైన నీయవలసి వచ్చునే యని సరిగా నభ్యసింపని వాని విద్యవలె నుండుదానిని.

చ. నమసిన కీర్తి, నాదరము ♦ చాలని శ్రద్ధఁ, బరిక్షీణంబు నా
యమలిన పూజ, భగ్న యగు ♦ నాశను, జిందఱవోవు లాభమున్
గమరిన పద్మమున్, మిగులఁ ♦ గాలెడి దిక్కును, భగ్న పూజనున్
దమమును గూడు వెల్తురు, ని♦దాఘమునందలి యేటిఁ బోలుచున్. ౫౦౮

### తాత్పర్యము

నశించిన కీర్తిని, ఆదరింపఁబడని శ్రద్ధను (శ్రద్ధగలవాని నాదరింపకున్న నా శ్రద్ధ క్షీణించి పోవును.) పూజా ద్రవ్యములు లేని పూజను, చెడిపోయిన యాశను.

చెదరిపోయిన లాభమును,వాడిపోయిన పద్మమును, కాలుచున్న దిక్కులను, విఘ్న
మైన పూజను, జీఁకటితోఁ గూడిన వెలుతురును, ఎండకాలమందలి యేటిని బోలు
చున్న దానిని. నిదాఘము=ఎండకాలము.

క. హతశూరము సైన్యమువలెఁ, బ్రతిహతశాసనము రీతి • రాహువు మ్రింగన్
వెతఁగొను జాబిలిఁ గల నిశ,గతి శాంతానలము భంగిఁ•గ్రాలెడిదానిన్. ౫౦౯

అర్థములు. హతశూరము=చంపఁబడిన శత్రువులుగలది, ప్రతిహత=నెఱ
వేఱని, శాసనము భంగిన్=ఆజ్ఞవలె, జాబిలి=చంద్రుఁడు, శాంతానలము=
చల్లారిన నిప్పు.

తాత్పర్యము

శూరులు చచ్చిన సైన్యమువలె, వ్యర్థమైన, యాజ్ఞవలె, రాహువు మ్రింగిన
చంద్రుని గల రాత్రివలె, చల్లారిన యగ్నివలె నున్నదానిని.

తే. మైల దాఁకిన వేదినాఁ•బూలఁ గమల,దళములను బీఁకివైచి పక్షులను బఱచి
గజము గలఁపఁగ బురదచే•గాడు పడిన,సారసాకరమో యనఁ•జాలుదాని.

తాత్పర్యము

అపవిత్రవస్తువు దాకిన యజ్ఞవేదికవలెఁ, దామరపూలను ఆకులను పీఁకివేసి,
పక్షులను బాఱఁదోలి యేనుఁగు కలియుపెట్టఁగా బురదగా నైన తామరకొలని
వలె నుండుదానిని.

చ. మగనిఁ దలంచి యేడ్చుటను • మానక, కట్టు దెగంగ వాఁకనాఁ
దగి, యుపచారహీన యయి • తానవసంగతిఁ గృష్ణపక్షమం
దగు నిశఁబోలు సుందరి, న•నర్ఘమణీస్థగితాలయోచితన్
మిగుల సుఖార్హనున్, మృదుల•నిర్మల దేహను, సుందరీమణిన్. ౫౧౧

అర్థములు. తానవసంగతిన్=కృశించి యుండుటచేత, అనర్ఘ=వెలలేని,
మణీ=రత్నములచే, స్థగిత=చెక్కఁబడిన, ఆలయ=ఇంటియందుండ, ఉచితన్=తగిన
దానిని.

తాత్పర్యము

మగనిఁ దలంచి విడువక యేడ్చుచు కట్టఁదెగిన వంకవలెనై, యుపచారములు
లేక కృశించి కృష్ణపక్షరాత్రివలె నుండుదానిని, వెలలేని మణులు చెక్కిన యింట
నుండఁదగిన దానిని, మిక్కిలి సుఖమునకు యోగ్యమగు దానిని, సుకుమారమైన
నిర్మలమైన దేహము గలదానిని, అంకగత్తెలందు శ్రేష్ఠురాలిని.

తే. అపుడ యెండకు వైచిన•యట్టి తమ్మి,తూఁడనంగను వాడిన•తోయజాక్షి
యూథపునిఁ బాసి కంబాన•నుక్కు చెడఁగఁ, గట్టఁబడినగ నూర్చుడి•కరిణికరణి

తాత్పర్యము

కొంచెము కాలమునకు ముందే యెండలో వేసిన తామర తూఁడువలె వాడిన

దానిని, యూథనాయకుని వదలి కంబమునకుఁ గట్టఁబడఁగా నూర్చుచున్న యాఁడే నుఁగువలె నుండు దానిని,

క. తూలుచును నొంటిజడతోఁ, జాలిగ నగ లేమి లేమి ♦ శారదవేళన్
నీలం బగు వనలక్ష్మి, లీలలు గల భూమినా ల♦లిం గనుదానిన్. ౫౧౩

అర్థములు. తూలుచును=సోలిపోవుచు, ఇది పూర్వపద్యముతో నన్వయము. ఒంటిజడతో=తల విరియఁబోసికొని, నేలపైఁ బొరలాడుటచే వెండ్రుకలన్నియు నొకటిగా జడకట్టుకొని పోయె నని భావము. నగలు=సొమ్ములు.

తాత్పర్యము

ఒంటి జడ గలిగి, చూచుటకు వ్యసనము గలిగించుచు, సొమ్ములేమి లేకుండుటచే శరత్కాల మందలి నల్లని వనభూమివలె నుండు దానిని.

తే. భయమునను శోకమున నుప ♦ వాసములను
ధ్యానమునఁ గొఱకుడుపువఁ ♦ దపముఁ జేయు
చుండునదివోలె శుష్కించి ♦ యుండుదాని
దీన యగుదాని వెలవెల ♦ యైనదాని. ౫౧౪

తాత్పర్యము

భయము చేతను, వ్యసనము చేతను, ఆహారములేమి చేతను, చింతచేతను, శుష్కించి కొంచె మాహారము దీసికొని తపస్సు చేయుదానివలె నుండు దానిని, శోకించుదానిని, తన్నుఁజూచి భయముచే తెల్లఁబోయిన దానిని.

ఉ. దేవతలార! నా పతికిఁ ♦ దేజ మెలర్పఁగఁ జేసి యా దశ
గ్రీవుఁ బరాభవింపుఁ డని ♦ కే లుమ్కుళించి సభక్తికంబుగా
భావములోన వేఁడు చెలిఁ ♦ బ్రక్కలు చూచుచు నేడ్చుదాని, న
వ్పావని మైథిలిం గదిసెఁ ♦ బాపి దశాస్యుఁడు పంచతార్థ మై. ౫౧౫

అర్థములు. పావనిన్=పవిత్రురాలిని, పంచతార్థము = మరణము నవిూపించిన కారణముచే.

తాత్పర్యము

దేవతలారా! నా పతికిఁ బరాక్రమ మతిశయింపఁజేసి రావణునకు నపజయము కలుగునట్లు చేయుఁ డని రెండు చేతులు జోడించి భక్తితో నమస్కరించుచు మనస్సులోఁ బ్రార్థించు దానిని నీ ప్రక్క నాప్రక్క చూచుచు నేడ్చు దానిని, పవిత్రురాలిని, పాపాత్ముఁ డగు రావణుఁడు మరణదశ ప్రాప్తించుటచే సీతను సమీపించెను.

—♦ ౨౦-వ సర్గము, రావణుఁడు తనకోరికను సీతాదేవికిఁ జెప్పుట. ♦—

క. చేరంగఁ బోయి రాక్షస,వీరుఁడు మధురోక్తిఁ బల్కెఁ ♦ బృథ్వీసుతతో
వారక తన మదిఁ గలుగు వి,చారము తెల్లంబుగాఁగ ♦ సాధ్వీమణికిన్. ౫౧౬

తాత్పర్యము

ఇట్లు సమీపించి రావణుఁడు తియ్యని మాటలతో దన మనస్సులో నున్న యాలోచనలు స్పష్టముగాఁ దెలియునట్లు పతివ్రతాశిరోమణియైన సీతాదేవితో నిట్లనియె.

ఉ. ఏటికి నన్నుఁ జూచి జల♦జేక్షణ! దాఁపఁ గుచోదరంబు, లి
　ట్లేటికి కొంకొ వణంకఁ, బరు ♦ లెవ్వరొకో కరభోరు! యిందు, నా
　మాటను బాటిగాఁ గొనుము ♦ మత్ప్రియురాల! బహూకరింపు నన్,
　మేటిసురూపతాఖనివి ♦ నీవ గదే జగదేకమోహినీ. ౧౭

అర్థములు. కుచ+ఉదరంబును=స్తనములను కడుపును, కరభోరు=కరభము వంటి తొడలు గలదానా! కరభము=మణికట్టు మొదలు చిటికెనవ్రేలి మొదలు దాఁక చేతి వెలుపలిచోటు. (౨) ఏనుఁగుతొండము. సురూపతా=సౌందర్యమునకు, ఖనివి=గనియైన దానవు.

తాత్పర్యము

నా ప్రియురాల! జగములను మోహింపఁజేయుదానా? నన్నుఁ జూచి యేల నీవు కడుపును, జనులను దాచిపెట్టెదవు. ఏల యిట్లు వణఁకుచున్న దానవు. ఇక్కడఁ బరులెవ రున్నారు. నా మాట వినుము. నన్ను గౌరవింపుము. నీవేకదా సౌందర్యమునకు గనియైన దానవు.

ఆ. కలికి మనుజులైనఁ ♦ గామరూపధరులు, రాత్రిచరులునైన ♦ రాజవదన!
　యిందు లేరు నీకు ♦ నేటికి భయపడ? నాకు వెఱవ వలదు ♦ నళిననేత్ర! ౧౮

తాత్పర్యము

కాంతా! ఇచట నీ జాతిలోఁ జేరిన మనుష్యులు లేరు. నా జాతికిఁ జేరి కామరూపధరులైన రాక్షసులు లేరు. నీ వేల యెవరుచూచి యే మనుకొందురో యని భయపడెదవు. నాకు నీవు భయపడవలసిన పనిలేదు. నేను రాక్షసుఁడనైనను నీ మీఁది కామమున వచ్చితినిగాని, నిన్నుఁ జంప రాలేదు.

క. పరదారగమనకేళియుఁ, బరదారాపహరణంబు ♦ పద్మదళాక్షీ
　పరగుఁ గులధర్మమయి నిర్జరవైరుల కెల్ల భీరు ♦ సందియ మున్నె. ౧౯

తాత్పర్యము

ఓరీ! నేను నీభార్యనుగాను, పరభార్యలను నీవు కోరవచ్చునా యందువేమో, పరుల భార్యలను బొందుట, పరుల ధన మపహరించుట యను నాటలు రాక్షసుల కందఱకు నాకొక్కనికే కాదు కులధర్మము. ఓసి పిఱికి! దీనిలో సందేహము లేదు; ఇది కులధర్మ మగుటచే దోషము గాదు కావున నీకుఁ బాపభయ మక్కఱలేదు.

క. రామా! యిది యిట్లయ్యు న,కామను నినుఁ దాఁక నొల్లఁ ♦ గామములలిమిన్
　గామింపు యథాకామము,గా మైథిలి! నాదుపట్లఁ ♦ గరుణామతివై. ౨౦

### తాత్పర్యము

సుందరీ! పరదారలను బొందుట నాస్వధర్మమైనను స్వధర్మము నిర్వహించుట నాకు విధియైనను, నాయందు నీకుఁ గామము కలుగ లేదు. కావున నాకెంత కామమున్నను నిన్నుఁ దాఁకుట కిష్టపడను. నీవే నీ కోరిక ప్రకారము యథేచ్ఛముగా నన్ను నా యందు దయయుంచి కామింపుము.

ఉ. దేవి! భయంబు నొందఁగ మ•దిం దగ దిందుఁ, బ్రసాదదృష్టి సం
భావన సేయు నన్ను వెత•పాల్పడఁబోకుమ, యేకవేణి దు
ష్టావని శయ్యయున్ వరసు•ఖార్హ్మతలంబునఁ బస్తు లుంటయున్
వావిరిచింతయున్ మయిల•వస్త్రము నీ కుచితంబులే యిటన్. ॥ ౨౧

అర్థములు. ప్రసాదదృష్టి=అనుగ్రహముతోఁ గూడిన చూపు సంభావన=గౌరవము, దుష్టావని=పాడు నేల.

### తాత్పర్యము

దేవీ! నీ విచ్చట భయపడరాదు, నన్ననుగ్రహదృష్టి గౌరవింపుము. వ్యసనపడవలదు. ఒంటి జడ, గొడ్డునేల పడుక, సుఖింపవలసినచోట నుపవాసములు, వదలని విచారము, మాసినగుడ్డ యివి నీ కిచ్చటఁ దగునా?

ఉ. అందము లైన మాల్యనిచ•యంబులు దివ్యము లైన భూషలున్
జందనలేపనంబులును • జక్కని పెక్కు తెఱంగు చేలముల్
సుందరమందిరంబులును • సొంపగు పానశయాసనంబులున్
సుందరి నృత్తగీతములు • నూల్కొనుమీ ననుఁ బొంది మైథిలీ! ॥ ౨౨

### తాత్పర్యము

సొగసైన పూలదండల గుంపులు, దివ్యాభరణములు, దివ్య చందనపుఁ బూఁతలు, అనేక విధములైన చీరలు, అందములైన యిండ్లు, సొంపయిన పానములు, పానుపులు, పీటలు, ఆటలు, పాటలు నన్నుఁగూడిన దానవై వీనినెల్ల నంగీకరింపుము.

క. స్త్రీరత్నమ! యిటు లుండకు; భూరివిభూషల ధరింపు•పువుఁబోఁడీ! నన్
జేరియునున్ రుచిరాలం, కారములకుఁ బాసి యుండఁ•గాఁ దగు నోకో.

అర్థములు. రుచిరాలంకారములకున్=అందములైన సొగసులకు, ద్వితీయార్థమున షష్ఠిషష్ఠ్యర్థానకంబగు కువర్ణకం బొక్కొక్కచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులఁ జూపట్టెడి. (ప్రౌ. వ్యా. కా. ౧౯)

### తాత్పర్యము

స్త్రీలయందు శ్రేష్ఠురాలా! నీ వీ ప్రకారముగా నుండఁ దగదు. వెలగల యాభరణములను ధరింపుము. నా యొద్ద నుండియును నీవు మనోహరములైన యలంకారముల విడిచియుండ వచ్చునా?

క. చను చున్నది యెఱుఁగ వో కో, ననఁబోణీ! హారియౌవనము నీకు వృథా
చనినదియు మరలు నటవే? వనజాక్షీ! వచ్చునా ప్రవాహము మఱలన్?

అర్థములు. హారియౌవనము=మనోహరమైన వయస్సు, "రతివ్యాయామసహనో మత్తేభస్యేవ సత్తతా। విద్యతే యువభావో య స్తద్యౌవనముదాహృతమ్."

తాత్పర్యము

పుష్పకోమలా! నీకుఁ బ్రాయము వృథాపోవుచున్నది. ఇది నీకుఁ దెలియ లేదు కాఁబోలు పోయిన ప్రాయము మఱలరాదు. ప్రవాహము మఱలి యెన్న డైన వెనుకకు వచ్చునా?

ఉ. నిన్ను సృజించి వెండి తరుణీ యలవిశ్వవిధాత రూపసం
పన్నల సృష్టి సేయుటయె మానె నటంచుఁ దలంతు లోకమం
దన్నులమిన్న! నీకు సరియైనగవ లేమి నొకర్తుఁ, బూరుషుం
డన్నలువైన నిన్నుడసి యబ్జముఖీ! విడనాడి పోవునే. ౧౩

అర్థములు. విశ్వవిధాత=ప్రపంచము సృష్టిచేసిన బ్రహ్మ, రూపసంపన్నలన్=సౌందర్యలక్ష్మి గలవారల, అన్నులమిన్న=స్త్రీలయందు శ్రేష్ఠురాలా, నలువైన=నలువ+ఐనన్=బ్రహ్మయైనను, నలు+వ=నలు+వాయి=నాలుగు వదనములు గలవాఁడు.

తాత్పర్యము

నిన్నుఁ బుట్టించిన తరువాత బ్రహ్మదేవుఁడు సౌందర్యవతు లగు స్త్రీలను సృష్టి సేయుటయే మానె నని తలఁచెదను. ఏలన యో స్త్రీరత్నమా! నీకు సరియైన స్త్రీ లోకమున లేదు. నీకంటె నందకత్తెను సృష్టింప యత్నించినను నది వ్యర్థప్రయత్నమగును. ఆ పనికిఁ బూన నేల యవమాన పడనేల యని యా పనియే మానుకొనెను. నీవు లభించినపుడు మగవాఁడు బ్రహ్మయైనను నిన్ను వదలిపోవునా?

ఈ రావణ వాక్యములకు మహేశ్వరతీర్థీయ మందు భక్తిపర్యాయముగా శ్లిష్టకల్పనము చేసి వ్రాయఁబడియున్నది. అది వాస్తవమునకు విరుద్ధ మని యిది వఱకే వ్రాయబడెను. ఈ విషయమున తిలకవ్యాఖ్యయం దీ వాక్యములు గాన నచ్చెడిని. 'ఈదృశేషు తీర్థ స్యాన్యథాయోజనం భ్రాంత్యైవ, రక్షస స్తమోగుణావిష్టస్య భగవన్మాయామోహిత స్యాకృత్యేష్వేవ ప్రవృత్తేః। తథా క్రియామాణం భగవద్ధ్యానమపి పాపభోగోత్తరం జన్మాంతరే ఉత్తమఫలాయేతి బోద్ధవ్యం... . ....ఏవంచ భగవతో నిందావరుద్ధభావేన ధ్యాన మపి నరకభోగోత్తరం జన్మాంతరే ఉత్తమ ఫలాయ। అత ఏవాస్య మరణోత్తరం చతుర్థచతుర్యుగ్యాం చేదిరాజకులే జన్మ, చతుర్వింశతి చతుర్యుగ్యాం రామావతార ఇతి హరివంశోక్తేః। తావత్పర్యంతం చైతత్పాప ఫలభోగ ఇత్యర్థ ఆయాత ఇతిబోధ్యమ్

ఇట్టిచోటుల తీర్థులవారి యన్యథార్థకల్పనమునకు భ్రాంతియే కారణము. తమోగుణావిష్టుఁడై భగవన్మాయా మోహితుఁడైన వానికి యకృత్యములు చేయుటయందే ప్రవృత్తి. ఆవిధముగఁ జేయు భగవద్ధ్యానము కూడ పాపభోగానంతరము జన్మాంతరమున ఉత్తమ ఫలము నిచ్చునని యెఱుఁగవలెను. ఈవిధముగ నిందించుచు భగవంతుని ధ్యానించుటచే నరకానుభవానంతరము జన్మాంతరమున ఉత్తమ ఫలము నిచ్చును. ఆ కారణముచేతనే నాలుగు మహాయుగముల యనంతరము చేదివంశమునఁ బుట్టెను. ఇరువది నాలుగవ మహాయుగమందు రామావతారమని హరివంశమందుఁ గలదు. ఇరువది యెనిమిదవ మహాయుగమునఁ గృష్ణావతారము కావున నంత పర్యంత మీ పాపఫల మనుభవించుచుండె నని తెలియవలయు నని యర్థము. ఈ విషయమున నింత కెక్కువ చెప్పవలసినది లేదు.

తే. ఎచ్చటెచ్చట నా దృష్టి • యిందువదన!, పడియె నీపయి నందంద • బ్రాఁతిఁజలన
మించుకయు లేక నిలిచెనే • యించుఁబోఁడి, గురునితంబిని నిన్నన్నఁ • దరమె నాకు,

అర్థములు. బ్రాఁతిన్=ప్రీతిచే, గురునితంబిని=పెద్దపిఱుఁదులు గలదానా? తరమే=సాధ్యమా?

## తాత్పర్యము

నీదేహము మీఁద నా చూపు లెందెందుఁ బడెనో, యందందే యవ్లియవి ప్రేమచే భ్రాంతి గొని నిలిచిపోవుచున్నవి. కొంచెమైన నాస్థానమును విడిచి పోవు. ఇట్టి నిన్నుఁ బొగడ నాకు సాధ్య మగునా? కాదు.

దూరా దాకర్షణే శక్తో యస్స ఆకర్షక స్స్మృతః
సర్వేషాం స్పర్శ లోలత్వం కురుతే యస్స చుంబకః
కృతార్థయతి యో దృష్ట్యా నంతు సంద్రావక స్స్మృతః
భ్రామకో మధురాభాషీ సంస్తవే ద్వేష భాజనమ్‌॥ భోజకారిక.

అయస్కాంతము ఇనుమును లాగుకొనునట్లు ఆకర్షించునది ఆకర్షక మనఁబడును. తాఁకవలయు నని కోరిక పుట్టించునది చుంబక మనఁబడును. చూపుల చేతనే కృతార్థులఁ జేయునది సంద్రావక మనబడును.

సీ. విడువుమీ మోహంబు • వెలఁది భార్యవు గమ్మ, నా కచ్చటచ్చట • నాఁచికొనుచు
దెచ్చిన నా యెల్ల • తెఱవలలో నగ్రమహిషివి గమ్ము న • మ్మదము మీఱ
నెల్లరఁ బిలిపించి • యేను దెచ్చినమణుల్, నేను రాజ్యంబును • నీ ధనంబ
నిర్జించి ధరణియు • నిఖిలపత్తనములు, నీదుసంతుష్టికై • నెలఁత నొసంగు

తే. వాఁడ జనకున, కెవ్వఁడేఁ వాలుమగఁడు, నన్ను రణమున నోర్వఁగా • నున్నజగము
నందుఁ? బోరుల వేళల • సుందరాంగి, నాదు బలవీర్యములను గ • నంగఁ గలవు.

అర్థములు. నాఁచికొనుచు=బలాత్కారముగ గ్రహించుచు, అగ్రమహిషివి=పెద్దపట్టపు రాణివి.

### తాత్పర్యము

సీతా! నీ వీ యజ్ఞానమును వదలుము. నాకు భార్యవు కమ్ము. నే నాయా దేశంబులందు బలాత్కారముగ గ్రహించి తెచ్చిన స్త్రీల యందఱిలో సంతోషముతో నీవు పట్టపు రాణివి కమ్ము. నే నందఱను బాధించి తెచ్చిన మణులు, నేను, నా రాజ్యము నీ సొత్తే. ఇదిగాక యింకయుఁ గావలయునని భూమిని, సకల నగరములను జయించి నీవు తృప్తిపడుటకై నీతండ్రి జనకునకు సమస్తము నిచ్చువాఁడను. యుద్ధమునందు నా ధాటి సహింపఁగల శూరుఁ డెవ్వఁడున్నాఁడే; యుద్ధములందు నా బలము, శౌర్యము నీవే చూడఁగలవు.

చ. ఒరగిన టెక్కెముల్, రవుతు • లూడిన వాజులుఁ, గూలు తేరులున్
విఱిగిన విండులుం, జెదరి • ప్రేలెడి వెంట్రుకలుం, దడంబడం
బఱచెడి పాదముల్, పిలుకు • మాఱెడి సేనలుఁ, గల్గి శత్రువుల్
విఱికితనానఁ బాఱుదురు • భీతి ననిన్ దనుజామరుల్ సతీ! ౨౮

అర్థములు. పిలుకుమాఱెడి=చచ్చుచున్న, అనిన్=యుద్ధమందు.

### తాత్పర్యము

సీతా! నేను యుద్ధము చేయునపుడు యుద్ధభూమి యెట్లుండు నని తలఁచితివో కదా! కట్టుత్రాళ్ళు తెగి దండములు విఱిగి నేలరాలిన ధ్వజములు, రౌతులు చచ్చిన గుఱ్ఱములు, కుప్పకూలిన తేరులు, విఱిగినవిండ్లు, విరియఁబోసికొని పరువెత్తువారి వెంట్రుకలు, తడఁబడ పరువెత్తుకాళ్లు, చచ్చుచున్న సేనాభటులు గలవారై దానవులందు, దేవతలందు శత్రువులగువారు భయపడి పరువెత్తుదురు.

ఉ. కన్నులకాంక్ష దీరఁ గనఁ • గా మది గోరెదు నీదు రూపమున్
జెన్నగు భూషణంబులను • జెల్వ! ధరింపుము మేన, నాశ దీ
ఱ న్నిఖిలేష్టభోగములఁ • బ్రాజ్యముగా భుజియింపు, క్రీడలన్
బన్నుగఁ దేలుమీ, రుచిర • పానకముల్ ముదమారఁ గ్రోలుమీ. ౨౯

### తాత్పర్యము

నీ సౌందర్యమును గన్నుల కోరిక దీరఁ జూడఁ గోరిక కలదు. కావునఁ జెలువా! దేహమున నాభరణంబుల ధరింపుము. నీ యాశదీర సమస్త భోగములఁ బూర్ణముగ ననుభవింపుము. కేళుల వర్తింపుము. సంతోషముతో మనోహరములైన పానకములు త్రాగుము.

మ. ధనమో భూమియొ రాజ్యమో యెదియు నే • దన్వీ! యథేష్టంబుగా
వనితా! దానము సేయుమీ, ననుఁ గృపా • భావంబునం జూడుమీ
కొనుమీ యెయ్యది గోర నిచ్చెదను నీ • కు, న్నాపయిం గూర్మిఁ జూ
పిన నీవారల కెల్ల సౌఖ్యములు ప్రా • పించున్ నిజం బాడెదన్. ౩౦

### తాత్పర్యము

నీ యిష్టప్రకారము ధనముగాని, భూమిగాని, రాజ్యముగాని, మఱియేదైన. గాని నీ యిష్టమువచ్చిన వారికి దానము చేయుము. నన్ను దయతోఁ జూడుముఁ నీవేది కోరినను నిచ్చెదను. నాయందు నీ కనుగ్రహము గలిగెనా నీ బంధువులకెల్ల సౌఖ్యములు లభింపఁజేసెదను. సత్యము చెప్పుచున్నాను.

తే. కలికి నాదు సమృద్ధియుఁ ♦ గలిమి కీర్తిఁ, గనుము ప్రీతి, వనాటుండు ♦ గతరముండు
చెలియ! చీరాంబరుండు ని ♦ క్షిప్తవిజయుఁ, డతివ! స్థండిలశాయి నీ ♦ పతి దలంప.

అర్థములు. వనాటుండు=అడవులందు సంచారము చేయువాఁడు, గతరముండు=పోయిన సంపద గలవాఁడు, చీరాంబరుండు=నారగుడ్డలు కట్టువాఁడు, నిక్షిప్త=వదలఁబడిన, విజయుఁడు=గెలుపు గలవాఁడు, స్థండిలశాయి = నేలపైఁ బండుకొనువాఁడు.

### తాత్పర్యము

ఇంతసేపు తన్నుఁ బొగడుకొని యిఁక రాముని దూషించుచున్నాఁడు. కలికీ! నా సమృద్ధి, సంపద. కీర్తి వీనిని ప్రీతితోఁ జూడుము. ఇఁక నీ మగఁడో యిల్లు, వాకిలి, గుడిసె యైన లేక యడవులయందుఁ దిరుగువాఁడు. సంపద లేనివాఁడు. కట్టుకొన మంచి వస్త్రములు లేక, నారచీరలు గట్టువాఁడు. గెలుపు లేనివాఁడు. పండుకొనుటకు నొక చాపయైన లేక నేలఁ బడి యుండువాఁడు. అట్టి దరిద్రరాముఁ డెక్కడ? నే నెక్కడ?

రావణుఁడు రామచంద్రుని దూషింపవలయు నని దూషించినను 'సత్యవాణీ సరస్వతీ' యన్నట్లు వానినోట సత్యవాక్కులే వచ్చెను. 'మానిషాద' వలెనని యెఱుంగునది, లేక ఘుణాక్షర న్యాయ మనియైనఁ జెప్పవచ్చును. వనాటుండు=వన మనఁగా నీళ్లు, వానియందుఁ జరించువాఁడు నారాయణుఁడు, గతరముండు=పొందఁబడిన లక్ష్మి గలవాఁడు, చీరాంబరుండు=అంబరము=ఆకాశము, అదియే వస్త్రముగాఁ గలవాఁడు, నిరావరణుఁ డని యర్థము=నిక్షిప్త విజయుఁడు=చెడిపోని గెలుపేగలవాఁడు, స్థండిలశాయి=స్థండిల మనఁగా యజ్ఞభూమి, దానియందుండు వాఁడు.

ఉ. రాముఁడు నింత దాఁక నటఁ ♦ బ్రాణముతోడుత నున్నవాఁడో లేఁ
డో మది సంశయింతు, నిను ♦ నుత్పలలోచన! చూడ నేనియున్
రాముఁడు చాలఁ, డగ్రమున ♦ రాజిలఁ గొంగలు వార్షికాంబుద
స్తోమము గ్రమ్మినన్ వశమె ♦ చూడఁగ వెన్నెల నెట్టివారికిన్? ౫౩౨

### తాత్పర్యము

సీతా! రాముఁడు రాముఁ డని యంగలార్చెదవే, రాముఁ డింకను బ్రదికియున్నాఁడు, చావలే దనుట యేమి నిశ్చయము. ఒకవేళ బ్రతికియున్నాఁడనుకో, నిన్నుఁ జూచుటకైనను రాముఁడు రాఁజాలఁడు. ఎట్లన ముందు కొంగ లన్నియు

వ్యాపించి వానిపైన వాన మబ్బుకూడఁ గ్రమ్మినప్పుడు వెన్నెలను జూచుట కెవరి కైన సాధ్యపడునా? అట్టులే సముద్రము దాఁటి నన్ను గెలిచికదా నీ యొద్దకు రావలె, అదెట్లు రాఁగలఁడు?

తే. వృత్రశాత్రవకరగత♦హేమకశిపు, కీర్తిచందంబునను రామ♦మూర్తి మఱల
నాదు హస్తంబునం దుండి♦నళిననేత్ర! నిన్ను గ్రహియింపనట్టులు♦నేర్చుఁజెపుమ.

అర్థములు. వృత్రశాత్రవ కరగత=ఇంద్రునకు వశపడిన, హేమకశిపు కీర్తి=హిరణ్యకశిపుని కీర్తి, ఇక్కడఁ గీర్తికారణమైన భార్యయని గ్రహింప వలయును. భార్యాహరణము కీర్తిహరణమేకదా, హిరణ్యకశిపుని భార్యను ఇంద్రుఁడు హరింపఁ గలిగెను గాని రాముఁడు నాచే జిక్కిన నిన్ను మఱల రాముఁడు నిన్ను హరించెనేని నాకీర్తి హరించినట్లే. అది యెన్నఁటికిని గాఁజా లదు. ఇంద్రుడు హిరణ్యకశిపుని భార్యను హరించి నారదాశ్రమమున నుంచె ననియు మఱల హిరణ్యకశిపుఁడు నారదు మూలమున నామెను గ్రహించెననియు భాగవతమునఁ గలదు. ఇది వైధర్మ్య దృష్టాంతము. రావణాసురుఁడు సీతను హరించినట్టులు హిరణ్యకశిపుఁ డింట లేని సమయంబున నింద్రుఁ డాయనభార్యను కయాధువును హరించెను. ఆవల వాఁడు నయముననో, భయముననో, మరలఁ దెచ్చుకొనెను. నీవు నాభార్యవు, నిన్ను రాముఁడు నయమునఁగాని, భయమునఁ గాని హరింపఁజాలఁడు. ఇట్లు చెప్పినను చెప్పవచ్చును. తన్ను గొప్పగాఁ జెప్పు కొనుటకై యింద్రునితోఁ దన్నుఁ బోల్చుకొనెను.

క. అందం బగు చిఱునగవున, సుందర రదనమునఁ గనుల♦సొబగున వినతా
నందనుఁడు లేలిహానము, చందమున హరించె దీవు♦సకి నా మనమున్.　　౭౩౮

అర్థములు. లేలిహానము=పాము.

తాత్పర్యము

అందమైన చిఱునవ్వుచేత, సుందరములైన దంతములచేత, కన్నుల సొగసు చేత, గరుత్మంతుఁడు పామును హరించినట్లు నీవు నామనస్సును హరించుచున్నావు. ఈ యుపమానము సీతాదేవి రావణుపాలికి మృత్యుదేవత యని సూచించు చున్నది. మృత్యుదేవత యేదియో రోగమో, నొప్పియో నెపముపెట్టి యెట్లు చంపునో యట్టులే సీతయు రామునిచేత రావణుని జంపించు నని భావము.

ఉ. మాసినచీరఁ గట్టి, నెఱి♦మాలి యలంకృతి లేక మిక్కిలిన్
గాసిలు చున్నయిట్టి నినుఁ♦గాంచుట నా ప్రియురాండ్రతోడ వి
శ్వాసముగా రతిం జలుపఁ♦జాలన, కంటె సమస్తసద్గుణా
వాసలు మత్సతుల్ ముగుద! ♦ వారల కీశ్వరి వై చెలంగుమీ.　　౭౩౯

తాత్పర్యము

మాసిన చీరగట్టుకొని, సొగసువదలి, యాభరణములు ధరింపక మిక్కిలి కష్ట

పడుచున్న నిన్నుఁజూచి నిశ్చింతముగా నా భార్యలతో నేను క్రీడింపలేకున్నాను. అయ్యో! సీత యింత కష్టపడుచుండఁగా నాకేమి సుఖ మని మనస్సంతయు నీ మీఁదనే యుండుటచే వారిమీఁద మనస్సు పోవుటలేదు. అట్లైనచో నిప్పుడునేను నిన్నంగీకరించిన వారి కందఱకు నా మీఁద కోపము రాదా? సవతి మచ్చరము సాధింపరా యందువేమో? నా భార్యలట్టివారు గారు. సుగుణసంపత్తి గలవారు. అదికాక వారి కందఱకు నీవే ప్రభ్వి కమ్ము. నీ యధికారానుసారము నిన్నను సరించి వారు వర్తింతురు.

క. సిరి నచ్చరలు భజించెడి, కరణిఁ ద్రిలోకీప్రవరులు • కాంతా! యస్మ
త్తరుణులు నిన్ను భజింతురు, కరమును భయభక్తియుక్తిఁ•గరుణం గనుమీ.

అర్థములు. త్రిలోకీప్రవరలు=మూఁడులోకములందు శ్రేష్ఠురాండ్రు, అచ్చరలు=అప్సరసలు, అస్మత్తరుణులు=నా స్త్రీలు.

తాత్పర్యము

శ్రీ మహాలక్ష్మిని మూఁడు లోకములందు శ్రేష్ఠురాండ్రగు నప్సరస లేవిధముగ భయభక్తులతో సేవింతురో యా ప్రకారమే నా యాఁడువా రందఱు నిన్ను భయభక్తులతో సేవింతురు.

క. చేకొను మలకాపురిఁ గల, ప్రాకటరత్నములు ధనము•బద్మదళాక్షీ
లోకంబునఁ గల్గు నమూ,ల్యాకల్పంబులను నన్ను • నాదర మారన్. ౫౬

అర్థములు. అమూల్య+ఆకల్పంబులు=వెలలేని యాభరణములు.

తాత్పర్యము

కుబేరుని పుర మగు నలకాపురియందుఁ గల నిధులలో నుండు రత్నములన్నియు నీవే తీసికొనుము. అవిగాక లోకమునఁగల వెలలేని యాభరణములను గ్రహింపుము. నన్ను నను గ్రహింపుము.

క. తపముననో బలముననో, విపులపరాక్రమములందో•విత్తనమునందో
విపుల సుకీర్తినో కాంతినొ• చపలాక్షీ! రామవిభుఁడు•సరియగు నాతోన్.

తాత్పర్యము

తపమునందో, బలమునందో,విస్తార పరాక్రమమందో, ధనమునందో, లోకమున మంచి కీర్తియందో రాముఁడు నాతో సమానుఁ డగునా?

మ. లలనా! కోరినరీతిఁ గ్రీడలను దే•లన్ రాదె, త్రావం గదే,
కలభోగంబులఁ బొందుమీ, యొసఁగెదం • గళ్యాణి! విత్తంబులో
యిలయో యెయ్యది గోర నాపయిఁ గృపా•దృష్టుల్ ప్రసారించినన్
జెలి! నీచుట్టము లెల్లరున్ సుఖులుగాఁ • జింతింపు కాంతామణీ. ౫౮

తాత్పర్యము

సీతా! నీ యిష్టమువచ్చినట్లు మనసారఁ గ్రీడింపరాదా! త్రావరాదా! భోగము

లన్ని యనుభవింపరాదా! నీకుఁ గావలసిన ధనమో, భూమియో నీ వేది కోరిన నిచ్చెదనే. నాపై నీవు దయార్ద్ర దృష్టులు వ్యాపింపఁజేసితివేని నేనేకాదు, నీకుఁ గావలసిన వారు బంధువు లందఱు సుఖపడుదు రని నమ్మము.

మణిమంజరి. మసలకు కనకసు♦మండన! కుంజ
ద్భసలవిసరములు ♦ భాసిలు వేలా
కుసుమితతరుగణ ♦ కుంజములందున్
బస మియి మెలఁగుము ♦ భామిని నాతోన్. ౧౮౦

అర్థములు. కనకసుమండన=బంగారుమయము లైన మంచి యాభరణములు గలదాన, కుంజత్=ధ్వనించు, భసలవిసరములు=తుమ్మెదల గుంపులు, భాసిలు=ప్రకాశించు, వేలా=సముద్రతీరమండలి, కుసుమిత=పూచిన, తరుగణ=చెట్ల సమూహముల, కుంజములందు=పొదలయందు.

తాత్పర్యము

భామిని! నీవు ఆలస్యము చేయకుము. బంగారుసొమ్ములు గలదానా! ఝుంకారములు చేయు తుమ్మెదల గుంపులుగల సముద్రతీరమండలి పూలచెట్ల పొదలందు నాతో సంతోషముగా విహరింపుము. మణిమంజరి వృత్తమునకు, న న స స గ గణములు, తొమ్మిదింట యతి.

—♦ ౨౧-వ సర్గము, సీతాదేవి రావణునకు బుద్ధి చెప్పుట ♦—

చ. అనుడు దశాస్యువాక్యముల ♦ నాధరణీభవ యాలకించి దు
ర్మన యయి వేపమాన యయి ♦ మానక సాధ్వి పతిం దలంచుచున్
గనుఁగవ నశ్రువు ల్దొరఁగఁ♦గా విలపించుచు దీననాదయై
యనియెను గడ్డిఁబోఁచ తన ♦ కడ్డము నిల్పి శుచిస్మితాస్య తాన్. ౧౮౧

అర్థములు. దుర్మన=వ్యసనముతోఁ గూడిన మనస్సు గలది, ఆలకించి=విని, వేపమాన=వణఁకుచున్నది, సాధ్వి=పతివ్రత, అశ్రువుల్=కన్నీళ్లు, దొరఁగన్=కాఱఁగా, దీననాదయై=దుఃఖముతోఁ గూడిన ధ్వనిగలది, ఏడుపు గొంతుతో, శుచిస్మితాస్య=పరిశుద్ధమైన చిఱునవ్వుతోఁ గూడిన ముఖముగలది. దుర్మన=పతి నెడఁబాసి యుండవలసి వచ్చెఁగదా, దుష్టుఁ డగు వీనిచే బతివ్రతలు వినరాని మాటలు వినవలసి వచ్చెఁగదా యని వ్యసనము.

వేపమాన=అబల—అసహాయ యగుటచే వీఁడు తొందరపడి తాఁకు నేమో యను భయముచే వణఁకెను.

సాధ్వి=సాధుత్వము గలది. కావున వాని నిర్దహింపఁ గలిగియు సహించెను.

పతిం దలంచుచున్=పతివ్రతలకు భర్తయే దైవము కావునఁ దక్కినవా రాపత్కాలంబుల దైవమును స్మరించునట్లామె పతిం దలంచెను. పాలించువాఁడు గదా పతి.

అశ్రువుల్ దొరఁగగాన్=తన్ను వాఁడేమియుఁ జేయ జాలఁ డను ధైర్యము గలది కావునఁ దనకై యేడిచినదికాదు. తన వలన భర్తకు దుఃఖము వచ్చెఁ గదా యనియుఁ, దనవలన వీఁడు సమూలము నాశమై పోవ నున్నాఁడే, చెప్పినను వినఁడేయని రావణు నిమిత్తమైయు కన్నీరు గార్చెను.

గడ్డిపోఁచ తన కడ్డము నిల్పి.

౧. వీఁడు దుష్టభావము గలవాఁ డైనను ప్రభువు, క్షత్రియుఁడు. ఇట్టివీఁడు తన యొద్దకు వచ్చినపుడు 'ఆసనం చాన్న ముదకం దేయమ్' అతిథివంటివాఁడే. అతిథికి ఆసనమో, అన్నమో, నీళ్లో యథాశక్తి యియ్యవలయు నని శాస్త్ర వాక్యము గలదు. కావునఁ దనకు లభించిన యా తృణము వైచెను.

౨. రావణుఁడు వచ్చి సమీపమందుఁ గూర్చుండుటచే దుష్టులతో సంపక్తిఁ గూర్చుండరాదు గావున పంక్తిభేదము గలిగింప 'స్తంభేన పలిలేన వా పంక్తి భేదోఽభిజాయతే' స్తంభముగాని, నీళ్ళుగాని యేదైన నడ్డముండిన పంక్తిభేద మగును గావున నిరువురకు నడుమఁ దృణము వైచెను.

౩. స్త్రీ పరపురుషునిఁ బ్రత్యక్షముగఁజూడరాదు. మాటలాడ రాదు. 'న పర ముఖ నిరీక్షణం నాపి సంభాషణ'మ్మన్న నీతి ననుసరించి ప్రత్యక్ష సంభాషణము నివారింపఁ దృణ మడ్డము వైచెను.

౪. 'తృణ మివ లఘు మేనే' నిన్ను నేను తృణముగా నెంచుచున్నాను. అన్నట్లు నీ వీ తృణముతో సమానము. ఈ తృణము నన్నేమి చేయఁగలదో నీవు చేయగలిగిన దంతయే యని సూచింపఁ దృణము వైచెను.

౫. నీకు జ్ఞానములేదు 'జ్ఞానేన హీనః పశుభి స్సమానః' యన్నట్లు నీవు పశువుతో సమానము. నీకు భోగ్యవస్తు వీ గడ్డియే, నేను గాదని తెలుప గడ్డి పోఁచ యడ్డము వైచెను.

౬. అలకాపురిఁగల, మఱియు లోకమునఁ గల రత్నాభరణము లిచ్చెద నంటివే, అవి, నీ యైశ్వర్యమంతయు నీ తృణముతో సమానమని తెలుప గడ్డి పోఁచ యడ్డమువేసెను.

౭. ఎంతటి శత్రువైనను గడ్డిపోఁచ నోటఁ గరచుకొన్నవాని వీరులుచంపరు. కావున నీవు బ్రదుకఁ గోరెదవేని దీనిని నోటఁ గఱచుకొని రాముని యొద్దకుఁ బొమ్ము. నిన్ను రక్షించును. లేకుండిన నిన్నుఁ జంపుట నిజము.

౮. నన్ను నీవు బాధించితివా హిరణ్యకశిపునిచే బాధపడు ప్రహ్లాదుని రక్షింప స్తంభమునుండి నృసింహమూర్తి యుద్భవించినట్టు యీ తృణము నందు రామమూర్తి యుదయించి నిన్నిచటనే చంపును.

౯. తృణము విఱిచివేసినయెడల సత్యము తప్పనని ప్రమాణము చేసి

నట్లగును. కావున నన్ను నీవు బాధించుటచే రామలక్ష్మణులు నీ లంకను భస్మీభూతము చేయుదురని ప్రమాణము చేసి చెప్పెదనని భావము.

౧౦. నా యవయవములందు నీ దృష్టి నిలిచిమఱలదని యంటివి. నీదృష్టులు మఱలక యంతటితో హతము లగునట్లు వామనుఁడు శుక్రాచార్యుని కన్నులు దర్భతోఁ బొడిచినట్లు దీనితోఁ బొడిచెదను.

౧౧. రామచంద్రమూర్తి నన్ను స్పృశించిన కాకాసురు నెట్లు దర్భచే గన్నులు పొడిచి పంపెనో యట్టులే నీ కన్నులు పొడిచెదను.

౧౨. నీవు రాముని గెలిచెద నంటివి. రామచంద్రమూర్తి విడిచిన యా దర్భను బ్రహ్మరుద్రేంద్రాదులును మఱలింపఁ లేకపోయిరి. అట్టి వానిని నీ వేమి గెలువఁగలవు?

౧౩. ఈ తృణమును త్రుంచునట్లు నీ తలను త్రుంచెదను జుమీ యని సూచింప తృణము త్రుంచివైచెను.

పతివ్రతల కోపదృష్టి కోపింపఁ జేసినవారిని దహించును. దమయంతి యెఱుక వానిని దహించెను. గాంధారి చూపు ధర్మరాజు పదనఖంబులపైఁ బడ నవి కమలెను. (భార. స్త్రీ. ౧-౧౨౬)

అట్టులే వీఁడును దన దృష్టిపడెనా భస్మ భగును. అట్లు వానిని మాత్రము భస్మము చేయుట యామెకు సమ్మతము గాదు. వీఁడు పరస్త్రీహరణము తన కుల ధర్మమని చెప్పెను. అట్టి కులమునే నిర్మూలింపవలెను. గాని యొకని నిర్దహించిన లాభ మేమి? అని తలఁచి వాఁడు దగ్ధుఁడు కాకుండుటకై తృణము వైచెను.

౧౪. నీవు నాకుఁ గోపము వచ్చునట్లు చేసితివేని నా కోపాగ్నికి నీ వీ తృణ ప్రాయముసుమా. కావున నాకుఁ గోపమువచ్చునట్లు చేయకుము.

శుచిస్మితాస్య-ఇది నవ్వవలసిన సమయముకాదే ఏల నవ్వెను?

౧. లెక్కఁ స్త్రీలు నవ్వుచున్నప్పు డుండు ముఖకాంతి యామె దుఃఖించు చున్న నుండును. అది స్వభావసిద్ధము. ఇప్పుడే యిట్లుండునది, సంతోషమున నుండు నపు డెట్లుండునో.

౨. పాము తన్ను మ్రింగుచుండఁ దాను గండుచీమను మ్రింగబోవు కప్ప వలెఁ దన్ను మృత్యుదేవత వాత వేసికొనుచుండుట యెఱుఁగలేక నన్నాశించు చున్నాఁడే, వీఁడెంత మూఢుఁడని నవ్వెను. 'పట్టరాని దుఃఖమువచ్చిన ఫక్కుమని నవ్వు'మని సామెత.

౩. క. గజ మంటినట్ల యడుచున్
భుజగము మూరొక్కనినయట్ల • పొరిగొను ధరణీ
భుజుఁడు నగినట్ల చంపున్
గుజనుఁడు మన్నించునట్ల • గొను బ్రాణంబుల్ ॥పంచ॥

అని యుండుటచే రాజప్రస్త్రీ రాజనీతి యెఱిఁగినది కావున నట్లునవ్వెను.

౪. రాముఁడు బలపరాక్రమంబుల నా యీడుగాఁ డనియెదవే, ఆయన యాశ్రమమున లేనపుడు గదా నన్నుఁ దెచ్చితివి. అట్టి పిఱికి పందవు చాటున నాఁడు వారి ముందర డంభములు పెలికెదవే యని నవ్వెను.

౫. ఈ నవ్వు సామాన్యమైన నవ్వుగాదు. శుచిస్మిత=అగ్నిహోత్రమువంటి నవ్వు, అదియే వానిని నాశము చేయఁగలదు; శుచి=అగ్ని.

క. నాపయిఁ జిత్తముఁ జేర్పకు, నీపడఁతులయందు మనము ♦ నిలుపుము నను నీ
వీ పగిది వేఁడ ఫలమా, పాపాత్ములు ముక్తిఁ గోరు♦పగిదిని ఖలుఁడా! ౫౪౨

తా త్ప ర్య ము

అందని సందునకై యత్నులు సాఁచినట్లు నాపై నీవు మనస్సుంప వలదు. పాపాత్మునకు ముక్తి లభింపనట్లు నేను నీకు లభించు దానఁగాను. నీ వెంత వేఁడినను ప్రయోజనము లేదు. అటైన నన్నేమి చేయు మనెదవా? నామీఁద నుంచిన మనస్సును మరల వెనుకకుఁ దీసికొని నీ భార్యల యందు నుంపుము. నా మీఁద మనస్సుంచిన నీ కెట్టి కీడుకలుగునో నీ భార్యలమీఁద నీవు మనస్సుంపవేనియంత కీడు గలదు. "పరిభూతవివర్ణా చే ద్భార్యా భర్తా వినశ్యతి" నిష్కారణముగ భార్య నవమానించుటచే నామె దుఃఖంచెనేని భర్త నశించును, అని కలదు గదా. కావున నీవు వారిని నుపేక్షింపకుము, నన్నపేక్షింపకుము.

ఉ. పుట్టితిఁ బుణ్యవంశమునఁ ♦ బూజ్యతరాన్వయ మేను మెట్టితిం
బట్టితి నేకపత్నినియ♦మంబును నిట్లు రహించి పాపమున్
గట్టుకొనంగ నేర్తు నె య♦కార్య మొకండు ఘటించి? యేల యీ
వట్టివి విప్రలాపములు ♦ వాఁగెదు మూర్ఖుఁడ వౌచు రాక్షసా? ౫౪౩

అర్థములు. మెట్టితిన్ = ప్రవేశించితి, ఏకపత్ని నియమంబు = పాతివ్రత్య వ్రతము, విప్రలాపములు=విరోధపు మాటలు, వాఁగెదు=వదరెదవు.

తా త్ప ర్య ము

ఓరి రాక్షసుఁడా! నేను పుణ్యాత్ముని వంశమునఁ బుట్టితిని. అంతకంటెఁ బూజ్యులైన వారియింటఁ బ్రవేశించితిని. పతివ్రతానియమమును గ్రహించితిని. ఇట్టి నేను చేయరాని చెడు కార్యము చేయఁగలనా? చేసితి నేని నేను జెడుటయే కాక యీ రెండు వంశముల వారిని నరకములపాలు సేయనా? ఇదంతయుఁ నాలోచింపక యేల శాస్త్రవిరుద్ధము, లోకవిరుద్ధము, ఆత్మ విరుద్ధము నగు మాటలూరక వదరెదవు.

చ. అని పెడవాటుగా మఱలి ♦ యా జనకాత్మజ వెండిపల్కె నో
దనుజుఁడ! నేను సాధ్విఁ, బర♦దారను, నీ సతిఁ గాను, నీ మదిం
గను మిఁక సాధుధర్మము ప్ర♦కారము, సాధులమార్గ మూనుమీ,
పనిగొని తేరతేర కిటు ♦ పాపము నీ వొడిగట్ట నేటికిన్? ౫౪౪

అర్థములు. పెడవాటుగా=వెనుక ప్రక్కగా, రావణునకు వీఁపు కనఁబడునట్లు.

తాత్పర్యము

అని చెప్పి యీ పాపాత్మున కెదురు ముఖమై యుండుటయు దోషమేయని తలఁచి వానిని లక్ష్యము సేయక వెనుకవైపుగాఁ దిరిగి వానికి బుద్ధివచ్చి బాగు పడును గాక యని మఱియు నిట్లనియె. ఓరి రాక్షసుఁడా! నేను బతివ్రతను, ఇతరుని భార్యను, నీ భార్యనుగాను. కావునఁ బరస్త్రీలయందుఁ బరపురుషు లెట్లుండవలెనో యీ సాధు మార్గము తెలిసికో, తెలిసికొనుటయేకాదు. ఆప్రకారము సాధుమార్గమున నడువుము. బుద్ధిపూర్వకము నేల యిట్లు నిష్కారణముగఁ బాపము సంపాదించుకొనెదవు.

క. నీ కెట్టులో నీ భార్యలు, లోకంబునవారి భార్య ♦ లును రక్ష్య లటుల్
రాకాసి తేఁడ! నిన్నే, చేకొని యుపమగను ప్రీతిఁ ♦ జెలఁగు న్నపతులన్.

తాత్పర్యము

ఓరీ! స్త్రీలనుఁ బాతివ్రత్యము నియతము, ఆవ్రతమును బురుషులు కాపాడ వలయును. నీ భార్యల పాతివ్రత్యమును నీ వెట్లు రక్షింతువో యితరుల భార్యల పాతివ్రత్యమును నట్లే నీవు రక్షింపవలయును. పాతివ్రత్య నియమము మంచిదా, చెడ్డదాయని యాలోచింపుము అది మంచిది కావున నది యెందున్నను రక్షింపఁ బడవలసినదే. పాతివ్రత్యమే యక్కఱ లేదందువా నీ భార్యలు ఱంకాడిన నేమి దోషము? ఇతరుల భార్యలను నీ వాశించితివేని నీ భార్యల వ్యభిచారమునకు నీ వనుజ్ఞ యిచ్చినవాఁడవేకదా. కావున నిన్నే యుపమానముగఁ దీసికొని నే నితరుల భార్యల నాశించినచో నా భార్య లితరుల నాశించిన దోష మేమి యను కొని నన్ను నాశింపకుము.

ఉ. సంచలితేంద్రియుం డగుచుఁ ♦ జంచలుఁడై తనభార్యయందఁ బ్రే
మించి రమించి తుష్టిఁ గొన ♦ మేకొన నోపనిజాల్ము ప్రజ్ఞయున్
సంచితలక్ష్మి యాయఘము ♦ సంతతియున్ మఱి వాని యాయువున్
ద్రుంచుట సత్య మన్యవన♦తోయజపత్రవిశాలలోచనల్. ౫౭౬

అర్థములు. సంచలితేంద్రియుండు=బాహ్యేంద్రియ నిగ్రహము లేనివాఁడై, చంచలుఁడు=మనోనిగ్రహము లేనివాఁడై, మేకొనన్=అంగీకరింప, జాల్మని= మూఢుని, ప్రజ్ఞయున్=బుద్ధియు, సంచితలక్ష్మి=వాఁడెన్ని జన్మముల నుండియో సంపాదించిన పుణ్యము, ఐశ్వర్యము; అన్య.....లోచనల్=పరస్త్రీలు.

తాత్పర్యము

బాహ్యేంద్రియ నిగ్రహము లేక, మనోనిగ్రహము లేక తన భార్యతో మాత్రము క్రీడించి తృప్తిపడలేని మూఢుని బుద్ధి, పూర్వపుణ్యము, ఐశ్వర్యము, వానిసంతానము, వాని యాయుస్సు వీని నన్నిటిని పరస్త్రీలు సత్యముగ నాశము చేయుదురు

కావున జారత్వ మెంత కీడో తెలిసికొని బుద్ధిగలవాఁడవై ప్రవర్తింపుము.

శా. లేరా పెద్దలు నీకు బుద్ధిఁ దెలుపన్? • లేకుందురా యీ పురిన్
వారిన్ డాయవొ ధర్మమార్గములు నేర్వన్? నీ దురాచారముల్
దూరీభూతసుపుణ్యవత్క్రియలు సాధువ్రాతదూరస్థుఁగా
నోరీ! తెల్పెడిఁ, గాక యున్న విపరీతోక్తుల్ నను బల్కఁ-దే? ౫౭౭

అర్థములు. దూరీభూత=దూరముగాఁ జేయఁబడిన, సుపుణ్యవత్ క్రియలు= మంచి పుణ్యము నిచ్చు కార్యములు, సాధువ్రాత దూరస్థుఁగాన్ = సజ్జనులకు దూరమందుండు వానిఁగా, విపరీతోక్తుల్=విరుద్ధపు మాటలు.

తాత్పర్యము

నీవు చేయరానిపని చేయఁ బూనినపుడు నీ మేలు కోరి నీ కిది తగదు, హాని కరము అని చెప్పెడు వా రింత పెద్ద పట్టణమం దొకరైన లేరా? విభీషణాదుల వంటివారు లేకుందురా? ఉన్నారు. ఉండిన నేమి లాభము? ఏది ధర్మ, మేది యధర్మమని తెలిసికొనుటకు నీవు వారి యొద్దకు పోవుచున్నావా? వారిని నీవు చెప్పనిచ్చుచున్నావా? లేదు. "తద్విద్ధి ప్రణిపాతేన, పరిప్రశ్నేన సేవయా, ఉప దేక్ష్యంతి తే జ్ఞానం, జ్ఞానిన స్తత్త్వదర్శిన" యన్నట్లు నీవు పోయి నమస్కరించి ప్రశ్నించినఁగదా ధర్మతత్త్వ మెఱిఁగిన పెద్దలు నీకు జ్ఞానముపదేశింతురు. నీవట్లు డిగిన వాఁడవు కావు. ఏలన నీ దుష్ట ప్రవర్తనము, పుణ్యములు గాని కార్య ములు చేయుట చూడఁగా సాధువులకు నీవుఁ జాల దూర మని తెలియుచున్నది. అటుగాకున్న నీ విట్లు విపరీతపు మాటలు మాటలాడనే యాడవు.

క. కాలంబు దీఱె రాక్షస, జాలంబుల కీవు వినవొ • సాధుల బోధల్?
బాలిశ! మిథ్యాస్నేహవి, లోలున్ నిను నమ్మి వారు•లోఁగరె చెట్టన్? ౫౭౮

తాత్పర్యము

నీవై యడుగ కున్నను, నీమేలు కోరువారు నీకు హిత ముపదేశించి యుందురు. కాని వారి మాటలు నీవువిన్న వాఁడవుకావు. ఏలరాక్షసులందఱు నీవలనఁ జావవలసిన కాలము వచ్చినది. కావున నింతవఱకు నీవు గొప్పవాఁడ వని నీ యాశ్రయమున మేలుపొందెద మని తలఁచి రాక్షసు లందఱు నీయందు స్నేహ భావము గలవారై యున్నారు. వారు నీమేలుకోరునట్లు వారిమేలు నీవు కోరు వాఁడవు కావు. నీస్నేహమసత్యము. నీవు చెడుటయే కాక వారందఱు చెడునట్టి పనిని జేయుచున్నావు

మిథ్యాస్నేహమనఁగా స్నేహమభావ మని యర్థము కాదు. వారియందు నీకుఁ గల స్నేహభావ మే ఫల మియ్యవలయునో యా ఫల మిచ్చుటలేదు. స్నేహమువలని ఫల ముపకారము. అది నీ వలనఁ గలుగుటకు మాఱు అప కారము గలుగ నున్నది. కావున నీ స్నేహము మిథ్యాస్నేహము.

చ. అనయరతాత్ముఁ డౌచు నకృ • తాత్మకుఁ డైన నృపాలపాశుప
ట్టనములు రాష్ట్రముల్ సిరి య • డంగును, దద్గతి రత్నపూర్ణయై
గొనబగు లంక యింకిటను • గూలెడు నిక్కము శీఘ్రకాలమం
దున యసురేంద్ర! నీ యొకని • దోషమునం బలుమాట లేటికిన్. ౧౪౯

అర్థములు. అనయరతాత్ముఁడు=చెడునడవడియందు నాసక్తిగల మనస్సు గలవాఁడు, అకృతాత్మకుఁడు=పెద్దలచే శిక్షింపఁ బడని స్వభావము, మనస్సు గల వాఁడు, నృపాలపాశు=నీచరాజుయొక్క, తద్గతిన్=ఆ విధముగా.

### తాత్పర్యము

ఓరీ! పుణ్యాత్ములచేఁ జక్కదిద్దఁ బడని మనస్సు, స్వభావముగలవాఁ డగుటచే చెడు నడవడియందుఁ బ్రీతిగల నీచరాజు కారణముగ వాని పట్టణములు, రాజ్యములు, సంపద నాశము లగును. ఆ విధముగనే నీ వొకఁడు చేయు పాపము వలన రత్నములతో నిండి యందమైన లంక యంతయు శీఘ్రకాలమందే నిజముగ నాశము కాఁగలదు. ఎట్లనెదవా! ఓడ నడుపువాఁడు మత్తుఁడై యోడను సుడిగుండములోనికి దించినవాఁడు చెడుటయే కాక వానిని నమ్మి యోడలోఁగూర్చుండిన వారందఱు చెడుదురు గదా.

ఉ. దూరపుఁజూపు లేక యెటు • దోచిన నెయ్యది యైనఁ జేయుచున్
క్రూరపుఁ బాపకార్యముల • కున్ మన సిచ్చి చరించు నా యప
స్మారి స్వకీయకృత్యములఁ • జావఁగ లోకము లెల్ల సంతసం
బారఁగఁ బంధుగుల్ సలుపు • హాయిగఁ గన్ను మొగుడ్చు రాత్రులన్. ౧౫౦

అర్థములు. అపస్మారి=ఉన్మత్తుఁడు, స్వకీయకృత్యములన్=తాను జేసిన కార్యములచే, దూరపుఁజూపు=దూరాలోచనము.

### తాత్పర్యము

దూరాలోచనము లేక యేవేళ కేది తోఁచునో దానిని ధర్మాధర్మవిచారము లేక యే పాపకార్యమునందైన మనస్సు పోనిచ్చు నున్మత్తుఁడు వాడు చేసిన పాపకార్యములచే వాఁడు చావఁగా లోకు లందఱు సంతోషముతోఁ బంధుగులు చేసికొని నిర్భయముగ, సుఖముగ రాత్రులందుఁ గన్నార నిద్రపోదురు.

ఉ. నిక్కపు వంచకుండ వగు • ని న్నొక నెచ్చెలి వంచు నమ్మి వే
దిక్కఱి పోవువారు నినుఁ • దిట్టుదు రీ చెడుకూళ చిక్కె నీ
చిక్కుల దైవ తంత్రమునఁ • జేడ్పడుఁ గాక యటంచు సంతసం
బెక్కఁగ, నేలరా చెడద • వీ గతి నిందును నందు నిందలన్? ౧౫౧

### తాత్పర్యము

స్నేహితునివలె నటించుచుఁ దుదకుఁ గీడు గలిగించు నిజమైన మోసగాఁడ వగు నిన్ను నీ చిత్తవృత్తి తెలియనివారు, నిన్నుఁ దమకు మంచిస్నేహితుఁడవని నమ్మి దిక్కుమాలిపోవువారు, నీవు కష్టదశలోఁ జిక్కుకొనినపుడు ఈ దుష్టుఁడు దైవవశే

మునఁ జిక్కులపాలైనాఁడు, దీనితో వీఁడు నాశమైపోవునుగాక యని సంతోషముతో నిన్నుఁ దిట్టుదురు. ఓరి! యేలరా నిందల పాలయి రెండులోకము లందును జెడెదవు.

ఎవని కీర్తి యెంతవఱకు లోకంబున నుండునో యంతవఱకు వాఁడు స్వర్గమున నుండును. ఎవని యపకీర్తి యెంతవఱకుండునో యంతవఱకు వాఁడు నరకమున నుండును.

క. రవి కెట్టులెండ శ్రీరా, ఘవునకు నే నట్లటన్న ◆ గనకంబుల నై
భవముల నాశలు గొలిపెద, నవివేకీ! మోసపుచ్చ◆నలవియె నీకున్. ౧౫౨

తాత్పర్యము

రావణా! నీవెంత మూర్ఖుఁడవురా, రామచంద్రమూర్తి నుండి నన్ను వేఱు దీయ నాలోచించెదవే, నీ చేతనైన నగునా? సూర్యునకు నెండ యెట్టిదో, యెట్టు లనన్యమో నేను శ్రీరామచంద్రునకనన్యను. సూర్యునినుండి యెండను నీవు వేఱు పఱుపఁ గలిగెదవేని రామచంద్రమూర్తినుండి నన్ను వేఱుపఱుపఁగలవు. బంగారు, సంపద, భోగములను జూపి నన్ను మోసగింపఁ జూచెదవే, నీ వెంత యవివేకివిరా! మా యిరువురకు ననన్యత్వమేకాదు, ఎండ సూర్యుని కాంతియై సూర్యునిపై నాధారపడి యున్నను ఆ ప్రకాశమువలననే సూర్యుని యునికి తెలియవచ్చుట, సూర్యునకుఁ బూజ్యత గలుగుట. అట్టులే నేను రామచంద్రమూర్తి దాననై ఆయన మీఁద నాధారపడి పరతంత్రనై యున్నను ఆయన లోకమున కెక్కువ యుపయోగపడునట్లు చేయుదానను నేనే. ఆయన మహిమాతిశయము లోకమెఱుంగుట నావలననే. నేను లేనేని యాయన యునికియే లేనివాఁడని చెప్పవలసి యుండును.

ఈ విషయము నీకు మారీచుఁడు 'జనకాత్మజ సంబంధంబున రాముండప్రమేయ పుణ్యతేజుం డయ్యె'నని చెప్పెనుగదా! అవివేకి వగుట నీ వా యర్థము గ్రహింపఁజాలవైతివి. యాచకులు లేరేని దాతలు లేరు. రోగులు లేరేని వైద్యులు లేరు. ప్రజలు లేరేని ప్రభువు లేఁడు. అట్టులే ప్రపంచము లేదేని భగవంతుఁడు లేఁడు; ప్రకృతిమూలమునగాక భగవంతుని దెలిసికొను మార్గమే లేదు. భగవంతుని శక్తియే లక్ష్మి. ఆమెయే మాయ. ఆమెయే ప్రకృతి. ఆమె చిద్విలాసమే ప్రపంచము. కావునఁ బ్రపంచము వేఱు, భగవంతుఁడు వేఱుకాఁడు. లక్ష్మి యనుగ్రహముచేఁ బ్రపంచమును దాఁటఁగలము. భగవదనుగ్రహమునకుఁ బాత్రులును గాఁగలము. కాని బలాత్కారముచేతను మన ధనవిద్యాబలముల చేతను ఆమెను వశపఱచుకొనలేము. ఆమెను వశపఱచుకొనుటకుఁ ద్రిజట చెప్పినట్లు నమస్కారమే సాధనము.

లక్ష్మీదేవి నారాయణునకు నిత్యానపాయిని యనుటకు,

"ఏవం యదా జగత్స్వామీ, దేవదేవో జనార్దనః
అవతారం కరో త్యేవ, తదా శ్రీ స్తత్సహాయినీ

రాఘవత్వే భవే త్సీతా, రుక్మిణీ కృష్ణజన్మని
అన్యేషు చావతారేషు, విష్ణో రేషానపాయినీ
దేవత్వే దేవదేహేయం, మనుష్యత్వే చ మానుషీ
విష్ణో ర్దేహానురూపాం వై. కరోత్యేషాత్మన స్తనుం.

ఎప్పుడు జగత్స్వామి జనార్దనుఁ డవతారమెత్తునో యప్పు డెల్ల శ్రీదేవి యాయనకు సహాయురాలై యుండును. రామావతారమున సీతాదేవిగను, కృష్ణావతారమున రుక్మిణిగను, ఇతరావతారములందు నిట్లే విష్ణువును విడిచి యుండదు' ఆయన దేవతలం దవతరించెనా తాను దేవత్వమును, మనుష్యులం దవతరించిన మనుష్య స్త్రీగను నగును. విష్ణుదేహమున కనురూపమైన దేహమును దాను ధరించును. అనన్యయనఁగా రాయినీళ్ళవలె, చీకటి వెలుతురువలె నన్యముగాక సూర్యుడు—ఎండ; చంద్రుఁడు—వెన్నెల, రత్నము, కాంతివలె, సముద్రము—అల, శక్తి—శక్తుఁడు – ఇవి చూచుటకు వేఱుగాఁ దోఁచినను వేఱు గానివి. గుణము-గుణి, విశేషణము-విశేష్యము వీనివలె నవినాభావ సంబంధము గలది యనన్యము. ఇట్టిదే జీవాత్మ పరమాత్మల కనన్యత్వ మెఱుఁగునది. జీవాత్మ విశేషణము (ఎండ) పరమాత్మ విశేష్యము (సూర్యుఁడు) "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అన్నట్లు పరమాత్మ యంశమే జీవాత్మ. కావున విశేషణ విశేష్య సంబంధము; పరమాత్మకంటె నే నన్యముగాను, అని జీవాత్మ యనుకొనుటయే యనన్యత్వ బోధ మని శంకరమతము గాని జీవాత్మయే పరమాత్మయని తలఁచుట కాదు. అపృథక్సిద్ధము. "ప్రకాశాదివత్తు నైవం పరః" –బ్ర.సూ. 3. 2. 28. ఈ యర్థమునే బోధించుచున్నది. అనఁగా కాంత్యాదికమువలెనే జీవుఁడు బ్రహ్మాంశము. ప్రకాశాదు లగ్న్యాదులయంశమగునట్లు జీవుఁడును పరమాత్మ యంశము. ఈ యర్థమునే రామచంద్రమూర్తియు ముందు చెప్పఁగలఁడు. కావున ముముక్షువగు బద్ధజీవుఁడు సీతాదేవి, రామచంద్రమూర్తిపట్ల నెట్టి యభిప్రాయము గలదై, యెట్లు ప్రవర్తించి, లంకనుండి ముక్తురాలయ్యెనో యట్లే పరమాత్మ విషయమున వర్తించి ముక్తుఁడు కావలయును. సీతాదేవి నేనే రాముఁడని చెప్పలేదనుటను గమనింపవలెను. అట్లులే రాముఁడు తానే సీతయని చెప్పలేదు.

తే. ఆ జగన్నాథు సత్కృతం ♦ బైన భుజము, దిండుగా సుఖమందెడి ♦ దేవి నయ్యు
నసురుఁడా! పేరులేని పెద్దమ్మ నొకనిఁ, గరముచే నంటుదునె నాదు ♦ కాంతుఁ గాసి.

అర్థములు. ఆ=ఆ విధముగఁ బ్రసిద్ధికెక్కిన, జగల్ +నాథు=బ్రహ్మ మొదలు స్తంబపర్యంతము చేతనాచేతనముల కన్నిటికిని, నాథుఁడు=రక్షకుఁడు అధిపతి యగు వానిమొక్క. సత్కృతంబు=పూజింపఁబడినది, దేవిని=ప్రియురాల నగు రాణినై యాయనతోడ సమానమైన లోకపూజ్యత గల రాణిని నయ్యు, పేరులేని పెద్దమ్మ=ఇది లోకోక్తి, కీర్తిప్రతిష్ఠలు లేనివానిని, ఒకనిన్=కళ్ళత్తు గానిని, ఆయనకు దాసుఁడుగా నుండనైన యోగ్యత లేని వానిని.

## తాత్పర్యము

సర్వలోక ప్రసిద్ధుఁడై, చరాచరకోటికి బ్రహ్మ మొదలు స్తంబపర్యంతమున కంతకు నాథుఁడైన నా కాంతునియొక్క పూజ్యమైన భుజమును తలదిండుగాఁ జేసికొని పండుకొను నతని దేవినైన నేను పేరు ప్రతిష్ఠలేని యనామకుని నొకనిఁ జేతితోనైనఁ దాఁకుదునా?

ఉ. సాంగము వేదముం జదివి ♦ సత్యము, శీలముఁ గల్గి సాధుస
 త్సంగతిఁ దేఁటి జ్ఞాని యగు ♦ క్ష్మావిబుధేశున కాత్మవిద్య నా
 నంగుగ రామభద్రునకు♦జ్యాపతి కిం తగు భార్య నేను నీ
 యంగముఁ గాల నేనియును ♦ నంటుదునా యిది యేడ భ్రాంతిరా! ౫౫౮

అర్థములు. సాంగము=అంగములతోఁ గూడినది, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము, ఈ యాఱును వేదాంగములు. సాధుసత్సంగతి=సాధువు లగు సత్పురుషుల సాంగత్యము, జ్ఞాని=జీవాత్మ పరమాత్మల సంబంధము తెలిసినవాఁడు, క్ష్మావిబుధేశునకు=బ్రాహ్మణ శ్రేష్ఠునకు, ఆత్మవిద్య=యోగవిద్య, అంగుగన్=అన్ని విధముల చక్కఁగ, జ్యాపతికిన్=భూపతికిన్, తగు=యోగ్యురాలనైన, 'హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ' యని శ్రుతి చెప్పినట్లు భూదేవియు, లక్ష్మీదేవియు భగవంతుని భార్యలు, అంగము=దేహము, అంగము గాల యనుటయందు తిట్టుకూడ స్ఫురించెడిని.

సాంగము వేదముం జదివి=ఆఅంగములతోడ వేదముఁ జదువఁగానే లాభము లేదు, గాడిద గంధపొడిమూట మోసినట్లే. సత్యము, శీలము గలవాఁడై యుండవలెను. నీవు వేదములు చదివితివి, ఏమి లాభము? సత్యశీలములు లేవు. ఇచ్చట నీశ్లోకము స్మరింప నగు. హనుమంతుఁడు మరల రామచంద్రమూర్తి యొద్దకుఁ బోయినపుడు ఆయన రాక్షసుల బలాబలములు, ఆచార వ్యవహారములు ప్రశ్నింపఁగా,

'అగ్నిహోత్రాశ్చ వేదాశ్చ రాక్షసానాం గృహే గృహే' యనెను. ఇది వినఁగానే అగ్నిహోత్రములు, వేదములు గలవారిని జయింప సాధ్యముగాదే, అట్టివారిని నే నెట్లు చంపఁగలను? అని యాయన ముఖము తెల్లఁబోయెను. అది తెలిసికొని హనుమంతుఁడు 'దయా సత్యంచ శౌచంచ రాక్షసానాం నవిద్యతే,' దయ, సత్యము, శౌచము అనునవి యొట్టివో వారెఱుఁగరు అనెను. అప్పుడు రామునకు ధైర్యము వచ్చెను.

అంతమాత్రమే కాదు. సాధుసాంగత్య ముండవలెను. అది లేదేని తక్కిన వన్నియు ఫలవంతములు గావు.

"సంత స్సంగస్య భేషజమ్" "నాసద్భిః కించి దాచరేత్" "సంసర్గజా దోషగుణా భవంతి" "త్రిజగతి సజ్జన సంగతి రేకా భవతి భవార్ణవతరణే నౌకా" "సత్సంగత్వే నిస్సంగత్వమ్" "సత్సంగాద్భవ నిస్పృహో" "త్యజదుర్జన సంసర్గం

భజ సాధు సమాగమమ్" "కురు పుణ్య మహోరాత్రం స్మర నిత్యత్వ మనిత్యతామ్" "మందోప్యమందతా మేతి సంసర్గేణ విపశ్చితః" "దర్శనా దేవసాధవః" ఈ ప్రకారము సాధుసాంగత్య ముండవలెను దుర్జన సాంగత్యము మానవలెను. నీకు సాధుసాంగత్యము లేదు. దుష్టసాంగత్యము మెండుగాఁ గలదు. నీవు జ్ఞానివి కావు. త్వష్టవిభుడవు కావు. నీ కాత్మవిద్యయు లేదు.

## తాత్పర్యము

షడంగములతో వేదముఁ జదివి, సత్యము, సదాచారము గలిగి, సాధువుల సాంగత్యము జేసి, జీవాత్మ పరమాత్మ సంబంధము తెలిసిన బ్రాహ్మణోత్తమునకు నాత్మసాధనభూత మైన యోగవిద్యవలె నీ యన్నిగుణములు గల రామభద్రునకు, భూపతికిఁ దగినభార్యను నేను. కావున వీనిలో నొక గుణమైన లేని నిన్ను జేతితోఁ దాఁకు టటుండనీ, కాలితోనైనఁ దాఁకుదునా? ఇది యేమి భ్రాంతిరా, నన్నాశించెదవు? నీ యోగ్యత యెంతమాత్రమో తెలిసికొను తెలివికూడ నీకు లేదాయెఁగదా.

రామచంద్రమూర్తి త్వష్టవిబుధేశుఁ డెట్లయ్యె నని సందేహింపఁ బనిలేదు. త్వష్ట+విబుధ+ఈశుఁడు=భూదేవికి, దేవతలకు నీశుఁ డని భేదము.

రావణుఁడు శుద్ధబ్రాహ్మణుఁడు కాఁడు. శుద్ధక్షత్రియుఁడు కాఁడు. అనులోమ సంకరజాతి. అది ముందు విచారింపఁబడును.

క. కాననతలమునఁ జిక్కిన, ధేనుకతోఁ గరిసి గూర్చు • తెరువున దుఃఖా
 ధీన నయి వగచు నాతో, నా నాథునిఁ దెచ్చి కూర్చు • నయమతి వగుచున్.

అర్థములు. ధేనుక=ఆఁడేనుఁగు. తాత్పర్యము

ఎంతో యాశపడి మోచి తెచ్చితినే. నీ విట్లనెదవే. ఇప్పుడు నన్నేమిచేయుమనెదవనెదవా? నీకుఁ గర్తవ్యము చెప్పెద వినుము. అడవిలో నొంటిగాఁ జిక్కి దుఃఖించు నాఁడేనుఁగు నొద్దకు మగయేనుఁగును దెచ్చి విడిచినట్లు నాభర్తను బాసి వగచుచున్న నాయొద్దకు నిప్పుడైన నీతిపరుఁడవై నా భర్తను దెచ్చి విడుము. తన్నుఁ దీసికొని పోయి రాముని యొద్ద విడువు మని చెప్పలేదు. అట్లు చెప్పిన నా నెపమున మఱలఁ దాఁకును. కావున రాముని నే యిటకుఁ దెమ్మనెను. అయినను నీవు నయమతి వనిపించి కొందువు. ఇప్పుడు వచ్చిన దుర్నీతిపరుఁ డను పేరు పోవును.

ఉ. ఇంకను గొన్నినాళ్లు పుర • మేలఁ దలంచెద వేని, దండభృ
 త్కింకర ఘోరపాశములఁ • గీడ్వడ నొల్లన యేని, రావణా!
 కొంకకు రామతోఁ జెలిమిఁ • గోరుమ, యప్పురుషోత్తముండు ధ
 ర్మాంకుఁడు నిన్ను నేలు శర•ణాగతవత్సలుఁ డౌట నర్మిలిన్. ౧౧౬

అర్థములు. దండభృత్=దండధరుఁడైన యమునియొక్క, కింకర=భటులయొక్క, ఘోరపాశములన్=భయంకరములైన పాశములచే, కీడ్వడన్=

బాధనొంద, ధర్మాంకుఁడు = శరణాగతి రక్షణమే లక్షణముగాఁ గలవాఁడు, శరణాగతవత్సలుఁడు=శరణని వచ్చినవారియందుఁ బ్రేమగలవాఁడు, అర్మిలిన్= కూర్మిచే, ఇంకను=ఇదివఱకు నీవు సుఖముగా రాజ్యము చేసినట్లు లేకమీఁదఁ గూడ, కొన్నినాళ్ళు=అల్పకాలమైనను, నన్ను రామున కర్పింపకపోయితివా నేఁడు మొదలు నీకు క్షయకాలమే. ఒక్కొక్కనాఁ డాలస్యము చేయుకొలఁది నీకు మృత్యువు సమీపించుచున్న దని తెలిసికొనుము, పుర మేలన్=కష్టపడి సంపాదించినది, సమస్త భాగ్యభోగ్య పదార్థములతో నిండినది, నాది యని నీ వభిమానము వహించినది యగు పట్టనము. పురమనఁగా దేహము. కావున నీ దేహము నింకను గొన్నినాళ్లు రక్షింపఁ దలఁచెదవేని.

ఏలఁ దలంచెదవేని=నాశము చేయుటకు నిష్టము లేదేని—బాగుగఁ బాలింపఁ గోరిక కలదేని, ఈ విధముగ నీవు జీవించి యీ లోకమున సుఖపడఁ గోరినను, లేక, దండ...నొల్లవ యేని=చచ్చి, యమకింకరుల చేతిలో నరకబాధ పడ నిష్టము లేకున్నను, రావణా! వదరుపోతా! నేను చెప్పఁబోవునట్లు నీవు చేయక పోయితివా, రామచంద్రమూర్తి నిన్నుఁ జంపుట నిజము. అప్పుడు నీకీ రాజ్య సుఖము లోనగు నీలోక సుఖములు లేవు. పరలోకమున నీ పాపానుభవమునకై నరకబాధయుఁ దప్పదు రెండులోకములఁ జెడుదువు. పరలోకమున నీవు సుఖపడఁ గోరినను రామునకు నీ వనుకూలుఁడవై యుండవలసిన వాఁడవే. ఆయనయందుఁ బ్రతికూలభావము గలవారికి బరలోకసుఖము లేదు. అనుకూల భావము గలవారికి నరకదుఃఖము లేదు. అయిన నేమి చేయు మనెదవా? కొంకకు=జంకుపడకుము. నీ పురమందు నీ కెవరు మేలు చెప్పువారు లేరు. వారు చెప్పినను నీవు వినవు. కనుక నీయందు జాలి గలిగి నీవు చెడిపోవుట సమ్మతింపక నేనే చెప్పుచున్నాను. "స్త్రీ బుద్ధిః ప్రళయంకరీ" యని యెవఁడుది చెప్పినట్లు విని నేమి యుపాయము వచ్చునో యని సందేహింపకుము.

రాముతోఁ జెలిమి కోరుము=రామచంద్రమూర్తితో స్నేహము చేయఁ దలఁపుము రాముతో=నీ వంటి క్రూరగుణము వికారాకారము గలవానితోఁ గాదు. ఆకారమున గుణమున నభిరాముఁ డగు వానితో-రాముతో=మఱి యెవ్వరితోనో కాదు.నా భర్త యగు రాముతో- నే నెట్లు నీ మేలుగోరి చెప్పుచున్నానో యట్లే నీమేలుకోరి రక్షింపఁగలవానితో, వచ్చినవాఁడు రావణుఁడైనను రక్షించెద నని ముందు చెప్పఁగలఁడుగదా, అట్టివానితోఁ జెలిమిఁ గోరుము. స్నేహము కోరుము, అనుకూలుఁడవు కమ్ము. ప్రతికూలబుద్ధిని కాకుము, కోరుము = అనుకూలుఁడనై వర్తించెద నని నీ మనస్సులో ననుకొనుము, చాలును. అంత కెక్కువ నీవు చేయవలసినది యేమియు లేదు. అట్టి యభిప్రాయము నీకుఁ బుట్టినను నిన్నాయన రక్షించును. ఓసీ నీవు నన్నుఁ జంపజూచుచున్నావు. ఆయన విషయములో నిటువంటి ఘోరాపరాధము జేసిన నేను ఆయన యెదుటఁ బడిన వెంటనే చంపునుగాని, విడుచునా? ఇదియా నీవు బోధించు హితము-అందువేమో. ఓరీ! నీవంటివాఁడు

వాఁడు. నీవు వధకర్హుఁడవైనను, ఘోరయుద్ధమందు నింకొక బాణము వేసిన చచ్చుస్థితిలో నీ వున్నను చేత నాయుధములేక యుంటివేని నిన్నాయన చంపఁడు. శత్రువు లందును ఆయన వాత్సల్యము గలవాఁడు. ఇది నీ వనుభవముచేఁ దెలిసి కొనఁగలవు. ఆయన పురుషోత్తముఁడు గనుక నాయనయం దిట్టి గొప్పగుణము గలదు. పురుషులకంటె నుత్తముఁడుగదా పురుషోత్తముఁడు. కావునఁ బురుషుల యందుఁ గల ప్రాకృతాది గుణము లాయనయందు లేవు. కేవల శుద్ధసాత్త్విక గుణములు గలవాఁడు. కావున ననుకూల భావము గల నిన్ను నీ దోషములెంచక రక్షించును. సజ్జనులు దోషము లెంచరు అని బహిరంగముగాఁ జెప్పఁగలఁడు. అట్లులే ప్రవర్తించును. 'అజ్ఞుండు చేసినయపరాధములను జేపట్టఁ డీశ్వరుఁడు కృపాళుఁ డగుట' నని కలదుకదా. ఇంకను ఆయన విషయమై యాయన నడవడి యెఱిఁగినవా రేమి చెప్పిరో వినుము. అవిజ్ఞాతా=పరుల దోషము లెఱుఁగని వాఁడు. "అపరాధశతము సల్పిన విపరీతము నెంచఁడాత్మ విజ్ఞుం డగుటన్" అప రాధానభిజ్ఞస్సన్ సదైవ గురుతే దయామ్" అపరాధముల నెఱుఁగక పోవుట మాత్రమేకాదు, ఎల్లప్పుడు దయయే తలఁచువాఁడు. కావున కరుణా కాకుత్స్థుఁ డని బిరుదు సంపాదించినవాఁడు. కావున నేనును బురుషుఁడనే, ఆయన పురుషుడే. నా యట్టి వాఁడే కదా యని నిన్నుఁబట్టి పోల్చుకొనకుము.

ధర్మాంకుఁడు-ధర్మగుణమే భూషణముగాఁ గలవాఁడు. "అంకో నాటక విచ్ఛేదే సంఖ్యాయాం యుధి భూషణే, సమీపే రూపకే స్థానే యతా వుత్సంగ చిహ్నయోః". నీకు బంగారు వెండి నగలు ఆభరణములు, ఆయనకు ధర్మగుణమే ఆభరణము. ధర్మాంకుఁడు=ఎదుటఁబడి నంతే మాత్రముననే నిన్నుఁ జంపునని భయపడకుము. నిన్నుఁ జంపఁ దలఁచెనా నిన్ను ధర్మయుద్ధమందే చంపును. అధర్మమార్గమున జయము రాఁగోరఁడు. కావున నీవై చావఁ గోరి పైఁబడి శస్త్ర ధారివై పోయినఁ దప్ప నిన్నుఁ జంపఁడు. ఏలన నాయన ధర్మాంకుడు= ధర్మబుద్ధిగలవాఁడు-బుద్ధిమాఱదా-ఎల్లకాల మొక తీరున నుండునా యందు వేమో.-ధర్మాంకుఁడు=ధర్మమునకు స్థానమైనవాఁడు. ధర్మమాయనను విడిచి పోదు. ఆయన ధర్మాంకుఁడు=ధర్మమే చిహ్నముగాఁ గలవాఁడు. నీవాయనను జూచినంతనే యాయన ధర్మాత్ముఁడని గుర్తింపఁగలవు. నీ ముఖము చూడఁ గనే నీవు క్రూరుఁడవని యెట్లు తెలియు చున్నదో యట్లాయనను జూచినవారు ధర్మాత్ముఁ డని తెలిసికొనఁగలరు. కావున నిన్ను నేలును = నిన్నువశ్యము రక్షిం చును. నీవు నీ పుర మేలు నట్లు నిన్నాయన యేలును. ఊరక యేలుట గాదు. అర్మిలిన్ ఏలును=ప్రేమతో రక్షించును. నీ దేహమును నీ వెట్లు రక్షించుకొను చున్నావో యట్లు నిన్ను రక్షించును. "రక్షతే భగవాన్విష్ణుః భక్తా నాత్మ శరీరవత్" అని కలదుకదా సూక్తి. ఏమి నమ్మకమందువా, ఆయన శరణాగత వత్సలుఁడు=శరణు అని వచ్చినవారిని తనబిడ్డలవలెఁ జూచువాఁడు. తన బిడ్డను

దా నెవఁడైనఁ జంపునా? నీవు చెప్పినది శాగున్నది. ఆయనయందు విరోధ భావము మాని నా యింటనే యుండెదను. నీ వీ వనములో నుండుము. ఆయన నడవిలో నుండ నిమ్మనెద వేమో?

ఉ. మానుము రాక్షసేంద్ర! కొఱమాలినబుద్ధి దయాస్వరూపుఁ డా
 మానధనుండు, న వ్వెస సమర్పణ చేసి భజింపు మీవునున్
 దాన శుభంబు నీ కగును • నా నుడి నీవు కృతాంతుప్రేరణన్
 వీనులఁ బెట్టవేని పృథివీవరుచే మృతిఁ గందు వాజిలోన్. ౧౧౭

అర్థములు. కొఱమాలిన బుద్ధి=నిష్ప్రయోజనమైన, యిటువంటి విపరీత బుద్ధి, మానుము=వదలుము — చెలిమిగోరుట కేమి లక్షణము? అపరాధము చేయుటయా? ఉపకారము చేయకుండినను అపకారముచేయుట మానవలెఁగదా. చేసిన యపకారము సవరించుకొనకుండిన నది యేమి స్నేహము? అది స్నేహలక్షణమా? కావున నీవు చేసిన యపరాధమును సవరించుకొనుము. ఆయన మానధనుఁడు కావున నవమానము సహింపఁడు. అందు నాయన విషయమునఁ జేసిన యపరాధములను క్షమించునుగాని, యాయన యాశ్రితుల విషయమునఁ జేసిన యపరాధములను సహింపఁడు. కావున నా విషయమున నీవు చేసిన యపరాధమును ఆయన సహింపఁడు. నీవు దానిని సవరించుకొంటివా, వీఁ డిట్టి దుష్టకార్యము చేసెనే యని మనస్సున నుంచుకొని దండింపక దయాస్వరూపుఁ డగుట క్షమించును. అంతటి దయావంతుఁ డైనచో నిప్పుడు మాత్రము నన్నేల క్షమింపరాదు. ఏమో జ్ఞానహీనుఁడు చేసినాఁడులే యని యూరకుండరాదా యందువేమో, అటయిన నందఱు నపరాధములు, పాపములు చేయువారేయగుదురు. పుణ్యపాప వివక్షయే లేకపోవును. లోక మధర్మమున నుండును. అప్పుడు ధర్మరక్ష యెట్లు చేయఁగలఁడు? అధర్మరక్షకుఁ డగును. అటయిన నిపుడు నన్నేమి చేయు మనెదవా? ఆయనను వెంటనే యిచ్చుటకెఁ దోడుకొనివచ్చి నన్ను సమర్పించి సేవింపుము. ఈవునున్ భజింపుము=నీవు కూడ భజింపుము, ఆయన రాఁగానే నీ విషయమై నీనిని రక్షింప వలసినది యని నేనును జెప్పెదను. నీవు కూడ నమస్కరింపుము. చాలును. అంత కెక్కువ నీ వేమియుఁ జేయవలదు. దానన్=ఆ నమస్కారరూపక సేవవలననే నీకు మేలు గలుగును.

కృతాంతుప్రేరణన్=యముఁడు ప్రేరించుటచే, నా నుడి నీవు వీనులన్ బెట్టవేని=విని యా ప్రకారము వర్తింపక పోయితివా, పృథివీవరుచేన్ = రామభూపాలునిచే, ఆజిలోన్=యుద్ధమందు, మృతిఁగందువు=చత్తువు.

తాత్పర్యము

రాక్షసరాజా! నిష్ప్రయోజనమైన యీ బుద్ధి వదలుము. రామచంద్రమూర్తి దయాస్వరూప మగువాఁడు. మానమే ధనముగాఁ గలవాఁడు. కావున నన్నాలస్యము చేయక యాయనకు సమర్పించి, నీవు కూడ సేవింపుము. దానివలన

నీకు మేలు గలదు. యముఁడు నిన్నుఁ బ్రేరించుటచే నా మాట వినక పోయితివా, యుద్ధమందు నీవు ఆయనచేఁ జచ్చుట శక్యము.

ఉ. తప్పినఁ దప్పవచ్చు బల • దానవవైరిశతారపాతముల్
దప్పినఁ దప్పవచ్చు నల • ధర్మునిచూడ్కులు కొంతకాలమేన్
జెప్పెద సావధానమతిఁ • జేర్పుము వీనుల, రాముఁ డల్గినన్
జెప్పెడి దేమి మూర్తమునఁ • జీలిచి వైచును నిన్నుబోఁటులన్. ౫౫౪

అర్థములు. బలదానవవైరి=బలుఁ డను రాక్షసునకు విరోధి యగు ఇంద్రుని యొక్క, శతార=నూరు అంచులు గల వజ్రాయుధము యొక్క, పాతముల్=పడుటలు, ధర్ముని=యముని యొక్క, కొంతకాలమేన్=కొంతకాలమైనను, శాశ్వతముగాఁ దప్పదు, ఎట్టి యోగియైనను బ్రళయము దైనఁ జావవలసిన వాఁడే, సావధానమతిన్=హెచ్చరిక గల మనస్సుతో.

తాత్పర్యము

బ్రహ్మచేత, రుద్రునిచేత, వరములు గొన్న నీవంటివారి విషయమున నింద్రుని వజ్రాయుధము వ్యర్థమై పోయినఁ బోవచ్చును. యమధర్మరాజు కంటఁ బడక కొంతకాలము తప్పించుకొనినఁ దప్పించుకొన వచ్చును గాని, నేను జెప్పెడి మాట యేకాగ్రచిత్తమున వినుము. ఏమో చెప్పుచున్న దని యుదాసీనుఁడవు గాకుము. రామచంద్రమూర్తికిఁ గోపమే వచ్చెనా, నే నేమని చెప్పుదును. నిన్ను బ్రహ్మరుద్రాదుల వరములు కాపాడలేవు. ఆయన బాణము లల్పకాలములో నిన్ను, నీవంటి వారిని ముక్కలు ముక్కలుగాఁ జీల్చివేయును. ఆయనకుఁ గోపము వచ్చి విల్లెక్కు పెట్టువఱకే నీ జీవితము.

క. కడువడి సురపతి విడిచిన, పిడుగులవడుపునను గడిఁది • బెడిదపుటులివుల్
విడివడ రఘుపతిశరములు, వెడలఁగ వినఁ గలవురా! వి • వేకముఁ గనరా.

అర్థములు. కడువడిన్ = మిగుల వేగముగ, కడిఁది=మిక్కిలి, బెడిదపు= భయంకరములైన, ఉలివుల్=ధ్వనులు, విడివడన్=బయలు వెడలఁగా.

తాత్పర్యము

నామాట నీవు వినకపోయితివా మిగుల శీఘ్రముగ నింద్రుఁడు విడిచిన పిడుగుల వలె మిగుల భయంకరములైన ధ్వనులతో రామచంద్రమూర్తి బాణములు వింటి నుండి వెలువడ వినఁగలవు. అవి వినక ముందే తెలివి తెచ్చుకొనుము. ఒకసారి విని యవి యెంత భయంకరముగాఁ దోఁచిన శరణు చొచ్చెదనులే యనకుము. ఆ శబ్దము నీ చెవిని బడకముందే బాణము నీ ఱొమ్మున నాటియుండును. నీవు నేలఁబడి యుందువు. రామచంద్రమూర్తి బాణములు వచ్చువిధము నీవు చూచిన వాఁడవు గావు. కావున నిన్ను నీవు గొప్పగాఁ జెప్పుకొనుచున్నావు. మారీచాదు లెఱుఁగుదురు. నీ శూర్పణఖ యెఱుఁగును. వారు నీకుఁ జెప్పియే యుందురు. నీ శరప్రయోగ

విధము రామచంద్రమూర్తి శరప్రయోగ విధము రెండును నేను జూచితిని. నీవి మేఘములనుండి వెలువడు నీళ్ళబిందువులవంటివి. రామునివి పిడుగులవంటివి. మీ యిరువుర కిదియే తారతమ్యము. అనుభవమువలన నీవే తెలిసికొన గలవు.

ఉ. క్రూరవిషానలార్చులను•గుప్పుచుఁ గ్రక్కుచుఁ గోఱలార్చుచున్
దోరముగాఁగ సర్పములు•దూఱెడు నట్టు లవక్రపర్వముల్
శ్రీరఘురామలక్ష్మణ సు•చిహ్నితముల్ శితభీకరేషువుల్
ఘోరముగాఁ బయింగవియ•గోడుకొనుం జుమి లంక యంతయున్. ౫౬౦

అర్థములు. క్రూరవిషానలార్చులను=తీక్ష్ణమైన విష మనెడి యగ్నిజ్వాలలను, ఆర్చుచున్=ఆడించుచు, దూఱెడు నట్టులు=ప్రవేశించు విధముగ, అవక్ర పర్వముల్=వంకరలేని కణుపులు గలవి, సుచిహ్నితముల్=పేర్లు చెక్కఁబడినవి, శిత=పదునైన, భీకర=భయము కలిగించు, ఇషువుల్=బాణములు, గోడుకొనుం జుమి=కీడుల పాలగును జుమీ.

### తాత్పర్యము

ఓసీ! రాముని బాణములు పిడుగులవంటివి. పిడుగు లొకటియో, రెండో పడును. రాముఁ డూరిలోనికి రాఁ జాలఁడు. ఊరి వెలుపలనెందో యుండి యొకటి రెండు బాణములు విడిచినంత మాత్రమున వచ్చిన భయమేమి యందువా? నేను వేగమునందు, శక్తియందుఁ బిడుగులని చెప్పితిని గాని, సంఖ్యయందుఁ గాదు. క్రూరములైన సర్పములు విషాగ్నులఁ గ్రక్కుచుఁ గోఱలాడించుచు గుంపులు గుంపులుగఁ దూఱునట్లులు రామచంద్రమూర్తి యొక్క వంకరలేని కణుపులు గలిగి రామలక్ష్మణుల పేర్లు చెక్కఁబడిన, భయంకరములైన బాణములు లంకలోఁ బ్రవేశించి రాక్షసులపైఁ బడఁగా నవి తగిలి చచ్చువా రెందఱో, భయపడి పరువెత్తువా రెందఱో లంక యెంత యల్లకల్లోల మగునో యాలోచింపుము.

తే. రామలక్ష్మణముక్తనా•రాచతతులు, కంకపత్రంబు లీ పురిఁ•గలయఁ బర్వి
పీనుఁగుల పెంట లొనరించు•దానవాళి, నింట నింటను నేడ్పులు•మింటినంట.

అర్థములు. ముక్త=విడువబడిన, నారాచతతులు=బాణసమూహములు, కంకపత్రంబులు=గ్రద్దయీఁకెలు గలవి.

### తాత్పర్యము

రామలక్ష్మణులచేత విడువఁబడిన గ్రద్దయీఁకెలు గల బాణము లీ పట్టణమం దంతయుఁ గలయ వ్యాపించి పీనుఁగుల పెంటలు గలిగింపఁగా, రాక్షసుల యింట నింటను నాఁడువా రేడ్పు ధ్వను లాకాశ మంటఁగలవు.

తే. పాఁపమూఁక సుపర్ణుండు•పట్టి చిమ్ము, గతి మహాబలుఁడగు రాము•ఖగవిభుండు
రాక్షసేంద్రమహాసర్ప•రాజి నెల్ల, నాశుగత్రోటిఁ జించి చెం•డాడుఁ జుమ్ము.

అర్థములు. పాఁపమూఁక=పాములగుంపు, ఖగవిభుఁడు = గరుత్మంతుఁడు, ఆశుగస్త్రోటి=బాణము లను ముక్కుచే.

తా త్ప ర్య ము

కోట్లకొలఁది మే ముండఁగా నొక్క రాముఁడేమి చేయఁగలఁ డందువా? పాముల సమూహముల నొక్క గరుత్మంతుఁడు పట్టుకొని విదిలించివైచువిధమున రాముఁడనెడి గరుత్మంతుఁడు బాణము లను ముక్కుతో రాక్షసు లను సర్పముల గుంపును చించి చెండాడును జుమ్మి. ఎన్ని పాము లయినను నొక్క గరుత్మంతుని గెలువ గలవా?

చ. అసురకుఁ గైవసం బయిన ♦ యైంద్రపదంబుఁ ద్రివిక్రమాకృతిన్
వసముగఁ గైకొనండె హరి ♦ వాసవశాత్రవ! యట్ల రాముఁడున్
వెస నిట నుండి తోడ్కొనుచు ♦ వెళ్ళును నన్, నిజ మంతవట్టు, నీ
వసదుగఁ జూడఁ బోకు రఘు♦వర్యుని, భూమి మనంగఁ గోరినన్. ౫౬౩

అర్థములు. అసురకున్=బలికి, కైవసము=స్వాధీనము, ఐంద్రపదంబు=ఇంద్రపదవి, వసముగన్=స్వాధీనపడునట్లు, వశము—తద్భ—వసము. నన్=నన్ను అసదుగ=అల్పముగ, మనంగన్=బ్రదుకుటకు.

తా త్ప ర్య ము

ఓరి యింద్రవిరోధీ! యింద్రవిరోధి యగు బలిచక్రవర్తి పూర్వ మింద్రుని స్థాన మాక్రమించి తానే యింద్రుఁడై యుండఁగా విష్ణువు దానిని మఱలఁ దన వశము చేసికొనలేదా? అట్టులే రాముఁడు నీస్వాధీనమందుండు నన్నుఁ దోడ్కొని పోవును. రామచంద్రమూర్తి యొంటరిగాఁ డేమి చేయఁ గల డని యాయనను నల్పముగఁ జూడవలదు. వామనుఁ డొంటరివాఁడు కాఁడా? బలపరాక్రమములు లెక్కగాని, యొంటరి సంటరి తనము లెక్కగాదు.

క, ప్రస్థానార్భటి చెలఁగ జ,నస్థానము వెడలి వచ్చి ♦ నానారులు నా
కస్థానముఁ జేరఁగను హ,తస్థానము గాఁగ నదియు ♦ ధైర్యము లేమిన్. ౫౬౪

అర్థములు. ప్రస్థానార్భటి=ప్రయాణధ్వని, నాకస్థానము=స్వర్గము, హత స్థానము=పాడుపడినది.

తా త్ప ర్య ము

యుద్ధమునందు నాతో రాముఁడు సాటియా యనెద వేమో. యుద్ధ సన్నాహమున భేరీ భాంకారాదులతో జనస్థాన రాక్షసు లందఱు వచ్చి చచ్చి జనస్థానము పాడు పడఁగా యుద్ధమున నెదిరింప ధైర్యము చాలక.

క. దొంగిలి తెచ్చితి వుటజము,నం గూళా యొంటి నుండు ♦ నన్ నృపతిలకుల్
చెంగట లేమిని జోరుని, భంగియ గా కిదియు శూరు♦పద్ధతి యటరా? ౫౬౫

అర్థములు. ఉటజము=పర్ణశాల, ఆకుటిల్లు; కూళా=వంచకుఁడా!

తా త్ప ర్య ము

ఆకుటింటిలో నొంటిగా నుండుదానిని వంచకుఁడా! రాజపుత్రు లిరువురు దగ్గఱలేని సమయమునఁ దెచ్చితివి. ఇది దొంగవాని విధమా? శూరుని విధమా? ఇట్లు దొంగవలె వర్తించియు శూరుఁడ నని చెప్పుటకు సిగ్గు లేదా.

క. పులులపసి సోఁక శునకము, నిలువంగా లేనియట్లు•నిలువం గలవే
కలన రఘూత్తంసుల ముం,గల విక్రమహీన నీవు • కల్మషచిత్తా! ౫౬౬

అర్థములు. పసి=వాసన, కలనన్=యుద్ధమందు, కల్మషచిత్తా=పాపాత్ముఁడా.

తా త్ప ర్య ము

పులుల వాసన తగిలినంత మాత్రమున నా ప్రాంతమందు నిలువక కుక్కలు పరుగెత్తునట్లు నీవు యుద్ధభూమియందు రామలక్ష్మణుల యెదుట నిలువఁ గలవా?

చ. అలవి యెఱుంగ నేరక మ • హాత్ములతోఁ బగ గొంటి, నీవు దు
ర్బలుఁడవు వారలం జెనయ • వచ్చునె నీ కని? దోర్యుగోగ్రు నా
బలదనుజారి నొంటిచెయి•వాఁ డగు వృత్రుఁడు పోరఁ దాఁకిన
ట్టుల విను నీవు ద్రుంగెదు ప•టుప్రదరాహతి వారిఁ దాఁకినన్. ౫౬౭

అర్థములు. అలవి=శక్తి, తారతమ్యము, చెనయన్=ఎదిరింపఁగా, అనిన్=యుద్ధమందు, దోర్యుగ+ఉగ్రున్=రెండుచేతులు గల భయంకరుఁడు, బలదనుజారి=ఇంద్రుఁడు, పటుప్రదరాహతిన్=దృఢములైన బాణముల దెబ్బలచే.

తా త్ప ర్య ము

నీ శక్తి యేమాత్రమో, రామలక్ష్మణులశక్తి యే మాత్రమో యాలోచింపక వారితో విరోధించితివి. నీవు బలహీనుఁడవు, యుద్ధమందు వారి నెదిరింప లేవు. రెండు చేతులు గల యింద్రుని నొంటిచేతి వృత్రుఁ డెదిరించి చచ్చినట్టులు నీవు వారి నెదిరించితివా వారి బాణముల తాఁకునఁ జావఁగలవు. అంతియగాని, నీవు గెలువలేవు.

చ. అనుజ సమేతుఁ డై యిటకు•నాత్మవిభుం డరుదెంచి వేగ పే
ర్చిన కినుకన్ వధించు నిను • గ్రీష్మవిభాకరుఁ డల్పతోయమున్
దనకిరణాళిఁ బీల్చు గతి • దాఁగిన యక్షపపర్వతంబునన్
వననిధినాథుపీటను ద్రు•తంబుగ వృక్షముఁ బిద్దురీతిగన్. ౫౬౮

అర్థములు. పేర్చిన=అతిశయించిన, గ్రీష్మవిభాకరుఁడు=ఎండకాలము నాఁటి సూర్యుఁడు, అల్పతోయమున్=కొంచెపునీటిని, యక్షప పర్వతంబునన్=నీ యన్న యగు కుబేరుఁడు, నీకు వరములిచ్చిన శివుఁడు నుండు కైలాసమున, వననిధి నాథుపీటను=వరుణు నగరమున, సముద్రములో.

తా త్ప ర్య ము

నా భర్త తమ్మునితో నిచ్చటికి శీఘ్రముగ వచ్చి మిగులఁ గోపములో నెండ

కాలము సూర్యుఁడు చిన్నగుంతలోని నీళ్ళు తన కిరణములచేఁ బీల్చు విధమున నీవు కైలాస పర్వతము లోనగు నూర్ధ్వలోకంబుల నెత్తున డాఁగినను సముద్రములలో వరుణుని పట్టనము లోనగు నధోలోకంబులందు డాఁగినను బిడుగు వృక్షమును బడఁగొట్టునట్లు పడఁగొట్టును.

—• ౨౨-వ సర్గము రావణుఁడు సీతాదేవిని బెదరించుట. •—

క. అని పరుసంబుగఁ బల్కిన, వనజాయతనేత్ర సీత•వచనంబులు దా
విని పంక్తికంఠుఁ డనియెన్, వినరాని కఠోరవాక్య•విస్తర మొలయన్. ౫౬౯

అర్థములు. వాక్యవిస్తరము=మాటల యతిశయము.

తాత్పర్యము

ఈ రీతి సీతాదేవి కఠినముగఁ బలుకఁగా నామె మాటలు విని వినరాని పరుషములైన మాటలచే నిట్లనెను.

కం. ఎంతెంతగ బతిమాలునొ, యంతంత వశుండు పురుషుఁ•డగు సతులకుఁ దా
నెంతెంత ప్రియము లాడునొ, యంతం తవమాన మొందు•నతఁ డతివలచేన్.

అర్థములు. అంతంతవమానము=అంత యనునది సర్వనామ మైనపుడు కళ. కావున నంతంతవమాన మని సంధికూర్చుటయ్యెను. విశేష్య మైనపుడు ద్రుత ప్రకృతికము. ఇచ్చట నంత యను దానికిఁ గొలఁది యని యర్థము. "నీ యోగ విభవ మింత యంత యని పొగడ నే నెంతదాన" కళా ౨. ఇట్టులే "ఇంతింతై వటుఁ డింతయై". భాగ.

తాత్పర్యము

పురుషుఁడు స్త్రీల నెంతెంత బతిమాలునో యంతంత వారికి వశుఁ డగును. ఎంతెంత ప్రియములాడునో యంతంత వారిచే నవమానింపఁబడును. వీఁడు మనకు లోపడినాఁడు గదా యని యెంత యవమానమైనఁ జేయుదురు. అట్టులే నేను మంచి మాటలాడు కొలఁది నీవు నోరికి వచ్చినట్లెల్ల మాటలాడుచున్నదానవు.

క. కాపథములఁ జను హయముల, నేపున రథచోదకుండు•నిలిపెడి రీతిన్
నీ పలుకుల కేఁగిన నా, కోపము నార్చెడిని గామ•గుణ మో చెలువా! ౫౭౧

అర్థములు. కాపథములన్=తప్పుత్రోవలను, రథచోదకుండు=సారథి.

తాత్పర్యము

తప్పుత్రోవలఁ బోవు గుఱ్ఱములను సారథి బిగియఁబట్టినట్లు నీ పలుకులు వినుట వలనఁ గలిగిన కోపమును నీ యందు నాకుఁ గల కామ మనునది బిగఁబట్టుచున్నది.

చ. వెలదిరో! యాత్మకామమును•విఘ్న మొనర్చెడునట్టివారి దం
డ్యుల నొనరింప నెట్లు తగి•యుండియుఁ గామభరంబునన్ దయన్
జెలిమిని జూపుచుంద్రు గద•చెల్వరో! యట్టులె కల్ల తాపసిన్
వలచెడి నీవు వధ్య వయి•నన్ బరిభావ్యవు నైన నోర్చితిన్. ౫౭౨

అర్థములు. దండ్యులన్ = శిక్షకుఁ బాత్రులను, వధ్యవు = చంపఁబడఁ దగిన దానవు, పరిభావ్యవు = అవమానింపఁ దగిన దానవు.

తాత్పర్యము

ఓసీ! తన కోరికకు నెవ్వరు విఘ్నము కలిగింతురో వారు చంపఁబడఁ దగిన వారు. అట్లుండియుఁ గామాతిశయము చేతను, దయ చేతను, స్నేహభావము చేతను దొంగ తపస్విని వలను నీవు చంపఁబడుటకు నవమానింపఁ బడుటకుఁ దగిన దాన వైనను సహించితిని.

క. నీ వాడిన పరుషోక్తుల, కే వధ కీ వర్హురాల • విప్పుడ యని కో
పావేశభరంబున నా, దేవారివిభుండు పలుకు • దివిజస్తుతకున్. ॥౨౩

అర్థములు. దివిజస్తుతకున్ = దేవతలచే స్తోత్రము చేయఁబడిన దానికి, దీనిచే నీమె యిచ్చిన ప్రత్యుత్తరముల కీమెను రహస్యముగా వర్ణించు దేవతలు స్తోత్రము చేసి రని భావము.

తాత్పర్యము

ఇప్పుడు నీవు చెప్పిన పరుసపు మాటలకు నీ విప్పుడే చావఁదగిన దానవు? అని రావణుఁడు కోపముచే దేహము తెలియక దేవతలచే శ్లాఘింపఁబడు సీతా దేవి కిట్లనియె.

మ. వినవే జానకి! యింక రెండునెలలే • విశ్వాసపూర్వంబుగాఁ
గను నే వేచెద, నంతయే గడువు, నెక్కంబు జూడు మా లోపలన్
ఘనవేణీమణి! నాదు శయ్య సతివై • కాదేని రెన్నెల్లపై
నిను వంటింటను గోసి వండుదురు విం • టే ప్రాతరాశార్థమై. ॥౨౪

అర్థములు, రెన్నెలలు. రెండు + నెలలు = కొన్ని యెడల నవర్ణకంబు పరం బగు నపుడు పూర్వపదాంత్య డకారంబు నకారంబగు (పౌ. వ్యా. సం. ౧౫ సూ.) ప్రాతః + ఆశార్థమై = ఉదయకాల భోజనము, ఇది దాక్షిణాత్యుల చల్లనీళ్ళ కూటిని సూచించెడి నేమో.

తాత్పర్యము

జానకీ! విను మిదివఱకు నేను నీకుఁ బన్నెండు నెలలు గడు విచ్చి యుంటిని. అందిక రెండునెలలే కొఱఁత. ఆ రెండునెలలు ముగియువఱకు నీ యందు విశ్వాస ముంచి కాచి యుండెదను. ఈ లోపల నీవు నా భార్యగా నా పానుపెక్కక పోయి తివా, ఆగడువు తీఱిన మఱునాఁడే నిన్ను నా వంటవారు నా యుదయకాల భోజనములోనికి నంజుడుగా వండుదురు. నాలవ పాదంబున ననునాసికాక్షరయతి.

క. అని యిట్లు రాక్షసేంద్రుఁడు, జనకతనూజాత మిగుల • సాధ్వసపడుపన్
గని నిర్జరగంధర్వాం, గనలు తపించిరి వెతన్ వి • కారేక్షణలై. ॥౨౫

అర్థములు. సాధ్వసపఱుపన్=భయపెట్టఁగా, వికారేక్షణలై=దుఃఖభయములచే మార్పుచెందిన కన్నులు గలవారై.

తాత్పర్యము

ఈ విధముగ రావణుఁడు సీతాదేవిని భయపెట్టఁగాఁ జూచి యచ్చటనున్న దేవగంధర్వస్త్రీలు భయదుఃఖములచే వికారమైన నేత్రములు గలవారై తపించిరి.

క. వెఱపెట్టి కఱకు లాడెడు, కఱటిం గని సీత వగవఁ • గనుసన్నల వా
తెఱలన్ మోములఁ గొందఱు, తెఱగంటి నెలంత లామె•ధృతిఁ దేర్పంగన్.

అర్థములు. వెఱపెట్టి=భయపెట్టి, కఱకులు=పరుషపు మాటలు, కఱటిన్=మూర్ఖుని, కనుసన్నల=కంటి సంజ్ఞలచేతను, వాతెఱలన్=పెదవుల చేతను, తెఱగంటి నెలంతలు=దేవతాస్త్రీలు, తెఱ+గన్నులు=తెఱచుకొని యుండు కన్నులు గలవారు. దేవతలకు ఱెప్పపాటు లేదు. అనిమేషులు.

తాత్పర్యము

ఈ విధముగఁ బరుషపు మాటలాడుచు మూర్ఖుఁడగు రావణుఁడు భయపెట్టుచుండఁగా దేవతాస్త్రీలు కనుగిఱుపులచేతను, పెదవి విఱుపులచేతను, మూతిత్రిప్పులచేతను ఆమెకు ధైర్యము వచ్చునట్లు వానికి లోఁపడవలదని సైఁగలు చేసిరి.

దీనివలనఁ గొందఱు వానికి వెఱచి లోఁబడి యున్నను వానిమీఁదఁ బ్రేమ లేనివారై యుండిరని యేర్పడుచున్నది.

— • సీతాదేవి రావణునిఁ బరుషంబులు పలుకుట • —

తే. వారి సన్నల ధృతిఁ గూరి•వారిజాక్షి, నిబ్బరంబుగ వృత్తశౌం•డీర్యగర్వ
వశమునను నాత్మహిత మెంచి•భావవీథి, నిట్టు లను వానితో దిగు•లింత లేక.

అర్థములు. ధృతి=ధైర్యము, కూరి=పొంది, నిబ్బరంబుగన్=అధికముగ, నిర్భరశబ్ద భవము. వృత్తశౌండీర్యగర్వమునను—వృత్త=తన పాతివ్రత్యము యొక్క, శౌండీర్య=బలము వలనఁ గలిగిన, గర్వమునన్=పొగరుచేత, "ఐశ్వర్య రూప తారుణ్య కుల విద్యా బలైరపి, ఇష్టలాభాది నాన్యేషా మవజ్ఞాగర్వ ఈరితః" ఐశ్వర్యము రూపము వయస్సు కులము విద్య బలము ఇష్టలాభము-వీనిచే నితరుల లక్ష్యము చేయకుండుటకు గర్వ మనిపేరు. ఇచ్చట గర్వమునకుఁ గారణము పాతివ్రత్యము.

తాత్పర్యము

వారు చేసిన సైఁగల వలన నధికమైన ధైర్యము గలదై సీతాదేవి పాతివ్రత్యబలమువలనఁ గలిగిన గర్వముచే, "వీనికి దేహబలముండిన నాకుఁ బాతివ్రత్య బలము గలదు. వీఁడు నన్నేమి చేయఁగలఁడు" అని తన మేలాలోచించి యిట్లనెను.

ఉ. నిక్కము రోరి దుష్టమతి! ♦ నీకు శుభంబిటఁ గోరువారు లే
రొక్కరుఁ, గల్గి రేని యిటు ♦ లొప్పని కార్యము నీవు చేయఁగా
నొక్కి వచింప కుందురె ఘ♦నుల్ సరికాదుర మాను మంచు, నీ
యొక్క నితోడఁ బోవ దిటు ♦ లొప్పరికించుట వారు రాక్షసా! ౫౭౪

అర్థములు. ఒప్పరికించుటన్=ఉపేక్షించుటచేత, నిక్కముర+ఓరి=నీచ మిత్రోద్దేశములందు ఉద్దేశ్యవాచకమునకు ఏకత్వంబున రకారం బంతాగమంబగు దీనినే పూర్వులు మఱియొక విధముగఁ జెప్పిరి. "కవులు పొగడువేళఁ గాంతలు రతివేళ, సుతులు ముద్దువేళ శూరవరులు, రణము సేయువేళ రాకొట్టి పిలుచుట. పాడి యిదియ మిగుల భజన కెక్క." ఒప్పనికార్యము=లోకము శాస్త్రము నంగీకరింపని చెడుకార్యము, నొక్కి=ఒత్తి, గట్టిగా.

### తాత్పర్యము

ఓరీ! రావణా! నీ మేలు కోరువారీ యూరలేరు. ఇది నిజము. ఏల? నీవు దుష్టబుద్ధివి కావున నిజముగా నీ మేలు కోరువారొకరైన నుండిన నీ విట్టు చేయ రాని పని చేయఁబూని నపుడు నీ కిది సరిగాదు, ఇట్లు చేయవలదని గట్టిగా నొత్తి చెప్పకుందురా? వారు చెప్పక నిన్ను సవరింపక యుపేక్షించుటచే నిది నీయొక్క నితోఁబోదు. వారు చేసిన వాఁ డనుభవించు నని తలఁచిరేమో కాని యది పొరపాటు.

ఉ. ఆలను నేను రామునకు ♦ నా హరికిన్ శచివోలె నన్ను నో
బాలిశ నీవు దక్కఁ బ్ర♦పంచమునం దెవఁ డైనఁ గోరునా
బాలిని జిత్తమం దయినఁ, ♦ బల్కితి వెన్నొ దురుక్తు లా యఘం
బేలర నిన్నుఁ బాయుఁ? జని♦తేనియు నెక్కడ కైనఁ ద్రెక్కొనున్. ౫౭౫

అర్థములు. ద్రెక్కొనున్=మ్రింగును — చెఱుచును.

### తాత్పర్యము

ఇంద్రునకు శచివలె నేను శ్రీరామచంద్రమూర్తి భార్యను. ఇట్టి నన్ను మూఢుఁడా! నీవు తప్ప మఱి యెవఁడైన నీ వలెఁ బ్రపంచమున మనస్సునం దైన నన్నుఁ గోరువా? నీ వెన్నొ చెడుమాట లాడితివి ఆ పాపఫలము నిన్ను విడుచు నని తలఁచితివా? నీ వెక్కడికిఁ బోయినను నిన్నుఁ జెఱుచును.

ఉ. మత్తమతంగజంబుఁ గోల ♦ మాలిన నీచశశంబు దాఁకఁగా
నెత్తినయట్లు నాదు విభు ♦ నీ వెదిరింపఁగఁ గోరు టెల్ల, నీ
జిత్తుల రాము దవ్వు చనఁ ♦ జేసియు దొంగిలి తెచ్చి నన్ను నీ
చిత్తమునం దొకింతయును ♦ సిగ్గు వహింప వ దెట్టి మానివో. ౫౭౬

అర్థములు. మత్తమతంగజంబు=మదపుటేనుఁగు; శశంబు=చెవుల పిల్లి, ఎత్తినయట్లు=ప్రయత్నించినట్లు, జిత్తులన్=వంచనచే, మానివో=పౌరుషము గలవాఁడవో-కావనుట.

### తాత్పర్యము

మతపుటేనుఁగులోఁ బనికిమాలిన యల్పమైన చెవులపిల్లి యుద్ధము చేయఁగాఁ బ్రయత్నించినట్లు నీవు నాభర్తతో నెదిరించి పోరాడఁదలఁచు చున్నావు. నీవు వంచనచే రామచంద్రమూర్తిని దూరముగాఁ బోఁజేసి నన్ను కొంగిలించి తెచ్చియు నీ మనస్సు నందైన నీవు సిగ్గుపడవు. ఏమి పౌరుషము గలవాఁడవురా.

క. లవమాత్ర మేనియును నా,థవుకంటం బడిన నీవు ♦ తత్సమయమునన్
బవరంబున నా నృపులా,ఘవసత్త్వము లపుడె నీకుఁ ♦ గనఁబడి యుండున్.

అర్థములు. లవము=కొంచెము, బవరంబునన్=యుద్ధమందు, లాఘవసత్త్వములు=చుఱుకుఁదనము-బలము.

### తాత్పర్యము

నీవు నన్ను దొంగిలించి తెచ్చు సమయంబున నీవు కొంచెమైన నా మగనికిఁ గనఁబడి యుండినయెడల యుద్ధంబున బాణప్రయోగము నందలి యాయన చుఱుకుఁదనము బలము తెలిసి యుందువు.

క. ఏలాకో నన్నుఁ దమిఁ గను నా, భీలవిరూపములుఁ గృష్ణ♦పింగళములు నా
నీ లోచనములు రెండును, నేలం బడ వవిసి యిపుడ ♦ నిష్ఠురశీలా. ౧౮౨

అర్థములు. తమిన్=కోరికతో, ఆభీల=భయంకరములైన, విరూపములు=వికారములైన యాకారము గలవి, కృష్ణపింగళములు=నలుపు పసుపు గలిసిన కాంతి గలవి, నిష్ఠురశీలా=నిర్దయమైన స్వభావము గలవాఁడా.

### తాత్పర్యము

కామముతో నన్నుఁ జూచు నలుపు పసుపు కలసిన వన్నెగల వికారములైన నీ రెండు గ్రుడ్లేల కూలిపోలేదో?

క. దశరథుకోడల నగుచున్, విశదయశుం డైన రామ♦విభునకు సతినై
యశమునం గనుఁ నన్నుఁ బల్కిన,దశవదనా నీదు నాల్క♦దగఁ జీలదుగా. ౧౮౩

అర్థములు. విశదయశుఁడు=నిర్మలకీర్తి గలవాఁడు.

### తాత్పర్యము

దశరథు కోడలనై నిర్మలకీర్తి వహించిన రాముని ధర్మపత్నినైన నన్నుఁ బనికిమాలిన మాటలు పల్కిన నీ నాలుక యేల రెండుగాఁ జీలకున్నదో.

ఉ. నేన దశాస్య నిన్నిపుడ ♦ నీఱుగఁ జేయనె? నాదువల్లభుం
డానతి యీమి నట్టిపని♦కై, తప మెల్లను బొల్లుపోవఁగా
మానస మొప్ప కుండుటను ♦ మానితిఁ గాక, హరింపఁ జాలుదే
దానవ నన్ను? నిన్నెడపు♦తత్పరతన్ విధి యిట్లు చేసెడిన్. ౧౮౪

అర్థములు. నీఱుగన్=భస్మముగ, ఆనతి=ఆజ్ఞ, పొల్లుపోవఁగా = వ్యర్థమై పోవుట, కెడపు=చంపు, విధి=దైవము.

## తాత్పర్యము

కుక్కను గొట్టను బచ్చెనకోల కావలయునా? యన్నట్లు నిన్నుఁ జంపుటకు రామచంద్రమూర్తి రావలయునా? నేనే నిన్ను భస్మముచేయలేనా? నీకంత శక్తి యుండిన నేల చేయరాదందువా? నేను కేవల పరతంత్రురాలను. నా రక్షణ భారము నాభర్తపై వైచియున్న దానను. నన్ను రక్షించు భారము ఆయన యందున్నది. ఇప్పుడు నేను స్వతంత్రించి నిన్నుఁ జంపితినా నా పారతంత్ర్యవ్రత మునకు హాని వచ్చును. నా ప్రాణము పోయినఁ బోనిమ్ము. కానీ, నా స్వరూప స్వభావమైన పారతంత్ర్యమును విడువఁజాలను. దానిని విడిచిన నాకు స్వరూప హానియే కలుగును, ఆయన యాపదలందు నిన్ను నీవు రక్షించుకొమ్మని దుష్టుని శపింపుమని యనుమతి యిచ్చినవాఁడు కాఁడు. నే నాయనసొమ్ము. ఆయన నా స్వామి. స్వామి గదా తన సొమ్మును దాను గాపాడుకొనవలెను. ఉండిన ననుభ వించువాఁ డాయనయే. పోఁగొట్టుకొనిన నష్టపడువాఁ డాయనయే. ఆయన నిమి త్తమై నాయునికిగాని నా నిమిత్తమై కాదు. కావున నాయన యాజ్ఞలేని కార్యము నేనెట్లు చేయుదును. అట్లు భర్తయాజ్ఞ లేని కార్యము నేను చేసితినేని నా పాతి వ్రత్యమునకే హానివచ్చును. కావున నీ విపుడే భస్మము చేయఁబడుటకు యోగ్యుఁ డవైనను నట్లు చేయక యూరకున్న దానను. అటుగాకున్న 'హతోభవ' యనినఁ జచ్చిపడవా? కావున నీవు నన్నేమిరా చేయఁగలవు? నిన్నుఁ జెఱుచుటకు దైవమే నిన్నిట్టు లాడించుచున్నాఁడు. నీ యంతట నీవే చెడుటకు సిద్ధముగా నున్నప్పుడు నే నేల చెఱుపవలె? బెల్లము దిని చచ్చువానికి విషము పెట్టవలయునా?

క. శూరుఁడవై విదితబలో, దారుఁడవై యైలబిలుని♦తమ్ముఁడవై పెం
పారియు వంచనమెయిఁ బర, దార స్తేయంబు నీకుఁ♦దగునే యనుడున్. ౫౬౧

## తాత్పర్యము

రామచంద్రమూర్తి యంతటి శూరుఁడవు గాకపోయినను లోకమున శూరుఁడ వని పేరు తెచ్చుకొన్నవాఁడవు. విస్తారమైన గొప్ప బలము గలవాఁడవు. లోక నమస్కృతుఁడైన కుబేరుని తమ్ముఁడవు. కులముచే బలముచే నింతటి గొప్పవాఁడ వయ్యు మోసముచేసి పరస్త్రీని దొంగిలించి తెచ్చుట నీకు సరియా? అని చెప్పఁగా.

చెఱలో నుండు దేవశాస్త్రీలో, విభీషణు భార్యయో, కూతురో, రావణా సురుఁడు శాపభయమున నిన్నుఁ దాఁకఁడు భయపడవల దని రహస్యము దెలిపిరి రావణుఁడు చంపఁబూనిన నీ శాప మడ్డుపడదు. సీతాదేవికి వీఁడు నన్ను జంపెనా చంపనీ, నా పాతివ్రత్యమునకు హానిలేదు గదా, యని యామె ధైర్యము.

— ♦ రావణుఁడు సీతాదేవిపై నాగ్రహపడుట ♦ —

క. జానకి వచనంబులను ద, శాననుఁ డాలించి క్రూర♦మగు నయనంబుల్
దా నట్టె విచ్చి త్రిప్పుచు, మానవతీమణిని గినుక♦మండుచుఁ జూచెన్. ౫౬౨

సీతాదేవి మాటలకుఁ గోపించిన రావణుని యాకారము వర్ణింపఁబడుచున్నది.

తాత్పర్యము

సీతాదేవి నయభయములు గలుగఁ జెప్పిన మాటలను విని రావణుఁడు క్రూరములగు కన్నులు పెద్దవి చేసి గ్రుడ్లు త్రిప్పుచుఁ గోపముచే మండిపడుచుఁ జూచెను.

ఇవన్నియు భర్తృని చేష్టలని తీర్థుల అభిప్రాయము.

సీ. కాలజీమూత సం•కాశుఁ, డున్నత మహా, భుజశిరోధరుఁడును•భూరిసింహ
గతిసత్త్వుఁడును దీప్త•తతజిహ్వాక్షాగ్రలోచనుఁడు మాల్యాను లే•పనుఁడు మఱియుఁ
జలితాగ్రమకుటుండు•స్వర్ణాంగదధరుండు, రక్తమాల్యాంబర•సక్తతనుఁడు
నవ్యసుధోత్పాద•నద్ధాహిమందర, మన నల్ల మొలత్రాట•నమరువాఁడు

తే. పర్వతమునకు నుద్దియై•పరఁగువాఁడు? పీనభుజయుగ్మమున శృంగ•విహితమైన
మందరధరాధరమునకు•మాద్రివాఁడు, రావణుండు త్రిలోకవి•ద్రావణుండు.

అర్థములు. కాలజీమూత సంకాశుఁడు=నల్లని మేఘముతో సమానుఁడు, జీవనము=నీళ్ళు, దీనియందు మూత్ బంధింపఁబడును గావున జీమూతము=మేఘము, ఉన్నత=ఎత్తైన, మహా=గొప్పవగు, భుజ=భుజములు, శిరోధరుఁడు=మెడగలవాఁడు భూరిసింహ=పెద్దసింహముయొక్క, గతి=గమనము, సత్త్వుఁడు=బలముగలవాఁడు, దీప్తతత జిహ్వాక్షాగ్రలోచనుఁడు=మండుచున్న పెద్ద నాలుక కొనయు కన్నులు గలవాఁడు మాల్యానులేపనుఁడు = మాల్యములు గందపుఁబూఁతయుఁ గలవాఁడు. చలితాగ్రమకుటుండు=కదలుచున్న కొనగల కిరీటము గలవాఁడు, కోపముచేఁ దల వణఁకించుచున్నాఁడని భావము. స్వర్ణాంగదధరుండు=బంగారు భుజకీర్తులు గలవాఁడు, రక్తమాల్యాంబర సక్తతనుఁడు=ఎఱ్ఱని మాలికలతోను వస్త్రముతోను గూడిన దేహము గలవాఁడు, నవ్య=నూతనమైన సుధా+ఉత్పాద=అమృతము కలిగించుటకై, నద్ధ=కవ్వపుఁ ద్రాడుగాఁ గట్టఁబడిన, అహి=వాసుకి యనెడి సర్పముగల, మందరము=మందర మను పర్వతము, పీనభుజ యుగ్మమునన్=బలసిన రెండు భుజములచే, శృంగవిహితమైన=శిఖరములతోఁ గూడిన, మందరధరాధరమునకున్=మందరపర్వతమునకు, మాద్రివాఁడు=సమానమైనవాఁడు, త్రిలోకవిద్రావణుఁడు=మూఁడులోకములను బరువెత్తునట్లు చేయువాఁడు.

తాత్పర్యము

నీలమేఘముతో సమానుఁడును, ఎత్తైన భుజములు మెడ గలవాఁడును, పెద్ద సింహమువంటి గమనము బలము గలవాఁడును, మండుచున్న నాలుకకొన కన్నులు గలవాఁడును, పూలదండలు గంధపుఁబూఁతయు గలవాఁడును, కదలుచున్న కిరీటము కొన గలవాఁడును, బంగారు బాహుపురులు ధరించినవాఁడును, మందర పర్వతము

నకుఁ జుట్టఁబడిన పామువలెనల్లని మొలత్రాడు ధరించిన వాఁడును, పర్వతముతో సమానమైన వాఁడును, బలిసిన రెండు భుజములచే శిఖరములతోఁ గూడిన మందరమువలె నుండువాఁడును, మూఁడు లోకముల జనులను భయపడి పరువెత్తునట్లు చేయువాఁడును నగు రావణుండు.

తే. రక్తపల్లవవరపుష్ప♦రాజిచేత, నతులితాశోకములచేత♦నద్రివోలె
నవదివాకరవర్ణకుం♦డలయుగంబు, కలిమిఁ దనరారు మునిమనః♦కంటకుండు.

అర్థములు. రక్తపల్లవ వరపుష్ప రాజిచేతన్=ఎఱ్ఱని చిగుళ్లు, శ్రేష్ఠములైన పూలు; వాని సమూహముచే, నవదివాకర=ఉదయకాల సూర్యుని, వర్ణ=వన్నెగల, కుండలయుగంబు కలిమి = రెండు చెవుల పోగులుండుటచే, తనరారు=ఒప్పుచున్న.

తాత్పర్యము

ఎఱ్ఱని చిగుళ్ళు పూలచేతను అశోకవృక్షములచేఁ గొండవలె బాలసూర్యుని వన్నెగల పోగులచేత నొప్పుచు మునుల మనస్సు సంకట పెట్టువాఁడు.

క. చందనలిప్త శరీరుఁడు, సుందరత వసంతుఁ డగుచు♦సురుచిర భూషా
బృందయుతుం డయి మసనము, నందలి మండపమునా భ♦యంకరుఁడగుచున్.

అర్థములు. చందనలిప్తశరీరుఁడు=గంధముచేఁ బూయఁబడిన శరీరము గలవాఁడు, మసనము=శ్మశానము.

తాత్పర్యము

చందనముచేఁ బూయఁబడిన శరీరము గలవాఁడై, సౌందర్యమున వసంతునివలె నుండి యందమైన సొమ్ములు ధరించినవాఁ డయ్యును శ్మశానమందలి మండపమువలె భయము గలిగించువాఁడు.

క. రాఁజెడి కోపహుతాశను, చేఁ జక్షులు జాజువాఱి♦చెడురోషమునన్
రోఁజుచు నాశీవిష మనఁ, దాఁ జటులత సీతతోడ♦దశముఖుఁ డనియెన్. ౨౯

అర్థములు. హుతాశనుఁడు=అగ్ని, జాజువాఱి=ఎఱ్ఱనయి, ఆశీవిషము=పాము.

తాత్పర్యము

రాఁజుచున్న కోపాగ్నివలనఁ గన్ను లెఱ్ఱనయి తీవ్రరోషముచే బుసగొట్టు పామువలెనై కోపముచే దేహము కంపింప సీతతో నిట్లనెను.

ఉ. ఓ గుణహీనురాల! నను♦నొల్లక నీతివిహీను నిర్ధనున్
బా గని యాశ్రయించె దటు♦పంకజమిత్రుఁడు సంధ్యఁ ద్రుంచు నా
లాగున నిన్ను నిప్పుడ చ♦లంబున రూపఱఁ జేయువాఁడ, నీ
యాగడ మెల్ల నా యెదుట♦నా! నను రావణు నీ వెఱుంగవా. ౩౦

అర్థములు. గుణహీనురాల=మంచి గుణములేనిదానా!, నిర్ధనున్=దరి

ద్రుని, చలంబునన్=పట్టుదలతో, రూపఱన్=రూపులేకుండ, ఆగడము=అకార్యము, అవగడము రూపాంతరము.

తాత్పర్యము

ఓసీ గుణహీనురాలా! నన్ను ధనవంతుని బలవంతుని శౌర్యవంతుని రూపవంతుని లోకములనెల్ల హా హా యనిపించువానిని నంగీకరింపక, నీతిలేనివాని ధనములేనివాని నా కంటె మేలని చేరెదవా? సూర్యుఁడు సంధ్యను హరించునట్లు పట్టు పట్టి నిన్ను నాశము చేయుదును; జూడుము, నీ యాగడములు నా యెదుటనా చేసెదవు? నేను రావణుఁడనని యెఱుఁగవా? సాయంసూర్యుఁడు సంధ్యను హరింపవలయు ననినఁ దాను ముందు హరణము కావలెను. అటులే నేను జచ్చినను జచ్చెదను, నిన్ను జంపెదనని భావము, నిన్ను జంపఁబోయి నేనే చచ్చెదను.

సీ. అని పల్కి యచ్చటి • యసురకాంతల నేకకర్ణ నేకాక్షి గో•కర్ణి హస్తి
కర్ణిని మఱి లంబ•కర్ణి నకర్ణిక, హస్తిపాది నపాది•నశ్వపాది
పాదచూళికను గో•పాదిని బృథుపాది, నేకపాదిని విపు•లైకనేత్రఁ
బెద్దతలలవారిఁ•బెద్దమెడలవారిఁ, బెద్దపొట్టలవారిఁ•బెద్దచనుల

తే. వారి నతిమాత్రనేత్రల•బాధకేశ్య,జిహ్వికను నజిహ్వికను మఱి•సింహముఖిని
సూకరీముఖి గోముఖి•జూచియనియె, వినుఁడు నాయాజ్ఞ మీరలు•వనితలార.

తాత్పర్యము

సులభము.

ఉ. మీరలు గుంపు గూడుచు స•మేలపుమాటల రామపత్ని నీ
వారిజలోచనన్ వినయ•వాక్కులనో మఱి సామదాన భే
దేరలనో భయంబుననో • యే గతినేఁ బ్రతిలోమలోమగీ
ర్వారములన్ మదీయవశ•వర్తిని వైశమ చేయుఁడెల్లరున్. ౫౯౨

అర్థములు. సమేలపు మాటలన్=ఒద్దికైన మాటలతో, అనుకూల వాక్యముల, సమ్మేళన శబ్దభవము సమేలము- భేదేరలనో, భేద+ఇరలు=భేద వాక్కుల చేతనో, ప్రతిలోమలోమగీర్వారములన్=ప్రతికూలములు అనుకూలములునైన మాటలు-వైశమ=శీఘ్రముగ.

తాత్పర్యము

మీ రందఱు గుంపుగఁ గూడి యనుకూలవాక్యములచేత సీరాముని భార్యను కమలములవంటి కన్నులు గల దానిని, వణఁకువ మాటలచేఁగాని, సామ దానభేద వాక్కులచేఁ గాని భయముచేఁ గాని యే విధముననైన సరియె, యనుకూల ప్రతికూల వాక్యముల నాకు వశపడునట్లు వేగముగఁ జేయుఁడు.

క. అని యానతి యిడి రాక్షస వనితలకున్ మఱల మఱల•వైదేహిని డాఁ
గనుఁగొని గర్జనములఁ దర్జన మొనరుప వడ్డ మగుచు•రాక్షసపతికిన్. ౫౯౩

అర్థములు. ఆనతి=ఆజ్ఞ ప్రాభవము=ఆజ్ఞ, గర్జనములన్=పెద్దగ నఱచుటచే, తర్జన మొనరుపన్=భయపెట్టగా.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము రాక్షసస్త్రీలకు నాజ్ఞచేసి మఱల మఱల సీతను జూచి పెద్దగా నఱచుచు బెదరింపఁగా రావణునకు నడ్డమై.

—• ధాన్యమాలిని రావణున కడ్డము వచ్చుట •—

తే. ధాన్యమాలిని రాక్షస•తరుణి యతనిఁ
 గౌఁగిటను గ్రుచ్చి యను ఱేఁడ!•క్ష్మాజ యేల?
 యీ నకియమానవి వివర్ణ • యేమనన్ మ
 హాకృపణ రమియింపు నా•యందు నీవు. ౪౦

అర్థములు. క్ష్మాజ=సీత, భూమియందుఁ బుట్టిన చెట్టువలె మొద్దువంటిది. ఈ నకియ+మానవి=ఈ స్త్రీ మనుష్యజాతిది. గొప్ప రాక్షసకులమునఁ బుట్టిననీకు ఈ తుచ్ఛజాతి మనుష్య స్త్రీ యేల? (౨) ఈనకి+అమానవి=ఈమె మనుష్యస్త్రీ యని తలంచుచున్నావు. కాదుసుమా. వివర్ణ=కాంతి లేనిది, (౨) నీ యోగ్యతకు మించినది, విశేషవర్ణ. మహా+కృపణ=మిగుల నీచురాలు(౨) మహా+అకృపణ= మిగుల పతివ్రత. ఈమె కోపించిన నీవు నాశమగుదువు, అని భావము.

తా త్ప ర్య ము

ధాన్యమాలిని యనెడి రాక్షస స్త్రీ రావణుని కనిష్ఠభార్య, యతని కడ్డము వచ్చి కౌఁగిలించుకొని రాజా! యీ సీత యేల నీకు? ఇది తుచ్ఛ మనుష్య స్త్రీ, కాంతి లేనిది, మహా నిర్భాగ్య, ఇట్టిది నీకేల? నాతో రమింపుము అనెను.

ఇట్లడ్డమువచ్చిన స్త్రీని వెనుక హనుమంతుఁడు అంగదాదులతోఁ జెప్పి నప్పుడు మండోదరి యని చెప్పెను. రూపసామ్యముచేతనే భ్రమించెనో,సుప్రసిద్ధు రాలగు మండోదరి పేరు తెలిసియుండి దీనిపేరు తెలియమిచేతనో లేక యిరువురు నడ్డమురాఁగా నొకరి పేరిచ్చుట నొకరి పేరచ్చుట వాల్మీకి చెప్పెనో! ఇచ్చుటఁ చెప్పినవాఁడు వాల్మీకి. అచ్చుటఁ జెప్పినవాఁడు హనుమంతుఁడు. ఈధాన్యమాలిని కొడుకే అతికాయుఁ డను వాఁడు. వాఁడుగూడ రామునకు సీత నిమ్మని రావణు నకుఁ జెప్పినవాఁడే కావున తల్లికొడుకు లిరువురు సుగుణసంపత్తి గలవారని యేర్పడుచున్నది. కావుననే రావణునకు నడ్డమువచ్చెను. మహాపతివ్రత సీత తటాలున శపించిన రావణుఁడు చచ్చునే, తనకు వైధవ్యము వచ్చునే యని యడ్డమువచ్చి యుండవచ్చును.

రంగనాథ రామాయణమునందు లక్ష్మణమూర్ఛనాఁడు హనుమంతుఁడు సంజీవనికిఁ బోవునపుడు మొసలిగా నున్న దీనికి శాపమోక్షణము గావించెననియు

దీని కొడుకు అతికాయుఁ డనియు నున్నది. అచ్చటఁ జెప్పఁబడినది దేవతాస్త్రీ.

"నా పాట విని దశాననుఁ డేగుదెంచి

♦ ♦ ♦

వనిత నన్ గారింప వలదు రమ్మనుచు
ననుఁ బ్రియోక్తులఁ దేల్చి నాతో రమింప
నతికాయుఁ డుదయించె నంత నా పుత్రు
నతివేగమున దానవాగ్రణి కిచ్చి."

యని యున్నది. దీని వలననే కాలనేమి కథ మతిహీనునిచేఁ గల్పిత మని స్పష్టపడు చున్నది. వాల్మీకి చెప్పిన ప్రకార మిచ్చట నీమె రావణున కడ్డము వచ్చుట నిజమా? ఈ కాలమందే యందెందో మడుఁగులో మొసలియై యుండుట నిజమా? ఇది రాక్షసస్త్రీ, అది దేవతాస్త్రీ. అతికాయుఁడు దీనికొడుకా? దాని కొడుకా? అతికాయుఁడు రాక్షసుఁ డనియే యుద్ధకాండమందు ౭౧వ సర్గమందుఁ గలదు. ఈ కారణముచే గాలనేమికథ కల్పిత కథయే. పూర్వపీఠిక చూచునది. ఇప్పు డడ్డము వచ్చినవారు మండోదరీ ధాన్యమాలినులు మాత్రమేకాదు. అక్కడ నున్న మఱి కొంద ఱాఁడువాండ్రు నడ్డము వచ్చినట్లు హనుమంతుఁ డంగదాదులతో "రమ్మంచు వారెల్లఁ గోపంబుఁ జల్లార్చి యా రాక్షసుం డోడుకొంచేగి" రను వాక్యములచేఁ దెలియ నగు. (చూ. దండకము. ౧౩౧౭.)

క. నిక్క మిది బ్రహ్మదేవుం, డిక్కమలాక్షికిని నొసటి॥యెడ వ్రాయఁడు నీ
దిక్కులను గెలిచి తెచ్చిన, యక్కజపుం ధనము లెల్ల॥నన భోగింపన్. ౪౧
అర్థములు. ఇది=నే నిపుడు చెప్పఁబోవునది.

తాత్పర్యము

నేను జెప్పునది నిజము. నీవు దిక్కుదిక్కుల గెల్చి తెచ్చిన యాశ్చర్యకరములైన ధనముల నెల్ల ననుభవించుటకు బ్రహ్మదేవుఁడు దీని ముఖమున వ్రాయలేదు. ఇది యేమి చేయఁగలదు? నీ వేమి చేయఁగలవు?

క. కామంబు లేని కామినిఁ. గామించినఁ యంతఁ బురుషు॥కాయంబు చెడున్
గామించు చున్న కామినిఁ, గామించిన బరమసుఖము॥గలుగును నాథా! ౪౨

తాత్పర్యము

కామము లేని స్త్రీని గామించి, భోగించెనేని యట్టిపురుషుని దేహారోగ్యము చెడును. తనయందుఁ గామము కలిగి భోగింపవలయునని కోరిక గల సమయంబున భోగించు పురుషునికి మిగుల సుఖము గలదు. కావున నీ మగతనము కొలఁదినాతో రమింప రమ్ము.

ఇది వారివారి భార్యలతో సంగమించునపుడును సత్యము. ఇరువురకుఁ గామము కలిగిన సమయంబున భోగించిననే యిరువురకు సుఖము ఆరోగ్యము కలవుగాని

కామోద్రేక మున్నను లేకున్నను నిత్యశ్రాద్ధముగాఁ జేయు వారికి సుఖారోగ్యములు లేవు. సత్సంతానము లేదు.

క. అని చెప్పుచు నా రక్కసి, దనుజేశ్వరుని న్మరల్పఁ • దశవదనుఁడు దాఁ
జని నవ్వికొనుచుఁ జొచ్చెను, దనమందిరమున్ సువర్ణ • ధామోజ్జ్వలమున్. ౫౯౯

తా త్ప ర్య ము

అని చెప్పుచు నా రాక్షసి రావణుని మరలించుకొని పోఁగా రావణుఁడు దాని మాటలకు నవ్వికొనుచు బంగారుమయమై ప్రకాశించు తన గృహములోనికిఁ బోయెను.

తే. దేవగంధర్వపన్నగ • దేవతారి, కన్యకలు చుట్టుఁ గొలువంగఁ • గదలి పోయె
నట్లు సీతను దర్జించి • యనుచితగతిఁ బంక్తివదనుండు మదనసం • భ్రాంతుఁడగుచు

తా త్ప ర్య ము

దేవగంధర్వస్త్రీలు, నాగస్త్రీలు, రాక్షసస్త్రీలు తన్నుఁ జుట్టుకొని సేవింపఁగా నిట్లు సీతను ననుచితమగు రీతి బెదరించి మదనునిచే తొట్రుపాటు పడువాఁడై వెడలిపోయెను.

—• ౨౩-వ సర్గము. రాక్షసస్త్రీలు సీతాదేవికి బోధించుట •—

క. ఆవలి యిడి యరిగిన న,ద్దానవపతు లంతఁ గ్రోధ • తామ్రాక్షుల నా
జానకిని డాసి పలికిరి, నానావిధపరుషభాష • ణంబుల నిట్టుల్. ౬౦౦

తా త్ప ర్య ము

రావణుఁ డిట్టు లాజ్ఞ చేసి పోఁగా నా రాక్షసస్త్రీలు క్రోధముచే నెఱ్ఱనైన కన్నులతో నా సీతను సమీపించి యనేకవిధములైన కఠినపు మాట లిట్లనిరి.

క. బేలా! రావణుఁ బతిఁగా, నేలా కైకొనవు? వాని • నేమిగఁ గని తా
పౌలస్త్యుని దశకంఠునిఁ,ద్రైలోక్యవరిష్ఠు నిహత • దర్పితవైరిన్? ౬౦౧

అర్థములు. పౌలస్త్యుని=బ్రహ్మపుత్రుఁ డగు పులస్త్య మహర్షి వంశమున బుట్టినవానిని, గోత్రార్థక తద్ధితము, దశకంఠుని=పదితలలు గలవానిని, త్రైలోక్య వరిష్ఠున్=మూఁడు లోకములందు శ్రేష్ఠుఁడగువానిని, నిహత దర్పితవైరిన్= గర్వించిన శత్రువులఁ జంపినవానిని.

తా త్ప ర్య ము

ఓసి! తెలివి లేనిదానా! ఏల నీవు రావణుని భర్తగా గ్రహింపకున్న దానవే. రావణుఁ డనఁగా నే మనుకొంటివే. కులము తక్కువయా యనిన, బ్రహ్మకుమారుఁడగు పులస్త్యమహాముని వంశమునఁ బుట్టినవాఁడు. లోకములో నందఱికొక్కొక తలయయిన, పది తలలు గలవాఁడు, ప్రతిష్ఠకుఁ దక్కువాయనిన మూఁడు లోకములందు వీనిని మించినవాఁడు లేఁడు. బలహీనుఁడా యనిన,

గర్వించిన శత్రువుల నందఱ జయించినవాఁడు. మగఁ డిట్టివాఁడు గావున్న నీక నెట్టివాఁడుగా నుండవలయునే.

సీ. అంతట నేకజ♦టాఖ్య యి ట్లను సీత!, రావణుం డనఁగ నీ♦భావమునను
గొలఁదిగాఁ జూచెదే? ♦యల ప్రజాపతు లార్వు, రందుఁ జతుర్థుఁ డ♦బ్జాసనునకు
మానసపుత్రుండు♦మహితయశస్వి పు,లస్త్యుండు వాని త♦లంపునందుఁ
గలిగె విశ్రవుఁ డను♦కంజజతుల్యుండు, వాని పుత్రుఁడు గదే♦వారిజాక్షి!

తే. రావణుం డభియాతివి♦రావణుండు
తాన బతిమాలుకొన నీకుఁ ♦ దగునె బిగవు?
మక్కువ నొనర్చు కొలఁదిని ♦ నిక్కపడెదు
నమ్మవా నాదుమాట నో♦యెమ్మెలాఁడి! ౬౦౨

అర్థములు. కొలఁదిగా=అల్పునిగా, ఆర్వురు ప్రజాపతులు=మరీచి, అత్రి, అంగిరుఁడు, పులస్త్యుడు, పులహుఁడు, క్రతువు అనువారు ప్రజాపతులు. వీరిలో నాలవవాఁడు పులస్త్యుడు. మానసపుత్రుఁడు=సంకల్పభవుఁడు, కంజజతుల్యుండు=బ్రహ్మతో సమానుఁడు. అభియాతి విరావణుండు=శత్రువుల నేడ్పించువాఁడు. ఎమ్మెలాఁడి=విలాసము గలదానా?

తా త్ప ర్య ము

అంతట నేకజట యను రాక్షసి యిట్లనెను. సీతా! రావణుని నీ మనస్సునం దల్పునిఁగా నెంచుచున్నావు. వాని పట్టువు నీకుఁ దెలియదు. వినుము. ఆర్వురు ప్రజాపతులలో నాలవవాఁడగు పులస్త్యుఁడు; ఈయన బ్రహ్మకు మానసపుత్రుఁడు ఆయన సంకల్పమునఁ గలిగినవాఁడు విశ్రవుఁడు. వాని కొడుకు రావణుఁడు. ఇఁక బలమునందా, శత్రువుల నేడిపించువాఁడు. ఇట్టి గొప్పవాఁడు తానై వచ్చి నిన్ను బ్రార్థింపఁగా నీ కేల యీ బిగువు. వాఁడు మక్కువ చూపుకొలఁది నీవు నిక్కి నిక్కి పడెదవే, నా మాట నీవు నమ్మవా?

సీ. ఆవల హారిజట♦యను పెనురక్కసి, తన పిల్లి కన్నులుఁ♦దద్ద విచ్చి
గిరగిర మని త్రిప్పి♦కినుక మై నిట్లను, ముప్పదికోటులుఁ♦మూఁడుకోట్లు
నిర్జరులను గెల్చె♦నిర్జరనాథుని, జెఱఁబెట్టె నట్టి పె♦న్జెట్టి నీకుఁ
దగినవరుం డగుఁ♦మగువ! వరింపుము, పంక్తికంఠుని ననఁ♦బ్రఘస యనియెఁ

తే. క్రోధమూర్చిత యగుచును ♦ ఘోరఫణితిఁ
దనదు ప్రియభార్య రూపసి ♦ ధన్యురాలి
విడిచి నినుఁ గోరు శూరుని ♦ వీరవరుని
బలియు సతి వౌట కింత ని ♦ ర్బంధ మేల? ౬౦౩

తా త్ప ర్య ము

ఆవల హారిజట యను రాక్షసి తన పిల్లికన్నులు బాగుగఁ దెఱచి గ్రుడ్లుగిరగిర

త్రిప్పుచు నిట్లనెను. ముప్పది మూఁడుకోటుల దేవతలను జయించెను, ఇంద్రుని చెర పెట్టెను, అటివంటి జగజెట్టి నీకుఁ దగిన మగఁడే కావున వానిని వరింపుము. అనిన ప్రఘస యనునది క్రోధముచే దేహము తెలియక కఠిన వాక్యముల నిట్లనియె. తన ప్రియురాలి, సుందరిని, పుణ్యాత్మురాలిని విడిచి నిన్నుఁగోరు వానిని, శూరుని; పరాక్రమవంతుని, బలవంతుని భార్య యగుటకు నీవై పైపడి పోవలసి యుండఁగా నిన్నింత నిర్బంధ పఱుపవలెనా?

క. కాంతాసహస్రకలితని, తాంతవిభాబహుళమణి వి॥తానాంచిత మా
నంతఃపురమును బో నిడి, కాంతా! నీ తోడఁ గూడఁ॥గలఁ డాతండున్. ౧౪

అర్థములు. కాంతా సహస్రకలిత=అనేక స్త్రీలతోఁగూడినది, నితాంత విభా=అధిక కాంతి గల, బహుళమణి వితానాంచితము=అనేకవిధములగు రత్న సమూహములచేఁ బ్రకాశించునది.

## తాత్పర్యము

అంద ఱాఁడు వారక్కడ నున్నారే, వారు చూచుచుండ నెట్లు వానితో సంభోగించెద నందువా, అనేక స్త్రీలతోఁగూడినదియు, అనేక రత్నకాంతులుగల దియు నగు నంతఃపురమును విడిచి యొంటిగ రమ్మనిన నిచ్చటకే వచ్చును. పోయి పిలుచుకొని వత్తునా?

సీ. వికట యి ట్లనియెను॥నికటంబునను జేరి, యమరులతో యుద్ధ॥మాడువేళ
నెన్ని మాఱులో గెల్చె॥హేలమై నాగగంధర్వయక్షోరగ॥దానవులను
నట్టి మహాత్ముండు॥పెట్టె నీపైమతి, యాసింప నిర్భాగ్య॥రాల యేల
యతని యిల్లాల వై॥హర్షింప నొల్లవు? నాఁగ దుర్ముఖి యెల॥నాఁగ కనియె
ఆ. నెవనిఁ దలఁచి సూర్యుఁ॥డెండలుగాయుండు. వెఱచు గాలి వీవ॥వృక్షతతులు
పూలవాన రాల్చు॥బోలుపుగా మబ్బులు, పరమభీతిఁ గురియు॥వలయునపుడు

అర్థములు. నికటము=సమీపము, హేలమై=వులాసముగా.

## తాత్పర్యము

వికట యనునది చనువుగ దగ్గఱఁజేరి కూర్చుండి యిట్లనెను. సీతమ్మా! రావణుఁడు యుద్ధములు చేయుచుండిన సమయమందు నాఁటవలె నవలీలగా నాగులను, గంధర్వులను. యక్షులను, పన్నగులను, దానవులను నెన్నిమాఱులో గెల్చినాఁడే, అంతటి మహాత్ముఁడు మనస్సంతయు నీ మీఁదఁ బెట్టినాఁడే పిల్లా! నీవెంత నిర్భాగ్యురాలవే, అట్టివాఁడెంతో యాశపడిరాఁగా వాని యిల్లాలవై సంతోషింపకున్న దానవు. అనఁగా దుర్ముఖి యిట్లనియె. ఓసీ! యతని పేరనిన సూర్యుఁడు లంకపై నెండగాయ భయపడును. గాలి విసర భయపడును. చెట్లు భయపడి వాఁడు తమ క్రిందికివచ్చినపుడు పూలవాన కురియించును. వాఁడు కోరినపుడు మేఘములు వర్షించును.

ఆ. అట్టి రాజరాజు♦నమరారిఁ బతిఁగాఁగఁ,గొనుము నాదుమాట♦వినుముశుభముఁ
గనుము సౌఖ్యముగను♦నునుము మా రావణు,జాయ వగుట కింత♦నందియంబ?

తా త్ప ర్య ము

అటువంటి మహిమ గలవాఁడు, రాజులకెల్ల రాజగువాఁడు, దేవతలకు విరోధి యగువాఁడు, రావణుఁడు. వాని భర్తగాఁ జేసికొని, నామాట విని, సుఖముగాఁ బ్రదుకుము, మా రావణు భార్య వగుట కింత సందేహ మేటి.

—♦ ౨౪-వ సర్గము. రాక్షసస్త్రీలు సీతాదేవిని బెదరించుట ♦—

సీ. మఱియు నందఱుఁ జేరి♦మైథిలిఁ గనుగొని, తర్జించి రిటు క్రూర♦గర్జనముల
నది యేల యెల్ల వే♦యఖిలభూతమనోహ,రం బైన శుద్ధాంత♦రంగసీమఁ
బఱుపులమీఁదను♦బన్నుండ? నో చెలి! మానుషి వగుటను♦మనుజునకును
నిల్లాల వగుటయే♦హెచ్చుగఁ జూచెద వీక నేటి రాముఁడే?♦యేల యతని
తే. మీఁద మనసుంచి మిడికెదు?♦మెలఁత!యింకఁ,గల్ల నీవెటు రామునిఁ♦గనుటగాన
రాక్షసేశ్వరుఁ డైనట్టి♦రావణుండు, నీకుఁ దగువాఁడు భర్తగా♦నెమ్మిఁగొనుము.

అర్థములు. తర్జించిరి=భయ పెట్టిరి, శుద్ధాంతరంగసీమన్ = అంతఃపుర ప్రదేశమున.

తా త్ప ర్య ము

ఇట్లు నయవాక్యములు వ్యర్థములగుటఁ జూచి భయ వాక్యముల నా రాక్షసులందఱొక్కటిగఁ జేరి యిట్లు క్రూరనాదములు చేయుచు బెదరించిరి. సీతా! ఎట్టివారి మనస్సైనను హరింపఁజాలు నంతఃపురిమందు పఱుపులమీఁదను బండుకొనుటకు నీ కేమి నొప్పియా? ఏల పండుకొన వనెదవు. నీవు మనుష్య స్త్రీ వగుటచేత మనుష్యున కిల్లాలగుటయే గొప్పగాఁ జూచుచున్నావు. ఇఁ కెక్కడి రాముఁడు? రాముఁడెక్కడ? నీ వెక్కడ. వానిమీఁద మనస్సుంచి యేల యేడిచెదవు? రాముని నీ విఁకఁ జూచుట యసత్యము. కాబట్టి రాక్షసరాజు రావణుఁడు నీకుఁ దగినభర్త. వానిని గ్రహించుము.

ఉ. మానుషి వౌట పాముఁ గొఱ♦మాలిన మానుషు రాజ్యహీనునిన్
దీను దరిద్రు దుర్బలుని ♦ దేవి! మహోహముఁగా దలంచె, దీ
మానవభోక్త లోకచయ♦మానితసర్వ పదార్థ భోక్తయౌ
దానవభర్త భర్తగ యథా♦సుఖముం జరియింప రాదటే?                ౧౦౨

అర్థములు. లోకచయమానిత=జనసమూహముచే గౌరవింపఁబడిన, సర్వ పదార్థ భోక్త=అన్నివస్తువుల ననుభవించువాఁడు.

తా త్ప ర్య ము

నీవు మనుష్య స్త్రీ వగుట పనికిమాలిన మనుష్యుని రాజ్యము లేనివానిని వెద్దుచుండువానిని దరిద్రుని బలహీనుని భర్తగాఁ దలంచెదవు. ఈ రావణుఁడో

మనుష్యులఁ దినువాఁడు. జను లే యే పదార్థములు గొప్పవని గౌరవించెదరో వాని నెల్ల ననుభవించువాఁడు. రాక్షసరాజు. ఇటువంటివానిని మగనిఁగాఁ జేసికొని యథేచ్ఛముగా సుఖింపరాదా!

క. అనుచును దను నసురాంగన, లన విని కనుఁగవలఁ గాఱు • నశ్రులు కొనగో
టను మీటుచు జలజేక్షణ, యను నా రాకాసిమూఁక • నల్లనఁ గనుచున్.

తాత్పర్యము

తన్నీ ప్రకారము పరుషముగ మాటలాడు చున్న రాక్షస స్త్రీలను గాఱు చున్న కన్నీళ్లను గొనగోట మీటుచు సీతాదేవి యా రాకాసి మూఁకకు మెల్లగా నిట్లనెను.

—• సీతాదేవి రాక్షసస్త్రీలకుఁ దనమనోనిశ్చయముఁ దెలుపుట •—

ఉ. రాక్షసకాంతలార! వినరా! జను లెవ్వరు మెచ్చ రీనుడుల్
రూక్షతరాఘకారణము • లుం జుఁడి మీ కివి, మర్త్యకాంతయున్
రాక్షసు నాలుఁ గాఁగలదె? • రచ్చల మీకివి యిష్టమేని నన్
భక్షణసేయుఁ డీ చెనఁటి • పల్కులు నా చెవిఁ గ్రుచ్చ కుండుఁడీ. ౮౧౦

అర్థములు. రూక్షతర=మిక్కిలి తీక్ష్ణములైన, అఘకారణములు=పాపమును గలిగించునవి.

తాత్పర్యము

రాక్షసస్త్రీలారా! నామాట చెవిలోఁ బడనీయరా? మీరు చెప్పునట్టి మాటలు లోకము మెచ్చునవికావు. అంతేకాదు. మీకు మహాఘోరపాపమును గలిగించునవి. ఎందైన మనుష్యస్త్రీ రాక్షసుని భార్యకాఁగలదా? మీకిటుసేయ నిష్టమేని నన్నుఁజంపి తినుఁడు. ఈ దుష్టవాక్యములు పలుకుట చాలింపుఁడు.

క. దీనుండో వర రాజ్యవిహీనుండో యెవ్వఁడైన • హృదయేశ్వరుఁడే
మానితుఁ డగు నా కెప్పుడు, భానుండు సువర్చల కగు • పగిదిం జగతిన్. ౮౧౧

తాత్పర్యము

దరిద్రుఁడో రాజ్యహీనుఁడో మఱి యెట్టి వాఁడైనను సువర్చలకు సూర్యుని వలె నా మగఁడే నాకు గొప్ప,

సూర్యుఁడు తనవేఁడిమిచే మిగులఁ దపింపఁజేయుచున్నను సువర్చల యతనిని విడిచిపోయినదా? విష్ణు పురాణము. ౧-౭

"కల్పాదా వాత్మనస్తుల్యం సుతం ప్రధ్యాయత స్తతః
ప్రాదురాసీ త్ప్రభో రంకే కుమారో నీలలోహితః
రురోద సుస్వరం సోఽథ ప్రాద్రవ ద్ద్విజసత్తమ!
కిం రోదిషీతి తం బ్రహ్మా రుదంతం ప్రత్యువాచహై
నామదేహీతి తం సోఽథ ప్రత్యువాచ ప్రజాపతిః

రుద్ర స్త్వం దేవనామ్నాసి మారోదీ ర్ధైర్య మావహ
ఏవ ముక్తః పునస్సోఽథ స ప్తకృత్వో రురోదహ
తతోఽన్యాని దదౌ తస్మై సప్తనామాని వై ప్రభుః
స్థానానిచైవ మష్టానాం పత్నీః పుత్రాంశ్చవై ప్రభుః
భవం శర్వ మథేశానం తథా పశుపతిం ద్విజ!
భీమ ముగ్రం మహాదేవ మువాచ స పితామహః
చక్రే నామాన్యథై తాని స్థానా న్యేషాం చకార సః
సూర్యో జలం మహీవాయు ర్వహ్ని రాకాశ మేవచ
దీక్షితో బ్రహ్మణ స్సోమ ఇత్యేతా స్తనవః క్రమాత్
సువర్చలా తథైవోషా సుకేశీ చాపరా శివా
స్వాహా దిశా తథా దీక్షా రోహిణీచ యథాక్రమమ్.

కల్పాదియందు బ్రహ్మకుఁ గొడుకు పుట్టి యేడ్చెను. ఏల యేడ్చెదవనఁగా, నాపేరేమి చెప్పుమనెను. బ్రహ్మ నీవు రుద్రుఁడవనెను. మఱల నేడుగా నై యేడ్చెను. అప్పుడు భవ-శర్వ-ఈశాన-పశుపతి-భీమ-ఉగ్ర-మహాదేవ యని వారికిఁ బేర్లు పెట్టెను. ఆ యెనమండ్రను సూర్య-జల-మహీ-వాయు-వహ్ని-ఆకాశ-దీక్షిత బ్రాహ్మణ-సోమ-దేహము లిచ్చి సువర్చల-ఉష-సుకేశి-శివ-స్వాహా-దిశ-దీక్ష...రోహిణి యను నెనమండ్ర భార్యల నిచ్చెను. ఇందుఁ జెప్పఁబడిన సువర్చల యీమెయే.

ఈ సందర్భమున నీ శాస్త్రవాక్యములు స్మరణీయములు.

వ్యాసః. కురూపోవా కువృత్తోవా దుస్స్వభావోఽథవా పతిః
రోగాన్వితః పిశాచోవా మద్యపః క్రోధనోపివా
వృద్ధోవాథ విదగ్ధోవా మూకోంధో బధిరోపివా
రౌద్రోవాఽథ దరిద్రోవా కదర్యః కుత్సితోపివా
కాతరః కితనో వాపి లలనా లంపటోపివా
సతతం దేవవత్పూజ్య స్సాధ్వ్యా వాక్కాయకర్మభిః
అహంకారం విహాయాథ కామక్రోధౌచ సర్వదా
మనసో రంజనం పత్యుః కార్య మనన్యస్య వర్జనమ్.

కురూపుఁడైనను, దుర్వృత్తి మం దున్నవాఁడైనను, చెడుస్వభావముగల వాఁడైనను, రోగియైనను, పిశాచము పట్టినవాఁడైనను, మద్యము త్రాగువాఁడైనను, క్రోధగుణము గలవాఁ డయినను, ముసలివాఁడైనను, వంచకుఁడైనను, మూఁగవాఁడు గ్రుడ్డివాఁడు చెవిటి వాఁడైనను, క్రూరుఁడైనను, దరిద్రుఁడైనను, లోభియైనను, కుచ్ఛితుఁడైనను, పిఱికివాఁడయినను, జూదరియైనను, అన్యస్త్రీ

కాముకుఁడైనను, పతిని పతివ్రతయగు స్త్రీ సర్వదా దేవునివలెఁ త్రికరణములఁ బూజింపవలెను. అతని విషయమున అహంకారము దుష్కామము క్రోధము వదలవలయును. అతని మనస్సు సంతోషపెట్టవలెను. అతఁడు సంతోషింపని తక్కిన కార్యము లన్నియు వదల వలయును.

సీ. బలసూదనునకుఁ • బౌలోమి యట్టులు, దమి వసిష్ఠున కరుం • ధతిని బోలి
నీహారకరునకు • రోహిణిరీతిని, చ్యవనర్షికి సుకన్య • చందమునను
సత్యవంతునకును • సావిత్రిమాడ్కిని, క్షితిఁ గపిలునకు శ్రీ • మతివిధమునఁ
బ్రథ నగస్త్యునకు లో • పాముద్రచాడ్పున, నగరునకును గేశి • నిగతిగాఁగ
తే. నల్లసౌదాసునకు మద • యంతికరణి, నలునకును దమయంతియం • దంబు వెలయ
రఘుకులాధీశ్వరుం డైన • రామచంద్ర, విభునకే నాతని భజించి • వెలయుదాన.

తాత్పర్యము

పాతివ్రత్య మనునది తన కల్పితము గాదనియు సాధ్వాచారపరాయణలైన యుత్తమ స్త్రీలందఱు దాని ననుష్ఠించి యున్నారనియుఁ బూర్వపతివ్రతల నుదాహరించుచున్నది.

బలనిషూదనునకు=ఇంద్రునకు పౌలోమి=శచీదేవి, నీహారకరునకు=చంద్రునికి, చ్యవనర్షికి=చ్యవనుఁ డను మహాఋషికి, సుకన్య, శర్యాతి యను రాజు కూఁతురు, చ్యవనుఁడు గ్రుడ్డివాఁడైనను ఆయనకిచ్చి తండ్రి వివాహముచేయఁగా నాయననే సేవించుచుండెను. చంద్రునకు రోహిణి యనుటచే చంద్రునకుఁ బెక్కురు భార్యలున్నను, చలిచేత వణకించుచున్నను రోహిణి యొక గడియయైన నాయనను విడిచియుండదు. సత్యవంతుఁడు సంవత్సరమునకుఁ జచ్చునని తెలిసియు సావిత్రి యాయనను వరించి చచ్చిన వానిని బ్రదికించుకొనెను. కపిలునకు=కపిల మహర్షికి—ఈయన యోగమందు సర్వదా యుండినను శ్రీమతి యాయనను విడిచినదికాదు. అగస్త్యుఁడు మహర్షి, దరిద్రుఁడు, లోపాముద్ర రాజుకూఁతురు. అట్లుండియు నాయనను విడువక సేవించెను. సౌదాసునకున్=ఈయనకుఁ గల్మాషపాదుఁడనియుఁ బేరుగలదు. ఈయన వసిష్ఠ శాపముచే రాక్షసుఁడై యుండినను ఈయన భార్య యీయనను సేవించుచునే యుండెను, నలునకు దమయంతి. ఈయన చక్రవర్తిగా నుండి జూదమందోడి యడవులపాలైనను, దిగంబరుఁడైనను, దన చీరెలో సగము చించి యీయన కిచ్చి యీయనవెంట నడవులలోఁ దిరిగి యష్టకష్టములు పడి తుదకు మగని సంపాదించుకొనెను. ఇందు చంద్రమతి హరిశ్చంద్రునుడు చెప్పఁబడలేదు. కారణమేమో. వీ రందఱు సీతారాములకుఁ బూర్వులే. ఇచ్చట సూక్ష్మముగ నొక్కొక్క మాటలో చెప్పిన యీ యితిహాసములఁ బెంచి వివరముగ వ్యాసమహర్షి భారతమున రచించెను. ఆకారణముననే యిరువది నాలుగువేల గ్రంథములు గల భారతము లక్షగ్రంథమయ్యెను. ఈ రామాయణ మందు నూఱు ఉపాఖ్యానములు సూచింపఁబడినవి. వీనికి వ్యాఖ్యానముగ భారతమునందుఁ గలవు. కావున రామాయణమునకు భారతము

వ్యాఖ్యాన మని యీ వ్యాఖ్యానమున ముందు వ్రాయఁబడెను. ఈ రామాయణ మందుఁ గల విషయములే భారత భాగవతములందుఁ బెంచి వ్రాయఁ బడినవి. ఈ వ్యాఖ్యాత యొక్క యీ యభిప్రాయమును బృహద్ధర్మ పురాణమందలి యీ యనువాదములు బలపఱుచు చున్నవి

రామాయణం మహాకావ్య మాదౌ వాల్మీకినా కృతమ్
తన్మూలం సర్వకావ్యానా మితిహాస పురాణయోః
సంహితానాంచ సర్వాసాం మూలం రామాయణం మతమ్
తదేవాదర్శ మారాధ్యం వేదవ్యాసో హరేఃకలా
చక్రే మహాభారతాఖ్య మితిహాసం పురాతనమ్
కార్యాకార్య నిర్ణయేత్ర స్మృతిశ్చైవ ధర్మసంహితా
ఇతిహాసాదివాక్యంతు తన్నిదర్శన సాధకమ్.

విధిరువాచ:—

యత్ త్వం వేదార్థవక్తా స్యాః కావ్యరూపేణ సర్వశః
అహం సృష్టికరో బ్రహ్మ తత్ర లీలాకరో హరిః
తద్వర్ణనస్య కర్తా త్వం సృష్టిరక్షాకరో భవ
లోకానాం ధర్మరూపైవ విష్ణోర్లీలా మలాపహా
త్వయా సా వర్ణితా లోకే పరోధర్మ స్థిరో భవేత్
త్వంచ త్రికాలవృత్తిజ్ఞః సత్యవాదీ ప్రతిష్ఠితః
నాహం త్వత్తః పృథక్ భూతః కవి రన్యః ప్రజాపతిః
కవి ర్బ్రహ్మ కవి ర్విష్ణుః కవి రేవ స్వయం శివః
కవిశ్చైవ ధర్మవక్తాచ కవిః సర్వత్ర సైకవిత్
త్వంతు రామచరిత్రాణి మునే భావీని వర్ణయ
తత్తు రామాయణం నామ మహాకావ్యం భవిష్యతి
వర్ణయిష్యసి యద్యత్ త్వం తత్తు విష్ణుః కరిష్యతి
విష్ణోః కీర్త్యా భవత్ కావ్యం స్థాస్య త్యాచంద్రతారకమ్.

దేవ్యువాచ:—

రామాయణం మహాకావ్యం కృతం వాల్మీకినా స్వయమ్
తత్ర రామచరిత్రస్య వ్యపదేశేన సర్వశః
సర్వే ధర్మాః సముద్దిష్టా వర్ణాశ్రమ విభాగశః
నానాదేశ చరిత్రాణి శత్రుమిత్రకథా అపి
ఇతిహాసస్వరూపేణ సర్వేధర్మా నిరూపితాః.

వాల్మీకి రువాచ:—

వేదః పరిణతోభూత్వా మహాభారతతాం గతః

స్త్రీశూద్ర ద్విజబంధూనాం వేదార్థ జ్ఞానహేతవే
భారతం కృతవాన్ పూర్వం దేవో నారాయణః స్వయమ్
భారతస్య విధానాయ త్వం నారాయణ నిర్మితః
రామాయణాచ్చ విస్తీర్ణం త్వం మహాభారతంకురు
రామాయణ పరిపాట్యా త్వం మహాభారతంకురు
పరమాత్మ స్వరూపస్య సీతారామస్య చేష్టితమ్
వర్ణితం చైకరూపస్య తచ్ఛరీర విశేషవత్
స ఏవ దేవో భగవాన్ కృష్ణః కమలలోచనః
జీవ ద్వితీయ శ్చిక్రీడ భూభారక్షయ హేతవే
జీవాత్మ పరమాత్మానౌ నరనారాయణా వుభౌ
నారాయణో వాసుదేవో నరశ్చైవార్జునాహ్వయః
నరనారాయణమయం తన్మహాభారతం విదుః
ఏకం రామాయణమయం కృతం రామాయణం మయా
రామాయణే భారతేచ విశేషోఽయ ముదాహృతః.

బృహద్ధర్మపురాణమ్.

శ్రీకృష్ణోపి పునర్దేవీ వ్యాసరూపధరో భువి
మానవానాం హితార్థాయ కావ్యాద్రామాయణా త్పునః
భాగా ద్భారత వర్షాంతర్గతాచ్చ వివిధాని హి
పృథక్ పృథక్ సప్తదశ పురాణాని కరిష్యతి
సవ్యాసో భారతాద్యైశ్చ యదా శాంతిం నగచ్ఛతి
అష్టాదశ సహస్రంహి శ్రీమద్భాగవతాభిధమ్
కరిష్య త్యష్టాదశమం రమ్యం జనమనోహరమ్
యత్కించి ద్గిరిజే భూమ్యాం కీర్త్యతే వై కథానకమ్
రామాయణాంశజం విద్ధి శ్లోకమాత్ర మపీహ యత్.

ఆనందరామాయణమ్.

శ్రీమద్రామాయణమునకు భారత భాగవతము లెట్లు వ్యాఖ్యానములో రామాయణములోని 'పరం కపీనా మాధారమ్' భవిష్యత్కావుల కిది యాధారము అను వాక్యమునకు మీఁది యనువాదములు వ్యాఖ్యానములై యున్నవి వాని సారాంశమేమన:—

రామాయణము మహాకావ్యము. అది యాదియందు వాల్మీకిచే రచింపఁబడెను. అది సర్వకావ్యములకు నితిహాసపురాణములకు నాదిమూలము. సమస్తసంహితలకు మూలము రామాయణము. దాని నాధారము చేసికొని విష్ణుకలయగు వేదవ్యాసుఁడు మహాభారత మను పురాతనేతిహాసమును రచించెను.

బ్రహ్మవాక్యము. నీవు కార్యరూపమున వేదార్థవక్త వెట్లయితివో నే నట్లే సృష్టికర్తను. అందు లీలాకరుఁడు విష్ణువు. ఆ విష్ణువుయొక్క లీలలు వర్ణించి సృష్టి రక్షింపుము. ధర్మరూపయగు విష్ణులీల పాపముల హరించును. నీవు దానిని వర్ణించితివేని లోకమున ధర్మము స్థిరపడును. నీవు త్రికాలవేదివి. సత్యవాదివి. నాకంటె నీవు భిన్నుఁడవు కావు. కవి యనగా వేఱొక ప్రజాపతియే. కవియే బ్రహ్మ, కవియె విష్ణువు-కవియె శివుఁడు. ధర్మకర్త కవియె. సర్వరసజ్ఞుఁడు కవియె. నీవు రామాయణమును భవిష్యముతోడ వర్ణింపుము. ఇది మహాకావ్యమగును. నీ వేమి వర్ణించెదవో దానిని విష్ణువు చేయును. విష్ణుకీర్తిగల నీ వాక్యము ఆచంద్ర తారకముగ భూమియందు నిలుచును.

దేవీవాక్యము:—

రామాయణ మహాకావ్యము వాల్మీకిచే రచింపఁబడెను. రామచరిత్రమును నెపముగాఁ దీసికొని సమస్త వర్ణాశ్రమ ధర్మములు నానాదేశ చరిత్రములు శత్రు మిత్ర కథలు ఇతిహాస స్వరూపముగ సర్వధర్మములు నిరూపింపఁ బడెను.

వాల్మీకి వాక్యము:—

వేదము పరిణమించి భారతముగ నయ్యెను. స్త్రీలకు శూద్రులకు బ్రహ్మ బంధువులకు వేదార్థజ్ఞానము గలుగుటకై (వీరికి వేదము చదువ నధికారము లేమిని) భగవంతుఁడు నారాయణుఁడే పూర్వము భారతము రచించెను. భారత విధానార్థము నీవు నారాయణునిచే నిర్మింపఁబడితివి. రామాయణమున కంటె విస్తారముగ నీవు భారతమును జేయుము. రామాయణక్రమము ననుసరించి నీవు భారతము చేయుము. పరమాత్మ స్వరూపమైన సీతారామ చేష్టితము ఆయన శరీర విశేషమువలెనే యొక రూపముగ వర్ణింపఁ బడినది. ఆ భగవంతుఁడు కమలలోచనుఁడు, కృష్ణుఁడై భూభారము క్షయింపఁజేయ రెండవవాఁడగు జీవునితోఁ గ్రీడించెను. (రెండవవాఁడు జీవుఁడు అర్జునుఁడని యెఱుంగవలెను.) నరనారాయణులు జీవాత్మపరమాత్మలు. నారాయణుఁడు వాసుదేవుఁడు. నరుఁడు అర్జునుఁడు ఆ మహాభారతము నరనారాయణ మయము, రామాయణము నేక మయముగా నేను జేసితిని. (ఇందు జీవకృత్యమున కంటెఁ బరమాత్మకృత్యము విశేషమని భావము.) రామాయణమునకు భారతమునకిది భేదము. రామాయణ మందు జీవాత్మను (సీతను) నెపముగా నుంచుకొని సర్వము తానే పరమాత్మ (రామచంద్రమూర్తి) చేసెను. భారతమందు జీవాత్మయగు నర్జునుచే సర్వము చేయించెను ఇది రెంటికి భేదము. వ్యాసరూపము ధరించి శ్రీకృష్ణుఁడను పేరు (కృష్ణశబ్దమునకు వ్యాసులనియు నర్థముగలదు) మానవుల హితముకొఱకు మఱల రామాయణ కావ్యమునకంటె భారముగ భరతవర్షమునఁ బదునేడు పురాణ ములను భారతమును వేఱువేఱుగ వ్యాసులు రచించియు శాంతి లేని వాఁడై పదునెనిమిదివేల గ్రంథము గల శ్రీమద్భాగవత మను పేరుగల

పము నెనిమిదవ పురాణమును జనమనోహరమైన రమ్యమైన దానిని జేయఁగలఁడు. పార్వతీ! లోకమునఁ గీర్తింపఁబడిన కథ యే కొంచెమైనను రామాయణాంశజ మనియే యెఱుంగుము. ఆనంద. రా.

రామాయణమున జీవకృత్యము సీతాదేవి చరిత్రము వలనను పరమాత్మ కృత్యము రాముని చరిత్రము వలనను దెలియనగు. మనము జీవాత్మల(సీతాదేవి) ప్రవర్తనము దెలిసికొని యీ ప్రకారము నడచి ముక్తులగుట యావశ్యకము. ఆ సీతాదేవి చరిత్రము విశేషించి సుందరకాండమునఁ గలదు. ఆ కారణము చేతనే యిది విశేషముగ నాదరణ పాత్రమై సుందరకాండ మను సార్థక నామధేయము వహించియున్నది.

తాత్పర్యము

ఇంద్రునకు శచీదేవి, వసిష్ఠున కరుంధతి, చంద్రునకు రోహిణి, చ్యవనునకు సుకన్య, సత్యవంతునకు సావిత్రి, కపిలునకు శ్రీమతి, అగస్త్యునకు లోపాముద్ర, సగరునకుఁ గేశిని, సౌదాసునకు మదయంతి, నలునకు దమయంతి యెట్టులో రామ చంద్రమూర్తికి నేనట్టులే, నే నాయన ననుభవించి కృతార్థురాల నగుదును.

క. జానకి యిటు పల్కిన విని, దానవకులనాథచోదితలు రాకాసుల్
దీనాత్మను గర్కశవా, చానిష్ఠురబాణనిహతఁ జలిపిరి మిగులన్. ౬౧౩

అర్థములు. చోదితలు=ఆజ్ఞాపింపఁబడినవారు. దీనాత్మను=దుఃఖించుచు న్న మనస్సుగల దానిని, కర్కశవాచా=కఠినవాక్కులనెడు, నిష్ఠురబాణ నిహతిన్= కఠినబాణములచేఁ గొట్టఁబడిన దానినిగ, రావణచోదితలు అనునది హేతు గర్భితము.

ఈ స్త్రీలు సీతను బాధించుట కేమి హేతువనిన రావణు నాజ్ఞయే కాని వారికి ద్వేషబుద్ధి గలిగి కాదు. కావుననే సీతాదేవి హనుమంతునితో (యుద్ధ. ౨౬-౨౬) 'నిర్జర విరోధి పనుపున, దర్జించిరి వీర లతని దాసులుగాననన్, నిర్జితుఁ డౌట దశాస్యుఁడు, తర్జింతురె యింక నన్నుఁ దరుచరవర్యా' యని చెప్పెను.

తాత్పర్యము

సీతాదేవి యీ ప్రకారము చెప్పఁగా రావణునిచే నాజ్ఞాపింపఁబడిన రాక్షస స్త్రీ లామెను కఠినవాక్కు లను బాణములచే మిగులనొప్పించిరి.

క. కదలక మెదలక తెలియక, పెదవులు నా శింశుపాఖ్యవృక్షస్థితుఁ డై
బెదరించు చుండ రాక్షస, సుకతులు జానకిని వాయుసూనుఁడు వినియెన్.

తాత్పర్యము

ఇటునటు కదలక కైకుఁయి యనక శింశుపావృక్షమునందుండి జానకిని రాక్షస స్త్రీలు బెదరించు మాటల నెల్ల హనుమంతుఁడు వినెను. రావణుఁడు రాకముందే యామె సీతాదేవియని హనుమంతుఁడు నిశ్చయించుకొనెను. ఆ నిశ్చయము రావణ సీతావాక్యప్రతివాక్యముల వలన స్థిరపడెను. ఇట్లుండ రావణుఁడు సీతాదేవి నన్ని

దుర్భాషణము లాడుచుండ వానిమీఁద దూఁకి హనుమంతుఁడు నాలుగు గ్రుద్దులు చేతులార గ్రుద్దక యెట్లు విని సహించి యూరకుండెను. ఇది దాసుని లక్షణమా? హనుమంతుఁడు దూతగా వచ్చెను. సుగ్రీవుఁడు సీతాదేవిని జూచి రమ్మనెను. రామచంద్రమూర్తి ముద్రికనిచ్చి దీనిని సీతాదేవి కిచ్చి మాటలాడి రమ్మనెను. ఇది దూత ముఖ్యకృత్యము. దీనిని జేయక క్రోధమునకుఁ బాలుపడి యముఖ్య కార్యమును జేయవచ్చునా! అందు వాఁడు తప్పఁద్రాగి కామవశుఁడై యున్న స్త్రీల నడుమ నున్నవాఁడు. అది యుద్ధసమయముగాదు. వానితో యుద్ధము పెట్టుకొనఁగానే రాక్షసులతో యుద్ధముతోనే సరిపోవునుగాని వచ్చిన కార్యమున కెడము లేక పోవును. అందఱికంటె ముందు సీతాదేవి బెదరును. కావున గార్య క్రమమదికాదు. వచ్చిన పనియైన యెడల యుద్ధ మెప్పుడైనఁ జేయవచ్చును. ఇవన్ని యాలోచించి హనుమంతుఁ డోర్పుగలిగిన వాఁడయ్యెను.

—• రాక్షస స్త్రీలు సీతాదేవిని గఱకు లాడుట •—

క. అంతట నందఱు రాక్షస, కాంతలు చుట్టుకొని రాము•కామిని భీత
స్వాంతమున వణఁకఁ గోపా,క్రాంతత నిట్లనిరి వాతెఱల్ చలియింపన్. ౬౧౫

అర్థములు. భీతస్వాంతమునన్=భయపడిన మనస్సుతో, కోపాక్రాంతతన్=కోపముచే నాక్రమింపఁబడుటచేత, వాతెఱల్=పెదవులు, వా+తెఱ=వాతెఱ, పండ్లను తెఱవంటిది.

తాత్పర్యము

సీతాదేవి యిట్లు చెప్పిన తరువాత రాక్షస స్త్రీలందఱు భయముచే వణఁకు నామెను జుట్టుకొని పెదవులు కోపముచేఁ గదలుచుండ నిట్లనిరి.

క. గొడ్డండ్లఁ ద్రిప్పుచును వఱ,గొడ్డంబులు పలుకుచుం ద్బ•కోపంబునఁ బై
పడ్డగతి నీ వటే మా,ఱొడ్డెదు నీ వేల యొల్ల•వో రావణునిన్. ౬౧౬

అర్థములు. వఱగొడ్డంబులు = వంకరమాటలు, "బిడ్డలకు బుద్ధిసెప్పని, గ్రుడ్డికిఁ బిండంబు వండికొని పొండిదె పైఁ, బడ్డాఁడని భీముం డొఱగొడ్డములను" భాగ. ౧ స్కం. పాఠము సరిగాదు. "భీముఁడు వఱగొడ్డము లాడంగ నెట్లు గుడిచెద వధిపా" యనునది సాధుపాఠము.

తాత్పర్యము

గొడ్డండ్లు ద్రిప్పుచు వక్రభాషణము లాడుచు మిగులఁ గోపంబునఁ బైపడు నట్లు వచ్చి నీవటే మమ్ము రావణునిఁగూడ యెదిరించి మాటలాడెదవు. ఏల నీవు రావణు నొల్లవే. వాఁడు మగవాఁడు కాఁడాయేమి?

క. అను డా బిభీషికోక్తుల, విని జానకి శోక బాష్ప•వృష్టి కురియఁగాఁ
జని నల్లశింశుపాద్రుమ,మున చాటునకున్ భయంబు•ముంచుకొనంగన్. ౬౧౭

అర్థములు. బిభీషికోక్తులు=బెదరింపు మాటలు.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చెప్పుచున్న వారి జెకరింపుమాటలు విని శోకమునఁ గన్నీళ్ళు వర్షింపఁగా భయపడి లేచి శింశుపావృక్షముచాటునకుఁ బోయెను.

ఆ. బొజ్జ వ్రేలుపొట్ట • యెఱ్ఱనికన్నులు, బుఱ్ఱముక్కు గలిగి • చిఱ్ఱు చిఱ్ఱు
లాడుకొనుచు వచ్చి • యాడె జానకితోడ, వినత యనెడు నొక్క • వికటరూప.

తా త్ప ర్య ము

సులభము.

క. పతిపై నెయ్యము మేల్మేల్, సతి! కనబఱిచితివి నీవు • చక్కఁగ నైనన్
మితి మీఱిన నది యేనియు, నతివా! కీడునకు మూల • మగు నన వినవే?

అర్థములు. నెయ్యము=స్నేహము.

తా త్ప ర్య ము

నీవు నీ మగనిపై స్నేహము చక్కఁగఁ గనఁబఱిచితివి. మేలు మేలు, మెచ్చు కొంటినిగాని 'అతి సర్వత్ర వర్జయేత్.' ఏదైనను మితిమించరాదు. మగని మీఁద నైనను ఎంత ప్రేమ యుంచవలయునో యంతే యుంచవలయును. ఎక్కువగా నుంచరాదు. మితిమించిన దేదైనను గీడునకుఁ గారణమగును.

సీ. మనుజాంగనలకుఁ దగు • మగనాలితనమును, మెలఁత చెప్పితి లెస్స • మెచ్చువచ్చె
నయిన నా చెప్పెడి • యత్యంతపథ్య మా, మాటలఁ జెవి నిడు • మందయాన
సురనాయకుం డైన • హరిహయునట్టులు, వరవిక్రముఁడు రూప • వంతుఁ డైన
నిఖిల రాక్షసభర్త • నీ ప్రియభర్తగాఁ, గొనుము నా మాటను • వినియుఁ జూడు

తే. మీఁగి గలవాఁడు కలవాఁడు • భోగపరుఁడు
దక్షిణుండు జనప్రియ • దర్శనుండు
రావణుఁడు నీకుఁ దగినట్టి • ప్రాణవిభుఁడు
కృపణుఁ డగు రాముతో నేల • యేడ్చె దిట్లు ? ౬ ౨౦

అర్థములు. మగనాలితనమును=పాతివ్రత్యమును, అత్యంత పథ్యము= మిక్కిలి మేలిచ్చునది, దక్షిణుఁడు=చక్కని మనస్సుగలవాఁడు, నేర్పరి.

తా త్ప ర్య ము

మనుష్యస్త్రీలకుఁ దగిన పాతివ్రత్యము గుఱించి చెప్పితివి. బాగుగనే యున్నది. అయినను అంతకంటె మేలైనది యొకమాట చెప్పెదను వినుము. దేవతాప్రభువైన యింద్రునివలె మిగులఁ బరాక్రమము గలవాఁడు, సుందరుఁడు అయిన రావణుని నీవు భర్తగాఁగొనుము. ఒకప్రొద్దుట నామాట విని చూడు ఆవల నీకు నిష్టము లేకున్నను కష్టముతోఁ దినను వదలిపెట్టుము. రావణుఁడు మహోదాత్త, భోగమందాసక్తిగలవాఁడు, నేర్పరి, ఎందఱ భార్యలనైన సంతోషపెట్టఁ గల

వాఁడు, చూచుటకుఁ బ్రియమైన ఆకారముగలవాఁడు. ఇట్టి రావణుఁడుకదా నీకుఁ దగినమగఁడు. దరిద్రుని రాముని గట్టుకొని యేలయేడ్చెదవే.

ఉ. ఘమ్మను నంగరాగములు•కాంచనరత్నసమంచితంబులౌ
సొమ్ములు లెస్స మైఁ దొడిగి • సుందరి! యీత్రుటినుండి యెల్లలో
కమ్ముల నేలుమీ, విబుధ•కాంతునకున్ శచి, స్వాహ యగ్నికిన్
సమ్మతి నిష్టురాండ్రయిన•చాడ్పున నీ వగుమీ సురారికిన్. ౬-౨౧

అర్థములు. అంగరాగములు=వాసన పదార్థములు; పూసికొని, మైన్=దేహమునందు.

### తాత్పర్యము

ఘుమఘుమ వాసనగొట్టు గంధములు లోనైనవి పూసికొని బంగారు రత్నములచేఁ బ్రకాశించు సొమ్ములు పెట్టుకొని యీక్షణమునుండి లోకములనెల్లఁ బాలింపుము. ఇంద్రునకు శచి, అగ్నికి స్వాహాదేవి యిష్టురాండ్రయినట్టు నీవు రావణాసురునకుఁ బ్రియురాలవు కమ్మా.

ఉ. ఏటికి రాముఁ గట్టుకొని•యేడ్చెద వా కృపణున్ గతాయుషున్
గూటికి లేనివాని మదిఁ • గూర్చెదు, విన్మ మదీయవాక్యముల్
పాటిగ నెంచి మా పనుచు•భంగి నొనర్పక మాఱు పల్కిని
న్నాటికి గండకండగను•గోసి భుజింతుము వ్యంజనంబుగన్. ౬-౨౨

అర్థములు. గతాయుషున్=క్షీణించిన యాయుస్సుగలవానిని.

### తాత్పర్యము

సీతా, యేమిటికే రాముఁడు రాముఁడని చొకలోభిని, అల్పాయువుగలవానిని, దినఁగూడు కట్టబట్ట లేనివానిని కట్టుకొని యేడ్చెదవు. అటువంటి వానిమీఁద నీకేటికే ప్రేమ. నా మాటలు విను, మేము చెప్పినట్లు చేయక ధిక్కరించితివా, నిన్ను ముక్కలు ముక్కలుగానటికి వ్యంజనముగా భుజింతుము తెలిసినదా?

తే. అంతటను వ్రేలుచన్నుల•యసుర పేర, వికట వికటాట్టహాసంబు•ప్రకటితముగ
ముష్టి పై కెత్తి చూపుచు•ముగ్ధసీత, ప్రక్కఁ గనుఁగొని యిట్లనుఁ•బరుష భంగి.

అర్థములు. వికటాట్టహాసంబు=భయంకరమైన నవ్వు.

### తాత్పర్యము. స్పష్టము

ఉ. ఓసి దురాత్మురాల! కఠి•నోక్తులు పెక్కులు పల్క రాక్షసా
గ్రేసరు నమ్మె పాప మని•కేవలమున్ మృదుకాయ వౌటచే
రోసము మాని పెందయున•గూరత నిన్ను వధింపఁ డాతఁడో
త్రాసుతి! కాలయోగ్య మగు•మా పలుకుల్ గణియింప వైతిగా. ౬-౨౪

### తాత్పర్యము

ఓసి దుర్బుద్ధీ! మా రాక్షస రాజును నీ వెన్నిమాట లంటివే. అంతకతి

నముగా నీవు మాటలాడినను నీయందు దయగలవాఁడై నీవు సుకుమారివౌటచేఁ గోపింపక నిన్నుఁ జంపలేదు. దేశము కాలము నాలోచించి మేము చెప్పుచున్న మాటలు వినవుకదా.

ఉ. పరికిఁ దేటి చూడఁగ మృ॰గేక్షణ! శక్యము గాని యీ యకూ
పారము తీరమం దసుర॰వల్లభు నంతిపురంబులోన దు
ర్వారత మేము గావ దృఢ॰పంజరమందలి చిల్కయట్టు లై
చేరితి వల్ల యింద్రుఁడును ॰ జేరఁగ నేర్చునె నిన్నుఁ గావఁగన్. ౬౨౫

అర్థములు. అకూపారము=సముద్రము,

తాత్పర్యము

రాముఁడు వచ్చును. నిన్నుఁ దోడుకొని పోవు ననెదవే. అదెట్టులే వచ్చును. మొట్టమొదట నాయొద్దున నుండువారికి సముద్రతీరముననుండు నీ లంకయె కానరాదు. ఒకవేళ సముద్రము దాఁటి వచ్చె ననుకో, రావణాసురుని యంతఃపురములో నుండు నిన్నుఁ దెలిసికొననే లేఁడు. ఒకవేళ నీ విచ్చట నున్నావని వినినను మేము ఇందఱము కావలి యుండఁగా మమ్ముఁ గాదని యెట్లు తీసికొని పోఁగలఁడే. పంజరములోఁ జిలుకవలెఁ జిక్కితివే. ఆ యింద్రుఁడైన నిన్ను రక్షించుటకు దగ్గఱకైన రాఁగలఁడా?

చ. వలవనిమాట లాడ, హిత॰వాదిని నేను, మదీయవాక్యముల్
చెలువరొ వీనులం జొనుపు ॰ చెక్కులఁ గన్నులనీరు గాఱఁగా
వలవల యేల యేడ్చెద, వ॰వశ్యము శోక మనర్థకంబెకా
వెలఁది! దశాస్యుతోడఁ గడు॰వేడుకలన్ విహరింపు మర్మిలిన్. ౬౨౬

తాత్పర్యము

సీతా! నే నెంతమాట పనికి కావలయునో యంతేమాట లాడుదును. వ్యర్థముగా మాటలాడలేను. నేను నీకు హితమే చెప్పుదును. అహితము చెప్పను. తెలిసినదా నే నందఱవంటి దానఁగాను. నా మాటలు నీ చెవిలోకిఁ బోనిమ్ము. చెక్కిళ్ళ వెంబడి కన్నీరు గాఱునట్లు లేల వలవల యేడ్చెదవు. శోకము వలనఁ గీడేకాని మేలు లేదు. కాఁబట్టి ప్రేమగలదానవై రావణుతోఁ గ్రీడింపుము.

ఉ. ప్రాయము శాశ్వతం బటవె॰భామల, కియ్యది నీ వెఱుంగవా,
తోయజనేత్ర! జవ్వనము ॰ దూలక మున్న వితాంతకాంతసౌ
ఖ్యాయతి నొందఁజూడుము వ॰నాంతరవీథులఁ గేళిశాద్రులన్
జే యని భోగముల్ గుడువఁ॰జేఁ దట యా యమరారినేతతోన్. ౬౨౭

తాత్పర్యము

ఏమే సీతా! నీకీ వయస్సు ఇట్టులే శాశ్వతముగా నుండునని తలఁచితివా? ఇంత మాత్రము నీకుఁ దెలియదా? వెన్నెల యున్నప్పుడేకదేమే అల్లోనేరేళ్లు, ఆవల

రమ్మనిన వచ్చునా? కాఁబట్టి యౌవనము పోకముందే మిక్కిలి మనోహరమైన విస్తారసౌఖ్యము నీ వనుభవింప యత్నింపుము. ఆట మలలయందు జే యని రావణునితోడఁ గ్రీడించుట నీకేమి చేఁదా? చేఁదు మే సెదవు కాఁబోలు. మమ్మోఁ గోరువాఁడు లేఁడుకాని మేమైననా జమ్మని విహరింపమా?

క. సుందరి! బృందారకపర, బృందారకు భర్తగాఁగ • నేలిన నిన్నుం
గ్రందుగ సప్తసహస్రము, లిందీవరలోచనాళు • లెలమి భజించున్, ౨౮

అర్థములు. బృందారకపర=దేవవిరోధు లగు రాక్షసులందు, బృందారకున్=శ్రేష్ఠుని, పుమాన్ బృందారకో దేవే తేషు శ్రేష్ఠమనోజ్ఞయోః॥ నానా॥ ర. సప్త సహస్రములు=ఏడు వేలమంది.

తాత్పర్యము

సుందరీ, రాక్షసశ్రేష్ఠుఁడైన రావణుని భర్తగాఁ గొనితిని అని యొక్క మాట యనుము. ఇప్పుడే నిన్ను నేడు వేలమంది స్త్రీలు వచ్చి పరిచరింతురో లేదో నా మాట చూడుము.

క. సమ్మతి గొన కీ మా వా,క్యమ్మోఁ దిరస్కృతి యొనర్పఁ • గాఁ జూచిన నీ
యొమ్మోఁ బగిల్చియు వెస న,స్రమ్మును గ్రోలెదము వింత • చవు లూరంగన్.

అర్థములు, అస్రము=నెత్తురు, తిరస్కృతి=ధిక్కారము.

తాత్పర్యము

మేము చెప్పిన యీ మాటకును సమ్మతింపక తిరుగుపాటు చేసెదవా, యిదిగోఁ జూడు, నీ యొమ్ములు చీల్చి క్రొత్తరుచి పుట్టుచుండ నీ నెత్తురు ద్రావెదము.

క. చండోదరి యను రక్కసి, చండతర క్రోధమునను • సాధ్వసకర మా
దండి త్రిశూలములఁ ద్రిప్పుచు, గండున నిట్లనియె జనక • కన్యామణికిన్. ౩౦

అర్థములు. చండతర క్రోధమునను=మిగుల భయంకరమైన కోపముతో, సాధ్వసకరము=భయంకరము.

తాత్పర్యము

చండోదరి యను రాక్షసి మిగులఁ గోపించినదై భయంకరముగాఁ ద్రిశూలముఁ ద్రిప్పుచు గర్వమున సీతతో నిట్లనెను.

క. త్రాసోత్కంపిపయోధర, నీ సుందరి భీతవన్య • మృగనేత్ర స్వరా
వాసారిహృతను జూడఁగ, వాసిగ నా నోర నీళ్లు • వారక యూరెన్. ౩౧

అర్థములు. త్రాసోత్కంపి పయోధర=భయముచే మిగుల వణఁకుచున్న చన్నులుగలది, భీతవన్య మృగనేత్ర=భయపడిన యడవిజింక కన్నులు గలది. స్వర్+ఆవాస+అరి+హృతను=దేవవిరోధి యగు రావణాసురుచే నపహరింపఁ బడిన దానిని.

తా త్ప ర్య ము

భయముచేత వణఁకుచున్న చన్నులుగల యీ సుందరిని బెదరిన యడవి జింక కన్నులవంటి కన్నులుగలదానిని జూడఁగా నెప్పుడెప్పుడు వాతవేసికొందునా యని నా నోర నీళ్ళూరక యూరుచున్నవి.

తే. ఎప్పుడో కదె సీత య • కృత్తు ప్లీహ, మెదను గల్గిన యుత్పీడ • మిష్టముగను
జప్పరించుచు బంధన • మొప్పమీఱ, మెదడు నరములు తినివార • మెసవుటొదవు.

అర్థములు. యకృత్తు=కడుపులో నీరుతిత్తి క్రింద కుడివైపున నుండెడి మాంస విశేషము, కారిజము, (Liver) ప్లీహము=హృదయమున (కడుపులో) నెడమ ప్రక్కనుండెడి మాంసవిశేషము, (Spleen) గుల్మము. ఎదను=హృదయ కోశమును, (Heart) ఉత్పీడము=ప్లీహమునకుఁ బైనున్న మాంసఖండము. బంధనమున్=ఈ మాంసపుఁ గట్లను.

తా త్ప ర్య ము

అక్కా, వికటా! నే నెప్పుడే యీ సీత యకృత్తును ప్లీహమును హృదయమునఁ గల యుత్పీడమును జప్పరించుచు మెదడు నరములు తృప్తిదీర దిందునే.

ఉ. అంతట నిట్లు పల్కెఁ బ్రఘ • సాఖ్య యి దేటికె యింతరచ్చ? యీ
కాంత గళంబును న్నులిమి • గ్రక్కున నల్లమనుష్యకాంత దా
నంతము నొందె నంచును ద • శాననుతోఁ జని చెప్ప నేఁడు ని
శ్చింతతఁ దిందు పొం దనను • సిద్ధము దీనికి నాల మేటికిన్. ౩౩

అర్థములు. గళంబు=మెడ; నులిమి=నలిపి; ఆలము=ఉపేక్ష; తాన్=తానే.

తా త్ప ర్య ము

అప్పుడు ప్రఘస యను రాక్షసి యిట్లనెను. ఏమిటికే యీరచ్చ? నే నొక యుపాయము చెప్పెద. వినుఁడు. ఈసీత గొంతు నులుముదము. చచ్చును. అంతట మనము రావణు నొద్దకుఁబోయి మనుష్యస్త్రీ తానే చచ్చిన దని చెప్పుదము. తిను పొందనును. దీనికేల యుపేక్ష?

చ. గల గల వాదులాడుటయె • కార్యముపొప్పుఁ దలంప రెవ్వరున్
బలుకులతోడ నేమిపని • భామిని నంజుడు నెల్లవారమున్
వలనుగఁ బంచుకోఁ దగును • వారుణి, నంజుకొనంగ నూరుఁగా
యలు గొని రండు మీఁదగు • రయంబును జాతము గాక యియ్యెడన్. ౩౪

తా త్ప ర్య ము

అంతట నజాముఖి యిట్లనెను. కుండలో గ్రచ్చకాయలుపోసి యాడించినట్లు గలగలమని యందఱు వాదులాడువారేకాని యేపని యెట్లు చేయవలయునా యను జ్ఞాన మొక్కరికిని లేదు. ఉత్తమాటలతో నేమిపని యగును. ఈ సీత మాంసమును మనమందఱము పంచుకొని సారాయములో నద్దుకొని లొట్టలు వేయుచుఁ

దింపముగాని యేడీ, దీనిలోనికి నూరుఁగాయలు దీసికొని రాపొండు, చూతము. ఎవరు వేగిరము పోయి వచ్చెదరో చూడవలె!

క. అనుచు నజాముఖి పలికిన, విని శూర్పణఖాసమాఖ్య • వినిచె యథార్థం
బనియె నజాముఖి, కల్లును, గొనిరండీ యదియ యన్ని • కొదవలు దీర్చున్.

తా త్ప ర్య ము

అప్పుడు శూర్పణఖ యనునది యిట్లనెను. అజాముఖి సత్యము చెప్పెను. కల్లును దీసికొని వచ్చితిరా మనకొదవ లన్ని తీరిపోవును.

క. మానుష మాంసంబును స, మ్మానముగ నంజికొనుచు • మతి సురలోనన్
జానుగ నికుంభిలను గే, ళీనిరతిం దేల వచ్చు • లీలం బాలిన్. ౬౩౬

అర్థములు. నికుంభిల=ఇది లంకకుఁ బడమటి వైపున నుండిన గ్రామశక్తి, భద్రకాళి. ఈ నికుంభిల యిప్పటికి నున్నది.

తా త్ప ర్య ము

మనుష్యస్త్రీ మాంసమును కల్లులో నద్దుకొని నికుంభిల దేవాలయమందు మన యిష్టము వచ్చినట్లు గంతులు పెట్టవచ్చును.

క. ఈ రీతి నసురకాంతలు, దారుణముగ బెదిరములను • దర్శించిన నా
శ్రీరాముదేవి విని వెఱ, హా రామా! యనుచు నేడ్చె • నంగిలి యెండన్! ౬౩౭

తా త్ప ర్య ము

ఈ విధముగా రాక్షసస్త్రీలు బెదరింపు మాటలాడఁగా శ్రీ సీతాదేవి రామా యని యంగిలి యెండ నేడ్చెను. లంకలో సీతాదేవి రాక్షసస్త్రీలచేఁబడు బాధల వంటివే, దేహమునందలి బద్ధజీవుఁడు సంసారమునఁబడి యింద్రియాదులచేఁ బడు బాధలు. అయినను రావణుఁడుగాని రాక్షసస్త్రీలుగాని సీతాదేవిని బెదరించిరేగాని చంపఁజాలినవారుగారు. కావున జీవాత్మ నెవియుఁజంపఁజాలవు. బాధింపను మాత్రము బాధించును. సీతాదేవివలె బద్ధజీవులును ప్రారబ్ధ విశేషమని దృఢచిత్తముతో భగవంతుఁడు రక్షకుఁడని మహావిశ్వాసము కలిగియుండవలెను. సీతాదేవి యింద్రియములకు వశపడలేదని మహావిశ్వాసము కలదని మీఁద దృఢపడెను. తరువాత జీవుఁడు చేయవలసిన భగవద్ధ్యాన మింక సీతావిలాపరూపమునఁ జెప్పఁబడును.

—• ౨౫-వ సర్గము. రాక్షసస్త్రీలమాటలకు భయపడి సీతాదేవియేడ్చుట. •—

ఉ. అండజయాన యిట్లు బహు • శార్తి శ్రమంపడు చాసురాంగనా
దండముతోడ నిట్లు లనుఁ • దథ్యము మీ పలు కాదరింప, నన్
దిండు యథేష్టవృత్తి, నగు • నే యసురాధము లేడ? మర్త్యవే
తండసుయాన లేఁడ? గల • దా విపరీతపుహత్తు ధాత్రిలోన్? ౬౩౮

అర్థములు. అండజయాన=హంసల నడకవంటి నడకగలది, "అండజయాన నీ వాసఁగు నట్టి సపర్యలు వచ్చె" నని మనుచరిత్ర.

### తాత్పర్యము

సీతాదేవి యీ విధమున మిగుల దుఃఖపడుచు నా రాక్షస స్త్రీలతోఁ దనిట్టు లనియె. ఓ రాక్షసాంగనలారా! సత్యముగా మీ మాట నేను వినను. మీరు చెప్పినట్లు నేను జేయను. అయిన నన్నుఁ దినెదమందురా? మీ యిష్టప్రకారము తినుఁడు. నేను వల దనను. మీ రాలోచనలేక చెప్పుచున్నారు. నీచరాక్షసు లేడ? మనుష్య స్త్రీ యేడ? ఇటువంటి విపరీతపుఁ బొత్తు భూమిలోఁ గలదా?

రాక్షసస్థానమునఁ బ్రకృతిని, మర్త్యస్త్రీ స్థానమున జీవాత్మను గ్రహింపవలెను. మనుష్యులకు మనుష్యభక్షకు లగు రాక్షసులకు విజాతీయభేద మున్నట్లు కేవల మచేతన మైన దేహమునకుఁ గేవలచేతన మగు నాత్మకుఁ దారతమ్యము గల దని గ్రహింపవలెను. విషమాలంకారము. అనురూపము కాని వాని చేరిక చెప్పిన విషమాలంకారము.

క. అని రాకాసులలో మహి, తనయామణి చిక్కి వణఁకుదనలోఁ గ్రుంగున్
వని మందనుండి చెదరినఁ, బెనుఁ దోడేలు పట్టుకొన్నవిడి హరిణియనన్.

### తాత్పర్యము

మందనుండి చెదరి యొంటరిగాఁ దోడేలునకుఁ జిక్కిన యొంటి జింకవలె సీతాదేవి తన వారి నందఱ విడచి రాక్షసస్త్రీలలోఁ జిక్కుకొని వణఁకుచుండెను.

ఇచ్చటఁ దనవారు శుద్ధాత్ములు, అశుద్ధాత్మ ప్రకృతికి వశపడుట జింక తోడేలికిఁ జిక్కుట.

తే. ఇంబు జాఱఁగఁ బుష్పగదంబభార, లంబమానసుశాఖకాలంబ యగుచుఁ
గంబుకంధర తనదు మనంబునందు, నంబుజాక్షుని బతిని దుఃఖంబు గదుర.

అర్థములు. ఇంబు=మనోజ్ఞత, ఇంపు; పుష్పకదంబ=పూలసమూహము యొక్క, భార=బరువుచే, లంబమాన=వంగి వ్రేలుచున్న, సుశాఖకాలంబ=కొమ్మను పట్టుకొన్నది, కంబుకంధర=శంఖమువంటి మెడ గలది.

### తాత్పర్యము

తన మనోజ్ఞత్వము పోవునట్లు పూలగుంపుల బరువులచే వంగిన కొమ్మను బట్టుకొని సీతాదేవి తన మనస్సులోఁ దన భర్తను దలఁచి శోకంబుతో.

క. కనుదోయి నీటివాఁకను, జనుదోయిని దడుపుకొనుచుఁ స్మరియించుచు లో
దనుజాంగనలకు వెఱచుచు, ఘనవాతోచ్చలితకదళికరణిన్ వణఁకెన్. ౭

అర్థములు. ఘనవాత=గొప్పగాలికి, ఉచ్చలిత=మిక్కిలి కదలుచున్న, కదళికరణిన్=అరఁటిచెట్టువలె.

### తాత్పర్యము

కన్నీళ్ళచే స్తనములను దడుపుచు భర్తను లోపల స్మరించుచు రాక్షసస్త్రీ లేవేళ కేమి చేయుదురో యని భయపడుచుఁ బెనుగాలికి నరఁటిచెట్టువలె వణఁకెను.

చ. గడగడ లాడు నా కలువ•కంటి విశాలము దీర్ఘమైన పెన్
జడ యిటు నట్టు బొర్లుచు మ•సంబునకుం దలపించె సర్పమున్;
బడఁతుక రామ! లక్ష్మణ! కృ•పారత! యత్తరో కోసలాత్మజా!
చెడితిని హా సుమిత్ర! కృప•సేయరుగా యొకరైన నా దెసన్. ౬౪౨

తాత్పర్యము

గడగడ వణకుచున్న యా కలువలవంటి కన్నులుగల సీతాదేవియొక్క విశాలము, నిడివిగల పెద్దజడ సీతాదేవి నిలువఁబడి యుండుటచే నీ భుజము మీఁదికి నా భుజము మీఁదికిఁ బొర్లుచుఁ బెద్ద సర్పమును స్మరణమునకుఁ దెచ్చుచుండెను. ఆమెయును రామ! లక్ష్మణ! దయగల యత్తా, కౌసల్యాదేవీ! హా సుమిత్రా! చెడితిని. ఒకరైన నాయందు దయ దలఁపరు గదా!

దీనివలన సోపాధి బాంధవు లెవ్వరు నెంత యాప్తులైనను నాత్మ నుద్ధారము చేయ లేరని సూచన. స్మృతిమ దలంకారము.

ఉ. తాలిమి వీడ, రాక్షసుల•తర్జనముల్ గడుగోకు గూర్ప, నా
యేలినవానిఁ బాసి త్రుటి•యేనియు జీవములోడ నుండుటన్
గాలముకాని కాలమునఁ•గల్గదు మృత్యువు పూరుపాళికిన్
గోలల కన్న సూరిపలు•కుల్ కడునిక్కము నో తలంపఁగన్. ౬౪౩

అర్థములు. తాలిమి=ఓర్పు, ఏలినవానిన్=ప్రాణేశ్వరుని, భర్తను, త్రుటి=అల్పకాలమున, కాలముకాని కాలమునన్=అకాలమున, గోలలకు=స్త్రీలకు, సూరి=పండితులయొక్క.

తాత్పర్యము

ఓర్పు సమసెను. రాక్షసుల బెదరింపులు బాధింపసాగెను. నాథర్తను బాసి యుంటుట గలిగెను. ఈ మూఁడు కారణములచేఁ బ్రాణ మెపుడో పోవలసినదే, పోకయున్నది దీనివలన స్త్రీకిఁగాని, పురుషునకుఁగాని యకాలమున మృత్యువు రాదని చెప్పునట్టి పండితుల మాట సత్యమే కదా. అటు గాకున్న నా దేహమున జీవములు నిల్వఁగారణ మేమి గలదు?

క. కొఱనోము నోఁచి పున్నెము, గఱిగొఱ యగు నేను సుడియు•గాలికి జలధిన్
జిఱజిఱను దిరిగి మునిఁగెడి,విఱిగిన కల మనఁగఁజెడుదు • విభురహితవలెన్.

అర్థములు. కొఱనోము=పూర్ణముకాని వ్రతము, ఉద్యాపనము వఱకుఁ జేయక విడిచినది, గఱగొఱ=తక్కువ, విఱిగిన=పగిలిన, విభురహితవలెన్=భర్త లేని దానివలె.

తాత్పర్యము

ఏదియో గొప్పనోము సలుపఁబూని సాంతముగ నెఱవేర్పనైతిని. ఆకారణముచే నానోము ఫలము నాకు లేదాయెను. ఆ కారణముచే నాకు భర్తయుండియు

లేనిదాననై నడిసముద్రమున సుడిగాలికి గిఱగిఱ దిరిగి విఱిగిన యోడవలె నాపత్సముద్రమున మునుఁగుచున్నాను. నా నోము సాంతమైయుండిన యెడల నా పుణ్యఫలమే నా భర్తచే నన్ను రక్షింపఁజేసి యుండును.

దీనివలన స్త్రీల పాతివ్రత్యము, నోముల ఫలము, వారి భర్తల మూలమున వారిని రక్షించుచున్నదనియు, అట్టి ఫలము లేనియెడల భర్తలుండినను రక్షింపఁజాలరనియు నేర్పడుచున్నది, దీనిని బట్టియే యాఁడుదాని దదృష్టమని నానుడి యేర్పడెను. ఆఁడుది నిర్భాగ్యురాలగునేని మగవాఁడెంత పుణ్యుఁడు, సమర్థుఁడైనను దానికి సుఖము లేదు.

లోకమునఁ గొందఱు దరిద్రులుగను, కొందఱు భాగ్యవంతులుగను, కొందఱు దుఃఖులుగను, గొందఱు సుఖులుగ నున్నారు. ఈ భేదమునకు వారు వారు చేసిన పుణ్యవిశేషమే కారణము. వారి వారి పుణ్యమునకుఁ దగినట్టు భగవంతుఁడే దేని నెపము వెట్టి యిచ్చుచుండును. పుణ్యము లేనివారికి ఫలము లేదు. వారు వారు బాగుండుటకుఁ, జెడుటకు వారివారి కర్మమే కారణము.

ఉ. ఆ రఘురాముఁ బ్రాణవిభు • నాదట నేఁ గనుగొంట లేకయున్
క్రూరపలాశినీవశముఁ • గూరి మహావ్యథ స్రుక్కఁ గంటి, దు
ర్వారరయోద్ధతం బయిన • వాహినిచేతను నుర్లు వాహినీ
తీరమునట్లు తే మనుచుఁ • దేఁకువ నుండుదు జీవయుక్తనై. ౬౨౫

అర్థములు. ఆదటన్=ప్రేమముతో, క్రూరపలాశినీ వశము=దయలేని రాక్షసస్త్రీల యధీనము, దుర్వార రయోద్ధతంబు=వారింపరాని వేగముచే నతిశయించినది, వాహిని=ఏఱు, తేఁకువన్=ధైర్యముతో.

తాత్పర్యము

నా ప్రియవల్లభుఁడైన శ్రీరామచంద్రమూర్తి దర్శనము లేకుండుటయటుండ దయలేని రాక్షసస్త్రీలకు వశపడి మిగుల బాధపడవలసి వచ్చెను. మహావేగమున బ్రవహించు నదీవేగమునకుఁ దెగి పడెడి యొడ్డులవలె నేను మరణింపక యేమి ధైర్యముతోఁ బ్రాణము ధరించి యుందును.

భగవత్ప్రాప్తి లేకుండిన మాననుగాక, బాధయైన లేకుండినఁ జాలుననిన నట్లుగాక బాధయు సహింపరాకయున్నది. దీనివలన భగవత్సాక్షాత్కార మగువఱకు సంసారబాధ తొలఁగదని యేర్పడుచున్నది. ప్రకృతి బంధము మన ప్రయత్నముచేఁ దొలఁగునది కాదు. భగవదనుగ్రహమువలననే తొలఁగవలెను.

క. మాన్యునిఁ గృతజ్ఞు నుతసౌ,జన్యునిఁ గమలాక్షు సింహ • సమగతిఁ గృతిమూ
ర్ధన్యుని నా ప్రాణవిభున్, ధన్యులువోఁ గన్నులార • దర్శించు జనుల్. ౬౨౬

అర్థములు. మాన్యుని=పూజింపఁ దగినవానిని, కృతజ్ఞున్=చేసినమేలు మఱవనివానిని, నుతసౌజన్యుని=స్తోత్రముచేయఁబడిన సాధుత్వముగలవానిని, ఈ

మూః డాత్మగుణములు, కమలాక్షున్=కమలములవంటి కన్నులుగలవానిని, సింహ సమగతిన్=సింహము నడకతో సమానమైన నడకగలవానిని కృతిమూర్ధన్యునిన్= పుణ్యకార్యములు చేసినవారిలో శ్రేష్ఠుఁడగు వానిని, ధన్యులు=కృతకృత్యులు, హో=నిజము, నా ప్రాణవిభుని పుణ్యాత్ము లందఱు దర్శించుచున్నారుగాని నాకే దర్శించు నదృష్టము లేకున్నది.

ప్రాణములకు విభుఁడు భగవంతుఁడే. అట్టివానిని పుణ్యవంతులు సాక్షాత్కరింపఁ జేసికొను చున్నారు. అట్టివాఁడు నా యందుండినను నేను జూడలేకున్నాను. దీనికి నా పాపమేకదా కారణము.

ఇచ్చట నీ శ్రుతివాక్యములు స్మరింపనగు.

“త మక్రతుం పశ్యతి వీతశోకో
ధాతుః ప్రసాదా న్మహిమాన మాత్మనః॥”
తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరా
స్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్
సమానే వృక్షే పురుషో నిమగ్నో
అనీశయా శోచతి ముహ్యమానః
జుష్టం యదా పశ్య త్యన్య మీశ
మస్య మహిమాన మితి వీతశోకః. ॥ముండ॥

ఒక దేహమందు జీవాత్మ పరమాత్మ లిరువురు గలరు. అందు జీవాత్మ సంసారమున మునిఁగి యీశునిఁ గానలేక మోహమున దుఃఖించుచున్నది. అది యెప్పుడు రెండవవాఁడైన యీశ్వరుని దర్శించునో యప్పుడు శోకరహితమైన దగును.

ఇందాత్మగుణములు దేహగుణములు కలిపి చెప్పుటచే సగుణబ్రహ్మమే సేవ్య మని యట్టివాని సాక్షాత్కారము గలవారే పుణ్యాత్ము లని మోక్షార్హు లని యేర్పడుచున్నది. “వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షాద్రామాయణాత్మనా” యన్నట్లు సాక్షాద్వేదమైన శ్రీ రామాయణము ఎవ్వఁడు గుణవంతుఁడని ప్రారంభించి శ్రీ రామచంద్రమూర్తి యందు ననురాగము గలవారందఱు ముక్తులై రని యుపక్రమోప సంహారము లేక విధము గల దయ్యెను. అట్టులే పంచమవేదము “నారాయణం నమస్కృత్య నారాయణ కథా మిమా’ మ్మని ప్రారంభించి యందు ముఖ్యములైన విష్ణుసహస్రనామములు, భగవద్గీత, సగుణ బ్రహ్మము నుపాసనమే మోక్షసాధనమని నిర్వహించెను. శ్రీ భాగవతము “విశ్వజన్మస్థితి విలయంబు లెవ్వనివలన” నని సగుణ బ్రహ్మముతోనే ప్రారంభించి “హరిం దలంపుమిఁక జన్మము గలుగ”దని ముగించెను. బ్రహ్మసూత్రములు ‘బ్రహ్మజిజ్ఞాస’ యని ప్రారంభించి ‘జన్మాద్యస్యయతః’ అనిసగుణ బ్రహ్మోపాసనతోనే ప్రారంభించి

యట్టివారికి శ్రుతిప్రమాణమున పునర్జన్మములేదని 'నపునరావృత్తిశబ్దాత్', అని సూత్రించెను. మందబుద్ధియెయి నిద్దురపోయెడి వాని కాళ్ళకు మ్రొక్కుటకంటె వాఁడే మేలుకొని యుండునపుడు మ్రొక్కుట ఫలదాయకము. ఇది సర్వమత సమ్మత మార్గము.

క. వసనాభిఁ దినినవానికి, నసువులు మెయి నిలువనట్టు • లమరసనాభున్
వసుధాపతి నెడఁబాసిన, వసమే నామేనఁ బ్రాణ • వాయువు లుండన్. ౬౪౭

అర్థములు. వసనాభి=విషము, అసువులు=ప్రాణములు, అమరసనాభున్=దేవతలతో సమానుఁడు, వసమే=వశమే. అమరశబ్దము వాస్తవమున భగవంతు నందే ముఖ్యవృత్తి నన్వయము. దేవతలందు గౌణాన్వయము. దేవతలకు బ్రహ్మకుఁగూడ మరణము గలదు. భగవంతుఁడు మాత్రమే మరణములేని వాఁడు కావున నమరుఁడు. దీపాదుత్పన్న దీపవత్, దీపమునుండి వచ్చిన దీపమువంటివి గదా పూర్ణావతారములు. కావున రాముఁ డమరసనాభుఁడు. వసుధాపతి=భూదేవియు భగవంతుని భార్యయే కదా! 'హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ'అని శ్రుతి.

తాత్పర్యము

విషము దినిన వాని దేహమునుండి ప్రాణవాయువులు తమంతటఁ దామే లేచిపోవును. ఆ విధముగ నమరసన్నిభుఁడు భూపతియు నగు నా భర్తను బాసిన నా దేహమునఁ బ్రాణవాయువు లుండునా?

క. కటకట యింతగ వెతచే, నటమటపడఁ బూర్వజన్మ • మందును నేనే
పటుపాపముఁ జేసితినో, కుటిలాత్మిక నగుచు నదియ • కూర్చెడిఁ గీడుల్. ౬౪౮

తాత్పర్యము

ఇంత మహాదుఃఖము ననుభవించుటకు నెంత ఘోరపాపమును బూర్వజన్మమునందుఁ జేసితినో ఆ పాపము నన్నిప్పు డిట్లు బాధించుచున్నది. "అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవ ఫల మశ్నుతే." అత్యధికమైన పుణ్యముగాని పాపముగాని చేసి యుండిన నీ జన్మమందే ఫలానుభవముగలదు. తక్కినవి మఱుజన్మంబుల ఫలించును.

పూర్వజన్మమునఁ జేసిన పాపము నేఁడిటు లనుభవించు చున్నానని సీతాదేవి చెప్పెనే, ఆమె కర్మవశమునఁ బుట్టినదా? కాదు. ఈ మాట రాక్షసస్త్రీల నుద్దేశించి చెప్పఁబడెను. సత్యముగా నుండవలె, వారి కర్థముగాక యుండవలెఁ గావునఁ బూర్వజన్మ మనఁగా బాల్యమని యర్థము. నిన్నరణ్యమునకుఁ బిలుచుకొని పోనని రామచంద్రమూర్తి చెప్పినపుడు నీవాఁడుదానవుగాని మగవాఁడవాయని దూషించెను. ఆ పాపమిప్పు డిట్లు బాధించు చున్నదని భావము. బ్రహ్మ, క్షత్రియ, వైశ్యుల కుపనయనముతో రెండవ జన్మము వచ్చును. వైశ్యులకు ద్విజన్మ లనిపేరు, సన్న్యాసాశ్రమ స్వీకారము జన్మాంతరము. ఈ కారణములచే బాల్యము జన్మాంతరమే. జన్మాంతర మనఁగా నీ దేహము పోయి వేఱు దేహము వచ్చుటే కదా. ఏడు సంవ

త్సరములకుఁ బరిపూర్ణ నూతన దేహము వచ్చుచుండును. కావున సీతాదేవి యనాలోచిత వాక్యము చెప్పలేదు.

క. ఇక్కరణిని బెనుమోఁటకు, రక్కస లొక్కటను మూఁగి॰రక్షింపంగా
నెక్కడి రాముఁడు నా కిట, దిక్కేదీ చూడ మృత్యు॰దేవత దక్కన్. ౨౮౯

## తాత్పర్యము

ఈ విధముగ మూర్ఖపు రాక్షసస్త్రీలు గుంపుగఁ జేరి యందఱు నాపైఁ గావలియుండ నెక్కడి రాముఁడు? ఎక్కడి నేను? ఆయనవచ్చి రక్షించుననియేమి నమ్మకము? కావున మృత్యు దేవతయే నాకు దిక్కు.

భక్తుఁడు తన యోర్పు ఓపిక సర్వస్వము ధారవోసియును భగవంతుఁడు సాక్షాత్కరింపఁడేని "కలఁడు కలం డనెడివాఁడు కలఁడో లేఁడో" యను సందేహ మొకానొక వేళ గలుగును. ఈ సందేహ మనునది వ్యతిరేకముగఁ బరిణమింప రాదు. నే నింత శ్రమించి నష్టకష్టముల కోర్చినను భగవంతుఁడు సాక్షాత్కరింప లేదు. కావున నాస్తికునివలె భగవంతుఁడు లేఁడనుకొనరాదు. నాయం దేదో లోపమున్నది. దానివలనఁ గానరాలేదని తలఁపవలయును.

క. ఛీ మనుజ జన్మ మేటికి, ఛీ మఱి పరవశ్యమైన॰చెనఁటి బ్రతుకు నే
లా? మదిఁ దలంచినప్పుడ, యే మరణముఁ బొంద రామి॰యేర్పడెఁ గంటే.

అర్థములు. పరవశ్యము=పరులకు స్వాధీనపడియుండునది. మనుజ జన్మమేటికి యనుటచే దేవతగా నుండు నేను అకర్మవశతఁ గార్యార్థమై మనుష్య స్త్రీగాఁ బుట్టుటయుఁ దప్పనియే తోఁచుచున్నదని భావము. 'మానవానామిదం పథ్య' మ్మన్నట్లు దీని నూహించునది. మనుష్యజన్మ మేల నింద్య మనిన నది పరవశమైన బ్రదుకు గావున సంసార బద్ధుఁడైన జీవుఁడు స్వతంత్రించి చచ్చినను అసురలోకములు దప్పవు. స్త్రీ పర్యాయంబున నేను పతివ్రతను, భర్తకుఁ బరాధీనురాలను. ఈ దేహము, జీవము భర్తదిగాని నాదికాదు. దీనిని బోఁగొట్టుటకుఁ జెఱుచుటకు నా కేమి యధికారము గలదు? కావునఁ బతియాజ్ఞ లేక చచ్చుటకు నధికారము లేని యీ యస్వతంత్రపు బ్రదుకు పాడు బ్రదుకు గదా యని భావము. సర్వం పరవశం దుఃఖం, సర్వమాత్మ వశం సుఖ మ్మని స్మృతి కలదు గదా.

## తాత్పర్యము

మనుష్యజన్మ మేమి పాడుజన్మము. ఛీ ఛీ. అందుఁ బరవశమైన బ్రదు కేమి బ్రదుకు. తలఁచినపుడు చచ్చునట్టి యధికారము కూడ లేదాయెఁ గదా.

దీనివలన మనుష్యులు సుఖమో దుఃఖమో ప్రారబ్ధ మనుభవింప వలయునే కాని బలాత్కారమరణముచే దానిని దప్పించుకొన యత్నింపరాని యేర్పాటు చున్నది. దేహి కట్టి యధికారము లేదు. అనుభవశేష మెప్పటికైన ననుభవింపవలసి

పదే. రాజదండితుఁడైన కారాగృహవాసి చెఱసాలనుండి తప్పించుకొనిన నంతతో క్షమింపఁబడునా?

—♦ ౨౬-వ సర్గము. సీతాదేవి శ్రీరామునిఁ దలంచుకొని దుఃఖించుట ♦—

ఉ. వెండియు నిట్టు లేడ్చుఁ బృథివీసుత యానతవక్త్రపద్మయై
దండిగ బాష్పవారి ముఖతామరసంబున నావరింప గో
త్రం దొరలాడు కోడిగవిధంబున నొవ్వుచుఁ బిచ్చి యెత్తిన
ట్లుండి ప్రమత్తరీతిఁ దనయుల్లము భ్రాంతి మునింగినట్లుగన్. ౬౪౧

అర్థములు. ఆనత=వంపఁబడిన, వక్త్రపద్మయై=ముఖకమలము గలదై దొరలు=దొరలు, రెండు రూపంబులును గలవు. ఇట్టివే దొంగ దొంగలోనైనవి. కోడిగ=ఆఁడుగుఱ్ఱము. దొరలాడు కోడిగ యనుటచే నింతవఱకుఁ గొమ్మపట్టుకొని నిలఁబడిన సీతాదేవి యిప్పుడు నేలఁబడి పొరలాడు చున్నదని భావము. దేహికి దుఃఖమా దుస్సహ మాయెను. అది తప్పించుకొనుటకు బలవంతముగ మరణించుటకు నధికారము లేదాయెను. ఇఁక నీ దుఃఖము వాయుటెట్లు? ఎన్నాళ్ళని యీ దుఃఖ మనుభవింపవలె ననిన దాని కుపాయ మిఁక సీతాదేవి చేసినట్లు రామచంద్రమూర్తిని దలఁచుకొని సర్వదా ధ్యానించుట గుణవర్ణనము చేయుట నిర్వేద పడుటయే కాని వేఱుపాయము లేదు. దీనికే యభ్యాసయోగ మని పేరు.

"తచ్చింతనం తత్కథన మన్యోన్యం తత్ప్రబోధనమ్
ఏకాంతే తత్పరత్వంచ తదభ్యాసంవిదు ర్బుధాః" అధ్యాత్మరామాయణము.

"అథచిత్తం సమాధాతుం నశక్నోషి మయి స్థిరమ్
అభ్యాస యోగేన తతో మా మిచ్ఛాప్తుం ధనంజయ."

యని భ॥ గీ॥ ౧౨-౯ భగవంతు డుపదేశించెను.

ఇరువదినాలుగు గంటలు యావజ్జీవము సమాధియం దుండలేనివారి కిదియే యవ్యవధానమైన యుపాయము. ఈ తీవ్రనిర్వేదఫల మాచార్యప్రాప్తి. అది ముందు చెప్పఁబడును.

అంతవరకుఁ ద్యాగము, మహావిశ్వాసము, చింతనము కార్యములు. ఉత్తరీయము తోడ సర్వాభరణములు తీసివేయుటచేఁ ద్యాగము చెప్పఁబడెను. మహావిశ్వాసము చింతనము ముందు తెలియగలవు.

తా త్ప ర్య ము

సీతాదేవి తలవంచుకొని కన్నుల నీళ్ళు దండిగఁ గాఱుచుండఁగా నేలఁబడి పొరలాడు నాఁడుగుఱ్ఱము వలెఁ బిచ్చి యెత్తినట్లు పిశాచము సోకుటచే దేహము తెలియనిదానివలె మనస్సు దిగ్భ్రమ గొన్నదానివలెనై మఱియు నిట్టులేడ్చు చున్నది.

ఇందుఁ దమ మన స్సంతతయు భగవంతునిపై నుంచిన భక్తప్రపన్నుల దశ వర్ణింపఁ బడెను. 'బాలోన్మత్త పిశాచ దశాలంబన' మన్నట్టు లతీత

భక్తియుక్తుఁడు 'బాల్యేన తిష్ఠాసేత్' నన్నట్లు బాలునివలె దేహాభిమానము విడిచి నేలఁబడి పొరలాడును. పిచ్చిపట్టినట్లు, దయ్యము పట్టినట్లు, మీఁది గుడ్డయు నుండునది పోవునది తెలియక వర్తించును. సీతాదేవి స్థితి యిట్లుండెను.

సీ. రాముఁ డేమఱి యుండ • కామరూపాసురుం, డేడ్చుచుండఁగ నన్ను • నీడ్చి తెచ్చె
నీ రక్కసులచేతి • కిటు చిక్కి పీరలు, తర్జింప నెబ్బంగిఁ • గనువుఁ దాల్తుఁ
బ్రాణంబు లేటికి • నర్థంబు లేటికి, భూషణంబుల వేల • పొక్కువేళ
రామచంద్రునిఁ బాసి • రాక్షసీమధ్యంబు, నన్ వందుచుండఁగ • నాదు గుండె

తే. యినుపచిట్టె మొగాక నా • హృదయమునకు
ముదిమియును జావు లే వొకో • సదమదంబ
నయ్యు దుఃఖంబుచే నది • యవిసి పడదు
కటకటా నాదు దౌర్భాగ్య • గరిమ నేమొ. ౬౫౨

అర్థములు. రాముఁ డేమఱి యుండఁగన్ = రామచంద్రమూర్తి నా రక్షణమం దజాగ్రత వహించిన వాఁడగుటచేత. కామరూపాసురుండు = కోరిన రూపము ధరింప గల రాక్షసుఁడు. సన్యాసివలె నైన రావణుఁడు. సదమదంబను = నలగిన దానను. రామచంద్రమూర్తి ప్రమాదముచే నాకీ గతి గలిగెను. తా నేకదా పొమ్మని నందువేమో పూర్ణముగా వదలి పొమ్మనెనా? కనుచూపు దూరము దాటఁగానే సీతను విడిచి నేను దూర మెట్లు పోదు నని తలఁచి మృగమును జంపి యుండరాదా? మరలి వచ్చియుండరాదా? అనఁగా భగవత్కటాక్షము దూర మయ్యె నేని యాపదలు తప్పక వచ్చును. సూర్యకిరణములు దొలఁగెనేని చీఁకటి వచ్చును. కోరిన రూపము ధరింపఁ గలది నిత్యవిక్రియ యగు ప్రకృతియే.

తాత్పర్యము

రామచంద్రమూర్తి నా విషయమునఁ బ్రమాదపడుటచేతఁ గోరినరూపము ధరింపఁ గల రావణాసురుఁడు నే నేడ్చుచున్నను బలత్కారముగ నీడ్చి తెచ్చెను. ఇప్పు డీ రాక్షసులచేతఁ జిక్కి మరల రామ ప్రాప్తి నాకు లభింపఁజేయ కుండుటకై నేను భయపెట్టఁ బడుచుండఁగా నే నే విధముగా దేహము ధరింతును? నేను ప్రాణములు ధరించుట రామసేవానిమిత్తమే. నా ధనము రామకైంకర్యార్థమే. నా సొగసులు రామ సంతోషార్థమే యైయుండ నాయన లేక నే నేడ్చు నపుడు నా కివన్నియేల? ఎవరి కివి యుపయోగపెట్టుదును? రాక్షసస్త్రీల నడుమ నేను దుఃఖించుచుండ నా గుండె పగిలిపోక యున్నది. అది యినుప చిట్టెమేమో లేక నా హృదయమునకు ముసలితనముగాని చావుగాని లేదేమో. అట్లుండిన యెడల నే నింత తీవ్రశోకాగ్నిచే నలఁగియున్నను అది పగిలి పెటిలి పడక యుండునా? గుండె యట్లు పోకుండుటకు స్వభావగుణము కారణముగాదు. గుండెలు పగిలి చచ్చిన వారెందఱు లేరు. నా నిర్భాగ్యదశే దాని నట్లు పోకుండ జేయుచున్నది.

తే. పాపజీవిత నయి రామభద్రుఁ బాసి, యొడలఁ బ్రాణంబులను నిల్పి యున్నదాన
ధీ యనార్యను నసతిని శీలహీన, నేమి బ్రదుకిది తలఁప నా కేమి వ్రతము.

తాత్పర్యము

రామచంద్రమూర్తి నా విషయమునఁ బ్రమాదపడెను. నన్ను విడిచిపోయె నని నే నేల యనవలె? ఆయన యట్లుపోవుట కేమి కారణము? నేను బాప జీవిత నగుటయే కారణము. నేను బుణ్యాత్మురాలనై యుండిన నే నేల పోమ్మందును. ఆయన యేల పోవును? ఆ పాపబలము చేతనే ప్రాణములను విడువలేక దేహమందు నిలిపియున్నదానను. ఎప్పుడు నేను దేహమందభిమానముచేఁ బ్రాణములను నిలిపితినో యప్పుడు నే ననార్యను. ఆర్యనుగాను. పతివ్రతనుగాను, సదాచారవతినిగాను. అయి యుండిన నాకీ కష్టము వచ్చియుండదు. ఇట్టి శీలాదులులేని దిక్కుమాలిన బ్రదుకేమి బ్రదుకు. నా పతివ్రత మేమి వ్రతము? అది పర్యాప్తమైనది కాదు.

మ. తిననీ వీరలు నా శరీరమును బ్రీతిం, దీర ఖండింపనీ
మనఁజాలం జతురర్ణవీవలయితక్ష్మాభర్త నా భర్తఁ బా
సి నితాంతంబు దురంతమైన వ్యథ గాసిం బొందుచే నిట్టి రీ
తని సౌఖ్యంబులు గోరుదాననె? కడుం దీపో కదే ప్రాణముల్. ౨౫౮

అర్థములు. తిననీ=తిననిమ్ము, "ఇచ్చుటకు సర్వత్ర ఈయయగు." తిననీయుము, తిననిమ్ము, తిననీ యని రూపంబులు తిననివ్వని యనునది గ్రామ్యము. ఇచ్చునకు 'ఇవ్వ' శాస్త్రసమ్మతముగాదు. మనఁజాలన్=బ్రదుకలేను, చతురర్ణవీ=నాలుగు సముద్రములచే, వలయిత=చుట్టఁబడిన, క్ష్మా=భూమికి, భర్త=పతి, నితాంతము= మిక్కిలి, దురంతము=అంతములేని.

తాత్పర్యము

రామచంద్రమూర్తి సేవ మరల లభించు నను నాశతో దేహమునందభిమానము వహించి ప్రాణములను దేహమున నిలిపితిని. అది యేమో యాశ లేదాయె. ప్రాణమా బలవంతముగ విడువరాదాయె. దుఃఖములా సహింపరాని వాయె. నే నేమి చేయుదును? ఈ రావణుఁ డొక్క సముద్రముచేఁ జుట్టఁబడిన యొక ద్వీపమున కధిపతి. నా భర్త నాల్గు సముద్రములచేఁ జుట్టబడిన భూమితల మున కంతయు నధిపతి. అట్టివానిని విడిచి మిక్కిలి యంతములేని దుఃఖముపాలై నేను బ్రదుకలేను. కావున నీ రాకాసులు నా దేహమును బీఁకి తిందురా తిన నిమ్ము. ముక్కలు ముక్కలుగా నఱకుదురా, నఱకనిమ్ము. ఈ బాధకంటె నది గొప్ప బాధగాదు. ఇంత దీర్ఘకాల బాధయుఁగాదు. ఇట్టి స్థితిలో నాకు మంచాలు పఱుపులు దిండ్లు సొగసులు కావలయునా? ఈపాడు ప్రాణ మింత తీపా?

దీనివలన భక్తునిమనస్సు భగవంతునిపై నుండవలెఁగాని సౌఖ్యములపై నుండ నీయరాదని యేర్పడుచున్నది.

ఆ. ఎడమ కాలిగోర • నేనియు రావణుఁ దాఁకుదానఁ గాను•దక్క మింత
యతని వలతు ననుట•యది యేటిమాట యి,స్సీ యెఱుంగఁడతఁడు•చెనఁటియగుట.

తాత్పర్యము

రావణాసురుని నే నెడమకాలి గోటనైనఁ దాఁకు దానఁగాను. ఇదిసత్యము ఇఁక వానిని ప్రేమింతు ననుట యేమి మాట? ఛీ యింతమాత్రము వాఁడు తెలిసికొన లేకయున్నాఁడు. దీనికి వాఁడు సిగ్గువిడిచిన దుష్టుఁడగుటయే కారణము.

ఉ. తిట్టి తిరస్కరించిన మ•దిం దెలియండు, తలంపలేఁడు దాఁ
బుట్టిన వంశముం బరువుఁ•బోణిమియుం, దనుఁ దా నెఱుంగఁ డా
కట్టిఁడి, నన్ను వేఁడెడిని•గ్రార్యరతుం డయి, యేమి చేయుఁ దన్
గట్టి యముండు పాశముల•గట్టఁగ నీడ్వఁగఁ జావనున్నడన్. ౬౫౬

తాత్పర్యము

నన్నుఁ దాఁకుటకే యిష్టములేనిది నన్ను మోహించునా? యను జ్ఞానము లేదు. అంతటి యూహాబలము లేకుండినఁ బోనీ, నోరారఁదిట్టి ఛీ పొమ్మని ధిక్కరించినను తెలిసికొన లేకున్నాఁడు. అంతియగాక తా నెటువంటి వంశమునఁ బుట్టెను? దాని గౌరవమేమి? తా నెటువంటి వాఁడు? తన గౌరవమేమి? ఇట్లు పిత్రార్జితము స్వార్జితమైన గౌరవమునైన నాలోచించి, ఛీ మన గౌరవమేమి? ఈ యాఁడు దానిచేత నీ చీవాట్లేమి? యని యైనఁ దలఁపలేక క్రూరుఁడై బెదరించి నన్ను వశపఱుచుకొనఁ జూచుచున్నాఁడు. ఇది వాని దోషమా? కాదు. యముఁడు పాశములువేసి యీడువగాఁ జచ్చుటకు సిద్ధముగా నుండువాని కిటువంటి బుద్ధి గాక మంచి బుద్ధి చక్కని యాలోచన యెట్లు కలుగును. కాలబలముచే వాఁ డట్లు చేయుచున్నాఁడు.

—• సీతాదేవి రాక్షసస్త్రీలకుఁ బరుషంబుగఁ బ్రత్యుత్తర మిచ్చుట. •—

క. కోయుఁడు కడికండలుగా, వ్రేయుఁడు కత్తులను రోష•వివశత నన్నున్
ద్రోయుఁడు మండెడుమంటల, మీ యుక్తుల విన ని టేల•మిడిసిపడంగన్.

అర్థములు. కడికండలు=తునుకలు తునుకలు, కడికిఁ జాలినంత తునుకలు-నోటఁ బెట్టుకొనుటకుఁ జాలినంత చిన్నముక్కలు, మిడిసి పడంగన్=మిట్టిపడఁగా

తాత్పర్యము

మీ నోళ్ళు పట్టునంతచిన్న తునుకలుగాఁ గోసెదరా కోయుఁడు. కోపించి కత్తులతో నఱకెదరా నఱకుఁడు. మంటలలో వేసి కాల్చెదరా కాల్చుఁడు. మీ యిష్టమేమైనఁ జేయుఁడు. నేను మీ మాటలు వినను. ఏల మీకీ గర్వమున మిట్టిపడెదరు? నా దేహము మీకు వశము. మీ యిష్టము వచ్చినట్లు చేయుఁడు. మనస్సు నా స్వాధీనము. దానిని మీ రేమియుఁ జేయఁజాలరు. అని రాక్షసస్త్రీలకుఁ దెగజెప్పి మఱల రామధ్యానము చేయుచున్నది.

సీ. తనవారిపట్లనఁ • బెనుదోస ముండిన, గుణము మాత్రముఁ గనుఁ • గుణధనుండు
ఇంచుక యుపకార • మెవఁడు చేసిన దాని, విస్మృతి నొందని • విజ్ఞతముఁడు
తన్ను నమ్మినవాని • ఖిన్నతకై తాను, విరవిర లాడెడి • కరుణగలఁడు
అన్యుల యభివృద్ధి • నాత్మఁ గోరుచు నుండు, నిర్మలచిత్తుండు • నిపుణతముఁడు
తే. పదియునాలుగు వేల దు • ర్మదుల నొంటిఁ, జంపె రాక్షసులను జన • స్థానమునను
నట్టి నా ప్రాణభర్త దా • నిట్టికరుణ, మాలుటయునాదు దౌర్భాగ్య • మహిమ నేమొ.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి నన్నుపేక్షింప నేమి కారణము? ఆయన దయాగుణ విహీనుఁడా? యనినఁ గాదు. నీ వాఁడను అనిన వారియం దెన్ని గొప్పదోషము లుండినను వానిని లెక్కింపక వారి యందుండు మంచిగుణము మాత్రము గ్రహించు కల్యాణ గుణములు గలవాఁడు. ఇట్టివాఁడు నా దోషము లెన్నునా? (చూ. యుద్ధ. ౩౬౫) ఎంత కొంచె ముపకార మెవరొకటియైనఁ జేసినను దానిని మఱవని కృతజ్ఞుఁడు. ఇట్టి వాఁడింతకాలము నిర్వంచనముగాఁ దనసేవ చేసిన నన్ను మఱచునా? (చూ. అయోధ్య. ౧౧ ప.)

తనయందు విశ్వాసముగలవారి కేదైన దుఃఖము ప్రాప్తించెనా ఆదుఃఖము తనకు వచ్చినట్లు ఖేదపడువాఁడు. ఇట్టివాడు తన్నునమ్మి తనతోఁడఁదన నిమిత్తమై యడవులపాలైనదాని విషయమున బరితాప పడకుండునా (అయోధ్య ౬౬)పరుల యభివృద్ధికోరి ఇంకను నెవరెవరిని బాగుపఱుతునాయని సర్వజనశాశ్వత సౌఖ్యము గోరు వారికది (ముక్తి) లభింపఁ జేయువాఁడు. ఇట్టివాఁడు నామేలు గోరఁడా? (అయోధ్య. ౬౬) తన్ను రక్షించు సామర్థ్యములేక యూరకున్నాఁడా యనినఁ బదునాలుగువేల దుష్టరాక్షసులను జనస్థానమున నొంటిగఁ జంపెనే. అట్టి వాఁడు తమ్ముఁడు కూడఁ దోడై యుండఁగా నీ రాక్షసుని జంపుట గొప్పకార్యమా? కాఁబట్టి యిన్నికారణము లాలోచింపఁగా నామీఁద నాయనకు దయరాకుండుటకు నా దురదృష్ట మహిమయే కారణము. ఇట్టి భావము వాస్తవభక్తుని లక్షణము. భక్తుఁడు భగవత్కటాక్షము తన యందు రాదేని భగవంతుని తప్పుపట్టఁడు. ఆయన కటాక్షము వచ్చునంత యోగ్యత తనయం దింకను గలుగ లేదు. కావున ఆయన కటాక్షము వచ్చుటకు నాయందుఁగల లోపములను బూర్తిచేసి కొనెదనని తన్నుఁ దాను దప్పు పట్టుకొనునే కాని తాను జేయువలసిన గంతయుఁ జేసి పూర్ణ భక్తి సంపాదించి కొనినట్లు భగవంతుఁడు కఠినుఁడై యనుగ్రహింపనట్లు భావింపఁడు. ఎవఁడు తాను బూర్ణభక్తుఁడని తలఁచునో వాఁడు భక్తుఁడుగాఁడు. వాస్తవ భక్తున కింకను భగవత్సేవ చేయకపోయితినే యని యుండునే కాని వాఁడు సేనయందు దృప్తి వహింపఁడు. ఇది భక్తస్వభావము.

సీ. నన్నిట్టు లరికట్టు•ని స్సిచబలుఁ ద్రుంప, జాలియు న న్నేల • నేల రాఁడొ?
దండకను విరాధు•దండించినట్టి వీ,రాగ్రణి న న్నేల• నరయ రాఁడొ?
ఖరదూషణాదుల•ఖండించి వైచిన, శూరుండు న న్నేల•చూడ రాఁడొ?
రక్కసు చేతిలోఁ•జిక్కిన ప్రియురాలిఁ, బ్రోయాలి న న్నేల•ప్రోవ రాఁడొ?
తే. యుదధిమధ్యంబునను లంక•యుండుఁ గాక, యన్యులకు నెల్ల దుస్సాధ•మగును గాక
మహిమ జగముల నెందును•మాఱు లేని, రామబాణంబులకు నడ్డ•మేమి గలదు?

తాత్పర్యము

రామచంద్రమూర్తి శక్తిచాలక తన్ను రక్షింప రాలే దనుట సరిగాదని కొన్ని దృష్టాంతములచే నిరూపించు చున్నది.

న న్నీ ప్రకారము నిర్బంధించి బాధపెట్టు నల్పబలుఁ డగు రావణుఁ జంప నేల రాకున్నాఁడు? నా నిమిత్తమె కదా దండకాటవియందు విరాధుని వధించెను. నా నిమిత్తమై కదా ఖరదూషణాదులను సంహరించెను. అటువంటివాఁడు తనకుఁ బ్రియురాలను, ఇల్లాలను (ప్రోలు+ఆలు=ప్రోయాలు) న న్నేల రక్షింప రాకున్నాడు. అప్పుడు వారందఱు ముఖాముఖి యెదుటఁబడిరి. గావునఁ జంపఁ గలిగెను. వీఁడు సముద్రమధ్యమునఁ గానరాకున్నాఁడు. కావునఁ జంపఁ లేఁ డందునా? లంక సముద్ర మధ్యమున నుండిన నుండుఁ గాక. ఇతరుల కిచ్చటికి వచ్చుట యసాధ్యమైన నగును గాక. మూఁడులోకములందును నడ్డములేని రామబాణములకు నీ సముద్రమా యడ్డము.

విషజలాప్యయాత్ వ్యాళరాక్షసాత్ వర్షమారుతా ద్వైద్యుతానలాత్
వృషమయాత్మజాత్ విశ్వతోభయాత్ వృషభ తే వయం రక్షితా ముహుః॥

అను గోపికల వాక్యము స్మరించునది. కృష్ణసాన్నిధ్యమునకై రుక్మిణీ గోపికల పరితాప మెట్టిదో సీతాపరితాప మట్టిదిగా నెంచవలెను.

ఉ. నందియ నయ్యొ నా విభుఁడు • చాలఁడు నే నిట నుం టెఱుంగ, నీ
చంద మెఱింగి యున్న యెడ•సైచునె మానధనుండు; రామ! నీ
సుందరి రావణాసురుఁడ•సుమ్ము హరించె న టంచుఁ జెప్పఁడే
మందల వీడ తున్న నస•మానబలుం డల గృధ్రనాథుఁడేన్. ౨౬౦

అర్థములు. మానధనుండు=మానమే ధనముగాఁ గలవాఁడు, మందల=బ్రతుకుపాటు జీవితము.

తాత్పర్యము

నాయం దెంతయో ప్రేమగలవాఁడు, ఎన్ని యాపదలనుండియో దన్ను రక్షించినవాఁడు. నేఁడు నామీఁద దయతప్పినాఁడని కాని, శక్తిచాలక యూరకున్నాడని చెప్ప సాధ్యపడదు. అయిన నేల యూరకున్నాఁడు? నే నెచ్చట నుండునది యాయనకుఁ దెలియదని నా సందేహము. ఆ కారణముచే నూరకున్నాఁడుగాని,

తాత్పర్యము

తెలిసియుండిన పౌరుషశాలి తనభార్యను బరుఁ డపహరించె నన్న యవమానము నెట్లు సహించును? సహింపఁడు. బొత్తిగాఁ దెలియక యూరకున్నాఁడా యనిన నట్లు చెప్పుటకు వలను పడదు. ఏలన జటాయుప్రాణము పోకయుండెనా యాయన నీ భార్యను రావణాసురుఁడు హరించెనని చెప్పకుండునా? చెప్పియే యుండును గాని రామచంద్రమూర్తి వచ్చునంతకు నతఁడు జీవించి యుండునో లేదో.

ఉ. అంతము నొందఁ జేసె నన•రాగ్రణి వీరు జటాయుఁ బట్టి, వా
డెంతటి తెంపు చేసెఁ గడు•వృద్ధుఁడు నయ్యును, ద్వంద్వయుద్ధమం
దింతల నంతలం జనక•యె డ్డెల చూపె మదర్థ, మక్కటా
యెంతకు లేఁడు నాదు దుర•దృష్టము కాలముగాదు వానికిన్. ౬౬౧

అర్థములు. అంతము=మరణము, ఇంతల నంతలన్=కొంచెపుఁ బ్రయత్నముతో, ఎడ్డెల=పరాక్రమము, మదర్థము=నా నిమిత్తము, ఎంతకు లేఁడు=ఎంత కార్యమైనను జేయఁజాలనివాఁడా? కాలము=అనుకూల కాలము.

తాత్పర్యము

పైఁది యాలోచన క్రమమందు జటాయువు స్మరణమునకు రాఁగా వానిని గుఱించి యనుకొనుచున్నది. రావణుఁడు వీరుఁడైన జటాయువును జంపెనుగాని, వాఁడు ముసలివాఁ డయ్యును ఎంత సాహసము చేసెను. నిరాయుధుఁడై ద్వంద్వ యుద్ధమందుఁ దన పరాక్రమ మంతయుఁ జూపెనుగాని, కొంచెముతో వీనిని విడిచెనా? వాఁ డేక నెంతదైనఁ జేసి జయించియుండును. నా దురదృష్టముచేతఁ గాలము వాని కనుకూలించి వచ్చినదికాదు.

సర్వం కాల మపేక్షతే విధివశాత్ నైవాస్మి కాలక్షమః॥

చండకౌశికమందు హరిశ్చంద్రవాక్యము

ఉ. నాయిట నుండు జాడ రఘు•నాయకుఁ డింత యెఱింగెనేని య
త్యాయతకోపఘూర్ణహృద•యంబున లోక మరాక్షసంబుగాఁ
జేయఁడె? యీనిమేషమున•సింధుపువం బెనుదమ్ము రేపఁడే?
మాయఁగఁ జేయఁడే? ఖలుసి•మానముఁ బ్రాణము నామముం బురిన్. ౬౬౨

అర్థములు. ఇంత=రావణాసురుఁడు నీ భార్యను హరించెను అను మూఁడు మాటలు మాత్రము, అత్యాయత=మిగుల విస్తారమైన, కోప=కోపముచే, ఘూర్ణ=తిరుగుడు పడుచున్న, హృదయంబునన్=మనస్సుచే, అరాక్షసము=రాక్షసులు లేని దానిఁగా, సింధుపువన్=సముద్రమును.

తాత్పర్యము

నే నీలంకలో నున్నదాన నను మాట మాత్రము తెలిసినవాఁడయ్యెనా రామచంద్రమూర్తి మిగులఁ గోపించినవాఁడై లోకమున రాక్షసుఁ డనువాఁడు లేకుండ జేయకుండునా? ఈ నిమిషమున సముద్రము నీళ్ళన్నియు నిగిరించి

దమ్ముల్లు రేఁగునట్లు చేయఁడా? ఈ దుష్టుని మానము ప్రాణము పేరు లంకా పట్టన మనువానిని రూపుమాపఁడా? కావున నిప్పటి కాయనకుఁ దెలియదనియే తలఁచెదను.

క. అప్పుడు గద రాక్షససతు, లిప్పుడు నే నేడ్చురీతి•నింటింట నెలుం
గొప్పఁగ విధవాకృతులన్, గొప్పగ నేడ్చెదరు గోలు•గోలున సతమున్.

అర్థములు. సతమున్=ఎల్లప్పుడు, జీవించి యుండువఱకు, నే నిప్పుడల్ప కాల మేడ్చిన వారు కలకాల మేడ్తురు.

తాత్పర్యము

ఈ రావణుని నూరుపేరు లేకుండ నెప్పుడు రామచంద్రమూర్తి ధ్వంసము చేయునో యప్పుడు నే నిప్పు డేడ్చు విధముగా రాక్షసస్త్రీ లింటింటఁ బెద్ద గొంతుకలతో లబో దిబో యని విధవలై యావజ్జీవ మేడ్చుచుండెదరు.

చ. ఉడిగెడువాఁడు కాఁడు పురు•షోత్తముఁ డేగతి నైన నాదు పో
బడిఁ గనిపట్టి యిచ్చటికి•వచ్చుట సత్యము, వచ్చినంత నా
కడిఁదిబలాఢ్యులం గని క•కావిక లై చనువారు గాక క్రు
క్కడి సురవైరులా యుసురు•గాచుకొనం గలవారు మాత్రమే. ౨౮

తాత్పర్యము

రామచంద్రమూర్తి చూచుటకు ముందే జటాయువు మరణించె నను కొందము. ఆయన నా వార్త చెప్పలే దనుకొందము. అంతతో నావార్త రామ చంద్రమూర్తికిఁ దెలియకయే యుండునా? ప్రస్రవణగిరి యాశ్రమ సమీపమందే కదాయున్నది. ఏటి వెంట వెదకుచు వచ్చిన నచ్చటఁ జచ్చిన జటాయువు కనఁ బడియుండఁడా? రావణుని సారథి, చామరములు ధరించినవారు, తేరులోనైనవి నేను బాఱవేసిన భూషణములు కానరాకయుండునా? వీనినిఁబట్టి యెవ్వఁడో రాక్ష సుఁడు నన్ను హరించెనని యూహింపలేఁడా? అంతమాత్ర మనుమానము కలిగిన నవఁ డీ రాక్షసుఁడని పోఁబడి తీయకుండునా! వానరుల ముంకట సొమ్ములు వైచితినే, వారెవ్వరైనఁ జెప్పియుండరా! ఇంతకాలమునకు నావార్త చెప్పువారే లేక యుందురా? కాఁబట్టి యెట్టులైన నే నిందున్నానని తెలిసి యిచ్చటికి వచ్చు టయే సత్యము. అది తప్పదు. ఆబలశాలులు రామలక్ష్మణు లిచ్చటికి వచ్చిరా యీ రాక్షసులందఱు చెల్లాచెదురై పరువెత్తుదురే కాని తమ ప్రాణములను క్షణ మైనఁ గాపాడుకొనఁగలరా?

ఆ. పాడెరాసు లుండ•బాటల నిండఁగఁ, బొగిలి కాలు పీన్గు•పొగలు మింట
నెడము లేక యాడు•గృధ్రాళిగూడ నీ, వీడు వేగ వల్లె•కాడు కాదె. ౨౯

అర్థములు. వీడు=పట్టణము, వల్లకాడు=శ్మశానము. పొగిలి=కుమిలి.

తాత్పర్యము

స్పష్టము.

క. తూర్ణంబ నాదుకోరికి, పూర్ణం బగుఁ, జెడెడివారు♦పోలఁతులు! మీ మీ
దుర్ణయముల మీరే యిది, నిర్ణయముగ వినఁడు వెండి♦నిజముం గనుఁడీ.

అర్థములు. తూర్ణంబ=శీఘ్రముగ.

## తాత్పర్యము

ఓ స్త్రీలారా! నా కోరిక త్వరలోనే నెఱవేఱును మీ మీ చెడు కార్యముల మీరే చెడిపోదురు. ఇది నిశ్చయము. ఇప్పుడు వినుఁడు. తరువాత నిజమైనపుడు చూడుడు.

ఇది యంతయు దేహేంద్రియముల కన్వయింపవలెను.

చ. చెలఁగెడి నిప్పు డీ పురిని ♦ జేటును దెల్పెడు పెక్కులక్షణం
బులు, నిజ మీ పురంబు చెడి♦పోవును నిష్ప్రభమై, దశాననుం
డిలుగ దురాసదం బయిన♦యీ నగరంబు ముహూర్తమాత్రలో
పల సొబగా ఱెడిం గౌమరుఁ♦బ్రాయపురండను బోలి, చూడుఁడీ ౬౬౭

అర్థములు. నిష్ప్రభమై=కాంతిహీనమై, ఇలుగన్=ఈలుగన్ = చావఁగా, దురాసదంబు=ఇతరులకు లభింపనిది, కౌమరుఁ బ్రాయపురండ=లేఁత వయసు విధవ.

## తాత్పర్యము

ఈ పురము పాడైపోవు లక్షణములు పెక్కులు కానవచ్చుచున్నవి. ఈ యూరు కాంతిహీనమై చెడిపోవుట నిజము. ఇతరులకుఁ బ్రవేశింప సాధ్యముగాని యీ పురము స్వల్పకాలమున బాలవిధవవలె నందము చెడిన దగును. చూచుచుండుఁడు. 'వ్యభిచారరతా నారీ బాలరండాతు జాయతే' పోయిన జన్మమున అంకాడిన స్త్రీ యీ జన్మమున బాలవిధవ యగును. అట్లులే ఈ పురమింకను నెంతోకాలము బాగుండవలసిన దయ్యును నిండు వ్యభిచారము లెక్కువగుటచేఁ ద్వరలోనే పతిహీనయై పాడగును.

క. భాసురపుణ్యోత్సవములు, వాసిగ శుభలక్షణములుఁ♦పాయుచు విధవా
వాసం బగుచును బూర్వసు, వాసినివలె నుండు లంక♦పతి మరణింపన్. ౬౬౮

అర్థములు. విధవావాసము=ముండలకు నెలవు, పూర్వసువాసిని = ముందు ముత్తైదువుగా నుండునది. అనఁగా నిప్పుడు విధవ.

## తాత్పర్యము

పతియగు రావణుఁడు చచ్చిన కారణముచే నీలంక పుణ్యోత్సవములు శుభచిహ్నములు పోయినదై పుణ్యములగు పండుగలు పసుపు కుంకుమ కాటుక గంధము కమ్మలు పాపట మొదలయిన శుభలక్షణములు పోయిన విధవవలె విధవల కునికిపట్టై యుండును.

క. తడ వింక లేదు సోఁకుం, బడఁతులు బిడ్డా యటంచు•మగఁడా యనుచున్
గోషుకా యని యింటింటను, మిడుకన్నే వినఁగఁ గలను•మెలఁతుకలారా!

అర్థములు. తడవు=జాగు, సోఁకుంబడఁతులు=రాక్షసస్త్రీలు, మిడుకన్=దుఃఖింపఁగా.

తాత్పర్యము

స్పష్టము.

క. దిగ్ధాము లెఱుఁగ హతపల, భుగ్ధీరము నిష్ప్రభంబు•పుర మగును నసం
దిగ్ధము రఘువరశరశుచి, దగ్ధం బై ముగ్ధలార!•తథ్యము కనుఁడీ. ౬౭౦

అర్థములు. దిగ్ధాములు=దిక్కుల నుండువారు, హత=చంపఁబడిన పలభుక్+ధీరము=రాక్షస వీరులు గలది, నిష్ప్రభంబు=కాంతి చెడినది, అసందిగ్ధము=సందేహము లేదు. రఘువరశర=రామచంద్రమూర్తి బాణముల నెడి, శుచి=అగ్నిహోత్రముచే, దగ్ధంబై=కాలినదై.

తాత్పర్యము

దిక్కులందుండువారికిఁ గూడఁ దెలియునట్లు ప్రసిద్ధముగా మూఢలారా! రామబాణాగ్నిచేఁ గాలి యీ పురము కాంతిహీనమై మాంసభోజు లగు రాక్షసులు చచ్చినదై పట్టణము నిస్సందేహముగఁ బాడగును. ఇది నిజమగును. చూచుచుండుఁడు,

ఇదంతయు సీతాదేవి భూమియందు నాకాశమునందుఁ గానవచ్చు శకునములఁ బట్టి చెప్పె నని తెలియ నగు. ఉత్పాత చిహ్నము లనిష్టసూచకములు.

క. ఆ నీచ పంక్తికంఠుఁడు దా నోసఁగిన గడువు ముగియ•దాపయ్యె మదిన్
మీ నైరృతు లెఱుఁగరు సువిధానం బుత్పాత మిపుడు•కలకొనుఁ జుండీ.

అర్థములు. నీచపంక్తికంఠుఁడు=నీచుఁడు పంక్తికంఠుఁడు, నీచశబ్దము వృద్ధాదులలోఁ జేరినది, కావున దుష్టులోపము. "న న్మొచ్చుఁడు బాహుగర్వమున నీచ సుయోధనుఁడు" భార. ఉద్యో. దాపు=సమీపము, నైరృతులు=రాక్షసులు, సువిధానంబు=చక్కఁజేసికొను విధము.

తాత్పర్యము

ఆ నీచుఁడగు రావణాసురుఁడు నాకు సంవత్సరము గడువిచ్చెను. అది తన చావు గడువు. అది సమీపించుచున్నది. ఆ గండ మెట్లు తప్పించుకొనవలెనో మీ రాక్షసు లెఱుఁగరు. కావున నుత్పాత మిపుడే పుట్టును. చూడుఁడు.

క. మాంసము నమలెడి దుష్టనృ, శంసులు ధర్మం బెఱుంగఁ•జాలర యసువుల్
హింసింతురు నన్ రాక్షస, పాంసను వలువాతికూటి•వ్యంజనమునకై. ౬౭౧

అర్థములు. నృశంసులు=క్రూరులు, రాక్షసపాంసను=నీచరాక్షసుని యొక్క, వలువాతి=ఉదయకాలమందలి.

### తాత్పర్యము

ఈ లంక పాడగుటకుఁ బ్రారంభింపఁగా మాంసము నమలెడి క్రూరులకు బుద్ధి తక్కువగావున ధర్మమార్గమున నపాయము తప్పించుకొను మార్గమెఱుంగక నా వలన నీ కీడు మూఁడె నని రావణాసురుని ప్రొద్దుటి కూటికి సాధకముగ నన్ను హింసింతురు.

ఆ మాత్రమునఁ గీడు తప్పదు. తన్ను మగఁడు కొట్టఁగాఁ దాను బిడ్డను గొట్టుదానివలె రామచంద్రమూర్తి తమ్ముఁ జంపఁగాఁ దాము నన్నుఁ జంపుదురు.

క. ఏమి యొనర్చితి రేనియు, నే మనగా నేర్తు నా హృదీశ్వరుఁ గరుణా
ధాముని రాముని వికసిత, తామరసదళాక్షు విడిచి తలరెడిదానన్. ౬౭

అర్థములు. వికసిత తామరస దళాక్షున్=వికసించిన తామర రేకులవంటి కన్నులు గలవానిని, హృదీశ్వరున్=ప్రాణనాథుని-భర్తను.

### తాత్పర్యము

నా ప్రాణేశ్వరుఁడు దయాస్థానము. తామర రేకులవంటి కన్నులు గల రామచంద్రమూర్తిని విడిచి యేడ్చు నేను మీ రేమి చేసిన నే నేమి చేయఁగలను?

క. పతిఁ బాసి యుండు నీ గతి, వెత గుడుచుట కన్న నిది గోవిషముం గొను మం
చితవుగ నిచ్చెడి కరుణా, వతి యుండినఁ జననె కనఁగ వైవస్వతునిన్. ౬౮

అర్థములు. కరుణావతి=దయగలది, వైవస్వతునిన్=యముని, కనఁగఁ జననె=చూడఁబోనా=చావనా?

### తాత్పర్యము

స్పష్టము.

ఉ. ఇక్కడఁ బ్రాణయుక్త నయి యేడ్చుచు నుండుట లక్ష్మణాగ్రజుం
డక్కడఁ దా నెఱుంగఁడొ కటా! యొక యింత యెఱింగి యుండినన్
జక్కఁగ రోయ కేలుడుగుత్త్వాత్మతల మెల్లను? నన్నుఁ బాసి లోఁ
ద్రెక్కొను శోకవేగమున వీటా నాకో? యిఁక నేమి సేయుదున్. ౬౯

అర్థములు. ఇక్కడన్=ఈలంకాపురమందు, ప్రాణయుక్తనయి=ప్రాణముతో నున్నదాన నయి, లక్ష్మణాగ్రజుండు=లక్ష్మణుని కన్నయఁగు రామచంద్రమూర్తి, రామచంద్రుఁడనియే చెప్పరాదా యనిన రాముని విడిచినప్పటి సీతాదేవి దుఃఖము రామున కెట్లు తెలియఁగలదు? కన్నులారఁ జూచిన లక్ష్మణునకుఁ దెలియును. తనకుఁ దెలియకున్న లక్ష్మణుఁడు చెప్పియైన నుండఁడా? ఆవిధముగఁ దెలిసికొనవచ్చును గదా యని భావము. ఒకయింత=కొంచెమైనను, రోయక=వెదుకక, ఉడుగుచు=చాలించుకొనను.

### తాత్పర్యము

ఈ లంకలో నే నింకను బ్రతికి యేడ్చుచున్నదాన నని రామచంద్రమూర్తి

మెఱుఁగడు గాఁబోలు. తన్నుఁ బాసి నే నేడ్చు విధము లక్ష్మణుఁడు చెప్పుటచే నైన దెలిసియుండడా? భూమండల మంతయు వెదుకక యేల యూరకుండును. నాదుఃఖ విధము తెలిసి వెదకింపక యుండుటచే నడవిలో నా శోకముచే మర ణించెనేమో! ఇఁక నే నేమి చేయుదును?

క. ధన్యులు రఘుకులనృపమూ,ర్ధన్యుని నా హృదయాధినాథు•రాముని నతరా
　జన్యుని రాజీవాక్షుని, మాన్యునిఁ గను దేవసిద్ధ•మౌనిప్రవరుల్. ౬౮౬

తాత్పర్యము

౬౪౬ పద్యముఁ జూచునది, అందు రామదర్శన భాగ్యము గల యీలోక జనులు ధన్యులని చెప్పఁబడెను. ఇందు ఆయననే పరలోకంబునఁ జూచు దేవతలు సిద్ధులు మౌనులు ధన్యులని చెప్పఁబడెను. ఇం దే రూప గుణ విశేషములు చెప్పఁ బడెనో యం దా గుణవిశేషములే చెప్పఁబడెను. ఇట్లిహలోకమూర్తికిఁ బరలోక మూర్తికి భేదము చెప్పఁబడెను.

'భక్తాస్తే యాదృశే రూపే సంసారపదసంశ్రితాః తాదృశం తే సమీక్షంతే, పరమవ్యోమవాసినః॥ సంసారమం దున్నప్పుడు భక్తు లెట్టి రూపమునం దాస క్తులై చూడఁగోరుదురో పరమపదమం దట్టి రూపమునే వారు చూడఁగలరు. ఇందు సీతారాముల సేవించుచు ముక్తు లగువారికిఁ బరమపదమందు భగవంతుఁడు సీతారామమూర్తిగనే కానవచ్చును. కృష్ణుని సేవించువారికి కృష్ణుడుగానే కాన వచ్చును. భయంకరమూర్తులయిన భూతాదుల పతుల సేవించు తామసులకు భూతపతులుగానే కానవచ్చును. కావుననే శ్రీభాగవతమున సాత్త్వికులు భయం కర భూతపతుల వదలి సౌమ్యుఁడైన విష్ణువునే సేవింతు రని ప్రథమస్కంధమునఁ జెప్పబడెను. శంకరాచార్యులవారి తల్లి చరిత్ర స్మరించునది.

ఈ లోకమున సాధువులలోఁ గలసి వర్తించు సాధువునకు సుఖము, సంతో షము గలదు. దుష్టులతోడ వర్తించు సాధువునకు సుఖము లేదు. అట్లులే ఇచ్చటి సాత్త్వికునకుఁ బరలోకమున సాత్త్వికులతోఁ గలిసినసుఖము, సంతోషముగలదు. ఇచ్చట మిశ్ర సాత్త్వికుఁ డనఁగాఁ గొంత సత్త్వగుణము, కొంత తమోగుణము గలవాఁడు. పరలోకమున భూతప్రేతపిశాచములతోఁ గలసి వర్తించుట సుఖ సంతోషకరముగాదు. కావున సాత్త్వికులు సత్త్వగుణము గల భగవంతునే యారాధింపవలెను.

క. పరమాత్ముఁడు ధీమంతుఁడు నిరతము ధర్మైకరతుఁడు•నృపఋషి యగునా
　వరశీలున కా లయినం, బరఁగెడి నా వలన నేమి•ఫల మాయనకున్. ౬౯౯

అర్థములు. పరమాత్ముఁడు (౧) ఆత్మల కన్నిటికిఁ బరముఁడైన వాఁడు, (౨) శ్రేష్ఠమైన స్వభావము గలవాఁడు, ధీమంతుఁడు=బుద్ధిమంతుఁడు, ఆశ్రితుల నెట్లు రక్షింతునా యను నాలోచన గలవాఁడు, ధర్మైకరతుఁడు=ధర్మమునందే ప్రీతిగలవాఁడు, నిరతము=ఎల్లప్పుడు, నృపఋషి = రాజులందు ఋషివంటి

వాఁడు. 'విద్ధి మాం ఋషిభిస్తుల్య' మ్మని కైకకుఁ జెప్పెనుగదా. ఋషి యనఁగా ద్రష్ట, చూచువాఁడు అని యర్థము. నృపఋషి యనఁగా జీవకోటులను బాలించు విధమునందే దృష్టిగలవాఁడు. వరశీలునకు=ఉత్తమ సదాచారము గలవానికి, ఆలు=భార్య.

## తాత్పర్యము

రామా రామా రామా యని నే నంగలార్చుచున్న దాననుగదా! రామచంద్రమూర్తి తోడి సాంగత్యము వలన నాకు మేలా? ఆయనకు మేలా? రామచంద్రమూర్తి పరమాత్ముఁడు, జీవాత్ముల కన్నిటి కంటెఁ బరముఁడైన వాఁడు. ఆయన స్వరూప స్వభావములు జీవాత్ముల స్వరూప స్వభావములకంటె నుత్తమమైనవి. ఆయన సర్వజ్ఞుఁడు. ఎవ రెవరి విషయమున నెట్లు తాను బ్రవర్తించిన వారు బాగుపడుదురో యా విధము చక్కఁగఁ దెలిసినవాఁడు, తెలియుట మాత్రమే కాక జీవకోటి యుద్ధారణమందే సర్వదా యాసక్తిగలవాఁడు. రాజమాత్రుఁడా యనిన, రాజులందు ఋషివంటివాఁడు. జీవకోటులఁ బాలించు నాలోచన గలవాఁడు. ఇట్టి సదాచార సంపత్తిగల వానికి నేనో యాయన ఆజ్ఞకు లోఁబడి యాయన నియోగించినట్లు పని చేయుదానను. నే నాయన విషయమై పొరపడి వక్రముగఁ బోవుటయుఁ గలదు. ఇట్టి నావలన నాయనకేమి మేలుగలదు. నా మేలునకై యాయనను నేను సేవింప వలయును. నేను సేవింపకుండినంత మాత్రమున నాయనకు రాఁగల లోపము లేదు.

దీనివలన జీవాత్మలు భగవంతుని సేవించుట తమ మేలు కొఱకకాని యాయన నుద్ధరింపఁ గాదు. జీవాత్మలు సేవింపకుండినంత మాత్రమున నాయనకు రాఁగల లోటు లేదు. లోకమున సర్వవిధముల సమానమైనవి రెండుపదార్థములు లేవు. ఎందుఁజూచినను గొంచెమైన హెచ్చుతగ్గులే కానవచ్చును. హెచ్చు దానిని తక్కువది తన మేలునకై యాశ్రయింపవలసి యున్నది. అట్టులే భగవదంశము లైన జీవాత్మలు పరమాత్మను సేవించుట తమ మేలునకే. వీరి సేవవలన నవాప్త సమస్త కాముఁడైన భగవంతునకు రాఁగల లాభమేమియు లేదు.

ఆ. కంటి కెదుర నున్నఁ • గడుఁ బ్రేమ గలుగును
మఱుఁగుపడిన మైత్రి • మఱపు గలుగుఁ
తథ్య మద్ది యగుఁ గృ • తఘ్నులయం, దెదఁ
బ్రేమ మఱవఁ డెపుడు • రామవిభుఁడు. ౬౭౪

## తాత్పర్యము

రామచంద్రమూర్తి రాజుగదా! రాజులు తమ యెదురుగ నున్నవారి నెక్కువగఁ బ్రేమించుటయుఁ, జాటుగనున్న వారిని మఱచి పోవుటయుఁ గలదు. ఆకారణమున నెదురుగా నున్నప్పు డెంతో ప్రేమగలవాఁడై యుండుట నాస్తవమే.

ఇప్పుడు కనుచాటగుటచే మఱచియుండునేమో. ఆ కారణమున నా విషయమై వెదకుటగాని, యిచ్చటికి వచ్చుటగాని యాలోచింపలేదేమో యందునా? కృతఘ్నులందుఁ గనుచాటు వారిని మఱచు గుణము గలదు. రామచంద్రమూర్తి కృతఘ్నుండనుగాఁడే. ఒక్క యుపకారము చేసినను గలకాలము దానిని స్మృతి యం దుంచుకొనువాఁడే. అట్టివాఁడు నన్ను మఱచునా! చాటుగ నున్నప్పుడొక విధముగ, నెదురుగ నున్నప్పుడొక విధముగ నే నుందునేమో కాని యాయన ప్రత్యక్షమందుఁ బరోక్షమందు నేకవిధముగ నుండును. సమక్షమున నే నుపేక్షింతు నేమో యనుటకు భగవద్గీత యందలి

ద్వి. నీ యిట్టి మహిమను నే నెఱుంగమిని. నో యచ్యుతా చెల్మినో పొరపడినొ
యో యాదవాయని, యో కృష్ణయనుచు, నోయి సఖాయని యూహించి చెలిమి
గేలిసేయుచు నిన్నుఁ గ్రీడల భుక్తి, వేళల నాసన వేళల నొంటి,
పాటున నేన్ బెద్దవారి సన్నిధినో, మాటలాడిన యవమానంపు నుడుల,
నప్రమేయా! కృష్ణ! యాత్మ క్షమింపు.

అను నర్జున వాక్యంబులు స్మరించునది, అరణ్యమునకు నిన్నుఁ బిలుచుకొని పోనని రామమూర్తి చెప్పినపుడు సీతాదేవి నలుగురిలో నవమానకరముగ మాటలాడలేదా? ఏకవచనమునఁ బిలువలేదా? రామచంద్రమూర్తి యిట్టి మాటలాడెనా? రావణ వధానంతరము మాటలాడలేదా? యనిన నది నైమిత్తికము. ఆమె మహిమ లోకమునకుఁ దెలుపుటకే కాని క్రోధముచేఁ గాదు. జీవాత్మలు భగవంతుని విషయమున నెన్ని యపచారములైనఁ జేయుదురుగాని భగవంతుఁ డట్లు చేయఁడు. దూరముగా నున్న మాత్రమున బిడ్డలను దల్లిదండ్రులు మఱతురా? అట్లులే భగవంతుఁడును

ఆ. అంతమంచిగుణము • లమరవో నా యందుఁ, బుణ్యఫలము చూఱ • పోయెనేమొ
ప్రాణతుల్యుఁ డైన • భర్తచే విడువంగఁ, బడితిఁ బడతిఁ! గోడు • గుడుచుదాన.

## తాత్పర్యము

అంత ప్రేమ నీ యందు నీ భర్తకింకను గలదేని యేల రాలేదందువా? ఓసీ రాక్షసీ! చెప్పెద విను. అది యాయన లోపముగాదు. నన్నాయన యనుగ్రహింపఁ దగినంత మంచి గుణములు నాయందు లేవో, ఒకవేళ నుండినను వాని పుణ్యఫలము ప్రారబ్ధ వశమునఁ జెడిపోయెనో? ఆ కారణమున నాభర్తచే నేను విడువఁ బడితిని గాని యాయనకు నా యందు దయలేక కాదు. ఆయన నన్ను మఱచి పోవుటచేతను గాదు.

క. శూరుఁడు రణధీరుఁడు నరి, మారుఁడు సద్గుణధనుండు • మహాత్ముఁడు సూ
దారుఁడు రాముఁడు పాయుట, ధారిణి నే మనుటకంటెఁ • దగు మరణింపన్.

అర్థములు. అరిమారుఁడు=శత్రువుల సంహరించువాఁడు, సూదారుఁడు=సు+ఉదారుఁడు=మిక్కిలి గంభీరుఁడు. మనుటకంటెన్=బ్రతుకుటకంటె.

ఓసీ సీతా! నీ దోషమో, యాయన దోషమో ఆయన రాలేదు. నిన్నుఁ దోషాఁడని పోలేదు. ఇప్పుడు నీవు చేయబోవునది యేమనెదవా? అటువంటి శూరుఁడు యుద్ధమునం దటువంటి ధైర్యము గలవాఁడు శత్రుసంహారకుఁడు కల్యాణ గుణములే ధనముగాఁ గలవాఁడు గొప్ప స్వభావము మనస్సు గలవాఁడు మిగుల గంభీరుఁడు త్యాగియగు రామచంద్రమూర్తిని బాసి బ్రతికి యుండుటకంటెఁ జచ్చుటయే తగినపని.

మ. వనిలో వేరులు వెల్లఁకుల్ మెసవుచున్ • వర్జించి శస్త్రాస్త్రముల్
మనుజశ్రేష్ఠులు నన్నదమ్ములు వ్యథా•మగ్నాత్ములై పోయిరో?
యనయుం డీ యసురేశ్వరుండు కుటిల•వ్యాపారపారీణుఁ డే
మన శూరాగ్రణులన్ వధించె నొకొ మా•యాసంప్రయోగంబునన్. ౮౦౧

అర్థములు. మెసవుచున్=తినుచు, వర్జించి=వదలి; వ్యథామగ్నాత్ములై=శోకమునందు మునిఁగినవారై, అనయుండు=నీతిమాలినవాఁడు, కుటిల వ్యాపార పారీణుఁడు=మోసకృత్యములందు గడితేఱినవాఁడు, మాయాసంప్రయోగంబునన్=మోసగించుటచేత, ఈ పద్యము పై పద్యమునకు ముందుండుట బాగు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యేల రాలేదందువా? దానికి రెండు కారణములు గలవు. ఒకటి యడవిలో ఆకులలములు వేరుఁ బెల్లకులు దిని శస్త్రాస్త్రములు వదలి నాయెడఁబాటు వలనఁ గలిగిన దుఃఖము చేతను అవమానము చేతను శోకమున మునిఁగి యన్నదమ్ము లిరువురు మరణించియైన నుండవలెను, లేదా? న్యాయము దప్పి చరించు నీ రావణుఁడు వంచనయందు గడితేఱినవాఁడు కావున నేదే మోసముచే వారిని జంపియైన నుండవలెను. వాడు మరణించి యుండుటచే రాలేదేమో కాని జీవించియే యుండిన రాక మానరు.

క. ఇంతటి దురవస్థలఁ బడి, యింతటి దుఃఖంబుఁ గుడుచు•హీనాత్మకుఁ దా
నెంతో సుఖదము మరణం, బంతకునకుఁ గరుణ లేదు•హా! నామీఁదన్.

అర్థములు. హీనాత్మకు=నీచురాలికి, అంతకునకున్=యమునకు.

తాత్పర్యము

ఇంత దుర్దశలకుఁ బాలుపడి యింతకష్ట మనుభవించు నీచురాలికి దీనికంటెఁ జచ్చుటే సుఖకరము. కాని యమునకు నామీఁద దయరాలేదు. అయ్యో నేనేమి చేయుదును?

క. ఎంతటిధన్యులో మును లా,వంతయు నే వంత లేక•త్యక్తకలుషులై
స్వాంతమునఁ బ్రియాప్రియంబుల, పొంతలఁ బోనీరు విజిత•బుద్ధీంద్రియులై.

అర్థములు. ఆవంతయున్=ఆవగింజంత యైనను, వంత=వ్యసనము

త్యక్తకల్మషులై=వదలిపెట్టఁబడిన పాపములుగలవారై, కలుషము=ద్వంద్వము, స్వాంతమున్=మనస్సును; ప్రియాప్రియంబులన్=ఇష్టములయొక్క యనిష్టముల యొక్క, పొంతలన్=సమీపమందు, విజితబుద్ధీంద్రియులై=జయింపఁ బడిన మనస్సు ఇంద్రియములు గలవారై.

తాత్పర్యము

మనస్సును నింద్రియములను జయించిన వారై శీతోష్ణములు సుఖదుఃఖములు లాభాలాభములు లోనగు ద్వంద్వము లనఁబడు కలుషముల వదలినవారై మనస్సును బ్రియమునకుఁ గాని యప్రియమునకుఁ గాని సమీపమునకైనఁ బోనీయక సుఖము వచ్చిన సంతోషింపక యప్రియము వచ్చిన దుఃఖింపక రెంటను నేకవిధముగ నుండి కొంచమైన నే వ్యసనము లేకయుండు మునీశ్వరు లెంత పుణ్యాత్ములో.

క. ప్రియమున సంతోషం బ ప్రియమున నధికముగ భయము•పృథివి జనించున్
భయమును ముదమును విడిచిన,యయగుణులకు మ్రొక్కుదాన•నవహితమతినై.

అర్థములు. అయగుణులకున్=శుభము గలిగించు గుణములు గలవారికి, అవహితమతినై=హెచ్చరికతోఁ గూడిన మనస్సు గలదాననై.

తాత్పర్యము

దేహాభిమానము గలవారికిఁ బ్రియము కలిగెనా సంతోషము కలుగును. అప్రియము కలిగెనా భయము కలుగును. కావున మనస్సు ప్రియము మీఁదను అప్రియము మీఁదను పోకపోయెనా ముదములేదు, భయమూలేదు. కావున నట్టి శుభకరమైన గుణములు గలవారికి హెచ్చరిక గలదాననై మ్రొక్కెదను.

మును లని చెప్పుటచే నీ రెండు పద్యములు వానప్రస్థుల విషయ మని యేర్పడుచున్నది. అయినను నిది నాకు స్వధర్మము గావున నావిషయ మాలోచింపఁ బని లేదనుకొనుచున్నది.

క. కావున విదితాత్ముం డగు, కేవల మత్ప్రియుని రాముఁ•గీర్తితగుణునిన్
బో విడిచి పాపిదైత్యున, కే వశపడి యుండఁ గలనె•మృత్యువుఁ గందున్.

అర్థములు. విదితాత్ముండు=తెలియఁబడిన ఆత్మగలవాఁడు, కేవల మత్ప్రియుఁడు=నాకుఁ గేవలము ప్రియుఁడగువాఁడు. అంతకంటెఁ బ్రియమైనది నాకు లేదు. కీర్తితగుణునిన్=కీర్తింపఁబడిన గుణములు గలవానిని, పాపిదైత్యునకు=పాపపు రాక్షసునకు.

తాత్పర్యము

ఆత్మజ్ఞానము గలవాఁడై నాకుఁ బ్రియుఁడైన వాఁడొక్కఁడే యయి కీర్తింపబడిన సద్గుణములు గల రామచంద్రమూర్తిని విడిచి యాత్మజ్ఞానము లేక నా ప్రీతికిఁ బాత్రుఁడుగాక నింద్యగణములు గల పాపపు రావణాసురునకు స్వాధీనపడి యుండఁ గలనా? చావనైనఁ జచ్చెదను గాని.

◆ ౨౭-వ సర్గము. త్రిజట తన స్వప్నవృత్తాంతము రాక్షసస్త్రీలకుఁ జెప్పుట.◆

క. అనిన విని యామె మాటల, కును గింకిరిపాటు గదురఁ◆గొందఱు రక్షో
వనితలు దశకంఠునకున్, వినిపింపఁగఁ జనిరి సీత◆వృత్తాంతంబున్. ౨౭౬

అర్థములు. కింకిరిపాటు=కోపము.

తాత్పర్యము

సీతాదేవి చెప్పిన యీ మాటలు విని రాక్షసస్త్రీలు కోపించినవారై కొందఱు రావణాసురుని పాలికిఁ బోయి రాజా నీవు చెప్పినట్లు మే మామెను నయమున భయమునఁ జెప్పి చూచితిమి. మామాట విన లేదు. మరణింప యత్నించుచున్నది యని చెప్పిరి.

క. కొందఱు కరాళవదనలు, ముందర నిలుచుండి రామ◆ముదితం గని యో
మందమతీ! నీదు మాంసం, బిందఱమును గుడుతు మనుచు◆నేకార్థముగన్.

తాత్పర్యము

మఱి కొందఱు మిట్టపండ్లు గల నోళ్ళవారు సీతాదేవి కెదురుగ నిలఁబడి యోసీ బుద్ధిలేని దానా! యిప్పుడే నిన్నుఁ జంపి నీ మాంసము నిందఱము పంచుకొనెద మని యొక్క మాటగాఁ జెప్పిరి.

క. వారలను గాంచి నిద్దురఁ, దీరిన యొకవృద్ధ మేలు◆కొని త్రిజట యనన్
బేరుది యిట్టులు పలికెన్, మీరలు చాలింపుఁ డింక◆మీ మీమాటల్. ౨౭౮

తాత్పర్యము

అప్పు డచ్చట నిద్దుర పోవుచున్న యొక ముసలి రాక్షసి త్రిజట యనునది మేలుకని వారి మాటలు విని వారితో నిట్లనెను. మీ మీ మాటలు మీరు చాలింపుఁడు. అది తత్తఱపాటుచే లేచి కూర్చుండు నవకాశము లేక పరుండియే చెప్పుచున్నది.

క. మీ రకట సీతను రాముని, దారను జనకేంద్రసుతను◆దశరథు స్నుషనున్
జేరి భుజింతురు? పొండీ, దూరంబుగ నన్నుఁ దినుఁడు◆తొయ్యలులారా!

తాత్పర్యము

ఆడంగులారా! సీతాదేవిని, రాముని భార్యను, జనకరాజు పుత్రిని, దశరథు కోడలిని మీరా భుజించువారు. చాలుఁ జాలు, దూరముగఁ బొండు, ఆమెను బాధింపకుఁడు. మీరు తినవలె నని యున్న నామె బదులు నన్నుఁ దినుఁడు.

మ. కలఁ గంటిం జెలులార! యే నును మై◆కంపంబు పో దిప్పుడున్
దలఁపన్ దాని, సమూలనాశము సి◆ద్ధం బాశరశ్రేణి, కీ
నలినాక్షీమణిభర్తకున్ జయము మా◆నం బో దనన్, భీత ల
చ్చెలువల్ నీ కల యెట్టి దీ నిశ వనం◆జెప్పం దదీయార్థమున్. ౨౮౦

అర్థములు. మైకంపంబు=దేహమున వణుఁకు, ఆశరశ్రేణికిన్ = రాక్షస

సమూహమునకు, సమూలనాశనము=వేరుతోడ పాడైపోవుట, భీతలు=భయపడిన వారు, నిశన్=రాత్రియందు, తదీయార్థమున్=ఆ కలయందలి విషయమును. ఈ త్రిజట విభీషణుని కూఁతు రని కొంద అందురు.

### తా త్ప ర్య ము

అమ్మలారా! నే నొక కల గంటిని. నే నేమని చెప్పుదును. దానిని దలఁచు కొనిన నా దేహ మిప్పటికిని వణఁకుచున్నది. దానివలన రాక్షస సమూహము మూల ముట్టుగ నాశనము కాఁగలదు. ఈ సీతాదేవి భర్తకు జయము తప్పదు. అని చెప్పఁగా వారు భయపడి నీ వెట్టి కలగంటివి చెప్పుమన నా కలయందలి విషయ మా త్రిజట యిట్లు చెప్పెను.

సీ. ఆకాశగమనంబు • హంససహస్రంబు, గజదంతమయ మైన•కలికి పల్ల
కీలోనఁ దెల్లని•మాలికల్ చేలముల్, దాల్చి సుమిత్రాగ్ర•తనయుతోడ
రామచంద్రుఁడు వచ్చె•రమణీయశుక్లాంబ, రావృత యగుచు సీ•దేవి పాల
వెల్లిలోపల నున్న • వెల్లనిగట్టుపై, భానునితోఁ బ్రభ•పరఁగునట్లు
ఆ. రామచంద్రుతోడ•రంజిల్లఁ గంటిని, ధరముఁబోలి నాల్గు•దంతములను
మీఱుచున్న గజము•మీఁద సలక్ష్మణుఁ, గౌసలేయు నరుగఁ•గంటిఁ గలను.

అర్థములు. ఆకాశగమనంబు=ఆకాశమున బోవునది, గజదంత మయము= ఏనుఁగు దంతముతోఁ జేసినది, శుక్లాంబరావృత=తెల్లని వస్త్రము కట్టుకొన్నది, పాలవెల్లి=క్షీరసముద్రము, గట్టు=పర్వతము, ధరము=పర్వతము, కౌసలేయున్= రామచంద్రమూర్తిని.

### తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి యాకాశమునం బోవునట్టిదియు, వేయి హంసలు గట్టినట్టిదియు, తెల్లని యేనుఁగు దంతముతోఁ జేయఁబడినదియునగు పల్లకీలో తెల్లని పూలసరములు వస్త్రములు ధరించిన లక్ష్మణునితోడ వచ్చెను. ఈ సీతాదేవి యందమైన తెల్లని చీర గట్టుకొని పాల సముద్రమునందలి తెల్లని పర్వతము మీఁద సూర్యునితోడఁ బ్రభ యున్నట్లు లాయనతోడ నుండఁగంటిని. నాలుగు దంతములు గలదై కొండవలెనున్న యేనుఁగుమీఁద లక్ష్మణుతోడ రాముఁడు పోవఁగంటిని.

"ఆరోహణం గోవృషకుంజరాణాం, ప్రాసాద శైలాగ్ర వనస్పతీనాం, విష్ఠాను లేపో రుదితం మృతంచ స్వప్నేష్వగమ్యాగమనంచ ధన్యం" (స్వప్నాధ్యాయము)కలలందు ఎద్దులను, ఏనుఁగులను, మేడలను,కొండశిఖరములను, కాచు పూచు చెట్లను ఎక్కుటయు, మలము పూసికొనుట, ఏడ్చుట, చచ్చుట, పొంద రాని దానితోఁ బొందుట — ఇవి శుభములు.

క. వెల్లని వలిపపుఁ జేలలుఁ, దెల్లని మాల్యములు దాల్చి•ధీరోత్తము లీ
పల్లవపద చెంగట రం,జిల్లఁగ రఘుకులులఁ గంటిఁ•జిత్తం బలరన్. ౭౯-౨

తాత్పర్యము

తెల్లని దువ్వలువలు తెల్లని పూలదండలు ధరించి ధీరులలో శ్రేష్ఠులైన రామలక్ష్మణులు చిగుళ్ళవంటి పాదములు గల యీయమె ప్రక్కను సంతోషముతో నుండఁ గంటిని. అది చూడఁగానే నా గుండెలు పగిలెను.

తే. అంత నా పర్వతాగ్రంబు♦నందు మింటి, నంటి యుండిన గారుపై♦నబ్జమిత్ర
కులుని తొడమీఁద నెక్కి యీ♦కలువకంటి,తరణి చంద్రుల నంటు వి♦ధంబుఁగంటి.

అర్థములు. గారు=ఏనుఁగు, అబ్జమిత్రకులునితొడ=సూర్యవంశమునఁబుట్టిన రామచంద్రమూర్తితొడ, తరణి చంద్రులన్=సూర్యచంద్రులను.

తాత్పర్యము

ఆవల నా పర్వతము శిఖరమునందు నాకాశముఁ దాఁకుచున్న యేనుగుమీఁద రాముని తొడమీఁద నీ సీతాదేవియుండి సూర్యచంద్రుల, దాఁకుచున్నట్లు చూచితిని.

ఆదిత్యమండలం వాతు చంద్రమండలం మేవవా
స్వప్నే గృహ్ణాతి హస్తాభ్యాం రాజ్యం సంప్రాప్నుయా న్మహత్.

కలయందు సూర్యమండలముగాని, చంద్రమండలముగాని చేతులతోఁబట్టుకొన్నట్లు కవఁబడెనా వానికి గొప్పరాజ్యము లభించును.

క. రా కొమరులు రాజాస్యయుఁ, బ్రాకటముగ నెక్కినట్టి♦భద్రేభము నే
నాకసమున లంకపయిన్, జోకగ నిలువంగఁ గంటి♦సుందరులారా! ౨౫౪

అర్థములు. రాకొమరులు=రాజకుమారులు, రాజాస్య=చంద్రునివంటి ముఖముగలది, భద్రేభము=భద్రజాతి యేనుఁగు.

తాత్పర్యము

రాజకుమారులు రామలక్ష్మణులు చంద్రునివంటి ముఖము గల సీతాదేవి స్పష్టముగ భద్రజాతి యేనుఁగుపై నెక్కిలంకమీఁద నాకాశమున నున్నట్లుగంటిని.

క. అంచిత వృషభాష్టకముం, బూంచిన రథ మెక్కి పురుష♦పుంగవుఁ డిట కీ
చంచలలోచనతో నరు, దెంచుట నేఁ గంటిఁ గొఱఁత♦దెలియఁగ వినుఁడీ.

అర్థములు. వృషభాష్టకము=ఎనిమిది యెద్దులు, పూంచిన=పూనునట్లు చేసిన.

తాత్పర్యము

మంచి యెద్దు లెనిమిది కట్టిన తేరెక్కి రామచంద్రుఁ డీ సీతాదేవితో వచ్చుచుండుట గంటిని. తక్కిన కల చెప్పెద వినుఁడు.

తే. అర్కసన్నిభపుష్పకా♦ఖ్యాతదేవ, యానమున వారలీ గజ♦యానతోడ
నుత్తరంబుగ నరుగుట♦యుత్సవముగఁ, గన్నులారంగఁ గంటినేఁ♦గలను బండి.

అర్కసన్నిభ=సూర్యునితో సమానమైన, పుష్పక+ఆఖ్యాత=పుష్పకమను పేరు గల, దేవయానమున=విమానమునందు, వారలు=రామలక్ష్మణులు.

తా త్ప ర్య ము

సూర్యకాంతిగల పుష్పకవిమానమెక్కి రామలక్ష్మణులు ఉత్తరముగ నీ సీత తోడఁ బోవఁ జూచితిని.

క. ఆ విష్ణుపరాక్రముఁ డగుఁ ధీవిభవుఁడు రామవిభుఁడు ♦ తేజం బెసఁగం
గా వెలఁదియుఁ దమ్ముఁడుఁ దా, నీ విధమున నుండఁ గంటి♦నిది నిక్కం బౌ.

తా త్ప ర్య ము

విష్ణుపరాక్రముఁడు, మహాబుద్ధిశాలి యగు రామచంద్రమూర్తి సీతతోను; దమ్మునితోను నీ విధముగ నుండఁగా నేను జూచితిని. ఇది నిజమగును.

స్వప్నక్రమ మే మనఁగా:— రామలక్ష్మణులు పల్లకిలో నెక్కి సీతను గూర్చి లంకా సమీపమునకు వచ్చిరి. లంక దగ్గఱ పాలసముద్రమునందు నొక తెల్లనికొండ యా కలయందుఁ గనఁబడెను. అచ్చటికి రామచంద్రమూర్తి వచ్చి చేరెను. సీతయు నా కొండయం దుండినది. రామలక్ష్మణులు పల్లకి దిగి యేనుఁగుపై నెక్కి సీత యొద్దకు వచ్చిరి. సీతయు నేనుఁగుపై నెక్కి పెనిమిటి తొడపైఁ గూర్చుడి నిక్కి సూర్యచంద్రులను బట్టుచుండినది. ఈ విధముగ వారు లంక మీఁదికి నాకాశ మార్గమున వచ్చి యేనుఁగు దిగి యెనిమిది యెద్దులు కట్టిన తేరిపై గూర్చుండి లంకలోనికి వచ్చి పుష్పకము నెక్కి యుత్తర దిక్కుగాఁ బోయిరి.

క. పాపాత్ములు స్వర్గంబున, దాపున కరుగంగ లేని♦తద్గతి రామున్
రూపింప నైన నేరదు, సౌపర్వసురారిగణము ♦ సంగరవీథిన్. ౭౨౦

అర్థములు. సౌపర్వ=దేవతా సమూహములు, సురారిగణము=రాక్షస సమూహము, సంగరవీథిన్=యుద్ధరంగమందు.

తా త్ప ర్య ము

పాపాత్ములు స్వర్గము సమీపమునకైన నెట్లు పోలేరో యా విధముగ దేవ రాక్షససమూహములుయుద్ధరంగమందు శ్రీరామచంద్రమూర్తిని సమీపింపలేవు.

సీ. దశకంధరునిఁ గంటిఁ♦దైలలిప్తాంగుఁడై, తైలంబుఁ గ్రోలు చు♦న్మత్తుఁడగుచు
గన్నేరుపేరులు♦గళమున వ్రేలంగ, రక్తాంబరంబులు♦గ్రాలు చుండ
ముండుఁడై,కృష్ణాంబ♦రుండయి వెండియుఁ,బుష్పకంబున నుండి♦పుడమిఁగూలఁ
బడఁతి యీడ్వంగను♦బాధలు పడుచుండఁ, గంటి నేఁ గల సోఁకు♦కాంతలార!
తే. మఱియుఖరయుక్తరథమున♦మలయువాని,రక్తమాల్యానులేపన♦యుక్తుఁడగుచు
భ్రాంతమతి నూనెఁగ్రోలుచు♦గంతులిడుచు,నగుచు గాడిదపై దక్షి♦ణంబుగాఁగ.

అర్థములు. తైలలిప్తాంగుఁడై=నూనె పూసికొనిన దేహము గలవాఁడై, క్రోలుచున్=త్రాగుచు, ముండుఁడై=బోడితల గలవాఁడై, కృష్ణాంబరుం డయి= నల్లని గుడ్డ కట్టుకొన్నవాఁడై.

తాత్పర్యము

ఇఁక రావణు విషయమై యేమి కల గంటినో చెప్పెద వినుము. రావణుఁడు దేహమునకు నూనె రాచుకొని, నూనె ద్రావుచు దేహము తెలియనివాఁడై, గన్నేరు పూలదండలు మెడయందు వ్రేలాడ నెఱ్ఱవస్త్రములు గట్టుకొని బోడితల వాఁడై నల్లవస్త్రములు గలవాఁడై, పుష్పకమున నుండి యొక యాఁడుది యీడువఁగా నేలఁబడి బాధపడుచుండఁ జూచితి. మఱియు గాడిదలు కట్టిన తేరి మీఁద నెఱ్ఱపూలదండలు నెఱ్ఱ గంధము పూసికొని భ్రాంత చిత్తుఁడై నూనె ద్రావుచు గంతులు పెట్టుచు గాడిద మీఁద దక్షిణముగా.

సీ. చను చుండ వెండియు♦మన దశవదనుండు, తలక్రిందు గాఁగ గా♦ర్దభమునుండి
భయమోహితుం డయి♦పడుచు దిగ్గన లేచి, వెల వెల నై మద♦విహ్వలుండు
సాధ్వసార్తుండు నై♦జల్పాకుఁ డగుచును, దిగ్వాసుఁ డయి దిక్కు♦తెలియలేక
దుర్గంధ ఘోర మై♦దుస్సహతిమిర మై, నరకాభ మగు పెను♦బురదలోనఁ

తే. బడఁగఁ గనుఁగొంటిఁ గాళినాఁ♦బడఁతి యొక తె
రక్తవసనయు మఱియుఁ గ♦ర్దమవిలిప్త
దేహయును నయి మెడ గ్రుచ్చి ♦తిగుచు చుండె
దక్షిణపుదిక్కుగా మన♦రాక్షసేంద్రు. ౨౦౦

తాత్పర్యము

పోవుచు గాడిదనుండి తలక్రిందుగాఁ బడుచు, భయపడి దిగ్గనలేచి తెల్లఁబోయి మత్తుచే వికలుఁడై. భయపీడితుఁడై, వదరుచు, దిగంబరుఁడయి, దిక్కు తెలియక, గబ్బుగొట్టుచు భయంకరమై, సహింపరాని చీఁకటి గల నరకసమమైన పెనుబురదలో బడుచుండఁజూచితిని. కాళి యనెడి స్త్రీ యెఱ్ఱగుడ్డ కట్టుకొని బురద పూసికొని వాని మెడఁ గౌఁగిలించి దక్షిణ దిక్కుగా మన రాక్షసరాజు నీడ్చుచుండెను.

సీ. అల కుంభకర్ణుపై♦గలఁ గంటి నే నిట్టి, రీతిన మఱి దశ♦గ్రీవుసుతులు
నూనెఁ బ్రుంగుట గంటి♦దానవనాథుండు, పందిని నింద్రజి♦త్తలు మొసలిని
గుంభకర్ణుం డొంటె♦గొని వాహనములుగ, దక్షిణాదిశ కయి♦తరలఁ గంటి
వీరలలోన వి♦భీషణుం డొక్కఁడే, తెల్లనిగొడుగును♦తెల్ల చేల

తే. ములును తెల్లనిగంధంపుఁ♦బూఁతలు నయి, శంఖదుందుభినిర్ఘోష♦సంయుతముగ
నృత్తగీతాదు లొప్పఁభూ♦భృత్సమంబు, మేఘరావంబు నగునొక్క♦మేలిగజము

తాత్పర్యము

ఇఁక నా కుంభకర్ణుపై నిట్టి కల నే గంటిని. రావణాసురుని కొడుకులు నూనె మునుఁగుటఁ జూచితిని. రావణాసురుఁడు పందిని ఇంద్రజిత్తు మొసలిని, గుంభకర్ణుఁ డొంటెను, వాహనములుగాఁ జేసికొని దక్షిణదిక్కు ప్రయాణము చేయఁ జూచితిని. ఇందఱిలో విభీషణుఁ డొక్కఁడే తెల్లనిగొడుగు తెల్లవస్త్రములు తెల్ల

గంధపు బూఁతగలవాఁడై శంఖములయు భేరులయు ధ్వనులు గలుగఁగ ఆటలు పాటలు నొప్పకొండ వంటిదియు మేఘధ్వని గలదియు నగు నొక్క పెద్దయేనుఁగు నెక్కి.

తే. ఎక్కి నల్వురుమంతురు • లెసక మెసఁగ, మింటి తెరువునఁ బోవుచు • నుంటగంటిఁ
 ద్రావి చెంగావిగుడ్డలు • రక్తమాల్య, ములును దాలిచి వాదిత్ర • ములు చెలంగ.

తాత్పర్యము

నల్వురు మంత్రులతో విజృంభించి యాకాశమునఁ బోవుచుండఁ జూచితిని. త్రాగి యెఱ్ఱ గుడ్డలు ఎఱ్ఱ మాల్యములు ధరించి మేళతాళములతో నొప్పఁగాఁ జూచితిని. విఱిగిన గోపురములు తోరణములు గలదై రావణరక్షితమైన లంక సముద్రములోఁ బడఁగాఁ జూచితిని.

తే. సోఁకుమూఁకలు వెలయ నేఁ • జూడఁ గంటి, భగ్నగోపురతోరణ • పంక్తిగలిగి
 యసురనాయకరక్షితం • బైన లంక, వనధిలోపలఁ గూలంగ • గనితిఁ జుండు.

దీని తాత్పర్యముపై ౨౦౩ పద్యమున నిమిడి యున్నది.

క. ప్రాఁత యఁట రామునకు నొక్క, క్రోఁతి వెనవ్వచ్చి లంక • గుఱుకొనిబూదిన్
 జేఁతయుఁ; జేడెలు ప్రోఁతలు, కూఁతలునై చొచ్చి లంకఁ • గ్రోలుచునూనెన్

అర్థములు. ప్రాఁత=భృత్యుఁడు, గుఱుకొని = ప్రయత్నపూర్వకముగా, బూదిన్ జేఁతయు=భస్మము చేయుటయు చూచితిని.

తాత్పర్యము

మఱియొక విశేషము చెప్పెద వినుఁడు. రామునకు భృత్యుఁడఁట, ఒక క్రోఁతివచ్చి ప్రయత్నముతో లంకను గాల్చి బూడిద చేయఁగాఁ గంటిని. ఆఁడువారేడ్పులతో నూనె ద్రావి లంకలో.

క. వేఁడి యగుబూదిఁ గూలుట, మూఁడఁగ విభీ కుంభకర్ణ • ముఖ్యులు దమ దో
 వాఁడిమి చెడి పడఁ బొఱఁగఁ, బేఁడమడుంగునను గంటి • వెలఁదుకలారా. ౨౦౫

తాత్పర్యము

వేఁడి బూడిదలోఁ బడుటయుఁ గుంభకర్ణుఁడు మొదలగు ముఖ్యరాక్షసులు చచ్చి పౌరుషముచెడి పేఁడ మడుఁగులోఁ బడుచుండఁగఁ జూచితిని.

ఈ కలగన్నది త్రిజట. ఇది విభీషణుని కూఁతురని చెప్పఁబడెను. విభీషణుఁడు మొదటినుండియు సీతా పక్షపాతి. ఆ మెయం గభిమానము గలవాఁడు. ఆయన తన భార్యను కూఁతును బంపి సీతాదేవికి ననుకూలముగ వర్తింపఁజేయుచుండినవాఁడు ఇట్లగుటచేత రాక్షసస్త్రీలు సీతాదేవిని బెట్టుబాధ సహింపఁజాలక వారిని భయపెట్టుటకై తనబిడ్డ కిట్టి యుపాయము చెప్పెనాయని సందేహింపనగు ఇది ముసలిది. కావున విభీషణునిపుత్రి కాదేమో యని సందేహము. అదెట్లులుండినను తక్కినదంతయుఁ గల్పితమని తలంచినను క్రోఁతి వచ్చుట లంక కాల్చుట

యనునది యెవరికి నూహింపరాని విషయము. అట్టి కల వచ్చుట వెంటనే యది ఫలించుట యనునది స్వప్నమంతయుఁ గల్పితము కాదని స్థిరపఱచుచున్నది.

## స్వప్న విచారము

శూన్యవాదులు నాస్తికులు మాయావాదులు స్వప్నము లసత్యములందురు. ఈ వాదము శ్రుతిస్మృతీతిహాసపురాణాదుల యభిప్రాయమునకు ననుభవమునకు విరుద్ధమైనది. ఈ రామాయణమందే దశరథస్వప్నము, భరతస్వప్నము, త్రిజటా స్వప్నము మూఁడుగలవు. మూడును సత్యము లయ్యెను. పగటి కలలు ధాతు వైషమ్యముచే వచ్చు కలలు నసత్యము లగును గాని యారోగ్యవంతులై నిర్మల మనస్సు గలవారి స్వప్నములు సత్యములే యగును. అట్లు గాదేని స్వప్నవిష యము వాని ఫలములు గుఱించి చెప్పు శాస్త్రవాక్యము లన్నియు నున్మత్తప్రలా పములగును. అనుభవమందును నేటికిని ననేక స్వప్నములు సత్యము లగుచున్నవి. వాని నిరాకరించు టెట్లు? కావున వాని నసత్యము లనరాదు.

అట్లైన "కలలంబోలెడి పుత్ర మిత్ర వనితాగారాది సంయోగముల్" అని గ్రంథములు చెప్పుచున్నవే యనిన నవి యసత్యము లని చెప్పలేదు. అల్పకాల ముండి యావల వ్యర్థములై పోవునని చెప్పుచున్నవి. కలలో లభించిన డబ్బుకలలో సత్యమే కాని మేలుకొన్నప్పు డవి యెట్లు పనికిరావో యట్టులే ఈ సంసారవర్గము జీవించియుండు వఱకేగాని పుణ్యపాపములవలెఁ బరలోకమునఁగాని భక్తిజ్ఞాన ములవలె మోక్షదశయందుఁగాని పనికిరావు. కావున వ్యర్థములు. ఈ దేశపు నాణెము లీ దేశమునఁ జెల్లినను బరదేశమునఁ జెల్లవు. కావున వానికి విలువలేదు. వ్యర్థములు కావున పెండ్లాము బిడ్డలను కలలకుఁ బోల్తురు. దేహము నీరుబుగ్గవంటి దన్నప్పు డల్పకాల ముండునది యని యర్థమేకాని యసత్య మని యర్థముకాదు. ఎవరి యభిప్రాయ మెట్లుండినను రామాయణము స్వప్నములు సత్యము లనియే సాధించుచున్నది.

బృహదారణ్యకోపనిషత్తు 4.3-9

'తస్యవా ఏతస్య పురుషస్య ద్వే ఏవ స్థానే భవతః ఇదంచ పరలోక స్థానంచ; సంధ్యం తృతీయం స్వప్నస్థానం, తస్మిన్సంధ్యేస్థానే తిష్ఠన్నేత ఉభేస్థానే పశ్యతీదంచ పరలోకస్థానంచ. అథ యథాక్రమోయం పరలోకస్థానే భవతి తమా క్రమ మాక్రమ్యోభయాన్, పాప్మన ఆనందాంశ్చ పశ్యంతి; సయత్ర ప్రస్వపి త్యస్య లోకస్య సర్వావతో మాత్రా మపాదాయ స్వయం విహృత్య స్వయం నిర్మాయ, స్వేనభాసా స్వేన జ్యోతిషా ప్రస్వపిత్యత్రాయం పురుషః స్వయం జ్యోతి ర్భవతి"

అర్థములు. ఆ పురుషునకు(జీవాత్మకు) రెండుస్థానములే కలవు? ఈలోకము పరలోకస్థానము. మూఁడవది స్వప్నమను తృతీయస్థానము. అది ఇహలోకము నకుఁ బరలోకమునకు సంధిస్థానము, ఆ సంధిస్థానమందుండి ఈ లోకమును బర లోకమును రెండును జూచుచున్నాఁడు. (రెండు గ్రామముల సంధి పొలిమేర

మీఁద నిలువఁబడినవాఁడు రెండు గ్రామముల పొలమును జూచునుగదా) ఇట్లు సంధియం దున్నవాఁడై యీ లోకమున జాగ్రద్దశయందలి విషయములను బర లోకమున స్వప్నదశయందలి విషయములను జూచినవాఁడై పరలోకమార్గమును (తాను జేసిన పుణ్యపాప ఫలానుభవము కొలఁది) బట్టి పోయి స్వప్నప్రపంచ మందునిలిచి యీ లోకమున జాగ్రద్దశ యందలి పాపములను, స్వప్నమునఁ బర లోకమందలి సుఖములను జూచుచున్నాఁడు. భగవంతుడే వీనిని నిద్రపుచ్చునపుడు వానికి మేలుఁకొనినపు డున్న జ్ఞానమును ఇంద్రియములను దానే గ్రహించి బాహ్యేంద్రియముల నెల్ల నివర్తింపఁజేసి స్వప్న పదార్థములను వానివాని యదృష్టము కొలఁది సృష్టించి యా స్వప్నపదార్థములను దనజ్యోతిచేఁ బ్రకాశింపఁజేసి స్వప్నము నందలి యాలోచనము తానే ప్రకాశింపఁ జేయుచున్నాఁడు. అట్టి నిద్రయందుఁ బురుషుఁడు స్వయంజ్యోతియగుచున్నాడు.

౪-౩-౧౦. నతత్రానందా ముదఃప్రముదో భవం త్యథానందాన్ముదః ప్రముదః సృజతే; నతత్రరథా నరథయోగా నపంథానో భవం త్యథరథాన్రథ యోగా న్పథః సృజతే. నతత్ర వేశాంతాః పుష్కరిణ్యః స్రవంత్యో భవం త్యథ వేశాంతాః పుష్కరిణీః స్రవంతీః సృజతే సహికర్తా.

అచ్చట ఆనందము ముదము ప్రముదము లేవు. ఆనందము ముదము ప్రముదము సృజింపఁ బడుచున్నవి. అచ్చట (ఆ స్వప్నమందు) రథములులేవు. గుఱ్ఱములు లేవు. రథము పోవు మార్గములేదు. రథములు వానిగుఱ్ఱములు మార్గము సృజింపబడుచున్నవి. అచ్చట గుంటలులేవు, పుష్కరిణులు లేవు, నదులులేవు, గుంటలు పుష్కరిణులు నదులు సృజింపఁ బడుచున్నవి. వానికిఁ గర్త భగవంతుఁడే.

జీవుఁడు చేసిన పుణ్యపాపముల ఫలము ననుభవింపఁ జేయుటకై భగవంతుఁడు దానికి దానికిఁ దగిన పదార్థముల నప్పటి కప్పుడు సృజించుచున్నాఁడు. కావున స్వప్నమునఁ జూచునవి యసత్యములు గావు.

రెండు గ్రామములు సత్యములైనచో నడిమి పొలిమేర యసత్య మెట్లగును? కొందఱు జీవాత్మయే వీని నెల్ల సృజించుకొనుచున్నాఁ డందురు. కలలందుఁబ్రియముల వలె నప్రియములు కానవచ్చును గదా. ఎవఁడైనను దన కప్రియము లవు వానిని సృజించుకొనునా? కావున స్వప్నసృష్టికర్త భగవంతుఁడే. సృష్టికార్య మాయనదే కాని జీవునిది కాదు. ముక్తునకే యా యధికారము లేనపుడు బద్ధ జీవున కెం దుండి వచ్చును? స్వప్నములకు ఫలము గలదని ఛాందోగ్యోపనిషత్తునం దీ శ్లోకము గలదు.

"యదా కర్మసు కామ్యేషు, స్త్రియం స్వప్నేషు పశ్యతి
సమృద్ధిం తత్ర జానీయా, త్తస్మిన్ స్వప్ననిదర్శనే. ౫. ౨. ౯

ఎప్పుడు కామ్యకర్మములందు స్వప్నమున స్త్రీని జూచునో యప్పుడు వాని కభివృద్ధి గలదని తెలియవలెను.

స్వప్నము లసత్యము లైనచో వానికి ఫలముగలదా? ఫలము గలదనిశ్రుతి

చెప్పునా? ఇట్టులే. "స్వప్నే పురుషం కృష్ణం కృష్ణదంతంచ పశ్యతి, స ఏనం హంతి," ఐ. ఆర. ౩-౨-౪-౧౭. కలలో నల్లనివానిని నల్లదంతములు గలవానిని చూచెనేని వాఁడు వానిని జంపును. చూ. బ్ర. సూ. ౩-౨, ౪-౫; తై ౭, ౭.౧. బ్ర సూ ౩-౨-౬; ౩-౨-౪.

ఇఁక స్మృతు లేమి చెప్పుచున్నవో చూతము.

స్వప్నాధ్యాయమున బృహస్పతి—

స్వప్నాధ్యాయం ప్రవక్ష్యామి నానాస్వప్నసముచ్చయే
స్వప్నస్తుప్రథమే యామే సంవత్సర విపాకినం.
ద్వితీయే చాష్టభి ర్మాసై స్త్రిభిర్మాసై స్త్రియామికమ్
చాతుర్థే యామికే స్వప్నే మాసే నైకేన ఫలంభవేత్
అరుణోదయ వేలాయాం దశాహేన ఫలం భవేత్
ఏవం చానుదితేకాలే త్రిరాత్రంతు భవిష్యతి
గవాం దోహనవేలాయాం సద్యః స్వప్నఫలం భవేత్
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి స్వప్నపుణ్య ఫల ధ్రువమ్
వాతకం పిత్తకంచైవ చింతితం చానువర్జయేత్
అతిదీర్ఘం దివా దృష్ట్వా స్వప్నం తం పరివర్జయేత్
యస్తు పశ్యతి స్వప్నాంతే రాజానం కుంజరం హయమ్
సువర్ణం వృషభం గావః కుటుంబం తస్య వర్ధతే.
ఆరోహణం గోవృషకుంజరాణాం ప్రాసాద శైలాగ్రవనస్పతీనామ్
విష్ఠానులేపో రుదితం మృతంచ స్వప్నే ష్వగమ్యాగమనంచ ధన్యమ్
క్షీరిణం ఫలినం వృక్ష మేకాకీ యోఽధిరోహతి
తత్ర తస్య విబుద్ధస్య మృత్యు రిత్యేవ నిర్దిశేత్
యస్తు శ్వేతేన సర్పేణ......దంశితో భుజః
స హ స్తలాభ స్తస్య స్యా దపూర్ణే దశమే దినే
ఉరగో వృశ్చికోవాపి జటాకా దృశ్యతే యది
అవ్యయం చార్థసిద్ధించ పుత్రం తస్య వినిర్దిశేత్
ప్రాసాద శైల మారుహ్య సముద్రం తరతే నరః
అపి దాసకులేజాతః సోఽపి రాజా భవిష్యతి.
యస్తు మధ్యే తటాకస్య భుంక్తే వై ఘృతపాయసమ్
అఖండే పుష్కరే పత్రే తం విద్యా త్పృథివీపతిమ్
బలాకాం కుక్కుటీం క్రౌంచీం లబ్ధ్వా యః ప్రతిబుధ్యతే
సతుల్లా ల్లభతే కన్యాం భార్యాంచ ప్రియవాదినీమ్॥

స్వప్నాధ్యాయము నచించెదను. మొదటిజామున వచ్చిన కల సంవత్సరము

నకు ఫలించును. రెండవజామున వచ్చినది యెనిమిది నెలలకు ఫలించును. మూఁడవజామున వచ్చినది మూఁడునెలలలో ఫలించును. నాలుగవజామునవచ్చిన కల నెలకు ఫలించును. అరుణోదయ వేళ వచ్చిన కల పది దినములకు ఫలించును. సూర్యోదయమునకు ముందు వచ్చినది మూఁడు దినములలో ఫలించును. ఆవులు పితుకు వేళ వచ్చిన కల వెంటనే ఫలించును. ఇఁక స్వప్నముల పుణ్యఫలము చెప్పెదను. వాత పిత్తాదులవలనఁ గలుగునవి తా నాలోచన చేయుచుండు వాని విషయమై వచ్చినవి. అతిదీర్ఘమైనవి పగటి కలలు త్యాజ్యములు. స్వప్నాంత మందు నెవఁడు రాజును, ఏనుఁగును, గుఱ్ఱమును, బంగారును, ఎద్దును, గోవును జూచునో వాని కుటుంబము వృద్ధియగును, "ఆరోహణం గోవృషకుంజరాణాం" ఈశ్లోకార్థము ముందు వ్రాయఁబడినది. పాలుగాఱు చెట్లను, పండ్లచెట్లను నొంటరిగా నెవఁడెక్కునో వెంటనే వాఁడు మేలుకొనెనేని వానికి మరణదశ ప్రాప్తించును. పాముగాని తేలుగాని జలగ గాని కఱచెనేని విశేష ధనలాభము పుత్ర ప్రాప్తి గలదు. మేడయెక్కి సముద్రము దాటినట్లు కలగనెనేని దాసికులములోఁ బుట్టినవాఁడైనను రాజగును. తటాకమధ్యమున నిండు తామరాకు నందు నేతి పాయసమెవఁడు తినునో వాఁడు రాజగును. ఎవనికి నాఁడుకొంగ పెట్టకోడి క్రౌంచి లభించినట్లై మేలుకొనునో వానికి సత్కులమునఁ బుట్టి ప్రియవాదిని యైన భార్య లభించును. స్వప్నములు మిథ్యలైనచో నిట్టి ఫలము లెట్లు కలుగును.

శా. పొందీ చాటుగ లేచి రామవిభుఁ డీ•పూఁబోఁడిఁ గై కొంచు ను
 గ్రుండై రాక్షస కోటులం దునుముచోఁ • గోపించి మీ రిట్టు లు
 ద్దండత్వంబున నాత్మదారను బ్రియం•దర్జించి బాధించుటన్
 ఖండీభూతలఁ జేయకుండఁడు మిముం•గంజాక్షి సంప్రీతికై.			౨౦౮

అర్థములు. ఉద్దండత్వమునన్=విశేషముగ, ఆత్మదారను=తన భార్యను. ఖండీభూతలన్=తునుకలుగాఁ జేయఁబడిన వారిని.

తాత్పర్యము

రాక్షసాంగనలారా! లేచి చాటుగఁ బొండు. రాముఁ డీ సీతాదేవిని గ్రహించుటకై రాక్షసుల నెల్ల భయంకరుఁడై వధించునపు డీమెను తనభార్యను విశేషించి భయపఱచి బాధించుటచే నీమె సంతోషమునకుఁగాను మిమ్మెల్లఁ దును కలుగా నఱుకక మానఁడు.

క. మచ్చిక గల దని తన్నున్, నచ్చిన దని భార్య యని వ•నంబుల కెలమిన్
 వచ్చిన దని రఘునాయకుఁ, డిచ్చానకు నై వధించు•నెల్లయసురులన్.			౨౦౯

తాత్పర్యము

తనయందుఁ బ్రేమగలదని తన్ను నమ్మినదని తన భార్యయని తనతోడ నడవులకు సంతోషముతో వచ్చినదని రామచంద్రమూర్తి యామె నిమిత్తమై రాక్షసుల

నెల్ల జంపును. ౪౫౩ పద్యమును సూచునది. రామచంద్రమూర్తి దుంఖించుట కే కారణములు చెప్పెనో యా కారణములే త్రిజటయు రాక్షసవధకుఁ గారణము లుగాఁ జెప్పెను.

దీనివలనఁ దన యాశ్రితుల నవమానించిన వారిని భగవంతుఁడు సహింపఁడు, తీవ్రముగ దండించు నని సూచన. దోషము కొలఁది వంశనాశము చేయును. ద్రౌపది నవమానించిన కౌరవులు వంశనాశమై పోయిరి. సీతాదేవిని బాధించిన రావణుఁడు వంశనాశ మయ్యెను. దీనివలన పతివ్రత నవమానించువారు బాధించు వారు తప్పక వంశనాశ మగుదురు.

ఉ. చాలును జాలు రక్కసులు! సాధ్వసభాషలపుస్తకంబు లా
మూలను గట్టి వైవుఁ డిఁక మోసము వచ్చును, మంచిమాటలన్
లాలన సేయుఁ డీమె, మనలన్ క్షమియింపఁగ వేఁడుకొంటయే
పోలును, సీత యాత్మవిభుఁ బొందుట నిక్కము నిక్కలం గనన్. ౨౦౪

అర్థములు. రక్కసులు=రాకాసులారా! సాధ్వసభాషల పుస్తకంబులు= మీరు పాఠముగ నేర్చిన బెదరింపు మాటల పుస్తకములు, నిక్కల=నిజమైనకల.

తాత్పర్యము

రాకాసులారా! మీ మాటలు చాలింపుఁడు. మీరు పాఠముగ నేర్చు కొన్న బెదరింపుమాటల పుస్తకము లావలఁ బాఱవేయుఁడు ఇఁక నా పాఠములు నల్లించిన మన ప్రాణమున కపాయము వచ్చును. కావున మంచిమాటలచే సమ్మా తల్లి యని బుజ్జగింపుఁడు. ఇదివఱకుఁ జేసినదానికిఁ బ్రాయశ్చిత్తముగ క్షమింప వేడుకొంటయే తగిన కార్యము. నాది నిజమైన కల. దీనినిబట్టి చూడ సీత తన భర్తతోఁ గూడుకొనును.

క. వ్యసనంబుల మునిగిన యా, బిసజేక్షణవిషయ మిట్టి విధమున కలయుం
బొసఁగిన యేనియుఁ దత్సతి, వెస దుఃఖము బాసి సుఖిత వెలయును జుండీ.

అర్థములు. బిసజ+ఈక్షణ=కమలము వంటి కన్నులు గలది. బిసజేక్షణ విషయము=బిసజేక్షణ విషయమందు అని సప్తమ్యర్థమునఁ బ్రథమగఁ గాని బిసజేక్షణ విషయముగాఁ గల దని బహువ్రీహిగ నైన గ్రాహ్యము.

తాత్పర్యము

వ్యసనంబులందు మునిఁగి యున్న యే స్త్రీ విషయమున నిట్టి కల కలుగునో యా స్త్రీ దుఃఖములను బాసి సుఖించును.

క. అదరించియు బెదరించియు, ముదలించియు గాసి పెట్టి మో మన మేలా
సదయ యగు ననఁగ వలవదు, కదిసెంబో బెఁడద మనకుఁ గాకుత్స్థునిచేన్.

అర్థములు. ముదలించి=ఆజ్ఞపెట్టి, సదయ=దయతోఁ? గూడినది, బెడఁద= అపాయము.

తాత్పర్యము

సీతాదేవిని మన మదరింపలేదా బెదరింపలేదా నిర్బంధింప లేదా మన విషయమున నీమె యెట్లు దయ గల దగును? అనవలదు. మనకు రామునిచే నపాయము సమీపించినది. రావణుఁడు చానఁగానే మనము చేయుచున్న పనికి మనల నయ్యో పాప మని రక్షించు వా రెవరు?

క. ప్రణతిప్రసన్న జానకి, యణుమాత్రంబైన సందియము లేదు సుఁడీ
క్షణదాచరసతులారా, యణుమధ్యను వేడుఁడీ మహాపదఁ బాపున్. ౨౧౧

అర్థములు. ప్రణతిప్రసన్న=ఈమె నమస్కారముచేతనే సంతోషించునది. క్షణదాచరసతులారా=రాక్షసాంగనలారా! అణుమధ్యను=సూక్ష్మమైన నడుము గలదానిని.

తాత్పర్యము

ఈమెను నానావిధముల బాధించితిమే, మనయందు దయ దలఁచునా యని సందేహింపఁ బనిలేదు. ఈమె నమస్కార ప్రియురాలు, మన మెన్ని తప్పులు చేసి నను నిష్కల్మషమైన బుద్ధితో క్షమింపు మని వేఁడుచు నమస్కరించితిమేని శాంతి వహించి మనల నవశ్యము రక్షించును. మనకు రాఁగల మహాపాయమును నీమె తప్పఁ బాపువా రెవ్వరును లేరు.

"ప్రాయశ్చిత్త ప్రసంగేతు, సర్వపాప సముద్భవే
మా మేకాం దేవదేవస్య, మహిషీం శరణం వ్రజేత్॥"

సర్వపాపములు చేసి ప్రాయశ్చిత్తము పెట్టుకొనవలసి వచ్చినపుడు దేవదేవ మహిషినైన నన్ను శరణము పొందవలెను. "సర్వకామప్రదాం రమ్యాం, సంసారార్ణవ తారిణీం, క్షిప్ర ప్రసాదినీం లక్ష్మీం శరణ్యా మనుచింతయేత్॥" సమస్త కాంక్షల నిచ్చునదియు, మనోజ్ఞమైనదియు, సంసారసముద్రమును దాటించునదియు, శీఘ్రముగ ననుగ్రహించునదియు నగు లక్ష్మీదేవిని శరణుచొర దగ్గ యగు రక్షకురాలిని ధ్యానింపవలెను, అను వాక్యములు స్మరింపనగు

క. లక్షించి చూడఁగా నవలక్షణ మొకటైన లేదు లలిమీఁదు విశా
లాక్షి మెయిఁ గాన వల్లభ, సాక్షాత్కారంబు గలుగు జలజాక్షి కెటున్. ౨౧౨

అర్థములు. అవలక్షణము=చెడు చిహ్నము, సీతాదేవి బాగుపడఁగలదను టకు రెండవకారణము చెప్పుచున్నది.

తాత్పర్యము

కల యటుండ నింకు, ఈమె దేహచిహ్నములఁ బరీక్షించి చూచినను నీమెకు శాశ్వతముగఁ బతి వియోగము గలదని తెలుపు చెడు చిహ్నమొకటియైన లేదు. కావున భర్త యీమెకు సాక్షాత్కరింపఁ గలఁడు.

క. కేవలము వన్నె మాయుట, చే వనటం బడె నటంచు ♦ సెంకించితి నీ
దేవి యదుఃఖార్హాయ యగు, గావున దివ్యసుఖములను♦గలదు భుజింపన్.

అర్థములు. సెంకించితిన్=సందేహించితిని, అదుఃఖార్హాయ=దుఃఖపడ యోగ్యురాలు కాదు.

తాత్పర్యము

ఈమె దుఃఖముచేఁ గాంతి మాయుటచే నీమె భర్తను బాసి దుఃఖ మనుభవించునదిగో యని సందేహించితిని గాని యీమె దుఃఖింప నర్హురాలు గాదు. ఈమె దివ్యసుఖముల ననుభవింపఁ గలదు. సందర్భము లట్లుండుటచే నీమెను నిష్కారణముగ బాధించి వెనుక మన మేల బాధపడవలెను. ఈమెను బాధించుట వలన మనకు రాఁగల లాభ మేమి? ముఖకాంతి మాయుట కష్ట దశను దెలుపును.

చ. అదె యదె కంటిరే జలరు♦హాయతపత్రమువోలి మిక్కిలిన్
గదలెడి వామలోచనము ♦ క్ష్మాసుతకుం బ్రియసూచకంబునై
సుదతికిఁ గార్యసిద్ధియును ♦ పోకులజేనికి నాశనంబు దు
ర్మదపరకాలుఁడైన రఘు♦రామునకు న్విజయంబుఁ దెల్పుచున్. ౭౧౮

అర్థములు. జలరుహాయత పత్రము=కమలము యొక్క దీర్ఘమైన రేకు, వామలోచనము=ఎడమ కన్ను, ప్రియసూచకంబునై = మేలు సూచించునదై, పోకుల జేనికి=రాక్షస రాజగు రావణునకు, దుర్మద పరకాలుఁడు=చెడుగర్వము గల శత్రువుల పాలిటికి యముఁడైన వాఁడు.

తాత్పర్యము

నామాట యసత్యమేమో ప్రత్యక్షముగఁ జూడుఁడు. అదిగో నదిగో నామె యెడమకన్ను నిడివి తామరరేకు వంటిది యెట్లదరుచున్నదో చూడుఁడు. అది యీమెకు మేలు సూచించు చున్నది. ఈమె కోరిన కార్యము భర్తసమాగమము సిద్ధించును. రావణాసురునకు వినాశము, మదించిన శత్రువులపాలికి యముఁడైన రామచంద్రమూర్తికి గెలుపు తెలుపుచున్నది. స్త్రీల కెడమ కన్నదరుట శుభ సూచకము. ఇది మూడవ కారణము.

క. ఆకస్మికముగ జానకి, డాకేల్ పులకించి వడకె♦డాపలిదెస శుం
డాకారోరు వదరుచును, గాకుత్స్థపురస్థితిం బ్ర♦కాశముఁ జేసెన్. ౭౧౯

అర్థములు. ఆకస్మికముగన్=ఉన్నట్టులుండి, డాకేలు=ఎడమచేయి, పులకించి=గగ్గురు పొడిచి, డాపలిదెస = ఎడమప్రక్కన, శుండాకార = ఏనుగు తొండమువలె నున్న, ఊరువు=తొడ, కాకుత్స్థ పురస్స్థితిన్=రామచంద్రమూర్తి సమీపమందే యుండుట.

తాత్పర్యము

ఉన్నట్టులుండి సీతాదేవి యెడమచేయి గగ్గురు పొడిచి యదరెను.ఎడమతొడ

యదరెను. దీనివలన రామచంద్రమూర్తి సమీపమందే యున్నాఁడనుట సిద్ధము.

చం. నెలకొని శాఖలందుఁ గడు•నెమ్మది నుత్తమసాంత్వవాదియై
వెలసెడి పక్షి పల్కుచును•వెండియు వెండియు స్వాగతోక్తిఁ బే
రెలమిని వెండి వెండియును•బ్రేరణ చేసెడునట్లు గ్రాలెడున్
వల దిక నింద నిల్చి యతి•వన్ వ్యథపెట్టఁగఁ బొందు దవ్వుగన్. ౭౧౬

అర్థములు. ముందు తనకుఁ గల వచ్చెనని చెప్పెను. దాని కనుగుణముగా సాముద్రిక చిహ్నములను శుభశకునములను జెప్పెను. ఇఁక నంతకంటె బహిరంగమైన శకునము చెప్పుచున్నది. శాఖలందు నెలకొని, కడునెమ్మిగన్ = మిక్కిలి సంతోషముతో, వెండియు వెండియున్=మీఁద మీఁద, పలుమఱు; ఉత్తమసాంత్వవాదియై=మిక్కిలి మధురముగఁ బలుకుచున్నదై, పక్షి=పైఁడికంటి పక్షి, స్వాగతోక్తిన్=స్వ+ఆగత+ఉక్తిన్=స్వ=బంధువుల యొక్క, 'బంధుస్స్వస్వజనాస్సమా'యని యమరము. బంధువు రాకను గుఱించి మాటను, పేరెలమిని=మిక్కిలి సంతోషముతో, వెండి వెండియును=మాటి మాటికిని, ప్రేరణ చేసెడునట్లు=సీతాదేవిని ప్రేరించుచున్నదో యను నట్లు, రాముని కథను జెప్పుచున్నట్లు, గ్రాలెడిన్=ఒప్పుచున్నది. కావున నో రాక్షసస్త్రీలారా! మీ రిచ్చట నుండి యీమెను బాధపెట్టవలదు. దూరముపొందు. ఇది నాల్గవ కారణము.

(౨) శాఖలందున్=చిగిరించి పూచియున్న కొమ్మలందు, ఇట్టివే శాఖలనఁబడును. నెలకొని=నెలవుకొని=దృఢముగాఁ గూర్చుండి, కడు నెమ్మిగన్=ఫలాదులఁ దినుటచే మిగుల సంతోషముగ, ఉత్తమ సాంత్వవాదియై వెలసెడి పక్షి, పక్షి=గొప్ప ఱెక్కలు గలది, పక్ష+ఇ=పక్షి. ప్రశంసార్థమున మతుప్ప్రత్యయము. 'భూమనిందాప్రశంసాసు। నిత్యయోగేతిశాయినే। సంసర్గేస్తి వివక్షాయాం భవంతి మతుబాదయః'' అను ప్రమాణమును గ్రహించునది. అనఁగా ఱెక్కలు విచ్చి యాకసమున గుండ్రముగఁ దిరుగుచుండిన గరుత్మంతుఁడు–గరుడపక్షి యాకాశమునఁ జక్రాకారముగఁ బ్రదక్షిణముగఁ దిరుగుటయుఁ బచ్చికొమ్మపై దృఢమును గూర్చుండుటయు ఫలాదుల భక్షించుచు సంతోషముగ నుండుటయు శుభసూచకములు. కావుననే యుత్తమసాంత్వవాదియై వెలసెడు నట్లున్నది. పైనున్నయట్లగ పదము వలసిన చోటుల నెల్ల నన్వయించును. ఉత్తమ సాంత్వవాది = నీ భర్త శీఘ్రముగా వచ్చును, ఇది దుఃఖపడవలసిన కాలముగాదు, కావున దుఃఖపడవలదు, అని యూఱట మాటలాడుచున్నది. స్వాగతోక్తిని వెండి వెండియుఁబల్కుచును–నీభర్త దుఃఖము నీ దుఃఖ మంత్రమాత్రమేకాదు. ఇంతకంటె నెంతయో యధికము అని పలుమాఱు చెప్పుచున్నట్లు విరహిణులకుఁ జెప్పెడి స్వాగతోక్తి భర్త సంతాపాతిశయమును జెప్పుటయేయని యెఱుఁగనగు. కాఁబట్టియే కదా కాళిదాసుఁడు, "తపతి తనుగాత్రి మదన స్త్వామనిశం మాం పునర్దహత్యేవ, గ్లపయతి

తాత్పర్యము

యథా శశాంకం స తథా హి కుముద్వతీం దివసః'' అని శాకుంతలమునఁజెప్పెను. సన్నని దేహము గలదానా! మన్మథుఁడు నిన్ను దహింపఁజేసె నేని నన్నుఁగాల్చు చునే యున్నాఁడు. పగలు చంద్రు నేమి చేయుచున్నదో కలువతీఁగ నేమి చేయు చున్నదో చూడుము. (చూడు ౧౮౧౩-౧౮౧౫ ప)

నెండి వెండియును ప్రేరణ చేసెడునట్లు=ఇట్లీమె యొద్దకు రామచంద్రమూర్తి వచ్చుట నిశ్చయమైన పిదప నింకేల స్నానాలంకారాదులకై తామసించు చున్నది, ఏల త్వరపడరాదు అని సీతను ప్రేరించునట్లు క్రాలెడిని. ఆ పక్షిస్వరము విన్నప్పు డిట్లుగాఁ దోఁచు చున్నదని యుత్ప్రేక్షాలంకారము. పేరెలమిన్=భార్యాభర్తలు కూడుట తనకే గొప్పసంతోషముగా భావించి యీపక్షి యట్టి తనభావమును రోమాంచముచేఁ దెల్పుచున్నట్లున్న దని భావము.

(3) ఉత్తమము మధ్యమము అధమము అని కావ్యములు మూఁడు విధ ములు. “తను వగు శబ్దార్థంబులు, ధ్వని జీవ మలంక్రియా వితానము సొమ్ముల్, దనరు గుణంబులు గుణములు ఘనవృత్తులు వృత్తు లౌర కావ్యేందిరకున్” నరస- అని. కావ్యమునకు ధ్వని ప్రాణము. శబ్దార్థములు దేహము. కావున వాచ్యార్థమున కంటెను, ధ్వన్యర్థ మెందు విశేషించి యున్నదో యది యుత్తమ కావ్యము. వాచ్యార్థముకంటె ధ్వన్యర్థమెం దతిశయింపదో యది మధ్యమ కావ్యము. దీనినే గుణీభూతవ్యంగ్య మందురు. అనఁగా వ్యంగ్యము గౌణము, అప్రధానము అని యర్థము. ధ్వనియే లేనిది యధమ కావ్యము. కథల పుస్తకములవంటివి చిత్ర కావ్యములు. ఇట్టి ధ్వన్యర్థ మొక్కచోఁ బదమునను, ఒక్కచో వాక్యమునను, మఱొక్కచోఁ బ్రబంధ సమష్టి పైనను నుండుట గలదు. ఈ కాండమున ధ్వన్య ర్థము అనాదిగా భగవత్సంబంధము గల జీవుఁడు సంసారమునఁ జిక్కి బాధలు పడుచుండఁగాఁ నాచార్యుఁ డది చూచి తాళలేక వాని యుజ్జీవనార్థమై ప్రవర్తించు చున్నాఁడు అని. ఈ యర్థము ఈ కాండమున రెండవ పద్యమగు “తరువాత రావణాసుర వరసీత” యను పద్యముననే సూచింపఁబడెను. ఈ కాండమున లంకాశబ్దముచేత శరీరమును ఏకాక్ష్యాదులచేత నింద్రియములును రావణ కుంభకర్ణులచే నహంకారమమకారములును ఇంద్రజిత్తు లోనగువారిచే కామక్రోధాదులును సూచితము,లంకలో శ్రమపడుచున్న సీత యనుటచే సంసార మునఁ గష్టపడుచున్న జీవుఁ డనియు నట్టి జీవునికి భగవత్ప్రేరణమున జ్ఞాన ముప దేశింప వచ్చిన యాచార్యుఁడు హనుమంతుఁడనియు సూచితము. ఆయాచార్యుని లక్షణ మీ పద్యంబున సూచితము. శాఖలందున్ = వేదశాఖలందు-నెలకొని= (౧) దృఢముగానుండి; వేదశాఖలను మఱవక దృఢముగా జ్ఞప్తియం దుంచు కొని; అధ్యయనము చేసిన వేదమును మఱవరాదు. మఱచినచోఁ బాపము కలదు. “అధీతమపి యో వేదం విముంచతి నరాధమః, భ్రూణహా సతువిజ్ఞేయో వియోని మధి గచ్ఛతి'' యని శిక్షా వాక్యము,(౨) నెలకొని= వేదార్థవిషయమైన శ్రవణ మనన

నిది ధ్యానసము లనియెడి యనుష్ఠానములు కలిగి "ఆచార్యో వేదసంపన్నో విష్ణు భక్తో విమత్సరః మంత్రజ్ఞో మంత్రభక్తశ్చ, సదా మంత్రాశ్రయ శ్శుచిః, గురు భక్తి సమాయుక్తః పురాణజ్ఞో విశేషతః, ఏవం లక్షణసంపన్నో గురురిత్యభిధీయతే॥" అనియాచార్య లక్షణము. అనఁగా జ్ఞానము గలవాఁడును విష్ణుభక్తి గల వాఁడును మాత్సర్యములేని వాఁడును, మంత్రార్థము తెలిసినవాఁడును, ఆమంత్ర మందు భక్తిగలవాఁడును, సర్వదా మంత్రము నాశ్రయించి యుండువాఁడును అనఁగా మంత్రార్థ మనుసంధానము చేయుచు నాప్రకారము వర్తించువాఁడును, లోపల వెలుపలఁ గామినీ కాంచనాదులపట్ల శుచిగా నుండువాఁడును, గురుభక్తి గలవాఁడును, శాస్త్రములఁ జదివి తా నా ప్రకారముగ నాచరించుచు శిష్యులచే నాచరింపఁ జేయువాఁడు నగు వాఁడు గురువనఁబడును. ఇట్టి యాచార్యలక్షణ మీ పదముచే జెప్పినట్లయ్యెను. కడు నెమ్మిగన్=సదా సంతోషముతో నుండు నని భావము. ఇట్టి యాచార్యుఁడుగదా భక్తులకు సదా సేవ్యుఁడు. "ఆహ్లాదశీత నేత్రాంబుః పులకీకృత గాత్రవాన్ సదా పరగుణావిష్టో ద్రష్టవ్య స్సర్వదేహిభిః" ఆచార్యుఁడు సర్వదా సంతోషముచేఁ జల్లని యానందబాష్పములు గలవాఁడును, పులకరించిన దేహము గలవాఁడును, ఎల్లప్పుడును పరమాత్మ గుణములను ధ్యానించుచుండువాఁడును నగువానిని గురువుగ నందఱు చూడవలెను. ఆచార్యుఁ డిట్టి సంతోషము గలవాఁడై యుండవలెను. వెండి నెండియును ఉత్తమ సాంత్వ వాది-ఉత్తమ="ఉత్తమః పురుష క్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః" భ. గీ. ప్రకృతి జీవులకంటె-బద్ధాత్మ ముక్తాత్మలకంటె నుత్తమ పురుషుఁడు పరమాత్మ యని చెప్పఁబడును, అన్నట్లు పరమాత్మను గుఱించి సాంత్వవాది=మంచి మాట లను శిష్యులకుఁ జెప్పువాఁడు. "త్వంమేఽ హంమే, కుత స్తత్తదపి కుత ఇదం వేద మూల ప్రమాణా దేతచ్చానాది సిద్ధా దనుభవ విభవా త్తర్హి సాక్రోశఏవ, క్వాక్రోశః? కస్య? గీతాదిషు మమ విదితః కోత్రసాక్షీ? సుధీస్స్యాదర్థం త్వ త్పక్ష పాతీ స ఇతి నృ కలహేమృగ్య మధ్యస్థ త్త్వ"మ్మని పూర్వాచార్యులు చెప్పినట్లు జీవ పరమాత్మలకు స్వాతంత్ర్య వివాదము కలిగినప్పుడు "యమో వైవస్వతో రాజా య స్తవైష హృది స్థితః తేనచేదవివాద స్తే మా గంగాం మాకురూన్ గమః" మనుస్మృతి. అనఁగా సర్వము సంయమించు వాఁడగుటచే యముఁడనియు దండించువాఁడగుటచే వైవస్వతుఁడనియు రంజించువాఁడగుటచే రాజనియుఁ జెప్పఁబడి నీ హృదయమునందుండు పరమాత్మతో నీకు వివాదము లేదేని అనఁగా నాత్మవంచనము లేక సత్యమందుఁ బ్రవర్తించెదవేని గంగకుఁ బోవలసిన పనిలేదు. కురుక్షేత్రమునకుఁ బోవలసిన పనిలేదు. అంతరాత్మకనుకూలముగ త్రికరణశుద్ధిగఁ బనులు చేయువాఁడు దన పాపములను జోఁగొట్టుకొనుటకు గంగాది స్నానములకై పోవలసిన పనిలేను. వానియందుఁ బాపలవములేదు. కావున నంతరాత్మకు విరోధ

ముగా వర్తించు వాఁడెక్కడ నెన్ని స్నానములు వ్రతములు చేసినను నిష్ప్రయోజనము. వానిపాపము పోదు. కావున వాడు తీర్థయాత్రలు చేయవలసిన పని లేదు, అనియర్థము. ఇట్టి భగవదనుకూల ప్రవర్తనము భగవంతుని స్వాతంత్ర్యమును నాచార్యుఁడు మంచిమాటలతో జీవునికి బోధించును అనిభావము. సేద్యగాఁడొక తూరిపొలము దున్ని పైరుపెట్టినపు డది మొదటిసారి ఫలింపక విత్తు పాడైనను, పై రెండిపోయినను నంతమాత్రమున సేద్యము చేయుట మానక మఱలమఱలఁ గృషిచేయుచుఁ దాను బూనిన కార్యము సఫలమగునంతవఱకు నిలుపనట్లు ఆచార్యుఁ డొకసారి చెప్పఁగా వారివచనములను శిష్యుఁడు వినక పోయినను నంతతో వదలక యాశిష్యుఁడు తనమాట వినునంత నఱకు నప్పుడప్పుడు వానికి జ్ఞాన ముపదేశించుచుండును. అని వెండియు వెండియునను పదము చేతఁ జెప్పినట్లయ్యెను. ఎట్లనఁగా నర్జునునకు భగవంతుఁడు భగవద్గీత యుపదేశించెను. దాని నర్జునుఁడు మఱచి మఱల దానిని జెప్పుమని యడిగెను. అప్పుడు శ్రీకృష్ణభగవానుఁడు 'నూన మశ్రద్ధధానోఽసి, దుర్మేధా శ్చాసి పాండవ" అర్జునా! నీవు శ్రద్ధగలవాఁడవు కావు. చెడుమేధ గలవాఁడ వని చీవాట్లుపెట్టి యనుగీతల నుపదేశించెను. ఇది ఉత్తర గీత లనఁబడునది కాదు. మహాభారతమున నశ్వమేధ పర్వమున ననుగీత లున్నవి కాని యుత్తరగీత లనునది లేదు. దానికి దీనికి సంబంధము లేదు.

పరలోక గమనమునకు సాధనమైన జ్ఞానము కర్మము అను రెండు రెక్కలు గలవాఁడు ఆచార్యుఁడు. ఒంటి రెక్క నిష్ప్రయోజన మైనట్లు జ్ఞానములేని కర్మము, కర్మములేని జ్ఞానము వ్యర్థము. రెండు చేరిననే ఫలముగలదు. "ఉభాభ్యామేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాంగతిః, తథైవ జ్ఞానకర్మాభ్యాం నియతా పరమాగతిః। అనువాక్యము ఇందుఁ బ్రమాణము. అనఁగా రెండు రెక్కలతో నాకాశమందుఁ బక్షి యెట్లు లెగిరిపోవునో యట్లు కర్మజ్ఞానములు రెండును బరమ గతికి నియతములు. 'జ్ఞానీతు పరమైకాంతి' యన్నట్లు జ్ఞాన మనఁగాఁ బరమైకాంతభక్తి జ్ఞాన కర్మములలో జ్ఞాన మంగి, కర్మమంగము. 'బ్రాహ్మణా వివిదషంతి యజ్ఞేన దానేన తపసానాశకేన," యను శ్రుతి యీ యంగాంగిభావమునఁ బ్రమాణము. అనఁగా యజ్ఞముచేత దానముచేత తపస్సుచేత ఉపవాసములచేత బ్రాహ్మణులు చక్కఁగాఁ దెలిసినవా రగుచున్నారు. (జ్ఞాను లగుచున్నారు.) దీనిచే నాచార్య శబ్దమునకు వ్యుత్పత్తి చెప్పినట్లయ్యెను. 'ఆచినోతిహి శాస్త్రార్థా, నాచారే స్థాపయత్యపి, స్వయమాచరతే యస్మాత్తస్మా దాచార్య ఉచ్యతే' యని యాచార్యశబ్ద నిర్వచనము. శాస్త్రార్థముల నెఱిఁగి తనకుఁ దెలిసిన దాని నితరులకుఁ జెప్పి చేయించుచుఁ దా నా ప్రకారము నడచువాఁ డాచార్యుఁడు.

స్వాగతోక్తిన్=స్వ+ఆగత+ఉక్తిన్=తనకు నాచార్యపరంపరగా వచ్చిన మంత్ర మను వాక్కును పల్కుచును, మంత్రానుసంధానమునకుఁ బూర్వముగా

"ఆచార్యాణా మసా వసా విత్యాభగవత్త"యని శ్రుతి చెప్పినట్లు గురుపరంపరాను సంధానము తప్పక చేయవలె ననుట దీనిచేత సూచితము,

నెండినెండియును ప్రేరణ చేసినట్లు గ్రాలెడిన్ = తా నుపదేశించిన దానిని అనుష్ఠింపఁ బలుమాఱు శిష్యుని నాచార్యుఁడు ప్రేరించు నని భావము. అట్లతఁడు చేయనిచోఁ దాను జేసిన యుపదేశము వ్యర్థమగునుగదా. దీని ననుసరించియే 'స్ఖాలిత్యే శాసితార'మ్మని స్ఖలనము కలిగినపుడు శాసించు వాఁడని గురులక్షణము చెప్పఁబడెను. ఇది తన లాభమనియే గురు వెంచవలయును, అని పేరెలమి ననుపదము సూచించును.

## తాత్పర్యము

కొమ్మలందుఁ గూర్చుండి మిక్కిలి సంతోషముతో మేలగు నూరార్పు మాటలు పక్షి చెప్పుచు మీఁద మీఁద శుభమును దెలిపెడి పలుకులను బలుకుచు నిండు సంతోషముతో ధైర్యము కలిగి యుండఁ బ్రేరించుచున్న ట్లొప్పుచున్నది. దీనివలన సీతాదేవికిఁ గేవల సమీపకాలమందే శుభము కలుగఁగలదు. కావున మీరిందుండి యీమెను బాధింపవలదు. లేచి దూరముగాఁ బొండు. ఆమెను నిర్భయముగా నుండనిండు. అనఁగా వారందఱు నట్లే చేసిరి. ఇచ్చట నా రాక్షస స్త్రీలు సీతాదేవి శరణు చొచ్చిరి. ఆమె రక్షించెదనని యభయమిచ్చెను. ఈ విషయమిచ్చటఁ జెప్పఁబడలేదు. సీతాదేవి గుణమాహాత్మ్యము వానరులకుఁ దెలియఁ జెప్పు టావశ్యకము, గావున హనుమంతుఁడు వానరులతో మాటలాడు సమయమున నిది యాయన చెప్పెను. రెండుస్థలము లందొక విషయము చెప్పుట వ్యర్థమని వాల్మీకి ముఖ్యమైన చోటఁ జెప్పెను.

♦ ౨౮-వ సర్గము సీతాదేవి శ్రీరాముడు రామికి యనేకవిధములఁ బరితపించుట ♦

మత్తకోకిలము. క్రూరుఁడైన దశాస్యునాజ్ఞను ♦ ఘోరరాక్షసకామినుల్
దారుణంబుగ నప్రియంబులు ♦ దన్ను పలుకుచు నుంటనున్
ధారిణీసుత కానలో మృగ ♦ నాథుబారిని బడ్డ యా
వారణేంద్రుని కన్యకీవిని ♦ బాధకంపిత గాత్రయై. ౭౧౭

## తాత్పర్యము

దయలేని రావణాసురుని యాజ్ఞప్రకారము రాక్షసస్త్రీలు తన్ను వినరాని మాట లనుచుండఁగా సీతాదేవి యడవిలో సింహము బారిని బడ్డ యేనుఁగు పిల్లవలె మిగుల వణఁకుచున్న దేహము గలదై.

మత్తకోకిలము. ర స జ జ భ ర-పదునొకండవ స్థానంబున యతి.

మత్తకోకిలము. రాక్షసాంగన లెల్లఁ జుట్టును ♦ గ్రాలి భీషణవేషలై
రూక్షభాషల బాధపెట్టఁగ ♦ రోషదూషితుఁడైన యా

రాక్షసాధిపు తర్జనంబుల ♦ రామకామిని కాన సం
రక్షకచ్యుత యైన బాలిక ♦ రాణఁ దా విలపించుచున్. ౨౧౮

తాత్పర్యము

రాక్షస స్త్రీలందఱు చుట్టుకొని భయంకరాకారములతోఁ గఠిన వాక్యముల చేతను, కోపముచే మనస్సు చెడిన రావణాసురుని బెదరింపుమాటలకును రామచంద్ర మూర్తి దేవి సీత యడవిలోఁ గాపాడువారు లేని యాఁడుపిల్ల వలె నేడ్చుచు.

పంచచామరము. అకాలమందు మృత్యువబ్బ ♦ దంచ్రు పెద్ద లెల్ల నా
ప్రకారమే యథార్థమయ్యెఁ ♦ బ్రాణమేగ దయ్యయో
నికారరీతిఁ దెచ్చి గ్రుచ్చి ♦ నిష్ఠురంబు లాడఁగన్
వికారరాక్షసీజనంబు ♦ నే నదెంత పాపనో. ౨౧౯

అర్థములు. నికారరీతిన్ = మోసపువిధముగ.

తాత్పర్యము

విధి నియమించిన కాలము వచ్చువఱకుఁ బ్రాణముపోదని పెద్దలు చెప్పు దురు. ఆ మాటయే నా విషయమున నిజమయ్యెను. కాలము రాలేదు. గనుకనే ప్రాణము పోవలసినంత స్థితి వచ్చినను నది పోలేదు. రావణాసురుఁడు మోసపు విధముగా నన్నుఁ దెచ్చి వికారాకారములు గల రాకాసుల కఠిన వాక్కుల నన్నుఁబొడిచి బాధించుటకు నే నెంత పాపము చేసితినో.

పంచచామరము. జర జర జగగణంబులు, తొమ్మిదిఁట యతి. దీనిలో మొదటిహల్లు తొలఁగించిన సుగంధి యగును.

మత్తకోకిలము. అక్కటా! కలవాయె సౌఖ్యము ♦ నైకముదుస్సహదుఃఖముల్
పెక్కు లాయెను, వజ్రపాతవి ♦ భిన్నశృంగమునట్టు లై
యొక్క వే శకలంబు లైచన ♦ దుల్ల మింతయుఁ జూడఁగా
నిక్క మీ హృదయంబు నాశిల ♦ నేర దెన్నఁడు దైవమా! ౨౨౦

అర్థములు. నైక = అనేకములయిన, దుస్సహ = సహింపరాని, వజ్రపాత = వజ్రము పడుటచే, విభిన్న = నఱిగిన, శృంగమునట్టులై = పర్వత శిఖరమువలె, వే = వేయి, శకలంబులు = తునుకలు, ఉల్లము = హృదయము.

తాత్పర్యము

అయ్యో! సౌఖ్యమా కలవాయెను. సహింపరాని దుఃఖములా యనేకము లయ్యెను. వజ్రముపడిన కొండ శిఖరము పగిలి తునుకలగునట్లు నా హృదయమా వేయితునుకలై పోదు. ఇదంతయుఁ జూడఁగా నా హృదయమునకు నాశన మనునది లేదు.

ఉ. చూడఁగ నైనరాని సుర•సూదను కోఁతకు నగ్గమౌచు న
ల్లాడుటకంటెఁ బాప సుగు•నా యురిపోఁతల నేను ప్రాణమున్
వీడుట? శూద్రజాతునకు •విశ్రుతమంత్ర మొసంగి పాపి యౌ
బాడబునట్లు నాకుఁ దగ•వా మన సీయ నిశాటనేతకున్? ౭౨౧

అర్థములు. చూడఁగనైనరాని=ముఖముఁ జూచినను బాపము వచ్చును. అంతటి మహాపాపి, చూచి సహింపరాని భయంకరుఁడు; అగ్గము=వశము. బాడబునట్లు=బ్రాహ్మణునివలె; నిశాటనేతకున్=రాక్షస ప్రభువునకు.

తా త్ప ర్య ము

చూచి సహింపరాని రావణాసురుఁడు పెట్టు హింసకు లోపడి బాధపడుచుండుట కంటె నురిపోసికొని యాత్మహత్య చేసికొనుట తప్పా? ఆత్మహత్యవలన నరకము వచ్చును గదా యనిన నరకబాధ దీని కంటెఁ దీవ్రమయినదా? రావణాసురుని యిష్టప్రకారము వర్తించిన యెడల నీబాధ యీ బాధ తప్పును గదా యనిన శూద్రునకు వేదమంత్ర ముపదేశించిన బ్రాహ్మణునివలె నేను రాక్షసునకు మన సీయ వచ్చునా.

రామచంద్రమూర్తికి నా మనసు త్రికరణశుద్ధిగా ధారపోసితిని. అట్టి దానిని మరలఁ దీసికొనిననే దత్తాపహారదోషము వచ్చును. దానికిఁ దోషు నీచున కర్పణ సేయుట మహాదోషము.

ఒక ఋషీశ్వరుఁడు శూద్రున కొకనికి వైదిక విధానముగఁ బైతృకర్మముఁ దెలిపి వానిచే నట్లు చేయించి రాజపురోహితుఁడుఁగా బుట్టినట్లు భారతమున అనుశాసనపర్వంబునఁ గలదు. కావున నిది ముముక్షువునకు భగవన్మంత్రమును నిషేధింపదు. ఏలన:- భక్తిప్రపత్తి మార్గముల మోక్షమున కందఱు నధికారులే. కావున దానికిఁ గావలసినది చెప్పుట తప్పుగాదు. వైదికకర్మములందు శూద్రున కధికారములేదు. కావున వానివిధానము చెప్పరాదని భావము.

మానిని. దుర్భరతేజుఁడు రాముఁడు నన్నిటఁ • దూర్ణమ చూడఁగ రానియెడన్
నిర్భరకోపముతోఁ గడు వేగిన • నిష్ఠురశాతకృపాణములన్
గర్భమున న్మరణించిన జంతువు•కండల శస్త్రచికిత్సకుఁడున్
నిర్భిదమున్ ఘటియించుగతిన్ రజ•నీచరుఁ డోడక కోయు ననున్. ౭౨౨

అర్థములు. దుర్భర తేజుఁడు=శత్రువులకు సహింపరాని తేజముగలవాఁడు' నిర్భరకోపము=విశేష కోపము, నిష్ఠుర=కఠినములైన, కృపాణములన్=కత్తులచే' శస్త్రచికిత్సకుఁడు=కత్తులతోఁ గోసి చికిత్స చేయువాఁడు, నిర్భిదమున్=భేదించిన దానినిగా.

మానిని. ఏడుభగణములు గురువు; పదుమూఁట యతి.

### తాత్పర్యము

శత్రువులకు సహింపరాని పరాక్రమము గల రామచంద్రమూర్తి త్వరగా నన్నుఁ జూడరాఁడాయెనా, గడువు ముగియఁగానే రావణుఁడు కోపాతిశయముచే నన్ను శస్త్రచికిత్సకుఁడు గర్భములో మరణించిన శిశువును గోసినట్లు వాఁడికత్తులచే భయము లేక కోయఁగలఁడు.

మత్తకోకిలము. ఎంతకాలముగానొ యేడ్చెడి • హీనభాగ్యకు రెన్నెలల్
కొంత కొంత గతించె నే మను • కొందు నయ్యయొ ధారిణీ
కాంతు నాజ్ఞను గాలుసేతులు • కట్ట వేకువ వధ్యుఁ డై
చింతలం బడు దొంగ భంగిని • జింతఁ గుందెద దైవమా! ౭-౨౩

### తాత్పర్యము

దీర్ఘకాలముగ నేడ్చుచుండు నిర్భాగ్యురాల నగు నాకు రెన్నెలలలోను గొంత కొంత గడిచిపోయినది. (పదియవనెలలో పదునైదు దినములు గడచెను.) అయ్యో! యే మనుకొందును? రాజాజ్ఞచేఁ గాలుచేతులు గట్టివైవఁగా నుదయము కాఁగానే చంపఁబడెడి దొంగవలె నేను దుఃఖపడు చున్నాను.

సీ. కన్నతల్లికి మిన్న • కరుణ నన్ లాలించు, నా రామమాత నా • యత్తగార!
యత్తగారికి మిన్న • యాదరించుచు నున్న, మైత్రి ధీపాత్ర సు • మిత్రదేవి!
కన్నతల్లినిబోలె • మన్నించు నా ముద్దు, మఱఁది యో లక్ష్మణా! • మహితచరిత!
తన ప్రాణములకన్న • ఘనముగా నన్నుఁ జూడు, ప్రేమసముద్ర యో • రామభద్ర!

తే. యయ్యయో రామ! లక్ష్మణా! • హా సుమిత్ర!
హా రఘూత్తము జనని య • త్తా! యిటేను
గడలి సుడిగాలి సుడివడు • కలముఁ గరణి
మందభాగ్యను నిడుమల • మ్రందుదాన. ౭-౨౪

అర్థములు. కలము=ఓడ, మందభాగ్యను=భాగ్యహీనను, గీతమున రెండవ పాదమునఁ బ్లుతయతి.

### తాత్పర్యము

స్పష్టము.

చ. కటకట! నా నిమిత్తము మృ • గంబుస్వరూపముఁ దాల్చియున్న యా
కుటిలునిచేత మృత్యువును • గూరిరి శూరులు పార్థివాత్మజుల్
దటుకునఁ బిట్టపిడ్గు వడిఁ • దాఁకిన సింహవృషద్వయంబునా
నటమట మింత కైనఁ గల • దా? మఱి యింతకు మూల మేఁ గదా! ౭-౨౫

అర్థములు. మృగంబుస్వరూపము=జింకయొక్క యాకారము, మూలము ఏను గదా=నేనేకదా కారణము.

తాత్పర్యము

అయ్యో! నా కొఱకై జింక వేషము ధరించిన వంచకుని చేత శూరు లగు రాజకుమారులు వాన లేని పట్టి పిడుగు పడుటచేఁ జచ్చిన సింహముల వృషభముల జంటవలె మరణించిరి కాఁబోలు. అయ్యో! యింతకంటె దుఃఖము గలదా? ఇంత యనర్థమునకు నేనే కదా కారణము. వా రిరువురు నన్ను విడిచిపోవుట నా కోరిక ప్రకారమే కదా!

క. రామానుజుఁ దత్పూర్వజు నే మూఢతఁ బాయఁ గాలమప్పుడే దురదృష్టన్
ఆ మృగరూపధరాకృతి,మై మోసము చేసె నన్నుమాట లిఁ కేలా? ౭౩౯

అర్థములు. రామానుజున్=రాముని తమ్ముని, తత్పూర్వజున్=ఆ లక్ష్మణు నన్నను, రాముని తమ్ముఁడు లక్ష్మణుని యన్న యీ ద్రావిడ ప్రాణాయామ మేల? రామలక్ష్మణులని చెప్పియుండరాదాయనిన ఇరువురు నించుమించు సమానులని తెలుపుట కని యెఱుగునది. "ద్వా సుపర్ణా సయుజా సఖాయా" యను శ్రుతి నిట ననుసంధించునది. దీనివలన శుద్ధాత్మ పరమాత్మ లించుమించుగా సమానులని భావము. మూఢతన్=జ్ఞానహీనత చే, కాలము=మృత్యువు. దురదృష్టన్=దుష్ట ఫల మనుభవింప వలసిన దానను.

తాత్పర్యము

రామచంద్రుని, లక్ష్మణుని నెప్పుడు తెలివిలేని దాననై దురదృష్ట వశమున నెడఁబాసితినో యప్పుడే మృత్యుదేవత జింకరూపము ధరించిన వాని రూపముగ వచ్చి నన్ను మోసగించెను. ఇఁక నే మనుకొని యేమి ప్రయోజనము? జీవాత్మ పరమాత్మ లిరువురు నెడఁ బాసిన దేహము వలె నైతిని.

ఉ. హా రఘురామ! సత్యరత హా! పరిపూర్ణసుధాకరాననా!
హా రమణీయ దీర్ఘకర! హా! జగదేకహితా! విశారదా!
హా రణరంగభీకర! సమస్తజగచ్చయ భూతరక్షణా!
సారసనేత్ర! నన్నిట నిశాటులు చంపుట నీ వెఱుంగవో? ౭౪౦

అర్థములు. సత్యరత=సత్యమందుఁ బ్రీతిగలవాఁడా! పరిపూర్ణసుధాకర+ ఆననా=నిండుచంద్రునివంటి ముఖము గలవాఁడా! రమణీయ దీర్ఘకర=అందము లైన నిడుపాటి చేతులు గలవాఁడా! జగదేకహితా=ప్రపంచమునకు నొక్కఁడే హితము గోరువాఁడా! విశారదా=నేర్పరీ, రణరంగభీకర=యుద్ధరంగమందు భయంకరుఁడా! సమస్తజగచ్చయ భూతరక్షణా = అన్నిలోకములనుండు ప్రాణి కోటులను రక్షించువాఁడా! సారసనేత్ర=కమలములవంటి కన్నులు గలవాఁడా! నిశాటులు=రాక్షసులు, మీఁది పద్యమునందుఁ బ్రపన్నుఁడు భగవత్సాహాయ్యమును, భాగవత సాహాయ్యమును భక్తిహీనతచే నవివేకమున దురదృష్ట వశమున గోలుపోయి ప్రకృతిచే వంచింపఁబడి మృత్యుస్వరూప మైన సంసారమునఁ

బడితి నని తలఁచి యేడిచి మించినదాని కేడ్చిన లాభ మే మనుకొని, దీనిని దరించు నుపాయము భగవచ్చింతనముదప్ప వే ఱుపాయము లేదని భగవద్గుణానుసంధానము చేయుచున్నాఁడు, అని ధ్వని. ఈ పద్యమున భగవత్స్వరూపస్వభావ వర్ణనము చేయఁబడెను.

తాత్పర్యము

హే రఘురామా! నీ వంశపూర్వుల యోగ్యత, కీర్తి, ప్రతిష్ఠ లాలోచింపుము. సత్యమందుఁ బ్రీతిగలవాఁడా! వివాహకాలమున నాకేమి ప్రమాణము చేసితివో యాలోచింపుము. చంద్రునివంటి ముఖము గలవాఁడా! లోకమునఁ జీకట్లు సమయఁ జేసి, యమృతము గురియించి లోకుల సంతోషింపఁ జేయువాఁడు గదా నిండు చంద్రుఁడు. అటువంటినీవు నా విషయమున నెట్లు సార్థక నామధేయుఁడవు కావలెనో యాలోచింపుము. అందములైన నిడుపాటి బాహువులుగలవాఁడా! నీ కందుకొనరాక దూరమైన దేదికలదు? ప్రపంచమునకంతయు హితమే కోరువాఁడవు నీవొకఁడవే కదా! నిన్ను విడిచిన నన్ను రక్షించువారు లేరే. అదియు నాలోచింపుము. నీవు దేనికైన సమర్థుఁడవే. నన్నొకయాఁడుదాని నాపదనుండి తప్పించు సామర్థ్యములేదా? యుద్ధరంగమందు భయంకరుఁడా! నీవు పూనిన నీ రాక్షసులా నీకెదురు నిలుచువారు? దాని నాలోచింపుము. అన్నిలోకముల నన్ని భూతముల రక్షించు దీక్షగలవాఁడవే! నన్నొకతెను రక్షింపకుండిన నీ వ్రతము భంగముగాదా? కమలలోచనా! నీ వీ రాక్షసులవలెఁ గ్రూరపు దృష్టిగలవాఁడవు కావే. తేనెచేఁ గమలమువలె దయచే నార్ద్రములైన దృష్టులు గలవాఁడవే. ఏల నాపై నా దృష్టి పఱుపకున్నావు? నీవు సర్వజ్ఞుఁడవే. ఇచ్చట రాక్షసులు నన్ను బాధించుట తెలిసికొనలేక యున్నావా?

సీ. ఈ వొకఁడవు దక్క • నితర దైవము లేద,టంచు నేఁ దలఁచిన • యట్టితలఁపు
వినఁగోరి నీసూక్తి • వికటరాక్షసపరు, షాలాపముల విను • నట్టి యోర్పు
నీ తోడ శయనించు • ప్రీతిమై నీ నేలఁ, బడియున్న యట్టి యా • కడిఁది దిటము
రాముఁ డేటికి నన్ను • రక్షింపకుండు నన్, ధర్మమార్గంబున • స్థైర్యవిధము

తే. నాదుపరమపాతివ్రత్య • నవ్యతపము, పాడుగాఁబోయె నాదు దౌ • ర్భాగ్యమునను
ధరఁగృతఘ్నున కొనరించు • పరమకృతిని,బోలి నా పాపమెంత ప్ర • భూదమార.

అర్థములు. ఎంత పుణ్యవంతునకైనను, ఎంత తపస్వికైనను ప్రారబ్ధ మడ్డపడినపుడు వాని పుణ్యము తపస్సు, శీలమేదియు రక్షింపఁజాలదని చెప్పఁబడుచున్నది.

వికటరాక్షస=భయంకరులైన రాక్షసుల, పరుషాలాపములు=కఠిన వాక్యములు; కడిఁది దిటము=గాఢమైన పట్టుదల, ధైర్యము, స్థైర్యవిధము=నిలుకడగా నుండుట.

నీ వొకండవు............తలఁపు=దైవమనిన నీ వొకఁడవే దైవముగాని వేఱుదైవము లేఁడని మరి యెట్టివారిని నేను దైవమని తలఁచినదికూడ లేదుకదా. "ఏకభక్తిర్విశిష్యతే" "అనన్యాశ్చింతయంతో మాం" "అనన్యచేతా స్సతతం

'అనన్యభాక్' 'అనన్యమనసః' 'అనన్యయోగేన' ఇత్యాదిభగవద్గీతావాక్యములను 'నాన్యం దేవం నమస్కుర్యాత్' 'నాన్యం దేవం నిరీక్షయేత్' మఱి యొకరిని దేవుఁ డని నమస్కారము చేయరాదు. మఱి యొకరిని దేవుఁ డని చూడనురాదు. ఇత్యాదివాక్యము లనుసంధించునది. భక్తుఁడు, ప్రపన్నుఁడు, పతివ్రత సమానులు. నాథా! నే నిటువంటి యేకభక్తి నీయందుఁ గలదాన నగుటచేఁ గదా నీవు నారాయణుపూజసేయు నపుడును నేను నీ సహాయురాలుగా నుండి కావలసినవి యందిచ్చుచుంటినే కాని, నేను నారాయణునందుఁ గూడ దైవబుద్ధినుంచి యర్చించిన దానగాను గదా. ఇది యనేక దేవతాపూజను నిరసించుచున్నది.

వినఁగోరి...... యోర్పు=చూచినంత మాత్రముననే గుండెలు పగిలించు నీ రాక్షసుల కఠినవాక్యములు నే నోర్పుతో వినుటకు వానియందలి ప్రీతియా కారణము? కాదు. ఊపిరి పట్టుకొనియుండిన నీ మధురాలాపములు మఱల విను భాగ్యము గలుగక పోవునా? ఒక్కనాఁడు ఒక్కమాటు వినినను నేను ధన్యురాల నగుదునే యని తలంచి కదా యింత యోర్పు గలదాననై యున్నాను. ఆ యాశ లేకున్న నెప్పుడో మరణించి యుండనా? నీ తోడ శయనించు...... ఇదియు మీఁది యట్టులే యాలోచింపవలెను.

రాముఁ డేటికి......విధము-దీనికే మహావిశ్వాస మని పేరు. భగవంతుఁడు నన్ను రక్షించునుగాని రక్షింపకపోఁ డను దృఢమైన నమ్మకము. 'తెడ్డుండఁగాఁ జేయియేల కాల్చుకొనవలయు' నన్నట్లు, రక్షించువాఁడు రాముఁడుండఁగా నేనేల దానికై శ్రమపడవలె? ఇతరుల నేల యాశ్రయింపవలె నన్న పట్టుదల 'నిన్ను దశాస్య నేనిపుడు నీఱుగఁ జేయనె' యని చెప్పుట కిదియె కారణము. పాతివ్రత్య పరమతపము=పాతివ్రత్యము, పతిసేవయే వ్రతముగాఁ గలది పతివ్రత, ఆమె చర్య పాతివ్రత్యము. స్త్రీల కిదియే పరమ తపము, దీనిని మించిన తపము స్త్రీలకు లేదు.

క. ఉపవాసంబులు వ్రతములు, తపములు వేయేల భర్త • దైవత మని ని
ష్కపటతఁ గొలిచిన సాధ్వికి, నృపవర దుర్లభము లేదు•నిఖిల జగములనే.

"నాస్తి యజ్ఞః క్రియా కశ్చిన్న శ్రాద్ధం నోపవాసకమ్। ధర్మః స్వభర్తృశుశ్రూషా తయాస్వర్గం జయంత్యుత॥ నాస్తి స్త్రీణాం పృథగ్ధర్మో న వ్రతం నాప్యుపోషణమ్।పతిశుశ్రూషణం తాసాం, తేన స్వర్గో విధీయతే" స్త్రీలకు యజ్ఞములు-ధర్మములు-కర్మములు-శ్రాద్ధములు-ఉపవాసములు-వ్రతములు లేవు. పతిశుశ్రూష చేతనే వారు స్వర్గము జయింతురు. ఇట్టి వ్రతము గలది పతివ్రత. నాదురదృష్టము వలన నివి యన్నియు వ్యర్థమై పోయెను.

తాత్పర్యము

నీకంటె నాకు వేఱుదైవము లేదని, నీవే నాదైవమని నిన్నే కొలుచుచుంటిని. నీమాటలు వినగల నను నాశతో రాక్షసుల పరుషవాక్యముల విన సహించితిని.

నీ తోడఁ బందుకొనఁగోరి యిచట భూశయ్యఁ గావించితిని. రామచంద్రమూర్తి నన్నేల రక్షింపఁడను ధైర్యముగలదాననై నా రక్షణమునందు నేనే ప్రయత్నముఁ జేయమానితిని. పాతివ్రత్య మను తపము దప్ప వేఱు తపము స్మరించినదానఁ గాను. నేను నిర్భాగ్యురాలనైన కారణమునఁ గృతఘ్నునకుఁ జేసిన మేలువలె నిన్నియు వ్యర్థమై పోయెను. పాప మనఁగా నిచటఁ బాపఫలమైన ప్రారబ్ధానుభవము. ప్రభూతము=దొడ్డది. దీనివలన నన్నిటికంటెఁ బ్రారబ్ధము బలిష్ఠ మని గ్రహింపనగు.

ఇంతఁ జెప్పఁబడిన వన్నియుఁ బరమభక్తులయుఁ, బ్రపన్నులయు కృత్యములు. ఏకదేవతోపాస్తి కలవాఁడై యుండును.

భగవచ్చరిత్రములు తప్ప వేఱు లౌకిక వార్తలు వినరాదు.

దేహసుఖములఁ గోరరాదు.

రక్షకుఁడు భగవంతుఁ డని దృఢవిశ్వాసము గలిగి తన యోగక్షేమములకై తాను బాటుపడ రాదు. స్వాతంత్ర్యబుద్ధి మానవలయును.

చ. చెలువము వాసి మిక్కిలి కృశించితి, నిన్గనఁ లారఁ గానఁగాఁ
గల నను నాశయున్ సమసెఁ గావున మత్కృతపుణ్యకార్యముల్
బొలిసెను నిష్ఫలంబు లయి పూరుష పుంగవ! పోయెఁ బొమ్ము ని
ర్మల మగు నేకపత్నినియమంబు నిరర్థక మాచు వల్లభా! ౭౨౯

అర్థములు. చెలువము=అందము, కృశించితి=క్షీణించితిని.

తాత్పర్యము

నాథా! నీకు సంతోషకరమైన నా చక్కఁదనము తొలఁగి పోయెను. సన్న్యాసులకు వలె దేహమా బక్కచిక్కి తెల్లబాఱెను. కాఁబట్టి నాయందు నిప్పుడు నీకు మునుపటి ప్రేమ యుండునో యుండదో, నీకైంకర్యహీన నైన నన్ను మునుపటివలె నీ వాదరింపకుండినను బోనిమ్ము. నేను దూరమున నుండి నీ ముఖమునైన దర్శింపగలనను నాశయు సమసెను. కావున నేను జేసిన పుణ్యముల ఫలమంతయు వ్యర్థమై పోయెను. గార్హస్థ్యమున సన్న్యాసమున రెంటఁ జెడితిని. పుణ్యకర్మముల ఫలము పోయినఁ బోనిమ్ము. దానికి నేను వగవను నన్ను రక్షించునని, వ్యర్థమైపోదని, నీప్రాప్తి కప్రతిహతమైన యుపాయమని నమ్మియుండిన నిర్మలమైన పాతివ్రత్యము (భక్తి) కూడ వ్యర్థమై పోయెను. దానికి నేను దుఃఖించెదను.

దేహము భగవంతుఁడుండు నాలయ మను భావముతో నలంకరించుకొనవచ్చును. భగవదర్పణ బుద్ధి మంచి యాహారముఁ దినవచ్చును. స్వబుద్ధి స్వప్రయోజనము మాత్రము నిషిద్ధము. సన్న్యాసులవలె దేహము శుష్కింపఁజేసి తపముల నవయుట కంటె నీ గృహస్థమార్గ ముత్తమ మని యేర్పడుచున్నది. కాని దానికంటె నిది కష్టతర మార్గము. ఇట్లు లుండలేనివాఁడు సన్న్యాసి యగును.

ఫలమునందు సన్న్యాసులకుఁ గలుగు బ్రహ్మలోకప్రాప్తికంటె వీరికి భగవత్సా యుజ్యప్రాప్తి తత్సమీపవర్తిత్వము లభించును.

చ. జనకునియాజ్ఞఁ బొప్పునఁ బ్ర॥శస్తగతిన్ వనవాసదీక్షఁ దీ
ర్చి నగర మేగి ధాత్రి కభి॥షేకముఁ గైకొనుచుం గృతార్థతన్
జనవున వారిజాతదళ॥చారువిశాలవిలోచనాళితో
నెనయిక భీతి లేక రమి॥యించెద వంచుఁ దలంతు సువ్రతా! ౨౩౦

అర్థములు. ప్రశస్తగతిన్=లోకము పొగడునట్లు, నిర్విఘ్నముగా, తీర్చి= ముగించి, కృతార్థతన్=పురుషార్థము లన్నియు సిద్ధముగా నుండుటచే, వారిజాత దళ=కమలముల రేకులవలె, చారు=మనోహరములై, విశాల = వెడలుపైన, లోచనాళితోన్=కన్నులుగల స్త్రీలతో, ఎనయికన్=ఒద్దికతో, భీతిలేక=నే నేమనుకొందునో యను భయములేక, సువ్రతా=ఏకపత్నీవ్రతము గలవాఁడా! ఈ పద్యమును గొందఱు రామునకు బహు భార్య లున్నారనుటకు నాధారముగ నుదహరించెదరు, గాని యది నిరాకరము. ఇది స్వభావముగ స్త్రీలకు వచ్చు నాలో చనయే. తానుఁబోయినఁ దనభర్త మఱల వివాహ మాడకుండునా? యని స్త్రీతల చుట యందేమి వింత గలదు? ఇచ్చట భయ మనునది వనవాసభయము కాదు. వనవాస దీక్ష ముగించి యయోధ్యఁ జేరినపిమ్మట మఱల వనవాసభయ మెందుండి వచ్చును.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి సత్యసంధుఁడు. తండ్రియాజ్ఞప్రకారము పదునాలుగుసంవ త్సరములు వనవాసము దీక్షగాఁ బూర్తిచేసి తన సత్యమును, దండ్రి సత్యమును గాపాడె నని లోకము మెచ్చునట్లు నిర్విఘ్నముగ వనవాసము సలిపి యయోధ్యకు బోయి రాజ్యాభిషేకము గ్రహించి పురుషార్థము లన్నియుఁ బూర్ణముగా నుండఁగా ననేక సుందరులతో నొద్దికతోఁ గ్రీడింపఁగల వని తలచెదను. అట్లు చేయక నీ వెట్లుండఁగలవు? ఇంత ప్రభుత్వము చేయుచు విధురునివలె, సన్న్యాసివలె నుండు టను నీవారు సహింతురా? వారు బలవంతపెట్టియైన నీకు వివాహము చేయ యత్నింతురు. ఎందఱు రాజులు మా పిల్లనిచ్చెద మనిన మాపిల్ల నిచ్చెద మని పైపడి వత్తురు. కావున నీవు మఱల వివాహమాడి సంసార సుఖ మనుభవింతు వని తలఁచెదను. కాని సువ్రతుఁడవే. ఏకపత్నీవ్రతము గలవాఁడవే. పట్టిన వ్రతము విడువని దృఢసత్త్వుఁడవే. నిరపరాధిని నీ యం దనురాగముగల దానిని నన్నిచ్చటఁ జావ విడిచి వ్రతభంగ మగుట కొర్చియైన నట్లు చేయుదువా? చేయవేని నేను నీ సుఖముకూడఁ జెఱచిన దాన నగుదునుగదా, అయ్యో తాను జెడి భర్తను జెఱుచు నావంటి నిర్భాగ్యురాలుకూడ లోకంబున నుండునా?

పంచచామరము. ఘనంబుగా మనంబు నిల్పి॥కంజనేత్ర! నీ పయిన్
వినాశ మందు చున్నదాన॥ నేను రామ! యీగతిన్

వినీతిరీతి నేను జల్పు♦విశ్వాసద్వ్రతంబులున్
జనెం బ్రయోజనంబు లేక♦స్వల్పభాగ్య నౌటచేనే. ౭౩౧

అర్థములు. వినీతిరీతిన్=మిక్కిలి వినయముతో, విశ్వాసద్ర్వతంబులన్=అన్ని మంచి వ్రతములు, స్వల్పభాగ్యను=కొంచెము పుణ్యముగలదానను.

తాత్పర్యము

నాథా! రామచంద్రా! ఎంతటి పాపాత్ములైనను నీమీఁద నేకొంచెము మనస్సైన నుంచినను శ్రేయస్సుఁ గందురు. అటులుండ నేను నీమీఁద దృఢముగ జిరకాలముగ మనసు నిల్పి యీ విధముగ నశించుచున్నదానను రామా! యిది నీ దోషము గాదు. నా దోషమే. ఎలన నేను నియమము దప్పక సల్పిన యన్ని మంచి వ్రతములు సల్పభాగ్యనగుటలే వ్యర్థములైనవి. ఏకొంచె మదృష్టమున్నను నేనుమాత్రము తక్కిన వారివలె నిన్నాశ్రయించి బాగుపడ లేకపోయితినా? నా దుర్దశకు నా దురదృష్టమే కారణము, నీవు కావు.

శా. లేరే దాతలు నాకు నింత విషమేన్ ♦ లేఖారి వేశ్మంబునన్
క్రూరం బైన కృపాణ మేనియును గో♦కొమ్మంచు నీయంగ? న
ల్లేరే నిచ్చినఁ బాయనే తనువు ని♦ర్దష్టే కాలకూటానఁ గా
నీ రాజత్కరవాలఘాతమునఁ గా♦నీ దుఃఖనాశంబుగన్. ౭౩౨

అర్థములు. లేఖారి=దేవతలకు విరోధియగు రావణాసురుని, వేశ్మంబునన్=ఇంటియందు, కృపాణము=కత్తి, కొమ్ము=తీసికో తీసికో. కాలకూటానన్=విషముచే, కరవాలఘాతమున=కత్తి దెబ్బచే, కానీ=కానిమ్ము, ప్రార్థనాదులం దస్ప్రత్యయాంత క్రియలమీఁది యిమ్మునకు నీ కారంబు విభాష నగు ప్రౌ. వ్యా. క్రి. ౧౦ సూ.

తాత్పర్యము

రామచంద్రా! నీ వయోధ్యకేగి దుఃఖమే యనుభవింతువో, సుఖమే యనుభవింతువో, దుఃఖ మనుభవింపకుండ నేనేమి చేయఁగలను. సుఖమనుభవింప నేనేమి చేయఁగలను? నే నేమియుఁ జేయఁజాలను. ఇట్టి దానను నేను జీవించి యేమి ప్రయోజనము? ప్రాణము విడుతునా? దానికైన విషమో కత్తియో కావలయును గదా! అవి నే నెక్కడనుండి తెత్తును? ఈ రావణాసురుని యింటిలో నిందఱున్నారే. ఒకరైన నాయందు దయ గలవారు గానీ, ద్వేషము గలవారు కానీ, కొమ్మని యింత విషమో, పదునైన కత్తియో యిచ్చుదాతలు లేరా? అల్లైవరే నిచ్చిన నిప్పుడే విషము చేతనో, కత్తి నఱకుల చేతనో నా దుఃఖము నశింపఁ బ్రాణము విడుతును గదా.

చ. లలన యనేకరీతులఁ ద♦లంచి తలంచి మనోవిభున్ వృథా
కులమతి నిట్లు వా విడిచి ♦ గోలున సంగిలి యెండ నేడ్చుచున్

దలఁచుచు బుష్పితోరువసు♦ధారుహమూలసదేశ మేగి య
చ్చెలి తనవేణిఁ గేలఁ గొని♦చెచ్చెరఁ దా నురిపోసికొ న్మతిన్. 233

అర్థములు. వావిడిచి=నోరు తెఱచి గట్టిగా, పుష్పిత=పూఁచిన, ఉరు=గొప్పదగు, వసుధారుహ=చెట్టు యొక్క, మూల=మొదళ్ళ యొక్క, సదేశ=సమీప ప్రదేశము, ఉరిపోసికొన్మతిన్=ఉరిపోసికొను నభిప్రాయముతో.

తాత్పర్యము

ఈప్రకారము తన భర్తను నానావిధములఁ దలఁచి తలఁచి దుఃఖముచే కలవరపడి నోరు తెఱచి హాయని గట్టిగా నోరెండ నేడ్చుచు నింకఁ బ్రదికి ప్రయోజనము లేదని పూచిన చెట్టు మొదటికి మునుపటికంటె సమీపముగఁ బోయి సీతాదేవి జడ చేతికి దీసికొని యురిపోసికొను నభిప్రాయముతో.

చ. అనువగుశాఖ గేలఁ గొని ♦ యాత్మకులంబును రామచంద్రునిన్
ఘనుని సుమిత్రపట్టిని మ♦నంబున నెంచుచు నుండ శోకనా
శనమును ధైర్యసాధనము ♦ శస్తకరంబును నౌ నిమిత్తముల్
గనఁబడెఁ దొంటియట్లు మృగ♦కాతరనేత్రకు ముత్ప్రదంబులై. 234

అర్థములు. అనువు=అనుకూలము, ఆత్మకులంబును=తన వంశంబును, శస్తకరంబును=మేలుకలిగించునవి, నిమిత్తముల్=శకునములు, మృగ కాతర నేత్రకున్=జింకకన్నులవలె బెదరుటచేఁ జలించు కన్నులు గలదానికి, ముత్+ప్రదంబులై=సంతోషకరములై.

తన వంశంబును తలచుటచే-అట్టి గొప్పవంశమునఁ బుట్టిన నేను నిట్టి నీచపుఁ జావు చావ వచ్చునా యని యాలోచించె నని భావము.

'అతిమానా దతిక్రోధా త్స్నేహాద్వా యది వా భయాత్। ఉద్బధ్నీయా త్స్త్రీపుమాన్ వా గతిరేషా విధీయతే। పూయశోణిత సంపూర్ణే త్వంధే తమసి మజ్జతి। షష్టిర్వర్ష సహస్రాణి నరకం ప్రతిపద్యతే। ఆశౌచం నోదకం నాగ్నిం నాశ్రుపాతంచ కారయేత్'॥ అవమానము వలనఁగాని, యతికోపముచేఁ గాని, స్నేహముచేఁ గాని, భయముచేగాని యురిపోసికొని బలవంతపు మరణము స్త్రీగాని, పురుషుఁడుగాని చచ్చినయెడల నఱువదివేల యేండ్లు దుర్గంధముతోఁ గూడిన యంధతమిస్ర నరకమందుఁబడి యుండవలెను. బలవంతపుఁజావు చచ్చినవారికి సూతకముండరాదు. నీళ్ళు విడువరాదు. అగ్నిసంస్కారము చేయరాదు. కన్నీరు విడువరాదు.

ఇట్టి నీచపుఁ జావు జనకునివంటి మహాత్ముని వంశము దాననై యెట్లు చత్తునాయని యాలోచించెను.

రామలక్ష్మణులను దలఁచుట నేనిట్లు చేసినవారి కపకీర్తి వచ్చునే యని. వారే మైన ప్రయత్నము చేయుచున్నారేమో నే నిప్పుడు చచ్చిన వారసమర్థులై యాఁడుదానిని రక్షింపలేక చావ విడిచిరని లోకులందు రేమో నిష్కారణముగ

నంతటి వారికి నపకీర్తి వచ్చునే? వారిచ్చటికి వచ్చునప్పటికి నేను జచ్చియుండిన దాహపీడితుఁడు పాడుపడిన చలువ పందిరికి వచ్చినట్లగునే యని యాలోచన.

తాత్పర్యము

ఉరి పోసికొనుటకు ననుకూలమైన కొమ్మను జేతఁ దీసికొని తన వంశంబును, రామలక్ష్మణులను మనస్సులో స్మరించుచు నురిపోఁతకు యత్నము చేయుచుండ శోకమునశింపఁజేయునవియు, ధైర్యము కలిగించు నవియు, శుభకరములై నవియు నగు శకునములు సంతోషకరములై మునుపటివలెనే శాన వచ్చెను.

మునుపటి వలెనే యనుటచే నింతకుఁ బూర్వముకూడ నిట్టులే యత్నము చేసి శుభశకునము లగుటచేఁ జాలించుకొను చుండె నని భావము.

♦ ౨౯-వ సర్గము. మరణోద్యుక్త యగు సీతాదేవికి శుభశకునంబు లగుట. ♦

సీ. అంతటి వ్యథితను ♦ హర్షవ్యపేతను. బరిదీనమానసఁ♦బరమనియమ
భద్రనిమిత్తముల్♦ప్రాపించి రాజిల్లె, ధనిఁ జేరు సేవక♦తతులభంగి,
లక్ష్మీకము నరాళి♦పక్ష్మరాజీవృతం,బును విశదవిశాల♦మును విసీల
మును నగు వామలో♦చనము మీనాహత, మైన పద్మం బన♦నదరఁజొచ్చె

ఆ. మృదుమనోజ్ఞపీనవృత్తంబు చందనా, గురుసమగ్ర్య మగుచుఁ♦బరమలోక
నాథచిరగృహీత♦సవ్యవామభుజంబు, కొంతసేపు కదలె♦నంత కంత. ౬౩౭

అర్థములు. అంతటి=ఇంతయని పరిమాణము చెప్పుటకు వాల్మీకి వంటి సర్వజ్ఞునకు సాధ్యము కానంతటి, వ్యథితను=దుఃఖపడిన దానిని, హర్షవ్యపేతను= సంతోషములేని దానిని, ఈమెయు గొన్నినాళ్ళు సుఖమనుభవించినదా, పుట్టినది మొదలిట్టులే యన్నదేమో యనునట్లు చూచువారికిఁ దోఁచుచున్నట్లున్న దానిని, వి-అప అను రెండుసర్గములఁ బ్రయోగమువలన నింతయర్థము చెప్పవలసి వచ్చినది. పరిదీన మానస=దీనమానస యని నప్పుడు దీనమైన మనస్సుగలదని యర్థమగును. పరిదీన యనుటచే నెప్పుడును నిట్లే శోకముతోఁ గూడినదై యుండునా, కొన్నినాళ్ళు సంతోషము గలదై యుండెనేమో యందమా, దానికిఁ దగిన యాధారములేని మనస్సుగల దానిని; పరమనియమ=ఆమెశోకము బాధ యెట్లున్నను ఆమెను జూచినయెడల నీమె జన్మప్రభృతి గొప్పనియమములు గలదని, పరమ పతివ్రతయని స్ఫురింపఁజేయు దానిని,భద్రనిమిత్తముల్=శుభసూచకములు ధనిన్=ధనవంతుని, సేవకులు తమ యుజ్జీవనార్థము ధనికుని యొద్దకుఁ దామేపోయి యతని నాశ్రయింతురు. అట్టులే శుభశకునములు తమంతటఁ దామే తాము శుభ శకునము లనిపించుకొనుటకుఁ దమ యుజ్జీవనార్థము ఆమె యొద్దకు వచ్చె నని భావము. లక్ష్మీకము=సేవకులు లక్ష్మిని గోరి లక్ష్మిగల వాని నాశ్రయించి వారి సేవచేసి వారి కుపకరించి ధన్యులగు చున్నారు. ఈ శుభశకునము లట్లుగావు.

సాక్షాల్లక్ష్మి యగు సీతాదేవినే యాశ్రయించి యామె కుపకరించి రాజు నాశ్రయించి రాజ భటులను గౌరవము సంపాదించు కొనునట్లు తాము శుభశకునములని పేరొందెను. అరాళ=వంకరయగు ముత్తెపుఁజిప్పలవంటి రెప్పలయొక్క, పక్ష్మరాజీ=వెంట్రుకల సమూహముచే, వృతము=ఆవరింపఁబడినది. విశద విశాలము=విశదము=నల్లగ్రుడ్డుచుట్టు తెల్లగాఁ నుండునది, విశాలము=వెడలుపైనది, వినీలము=నల్లని గ్రుడ్డుకలది, వామలోచనము = ఎడమకన్ను, మీనాహతము=చేపచేఁ గొట్టఁబడినది, పద్మంబన=కమల మనునట్లు, కనులకొన లెఱ్ఱగా నున్నవని భావము. 'ప్రాంతరక్తే చ నేత్రే' యని యుండుటచే నీ వర్ణన మీమె పద్మినియని తెలుపుచున్నది. పీనము=బలిసినది, వృత్తము=గుండ్రనిది, చందన+అగురు+సమర్హము=చందనము పూతకు, అగురు పూతకు యోగ్యమైనది, పరమలోకనాథ=లోకపరమనాథ యని యన్వయము, లోకముల కన్నిటికి శ్రేష్ఠుఁడైన నాథుఁడు, లోకనాథు లనిపించుకొన్న వారి కందఱకు నాథుఁడని భావము "ఏకో దేవో నారాయణః-ఏకమేవాద్వితీయమ్ న త్వత్సమో స్త్యభ్యధికః కుతోన్యః" భ.గీ. ౧౧-౪౩ అను శ్రుతి స్మృతివాక్యములు స్మరణీయములు. ఇది వాల్మీకి యభిప్రాయము. చిరగృహీత=బహుకాలమునకుఁ బూర్వము. అనఁగా ననాదిగ సూక్ష్మావస్థ యందును, స్థూలావస్థ యందును, నవ్య=అందమైన, వామభుజంబు=ఎడమచేయి, కొంతసేపు=కొంచెముసేపు, ఎక్కువకాల మదిరిన వాతరోగ మగును.

## తాత్పర్యము

ఇంతంతని చెప్పరాని బాధపడుచు సంతోష మనునది లేక మిగుల శోకపూరితమయిన మనస్సుగలదయ్యు పరమవ్రతము విడువక యుండు సీతకు ధనవంతునిఁజేరు సేవకులవలె శుభశకునములు కానవచ్చెను అవి యేవి యనిన శోభతోఁ గూడి వంకర వెంట్రుకలచే నావరింపఁబడి తెల్లనై విశాలమై నల్లనైన గ్రుడ్డుగలదై యంచున నెఱ్ఱని కాంతిగల యెడమ కన్ను చేపతాఁకుచేఁ గదలెడి పద్మమువలెఁ జలించెను. మృదువై మనోహరమై బలిసినదై గుండ్రమైన చందనాగురు గంధముల కర్హమై లోకాధినాథుఁ డగు శ్రీరామచంద్రమూర్తిచేఁ జిరకాలముగ గ్రహింపఁబడినదగు మనోహరమైన యెడమచేయి యంతకంత కెక్కువగఁ గొంచెముసేపు కదలెను.

క. కరిరాజహస్తనిభములు, సరసంబులుఁ బీవరములు•సంహతములు నా
  కరభోరుతొడల నెడమది, పొరిఁబొరి రఘురాముఁ జూపు•పొలుపున నదరెన్.

అర్థములు. కరిరాజహస్త నిభములు=శ్రేష్ఠమైన యేనుఁగు తొండముతో సమానములైనవి, సరసంబులు=అందముతోఁ గూడినవి. పీవరములు=బలిసినవి, సంహతములు=ఒకదాని నొకటి తాఁకియుండునవి, కరభోరు తొడలన్=సీతాదేవి తొడలందు.

స్త్రీలకు నెడమ కన్ను, ఎడమభుజము, ఎడమతొడ అదరెనేని ఫలము

వెంటనే కనఁబడును. అట్టులే పురుషులకుఁ గుడివైపు కన్ను, భుజము, తొడ యదరెనేని వెంటనే శుభఫలము గలుగును.

### తాత్పర్యము

ఏనుఁగు తొండముతో సమానములై, యందములై, బలిసినవై-కావుననే జోడించి నపుడు నడుమ నెడములేనివైన సీతాదేవి తొడలందు నెడమతొడ రామ చంద్రమూర్తిని నేను జూపెద నన్నట్టు లదరెను. సీతాదేవికి నెడమకన్ను, ఎడమ భుజము, ఎడమతొడ యదరెనని చెప్పినఁజాలునే. ఇంత వ్యర్థవర్ణన మేల? ఇది వ్యర్థవర్ణనముగాదు. లోకములోని స్త్రీలకు నేదైన నంగవైకల్యము వారి దుఃఖ ములకుఁ గారణము. అట్టి యంగవైకల్య మీమె యందు లవమైన లేదు. అట్లుం డియు దుఃఖింపనేల యనిన నిదియామె స్వయముగఁ గోరి తెచ్చుకొన్నదే. కాలు చున్న యింటిలోఁ జిక్కుకొన్న బిడ్డలబయటఁ దెచ్చుటకు దానిలో దుముకు గయావతివలె రావణు చెఱలో నుండు స్త్రీలను రక్షింపఁ దాను జెఱలోఁ బ్రవే శించెనుగాని, కర్మానుభవమునకై కాదు. ఈవిషయము దెలుపుటకై యీ యవ యవ వర్ణన మని యెఱుంగునది. అటుగాకున్న బలిసిన భుజములు, బలిసినతొడలు ననునవి మునుపటి స్థితిగాని, కూడు నీళ్ళులేక శుష్కించిన యిప్పటి స్థితిగాదు, దాని నిప్పుడు చెప్ప నేల?

క. చారురద చారులోచన, సారసముఖి యైన సీత•స్వర్ణాభవిభో
 దారము దూసరితం బగు, చీరయు నొక యింత సడలె•నేమముఁ దెలుపన్.

**అర్థములు.** చారురద=అందమైన దంతములు గలది, చారులోచన=అందము లైన కన్నులు గలది, సారసముఖి=కమలమువంటి ముఖము గలది, స్వర్ణాభ= బంగారుతో సమానమైన, విభా+ఉదారము=కాంతిచే గొప్పది, ధూసరితము= దుమ్ముచే నిండి బూడిదరంగు గలది. వ్యాకరణము:— సీత యనునది చీరతో సమసించును. సీత చీర యని షష్ఠీతత్పురుషము. ఈ రెండుమాటల నడుమ చీరకు విశేషణములైన స్వర్ణాభ విభోదారము, ధూసరితము అను పదములు వచ్చినవి. ఇట్లు సమాసము నడుమ వ్యస్తపదములు రావచ్చునా? "ఒక్కొక్కచో సమాస గత పూర్వ పదంబు వ్యవహితోత్తర పదం బొంటితోడను, వాని పెక్కింటి తోడను నన్వయించెడి" ప్రౌ. వ్యా. సమా. ౩౮. సూ. "ఒక్కొక కన్నును, జెవియును, జెక్కును, మూఁపు చెలు వగు చేయున్. భార. సభా. ౧ ఆ. ఇచ్చట నొక్కొక చేయున్ అను సమాసము నడుమ చెలువగునను విశేషణము వచ్చినది. సడలెన్=వదు లయ్యెను. నిష్కారణముగఁ గట్టుకొన్న వస్త్రము జాఱుట శుభ సూచకము.

### తాత్పర్యము

అందములై దానిమ్మగింజలవంటి దంతములు, నందములైన కన్నులు, కమ లమువంటి ముఖముగల సీతాదేవి కట్టుకొనియున్న పచ్చని కాంతి గలిగి మాసిన చీర కొంచెము వదలి జాఱెను.

క. మున్నుగడు లెస్సయెఱిఁగి, యున్న నిమిత్తములఁ జూచి•యుగ్రాతపవా
తోన్నతిఁ జెడు బీజము వృష్టి న్నన మొలలెంచు మాడ్కి•సీతయు నలరెన్.

అర్థములు. ఉగ్ర+ఆతప+వాత+ఉన్నతిన్=భయంకరమైన యతిశయించిన యెండకు, గాలికి, వృష్టిన్=వానచే, నన=మొలక.

తాత్పర్యము

మును చక్కఁగా దెలిసియున్న శకునములఁ జూచి తీవ్రమైన యెండకు, గాలికి నెండిపోయిన, నేలలోఁ బడియున్న విత్తనము వాన పడఁగానే మొలక లెత్తునట్లు సీతాదేవి సంతోషించెను.

క. బింబఫలాధరమును రో,లంబాలకమును సుమంజు•లభ్రువు నీరే
జాంబకమున్ సితదంతం,బుం బోలిచెను ముఖము రాహు • ముక్తేందుగతిన్.

అర్థములు. బింబఫలాధరము=దొండపండువంటి పెదవిగలది, రోలంబాలకము=తుమ్మెదవంటి ముంగురులు గలది, ఇవి యన్నియు బహువ్రీహి సమాసములు, సుమంజుల భ్రువు=మిగుల మనోహరమైన కను బొమ్మలు గలది, నీరేజాంబకము=కమలమువంటి కన్నులు గలది, సితదంతంబున్=తెల్లని పండ్లుగలది, రాహు ముక్తేందుగతిన్=రాహువుచే విడువఁబడిన చంద్రునివలె.

తాత్పర్యము

దొండపండువంటి పెదవి, తుమ్మెదలవంటి ముంగురులు, అందమైన కనుబొమలు, కమలము వంటి కన్నులు, తెల్లని దంతములుఁ గల సీతాదేవి ముఖము రాహువుచే విడువఁబడిన చంద్రునివలెఁ బ్రకాశించెను.

సాముద్రిక శాస్త్రమందలి యీ శ్లోకము నిచట స్మరింపనగు.

కన్నులు-లలనాలోచనే శస్తే, రక్తాంతే కృష్ణతారకే, గోక్షీరవర్ణ విశదే సుస్నిగ్ధే కృష్ణపక్ష్మిణీ, ఉన్నతాక్షీచ దీర్ఘాయుః.

కనుకొలుకులం దెఱుపు-కనుపాపలు నలుపు-దానిచుట్టు నావుపాలవలెఁ దెలుపుగలవై, నునుపై నల్లని తెప్పకొనలు గల కన్నులు, మిగుల శ్రేష్ఠములు. కన్నులు కొంచెము మిట్టగనుండిన (మిడిగ్రుడ్లు కావు) దీర్ఘాయువు గలదగును. తొడలు:-"సుదృఢైః కరభాకారై రూరుభి ర్మసృణై ర్ఘనైః। సువృత్తై రోమరహితై ర్భవేయు ర్భూమివల్లభాః॥

తొడలు దృఢములుగను, కరభములవలెను, నునుపుగను, లావుగను గుండ్రముగను వెండ్రుకలు లేకయు నుండిన రాజులకు భార్యలగుదురు.

దంతములు: గోక్షీర సన్నిభా స్నిగ్ధా ద్వాత్రింశద్దశనాః శుభాః। అధస్తాదుపరిష్టాచ్చ సమాస్తోక సమున్నతాః॥

ఆవుపాలవలెఁ దెల్లనై గంతులు లేక నునుపై క్రింద మీఁద సమములై కొంచెె మెత్తుగలిగి ముప్పది రెండు పండ్లుండెనేని శుభము.

పెదవులు:— పాటలోవర్తులః స్నిగ్ధో రేఖాభూషితమధ్యమః। సీమంతినీ నామధరో ధరాజానిప్రియా భవేత్॥ ఎఱ్ఱనై-గుండ్రమై-నునుపై నడుమ రేఖగలిగిన పెదవి గల స్త్రీ రాజపత్ని యగును.

ముఖము:-- సమం సమాంసం సుస్నిగ్ధం స్వామోదంవర్తులం ముఖం। సునేత్రం సురదచ్ఛాయం ధన్యానా మిహ జాయతే॥ ముఖము సమమై మాంసము గలదై నునుపై మంచి పరిమళము గలదై గుండ్రమై మంచి కన్నులు పెదవుల కాంతిగలదై యుండెనేని యట్టి స్త్రీ ధన్యాత్మురాలు.

స్తనములు:— ఘనౌ వృత్తౌ సమౌ పీనౌ దృఢౌ శస్తౌ పయోధరౌ॥ స్తనములు గొప్పవిగను గుండ్రముగను, రెండును సమముగను, బలిసినవిగను (గుంతలు లేనివి) గట్టిగను నుండునవి ప్రశస్తములు.

దక్షిణోన్నత వక్షోజా పుత్రిణీ హ్యగ్రజా మతా
వామోన్నత కుచా సూతే కన్యాం సౌభాగ్య సుందరీమ్॥

కుడి స్తన మెత్తుగ నుండిన మంచి కొడుకులు గలదగును. ఎడమ స్తన మెత్తుగ నుండిన సౌభాగ్యవతియు, సుందరియు నగు కూఁతును గనును. "మూలే స్థూలాక్రమ కృశా వగ్రే తీక్ష్ణౌ ప్రశస్తకౌ" మొదట నడుగు భాగమున లావు గను గ్రమక్రమముగాఁ బైకిఁబోవు కొలఁది సన్నముగను (మారేడుకాయవలె) కొనలు తీక్ష్ణముగ నుండిన స్తనములు ప్రశస్తములు.

"సదృశం చూచుకయుగం శస్తం శ్యామం సువర్తులమ్." రెండు చనుముకుఁలు సమానముగను, నల్లగను గుండ్రముగ నుండిన ప్రశస్తములు.

వెంట్రుకలు: కేశా అళికులచ్ఛాయా సూక్ష్మా స్నిగ్ధా స్సుకోమలాః
కించి దాకుంచితాగ్రాశ్చ, కుటిలాశ్చాతి శోభనాః.

తుమ్మెదరెక్కల కాంతిగలిగి సన్నములై, నునుపులై, మృదువులై, కొంచెము వంగిన కొనలు గలవై వంకరలయి యున్న వెంట్రుకలు శుభప్రదములు.

కనుబొమలు:—భ్రువౌ సువర్తులౌ తన్వ్యౌ స్నిగ్ధే కృష్ణే త్వసంహతే
ప్రశస్తౌ మృదురోమాణౌ, సుభ్రువః కార్ముకాకృతీ.

గుండ్రములై, నునుపులై నల్లనై-ఒకదానితో నొకటి కలియనివై మెత్తని వెంట్రుకలు గలవై విండ్లవలె నుండు కనుబొమలు ప్రశస్తములు. ఇవన్నియు నుత్తమ స్త్రీలక్షణములు. సీతాదేవియం దివి యన్నియుఁ గాన నగును.

క. అంతట శ్రీరఘురాముని, కాంత విగతశోక హర్ష♦కలితయునై యే
కాంతము శోభిల్లె నిశా, కాంతునితో వెలుగు రేయి♦గతి నవ్వేళన్. ౭౮౦

అర్థములు. విగతశోక=పోయిన శోకము గలది, హర్షకలితయు=సంతోషము కలది, ఏకాంతము=మిక్కిలి.

## తాత్పర్యము

ఇట్లు శుభ శకునములు కనఁబడిన పిమ్మట సీతాదేవి శోకమువదలి సంతోషించినదై చంద్రునితోఁ గూడిన రాత్రివలెఁ బ్రకాశించెను. నిశాకాంతునితోడి నిశవలె శ్రీరఘురాముని కాంత యనుటచే భర్తతోఁ గూడినంత సంతోషము గలదయ్యె నని భావము.

♦ ౩౦-వ సర్గము. సీతాదేవితో నెట్లుభాషింపఁదగునని హనుమ యోజించుట ♦

క. సీతావిలాప మసురీ, వ్రాతము బెదిదములు త్రిజట♦స్వప్న కథనమున్
వాతతనూజుఁడు విని భూ, జాతను సురవని నమర్త్య♦సఖిఁగఁ దలంచున్. ౨౮౧

అర్థములు. విలాపము=ఏడుపు, అసురీ వ్రాతము=రాక్షస స్త్రీలయొక్క, బెదిదములు=పరుషంపు మాటలు, బెట్టిద శబ్దమునకువలె దీనికిని బహువచనమందే యీ యర్థము. కథనము=చెప్పుట, సురవనిన్=నందనమందలి, అమర్త్యసఖిగ= అప్సరసవలె, విని, తలంచున్-ఈ రెండు క్రియలకు సమానాశ్రయితయే వివక్షితముకాని యుత్తర కాలీనత వివక్షితము కాదు.

## తాత్పర్యము

సీతాదేవి యేడుపు మాటలు, రాక్షసస్త్రీల బెదరింపు మాటలు, త్రిజట చెప్పిన కలవిషయమైన మాటలు హనుమంతుఁడు విని యీమె దేవలోకములోని నందనవనమున నుండు దేవతాస్త్రీగాని, మనుష్యస్త్రీ గాదని తలఁచెను. ఈమె సీతాదేవియే యనుటకు నిందుఁ జెప్పఁబడినవి, స్వతంత్రములు, పరోక్షములు, పరస్పర సంబంధములేని సాక్ష్యములు. ప్రత్యక్ష సాక్ష్యము దేహమునందుఁ గాన వచ్చిన సాముద్రిక చిహ్నములు. ఇన్ని విధములఁ బ్రత్యక్ష పరోక్ష నిదర్శనములచే నీమె సీతయే. రామచంద్రమూర్తి సందేశము విన నీమె యర్హయే యని యెట్లు హనుమంతుఁడు తీర్మానించుకొనెనో యట్టులే యాచార్యుఁడును శిష్యుఁడుగా గ్రహింప నుద్దేశించిన వానిని బ్రత్యక్ష పరోక్ష నిదర్శనములచే భగవత్తత్త్వ రహస్య ముపదేశింప నర్హుఁడా యని పరీక్షింపవలయును.

ఉ. వేయితలంపు లూరఁబడి♦వేలవిధంబుల యోజనాపరుం
డై యతిసంఖ్యులైన ప్లవ♦గాగ్రణు లెల్లెడ నే సతీమణిన్
రోయుచు నున్నవారొ సిత♦రోచిముఖిం గనుఁగొంటి నిందు నే
నా యలినీలవేణిఁ గుసు♦మాసవసన్నిభవాణి జానకిన్. ౨౮౨

అర్థములు. యోజనాపరుండై = ఆలోచనలతోఁ గూడినవాఁడై, అతిసంఖ్యులు=లెక్కకు మించినవారు, ప్లవగాగ్రణులు=వానరశ్రేష్ఠులు, సితరోచిముఖిన్=చంద్రముఖిని, అలినీలవేణిన్=తుమ్మెదలవలె నల్లనైన జడగల దానిని, స్త్రీని, కుసుమాసవ=తేనెతో, సన్నిభ=సమానమైన, వాణిన్=వాక్కుగల దానిని.

## తా త్ప ర్య ము

అనేకము లగు తలంపులు గలుగఁగా ననేకవిధంబుల యోచించి హనుమంతుఁడు తనలోఁ దా ని ట్లనుకొనుచున్నాఁడు. లెక్కలేని వానరు లే సతీరత్నమును వెదకుచున్నారో యా స్త్రీని నే నింకు జూచితిని.

క. చారుఁడ నై యోగ్యుఁడ నై, వైరిబలాబలము లెఱుఁగఁ వలఁతిని నా నే
నారసి యసురవిశేషము, లీ రావణుబలముఁ బురముఁ నెఱిఁగితి నెల్లన్. ౭౮౩

అర్థములు. చారుఁడనై=వేగులవాఁడనై, హనుమంతుఁడు దూతగాఁ బంపఁబడెనుగాని వేగులవాఁడుగాఁ బంపఁబడ లేదు, దొంగ వేషములతో, దొంగ చేష్టలతో, దొంగమాటలతోఁ గార్యము చేయువాఁడు వేగులవాఁడు. దూత బహిరంగముగ వర్తించువాఁడు. వీఁ డూరు పేరు దాఁపఁడు, ఇట్టివాఁడు తాను వేగులవాఁడ ననుటయే గాక యోగ్యమైన కార్యముచేసితి ననియుఁ చెప్పుచున్నాఁడు. ఇది యెట్లు సమంజసము?

సుగ్రీవుఁడు సీతాదేవి యెందున్నదో చూచి రండని చెప్పెను. రామచంద్ర మూర్తి సీతాదేవితో మాట్లాడి రమ్మని ముద్రిక యిచ్చెను. వెదుకుటయును కార్యము రహస్యముగను జేయవచ్చును. బహిరంగముగఁ జేయవచ్చును. ఇచ్చట బహిరంగముగఁ జేయఁబూనినఁ గార్యభంగమగును. అది యాచితీవిరుద్ధము. దొంగవలె వెదకుట పౌరుషవిరుద్ధము కాదా యనిన నది యెట్టివారియం దట్టులే వర్తించుట, యెవరికైన నీతిబాహ్యము కాదు. "కుటిల బుద్ధుల గెలువంగఁ గుటిల మతియ, యర్హమగుఁగాని నీతిగా దార్జవంబు" అని నీతి లక్షణము. మఱియు "యో యథా వర్తతే యస్మిన్, తస్మిన్నేవం ప్రవర్తయన్। నాధర్మం సమ వాప్నోతి, న చాశ్రేయశ్చ విందతి" (భార. ఉ. ౧౭౮-౩౦.)

ఎవని విషయమున నెవఁడెట్లు వర్తించుచున్నాఁడో వాని విషయమున వాఁడట్లు వర్తించినయెడల ధర్మహాని లేదు శ్రేయోహాని లేదు. ఇది భీష్మవాక్యము.

యస్మిన్ యథా వర్తతే యో మనుష్యః
తస్మిన్ తథా వర్తితవ్యం స ధర్మః
మాయాచారో మాయయా బాధితవ్యః
సాధ్వాచారః సాధునా ప్రత్యుపేయః॥ శాంతి.

ఏ మనుష్యుఁ డితరుని పట్ల నెట్లు వర్తించునో వాని విషయమున నితరు లట్లే వర్తింపవలయును. అదియే ధర్మము. మాయలమారిని మాయచేత బాధింపవలయును. సాధు వగు నాచారము గల వానిని సాధుమార్గముననే జయింపవలెను. (శాంతి ౧౦౯-౨౯)

'త్వం మాయాభి రనవద్య మాయినం......వృత్రం అర్దయః'

ఓ పాపరహితుఁడైన యింద్రా! మాయలాఁడగు వృత్రుని నీవు మాయచేతనే

చంపితి వని ఋగ్వేదమునందు నింద్రుని మాయావిత్వము నిందింపఁబడక శ్లాఘింపఁ బడెను. (ఋ.౧౦.౧౪౭-౧-౮౦-౭)

ప్రజంతి తే మూఢధియః పరాభవం
భవంతి మాయావిషు యే న మాయినః
కిరాతార్జునీయం ౧-30.

మాయావుల విషయమై యెవరు మాయతో వర్తింపరో వారు నాశమగుదురు

ఇట్టి మహావాక్యము లుండుటచే వంచనచేసి చోరుని వలె వర్తించిన రావణుని విషయమై హనుమంతుఁడు వంచనముగఁ బ్రవర్తించుట ధర్మవిరుద్ధముగాదు. ఇంతకుఁ దన కార్యము సాధింప, అనఁగా సీతను వెదకుటయందు చారునివలె వర్తించెనే కాని, నిద్ర పోవువాని గొంతు పిసుక లేదు. హనుమంతుని వేగుతనమున రావణునకు వచ్చినహాని యేమియు లేదు. ఓయీ యట్లైన 'న పాపే ప్రతిపాపః స్యాత్' పాపివిషయమున మనము పాపము చేయరాదు. అనియు "అక్రోధేన జయేత్క్రోధం, అసాధుం సాధునా జయేత్, జయేత్ కదర్యం దానేన జయే త్సత్యేన చానృతమ్" అక్రోధముచేఁ గ్రోధమును, సాధుత్వముచే నసాధువును, దానముచే లోభిని, సత్యముచే నసత్యమును జయింపవలె నను (భా.ఉ. 3౮-23-3౪) వాక్యములు వ్యర్థములా యనిన వ్యర్థములు కావు. సాధు మార్గముచేఁ గార్యము చక్కఁబడు నని తోఁచినపుడు వంచన చేయరాదు. సామదానములు వ్యర్థములు, కార్యహాని కరములు అని తోఁచినపుడు 'విషస్య విషమౌషధ'మ్మన్నట్లు (విషము విఱుగుటకు వేఱొక విష మిచ్చుట) వంచనకు వంచనయే యర్హకార్యము. గోటఁ బోవుపనికి గొడ్డలి ప్రయోగింపరాదు. గాని, గొడ్డలి ప్రయోగించినఁ గాని కార్యము చక్కఁబడ దని తోఁచినపుడు గొడ్డలి నుపయోగించుట తప్పు గాదు. వలఁతిని=సమర్థుఁడను, ఆరసి=వెదకి.

తాత్పర్యము

వేగులవాఁడనై యుపాయముచేఁ దగిన కార్యము చేసిన వాఁడనై యెట్టులైన యుద్ధము తటస్థించునుగాని తప్పదు, గావున శత్రువుల బలాబలము లెఱుఁగ సమర్థుఁడ నగు నేను పురమంతయుఁ దిరిగి వెదకి రాక్షసులందుఁగల వారి వారి బల తారతమ్య విశేషము, రావణు బలము, పుర లక్షణము సర్వము తెలిసికొంటిని. ఇప్పటికి సుగ్రీవుఁడు చెప్పిన కార్యము సాధించి యిఁక రామచంద్రమూర్తి చెప్పిన కార్యము సాధింప నాలోచించుచున్నాఁడు.

సీ. అటుగాన నప్రమేయగుణాకరుండును, నఖిలభూతహితుండు•నైన రామ
చంద్రు దేవిని భర్తృ•సందర్శనాసక్త, నాశ్వాసించుటె శుభం•బైన విధము
దుఃఖనిర్మగ్న యై•దుఃఖాంత మెఱుఁగక, సంతపించెడి పూర్ణ•సౌఖ్యపాత్ర
నూఱడింపకయ యే•నూరక పోయిన, సత్య మనర్థంబు•సంభవిల్లు

తే. నీ యశస్విని తన్నుఁదా•నిందుఁ గాచు,కొనఁగ నేరక మరణించు•గురుబలుండు
దశరథసుతుండు జానకీ•దర్శనేచ్ఛుఁ,డతని నాశ్వాసపఱుచుటే•న్యాయ్యమగును.

అర్థములు. అప్రమేయగుణాకరుఁడు=ఇంతమాత్రము ప్రమాణమని కొలఁత చెప్పరాని కల్యాణ గుణములకు గనియైనవాఁడు, భర్తృసందర్శనాసక్తన్= భర్తను జూచుటయందుఁ గోరిక కలదానిని, అశ్వసించుటె = ఊఱడించుటయే, పూర్ణసౌఖ్యపాత్ర=నిండిన సౌఖ్యముల పాత్రము-సౌఖ్యములను బూర్ణముగా నను భవింప యోగ్యురాలు, అనర్థంబు=కీడు, యశస్విని=కీర్తిమంతురాలు, జానకీ దర్శనేచ్ఛుఁడు=సీతాదేవిని జూడఁ గోరిక కలవాఁడు.

## తాత్పర్యము

రావణుని గుఱించి తెలియవలసిన విషయము లన్నియుఁ దెలిసికొంటిని. కావున ననంత కల్యాణగుణఖనియును సర్వభూతములకు మేలుగోరువాఁడును నగు రామచంద్రమూర్తి దేవిని పతినిజూడ నాసక్తి గలదానిని నామెభర్త యోగ క్షేమములు డెలిపి ధైర్యము వచ్చునట్లు చేయుటయే మేలగు కార్యము. అట్లు చేయక వచ్చినవాఁడను వచ్చినట్లు పోయితినా యీయామె దుఃఖము తుదనెఱుఁగక దుఃఖము నందు మునిఁగి సంతపించుచున్నది. ఈమె మిగుల సౌఖ్య మందవలసినదే కాని యిట్టి స్థితియందుండఁదగినది కాదు. కావున నీమెకు ధైర్యోక్తులు చెప్పి యీయామె దుఃఖము నివారించుట ప్రథమ కార్యము. అంతమాత్రమే కాదు. నేనీమె నూఱడింపక పోయితి నేని మఱియొక యనర్థము కూడఁ గలదు. ఈమె యెంతో కీర్తికి నర్హురాలు. ఇట్టి యీయామె తన్నుఁదాను రక్షించుకొనలేక మరణించును. అక్కడనో మహాబలశాలి యగు రామచంద్రమూర్తి సీతాదేవి నెప్పు డెప్పుడు చూతునా యని యాసక్తి గలవాఁడై యున్నాఁడు. ఆయనమాట లీమెకుఁ జెప్పి యూరార్చినట్టు లీమె వృత్తాంత మాయనకుఁ దెలిపి యాయనను నూరార్పవలెను. ఇదియే న్యాయయుక్తమైన మార్గము.

ఆ. ఏమి సేయవచ్చు•నీ రక్కసులు విను,చుండఁ బల్కు-నెట్లు•యుక్త మగును
మగువ నేను రాత్రి•తెగుదలలోపల, నూఱడింప కున్న•నుసుఱుఁ బాయు.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి వృత్తాంత మీయామెకుఁ జెప్పుట యావశ్యకమే కాని చెప్పు టెట్లు? నా మాట లీ రాకాసులు వినరాదు. వినిరా యిప్పుడేపోయి రావణునకుఁ దెలుపుదురు. వాఁడు బయలుదేఱి వచ్చును. అనుకొన్న కార్య మనుకొన్నట్లు గాదు. చెడును. కావున వీరికిఁ దెలియకుండునట్లు సీతాదేవికి మాత్రము తెలియునటు మాటలాడుటబాగు. ఉదయము కాకముందే నే నీ కార్యము చేయక పోయితినా యీయామె నూరడింపక పోయితినా యీయామె ప్రాణము విడుచుట నిజము

మ. హనుమా! యే మని నాకుఁ జెప్పు మనె నయ్యా! జానకీదేవి నీ
వనుమా తద్వచనంబులెల్ల నని ధర్మాత్ముండు శ్రీరాముఁ డా
య్యనఁ బల్కన్ సతి నిందుఁ జూచియును మాట్లాడింప కే నేగి లో
ననుమానింపక యేమి మా టిడుదు? నర్థాంబౌనె నా కా విధుల్? ౭౮౬

తా త్ప ర్య ము

అంతియకాదు. రామచంద్రమూర్తి యొద్దకుఁబోఁగానే హనుమంతా! సీతను జూచితివికదా. ఉంగర మిచ్చితివా? దానిని జూచి యామె యే మనెను. ఆమాటలన్నియుఁ జెప్పుమని ధర్మాత్ముఁ డగు శ్రీరామచంద్రమూర్తిదీనుఁడై యడుగును గాని యడుగకపోఁడు. ఈమెను మాట్లాడింపకపోయితినేని నాయనతో జంకులేక యేమని చెప్పుదును? చూచిరమ్మనినఁ జూచివచ్చితిని. మాట్లాడలేదని జెప్పుదునా? ఉంగర మేమిచేసితి వనిన నేను ధరించితినందునా? అటువంటిపని నాకుఁదగినదా? నేనట్లు చెప్పఁదగునా?

క. సీతాసందేశము లే, కా తరణికులేంద్రుఁ జూడ నరిగిన నతఁడున్
జాతాధికకోపానల, హేతుల నను నీఱుఁ జేయ కేలా మానున్. ౭౮౭

అర్థములు. సీతాసందేశము=సీతాదేవి చెప్పిన వార్త జాతాధిక కోపానల హేతులన్=పుట్టిన యధికమైన కోపమనెడి యగ్నిజ్వాలలచే, నీఱు=భస్మము.

తా త్ప ర్య ము

సీతాదేవి రామచంద్రునకేమి చెప్పునో తెలిసికొనక యాయనను జూడఁబోఁగానే యాయన తీవ్ర మగు కోప మనెడి యగ్నిజ్వాలలచే నన్ను భస్మము చేయకుండునా? పోయిన వాఁడవు చూచినవాఁడవు మాట్లాడింపక యేమనివచ్చితి వనఁడా?

సీ. సీత యున్నది లంకఁ జెచ్చెరఁ బడఁడని, రాముకార్యమున శాఖామృగాళిఁ
దోడితెచ్చితి నేని తుదకు వ్యర్థము గాదె, జానకి యింతలో సమసె నేని
యటుగాన నిం దుండి యంతరంబును రోసి, జానకి నూరార్చి చనుట లెస్స
యల్ప శరీరుండ నందు వానరుఁడను, మనుజునివలె నేను మాటలాడఁ

తే. దగవె సంస్కృతమున? నేను ధరణిసురుని
రీతి సంస్కృత మాడిన భీత యగుచు
దశముఖాసురుఁగా నన్నుఁ దలఁచు నేమొ?
యేమి సేయుదుఁ గ్రోతి నే నెట్లు పలుక? ౭౮౮

అర్థములు. అంతరంబు=సందు, తగిన సమయము, అల్పశరీరుండన్=చిన్న దేహము గలవాఁడను, ధరణిసురునిరీతిన్=బ్రాహ్మణునివలె, సంస్కృతము=దేవభాష.

తా త్ప ర్య ము

సీతాదేవిని జూచిరమ్మనినఁ జూచి వచ్చితి నని నేను జెప్పఁగానే యడవి

క్రోఁతి కింత యెక్కువ తెలివి యెక్కడనుండి వచ్చునని తలఁచి కోపింపఁ డనుకో, నామాట నమ్మి వానరు లందఱు నిటవచ్చిరనుకో, ఇంతలో సీతాదేవి చచ్చెననుకో వారందఱు వచ్చియు వ్యర్థముగదా. కావున నవకాశము చూచి సీతాదేవి నూరార్చిపోవుటే బాగు. ఊరార్చుటెట్లు? నేనా చిన్న దేహముగల వాఁడను. దేహము నిప్పుడు పెంచరాదు. పిల్లక్రోఁతి యగు నేను మనుష్యులు మాటలాడి నట్లు సంస్కృతమున మాటలాడ వచ్చునా? బ్రాహ్మణునివలె సంస్కృతమున మాటలాడిన నీమె భయపడి నన్ను రావణాసురునిఁ గాఁ దలఁచునో యేమో. క్రోఁతి నే నెట్లు మాటలాడుదును?

క. ఊరార్పఁగఁ దగుఁ దరుణిని, నూరార్చుట యెట్లు మానమూనిన? మఱి నే
నేరీతిఁ బలుక, గతి లే, దీ రమణిం బలుకరింతు నే మనుజోక్తిన్? ౨౪

## తాత్పర్యము

మాటలాడక నోరుమూసికొని యుంటినేని యూరార్ప వలసిన యీమెను నే నెట్లూరార్తును? మాటలాడఁబూనిన నే నేరీతి మాటలాడవలె? వేఱుగతి లేదు. ఈమెను నీమెకుఁ దెలిసిన ప్రాకృత భాషయందుఁ బలుకరించెదను. అట్లు చేసితి నేని యీ భాష యీ రాక్షసులకుఁ దెలియదు. గావున నేను జెప్పునది వారి కర్థముగాదు.

క. రూపంబునఁ గ్రోఁతియు నా, లాపంబులు మనుజులవియు లలనామణి దా
రూపించి మున్నె రక్షః స్త్రీ పరిసంత్రస్త భయము చెందదె మఱియున్. ౨౫

## తాత్పర్యము

నేను బ్రాకృతము మాట్లాడిన నందు నొక గండము గలదు. నేనాయాకారమునఁ గ్రోఁతిని. నా మాటలా మనుష్యులు మాటలాడునవి. కాఁగాఁ జూచి క్రోఁతి యేమి మనుష్యునివలె మాటలాడుట యేమి యని సందేహించి యిది యేదో మాయ యని మునుపే రాక్షసస్త్రీలచే భయపెట్టఁబడి యుండునది మరింత భయపడును.

సీ. కంజాక్షి యంతటఁ గామరూపిని నిర్జ, రారినేతఁగ నెంచి యఱుచు భీతి
నా నాదమునఁ జేసి యఖిలాసురాంగనల్, వివిధసాధనహస్తలవుచుఁ గదిసి
కోపించి ననుఁబట్టి రూపుమాపఁగ నొండెఁ, గట్టి కొంపో నొండెఁ గడఁగువారు
కొమ్మల రెమ్మల గొప్ప మొదళ్ళతో, వృక్షముల్ గొని పరువిడుచు నేను
తే. వనమున న్విహరింపఁగ భయదమైన, మత్స్వరూపంబుఁ గనుఁగొని మగువలెల్ల
వికృతముఖములతో వెఱ వేగ మరిగి, రాక్షసేంద్రుని గేహసంరక్షకులను.

అర్థములు. నిర్జరారినేతఁగన్=రావణాసురునిగ, గేహసంరక్షకులన్=ఇంటి కావలివారిని.

## తాత్పర్యము

ఇట్లు భయపడి నన్నుఁ గామరూపి యగు రావణాసురుఁ డీ వేషమున వచ్చెనని తలఁచి యఱచును. ఆ యఱపు విని రాక్షసస్త్రీలందఱు నానాయుధములు తీసికొని నావద్దకు వచ్చి నన్నుఁబట్టి చంపుటకో, కట్టి రావణు నొద్దకుఁ దీసికొని

పోవుటకో, ప్రయత్నింతురు. నేనో కొమ్మలతో, రెమ్మలతో, బోదెలతోఁ జెట్లను బీఁకికొని వారికిఁ జిక్కక పరుగు లెత్తుచు నే నీ వనమునఁ దిరుగఁగా వారు నా భయంకర వేషముఁ జూచి వికారముఖములతోఁబోయి రావణు నగళ్ళ కావలి వారిని.

క. రక్కసులం బిలుతురు వా,రుక్కున శూలములు శక్తు•లు గ్రాసులు నీ
సెక్కఁగఁగొని మొత్తములై, యొక్కట ననుఁ దాఁక రోస•మొదవెడు నాకున్.

అర్థములు. ఈసు=ఈర్ష్య, కోపము, ఉక్కన=బలముచే, అసులు=కత్తులు.

తాత్పర్యము

రాక్షసులను బిలుతురు. వారు బలమున శూలములు, శక్తులు, కత్తులు కోపముతోఁ దీసికొని గుంపులై యొక్కటిగ నాపైపడి రాఁగా నాకు రోషము వచ్చును.

ఉ. వారల నెల్ల జంపుపని • వచ్చినచో జలరాశి దాఁటి యా
తీరముఁ జేర నెట్టు లగు?•దెంపునఁ బైపడి నన్నుఁ బట్టినన్
శ్రీరఘురామవార్త చెవి•సేరదు సీతకు, నేను జిక్కుదున్
ధారిణికన్యఁ బట్టి ఖల•దైత్యసతుల్ వధియింతు, రంతటన్. ౨౫౩

తాత్పర్యము

ఈ వచ్చిన రాక్షసుల నందఱను జంపుచుంటినేని సముద్రము దాఁటియావలి యొడ్డెట్లు చేరఁగలను? అటుగాక వారు సాహసించి పైపడి నన్నుఁ బట్టికొనిరా సీతాదేవికి శ్రీరాముని వార్త చెప్పువా రుండరు. నేను జిక్కుదును. అప్పుడు రాక్షసులు దుష్టులై సీతను జంపుదురు.

ఉ. పాడగు రామభానుజులు•పట్టిన కార్యము, సీత యంటినా
జాడయుఁ గానరా కసుర•సంఘపరీవృత యాచు వార్ధి యే
వీడని పేరగడ్త యయి•విశ్రుతి గాంచిన లంకలోనఁ గా
పాడఁ బడున్ రహస్యముగ•ప్రాణములైనను గోలుపోయెడిన్. ౨౫౪

తాత్పర్యము

అంతతో రామసుగ్రీవులు పట్టిన కార్యము పాడైపోవును. సీతను వారు చంపకపోయిరా, జాడ గూడఁ దెలియ రాకుండునట్లు రాక్షసులచేఁ జుట్టఁబడి సముద్రమే యగడ్తగాఁ గల లంకలో రహస్యముగ నే నేలమాలిగయందో దాఁపఁబడును. లేదా యామె యీ బాధలు పడలేక చావనైనఁ జచ్చును.

చ. కలనను నన్నుఁ జంపినను•గాక రుషామతిఁ గట్టివైచినన్
గలుగఁ డొకండు రామవిభు•కార్యముఁ దీర్పఁగఁ జాలుమేటి, యె
వ్వలను దలంచి చూచినను•వానరుఁ డన్యుఁడు నూఱు యోజనం
బులు గల వార్ధి దాఁటఁగను•బూనెడు వాఁడట లేఁడ యారయన్. ౨౫౫

అర్థములు. కలనను=యుద్ధమందు, రుషామతిన్=కోపముతోఁ గూడిన మనస్సుతో, ఎవ్వలను=ఏ విధముగఁ.

## తాత్పర్యము

యుద్ధమందీ రాక్షసులు నన్నుఁ జంపినను గోపించి కట్టివైచినను రామకార్యము చక్కఁ బెట్టఁగల గొప్పవాఁ డొకఁడైన లేఁడు. ఏ విధముగ నాలోచించినను నూఱుయోజనముల సముద్రమును దాఁటఁగల వానరుఁడు లేఁడు.

ఉ. వేలకొలంది రాక్షసుల • పీఁచ మడంపఁగ నేర్తు నైన దో
ర్లీల వెలుంగఁ, బిమ్మటఁ దరింపఁగ లేను మహాబ్ధి గాసిమై,
నాలములో జయం బపజయం బన రా దిదమిత్థ మంచు, శం
కాలుళితార్థముల్ సలుపఁగా మది గొల్పదు కొంచె మేనియున్. ౨౮౬

అర్థములు. పీఁచము=మదము, దోర్లీల=భుజబలము, గాసిమైన్=బడలిక చేత, ఆలము=యుద్ధము, ఇదమ్+ఇత్థమ్=ఇది యీ ప్రకారము జరుగును, శంకాలుళితార్థముల్=సందేహముచేఁ గలఁత చెందిన కార్యములు, కొల్పదు=సమ్మతింపదు.

## తాత్పర్యము

ఎన్నివేల రాక్షసుల మదమైనను భుజబలముచే యుద్ధమందు నణఁపఁగలను గాని, బడలికచేత మఱల సముద్రము దాటలేను. అదిగాక యుద్ధమందు జయముప జయ మిట్టులే యగు నని నిర్ధారించి చెప్ప నెట్లు? కావున సందేహమున కెడ మిచ్చు కార్యములు చేయ మనస్సు సమ్మతింపదు.

క. సందేహ మైన కార్యము, నం దెవ్వఁడు బుద్ధిమంతుఁ డాలోచన లే
కెందును దెగు? నటు చేసిన, నిందింపఁగఁబడును దుర్వినీతుఁ డటంచున్. ౨౮౨

అర్థములు. తెగును=సాహసించును, దుర్వినీతుఁడు=నీతి యెఱుఁగనివాఁడు.

## తాత్పర్యము

మేలు గలుగుట సందేహమైన కార్యమును బుద్ధిమంతుఁ డగు వాఁ డాలోచింపక చేయ సాహసింపఁడు, అటు సాహసము చేసెనా వీఁడు నీతిమాలిన వాఁ డని లోకులు నిందింతురు.

తే. పలుకరింపక నే నేగ • భయము పేర్మి, మేను దొఱఁగుట నిక్క మీ • మీననేత్ర
పలుకరించితి నేనియుఁ • బైఁ యనర్థ, చేయము లెల్లను బ్రాప్తించు • సత్యముగను.

## తాత్పర్యము

రాక్షసులకు భయపడి పలుకరింపక నేను బోయితినా రాక్షసభయముచే నీమె దేహము వదలుట సత్యము. పలుకరించితినా మీఁదఁజెప్పిన కీడు కలుగుట సత్యము.

క. ఏనట్టు తోఁచు పనులేన్, భానునిఁ గనుగొన్న తమము • పగిదిం జెడెడున్
వానిని దేశము, కాలము, జ్ఞానము లేనట్టిదూత • సలుపఁ గడఁగినన్. ౨౮౯

అర్థములు. తమము=చీకటి

తాత్పర్యము

ఐనది యని నిస్సందేహముగఁ దోఁచు పను లైనను దేశకాల జ్ఞానములేని దూత చేయఁబూనెనేని సూర్యునిఁ జూచిన చీఁకటివలెఁ జెడిపోవును.

క. దీని నిటు సల్ప సఫలం, బౌ నని ప్రాజ్ఞులు విధించి♦నట్టిది కార్యం
బైనను జెఱుచును బండిత, మాని యయిన దూత శ క్తి♦మంతుఁడు గామిన్.

అర్థములు. పండితమాని=పండితుఁడనని తన్నుఁదాను దలచువాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము చేసిన నీ కార్యము ఫలించునని బుద్ధిమంతు లేర్పాటుచేసిన పనినైనను పండితమాని యగు దూత సామర్థ్యము లేనివాఁడై దానిని జెఱుచును.

ఉ. ఏగతిఁ గార్యహాని జని♦యింపక యుండునో, బుద్ధిజాడ్య మిం
కేగతిఁ రాకయుండు నొకో♦యేగతి వారిధిలంఘనంబు దా
నోగయి పోక యుండెడినొ♦యుర్విజ యేగతి నాదుమాటలన్
బాగుగ నాలకించు, వెఱ♦పొల్పడ కేగతి నుండ నన్గనన్. ౭౬౧

అర్థములు, జాడ్యము=మాంద్యము, ఓగయి=చెడి, వెఱ=భయము, నన్గనన్=నన్నుఁ జూడఁగానే.

తాత్పర్యము

ఎట్లు చేసినఁ గార్యము చెడక యుండును. బుద్ధిమాంద్యము నా కేగతి రాకయుండును. ఎట్లు వర్తించిన సముద్రము దాఁటుట వ్యర్థము గాక యుండును. ఎట్లు చెప్పిన సీతాదేవి నా మాటలను జక్కఁగా వినును. నన్నుఁ జూడఁగానే సీతాదేవి భయపడకుండు టెట్లు?

సీ. అనుచు దీర్ఘంబుగ♦నాలోచన మొనర్చి,మతిమంతుఁ డగు హను♦మంతుఁడపుడు
కార్యనిశ్చయము సీ♦కరణిని గావించె, నా రూపమును జూప♦కా రఘూత్త
మునిని గీ ర్తించెద ♦ వనజాతలోచన, భయపడ కుండెడు♦పగిది గాఁగ
రఘుకులగ్రామణి♦రాముని విదితాత్మ, ధర్మసహితశుభ♦దంబు లైన

ఆ. మధురవాక్యములను♦మానుగ నమ్మిక, పుట్టునట్టి భంగిఁ♦బొగడువాఁడ
వెలఁది యెంతమట్టు♦విశ్వసించునో దాని, నెఱిఁగి యవలికార్య♦మే నొనర్తు.

అర్థములు, దీర్ఘంబుగ=దూరముగ, ధర్మసహిత=ధర్మముతోఁ గూడినవి, శుభదంబులు=మేలిచ్చునవి, వెలఁది=స్త్రీ, సీత, ఎంతమట్టు=ఎంత మాత్రము.

తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు దూరాలోచనము చేసి బుద్ధిమంతుఁ డగుటచే నిటు చేయవలెనని నిశ్చయించుకొనెను. ఎట్లనఁగా నన్నుఁ జూచినఁగదా యామె

భయపడును. నా రూప మీమెకుఁ గానరాకుండునట్లు కొమ్మలచాటున దాఁచి యీమె భయపడకుండునట్లు రామచంద్రమూర్తిని ధర్మముతోఁ గూడినవియు, శుభము నిచ్చునవియునగు తియ్యని మాటలచే నామెకు నమ్మకము పుట్టునట్లు పొగడెదను. ఆమాట లీమె యెంతవఱకు నమ్మునో చూచి తరువాతి కార్యమాలో చించెదను. ఇంతమాత్రమునఁ జెడునది యేదియు లేదు.

క. అని నిశ్చయించి సీతం, గను చామెయె వినెడునట్లు•గా సరసకుజం
బున మాటుగొనియె పావని, యనియెన్ మధురంబులైన•యవితథసూక్తుల్.

అర్థములు. ఆమెయె=ఆమె మాత్రమె, రాక్షసులకు వినఁబడకుండునట్లు, సరస=సమీపంబుననున్న, కుజంబునన్=వృక్షంబునందు, మాటుగొనియె=దాఁచు కొనియె. అవితథసూక్తుల్=యథార్థములై, వ్యర్థముకాని మంచిమాటలు, మధు రంబులు=వినుటకు స్వయముగఁ దియ్యనివి, లోకమునందుఁ దఱుచుగా నింద్రియ ముల మూలమున జ్ఞానము ప్రసరించి విషయమును గ్రహించిన పిమ్మటనే మన స్సున నాహ్లాదము కలుగుట వాడుక. ఈమాట లట్లుగాక తామే చెవిని స్పృశించు చున్నవో, యాచెవియందే యాహ్లాదమును గలిగించుచున్నవి ఈ మాటలు జ్ఞాన మూలమున నాహ్లాదకరములు. స్వయముగనే యాహ్లాదకరములు ఇచ్చట జ్ఞానము నకు నాహ్లాదకరత్వము శబ్దమూలమున నని యెఱుఁగునది. ఈ వాక్యముల కంతటికి మాధుర్యము గలదని యతిశయోక్తి. అవి తథసూక్తులు=ఈ వాక్యములు సీత విన్నతోడనే సంతోషపడి తాను బూనియున్న ప్రాణత్యాగ ప్రయత్నము తప్పక మానునని భావము ఏ యుద్దేశముతో నామాటలు చెప్పఁబడెనో యాయుద్దేశము నెఱవేర్చు శక్తి యీ మాటలయందుఁ గలదని భావము. సూక్తుల్=ఈ వాక్యము లకు నాహ్లాదకరత్వము పూర్వాపర నిరూపణముచేఁగాదు. వానియందు సహజము గానే యున్నదని భావము. తాత్పర్యము

ఈ ప్రకారము నిశ్చయించుకొనినవాఁడై హనుమంతుఁ డామెను జూచుచు నామె మాత్రము వినునట్లు దగ్గఱనున్న చెట్టుచాటున నుండియే తియ్యనివి, ప్రయోజనకారులైన మంచి మాట లిట్లనెను.

—• ౩౧ వ సర్గము. హనుమ సీతాదేవి వినునట్లు శ్రీరాముఁ బ్రశంసించుట •—

సీ. దశరథుం డనురాజు•దారకీర్తియు రథ, వారణసైంధవ•భటయుతుండు
ధర్మశీలుఁడు గుణ•ధన్యుండు మాన్యుండు, రాజర్షి వర్యుండు•ప్రకటయశుఁడు
చక్రవర్త్యన్వయ•జాతుండు తపమున, ఋషిఁబోలు బలమున•నింద్రనిభుఁడు
కరుణాపరుండు ని•క్ష్వాకువంశాగ్రణి, సత్యవిక్రముఁ డహిం•సారతుండు

తే. నృపతిలక్షణ యుక్తుఁడు•ఋజుగుణుండు
చతురుదధివృతమేదినీ • చక్రవిభుఁడు

తుండు సుఖదుండు సుఖి యయి ♦ దొరలు లేక
దొరల కెల్లను దొర యయి ♦ పరఁగు చుండు. ౨౬౪

అర్థములు. ఉదారకీర్తి=(౧) గొప్పకీర్తి గలవాఁడు, (౨) ఉదారుఁడు=దాత యను కీర్తి గలవాఁడు, యాచించి వ్యర్థముగాఁ బోయినవాఁడు లేఁ డను కీర్తి, "దానేన ప్రభవా కీర్తిః, ప్రతాప ప్రభవం యశః" అన్నట్లు దానాదుల చేత వచ్చు మంచిపేరు కీర్తి యనియు, ప్రతాపముచే శత్రువుల జయించి సంపాదించిన పొగడ్తకు యశమనియుఁ బేరు.

దశరథుఁ డను పేరు స్మరించు వా రచ్చటలేరు. ఒకవేళ యేదో ప్రస్తావనగా ననుకొన్నను బొగడు వారులేరు కావున దశరథుఁడనురాజు ఉదారకీర్తియను మాటలు చెవిలోఁ బడఁగానే యామెకు సంతోషము జనించి, యామె మనస్సు నాకర్షించి, యావల నేమి చెప్పునో విందమను బుద్ధి పుట్టించెను. ఈ విధముగ హనుమంతుఁడు సీతాదేవి మనస్సును దన వంకకు లాఁగుకొనెను. రథ=తేరులు, వారణ=ఏనుఁగులు, సైంధవ=గుఱ్ఱములు, భట=కాలిబంట్లు, వీరితో-యుఁతుడు=కూడిన వాఁడు, చతురంగబలము గలవాఁడని భావము. ఇట్లు సేనా సమృద్ధి చెప్పఁబడెను. ధర్మశీలుఁడు=ధర్మగుణము స్వభావముగాఁ గలవాఁడు, గుణధన్యుండు=సద్గుణము లను ధనముగలవాఁడు, ధనము చేయు కార్యములు ఆయన గుణములే చేయుచున్నవి. మాన్యుండు=లోకులచే గౌరవింపఁబడువాఁడు, రాజర్షి నగ్యుండు=రాజఋషులలో శ్రేష్ఠుండు, ప్రకటయశుఁడు=ప్రసిద్ధమైన యశస్సుగలవాఁడు,చక్రవర్త్యన్వయ జాతుండు=సగరుఁడు మొదలగు చక్రవర్తులు మూల పురుషులుగాఁ గల వంశమునఁ బుట్టినవాఁడు, సత్యవిక్రముఁడు=సత్యమే విక్రమముగాఁ గలవాఁడు, "సత్యేన లోకాన్ జయతి" యన్నట్లు పరాక్రమముచే సాధింపఁదగిన దానిని, సత్యము చేతనే సాధించువాఁడు, సత్యవిక్రముఁడు=యుద్ధము నందు న్యాయమున నిలిచి, వంచనలేక శత్రువుల గెలుచువాఁడు, బలహీనుఁడు గదా వంచన చేయవలె. నిక్కపు బలశాలికి వంచన యేల? ఋజుగుణుండు=చక్కని నడవడి గలవాఁడు, చతురుదధి=నాలుగు సముద్రములచే, వృత=చుట్టఁబడిన, మేదినీచక్ర=భూచక్రము గలవాఁడని, విశ్రుతుండు=ప్రసిద్ధిగలవాఁడు, సుఖదుండు=ప్రజలకు సుఖమే కలిగించువాఁడు, సుఖి=తాను సుఖము ననుభవించువాఁడు, దొరలులేక=సమానులు లేక, దొరలకు=ప్రభువులకు, దొర=ప్రభువు.

## తాత్పర్యము

దశరథుఁ డనురాజు మహాదాత యను కీర్తిని సంపాదించినవాఁడు. చతురంగ సైన్యము గలవాఁడు.ధర్మస్వభావముగలవాఁడు. సుగుణసంపత్తి గలవాఁడు, లోకపూజ్యుఁడు.రాజర్షులందు శ్రేష్ఠుఁడు. ప్రసిద్ధమైన యశము గలవాఁడు. చక్రవర్తుల వంశమునఁ బుట్టినవాఁడు. తపమున ఋషులకుసముఁడు. బలమునవింద్రసమానుఁడు.

దయాశాలి. ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడు. సత్య పరాక్రముఁడు. అహింసయందుఁ బ్రీతిగలవాఁడు. గొప్ప రాజులకుండవలసిన చిహ్నములు గల వాఁడు. చేతఁ-ని నడవఁడి గలవాఁడు. నాలుగు సముద్రముల నడిమిభూమిని నేలువాఁడు. ఒకరిని సుఖపెట్టి తాను సుఖించువాఁడు, తనతో సములు లేక, ప్రభువులకెల్లఁ బ్రభువగువాఁడు.

తన మామగారి నిట్లు పొగడు మాటలు విన గుణవతి యగు స్త్రీ యెల్లని దుండునా? కావున నిం కేమి వినఁబడునో యని సీతాదేవి యూరక నిలఁబడెను.

ఉ. ఆ మహితాత్మ్మ నగ్రసుతుఁ • డబ్జనిభాస్యుఁ డతిప్రియుండు, శ్రీ
రాముఁడు పేర, స్వీయజన•రక్షణదక్షుఁడు, నాత్మధర్మర
క్షామతి. చాపభృద్వరుఁ డ•ఖండుఁడు నన్నిట, దుష్టశాత్రవ
స్తోమభయంకరుండు, నిజ•శుద్ధకులాగత ధర్మరక్షుఁడున్. ౭౬౫

అర్థములు. అబ్జనిభాస్యుఁడు = చంద్రునితో సమానమైన ముఖము గల వాఁడు, స్వీయజనరక్షణ దక్షుఁడు=తన్నాశ్రయించిన వారిని తన్నాశ్రయించిన వారి నాశ్రయించిన వారిని రక్షించుట యందు సమర్థుఁడు, ఆత్మధర్మ రక్షామతి= స్వధర్మమును రక్షించు మనస్సు గలవాఁడు, చాపభృద్వరుఁడు=చాపభృత్ + వరుఁడు=విల్లుపట్టెడి వారిలో మేటి, అఖండుఁడు నన్నిట=ఏ విషయమందును గొఱఁత యనునది లేనివాఁడు, దుష్టశాత్రవ=దుష్టులగు శత్రువులయొక్క, స్తోమ= సమూహమునకు, భయంకరుఁడు=భయము కలిగించువాఁడు, నిజ=తనయొక్క, శుద్ధ=నిర్మలమైన, కులాగత=వంశపరంపరగా వచ్చిన, ధర్మ=ధర్మమును, రక్షుఁడు=రక్షించువాఁడు.

తాత్పర్యము

గొప్ప మనస్సుగల యాదశరథ మహారాజునకుఁ బెద్దకొడుకొకఁడు గలఁడు. ఆయన పేరు రాముఁడు ఆయన చంద్రునివంటి ముఖము గలవాఁడు, ఆకారణ ముచే నందఱకుఁ బ్రియుఁడైనవాఁడు, తన్నాశ్రయించిన వారిని-వారి నాశ్రయిం చినవారిని రక్షించుటయందు సమర్థుఁడు. స్వధర్మరక్షణమందుమనస్సు గలవాఁడు. విల్లు పట్టెడి వారిలో నెల్లమేటి, అన్ని విషయంబులఁ బూర్ణుఁడు, సర్వజ్ఞత్వ- సర్వశక్తిమత్వ-సర్వసంహారకత్వ-సర్వరక్షకత్వాది గుణము లం దన్నిట నేలో పము లేనివాఁడు, చెడు పగవారికి భయము గలిగించువాఁడు, నిర్మలమైన తన వంశాచార ధర్మమును రక్షించువాఁడు.

ఓహో యెవరో నామగనిపేరు చెప్పుచున్నారే, ఆయన గుఱించి యేమి చెప్పునో-ఉన్నాఁడని విందునో-వచ్చుచున్నాఁడని వింతునో యని తహతహ పాటుతో చెవి మనస్సు విచ్చి సీతాదేవి వినుచున్నది.

సీ. ఆయుసఘుండు స•త్యాత్ముఁడు వృద్ధుఁ డా, తనితండ్రి పనిచిన•పనువుఁ జేసి
తమ్ముఁడు దారయుఁ•దనతోడ రా వనీ, ధారణి కేగి యా•వీరవరుఁడు

మృగయారతుం డయి•మెలఁగుచు శూరులుఁ, గామరూపులు నైన•ఖలసురారి
వరులఁ బెక్కుర జంపె•ఖరదూషణాదులు, సమయుట విని జన•స్థానమునను
తే. మాయలేడి నెపంబున•మాయచేసి, యతని యిల్లాలి రావణుఁ•డపహరించె
నామె వెదకుచు వచ్చి నె•య్యం బొనర్చె, భూవిభుఁడు కీశుఁడైన సు•గ్రీవుతోడ.

అర్థములు. పనుపుఁజేసి=ఆజ్ఞచే, మృగయారతుండయి=వేఁటయం దాసక్తి గలవాఁడయి.

## తాత్పర్యము

పాపరహితుఁడైన యా శ్రీరామచంద్రమూర్తి సత్యస్వభావుఁడు, ముసలివాఁడు నగు తన తండ్రి యాజ్ఞాపించిన ప్రకారము తన తమ్ముఁడు భార్య తనతోడ రాఁగా, నడవుల కేగి యా వీరుఁడు వేఁటకై తిరుగుచు శూరులు, గామరూపులును నగు దుష్టరాక్షసుల ఖరదూషణాదుల ననేకులఁ జంపెను. జనస్థానమున నున్నవారు చచ్చుట విని రావణాసురుఁడు మాయలేడి నెపమున మోసగించి యా రామచంద్రమూర్తి భార్యను అపహరించెను. రామచంద్రమూర్తి యామెను వెదకుచు వచ్చి వానరుఁడైన సుగ్రీవుతో స్నేహము చేసెను.

ఉ. వాని నిమిత్తమై తునిమె•వాలిని, వానర రాజ్యలక్ష్మినిన్
బూనిచె సూర్యసంభవునిఁ • బూని యతండును సీత రోయఁగా
వానరవీరులం బనిచె•వాఁడి చెలంగెడి కామరూపులన్
మానక సర్వదిఙ్నిచయ•మార్గణతత్పరు లైరి వారలున్. ౭౬౭

అర్థములు. పూనిచెన్=పూనునట్లులేసెను, పూనునకు పూనిచె, పూంచె- ఇవి ప్రేరణార్థకరూపంబులు. వాఁడి=పరాక్రమము, సర్వదిక్ + నిచయ=అన్ని దిక్కుల సమూహములందు, మార్గణతత్పరులైరి=వెదకుట యను పనియందు నాసక్తిగలవారైరి.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి తనస్నేహితుఁడైన సుగ్రీవుని నిమిత్తమై వాలినిజంపి సుగ్రీవున కారాజ్యము నిచ్చెను. ఆ సుగ్రీవుఁడు సీతాదేవిని వెదకుటకై పరాక్రమవంతులు, కామరూపులు నగు వానరులఁ బంపెను. వా రన్ని దిక్కులయందామెను వెదకు చున్నారు..

మ. పరగన్ నేను జటాయుసోదరుఁడు నౌ•సంపాతి వాక్యంబునన్
గురుశక్తిన్ శతయోజనాయతమహా•కూపారమున్ దాటితిన్
ధరణీపుత్రి నిమిత్తమై; యిచట సీ•తానాయకోక్తస్వరూ
పరుచిశ్రీలఁ జెలంగు సాధ్వి గుణరూ•పం గంటిఁ బుణ్యంబునన్. ౭౬౮

అర్థములు. పరగన్=త్వరగా, శతయోజనాయత=నూఱుయోజనములు నిడివిగల, మహాకూపారమున్ = గొప్ప సముద్రమును, సీతానాయకోక్త=

సీతాపతి యగు రామచంద్రమూర్తిచేఁ జెప్పఁబడిన, స్వరూపరుచిశ్రీలన్=ఆకారముచేతను, వర్ణము చేతను, కాంతిసంపత్తిచేతను, సాధ్వీన్=పతివ్రతను.

తాత్పర్యము

అట్టివారిలో నొకఁడనైన నేను జటాయువున కన్నయగు సంపాతిమాటల ప్రకారము శీఘ్రముగ నా గొప్ప శక్తిచే నూఱామడ నిడివి గల గొప్ప సముద్రమును సీతాదేవి నిమిత్తమై దాఁటి వచ్చి రామచంద్రమూర్తి చెప్పిన యాకారము, వర్ణము, కాంతి, గుణము, సౌందర్యము గల పతివ్రతను నా పూర్వపుణ్యఫలమునఁ జూచితిని.

చ. అని హనుమంతుఁ డాడ జన•కాత్మజ తద్వచనంబు లన్నియున్
వినిన వెఱఁగంది మోమునను•వ్రేలెడి ముంగురు లల్లఁ ద్రోచికొం
చును మొగ మెత్తి చెట్టుదెసఁ • జూచుచు రాము నెఱన్ స్మరించుచున్
గనియెను గ్రిందు మీఁదును న•గంబునఁ బ్రక్కల నందు నొక్కెడన్. ౭౬౯

అర్థములు. వెఱగు+అంది=ఆశ్చర్యపడి, ఎఱన్=భయముచే, ఆపదలందు, భయసమయముల రామనామస్మరణము "ఆపదామపహర్తార" మ్మను మంత్ర శ్లోకమును బఠించిన నా యాపద, భయము దొలఁగును. ఇది యనేక భక్తులకునను భవ విదితము.

తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు చెప్పఁగా సీతాదేవి యామాట లన్నివిని యాశ్చర్యపడి ముఖముపై వ్రేలాడుచున్న వెంట్రుకలు మెల్లఁగ బైకిఁ ద్రోచికొని యెవ రీ మాటలు చెప్పిన వా రని ముఖమెత్తి చెట్టుప్రక్క చూచుచు నిది యేమి రావణమాయయో, యని భయముచే రామనామము స్మరించుచుఁ జెట్టునందు, గ్రింద మీఁదఁ బ్రక్కల, సందులఁ జక్కఁగాఁ జూడఁగా నందు నొక్క చోట.

—• ౩౨-వ సర్గము. సీతాదేవి హనుమంతునిఁ జూచి భయపడుట. •—

ఉ. తూరుపు కొండపై నరుణు • తోయమువాఁడన నొప్పి కొమ్మలం
దారఁగ డాఁగియున్న కపి•నర్జునచేలుని సాంత్వవాది శం
పారమణీయపింగళుని•భాస్వదశోకసుమోత్కరాభునిన్
జేరువ కొమ్మ నుండెడి య•చింత్యపరాక్రము స్వర్ణలోచనున్. ౭౭౦

అర్థములు. అరుణ తోయమువాఁడు=అనూరునితో సమానుఁడు, ఆరఁగన్=బాగుగ, అర్జున చేలునిన్=తెల్లవస్త్రము గలవానిని, సాంత్వవాదిన్=మంచి మాటలు చెప్పువానిని, శంపా=మెఱుఁగువలె, రమణీయ=అందమైన, పింగళుని=పచ్చనికాంతిగలవానిని, భాస్వదశోకసుమోత్కరాభునిన్=ప్రకాశించు నశోకపుష్పముల సమూహముతో సమానుని, చేరువ కొమ్మన్=సమీపమున నుండు కొమ్మయందు; మెల్లగాఁ జెప్పుమాటలు సీతాదేవికి వినఁబడుటకై సమీపశాఖయందే

యున్నాఁడని భావము. అచింత్య పరాక్రమము=చింతింపరాని పరాక్రమము గల వానిని, సముద్రము దాఁటుట, లంకలో వెదకుట, తన్నుఁగనుఁగొనుట సామాన్యులచే నగుకార్యముకాదు, స్వర్ణలోచనున్=బంగారువంటి కన్నులు గల వానిని.

తా త్ప ర్య ము

తూరుపు కొండమీఁద నుదయించి యుదయింపకయుండు సూర్యునివంటివాఁడనఁ జెప్పఁదగి కొమ్మలందు బాగుగా దాగియున్న తెల్లని వస్త్రము ధరించి ప్రియవాక్కులు చెప్పుచున్న వానిని, మెఱుఁగు వంటి పింగళవర్ణము గల వానిని అశోక పుష్పముల రాశివలె నెఱ్ఱనగు ముఖము గలవానిని, సమీపమందే యుండెడి యద్భుత పరాక్రమము, పచ్చని కన్నులు గలవానిని, క్రోఁతిని,

తూరుపు కొండమీఁది యనూరుఁడు ఎఱ్ఱనివాఁడు, ఎత్తున నున్నవాఁడనుటచే సూర్యబింబము కానవచ్చి కానరాని సమయమును, సూచించుచున్నది. హనుమంతుఁడను ననూరుని దర్శనమగుటచే రామచంద్రమూర్తి యను సూర్యుని దర్శనము శీఘ్రకాలమందే తప్పక కలుగునని భావము.

చ. కని చలియించి యబ్రపడి•క్ష్మాసుత హా! యిది భీషణంబు నౌ
వనచరరూప, మే దొసఁగు•పాటిలునో కనుఁ గొంట దీని, నం
చను మదిలోఁ దలంచి భృశ•శోకమునన్ రఘురామ! లక్ష్మణా!
యని భయమోహితాత్మ యయి•యల్లన నల్లన నేడ్చె దీనయై. ౭౭౧

అర్థములు. చలియించి=భయముచే దేహమును గదలించి, భీషణము=భయంకరము, దొసఁగు=కీడు, భృశ=అధికమైన, అల్లన నల్లన నేడ్చెన్=మెల్ల మెల్లగా నేడ్చెను. ఇప్పటి సీతాదేవి మనసు నమ్మీ నమ్మని డోలాయమాన దశయందున్నది. దానివలన గట్టిగా నేడ్చిన రాకాసు లందఱు వత్తురేమో. నిజముగ నితఁడు రాముదూతయై యుండినఁ గార్యము తాను బాడుచేసిన ట్లగును.

తా త్ప ర్య ము

చూచి దేహము జలదరింపఁగా నాశ్చర్యపడి యిది భయంకరమైన క్రోఁతి రూపము. దీనిని జూచితిని. ఏమి కీడు మూఁడఁగలదో యయ్యో యని మిగుల శోకముచే రామలక్ష్మణుల స్మరించి భయముచే భయపడిన మనస్సు గలదై మెల్ల మెల్లన నేడ్చెను.

క. కనుచుఁ బృథుభుగ్న వక్త్రిని, వనచరపతిమంత్రివర్య•వాతాత్మజునిన్
ఘనమేధావివరిష్ఠుని, దిననాథతనూజుబంటుఁ • దేజోనిలయున్. ౭౭౨

అర్థములు. పృథుభుగ్న వక్త్రినిన్=గొప్పదియు వంకరయైనదియు నగు ముఖము గలవానిని, మేధావి వరిష్ఠునిన్=బుద్ధిమంతులలో శ్రేష్ఠుని.

తా త్ప ర్య ము

పెద్దదియు వంకర యైనదియు నగు ముఖము గలవానిని, సుగ్రీవుని మంత్రు

లందు శ్రేష్ఠుని, వాయుకుమారుని, గొప్ప బుద్ధిమంతులలో శ్రేష్ఠుని, సుగ్రీవుని బంటుగా వచ్చిన వానిని, తేజమునకు స్థానమైన వానిని జూచుచు.

చ. నెలఁత భృశార్తిఁ గుందుచు వి•నీతునిరీతిగ నున్న మారుతిం
దలఁచి మనంబులోన నగు•నా యిది స్వప్న? మ టంచు వెండియున్
జెలువ సమీరపుత్రుఁ గని•చిత్తము వ్యాకుల మంద భీతిచేఁ
గలఁగి విసంజ్ఞ యై శవము•కైవడి నై తెలి వొంది యిట్లనున్. ౨౨౩

అర్థములు. నెలఁత=స్త్రీ, సీత- వినీతునిరీతిగన్=వినయము గల వాఁడుగ, విసంజ్ఞయై=స్మృతి తప్పినదై.

తాత్పర్యము

సీతాదేవి మిగుల మనోవేదనచే దుఃఖించుచు వినయవంతుఁడుగ నున్న హనుమంతుని జూచి యిది కలయా యేమి యని వ్యాకులపడి స్మృతి తప్పి పీనుఁగువలె నిశ్చేష్టయై యుండి మఱలఁ దెలివి తెచ్చుకొని తనలోఁ దా నిట్లను కొనుచున్నది.

మ. కలలోఁ గ్రోఁతిని జూడరా దనుచు వ•క్కాణించు శాస్త్రంబు, నేఁ
గలఁ గంటిం గద వానరంబు, నిఁక నే•కష్టంబు ప్రాప్తించునో
కలుగుం గావుత రామలక్ష్మణులకుం • గళ్యాణముల్, సంతతం
బలరుం గావుత నాదుతండ్రి జనకుం • డారోగ్యసంపత్తిచేన్. ౨౨౪

అర్థములు. వక్కాణించున్=చెప్పును.

తాత్పర్యము

కలలోఁ గ్రోఁతిని జూచినఁ గీడని శాస్త్రములు చెప్పుచున్నవి. నేను గలలో గ్రోఁతిని జూచితిని. కావునఁ గీడు కలుగనున్నది. రామలక్ష్మణులకు మేలు కలుగుం గావుత. మా తండ్రి జనక మహారా జారోగ్యముచే సంతోషించునుగాక.

చ, కల యని యందమా యెటులు•కల్గెడు స్వప్నము నిద్ర లేకయే?
కలిగెడు నెట్లు నిద్ర యిటు•కాఱియపాటున వేఁగు వేళలన్?
జెలఁగు నొకో సుఖంబు నను • శీతకరాభ ముఖారవిందునిన్
జెలువుని రాముఁ బాసి యిటు•చేడ్పడు దుర్భగురాల నాకునున్? ౨౨౫

అర్థములు. కాఱియపాటునన్=బాధచే, నమ=నిండు; శీతకరాభ = చంద్రునితో సమానమైన, ముఖారవిందునిన్ = ముఖకమలము గలవానిని, దుర్భగురాలన్=దురదృష్టముగలదానను.

తాత్పర్యము

ఇవి కలయా! కాదు. ఏల? నిద్రలేక కల యెట్లువచ్చును? ఇప్పుడు నేను నిద్రించు చున్నానేమో. నిద్రయెట్లు వచ్చును? దుఃఖముచే బాధపడుచున్న వేళ నిద్ర యెట్లు వచ్చును. సుఖముదోఁచినఁగదా నిద్రవచ్చును. నిండు చందురువంటి

ముఖారవిందము గల రామచంద్రుని విడిచి యేడ్చుచుండు యీ నిర్భాగ్యురాలికి నిద్ర యెట్లు వచ్చును? సుఖ మెట్లు దోఁచును.

చ. కల యిదిగాదు, నిక్కువము ♦ గాదు, నిజం బరయంగ నెప్పుడున్
దలఁపున రామ రామ యని ♦ ధ్యాన మొనర్చుచు, నోర నట్టులే
పలుకుచు నుంటఁ దద్విషయ ♦ వాక్యములే విను దాన, నమ్మహా
బలుని స్వరూపమే కనెద ♦ భావనతీవ్రబలంబు పెంపునన్. ౭౭౬

తాత్పర్యము

నిద్రకుఁ గారణములేదు, కావున నిది కలకాదు రాముదూత క్రోఁతి యింత సముద్రముదాఁటి రావణాసురుని యంతఃపురమునకు వచ్చుటనమ్మరాని విషయము. కావున నిది నిజముగాదు. అట్లైన నీఁకేమి యనిన నేను సర్వవేళల రామ రామ యని స్మరించుచున్నదానను. ఆయననే ధ్యానించు చున్నదానను. కావున నాయన మాటలే వినవచ్చుచున్నవి. తీవ్ర భావన బలముచే నాయన స్వరూపమే కాన వచ్చుచున్నది.

ఉ. రఘువీరుపై హృదయ ♦ మంతయు నిల్పి మనోభవవ్యథా
భారముచేఁ దపించుటను♦భావనశక్తి రఘూత్తమాకృతిన్
సారెకుఁ గాంతు నెల్లయెడఁ♦జారుతదీయకథల్ వినంబడున్
వారక నాదుమోహ మొక♦వానరరూపముఁ గాంచి పల్కెనో. ౭౭౭

తాత్పర్యము

వాస్తవ మిదియె. రామచంద్రమూర్తి మీఁదనే నా మనస్సంతయు నిలిచి మనస్సులోఁ బుట్టిన దుఃఖాతిశయముచేఁ బరితాప పడుట వలన హృదయము నందు వేఱొక విచారము లేకుండుటచే భావన బలంబున నే నెందు జూచినను రాముని స్వరూపమే కానవచ్చుచున్నది. ఆకథలే వినఁబడు చుండును. కావున నా మోహమే యొకక్రోఁతిరూపము గైకొని పల్కుచున్నది.

ఈ పద్యమందు భక్తివలనఁ గలుగు సమాధి చెప్పఁబడెను.

యత్రైవ యత్రైవ మనో మదీయం
తత్రైవ తత్రైవ తవ స్వరూపమ్
యత్రైవ యత్రైవ శిరో మదీయం
తత్రైవ తత్రైవ పదద్వయం తే.

నా మనస్సెందెందుఁ బోవుచున్నదో యదియంతయు నీ స్వరూపమే. నా శిరస్సెందెందు వ్రాలుతునో యం దెల్ల నీ పాదములే యున్నవి.

'స్వానుభూతి రసావేశా, దృశ్యశబ్దా ఉపేక్షతః,
నిర్వికల్ప సమాధిస్స్యా, నివాత స్థిత దీపవత్.

తన యనుభవ రస మావేశించుటచేఁ గానవచ్చునవి, వినవచ్చునవి, ఉపేక్షిం

చుట నిర్వికల్ప సమాధి యగును. ఇది గాలిలేనిచోట నుండు దీపము వంటిది.

సీతాదేవి రామునందే మనస్సు నిలిపి రామునే ధ్యానించుటచే నితరాకారములు గానవచ్చుట లేదు. ఇతర ధ్వనులు చెవిని బడుటలేదు. ఏది చూచిన రామచంద్రమూర్తియే. యేది విన్నను రాము ముచ్చటలే. ఇది భక్తిపరాకాష్ఠ. దీనిని మించిన దశలేదు; దీని నెప్పుడు రామచంద్రమూర్తి ప్రసాదించునో, ఈ దశ కంస మారీచులకు భయము చేతను సీతాప్రహ్లాదులకు భక్తి చేత గలిగెను.

ఉ. అటు లయినన్ మనోరథము•నాకృతి యిట్టిది గా దటంచుఁ బ్ర
స్ఫుటముగ బుద్ధిచేఁ దెలియఁ•జూచెద, రూపము లేదు దానికిన్
బటుతరరూపి యయ్యదియుఁ • బల్కెడి మాటలు నన్నుఁ జూచియే
యెటు లనవచ్చు మాయ యని•యెంతయుఁ జూచిన నిక్కువంబ యౌ. ౨౨౪

## తాత్పర్యము

ఆ విధముగఁ జూచిన నదియు సరికాదని తోఁచుచున్నది. మనోరథరూపమిది కాదని బుద్ధి చెప్పుచున్నది. మనస్సునకు రూపము లేదుకదా. ఇది స్పష్టముగ రూపముగలదై కానవచ్చుచున్నది. ప్రత్యక్షముగఁ గానవచ్చునది, నన్నుఁ జూచి మాటలాడుచున్నది, మాయయని యెట్లనవచ్చును. కావున నిది వాస్తవమే.

“యథార్థం సర్వ విజ్ఞాన మితి వేదవిదాం మత”మ్మన్నట్లు మనకుఁ గానవచ్చునది వినవచ్చునది సర్వ సత్యమే కాని యసత్యము కాదని సూచితము.

చ. అని మది నిశ్చయించి తన•హస్తయుగంబును మోడ్చి మ్రొక్కెదా
నను బలవైరి యుక్తసుమ•నస్తతి మంత్రి స్వయంభువున్ శుచిన్
వనచరుఁ డిప్డు దా యెదుటఁ•బల్కిన వాక్యము లెల్ల సత్యమై
యొనరుత వేఱుగా జరుగ•కుండెడిఁ గాత మటంచు వేఁడఁగన్. ౨౨౫

## తాత్పర్యము

నాకుఁ గానవచ్చు క్రోఁతి వాస్తవముగఁ క్రోఁతియే గాని యొకవస్తువు మఱియొక వస్తువుగాఁ గానరాలేదని నిశ్చయించుకొని రెండుచేతులు జోడించి యింద్రునితో గూడిన బృహస్పతిని బ్రహ్మను అగ్నిని నమస్కరించెదను. ఇప్పుడీ క్రోఁతి నాయెదుట జెప్పిన మాటలన్నియు సత్యములే యగునుగాక! దానికి భిన్నముగా జరుగకుండును గాక యని ప్రార్థించెను. ఇప్పటికి సీదాదేవి మనస్సునకు నిది నిజముగాఁ క్రోఁతియే యని విశ్వాసము కుదిరి ఆయన చెప్పిన విషయము సత్యమని యింకను నమ్మినది కాదు.

## —• 33-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవితో సంభాషించుట. •—

క. హనుమయు వినీతవేషం,బున వృక్షముఁ గొంత డిగ్గి • మోడ్పుం గేలిన్
దనశిరమునఁ బూనుచు నతి,వినయంబున మధురఫణితి•వెలఁదికి ననియెన్.

### తాత్పర్యము

ఇంత మాత్రము దనయందు విశ్వాసము గలదయ్యెను గదా యని హనుమంతుఁడు నిశ్చయించుకొని మునుపున్న కొమ్మకంటెఁ గ్రిందికొమ్మకు వినయవంతుని వేషమునసే దిగి రెండు చేతులు జోడించి శిరస్సున నుంచుకొని మిగుల వినయముతోఁ దియ్యని మాటలతో నిట్లనెను.

శా. అమ్మా! పద్మదళాక్షి యెవ్వతె విఁకేలా మైల కౌశేయచే
లమ్మున్ దాలిచి కొమ్మ యూఁతఁగొని నిల్వం? బద్మపత్రంబులం
దిమ్మైన్ గాఱు జలంబు నాఁగఁ గనులం దిట్లేల శోకాశ్రుపూ
రమ్ముల్ గ్రమ్మెడి? నానతీయఁ గదవే ప్రార్థింతు సాధ్వీమణీ! ౭౮౧

### తాత్పర్యము

అమ్మా! పతివ్రతా రత్నమా! నిన్ను నే నొకటి ప్రార్థించెదను. నాయందను గ్రహించి సెలవిమ్ము. నీ వెవ్వతెవు. ఏల యిట్లు మాసిన పట్టువస్త్రము గట్టుకొని కొమ్మను బట్టుకొని నిలఁబడి యున్నదానవు. తామర రేకులనుండి పడు నీళ్ళవలె నేల కన్నులనుండి నీరు కాఱుచున్నది?

ఉ. కిన్నరకాంతవో? యసుర గేహినివో? వసురుద్రరామవో?
పన్నగనారివో? విబుధ భామినివో? మఱి యక్షయోషవో?
యన్నిలఁ బాసి కూలిన గుణాన్విత రోహిణివో? తలంప నో
కన్నియ నీవు దేవతవు కాఁ దలపోసెద భద్రలక్షణా! ౭౮౨

### తాత్పర్యము

నీవు కిన్నర స్త్రీవా? వసువుల రుద్రుల భార్యవా? పన్నగస్త్రీవా? దేవతా స్త్రీవా? యక్షకాంతవా? ఆ చంద్రుని విడిచి నేలఁబడిన రోహిణివా? నీ యందుఁ గలశుభచిహ్నములు చూచి నీవు మనుష్య స్త్రీవి కావు, దేవతాస్త్రీవని తలంచెదను.

తే. అలుక చేతనో మోహంపుఁ గలఁక చేత
నో వసిష్ఠుని నెడఁబాసి యుర్విఁ దిరుగఁ
గడఁగిన యరుంధతివి గావు గా? యెఱుంగఁ
బల్కవే ప్రేమఁ గళ్యాణి భద్రమగుత. ౭౮౩

### తాత్పర్యము

కల్యాణీ! నీకు మేలుగలుగునుగాక! చెప్పుము. కోపముచేతనో మోహము వలనఁ గలిగిన కలఁత చేతనో భూమిని దిరుగుటకై వసిష్ఠుని విడిచివచ్చిన అరుంధతివి కావు గదా చెప్పుము. అరుంధతి తన పేరున కర్థము తానే యిట్లుచెప్పెను. “ధరాన్ ధరిత్రీం వసుధాం భర్తృస్తిష్ఠా మ్యనంతరమ్, మనోఽనురంధతీ భర్తృరితి మాం విద్ధ్యరుంధతీమ్॥ భార. ఆను ౧౮౨ అధ్యా.

ధరాన్=పర్వతములను, ధరిత్రీం=భూమిని, వసుధామ్=ఆకాశమును

(వసన్ దేవాన్ ధత్తే ఇతి వ్యుత్పత్త్యా వసుధాం దివమ్-నీలకంఠ) పర్వతములను భూమిని ఆకాశమును భర్తతోడ నధిష్ఠించి యున్నాను. భర్తను అవ్యవధానముగ ననుసరించి యుండుదానను.భర్తకంటె నెక్కువగా సారవంతమైన ధరిత్రిని దలఁచు దానఁ గాను, కావున నా పే రరుంధతి యందురు.

ఉ. ఎందులనుండి వచ్చి? తిటులిచ్చట నేల మహార్తిఁ గుంద, నో
సుందరి! తండ్రి యెవ్వఁ డొకో! సోదరుఁ డెవ్వఁడు? భర్త యెవ్వరో
నందనుఁ డెవ్వఁ డమ్మ? సుర నారివి గా వని తోఁచె నేడ్చుటన్,
దండడియూర్పు లుంట, వసుధాస్థలి నిల్చుట, రాజచిహ్నలన్. ౭౦౪

తాత్పర్యము

అమ్మా! ఎచ్చట నుండి నీ విచ్చటకు వచ్చితివి. ఇచ్చట నీ విట్లు దుఃఖింపఁ గారణమేమి? నీవిటు దుఃఖింపవలసిన దానవుగావే. నీ తండ్రి యెవ్వఁడు? నీతోడఁ బుట్టినవాఁ డెవ్వడు? నీ భర్త యెవ్వడు? కొడు కెవ్వఁడు? నీరూపము గుణముఁ బట్టి నీవు దేవతాస్త్రీ వని తలఁచితిని గాని నీ వేడ్చుచుండు చేతను, విస్తారముగ నూర్పు లుండుటచేతను, భూమి మీఁద నిలఁబడి యుండుటను రాజస్త్రీల కుండ వలసిన చిహ్నములు నీ యం దుండుటను నీవు దేవతాస్త్రీని గా వని తోఁచు చున్నది. రాజస్త్రీ చిహ్నములు:--

'చక్రస్వస్తిక వజ్రాంకం ధ్వజమీనాతపత్రవత్
యస్యాః పాదతలం బ్రహ్మన్ సా భవేత్ క్షితిపాంగనా,
భవే దఖండభోగా యోర్వ్యాం మధ్యాంగుళి సంగతం
ఉన్నతో మాంసలోంగుష్ఠో వర్తులోఽతుల భోగదః॥'

చక్రము, స్వస్తికము, వజ్రము, ధ్వజము, మత్స్యము, గొడుగు వీని యాకారమువంటి రేఖలు పాదము లందుండిన రాజపత్ని యగును. కాలివ్రేళ్ళ నడిమి భాగము భూమిని దాఁకియుండిన నఖండభోగములు గలుగును. బొటనవ్రేలు ఎత్తుగను గుండ్రముగ నుండిన విశేష సౌఖ్యములు గలుగును.

'రాజ్ఞీత్వసూచకం స్త్రీణాం-పాదపృష్ఠం సమున్నతమ్
అస్వేద మసిరాఢ్యంచ మసృణం మృదు మాంసలమ్॥'

మీఁగా లెత్తుగను, చెమటలేనిదిగను, నరములు తెలియనిదిగను, నునుపుగను, మెత్తగను, బలిసినదిగను నుండిన రాజభార్య యగును.

'రోమహీనే శుభే స్నిగ్ధే యజ్ఞంఘే క్రమవర్తులే
సా రాజపత్నీ భవతి హ్యసిరే సుమనోహరే
ఏకరోమా రాజపత్నీ ద్విరోమాతిసుఖాన్వితా
త్రిరోమా రోమకూపేషు-భవే ద్వైధవ్య దుఃఖభాక్॥'

పిక్కలు రోమములు లేక నునుపై గుండ్రములై నరములు తెలియకరమ్యముగ నుండిన రాజపత్ని యగును. ఒక రోమకూపమందొక వెంట్రుక యుండిన రాజపత్నియగును, రెండురోమములుండిన మిగుల సుఖ మనుభవించును. మూఁడు వెంట్రుకలుండిన విధన యగును.

"సువృత్తైః కరభాకారై రూరుభి స్సమృతైర్ఘనైః.
సువృత్తైరోమరహితై ర్భవేయు ర్భూమివల్లభః"

తొడలు దృఢములుగను, ఏనుఁగు తొండమువలెను, నునుపుగను, లావుగను, గుండ్రముగను, వెంట్రుకలు లేనివిగను, నుండిన రాజభార్య లగుదురు.

"చతుర్భి రంగుళై శ్శస్తా కటి ర్వింశతి సంయుతైః
సమున్నత నితంబాఢ్యా చతురశ్రా మృగీదృశామ్
నితంబబింబో నారీణా మున్నతో మాంసలః పృథుః
మహాభోగాయ స ప్రోక్త స్తదన్యోఽశర్మణే మతః॥

మొల యిరువదినాలు గంగుళముల వెడలుపుగలిగి యెత్తై చదరముగా నుండిన పిఱుఁదులు గలది రాజపత్నియగును. పిఱుఁదు లున్నతములుగను బలిసినవిగను విశాలముగ నుండిన మహాభోగము గల దగును.

'సూతే సుతాన్ బహూన్ నారీ పృథుకుక్షిః సుఖాస్పదమ్
క్షితీశం జనయే త్పుత్రం మండూకాభేన కుక్షినా.

కడుపు పెద్దదిగ నుండిన పెక్కు కొడుకులఁ గనును. కప్పవంటి కడుపు గలది రాజు గాఁగలవానిని గనును.

'రక్తా వ్యక్తా గభీరాశ్చ, స్నిగ్ధాః పూర్ణాశ్చ వర్తులాః
కరరేఖా స్త్రియో యస్యా, శ్శుభా భాగ్యవతీచ సా
మత్స్యేన సుభగా నారీ స్వస్తి కేన వసుప్రదా
పద్మేన భూపతేః పత్నీ జనయే ద్భూపతిం సుతమ్
చక్రవర్తి స్త్రియః పాణౌ నంద్యావర్త. ప్రదక్షిణః
శంఖాతపత్రకమలా నృపమాతృత్వ సూచకాః.'

అఱచేతియందు రేఖలు ఎఱ్ఱగను, స్పష్టముగను, లోతుగను, నునుపుగను సంపూర్ణముగను (నడుమ తెంపులులేక) గుండ్రముగ నుండిన భాగ్యవతి యగును, మత్స్యరేఖయుండిన మహైశ్వర్యము కల దగును. స్వస్తికముండిన మంచి వ్రతము గలదగును. పద్మరేఖ యుండిన రాజు భార్యయై రాజుగాఁగలవానిని కొడుకును గనును. చేతియందు నంద్యావర్తలేఖ యుండిన, ప్రదక్షిణముగను రేఖలుండిన చక్రవర్తి భార్యయగును. శంఖము గొడుగు కమలము వీనివలె రేఖలుండిన రాజమాత యగును.

'పాటలో వర్తుల స్నిగ్ధో రేఖాభూషిత మధ్యమః,
సీమంతినీనా మధరో ధరాజాని ప్రియా భవేత్.

ఎఱుపు వర్ణము-గుండ్రము-నునుపు-నడుమ రేఖగల పెదవి గలది రాజ భార్య యగును.

> 'భ్రువోరంతర్లలాటేవా మశకో రాజ్యసూచకః,
> నాసాగ్రేమశక శ్శోణో మహిష్యాశ్చైవ జాయతే.'

కనుబొమల నడుమఁ గాని, లలాటమునందుఁ గాని దోమవంటి సన్నమచ్చ యుండిన రాజ్యప్రాప్తి కల దగును. ముక్కు కొన నెఱ్ఱని మచ్చ యుండిన రాజ భార్య యగును.

> 'అరవిచ్చు తమ్మికై వడి, పరఁగిన రుచి నొప్పి నింబ పల్లవరుచితో
> సరియైన మోవి గలయది, యరయంగా రాజపత్నియై విలసిల్లున్'
> 'ఉదరంబు కరతలోదర, సదృశంబై జంఘ లతి విశాలంబై నన్
> సుదతీ తిలకంబున క, భ్యుదయం బగు ధరణినేలు పుత్రులఁగాంచున్.
> "విదితముగాఁ బ్రసన్నతగల
> వదనముగల వనిత రాజవల్లభ"

ఇత్యాది చిహ్నములచే సీతాదేవి రాజపత్ని యని హనుమంతుఁడు గ్రహించెను.

చ. లలనరో! చూడ నీదుశుభ•లక్షణముల్ నృపకన్య వంచు భూ
వలయము నేలుమేటి నృప•వర్యుని పట్టపుదేవి వంచు నేఁ
దలఁచెద, దండకాటవి య•థామతిఁ ద్రిమ్మరి రావణుండు దా
బలిమిని దెచ్చినట్టి నృప•భామిని సీతవా? పలుకు-మే లగున్. ౨౦ ॥

తాత్పర్యము

తల్లీ! నీయందుండు శుభచిహ్నములుచూచి నీవు క్షత్రియ స్త్రీవనియు భూచక్రమంతయుఁ పరిపాలించు రాజశ్రేష్ఠుని పట్టపుదేవి వని నేను దలఁచుచున్నాను. దండకారణ్యములో యథేచ్ఛముగాఁ ద్రిమ్మరుచుండ రావణాసురుఁడు బలాత్కారముగఁ దెచ్చిన సీతవా యేమి? నిజము చెప్పుము. నీకు మేలగును.

క. అతిమానుష మగురూపము, వ్రతయుత వేషంబు నీదు•వైవర్ణ్యంబున్
మతిఁ దలపోయఁగ రాముని, సతి వంచును దోఁచె; లేదు•సందియ మబలా!

అర్థములు. అతిమానుషము=మనుష్యుల నతిక్రమించినది, మనుష్యులందు గానరానిది, వైవర్ణ్యము=కాంతిహీనత.

తాత్పర్యము

మనుష్య స్త్రీలకు దుర్లభమగు నీయందము దీక్షతోఁగూడిన వేషము నీకాంతి హీనత యివన్ని చూడ నీవు రామచంద్రమూర్తి భార్యవని తోఁచుచున్నది. ఇందు సందేహము లేదు. నా యభిప్రాయము నిజమా చెప్పుము.

త్రిజట చెప్పిన మాటలు వినిన తరువాత రాక్షసస్త్రీలు సీతాదేవి నుపేక్షించి యెవరంతట వారు దూరముగఁబోయి పండుకొనిరి. ఆకారణముచే హనుమంతుఁడు సీతాదేవితో సంభాషింప సమయము దొరకెను. ఈ విషయము హనుమంతుఁ డంగదాదులతో ముందు చెప్పును. సీతావిలాపము ముముక్షువగు ప్రపన్నుని విలాపము నొకటియని ముందు చెప్పఁబడెను. పూర్వకాండమున సంసారముఁ దరించు మార్గము దెలియక నిర్వేదపడుచుఁ దన్నాశ్రయించిన జీవుల రక్షించుటకై భగవంతుడాచార్యులఁ బంపుట చెప్పబడెను. ఇట్టి భగవత్సాహాయ్యము ప్రత్యక్షముగనో పరోక్షముగనో దేహాభిమానము పూర్తిగ వదలి తన్నే తన నిమిత్తమై మానప్రాణములను బోఁగొట్టుకొనుటకు సిద్ధపడి కేవల పరతంత్రులగు వారికి లభించును. స్వప్రయత్నమందు దేహమునయందే మాత్రమభిమానముండినను భగవత్సాహాయ్యము రాదు. గజేంద్రుఁడు యుద్ధము చాలించి నీవే తప్ప నితఃపరంబెఱుఁగ నని నిలిచిపోయిన తరువాతఁ గాని భగవత్సాహాయ్యము రాలేదు. కౌరవ సభయందు దుశ్శాసనుఁడు తన చీర లొలుచు నప్పుడు ద్రౌపది తన్నుఁదాను గాపాడుకొనఁ బ్రయత్నించు చుండునవఱకు భర్తలు తన్ను రక్షింతురని నమ్మియున్నంతవఱకు భగవత్సాహాయ్యము రాలేదు. పురుషప్రయత్నము వ్యర్థమని తలఁచి భగవంతుఁడే కలఁడని నమ్మి రెండుచేతులెత్తి.

'హా కృష్ణ! ద్వారకావాస! క్వాసి యాదవ నందన!
ఇమా మవస్థా సంప్రాప్తాం కి మ్మనాథా ముపేక్షసే
శంఖచక్రగదాపాణే! ద్వారకానిలయాచ్యుత!
గోవింద! పుండరీకాక్ష! రక్ష!మాం శరణాగతామ్. భార.సభా౬౮-౪౧

ఓ కృష్ణా! ద్వారకావాసా! వసుదేవ కుమారా! అనాథనై యిటునంటి యవస్థయందుండ నన్ను నేల యుపేక్షించెదవు.

శంఖము చక్రము గద చేతియందుఁ గలవాఁడా! ద్వారకావాసా? భక్తులను విడనాడని వాఁడా! పుండరీకాక్ష! శరణు! శరణు! రక్షింపుము. అని వశిష్ఠునుపదేశము స్మరించి భగవంతుని శరణు వేఁడఁగా వలువ లక్షయము లయ్యెను.

అట్లులే సీతాదేవియు, "కోయుఁడు కడికండలుగా, వ్రేయుఁడు కత్తులను మండుమంటలఁ ద్రోయుఁ" డనియు, మీరు నన్నుఁ దినసి, కోయనీ యేమైనఁ జేయనీ యని దేహాభిమానము వదలి నిద్రాహారము లుజ్జగించి యేకాగ్రమనస్కయై దుష్టరాక్షసులచేఁ జంపఁబడుట కంటె బుద్ధిపూర్వకముగా దేహము ప్రాణము రామచంద్రమూర్తికే సమర్పింపఁ దలఁచి నిరాశయై మరణోద్యుక్తయయ్యెనో యప్పుడు హనుమదాచార్యలాభము ప్రాప్తించెను.

—♦ సీతాదేవి హనుమంతునితోఁ దన వృత్తాంతము చెప్పుట ♦—

క. అనుడున్ రఘువల్లభ కీ, ర్తన హృష్టమనోజ్ఞ యగుచుఁ♦దర్వా శితునిన్
హనుమంతుఁ గాంచి పలికెన్, జనకతనూజాత తనదు♦చారిత్రంబున్. ౭౦౭

అర్థములు, రఘువల్లభకీర్తన హృష్టమనోబ్జ=రామచంద్రుని బొగడుటచే సంతోషించిన మనఃకమలము గలది, తరు+ఆశ్రితునిన్=చెట్టుమీఁద నుండువానిని.

తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁ డడుగఁగా రాముని బొగడుటచే సంతోషించిన మనస్సుగలదై సీతాదేవి చెట్టుమీఁద నున్న యాంజనేయునితోఁ దన వృత్తాంత మిట్లు చెప్పెను.

క. రాజితయశుఁ డగు దశరథ, రాజేంద్రుని స్నుషను జనక•రాజతనూజన్
రాజనిభాస్యుఁడు రామున, కే జాయను సీత యందు•రిల నాపేరున్. ౨౮౮

తాత్పర్యము

కీర్తిచేఁ బ్రకాశించు రాజశ్రేష్ఠుఁడగు దశరథునిఁ గోడలను, జనకరాజపుత్రికను, చంద్రునివంటి ముఖముగల రామచంద్రుని భార్యను. నాపేరు సీతయందురు.

ఉ. మానితసర్వకామముల•మానుషభోగములన్ భుజించుచున్
మానుగ రెండునుం బది స•మల్ వసియించితి రామునింటిలోఁ
బూని త్రయోదశాబ్దమున•భూవరుఁడున్ గురుమంత్రిపౌరలో
కానుమతిన్ మదీశ్వరు ర•సాధిపుఁ జేయఁగ నున్న యంతటన్. ౨౮౯

అర్థములు, మానిత సర్వకామములన్=గౌరవింపఁబడు సమస్తములైన కోరికలను, మానుషభోగములన్=మనుష్యు లనుభవింప యోగ్యములైన భోగములను, దీనివలనఁ దాను మనుష్యస్త్రీ గాదని సూచితము. రెండునుంబదిసమల్=పండ్రెండు సంవత్సరములు, త్రయోదశాబ్దమునన్=పదమూఁడవ సంవత్సరమున. మదీశ్వరు=నా భర్తను, రసా+అధిపున్=భూపతిన్=రాజుగ.

తాత్పర్యము

మనుష్యు లనుభవింప యోగ్యములైన సమస్తములైన కోరికలను భోగములను ననుభవించుచుఁ బండ్రెండు సంవత్సరములు రామచంద్రమూర్తి యింటిలో నుండితిని. పదుమూఁడవ సంవత్సరమున దశరథరాజు నాభర్తను రాజుగాఁజేయఁ బ్రయత్నింపఁగా.

ఇచట పదియు రెండు సంవత్సరములు రాము నింట నుండితినని చెప్పెను. రావణాసురునితోఁ దాను రామునితో నరణ్యమునకు వచ్చునప్పటికిఁ బదునెనిమిది సంవత్సరములని చెప్పెను. (చూ అర. ౭౬౭) కావున రామచంద్రమూర్తి యింటికి నాఱవ సంవత్సరముననే వచ్చెనని యేర్పడుచున్నది.

ఉ. ఆ మనుజాధినాథు ప్రియు•రా లగు కైకయి ప్రాణభర్తతో
రాముని నీవు ధారిణికి•రాజుగఁ జేసెద వేని చెప్పెదన్
నేమముఁ బట్టి త్రావ నిఁక•నీరముఁ, గూడును ముట్ట నింతతో
నీమెయితోడి పొత్తు సరి,•యిప్పుడ ప్రాణముఁ బాయుదుం జుమీ ౨౯౦

తాత్పర్యము

ఆ రాజేంద్రుని ప్రియభార్య కైక తన మగనితో నిట్లుచెప్పెను. నీవు భూమికి రామచంద్రమూర్తిని రాజుగాఁ జేసెద వేని నేను నేమముఁబట్టి నీళ్ళు త్రాగను. కూడు ముట్టను. నా ప్రాణముల నిప్పుడే పోఁగొట్టుకొందును.

ఉ. ఆడినమాట నిల్పుకొను•నట్టి తలం పెదఁ గల్గె నేనియున్
 పీడుము రామునిన్ గహన•వీథుల వేగ మటన్న మున్ను దా
 నాడినమాట నెంచి ప్రియు•రాలి కఠోరత రాప్రియోక్తికై
 యేడిచి మూర్ఛలన్ మునిఁగి•వృద్ధధరాపతి ధర్మబద్ధుఁడై. ౭౯౧

తాత్పర్యము

నీవు చెప్పిన మాట ప్రకారము సత్యము తప్పక వర్తింపఁదలఁచెదవేని రామచంద్రమూర్తిని నడవులలో వదల వలసినదని కోరఁగాఁదాను మును చెప్పినమాట తలఁచి ప్రియురాలి కఠినమైన యప్రియమైన మాట విని యేడిచి మూర్ఛలో మునిఁగి ముసలివాఁడగు రాజు ధర్మముచేఁ గట్టఁబడిన వాఁడై.

ఉ. ఆలికిఁ జెప్ప లేక తన•యగ్రతనూజుని వేఁడె రాజ్యమున్
 శ్రీలలితుండు రాముఁ డభి•షేకముకంటెఁ బ్రియంబు నైన భూ
 పాలునిమాటఁ గైకొనియెఁ•బ్రాణనిమిత్తమ యైన నా మగం
 డాలరిపల్కుఁ బల్కఁడు, న•యంబున నిచ్చు గ్రహింపఁ డేమియున్. ౭౯౨

తాత్పర్యము

పెండ్లమున కేమియు సమాధానముఁ జెప్పఁజాలక తన పెద్దకొడుకును నీవు రాజ్యము వదలి పొమ్మని కోరెను. సహజ శ్రీమనోహరుఁడగు నాభర్తకు నాగంతుకమైన యీ రాజ్యాభిషేకము కంటెఁ దండ్రిమాట నెఱవేర్చుట ప్రియముకావున నాయనమాట నెఱవేర్ప నంగీకరించెను. ప్రాణము రక్షించుకొనుటకైనను నామగఁడు అప్రియమైన మాట చెప్పెడు వాఁడుకాఁడు. మంచితనముగా నెవ్వరేమి యడిగిన నిచ్చునేకాని యొకరిచే నేమియు గ్రహింపఁడు.

చ. జనకునిమీఁది భక్తిమెయి•సంపదలున్ ధరణీ ప్రభుత్వమున్
 ఘనతరవన్యచేలములు•గ్రక్కున వీడి, కుశాజినంబులన్
 గొని, ననుఁ దల్లికిన్ మిగులఁ•గూరిమి నప్పన చేసి నాకు న
 య్యనఘునిఁ బాసినంత సమ•రాలయ మైన రుచింప దాత్మకున్, ౭౯౩

తాత్పర్యము

తండ్రి మీఁద దనకుఁ గల భక్తిచేత సమస్తైశ్వర్యము భూప్రభుత్వము గొప్ప వెలగల వస్త్రములు తత్క్షణమే వదలి వనవాసమునకుఁ దగిన దర్భలు జింకచర్మములను గైకొని యడవికిఁ బోవఁ బ్రయత్నించి నన్నుఁ దన తల్లి కప్పగింపఁ జూచెను. గాని యీ పుణ్యాత్ముని వదలితినా స్వర్గమైనను నాకు రుచింపదు.

ఉ. కావున రాముకంటె మును • కానలకేను బ్రయాణ మైతి, స
ద్భావుఁడు లక్ష్మణుండు దొలు • తన్ ధరియించెను నారచీరముల్
మూవుర మిట్లు మేము వ్రత • మున్ గొని యెన్నఁడుఁ జూడనట్టి భీ
త్యావహ మైన దండక ధ • రాధిపు నాజ్ఞనుజొచ్చి భయండఁగన్. ౨౯౮

తాత్పర్యము

కావున రామచంద్రమూర్తి కంటె ముందు నేనే యడవులకుఁ బ్రయాణ మైతిని. రామచంద్రమూర్తిని సేవింప వలయునను మంచి హృదయముగల లక్ష్మణుఁడన్న మీఁది భక్తిచే నారచీర లప్పుడే కట్టుకొనెను. మేము ముగ్గుర మీ విధముగా వనవాసదీక్ష గైకొని ముందెన్నఁడు చూడనిభయంకరమైనయడవి యందు రాజాజ్ఞాప్రకారము ప్రవేశించి యుండఁగా.

అయోధ్యాకాండమందు ముందు రామచంద్రమూర్తి నారచీరలు కట్టుకొన్న తరువాత లక్ష్మణుఁడు కట్టుకొనెనని యున్నను ఇచ్చట లక్ష్మణుఁడుముందు కట్టుకొనె ననుట ప్రయాణమందలి యతని యాదరాతిశయముఁ దెలుపుట కని గ్రహింపవలెను.

ఉ. ముచ్చిలి తెచ్చె నన్ను రఘు•ముఖ్యుని దేవిని కూళ రావణుం
డిచ్చట దిక్కు లేమి నిటు•లేడ్చెద, మాసయుగంబు జీవితం
బిచ్చె దశాస్యుఁ, డంతపయి • నీల్గెడుదానను, నింతలోన నా
సచ్చరితుండు వచ్చు నని • చాలఁగ నాశను మేను నిల్పితిన్. ౨౯౯

అర్థములు. ముచ్చిలి=దొంగిలించి, కూళ=వంచకుండు, క్రూరశబ్దభవము కూళ, మాసయుగంబు=రెండు నెలలు.

తాత్పర్యము

రాముని భార్య నగు నన్ను వంచనచేసి రావణుఁడు దొంగిలించి తెచ్చెను. కావున నిచ్చట దిక్కులేక యేడ్చుచున్న దానను. నాకుఁ బన్నెండు నెలలు వాఁడు గడువిచ్చెను. వానిలో రెండు మిగిలినవి. అది తీరఁగానే చత్తును. ఇంతలో రామచంద్రమూర్తి వచ్చునను నాశచేతఁ జావకున్నాను.

{ ౩౪-వ సర్గము, హనుమంతుఁడు సీతాదేవికి శ్రీరామలక్ష్మణుల కుశలవార్త దెలుపుట. }

సీ. అనవుడు నామాట•లాలించి పావని, సాంత్వనోక్తుల ననుఁ•జనకసుతకు
దేవి! నీ కొక్కఁ•సందేశ మంపఁగ రామ,భద్రుండు దూత నై•వచ్చినాఁడ
శ్రీరామచంద్రుండు•నేమ మయ్యెడఁ దన, నేమంబు సీతోడఁ•జెప్పు మనియె
బ్రహ్మాస్త్ర వేదశా•స్త్రవిదుండు శ్రీరాముఁ, డర్మిలి నీ నేమ•మడిగె నమ్మ!
ఆ. శౌర్యదర్పధనుఁడు•సౌమిత్రి నీ పతి, కనుచరుండుఁ బ్రియుఁడు•సాశ్రునేత్రుఁ
డగుచు నీకు భక్తి•సాష్టాంగ మెరఁగెను, కుశలు లమ్మ వారు•కువలయాక్షి.

అర్థములు. సాంత్వనోక్తులన్=ఊరార్పు మాటలచే, సందేశము=వార్త, అనుచరుండు=దాసుండు, వెంటనంటి తిరుగువాఁడు; సాశ్రునేత్రుఁడు=కన్నీటితో గూడిన కన్నులు గలవాఁడు, బ్రహ్మాస్త్రము తెలిసినవాఁ డనుటచే సమస్తాస్త్రములు దెలిసినవాఁడని యర్థము. వేదములు తెలిసినవాఁ డనుటచే అర్థముతోడ వేదముల నధ్యయనము చేసెనని భావము. శాస్త్ర మనుటచే ధర్మశాస్త్రము కర్మానుష్ఠానము తోడఁ దెలిసినవాఁడని యర్థము. అర్మిలిన్=ప్రేమతో, శౌర్య దర్పధనుఁడు=శౌర్యమువలని గర్వమే ధనముగాఁ గలవాఁడు, ఎఱఁగెను=నమస్కరించెను, కువలయాక్షి=కలువలవంటి కన్నులుగలదానా! హనుమంతుఁడు సీతాదేవిని కువలయాక్షియని, అసితేక్షణయని పలుతాపుల వర్ణించెను. ఈ నేత్ర సౌందర్యమే యీమె రామచంద్రమూర్తికిఁ దగిన భార్య యని తెలుపుచున్నదని హనుమంతుని యభిప్రాయము. కు+వలయ మనఁగా భూచక్రము. అది యంతయు నీ కనుసన్నల మెలఁగవలసినదై యుండ నీ కీదశ తగినది కాదని భావము. అనఁగా నీవు సాక్షాల్లక్ష్మివిగాని, మనుష్య స్త్రీవిగా వని భావము.

తాత్పర్యము

ఆ మాట లాంజనేయుఁడు విని యూఱడింపు మాటలతో సీతాదేవి కిట్లనియె. దేవీ! రామచంద్రమూర్తి నీ కొక్కమాట చెప్పుమని నన్నుఁ బంపుటచేత నాయన మాతనై వచ్చినాఁడను. శ్రీరామచంద్రమూర్తి క్షేమముగా నున్నా నని నీతోఁ జెప్పుమనెను. బ్రహ్మాస్త్రాది సకలాస్త్రములు దెలిసినవాఁడును, కావుననే యుద్ధమం దెదురు లేనివాఁడును వేదముల నర్థముతో నధ్యయనము చేయుటచే సర్వవిషయములు తెలిసిన జ్ఞానియు, ధర్మశాస్త్రములు తెలిసినవాఁడగుటచే నే కార్య మెట్లు చేయవలెనో తెలిసి చేయువాఁడును నగు శ్రీ రామచంద్రమూర్తి మిగులఁ గూర్మితో నీ సేమ మడిగె నమ్మ. శౌర్యము వలనఁ గలిగిన గర్వమె ధనముగాఁ గలుగుటచే రామచంద్రమూర్తికి సహాయుఁడై రాక్షసుల నెల్ల సాధింప సామర్థ్యముగల లక్ష్మణుఁడు నీ భర్తకు సేవకుఁడు ప్రియుఁడునై తల్లీ! నీకు సాష్టాంగ నమస్కారము గావించెను. కువలయాక్షీ! వా రిరువురు కుశలులు తల్లీ!

క. అని హనుమంతుఁడు పలుకఁగ, విని జనకతనూజ హర్ష•వివశాత్మిక యై
తను వెల్లఁ బులకరింపఁగ, ననుఁ బావనిఁ జూచి యంచి•తాలాపములన్.

తాత్పర్యము

అని హనుమంతుఁడు చెప్పఁగా విని సీతాదేవి సంతోషముచే దేహము మఱచినదై దేహము గగ్గురింపఁగా మనోహరములైన వాక్యముల హనుమంతున కిట్లనెను.

క. తనువునఁ బ్రాణము లుండినఁ, గనుఁగొను నూఱేండ్లకైనఁ•గడు హర్షంబున్
మనుజుం డను సామెత మ, న్ననుకొనఁగా వింటి నది య•థార్థము చూడన్.

తాత్పర్యము

ఆంజనేయా! దేహమునఁ బ్రాణము లుండెనా నూఱేండ్లకైనను మనుష్యుఁడు

సంతోష మనుభవించునని యొక సామెత పూర్వము వినియుంటిని. అది సత్య మనియే తోఁచుచున్నది. నేను ప్రాణము బిగఁబట్టుకొని యుండుటచేఁగదా యీ సంతోషవార్త వినఁగలిగితిని. ప్రాణము విడిచియుండిన నీ భాగ్యము లేక పోవునుగదా.

క. అని శుభవార్తం దెలిపిన, హనుమయెడన్ జనకతనయ•యద్భుత మగు ప్రీ
తిని జూపఁగ నన్యోన్యం, బును నమ్మిక కుదురుకొనఁగ•ముచ్చట జరగెన్.

తాత్పర్యము

ఈ ప్రకారము శుభవార్త దెలిపిన హనుమంతునియందు సీతాదేవికి మిక్కిలి ప్రీతి గలిగెను, ఒకరినొకరు నమ్మి సంభాషింపఁ దొడఁగిరి.

క. భూపుత్త్రిక పలికిన యా, లాపంబుల విశ్వసించి•లాలించుచు దుః
ఖోపశమనం బొనర్పఁగ, దాపునకున్ మెల్ల వాయు•తనయుం డరిగెన్. ౭౧౦

అర్థములు. విశ్వసించి=నమ్మి, లాలించుచు=బుజ్జగించుచు, ఉపశమనంబు= శాంతి.

తాత్పర్యము

సీతాదేవి చెప్పిన మాటలు విని మనయందు నీమెకు దృఢమైన నమ్మకము కుదిరెనని నమ్మి యామెను బుజ్జగించుచు దుఃఖశాంతి సేయుటకై మెల్లమెల్లన సమీపమునకుఁ బోయెను.

క. అంతకు నంతకు వానర, కాంతుఁడు దను డాయుకొలఁది•క్ష్మాసుత శంకన్
జింతించె రావణుండే, చెంతకు నటు వచ్చె ననుచుఁ•జేడ్పడి భీతిన్. ౭౧౧

తాత్పర్యము

హనుమంతుఁడు దగ్గఱకు వచ్చుకొలఁది రావణాసురుఁడే యీ వేషము వేసి కొని తన్ను మాట లాడించుటకై వచ్చెనని సీతాదేవి భయపడెను.

—• సీతాదేవి హనుమంతుని రావణుఁ డని శంకించుట •—

ఉ. అక్కటా! మోస మయ్యెను ద•శాననుఁ డీగతి మాఱురూపమున్
నెకొ్కని వచ్చె, నీవిధము • నేఁ దలపోయక మాట లాడితిన్
మక్కువ విశ్వసించితిఁ, బ్ర•మాదము కల్గె నయో! య టంచుఁ దా
గ్రక్కునఁ గొమ్మ వీడుచు ధ•రాస్థలిఁ గూలఁబడెన్ వ్యథామతిన్. ౭౧౨

తాత్పర్యము

అయ్యయ్యో! నే నెంత మోసపోయితిని. రావణాసురుఁడే మాఱువేషము వేసికొని వచ్చెను. నే నింతమాత్ర మాలోచింపక వీనితోఁ జనవుగ మాటలాడి తిని. నిక్కపు రామదూత యను ప్రేమచే నమ్మితిని. అయ్యో! చాలఁ బ్రమాద పడితిని. అని పట్టుకొన్న చెట్టుకొమ్మ వదలి దుఃఖించుచు నేలఁ గూలఁబడెను.

క. వడఁకెడి దేహముతో వ్యథ, పడు పడఁతిం గాంచి హనుమ•ప్రాంజలి యగుడున్
గడువెఱ నతనిం జూడక, యడజడి నిట్టూర్పుతోడ•నన నీ రీతిన్. ౭౧౩

అర్థములు. అడజడిన్=దుఃఖముతో.

తా త్ప ర్య ము

శరీరము వడఁకుచుండఁగా బాధపడుచున్న యామెను జూచి హనుమ రెండు చేతులు జోడించి నమస్కరించెను. సీతాదేవియు నాయనను జూడక దుఃఖముచే నిట్టూర్పులు విడుచుచు నిట్లనెను.

చ. తెలిసితి లేర నిన్ను, నిటు ♦ తెక్కలివేషము వేసి రావణా!
కలఁచెద వేలరా? శుభము♦గాదుర నీ కిది, దండకాటవిన్
వలనుగ భిక్షురూపమున♦వచ్చిన మాయలమారి వీవె, దు
ర్బల నుపవాస దీనఁ దగ♦వా యిటు కాఁతియ పెట్ట రాక్షసా? ౮౦౮

అర్థములు. తెక్కలివేషము=దొంగవేషము.

తా త్ప ర్య ము

ఓరీ! నీ వెవఁడవో తెలిసికొంటిని. రావణా! యేలరా! యిటు దొంగ వేషము వేసికొని నా మనస్సు వికలము చేసెదవు. దీనివలన నీకు మేలు లేదు. దండకారణ్యమందు నే నుండఁగా సన్న్యాసివలె వచ్చిన మాయల మారివి నీవు కావా? రాక్షసా! బలముడిగినదానను, ఆహారము లేని దానను, ఏడ్చుచున్న దానను, న న్నీ ప్రకారము బాధపెట్ట నీకుఁ దగునా?

ఉ. రావణుఁ డీ వటంచు నన♦రా దనియున్ మదిఁ దోఁచె, ని న్గనన్
భావమునందుఁ బ్రీతి ప్రభ♦వం బగు చున్నది, రామదూత వేన్
వావిరి మేలు నీ కగుత♦వర్ణన సేయుము మత్ప్రియంబు లౌ
నా విభు రామచంద్రునిగుఁ♦ణంబు, లనంతముదంబు నా కగున్. ౮౦౯

తా త్ప ర్య ము

ఒక విధమునఁ జూచిన నీవు రావణుఁడు కావనియుఁ దోఁచుచున్నది. వలన రావణునిఁ జూచినంతనే నా మనస్సు చిటచిట లాడుచుండును. అట్టుది నిన్నుఁ జూచినఁ బ్రేమ యుదయించుచున్నది-నా యంతఃకరణము నన్ను మోసపుచ్చదు. నీవు నిజముగ రామదూతవే యయితివేని రాముని గుణములు వర్ణింపుము. రామచంద్రమూర్తి గుణములు నాకుఁ బ్రియంబులు. దానివలన నాకు మితిలేని సంతోషము కలుగును. రావణుఁడే యైనపక్షమున రామచంద్రునిఁ గీర్తింపఁడు. దీనివలన భగవద్గుణానుభవమందు నభిలాష గలిగి భగవద్గుణానుసంధానము చేయుచు శిష్యునకు భగవద్గుణములు వర్ణించి చెప్పువాఁడు నిజమైన గురువు. అటుచేయక తక్కినవి చెప్పువాఁడు దొంగగురువు. అట్టివా రెట్టివారైనను నమ్మరాదు. దగ్గఱఁ జేరనీయరాదు.

క. భూరిప్రవాహవేగము, తీరంబు హరించురీతిఁ♦దిగిచెదు సౌమ్యా
కారా! మచ్చిత్తము నని, ధారిణిసుత మఱియు నిట్లు♦దలఁచెన్ మదిలోన్.

## తాత్పర్యము

గొప్ప ప్రవాహముయొక్క వేగము గట్టును బ్రవాహములోనికి నీడ్చుకొను నట్లు నీ సౌమ్యమైన యాకారము నా మనస్సును నీవంక కీడ్చుచున్నది, అని మఱియు నిట్లు తలఁచెను.

ఉ. ఎక్కడిరామదూత? యిట • కేగతి వచ్చును? స్వప్న మద్దిరా
నిక్కపుసౌఖ్య మిచ్చెడిని • నేఁటికి రామునిదూత నంచుఁ దా
నొక్కఁడు క్రోఁతి వచ్చె,నయ•యో కలయుం గఱ వాయె, మచ్చరం
బెక్కెమొ నన్నుఁజేర దది, • యేగతిఁ గాంచెద రాఘవేంద్రులన్. ౮౦౭

## తాత్పర్యము

అయ్యో! యిదియేమి నాభ్రాంతి. ఎంత భ్రమపడుచున్నాను. రాము డెక్కడ? ఆయన దూతయెక్కడ? ఇచ్చటికి సముద్రముదాఁటి లంకలోఁ బ్రవేశించి యంతఃపురమునఁ బ్రవేశించి యీ వనములో నీ మూలఁ బడియుండుచోటికి నెట్లురా గలఁడు. ఇది సాధ్యమా? కాదు. కావున నిది స్వప్నమే. స్వప్నమే జాగ్రద్దశయందునునాకు నిజమైన సౌఖ్య మిచ్చుచున్నది. ఇన్ని దినాలకు నేను రామదూతనని యొక క్రోఁతి కలలోవచ్చెను. అయ్యో! నాకుఁ గలకూడఁ గఱ వాయెను. నిద్రపోయిననఁగదా కలవచ్చును. నిద్రలేక కల యెట్లువచ్చును? దానికిని నామీద మచ్చరమేమో! కలలోనే రామలక్ష్మణులఁ జూడలేనిదానను బ్రత్యక్షముగ నెట్లు చూడఁగలను?

చ. కల యిది గాదు, వానరునిఁ•గాంచిన స్వప్నమునందు భద్రముల్
గలుగునె? కల్గుచున్న యవి•గా యిపు డీతనిఁ జూడ, నామనః
కలిలమొ? వాతలక్షణమొ? • కా దనఁ బిచ్చియొ? యెండమావొ? యిం
దుల నెది గాదు, చక్కఁ గపి•తోఁచెడి, నాస్మృతి లెస్స యుండెడిన్. ౮౦౮

## తాత్పర్యము

కలకల యని కలవరించుచున్నాను, ఇది కలయగునా? కాదు. ఏలనందువా? స్వప్నములోఁ గ్రోఁతిని జూచిన మేలుకొన్నప్పుడు మేలు కలుగునా? కలుగదు. అయినను ఇప్పుడు నాకు నీయనను జూడ మనస్సునకు సంతోషము కలుగుచున్నది. కావున నిది మనోవ్యాకులత్వమో? వాయువు గుణమో? అది కాదనిన నాకుఁబిచ్చి పట్టినదో! పిచ్చివానికిఁ దాను బిచ్చివాఁడని తోఁచునా? వాతరోగమైన నాడులు సమముగా నడచునా? కావున నిది యెండమావేమో? ఎండమావు నీళ్ళవలెఁ గానవచ్చును గాని క్రోఁతివలెఁ గానవచ్చునా? కావున వీనిలో నేదియుఁగాదు. ఏలనః- క్రోఁతి చక్కఁగాఁ గానవచ్చుచున్నాఁడు. నా స్మృతి చక్కఁగానున్నది.

చ. అనుచు బలాబలంబుల ని•జాత్మవిచార మొనర్చి లేదు నా
మనమున మోస, మింక నను•మానము మానెదఁ, గామరూపి యా

దనుజవరుండె వచ్చె, నిది • తథ్య మ టంచును నిశ్చయించి యా
యనుపమసాధుశీల పలు•కాడక యుండె మరుత్తనూజుతోన్. ౮౯

అర్థములు. బలాబలంబులన్=ఈ కానవచ్చునది నిజమైన క్రోఁతి, రామ దూతయా? మాయవేషము వేసికొనిన రావణాసురుఁడా యను విషయమున నే ప్రక్క నెక్కువ బలమున్నది, ఏ ప్రక్క తక్కువ బలమున్నది యని నిజాత్మన్=మనస్సులో, విచారము=ఆలోచన.

తా త్ప ర్య ము

ఇతఁడు రామదూత యగు నిజమైన వానరుఁడా, మాయావేష ధారియైన రావణుఁడా యనుటయందుఁ గల బలాబలంబులు తనలో నాలోచించుకొని వీని రామదూత యని నేను నమ్మితినా యటుకాదేని నా కపాయము కలదు. నిజముగా రామదూత యాయెనా నా నిమిత్తమై వచ్చినవాఁడు గనుకఁ దన యథార్థ స్థితిఁ దెలుప యత్నించును. కావున నేను మాటలాడకుండుటచేఁ గలుగు నష్టిలేదు. నా మనమునఁ గలంకములేదు, ఈసందేహముతోఁ బనిలేదు. కామరూపి రావణుఁడే యిట్లు వచ్చెను, ఇది సత్యమని నిశ్చయించుకొని యసమాన పాతివ్రత్యసంపదగల సీతాదేవి హనుమంతునితో మాట్లాడక యూరకుండెను.

—• హనుమంతుఁడు సీతాదేవికి సందేహము దీఱునట్లు భాషించుట. •—

క. కాంతామణి యీవిధమునఁ, జింతాకుల యగుట కీశ•శేఖరుఁడు నిజ
స్వాంతంబున నూహించి ని,తాంతమధురసూక్తి సతికిఁ•దా నిట్లనియెన్.

అర్థములు. నిజస్వాంతంబునన్=తన మనస్సులో, కాంతామణి=స్త్రీలయందు శ్రేష్ఠురాలు, గనుకనే యెవనితో నమ్మి మాటలాడవచ్చును, ఎవనితో మాట లాడరాదని యాలోచింపఁ గలిగినది. సామాన్యస్త్రీల కిట్టి వివేక ముండదుకదా.

తా త్ప ర్య ము

స్త్రీరత్నమగు సీతాదేవి యీ విధముగఁ దనవిషయమునఁ జింతచేఁ గలఁత చెందిన దని తెలిసికొని వానరరత్నమగు హనుమంతుఁ డా సందేహముఁ బాపఁ దలఁచి తియ్యని మాటలతో నిట్లనియె.

ఉ. రాజులలోన మేటి, దిన•రాజు ప్రతాపమునందు, యామినీ
రాజు మనోజ్ఞతన్, భువన•రాజులరా జలరాజరాజున
ట్లా జగదేకకీర్తి యశ•రాజిత శౌర్యుఁడు, మూర్తిమద్రతీ
రాజు సురూపసంపద, వి•రాజిలు సత్యవచోరతుండునున్. ౯౧

అర్థములు. దినరాజు=సూర్యుఁడు, యామినీరాజు=చంద్రుఁడు, రాజ రాజు=కుబేరుఁడు, భువనరాజులన్=లోకసమూహములందు, మూర్తిమత్ =రూపము గలిగిన, రతీరాజు = మన్మథుఁడు, రతి, రతీ రెండురూపములు గలవు. కుబే

రుఁడు=భువనరాజుల రాజనుటకు "రాజాధి రాజాయ ప్రసహ్య సాహినే, నమో వయం వై శ్రవణాయ కుర్మహే" యని శ్రుతి.

తాత్పర్యము

ఎవ్వఁడు రాజులలో శ్రేష్ఠుఁడు, ఎవ్వఁడు ప్రతాపమున సూర్యుడు, ఆహ్లాదకరత్వము నందుఁ జంద్రుఁడు ఎవ్వఁడు కుబేరునివలె లోక సమూహములందు ప్రభువు. అటువలె జగమునందుఁ గేనల కీర్తిగలవాఁడు. ఎవ్వఁడు విష్ణువువలెఁ బరాజయమెఱుఁగని శౌర్యముగలవాఁడు. ఎవఁడు సౌందర్యమునందు నాకారము గొన్న మన్మథుఁడు, ఎవఁడు సత్యభాషణమందుఁ బ్రీతి గలవాఁడునై ప్రకాశించును. రాముని దూఱవైతి వేని రామచంద్రునిఁ గీర్తింపు మని సీతాదేవి చెప్పుటచే నా సందేహము పోవ నాయనను వర్ణించు చున్నాఁడు.

క. గురుఁడు మధురోక్తులను భీ,కరుఁడు విరోధులకు భువన•గణ మెవ్వని శ్రీ
కరకరముల ఛాయను సు,స్థిరతన్ జీవించు నట్టి•దేవుని రామున్. ౮౧౨

అర్థములు. గురుఁడు=బృహస్పతి, శ్రీకర=సంపత్కరము లగు, కరముల=బాహువుల, ఛాయను=నీడను, ఎండ వడఁబడినవాఁడు చెట్లనీడను సుఖపడినట్లు సంసారతాపమున వేఁగువానికి నాయన హస్తముల నీడయే సంతోషము గలిగించును. అట్టి దేవుని=ఇచ్చట నట్టి యనుటచే ఎవ్వఁడు రాజులలో మేటియని యెవ్వడను పదము అన్ని విశేషణంబుల మొదట ననువర్తింపఁ జేయవలెను.

తాత్పర్యము

తియ్యని మాటలం దెవ్వఁడు బృహస్పతియో, ఎవ్వఁడు శత్రువులకుభయంకరుఁడో లోకమంతయు నెవ్వని సంపత్కరములైన బాహువుల నీడను స్థిరముగ జీవించుచున్నదో యట్టి దేవుని రామచంద్రమూర్తిని.

క. మృగము నెపంబుగ దూరం,బుగఁ గొని చని యెవరు లేని•పొలకువఁ గని నె
వ్వగఁబడ నిన్నుం దెచ్చిన, పగతుఁడు తత్ఫలముఁ గుడువఁ•బరికింపు మిఁకన్.

తాత్పర్యము

లేడి నెపము పెట్టి దూరముగఁ గొనిపోయి నీ యొద్ద నెవరు లేని జాడ తెలిసికొని నీవు దుఃఖించుచుండఁగా దెచ్చిన నీ విరోధి వాఁడు చేసిన పాపమునకు ఫలమునిఁక ననుభవించును. చూచుచుండుము.

శా. జ్వాలాభీలకరాళశాతఖగదు•ర్వారప్రవాహంబునన్
బాలా! రావణు ముంచి త్రుంచు ననిఁ గో•పస్ఫీతుఁడై పోరిలోఁ
గాలాగ్ని ప్రతిమానుఁ డేమహితుఁ డా•కాకుత్స్థవర్యుండు స
చ్ఛీలా! నీ కడ కంచె దూతగ ననున్•సెంకింప నీ కేటికిన్. ౮౧౪

అర్థములు, జ్వాలాభీల=జ్వాలలచే భయంకరమైన, కరాళ=నిడివియైన, శాత=వాఁడియైన, ఖగ=బాణములనెడి, దుర్వార ప్రవాహంబునన్ = అడ్డగింప

రాని వెల్లువయందు, కోపస్ఫీతుఁడై=నిన్ను హరించెనను కోపముచే వృద్ధినొందిన వాఁడై, కాలాగ్ని ప్రతిమానుఁడు=ప్రలయకాలమందలి యగ్నిహోత్రునకు సమానుఁడు సచ్ఛీలా=మంచి పాతివ్రత్యము గలదానా! శంకించు-తద్భవము=సెంకించు; సంస్కృత శకారమునకు వికృతియందు 'సె' వచ్చును. శల్యుఁడు = సెల్లుఁడు, శంఖము=సెంకు లోనైనవి.

### తాత్పర్యము

పతివ్రతా శిరోరత్నమా! నా విషయమున వాస్తవరామదూత యగునో కాదో యని యేల సందేహించెదవు? తల్లీ! యే మహామహుఁడు యుద్ధమునందుఁ బ్రలయకాలాగ్ని వంటివాఁడై మంటలచే భయంకరమై నిడుపాటివై పదునైన బాణముల ప్రవాహమునందు రావణుఁడు నిన్నుహరించెనను కోపముచే విజృంభించి వానిని ముంచి నఱికివైచునో యట్టి నీభర్త రామచంద్రమూర్తి పంపఁగా దూతనై వచ్చితిని. ఏల సందేహించెదవు? నేను రావణుఁడఁగాను. నేను మాయా వేషము వేయలేదు.

సీ. నీ వియోగంబున • నెవ్వఁగ రాముఁడు, నీ సేమ మడిగె నో • నీరజాస్య!
సౌమిత్రి సద్భక్తి • సాష్టాంగ మెఱఁగి నీ, కుశలంబుఁ గోరెనో • కోమలాంఘ్రి!
రాముని మిత్రుండు • రాజు క్రోఁతుల కెల్ల, సుగ్రీవుఁ డడిగె నీ • శుభముఁ దల్లి!
సౌమిత్రి సుగ్రీవ • సహితుఁడై రాముండు, సంస్మరించును నిన్ను • సతము దేవి!
తే. రాక్షసులకును జిక్కియు • రాజవదన! భాగ్యవశమున నిందాఁక • బ్రతికియున్న
దాన వింకిటఁ దూర్ణంబ • తరుణి కనెదు, రాము లక్ష్మణు వానర • స్తోమవిభుని.

అర్థములు. నీరజాస్య=(౧) కమలమువంటి ముఖముకలదానా! (౨) చంద్రునివంటి ముఖముగలదానా! ఇట్లు పగటిపూఁటఁ గమలమువలెను, రాత్రులందు జంద్రునివలె ఆహ్లాదమును గలిగించు నీ ముఖ దర్శనము లభింపమిని, కోమలాంఘ్రి=మృదువులగు పాదములను గలదానా! దేవి=శ్రీలక్ష్మీదేవి.

### తాత్పర్యము

నిన్నెడఁబాయుటచేఁ గలిగిన యపార వ్యథచేత రామచంద్రమూర్తి హనుమంతా! రేయి పగలుకూడ నన్ను సంతోషింపఁజేయు సీతాదేవియొక్క కమల చంద్రులఁబోలు ముఖము చూచుటకుఁ బ్రాప్తిలేదు. నీవైన బోయి చూచి నా సేమ మామెకుఁజెప్పి యామె సేమము తెలిసికొని రమ్మని నాతోఁ జెప్పెను. ఆయన యాజ్ఞప్రకారము నేను బయలుదేఱి వచ్చునపుడు నీ మృదుపదములను దప్ప నిన్నుఁ గన్నెత్తియైనఁ జూడని లక్ష్మణుఁడు నిండారు భక్తితో నీ పాదములకు సాష్టాంగముగ నమస్కరించి నీ క్షేమము తెలియఁ గోరెను. తనకుఁ బ్రాణదాత భయత్రాత యగుటచే రామచంద్రమూర్తిని దండ్రివలెఁ జూచు సుగ్రీవుఁడు రామచంద్రమూర్తి మిత్రుఁడు వానరులకెల్లరాజు నీవు తల్లివను భావముతో నీ క్షేమముఁ దెలియ గోరెను. రామచంద్రమూర్తి నాకై దుఃఖించు

చున్నాఁడో, రాజ్యనష్టికై, బంధు వియోగమునకై దుఃఖించు చున్నాఁడో నీ వేని యెఱుంగుదు వందు వేమో నాపాలికి నీవు శ్రీ మహాలక్ష్మివి. అట్టి నీతో నేను గల్లలాడుదునా? ఆయన రహస్యముగఁ దనలోఁదా నేడువలేదు. లక్ష్మణుఁడు సుగ్రీవుఁడు కూడనుండఁగ వారితోఁ జెప్పుకొని దుఃఖింపఁగా వారును నీకై దుఃఖించుచున్నారు. మాయందఱ భాగ్యము బాగుండుటచే నీవు మనుష్యులను భక్షించు రాక్షసులచేతిలోఁ జిక్కియు వారిచే భక్షింపఁబడక నీవై చావక యింత దాఁక బ్రదికియున్న దానవు. నీవు మరణించి యుండిన మేమందఱము చచ్చిన వారమే. ఇక జరుగఁబోవునది చెప్పెద వినుము.

నీవు రామచంద్రమూర్తిని, లక్ష్మణుని, సుగ్రీవుని త్వరగా నీ లంకయందు జూడఁగలవు.

ఉ. మానిని! వానరుండ, హనుమంతుఁడఁ బేర, దినేశపుత్త్రుఁడౌ
వానరరాజు మంతిరిని వారిధి దాఁటితి, లంకఁ జొచ్చితిన్
మానవభోజి నెత్తిపయి నా పద ముంచి పరాక్రమంబునన్
గానఁగ వచ్చినాఁడ నినుఁ గంజదళాయతనేత్ర! నమ్ముమీ. ౪౧౬

తాత్పర్యము

నేను మాఱువేషముతో వచ్చిన రావణుఁడనని కదా నీ సందేహము. అట్టి మాయలమారిని నేనుగాను. నీ కెట్లు గానవచ్చుచున్నానో యట్టిదే నా నిజస్వరూపము. నేను క్రోఁతినే. నా పేరు హనుమంతుఁడు. సూర్యపుత్త్రుఁడు వానరరాజగు సుగ్రీవుని మంత్రిని. అధముఁడగాను. ఇట్టి నేను నీ నిమిత్తమై రాము నాజ్ఞా ప్రకారము సముద్రము దాఁటితిని. లంకలోఁ బ్రవేశించితిని. రావణాసురుని తలమీఁద దొంగతనముగఁ గాదు, పరాక్రమముచేఁ గాలుంచితిని, ఇంతచేసి నిన్ను జూడ వచ్చినాఁడను. తల్లీ! నన్ను నమ్ముము.

క. ఎవ్వనిఁగా ననుఁ దలఁచితి. నవ్వాఁడను గాను సందియంపడ నేలా?
నొవ్వక యభిభాషింపుము, మవ్వంబున ననిన సీత మారుతి కనియెన్. ౪౧౭

తాత్పర్యము

నన్ను నీ వెవ్వాఁడ వని తలఁచితివో యా రావణుఁడను నేనుగాను. ఏల సందేహించెదవు? పరునితో నెట్లు భాషింపవచ్చునాయని నొచ్చుకొనక నీ దాసునితో నీ బిడ్డతో నీవు ప్రేమమున మాట్లాడునట్లు మాటలాడుము. అనిన సీతాదేవి యాంజనేయున కిట్లనియె.

పూర్వము హనుమంతుఁడు రామచంద్రమూర్తి భార్య సీతాదేవి యీమెయే యని యెట్లు పెక్కునిదర్శనములచే నిశ్చయించుకొనెనో యట్లు సీతాదేవి యిఁక హనుమంతుని బ్రత్యక్షముగ బరీక్షించుచున్నది. అట్లులే శిష్యుని గురువెట్లు పరీక్షించునో గురువును నట్లే శిష్యుఁడుగాఁ గోరువాఁడు పరీక్షింపవలెను. గాని తటాలున వీధిని బోవు వానిని వేషభాషణములఁ జూచి యాచార్యుఁడని నమ్మి

దగ్గఱఁ జేర్పరాదు. అందు ముఖ్యముగ స్త్రీలు వారితో మనసిచ్చి మాటలాడ రాదు. సీతాదేవి హనుమంతు నే విధముగఁ బరీక్షించుచున్నదో చూడుఁడు. రామచంద్రమూర్తి యొద్దకు మాఱువేషముతోఁ బోవ సాహసించిన హనుమంతుఁడు సీతాదేవి యొద్ద కట్లు పోవుట నిప్పుతో నాడుకొనుట యవి దలఁచెను, లేకుండిన మనుష్య వేషముతోనే పోయి సంగతులన్ని చెప్పి తరువాతఁ దన రూపము చూపి యుండ వచ్చును, అట్లిచ్చటఁ జేసెనేని వీఁడు మాయలమారి, నన్ను మోసగించె నని తలఁచి యుండును. కార్యము భంగమై యుండును.

—•౩౫-వ సర్గము, సీతాదేవి హనుమంతుని శ్రీరామలక్ష్మణుల చిహ్నంబు లడుగుట•—

సీ. శ్రీరామచంద్రుతో•స్నేహ మెట్లు లభించె, నీకు? లక్ష్మణు నెట్టు•లెఱిఁగి తీవు?
నరవానరుల కెట్లు•పరఁగె సమాగమం? బెట్టి గుర్తుల వార•లిద్ద అన్న
దమ్ములు? వానిని•దథ్యంబుగాఁ దెల్పి, నా దుఃఖ మడఁపు వా•నరవరుండ!
యెట్టిది సంస్థాన?•మెట్టిది రూపంబు, రామున కా సుమి•త్రాజునకును

ఆ. నూరుబాహు లెట్టి•వా రీతి వినిపింపు, మంచు నిట్లు దన్ను•నడుగుటయును
మారుతాత్మజుండు•మైథిలితో రాఘవుల శుభాంకములను•బలుకఁ దొడఁగె.

అర్థములు. సమాగమము=కూడిక, సంస్థానము=ఆకారసన్నివేశము.

రావణాసురుఁడు మాఱువేషముతో వచ్చి యుండిన యెడల రావణు నెత్తిపై నా పదముంచితిని, రావణుని రామచంద్రమూర్తి చంపును, అని యిట్టి మాటలు చెప్పి యుండఁడు. కావున వీఁడు రావణుఁడు కాఁడు, మాటలాడ వచ్చునని నిశ్చయించుకొనెను గాని వీఁడు రాము దూత యనుట యేమి నిజము? అని యీ సందేహము దీరఁ బ్రశ్నించుచున్నది.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తికి నీకు స్నేహ మెట్లు లభించెను? ఏ విధముగా నీవు లక్ష్మణు నెఱిఁగితివి? నరులను జూచిన క్రోఁతులు దూర దూరమునందే యుండును. వానరులను జూచిన మనుష్యులు బెదరించుచుందురు. ఇట్టిచోట మీ రిరువురు నొకచోట నెట్లు చేరితిరి? ఆ యన్నదమ్ము లిరువురు నెట్టి గుర్తులవారు? నీవు నిజమైన వానరుఁడ వైతివేని యున్న వాస్తవముఁ దెల్పి నాకు సంతోషము గలిగింపుము. రామునకు నాయన తమ్ముఁడు లక్ష్మణునకుఁ దొడ లెట్టివి? బాహువు లెట్టివి? తెలుపుము అని తన్నడుగఁగా హనుమంతుఁడు రామచంద్రమూర్తి శుభకరములైన చిహ్నము లిట్లు చెప్పఁ దొడఁగెను.

సీతాదేవి ప్రశ్న విషమ ప్రశ్న. అందు రెండు భాగములు గలవు. బాహువులు బహిరంగము లెవరైనఁ జూచియుండవచ్చును. తొడ లెట్టివని యడిగెను. అనఁగా మర్మాంగము లెట్టివని ప్రశ్న. ఇవి వస్త్రము మఱుఁగున నుండునవి. వీనిని

వీఁ డెట్లు తెలిసికొనెను. తెలిసికొనెం బో, స్త్రీయైన తనతో వాని నెట్లు చెప్పును. ఔచిత్యము నెఱుఁగునా యెఱుఁగఁడా? రాముని దూతయే యైన పక్షమందు నౌచిత్య మెఱుఁగక మాటలాడఁడు. అని సీతాదేవి తలఁచి యీ ప్రశ్న వేసెను.

దీనివలన నాచార్యుఁడు భగవత్తత్త్వము నామూలాగ్రము సరహస్యముగఁ దెలిసినవాఁడై యుండవలయునని భావము.

ఉ. భాగ్యము గాదె దేవి! నను • భావమునం దిటు విశ్వసించి నీ
వాగ్యమ ముజ్జగించి నిజ • వల్లభు గుర్తులు లక్ష్మణాంకముల్
యోగ్యవిధంబుగాఁ బలుకు • మున్నవిధంబుగ నంటి ప్రీతి సౌ
భాగ్యవతీ! వచింతు విను • భ్రాతల మేని శుభాంకపద్ధతుల్. ౪౧౯

అర్థములు. భాగ్యముగాదె=నా యదృష్టముగదా, వాగ్యమము=నియమము, ఉజ్జగించి=వదలి.

తాత్పర్యము

దేవీ! నా యదృష్టము కొలఁది నన్ను నీవిట్లు మనస్సున రావణుఁడుగాఁడని నమ్మి మౌనము చాలించి నీ భర్త గుర్తులు లక్ష్మణు చిహ్నములు యోగ్యమగు రీతి వాస్తవముగఁ జెప్పుమంటివి. సౌభాగ్యవతీ! యీ యన్నదమ్ముల దేహము లందలి చిహ్నములు చెప్పెద వినుము.

సీ. రాముండు కమలప • త్రవిశాలలోచనుం, డఖిలసత్త్వసుమనో • హరగుణుండు
రూపదాక్షిణ్యని • రూఢుఁడై జనియించెఁ, దేజంబునందు నా • దిత్యుఁబోలు
నోరుపుగుణమున • నుర్వికిఁ దుల్యుండు, బుద్ధి బృహస్పతి • పురుడు చూపు
నద్యశంబున హరి • సకలజీవావళీ, రక్షకుఁ డాత్మీయ • రక్షకుండు
ఆ. స్వకులవృత్తి ధర్మ • సంరక్షకుఁడు నాల్గు, జాతు లరయుచుండు • నీతి చెడక
మనుజహితము లైన • మర్యాదలం దుండి, పరుల నట్ల చేయఁ • బనుచుచుండు.

అర్థములు. కమల పత్ర విశాల లోచనుండు=తామర రేకులవలె వెడలుపగు కన్నులు గలవాఁడు, విరోధ భావముతోఁ జెప్పినను అనుకూల భావముతోఁ జెప్పినను రామచంద్రమూర్తిని జూచిన వారాయన కన్నులు తమకన్నుల యెదుటఁ గట్టినట్లుండుటచే వానినే ముందువర్ణింతురు. అవి యెట్టివారి మనస్సునైన నాకర్షించి వారి మనస్సున దృఢముగ నాటుకొను సంతతి సౌందర్యము గలవి. కావుననే శూర్పణఖయు 'నిడుద బాహులవాఁడు వెడఁద కన్నులవాఁ' డని ప్రారంభించెను. రామచంద్రుని బాహువులఁ జూపినపు డీ బాహువులచేఁ దన్ను నీయన కౌఁగిలించుకొనునా యని యాశపడెను. ఆ భ్రమ వదలినది కాదు. కావున ముందు చేతులు చెప్పి తన్ను మోహింపఁజేసిన కన్నులు రెండవదిగాఁ జెప్పెను. ఈ కన్ను లెట్టివనిన మహా ప్రవాహమందుఁ దామర పూలవంటివి. సుడిగుండ

ముల వంటివి. ప్రవాహమెంత సుందరముగఁ బాఱుచుండినను వాని నడుమ కమలము లుండెనేని మనుష్యుల దృష్టి వానిమీఁదికే పోవును. వానికై వానిని సమీపించితి మేని యవి తమలోనికి నీడ్చుకొనును. అట్లు సౌందర్యరస ప్రవాహమున నీకన్నులు దూరమునుండి చూచువారిని సమీపమునకు నాకర్షించును. సమీపమునకు రాఁగానే వారి మనస్సులను దమయందే లగ్నము చేసికొనును. సహజ సుందరుఁడు రాముఁడు, ఆయన యందీ కన్ను లభిరామములై యున్నవి.

అఖిలసత్త్వ=సమస్త జంతువులయొక్క, సుమనో=మంచి మనస్సులను, హర=హరించు,గుణుండు=కల్యాణ గుణములు గలవాఁడు, ఈయన సౌందర్యమేవరి నాకర్షించును? కన్నులు గలవారి నందఱను గన్ను లాకర్షించునట్లు లీయనయు సమస్త జంతువులను నాకర్షించును ప్రత్యక్షముగా నుండినచోఁ దామరలు కన్నులకుఁ గానవచ్చును. దూరముననుండు వారికెట్లు గానవచ్చును. రామచంద్రమూర్తి సుమనోహర గుణములు గలవాఁడు. కమలము లెందో యున్న తుమ్మెదల నెట్లాకర్షించును? దాని స్వభావగుణమైన సువాసనచేఁగదా. అట్లులే రామచంద్రమూర్తి తన గుణములచే దూరమున నుండు వారికిని దనయందుఁ బ్రేమ పుట్టించి తనయొద్దకు నాకర్షించును. ఎల? ఆయన సుమనస్సులవలె (పూలవలె) సుమనస్సుల (దేవతల-పండితుల) సుమనస్సులను (మంచిమనస్సులను) హరించు గుణములు గలవాఁడు. సర్వసత్త్వములను హరించువాఁడంటివే. రావణాదిరాక్షసుల మనస్సుల నేల హరింపలేదు? కమలము తుమ్మెదలు లోనగువాని నాకర్షించునే కాని కప్పలను తేళ్ళను బాములను నాకర్షించునా? అట్టులే రాక్షసులు సుమనస్సులు గారు. కావున వారి మనస్సులు హరింపలేదు. వారి యందు సుమనస్సులు(మంచి మనస్సుగలవారు)గా నుండు విభీషణాదుల మనస్సు నాకర్షింపలేదా? చెట్లయందు గుట్టల యందుఁ దిరుగు నడవిమృగమైన నా మనస్సునే యాకర్షించినపుడు మనుష్యుల నేల యాకర్షింపకుండును?

రూపదాక్షిణ్య నిరూఢుఁడై జనియించె=ఓయి, కమలము పుట్టినపుడే తేనె, వాసన పుట్టలేదు. కొన్ని దశలు మాఱిన పిమ్మట వచ్చినవి. రామచంద్రుని గుణము లట్టివా యందువేని తల్లీ! యట్టియాగంతుకములు గావు. రూపముచే-దాక్షిణ్యముచే, నిరూఢుఁడై = పరిపూర్ణముగ నిండినవాఁడై, జనియించెను=పుట్టెను అనుటచే నాయన కల్యాణగుణము లాయన తోడనే పుట్టినవి. కాని నడుమ వచ్చినవి కావు. ఇది 'పూర్ణమదః పూర్ణమిద'మ్మను శ్రుత్యర్థమును బోధించుచున్నది. పరత్వ దశయందు నే షాడ్గుణ్య పరిపూర్తి గలదో అవతార దశయందును నాయాఱు గుణములు గలవని భావము. ఇచ్చట భ.గీ. ౯-౧౧ "అవజానంతి మాం మూఢామానుషీం తను మాశ్రితమ్, పరంభావ మజానంతో మమ భూతమహేశ్వరమ్" సర్వభూతములకు మహేశ్వరుఁడనైన నేను నా పరత్వ

భావమును వదలక జనించితినని తెలిసికొన లేక మూఢులగువారు మనుష్య దేహమువంటి దేహమును (మనుష్య స్త్రీ దేహమును) ఆశ్రయించిన నన్నుఁ దెలిసికొనలేరు. అను శ్లోకము ననుసంధించునది. ఆ గుణములేవి యందువా? రూపము=సౌందర్యము. ఇది దేహ గుణముల కన్నిటికి నుపలక్షణము. దాక్షిణ్యము. ఇది యాత్మగుణముల కన్నిటికి నుపలక్షణము. ఈ ప్రకారము సమిష్టి మీఁద సౌందర్యము, గుణముల గుఱించి చెప్పి యిఁక వానిని వేఱు వేఱుగ వివరించి చెప్పుచున్నాఁడు. ఆదిత్యన్=సూర్యుని, ఉర్వికి=భూమిని, పురుడు= సమానము,సత్ + యశంబునను=మంచి కీర్తియందు,హరి=ఇంద్రుఁడు, ఆత్మీయ= తన వారిని, మనుజహితములైన మర్యాదలుఁ=ఈ మర్యాదలు (కట్టుపాట్లు) మనుష్యులకు హితములైనవే కాని వానివలనఁ దనకేమి మేలులేదని భావము. మనుష్యులను హితమర్యాదలందుఁ బ్రవర్తింపఁ జేయుటకై లోక సంగ్రహార్థము తాను జేయుచున్నాఁడు. కాని యవి చేసిన నాయనకు రాఁగల లాభము లేదు. చేయకుండినఁ బ్రత్యవాయములేదు. "న మే పార్థాస్తి కర్తవ్యం, త్రిషులోకేషు కించన, నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవహి కర్మణి" భ.గీ.౩.౨౨.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి తామరతేకులవలె విశాలములైన కన్నులు గలవాఁడు. సమస్తజంతువుల మనస్సును హరించు గుణములు గలవాఁడు. సౌందర్యదాక్షిణ్యాములతోఁ బూర్ణుఁడై జనించెను. తేజస్సునందు సూర్యునకు ఓరుపునందు భూమికి బుద్ధియందు బృహస్పతికి సమానుఁడు. మంచి కీర్తియందు నింద్రునివంటివాఁడు. సకల జీవకోటుల రక్షించువాఁడు. అందు విశేషముగఁ దన యాశ్రితులను రక్షించువాఁడు. తన కులవృత్తి ధర్మముల రక్షించువాఁడు, తన యనఁగా ఆవది మాత్రమే కాక లోకమున వారి వారి కులవృత్తులను కులధర్మములను రక్షించువాఁడు, వారివారి పద్ధతులు చెడకుండునట్లు నాలుగు వర్ణములవారిని రక్షించును. మనుష్యుల కేవి హితములో యా మర్యాదలను ముందుఁ దా ననుష్ఠించి మార్గముఁ జూపి తరువాత లోకులను మీరిట్లులే చేయుఁడని చెప్పుచుండును. రామచంద్రునం దుపదేశ పాండిత్యమే కాక యనుష్ఠానసామర్థ్యము చెప్పఁబడెను.

ఉ. కాంతి రహించుఁ, బూజితుఁడు ♦ కంజదళాక్షిరో! బ్రహ్మచర్య మ
త్యంతముఁ బూను, సాధులకుఁ ♦ దప్పనిప్రాపు, సమస్తసద్విధుల్
సాంతముగా నెఱుంగు, సము♦పాసితవిప్రుఁడు, రాజవిద్యలం
దెంతయు మేటి, శీలధనుఁ ♦ డెల్లరపట్ల వినీతుఁ డంగనా! ర-౨౧

అర్థములు. కాంతిరహించున్=కాంతిచేఁ బ్రకాశించును. నా విషయమై శోకించుచున్నాఁడంటివే. అట్టివానియందుఁ గాంతి యుండునా? యందువేమో. గ్రహణము సూర్యకాంతిని రూపుమాపలేనట్టు లాపదలెన్ని వచ్చినను మహాత్ముల సహజకాంతి పోదు. పూజితుఁడు=సాధువులచే నర్చింపఁబడువాఁడు. బ్రహ్మ

చర్య మత్యంతముఁ బూనున్=బ్రహ్మచర్యము రెండువిధములు. గృహస్థుఁడు ఋతు కాలమందు మాత్రము తన భార్యతో సంగమించి తక్కిన దినములందు స్త్రీసాంగత్యము మానువాఁడు.

“ఋతు స్స్వాభావిక స్త్రీణాం, రాత్రయ ష్షోడశః స్మృతాః
చతుర్భి రితరై స్సార్థ మహోభి స్సద్విగర్హితైః
తాసా మాద్యా శ్చతస్ర స్తు నిందితై కాదశీ చ యా
త్రయోదశీ చ శేషా స్తు ప్రశస్తా దశరాత్రయః.

స్త్రీకి రజోదర్శనమైనది మొదలు పదునాఱుదినములు ఋతుకాల మనఁబడును. వానిలో మొదటి నాలుగురాత్రులు నిషిద్ధములు. పదునొకండవ రాత్రి పదుమూఁడవ రాత్రియుఁ బనికిరావు. తక్కిన పదదినములందు ఏకాదశీ అమావాస్య పున్నమ పితృదినములు వదలవలయును. తక్కినదినములు ప్రశస్తములు. ఋతుకాలమందు భార్యాభర్త లారోగ్యవంతులై యుండి దానిని వ్యర్థముచేసిరేని భ్రూణహత్యాదోషము వచ్చును. ఇది ముగ్గురుకొడుకులు గలుగువఱకే కాని యావల నీ నియమములేదు. ఆవల భార్యను జెల్లెలివలెఁ జూడవలయును. పర స్త్రీలను దల్లులవలెఁ జూడవలెను.

“యుగ్మాసు పుత్రా జాయంతే, స్త్రియో యుగ్మాసు రాత్రిషు
పుమాన్ పుంసోధికే శుక్లే స్త్రీ భవత్యధికే స్త్రియాః
సమే పుమాన్ పుం స్త్రీ యావా క్షీణేల్పేచ విపర్యయః
యది సంయోగకాలేతు పురుషో రాగమోహితః
ద్విధా సముత్సృజే చ్ఛుక్లం యమకం తత్ర జాయతే॥

సరిదినములయందుఁ గూడిన పుత్రులును, బేసిదినములయందుఁ బుత్రికలును గలుగుదురు. పురుషుని వీర్యము అధికమైన పుత్రుఁడును స్త్రీ యార్తవ మధికమైన స్త్రీయును రెండును సమత్వమును జెందిన నపుంసకుఁడు గాని స్త్రీ పురుషులు గాని గలుగుదురు. సంభోగకాలమునఁ బురుషుఁడు రాగమోహితుఁడై శుక్రమును రెండు విధములుగ విడిచినఁ గవలు పుట్టుదురు.

శ్లో॥ రాత్రౌ చతుర్థ్యాం పుత్రస్స్యా దల్పాయు ర్ధనవర్జితః
పంచమ్యాం పుత్రిణీ నారీ షష్ఠ్యాం పుత్రస్తు మధ్యమః
సప్తమ్యా మప్రజా యోషి దష్టమ్యా మీశ్వర స్సుతః
నవమ్యాం సుభగా సాధ్వీ దశమ్యాం చ నరః పుమాన్
ఏకాదశ్యా మధర్మ్యా స్త్రీ ద్వాదశ్యాం పురుషోత్తమః
త్రయోదశ్యాం సుతా లోకవర్ణ సంకర కారిణీ
ధర్మవిచ్చ కృతజ్ఞస్స్యా దాత్మవేదీ దృఢవ్రతః
ప్రజాయతే చతుర్దశ్యాం గుణాఢ్యై ర్జగతీపతిః

రాజపత్నీ మహీభోగా రాజవంశగతాథవా
జాయతే పంచదశ్యాంతు బహుపుత్రా పతివ్రతా
విద్యాలక్షణ సంపన్న స్సత్యవాదీ జితేంద్రియః
ఆశ్రయ స్సర్వ భూతానాం జాయతే షోడశే పుమాన్॥

తా త్ప ర్య ము

నాలవ దినము రాత్రి పురుషునిఁ జేరిన యెడల అల్పాయువు ధనహీనుఁడు నగు పుత్రుఁడును, ౫వ దినము రాత్రి పుత్రవతియగు కూఁతురును, ఆఱవదినము రాత్రియందు మధ్యముఁడగు పుత్రుఁడును, ఏడవదినము రాత్రి సంతానహీనురాలగు పుత్రికయు, ఎనిమిదవ దినమున ప్రభువగు పుత్రుఁడును, తొమ్మిదవ దినమున పతివ్రతయగు పుత్రికయు, పదియవ దినమున శ్రేష్ఠుఁడగు పుత్రుఁడును, పదునొకండవ దినమున అధర్మురాలగు పుత్రికయు, పండ్రెండవ దినమున పురుషోత్తముఁడగు పుత్రుఁడును, పదుమూఁడవ దినమున వర్ణసంకరురాలగు పుత్రికయు, పదునాలవ దినమున ధర్మవేత్తయు, కృతజ్ఞుఁడును, ఆత్మవేదియు, దృఢవ్రతుఁడును, సుగుణములు గలవాఁడును భూభర్తయు నగు కొమరుఁడును గలుగుదురు. పదునేనవ దినమున రాజపత్నియు పతివ్రతయు రాజవంశమును పొందునదియు శ్రేష్ఠురాలును పుత్రులు గలదియు నగు పుత్రికయు, పదియాఱవ దినంబున విద్యాలక్షణ సంపన్నుఁడును సత్యవాదియు జితేంద్రియుఁడును సర్వభూతాశ్రయుఁడు నగు పుత్రుఁడు గలుగును.

ఇట్లు ఋతుకాలమందు మాత్రము స్వభార్యతో సంగమించుట యొకవిధమైన బ్రహ్మచర్యము. రెండవది స్త్రీసంభోగమునే మానుట.

"ప్రేమాభిలాషో రాగశ్చ, స్నేహః ప్రేమరతి స్తథా
శృంగారశ్చేతి సంభోగ స్సప్తావస్థః ప్రకీర్తితః,

ప్రేమ-అభిలాష-రాగము-స్నేహము-ప్రేమము - రతి - శృంగారము అని సంభోగ మేడు విధములు.

"ప్రేమా దిదృక్షారమ్యేషు, తచ్చింతా త్వభిలాషకః
రాగ స్తత్సంగబుద్ధిస్స్యాత్, స్నేహ స్తత్ప్రవణా క్రియా
తద్వియోగాసహం ప్రేమ, రతి స్తత్సహవర్తనం
శృంగార స్తత్సమం క్రీడా, సంభోగ స్సప్తధా మతః.

అందగత్తెలఁ జూడవలయు నను కోరిక ప్రేమ యనఁబడును. ఆ విషయమైన చింత యభిలాష. అట్టివారితో సంగమింపవలయు నను బుద్ధి రాగము. దానియందే మనస్సుంచుట స్నేహము. అట్టివారిని విడిచి యుండలేకుండుట ప్రేమ. వారితోడ గలసి మెలసి తిరుగుట రతి. వారితోడఁ గ్రీడించుట శృంగారము ఈ యేడును సంభోగమనఁబడును. స్త్రీలతో నొంటిపాటున మాటలాడుటగాని, వారిచేఁదల దువ్వించుకొనుటగాని, తలఁటించుకొనుటగాని, వారిని స్పృశించుట గాని,

వారు తలదువ్వుకొనునపుడు పరుండినపుడు స్నానము చేయునపుడు చూచుటగాని యిట్టివి నిషిద్ధములు. వయస్సు స్త్రీలను పీనుగులవలె నైనఁ జూడవలె, లేదా వారి యొద్ద ౫-౬ సంవత్సరముల బాలునివలె నుండవలె. ఇట్టిది రెండవ బ్రహ్మచర్య విధము. ఇట్టి బ్రహ్మచర్య వ్రతము రామచంద్రమూర్తి యందు విశేషించి గలదు. సమస్త సద్విధుల్=అన్ని వైదిక కర్మవిధానములు, సముపాసిత విప్రుఁడు=బ్రాహ్మణుల సేవించినవాఁడు, రాజవిద్యలందున్=ఆన్వీక్షకి-త్రయీ-వార్త-దండనీతి యను నాలుగు రాజవిద్యలు.

"ఆన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతిశ్చ శాశ్వతీ
ఏతావిద్యా శ్చతస్రస్తు లోకసంస్థితి హేతవః॥ అని ప్రమాణము.

ఆన్వీక్షకి=తర్కవిద్య, త్రయి=మూఁడు వేదములు, వార్త=వాణిజ్యాదికము, దండము=దోషుల దండించుట. లోకస్థితి యీ నాలుగింటిపై నాధారపడి యున్నది. శీలధనుఁడు=సదాచార పరాయణుఁడు.

తాత్పర్యము

కాంతిగలవాఁడు, సాధు పూజితుఁడు, తీవ్రమైన బ్రహ్మచర్యనిష్ఠ గలవాఁడు, సాధువులకు నాయన తప్ప వేఱు ప్రాపు లేదు. సమస్తవైదిక కర్మవిధానము తుదముట్టఁ బూర్ణముగ నెఱుఁగును. బ్రాహ్మణోపాస్తి గలవాఁడు, రాజవిద్యలందు మిగుల సమర్థుఁడు. సదాచారసంపత్తి గలవాఁడు. అందఱ విషయమున నీతితోఁ గూడిన ప్రవర్తనము గలవాఁడు.

తే. వేదవేదాంగముల యజు•ర్వేదమునను, విల్లువిద్యను నిపుణుండు•విపులము లగు
నంసములవాఁడు దీర్ఘబా•హావిరాజి, యబ్జకంఠుఁడు ముఖము రా•కాబ్జసఖము.

తాత్పర్యము

ఋగ్వేదము సామవేదము అథర్వణము లను వేదములను, వేదాంగములగు శిక్ష వ్యాకరణము ఛందస్సు నిరుక్తము జ్యోతిషము కల్పము నను వానిని, యజుర్వేదమును, ధనుర్వేదమునందును, నిపుణుఁడు. ఇంతవఱకు నాత్మగుణములు. ఇఁక దేహగుణములు చెప్పెద వినుము. వెడల్పుగల మూఁపులు. గలవాఁడు, నిడుపులగు బాహువులచేఁ బ్రకాశించువాఁడు, శంఖమునంటి కంఠము గలవాఁడు, ముఖము పూర్ణచంద్రునితో సమానము. ఇందు యజుర్వేదమును ప్రత్యేకించి చెప్పుటచే రామచంద్రమూర్తి యజుశ్శాఖ యని తెలియనగు.

ఆ. తామ్రలోచనుండు•తతగూఢజత్రుండు, దుందుభిస్వనుండు•తోయజాక్షి
బల్లిదుండు స్నిగ్ధ•వర్ణుండు చామన,చాయవాఁడు సింహ•సంహననుఁడు. ౮-౨౩

అర్థములు. తామ్రలోచనుండు=ఎఱ్ఱకమలమువంటి కన్నులు గలవాఁడు ,తతగూఢజత్రుండు=మూఁపులు బలిసియుండుటచే వెలుపలికిఁ దెలియరాని మూఁపుల సంధి యెముక గలవాఁడు, దుందుభిస్వనుండు=భేరివంటి కంఠధ్వని గలవాఁడు.బల్లిదుండు=మిగుల బలిష్ఠుఁడు, బల్లిదాదులు సంస్కృత తుల్యములు గావున బల్లిదము

బల్లిదుఁడు బల్లిద యని రూపంబులు. ఇవి విశేష్య నిఘ్నములు, స్నిగ్ధవర్ణుండు= మిన మిన మను దేహకాంతి గలవాఁడు,—చామనచాయవాఁడు చామనము+ చాయ=వృత్తియందు ప్రత్యయలోపము. బొగ్గువలె నలుపుగాక తెలుపుగాక మేఘ వర్ణము వంటి చాయ గలవాఁడు. సింహసంహననుఁడు=సౌందర్యముతోఁ గూడి సౌష్ఠవమైన ప్రత్యవయవము గలవాఁడు, వరాంగరూపోపేతో య స్సింహ సంహననో హి సః॥ అమరకోశము. ఏ యే యవయవ మెంత పరిమాణముండ వలయునో యంతే పరిమాణముగల యవయవములు గలవాఁడు.

## తాత్పర్యము

ఎఱ్ఱని కన్నులు, దాఁగిన మూఁపు సంధి యెముకలు, భేరివంటి గంభీరధ్వని గలవాఁడు, బలిష్ఠుఁడు, మినమిన మెఱయు దేహకాంతి గలవాఁడు, మేఘ వర్ణము వంటి దేహవర్ణము గలవాఁడు, అవయవ సౌష్ఠవము గలవాఁడు.

సీ. సమవిభక్తాంగుండు♦సముఁడు త్రితామ్రుండు, త్రిప్రలంబుండును♦త్రిస్థిరుండు
ముచ్చోట్ల నున్నతి♦ముచ్చోట్ల స్నిగ్ధత, ముచ్చోట్ల గాంభీర్య♦మును గలండు
త్రివళివంతుండును♦త్రిసముండు త్ర్యవనత, త్రిశిరస్కుఁడమ్మ! నీ♦హృదయవిభుఁడు
నాలుగు వ్యంగ్యముల్♦నాలుగు కలలును, నాలుగురేఖ లం♦దంబు మీఱు

ఆ. జెలి! చతుస్సముండు♦బలి చతుష్కిష్కుఁడో, యమ్మ మహితనాసి♦కోష్ఠహనువు
లమరువాఁడు జంట♦లగు పదునాలుగు, సమముగాఁ గలండు♦జనకతనయ.

అర్థములు. సముఁడు=ఎచ్చుతక్కువలు లేని శరీరము కొలఁత గలవాఁడు, సమవిభక్త+అంగుఁడు=ఒక్కొక్కయంగమును దగినంత కొలఁతతోఁ గలవాఁడు. త్రితామ్రుండు=కన్నుల కొలుకులందును, గోళ్ళయందును, అరచేయి యరకాలి యందును నెఱ్ఱని రంగుకలవాఁడు. 'నేత్రాంత నఖ పాణ్యంఘ్రితలై స్తామ్రై స్త్రిభి సు ఖీ' యను వచనము ప్రమాణము. శ్లిష్టాంగులీ రుచిర తామ్రనఖౌ సుపార్ష్ణి పాదౌ కరావపి సురక్తనఖాత్మరేఖా' యనియు నిందుఁ బ్రమాణవచనము. త్రిప్రలంబుండు=రామునికిఁ గనుబొమలు బాహువులు వృషణములును దీర్ఘములైనవి. 'దీర్ఘభ్రూబాహుముష్కస్సు చిరజీవీ ధనీ నర' యని ప్రమాణ వచనము. త్రిస్థిరుండు=మూఁడు చోటులందు స్థిరమైనవాఁడు. స్థిరమైన రొమ్ము, స్థిరమైన మని కట్టు, స్థిరమైన పిడికిలి కలవాఁడు. "ఉరశ్చ మణిబంధశ్చ ముష్టిశ్చ నృపతేస్థిరా' యని సాముద్రిక వచనము. ముచ్చోట్లన్=ఱొమ్ము, కడుపు, నాభి యంతర్భాగము అను నీ మూఁడు చోట్లయందు, ఉన్నతి=మిట్టగానుండుట కలవాఁడని యన్వ యము. "నాభ్యంతః కుక్షి వక్షోభి రున్నతః క్షితిపో భవే" త్తని ప్రమాణవచనము. "ఉన్నతకుక్షిః క్షితిపః పరిమండలోన్నత నాభీ యః క్షితిపః।హృదయం నవేపనం పృథు సమోన్నతం మాంసలంచ నృపతీనా" మ్మనియు వరాహమిహిరవచనము. ముచ్చోటన్=పాదరేఖలు, తలవెంట్రుకలు, లింగమణి యను నీ మూఁడుచోట్ల

యందు, స్నిగ్ధత=నునుపు, కలఁడు=కలవాఁడు, "స్నిగ్ధా భవంతి వై యేషాం పాదరేఖా శ్శిరోరుహాః తథా లింగమణి స్తేషాం మహాభాగ్యం వినిర్దిశేత్" అని సాముద్రిక ప్రమాణవచనము. ముచ్చోట్లన్=స్వరము సత్త్వము నాభి యను మూఁడు చోట్లయందు, గాంభీర్యము గలండు=గంభీర స్వరము, లోఁతైన నాభి, గొప్ప సత్త్వము కలవాఁడు. "స్వరే సత్త్వే నాభౌచ గంభీర స్త్రిషు శస్యతే" యని బ్రహ్మపురాణము.

త్రివళవంతుఁడు=బొజ్జపైని మూఁడు మడఁతలుగలవాఁడు. (౨) మెడపైన మూఁడు మడఁతలు గలవాఁడు "స్థిరా త్రిరేఖ్యా సుభగోపపన్నా స్నిగ్ధా సుమాం సోపచితా సువృత్తా, నచాతిదీర్ఘా చతురంగుళాచ గ్రీవా సుదీర్ఘా భవతీహధన్యా" యని ప్రమాణవచనము. త్రిసముండు=వెండ్రుకల కొనలు, మోకాళ్ళు, వృషణములు అని మూఁడును ఎచ్చుతక్కువలు లేక సమానమయినవిగాఁ గలవాఁడు. "కేశాగ్రం వృషణం జాను సమా యస్య స భూమిపః" అని వచనము. త్ర్యవనతుఁడు=అొమ్మునందు స్తనభాగము, దానికొనభాగము కాలు సేతులయందు రేఖలు అను నీ మూఁడును లోఁతుగానున్నవి రామునకని యర్థము. "పీనోపచితైర్నిమ్నైః క్షితిపతయ శ్చూచుకై స్తనై స్సుఖినః స్నిగ్ధా నిమ్నా రేఖా ధనినాం తద్వ్యత్యయేన నిస్వానా'మ్మని వరాహమిహిరవాక్యము. త్రిశిరస్కుఁడు=మూఁడు సుడులు గల తలలుగలవాఁడు. "ఆవర్తత్రయరుచిరం యస్య శిర స్స క్షితిభృతాం నేతా" యని ప్రమాణము. మూఁడు తీరులుగల శిరస్సు గలవాఁడు. సమమై గుండ్రమై యుండుట, ఛత్రాకారమై యుండుట, విశాలమైయుండుట యనునవి మూఁడు తీరులు "సమవృత్త శిరాశ్చైవ ఛత్రాకారశిరా స్తథా। ఏకచ్ఛత్రాం మహీం భుంక్తే దీర్ఘమాయుశ్చ విందతి" యని నారద వాక్యము. నాలుగు వ్యంగ్యముల్=పొట్టివియైన నాలుగవయవములు. మెడ ప్రజననము వీఁపు మోఁకాళ్ళు. ఇవి పొట్టివైన నాల్గవయవములు, నాలుగవయవములు కొన్ని లోపములు గలవి. పాదములందు నరము కనఁబడదు. ఒక రోమకూపమందు రెండు రోమములు మొలవవు. మగగుఱి పొడుగుగాక యుండును. వస్తి మాంసశూన్యము. ఇవియే లోపములు. "పాదైః ప్రస్వేదరహితైస్సిరా హీనశ్చ పార్థివః। ఏకరోమా భవేద్రాజా ద్విరోమా పండితో భవేత్। త్రిరోమా చతురోమాచ భవే ద్భాగ్యవివర్జితః। సమపాదోపవిష్టస్య గుల్ఫం స్పృశతి మేహనం। యస్యేశ్వరం తం జానీయాత్సుఖినం చైవ మానవం। నిర్మాంస స్సంహతో వస్తిర్యేషాం తే సుఖభాగినః" అని నారద వచనము. నాలుగు కలలును=నాలుగు వేదములును. శరీరలక్షణము చెప్పునప్పుడు వేదములను జెప్పుట తత్సూచకములైన రేఖలను దెల్పుటకై యని తెలియునది. "మూలేంగుష్ఠస్య వేదానాం చతస్ర స్తిస్ర ఏవహి। ఏకా ద్వేవా యథాయోగం రేఖా జ్ఞేయా ద్విజన్మనా"మ్మని నందివచనము. నాలుగు రేఖలు_నొసలియందును, అఱచేతులయందును. నఱకాళ్ళ యెందును నున్న నాలుగు

రేఖలు. "లలాటే యస్య దృశ్యన్తే చతుస్త్రిద్వ్యేకరేఖికాః। శతద్వయం శతం షష్టి స్తస్యాయుర్వింశతి స్తథా" యని కాత్యాయన వచనము. "యస్య పాదతలే వజ్రధ్వజ శంకాంకుశోపమాః। రేఖాస్సన్త్యక్రశ్శాఖాశంతే మనుజేంద్రం తమాదిశే" త్తని నారదవచనము. "పాణౌ చతస్రో రేఖాశ్చ యస్య తిష్ఠంత్యభంగురా" యని బ్రహ్మవచనమునిట స్మరించునది. చతుస్సముఁడు=భుజములు మోఁకాళ్లు, తొడలు, చెక్కిళ్ళు అనునవి ఎచ్చుతక్కువలు లేనివాఁడు. (సమానముగాఁ గలవాఁడు.) చెక్కిళ్ళకు మాఱుగాఁ బిక్కలని కొందఱందురు, "బాహూ జానూరు గండాశ్చ చత్వార్యది సమానిచ" యని బ్రహ్మాండపురాణము, "గండాశ్చ" యన్నచో "జంఘాశ్చ" యనియు పాఠాంతరము. చతుః+కిష్కుఁడు=నాలుగు కిష్కుల కొలఁత గలవాఁడు, కిష్కువు=ఇరువదినాలుగంగుళములు. తొంబది యాఱంగుళముల యెత్తుగలవాఁడని భావము. మహిత.......... హనువులు. మహిత=కొనియాడఁబడిన, నాసిక=ముక్కు, ఓష్ఠ=పెదవి, హనువులు=దవడలు, పెదవులు దొండపండువలె నెఱ్ఱనై బలిసియున్నవి. ముక్కు ఎత్తై పొడుగుగా నున్నది. దవడ లంటుకొనిపోక బలిసియున్నవని భావము. జంట యిత్యాది=జంటగా నున్న పదునాలు గవయవములు హెచ్చుతక్కువలు లేక యున్నవి. "భ్రువౌ నాసాపుటే నేత్రే కర్ణా ఓష్ఠౌచ చూచుకే కూర్పరౌ మణిబంధౌ చ జానునీ వృషణౌ కటీ। కరౌ పాదౌ స్ఫిజౌ యస్య సమాజ్ఞేయ స్స భూపతిః" అని బ్రహ్మాండపురాణము. "కర్ణాక్షి భ్రూగండ నాసా దంతోష్ఠ స్కంధ జత్రుణీ। పాదౌ కరౌ స్తనావూరూ స్ఫిచౌ ద్వంద్వా శ్చతుర్దశ సమాశ్చయస్య విద్యంతే క్రమేణోపచితా స్తథా" యని బ్రహ్మాండ పురాణ వాక్యము.

## తా త్ప ర్య ము

ఏ యవయవ మెంతయుండిన నందమో యంతమాత్రమే వేర్వేఱుగాఁ దెలియునట్లు గలవాఁడు, ఎచ్చు తక్కువలులేని శరీరము కొలఁత గలవాఁడు. ఎఱ్ఱని కనుఁగొనలు, గోళ్ళు అరచేతులు అరకాళ్ళు గలవాఁడు. కనుబొమ్మలు, వృషణములు, బాహువులు పొడుగుగాఁ గలవాఁడు. ఱొమ్ము మణికట్టు పిడికిలి స్థిరముగా గలవాఁడు. పొత్తికడుపు, బొడ్డు, ఱొమ్ము ఎత్తుగాఁ గలవాఁడు. పాదరేఖలు తలవెండ్రుకలు లింగము నునుపై యుండువాఁడు. గంభీరమైన కంఠధ్వని, నడక లోఁతైన బొడ్డు గలవాఁడు. కంఠమున మూఁడు రేఖలు గలవాఁడు, తలవెండ్రుకలకొనలు, వృషణములు, మోఁకాళ్లు సమముగాఁగలవాఁడు. చనుమొనలు స్తనములు రేఖలు పల్లముగాఁ గలవాఁడు. మూఁడు సుళ్లు గల తలగలవాఁడు. కంఠము, లింగము, పిఱుఁదులు, పిక్కలు ఇవి హ్రస్వములుగాఁ గలవాఁడు. సమమై గుండ్రమై విశాలముగా నుండు శిరస్సు గలవాఁడు. బొటనవ్రేలి క్రింద వేదముల సూచించు నాలుగు గీఁతలు గలవాఁడు. నొసట నాలుగు రేఖలును. అఱకాలియందును, అఱచేతియందు, ధ్వజము వజ్రము అంకుశము

శంఖమువంటి నాలుగు రేఖలు గలవాఁడు, బాహువులు మోఁకాళ్లు, పిక్కలు, తొడలు, సమముగాఁ గలవాఁడు, బలశాలి. నాలుగు హస్తము లనఁగాఁదొంబది యాఱంగుళముల యెత్తుగలవాఁడు. మంకెనపువ్వు దొండపండు వంటి పెదవియు, బలిసియున్న చెక్కిళ్లు, నిడుపై నిక్కపొడిచిన ముక్కు గలవాఁడు. కనుబొమలు, ముక్కుపుటములు, కన్నులు, వీనులు, పెదవులు, చనుముక్కులు, మోఁచేతులు, మణికట్లు మోఁకాళ్లు, వృషణములు, కటి ప్రదేశములు, చేతులు, కాళ్లు, పిఱుఁదులు సమానములుగ నుండువాఁడు. ఇట్టి మగవారు లోకమందున్నారా యందు వేమో. నీనికిఁ దగిన చిహ్నములు గల స్త్రీవి నీవొకతెవే యెట్లున్నావో, లోకమున నీకుఁదగినట్టి యిట్టి చిహ్నములు గలవాఁ డాయన యొక్కఁడే యున్నాఁడు.

ఉ. నాలుగుప్రక్కదంష్ట్రిలును•నాల్గిటియానముఁ గల్గు, నాలుగున్
నాలుగు వంశముల్ గలఁడు•నాలుగు నొక్కటి స్నిగ్ధ, మాఱునున్
నాలుగు పద్మముల్, మఱియు•నాలుగు నాఱును గొప్ప వొప్పెడున్
నాలుగు రెండు మిట్టలును•నాలుగు నైదును సన్నవైతగున్.  ౧౫౫

అర్థములు. నాలుగుప్రక్క దంష్ట్రిలు=పై పండ్లవరుసయందు రెండు ప్రక్కలును, దిగువ పండ్ల వరుసయందు రెండు ప్రక్కలును జేరి నాలుగు ప్రకలు. అం దొక్కొక్క ప్రక్కయందును నాలుగేసి కోరలవంటి పండు కల్గు నని యన్వయము. (౨) ఈ రెండువరుసలలోను నడుమనుండు నాలుగు పండ్లకు రెండుప్రక్కల యందును నొక్కొక్క పల్లుకలదు. దానికి దంష్ట్రి యనిపేరు. అవి నాలుగు ప్రక్కలందును నాలుగున్నవని యర్థము, 'స్నిగ్ధా ఘనాశ్చ దశనా స్సుతీక్ష్ణదంష్ట్రా స్సమాశ్చశుభా'యని వరాహమిహిరవచనము.

"బంధుజీవ కుసుమోపమోఽధరో। మాంసలో రుచిరబింబ రూపధృత్। పూర్ణమాంసళహనుస్తు భూమిప స్తుంగతుండ రుచిరాకృతి స్తథా" యనిసంహితా వచనము, నాల్గిట యానముఁగల్గున్=సింహశార్దూలగజ వృషభముల వంటి నడక గలవాఁడు. "గజసింహ గతీ వీరౌ శార్దూల వృషభోపమౌ" యని బాలకాండ వాక్యము, నాలుగున్ నాలుగు=ఎనిమిది వంశముల్=నిడుపైన యవయవములు కలవాఁడు. వెన్నెముక, శరీరము, వ్రేళ్లు, చేతులు, ముక్కు, కన్నులు, చెవులు, మగగుఱి–యివి, యెనిమిది యవయవములు. మగగుఱి వంకర కాకుండుటే పొడుగనఁ బడును. 'పృష్ఠవంశ శ్శరీరంచ హస్తపాదాంగులీ కరౌ, నాసికా చక్షుషీ కర్ణౌ ప్రజనో యస్య చాయతా" యని సాముద్రిక వచనము. (౨) రెండు చేతులు, రెండు చేతుల వ్రేళ్లు రెండు తొడలు రెండు పిక్కలు చేరి యెనిమిది యవయవము లని కొందఱు. 'బాహావ నలకౌ చోరూ జంఘే చే త్యష్టవంశకా' యని వచనము. నాలుగు నొక్కటి = అయిదు అవయవములు. అవి వాక్కు, వక్త్రము, నఖములు. రోమములు, త్వక్కు అని కొందఱు.

వెంట్రుకలు-కన్నులు-దంతములు-అడుగులు-త్వక్కు- అని మఱి కొందఱు. స్నిగ్ధములు=నునుపైనవి. 'చక్షు స్స్నేహేన సౌభాగ్యం, దంతస్నేహేన భోజనం, త్వచస్స్నేహేన శయనం పాదస్నేహేనవాహన"మ్మని వరరుచి వాక్యము, 'స్నిగ్ధనీల మృదుకుంచితా_స్తథా మూర్ధజాస్సుఖకరా స్సమం శిర' యని మిహిర వాక్యము. ఆఱునున్ నాలుగు=పది యనయవములు, పద్మముల్ = పద్మాకారములు. ముఖము, నేత్రము నోరు, నాలుక, పెదవి, దవడలు, స్తనములు, గోళ్లు-చేతులు, కాళ్లు-యివి పది యవయవములు. "ముఖ నేత్రాస్య జిహ్వోష్ఠతాలు స్తనా నఖా కరా। పాదౌచ దశపద్మాని పద్మాకారణి యస్య చ" యని వచనము. నాలుగు నాఱును=ఱొమ్ము, తల, నొసలు, మెడ, భుజములు, మూఁపులు, నాభి, పార్శ్వములు, వెన్ను, స్వరము-అను పది యవయవములు గొప్పవి, 'ఉర శ్శిరో లలాటం చ గ్రీవా బాహ్వంస నాభయః। పార్శ్వ పృష్ఠస్వరాశ్చేతి విశాలా స్తే శుభప్రదా" యని సాముద్రిక వచనము. విశాలములు. స్వరము అనేకులకు వినఁబడుటయేగొప్ప (౨) ఱొమ్ము, నొసలు, చెవులు, మెడ, తల, మనస్సు, కడుపు, కాలు సేతులు, వెన్ను-అని పది యవయవములని మఱి కొందఱు. "శిరో లలాటే శ్రవణే గ్రీవా వక్షశ్చ హృత్తథా।ఉదరం పాణిపాదౌచ పృష్ఠం దశ బృహంతిచ" యని బ్రహ్మపురాణ వాక్యము. నాలుగు రెండు=కక్షము, కుక్షి, వక్షము, ముక్కు, మూఁపు, నొసలు-అను నా అవయవములు. మిట్టలు. 'కక్షః కుక్షిశ్చ వక్షశ్చ ఘ్రాణస్సకంధో లలాటికా। సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతాంగా శ్శుభప్రదా" యని వరరుచి వాక్యము. నాలుగైదును=కేశములు, మీసములు, రోమములు, వ్రేళ్ళకణుపులు, త్వక్కు, మగగుఱి, బుద్ధి, చూపు-అను తొమ్మిది యవయవములు సన్ననైతగున్. "సూక్ష్మా ణ్యంగులిపర్వాణి కేశలోమ నఖత్వచః శేఫశ్చ యేషాం సూక్ష్మాణి తే నరా దీర్ఘజీవిన" యని వరరుచి వాక్యము. 'అస్ఫుటితాగ్రం సూక్ష్మం శ్మశ్రు శుభం మృదుచ సంతతం స్నిగ్ధ'మ్మనియు "సూక్ష్మదృక్సూక్ష బుద్ధిశ్చ యో నర స్స సుఖీ భవే" త్తనియు వచనాంతరములు.

## తాత్పర్యము

నాలుగు దంష్ట్రిలు గలవాఁడు సింహము, ఏనుఁగు, శార్దూలము, వృషభము వీనివలె నడచువాఁడు, ఏఁపు, దేహము, చేతుల కాళ్ళ వ్రేళ్ళు, చేతులు, ముక్కు, కన్నులు, చెవులు, లింగము ఇవి నిడుదలుగా గలవాఁడు. బాహువులు, వ్రేళ్లు, తొడలు, పిక్కలు ఈ యెనిమిది నిడుపు లగువాఁడు, కన్నులు,దంతములు. చర్మము, పాదములు, వెంట్రుకలు మెఱయుచుండువాఁడు ముఖము, కన్నులు, నోరు, నాలుక, పెదవులు, దవడలు, చన్నులు, గోళ్ళు, చేతులు, కాళ్లు-ఇవి పద్మములవలె గుండ్రముగాఁ గలవాఁడు. శిరము, నొసలు, చెవులు. కంఠము, ఱొమ్ము హృదయము, కడుపు, చేతులు, కాళ్లు, పిఱుఁదులు పెద్దవిగాఁగలవాఁడు, చంకలు, కడుపు, ఱొమ్ము, ముక్కు, మూఁపు, నొసలు మిట్టలుగాఁ గలవాఁడు.

(వ్రేళ్ళ గణుపులు, తలవెండ్రుకలు, దేహమున వెండ్రుకలు, చర్మము, లింగము, మీసమున వెండ్రుకలు, సూక్ష్మబుద్ధి, సూక్ష్మదృష్టి-ఇవి సూక్ష్మములుగఁ గలవాఁడు.

తే. మూఁట వ్యాప్తుఁ డనుష్ఠించు ♦ మూఁటి సతము
రెంటఁ దెల్లన సత్యంబు ♦ నంటి యుండు
ధర్మనిరతుండు సంగ్రహా♦దాన విధుల
నెంతయును నిస్తులుండు శ్రీ♦మంతుఁ డమ్మ! ౧౩౬

అర్థములు, మూఁట వ్యాప్తుడు=మూఁడింటిచే వ్యాపించినవాఁడు. "త్రిభి ర్వ్యాప్తిశ్చ యస్యస్యాత్। తేజసా యశసా శ్రియా" యన్నట్లు తేజస్సు చేతను, కీర్తి చేతను, శ్రీ చేతను వ్యాపించినవాఁడు. మూఁటన్=పూర్వాహ్ణ మధ్యాహ్న పరాహ్ణములను మూఁడుకాలములందు ననుష్ఠింప వలసిన ధర్మార్థకామము లను త్రివర్గము గలవాఁడు. "ధర్మార్థకామాః కాలేషు త్రిషు యస్య స్వనుష్ఠితా"యని బ్రాహ్మవచనము. రెంటఁదెల్లన=తెల్లనిదంతములు, తెల్లనికన్నులు గలవాఁడు. మాతాపితృవంశములు రెండును శుద్ధముగాఁ గలవాఁడు.

తాత్పర్యము

తేజస్సు, యశస్సు, శ్రీ-యీ మూఁటిచే వ్యాపించి యుండువాఁడు. పూర్వాహ్ణ మధ్యాహ్న పరాహ్ణములందు ధర్మార్థకామముల నాలోచించి చేయువాఁడు, కన్నులు, దంతములు తెల్లనైనవాఁడు. పరిశుద్ధములైన మాతాపితృ వంశములు గలవాడు. సత్యము వదలనివాఁడు, స్వధర్మమునందు విశేషించి ప్రీతి గలవాఁడు. ధనార్జనమందు దానము చేయుటయందు మిక్కిలి యసమానుఁడు. శ్రీతో నిత్యయోగము గలవాఁడు.

ఇంత గూఢముగాఁ జెప్పనేల? స్పష్టముగనే చెప్పియుండవచ్చును గదా. స్పష్టముగాఁ జెప్పియుండిన సీతాదేవి హనుమంతుని బదిసార్చి యుండును. మీఁద వ్రాయఁబడిన యర్థమందు శిశ్నము, వృషణములు చెప్పఁబడినవి. హనుమంతుఁడు నీ మగని శిశ్న మిట్లున్నది, నీ మగని వృషణము లిట్లున్నవని చెప్పిన సీతాదేవి వీఁ డడవి మనుష్యుఁడే, ఔచిత్య మెఱుఁగక మాటలాడుచున్నాఁడు, ఇటువంటి మొద్దుగాఁడు శ్రీరామచంద్రమూర్తి దూతగా నుండఁజాలడు, అని తీర్మానించు కొని యుండును. ఆ కారణముచేతనే యీ రామాయణమునందు నౌచితీపోష ణకై గూఢముగానే చెప్పఁబడెను. ఈ విషయము వీఁ డెట్లు చెప్పునో తెలిసి కొందమనియే కదా సీతాదేవి యిటువంటి ప్రశ్న వేసెను. వస్త్రము మఱుఁగున నుండు వానిని హనుమంతుఁ డెప్పుడు చూచెను? ఎట్లు తెలిసికొనఁ గలిగెను.

"పలు సందియములఁ దొలఁచును, వెలయించు నతీంద్రియార్థ విజ్ఞానములోకుల కక్షి శాస్త్ర మయ్యది యలవడ దెవ్వనికి వాఁడె యంధుఁడు జగతిన్" చిన్నయ సూరి నీతి చంద్రిక. బుద్ధిమంతులకు శాస్త్రమే కన్ను. కావునఁ దక్కినవన్ని శాస్త్ర ప్రకారము సరిగా నున్నప్పుడవియు సరిగా నుండక తప్పదు. కావున శాస్త్రము

నాధారము చేసికొని చెప్పెను. దానిని గుఱించి హనుమంతుఁడు చెప్పకుండినను నేను జూడలేదు, నాకుఁ దెలియదని చెప్పియుండినను హనుమంతుఁడు మందబుద్ధి యని సీతాదేవి తలఁచియుండును.

క. రామునిద్వైమాతురుఁ డగు, సౌమిత్రి యజయ్యుఁ డాజి♦సద్గుణరూప
 ప్రేమముల నట్టివాఁ డు,ర్వీమండలి దేవి! నిన్ను♦వెదకుచు వారల్. ౪ ౨౮

అర్థములు. ద్వైమాతురుఁడు=లక్ష్మణుఁడు రామునకు సవతితల్లి కొడుకై నను నిచ్చట నిద్దఱు తల్లుల బిడ్డఁ డని చెప్పఁబడెను. ద్వయో ర్మాత్రో రపత్యం పుమాన్ ద్వైమాతురయని వ్యుత్పత్తి. "మాతురుత్సంఖ్యాసంభద్రపూర్వాయాః" యని పాణిని. అనఁగా నిద్దఱు తల్లుల బిడ్డఁడు. కన్నతల్లి సుమిత్రవలెనే కౌసల్యాదేవిచే రామునితోడఁ బెంపఁబడుటచే నిద్దఱు తల్లుల కొడుకని చెప్పఁబడెను. రామలక్ష్మణు లిరువురు నొక్కతల్లి బిడ్డలవలెఁ గలసి మెలసి యున్నారుగాని, సవతితల్లి బిడ్డలని వారిని జూచిన వారు వారి నడవడిఁబట్టి చెప్పఁజాల రనిభావము. అజయ్యుఁడు=జయింపరానివాఁడు, ఆజిన్=యుద్ధమందు, అట్టివాఁడు=రామచంద్రమూర్తి వంటివాఁడే, వారల్=రామలక్ష్మణులు.

### తాత్పర్యము

రామచంద్రమూర్తి సవతితల్లి కొడుకైనను నేకోదరునివలె నుండువాఁడు లక్ష్మణుఁడు. యుద్ధమం దజయ్యుఁడు, సద్గుణమందు, రూపమందు, ప్రేమమందు, రాముని వంటివాఁడు, వా రిరువురు నిన్ను భూమి యంతయు వెదకుచు.

ఇంతవఱకు "ఎట్టిది సంస్థాన మెట్టిది రూపంబు రామునకా సుమిత్రాత్మజునకు" అని సీతాదేవి యడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పి శ్రీరామచంద్రుతో స్నేహ మెట్లు లభించె నీకు, లక్ష్మణు నెట్టు లెఱిఁగి తీవు నరవానరుల కెట్లుపరఁగ సమాగమం బన్న ప్రశ్నలకుఁ బ్రత్యుత్తర మిచ్చుచున్నాఁడు.

-♦ సీతాదేవికి హనుమంతుఁడు శ్రీరామసుగ్రీవుల సమాగమ విధంబుఁ జెప్పుట ♦-

సీ. చనుదెంచి రమ్మ! మా♦చరియించుచోటికి, నన్న రాజ్యమునుండి♦తన్నుఁదఱుమ
 ఋశ్యమూకాద్రి మే♦మెల్లరు సేవింప, నన్నభయంబున ♦ నదరిపడుచు
 నున్న సుగ్రీవుఁ డీ♦యన్నదమ్ములఁ జీర,వసనుల ధృతచాప♦పాణితలుల
 వీక్షించి భయమున♦నెగిరి శృంగముఁజేరి, ననుఁ బంపె వారిచం♦దం బెఱుంగ

ఆ. మోడ్పుఁగేలఁ బురుష♦ముఖ్యుల డాసితి, వారు నాదు పలుకు♦గారవింప
 మోచి తెచ్చి కీశ♦ముఖ్యుని ప్రేమలను, లలితరీతి వారి♦నినుపుటయును. ౪ ౨౯

అర్థములు. మాచరియించు చోటికి=మేము చరించు చోటికి, సమాసంబునఁ బ్రథమకు షష్ఠి-చీరవసనులన్=నారచీరలు గట్టిన వారిని, ధృతచాప పాణితలుల=హస్తములందు విండ్లు ధరించినవారిని.

తాత్పర్యము

మే మున్నచోటికి వారు వచ్చిరి. అన్న రాజ్యము నుండి తఱుమఁగా ఋశ్యమూకాద్రియందు మే మెల్లవారు సేవింప నన్నకు భయపడుచు నున్న సుగ్రీవుఁడు నారచీరలు, చేతుల విండ్లు ధరించిన వీరిని జూచి భయపడి యెగిరిపడి శిఖరముచేరి వారి వృత్తాంతము దెలిసికొని రమ్మని నన్నుఁబంపెను. వారిని జూడఁగానే వారెవరో మహాత్ములని తోఁచుటచే నేను వినయమునఁ జేతులు జోడించుకొని వారియొద్దకుఁ బోయితిని. వారు నా మాటయందాదర మఁంచి గారవింపఁగా నేనే వారిని మోచి తెచ్చి సుగ్రీవుని యెదుట నిలిపితిని.

ఇచ్చట నేను నేను అని యుత్తమపురుషము చెప్పుట యహంకారముచేఁ గాదు. రామ సుగ్రీవసఖ్యమునందుఁ దనకుఁగల సంబంధమును, నీవు లక్ష్మణు నెట్లెఱిఁగితి వనుటకుఁ బ్రత్యుత్తరము తెలుపుటకే.

క. వారు పరస్పరసల్లాపోరురతిన్ విశ్వసించి•యొండొరులను వా
రూరార్చిరి తమిఁ దనతన; చారిత్రముఁ జెప్పిఁ విశద•సరణిగ నంతన్. ౭౩౫

తాత్పర్యము

వారిరువు రొకరితో నొకరు మంచిగ మాటలాడుచు నొకరి నొకరు నమ్మిరి. వారి వారి దుఃఖము వారు వారు చెప్పుకొనఁగా వారే యొకరినొకరు సమాధానపఱిచిరి.

క. అన్న యగు వాలిచేఁ దన, యున్ని నిమిత్తంబు వెడల•నడువంబడుటన్
బన్నపడి వగచు సుగ్రీవు న్నీ ప్రాణేశ్వరుండు•పాలఁతీ! తేర్చెన్. ౭౩౦

అర్థములు. అన్ని=స్త్రీ, ఇచ్చట భార్య యని యర్థము.

తాత్పర్యము

తనభార్య నపహరింప వలెనని తన యన్న తన్ను వెడలఁగొట్టఁగా నవమానపడి దుఃఖించు సుగ్రీవుని నీ మగఁడు తల్లీ! సమాధాన పఱిచెను. వాలి సుగ్రీవుల వాస్తవ కలహ కారణ మిదియే.

తే. నీ వియోగవశంబున•నెవ్వగ గొను, రాముచరితంబు వానర•స్వామి కంత
వినిచె సౌమిత్రి యది విని•విగతతేజుఁ, డయ్యె నుపరాగకలిత ప•ద్మాప్తునట్లు.

తాత్పర్యము

నిన్ను నెడఁబాయుటచే దుఃఖించు రామచంద్రమూర్తి చరితంబు సుగ్రీవునకు లక్ష్మణుఁడు వినిపించెను. అది విని సుగ్రీవుఁడు రాహు పట్టిన సూర్యునివలెఁ దేజో విహీనుఁ డయ్యెను. విగతతేజుఁడు=సీతా విరహముచే రాముఁడు గత తేజుఁడు=పోయిన తేజము గలవాఁడు, సుగ్రీవుఁడు; విగతతేజుఁడు = విశేషముగ (పూర్ణముగ) పోయిన తేజస్సుగలవాఁడు. ఇటువంటి దంపతుల దర్శనము వారు

కూడియుండఁగా లభింపదయ్యెఁగదా యని గతతేజుఁడై యుండి, రామచంద్రమూర్తి దుఃఖము జూచి విగతతేజుఁ డయ్యెను.

ఉ. పూర్వము మింట రావణుఁడు♦పొల్తుక నిన్గొనిపోవువేళ నీ
పుర్విని వైచినట్టి నగ♦లొక్కెడ నేఁ బదిలంబు సేసితిన్
సర్వము నొప్పు తేర దివ♦సప్రభుసూతియుఁ జూపెఁ గాని హృ
త్పర్వము గూర్ప నీ యునికి♦పట్టును మాత్ర మెఱుంగ మంగనా! ౪౩౨

అర్థములు. హృత్పర్వము=హృదయమునకు సంతోషము.

తాత్పర్యము

పూర్వము రావణాసురుఁడు నిన్ను నాకాశమార్గమునఁ దీసికొని పోవునపుడు నీవు భూమిమీఁద వేసిన యాభరణములను నేనొకచోట భద్రపఱిచియుంటిని. వాని నన్నిటినిఁ దీసికొని రాఁగ సుగ్రీవుఁడు వానిని రామచంద్రమూర్తికిఁ జూపెఁగాని, యాయన మనస్సు సంతోషించునట్లు చెప్పుటకు నీ వెందున్న దానవో మాకుఁ దెలియదు.

కిష్కింధాకాండము ౧౦౩వ పద్యంబున సుగ్రీవుఁడు తెచ్చి చూపినట్లున్నది. ఇచ్చట హనుమంతుఁడు తెచ్చినట్లున్నది. హనుమంతుఁడు తెచ్చి సుగ్రీవుచేతి కీయఁగా సుగ్రీవుఁడు కనఁబఱచె నని తెలియ నగు.

ఉ. వానిని జేర్చి యంకమున♦వారిజలోచన! నీదుభర్త శో
కానలదహ్యమానుఁ డయి♦యాభరణాళిని గాంచి కాంచి య
మ్మా! నినుఁ గూర్చి యా వఱచి♦నట్లఱచెన్ వివిధప్రలాపుఁడై,
నేను విచేతనున్ నృపతి♦నెమ్మదిఁ దేర్చితి సాంత్వవాక్యలన్. ౪౩౩

అర్థములు. అంకమునన్=ఒడియందు, శోకానల దహ్యమానుఁ డయి=శోకాగ్నిచే దహింపఁబడిన వాఁడై, ఆవు+అఱచినట్లు, విచేతనున్=స్మృతి తప్పిన వానిని, సాంత్వవాక్యలన్=ఓదార్చు మాటలచే.

తాత్పర్యము

ఆ యాభరణములను నొడిలో నుంచుకొని నీ మగఁడు శోకాగ్నిచేఁ గాలిన వాఁడయి వానిని జూచి చూచి, తల్లీ! యావఱచినట్లు నానా విధముల నేడ్చెను. స్మృతి తప్పిన రామచంద్రుని నేనే మూర్ఛ తేఱునట్లు చేసి యూరార్చితిని.

— ♦ శ్రీరాముని విరహతాపము హనుమంతుఁడు సీతాదేవికి జెప్పుట ♦ —

ఆ. నగలు చూచి చూచి♦నగచరపతి కిచ్చె, మఱల వాని నీదు♦మగఁడు దేవి!
నిన్నుఁ బాసి విభుఁడు♦నిత్య మగ్నినిఁ గాలు, నగ్నిపర్వతంబు♦నటు తపించు. ౪౩౪

మొదట రామచంద్రమూర్తి యవయవ సౌందర్యము నచ్చచెప్పి యిప్పుడు సొమ్ముల విషయముఁ జెప్పి యానమ్మకమును బలపఱచెను. నగలుచూచిన పిమ్మట

తన విషయమై యుపేక్షవహించెనా, ప్రేమగలవాఁడై వర్తించెనా యను విషయము సీతాదేవి ముఖ్యముగాఁ దెలియవలసినది. కావున నా విషయము చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

ఆభరణములను జూచి చూచి మఱల రామచంద్రమూర్తి సుగ్రీవున కిచ్చెను. ని న్నెడబాసి నీ మగఁడు సర్వదా లోలోపలనే కుములు నగ్నినిగల యగ్గికొండ వలెఁ దపించుచున్నాఁడు.

'అత్రమాల్యవతే శృంగే। దృశ్యతే హవ్యవాట్సదా, నామ్నా సంవర్తకోనామ కాలాగ్ని ర్భరతర్షభ। భారత మాల్యవంతమను పర్వత శృంగమున సంవర్తకుఁ డనుఁ నగ్ని సర్వదా కానవచ్చును, అని ప్రమాణము.

క. మగ్నుండై శోకంబున, భగ్నంబుగ నిద్ర చింత•వనరుచు రాముం
డగ్నులచేఁ దపియించెడి, యగ్నిగృహం బనఁగ నున్న•యాతం డబలా! ౪౩౫

లోపల నున్నది నీ కెట్లు తెలిసెను. ఉన్నదో, లేదో లోపల నుండిన వెలుపలికిఁ దెలియదా యందు వేమో శోకంబున మునిఁగినవాఁడై నిద్ర భగ్నమై పోఁగా చింతచే దుఃఖించుచు రామచంద్రమూర్తి యగ్నులచే దపించు నగ్నిహోత్ర గృహమువలె నున్నాఁడమ్మా!

తాత్పర్యము

నిత్యాగ్నిహోత్రు లగు ద్విజుల యిండ్లలో నగ్నిని సంరక్షింప నొకగది దానికని ప్రత్యేకముగా నుండును. అం దగ్ని యాఱక మండుచునే యుండును. ఆ కారణమున నా గది సెగలు గ్రక్కుచుండును. ఆ విధముగ నీ మగడు విరహాగ్నిచే సంతప్తు డగుటచే దేహము పెనము గ్రాఁగినట్లు గ్రాగుచున్నది.

ఉ. కానఁడు సౌఖ్య మేమి నినుఁ • గానని వేదనచేతఁ, దాపమున్
మానఁడు, త్వద్వియోగదహ•నంబు దహింపఁగ భూమికంపవే
గాన వణంకుకొండ యనఁ•గాఁ జలియించెడి, సంతసింపఁ డో
మానిని! నిన్నుఁ బాసి సుమ•మంజులకుంజము లెన్ని చూచినన్. ౪౩౬

అర్థములు. భూమికంపవేగానన్=భూమివణఁకు వేగముచే, సుమమంజుల కుంజములు=పూవులచే రమ్యములైన పొదలు.

తాత్పర్యము

నిన్నుఁ జూడలేదను తాపముచేత సౌఖ్యము కొంచెమైనఁ గానఁడు. తాపము వదలఁడు. నీ వియోగవహ్ని దహింపఁగ భూకంపముయొక్క వేగముచే వణఁకు కొండవలె వణఁకుచున్నాఁడు. తల్లీ! నిన్ను నెడఁబాసిన కారణముచే రమ్యములైన పూఁబొద లెన్ని చూచినను సంతోషింపఁడు.

తే. హృద్యకాంతారముల నెందు•నేగుచున్నఁ
గ్రమలహరీతరంగిణుల్ • గాంచుచున్న

నిన్నుఁ గానని కతమున • నీరజాక్షి
మానవేంద్రున కరుస మన్ • మాట లేదు. ౪౩౭

అర్థములు. హృద్య=మనోహరములైన, కాంతారములన్ = అడవులందు, క్రమ=మనోహరములైన, లహరీ తరంగిణుల్=ప్రవాహములు గల యేళ్ళను, కతమునన్=కారణముచే.

తాత్పర్యము

ఎల్లవారికి మనోహరములైన యడవులందుఁ బోవుచున్నను, మనోహరములుగాఁ బాఱుచున్న యేళ్ళు చూచినను నిన్నుఁ జూడని కారణముచే రామచంద్రమూర్తికి సంతోష మను మాటయే లేదు.

ఉ. అంబుజనేత్ర! నీపతి ర•ణాననిఁ రావణుఁ బుత్రమిత్రయు
క్తంబుగఁ జంపి శీఘ్రముగఁ•గ్రమ్మఱఁ గైకొను నిన్ను, బాస లా
యంబుజమిత్రవంశ్యుఁడును•నబ్జహితోద్భవుఁ డాచరించి రో
యంబ! వధింప వాలి నిను•నారసి నల్గడ వార్తఁ దేరఁగన్. ౪౩౮

సీతాదేవి తృప్తికై రామవిరహంబు వర్ణించి, ప్రకృత మనుసరించుచున్నాఁడు.

అర్థములు. బాసలు=ప్రమాణములు, అంబుజమిత్రవంశ్యుఁడు=సూర్యవంశమునఁ బుట్టిన రామచంద్రమూర్తి, అబ్జహితోద్భవుఁడు=సూర్యపుత్రుఁడగు సుగ్రీవుఁడు. క్రమాలంకారము.

తాత్పర్యము

కమలాక్షి! నీ భర్త రావణాసురుని కొడుకులతోడను, మిత్రులతోడను యుద్ధమందుఁ జంపి నిన్ను మఱల శీఘ్రముగ గ్రహించును. నీ కెట్లు తెలియు ననెదవా? వాలిని జంపునట్లు రామచంద్రమూర్తి ప్రమాణము చేసెను. నిన్ను వెదకించి వార్త తెప్పించెద నని సుగ్రీవుఁడు ప్రమాణము చేసెను.

ఉ. బంధురతేజు లుగ్రరణ•పండితు లా హరినాథుతోడఁ గి
ష్కింధను డాసి వాలి హతుఁ•జేసి యినాత్మజు రాజుఁ జేయుటన్
సంధిగ నైక్య మిట్లొదవె•జక్కఁగ వారికి, వారి మాతుఁడన్
సింధువు నుత్తరించి యిటు•చేరితి రోయుచు నిన్ను మైథిలీ. ౪౩౯

అర్థములు. బంధురతేజులు=అధిక తేజస్సుగలవారు, ఉగ్రరణ పండితులు=భయంకర యుద్ధమునందుఁ బండితులు; ఇనాత్మజున్=సుగ్రీవుని, ఐక్యము=సమభావము, స్నేహము, సింధువున్=సముద్రమును, ఉత్తరించి=దాఁటి, రోయుచున్=వెదకుచు, మాతుఁడు=యోధాదులు బహుళంబుగ స్త్రీసమములు, సు.వ్యా. తత్స. ౨౧. మాత శబ్దము యోధాదులందుఁ జేరినది. ఐక్యము ఈ శబ్దార్థము గుఱించి కిష్కింధ ౧౬-౫౫ ప. వ్యాఖ్య చూచునది. ఉప్పుగడ్డ నీళ్ళలోఁ బడెనేని ఘనత్వము పోయి ద్రవత్వమును బొందునేకాని వాని పరమాణువులు జలపరమాణువులు

కాఁజాలవు సముద్రములో గంగ కలసినను విభజింపరానట్లు కలియునే కాని యొక పరమాణువు మరియొక పరమాణువు కాఁజాలదు. నామ రూపములు మారినను స్వస్వరూప స్వభావములు మారక భేదింపరాని సమత్వదశకు నైక్యమనిపేరు. తుమ్మెదలు నానా పుష్పముల తేనె లొకచోఁ జేర్చును. మరల దానిని విడఁదీయ సాధ్యపడునా? అట్టికూడిక కైక్య మనిపేరు. మేఘ గంభీర భాషణంబు లన్నప్పుడు మేఘధ్వని మనుష్యునకు రాదు. మేఘధ్వనిని బోలిన ధ్వని యని యర్థము.

తా త్ప ర్య ము

అధిక తేజము గలవారును భయంకర యుద్ధములందుఁ బండితులును, నగు రామలక్ష్మణులు సుగ్రీవునితోడఁ గిష్కింధకుఁ బోయి వాలిని జంపి సుగ్రీవుని రాజు చేయుటచే రామసుగ్రీవులకు స్నేహ మిట్లు కుదిరెను. నేను వారి దూతను. నిన్ను వెదకుచు సముద్రము దాటి యిచటికి వచ్చితిని.

క. హనుమంతుఁడఁ బేరను నా, యినజుఁడు రాజ్యస్థుఁడై హరీశ్వరకోటిన్
నిను వెమకఁగఁ బదిదిక్కుల, కును బంచిన వారు చనిరి కోమలి నీకై. ౭౪౦

తా త్ప ర్య ము

నా పేరు హనుమంతుఁడు. సుగ్రీవుఁడు రాజ్యము నంగీకరించిన వాఁడై తాను జేసిన ప్రమాణము ప్రకారము వానరకోట్లను నిన్ను వెదకుటకై పది దిక్కుల కును బంపెను. వారును నీకై వెడలి పోయినారు.

ఉ. వాలి తనూభవుండు కపివల్లభుఁ డుత్తమశూరుఁ డంగదుం
డోలిఁ ద్రిభాగసైన్యయుతుఁ డూనె స్వయంబుగ నేతదర్థమై
శైలవరంబు వింధ్యమునఁ జాలదినంబులు రోసి మేము దు
ర్గాళిని ద్రోవ తప్పి వ్యసనార్తిఁ బడం జనెఁ గాల మంతయున్. ౭౪౧

అర్థములు. త్రిభాగసైన్యయుతుఁడు=సైన్యములో మూఁడవ భాగముతోఁ గూడినవాఁడై; సమాసంబున సంఖ్యార్థకము సంఖ్యేయార్థక మగును. తృతీయ భాగ మనుటకు త్రిభాగము. స్వయంబుగన్=తానే, ఏతదర్థమై=నిన్ను వెదకు కార్యమునకుఁగా.

తా త్ప ర్య ము

వాలి కుమారుఁడు యువరాజు శూరులం దుత్తముఁడు నగు నంగదుఁడు సేనలో మూఁడవభాగముఁ దీసికొని యువరాజై యింట నుండవలసినవాఁ డయ్యు నిన్ను వెదకవలయు నని తానే పనిపూనెను, మేము వింధ్యపర్వతమునందుఁ జాల దినంబులు వెదకి త్రోవ తప్పి దుఃఖించుచుండ, జాల దినములు గడచెను. ఆ కారణమున నిచ్చటికి నేను వచ్చుట కాలస్యమయ్యెను. "వింధ్యాత్తు దక్షిణో దేశో దక్షిణాపథసంజ్ఞకః॥ యాదవ॥

క. గుట్టయు గుట్టయు విడువక, చెట్టును జెట్టును మఱుంగు•చేనున్ జేనున్
బట్టుగ వెదకిన జనకుని, పట్టీ! నీయునికి తెలియఁ•బడ దయ్యెఁ జుమీ. ౨౨౧

తా త్ప ర్య ము

చెట్టు, చెట్టు గుట్ట గుట్ట వదలిపెట్టక చాటుగా నున్న చేను చేను పనిపూని వెదకితిమి గాని, నీ మునికిపట్టు మాకుఁ దెలియలేదు.

క. గడు వేమోం కడచనియెను, బుడమితనూజాత యున్న•పోబడిఁ గనమున్
గడుసరి కపిపతి యసువెఱ, విడువఁగ నెంచితిమి మేము•వెలఁదీ యుసుఱుల్.

తా త్ప ర్య ము

సుగ్రీవుఁ డిచ్చిన నెలగడువు మించిపోయెను. సీతాదేవియున్న జాడ తెలియరాదయ్యెను. కపిరాజు కఠినుఁడు. ఊరకపోయినఁ జంపునని భయపడి మేమే ప్రాణములు విడువ నెంచితిమి.

• హనుమంతుఁడు సీతాదేవితోఁ దన కామె యునికి దెలిసినవిధంబుఁ జెప్పుట •

ఉ. అంగదుఁ డంతశోకమున • హా! యనుచున్ నినుఁ గోలుపోవుటల్
భంగము గృధ్రరాజునకుఁ • బ్రాణవినాశము వాలి కబ్బుటల్
శృంగమునందు మా కిటులు•చేకుఱుటల్ మృతి, చెప్పికొంచు నో
యంగన! యేడ్చె, నేడ్చిన జ•టాయువుసోదరుఁ డంతయు న్వినెన్. ౨౨౨

తా త్ప ర్య ము

అప్పు డంగదుఁడు శోకముచే నీ వపహరింపఁబడుటయు, జటాయువు మరణించుటయు, వాలి వధయు, దిక్కులేనివారివలెఁ గొండ శిఖరమున మేము చావవలసి వచ్చుటయుఁ జెప్పుకొనుచు హా• యని యేడ్చెను. అమ్మా! యా ధ్వని విని జటాయువున కన్న మా ముచ్చట లన్నియు వినెను.

మ. విని సంపాతి యనంగ గృధ్రపతి వే•వే వచ్చి మా యంతికం
బునఁ గోపారుణనేత్రుఁ డై పలికె మ•మ్మున్ జూచి యెవ్వాండు నా
యనుజుం జంపె వచింపుఁడీ ప్లవగులా•రా! యన్నఁ దారేయుఁడున్
దనుజుం డాతని నీ నిమిత్తము జన•స్థానంబునం ద్రుంచుటల్. ౨౨౪

అర్థములు. అంతికంబునకున్=సమీపమునకు, కోపారుణనేత్రుఁడై=కోపముచే నెఱ్ఱనయిన కన్నులు గలవాఁడై, తారేయుఁడు=తార కొడుకగు నంగదుఁడు.

తా త్ప ర్య ము

ఆ గ్రద్దరాజు పేరు సంపాతి. అతఁడు త్వరత్వరగా మా సమీపమునకు వచ్చి కోపముచే నెఱ్ఱనగు కన్నులు గలవాఁడై నా తమ్ముని జంపినవాఁ డెవ్వఁడు వానరులారా! చెప్పుఁ డని యడుగఁగా నంగదుఁడు నీ నిమిత్తమై రావణుఁడు జటాయువును జంపెనని చెప్పెను.

ఉ. అంతయు నాడె; నాడ నరు♦ణాత్మజుఁ డార్తి సహించి నీదువృ
త్తాంతముఁ బల్కె రావణుని♦ధామమునందు వసించి యుండుటల్
సంతస మార దాని విని♦చయ్యనఁ గీశులు లేచి తన్నగ
ప్రాంతముఁ బాసి చేరిరి మ♦హాంబుధి యుత్తరతీరధారిణిన్. ౧౪౬

అర్థములు. ఆడన్=చెప్పఁగా, అరుణాత్మజుఁడు=అనూరుని కొడుకు, ధామమునందు=ఇంట.

తాత్పర్యము

సర్వము చెప్పఁగా విని యనూరుని కొడుకగు సంపాతి దుఃఖపడి నీవు రావణాసురుని యంతఃపురమునం దున్న వార్త చెప్పెను. వానరు లందఱు నా వృత్తాంతము విని సంతోషించి లేచి యా కొండ శిఖరము విడిచి సముద్రము యొక్క యుత్తరపు టొడ్డు చేరితిమి.

ఉ. చిత్తము నిన్నుఁ జూడఁ ద్వర♦సేయుచు నుండియుఁ గంధిదర్శనం
బుత్తలపాటు గూర్చెఁ బ్లవ♦గోత్తమపాళికి, సంత నేను లో
హత్తిన ధైర్యసారమున♦నామడ లొక్కశతంబు దాఁటి దై
త్యోత్తము వీడు సొచ్చి నిశ♦నొయ్యన రావణు నిన్నుఁ జూచితిన్. ౧౪౭

అర్థములు. కంధి=సముద్రము, ఉత్తలపాటు=కలఁత, నిశన్=రాత్రియందు

తాత్పర్యము

నిన్నుఁ జూడవలయు నని మాకెంత తొందర పాటుండినను సముద్ర దర్శనము వానరులకు మనోవ్యాకులత్వము గలిగించెను. అప్పుడు నేను ధైర్యము సాహసము గలవాఁడనై నూఱామడ సముద్రమును దాఁటి రావణు నగరము ప్రవేశించి రాత్రియందు రావణు, నిన్నుఁ జూచితిని.

చ. కలది వచించినాఁడ, మదిఁ♦గాతరభావము మాని ధీరతం
బలుకుము, నన్ను నమ్ముము, నృ♦పప్రవరోద్యమ మూని నీకుఁగాఁ
జెలి! యరుదెంచినాఁడఁ, గపి♦శేఖరుమంత్రిని, వాయుపుత్రుఁడన్
జలజహితాన్వవాయనృప♦సత్తము రామునిదూత సాధ్విరో! ౧౪౮

అర్థములు. కాతరభావము=భయము, నృపప్రవరోద్యమము=రాజ శ్రేష్ఠుఁడగు రామచంద్రుని ప్రయత్నము, జలజహితాన్వవాయ=సూర్యవంశమువాఁడుగు; వాయుపుత్రుఁడన్=వాయుదేవుని కుమారుఁడను, 'నమస్తే వాయో-త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి' యను శ్రుతివాక్య మిట ననుసంధించునది, జగత్ప్రాణభూతమైన ప్రత్యక్ష బ్రహ్మము యొక్క కుమారుఁడను దీనిచేఁ దన యుత్తమ కుల ప్రసూతి చెప్పినవాఁ డయ్యెను. దీనివలన నుత్తమ కులమునఁ బుట్టినవానిని గాని, గురువుగా గ్రహింపరాదని యేర్పడుచున్నది. ఆనుపూర్విగ వంశపరంపర చెప్పలేని

గురువును గురువుగా గ్రహింపరాదు. అట్లు చెప్పలేనివారు నీచకులులుగాను, నీచ మతమువారు గాను నందురు.

తాత్పర్యము

సాధ్వీరత్నమా! వాస్తవము చెప్పినాఁడను. నీవు భయము వదలి ధైర్యముతో మాటలాడుము. నన్ను నమ్ముము. నా యందు మాయలేదు. రామచంద్ర మూర్తి కార్యము నిర్వహింప నీ నిమిత్తమై వచ్చినాఁడను. వానరరాజు మంత్రిని. వాయుదేవుని కుమారుఁడను. సూర్యవంశపు రాజగు రామచంద్రమూర్తి దూతను.

క. మీ రాముని కఖిలాయుధ, వారభృదగ్రణికి సుఖము♦వర్ణితగుణ! గు
ర్వారాధన యుక్తుం డగు, వీరుఁడు సౌమిత్రి సుఖిత♦వెలసెడి నమ్మా? ౭౪౫

అర్థములు. అఖిలాయుధవారభృదగ్రణికిన్=ఆయుధములు ధరించు నంద ఱిలో మొదటివానికి; వర్ణితగుణ=కీర్తింపఁబడు గుణములు కలదానా! గుర్వారాధనయుక్తుఁడు=అన్న సేవతోఁ గూడినవాఁడు, సుఖితన్=సౌఖ్యముచే.

తాత్పర్యము

అమ్మా! ఆయుధములు ధరించువారిలో శ్రేష్ఠుఁడగు నీభర్తకు రామచంద్రమూర్తికి సుఖము. కీర్తింపఁబడు గుణములు గలదానా! లక్ష్మణుఁడు అన్న సేవ చేయుచు సుఖముగా నున్నాఁడు.

క. నీ విభు హిత మెంచుచు సుగ్రీవుని నుడి దక్షిణముగ♦క్షితిజా! నిన్నన్
నే వెదకుచు ననహాయుఁడ, నై వచ్చితి నిన్నుఁ గంటి♦నతిపుణ్యమునన్. ౭౪౬

అర్థములు. నుడిన్=మాటప్రకారము.

తాత్పర్యము

నీ భర్త మేలుగోరి సుగ్రీవుని మాటప్రకారము దక్షిణపు దిశగా నిన్ను వెదకుచు వచ్చితిమి. అందు నా పూర్వ పుణ్యాతిశయమున నేను నిన్నుఁ జూడఁ గలిగితిని.

చ. నినుఁ గనలేని దుఃఖమున♦నివ్వెఱఁగూరిన కీశపాళికిన్
వినిచి నినుం గనుంగొనుట♦వే తొలంగించెద దుఃఖ మెల్ల, నో
జనని! సముద్రలంఘనము♦సార్థక మయ్యెను బుణ్యసంపదన్
హనుమ యొకండె కాంచె జన♦కాత్మజ నవ్యశ మేను గాంచితిన్. ౭౪౭

తాత్పర్యము

నిన్నుఁ జూడలేక పోయితిమి గదా యను దుఃఖమున మిగుల భయపడుచున్న వానరసమూహమునకు నేను నిన్నుఁ జూచిన వార్త తెలిపి వారి దుఃఖమంతయుఁ బోఁగొట్టెదను. తల్లీ! నేను సముద్రము దాఁటుట సఫల మయ్యెను. నా పుణ్యాతిశయముచే హనుమంతుఁ డొక్కఁడే సీతాదేవిని జూడఁగలిగె నను కీర్తిని సంపాదించితిని.

—•హనుమంతుఁడు సీతాదేవికిఁ దన జన్మవృత్తాంతముఁ జెప్పుట.•—

క. వీరుఁడు రాముఁడు సహపరి, వారున్ సహమిత్రునిన్ స•బాంధవునిన్ ర
క్షోరాజుఁ జంపి పోరన్, వారక గ్రహియించు నిన్ను•నమ్ముము దేవీ! ౮౫-౮౦

ఇంతవఱకుఁ దాను రామచంద్రమూర్తి పంపున దూతనై వచ్చిన వార్తఁ దెలిపి యిఁకఁ దన జన్మచరిత్ర చెప్పుచున్నాఁడు. ఏలన:—

"యస్య నజ్ఞాయతే శీలం, కులం తస్య చ సంశ్రయమ్
న సంగతిం కుర్యా, దిత్యువాచ బృహస్పతిః॥

ఎవనియాచారము, స్వభావము, కులము నెవరి యొద్ద నెచ్చోట నుండునది తెలియదో వానితోడఁ గూడియుండరాదు, అని బృహస్పతి చెప్పెను. కావున స్నేహముచేసినను గలసి మెలసి యుండవలసి వచ్చినను గులహీనునితో నాచారహీనునితో సదాశ్రయము లేనివానితో నట్లు చేయరాదు గనుకఁ దన విషయము చెప్పుచున్నాఁడు. తన కులము, గుణము, ఊరు, నిజమైన పేరు, దాఁచువానిని నమ్మి దగ్గఱఁ జేరరా దన, నిఁక వానిని గురువుగా గ్రహింపవచ్చునా. కావున శిష్యులును గురువు వంశాదులను, వారి పుట్టువు పూర్వోత్తరములను విచారింపవలెను.

తాత్పర్యము

వీరుఁడగు రామచంద్రమూర్తి పరివారముతోను, మిత్రులతోను జుట్టములతోను గూడిన రావణుని యుద్ధమునందుఁ జంపి నిన్ను గ్రహింపఁగలఁడు. నా మాట, దేవీ! నమ్ముము.

సీ. మాల్యవంతం బను•మహితభూధరమున, జనని! నాతండ్రి కే•సరి వసించుఁ
జనియె గోకర్ణాఖ్య•శైలంబున కతండు, నట శంబసాదనుఁ•డనెడి దైత్యు
దేవర్షిసంఘనిర్•దిష్టుఁడై వధియించె, నతనిక్షేత్రంబున•ననిలునకును
జనియించినాఁడను•స్వకృతకర్మంబున, హనుమంతుఁ డను నామ•మమరె నాకు,
ఆ. నీవు నమ్మఁపొంకె•నీ నాథుగుణముల, నెల్లఁ బలికినాఁడ•నిచటనుండి
నిన్నుఁ దోడుకొనుచు•నీవల్లభుం డేగు, భయపడంగ వలదు•భవ్యశీల! ౮౧-౮౩

తాత్పర్యము

మాల్యవంత మను గొప్ప పర్వతము గలదు. అందు నా తండ్రి కేసరియను వానరరాజుండును. ఆయన యొకసారి దేవఋషుల సంఘముచే నాజ్ఞాపింపఁబడినవాఁడై శంబసాదనుఁడను దైత్యుని జంప గోకర్ణమను పర్వతమునకుఁ బోయి వానిని జంపెను. ఈ విధముగ మా తండ్రి తరమునుండి రాక్షసులకు మాకు విరోధమే. ఆయన భార్యయందు వాయుదేవునకు నేను జన్మించితిని. నేను స్వాయముగఁ జేసిన కార్యముచే నాకు హనుమంతుఁ డను పేరువచ్చెను. నీవు నమ్ముకొఱకు నీ భర్త గుణములను నన్నిటిని జెప్పితిని, నిచ్చటనుండి నీప్రియుఁడు తోడుకొని పోవును. నా మాట నమ్ముము.

ఇది యాచార్యకృత్యము. శిష్యునకు భగవద్విషయము నంతయు సమగ్ర ముగఁ జెప్పి నీవు భయపడవలదు. నిన్ను భగవంతుఁడు తన యొద్దకు స్వయముగా వచ్చి తీసికొని పోవును. భయపడ వలదు. కాలమునకు వేచి యుండుము. నీవు మాత్రము సదాచారము, భక్తి విశ్వాసములు మానవలదని చెప్పును. భవ్యశీల యను సంబోధన మీయర్థ మిచ్చుచున్నది.గురుపరంపరయుఁ జెప్పినవాఁడయ్యెను.

చ. అనవుడు విశ్వసించె జన♦కాత్మజ యాతని దూతగా మనం
బునఁ, గడు సమ్మదాశ్రువులు♦ముమ్మరమై ప్రవహించె వాలుఁగ
న్గొనలను, రాహుముక్తశశి♦కోపున మోము వికాస మందె, వా
నిని దలపోసె నిక్కపు వ♦నేచరుఁ డంచు నపాస్తశంక యై. ౭౫౪

తాత్పర్యము

ఇన్ని విధములఁ జెప్పఁగా సీతాదేవి హనుమంతుని రామచంద్రమూర్తి దూతయని నమ్మెను. నిడుపాటి కన్నుల కొలకుల నుండి సంతోషబాష్పములు విశేషముగఁ బ్రవహించెను. ముఖము రాహువుపట్టి విడిచిన చంద్రునివలె వికాసము నొందెను. సందేహమువదలి వీఁడు నిజముగా రామదూత వానరుడని నమ్మెను.

ఈ విధముగ శిష్యులు గాఁగోరువారు గురువుల మని వచ్చువారిని బరీక్షింపక గ్రహింపరాదు.

క. దానిని గని హనుమంతుఁడు, మానవతీమణికి నని యె♦మఱలి చనియెదన్
జానకి! యూఱడుమీ నీ, కే నేమి యొనర్తు నెద్ది♦యిష్టము చెపుమా. ౭౫౫

తాత్పర్యము

ఈ ప్రకారము సీతాదేవి తన్నుఁ దన మాటలను నమ్ముటయు, సంతోషించుటయుఁ జూచి యమ్మా! మఱలి నేను రామచంద్రు నొద్దకు నీవార్తఁ దెలుపఁబోవలసి యున్నది. నికేమి సాహాయ్యము చేయుమనెదవు, చెప్పుము. ఊఱడిల్లుము తల్లీ! ఊరడిల్లుము. నీ యిష్టము చెప్పుము. చేయుదు ననుటచే శిష్యుని సందేహము లన్నియు గురువు దీర్ప శక్తిగలవాఁడై యుండవలె నని యేర్పడు చున్నది.

క. పవనతనూజుఁడ నగుటను, జవబలగరిమములఁ దండ్రి♦సరిపోలుదు నో
యవనిజ! కపిమాత్రుఁడ నని, తవులుట సందియము నీకుఁ♦దగదు సుశీలా!

తాత్పర్యము

నేను వాయుపుత్రుఁడ నగుటచే వేగాతిశయము చేతను, బలాతిశయము చేతను తండ్రికి సమానుఁడను. వీఁడు సామాన్య వానరుఁడు, ఏమి చేయఁగలఁ డని సందేహించుట సత్స్వభావము గల నీకుఁ దగదు.

పవన తనూజుఁడను=పునాతి_పవనః; పవిత్రము చేయువాఁడు. అట్టి వాని కొమరుడను. ఆయన గుణములు నాయందుఁగలవు. కావున నొరు లపవిత్రు లగు కార్యము గాని, మాటలు గాని నేను చెప్పనని భావము. నీవును సుశీలవు. కావున

నీ కింతమాత్రము చెప్పఁబూనితిని గాని నీ నడవడి సరిగాదేని నీతో నేను మాట లాడి యుండ నని సుశీలాశబ్దము స్ఫురింపఁ జేసెడిని.

—• ౩౬-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవికి శ్రీరామముద్రిక నిచ్చుట •—

ఉ. ఇంకను నమ్మవేని జన•కేశ్వరనందిని! చూడు రామనా
మాంకిత మైన యుంగరము•నాదటఁ బంచె నతండు దీని నీ
కింకరుచేత నీదు మది•కిన్ ఘటియింపఁగ నమ్మకంబు నీ
యంకిలి దీఱు నం చొసఁగ•నా యమ గైకొని దానిఁ బ్రీతితోన్.   ౪౫౭

అర్థములు. రామనామాంకితము=శ్రీరామయను నక్షరములు చెక్కఁబడి నది. అంకిలి=కలఁత, వ్యాకులత్వము, ఆయమ=అంతవఱకు వీఁడు రావణుఁడని సందేహించి హనుమంతుని ప్రక్క చూడకుండిన యా సీత ప్రీతితోఁ గైకొని= ఇదియేమి మాయయెా, యే కమసాలిచేతఁ జేయించుకొని వచ్చెనో యని భీతిచే నిరాకరింపక ప్రీతిచేఁ జేతఁ దీసికొనెను.

గై+కొను=చిరకాలమున విడిచిపోయిన బంధువు ఆ పుత్త్రుఁడు తటాలున రాఁగానే సంతోషముచే నతని చేతులు పట్టుకొని యాదరించినట్లు చేకొని.

తాత్పర్యము

జనకరాజు కూఁతురా! నామాటయందు, నాయందును నీకింకను సందేహము గలదేని శ్రీరామచంద్రమూర్తి పేరు చెక్కఁబడిన యీ యుంగరమునుజూడుము. దీనిని నీ కింకరుఁ డగు నాచేత నీ కిమ్మని నీవు దీనిని జూచిన నీకు నాయందు నమ్మకము గలుగునని ప్రేమతో నిచ్చి నీయొద్దకుఁ బంపెను. దీనిచే నీ మనోవ్యాకులత్వముఁ దీరు నని యా యుంగరమును నామె కిచ్చెను. ఆమెయు దానిని సంతోషముతో గైకొనెను.

దీనివలన సంశయచిత్తులకు, శ్రద్ధచాలని వారికి రామమంత్ర ముపదేశింప రాదని యేర్పడుచున్నది. సీతాదేవి సందేహము దీరెననియు, శ్రద్ధగలదయ్యె ననియు ౪౫౭వ పద్యంబునఁ జెప్పఁబడెను. ఆ యమ గైకొని దానిఁ బ్రీతితో ననుటచేఁ దారకమంత్రము దొరకెను, ధన్యుఁడనైతి నని సంతోషమున గురూపదిష్ట మంత్రమును శిష్యుఁడు గ్రహింపవలెనని యేర్పడు చున్నది. నా కిది చెప్పు, మిది చెప్పుమని యడుగరాదు. గురు వనుగ్రహించినది గైకొనవలెను.

ఈ విధముగ సీతాంజనేయుల చర్యవలన శిష్యలక్షణము, గురు లక్షణము ముముక్షు హితచర్య, భగవన్మంత్రప్రాప్తి చెప్పఁబడెను.

చ. పతికరభూషణంబుఁ గని•పద్మదళాక్షి ముదంబు నొందెఁ దాఁ
బతియె సమక్ష మచ్చటికి•వచ్చినయట్లుగఁ, దామ్రపత్రభా

సితనయనాంచితం బయిన॰శ్రీముఖ మెంతో వికాస మొందెన
ద్భుతగతి రాహుముక్తపరి॰పూర్ణసుధాకరబింబమో యనన్. ౮౫౪

అర్థములు. తామ్ర=కనుగొలుకులందు నెఱ్ఱని కాంతిచేతను, శుక్ల=కంటి గ్రుడ్డుచుట్టు తెల్లని కాంతిచేతను, భాసిత=ప్రకాశించు, నయన+అంచితంబు=కన్నులచేఁ బ్రకాశించు, శ్రీముఖము=శోభాయుక్తమైన ముఖము, రాహుముక్త=రాహువుచే విడువఁబడిన, పరిపూర్ణ=నిండు, సుధాకరబింబము = చంద్రబింబము. ఉత్ప్రేక్షాలంకారము. తాత్పర్యము

తన మగఁడు హస్తమున ధరించు నాభరణంబులఁ జూచి తన మగఁడే యెదురుగ వచ్చిన విధముగఁ దలంచి మిక్కిలి సంతోషించెను. ఎఱుపు తెలుపు గల కన్నులచేఁ బ్రకాశించు నామె ముఖము రాహువు విడిచిన చంద్రబింబమువలె వికాసము నొందెను.

భర్తృవియోగదుఃఖమే రాహువు.

పతికరభూషణంబు=పాణిగ్రహణ సమయంబునఁ దొలుత నా చేతిని రామచంద్రమూర్తి పట్టుకొన్నప్పుడు నన్ను స్పృశించిన ప్రథమాభరణ మిదియేకదా. నేను బ్రణయకోపము వహించినపుడు నన్ను శాంతిపఱుప నాభర్త గడ్డము పట్టుకొని సమాధానపఱచు వేళ నన్ను స్పశించిన దీ యుంగరమే కదా! నన్నుఁ గౌఁగిలింపఁగోరి కౌఁగిలించు నప్పుడు తనమేని యాభరణములు హారములు లోనైన వన్ని తొలగించి నప్పుడును వదలక యుండిన దీ యుంగరమే కదా. ఇరువురకుఁ బ్రణయకోపము వచ్చి మాటలాడక బిగించుకొని యుండి నపుడు మఱల నన్ను మాటాడింపఁ గోరి యీ యుంగరమును నేల విడువఁగా నది నెపముగా మీ యుంగరము నేలఁబడినది తీసికొనుఁ డని దాని నందిచ్చు నెపమున మమ్ముఁ గలిపిన దీ యుంగరమే కదా. వివాహకాలమున నాతోడ మాతండ్రి యిచ్చిన కారణముచే నరణ్యమునకు వచ్చునపుడు సర్వాభరణములను వదలియు నన్నుఁబోలెఁ దనతోడ తెచ్చుకొన్న దీ యుంగరమే కదా. పచ్చకప్పురపుఁ దిప్పల వెన్నెల కుప్ప లాడునపు డొక కుప్పలో దీనిని నా భర్త దాఁచి యుంచఁగాఁ గనిపెట్టి నేను దెచ్చి యిచ్చుచుండున దీ యుంగరమే కదా. అని యిట్లనేకములు తలంపులు పూర్వకృత్యములు మనస్సునకు రాఁగా నుంగరమును బట్టి చేయు, ఆ మూలమునఁ గ్రమక్రమముగ నాకారమంతయు స్పష్టముగ భావనాతిశయబలమున గోచరింపఁగా భర్తయే యెదుట వచ్చి నిలిచెనని కౌఁగిలింపఁబోయెనని, రామచంద్రమూర్తి సమక్ష మచ్చటికి వచ్చినట్లని కవి గూఢముగ సూచించెను. ఈక్రమము భగవన్మూర్తి ధ్యాన సోపాన మార్గమును దెలుపుచున్నది ఇది శిష్యుని యుత్తర కార్యము. భగవన్మూర్తి యెదురుగ వచ్చి నిలచినట్లు తోఁచువఱకు నిట్లుపాసింపవలెను. అప్పుడు రామచంద్రమూర్తియే వచ్చియుండిన సీతాదేవి కౌఁగిలింపక యుండునా?

పద్మదళాక్షి=పద్మము ముకుళించి యుండిన రేకులు తెలియరావు. కావున విచ్చిన పద్మ మనియే చెప్పవలెను. దాని వలన సీతాదేవియు సూర్యుని జూచిన కమలమువలెఁ దన ముఖమును వికాసింపఁజేసెనని భావము. ఉంగరమునుఁ జూచి నంత మాత్రముననే ముదంబు చెందిన సీత యిఁక రామాగమనము రావణవధ పునస్సంగమము గలిగిన నెంత యామోద ప్రమోద సమ్మోదములు గాంచునో కదా యని సూచన.

తామ్ర శుక్ర నయనంబులు = రక్తవర్ణము. నీ విన్నిదినాలు నన్ను పేక్షించితివిగదా యని కోపమును-స్వయంకృతాపరాధమునకు నాయన నననేల యని శుక్రవర్ణము శాంతిని గన్నులు సూచించెను.

క. హ్రీమతి బాలామణి పతి, సేమము సందేశవార్తఁ జెప్పఁగఁ గపియున్
నామోదంబుగ విని యా,సామీరిని గౌరవించి స్తవ మొనరించెన్. ౧౫౯

అర్థములు. హ్రీమతి=లజ్జగలది. తనయందు భావోదయము, భావోల్బ ణము, భావశాంతి తాను జవాలున లేచి భర్తను గౌగలించుకొనఁ బోవుట యీ చేష్టలకు హనుమంతుఁ డే మనుకొనునో యని సిగ్గుపడెను.

మీఁదఁజెప్పిన విషయము కవిహృదయము. కాదేని యిచ్చట 'హ్రీమతి' వ్యర్థవిశేషణము, అప్రస్తుత మగును. సిగ్గుపడవలసిన వేఱు కారణము లేదు. ఈ యర్థమును బాలామణి యను శబ్దము బలపఱచుచున్నది. సీత యిప్పుడు ముప్పది రెండేండ్లది కావున బాలనాయిక కాదు. అట్లుండియు బాలామణి యనుటచే నా సమయంబున ముగ్ధనాయికయందలి గుణము లజ్జ యామెయందుఁ గానవచ్చె నని భావము.

'ఉదయ ద్యౌవనా ముగ్ధా లజ్జావిజిత మన్మథా'యని కదా ముగ్ధలక్షణము. సామోదంబుగన్=ఆమోదముతోఁ గూడినట్లుగ, తొలుతటి మోద మిప్పు డా మోద మయ్యెను. సామీరి=సమీర కుమారుఁడు=ఆంజనేయుఁడు. సమీరుఁ డనఁగా 'సమ్యక్ ఈరతి-సమీర' యని వ్యుత్పత్తిప్రకారము చక్కఁగాఁ జెప్పువాఁడని యర్థము.

"వ్యాహర త్యభిధ త్తేభిదధా తీరయతీ త్యపి" యని క్రియానిఘంటువు. కారణగుణము కార్యమం దుండును,గావున ప్రియ వక్తృత్వ మాంజనేయునందుఁ గలదని భావము. స్తవము=స్తోత్రము. స్తవ మొనరించె ననుట గురుస్తోత్రము గురు మాహాత్మ్య వర్ణనము దెలుపుచున్నది. భగవన్మూర్తి సాక్షాత్కరింపఁజేసిన గురువు నెంత స్తోత్రము చేసినను గొఱతయే.

తా త్ప ర్య ము

లజ్జావతి యగు నా బాలిక పతిక్షేమము, పతివార్త కపీశ్వరుఁడు చెప్పఁగా

మిగుల సంతోషముతో విని, ప్రియవాక్యములు చెప్పనాంజనేయుని సన్మానించి యిట్లు స్తోత్రము చేసెను.

"ఆత్మజ్ఞ మర్చయే ద్భూతికామః" అను శ్రుతి వాక్య మిట ననుసంధించునది.

—• సీతాదేవి హనుమంతునిఁ బ్రశంసించి శ్రీరామాదుల కుశలం బడుగుట. •—

సీ. జలనిధి యోజన•శతము గోష్పదముగా, లంఘించి యిక్కడ లంకఁ జొచ్చి
తీవె శూరుండవు•నీవె సమర్థుండ, వీవె ప్రాజ్ఞుఁడవు•కపీంద్రచంద్ర!
సామాన్యవానరుఁ•గా మది నమ్మంగఁ, జాల రావణుఁ డన•సంభ్రమంబు
సంత్రాసమును లేమి•సమభిభాషింపగఁ బావని తగుదువు•ప్రాణనాథుఁ

తే. డైన శ్రీరామునకుదూత•వగుటఁ జేసి; పంపఁ డతఁ డపరీక్షితుఁ•బవనతనయ!
యందులోపల నా కొఱ•కంపునపుడు, పటుపరాక్రమవంతునిఁ•బంపుఁ గాని.

అర్థములు, సంభ్రమంబు=తొట్రుపాటు, సంత్రాసము=భయము, సమభిభాషింపఁగన్=ఆంజనేయుఁడు ౨౧౭వ పద్యంబున నభిభాషింపు మని కోరెను. దాని కిది ప్రత్యుత్తరము. భాషించుట యనఁగా నీ వెవ్వరనిన నీ వెవ్వరని క్రొత్త వారివలె నేవో ముచ్చటలాడుట. అభిభాషించుట, యనఁగాఁ బరిచితు లగు వారు చేయు కుశల ప్రశ్నాదికము. సమభిభాషించుట యనఁగా నితరు లెవ్వ రెఱుఁగని యంతఃపుర రహస్యములు కూడఁ జెప్పుట. దశరథుఁ డను రా జని హనుమంతుఁడు చెప్పుట ౭౨౧ మొదలు పద్యంబులఁ గలదియు ౭౨౨ పద్యము మొదలు గలదియు భాషణము. ౭౪౮ మొదలుకొని యభిభాషణము. ఇఁకఁ జేయఁబోవునది కాకాసుర వృత్తాంతము, తిలక వృత్తాంతము సమభి భాషణము. నీ వభిభాషింపు మని కోరితివి గాని సమభిభాషింప నీవు యోగ్యుఁడవు.

పల ననఁగా:—పావని వగుటచే, పావని=(౧) ఆంజనేయుఁడు (౨) పవిత్రుఁడు. ఉపసర్గముల గుఱించిన యీ సూత్రము లిచ్చట ననుసంధింపనగు."ఉపసర్గేణ ధాత్వర్థో బలా దన్యః ప్రతీయతే। ప్రహారాహార సంహార విహార పరిహారవత్॥ ధాత్వర్థం బాధతే కశ్చి త్కశ్చి త్త మనువర్తతే। తదేవ విశినష్టస్య ఉపసర్గ గతి స్త్రిధా" అను సూత్రముల ననుసరించి యీ యర్థము సాధితము.

### తాత్పర్యము

నూఱామడ గల సముద్రమును గోవుపాదమంత గుంతవలె దాఁటి యిక్కడవే లంకలోఁ బ్రవేశించితివి. వానరేశ్వరా? నీవే శూరుఁడవు. నీవే కార్యసాధకుఁడవు. నీవు మహాబుద్ధిమంతుఁడవు. రావణుఁ డనిన నందఱుఁ దత్తఱలాడుచుండ నీవు వాఁ డనిన తొట్రుపాటు పడవు. భయముపడిన వాఁడవు కావు. కావున నిన్ను నన్ని క్రోఁతఁలవంటి క్రోతి వని నేను నమ్మలేను. నా ప్రాణనాథుఁడైన శ్రీరామచంద్రమూర్తికిఁ బావనీ! నీవు దూతవు గావున నీతో రహస్య విష

యములైన జెప్పఁటకుఁ దగుదువు. ఏలన శ్రీరామచంద్రమూర్తి సామాన్య కార్యములకే పరీక్షించి గాని దూతను బంపఁడు. అందు నా యొద్దకుఁ బంపునపుడు విశేష పరాక్రమము గలవానిని బంపును. గాని దుర్బలునిఁ బంపఁడు. నా మగఁడు నచ్చిన బంటు గావున నీకు రహస్యవిషయములు గూడఁ జెప్పఁదగుదువు. శూరుఁడవు, సమర్థుఁడవు ప్రాజ్ఞుఁడవు అను పదంబులు జ్ఞానశక్తిబలంబులఁ దెలుపు చున్నవి. అనాయాసముగ జలనిధి లంఘించియనుట బలమును, ఒక్కఁడవే అనుటచే సామర్థ్యమును, లంకఁ బ్రవేశించి నన్ను దెలిసికొనుటచే జ్ఞానమును దెలుపఁబడెను. కపి+ఇంద్ర+చంద్ర=కపి=సూర్యుఁడు.జలమును పానమును జేయువాఁడు; కపయో ర్కేభ వానరాః" నానా. ర. ఈముగ్వురగుణములు నీయందున్నవి. తపింపజేయు సూర్యునివలె నీవు శూరుఁడవు. ఇంద్రునివలె సమర్థుఁడవు. మనోధిష్ఠాన దేవత యగు చంద్రునివలెఁ బ్రాజ్ఞుఁడవు. సంత్రాసము=అంత సముద్రమునకు-ఇంతటి రావణునకు భయపడవైతివి. ఇఁక నిన్ను భయపెట్టునది యేది కలదు?

పటు పరాక్రమవంతునిఁ బంపుఁగాని, ఇచ్చట గాని యేవార్థక బోధకము; పటుపరాక్రమవంతునే పంపును. అట్టివాఁడు కాని వానిని బంపడని యర్థము.కాని, యనుక్త వాక్య పదగ్రాహకం బగు నవ్యయము. (ప్రౌ. వ్యా. వా.౧౮ సూ).

హనుమంతునియందు జ్ఞానశక్తి బలములు మూఁడుగుణములు గలవని యిందుఁ జెప్పఁబడెను. వీర్యము తేజస్సు యుద్ధకాలమునఁ జెప్పఁబడును. కావుననే నీవు రామునంతటి వాఁడ వని జాంబవంతుఁడు చెప్పెను.

సీ. సత్యసంగరుఁడు కౌ॥సల్యాతనూజుండు, కుశలిగా నా భాగ్య॥వశతఁ దండ్రి!
యనుపమగుణి సుమి॥త్రానందవర్ధనుం,డౌ లక్ష్మణుఁడు సుఖి॥యా హితేంద్ర?
రాముండు కుశలియేన్॥భూమివార్థులఁ గాల్ప, లేదుగా కల్పాగ్ని॥లీలఁ గినిసి?
కా కేమి శూరులు॥నాకుల గెల్వరే కలనిలో నా పాప॥ఫలము గాక

తే. యున్నవాఁడు గదా రాముఁ॥డన్న! చెపుమ
మద్వియోగవ్యథార్తిని॥మఱుఁగకుండ?
నాకుఁగాఁ బరితాప మం॥దండు గాదె?
యెంచునా మీఁదికార్యంబు॥లెన్నఁడైన?　　　౨౬౧

అర్థములు. సత్యసంగరుఁడు=(౧) యథార్థమైన ప్రతిజ్ఞ గలవాఁడు. (౨) 'పాతునె నిను నాత్మజ్ఞుఁడు, ఖ్యాతివలెన్ నీకు నేల కళవళ పడఁగన్' అనిచెప్పెనే, అట్టివాఁడు నన్ను విడిచియున్నాఁడె ఇదియా సత్యప్రతిజ్ఞత్వము. ఇది నర్మోక్తి యని గ్రహించునది. కౌసల్యాతనూజుండు కాని దశరథతనూజుఁడు కాఁడు. దశరథుకొడుకైన యెడల నాయనయం దుండు బలపరాక్రమ శౌర్య సత్యసంధత లేవీ లేవే. ఆఁడుదానియం దుండు గుణము లున్నవే. కౌసల్యాతనూజుండు = కౌసల్య కడుపునఁ బుట్టి యామె నేమి సంతోషపెట్టెను, ఇఁక నన్ను సంతోషపెట్టుటకు?

ఆమె యక్కడ నేడ్చుచున్నది. నే నిక్కడ నేడ్చుచున్న దానను. కుశలిగా నా భాగ్యవశత-నా భాగ్యవశమున బాగున్నాఁడుకదా? ఆయన యెందైన నుండనీ బాగున్నాడుకదా! నాకంతే చాలు. నే నెట్లు పోయిన నాయనకేమి? కౌసల్యా తనూజుండు కుశలియా=నేను నిర్భాగ్యురాలనే. ఆమె కడుపు చలువచేతనైన క్షేమముగా నున్నాఁడుకదా. అదియే నాపాలికి భాగ్యము. తండ్రీ! తండ్రితోఁ జెప్పుకొన్నట్టు సిగ్గుబిడియము విడిచి తండ్రివలె నన్నాదరించి నా కష్టములు తొలఁగించెదవని చెప్పుకొనుచున్నాను. గాని పరాయివాఁడవు దూత వని నేను జెప్పఁ బూనలేదు. మగఁడు వదలిన ఆఁడుబిడ్డలు తమ దుఃఖమును దండ్రితోఁ జెప్పుకొనక మఱి యెవరితోఁ జెప్పుకొందురు?

అనుపమగుణి=అసమానమైన గుణములు గలవాఁడు. రామునివలె నొకటి చెప్పి మఱియొకటి చేయువాఁడు గాఁడు ఎంత చెప్పునో యంతే చేయువాఁడు. సుమిత్రానందవర్ధనుఁడు=రామచంద్రమూర్తి యడవికివచ్చి తల్లిని దుఃఖపెట్టెను. లక్ష్మణుఁ డన్న వెంట వచ్చి తల్లిని సంతోషపెట్టెను. అటువంటి లక్ష్మణుఁడు రామదాస్యమే చిహ్నముగాఁ గలవాఁడు, రామునకుఁ గష్టము దోఁపనీయక సేవ సేయుచుఁ సుఖముగా నెంచు చున్నాఁడు గదా. హితేంద్రాః=నా హితము కోరు బంధువులున్నారు. ఏమి లాభము? అక్కఱవేళకు నీ వాదుకొన్నట్లు వార లాదుకొనఁ గలిగిరా? కావున నా మేలు కోరు బంధువు లందఱిలో నీవే శ్రేష్ఠుఁడవు. అక్కఱకు రాని చుట్టము లుండియు నేమి ప్రయోజనము?

రాముండు కుశలియేన్=రామచంద్రమూర్తి కుశలిగా నున్న పక్షమున భూమి వార్ధులన్=భూమిని సముద్రమును, కల్పాగ్నిలీలన్=ప్రళయకాలాగ్నివలె, కినిసి=కోపించి, అయ్యో! రాముఁడు ప్రాణముతో నుండినయెడల నా నిమిత్తమై కోపించి ప్రలయకాలాగ్నివలె భూమిని సముద్రమును గాల్చకున్నాఁడా? నన్ను దక్కించుకొనుటకై యంతపని చేసి యుండునే. చేయలేదా? అది యాయనకుఁ గష్ట కార్యము గాదే. ఆయన కన్నెఱ్ఱనైనఁ జాలును. అదియే ప్రలయకాలాగ్ని చేయుపని చేయును గదా. విల్లు చేతికిఁ దీసికొని యెక్కుపెట్టి బాణము సంధించి సముద్రముపై నొకటి,భూమిపై నొకటి ప్రయోగింపన లేనా? ఆంజనేయా! రాముఁడు కుశలియని నీవు చెప్పుటచే నమ్ముచున్నాను గాని యంతకార్యము చేయలేదు గావున మఱియొకరు చెప్పిన నమ్మియుండను. నీవు చెప్పుటచే నమ్మెదను గాని యంతకార్యము చేయకుండుటచే నా మీఁదఁ బ్రేమ తప్పినదని తలఁచెదను. లేదా యంతటిశక్తి లేదని తలఁచెదను. వారి శక్తి యాఁడుదానిని జంపను, ఆఁడుదాని ముక్కులు చెవులు గోయనే కాని యిటువంటి వారిని దండించుటయందు లేదు.

కాకేమి శూరులు=శూరులు కాకేమి? శూరులే యగుదురు. నాకులన్=నాకులనైనను = దేవతలనైనను, నాకము+ఇ=నాకి = స్వర్గమందుండువారు,

గెల్వరా=గెల్వలేరా. నా పాపఫలము వారికి నాయందు దయ తప్పఁజేసి వారి శౌర్య ముపయోగింపకుండఁ జేసినది. ఆకారణముచే; మద్వియోగ వ్యథా ప్తిని= నన్ను విడుచుటవలనఁ గలిగిన దుఃఖముచే, మఱుఁగకుండన్=సంతాపింపక, నీళ్ళు కళపెళ కళపెళ క్రిందికి మీఁదికి మసల గ్రాఁగుట మఱుఁగుట యందురు.

తాత్పర్యము

తండ్రీ! సత్యప్రతిజ్ఞగల కౌసల్యాకుమారుఁడు నా భాగ్యవశమునఁ గుశలముగా నున్నాఁడుగదా. అసమానగుణవంతుఁ డగు సుమిత్రానందనుఁడు లక్ష్మణుఁడు హితేంద్రా! సుఖమా? రాముఁడు కుశములతో నుండినఁ బ్రలయకాలాగ్నివలెఁ గోపించి నా నిమిత్తమై భూమిని, సముద్రమును గాల్పలేదు గదా. వారు శూరులు కారా, శూరులే. దేవతలనైనను యుద్ధమందు గెల్వఁగలవారే. నా పాప ఫలమువలన వా రా ప్రయత్నము చేసినవారుగారు. అన్నా! యాంజనేయా! నన్ను నెడఁబాసిన తాపముచే రామచంద్రమూర్తి సంతాపింపకున్నాఁడుగదా. నా కొఱకై యాయన దుఃఖింపఁడు గదా. నా విషయమునఁ గాకున్నఁ దన విషయమే యైనను నిఁక మీఁద నయోధ్యయందుఁ జేయవలసిన కార్యములు మఱల బెండ్లియాడుట మొదలైనవి యాలోచించుచున్నాఁడా? లేక నా విషయమై నా ప్రియురాలి కింత కష్టము వచ్చెనే, యెట్లు తప్పింత మని చేయవలసిన కార్య మెన్నఁడైన నాలోచించుచున్నాఁడా?

సీ. ఏమఱఁడే కదా • యెల్ల కార్యంబులు, దీనుఁ డై సంభ్రాంతి • వానరేంద్ర?
పురుషకారము లెల్ల • సరిగఁ జేయును గదా, యా రాజనందనుం • డాంజనేయ?
సలుపునా మిత్రుల • శత్రులయెడ రెండు, మూఁ డుపాయంబులు • మోసపోక?
గడవ నేయునుగదా • కడుమిత్రవర్గంబుఁ! జెలికాండ్రు రతనిఁ బూ • జింతురయ్య?
తే. దేవతానుగ్రహమును జిం • తించునొక్కొ - పౌరుషంబును దైవంబుఁ • బరఁగుచున్నె?
కరము దవ్వైన నామీఁదఁ • గరుణ గలఁడె? ప్రోచునా నన్ను నీబాధఁ • బ్రోచితండ్రి?

అర్థములు. పురుషకారము=మనుష్యులు చేయవలసిన ప్రయత్నము' మిత్రులయెడ సామదానములను రెండుపాయంబులు, శత్రులయెడ దానభేదదండములను మూఁడుపాయంబులు, గడననేయునుగదా=సంపాదించునుగదా.

తాత్పర్యము

నన్నెడఁబాసిన కారణముచే శోకతప్తుఁడై తొట్రుపాటుచేఁ జేయవలసిన కార్యములన్నియు నేమఱక చేయుచున్నాఁడుగదా(ఇవన్నియు సర్వగర్భితములని యెఱుఁగవలయును.) నామీఁద ప్రేమ మునుపటి వలెనే యుండెనా?(ఈకార్యము లేవియుఁ జేయఁజాలఁడని యర్థము.) ఆంజనేయా! ఈ రాజకుమారుఁడు రాజధర్మ మనుసరించి చేయవలసిన పురుష ప్రయత్నములు లోపములేక చేయుచున్నాఁడు కదా. మిత్రులందు సామదానములు, శత్రువులందు దానభేదదండములు లుపయో

గించుచున్నాఁడుగదా. మిత్రులను సంపాదించుచున్నాఁడా? స్నేహితు లతని గౌరవింతురా? దైవ సాహాయ్యము కలుగు నుపాయ మాలోచించుచున్నాఁడు గదా! పౌరుషమును నమ్మి దైవమును నమ్మి పురుషప్రయత్నము విడువక రెంటిని నాశ్రయించి యున్నాఁడుగదా. ఇన్ని కార్యముల సందడిలో మిగుల దూరమం దుండు నన్నెప్పుడైనఁ దలఁచునంతటి దయగలదా? ఈ బాధనుండి తొలఁగించి నన్ను రక్షించునని యాశగలదా?

క. ఆగర్భశ్రీమంతుఁడు, భోగి వ్యథానర్హుఁ డైన•పుణ్యుఁడు రాముం
డీ గతి నాకై దుఃఖా,భోగంబున మిగుల నవసి•పోలేను గదా? ౨౬౩

అర్థములు. ఆగర్భ శ్రీమంతుఁడు = తల్లికడుపులో నుండునది మొదలు సంపద ననుభవించినవాఁడు, శ్రీ యాయనకు నిత్యానపాయిని గదా. (౨) శ్రీశబ్దమునకు విషమనియు నర్థము గలదు. తల్లి గర్భమునందుండి హృదయమున విషము గలవాఁడే. భోగి=(౧) భోగము లనుభవించువాఁడు,(౨)సర్పము, వ్యథానర్హుడు=దుఃఖపడఁదగిన వాఁడు కాఁడు. (౨) పరులబాధ యెట్టిదో తెలిసికొను యోగ్యత లేనివాఁడు, పుణ్యుఁడు=పుణ్యమూర్తి. (౨) వక్రోక్తి పుణ్యము నెఱుఁగనివాఁడు. రాముఁడు-(౧)రామచంద్రమూర్తి,(౨)పైకి నభిరాముఁడుగాఁ గనఁబడువాఁడు. దుఃఖాభోగంబునన్=దుఃఖాతిశయముచే, నవసి=శుష్కించి.

## తా త్ప ర్య ము

ఆంజనేయా తల్లిగర్భమున నుండునది మొదలు సంపద ననుభవించువాఁడు. పుట్టినపిమ్మట భోగములే నిత్యముగా ననుభవించువాఁడు, దుఃఖమెట్టిదో యెఱుఁగ నర్హుఁడు కానివాఁడు. ఇట్టి రాముఁడు అడవులలోఁ దిరుగుటచే నెంత శుష్కింపవలయునో యంతేగాని, నా నిమిత్తమై దుఃఖాతిశయముచే విశేషించి శుష్కింపక బాగున్నాఁడుగదా.

తల్లిగర్భము నందుండినది మొదలు విషముగల పాము తన కాటువలనఁ బరులు పడు బాధ యెట్లు తెలిసికొనఁగలదు? యట్లే తన యుపేక్షచే నేను బాధపడుచుండ నాకై యా పుణ్యుఁడు (వ్యతిరేకలక్షణ) దుఃఖించుచు మిగుల శుష్కింపక పూర్వమువలె బాగున్నాఁడు కదా!

సీ. కౌసల్యయు సుమిత్ర•కపినరా! భరతుండు, కుశలులే? యవ్వార్త•విశదపడునె?
భ్రాతృవత్సలుఁ డైన•భరతుండు నాకయి, యక్షౌహిణీసేన•నంపునయ్య?
దంతనఖాయుధ•తరుచరకోటితో, సుగ్రీవుఁ డీ లంకఁ•జొచ్చునయ్య?
సత్వసంపన్నుండు•సౌమిత్రి యసురుల, నానాస్త్రవృష్టిని•నఱకునయ్య?
తే. చూతునా నేను భీకర•శాతబాణ, దారితాంగు సబాంధవు•దశశిరస్కు?
నా నిమిత్తంబు వగచుచు•న్నాఁడె? యేక,మతియె నాపతియనఁ పనా•యతులితార్తి?

అర్థములు. అవ్వార్త విశదపడునె=వారి కుశలవార్త యేమైన వినవచ్చు

చున్నదా. తామయోధ్య విడిచినది మొదలు కౌసల్యాదుల కుశలవార్త వచ్చుటయే లేదేని యిప్పు డీమె యీ ప్రశ్న వేయఁ గారణము లేదు. దీనివలన భరతుఁడు గుహుని మూలమున మనుష్యులఁ బంపి తమ వార్త రామాదులకుఁ దెలుపుచు వారి వార్త తాను దెలిసికొను చుండె నని యేర్పడుచున్నది. అటు గాకున్న నంతటి భ్రాతృతత్పరుఁ డన్న వదినె యడవిలో నేగతి పట్టిరో విచారింపక యింతకాల మూరకుండునా? సీతాపహరణము వఱకు నిట్లే జరుగుచుండెను గాని, యున్నట్టుండి యాశ్రమము వదలి వచ్చిన కారణముచేఁ దమ వార్త వారికి, వారి వార్త వీరికిఁ దెలియలేదు. ఈ యభిప్రాయమును భ్రాతృవత్సలుఁ డైన భరతుఁడు నాకయి యక్షోహిణీ సేన పంపునా? యను ప్రశ్న బలపఱుచుచున్నది. వాడుక ప్రకారము వచ్చువారు తాము పంచవటి విడిచిన తరువాతఁ బంచవటికి వచ్చి తన వృత్తాంతముఁ దెలిసికొని పోయి భరతునకుఁ జెప్పి యుందు రనియు నాయన తనకుఁగల యక్షోహిణీసేన రామచంద్రమూర్తికి సహాయముగాఁ బంపి యుండు ననియు సీత యూహించెను. ఈ యూహ యపోహము గాదు. ఉత్తర కాండంబున ౪౭౧-౪౭౯ పద్యములఁ జూడుఁడు. కం. జనకావనీశు నందిని, వనముల హృతయైనవార్త భరతుఁడు విని మీ, మ్మనఘాత్ములార పిలిపించిన వచ్చితి రెల్ల రీరు స్నేహము పేర్మిన్" ఇత్యాది వాక్యములు భరతుఁడు సీతారాముల కుశల వార్త తెప్పించుకొనుచుండె నని స్థిరపఱుచు చున్నవి. పూర్వ మీ విషయము చెప్పఁబడ కుండినను వాల్మీకి శైలి ననుసరించి యీ ప్రశ్నవలన నది ముందు జరగుచున్నట్లూహింపవలెను.

దంత నఖాయుధ తరుచర కోటితోన్=దంతములు, గోళ్లు నాయుధములు గాఁగల క్రోఁతుల సమూహముతో, సత్త్వ సంపన్నుఁడు=బలసంపత్తి గలవాఁడు, భీకర శాతబాణ=భయంకరములై వాఁడియైన బాణములచే, దారితాంగు=చీల్పఁ బడిన దేహము గలవానిని, సబాంధవున్=బంధువులతోఁ గూడిన వానిని.

## తాత్పర్యము

కౌసల్యయు, సుమిత్రయు, భరతుఁడు క్షేమముగా నున్నారా? ఆ వార్త యేమైన దెలియ వచ్చుచున్నదా? అన్నయందు ప్రేమగల భరతుఁడు నా నిమిత్తముగఁ దనకు గల యక్షోహిణీసేనను బంపునా? దంతములు, నఖములు సాధనములుగాఁ గల వానరసమూహములతో సుగ్రీవుఁ డీ లంకయందుఁ బ్రవేశించునా? బల సంపత్తి గల లక్ష్మణుఁడు రాక్షసుల నెల్ల నానాస్త్రవర్షముచే నఱకివైచునా? దశకంఠుఁడు బంధువులతోడ భయంకరములైన వాఁడి బాణములచేఁ జీల్పఁబడిన దేహము గలవాఁడై నేలఁబడి యుండఁ జూడఁగలనా? అయ్యో! రామచంద్రమూర్తి నా కింత కష్టము వచ్చెనుగదా యని వ్యసనపడుచున్నాఁడా? నా దుఃఖమును బాపుటయందుఁ జపలుఁడుగాక యేకనిశ్చయముతో నున్నాఁడా?

చ. పరమనవీన హేమసమ•వర్ణము పద్మసమానగంధి యై
సురుచిర మైన మన్నయన•సోమముఖంబు మరు త్తనూజ! మ
ద్విరహము పేరిమిన్ వ్యసన•పీనత నీరము లింకఁ దమ్మికిన్
దర మయి వాడిపోలేదు గ•దా వచియింపఁగదయ్య త త్త్వమున్. ౪౬౫

అర్థములు. పరమ నవీన హేమ=శ్రేష్ఠమై పుటము వేసి తీసి మెఱుఁగుపెట్టఁబడిన శుద్ధమైన బంగారుతో, సమ=సమానమైన, వర్ణము=కాంతి గలది, ఇచ్చట మెఱుఁగు మాత్రమే వివక్షితముగాని పసిమి వివక్షితముగాదు, పద్మసమానగంధి=తామరపూవుల వాసనవంటి వాసన గలది, సురుచిరమైన=అందమైన, మన్నయన సోమముఖంబు=నా కన్నులకుఁ జంద్రునివంటిదగు ముఖము, దరమయి=సమాన మయి, త త్త్వమున్=వా స్తవమును.

తా త్ప ర్య ము

అప్పుడు పుటము వేసి తీసి మెఱుఁగు పెట్టఁబడిన శుద్ధమైన బంగారు మెఱుఁగు వంటి మెఱుఁగు కలదియు, పద్మముల వాసన వంటి వాసన గలదియు, నందమైనదియు, నా కన్నులకుఁ జంద్రుని వంటిదియునగు రామచంద్రమూ ర్తి ముఖము, వాయు నందనా! నన్నుఁ బాసిన తాపముచేఁ గలిగిన దైన్యము వలన నీళ్ళింకిన తామరవలె వాడి పోలేదు గదా. అయ్యా! నిజము చెప్పుము.

ఉ. క్రౌర్యముతోడఁ గైకయి య•రణ్యములం బడు మన్న ధర్మ్య స
త్కార్య మటంచు నెంచిన వి•కార విహారుఁడుఁ, నేను బాదసం
చర్యఁ జరింపఁ గానఁ గన•జాలినధీరుఁడు, నేఁడు దీనుఁడై
ధైర్యము నుజ్జగింపఁడు గ•దా కపినాథ! నిజంబుఁ జెప్పుమా. ౪౬౬.

అర్థములు. క్రౌర్యము=దయలేని తనము, ధర్మ్యసత్కార్యము=ధర్మయు క్తమైన మంచిపని, వికార విహారుఁడు=మనసున మాఱుపాటు లేనివాఁడు, పాదసంచర్యన్=కాలినడకతో, ధీరుఁడు=ధైర్యశాలి, ఉజ్జగింపఁడు=మానఁడు, రాముని విషయమైన సీతాదేవి మాట లన్నియు సర్వో త్కృ ష్టములే.

తా త్ప ర్య ము

దయలేనిదై, రామా! నీ వడవులఁ బడఁ బొమ్మని చెప్పఁగా సవతి తల్లి మాట ప్రకారము వ ర్తించుట ధర్మ యు క్త కార్య మని పట్టాభిషేకము చేసి కొమ్మన్నప్పు డెట్లుండెనో యట్టులే కోపచిహ్నములుగాని, భయముగాని, వ్యసన చిహ్నలు గాని కనఁబఱుపని వాఁడు, నేను బదునెనిమి దేండ్ల పిల్లను, గాఱడపులలో, ముండ్లలో రాలలోఁ దనకన్నుల యెదుట గాలినడఁ దిరుగుచున్నను అప్పుడును మనస్సులో జాలి యనునది లేక యూరక ధీరతఁ జూచుచుండిన ధైర్యశాలి యిప్పుడు సీత పోయినఁ బోనిమ్మని ధైర్యము విడువక యున్నాఁడు గదా. ఆంజనేయా! నిజము చెప్పుము.

ఉ. ఏ మనుదాన దూతుఁడ! మహీశ్వరు, నా పయి కూర్మికంటె శ్రీ
రాముస కాత్మమాతపయిఁ రా జగు తండ్రిపయిన్ హితాళిపైఁ
బ్రేమము హెచ్చు గాదు సరిప్రీతియుఁ గా, దటు గావునం గదా
యా మహితాత్మువార్త వినునంతకు నిల్పితి మేనఁ బ్రాణముల్. ౨౮౭

తాత్పర్యము

అయ్యో! రామదూతా! మా రాముఁడు కఠినచిత్తుఁడు, నిన్ను విడిచి సహించినాఁడని నిష్ఠురము లాడెదవే, నీవు మాత్రము తక్కువైన దానవా? ఆఁడుదాన నయ్యుఁ, జిన్నదానవయ్యు, నింత యాపదలో మునిఁగియుఁ బ్రాణములు నిలిపితివే నీ ధైర్యము ముందట మా రాముని ధైర్యమే మాత్రములే యందువా. నేను బ్రాణములు నిలిపిన కారణము చెప్పెద వినుము. నే నేమని చెప్పుదును. నా హృదయేశ్వరుఁడైన శ్రీరామచంద్రమూర్తికి నా యందున్న ప్రేమకంటె నెక్కువ ప్రేమగాని, సమానమైన ప్రేమగాని తన తల్లి యందు లేదు. తండ్రి యం దుండినది కాదు, తన యాప్తులయందును లేదు. ఇది నే నెఱుఁగుదును. ఆ ధైర్యము చేతఁగదా యాయనవార్త వినవచ్చువఱకు బొందిలో బ్రాణములు నిలిపి యున్న దానను. నేను బ్రాణము విడిచితినా నాయందంతటి ప్రేమగలవాఁడు కావున నెటులైన నిచ్చటికి రానేవచ్చును. వచ్చి నేను జచ్చితి నన్న వార్త విని యాయన "అయ్యో! నా ప్రేమ వ్యర్థము చేసెఁగదా. నేను వచ్చి తన్ను రక్షింపఁగల నను ధైర్యము, విశ్వాసము నా యందు లేనిదయ్యెఁగదా, ఎంత దయాహీనురాలని తపించునే, నా యందంతటి ప్రేమగలవానికి నేను దుఃఖము కలిగింపవచ్చునా? ఎన్ని బాధలైన సహించునుగాక యని కదా ప్రాణములు నిలిపితిని. ప్రాణము తీఁపని రక్షించుచున్నానని తలఁచితివా? ఇంతవఱకుఁ బైపద్యములందు వానరేంద్రా! కపీంద్రా! యని సంబోధించుచుండిన సీత యిప్పుడు దూతా! యని సంబోధించెను. ఏల? దూతతోఁ జెప్పినమాట లతని స్వామితోఁ జెప్పినట్లే. అతని స్వామి కా మాట లతఁడు చెప్పవలయు ననియే యుద్దేశ్యము. శ్రీ భాగవతమున దశమ స్కంధమున గోపికల భ్రమరగీతలు పోల్చి చూచినది.

సీతాదేవి తనయందు రామచంద్రమూర్తికిఁ గల ప్రేమ, యాయన తలిదండ్రులయందుఁగాని యాప్తులగు బంధువులందుఁగాని లేదని చెప్పుటచే భర్తలగు వారు పతివ్రత లగు తమ భార్యలం దట్టిప్రేమ యుంచవలె నని సూచన:—ఏల? అర్ధాంగ లక్ష్మియై సగము దేహము పంచుకొని సహధర్మచారిణియై సమానసుఖదుఃఖయై యీ లోకమునందే కాక పరలోకమునందును, నీ జన్మమందే కాక కడచి నట్టియు, రాఁగలట్టియు జన్మంబులందును వెంటనంటియుండు సాధ్వియగు భార్యకుఁ దక్కినవా రెట్లు సాటి కాఁగలరు? వారితోడ కూటమికి ఋణసంబంధము కారణము. ఒక యాత్మయేకదా రెండయ్యెను.

చ. అని మధురార్థయుక్తము మ♦హార్థము నౌ వచనంబు లాడి యా
వనజదళాయతాక్షి కపి♦వర్యుని రామగుణానుకీర్తనం
బును విను నాశ మౌనమును♦బూనిన నాయమఁ జూచి వాయునం
దనుఁడు కరంబుభక్తిఁ గర♦తామరసంబులు మోడ్చి యిట్లనున్. ౪౬౪

అర్థములు. మధురార్థయుక్తము=తియ్యని యర్థముతోఁగూడినది, ఆమె చెప్పుమాటలను నింకను దినవలె నింకను దినవలె నని యాశ కలిగించునవి. రామచంద్రమూర్తి హనుమంతా! సీతాదేవి యేమిచెప్పె ననిన నామెమాటలు విన కుండినఁ దానేమి చెప్పగలఁడు. కావున వినుచుండెను. వినుకొలఁదిఁ దియ్యగా నుండుటను, రామచంద్రునకుఁ జెప్పుటకై వినుట యావశ్య మగుటను సేవకుఁడగు వాఁడు నడుమ నడుమ మాటలాడరాదు గనుకను, ఆమెచెప్పిన మాటలు హనుమంతుఁడూరక వినుచుండెను.

మహార్థము=ఆమాటల యందుండు గొప్పయర్థము. బ్రహ్మచారులగు హనుమంతునకు వాల్మీకికిఁ దెలియునవి కావు. కనుక వానిని వివరించి చెప్పఁజాలక సమష్టి మీఁద మహార్థము లని వాల్మీకి చెప్పెను. కపివర్యుని=కపులందు శ్రేష్ఠుఁడగు వానియొక్క—కపులకెల్ల రాజు సుగ్రీవుఁడు—ఆయన మంత్రి, బంటు హనుమంతుఁడు—ఎట్లు కపివర్యుఁడయ్యెను. లౌకికాధికారము బట్టి కాదు. సీతాదేవితో నింత చనువుగ నేకాంతమున మాటలాడు నధికారము భక్తిపారతంత్ర్యపూర్తిగల హనుమంతునకుఁ గలిగెఁ గాని మఱి యేక్రోఁతికిఁ గలిగెను? కావున వాస్తవ కపివర్యుఁడు హనుమంతుఁడే.

## తాత్పర్యము

ఈ ప్రకారముగ గొప్పదియుఁ, దియ్యనైనదియు నగు నర్థముతోఁగూడిన మాటలు చెప్పి సీతాదేవి రామభక్తుఁడును, రామపరతంత్రుడును నగు కపిశ్రేష్ఠుఁడుచేయు రామగుణకీర్తనము వినఁగోరి మౌనము వహించెను. ఇట్లు మాటలు చెప్పుట నిలిపిన యామె యభిప్రాయ మెఱిఁగి మిగుల భక్తిచే హనుమంతుఁడు హస్తకమలములు ముకుళించి యిట్లనియె.

దీని వలన రామభక్తుఁడు సీతారాముల యిరువురయందు సమాన భక్తి యసమాన పారతంత్ర్యము గలవాఁడై యుండవలయు నని యేర్పడుచున్నది. కరంబులు మోడ్చి యిట్లనున్=అనుటచే నుత్తమ స్త్రీలతోఁ గాని యుత్తమ పురుషులతోఁగాని మాటలాడు నపుడు సేవకులు చేతులు కట్టుకొని కాని. యంజలి మోడ్చి కాని మాట లాడవలెఁ గాని, చేతు లూఁగు లాడించుచుఁ గాని, వ్రేల వైచి కొని కాని మాటలాడ రాదని సూచన.

## —♦ హనుమంతుఁడు సీతాదేవికి ధైర్యోక్తులు చెప్పుట ♦—

చ. కమలదళాయతాక్షి! యెఱుఁ♦గుము సుమీ యిట నీదు నున్కి నీ
రమణుఁడు, కావునం గద పు♦రందరుఁ డా శచిఁబోలె నిన్ను శీ

గ్రహముగను దోడుకొం చరుగ • రాఁ, డిక నే వచియించి నంత వే
గము చనుదెంచు ఋక్షకపి•కాండసమాకుల సైన్యయుక్తుఁడై. ౪౬౯

అర్థములు. నీ రమణుఁడు=నిన్ను రమింపఁ జేయువాఁడు కదా రాముఁడు-ఏమి కారణము? నీవు కమల దళాయతాక్షి వగుటయే కారణము. కమల దళాయ తాక్షి=తామర ఱేకులవలె దీర్ఘములైన కన్నులు గలదానా! నీ నేత్ర సౌంద ర్యము నెప్పుడు నీ వద్దము నందైనఁ జూచుకొన్న దానవో, కావో-చూచినను తేనెఱుఁ దనతీపు తెలియనట్లు నీ సౌందర్య మహాత్మ్యము నీ వెఱుఁగ లేకయేఁ యున్నావో కాని, నీ దృష్టి తనపైఁబడునా యని రాముఁడే కోరుచున్నాఁడు. నాదృష్టి గుఱించి యేమి చెప్పినాఁ డందువా. నీవు దగ్గఱ నున్నప్పుడు కమల దళాయతాక్షివఁట. దూరముగా నుండినను గమలదళాయతాక్షివఁట. దగ్గఱ నున్నప్పుడు నీదృష్టులు తామర ఱేకులవలె శీతలమై తాపమార్చునఁట. దూర మున నున్నప్పుడు చూరకత్తివలె మనస్సును జీల్చునఁట, 'కమలం మరికా దీనా' మ్మని కమల శబ్దమునకు చూరకత్తి మొదలగు వానికిఁ బేరు. దళశబ్దమునకుఁ జీల్చుట ఖండించుట యని యర్థము. అట్టివాఁడు నీ విచ్చట నున్నదాన వని తెలి సిన రాకయుండునా? నీ విచ్చట నుండుట యాయన యెఱుఁగఁడు. ఆ కారణము చేత ననుహ్లాముఁ డపహరించిన శచిని నింద్రుఁడు మఱల గ్రహించుటయం దాలస్య మైనట్లు నీ విషయమందును ఆలస్యమైనది. ఇప్పుడుపోయి నేను జెప్పితినా వానర భల్లూక సేనా సమూహముతో బయలుదేఱి వెంటనే వచ్చును.

ఉ. క్రమ్మను క్రూరశాతవిశి•ఖమ్ములచే వరుణాలయంబు స్త
బ్ధమ్మొనరించి లంక హత•పాపనిశాటగఁ జేయు నమ్మ! మ
ద్యమ్మునఁ గాలుఁడైన విబు•ధాసురకోటులు నైన నాఁగినన్
దిమ్మ వదల్చు నమ్మము మ•దిన్ నిరవద్యసుశీలభూషణా! ౪౭౦

అర్థములు. క్రూరశాత విశిఖమ్ములన్=కఠినములై వాఁడిగల బాణములచే, వరుణాలయంబు=సముద్రము, స్తబ్ధ మ్మొనరించి=కట్టివైచి, హతపాప నిశాట గన్=చంపఁబడిన పాపపు రాక్షసులు గలది, పాపాత్ములను జంపునే కాని, విభీషణాదులఁ జంపఁడని భావము, కాలుఁడు=యముఁడు, విబుధ+అసుర కోటులు= దేవతలయు, దైత్యులయు గుంపులు, ఆఁగినన్=అడ్డగించినను, దిమ్మ=మత్తు, గర్వము, నిరవద్య=దోషరహితమైన, సుశీల=పాతివ్రత్యమే, భూషణా=ఆభరణ ములు గలదానా.

## తాత్పర్యము

నీవు క్రోఁతివి గనుక సముద్రమును దాఁటితివి. రాముఁ డెట్లు దాఁటునందువా? కఠినములై పదునైన బాణములు ప్రయోగించి సముద్రమును గట్టివైచి లంక యందలి పాపపురాక్షసుల నందఱఁ జంపును. ఈ నడుమ యముఁడైనను, దేవత

లయినను దైత్యులయినను, నడ్డము వచ్చిరా వారికిఁ బట్టిన తఁ నమ్మ వదల్చును. తల్లీ! నిర్దుష్ట పాతివ్రత్యమే యలంకారముగాఁ గలదానా! నా మాటనమ్మును.

ఇట్లు చెప్పుటచే నింతపని చేయించుచునని యర్థము. నా పాతివ్రత్యము వ్యర్థముగాఁ బోయె ననిన సీతవాక్యమున కిది ప్రత్యుత్తరము.

క. సింగముచేఁ జిక్కిన మాతంగమువలెఁ ద్వద్వియోగ•తాపార్దితుఁడై
యంగన! సుఖము నెఱుంగఁడు, పొంగతి కృశియించుఁ బూఁట•పూటకు దేవీ!

అర్థములు. మాతంగమువలెన్=ఏనుఁగువలె, త్వత్+వియోగతాప+అర్దితుఁడై=నిన్ను నెడఁబాయుట, వలనఁ గలిగిన తాపముచేఁ బీడింపఁ బడినవాఁడై, పొంగు+అతి=సంతోషము చెడి; ఈ పద్యములో మన్మథావస్థలలోఁ గృశత్వ మను నవస్థ చెప్పఁబడెను.

తాత్పర్యము

రామచంద్రమూర్తి చిక్కిపోలేదుగదా యంటివి. ఆయనస్థితి చెప్పెద వినుము. సింహము బారిఁబడిన యేనుఁగువలె నిన్ను నెడఁబాయుటవలనఁ గలిగిన తాపముచే బాధపడుచు సంతోషముచెడి పూఁట పూఁటకుఁ జిక్కిపోవుచున్నాఁడు.

చ. మలయసుమేరు వింధ్యధర•మందరదర్దురభూధరాళిపై
ఫలముల వేరువెల్లకుల•పై జననీ!శపథంబుఁ జేసెదన్
గలవు కనంగ భవ్యతర•కంజవిలోచన ముజ్జ్వలోరుకుం
డల మరుణాధరంబు నగు•నాథమనోజ్ఞముఖేందుబింబమున్. ౪౨౨

అర్థములు. భవ్యతరకంజ విలోచనము=శుభకరమైన కమలములవంటి కన్నులు గలదియు, ఉజ్జ్వలోరుకుండలము=ప్రకాశించు గొప్ప కుండలములు గలదియు (ఉంగరమువలె దీనిని విసర్జింప లేదు. ఉత్తచెవులతో నుండరాదు గావున) అరుణాధరంబు=ఎఱ్ఱని పెదవిగలదియు, అగు, నాథ=రామచంద్రమూర్తి యొక్క, మనోజ్ఞ=అందమైన, ముఖేందుబింబమున్=చంద్రునివంటి ముఖమును.

తాత్పర్యము

తల్లీ! నేను రిత్తయోదార్పుమాటలు చెప్పరాలేదు. మలయము, మేరువు, వింధ్యపర్వతము, మందరము, దర్దురము, లోనగు కొండల మీఁదను మాకాహారమైన పండ్లు, వేర్లు, గడ్డల మీఁదను బ్రమాణము చేసి చెప్పుచున్నాను. నీవు మే లయిన కమలములవంటి కన్నులు, గొప్ప కుండలములు, ఎఱ్ఱని పెదవిగల నీ మగని రామచంద్రుని యందమైన ముఖమును జంద్రునివలెఁ జూడఁగలవు.

క. రామునిఁ బ్రస్రవణతటీ.ధామునిఁ జూడంగఁ గలవు•త్వరగా నల సు
త్రాముని విబుధాలయగత,భా మానితనాకపృష్ఠ•భాసితుఁ బోలెన్. ౪౨౩

అర్థములు. ప్రస్రవణ తటీధామునిన్=ప్రస్రవణ పర్వతమం దిప్పు డుండువానిని, సుత్రామునిన్=ఇంద్రుని, విబుధాలయ గత=స్వర్గమందుండిన, భామా

నిత=కాంతిచేఁ బూజింపఁబడు, నాకస్పృష్ట భాసితుఁ బోలెన్=నాకపృష్ఠ మను పర్వత ప్రదేశమునఁ బ్రకాశించు వానివలె.

తాత్పర్యము

నేను జెప్పినది యసత్యమని నమ్మవేని రమ్ము. నీవే స్వర్గమండలి నాకపృష్ఠము నందుండు నింద్రునివలెఁ బ్రస్రవణ పర్వతశిఖరంబున నున్న రామచంద్ర మూర్తిని జూడఁగలవు.

క. మాంసము ముట్టఁడు రాముఁడు, హంసీవరయాన! మధువు•నాసింపఁడు సా
యంసమయములన్ మాత్ర మ,హింసారతి వన్యఫలము•లించుక కొనెడిన్.

అర్థములు. మధువు=తేనె, వన్యఫలములు=అడవి యందుఁ బుట్టిన పండ్లను ఇంచుక=కొంచెము.

శ్లో॥ దృఙ్మనస్సంగ సంకల్ప జాగరాః కృశతాఽరతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగదశా దశ.

యని మన్మథావస్థలు పది. అందు అరతి యను నవస్థ యిందుఁ జెప్పఁబడెను. అరతి యనఁగా దేనియందుఁ బ్రీతి లేక పోవుట.

తాత్పర్యము

మాంసమును దాఁకఁడు, తేనె నాశింపనే యాశింపఁడు. సాయంకాలమందు వానప్రస్థమార్గమున హింసలేక యడవి ఫలములను దేహధారణార్థమై కొంచెము గాఁ దీసికొనును. దినమున కొక పూఁటనే కాని రెండవసారి భుజించుట లేదు. నాకు రెండు పూఁటల నాహారము లేదుగదా యందువేమో. నీవు చేయవలసిన కష్టము లేదుగదా! ఆయనకు యుద్ధకార్యము గలదే; నిరశనవ్రతముఁ బూనిన యుద్ధ మెట్లు చేయఁగలఁడు. అదియును గాక, నీవు ప్రోషితపతికవు, ఉత్తమరాజకన్యవు. కావున పరదత్తము, అందు శత్రుదత్తము గ్రహింపరాదు. అందు రావణుఁడు పతితుఁడు. కులటా షండ వైరి పతితు లిచ్చునది పక్వమైనను, అపక్వమైనను ప్రాణాపద దశయందును గ్రహింపరాదు. అందు వ్రతస్థవు కావున నీ కుపవాసము దగినదే. ఆయన నిషాకారణోపవాసము శాస్త్ర నిషిద్ధము కావున నెట్లు శుష్కోపవాసము చేయనచ్చును. నిర్నిమిత్తమైన శుష్కోపవాసము ఆత్మహత్య యగును. అది దోషావహము. శోకము, కోపము నుపవాస కారణములు గావు.

క. దోమలు నీఁగలుఁ బురుగులుఁ, బాములుఁదను నెరియ మీఁదఁ•బ్రాకుచునున్నన్
రాముఁ డెఱుంగఁ డొకింతయు, భామిని! నీ యంద యుంటఁ•బ్రాణములెల్లన్.

అర్థములు. ఎరియన్=మండునట్లు, భామిని=కోపశీలా!

తాత్పర్యము

ఆయన నిమిత్తమై నా దేహమునఁ బ్రాణములు నిలిపిన దాన నంటివి, ఆయన తన ప్రాణము లన్నియు నీయందు నిలిపియుండు వాఁడగుటచే ఈఁగలు.

దోమలు, పురుగులు, పాములు దేహము మంట నెత్తునట్లు మీఁదఁ బ్రాఁకులాడుచున్నను ఆయనకుఁ గొంచెమైనఁ దెలిసినది కాదు. పరకాయప్రవేశము చేసిన యోగివలె నున్నాఁడు. నీ యందుఁ గోపస్వభావ మున్నది. ఆయనయం దది లేదు. నీ వాయన నుద్దేశించి నిష్ఠురము లాడితివే. ఆయన యొక మాటయిన నిన్ను గుఱించి నిష్ఠురము లాడినవాఁడు కాఁడుగదా. ఆయన కాలము సీతా సీతా యనుటలో సరిపోవు చున్నది. వే ఱాలోచన తోఁచినఁ గదా నిష్ఠురము లాడుట.

ఈ పద్యమున మనస్సంగమ మనెడి యవస్థ చెప్పఁబడెను. ప్రియ పదార్థము నందుఁ దప్ప మఱి దేనియందును మనస్సుంచకుండుట మనస్సంగమ మగును.

సీ. నీ చక్కఁదనమును•నీదు సౌశీల్యంబు, చెలువరో! ధ్యానంబుఁ • జేయుఁ జేయుఁ
జేయుచో నీరూపు•చెలువు కన్నులఁ గట్ట సుందరీ! నిన్నెఱఁ•జూచుఁ జూచుఁ
జూచి నన్ బాసితే•సుదతిరో! యంచును, గన్నులఁబడి నీరుఁ•గార్చుఁ గార్చుఁ
గార్చి నే నే రీతిఁ•గనుగొందునో కదే, మెలఁత నంచును గడు•మిడుకుమిడుకు
తే. నన్య మేది స్మరించఁడ•నంగ బాణ, తాపమునఁ జేసి కనుమూయఁ•దలఁపఁ డెపుడుఁ
దలఁచెఁ బో యంతలోన సీ•తా! యటంచు, నులికిపడి లేచు మదిలోనఁ•గళవళించు.

అర్థములు. అనంగ బాణ తాపమున=మన్మథుని బాణముల వలనఁ గలిగిన తాపముచే, ఇందుఁ గనుమూయఁ దలఁపఁ డనునది జాగరణమును దెలుపును. నీకు నిద్రరా లేదని నిద్రావిషయ జ్ఞానమైనఁ గలదు. ఆయన కా యాలోచనయే లేదు. నిద్రయనునది యొకటి యుండుటయు నెఱుఁగఁడు.

## తాత్పర్యము

స్పష్టము.

క. పండో పువ్వో మఱి యిం, కొండు మనోహరపదార్థ•మో కాంచినచో
నండజగమనా యంచును, నుండును నినుఁ గూర్చి యుల్ల•ముదిలకొనంగన్.

అర్థములు. అండజ గమనా=హంసనడక వంటి నడక గలదానా. ఉదిల కొనున్=పరితాప పడును.

## తాత్పర్యము

స్పష్టము.

క. సీతా సీతా యనుచును, జేతము తపియింపఁ బలుకు•క్షితిజా, నినుఁ దా
నే తెఱఁగునఁ బడయఁగ నగు, నా తెఱఁగు నొనర్చెడిన్ మహాత్ముం డనఁగన్.

అర్థములు. చేతము=మనస్సు; ఇందుఁ దాపము చెప్పఁబడెను.

## తాత్పర్యము

స్పష్టము.

ఉ. రాముని కీర్తనంబునను•రాగిలి రామసమానశోక సీ
తామదిరాక్షి, దుఃఖమును•దవ్వానరించి, శిరన్ముఖంబునన్

ధూమజఖండయుక్త మగు తోయజశాత్రవమండలంబు నా
యామిని బోలి భూమిసుత యంజననందనుతోడ నిట్లనున్. ౪౨౯

అర్థములు, రాగిలి=సంతోషించి, రామసమానశోక=రాముని శోకమెంత తీవ్రమో యంత తీవ్రత గల శోకము గలది. రాముని శోకము సీతకురాదు. సీత శోకము రామునకు రాదు. తీవ్రత యందు సమత్వము. దవ్వు=దూరము. శరత్+ముఖంబునన్=శరత్కాలారంభమందు, ధూమజ=మేఘముయొక్క, ఖండ=తునకతో, యుక్తము=కూడినది, తోయజశాత్రవ మండలంబు=చంద్రమండలము; బౌ=కల, యామిని=రాత్రి.

తాత్పర్యము

హనుమంతుఁడు రామచంద్రమూర్తిని పొగడుటచే సంతోషించినదై రాముని దుఃఖమంత దుఃఖము గల సీత, నా దుఃఖమంత దుఃఖము రామచంద్రమూర్తియుఁ బడుచున్నాఁడుకదా! తనదుఃఖముఁ బాపుకొన యత్నించునుకదా, యదియే నాకుఁ జాలునని తనదుఃఖమును వదలి శరత్కాలారంభమందు మేఘము తునుకలతోఁగూడిన చంద్రమండలము గల రాత్రివలెనై యాయనతో నిట్లనియె.

ఇందలి యుపమానమువలన సీతాదేవి దుఃఖమంతయుఁ బోలేదనియు నింకను గొంతశేషము గలదనియు నేర్పడుచున్నది. కారణము క్రింది పద్యమునఁ గలదు.

౩౭-వ సర్గము. సీతాదేవి హనుమంతునకు రావణుఁడు పెట్టినగడువు నెఱింగించుట

క. రాముఁ డనన్యమనస్కుఁడు, రాముఁడు భూరివ్యథాపరాయణుఁ డనుచున్
నీ మాటలు సుధ విషమున, సామీరీ! కలిపి యిడిన చందం బయ్యెన్. ౪౩౦

అర్థములు. అనన్య మనస్కుఁడు=ఇతరమునందు మనస్సు లేనివాఁడు, భూరివ్యథాపరాయణుఁడు=గొప్పబాధ పూర్ణముగ ననుభవించు చున్నాఁడు. సుధ=అమృతము.

తాత్పర్యము

ఆంజనేయా! రామచంద్రమూర్తి నన్ను దప్ప మఱిదేనిని దలఁచుటలేదంటివి. ఇది యమృతము ద్రావినంత సంతోషము గలిగించెను. రామచంద్రమూర్తి మిగుల దుఃఖించుచున్నాఁ డంటివి. ఇది విషము ద్రాగినట్లు తాపము గలిగించుచున్నది. నీవు విషము కలిసిన యమృతము నిచ్చినట్లయ్యెను.

క. భూరితరైశ్వర్యముననో, దారుణదుఃఖమున నేని దైవము ద్రాటన్
బూరుషునిఁ గట్టి యీడ్చును, ధారిణిపై జీవికిని స్వాతంత్ర్యత గలదే? ౪౩౧

అర్థములు. భూరితర+ఐశ్వర్యముననో=గొప్పసంపదయందుఁగాని, దారుణదుఃఖమున నేని=భయంకర దారిద్ర్య దుఃఖమందైనను.

తాత్పర్యము

గొప్ప సంపదయందుఁగాని, భయంకర దారిద్ర్య దుఃఖమందైనను పూరుషుని దైవము (పూర్వజన్మ కర్మఫలము) త్రాటితోఁ గదలకుండఁ గట్టియాడ్చును. భూమిమీఁదఁ బుట్టిన వారికి స్వాతంత్ర్య మనునది యున్నదా? లేదు.

ఆ. విధిని దాఁటు జీవి•విశ్వంబునను లేదు, వానరేంద్ర? యింత•వట్టు నిజము
రామచంద్రవిభుని•సౌమిత్రినిన్ నన్ను, నెట్లు పఱచెఁ గంటి•వే కదయ్య.

అర్థములు. విధిని=దైవమును, పఱచెన్=బాధపెట్టెనో.

తాత్పర్యము

దైవనియమము నతిక్రమించి స్వతంత్రించి తన యిష్టప్రకారము వర్తించు ప్రాణి యీలోకమందు లేదు. వానర శ్రేష్ఠా! యింతమాత్రము నిజము. అసత్యము గాదు. రామచంద్రమూర్తిగాని,లక్ష్మణుఁడుగాని, నేనుగాని దుఃఖింపవలసిన కారణమా లేదు.అయినను దుఃఖించుచున్నాము. దుఃఖించుటకు మాయందే దోషము గలదు? రామునికై నేను, రామచంద్రమూర్తి మా యపరాధములకై దుఃఖింపవలసినదే యనుకో. మా యిరువుర నడుమ లక్ష్మణుఁ డేల మా యిరువురకై దుఃఖింపవలె? ఇదంతయు దైవచేష్టగదా.

ఉ. ఎప్పుడు చేరువాఁడొకో ది•నేశకులాభరణంబు రాముఁడీ
గొప్ప వ్యథాసముద్రమున•కూలముఁ? బెద్ద తుపాను తాఁకునన్
ద్రిప్పుల నొందు నావగతిఁ•దేజు దొఱంగి నలంగినాఁడె? న
న్నెప్పుడు దోడుకొంచు చరుగు?•నెప్పుడు రావణుఁ ద్రుంచు? మారుతీ! ౪౪౩

అర్థములు. దినేశకులాభరణంబు=సూర్యవంశమునకు నలంకారమైనవాఁడు. సముద్రమున కూలము=సముద్రముయొక్క తీరము, షష్ఠీసమాసమున నకారాగమము.

తాత్పర్యము

మారుతీ! రామచంద్రమూర్తి యీ వ్యథాసముద్రమున మునుఁగకుండఁ దీరమెప్పు డయ్యా చేరును? పెద్ద గాలివానవలన గిరగిర తిరుగు నావవలెఁ గాంతిని బాసి నలఁగినాఁడా? నన్నెప్పుడు తోడుకొని పోవునో, ఎప్పుడు రావణు సంహరించునో?

'పరిత్రాణాయ సాధునాం, వినాశాయ చ దుష్కృతా'మ్మన్నట్లు సీతాదేవిని గ్రహించుట యను సాధు పరిత్రాణము ముఖ్యకార్యము దానికి విఘ్నము కలిగించు దుష్కృతుల వినాశము రెండవ కార్యము, అని యేర్పడుచున్నది.

ఉ. ఎప్పుడు వచ్చునొక్కొ•మనుజేంద్రుఁడుఁడు? రాక్షసకోటిఁ బట్టి తా
నెప్పుడు ద్రచ్చునొక్కొ?దను•జేంద్రునిఁ గిట్టి శరాలి పాలుగా
నెప్పుడు ద్రుంచునొక్కొ? యసు•రేంద్రుని వీటిని మూలముట్టుగా
నెప్పుడు దంచునొక్కొ? నను•నెప్పుడు చూచెడినొక్కొ? పావనీ! ౪౪౪

తాత్పర్యము

హనుమా! రామచంద్రమూర్తి యెప్పుడయ్యా వచ్చును. ఎప్పుడయ్యా రాక్షస సమూహములనుబట్టి చీల్చును. రావణుని బాణముల పాలుచేసి యెప్పుడు ఖండించును? ఈ లంకాపురమును బునాదితోడఁ బాడగునట్లు లెప్పుడు దంచునో, నన్నెప్పుడయ్యా చూడవచ్చును?

ఉ. తీసర పెట్టు నయ్యా జగ•తీవిభు నింతటిలోన రాఁగ నో
పావని! నా కిలన్ బ్రదుకు•పాటును నీ సమ తీఱునంతకే
చూ విధియించె నట్లు దను•జుం, డిఁక మాసయుగంబ చిక్కె ద
త్తావధియందుఁ, జెల్లెడిఁ జు•మా దశమం బగు మాస మిట్లేడన్. ౮౮౫

అర్థములు. సమ=సంవత్సరము; ఇది సంస్కృతమున స్త్రీలింగము. ప్రాయికముగ బహువచనమందే ప్రయోగము,అయినను బాణిని ఏకవచనమందు 'సమాం సమాం' అని పఠించెను. (పా.వ్యా. -౨.౧.౨) మఱియు సమాం విజాయత యని యేకవచనమందును బ్రయోగము కలదు. కావునఁ దత్సమమున సమ యను రూపము సాధువు. దత్తావధి=ఇయ్యఁబడిన గడువు.

తాత్పర్యము

ఆంజనేయా! రావణుఁడు నా కొక్క సంవత్సరము గడు విచ్చెను. ఆ సంవత్సరము ముగియువఱకే నేను జీవించియుందును ఆ సంవత్సరమునందుఁ బదియవ నెల జరగుచున్నది. కావున రెండు నెలలు మాత్రమే మిగిలినవి. అవిఁ కాగానే నా చావు సిద్ధము కావున నీ లోపలనే వచ్చునట్లు రామచంద్రమూర్తిని తొందర పెట్టుము. ఆవల వచ్చినను ఫలము లేదు.

ఇది ఫాల్గున మాసము. ఇది పదియవనెల యగునేని జ్యేష్ఠమాసమున సీతాపహారణ మని యేర్పడుచున్నది.

ఉ. పెక్కువిధాలఁ దమ్ముఁడు వి•భీషణుఁ డెంతయు నొక్కి చెప్పె నీ
వ క్కమలేక్షణన్ మఱల•నంపు మటంచును, నాలకింపఁ డా
ముక్కడి రావణుండు, విధి•మూఁడినవానికి సాధుశద్ధతుల్
మక్కువ గూర్చునే దురభి•మానము కన్నులఁ గప్పుచుండఁగన్? ౮౮౬

తాత్పర్యము

ఈలోపల మంచి బుద్ధి పుట్టి రావణుఁడు మఱల నన్ను రామచంద్రున కర్పింప రాదా యందువేమో,వానికట్టి యభిప్రాయము లేదు. రావణుని తమ్ముఁడు విభీషణుఁడను వాఁడు నీవు సీతను మరల నిమ్ము అని యనేక విధముల బోధించెను గాని మూర్ఖుఁ డగు రావణుఁడు విన్నవాఁడుకాఁడు. వానికి మరణకాలము సమీపించి దురభిమానము కన్నులు గానరాకుండఁ జేయుచుండఁగా వాఁడేల వినును?

చ. పెనిమిటి యానతిం గొని వి•భీషణుపత్ని నిజాత్మజాతం దా
నవల యనంగఁ బేర నల•రారెడి కన్యక యీ చరిత్రమున్
వినుపఁగ బంచె నా కడకు•వే పతి నన్ను గ్రహించు శుద్ధమై
తనరె మదంతరాత్మయును•దాన వసించు గుణంబు లెన్నియేన్. ౧౧౭

తా త్ప ర్య ము

నీకెట్లీ విషయము దెలిసె నందువా? ఆ విభీషణుని భార్యయే సరమ యను నామె పతి యనుమతిం దీసికొని తన కూతురగు నవల యను కన్యకచే నీ విషయము నాకుం జెప్పి పంపెను. ఆంజనేయా! నా పతి నన్ను గ్రహించుట సత్యము. ఏమి ధైర్యముతో నీ మాట చెప్పెద నందువా, నా యంతరాత్మ శుద్ధమై యున్నది. అంతరాత్మ శుద్ధమై యుండెనేని యనేక శుభగుణములుగలవు. ఏ కార్యమునందు నంతఃకరణము శుద్ధమై, ప్రసన్నమై యుండునో యా కార్యము నెఱవేఱిన దనియే నమ్మనచ్చును.

విభీషణుఁడు సకుటుంబముగ సీతాపక్షపాతి యని దీనివలన స్పష్టపడు చున్నది. విభీషణుఁడునందు సీతాదేవి కనుగ్రహబుద్ధి కల దని యెఱుఁగుట చేతనే శ్రీరామచంద్రమూర్తియు విభీషణు ననుగ్రహించెను. సుగ్రీవుని విషయమున నిట్టులేకదా వర్తించెను.

క. పౌరుషము సముత్సాహము, సారతరబలంబు నానృ•శంస్యము మహిమో
దారత కృతజ్ఞతాదులు, శ్రీరామునియందు కలవు•స్థిరముగ హనుమా! ౧౧౮

లోకోత్తర కార్యమునందు స్థిరప్రయత్న ముత్సాహము. దానికిం దగినట్లు కార్యము చేయుట పౌరుషము. సత్త్వము. అది నెఱవేఱుటకు బలము. ఆనృశంస్యము=చేయుట యందుం గ్రూరత్వము లేకుండుట, కృతజ్ఞత=తనకుం జేసినమేలు మఱవకుండుట, విక్రమము=శౌర్యము, ప్రభావము=శక్తి.

తా త్ప ర్య ము

హనుమంతా! లోకోత్తర కార్యము చేయుట, దానికిం బ్రేరకమైన యుత్సాహము, కార్యమును సాధింపఁదగిన మహాబలము, కార్యము చేయుటయందుం గామ రోషములకు వశుఁడై, క్రూరుఁడై వర్తింపకుండుట, తన దివ్యమహిమ ప్రకాశింపఁజేయుట, కార్యముచేయుట యందు సహాయుల పట్లఁ గృతజ్ఞత, యీ మొదలయిన గుణములు స్థిరముగ నొక్క శ్రీ రామచంద్రమూర్తి యందే కలవు. కొందఱి యందివి యల్పకాలమే యుండును. మఱికొందఱి యందిందుం గొన్నియే యుండును, రామునం దట్లుగాదు. కల్యాణగుణము లన్నియు సంపూర్ణముగ శాశ్వతముగ నున్నవి. అట్టివాఁడు నా విషయమై తన పౌరుషము చూపకుండునా?

సీ. ఆ జనస్థానంబు•నందు సోదరుఁ డేని, బాసటగా లేక•పదియునాల్గు
వేలరక్కసుల దో•ర్బ్రీల నొక్కఁడ చంపె, నట్టివానికి నెవ్వఁ•డడల కుండు?

నింద్రుని శచిపోలె•నెఱుఁగుదుఁ దన్మహి, మంబుఁ గష్టంబు లా•మానధనునిఁ
గలఁపగ జాలవు•కాండభానువులను, రక్షోజలంబుల•రామభానుఁ
తే. డడరి శోషింపఁజేయు నం•చశ్రుపూర్ణ, లోచనాంబుజ యైన యా•లోలనేత్రఁ
జూచి యిట్లను నంజనా•సూనుఁ డప్పు,డేల శోకించెదమ్మ! యీ•లీల నీవు.

అర్థములు. అడలకుండుము=భయపడకుండుము; కాండభానువులను=బాణములను కిరణములచే, రక్షోజలంబులన్=రాక్షసులనునీటిని; రామభానుఁడు=రామచంద్రమూర్తి యను సూర్యుఁడు; అశ్రుపూర్ణలోచనాంబుజము=కన్నీళ్ళచేనిండిన నేత్రకమలములు గలది.

### తాత్పర్యము

ఆంజనేయా! ఆయన రాలేదు. రావణుఁ జంపలేదు. నన్నుఁ దీసికొని పోలేదని నిష్ఠుర మాడెదవే. ఆయన యొంటరిగాఁ డేమి చేయఁగలఁడమ్మా! యందువేమో. ఆ జనస్థానమందుఁ దమ్ముఁడుకూడఁ దోడులేక పదునాల్గువేల రాక్షసులను భుజబలముచే నవలీలగాఁ జంపలేదా, అట్టివాఁడిచ్చటికి వచ్చినంత మాత్రముననే యీ రాక్షసులు చూచి భయపడకుందురా. ఆయన శక్తి తెలియక నేను దూషింపలేదు. ఇంద్రుని శక్తి శచికిఁ దెలిసినట్లు రామచంద్రుని శక్తి నాకుఁ దెలియును. మానధనుఁ డగు నతనిని నీ కష్టము లెవ్వియుఁ గలఁత చెందింప లేవు. ఎన్ని కష్టములైన నోర్చి మానము కాపాడుకోఁగలఁడు. సూర్యునకుఁ దన కిరణములచే జలము నెండించుట మహాశ్రమకరమైన కార్యమా? అట్టులే రామునకు రాక్షసుల వధించుట కష్టకార్యమా! అని కన్నుల నిండ నీరు నించిన యా సీతాదేవిని జూచి హనుమంతుఁడు తల్లీ! యేల శోకించెదవు?

—• హనుమంతుఁడు సీతాదేవిని దనవీఁపున నెత్తుకొని పోయెదనని చెప్పుట. •—

ఉ. నానుడు లాలకించి రఘు•నాథుఁడు వానరభల్లుకావళీ
సేనలతోడ నియ్యెడకు • శీఘ్రమ వచ్చెడు, నంత కోర్వ నె
ట్లా నని తేని దుఃఖము ర•యంబుగఁ బాతు ననింద్యశీల! చం
ద్రానన! నాదు వీఁపుపయి • నాదట నెక్కుము కొంచుఁ బోయెదన్. ౪౯౦

అర్థములు. నా నుడులు=నా మాటలు; పాతున్=పాచుదును, పాయునట్లు చేయుదును.

### తాత్పర్యము

నా మాటలు విని రామచంద్రమూర్తి క్రోఁతులు, ఎలుగులు గల సేనలతో నిచ్చటికిఁ ద్వరగా వచ్చును. అంతకాలము వఱకు నే నీ దుఃఖ మెట్లు సహింతువందువా? నీ దుఃఖమును నేను బోవునట్లు చేసెదను. నా వీఁపుపై నెక్కుము. రామచంద్రమూర్తి యున్న చోటికిఁ దీసికొని పోయెదను. నేను నీ కింకరుఁడను. కావున దీనివలన నీ శీలమునకు హాని లేదు.

క. నీ వాకత వేల? లంకను, రావణునిన్ మోచికొనుచు రయమునఁ బోవం
గా వలఁతిని. జేర్చెద నిపుడే విభుకడ హవ్య మగ్ని యింద్రునకువలెన్. ౪౯-౧

అర్థములు. వలఁతిని=సమర్థుఁడను, హవ్య మగ్ని యింద్రునకువలెన్=అగ్నిహోత్రుఁడు హోమము చేయఁబడిన హవ్యమును నింద్రునకుఁ జేర్చినట్లు; ఈ యుపమానముకూడ స్పర్శదోష శంకను బరిహరించుచు, నాంజనేయుని శుచిత్వము తెలుపుచున్నది.

తాత్పర్యము

నీవు నన్ను మోయఁగలవా యందువేమో, నిన్ను మాత్రమే కాదు. లంకను, రావణుని కూడ మోచికొని శీఘ్రముగఁబోవ సమర్థుఁడను. హవ్యవాహనుఁడగు నగ్ని హుతమును నింద్రునకుఁ జేర్చినట్లు నిన్ను శ్రీరామునొద్ద నిప్పుడే చేర్చెదను.

శా. అమ్మా! మున్ దనుజావళిం దునుము దైత్యారాతి సన్నాహి యౌ
నమ్మాడ్కిం దన తమ్ముతోడ భవదీయప్రాణనాథుండు య
త్నమ్ముం జేయుచు నుండఁ జూడఁ గల వుద్యత్ప్రీతిఁ గన్నారఁగా
లెమ్మా యెక్కఁగదమ్మ! వీఁపుపయి నో లేమా! ననున్ నమ్ముమీ. ౪౯-౨

అర్థములు. సన్నాహి=ప్రయత్నముగలవాఁడు; ఉద్యత్ప్రీతిన్=పుట్టుచున్న ప్రేమతో.

తాత్పర్యము

తల్లీ! పూర్వము రాక్షసులను జంపుటకు విష్ణువు ప్రయత్నము చేసినట్లు తమ్మునితోడ నీ మగఁడు రావణాదులఁ జంప యత్నముఁ జేయుచుండ నీవు సంతోషముతో గన్నులారఁ జూడఁగలవు. అమ్మా! లెమ్ము. నా వీఁపుపై నెక్కుము. నా మాట నమ్ముము.

క. నినుఁ జూడఁ గోరు వానిని, ననుపమబలశాలిఁ బర్వతాశ్రమగతునిన్
గనుఁగొనెదు నాకపృష్ఠంబున నుండెడి వజ్రధరునిఁ బోలినవానిన్. ౪౯-౩

తాత్పర్యము

నాకపృష్ఠంబున నింద్రునిఁబోలి పర్వతాశ్రమ మందుండి నిన్నుఁ జూడఁ గోరుచున్న బలవంతు రామచంద్రమూర్తిని జూడఁగలవు.

ఉ. ఆలము సేయకమ్మ నినునాదటఁ గూర్చెదఁ బ్రాణనాథుతో
బాలిక! రోహిణీకుముదబాంధవు లట్టులు కూడి యుండ మీ
రాలు మగండు, శీతకిరణార్కులతోడఁ బ్రసంగమాడుచున్
లీలగ దాఁటవమ్మ యవలీల నభంబును సాగరంబునున్. ౪౯-౪

అర్థములు. ఆలము=ఉపేక్ష, ఆదటన్=ప్రేమముతో, కుముద బాంధవుఁడు=చంద్రుఁడు, శీతకిరణార్కులతోడన్=సూర్యచంద్రులతోడ, ఆకాశమున నెంత యెత్తు ప్రదేశమునకుఁ బోయిన సూర్యచంద్రు లిరువు రేకకాలమునఁ గాన వత్తురో యంత యెత్తున; నభంబును=ఆకాశమును; సాగరంబునున్=సముద్రమును

తాత్పర్యము

నా మాట లేమోలేయని యుపేక్షింపకుము. రోహిణీచంద్రులు కూడియుండు నట్లు నీవు నీమగఁడు కూడియుండునట్లు చేసెదను. ఆకాశమున సూర్యచంద్రులతో ముచ్చట లాడుచు సముద్రమును, సముద్రమును దాఁటిన తరువాత నాకాశమును నవలీల దాఁటుము. రామచంద్రమూర్తి యొద్దకుఁ బోవు వఱకు నిన్నుదింపను.

క. నిను నేఁ గొనిపోవఁగ న, న్ననుగమనము సేయ నోపఁ•డమ్మా! లంకన్
దనుజుం డొక్కఁడైనను, ననుమానము మాని యెక్కు•మా నామూఁపున్.

అర్థములు. అనుగమనము=వెంటవచ్చుట.

తాత్పర్యము

ఈ రాక్షసులు మన వెంటబడఁగా, పోనిత్తురా యందువేమో, నిన్ను నేను దీసికొని పోవునపుడు నా వెంట నీ రాక్షసులలో నొకఁడైన రాఁ జాలఁడు, నమ్ముము.

క. ఏకరణిని వచ్చితి నిట, కా కరణిని గొంచుఁబోదు•నాకాశమునన్
నీ కేల సందియం బన, నా కపిఁ గని హర్ష విస్మ•యాంగి వచించెన్. ౪౯౯

తాత్పర్యము

నీ వే విధముగ నాకాశమార్గమున నిటకు వచ్చితివో యావిధముగనే యాకాశ మార్గమున నిన్నుఁ దోడుకొని పోయెదను, నీకేల సందేహము అనిన నా వానరుఁ జూచి సీత యతని భక్తికి సంతోషము, అతని మాటల కాశ్చర్యము గలదై యిటులు చెప్పెను.

—: హనుమంతుఁడు సీతాదేవికిఁ దన దేహముఁ బెంచి చూపుట :—

క. హనుమా! మిక్కిలి దూరము, ననుఁగొని నీ వేగతిం జ•నం జాలెదవో
విన వింతలు నీ పలుకులు, వనచర! నీ క్రోఁతిబుద్ధి•వచ్చెం దెలియన్. ౫౦౦

తాత్పర్యము

ఆంజనేయా! నేను సొమ్ములమూట కట్టి యెక్కడ వైచితినో నాఁకుఁ దెలి యును. అక్కడకు నిక్కడకు మిగుల దూరముగలదు. ఇంతదూరము నన్ను మోచికొని నీ వే ప్రకారము పోఁగలవు. నీ మాటలు వినుటకు వింతలుగానున్నవి. ఇంతవఱకు నీవు నిజమైన క్రోఁతి వగుదువో కావో యని సందేహించుచుంటిని. ఇప్పుడు నీబుద్ధిని బట్టి చూడ నీవు నిజమైన క్రోఁతివే యని నిశ్చయించుకొంటిని.

ఉ. ఇంతవు నీ వదేమి గతి•నేగెదవో నను మోసికొంచు భూ
కాంతుసపాలి కం చనిన•వ్వామసుతపలుకుల నాలకించి లోఁ
జింత వహించె నా కిపుడు•చేకుఱెఁ గ్రొత్తపరాభవం బటం
చెంతయు వానరుండు మఱి•యిట్లని తాఁ దలపోసె నాత్మలోన్. ౫౦౧

అర్థములు. ఇంతవు=ఇది చేతితోఁ జూపించి జేనెఁ డని చెప్పెను. అనఁగా అల్పశరీరుఁడవు. క్రొత్తపరాభవంబు=ఎన్నఁడులేని యవమానము.

తాత్పర్యము

హనుమంతా! యీడిచి కొలిఁచిన జేనెడు లేవే, నీ వెట్లు నన్ను మోసికొని రామచంద్రుడు నొద్దకు నంతదూరము పోఁగల ననెదవు అనఁగా సీతాదేవి పలుకులు విని హనుమంతుఁ డిల్లు విచారపడెను. ఎన్నఁడు నెవరిచేతఁ గలుగని యవమానము, నేఁడు ఆఁడుదానిచేతఁ బడవలసి వచ్చెను గదా యని మఱియు నిట్టు లాలోచించెను.

చ. ఎఱుఁగదు గాక యించుకయు♦నెంతటివాఁడనొ కాన ఁ బల్కెనన్
 న్నుఱక మదీయరూప మిపు♦డొప్పుగఁ జూపిన నమ్మఁ గాక యీ
 తెఱవ యటంచు నెంచి తన♦దివ్యమహాకృతిఁ జూప నేలపై
 కుఱికి ద్రుమంబునుండి రభ♦సోద్ధతిఁ బెంపఁ దొడంగె గాయమున్. ౯౯

అర్థములు. ఉఱక=లక్ష్యము లేక, ఉఱికి=దుమికి; రభసోద్ధతిన్=వేగముతోడి గర్వముచే; నేలపై కుఱికి యనుటచే నింతవఱకు రాక్షసస్త్రీలకుఁ గానరాకుండునట్లు చెట్టుకొమ్మమీఁదే యుండె నని యేర్పడుచున్నది. అవమానము సహింపలేక రోషము గలవాఁడై చెట్టుమీఁదనే యుండి దేహము పెంప సాధ్యపడదు కావున నేల దుమికెను.

తాత్పర్యము

ఈమె నన్ను నవమానింపవలయు నను తలంపుతో నవమానింపలేదు. నే నెంతటి వాఁడనో, నా మహత్త్వ మెట్టిదో తెలియక లక్ష్యములేక మాటలాడినది. నా మాట నిజ మని, నే నంత కార్యము చేయఁగల నని, నిజముగ నమ్మినది కాదు ఈమె నమ్మునట్లు చేయుటకు నా స్వరూపము చూపించెద నని తలఁచి తన దివ్యమైన గొప్ప యాకారమును జూప నేలమీఁదికి దుమికి శీఘ్రముగాఁ బెంపఁ బ్రారంభించెను.

సీ. దీప్తానలప్రభఁ♦దేజరిల్లుచు, మేరు, మందరసంకాశ♦మహితరూప
 మునఁ దామ్రవక్త్రుఁడై♦ఘనవజ్రసన్నిభ, దంష్ట్రానఖంబులు♦దద్ద వెలుఁగ
 జానకి ముంగల♦గా నిలుచుండి యి, ట్లనియె నా సతితోడ♦నాంజనేయుఁ
 డో దేవి! సగిరివ♦నోద్దేశముగ సాట్ట,వప్రతోరణముగ♦వైరినాథు
ఆ. తోడ లంకఁగొనుచుఁ♦దోరంపుజవమునఁ, బోవు శక్తి గలదు♦భూమితనయ!
 పిన్నవాఁడ నను న♦భిప్రాయమును బాసి, రమ్ముజాల మేల♦రాము కడకు. ౧౦౦

అర్థములు. దీప్తానల ప్రభన్=మండుచున్న యగ్నిహోత్రుని కాంతితో; సంకాశ=సమానమైన; మహిత=గొప్పదైన; తామ్రవక్త్రుఁడై=రాగివలె నెత్తురు ముఖము గలవాఁడై; ఘన=గొప్ప వగు; వజ్ర సన్నిభ=వజ్రముతో సమానమైన; దంష్ట్రానఖంబులు=కోఱలు గోళ్లు, సగిరివనోద్దేశముగన్=పర్వతములు, వనప్రదేశములతోడ; సాట్టవప్రతోరణముగ=బురుజులతో, ప్రాకారములతో, తోరణములతో.

తాత్పర్యము

మండుచున్న యగ్నిహోత్రకాంతి గలిగి, వెలుఁగుచు మేరుమందర పర్వతములతో సమానమైన గొప్ప యాకారముగలవాఁడై, యెఱ్ఱని ముఖము, వజ్రాయుధములవంటి గోళ్ళు, కోఱలు గలవాఁడై, సీతాదేవి ముందు నిలుచుండి యిట్లనియె. దేవీ! ఈ లంకను గొండలతో, వనములతో, బురుజులతో, ప్రాకారములతో, తోరణములతో, రావణాసురునితో పెల్లగించి యతివేగమునఁ దీసికొని పోవు శక్తిగలదు. నేను జిన్నవాఁడ నను నభిప్రాయము వదులుము. ఆలస్యమేల? రాము నొద్దకుఁ బోదము రమ్మా.

—♦ హనుమంతునితోడ సీతాదేవి తాను రామికిఁ గారణములు చెప్పుట ♦—

చ. అపుడు వాయుసూనుని మ♦హాద్భుతభీప్రదభూరి రూపమున్
గనుఁగొని నీరజాక్షి యను♦గాడుపునందనుతో నెఱింగితిన్
ఘన మగు తావకీనబల♦గర్వసమున్నతి వాయువేగమున్
వనదహనోరు తేజమును♦వానరమాత్రుఁడవే కపీశ్వరా! ౯౦౧

అర్థములు. మహాద్భుత=మిగుల నాశ్చర్యకర మైన, భీప్రద=భయము కలిగించు; భూరి=గొప్పదగు, రూపమున్=ఆకారమును, వనదహన=కాఱుచిచ్చు తేజస్సువంటి; ఉరు=గొప్పదగు; తేజము.

తాత్పర్యము

హనుమంతుఁ డీ ప్రకారము చెప్పఁగా మిగుల నాశ్చర్యము, భయము కలిగించు నతని గొప్ప యాకారము చూచి యాయనతో నిట్లనియె. కపీశ్వరా! నీ బలగర్వము, వాయువేగము, కాఱుచిచ్చువంటి నీతేజము, నెట్టిదైనది తెలిసికొంటిని. నీవు సామాన్యపు క్రోతివి గావు.

ఉ. ఇంతటివాఁడు గాక యది♦యెట్లు పయోధిఁ దరించి లంక నే
కాంతము చొచ్చి న న్నరయఁ♦గా క్షముఁ డౌ? నొక ప్రాకృతుండు దా
నింత ఘటింప నేర్చునె? య♦హీనజవంబున నన్ను రామ భూ
కాంతుని యంతికంబునకు♦గ్రచ్చఱఁ జేర్తువు విశ్వసించితిన్. ౯౦౨

అర్థములు. ఏకాంతము=రహస్యముగా; క్షముఁడు=సమర్థుఁడు; ప్రాకృతుండు=సామాన్య పురుషుఁడు, అంతికంబునకు=సమీపమునకు; విశ్వసించితిన్=నమ్మితిని.

తాత్పర్యము

ఇంత గొప్పవాఁడవు కావేని, నీవెట్లు సముద్రము దాఁటి రహస్యంబుగ నొంటిగ లంకలోఁ బ్రవేశించి నన్ను వెదకి కనుఁగొన సమర్థుఁడ వగుదువు. ఇంత కార్యము సామాన్య పురుషులకుఁ జేయ సాధ్య మగు పనియా? మిగుల వేగముగ నీవు నన్ను రామచంద్రమూర్తి సమీపమునకుఁ దీసుకొని పోఁగల వని నమ్మితిని.

సీ. అయినను మామకీ•నాత్మేశుకార్యంబు, వేగంబు సిద్ధించు•విధ మ దెట్లొ
యని తలపోయుట•యావశ్యకము నాకుఁ, గాదె? నీ వెంట రా•రా దటౌట
ననిలవేగము తుల్య•మగు నీదు జవమున, కోర్వక దిగ్భ్రమ•మొనవు నాకుఁ
బైపైన బొరలు కూ•పారంబుఁ గన భీతిఁ, దల చుట్టి పడిపోనె•దానిలోనఁ
తే. బడిన యంతనె తిమినక్ర•పటలి నన్నుఁ
బట్టి చవు లూరఁగా బ్రుంగి•యట్టె పోవె?
నన్ను రక్షింపఁ దలపోయు•చున్న నిన్నుఁ
గూర్చియును సంశయించెదఁ•గ్రోతిరాయ. ౧౦౩

అర్థములు. మామకీ నాత్మేశు కార్యంబు=నా యాత్మకు నధీశ్వరుఁడైన రామచంద్రమూర్తి కార్యము త్వరగా సఫలమగు విధ మేదో యది నే నాలోచించుట తగును గదా. కావున నీ వెంబడి నేను రాను. నేను నీవెంట వచ్చితినా.

(౧) రావణుఁడు దొంగతనముగా సీతను హరించుకొని పోయినట్లు రామచంద్రుఁడును రావణాసురుని జయింపలేక దొంగతనముగా సీతను దెప్పించుకొన్నాఁడు, హనుమంతుఁడు లేకుండిన రామచంద్రుఁడు సీతను దక్కించుకొని యుండలేఁ డను నపకీర్తి నా మగనికి వచ్చును. నే నట్టి కార్యము చేయవచ్చునా?

(౨) నే నచ్చటికి వచ్చితినేని నా ప్రాణము దక్కించుకొన్నట్టు లగును గాని యింత దుష్టకార్యము స్త్రీల విషయమునఁ జేయు వీనికేమి శిక్షగలిగినట్లు? ఇట్టివాఁడు శిక్షింపఁబడఁడేని యింకను లోకమున నెన్ని యనర్థకార్యములు చేయునో.

(౩) రామచంద్రమూర్తి తప్ప రావణునిఁ జంపఁగలవాఁ డెవ్వఁడు. ఎందఱ స్త్రీలనో నానలెనే బలాత్కారముగఁ దెచ్చి చెఱలో వేసియుంచుట నీవు చూచితివి కదా. వారి మగవా రెవ్వరైన వానిని దండింపఁగలిగిరా? కావున రామచంద్రమూర్తి చేతనే వీని పుట మార్పింపఁజేసిన నీ స్త్రీలందఱు సుఖముగఁ బోదురు. క్రొత్తవారు రాకుందురు.

(౪) రామచంద్రమూర్తి రావణుఁ జంపఁ బ్రతిజ్ఞ జేసెఁగదా. నే నచ్చటికి వచ్చితినేని యిది నెఱవేఱు టెట్లు? ఆయన సత్యప్రతిజ్ఞత్వమునకు హానిరాదా? నాయందు భక్తిగలవాఁడ వగుటచే నా సుఖము మాత్రము చూచితివిగాని, యివన్నియు నాలోచింప వైతివిగదా. ఇకను జెప్పెద వినుము.

కూపారంబు=సముద్రము; చవులు=రుచులు.

తాత్పర్యము

నీయందు నాకెంత విశ్వాసమున్నను శీఘ్రముగ నా మగని కార్యము సిద్ధించు నుపాయము నే నాలోచించుట యావశ్యకము గదా. కావున నీ వెంట నేను రారాదు. వాయువేగముతో సమానమైన నీ వేగము సహింపలేక నేను దిగ్భ్రమ నొందుదును. మీఁద మీఁద బొరలుచున్న యలలు గల సముద్రమును జూడఁ

గానే దానిలో దలతిరిగి పడిపోదును పడఁగానే తిములు మొసళ్లు వచ్చి నన్ను రుచులార భ్రమింగి స్వేచ్ఛగాఁ బోవును. ఇది నాగతి. ఇఁక నీ గతి విషయమందును నాకు సందేహము గలదు. ఏ మంటివా?

సీ. నన్నుఁ గొనియెగు నిన్నగని పంక్తికంధర, చోదితరాక్షస•శూరవరులు
నిను వెంబడింపరే?• నీకును వారికిఁ, జండసంగ్రామంబు•జరుగ కున్నె?
శూలముద్గరక రా•భీలుర వారల, గెలుతువో! కలనిలో•గెలువ లేవొ?
సాయుధుల్ వారు ని•రాయుధుండవు నీవ, దెట్లు పో రెదవు న•న్నెట్లు గాతు?

తే. నీవు కలహింపఁ గ్రూరదు•ర్భావు లైన
దైత్యులను గని నా మది•తల్లడిల్లి
వనధిలోపలఁ బడుదునో?• పడిన నన్నుఁ
గొనుచుఁ బోయి యొసంగరే•దనుజపతికి? ౯౦౪

అర్థములు. చోదిత=ఆజ్ఞాపింపఁబడిన; క్రూరదుర్భావులు = చెడ్డమనస్సు గలవారు.

తాత్పర్యము

నన్నుఁ దీసికొనిపోవు నిన్నుఁజూచి రావణుచే నాజ్ఞాపింపఁబడిన రాక్షసులు నీ కంటఁబడరా? వారికి నీకు భయంకర యుద్ధము జరుగకుండునా? వారు శూలములు, ముద్గరములు కలవా రగుటచే దూరమునుండి నిన్నుఁ గొట్టుదురు. వారలను నీవు గెలుతువో గెలువలేవో, గెలు పోటు లెట్లున్నను ఆయుధములు కలిగి దూరమునుండి గొట్టువారితో నాయుధములు లేని నీవెట్లు యుద్ధము చేయఁగలవు? న న్నెట్లు రక్షింపఁగలవు? నీవు వారియొద్దకుఁ బోయికదా కొట్టవలెను. వారు నాలుగుప్రక్కల నిన్నుఁ జుట్టుకొని యాయుధములతోఁ గొట్టునపుడు నీవు ముఖ మొకవైపు తిరిగి పోరునపుడు వెనుకటి నన్నుఁ గొట్టరా? ఆ దెబ్బలు నాకుఁ దగులవా? దెబ్బలు తగులు టెట్లుండినను గ్రూరులు చెడ్డ మనస్సుగల రాక్షసులను జూడఁగానే నా మనస్సు తల్లడిల్లదా? నేను సముద్రములోఁ బడిపోదు నేమో? నేను బడిపోఁగానే వారు నన్నుఁ బట్టుకొని పోయి రావణున కీయరా?

ఉ. పోరుపయిన్ మది న్నిలిపి•పోరుచు నుండెడివేళ నీవు నే
వారిధి జాఱి త్రెళ్ళినను•వారు బలాత్కృతిఁ గొంచుఁ బోయినన్
శూరత నిన్ను గెల్చినను•జొప్పు చెడుం గద? నన్ను రాక్షసుల్
క్రూరత ముక్కముక్కలుగఁ•గోయరె వారలచేతఁ జిక్కినన్? ౯౦౫

తాత్పర్యము

నీ మనస్సంతయు యుద్ధముపై నుంచి యుద్ధముచేయునపుడు నేను జాఱి సముద్రములోఁ బడినను వారు బలాత్కారముగ మఱలఁ దీసికొని పోయినను, నిన్ను వారు గెలిచినను క్రమమార్గము తప్పునుగదా. వారిచేఁ జిక్కిన ముక్కలు ముక్కలుగాఁ గోయరా?

చ. అరయఁగ నేరి సొమ్ము విజ•యాపజయంబులు యుద్ధమందు? సా
గరమున నేను ద్రెళ్ళమియ•కల్గిననున్ విజయంబు నీకు నే
దొరకిన యేనియున్ దనుజ•ధూర్తుల యార్భటి విన్నమాత్రనే
హరివర! ప్రాణముల్ విడనె•యంత భవత్కృతి వ్యర్థమే కదా? ౯౦౬

అర్థములు. త్రెళ్ళమియ=పడిపోకుండుటే.

తాత్పర్యము

యుద్ధమందు వీఁడే జయించును, వాఁడే యోడిపోవు నని యెవ్వఁడు చెప్పఁగలఁడు? బలహీనుఁడు గెలుచుటయుఁ గలదు. బలవంతుఁ డోడిపోవుటయుఁ గలదు. ఒకఁడు పదిమందిని జంపును. పదిమంది యొకనిఁ జంపుదురు. కావున యుద్ధములం దన్నిట నేనే గెలుతు నని యెవ్వఁడు నమ్మరాదు. ఒకవేళ నీవే గెలిచెదవనుకో, సముద్రములో నేను బడిపోలే దనుకో, అట్లుండినను రాక్షసుల సింహనాదములు విన్నంత మాత్రముననే వానరేంద్రా! నా ప్రాణములు లేచిపోవా? అప్పుడు నీవు పూనిన పని యంతయు వ్యర్థమేకదా.

క. చాలుదువు నీవు రాక్షస, పాళిన్ గెలువంగ నట్టి•భంగియ యగునే
నీ లోకంబునఁ దలఁగదె, వాలాయము రాము కీర్తి•వనచరనాథా! ౯౦౭

అర్థములు. వాలాయము=నిరంతరము, అనివార్యము.

తాత్పర్యము

ఇట్లు చెప్పుటచే నీవు యుద్ధములో రాక్షసుల గెలువ లేవని నా యభిప్రాయము గాదు. నీవు తప్పక గెలుతువు. అట్లు నీవు గెలిచెద వేని లోకమునందు ననివార్యముగ రామచంద్రుని కీర్తి తగ్గిపోదా? అట్లు చేయుట నీకుఁ దగునా?

క. అట్టులు గా కుండినచోఁ, బట్టుగ రాక్షసులు నన్నుఁ•బార్థివులు కపుల్
నెట్టన యెఱుంగ కుండఁగ, గుట్టగు స్థలి దాఁప ఫలము•గూడునె మీకున్?

తాత్పర్యము

అట్లు గాకుండినను, రాక్షసులు నన్నుఁ బట్టుకొని పోయి రామలక్ష్మణులు గాని, వానరులు గాని తెలిసికొన సాధ్యపడని చోట దాఁచిరేని మీ శ్రమమునకు ఫలము గలదా?

ఉ. రాముని ప్రాణ మా యనఘు•భ్రాతల ప్రాణము కీశవర్య! మీ
స్వామికులంబు ప్రాణమును•వర్తిలు టంతయు నేమ మార నా
క్షేమముఁ బట్టి, య ట్లగుటఁ•జెచ్చెరఁ బోయి సుఖాన నున్నదా
భూమిజ యంచుఁ దెల్పి నృప•పుంగవుఁ దెమ్ము శుభమ్ము కల్గెడిన్. ౯౦౯

తాత్పర్యము

నీకు మఱొక విషయము చెప్పెదను. వానరేంద్రా! రామచంద్రమూర్తి ప్రాణము లక్ష్మణుని ప్రాణము, మీ వానరరాజు వంశము ప్రాణము యివన్నియు క్షేమముగా

నుండుట నా క్షేమముపై నాధారపడి యున్నవి. నాకు క్షేమము లేదయ్యేనా మీా కెవ్వరికి క్షేమము లేదు. కావున వెంటనే నీవు పోయి సీత సుఖముగా నున్న దని వారికిఁజెప్పి రామచంద్రుదు నిచ్చటికిఁ దోడుకొని రమ్ము. నీకు శుభ మగుఁగాక.

క. భూసుత లే దని నృపవరు, లాసను నాయెడను మాని॰రా యంతటితో
వాసిచెడి వానరావళి తో, సమయుటె నిజము వారు॰దుఃఖబలమునన్. ౯౧౦

తా త్ప ర్య ము

'సీతలేదు' అని నా యాసనువారు వదలుకొనిరా వానరసేనల తోడ దుఃఖ బలముచే వారు నశించు టే నిజము. వారు నశించిన మీారందఱు నశించినవారే.

చ. వరపతిభక్తిఁ జేసి మగ॰వానిని రాముని దప్ప నింక నె
వ్వరిని స్పృశింప నొల్ల, దశ॰వక్త్రుఁడు దాఁకఁడె నిన్నునంటివా?
పరవశురాల, దుర్బలను ॰ ప్రాపును లేద, యనాథ, నొంటి, నె
ప్పరసున నేమి చేయఁగలఁ?॰బావని నీవ తలంచి చూడుమా. ౯౧౧

తా త్ప ర్య ము

నేను సీతోడ రాకుండుటకు ముఖ్య కారణము మఱి యొకటి గలదు. చెప్పెద విను. నామగని యందు నాకుఁగల భక్తిచేత మగవానిని రాముని దప్ప మఱి యెవరిని దాఁక సమ్మతింపను, రావణాసురుఁడు నిన్నుఁ దాఁకలేదా, అప్పుడు నీవేమి చేయఁ గలిగితివి యందువా, అప్పుడు నేను మూర్ఛపోయి పరాధీననై యుంటిని, అందు బలములేని దానను, వేఱు సహాయము లేని దానను, దిక్కులేని దానను, ఒంటరి దానను, వాఁడో బలవంతుఁడు, సహాయసంపత్తి గలవాఁడు, అట్టి సందర్భమునందు వానిని నే నేమి చేయఁగలనో నీవే చెప్పుము. ఇప్పు డట్టి సందర్భములు లేవు. నేనై బుద్ధిపూర్వకముగాఁ దాఁకవలసియున్నది. అట్లు చేయు టకు నా మన స్సంగీకరింపదు. ఇది వాస్తవకారణము. ముందుగానే దీనిని జెప్పిన నీ వే మనుకొందువో యని కడపటఁ జెప్పుచున్నాను.

మగవానిని రామునిఁ దప్పననుటచే రామచంద్రమూర్తి యొకఁడే పురు షుఁడు, తక్కినవా రందఱు స్త్రీలని యభిప్రాయము. 'సఏవ వాసుదేవోయం సాక్షాత్పురుష ఉచ్యతే. స్త్రీప్రాయ మేతత్సర్వమ్ జగ ద్బ్రహ్మపురస్సరమ్' భగవంతుఁడు వాసుదేవుఁడే పురుషుఁడు. తక్కిన బ్రహ్మములతోడి ప్రపంచ మంతయు స్త్రీప్రాయ మనువాక్య మనుసంధించునది. స్త్రీ స్త్రీతోఁ గలిసిన నానందముకలదా. కావున జీవాత్మ భగవంతునితో సాయుజ్యము నొందిన నానం దము గలదుగాని, బ్రహ్మములతో సాయుజ్యము కలిగిన మఱల జన్మింప వలసినదే మఱల దుఃఖింపవలసినదే.

క. రాముఁడు దశకంధరు సం॰గ్రామంబున నింద చంపి॰కలబంధులతో
నేమముగ నన్నుఁ గైకొన, సామిారీ! యతని కదియె॰సముచితకృతి యౌ.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి వచ్చువఱకు సహింపలేనంటివి. నేను రానంటివి. ఇఁక జరగవలసినదేమి యనెదవా? రామచంద్రమూర్తి రావణుని యుద్ధమందు నీ లంకలోనే చంపి యాంజనేయా! నన్నుఁదీసికొనిపోవుట యాతని యోగ్యతకుఁ దగిన కార్యము. ఆయన రాఁడు నన్ను రక్షింపఁడను సందేహ ముండినయెడలఁ గదా నేను నీ వెంట రావలెను. నా కట్టి సందేహము లేదు.

ఈ రెండు పద్యములందు సీతాదేవి తెలిపిన యభిప్రాయము ముఖ్య ప్రాణము వంటిది. ఇందు ఆత్మనిక్షేపము, పారతంత్ర్యము స్పష్టముగాఁ జెప్పఁ బడెను. ప్రపన్నులు తప్పఁ దక్కిన ముముక్షువు లందఱు భగవత్ప్రాప్తికి సాధన భక్తినో, (ఉపాయభక్తి) కర్మయోగమో, జ్ఞానయోగమో, అష్టాంగయోగమో యేదియో యొకటి సాధనముగ గ్రహింతురు. ప్రపన్నుఁ డీ సాధనముల దేనిని నాశింపక భగవత్ప్రాప్తికి భగవంతుఁడే సాధనము, ఆయనయే రావలెఁ దన్నుఁ దీసికొనియే పోవలె నని యుండువాఁడు. వానికి భగవంతుని 'అహం స్మరామి మద్భక్తం, నయామి పరమాం గతిమ్,' 'అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి' 'అభయం సర్వభూతేభ్యో దదామి' యను వాక్యములే యూఁతకోలలు. ప్రపన్నుఁడు భగవంతునిఁదప్ప వేఱొక సాధనము గోరినను, భగవత్ప్రాప్తితప్ప వేఱొక ఫలము గోరినను, భగవంతునిదప్ప వేఱొక దేవత నాశ్రయించినను ప్రపత్తి చెడును, ఫలింపదు. హనుమంతునివెంట సీతాదేవి పోయియుండినను, ఆమెను రామచంద్రమూర్తి నీవు భ్రష్టురాలవని స్వీకరించియుండడు. పారతంత్ర్యము వదలిన ప్రపన్నుని భగవంతుఁడు స్వీకరింపఁడు. కావునఁ బ్రపన్ను లన్ని విధముల పరతంత్రులై యుండవలెను.

ఉ. శిక్షితవైరి యైన రఘుశేఖరు భూరిపరాక్రమంబుఁ బ్ర
త్యక్షముగాఁగ నేఁ గనినదానఁ, బొరింబొరి విన్నదాన, నా
దక్షుని సంగరస్థలినిఁ దాఁకఁగ లేవు ముఖాముఖిన్ సహ
స్రాక్షముఖామరోరగసురారిచయంబులు నైన వాయుజా! ౯౧౩

## తాత్పర్యము

అమ్మా! గోటఁ బోవుపనికి గొడ్డలి తెమ్మనుచున్నావు. జయాపజయము లెవఁ డెఱుఁగు నని నీవేయంటివి. ఆయన కింత శ్రమము నీ వీయవచ్చునా? మగనికి శ్రమమిచ్చుటయు పతిభక్తిలక్షణ మందునా. ఆంజనేయా! చెప్పెద వినుము.

ఆయన యోగ్యతకుఁ దగినది ఆయనకుఁ గష్టసాధ్యమైనది, సందిగ్ధమైనది, నేను గోరలేదు. ఎట్టి విరోధులనైన దండింపఁగల శ్రీరామచంద్రమూర్తి పరాక్రమమును బరులు విశేషముగాఁ జెప్పఁగా విన్నదానను. కన్నులార నేను జూచిన దానను. ఆయన శక్తి నాకుఁ దెలియును. అసమర్థుని యెదుట యుద్ధభూమియందు నింద్రుడు మొదలుగాఁ గల దేవతలు, పన్నగులు, దేవదానవరాక్షసులు, గుంపులు

గుంపులై వచ్చి యెదుర నిలిచి తాఁకలేరు ఇచ్చటఁ బ్రత్యక్షముగా ననునది ప్రత్యక్షానుమాన ప్రమాణములుగను, పారింబోరి విన్నదాన ననునది శాస్త్ర ప్రమాణముగను బ్రపన్నుఁడు గ్రహింపవలెను. భక్తునకుఁ, బ్రపన్నునకు భగవంతుఁడు తన పాలిటఁ గలఁ డనుటకు ననేక నిదర్శనము లనుభవమునఁ దెలియుచుండును. వానిని బట్టి తక్కినవి యూహించుకొనును. శాస్త్రప్రమాణములు, ప్రహ్లాద నారద ధ్రువాంబరీషాదుల చరిత్రములు, రామాయణమందుఁ గాకాసుర వృత్తాంతము (౯౩౩ ప) హనుమంతుఁడు రావణునకుఁ జెప్పిన "అధిప బ్రహ్మ స్వభువు చతురాస్యుఁడైనఁ ద్ర్యంబకుఁడు రుద్రుఁడును బురహరుఁడు నైన, నింద్రుఁడు మహేంద్రుఁడును సురాధీశుఁ డైనఁ గలన శ్రీరామవధ్యునిఁ గావలేరు (ప. ౧౧౭౭) బాలకాండమున బ్రహ్మరుద్రేంద్రాదుల శరణాగతి, యుద్ధకాండమున బ్రహ్మాదుల స్తుతి, యవి యన్నియు భగవంతుఁడుఁ శ్రీరామచంద్రమూర్తియే తక్కిన యందఱ దేవతలకంటె గొప్పవాఁ డని స్థాపించుచున్నవి. ఇట్టి యుత్తమోత్తమ దేవతను సాధించు ప్రపత్తియే యుత్తమోత్తమోపాయం బని దృఢచిత్తుఁడై యనన్యుఁడై యుండవలెను.

ఉ. ఎవ్వఁ డోర్వ సహించెడి నఁహీనబలున్ బలవైరివిక్రమున్
జివ్వను జిత్రకార్ముకు విఁచిత్రచరిత్రు సలక్ష్మణుం గదున్
గ్రొవ్వఱఁ జూచియేనియు? నఁకుంఠితమత్తదిశాగజాభుఁ దా
నెవ్విధిఁ దాఁకియున్ మను నఁమీరసమీరితవహ్నితుల్యునిన్. ౯౧౪

అర్థములు. బలవైరి విక్రమున్=ఇంద్రుని పరాక్రమమువంటి పరాక్రమము గలవానిని, చివ్వను=యుద్ధమందు, గ్రొవ్వఱన్=పొగరు క్షయించునట్లు, అకుంఠిత=మొక్కపోని, మత్తదిశాగజాభున్=మదించిన దిగ్గజములతో సమానుని; మనున్=బ్రదుకును, సమీర=వాయువుచే; సమీరిత=ప్రేరింపఁ బడిన, వహ్నితుల్యునిన్=అగ్ని సమానుని.

## తాత్పర్యము

జయాపజయవిచారము సామాన్యుల విషయమే కాని రామచంద్రమూర్తి విషయమున నపజయ శంక లేదనుటకు నింకను నాయనపరాక్రమముగుఱించి చెప్పుచున్నది. ఆంజనేయా! రామచంద్రమూర్తి యెదుటఁ బడుటయు యుద్ధము చేయుట యనుమాట లటుండ నిమ్ము. యుద్ధమం దాయనను జూచి యైన సహింప గలవాఁడెవఁడయ్యా! ఎవడు మహాబలశాలియు, నింద్రపరాక్రముఁడును, చిత్రమైన ధనువు ధరించిన వాఁడును, ఆశ్చర్యకరమైన నడవడి గలవాఁడును లక్ష్మణుతోఁ గూడిన వాఁడును నగు రామచంద్రమూర్తిని యుద్ధమునఁజూచినంత మాత్రమున గర్వభంగము కాని వాఁ డెవఁడయ్యా కలఁడు. ఇట్లుండఁగా వాయువుచేఁ బ్రేరింపఁ బడిన యగ్నినంటి వానిని, నష్టదిగ్గజములకు సరిపోలు వానిని, నెదిరించియు బ్రదుకఁ గలవాఁ డెవఁడయ్యా!

క. కల్పావసానభాస్కర,కల్పు నమోఘానుపమిత•కాండుని దృఢసం
కల్పుని లక్ష్మణసహితునిఁ, జల్పునో సాహస మెవండు•సమితిం దాఁకన్?

అర్థములు. కల్పావసాన భాస్కరకల్పున్=ప్రలయము కడపట ప్రకాశించు సూర్యునితో సమానుని; అమోఘ+అనుపమిత+కాండునిన్=వ్యర్థము కాని, సమానములేని బాణములు గలవానిని, దృఢసంకల్పుని=చలనములేని సంకల్పము గలవానిని; సమితిన్=యుద్ధమందు.

తా త్ప ర్య ము

ప్రలయకాలమునఁ గనఁబడు సూర్యుని వేఁడిమి గలవాఁడును, గురితప్పని లక్ష్యమును, భేదింపని బాణము గలవాఁడును, వ్యర్థము కాని సంకల్పము కల వాఁడునగు రామచంద్రమూర్తిని లక్ష్మణుని గూడియుండు వానిని యుద్ధమం దెదిరింప మనసునందైన సాహసించునా?

మొదట నెదిరించి యెవరును నిలువఁ జాల రనియు రెండవ పద్యంబునఁ జూచి సహింపలే రనియు, నీ పద్యంబున మనసుచే నైన సాహసింప రనియుఁ దెలిపెను. జగత్సంహారము చేయ సంకల్పించెనా, ప్రలయకాలమందలి సూర్యుని వలెఁ బ్రపంచమును శోషింపఁ జేయును. ప్రలయకాలమందలి మేఘమువలె బాణ వర్షము కురియించును. అట్టివానికి లక్ష్మణుఁడు తోడుపడినపుడు లోకమున నెవఁడు నిలువఁ గలఁడు? కావున జగత్సంహారము చేయ శక్తిగల రామచంద్ర మూర్తికి తుచ్ఛ రావణాది రాక్షసుల సంహరించుట గొప్ప కార్యమా? నీ కిది గొడ్డలితోఁ జేయు గొప్ప కార్యమేమో కాని రామచంద్రమూర్తికిది గోరఁబోవు పని యనియే నానమ్మకము. దీనివలన భక్తులకుఁ బ్రపన్నులకు భగవన్మహిమ యందు నెట్టి విశ్వాసముండ వలయునో తెలియనగు. నేనొక్క యాఁడుదానను. నా నిమిత్తమై రామచంద్రమూర్తి యింత గొప్ప యత్నము చేయునా యని సందేహింప నట్టు ప్రపన్నుఁడును తా నంతవఱకుఁ జేసియుండిన కర్మమును స్మరింప రాదు. భగన్మహిమ మాత్రమే స్మరించుచు నింతటివాఁడు నన్ను రక్షించుట యేమి కష్టమని నమ్మి యాయననే స్మరించు చుండవలెను.

ఉ. కావున వే ఱుపాయములఁ•గార్యము లే, దిటకున్ రయంబునన్
నా విభు లక్ష్మణాన్వితు వ•నాటసమూహధవోపసేవితున్
నీ వెటులేని తెమ్ము, ధర•ణీవిభుఁ గూర్చి నితాంతనిత్యదుః
ఖావిల నన్నుఁ దేర్పు, పవ•నాత్మజ! పుణ్యము నీకు నయ్యెడున్. ౯౧౬

అర్థములు. వేఱుపాయములు=నేను జెప్పినది తప్ప నితరోపాయములు; వనాటసమూహధవ=అడవిఁ దిమ్మరు లగు వానర భల్లూక సమూహములకు బతి యగు సుగ్రీవునిచే, ఉపసేవితున్=సమీపమునుండి సేవింపఁ బడువానిని;

నితాంత=అధికమైు, నిత్య=ఎడఁదెగని, దుఃఖావిలన్=దుఃఖముచేఁ గలఁత చెందిన దానిని,

తాత్పర్యము

కావున హనుమంతా! నేను జెప్పెడు నుపాయము తప్పఁ దక్కిన వన్ని వదలి పెట్టుము. నీవు త్వరగా లక్ష్మణ సుగ్రీవులతోఁ గూడిన రామచంద్ర మూర్తిని నే విధముననైన సరియ తోడుకొని రమ్ము. ఆయన నుద్దేశించి యెడఁ దెగని తీవ్రమైన దుఃఖము పడుచున్న నన్నుఁ గృతార్థను జేయుము. ఆంజనేయా! నీకుఁ బుణ్య ముండును.

తక్కిన యన్ని యుపాయములు వదలి నేను జెప్పిన యొక్క యుపాయము ననుసరింపు మనుటచే 'సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ'యన్నట్లు కర్మ జ్ఞానభక్తి యోగాదుల నెల్లనుపాయము లని గ్రహింప రాదని యెఱుఁగ నగు. ఇటకుం దెమ్ము- అనుటచే 'తం దుర్దర్శం గూఢ మనుప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురాణమ్। అధ్యాత్మ యోగాధిగమేన దేవం' కఠ-'అణోరణీ యా న్మహతో మహీయా నాత్మా గుహాయామ్ నిహితోఽస్య జన్తోః తమక్రతుం పశ్యతి వీతశోకో। ధాతుః ప్రసాదాన్మ హిమాన మీశం॥ అన్నట్టు లెక్కడనో, గుహలో దాఁగియుండు భగవంతుని వెదకుచు నేను బోలేను. ఆయనయే యిచ్చ టికి వచ్చునట్లు చేయుము, అనియు శిష్యుఁడు గురువును బ్రార్థింపవలెను. ప్రస వణగిరి గుహలో నున్నాఁడు చూడరమ్మనికదా హనుమంతుఁడు పిలిచెను. దాని కిది ప్రత్యుత్తరము. "ఉపాసతా మాత్మవిదః పురాణాః। పరం పుమాంసం నిహితం గుహాయాం వయం యశోదాశిశుబాలలీలా కథాసుధాసింధుషు లీల యామః" లీలా. ఆత్మజ్ఞానము గల ముసలివారు గుహలో నుండు పరమపురుషు నుపాసింపనీ, మాకు దానితోఁ బని లేదు. మేము యశోదాశిశుబాలక్రీడల కథ లను నమృత సాగరమున నాడుకొనుచుందుము, దానిలో మునుఁగుదుము, తేలు దుము. ధ్యానాభ్యాస వశీకృతేన మనసా యన్నిర్గుణం నిష్క్రియం।జ్యోతిః కంచన యోగినో యది పరం పశ్యంతి పశ్యంతుతే। అస్మాకంతు తదేవ లోకనచమత్కా రాయ భూయా చ్చిరమ్। కాళిందీ పులినేషు య త్కిమపి తన్నీలం మహో ధావతి॥ మధుసూదన సరస్వతి. ధ్యానాభ్యాస బలమున మనస్సును వశము చేసి కొని యోగు లేదో జ్యోతినిఁజూచినఁ జూతురుగాక! మాకు దానితోఁ బనిలేదు. యమునాతీరమందలి యిసుకదిబ్బలపై బరువెత్తునల్లని తేజస్సు మాకుఁ జాలును. ప్రపన్నుఁడు తానట్టి దృఢవిశ్వాసము, ప్రపత్తి గలవాఁడై యుండవలెను, అని యేర్పడుచున్నది.

ఇం దాచార్య కృత్యము సూచితము నిన్ను రామచంద్రమూర్తి యీ నిర్బం ధము నుండి తొలఁగించిరక్షింప సంకల్పించియున్నాఁడు.నీవు భయపడవలదని హను మంతుఁడు సీతాదేవికిఁజెప్పి యచ్చట శ్రీరామునకు సీతాస్థితిఁ దెలిపి(౧౪౫౪వ.ప) సీతను రామచంద్రమూర్తితోఁ జేర్చినట్లును గీతగోవిందమందు "న కురు నితంబిని

గమన విలంబన మనుసర తం హృదయేశ”మ్మని రాధకుఁ జెప్పి-కృష్ణునికి “సీదతి రాధా వాసగృహే”యని చెప్పి సంధానము కుదిర్చినట్లును ఆచార్యుఁడు చేయవల యును.జీవాత్మ పరమాత్మలకు నడిమివాఁ డాచార్యుఁడు. కావున నాచార్య మూల మున భగవత్ప్రాప్తి సుకరము. ఇది భక్తప్రపన్నుల చర్య, లక్ష్మణ శబ్దము నిత్య సూరులకును, సుగ్రీవశబ్దము ముక్తులకు నుపలక్షణము, సుగ్రీవుఁడు నడుమ వచ్చిన వాఁడు. లక్ష్మణుఁడు నిత్యసేవ సేయువాఁడు.

| ౩౪-వ సర్గము. సీతాదేవి చెప్పిన కారణములను విని హనుమంతుఁ డామెను ప్రశంసించుట. |

క. అని జనకతనయ పలికిన, విని వాక్యవిశారదుండు•ప్రీతుం డగుచున్
జననాథుతరుణిఁ గనుఁగొని, యనియెఁ జతురవచనరచన•యమరఁగ నిట్టుల్.

అర్థములు. వాక్య విశారదుండు=మాటలు చెప్పుటయందు నేర్పరి. (౨) తర్క-శాస్త్ర పండితుఁడు, చతురవచన రచన=చాతుర్యము కల మాటలయల్లిక.

తా త్ప ర్య ము

హనుమంతుఁడు తర్క-పండితుఁడు గావున రామప్రాప్తియందుఁ దాను జెప్పిన యుపాయము మేలా? జనకరాజు కూఁతురు చెప్పిన యుపాయము మేలా యని తర్క యుక్తులచే నాలోచించి యామె చెప్పినదే బాగున్నదని సంతోషిం చినవాఁడై సీతాదేవిని జూచి తన పరాభవమును(నీ క్రోతిబుద్ధి యనిన మాటను) గప్పి పెట్టుచుఁ జమత్కారపు మాటల నిట్లనెను.

తే. చారుదర్శన నీ వన్న•చంద మరయ,యుక్తరూపంబు నినువంటి•యువతిమణికి
స్త్రీస్వభావంబునకును వి•శిష్టసాధ్వి, శీలమునకును దగినట్లు•చెప్పి తమ్మ. ౧౧౧

అర్థములు. చారు దర్శన=అందమైన చూపుగలదానా, దర్శన శబ్దమునకు చూపు-కన్ను-బుద్ధి-తెలివి-శాస్త్రము-ధర్మము అను నర్థములు కలవు. ఇచ్చట నిన్ని యర్థములు సమన్వయించును. కావున దీనికి (౧) చక్కని యాలోచన గల దానా, (౨) చక్కని బుద్ధిగలదానా, (౩) చక్కని యక్తాయుక్త వివేకము గల దానా, (౪) చక్కని శాస్త్రజ్ఞానము గలదానా. (౫) చక్కని ధర్మమెఱిఁగిన దానాయని యర్థములు, కావున సీతాదేవి చెప్పిన రామప్రాప్తికుపాయముశాస్త్ర సమ్మతమై, సద్బుద్ధి నిశ్చితమై, వివేక యుక్తమై సాధ్యమై ధర్మపద్ధతి ననుసరించి యున్నదని భావము. చందము=విధము-ఉపాయము, యుక్తరూపంబు=ఇచ్చట ప్రశంసయందు రూపప్ ప్రత్యయ మని యెఱుఁగునది. ప్రశంసింపఁ దగినంత యుక్తమై యున్నది. విశిష్ట=విశేషముగ సదాచార సంపత్తిగల, సాధ్వి=పతివ్రత యొక్క, శీలమునకు=స్వభావమునకు.

## తాత్పర్యము

అందమైన రూపుగలదానా! నీవు చెప్పిన విధము నాలోచింపఁగా నీవంటి స్త్రీ చెప్పుటకు మిక్కిలి యుక్తమైనది. స్త్రీల స్వభావమునకు, సదాచార సంపత్తి గల పతివ్రత నడవడికిఁ దగినట్లు చెప్పితివి. అప్పుడు నేనేమో నీ దుఃఖము చూడ లేక చెప్పితినిగాని, నేను జెప్పినది మగవానిపై నాఁడుది యెక్కి కూర్చుండి వచ్చుట-ఘోరరణములోఁ బ్రవేశించుట, పతియాజ్ఞ లేక స్వతంత్రించి స్వచ్ఛంద ముగా వర్తించుట యివి పతివ్రతలకుఁ దగినవి కావని నాకును దోఁచుచున్నది.

తే. ఆఁడుదానవు గావున•నదరె దిట్టు, లాఁడుదలు నూఁకు విరివి గ•లట్టి కడలి
నాదు వీఁ పెక్కి దాఁటంగ•నళిననేత్ర! విశదమయ్యెను దీన నీ•పిఱికితనము.

## తాత్పర్యము

నీవు క్షత్రియ కన్యవు, రామచంద్రమూర్తి భార్యవు. ఘోరారణ్యములలో సంచారము చేసినదానవు. ఎంతో ధైర్యశాలిని వనుకొంటినిగాని నూఁకామడ సముద్రమును నా వీఁపెక్కి వచ్చుటకు భయపడితివో యప్పుడే నీ యాఁడుదాని పిఱికితనము బైటపెట్టితివి. నీ క్రోఁతి బుద్ధి యని సీతాదేవి చేసిన యవమానము నకు నీ యాఁడు తన మని బదు లాక్షేపము, ఇంత మాత్రమున హనుమంతుఁడు క్రోఁతి గాక పోఁడు. సీతాదేవి యాఁడుది గాకపోదు. ఎంతటి వారి కైనను అదెంత వాస్తవ మైనను మాటపడవలయు ననినఁ గష్టము దోఁచును. సీతాదేవి తనది క్రోఁతి బుద్ధి యని రోషగించుకొనినవాడు తనది క్రోఁతిబుద్ధి యని తా నను కొనుట సహజముగానే యుండెను. (చూ.ప. ౧౨౪౯ సుం.)

ఉ. రెండవకారణంబుగ ధ•రిత్రిసుతా! యని తీవు ప్రాణకాం
తుం డగు రాముఁ దక్క మఱి•నూఁకొనఁ దాఁకఁగ నొంట్ల• జుమ్మి యె
వ్వం డగుఁగాక యంచు, నటు•వంటి మహాత్ముని భార్య వైన యో
యండజనేత్ర! నీకుఁ దగు•న ట్లన, నన్య లిటుల్ వచింతురే? ౯-౨౦

అర్థములు. నూఁకొనన్=అంగీకరింపను, అన్యల్=ఇతర స్త్రీలు.

## తాత్పర్యము

నీవు నావెంట రామికి రెండవ కారణముగ నాఁడెవ్వఁడైన నగుఁగాక పర పురుషు నంట నంటివి ఇల్లనుటకు రామచంద్రమూర్తి భార్యవైన నీకుఁ దగును గాని యితర స్త్రీలిట్టి యాపద్దశలో నిట్లు చెప్పుదురా? ఏదో విధముగఁ దప్పించు కొని పోయినఁ జాలునందురే కాని చచ్చినను సంతోషమే, పరపురుషుని దాఁకను, బాధపడుచుండు నందురా.

చ. విని యెఱుఁగఁడుగాక రఘు•వీరుఁడు దేవి! త్వదీయ చేష్టితం
బును మఱి నీవు నా యెదుటఁ బొంకముగఁ బల్కినయట్టి మాటలున్

వనజదళాక్షి! నీవు పడు•పాటులు గన్గొని తాళలేక యా
యనయెడఁ గల్గుభక్తి మెయి•నట్లు వచించితిఁ దల్లి సైఁపుమీ. ౯-౨౧

తాత్పర్యము

దేవీ! నీ విచ్చటఁ జేయుచుండు కార్యములు (నీయేడ్పులు-నీమాటలు-నీయురిపోఁత ప్రయత్నములు) నీవు నాయెదుట రావణునకు, నాకు, రాక్షస స్త్రీలకుఁ జెప్పిన మాటలు వీని నన్నిటిని రామచంద్రమూర్తికి వినిపించెదను. తల్లీ! నీవు పడుచున్న కష్టములను జూచి సహింపలేక రామచంద్రమూర్తి యందు గల భక్తి కారణముగ నట్లు చెప్పితిని. తప్పుగా నెన్నక క్షమింపుము.

చ. జలధిఁ దరించు టెంతయు న•సాధ్యము గావున, లంకఁ జొచ్చుటల్
సులువుగఁ గాని కార్య మను•చుం దలపోసి స్వశక్తి నెంచి నేఁ
బలుకుట దద్విధంబుగను•భామిని నిన్పతితోడఁ గూర్పు మేల్
దలఁపునఁ గాని వే ఱొక వి•ధంబుగ నీ మది నెంచఁబోకుమీ. ౯-౨౨

తాత్పర్యము

సముద్రము దాఁటుట మొదట నసాధ్యము. రెండవది లంకఁజొచ్చుట యంతకంటె నసాధ్యము, ఈ కష్టము లన్ని యాలోచించి నాకు శక్తి గలదు కావునఁ జేయఁ గలనను తలంపుతో నీ భర్తతోడ నిన్నుఁ జేర్పవలయు నను సదభిప్రాయముతో ఆ విధముగఁ జెప్పితిని గాని దురభిప్రాయముతోఁ గాదు.

తాను జెప్పినది సరి గాదని హనుమంతుని మనస్సునకే వచ్చినది.

క. నావెంట నిపుడు వచ్చుట, కీ వుత్సాహంబు నేయ•వేనియు రామ
త్క్ష్మావిభున కభిజ్ఞానము, దేవీ య్యేదైన నిమ్ము•తెలియఁగ దానన్. ౯-౨౩

అర్థములు. అభిజ్ఞానము=గుర్తు.

తాత్పర్యము

నా వెంట నీవిపుడు వచ్చుట కంగీరింపవేని నే నిచ్చటికి వచ్చుటకు నిన్నుఁ జూచుటకు రామచంద్రమూర్తి నమ్మఁదగిన గుర్తేదైన నిమ్ము; లేకున్న నామాట లాయన నమ్మునా? ఉత్తమాటలు నీవు నమ్మ వని కదా యాయన యుంగరము. గుర్తుగ నిచ్చెను. అట్టులే యాయనను నమ్మింపఁజాలు గుర్తు నీవేదయిన నిమ్ము

—• సీతాదేవి హనుమంతునకుఁ గాకాసురవృత్తాంతముఁ జెప్పుట •—

క, అని పవనసుతుఁడు పల్కిన, విని జానకి కనులనీరు•వెడలఁగ హనుమం
తునితో నిట్లను మెల్లగ, వినుమీ మే ల్గుర్తు నిట్లు•విభునకు ననుమీ. ౯-౨౪

తాత్పర్యము

ఇట్లాంజనేయుఁడు చెప్పఁగా సీతాదేవి కన్నుల నీరు గాఱుచుండ మెల్లఁగ నిట్లనియె. హనుమా! రామచంద్రమూర్తికి మంచి గుర్తు చెప్పెద వినుము.

భర్తతోడఁ దానున్నప్పటి విషయములు జ్ఞప్తికి వచ్చుటయె దుఃఖకారణము.

సీ. మును చిత్రకూటంబు♦నను నీశ్వరాశను, మందాకినీతీర♦మందు మనము
తాపసాశ్రమములఁ♦దవిలి వసించుచో, విమలసుగంధి ♦పుష్పముల నొప్పు
వనములఁ దిరుగుచు♦బడలి నీ కుఱువున, నుండితి నట వాయ♦సుం డొకండు
తన ముక్కునను మాంస♦మునయాసనన్నుఁజ,రక్కునఁబొడిచెఁ జు♦ఱుకనంగ
ఆ. మంటిపెళ్ళ నెత్తి♦తుంటరికాకిని, గొట్ట నదియుఁ జుట్టుఁ♦జెట్టు చుండెఁ
గాని పోవదయ్యె♦దానిని గని కోప,మునను దఱిమికొట్ట♦మనసు పెట్టి. ౯౨౫

అర్థములు. ఈశ్వరాశను=ఈశాన దిక్కున, కుఱువునన్=తొడయందు, వాయసుండు=కాకము, మహద్వినక్షయందుఁ గొన్ని యమహచ్ఛబ్దంబులకు డుజ్జగు. సు. వ్యా. సూ. ౨౯.

ఇది మొదలు ౯౨౮వ పద్యము దాఁక సీత రామచంద్రునితోఁ ప్రత్యక్షముగఁ జెప్పినట్లు రామచంద్రునే సంబోధించుచున్నది. ౯౨౯ వ పద్యము మొదలు ౯౩౩వ పద్యము వఱకు రాముఁడు పరోక్షమం దున్నట్టు తెంచుకొని హనుమంతుని సంబోధించి చెప్పుచున్నది. ఆపై మఱల మూఁడు పద్యములు రామునే సంబోధించి చెప్పును. ఆపై హనుమంతుని సంబోధించి చెప్పును. నొకిఁ చెప్ప వలసిన దానిని రాముని సంబోధించియు, నితరవార్త హనుమంతుని సంబోధించియు ననుచున్నదని కాని నాతో మాటలాడుచున్నను మనస్సంతయు నీ మీఁదనే యుండుటచే మైమఱచి నడుమ నడుమ నిన్ను సంబోధించె నని హనుమంతుడు రామునితోఁ జెప్పుటకై యని కాని యెఱుంగునది.

సీతాదేవి కాకిని దోలలేక బాధపడుచుండ రామచంద్రమూర్తి యేల యూరక చూచుచుండెను? జీవుఁడు స్వరక్షణమున స్వతంత్రించి కార్యము చేయు వఱకు భగవంతుఁ డుపేక్షించు ననియు జీవుఁ డీశ్వరునిపై భారము వేసినపుడు భగవంతుఁడు రక్షించుననియు సూచితము.

తాత్పర్యము

స్పష్టము.

క. నా యొడ్డాణముఁ దీసితి, నాయెడ నొకింత జాఱె♦నంశుకము చెఱం
గా యది గని నీ నవ్వుట, నాయాసము పడితి లజ్జ♦యలముటకతనన్. ౯౨౬

అర్థములు. అంశుకము=చీర.

తాత్పర్యము

ఆ కాకిని దఱుమఁ గొట్టుటకై నాయొడ్డాణము దీసితిని. అప్పుడు చీర జాఱి పోయెను. నీవు నవ్వితివి. నాకు సిగ్గు దోఁచుటచే నాయాసపడితిని.

క. నను గాకము చీరుటచేఁ, గినుకయు నీ వపహసింపఁ♦గెరలఁగ సిగ్గున్
జనుదెంచి గాసిపడి నేఁ, గొనకొని నీ యంకసీమఁ♦గూర్చుంటి వ్యథన్. ౯౨౭

అర్థములు. చిరుటచే=ముక్కుతో గీఁచుటచే, కినుక=కోపము, అపహసింపన్=నవ్వఁగా, అంకసీమన్=ఒడిలో.

తాత్పర్యము

నన్నుఁ గాకి ముక్కుతో గీఁచుటచేఁ గోపము, నీవు నవ్వుటచే సిగ్గుగలదాననై ప్రయాస పడి వచ్చి నీ యొడిలోఁ గూర్చుంటిని.

చ. బుడబుడ బాష్పముల్ కనులఁ ♦ బొంపిరి వోవఁ జెఱంగుచేత నేఁ
దుడుచుకొనంగ నన్నుఁ గని ♦ తోయజలోచన! యూఱడింపవే?
వడఁబడి నీదు కుర్వుపయి ♦ వ్రాలితి నిద్దుర గ్రమ్మ కన్నులన్
వడిగను లేచితిం బిదపఁ♦నా పతి హాయిగఁ గూర్కె నా తొడన్. ౯-౨౮

అర్థములు. పొంపిరి వోవన్=వృద్ధికాఁగా.

తాత్పర్యము

ఈ రెండు కారణములచేతఁ గన్నులందు నీళ్ళు వృద్ధియయి బుడబుడ కాఱఁగా నేను కొంగుతోఁ దుడుచుకొనఁగా నీవు నన్ను సమాధాన పఱుపలేదా. అట్లు గాసిపడి నిద్దుర రాఁగా నీతొడమీఁదఁ బండుకొంటిని. వెంటనే లేచితిని. అప్పుడు నా మగడు నా తొడమీఁదఁ దలయుంచి పండుకొని నిద్రించెను. పగటినిద్ర; అరణ్యకాండము ౧౦౮ వ పద్య వ్యాఖ్య చూచునది.

ఉ. అంతట మున్ను గాసి నిడి ♦ నట్టిది యా పలుగాకి కాకి నా
యంతికసీమ డాయుచు స్త♦నాంతరసీమను జేరి యంతతో
శాంతి వహింప కా పులుఁగు ♦ నత్వరతం బొడువంగ మాటికిన్
వంత జనింప రాము పయి♦వ్రాలెఁ దదుద్గత రక్తబిందువుల్. ౯-౨౯

అర్థములు. పలుగాకి=చెడ్డది, అంతికసీమ=సమీప ప్రదేశము, వంత=బాధ, తదుద్గత=దానిలోనుండి బయలు వెడలిన, రక్తబిందువుల్=నెత్తురుబొట్లు.

తాత్పర్యము

ఇట్లు రామచంద్రమూర్తి నిద్రింపఁగా ముందు బాధ పెట్టిన యా దుష్ట కాకమే నా సమీపమునకు వచ్చి నా స్తనములమీఁద గీఱి యంతతోఁ బోక ముక్కుతో మీఁదమీఁద నాకు బాధ కలుగునట్లు పొడిచెను. ఆ గాయము నుండి వెలువడిన నెత్తురు బొట్లు రామచంద్రమూర్తిపైఁ బడెను.

ఉ. పాపపుఁ బుల్గు నా కిడెను♦బాధల సైఁపక నాథు నిద్దురన్
లేపితి శ్రీకు శత్రుహరు♦లేచి యతండు స్తనాంతరంబునన్
జేపడియున్న కాటుఁ గని♦చిత్తమునం గన లూని యెవ్వఁ డీ
పాపముఁ జేసెఁ జెప్పు మికఁ ♦ బైదలి! యాతని రూపు మాపెదన్. ౯-౩౦

అర్థములు. శ్రీకున్=శ్రీకలవానిని, లోకమునఁ దఱచుగా జను లందఱు మేలుకనియున్న వేళఁ దళుకు బెళుకులు చేసికొనుటఁ, గను గిఱపులచే సుందరులు

గానే కానవచ్చుచుందురు. నిద్రించునపుడా వేషములు, నభినయములు దొలఁగుటచే వారి స్వభావ వికారరూపము కానవచ్చుచుండును, రామచంద్రమూర్తి విషయమట్టిదిగాదు. నడయాడుచున్నప్పుడెంత సుందరుఁడో నిద్రపోవునపుడంత సౌందర్యము కలవాఁడుగానే కానవచ్చుచుండును. కాని సౌందర్యమునకు నే దశయందును హానిలేదు.

నాథ శబ్దమునకు యాచింపఁబడువాఁడు దీపింపఁబడువాఁడని రెండు ధాత్వర్థములు గలవు.

నా నాథుఁడు=నాచే యాచింపఁబడువాఁడు, ఆయన నిద్దురపోవునపుడాయన సౌందర్యమును జూచి చూచి నీ సౌందర్యము, నాకుఁ గొంచె మీయరాదా, నే నెంతో సుందరి ననిపించుకొంటినే యని యాచించుదానను. అట్టి సౌందర్యము ననుభవించు భాగ్యము లేక, నిద్దురపోవు వానిని అందు తటాలున లేప రాదని తెలిసియు నా సౌందర్యానుభవానందమునకు నోఁచుకొనక నిద్దుర లేపితిని.

ఆ నిద్రాసౌందర్య మెట్టి దని చెప్పుదును. ఎవరైనఁ జూచిన దృష్టిదాఁకునో యని నేను దృష్టిదీసి మంగళాశాసనములు పలుకు దానను. అటువంటి సౌందర్యము గలవానిని లేపితిని.

శత్రుహరున్=ఆయన నిద్రపోవుచున్నప్పుడు చూచినను, శత్రువులు భయపడి పోదురు. కాకికి నిద్రపోవు రామచంద్రుని ముఖము కనఁబడునట్లుచేసి యుండిన నది భయపడి పరువెత్తి యుండును. నే నట్టు చేయక తెలివిమాలి నిద్దుర లేపితిని.

(అరణ్య. ౧౦౮. బాల. ౬౨౨ వ్యాఖ్య చూచునది.) కనలు=కోపము, పైఁదలి=ఓ సీతా!

## తాత్పర్యము

ఆ పాపపుఁ బక్షి పెట్టెడిబాధ సహింప లేక సుఖముగ నిద్రించు నాథుని, శ్రీకాంతుని, శత్రుమర్దనుని లేపితిని ఆయనలేచి నాస్తనముల యందున్న గాయముఁ జూచి, కోపించి, యీపాపము చేసిన వాఁడెవ్వఁడే చెప్పుము. వాని నిపుడే రూపుమాపెద నని చెప్పెను.

ఆ. రోష వేగమునను ♦ రోఁజెడి పంచవ, క్త్రింబు పాముతోడ ♦ గర్వి యెవ్వఁ
డాడుకొనఁగఁజొచ్చె ♦ నంబుజలోచన! యనుచు నచట నాకు ♦ నభిముఖముగ.

అర్థములు. పంచవక్త్రింబు=అయిదు తలలు గలది. (౨) విచ్చిన విశాలమైన పడగలు గలది. గర్వి=పొగరు పట్టినవాఁడు; అభిముఖముగన్=ఎదురుగ.

## తాత్పర్యము

రోషముతో బుసకొట్టుచున్నయైదు తలలు పాముతో నెవ్వఁ డాడుకొన సాహసించె నని చెప్పి నాకు నెదురుగ నున్న.

ఆ. రక్తసిక్తనఖర ♦ యుక్త మౌ కరటంబుఁ, గనియోఁ గనినయంతఁ ♦ గాకిరూపుఁ
గొనినయట్టి శక్రు ♦ కొమరుండు గాడ్పునఁ, బర్వతంబు డిగ్గి ♦ పాఱిఁ దొడఁగె.

అర్థములు. రక్తసిక్త నఖర యుక్తము=నెత్తుటితోఁ దడిసిన గోళ్ళుగలది, శక్రు కొమరుండు=ఇంద్రుని కొడుకు జయంతుఁడో, లేక వాలి క్రోతిఁగఁ బుట్టినట్లు కాకిగా నెవఁడైనఁ బుట్టెనో, అట్టివాఁడు, గాడ్పు=గాలి.

తాత్పర్యము

నెత్తుటఁ దడిసిన గోళ్ళుగల కాకిని జూచెను. ఆయన జూచినంత మాత్రము ననే కాకిరూపముతో నున్న యింద్రుని కొడుకు గాలివలెఁ గొండ దిగి పరువెత్త నారంభించెను.

పిచ్చుకమీఁదఁ బ్రహ్మాస్త్ర మన్నట్లు కాకిమీఁద నంత పెద్ద యస్త్రము వేయవలయునా యను హనుమంతుని సందేహము దీఱ నది సామాన్యమైన కాకి కాదు, ఇంద్రుని కొడుకని సమాధానము చెప్పుచున్నది.

ఇంద్రుఁడు అహల్యను జెఱుపఁదలఁచి యొకనాఁటిరాత్రి కాకియై కూసెను. గౌతముఁడు కాకులు కూయువేళ యైన దని లేచి యేటికిఁబోయి నది నిద్రించుచుం డుట చూచి యిది యింద్రుని కుచేష్ట యని యెఱిఁగి నీకు కాకిరూపమే శాశ్వత మగును గాక యని శపించెను. అప్పుడు దేవతలు, ఋషులు గౌతముని ప్రార్థిం పఁగా నీశాపము నీ కొడుకునకుఁ దగులు ననియు రామబాణ పీడితుఁడై యాయ నచే రక్షింపఁబడి శాపముక్తుఁ డగు ననియు గౌతముఁడు చెప్పెను. వాసిష్ఠ రామాయణము.

సీ. అదిచూచి శ్రీరాముఁ♦డాగ్రహవశుఁడయి, యాయరిష్టముపట్ల♦నదయుఁడగుచు
దర్భాసనంబున♦దర్భ యొక్కటి దీసి, బ్రహ్మమంత్రంబునఁ♦బ్రజ్వరిల్లఁ
జేసి మాకలిమీఁద♦వేసిన నదియును, నంబరపథమున♦నరుగుచున్న
బలిభుక్కు వెన్నంటి♦పఱవఁ దొడంగెను, గాకియు వెఱ మూఁడు♦లోకములను
తే. దిరిగి తిరిగియుఁ బలువుర♦శరణు వేఁడె,
కన్నతండ్రియు సురలును ♦ ఘనమహర్షి
చయములును దాముఁ గావంగ♦జాల మనఁగ,
మరలి చనుదెంచి రామునే ♦ శరణుఁజొచ్చె. ౯౩౩

అర్థములు. అరిష్టము=కాకి, అదయుఁడు=దయలేనివాఁడు, మాకలి=కాకి, బలిభుక్కు=కాకి, వెఱన్=భయముచే, కన్నతండ్రి=ఇంద్రుఁడు, సురలు=దేవతలు, సురశబ్దము నిత్యబహువచనము. స్త్రీ సమానము; సిద్ధసమాసంబునఁ బుంలింగము. భూసురుఁడు—భూసురులు; దీనికి నేకవచనంబున రూపము లేదు.

సు. వ్యా. తత్స. ౭౮ సూ.

బలిభుక్కు=కాకి; భగవంతుఁడే లోకులకు ముఖ్యబంధువు. తదితరులైన మాతాపిత్రాదులు ఆభాసబంధువులేకాని ముఖ్యబంధువులు కారు. కాన నట్టి ముఖ్య బంధువే లోకులను రక్షింపవలెనుగాని యీ యాభాసబంధువులు రక్షింప రని చెప్పుచున్నది, కాకియు నిత్యాది. కాకియున్=(౧) భగవత్ప్రాప్తికిఁ బురుష

కారమైన జగన్మాతయైన సీతయెడ నపరాధపడిన యా కాకి. దాని యపరాధ మిపుడే కలిగినది. కాన నార్ద్రముగనే యున్నది. కాని యింక నెండెడి స్థితికి రాలేదు. పెటన్=రాముఁ డేసిన బ్రహ్మాస్త్రమువలని భీతిచేత; కన్నతండ్రియున్= కష్టము వచ్చినపుడు కన్నతండ్రిగదా రక్షించు నని యతనిని శరణు వేఁడినది. కావంగఁజాల మను పైపద్యముతో నన్వయము. ఆ యింద్రుడు తాను త్రైలోక్యనాథుఁ డయినను వానిని రక్షింపఁ దనకు సాధ్యపడ దన్నాఁడు. ఇంద్రో మహేంద్ర స్సురనాయకోవా' యని యీ గ్రంథము నింద్రునికిని రక్షణ సామర్థ్యము లేదని చెప్పి యున్నది గదా. తండ్రి శబ్దముపైని సముచ్చయము తల్లిని సూచించును. తండ్రి మాత్రమే కాదు, తల్లియు వదలెను. సర్వరక్షకురాలైన సీతయెడ నపరాధము కావించిన వాని నామె మాత్రము రక్షింప సమకట్టునా? 'సీతా నారీ జన స్యాస్య యోగక్షేమం విధాస్యతి' యని గదా యీ గ్రంథమున నున్నది. క్రమ మిట్లెఱుఁగునది. ఆ కాకి తండ్రికన్నను దల్లికి బుత్రులందుఁ బ్రేమ యెక్కువయని యెంచి మొట్టమొదట నామెను శరణుజొచ్చినది. ఆమె వదలిన పిమ్మటఁ దండ్రిని శరణు జొచ్చెను. ఆయనయు రక్షింపలేదనుటచేతఁ దల్లియుఁగావ లేదని యర్థసిద్ధము; సముచ్చయ సూచితము. లోకమున నొక్కనిని దల్లిదండ్రులు వదలి పెట్టినను బంధువులు వదలు వాడుక లేదు. ఈ వాయస విషయమట్లు కాక తల్లి దండ్రులు వదలినది విని, బంధువులును వదలి రనుచున్నది. సురలును-కావంగఁ జాల మనఁగ ననుదానితో నన్వయము. 'యస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే' యన్నట్లు రాముని కన్నులెఱ్ఱబాఱినచో దేవతలెక్కడివా రక్కడనే జడిసిపోదురు గదా. పూర్వపు శరీర బంధువులు వదలుటయే కాక యిపుడు పరిగ్రహించిన కాక శరీరము మూలాన బంధువులైన పక్షులును వదలినవని సముచ్చయము తెల్పును. పక్షులు వీనిని వదలుటకు రెండు కారణములు. రాముఁడు తమ రాజైన గరుత్మంతుని వాహనముగాఁ గొన్నవాఁడని యొకకారణము. 'పక్షిణోఽపి ప్రయాచంతే సర్వభూతానుకంపిన' మన్నట్లు రాముఁడు తమకును శరణమగుట రెండవకారణము. తలిదండ్రులును, బంధువులును వదలిన పిమ్మట నా కాకి దయాస్వరూపులయిన మహర్షులను శరణుజొత్తమని పోయినది. వారును జాలదూర మాలోచించి వదలి రనుచున్నది. ఘన మహర్షి చయమును దాము గావంగఁ జాల మనఁగ (౧) దయ చేయుటకును స్థలవ్యవస్థ కలదని యెంచి వారీ కాకిని వదలిరి. (౨) వీనిని మనము చేర్చుకొన్నచో వీని సహవాసదోషము వలన మనకును చేటు కలుగును. మనము వీనిని వదలి పెట్టితిమేని గతిలేక శ్రమ పడుచున్న వీనిని రాముఁడు తప్పక రక్షించు నని దూరాలోచన చేసి వీనిని వదలిరని యైనను భావము. (3) "యో విష్ణుం సతతం ద్వేష్టి తం విద్యా దంత్యరేతస" మ్మన్నట్లు విష్ణువును ద్వేషించువాఁడు అంత్య జాతికిఁ బుట్టినవాఁడు. ఈ కాకి విష్ణుమూర్తి యవతారమైన రాముని ద్వేషించునది కాన,నిది చండాల జాతిలోఁ జేరినది. మాలవానిని మనము దగ్గఱఁ జేర్చనట్లు

దీనినిగూడ దగ్గఱఁ జేర్పరాదని తలంచి వదలి రని యైనను భావము. సన్న్యాసు లందుఁ గోపము కలవాఁడు, పక్షులందుఁ గాకి చండాలు రని సామెతగలదు. ఏనుఁగును బోఁగొట్టుకొన్నవాఁడు, కుండల సందులందు వెదకి నాఁ డన్నట్లు లీ కాకి తన కెవరును శరణు కాకపోఁగా వాకిలి తెఱచియున్న యింటింటఁ దూఱ నారంభించిన దనుచున్నది. మూఁడులోకముల సంచరించుఁ బలువుర శరణు వేఁడె. సంచరించుచున్=ఒక్కొక్క యింటికిని తోఁచినదేసి మూర్లుపోయి యింటి వారికిఁ దెలియక మూలమూలలను దాఁగుకొనియుండె నెవ్వడైన వారికి దయగలుగునా తనపైనని యా కాకి కాచుకొని యుండెను. ఆ యింటివార లందఱును వీనిని బైటఁ ద్రోసి తలుపు గడియ వేసికొనిరని భావము. ఆ పైన కాకి చేసిన దేమనఁగా చెప్పుచున్నది. మఱలఁ జనుదెంచి రామునే శరణుజొచ్చె. రామునే=(౧) రక్షకు లని పేరు పెట్టుకొన్నమాతా పిత్రాదుల కంటెను, శిక్షకుఁడైన శ్రీరాముని ముఖమే కాకికిఁ జల్లగా నున్నట్లు తోఁచినది. కాఁబట్టి కాకి రామునే శరణు జొచ్చినది. 'యది వా రావణస్స్వయ'మ్మని రావణుఁడు వచ్చినను రక్షింతు నని కదా రాముని యధ్యవసాయము. (౨) సర్వలోక రక్షకుఁడైన రామునే (౩) 'దోషో యద్యపి తస్య స్యాత్' వాని దోషము నేను లెక్కింపను అను నట్టి రామునే. ఈ యభిప్రాయము లన్నియు నేకారసూచితములు. శరణుఁ జొచ్చెన్= కాకి రాముని నివాసస్థానముగా నొందినదేకాని రక్షణోపాయముగా నొంద లేదు. 'నివాసవృక్ష స్సాధూనామ్'-సాధువులకు నివాసవృక్షము. గోవింద.

## తాత్పర్యము

పరువెత్తుచున్న యా పక్షిని జూచి కోపించి దయ నదలినవాఁడై దర్భాసనమందుండిన దర్భపోఁచ దీసి బ్రహ్మాస్త్రమంత్రమున మంత్రించి కాకిమీఁద వైచెను. ఆ పోఁచ యాకాశమునఁ బోవుచున్న కాకిని వెంబడించెను. కాకి మూఁడులోకములు దిరిగి తిరిగి యనేకుల శరణు వేఁడెను. ఇంద్రుఁడు, బ్రహ్మాది దేవతలు, గొప్ప మహర్షులు అందఱు మేము నిన్నుఁ గావఁజాల మని చెప్పఁగా వేఱుగతి లేదని తెలిసి మఱలవచ్చి రామునే శరణువేఁడెను.

ఈ విషయము పద్మపురాణమున నిట్లు వివరింపఁబడెను.

'యత్రయత్ర యయౌ కాకః, శరణార్థీ స వాయసః
తత్ర తత్ర తదస్త్రంతు, ప్రవివేశ భయావహమ్॥
బ్రహ్మాణ మింద్రం రుద్రంచ, యమం వరుణ మేవచ
శరణార్థీ జగామాసౌ, వాయసః శస్త్రపీడితః।
తం దృష్ట్వా వాయసం సర్వే, ఋషయో దేవదానవాః॥
న శక్తాస్మ వయం త్రాతు మితి ప్రాహు ర్మనీషిణః॥
అథ ప్రోవాచ భగవాన్, బ్రహ్మా త్రిభువనేశ్వరః

భో భో బలిభుజాం శ్రేష్ఠ; త మేవ శరణం వ్రజ॥
సఏవ రక్షక శ్శ్రీశః, సర్వేషాం కరుణానిధిః
రక్షత్యేవ క్షమాసారో, వత్సలః శరణాగతాన్॥
శరణం వ్రజ సర్వేశం, నాన్య దస్తి తవ ద్విజ
ఇత్యుక్త స్సోఽథ బలిభు గ్బ్రహ్మణో రఘునందనమ్
ఉపేత్య సహసా భూమౌ నిపపాత భయాతురః॥
ప్రాణ సంశయ మాపన్నం దృష్ట్వా సీతాఽథ వాయసమ్
త్రాహిత్రాహీతి భర్తార మువాచ దయయా విభుమ్॥
పురతః పతితం దేవీ ధరణ్యాం వాయసం తథా
తచ్ఛిరః పాదయో స్తస్య యోజయామాస జానకీ॥
త ముత్థాప్య కరేణాథ కృపాపీయూషసాగరః
రరక్ష రామో గుణవాన్ వాయసం దయ యైక్షత॥

తాత్పర్యము

కాకి యెక్కడెక్కడికిఁ బోయెనో యస్త్ర మక్కడక్కడికిఁ బోయెను. శస్త్ర పీడితుఁడు కాకాసురుఁడు బ్రహ్మను-ఇంద్రుని-రుద్రుని-యముని-వరుణుని తక్కినవారిని రక్షింపుమని కోరెను. దానిని జూచి ఋషులు, దేవతలు, దానవులు లోనగు వారందఱు మేము రక్షింపఁజాల మనిరి. అప్పుడు బ్రహ్మ ఓ కాకి! నీవు పోయి శరణాగతవత్సలుఁడు, శ్రీపతి యగు శ్రీరామచంద్రునే శరణు చొరుము. ఆయనయే సర్వ రక్షకుఁడు, కరుణానిధి, క్షమాసారము, శరణాగతుల రక్షించునని చెప్పఁగా నట్టులే వచ్చి శ్రీరాము సమీపమునఁ బడెను. ప్రాణసంశయ దశ నున్న కాకిని జూచి దయావతి యగు సీత భర్తతో రక్షింపు రక్షింపు మనెను. సీతాదేవి తన ముందటఁ బడిన కాకిని జూచి దాని తల రామునపాదములపైఁ బడు నట్లు చేతితో నొత్తివేసెను. సీత యనుగ్రహించిన కారణముచే రామచంద్రుఁడును దానిని రక్షించెను.

సీ. శర ణంచు ధరణిపై ♦ సాఁగిలఁబడినట్టి, వాయసుఁ గని యది ♦ వధ్య మయ్యుఁ
జంపక కాచితి ♦ పెంపారు కరుణచే, జగముల దిక్కేఁది ♦ వగపు చెంది
శరణాగతం బైన ♦ పరభృత్తుఁ గనుగొని, వ్యర్థంబు పోదు బ్ర ♦ హ్మాస్త్ర మేమి
చెప్పెద వనినను ♦ జేకొన నిమ్ము నా, కుడికంటి ననియె నా ♦ చెడుగు కాకి

ఆ. బెడిదమైన శరము ♦ కుడికన్ను హరియించి, చనియెఁ జనియెఁ గాకి ♦ చావుదప్పి
కన్ను లొట్ట వోవఁ ♦ గాకుత్థ్సకులున కా, దశరథునకు భక్తి ♦ దండమిడుచు. ౯౩౮

అర్థములు. దిక్కేఁది=దిక్కులేక, వధ్యము=చంపఁబడఁదగినది, దశరథునకు దండ మిడుచు=శరణాగత రక్షణము మా వంశధర్మము కావున శ్రీరామునినే శరణు వేఁడి బ్రతుకు మని స్వర్గమున బోధించెను కావున నాయనకు దండము, పర భృత్తు=కాకి, కోవిల పిల్లలను సాకునది కావునఁ బరభృత్తు. కోకిలలు దమ పిల్ల

లను దాము కాపాడలేక యా పిల్లలను దెచ్చి కాకిగూటిలో నుంచిపోవును. అవి తమ పిల్లలేయని కాకులు సాకును. కాలము వచ్చి యవి గూసినపుడు తమపిల్లలు కావని తెలిసి వానిని తన్ని తఱుమును. ధరణిపై సాఁగిలఁబడిన=దుష్టపుత్రుఁడు; తండ్రి తన్ను శిక్షింప రాఁగా నా శిక్షను దప్పింపుమని తల్లి కాళ్ళపైఁ బడినట్టు లీ కాకి రామపాదముల యొద్ద నున్న భూమిమీఁదఁబడెను.

అట్టి వాయసున్=భగవద్విషయమున నపరాధము చేయుటే దీక్షగాఁ గల వానిని, పాఠక్రమమున నిట్లున్నను పాఠక్రమమునకంటె నర్థక్రమము బలీయ మను న్యాయ మనుసరించి యట్టి యను పదార్థమును తక్కిన విశేషణములకు ముందుగా యోజన చేసికొనునది. అట్టివాయసున్=తండ్రియగు రాముని విషయముననేకాక పురుషకారభూత యగు తల్లివిషయమందును ద్రోహము చేసినవాఁడు.

తాత్పర్యము

శరణు శరణని భూమిమీఁద సాఁగిలఁబడిన కాకిని జూచి యిది వధింపఁ దగిన దయ్యుఁ జంపక దయచేత వదలితిని. ఇంత ప్రపంచమం దొక్కఁడైనఁ గాచు వాఁడు లేక దుఃఖపడి శరణు జొచ్చిన కాకిని జూచి నా బ్రహ్మాస్త్రము వ్యర్థము పోదు. దానికేమి యిచ్చెదవనిన నది తన కుడి కంటిని దీసికొన నిమ్మని చెప్పెను. ఆ భయంకరమైన బాణము దాని కుడికన్ను హరించి పోయెను. కాకియును, జావు దప్పి కన్ను లొట్టపోవ రామచంద్రమూర్తిని, దశరథమహారాజును దలఁచి నమ స్కరించి పోయెను.

క. నా కొఱకై బ్రహ్మాస్త్రముఁ, గాకముపై విడిచి, నిన్నుఁ గాదని నను దా
నీ కరణిని గొని తెచ్చిన, యా కూళునియెడ నుపేక్ష యగునె నరేంద్రా!

తాత్పర్యము

నరేంద్రా! నా కేదో కొంచె మల్పకాల బాధ గలిగించిన దని కాకముపై బ్రహ్మాస్త్రము ప్రయోగించిన నీవు, నిన్నుఁ దిరస్కరించి యింత కాలముగ నింత బాధపెట్టు నీ క్రూరుని నీ వుపేక్షింపవచ్చునా? ఇట్లు చేసితివేని నీవు నరేంద్రుఁడ వెట్లయ్యెదవు? నీ నరేంద్రత్వమునకు హాని రాదా? కాన దానిని రక్షించుకొనుము

చ. తెలియని దానఁ గాను జగతీవర! నీదు పరాక్రమంబునున్
బలమును సాహసంబును, గృపాగుణమే వరధర్మ మంచు మున్
బలికితి వీవ నన్గుఱిచి బాధలఁ బొందెడి నాయెడన్ దయం
దలఁపుము, నాథుఁ డీ వఁట యనాథగతిం బడియున్న దాన్ఁగా. ౯౩౭

అర్థములు. నీదు పరాక్రమంబు బలము సాహసము=నీదు = పరుల దుఃఖ మును జూచి సహింపఁ జాలమని చెప్పిన నీ యొక్క; పరా.....సము=చెప్పుటయే గాక పరాక్రమాదులచేనట్లే నెఱవేర్చియు నున్నావు. ఇది నే నెఱుఁగుదును. పరుల దుఃఖముఁ జూచి నే నొకానొక యేకాంతసమయంబున మీ యందుండు నన్ని సద్గుణములలో దేనిని మీరు గొప్పదిగా భావించి యనుష్ఠించెదరని నే నడుగఁగా,

దయాగుణమే గొప్పగా నెంతు నని మీరే నాతోఁ జెప్పలేదా? ఈవ=నీవే, మఱి యెవ్వరో కాదు. దూతలు మొదలగు నితరుల ముఖమునఁ గాదు. నన్ గుఱిచి= నాతోనే. మఱి యెవ్వరితోనో చెప్పఁగా నేను విన్నది గాదు. మఱి యెవ్వరి విష యము గుఱించియో కాదు. నా విషయమందే. మన మి ట్లడవులలో మృగముల, రాక్షసుల నడుమఁ దిరుగుచున్నామే. నాకేదైన నపాయము వచ్చి, నిన్ను విడిచి యుండుట గలిగెనేని నాగతి యేమి చేసెద రని నే నడుగఁగా నేను నిన్ను రక్షిం చెదనని నీవు చెప్పలేదా. కృపాగుణము=పరుల దుఃఖమును, తన దుఃఖముగా నెంచి నివారింపజేయు గుణము. ఇట్టి గుణము నీ యం దుండుటచేఁ గదా నీవు జగతీవరుఁడ వైతివి. జగతీవరుఁడవు=భూదేవికి నిష్టుఁడ వగు వాఁడవు. భూమిచే వరింపఁబడిన వాఁడవు, "జగతీ రత్నగర్భాచ భూతధా త్ర్యబ్ధిమేఖలా" నిఘం. "జగతీ లోకో విష్టపం భువనం జగత్" లోకములో రాజు లందఱు భూమిని గోరుచుండఁగా, భూదేవి నిన్నుఁ గోర నేల? (అయోధ్య ౭-౨ వ. పద్యము) నీ విష్టుఁడ వైన భర్త వనిగదా నిన్ను వరించెను. తన కిష్టుఁడుగాని వానిని. తన్ను భరింపలేని వానిని నే యాఁడుదైన భర్తగా వరించునా? పడుని నెవతె భర్తగా వరించును? అట్లు ప్రపంచమున కంతయు నీవిష్టవరుఁడవై రక్షింపగలిగి జగతీవరుఁ డని పేరొందిన వాఁడవు, న న్నొక యాఁడుదానిని రక్షింప లేవేని నీ కాబిరుదము సార్థకమా? "సీతాయాః పతయే నమ" యని నిన్ను సీతానాథుఁడు, సీతాపతి యనుచున్నారు గదా. సీతను రక్షింపలేకుండిన నీ కీ పేరు తగునా? నీవు సీతా పతివి, సీతానాథుఁడ వగుటచే నీ కందఱు నమస్కరించు చున్నారుగాని, ఆ యోగ్యత నీవు దక్కించుకొనవేని నీ కెవ్వఁడు నమస్కరింపఁ దలఁచును! సీతను రక్షింపలేని రాముఁడు మఱి యెవ్వనిని రక్షించును అని లోకము నిన్నుపేక్షింపదా! కావున నీ గౌరవము కాపాడుకొనుటకైన నన్ను రక్షింపుము.

ఈ విధముగా సీతాదేవి వాక్యము లన్నియు భావగర్భితములై యున్నవి. గ్రంథవిస్తరభీతి నేవియో కొన్ని వివరింపఁబడెను.

## తాత్పర్యము

జగన్నాథా! నీ బలపరాక్రమ సాహసము లెట్టివో, యెంతటివో నేనెఱుఁగు దును. తెలిసియే నీవు తప్పక రక్షింతు వని నమ్మి యున్నదానను. అన్ని గుణము లలో దయాగుణమే శ్రేష్ఠ మని నీవే నాతోఁ జెప్పియుంటివిగదా. ఆ దయను బాధలు పడు నాయెడఁ గనఁబఱుపుము. నిన్ను నాథుఁడుగాఁ గల నేను అనాథ వలెఁ బడియున్న దాననే, ఇట్లు చేయుట నీకు ధర్మమా? ఈ యుపదేశ పాండి త్యము అనుష్ఠానమందు లేదా యని హనుమంతా! యడుగుము,

(అరణ్య ౧౩౮ వ. చూచునది.)

క. అంభోనిధిగంభీరుఁడు, శుంభద్విక్రముఁడు వైరిసూదనచణుఁ డా
జంభారినిభుఁడు సజలధి, కుంభినికిని భర్తసూ రఘుప్రవరుండున్. ౯౩౩

అర్థములు. అంభోనిధి=సముద్రమువలె, గంభీరుఁడు=లోఁతు తెలియనీయని వాఁడు, వైరిసూదనచణుఁడు=శత్రువులఁ జంపుటయందు సమర్థుఁడు, జంభారినిభుఁడు=ఇంద్రునితోఁ సమానుఁడు, సజలధి=సముద్రములతోఁ గూడిన, కుంభినికి=భూమికి, సముద్రమడ్డము వచ్చినది, రాలేదందువా. భూమి అబ్ధిమేఖలకదా. స్త్రీతో భోగింపఁదలఁచిన మగనికి దాని యొడ్డాణమా యడ్డము వచ్చును? భూమి జలధివసనకదా. భూమికి సముద్రము చీరగదా. భార్యతో సంభోగింపఁ జీర యడ్డమని తలఁచు మగవాఁడు మగవాఁడా? (చూ. ౯౭౮-వ ప.) జలధివేష్టిత=సముద్రము వస్త్రముగాఁగలది.

తాత్పర్యము

హనుమా! సముద్రమువలె గాంభీర్యము గలవాఁడును, ప్రకాశించుపరాక్రమము గలవాఁడును, శత్రుసంహారమందు సమర్థుఁడును, ఇంద్రునితోఁ సమానుఁడును నగు రామచంద్రభూపాలుఁడు చతుస్సముద్రములతోఁ గూడిన భూమండలమునకు భర్త సుమా.

క. ఈ విధమున నస్త్రకళా,కోవిదతతిమేటి సత్త్వగుణధాముఁడు స
ద్భావుఁడు సచ్ఛీలుండే,లా విడువం డస్త్ర మొండు నసురావళిపై. ౯౩౪

అర్థములు. అస్త్రకళాకోవిదతతి=అస్త్రవిద్యయందలి పండిత సమూహము లందు, సత్వగుణధాముఁడు=బలమునకు, సద్గుణమునకు స్థానమైనవాఁడు, సద్భావుఁడు=మంచిహృదయము గలవాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము నస్త్రవిద్యయందు పండితులగు వారిలో శ్రేష్ఠుఁడు, బల గుణ స్థానము=మంచిబలముగలవాఁడు, మంచి స్వభావముగలవాఁడగు రామచంద్రమూర్తి నామీఁద నే మాత్రము కొంచెమైన దయ యుండినను లోకమరాక్షస మగు నట్టు లోక యస్త్ర మేల విడువకున్నాఁడు?

మ. వరదివ్యాస్త్రవిదుం డదేల యసురవ్రాతంబుపై వైవఁడు
ధురశౌర్యాస్త్ర మొకండు? దేవదనుజస్తోమాహిగంధర్వులేన్
దిరులై చూడఁగ లేరు సంగరధరిత్రిన్ రామునిన్, నా పయిన్
గరుణాలేశమె యున్న రాక్షసుల వీఁకం గూల్పఁ డే హేతువో? ౯౩౫

అర్థములు. వరదివ్యాస్త్రవిదుండు=శ్రేష్ఠములైన దివ్యాస్త్రముల నెఱింగిన వాఁడు.

తాత్పర్యము

ఉత్తమములైన దివ్యాస్త్రముల నెఱింగిన రామచంద్రమూర్తి రాక్షసులమీద

నొక పదునైన యస్త్రమేల విడువరాకున్నాఁడు. దేవతలు, దానవులు, పన్నగులుఁ గంధర్వులైనను యుద్ధభూమి యందు స్థిరముగ నిలఁబడి యాయన వంకఁ దేఱిచూడ జాలరు గదా, అట్టివాఁడు నామీఁదఁ గూరిమియున్నచో రాక్షసులఁ జంపకుండునా? దీనికి నేమికారణ ముండఁగలదు. నామీఁద దయలేమియే.

ఉ. అన్నయనుజ్ఞఁ బొంది యహితాంతకమూర్తి సుమిత్రపట్టియే
నన్నది యేల కావఁగ మనంబున నెంచఁడు? సర్వభుఙ్మరు
త్సన్నిభు లన్నదమ్ములు నజయ్యులు దక్షు లుపేక్ష సేత కో
యన్న నిజంబు మత్కృతమహాత్తర పాపమ హేతు వెన్నఁగన్. ౯౪౦

అర్థములు. అహితాంతకమూర్తి=శత్రువుల పాలిటికి యముఁడగువాఁడు, సర్వభుక్+మరుత్+సన్నిభులు=అగ్నివాయు దేవతలతో సమానులు, మత్కృత=నా చేతనే చేయఁబడిన, మహత్తర పాపమ=మిగుల గొప్పతగు పాపమే, అభ్యుపగత ప్రారబ్ధము. సంచితము, ఆగామి, ప్రారబ్ధములలో రామచంద్రమూర్తి నాశ్రయించి శరణాగతి చేసినచో వెంటనే సంచితాగాములు నశించును. యావజ్జీవ మనుభవింపఁ దానై యంగీకరించిన ప్రారబ్ధము మాత్రము పోదు. అట్టులే యీ ప్రారబ్ధానుభవము నేనై యంగీకరించినదే. కావుననే వా రుపేక్షించియున్నారు. నా కార్త ప్రపత్తి యుండిన రామ వియోగము లభించిన వెంటనే ప్రారబ్ధము నశించి యుండును. ఈబాధ లేకుండును. దృప్త ప్రపత్తియగుటచే ననుభవింపవలసి యున్నది. నేనై చేసికొనిన దానిని వారి నని యేమి లాభము? నేను బాపాత్మురాలినే, నా పాతివ్రత్యమునందు లోపము గలదు. ఏ మన నేను నాడు జనకుండు నిన్ను స్త్రీ యని తలఁపఁడా యని దూషించితినే. ఆ పాపమేల వృథాపోవును. ఇది యుత్తరాఘము కదా. ప్రాయశ్చిత్తము పెట్టుకొనకున్న ననుభవింప వలసినదే కదా.

సర్వభుఙ్మరుత్సన్నిభులు=అగ్ని మందముగా మండుచున్నను, గాలి వీచెనేని యట్లుండ దానికి సాధ్యమగునా? అట్టులే లక్ష్మణుఁడు ప్రేరించిన రామచంద్రమూర్తి యెట్లుపేక్షించి క్రియాశూన్యుఁడై శత్రువుల నిశ్శేషంబుగ దహించి భస్మముసేయక యుండఁగలఁడు. కట్టె లన్ని భస్మ మగువఱకు నగ్ని చల్లాగనట్లు రాక్షసుఁ డనువాఁడు లోకమున లేకపోవునఱకు రామాగ్ని మండదా?

తాత్పర్యము

రామచంద్రమూర్తి యుపేక్ష చేసినను నన్నుఁ దన తల్లివలెఁ జూచుకొను లక్ష్మణుఁడు నానలెనే పరతంత్రుఁడు. కావున స్వయముగఁ బూనకున్నను అన్న యనుజ్ఞ పొంది యైన నన్ను రక్షింపనేల ప్రయత్నింప లేదు? ఆయన పగవారి పాలిటికి యముఁడే. దోషముగల భార్యలను భర్తలు విడువవచ్చుగాని యెట్టి దోషము గలదాని నైనఁ దల్లిని కొడుకు విడనవచ్చునా? అట్టి లక్ష్మణుఁడు నన్నేల చేయివిడిచెను? అన్నదమ్ము లిరువురు అగ్నివాయువు వంటి వారు.

గెలువరాని వారు. సమర్థులు. నన్నుపేక్షించుటకు నేను జేసిన విశేషపాపము తప్ప మఱియే కారణము కనఁబడలేదు. వారియందు దోషము నెట్లు చెప్పుదును. వారు సమర్థులు కారా, నా యందుఁ బ్రేమలేని వారా, కావున దోషము నాదే.

క. అని దీనాలాపంబులఁ, గనుఁగవ బాష్పంబు లురలఁ•గళవళపడుచున్
జనకజ పల్కిన విని యం, జనతనయుం డిట్టు లనియె•సాంత్వవచనముల్.

తాత్పర్యము

ఈ ప్రకారము శోకముతోఁ గూడిన మాటలను గన్నుల నీళ్లు గాఱుచుండఁ గలవరపడి సీతాదేవి పలుకఁగా, నూరార్పు మాటల హనుమంతుఁ డిట్లనెను.

మ. వినుమీ సత్యముఁ జేసి పల్కెదను దే•వీ! రామభద్రుండు త్వ
జ్జనితార్తిన్ విముఖుండు సర్వమునకున్•సంతప్తుఁ డైకుందెడిన్
కని యా యన్న యవస్థ లక్ష్మణుఁడు శో•కక్షుబ్ధుఁ డయ్యెం జుమీ
కనితి న్నిన్నిపు డెట్టనేల కిట, నిం•కం జాలి నీ కేటికిన్. ౯౪౨

అర్థములు. త్వజ్జనితార్తిన్=నీవలనఁ గలిగిన దుఃఖముచే, విముఖుండు=దేనికిని మాఱుమొగము కలవాఁడు, దేనియందుఁ బ్రీతిలేకున్నవాఁడు-సంతాపముచేఁ గ్రుళ్లుచున్నాఁడు. ఆ యన్న స్థితిఁజూచి లక్ష్మణుఁడు మనస్సు కలవళపాటు గలవాఁడగుచున్నాఁడు. నే నిచ్చట నిన్నిట్లు చూచితిని. ఇంకను నీకేల వ్యసనము?

క. ఇడుమలఁ గుందెడికాలము, కడచెన్ దుఃఖాంత మిపుడు•కనియెద వాత్రం
పడుచు విభు లెదురు చూచుచుఁ, బడఁతీ! యున్నారు లంక•భస్మము సేయన్.

అర్థములు. ఇడుమలన్=కష్టములను.

తాత్పర్యము

అమ్మా! నీవు కష్టపడు కాలము పోయినది. నీ దుఃఖ మిప్పుడే నశింపఁగలదు. దానిని నీవే చూడఁగలవు. లంక నెప్పు డెప్పుడు భస్మము చేయుదుమా యని రామలక్ష్మణు లిరువురు నెదురు చూచుచున్నారు.

క. ఆహవమున సహబాంధవు, ద్రోహిని రావణు వధించి•ద్రుతగతిని జగ
న్మోహిని! నినుఁ గొని పురి కు•త్సాహంబునఁ బోవు రామ•చంద్రుఁడు ప్రీతిన్.

తాత్పర్యము

మీకు ద్రోహముచేసిన రావణుని బంధువులతోడఁ జంపి శీఘ్రముగ నయోధ్యకు నిన్నుఁ దీసికొని రామచంద్రుఁడు పోఁగలఁడు.

•సీతాదేవి హనుమంతునితో శ్రీరామలక్ష్మణులకు సందేశవార్తలు చెప్పిపంపుట•

ఉ. ఏమని చెప్పె సీత యన•నే మనుదున్ రఘురాముతో, సుమి
త్రామహిళాత్మజాతునకుఁ•దన్వీరో! యే మనువాఁడ? వానర
స్వామికి నేమి చెప్పుదును? సంగడికాం డ్రగు క్రోఁతిఱేండ్ల కే
నే మని నీదుమాటలు మ•హీతనయా! వచియింతుఁ? జెప్పుమా. ౯౪౩

తాత్పర్యము

అమ్మా! నేను బోయి సీతాదేవిని జూచితి ననఁగానే రామచంద్రమూర్తి సీత నా కేమని చెప్పు మనెను? లక్ష్మణుఁడు నాకేమైనఁ జెప్పెనా యనును. సుగ్రీవుఁడు, నా స్నేహితులు వానరులు మాకేమి చెప్పె మాకేమి చెప్పె నని యడుగుదురే. నీ మాటలుగా వారివారి కేమని చెప్పుదునో చెప్పుము.

క. ఈ విధిఁ దన్నడిగిన యా,పావనివాక్యముల దుఃఖ•పరితప్తగ నై
భూవిభుని దేవి యిట్లను, వావిరిఁ గన్నీళ్లు దొరఁగ•వాతాత్మజుతోన్. ౬౪౬

తాత్పర్యము

ఈ ప్రకార మాంజనేయుఁడు తన్నడుగఁగా దుఃఖపీడితయై కన్నీరు గార్చుచు సీతాదేవి యాయనతో నిట్లనియె.

క. లోకచయభర్త శుభమతి, యా కోసలతనయ గాంచె•నా మహనీయున్
నాకు న్మాఱుగ మ్రొక్కుము, మీ కుశలం బడిగె ననుమి•మిత్రవతంసా! ౬౪౭

అర్థములు. లోకచయభర్త=లోకసమూహముల భరించువాఁడు, శుభమతి=లోకమునకు శుభము గలిగించు మనస్సు గలది, మిత్రవతంసా=మిత్రులందు శ్రేష్ఠుఁడా! అవతంసమె-వసంతము.“వష్టిభాగురి రల్లోప మవాప్యో రుపసర్గయోః” యను సూత్రప్రకారము అకారము లోపించి వతంస మయ్యెను. అట్లులే అవగాహము వగాహము. అపిధానము-పిధానము. అహంకారము-హంకారము. అవహేళ-వహేళ. అకూపారము-కూపారము. అహంవీర-హంవీర. అపోగండ-పోగండ, యయ్యెను. వతంసము=శిరస్సునందు ధరించెడి పువ్వు లేక ఆభరణము, అవతంసము=చెవులందుఁగాని, చెవులసందునందుఁగాని ధరించెడి పువ్వో, ఆభరణమో అని భేదము గ్రహించుట కలదుగాని, సాధారణముగ రెండును పర్యాయములుగనే ప్రయోగింపఁబడును. ‘అవతంసంబవు పార్వతీపతి’ కిత్యాదులు. అలంకారమందు శ్రేష్ఠ వాచకముగఁ బ్రయోగింపఁబడును.

లోకచయభర్త=లోకములోని స్త్రీ లందఱు తల్లిదండ్రులను, దారపుత్రాదులను భరించు బిడ్డలఁ గందురు. కౌసల్య లోకముల నన్నిటిని భరించు పుత్రునిఁ గనెను. నే నా లోకములోఁ జేరినదాననేకదా. నన్నేల రక్షింపరాదు? శుభమతి=లోకక్షేమమును గోరు మనస్సు గలది. కౌసల్యాదేవి లోకముల నన్నిటి నిహపరముల నుద్ధరించు కొడుకు కావలెనని నోఁచెను, కావున నట్టి కొడుకే పుట్టెనుగాని, యామె కట్టుకొన్న భార్యను సీతనుదప్పఁ దక్కినవారిని రక్షించుకొడుకు కావలెనని నోఁచెనా? ఆ శుభమతి యిట్లు చేయునదికాదే. కావున నన్ను రక్షింపనిదోషము రామచంద్రమూర్తిదే. శుభమతి యనునది రాముని కన్వయించినను నన్వయింపవచ్చును. ఆ మహనీయున్=అటువంటి మహాత్ముని, ఆంజనేయా! అటువంటి నా ప్రియుని నని చెప్పుభాగ్యము నాకు లేదాయెఁగదా! నాకున్ మాఱుగ

ప్రొక్కుము=నా బదులుగ నిది సీత నమస్కార మని ప్రొక్కుము. ఏమమ్మా! నీ భర్తకు నీవు రక్షింపు మని నమస్కరించి ప్రార్థింపవలెనా యందువేమో.

(౧) లోకములో సామాన్య స్త్రీలు భర్తలకు నమస్కరింపరు. నేను సదాచార సంపత్తి గల జనకవంశమునఁ బుట్టిన దానను. పతిదేవతను కావున శాస్త్ర విధి ననుసరించి దేవునికి నమస్కరించినట్లు దైవమను బుద్ధితో నమస్కరించెదను.

(౨) ఆంజనేయా! నాస్థితి యిట్టిదైనది. కొన్ని దినాలు ప్రియురాలై యుంటిని. ఆవల భార్యనైతిని. ఆవల దాసినైతిని. ఇప్పుడేమైతినో నాకే తెలియదు. దాసీజనులు మాత్రము తమస్వామితో నమస్కరించి మాటలాడు చున్నారా? లేదు. దానిని గూడఁ గాను గావున నే నట్లుచేసి చెప్పుకోవలసి వచ్చినది.

(౩) నేను మహాపరాధము చేసితిని. నన్ను రక్షింపు మని నేను గోరితిని. ప్రపన్నురాలగు నేనట్టి కోరికయుఁ గోరరాదు. ఆయన కృత్య మాయనకు నేర్పిన దాననైతిని. ఇదెంత దురహంకారము. దానివలన సర్వజ్ఞునందు విస్మృతిదోషము నారోపించిన దాన నైతిని. ఆయన రక్షణమందు విశ్వాసము లేనిదాన నైతిని. ఆయన సొత్తు కాపాడు కొననీ; పోఁగొట్టు కొననీ బలవంతపెట్టుటకు నే నవతెను? ఆ దోషము పోవఁ బ్రాయశ్చిత్తముగా నమస్కరించు చున్నదానను.

(౪) వివాహకాలమందు నా పాదములంటి నన్ను స్వీకరించెను. ఇప్పుడు నేను నమస్కరించినఁ గాని నన్ను స్వీకరింపఁడు. కావున నమస్కరించెదను.

(౫) వివాహకాలమున నా పాదము లాయన యంటిన సహించితిని. నే నెన్ని నమస్కారములు చేసిన నా పాపము పోవును.

(౬)పరస్త్రీలు మహాత్ములఁ జూచినపుడు నమస్కరింప వలసినదే. ఆయన మహానీయుఁడై నాఁడు. నేను బరస్త్రీనైతిని; కావున నమస్కరించెదను. అట్లు గాకున్న నన్ను రక్షింపుము, నన్ను రక్షింపు మని పరస్త్రీలవలెఁ జెప్పుకొన వలసిన కాలము వచ్చినది కదా! కావునఁ బరస్త్రీలవలె నేను నమస్కరించెదను.

మీ కుశలం బడిగితి ననుము. ప్రొక్కుము - మీక్షేమము లడిగిన దని చెప్పుము. అంతే కాని రక్షింపఁ గోరిన దని చెప్పవలదు. నీవు మిత్ర శ్రేష్ఠుఁడవు. కావున నీవు నాకుఁ జేయవలసిన యుపకార మింతయే. ఉపకారము చేయువాఁడు గదా మిత్రుఁడు.

ఉ. హారివిహారశాలలు స•మంచిత నిస్తుల భోగభాగ్యముల్
 వారిజలోచనామణుల•వర్గముఁ బాయుచుఁ, దల్లిదండ్రులన్
 గౌరవ మారఁ బల్కి,యధి•కం బగు వారి ప్రసాద మంది, కాం
 తారనివాసి యయ్యె గుణ•ధన్యుఁడు లక్ష్మణుఁ డన్నఁ గావఁగన్. ౫౪౮

అర్థములు. హారి విహార శాలలు=మనోహరములై, సంచార యోగ్యము లైన గృహములు-సమంచిత నిస్తుల భోగ భాగ్యముల్=మిక్కిలి యొప్పుచున్న,

యసమానములైన, భోగములు భాగ్యములు - వారిజలోచనామణుల వర్గము= సేవకు రాండ్రగు స్త్రీల సమూహము-కాంతార నివాసి=అడవియందు నివసించు వాడు.

ఇది మొదలు నాలుగు పద్యములు లక్ష్మణ గుణ వర్ణనము.

తాత్పర్యము

ఆంజనేయా! రామచంద్రమూర్తి, నేను అడవులకు వచ్చుటకు లక్ష్మణుం డడవులకు వచ్చుటకుఁ జాల భేదము గలదు. రామచంద్రమూర్తి తండ్రి నిర్బంధము చేత నాయన యాజ్ఞ మీఱలేక వచ్చెనే కాని సంతోషముగ బుద్ధిపూర్వకముగ నొక ప్రయోజనము గోరి వచ్చినవాఁడు కాఁడు, శ్రీరామచంద్రమూర్తి వచ్చెను గావున భార్యనగుట నాకు రాక తప్పినదికాదు. రామచంద్రుని రాకను సమ్మతించిన వా రెవ్వరు లేరు. లక్ష్మణు విషయ మట్టిదికాదు. లక్ష్మణుఁ డరణ్యములకు రావలసిన కారణము లేదు. ఆయన యడవులకు వచ్చుట కందఱు సమ్మతించినవారే, అందఱు సంతోషించినవారే, ఆయన భక్తికి మెచ్చి.

మనోహరములై సంచారయోగ్యములైన గృహములు, అసమాన భోగములు, సంపదలు, సేవచేయుటకుఁ గావలసినంతమంది యుత్తమస్త్రీల సమూహము, వీనినన్నిటిని దానే బుద్ధిపూర్వకముగ వదలి తల్లిదండ్రులను గారవించి సమాధాన పఱచి వారి యనుగ్రహమునకుఁ బాత్రుఁడై వారి యాశీర్వచనము వడసి తన కొక ప్రయోజనము లేకున్నను అన్న యొంటరిగాఁ బోవుచున్నాఁడే, పిలిచినఁ బలుకు మాఱుమనుష్యుఁడు లేఁడే యని యన్నసేవ యేకాంతమున యథేచ్ఛముగఁ జేయవచ్చును గదాయని యడవుల వసింపవచ్చెను. ఎంతటి సుగుణసంపత్తి గలవాఁడో తెలిసెనా?

చ. నిరుపమవిక్రమాఢ్యుఁడు వినీతుఁడు సత్ప్రియదర్శనుండు ని
ర్భరసుఖ మెల్ల వీడి తన భ్రాతకుఁగా గహనంబులోన ని
ష్ఠురదశ సానుకూలమతిఁ జొచ్చి నిజాగ్రజుఁ గొల్చుచుండు, న
న్నరయును దల్లిఁగాఁగ, దన యన్నను దండ్రినిగాఁగ జూచెడిన్. ౬౪౯

అర్థములు. నిరుపమ విక్రమాఢ్యుఁడు=అసమాన పరాక్రమ సంపద గలవాఁడు, వినీతుఁడు=వినయము గలవాఁడు, పెద్దలచేఁ జక్కఁగా శిక్షింపఁబడినవాఁడు, సత్+ప్రియ+దర్శనుండు=సజ్జనులకుఁ బ్రియమైన దర్శనముగలవాఁడు, నిర్భర సుఖము=అతిశయసౌఖ్యము, గహనంబులోనన్ = అడవిలో, సానుకూలమతిన్=ఆనుకూల్యముతోఁ గూడిన మనస్సుతో, "నాన్యం పశ్యామి రామస్య సాహాయ్యం కార్యసాధనే" సుం 30.3౨. సహాయ సాహాయ్యములు పర్యాయములైనట్లు లిచ్చట అనుకూలానుకూల్యములు పర్యాయములు. (౧) అనుకూల శబ్దము భావ ప్రధానము. (౨) అనుకూలశబ్దము అనుకూలాభిప్రాయ పరము. అనుకూలాభిప్రాయముతోఁగూడిన మనస్సుతో-నిజాగ్రజున్=తన యన్నను, అరయున్=విచారించును.

## తాత్పర్యము

అడవులకు వచ్చి యెటు లున్నవాఁడో తెలియునా! అసమాన పరాక్రమ వంతుడయ్యు, గర్వములేక వినయముగలవాఁడు, గురువులచేఁ జక్కఁగ శిక్షింపఁ బడుటచే నా గుణము లభించెను. విద్యాఫలము వినయమే గదా. సత్పురుషులు చూచుటకుఁ బ్రియ మైనవాఁడు. ఇట్టివాఁడు సుఖముల నెల్లవదలి తన యన్న నిమిత్తమై యడవులలోఁ గష్టదశయందు నన్నకు ననుకూలమైన మనస్సు గల వాఁడై తనయన్న సేవచేయు చుండును. నన్నుఁదన తల్లివలెను, అన్నను తండ్రి వలెను జూచి తల్లిదండ్రులకెట్లు సేవ చేయవలయునో యట్లె చేయును.

ఆ. మంచి మనసువాఁడు ♦ మంచిచూడ్కులవాఁడు
సింగ మెనయు మూఁపు ♦ చెలువువాఁడు
మామగారితో స ♦ మానుండు, దెలియండు
పాపి యసుర నన్నుఁ ♦ బట్టి తేర. ౬౨౦

## తాత్పర్యము

ఆయన యొకరికి మేలు చేయవలయునని తలంచునే కాని, యొకరికినిద్రోహము చేయవలయునని తలఁచువాఁడు కాఁడు. ఆయన మూపులు చూడఁగానే యాయన సౌమ్యుఁడని తోఁపఁజేయునుగాని క్రూరుఁడని తోఁపఁజేయవు (చూ. కిష్కింధ. ౬౦౪ ప) సింహము మూఁపురముల వంటి మూఁపులు గలవాఁడు. అన్ని విష యములందు మా మామగారితో సమానుఁడు. రావణాసురుఁడు నన్నుఁబట్టి తెచ్చినది యాయన యెఱుఁగఁడు. తెలిసి యుండెనా రావణుని నచ్చటనే హతునిఁజేసి యుండును.

సీ. వృద్ధోపసేవి సు♦శ్రీకుండు మితభాషి, మా మామగారి గా♦రామసుతుఁడు
వా ముద్దుమఱఁది యా♦సౌమిత్రి భరియించు, నెంత భరంబు మే♦మింతజెప్ప
నెవ్వనిఁ గనుఁగొని♦యెలమిశ్రీరాముండు, తనతండ్రిమదిలోనఁ♦దలపద కుండు
దాక్షిణ్యశీలుండు♦దయ గలవాఁడు ని, ర్మలమతి కడు మెత్త♦మనసువాఁడు

తే. ననఘుఁడును రామచంద్రుని♦యనుఁగుభ్రాత, సేమమడిగితి నని నీవు♦చెప్పవయ్య
యెట్లుచెప్పిన శ్రీరాముఁ♦డేగుదెంచు,నట్టులంతయుఁ జెప్పుమా♦యాంజనేయ!

అర్థములు. వృద్ధోపసేవి=పెద్ద లనువారి సమీపమం దుండి సేవ చేసిన వాఁడు. ఉప=సమీపము, సుశ్రీకుఁడు=మంచి కాంతిగలవాఁడు, మితభాషి=అడి గిన దానికి నెంత ప్రత్యుత్తర మీయ వలయునో యంతియగాని, యెక్కువమాట లాడువాఁడుకాఁడు. ఎంత భరంబు=ఎంత భారమైనను; కష్టకార్యమునే కాదు. నాకు మామగారు పదునాలుగు సంవత్సరములకుఁగా నిచ్చిన చీరలు, గడ్డపాఱ, గంప, ఆయుధములు, కవచములు ఇంత బరువు మోచి తిరుగు చుండెను.

తాత్పర్యము

పెద్దల యొద్దనుండి వారలసేవ చేసినవాఁడు, మంచి కాంతి గలవాఁడు, మితముగ మాటలాడువాఁడు, మామగారికిఁ బ్రియకుమారుఁడు నాకు ముద్దు మఱఁదియగు లక్ష్మణుఁడు మేమెంత కష్టకార్యము చెప్పినను నాచేతఁగా దనక చేయువాఁడు. ఎంతబరువైన మోచి తెచ్చువాఁడు. ఆయన యుండుటచే శ్రీరాముఁడు తనతండ్రి లేఁడాయె నని తలఁపకున్నాఁడు. దాక్షిణ్యస్వభావము గల వాఁడు. దయగలవాఁడు. నిర్మలమై, మృదువైన మనస్సు గలవాఁడు. ఎట్టి దోషము లేనివాఁడు. శ్రీరామచంద్రునకుఁ బ్రియసోదరుఁడు, అట్టి లక్ష్మణుని సేమ మడిగితి నని నీవే చెప్పుము. ఎట్లు చెప్పిన శ్రీరామచంద్రమూర్తి యిచ్చటికి వచ్చునో యట్లుసర్వము చెప్పుము.

క. నా వంత లంత మొందఁగఁ, బ్రోవఁగ ననుఁ బ్రాణవిభుఁడు•పూనుట యెట్లో
 యా విధిఁ గార్య మొనర్పఁగ, నీవె ప్రమాణంబు సుమి వ•నేచరనాథా!

తాత్పర్యము

వానరేంద్రా! నాదుఃఖములు తుదముట్టవలె. ఇది నాకుఁ గావలసినకార్యము. దానికై నామగఁడేమి ప్రయత్నము చేసిన నన్ను రక్షింపఁగలఁడో యదియంతయు నాయనచేఁ జేయింపవలసిన వాఁడవు నీవే. ఆ భారము నీయందున్నది.

ఉ. సారెకుఁ జెప్పవయ్య కపి•సత్తమ! నే నిఁక నొక్క-మాస మే
 తీరున నైనఁ బ్రాణములు•దేహమునన్ ధరియించుదాన, నా
 పై రఘుచంద్రమా! నిజము•ప్రాణము నిల్వదు, మున్నధోభువిన్
 జేరిన కౌశికిన్ హరిని•జేర్చిన రీతి సముద్ధరింపుమీ. ౯౫౩

తాత్పర్యము

ఆంజనేయా! యీ మాట మాత్రము గట్టిగఁ బలుమారు నా మగనికిఁ జెప్పుము. ఎంత కష్టమైన సహించి యింకొకనెల ప్రాణము బిగఁబట్టి యుండఁ గలను. రామచంద్రా! యాపైన నేను నిలుపవలయు నని నను ప్రాణము నిలుపదు. పూర్వమింద్రుని రాజ్యలక్ష్మిని నింద్రుని జేర్చిన ట్లుద్ధరింపుము. తన సొత్తును దాను గాపాడుకొను మని చెప్పుము.

ఇంకను రావణుఁ డిచ్చిన గడువు రెండు నెలలకు మించి యుండఁగా నెలకే ప్రాణములు విడిచెద నన నేల?

ఇది పదునాలుగవ సంవత్సరము ఫాల్గున మాసము. సీతా రామలక్ష్మణు లయోధ్య విడిచినది చైత్ర శుద్ధ చతుర్థి. పదునాలుగు సంవత్సరములు పూర్తి యగుటకు పందొమ్మిది దినములే కొఱఁత యున్నది. పదునైదవ సంవత్సరము మొదటి దినము నీవు రావేని నే నగ్నిని బ్రవేశించెద నని భరతుఁడు శపథము చేసెను. రామచంద్రమూర్తి దాని నామోదించెను. కావున నేఁటి కిరువదవ

నాఁడయోధ్యలో రామచంద్రమూర్తి యుండక తప్పదు. భరతుఁడు చచ్చినా కౌసల్యా సుమిత్రా కైకేయీ శత్రుఘ్నులు చచ్చినవారే. వంశనాశన మగును. దానిని నా నిమిత్తమై రామచంద్రమూర్తి యెట్లు సహింపఁగలఁడు. కావున నయోధ్యకుఁ బోక తప్పదు. నేనా ఆయన వచ్చును. నన్ను రక్షించునని ప్రాణములు నిలిపియున్న దానను. ఆయన యిటు రాక యయోధ్యకుఁ బోయె నేని నా యాశ భంగ మగును దానితోఁ బ్రాణములు పోవును. కావున నెల దినములు బ్రదికి యుండెద ననెను. కౌశికిన్ హరిని జేర్చిన రీతిన్=పూర్వము వృత్రాసుర వధచే నింద్రునికి బ్రహ్మహత్యరాఁగా విష్ణ్వాదు లశ్వమేధము చేయించి యా హత్యాదోషముఁ బాపిరి. అయినను శ్రీ వచ్చినదిగాదు. వాని రాజ్యలక్ష్మి వానికి వచ్చునట్లు చేయ నాలోచించి యాకాశవాణి మాటప్రకారము గవాక్ష తీర్థమున నుండిన యామెను బిలిచినను రాక యామె పాతాళమునకుఁ బోయెను. అప్పు డచ్చటికి దేవతలు పో శక్తి చాలక విష్ణువును బ్రార్థింపఁగా నాయన పోయి యామెను దోడితెచ్చి యింద్రున కిచ్చెను—బ్రహ్మ పురాణము.

ఉచథ్యుని భార్య యమునలో స్నానము చేయుచుండఁగా వరుణుఁడామెను నపహరించెను. ఆ ముని నారదమూలమున యాచించినను వరుణుఁ డామెను నిచ్చిన వాఁడుకాఁడు అప్పు డా ముని పాతాళ హ్రదమును నెండించి యామెను దెచ్చికొనెను. ఆమె పేరు కౌశికి యని కొందఱందురు.—భారతము.

—♦ సీతాదేవి హనుమంతుని చేతికిఁ దన చూడామణి నిచ్చుట. ♦—

క. అని తన కొంగున ముడిచిన, ఘనచూడామణిని దీసి♦కౌసల్యానం
దనునకు నిమ్మని జానకి, హనుమంతునిచేతి కిచ్చె♦నధిక ప్రేమన్. ౨౯౯

తాత్పర్యము

అని తన కొంగున ముడివేసి దాఁచియుంచిన చూడామణిని దీసి రామచంద్రున కిమ్మని హనుమంతున కిచ్చెను.

క. ఇచ్చినమణి నంగుళి నిడె, నచ్చపుమతిఁ బెద్దగాదు♦హస్త మపుడు దాఁ
గ్రచ్చఱ వలగొని మ్రొక్కుచు, నచ్చపలవిశాలనేత్ర♦యంచున నిలిచెన్.

తాత్పర్యము

ఆమె యిచ్చిన జడబిళ్ళను హనుమంతుఁడు తన వ్రేలియందు ధరించెను. అప్పు డాయన హస్తము పెద్దది గాదు. సీతాదేవికిఁ జూపిన పెద్దయాకారమప్పుడే యా పని తీరఁగానే తగ్గించి పూర్వమువలె జిన్నవాఁడై యుండుటచే నా బిళ్ళ యాయన వ్రేలికి సరిపోయెను. ఆయన బిళ్ళను లోప్రక్క వెంట్రుకలు దూర్చుటకై యుండు తూములో వ్రేలిని దూర్చి యుంగరమువలె ధరించెను. ఇట్లు ధరించి యామెకుఁ బ్రదక్షిణించి నమస్కరించి యామె యొద్ద నిలువఁబడెను. రామచంద్ర మూర్తికి హనుమంతుఁడు ప్రదక్షిణము చేసి నమస్కరించినట్లు చెప్పఁబడలేదు.

దీనివలన హనుమంతునకు సీతారాము లిరువురు సమానులైనను భక్తిముల్లు కొంచెము సీతవైపు ప్రాలె నేమో యని చెప్పవలసియున్నది.

క. సంతసమునఁ బొదలెడి కపి; కాంతుఁడు దేహంబు సీత•కడ నుంచియుఁ దా
స్వాంతంబున రఘురామునిఁ జింతించుచు నుండె నతని•జేరఁగఁ జనఁగన్.

తాత్పర్యము

వచ్చినకార్యము నిర్విఘ్నముగ నెఱవేఱె నని సంతోషించు హనుమంతుఁడు దేహమును సీతయొద్ద నుంచినను మనస్సు రామచంద్రమూర్తి యొద్దనుంచి యాయనను జూడఁ ద్వరపడుచుండెను.

చ. అతులిత మై మహార్హమయి•యా జనకాత్మజచే మహానుభా
వత ధృత మైన యమ్మణిఁ బ్ర•భావమునం గొని పావమాని మా
రుతమునఁ గంప మొందియును•రూ ఢయి కోల్కొను నద్రివోలి హ
ర్షితమతి యై చనం దలఁచె•శ్రీరఘురామునిఁ జేర నంతటన్. ౧౫౭

అర్థములు. అతులితమై=అసమానమై, మహార్హమయి=మిక్కిలి యుత్తములు ధరింప యోగ్యమై; మహానుభావతన్=మాహాత్మ్యముచే, ధృతమై=ధరింపబడినదై, ప్రభావమునన్ = తన మహిమచే; పావమాని = ఆంజనేయుఁడు; కోల్కొను=కుదుటఁబడిన-స్యమంతక మణివలె నీ మణి నందఱు ధరింపయోగ్యులు గారు.

తాత్పర్యము

అసమానమై, యుత్తములు మాత్రము ధరింప యోగ్యము, సీతాదేవిచే నామె మహాత్మ్యముచే ధరింపఁబడినదైన చూడామణిని హనుమంతుఁడు తన బుద్ధిబలముచే గ్రహించినవాఁడై పెద్దగాలికిఁ జలించి మఱలఁ గుదుటఁబడిన కొండవలె మొదట సీతాదేవి కానరాకముందు మిగుల వ్యాకులపడియును నిప్పుడు స్వస్థచిత్తుఁడై సంతోషించి రామచంద్రమూర్తి యొద్దకుఁ బోవ నాలోచించెను.

౩౯వ-సర్గము. సీతాదేవి తన్ను గుఱించి శ్రీరామునికిఁ
దెలుప హనుమంతుని వేఁడుట.

ఉ. జానకి రత్న మిచ్చి కపి•సత్తముతో నను వానరోత్తమా!
దీనిని గుర్తెఱుంగు రఘు•దీపకుఁ డెంతయు లెస్స, దీని నా
మానధనుండు కన్గొనిన•మాత్రన నా జననిన్ ననున్ ధరా
జానిని నాజినిం దలఁచు•సంశయ మింతయు లేదు నమ్ముమీ. ౧౫౮

అర్థములు. జననిన్=నా తల్లిని; ధరాజానినిన్=రాజును; ఆజినిన్ = దశరథుని.

తాత్పర్యము

సీతాదేవి హనుమంతునకు చూడామణి నిచ్చి యిట్లనియె. వానరేంద్రా!

యీ గుర్తును రామచంద్రమూర్తి చక్కఁగా నెఱుఁగును. దీనిని జూచినంతనే నా తల్లిని, నన్ను, దశరథమహారాజును స్మరించును.

వివాహకాలంబున దీనిని జనక మహారాజు తన చేతి కీయఁగా నాయన భార్య, దశరథుఁడు రాముఁడు చూచుచుండ నామె సీతాదేవి తలలో నలంకరించెను, కావున మేము తప్పక జ్ఞప్తికి వత్తుము. జనని యనఁగా కౌసల్య యని కొందఱందురు. కన్యాదానవేళ కన్న తల్లిదండ్రులు దానము చేయఁ బెండ్లికూఁతుతో నుందురుగాని వరుని తల్లితోఁ బనిలేదు. కావున కౌసల్య వివాహవేది యొద్ద లేదు. దశరథుఁడు మాత్రమే కుమారులతోడ నుండెను. అదియును గాక ౧౪౧౦ వ పద్యమున క్ష్మాతనూభవకు మామామగారు ప్రేమమున నుద్వాహవేళ శిరమం దిది గూర్పననెడి వాక్యమువలన కౌసల్యాప్రసక్తికిఁ గారణములేదు. కన్య నలంకరించుపని కన్యతల్లిదండ్రులది గాని వరుని తల్లిదండ్రులది గాదు. కావున జనని యనగా కౌసల్యగాదు.

ఇప్పటి యాఁడువారు ధరించు పచ్చబిళ్ళవంటిది యీ జడబిళ్ళ, ఇప్పటి వారు గాజుబిళ్ళకు చుట్టు జవకట్టించి ధరింతురు. సీతాదేవి జడబిళ్ళ అంతయు రత్నమే. అనఁగా నంత పెద్ద కెంపు కావుననే యతులితము, మహార్హమని చెప్పఁబడెను.

క. నీవు సముత్సాహముఁ గొను, నా విధిఁ బ్రేరించితిన్ వ◆నాటచయేంద్రా!
నీవే యీ పని యిఁకమీఁ, దే విధి ఘటియింపవలయు◆నెంచుము దానిన్.

తాత్పర్యము

నీ కుత్సాహము గలుగుటకై యెట్లు చెప్పవలయునో, యెంత చెప్పవలయునో య ట్లంతయుఁ జెప్పితివి. తరువాతికార్య మెట్లు చేయవలయునో యది నీవే యాలోచించుము.

క. నీవే గతి యీ కార్యం, బో వానరవర్య! ఫలము◆నొందఁగఁ జేయన్
నీ వే విధి నైనను నా, వావిరిదుఃఖంబుఁ బాప◆వలయుం జుమ్మీ. ౯౬౦

తాత్పర్యము

స్పష్టము.

క. కావున నే మార్గంబున, భూవిభుఁడు మదీయదుఃఖ◆మును బోనడుచున్
నీ వా యుపాయ మంతయుఁ, బావని! యోజంప నీదె◆భారము సుమ్మీ. ౯౬౧

తాత్పర్యము

స్పష్టము.

క. అన నట్ల చేయువాఁడను, వనితామణి? యని ప్రతిజ్ఞ◆వచియించి మరు
త్తనయుఁడు పయనం బైనను, గని జానకి యిట్టు లనియెఁ◆గనుఁగొ రోలుకన్.

తాత్పర్యము స్పష్టము.

క. వినుమా కుశలం బడిగితి. ననుమా శ్రీరాముఁ దమ్ము◆నా ప్తజనయుతున్
దినకరసుతుఁ గపివృద్ధుల, హనుమా! ధర్మోక్తి నేమ◆మడిగితి ననుమా. ౯౬౩

తా త్ప ర్య ము

ఆంజనేయా! నీ మన స్సెందో యుంచియున్నావు. నేను జెప్పునది వినుము. శ్రీరామచంద్రమూర్తిని, ఆయన తమ్మునిని, ఆయనకును, దనకు ముఖ్యులైనవారితో, గూడిన సుగ్రీవుని, వానరులందుఁ బెద్దవారిని, ధర్మపద్ధతిని క్షేమము విచారించితి నని చెప్పుము.

తే. ఆ మహాబాహుఁడైన శ్రీ•రామచంద్రుఁ, డెట్లు తరియింపఁజేయు న•న్నీదురంత
శోకవారాశినుండి యా•చొప్పు నెఱిఁగి,యట్లు సమ్మతిపఱుపుమా•యతులకీర్తి.

అర్థములు. దురంతశోక వారాశినుండి=అంతములేని దుఃఖసముద్రమునుండి, అతులకీర్తి=అసమానమైన కీర్తిగలవాఁడా.

తా త్ప ర్య ము

మహాబలవంతుఁడైన శ్రీరామచంద్రమూర్తి యే విధముగఁ బారము లేని యీ దుఃఖ సముద్రమునుండి నన్ను దాటించునో, యా విధము దెలిసికొని యా విధముగనే యాయనను సమ్మతింపఁ జేసి కీర్తి వహింపుము.

క. నా చేతోవిభుఁ డేగతిఁ, బ్రోచున్ నే మేను విడక•పూర్వమె నన్నున్
ధీచతుర! యట్లు పలుకుము, వాచాపుణ్యంబుఁ జలుపు•వానరవర్యా! ౯౬౫

అర్థములు. చేతోవిభుఁడు=మగఁడు, వాచాపుణ్యము=మాటచెప్పుటవలనఁ గలుగు పుణ్యము, కర్తకెంత పుణ్యమో ప్రేరించు వానికి; జేయించు వానికి నంత పుణ్యము గలదు కదా. "వష్టి వాగురి రల్లోప మవాప్యో రుపసర్గయోః। ఆపం చైవ హలంతానాం యథా వాచా నిశా దిశా॥ అని వాచాశబ్దము ఆకారాంత స్త్రీలింగము గలదు.

తా త్ప ర్య ము

నేను దేహము విడువక ముందే నన్ను నా మగఁ డెట్లు చెప్పిన రక్షించునో యట్లు బుద్ధి చమత్కారముగల నీవు చెప్పి ప్రేరకునకువచ్చు పుణ్యంబుపొందుము.

క. సత్సాహసికాగ్రణి విచి, కిత్సాదూరోక్తి నీవు•కెరలుచుఁ బలుకన్
బ్రోత్సాహము గొని నను నా,పత్సాగరముం దరింపఁ•బతి యొనరించున్.

అర్థములు. సత్+సాహసికాగ్రణి = మంచి సాహసము చేయువారిలో మొదటివాఁడవు. విచికిత్సాదూరోక్తిన్=సందేహములేని మాటలతో, కెరలుచు= ఉత్సాహముతో విజృంభించి.

తా త్ప ర్య ము

మంచి సాహసవంతులలో మొదటివాఁడా! నీవు సందేహమున కెడ మీయని మాటలతో నుత్సాహమున విజృంభించి పలికితి వేని ప్రోత్సాహము గొని నాభర్త నన్ను నాపత్సముద్రమునుండి తరింపఁజేయును. అటుగాక నీవు నీళ్ళు నములుచు లంక చాల దూర మున్నది. చుట్టు పెద్ద సముద్రము. దాని దాఁటుటే కష్టము. దాఁటి

నను రావణుఁడు బలవంతుఁడు. ఎట్లగునో, యేమో-యని యిట్లు లేడ్పు గొంతుకతోఁ జెప్పుకుము. రామచంద్రా! లే లెమ్ము. సీతాదేవిని నా దుష్టుఁడు చాల బాధపెట్టుచున్నాఁడు, మనము పోవువఱకు బ్రదుకునో, బ్రదుకదో, రావణుఁడనఁగా నెంత? లే లెమ్ము. నిమిషములోఁ బోయి లంక ధ్వంసము చేసి రావణుని బట్టి ఖండించి సీతను దీసికొని వత్తము. ఆఁడుది దిక్కులేక యందల్లాడుచుండఁగా నిందఱము మగవారము పరాక్రమ వంతుల మూరకుండ వచ్చునా, లే లెమ్ము పోద మని యిట్లు చెప్పుము.

క. సందేశయుతం బగు, నీ సూక్తుల నాలకించి నెఱపౌరుషమున్
గౌసల్యాతనయుఁడు క్రూ, రాసురపంక్తులకుఁ జూపు నాహవమందున్. ౯౬౨

అర్థములు. నా సందేశ యుతము=నేను జెప్పిన వార్తతోఁ గూడినది. ఆహవమందున్=యుద్ధమందు.

తాత్పర్యము

నేను జెప్పిన మాటలతోడ నీవు ననుసరించియనుకూల వాక్యములు చెప్పితివా తన పౌరుషమును రాక్షసులపై రామచంద్రమూర్తి చూపును.

సీ. అనవుడుఁ బవమాన తనయుఁ డి ట్లను దేవి! శ్రీరామభద్రుండు శీఘ్రముగను
వానరభల్లూక వారసంయుతుఁ డయి, చను దెంచి యిచ్చటి శత్రుసమితి
హరియించి నీ దుఃఖ మపనయించును దేవ,మనుజనాగార్కయ మప్రభృతులుఁ
బర్జన్యుఁ డైనను భగ్నులె నీ కయి, రాముండు దొడరన్ నిం కేమి పలుక?
ఆ. జలధివేష్టితోర్వి శాసింపఁగలవాఁడు, రామచంద్రుఁ డతిపరాక్రమమున
నతని విజయమునకు నంబుజలోచన, నీవె కావెకతము నిశ్చయముగ. ౯౬౩

అర్థములు. అపనయించును=పోగొట్టును; తొడరన్ = ప్రయత్నించెనేని; జలధివేష్టితోర్విన్=సముద్ర మను వస్త్రముచేఁ జుట్టఁబడిన భూమి; శిరోవేష్టము. ఇత్యాదులందు వేష్టము వస్త్రపర్యాయము. ద్రావిడులు సాధారణముగ వాడుకయందును కట్టువస్త్రము పర్యాయముగ వేష్ట శబ్ద ముపయోగింతురు.

తాత్పర్యము

సీతాదేవి యిట్లు చెప్పఁగా హనుమంతుఁడు "దేవీ! శ్రీరామచంద్రమూర్తి వానరులతోను, భల్లూకములతోను శీఘ్రముగా నిచ్చటికి వచ్చి శత్రు సమూహముల సంహరించి నీ దుఃఖము బోగొట్టును. రామచంద్రమూర్తి యుద్ధప్రయత్నము నీకయి చేసెనేని దేవతలు, మనుష్యులు, పన్నగులు, ఇంద్ర సూర్యయములు లోనగు వారెవ్వ రడ్డమైనను చచ్చినవారే. ఇట్లు జయించి సముద్రముచేఁ జుట్టఁబడిన భూమండలములను బరిపాలింపఁగలఁడు రామచంద్రమూర్తి పరాక్రమమును వర్ణించుచున్నానే కాని యాయన విజయమునకు మూలకారణము నీవే. చచ్చిన సత్యవంతుఁ డెట్లు బ్రదికెను. సావిత్రి సత్యవంతున కే విధ మావిధముగ నీకు

నే నని నీవే చెప్పితివే. అదియేల నీకు మఱపువచ్చెను. నీ పాతివ్రత్యము వ్యర్థమై యేల పోవును. ఆయనను గెలిపింప నది యొక్కటిచాలదా? ఇతరుల సాహాయ్యము కూడ నాయనకేల? (చూ. అయో. ౮౩౭ ప.) నీ పాతివ్రత్యబలము నందు నీ కేల విశ్వాసము దప్పెను. నీవె కావె కతము=ఆఁడుదాని దదృష్టము. ఆఁడుది పుణ్యవంతురాలై సుఖ మనుభవింపవలసియుండెనా భర్త చిరాయువై, యారోగ్యవంతుఁడై. భాగ్యవంతుఁడై యుండును. భార్య పాపాత్మురాలై దుఃఖ మనుభవింపవలసి యుండెనా భర్త చావనైనఁ జచ్చును. రోగియో దరిద్రుఁడో యగును ఈ సందర్భమున సావిత్రి యమునితోఁ జెప్పిన వాక్యములు స్మరించునది. తల్లీ! నీ యందలి చిహ్నములు చూచిన నీవు దుఃఖింపవలసిన దానవు గావు. సుఖింపవలసిన దానవై యున్నావు. కావున నీ మగఁడు తప్పక విరోధుల జయించును. నీ పాతివ్రత్యమే నీ మగనికి జయమిచ్చును. నీ యందు వైధవ్య చిహ్నములులేవు. కనుక యుద్ధమందు నీ మగనికి భయము లేదు. చూ. ౧౧౨౦-౧౧౩౬ పద్యములు.

—• సీతాదేవి తనసందేహమును హనుమంతునితోఁ జెప్పుట. •—

క. అనవుడు సంయుక్తికంబును, విన నింపును సత్యమైన•వృక్షాటోక్తుల్
విని సంతసించి యంజన, తనయున్ బహుమానసూక్తి • ధరణిజ మెచ్చెన్.

అర్థములు. సయుక్తికంబు=యుక్తియుక్తముగ నుండునది; సేనలతోడ రాముఁడు వచ్చుననుట, సావిత్రి కథనము సయుక్తికము. నీ దుఃఖ మపనయించు ననుట యిపుడు రామ విజయమునకు నీవే కారణ మనుట సత్యము. వృక్షాటోక్తుల్=వానరుని మాటలు, బహుమానసూక్తి=గౌరవముతోఁ గూడిన మంచి మాటలు.

తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు చెప్పఁగా నాయన యుక్తియుక్తముగను, విననింపుగను, యథార్థమునైన యాయనమాటలు విని సంతోషించి సగౌరవములగు మాటల నాయనను సీతాదేవి మెచ్చుకొనెను.

క. ఆమాటలు విని శ్రీరఘు, రామునిపై గల్గుస్నేహ•రమ దీపింపం
గా మారుతిదెస మఱి మఱి, ప్రేమంబునఁ గనుచు నిట్లు•ప్రేయసిపలికెన్.

అర్థములు. స్నేహరమ=అనురాగ మను లక్ష్మి; ప్రేయసి=రాముని ప్రియురాలు.

తాత్పర్యము

స్పష్టము.

క. నాపలుకు నీకు సమ్మత, మై పొసఁగిన యేని శత్రు•హరణసమర్థా!
యీ పూఁట నిలిచి మఱుఁగున, రేపటఁ బోరాదె శ్రమము•ప్రీలెడి నీకున్.

అర్థములు. శత్రుహరణ సమర్థా=శత్రువులఁ జంపు సామర్థ్యము గల

వాఁడా! ఇట్లు చెప్పుటచే నిన్ను రాక్షసులు చూచినను నేమియుఁ జేయఁజాలరు. వారివలన భయము లేదు. అయినను ఆపని రామచంద్రునకు విడువుమనిభావము.

తా త్ప ర్య ము

నామాట నీ మనస్సునకు సరిపడినయెడల నిందే యీ పూఁట నెందైనఁ జాటుగనుండి రేపు సముద్రము దాఁటి పోరాదా? నీకు గాసి తగ్గునుగదా. ఇప్పుడు వచ్చి మఱల నిప్పుడే పోవలె ననిన బడలిక తోఁచును గదా.

క. ఓపావని! నీ సన్నిధి, ప్రాపున ధృతిఁ గూరి యల్ప•భాగ్యను క్షణమేన్
నీ పుణ్యంబున శోకము, తాపంబుఁ దొఱంగి బ్రదుకు•దానఁ గపీంద్రా! ౯౭౨

తా త్ప ర్య ము

ఆంజనేయా! నేనీ మాట చెప్పుట కేవలము నీ నిమిత్తమే కాదు. నీవు సమీపమున నుంటివేని ధైర్యము గలదాననై యల్పకాల మైనను శోకతాపముల విడిచి యల్పభాగ్యము కల నేను బ్రతికి యుందును.

ఉ. పోయెద వేనిఁ బొమ్ము రఘు•పుంగవుఁ జేరఁగ, నీవు గ్రమ్మఱన్
వాయుజ! వచ్చునందనుకఁ•బ్రాణము లుందునో యుండవో చుమీ
యీ యెడలందు సందియము•యెంతయు వేఁగెడు నాకు నీవునున్
బాయుట గల్గ నేమి కని•ప్రాణము నిల్చునో నీవ చెప్పుమా. ౯౭౩

తా త్ప ర్య ము

ఆంజనేయా; యొకనాఁడు నీ విచ్చట నుండగానే నాకు రాఁగల లాభమేమి? ఆవల యథాప్రకార మేడువ వలసిన దాననేకదా. ఎన్నాళ్ళని నీ విచ్చట నుండఁ గలవు? నీ విచ్చట నాలసించిన కొలఁది నీరాకకై యెదురుచూచు రామచంద్ర మూర్తి యెక్కువగఁ బరితపించునుగదా. నీ విచ్చట నుండిన జరుగవలసిన కార్య మెట్లు జరుగును. కావున రామచంద్రు నొద్దకు నీవు పోఁదలఁచినఁ బొమ్ము. అయి నను నీవు మఱల నెన్నిదినాలకు వత్తువో యేమో. అంతవఱకు నాకీ దేహమునఁ బ్రాణము లుందునో యుండవో యది మాత్రమే నేను జెప్పజాలను. సందేహమే. అది యేమమ్మా యిట్లు చెప్పెద వందువా, నిన్నుఁ జూచుటచేఁ బోనున్న ప్రాణ ములు మఱల వచ్చెను. నీవుకూడ వెడలిపోయిన దేహమునఁ బ్రాణములును నే మని నిలుచునో? నీవే చెప్పుము.

క. నీ యందును, నీకును దోడై యగు దెంచిన కపీంద్రు•లందును నాకున్
బాయని సందేహం బో,వాయుజ! నా కనుల్ర మోల•వర్తిలఁ దొడఁగెన్. ౯౭౪

తా త్ప ర్య ము

ఆంజనేయా! నీవు మరల సముద్రము దాఁటఁగలవు. పోఁగలవు. రామచంద్రు నకు నా విషయమై చెప్పవలసిన వన్ని చెప్పఁగలవు. ఆ యన్నదమ్ములను వానరు లను బిలుచుకొని సముద్ర దీరమునకు రాఁగలవు. తరువాత ఆవల విషయమునఁ

పెద్ద సందేహము నన్ను బాధించుచు నా కన్నులయెదుర మూర్తీభవించి నిలిచి యున్నది.

చ. హరివర ఋక్షసైన్యములు ♦ నా నృపవర్యతనూజులేని దు
స్తరజలరాశి దాఁట నెటు ♦ చాలుదు రన్న? తలంచి చూడఁగా
గరుడుఁడు నీవు మారుతుఁడుఁ ♦ గాక మ ఱెవ్వరు భూతకోటిలోఁ
బరవస మొప్ప దాఁటఁగల ♦ వారలు గానఁగరారు మారుతీ! ౯౭౫

అర్థములు. పరవసము=ధైర్యము.

తాత్పర్యము

వానరేంద్రా! యెలుఁగుల సేనగాని, రాజకుమారులుగాని దాఁట సాధ్యముగాని సముద్రము నెట్లు దాఁటుదురయ్యా! మారుతీ! ఈ భూతకోటిలో గరుత్మంతుఁడు, వాయుపుత్రుఁడ వైన నీవు, వాయువుతప్ప మఱియెవ్వరును నీ సముద్రమును దాఁటఁ గలవారు లే రని నా యభిప్రాయము.

క. కనుఁగొలఁది నసాధ్యం బౌ, పని యనుచుం దోఁచె; గార్య♦పద్ధతులను నీ
కననియది లేదు, దీనికి, హనుమా! నీ వనుచు విన స♦మాధానంబుల్. ౯౭౬

తాత్పర్యము

నే నాలోచించుకొలఁది వారంద ఱిచ్చటికి వచ్చుట యసాధ్యకార్య మని తోఁచుచున్నది. అయినను కార్యము చేయుమార్గములందు నీ వాలోచింపనిది లేదు. దీనికి నీ వేమి సమాధానము చెప్పెదవో వినఁగోరెదను.

క. నీ వొకఁడవె యీ కార్యము, పావని సాధింప శక్తి♦పరుఁడవు ధరపై
నీ వొకఁడవె యీ కీర్తి, చే విలసిల్లంగఁ గలవు♦శిక్షితవైరీ! ౯౭౭

తాత్పర్యము

ఎట్లు సాధింపఁగలవో యేమో, నాఁకు దెలియదు గాని దీనిని సాధింపఁగలవాఁడవు నీ వొకఁడవే. ఈ కీర్తి పొందఁగలవాఁడవు నీ వొక్కఁడవే. మఱియొకరీ కార్యము చేయను లేరు, కీర్తిని సంపాదింపను లేరు. కాని నీవిట్లు చేయుటనాకుఁ గీర్తికరము గాదు.

క. బలములతో నిచటికి రఘు, కులతిలకుఁడు వచ్చి కలనఁ♦గూల్చి దశాస్యున్
గెలు పొంది నన్నుఁ దనపురి, కలవునఁ గొనిచనిన నాకు♦యశ మది గూర్చున్.

అర్థములు. కలనన్=యుద్ధమున; అలవునన్=బలములచే, నాకు=వీర్యశుల్కనగు నాకు వీరుఁడుగా నుండువాఁడుగదా నా కుమార్తెకు మగఁడు అని తండ్రి చాటించెను.

తాత్పర్యము

అట్లైన నీ కేది కీర్తికర మందువా? రామచంద్రమూర్తి సేనలతో నిచటికివచ్చి యుద్ధమందుఁ దనబల పరాక్రమములు జూపి రావణుఁ జంపి నన్ను నయోధ్యకు

దీసికొనిపోయెనా, యది నాకు గీర్తికరము. అప్పుడు నేను వీరపత్నియను బిరుద మునకుదగిన దాన నగుదును. ఇది రామునకు సాధ్యముగానీ కాకపోనీ, ఆయనకుఁ గీర్తికరముకానీ కాకపోనీ మఱి యే యుపాయ మైనను నాకుఁగీర్తికరము గాదు. కావున నే నంగీకరింపను.

పరమభక్తులు, ప్రపన్నులు భగవంతుఁడు స్వయముగ వచ్చి తమ్ముఁబిలిచి కొని పోవఁ గోరుదురు గాని దూతలచేఁ బిలిపించుకొనుట కూడ సహింపరు. "ఏత ద్దేహావసానే మాం తత్పాదం ప్రాపయ స్వయమ్" అనియే వారు కోరుదురు. అట్లు గాదేని మహారాజు నాశ్రయించుట, వాని భృత్యు నాశ్రయించుట రెండు సమానము లగును. అది రాజునకు, వాని యాశ్రితునకు యిరువురకు నవమాన కరమె.

క. ప్రాకటశితనారాచా, నీకంబున లంకఁ జలిపి•నీఱుగఁ గడిమిన్
  గైకొని న న్నేగినచోఁ, గాకుత్థ్సున కదియె తగిన•కార్యము చుమ్మీ. ౯౯

అర్థములు. ప్రాకట శితనారాచానీకంబునన్=ప్రసిద్ధములై, పదును గలిగిన బాణముల గుంపులచే; నీఱుగన్=భస్మముగ; కడిమిన్=బలముచే; కాకుత్థ్స నకున్=దేవతలకుఁ దోడ్పై రాక్షసుల వధించి కీర్తి సంపాదించిన కకుత్థ్సుని వంశ మునఁ బుట్టినవానికి.

తాత్పర్యము

నేను జెప్పిన యుపాయము కీర్తికరము నాకు మాత్రమే కాదు. ప్రసిద్ధము లైన వాఁడి ములుకులచే లంకను భస్మము చేసి తన బలమున నన్నుఁదీసికొని పోయె నేని దనకుఁ, దన వంశమునకుఁ గూడఁ గీర్తికరము. కావున నా నిమిత్తమై గాకున్నఁ దన నిమిత్తమై యైన నేను జెప్పినట్లు చేయవలెను.

దీనివలన భక్తిప్రపత్తుల శ్రేష్ఠత్వము స్థాపింపఁ బడెను. ఉపాయము గొప్ప దైన నుపేయము గొప్పదే. ఉపేయము గొప్పదైనపుడు దాని సాధించు నుపా యము గొప్పదిగానే యుండవలెను. ఉపేయము రామచంద్రమూర్తి, దాని సాధన ముపాయము, రామచంద్రమూర్తియే వచ్చుట.

తే. పరమశూరుండు రాముండు • బవరమందు
  నతని మగఁటిమి కనురూప • మైనదాని
  యోజన యొనర్చి చెప్పుమీ • యోజమీఱ
  వనచరకులావతంస! నీ వనుచు నడుగ. ౧౦౦

అర్థములు. బవరమందున్=యుద్ధమందు. అనురూపము=తగినది.

తాత్పర్యము

ఆంజనేయా! యిది యోఁదువాన నైన నా యాలోచన విధము; నీవును రామ చంద్రుఁడు యుద్ధమందు మిగుల శూరుఁడు; అటువంటి వానికిఁ దగిన చర్య యేదియో యాలోచించి చెప్పుము అని యడుగఁగా.

క. ఘనహితము హేతుయుతమును, ననఘార్థోపహిత మైన•యవనిజసూ క్తుల్
విని యంజనవరతనయుం, డనియెన్ వక్తవ్య శేష•మాదట నిట్టుల్. ౧౫౧

అర్థములు. ఘనహితము=గొప్పమేలు కూర్చునది, హేతుయుతము=యుక్తి యుక్తము, అనఘ=దోషరహితమైన, అర్థ+ఉపహితము=అర్థముతోఁ గూడినది. వక్తవ్య శేషము=చెప్పవలసిన దానిలో నంత వఱకుఁ జెప్పఁగా మిగిలినది.

తాత్పర్యము

మిగుల హితమైనవి, యుక్తియుక్తమైనవి, నిర్దోషమైనవి, ప్రయోజనముతోఁ గూడినవి యగు సీతాదేవి చెప్పిన మంచి మాటలను విని, హనుమంతుఁడు చెప్ప వలసిన దానిలో మిగిలిన దాని నిట్లు చెప్పెను.

—• హనుమంతుఁడు సీతాదేవి సందేహము దీర్చుట. •—

ఉ. దేవి! కపీంద్రభల్లుకత•తి౹ప్రభువర్యుఁడు నిశ్చయించె సు
గ్రీవుఁడు నీ నిమిత్తము ప్ర•కృష్టబలంబులతోడఁ దోడ్పడం
గా, వెస వత్తు రాతనికిఁ • గైవసమై యసమాన విక్రముల్
దేవనిభుల్ మనోజవులు•దిగ్గగనాటులు శత్రుమర్దనుల్, ౧౫౨

అర్థములు. కపీంద్ర=వానర శ్రేష్ఠుల యొక్కయు. భల్లుకతతి = ఎలుగుల సమూహము యొక్కయు, ప్రభువర్యుఁడు=గొప్పప్రభువు, ప్రకృష్ట బలంబుల తోడన్=గొప్ప సేనలతో, కైవసమై=స్వాధీనపడి, మనోజవులు = మనసువంటి వేగము గలవారు. దిక్+గగనాటులు=దిక్కులయందు, నాకాశమందు సంచ రించువారు.

తాత్పర్యము

దేవి! వానరభల్లూకరా జగు సుగ్రీవుఁడు నీ మిత్తమై గొప్ప సేనలతో రామచంద్రమూర్తికి సహాయపడ నిశ్చయించినాఁడు. ఆయనకు లోఁబడినవారై యసమానపరాక్రమము గలవారును, దేవతలతో సమానులును, మనోవేగముగల వారును, దిక్కులందు నాకాశమందు, సంచరించువారును, శత్రుసంహారకులు నగు వారు శీఘ్రముగ వత్తురు.

క. ఎంత గడుసుఁబని నైన ర,నంతయు వెంత లేక సలుప•నగు వారలు వి
క్రాంతులు సాబ్ధిధరావని, గంతున వలగొనెడివారు•గగనాధ్వగులై. ౧౫౩

అర్థములు. గడుసుఁబని=కఠినకార్యము. స+అబ్ధి=సముద్రముతోను, ధర= పర్వతములతోను గూడిన, అవనిన్=భూమిని, గంతునన్=దాఁటున, వలగొనెడి వారు=ప్రదక్షిణించువారు; గగనాధ్వగులై=ఆకాశమార్గమున సంచరించువారై.

తాత్పర్యము

వా రెటువంటివారని తలఁచితివో యేమో, ఎంతకష్టమైన పనియైనను రవంత

యైన బడలిక లేక చేయఁగలవారు, పరాక్రమము గలవారు, సముద్రముతోను బర్వతములతోను గూడిన భూమండలమును ఆకాశమార్గమునఁ బ్రదక్షిణము చేసి రాఁ గలవారు. అట్టివారి కీ సముద్రము దాఁటుట యెంత కార్యము.

క. నాకంటె గొప్పవారును, నాకున్ సరివారుఁ గలరు•నగచరు లచటన్
నాకంటె హీనుఁ డొకఁడేన్, ఛ్మాకన్యా! లేఁడు తీక్ష్ణ•కరసుతు నొద్దన్. ౯౪౮

తాత్పర్యము

వానరులలో నముద్రము దాఁటగలవాఁడు నేనొకఁడనని తలఁచితివి. అది పొరపాటు సుగ్రీవు నొద్ద నా కంటె గొప్ప వారును; నాకు సమానులు నగువారు గలరే కాని నా కంటెఁ దక్కువ వాఁ డగు వ్యక్తి యొకఁడైన లేఁడు. వారీ ప్రక్క రాలేదు. కనుక నిన్నుఁ జూడలేదు. నే నీ ప్రక్క వచ్చితిని. నా పుణ్యము కొలఁది చూచితిని. ఈ మాత్రమున వానరుల యందఱిలో నేనే మొనగాఁ డని యెట్లు నిశ్చయించితివి.

క. నేనే నినుఁ గాంచితి నఁట, యా నిస్తులబలుల నేమి•యనవలయు నోకో
మానవపతి భూరిగుణా,హీనులఁ బంపండు పంపు•నితరుల మొదలన్. ౯౪౯

అర్థములు. భూరిగుణుహీనులన్=గొప్ప గుణములచే గొప్పయగు వారిని, ఇతరులన్=గుణహీనులను.

తాత్పర్యము

వానర వీరుల యందఱిలోఁ గనిష్ఠుఁడ నగు బక్క వ్యక్తిని నేనే నిన్నుఁ జూడఁ గలిగితి నట. ఇఁక నసమాన బలు లగు వారి నే మనవలయును, రాజనీతి వినుము. నీకుఁ దెలియనిది గాదు. రాజు శత్రువుల యొద్దకుఁ బంపునపుడు గుణ హీనులను దొలుతఁ బంపును గాని, గుణోత్తములను మొదటఁ బంపఁడు. ఏల? వా డక్కడఁ జిక్కుపడె నేని తనకు బలము తగ్గును. కావున నందఱిలో హీనుఁడ నగుటచేతనే సుగ్రీవుఁడు నన్నుఁ బంపెను గాని యుత్తముఁ డగుటచేఁ గాదు.

ఇది యుక్తియుక్తమైనను సత్యము మాత్రము గాదు. అయినను నిట్టి యసత్యమసత్యముగాదు, ఇందు సీతాదేవికి ధైర్యము చెప్పి జీవింపఁ జేయవలయు నను సదుద్దేశముగలదుగాని దురుద్దేశములేదు. కావున నసత్యదోషము లేదు. పుణ్యాపాపములు భావాధీనములు. అటుగాక సముద్రలంఘనము మాత్రమే సీత యుద్దేశ మగునేని నిది సత్యమే. ఆ మెసందేహము సముద్రము దాఁటి యెవ్వరు రాఁగల రనియే కదా. బలమున హనుమంతు డెక్కువైనను, వేగమున నంగద నీలాదులు సమానులే.

సీ. కావున నీవు శోకంబు మానుము దల్లి! దుఃఖకాలం బెల్లఁ•దొలఁగిపోయె
నిదె పోయి నేఁ జెప్ప•ముదితులై క్రోఁతులు, వచ్చెదరొక గంతు•వైచి యిటకు
నా వీఁపుపై నెక్కి•భూవిభుల్ శశిభాస్క,రులపోల్కి నీ మ్రోల•నిలుచువార
లిట వచ్చి యీలంక•నెల్లసాయకములఁ, దుత్తుమురుగఁ బోవఁ•ద్రుంచువారు

ఆ రామచంద్రవిభుఁడు•రణరంగమం దిందు, సబలుఁ బంక్తికంఠు•సంహరించి
నిన్నుఁదోడుకొనుచు•నెమ్మి నయోధ్యకుఁ, బోవువాఁడు పువ్వుఁ•బోణి నిజము.

అర్థములు. ముదితులు=సంతోషించిన వారు, పాయకములన్=బాణములచే.

తాత్పర్యము

ఈ కారణముచే నీవు రామలక్ష్మణు లెట్లు రాఁగల రను సందేహముగాని, రారను శోకముగాని వదలుము. నీ దుఃఖకాలము పోయినది. నేనుబోయి చెప్పఁగానే వానరు లొక గంతునైచి సంతోషముతో నిటకు వత్తురు. రామలక్ష్మణులు సూర్య చంద్రులవలెనా వీఁపుపై నెక్కివచ్చి నీ యెదుట నిలువఁ బడుదురు. ఇచ్చటికి వచ్చి బాణములచే నీ లంక నంతయు పొడిపొడిగాఁ జేయుదురు. యుద్ధమందు రామచంద్రమూర్తి రావణుని సేనలతోడఁ జంపి నిన్నయోధ్యకుఁ దోడుకొనిపోవును.

క. కాలమున కెదురు చూడుము, బాలా! తూర్ణముగ రాము•వహ్నివలెఁ గనం
జాలెద వాతఁడు నీ వ్యథఁ, బాలార్చును నసురుగతిని•బరికింపు మింకన్. ౯౪౭

అర్థములు. తూర్ణముగన్=త్వరగా; వహ్నివలెన్=అగ్నివలె, పాలార్చును నశింపఁజేయును.

తాత్పర్యము

అమ్మా! మే మెప్పుడు వత్తుమా యని మా రాక కెదురు చూచుచుందుము. ఈలోపల నీ వేమియు సాహసము చేయఁబోకుము. రామచంద్రమూర్తిని మండుచున్న యగ్నిహోత్రమువలె నిందుఁ జూడఁగలవు. ఆయన నీ దుఃఖము మాపును. రాక్షసుఁ డిఁక నేగతి పట్టునో చూడుము.

చ. కొడుకులతోడ బంధుజన•కోటులతోడ నమాత్యపంక్తితోఁ
గడచిన రాక్షసేశ్వరుఁడు•క్ష్మాస్థలిఁ ద్రెళ్ళఁగ నీవ చూచి నీ
యుడుగని దుఃఖసాగరము•నొడ్డును జేరి శశాంకు రోహిణీ
జలజదళాక్షి చందమున•సమ్మద మారఁగఁ గూడె దంగనా! ౯౪౮

అర్థములు. అమాత్యపంక్తితోన్=మంత్రుల సమూహముతో, కడచని=చచ్చి.

తాత్పర్యము

అమ్మా! కొడుకులతోఁ జుట్టములతో మంత్రులతో జచ్చి రావణుఁడు నేల బడఁగా నీవే చూచి నీ దుఃఖసముద్రముయొక్క యొడ్డును జేరఁగలవు, మఱియు రోహిణి చంద్రునిఁగూడినట్లు నీ మగనిని నీవు సంతోషముతోఁ గూడుకొనఁగలవు

సీ. అని యిటు లూరార్చి•యవనిజఁ గనుఁగొని, పయనింప నాయత్త•పడుచు వెండి
పలుకు నా పావని•పల్లటిల్లకు మమ్మ, త్వరగానె కాంచెదు•దాశరథుల
శరచాపకరుల నీ•పురమువాకిట నఖ, దంష్ట్రాయుధులు రణ•దక్షులైన
శాఖామృగంబులు•శైలాంబు సములఁ, సద్భక్తిఁగొలువంగ•జలదవేణి!

ఆ. నిన్నుఁ దలఁచి తలఁచి•కన్ను మొగుడ్పక, యున్నవాఁడు రాముఁ•డుమ్మలికను
దుఃఖపడకు మమ్మ!•దురపిల కో యమ్మ, తాళవమ్మ! వెతలు•దలఁగు నమ్మ.

అర్థములు. ఆయత్తపడుచున్=సిద్ధపడుచు; పల్లటిల్లకుము=తెల్లఁబోకుము; శాఖామృగంబులు=వానరులు; శైలాంబుదసముల్ = పర్వతములతో మేఘములతో సమానమైనవారు, ఉమ్మలికను=శోకముచేత; దురపిల్లకుము=తపింపకుము; జలదవేణి=మేఘమువలె నల్లనైన జడ గలదానా.

## తాత్పర్యము

ఈ ప్రకారము సమాధాన పఱిచి ప్రయాణమునకు సిద్ధపడుచు సీతాదేవిని జూచి యామెకు మఱింత ధైర్యము వచ్చుటకై హనుమంతుఁ డిట్లనియె. అమ్మా! నీవు తెల్లఁబోకుము. విల్లు బాణములు ధరించిన రామలక్ష్మణులను నీ పురము వాకిట ద్వరలోనే, గోళ్ళు కోఱ లాయుధములుగఁ గలిగి యుద్ధమందు సమర్థులై పర్వతములవలె నెత్తై మేఘములవలె లావైన వానరులతోడఁ గూడి యుండఁగా జూడఁ గలవు. రామచంద్రమూర్తి నిన్నుఁ దలఁచి తలఁచి వ్యసనముచే నిద్దుర లేక యున్నాఁడు. కావున నీవు సంతాపము పడకుము. రావణు భయము వదలుము.

క. రామునికంటె విశిష్టుఁడు, భూమిజ! యెవఁ డమ్మ లోక•ముల నెం దేనిన్?
సౌమిత్రికి సముఁ డెవ్వఁడు? భామా! నీ కాశ్రయులు న•వహ్న్యనిలసముల్.

అర్థములు. విశిష్టుఁడు=గొప్పవాఁడు, వహ్ని+అనిలసముల్=అగ్ని వాయువులకు సమానులు.

## తాత్పర్యము

ఎందైనను, ఏ విషయ మందైనను రామచంద్రమూర్తి కంటె గొప్పవాఁ డెవఁడు? లక్ష్మణునకు సమానుఁ డెవ్వఁడు? వారిరువురు అగ్నివాయువుల వంటి వారు. లోకమున దహన కర్మమందు నగ్నిని మించినది లేదు. రూపమే లేకుండఁ జేయును. బలమునందు వాయువుతో సమానమైనది లేదు. ఎట్టి దానినైన బోర్లఁ దోచి తుత్తుమురుచేయఁ గలదు. రెండు నేకమైనపుడు శత్రునిశ్శేషము చేయఁ గలవు. ఈ యిరువురు నీకు సహాయులు. ఇఁక నీకు వచ్చిన భయమేమి?

క. రాముని నేఁ జూచుటయే, భూమిసుతా! యడ్డు; నేను•బోయి వచింపన్
భీమకపిస్తోమంబులతో మహిపుఁడు వచ్చి యిటకుఁ•దున్మాడు నరిన్. ౯౯౧

## తాత్పర్యము

నేను బోయి రామచంద్రమూర్తిని జూచుటే యాలస్యము నేను బోయి చెప్పఁగానే భయంకర వానర సమూహముతో నాయన బయలుదేఱివచ్చి శత్రు సంహారము చేయును.

క. ఈ రక్షోగణరక్షిత, ధారిణి వెత లందఁగలదు•తల్లి! చిరముగా
స్వారాజును శచి గూడిన, తీరునఁ బతిఁ గూడెదీవు•ధృతి గొను మాత్మన్.

అర్థములు. ఈ రక్షోగణరక్షిత ధారిణి=రాక్షససమూహములచే గాపాడఁబడుచున్న యీ భూమి, ఈ యనునది సమీప పదార్థమును దెలుపును; చిరముగా=శాశ్వతముగా; స్వారాజును=స్వర్ + రాజును=ఇంద్రుని; ధృతి=ధైర్యము.

## తాత్పర్యము

రాక్షసులు కాపాడుచున్న యీ లంక శాశ్వతముగా దుఃఖముల పాలుకాఁగలదు. ఇంద్రుని శచీదేవి కలిసికొన్నట్లు నీవును రామచంద్రమూర్తిని గలిసికోఁగలవు. ధైర్యము వహింపుము. భయపడవలదు.

♦ ౪౦-వ సర్గము. సీతాదేవి శ్రీరాము నుద్దేశించి హనుమంతునితోఁ బలుకుట ♦

సీ. అనవుడుఁ బవమాన♦తనయుని గనుగొని, ధరణిజ యిట్లనుఁ♦గరముఁ బ్రీతి
నీ ప్రియసూక్తులు♦నిండుముదం బిచ్చె, వాడిన మడికిని ♦ వానయట్టు
శోకంబుచేఁ జాల శుష్కించి యుండు నా, యవయవంబులచేత ♦ నాసదీర
నెట్టు లాత్మేశు నే♦స్పృశియింపఁ గలనో నీ,వట్లు సేయుము వఱు♦వట్లువోలఁగఁ
గాకిని గోపాన♦నేకాక్షముగఁ జేసి, నట్టివార్తయు నర♦ణ్యమున నాదు

ఆ. గండభాగమునను♦గరఁగిపోఁ దిలకఁబు, స్వేదబిందువులను♦జిత్రరీతిఁ
మణిశిలను నొకంట♦మమతమీఱఁగ నీవు, తిలకముంచుటయును♦దలఁపుమనుము

అర్థములు. వఱువట్లు=నట్లు+వట్లు=వఱువట్లు, మిక్కిలి శుష్కించుట,ఏకాక్షము గన్=ఒక కన్నుగలదానిగఁ, గండభాగమునను=చెక్కిలి యందు. (౨) గండశైలము ప్రక్కనున్నప్పుడు, స్వేదబిందువులను=చెమట బొట్లను.

## తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు చెప్పఁగా నాయనను జూచి సీతాదేవి మిగులఁ బ్రీతితో నిట్లనియె, వాడిపోవుచున్న మడిలోని పైరునకు వాన మఱలఁ బ్రాణము గలిగించి పచ్చగాఁ జేసినట్లు చావనున్న నాకు నీ ప్రియవాక్కులు మఱలఁ బ్రాణమును గలిగించెను. బ్రదికితిని, శోకముచే మిక్కిలి శుష్కించి యుండు నీ యవయవములచే నా దుఃఖమంతయు సమయునట్లు నామగని నేనెట్లు కౌగలింపగలనో నీవట్లు చేయుము. ఇదివఱకు నీకు నిచ్చిన గుర్తుగాక మఱియొక రహస్యమైన గుర్తు చెప్పెద వినుము. కోపముచేఁ గాకిని నొంటికంటిదానిగఁ జేసిన విషయముగాక యరణ్యములందు సంచరించునపుడు గండశైలమునందుఁ జెమటకు నా ముఖమున జుక్కబొట్టు కరఁగిపోగాఁ బాడుముఖముతో నుండు నాకుఁ దానే ప్రేమతో మణిశిలను జాఁది తిలకముంచెను. అదికూడ స్మరింపుమనుము.

దీనివలన ముత్తైదువులు కొంచెము నేపైనఁ బాడు ముఖముతో నుండరాదనియు, నట్టి పాడు ముఖమును బురుషులు చూడరా దనియు నేర్పడుచున్నది. తిలకము లేని ముఖము శ్మశానము వంటిది. ఇందు నీసము పంచపాది.

క. వరుణేంద్రోపమవిక్రమ, పరుఁడవు నీ యట్టిఁ డాత్మ•పత్నిని దైత్యుల్
హరియించి బాధ పెట్టఁగఁ, బరునట్టుల యూరకుంట•భావ్యం బగునే? ౯౯౪

అర్థములు. వరుణేంద్రోపమ విక్రమ పరుఁడవు=వరుణుని, యింద్రుని పరాక్రమము కంటె గొప్ప పరాక్రమము గలవాఁడవు. వా రిరువురు కలిసినను నీ కీడు రారు. అట్టిఁడు=అట్టివాఁడు, ఆత్మపత్నిని=తన భార్యను, మఱి యెవతనో కాదు. తాను భరింపఁ బూఁటపడిన యిల్లాలిని; ఆమె లేకుండిన నగ్నిహోత్రముకూడ లేకుండఁ బోవుదానిని, దైత్యుల్=రాక్షసులు; మఱి యెవ్వరో బంధువులు పిలుచుకొని పోలేదు. హరియించి=దొంగతనముగా నెత్తికొని, నీ సమ్మతి మీఁదఁ గాదు. బాధ పెట్టఁగన్=ఎత్తికొనిపోవుట సుఖపెట్టుటకుఁ గాదు. బాధపెట్టుటకు, పరునట్టుల=అన్యునివలె; తేరకానివలె; శత్రువునలెనే; ఒక స్త్రీ బాధపడునపుడు పరాయి మగవాఁడైనను సాహాయ్యపడవలసినవాఁడే శత్రువు మాత్రమే సహాయపడఁడు.

తాత్పర్యము

పరాక్రమమందు ఇంద్రవరుణు లిద్ద ఱొకటిగా వచ్చినను నీకు సమానులు గారు. అటువంటి పరాక్రమము గల నీవు నీ భార్యను రాక్షసులు నీ సమ్మతి లేకుండ దొంగతనముగా హరించి బాధపెట్టుచుండఁగా నీవు శత్రువువలె నూరకుండుట ప్రశస్త కార్యమా?

ఉ. దాఁచితి నీరజంబుమణి•దాశరథీ! యిది నీ మనోంబుజం
బాఁచికొనంగఁ జాలుట మ•హాత్మ! భవద్విరహానలంబు న
న్నాఁచెడివేళ ని న్గనిన•కైవడి దీనిని గాంచి పొంగుదున్
పైఁచుట దోఁప దింక వెత•సముద్రమునం దుసు రుగ్గఁబట్టుచున్. ౯౯౫

అర్థములు. నీరజంబుమణి=నే నిప్పుడు నీకుఁ బంపిన చూడారత్నము గనులలో బాలలోఁ బుట్టినది గాదు, సముద్రమున జలములందుఁ గౌస్తుభమువలె బుట్టినది. మనోంబుజంబు=మనస్సనెడి కమలము, నీరజము- ఈ మణి నీరజము కావునఁ బరస్పరము సోదరన్యాయము కలదు, కావున నీ హృదయకమలమును నిది యాకర్షింపఁగలదు. ఆఁచికొనంగనె=ఆకర్షించుకొన; ఉసురు=ప్రాణము; ఉగ్గఁబట్టుచున్=బిగఁబట్టుచు; దాశరథీ=నీ తండ్రిని దశరథునైన స్మరింపుము. ఆయన బలపౌరుషములు స్మరించి యాయన కడుపునఁబుట్టిన నీ వెట్టులు ప్రవర్తింపవలెనో యోజింపుము. భార్యయొక్క తుచ్ఛమైన కోరిక నిమిత్తమై తన ప్రాణము విడిచిన యాయన చర్య స్మరింపుము. అట్టి కోరిక నేను గోరలేదు. నీ పౌరుషమునకుఁ గీర్తికి హాని రాకుండ నా ప్రాణమును గాపాడుమని కదా నేను గోరుచున్నాను. నా మామగా రుండిన నన్నిట్లుపేక్షించి యుండునా? మహాత్మా= నీవు స్వభావమున మహాత్ముఁడవే. ఏల నా విషయమున మాత్రము క్షుద్రాత్ముఁడ వైతివి. భవద్విరహానలంబు=నిన్నెడఁబాయుట యనెడి యగ్ని.

## తాత్పర్యము

దశరథ రాజపుత్రా! నీ మనస్సు నిది యాకర్షింపఁజాలు శక్తి గలదికావున నీ నీటఁబుట్టిన మణిని నేను దాఁచియుంచితిని. ఇది నీ వియోగ మను నగ్ని నన్నుఁ గాలుచునపుడు నీటఁబుట్టినది కావున నీ చలువగుణము దీనియం దుంటచేనిప్పును నీళ్ళు చల్లార్చినట్లు నా విరహాగ్నిని నది చల్లార్చును దీనినిజూచి నిన్నుఁ జూచినట్లే పొంగుదును. గావున దీనిని జూడఁగానే విరహానలము శమించును. దీనిని గూడ నెడఁబాసితిని. ఇఁక నీదుఃఖసముద్రమునందు నేను ప్రాణము బిగఁబట్టఁగలనని తోఁపలేదు. అట్లైన నేల పంపితివందువా? ఇదివఱకు దీని దర్శనము నీ రూప మును స్మృతికిఁదెచ్చుచుండెను. ఇప్పు డిదేపోయి నిన్నుఁ బిలుచుకొని వచ్చునని నమ్మిపంపితిని. ఇది సముద్రమునఁ బుట్టినది కావున సముద్రమువలన బాధలేకుండ నన్ను రక్షించుచుండెను, ఇఁక నన్ను రక్షించువారెవరు? ఈ రత్నమును జూచి నపుడంతయు నీవు స్మరణమునకు వచ్చుటచే దీనిని దాఁచితినని చెప్పుటచేఁ జూచి నపు డంతయు భగవంతుని జ్ఞాపకముఁ దెచ్చు పతకముగాని మఱి యేదైన చిహ్నముగాని దేహమున ధరింపవలయునని సూచన. అది పోవుట ప్రాణము పోవుటతో సమానము. కావుననే శ్రీకోదండరామసేవక సమాజ సభ్యులు సీతా రామ లక్ష్మణ పతకమును సర్వదా ధరించుచున్నారు. సీతాదేవి సర్వాభరణ ములు వదలి దీనిని మాత్రము ప్రాణపదముగా దాఁచియుంచెను. దానిని గూడ రామార్పణము గావించి సర్వస్వ నిక్షేపము గావించిన దయ్యెను.

ఆ. పడఁగ రాని యట్టి • పాటులఁ బడుచును, వాకొనంగ రాని • వార్త వినుచు
గుండె జల్లు మనఁగఁ • గ్రూరరక్కసులలోఁ, నిన్నుఁ దలఁచి సైఁచి • యున్నదాన.

అర్థములు. వాకొనంగరాని= (౧) చెప్పరానంత నీచములైనవి. (౨) చెప్పరానన్ని సంఖ్య గలవి.

## తాత్పర్యము

ప్రాణి పడుటకు సాధ్యముగాని బాధ పడుచు నోటఁ జెప్పరాని మాటలు వినుచు గుండెలు జల్లు జల్లు మనుచుండ నీ దయలేని రాకాసులలోఁ జిక్కుకొనియు నీవు కలవుకదా భయమేమి యని నిన్ను స్మరించి సహించి యున్నదానను.

దేహము ధరించిన ఫలము భగవంతుని స్మరణమే. దేహము లేదేని భగవ త్స్మరణములేదు. భగవంతుని స్మరించినఁగాని భగవత్ప్రాప్తిలేదు, కావున భగవ త్ప్రాప్తికై దేహధారణము చేయవలయునుగాని మనమై విడువరాదు. దానినన్య ప్రాకృత విషయములందు వినియోగపెట్టనురాదు. కావున నీదేహము వదలి పోవు లోపలనే భగవత్ప్రాప్తి కలుగు నుపాయము చేసికొనవలయును.

చ. ఒకనెల యెట్లు లైన మని • యుండెద, నంతకు నీవు రానిచోఁ
ప్రకటముగాఁగఁ బ్రాణములు • పాయును, రావణుఁ జూచినంతటన్.

దకతకే లాడు గుండియలు • దైత్యుఁడు క్రూరుఁడు నాథ! నీ మనం
బకట! కరంగ దేని యది•యంతయు నా దురదృష్టమే చుమీ.

అర్థములు. మనియుండెదన్=బ్రతికి యుండెదను; అంతకున్=అంతకాలము వఱకు.

తాత్పర్యము

ఎంతకష్టమైనఁబడుచు నొక నెల బ్రదికియుండెదను. (౯౪౩ ప.) ఈ లోపల నీవు రానియెడల ప్రాణములు తమంతఁ దామే పోవును. నిలుప నాకు సాధ్యపడదు. ఆశయను త్రాళ్ళచేఁ గట్టి యుంచినాను. అది తెగిపోయెనా దానిని బిగఁబట్టు సాధనము లేదు. ప్రాణ మేల పోవునందువా రావణుఁ జూచిన మాత్రముననే నాప్రాణములు తల్లడిల్లును. వాఁడు మహా క్రూరుఁడు, ఇంత చెప్పినను ఇప్పటికిని నీ మనస్సు కరఁగదాయెనా యది నా పాప ఫలమె గాని నీ దోషముగాదు.

—• హనుమంతుఁడు మరలిపోవుటకు సీతాదేవిని సెల వడుగుట. •—

చ. అని కరుణంబుగా రమణు•నాడు మృగాయతనేత్రవాక్యముల్
విని పవమాననందనుఁడు•విన్ము సతీ! శపథంబుఁ జేసెదన్
వనజదళాయతాంబకుఁ డ•వశ్యము నీ వెతఁ బాపు, నెంతయున్
వనరెడి నిన్నుఁ బాసి, మగు•వా, యది చూచి కృశించుఁ దమ్ముఁడున్. ౯౯౮

అర్థములు. కరుణంబుగాన్=శోకముతో-శోకము గలుగునట్లు.

తాత్పర్యము

అని దుఃఖకరముగా మగనిని బలుకుచున్న సీతాదేవి వాక్యములు విని హనుమంతుఁ డిట్లనియె. అమ్మా! నేను ప్రమాణము చేసి చెప్పుచున్నాను. నా మాట నమ్ముము. రామచంద్రమూర్తి యవశ్యము నీకష్టములఁ దొలఁగించును. నిన్నుఁ బాసి యెంతయో దుఃఖించు చున్నాఁడు. ఆయన స్థితి చూచి లక్ష్మణుఁడును శుష్కించు చున్నాడు.

శా. ఎట్టెట్టో నినుఁ గంటి నిందు నింకఁ ద•ల్లీ! దుఃఖకాలంబు గా
డెట్టుం దప్పదు నిన్నుఁ జూచుతమి ధా•త్రీశాత్మజుల్ లంకకుం
బట్టన్ లగ్గలు రాక్షసాధముని దు•ష్కృన్ నీవ కన్నార రా
పట్టీ! చూచెదు పోను వాత్మవిభుతోఁ•బద్మాక్షి మీ పీటికిన్. ౯౯౯

అర్థములు. రాపట్టీ=రాచకూతురా. పట్టి శబ్దము బిడ్డ శబ్దము వంటిది గాని ఆఁడుబిడ్డ-మగబిడ్డ యన్నట్లు ఆఁడుపట్టి మగపట్టి యని ప్రయోగములు లేవు, సందర్భానుసారముగా నర్థము చేసికొనవలెను.

తాత్పర్యము

తల్లీ! యెంతో కష్టపడి నిన్ను నేనిందుఁ జూచితిని. ఇఁక నీవు యాచింపవలసి

నదిలేదు. నిన్నుఁ జూచు కోరికతో రాజకుమారులు లంకకువచ్చి కోటకు లగ్గలు పట్టి నీచరావణునిఁ జంపఁగా నీవే కన్నులారఁ జూచెదవు. ఇది తప్పదు. నీవు నీ మగనితో మీ యూరికిఁ బోఁగలవు.

ఉ. రాముఁ డెఱుంగు గుర్తొకటి•రాజసుతా! యిదు మంత్రె చాలు నా
భామిని మత్ప్రదత్తమణి•పావని! చాలెడిగుర్తు, తన్మణిన్
భూమివిభుండు చూచిన న•పోహముగా దెద నమ్ము నీ నడుల్
నా మరుదాత్మజుండు పయ•నం బయి నే నిఁకఁ బోయివత్తునే. ౧౦౦౦

తాత్పర్యము

రామచంద్రమూర్తి గుర్తింపగలఁ గుర్తొకటి యిమ్ము. అంతమాత్రము చాలును. తక్కిన కార్యములు నేను జేసెదను. అనిన హనుమా! నే నిచ్చిన మణి నిన్ను నమ్ము నట్లు చేయఁజాలినంత గుర్తు. దానిని జూడఁగానే నీవు నా యొద్దకు వచ్చితివని నేను దీని నిచ్చితి నని నమ్మును. అసత్యముగాదు. అని చెప్పఁగా హనుమంతుఁడు తల్లీ నే నిఁక పోయి రావచ్చునా? అనుజ్ఞ యిచ్చెదవా?

చ. అని నమితోత్తమాంగుఁ డయి•యంత ప్రణామము చేసి నిల్వ న
య్యనఘుని మేను పెంచుట మ•హాంబుధి దాఁటఁగ నుత్సహించుటల్
గని కనుదోయి బాష్పములు•గ్రమ్మ సగద్గదకంఠయై ధరా
తనయ ప్రభంజనాత్మభవు•దైన్యమునం గని పల్కె నీ గతిన్. ౧౦౦౧

అర్థములు. నమితోత్తమాంగుఁడు=వంచిన శిరస్సు గలవాఁడు.

తాత్పర్యము

ఇట్లు చెప్పి తనకుఁ దలవంచి నమస్కరించి నిల్వఁగా నా పుణ్యాత్ముఁడు దేహము పెంచుట - సముద్రముదాట నుత్సహించుట చూచి కన్నుల నీళ్ళు గ్రమ్మగా డగ్గుత్తికతో సీతాదేవి యాంజనేయునిఁజూచి వ్యసనముతో నిట్లనియె

హనుమంతుఁడు సీతాదేవిని తొలుతఁ జూచినపుడు నమస్కరింప లేదు. ఇపుడు నమస్కరించెను. ఏల? పురుషులు స్త్రీలకు నమస్కరింప వచ్చునా? పురుషులు తాము చూచిన స్త్రీల కందఱకు నమస్కరింపరాదు గాని,

స్త్రియో నమస్యా వృద్ధాశ్చ, వయసా పతిదేవతాః
దేవతా ప్రతిమాం దృష్ట్వా యతించైవ త్రిదండినమ్॥
నమస్కారం న కుర్యాచ్చే దుపవాసేన శుధ్యతి.

వయస్సున వృద్ధస్త్రీలు, పతిని దేవతలవలెఁ గొలుచు పతివ్రతలు తీరున నమస్కారమునకు నర్హులౌదురు. వీరిని, దేవతా ప్రతిమలను, త్రిదండ యతిని చూచినపుడు నమస్కరింప దోష మొకనాఁ డుపవాస ముండినఁ బోవును.

పాదములంటి మ్రొక్కుట యభివాదన మనఁబడును. చేతులు జోడించి మ్రొక్కుట నమస్కార మనఁబడును.

తొలుత సీతాదేవిని జూచినపుడీమె సీత యగునో కాదో తెలియదు. పతి దేవత యగునో, కాదో తెలియదు. వృద్ధయుఁగాదు. కావున నమస్కరింపలేదు.

దూత లక్షణములు.

నిసృష్టార్థో మితార్థశ్చ తథా సందేశ హారకః
కార్య ప్రేషతథా దూతో దూత్యశ్చాపి తథావిధాః.
ఉభయో ర్భావ మున్నీయ, స్వయం వదతి చోత్తరమ్.
సుశ్లిష్టం కురుతే కార్యం, నిసృష్టార్థస్తు సస్మృతః.
మితార్థభాషీ కార్యస్య; సిద్ధికారీ మితార్థకః
యావద్భాషిత సందేశ, హారః సందేశహారకః.

నిసృష్టార్థుఁడని, మితార్థుఁడని, సందేశహారుఁడని దూతలు మూఁడువిధములు. దూతికలునట్టులే. అందుల నుభయుల యభిప్రాయము దెలిసికొని ప్రత్యుత్తరములు తానే వారిభావ మనుసరించి సమయోచితముగ నిచ్చి కార్యము చక్కఁజేయువాఁడు నిసృష్టార్థుఁడు. మితార్థములు భాషించి కార్యము చక్కఁజేయువాఁడు మితార్థభాషి. కార్యమెట్టులైనఁగాని తన ప్రభువు చెప్పిన మాటలఁ జెప్పువాఁడు సందేశహారి. వీరిలో హనుమంతుఁడు నిసృష్టార్థుఁడు. రామసుగ్రీవులు చెప్పకున్నను సీతాదేవి ప్రశ్నల కన్నిటికి హనుమంతుఁడు తానే సమయోచితముగఁ బ్రత్యుత్తరములు చెప్పెను. రావణునకు నిల్లే చెప్పఁగలఁడు. హనుమంతుఁడిట్టి యుత్తమదూత కావుననే "ఆదిఁ బరోపకారపగులై చరియించిన యట్టి యాంజనేయాదులఁ బోలనైతి" నని నలుఁడు దుఃఖించెనని శృంగార నైషధమునఁ జెప్పఁబడెను. కాలమునుబట్టి చూచిన నలుఁడు ముందటివాఁడు. హనుమంతుఁడు వెనుకటివాఁడు కావున ఆది ననుట సరికాదు. కావ్యములం దిట్టివి దోషముగ నెన్నఁబడవు. అందు విషయము మాత్రము ప్రధానముగ గ్రహింపఁబడును గాని పూర్వాపర విచారము కావ్యకర్తలకును లేదు.

—• సీతాదేవి హనుమంతుఁడు క్రమ్మఱిపోవుటకు ననుమతించుట. •—

క. హనుమా? కుశలం బడిగితి, ననుమా! శ్రీరాము నతని•యనుజు సుమిత్రా
తనయు సహామాత్యుని నిన తనుజాతుని నందు నున్న•తక్కిన వారిన్. ౧౦౦-౨

తాత్పర్యము

ఆంజనేయా! రామచంద్రమూర్తిని, ఆయన తమ్ముని, లక్ష్మణుని,మంత్రుల తోడ నుండు సుగ్రీవుని, ఇంకను నచ్చట నున్న తక్కిన వారి నందఱను కుశల మడిగితి ననుము.

క. అన్నా! రాఘవుఁ డెట్టులు, నన్ను విపత్సాగరంబు•నం జెడకుండన్
జెన్నారఁ బ్రోచు నా గతి, మన్ననమెయిఁ బలుక వన్న!•మఱవకు మన్నా!

తా త్ప ర్య ము

అన్నా! ఆంజనేయా! నే నీ యాపత్సముద్రమున మునుఁగకుండ నెట్లు చెప్పిన రామచంద్రమూర్తి నన్ను రక్షించునో యట్లు చెప్పుము. అన్నా! మఱవకుము సుమా.

క. ఇన్నిచరాక్షసావళి, నన్ను భయము పఱుచు విధము•నానావ్యసనా
పన్నత నే గుందెడి గతి, విన్నప మొనరింపు నాదు•విభునకుఁ దండ్రీ! ౧౦౦౪

అర్థములు. నానావ్యసనాపన్నతన్=పలువిధములయిన దుఃఖముల యాపత్తుచే.

తా త్ప ర్య ము

తండ్రీ! యీ రాక్షస స్త్రీలు నన్ను భయపెట్టు విధము నానావిధములయిన దుఃఖములచే నేను బాధ పడుచుండు విధము నా మగనికి విన్నవింపుము.

ఇట్లు అంగీకరింపఁ బడినట్టి ప్రపన్నుండు సంసారములో, నుండునట్టి స్థితిని పిరాట్టికి రావణుని గృహమునందుండు అశోకవనమున నుండి చూపించినది. అదెట్లనిన, పిరాట్టి రావణసంబంధ మెట్లో ఈతనికి దేహసంబంధమును అట్టిదే. పిరాట్టికి ఏకాక్షి, ఏకకర్ణి మొదలగు రాక్షసస్త్రీ లెట్లో, ఈతనికి అహంకార మమకారములును అట్లే. పిరాట్టికి తనను పెరుమాళ్ళవద్దనుండి కొనిపోదలఁచిన మారీచుఁడు ఎట్లో, ఈతనికి విషయప్రావణ్యా మట్టిది. తర్జనభర్త్సనాదుల నొనర్చిన రాక్షస స్త్రీ సంబంధము పిరాట్టి కెట్టిదో, ఈతని కళత్రపుత్ర సంబంధ మట్టిదే. పిరాట్టికి ఆంజనేయులవారి సంబంధ మెట్టిదో, ఈతనికి ఆచార్యుని దర్శనమును అట్టిదే. పిరాట్టికి శ్రీ యాంజనేయుల వా రొనర్చిన రామగుణకీర్తన మెట్టిదో, ఈతనికి ఆచార్యుండు సాయించిన గురుపరంపరయును నట్టిదే, పిరాట్టికి ఆంజనేయుఁ డిచ్చిన యుంగర మెట్టిదో, ఈతనికి ఆచార్యుండు ఉపదేశించిన తిరుమంత్ర మట్టిది. పిరాట్టి రామచంద్రుని యుంగరమునుజూచి దానిమూలముగ సుందరమగు వ్రేలిని, దానిమూలముగ బాహువులను వాటిమూలముగ దివ్యమంగళ విగ్రహమును అనుసంధించుకొని, ప్రాణములను ధరించియున్నట్లు శ్రీ వైష్ణవుండును, ఆచార్యుండు కృపచేసిన తిరుమంత్రము యొక్క యర్థమును అనుసంధించుకొని ధరించియుండును. పిరాట్టి లక్ష్మణస్వామితో పరుషముగ మాట్లాడిన మాట ఈమెను పెరుమాళ్ళను విడిచి, దూరముగా నుండునట్లు చేసిన చందమున, ఈతం డొనర్చినట్టి 'భాగవతాపచారము' ఈతనిని "క్షిపామి" "నక్షమామి" అను భగవన్నిగ్రహమునకు విషయముగాఁ జేసి పెరుమాళ్ళనుండి దూరముగా నుండునట్లు చేసినది. పిరాట్టికి విరోధు లగు రావణాదులను వధించి పెరుమాళ్ళు ఆమెను గొనిపోవుట యెట్లో, అట్లే యీతనికి విరోధి యగు ప్రకృతి సంబంధములు బోఁగొట్టి సర్వేశ్వరుండు ఈతనిని పరమపదమునకుఁ గొనిపోయి నిత్యముక్తులతోఁ బాటు నిత్యకైంకర్యమున నుపయోగపఱుచుకొనును. ఈ పది

వార్తలను అనుష్ఠానపర్యంతము గలిగియున్నట్టి శ్రీ వైష్ణవుం డుండునట్టి తావే పరమపదము. (వార్తమాలా -౨౦౩ పుట.)

—♦ ౫౧-వ సర్గము. హనుమంతుఁడు కార్యశేషం బాలోచించుట. ♦—

చ. శుభ మగు గాక ప్రోవ నరి♦సూదన! యం చనఁ బొంగుచున్ మరు
త్ప్రభవుఁ డుదగ్దిశాగమన♦తత్పరుఁ డై యటువాసి పోయి నే
నిభనిభయానఁ గంటి, నిఁక ♦ నించుక కార్యము తక్కెఁ, నీ పురీ
విభు నెడ మూఁ డుపాయములు♦వీడి చతుర్థమె యుక్త మారయన్. ౧౦౦౪

అర్థములు. అరిసూదనా=శత్రుసంహారకుఁడా! ఈ దీవనవలన హనుమంతుఁడు రాక్షసుల జయింపఁగలిగెను. నీకు శుభమగుఁగాక ప్రోవన్=అనుటచే సముద్ర మందు వచ్చునపుడు కలిగిన విఘ్నములు మఱలఁ బోవునపుడు రాక తొలఁగి నవి. పొంగుచున్-సీత దీవించినది, ఇఁక నాకేమి భయ మని సంతోషించిన వాఁడై-మరుత్+ప్రభవుఁడు=గాలి కుమారుఁడు, ఉదక్+దిశా+గమన తత్ప రుఁడై=ఉత్తరదిక్కుగాఁ బ్రయాణమై పోవ నాసక్తిగలవాఁడై, ఇభనిభయానన్= ఏనుఁగు నడకవంటి నడకగల సీతాదేవిని, ఇంచుకకార్యము = కొంచెపుఁబనియొ, తక్కెన్=మిగిలియున్నది. సుగ్రీవుఁడు సీతను జూడుఁడు, లంకను వెదకుఁడు, అను రెండు పనులలో నొకటి సీతను వెదకుట. ఆ ముఖ్యమైన పని ముగిసినది. లంకఁ జూచుట నిలువ యున్నది. అదియును రాత్రి చూచినను రాక్షసుల బలాబలములు రావణు నభిప్రాయమెట్లున్నది యెఱుఁగవలసి యున్నది. ఆంజనేయా! లంకను జూచితివా యనినఁ జూచితిని మిద్దెలు మేడలు బాగున్న వనియా చెప్పుదును?. రావణు నభిప్రాయ మే మనిన నేను జూచినపుడు నిద్రపోవుచుండెను ఆవల నాత నితో మాట్లాడలేదని చెప్పుదునా? కావున రాక్షసుల బలాబలము రావణు నభిప్రాయము దెలిసికొనుట యను కొంచెము కార్యము నిలువ యున్నదనెను.

## తాత్పర్యము

శత్రుసంహారకా! నీకు మార్గమందు శుభమగుఁగాక. విఘ్నములు గలుగ కుండును గాక; పోయి రమ్మనిన సీమె దయకుఁ బాత్రుఁడ నైతిని, నాకేమి భయ మని హనుమంతుఁ డుత్తరముగాఁ బ్రయాణమై పోవఁదలఁచి కొంచెము దూరము చాటుగాఁబోయి యిట్లు లాలోచించెను. సుగ్రీవుఁడు చెప్పిన పనులలో సీతాదేవిని గనుట యను నది ముగిసినది. రెండవది లంకాశోధనము. రాత్రివేళఁ జక్కఁగాఁ జూచిన వాఁడఁగాను. రాక్షసు లేమాత్రము బలవంతులో రావణు నభిప్రాయ మేదో తెలియలేదు. ఈ కొంచెపుఁబని నిలువ యున్నది. ఇది చేయుటకు సామ దాన భేదములు రావణు విషయమున నిష్ప్రయోజనములు. నాలుగవది దండో పాయమె తగినది. ఏలయంటివేని.

ఉ. సామము మేలు గాదు దనుజప్రకరంబుల పట్ల, దాన ము
ద్దామధనాఢ్యులందు ఫలదంబును గా, దిఁక భూరివిక్రమో
ద్దాము లభేదసాధ్యులు గదా యటుగానఁ బరాక్రమం బొకం
డేమెయిఁ జూడ యుక్త మని యెంచెద బ్రస్తుత కార్యభంగికిన్. ౧౦౦౬

అర్థములు. ఉద్దామ ధనాఢ్యులందు=అధిక ధనముగల వారియందు, ఫలదంబు=ఫలమిచ్చునది, భూరి విక్రమోద్దాములు=అతిశయించిన పరాక్రమముచే గొప్పవారు, అభేద సాధ్యులు=భేదముచే సాధింప రానివారు, ఏమెయిన్=ఏ విధముగ, ఇప్పటి కార్యభంగికిన్=ఇప్పటి కార్యవిధమునకు.

తాత్పర్యము

రాక్షసులు తమోగుణము విశేషముగఁ గలవారు. అట్టివారు మంచి మాటలకు, ధర్మవాక్య శ్రవణములకు సాధువుల వలె లోపడువారు గారు. దానమున వశపఱచి కొందమనిన వారి యొద్దనే విశేషించి ధన మున్నది. ఇట్టి వారు ధనమునకు వశపడరు. అందఱు పరాక్రమ వంతులు. వీరిలో భేదోపాయము సాధ్యము గాదు. ఇఁక నాలుగవది యగు దండోపాయమే యిప్పటి కార్యస్థితినిబట్టి చూడఁ దగి యున్నది.

'అనిత్యో విజయో యస్మాద్దృశ్యతే యుధ్యమానయోః
పరాజయశ్చ సంగ్రామే తస్మాద్యుద్ధం విసర్జయేత్. మనువు.

గీ. కలహమున లక్ష్మిఁ గావించుఁ బ్రాణహాని యును జేయు నింత నిక్కువంబు
పలువు రొకని కోడి పాఱుట బల్లిదు, లనద చేత జెడుటయును ఘటించు.

క. జయమగు నోడుదు మను నిశ్చయ మొక్కఁడు లేదువినుము సమరమునఁబరా
జయము మరణంబుకంటె హృ,దయపుట భేదనము సేయుఁ దథ్యం బనఘా.

ఈ కారణముచే యుద్ధము మానుదుమా యనిన సీతాదేవి రామచంద్రునితోఁ జేర్చుటెట్లు? యుద్ధమునందుఁ బరాజయము వచ్చినఁ గార్యము చెడునేమో. ముందు రామచంద్రమూర్తి, వెనుక సీతాదేవి గాచు చుండఁగా నాకుఁ బరాజయమెట్లు రాఁగలదు? 'యత్ర రామో భయం నాత్ర నాస్తి తత్ర పరాభవ' యనుట యసత్య వాక్యమా? వారి సాహాయ్యము కలదని నే నధర్మ కార్యము చేయఁబూనితినా? ధర్మమేల చెడును? కావున యుద్ధమునకు సాహసించుటే తగిన కార్యము. దుష్టులకు భయపడి ధర్మము చెడుచుండఁ జూచుచుండ వచ్చునా? యుద్ధమెప్పుడు నిషిద్ధము? అర్థకాంక్ష యన్యరాజ్యాపహరణమునకై, కేవల కీర్తికై బలములు రెండు సమానములై జయము సందిగ్ధమై నపుడు యుద్ధము నిషిద్ధము. తన ద్రవ్యముఁ దాను రాఁబట్టుకొనుటకై చేయు యుద్ధము నిషిద్ధము కాదు. అందు నాకు దైవ బలము గలదు. దేహబలము గలదు. ధర్మ బలము గలదు.

ఇట్టి నేనే లేనిపోని కుశంకలచే యుద్ధమునకు జంకితినేని కార్యమగు టెట్లు?

కావున యుద్ధమునకు జంకరాదు. రామచంద్రమూర్తి యసహాయుఁ డను దురభి ప్రాయము రావణునకుఁ గలదు. దానిని దొలఁగించినఁ గాని వాఁడు మెత్తఁ బడఁడు. వారిలో వారికి భేదములు పుట్టవు. కావున యుద్ధ మవశ్యకర్తవ్య మగు చున్నది.

చ. అసురులచేవమట్టు తెలి యన్ గమనించెద నేని దండమే
యొసఁగు శుభోత్తరం బయి, మఱే ది ప్రయోజనకారి గాదు, రా
క్షసవరవీరులం గెడపఁగా ననిఁ గొందఱ నున్నవార లీ
రస మఱి మెత్తపాటు గొన రాముని కార్య మకష్టసాధ్య మా. ౧౦౦౭

అర్థములు. చేవమట్టు=బలప్రమాణము, గమకించెదనేని, ప్రయత్నము చేసెదనేని, శుభోత్తరము=మిగుల మేలైనది, కెడపఁగాన్=చంపఁగా, అనిన్= యుద్ధమందు, ఉన్నవారు=తక్కినవారు, అకష్టసాధ్యము=సులభ సాధ్యము.

తాత్పర్యము

నేను మఱలి పోఁగానే రావణుని, రాక్షసులయు బలాబలము లే మాత్రమని రామ సుగ్రీవులు తప్పక యడుగుదురు. దానికి నేను సరియైన ప్రత్యుత్తర మీయ వలసియుండిన రాక్షసు లే మాత్రము బలవంతులో తెలియవలయును. ఇది యుద్ధ మందుఁ దెలియఁ దగినదే కాని సామదానాదులఁ దెలిసికొన సాధ్యపడునది కాదు. అటుగాక యుద్ధమునకు నేను బ్రయత్నించుటవలన మఱియొక మేలు గలదు. ఇప్పుడు వీరు రామలక్ష్మణు లిరువు రసహాయులేమి చేయఁగలరని ధైర్యముతో నున్నారు. ఆ దురభిప్రాయముఁ దొలఁగించి రామచంద్రమూర్తికి సుగ్రీవసాహా య్యము గలదని ప్రకటించి యుద్ధమునఁ గొందఱఁ జంపితి నేని తక్కినవారు ద్వేషము వదలి మెత్తఁబడుదురు. వారిలో వారి కభిప్రాయభేదము పుట్టును. అప్పుడు రామచంద్రమూర్తి కార్యము లేక నెఱవేఱును.

ఉ. సీతను జూచి రమ్మనుచుఁ జెప్పెను గాక రఘూద్వహుండు దు
ర్నీతులతోడఁ బోరు మనె నే యని యాత్మఁ దలంతు నేనియున్
దూతయు నీతమైన పని తోఁ బలుకార్యములన్ ఘటించుచో
ఖ్యాతమనస్వి తత్ప్రథమ కార్యవిరోధము లేమిఁ గన్గొనున్. ౧౦౦౮

అర్థములు. దుర్నీతులతోడన్=నీతిమాలిన వారితోడ, నీతము=నియమింపఁ బడినది, ఖ్యాత=ప్రసిద్ధికెక్కిన, మనస్వి=ధీరుఁడు, ఆలోచనాపరుఁడు, తత్ప్రథమ కార్య విరోధము=మొదటి కార్యమునకు విరోధించినది.

తాత్పర్యము

రామచంద్రమూర్తి సీతాదేవిని జూచి మాట్లాడి రమ్మనెనుగాని, యీనీతి మాలిన వారితో నీచకలహమునకు దిగు మనెనా యని యందు నేని సీతాదేవి యేమి చెప్పెను. రామచంద్రమూర్తియే యిచ్చటికి రావలె, రావణాదులఁ జంప వలెఁ దన్నుఁ దీసికొనిపోవలె నని పట్టుదలగాఁ జెప్పెను. ఈ మాట నేను జెప్పిన

రాక్షసుల బలాబల విచారము రాకతప్పదు. ఈ పని నాకుఁ బ్రభువు చెప్పలేదే యనరాదు. ఏవిధముగనైనఁ గార్యముసాధించుట యుత్తమ దూతకృత్యము. అటు చేయునపుడు ప్రభువు నియమించిన కార్యముతోడఁ గార్యసాధనమునకు నేవేవి చేయవలయునో యవి యన్నియు మొదటిదాని కంగములుగాఁ జేయుట దూత కృత్యమే. అయినను ధైర్యము, ఆలోచన గలవాఁడు నియమిత కార్యమునకు హానిరాకుండఁ జూడవలయును. అది చెడకుండునట్లు కార్యము సాధింప నెన్నియైనఁ జేయవచ్చును. మూలచ్ఛేదమగు కార్యము చేయరాదు.

ఉ. ఎంతయుఁ జిన్నపాటి పని•నేనియుఁ జక్కఁగఁ జేయఁ బూనుచో
సంతస మందఁ గూడ దొక•సాధన మబ్బినయంత, నర్హ్మమాఁ
జింతిలఁ బెక్కు మార్గములఁ•జేయఁగ దానిని, గాన జానకీ
కాంతుని యిమ్మహాక్రియయుఁ•గార్యము చేయఁగఁ బెక్కుభంగులన్. ౧౦౯

తాత్పర్యము

ఎంతగ యల్పకార్యమునైనఁ జక్కఁగఁ జేయవలయు నని పూనినవాఁ డది నెఱవేఱుట కెన్నెన్ని యుపాయము లున్నవో యన్నియు వెదకి చేయవలయును. అప్పుడే యీ కార్యము నిర్భయముగఁ జక్కఁగఁ నెఱవేఱఁగల దని నమ్మ వచ్చును. కావున నీ రామ కార్యము కూఁడ బలువిధముల నెఱవేర్చుటే బాగు.

తే. దనుజులకు నాకుఁ గల తార•తమ్య మెల్ల, నరసి నిక్క మెఱింగి కో•శాధినాథు
సరస కరిగితి నేని య•శంబు వెలయ, భర్తృనాజ్ఞను జేసిన•బంటనగుదు. ౧౧౦

అర్థములు. సరసకున్ = సమీపమునకు, భర్తృనాజ్ఞను = భర్తయాజ్ఞను; షష్ఠీసమాసంబులం దుకారఋకారముల కచ్చు పరంబగు నపుడు నుగాగమం బగు. సు. వ్యా. సంధి. ౪౯ సూ.

తాత్పర్యము

బలమునందు రాక్షసులకు, నాకుఁగల భేదము తెలిసికొని రామచంద్రు సమీపమునకుఁ బోయితి నేని, యిప్పటికి స్వామి యాజ్ఞ నెఱవేర్చిన బంట ననిపించు కొందును.

క. సులభంబుగ నసురులతోఁ, గలహము సమకూరఁ బంక్తి•కంఠుం డస్మ
ద్బలమును దనదు బలంబును, దెలిసికొనుం గాక యెట్లుఁ•దెలియం గలఁడే?

తాత్పర్యము

రావణుఁడు తనయంతటి బలశాలి లేఁడని మదించి యున్నాఁడు. ఆ మద మణఁచిన గాని వాఁడు లొంగఁడు. కావున సులభంబుగ రాక్షసులను యుద్ధమున కీడ్చి కొందఱఁ జావఁదన్నుదునేని రావణుఁడు యుద్ధమునకు వచ్చును. అప్పుడు తన బల మెంతో నాబల మెంతో తెలిసికొనునుగాని, నే నూరక పోయిన వానికేమి తెలియఁగలదు?

ఉ. కావున నెట్టు లైన దశ•కంఠు సమంత్రి సమూహ సైన్యసం
భావితు నాజి కీడ్చి పరి•పంథి బలాబలరీతి వానిహృ
ద్భావము చందముం దెలిసి•తద్దయుఁ జెక్కు చెమర్ప కుండఁగాఁ
బోవుట కార్య మట్లయినఁ•బో కృతకార్యుఁడ నౌదుఁ గావునన్. ౧౧౧౨

అర్థములు. ఆజికిన్=యుద్ధమునకు, పరిపంథి=శత్రువుల, బలాబలరీతిన్=బలము గలవారో, కారో యను దానిని, హృద్భావము చందము=ఆలోచన విధము, చెక్కు చెమర్పకుండఁగాన్ = అనాయాసముగ, చెంపమీఁదఁ జెమట పోయకుండఁగా, కృతకార్యుఁడను=కార్యము చేసినవాఁడను.

తాత్పర్యము

కాఁబట్టి యేదో విధముగ రావణుని వాని మంత్రులతోను, సైన్యములతోను, యుద్ధమున కీడ్చి దానియందు శత్రువుల బలాబలములు దెలిసికొని సీతా విషయమై వాని యాలోచన యేమో యనియు నెఱిఁగి యనాయాసముగా నే బాధ లేక మరలిపోయితి నేని రామకార్యము చేసినవాఁడ నగుదును.

చ. కనులకుఁ బండు వై హృదయ•కాంతము నై సురనాథునందనం
బన ఘనవృక్షసుందరల•తాన్వితమై సొబగారుచున్న దీ
దనుజుని నిష్కుటంబు, వెస•ధ్వంసముఁ జేసెద దీనిఁ, గారుచి
చ్చునఁ జెడినట్టి కాననము•చొప్పయినం గని రావణుం డెదన్. ౧౦౧౩

అర్థములు. హృదయకాంతము=మనస్సున కాహ్లాదకరమై, ఘనవృక్ష=గొప్ప వృక్షములతోను, సుందరలతా=అందమైన తీఁగలతోను, అన్వితము=కూడినది, నిష్కుటంబు=ఉద్యాన వనము.

తాత్పర్యము

కన్నులపండువై, మనస్సునకు నింపై యింద్రుని నందనవనమువలె గొప్ప వృక్షములతోను, నందమైన తీఁగలతోను గూడిన యీ యుద్యానవనము సొగసుగా నున్నది. దీని నిప్పుడే ధ్వంసము చేసెదను. ఇది కారుచిచ్చుచేఁ గాలినట్లు పాడై పోవఁగా రావణుఁడు తన హృదయమందు.

ఉ. మండి మహారథద్విపస•మాజముఁ బంపును భండనార్థమై
దండిమగల్ త్రిశూలచయ•దారుణపట్టిసచాపహస్తులై
గండున రాఁగ వారలను•గ్రక్కునఁ జేయుచుఁ దుండెతుండెముల్
నిండు ముదంబునం జనెద•నేఁ గపినాథుపురంబుఁ జేరఁగన్. ౧౦౧౪

అర్థములు. మహారథద్విపసమాజము=గొప్పతేర్లు, ఏనుఁగులు వీనిగుంపును, భండనార్థమై=యుద్ధము కొఱకు.

తాత్పర్యము

కోపముచే మండిపడి పెద్దతేరులను, ఏనుఁగులను గల సేనలను యుద్ధముకొఱకై

నా మీఁదికి బంపును. ఆ శూరులు త్రిశూలములు, పట్టిసములు, విండ్లుపట్టుకొని వత్తురు. వారి నందఱను దునుకలు తునుకలుగా నఱకివైచి సంతోషముతో గిష్కింధకుఁ బోయెదను.

—• హనుమంతుఁ డశోకవనంబుఁ బాడుచేయుట. •—

సీ. అని తలపోసి యం•జనపట్టి చెలరేఁగి, యూరువేగంబున•ధారిణీజ
తతులఁ బ్రభంజను•గతి మూలముట్టుగఁ; బడవైవఁ గడఁగెను•బెడిదముగను
మత్తశంకుత•మాఘుష్ట మగుచును, నానాద్రుమలతాళి•నవ్య మయిన
ప్రమదావనం బెల్లఁ•బాడు పాడొనరించి, యాటమలల నెల్ల•నవనిఁ గలిపి
తే. కేళిసలిలాశయంబులఁ•గూలఁ ద్రోయఁ, దెగిన తీఁగలు విఱిగిన•యగచయంబుఁ
బాడుకొలఁకులు నగుచును•బ్రమదవనము, కారుచిచ్చునఁ గాలిన•కరణినయ్యె.

అర్థములు. ధారిణీజతతులన్=వృక్షసమూహములను, ప్రభంజనుగతిన్=వాయువువలె, మూలముట్టుగన్=వేళ్ళతోడ, బెడిదముగను=భయము కలుగునట్లు, మత్తశకుంతసమాఘుష్టము=మదించిన పక్షులధ్వనులతోఁ గూడినది; ద్రుమ=చెట్లు, ఆటమలలు,=క్రీడా పర్వతములు, కేళి సలిలాశయంబులన్=క్రీడా సరస్సులను, 'ద్రవకేళి పరీహాసాః క్రీడా లీలాచ నర్మచ' అనురుఁడు. కేళీకేళి రపి ప్రోక్తా. ద్వి.కో. రెండు రూపంబులుగలవు. అగచయంబు=చెట్ల సమూహము, ప్రమద వనము=స్త్రీలు విహరించు తోఁట, ప్రమదవనము ప్రమదావన మని రెండు రూపములు గలవు.

తాత్పర్యము

ఈ ప్రకార మాలోచించిన వాఁడై హనుమంతుఁడు విజృంభించి తొడల వేగముచేత మహావాయువువలె చెట్లను వేళ్ళతోడ నేలఁబడవేయ నారంభించెను. మదించిన పక్షుల ధ్వనులు గలదై నానావిధములైన, చెట్లు తీఁగలు గలిగిన ప్రమదావనమును పాడుచేసి, క్రీడా పర్వతముల నెల్ల నేలపాలుచేసి, క్రీడా సరస్సుల విఱుగఁ ద్రోయఁగా తెగిన తీఁగలు, విఱిగిన చెట్లు, పాడైన సరస్సులు గలదై, యా వనము కారుచిచ్చున గాలి నట్లయ్యెను.

క. కూఁకటివేరులతోడం, బ్రాఁకుం బట్లెల్ల నేలఁ•బడఁగ లతాళుల్
మ్రాఁకులకొనలఁ జలించెను, దేఁకువ వడఁకాడు చెలుల•తీరున నంతన్.

అర్థములు. ప్రాఁకుంబట్లు=తీఁగ లెగఁబ్రాఁకుటకు ననుకూలమైన చెట్లు-ప్రాఁకు+పట్లు=ప్రాకుంబట్లు-తేఁకువన్=భయముతో, చెలుల తీరునన్=స్త్రీలవిధమున.

తాత్పర్యము

నేలఁ బాఁతుకొన్న తల్లివేళ్ళతోఁ దా మల్లుకొనుటకు నాధారముగ నుండిన

చెట్లన్నియు నేలఁబడఁగా వాని కొనలయందుఁ దీఁగలు దిక్కు-చెడిన స్త్రీలు భయముతో వణఁకినట్లు వణఁకుచుండెను.

క. వ్యాళంబులు నలఁగెను జి,త్రాలయములుఁ బొదరుటిండు♦లశ్మగృహంబుల్
  గూలెను ప్రీలెను, దూలెను, నేలను గడుఘోర మగుచు♦నేత్రంబులకున్.౧౦౧౮

అర్థములు. వ్యాళంబులు=పాములు, అశ్మగృహంబుల్=ఱాతికియిండ్లు.

## తాత్పర్యము

చెట్లు పడుటచే వానిసందునఁ బడి పాములు నలఁగి చచ్చెను. చిత్రగృహములు నేలఁగూలెను. పొదరుటిండ్లు ప్రీలిపడెను. ఱాతియిండ్లు నేలఁ దూలిపడెను. ఇదంతయుఁ జూచుటకు ఘోరముగ నుండెను.

క. దనుజేశప్రమదావన, మను ప్రమదావనము మూల♦ముట్టుగ నాశం
  బొనరిచి యలరుచుఁ గలనికి, హనుమంతుఁడు తోరణాగ్ర♦మందు వసించెన్.

అర్థములు. దనుజేశ=రావణుని, ప్రమదా+అవనమును=స్త్రీలకు సంతోషకరమైన భోగస్థానము, ప్రమదావనము=ఉద్యానవనము, మూలముట్టుగ=మొదలంట, అలరుచున్=సంతోషించుచు, కలనికిన్=యుద్ధమునకుఁగాను, తోరణాగ్రమందు=ఆ వనము తలవాకిటి మీఁద.

## తాత్పర్యము

రావణాసురుని భార్యలకు భోగస్థానమైన యుద్యానవనమును మొదలుముట్ట నాశము చేసి, సంతోషించి యుద్ధమున కెదురు చూచుచు నాఁతోట తలవాకిటి మీఁద గూర్చుండెను.

♦ ౪౨వ సర్గము. రాక్షసస్త్రీలు హనుమంతు వృత్తాంతము సీతాదేవి నడుగుట ♦

క. పక్షులబహుళారవమున, వృక్షంబులు గూలుధ్వనుల♦వెఱగొని లంకన్
  రాక్షసు లందఱు దిగ్భ్రమ,వీక్షించిరి యొకరి మొగము♦వేఱొక రంతన్.౧౦౧౯

అర్థములు. బహుళ+ఆరవము=విస్తారధ్వని.

## తాత్పర్యము

ఆకాశమునకు గుంపులు గుంపులుగ నెగిరి కూయు పక్షుల ధ్వనులచేతను, దభాలు దభాలని పడుచున్న చెట్ల చప్పుడుల చేతను లంకలోనుండు రాక్షసులందఱు భయపడి దిక్కు- తోఁపక, యది యేమైనది తెలియక యొకరి ముఖము నొకరు చూచుచుండిరి.

ఉ. క్రూరనిమిత్తముల్ దెలుపు♦కూఁతలు పెట్టుచుఁ బాఱెఁ బక్షులున్
  క్రూరమృగంబు లాదిగ దిశ♦గుల్ పడి మేల్కని రాక్షసాంగనల్
  ఘోరతరాకృతిన్ వెలయు♦క్రోఁతిని బా డగు చున్న నిష్కుటం
  బారసి చూచె వేగ జన♦కాత్మజఁ జేరఁగఁ బాఱుచుండఁగన్. ౧౦౨౦

అర్థములు. క్రూరనిమిత్తముల్ = చెఱుపు దెలుపు శకునములు, ఘోర శరాకృతిని=మిగుల భయంకరమైన యాకారముతో, నిష్కుటము=ఉద్యాన వనము.

తా త్ప ర్య ము

కీడును దెలుపు ధ్వనులుచేయుచుఁ బక్షులు, క్రూరమృగములు పరువెత్తెను. కావలికత్తెలై నిద్రపోవుచున్న రాక్షసస్త్రీలు భయపడి లేచి భయంకరాకారము గల క్రోఁతిని జూచి, సీత యేమైపోయెనో యని యామె యొద్దకుఁ బరువెత్తిరి.

క. ఆరాకాసులు బెదరఁగఁ గ్రూరము భయదంబునైన•రూపముఁ గొనె న
మ్మారుతి యాతని భయదా,కారు మహాబలునిఁజూచి•క్ష్మాసుతతోడన్.

తా త్ప ర్య ము

ఆ రాక్షసస్త్రీలు భయపడునట్లు ఘోరమై, భయంకరమైన రూపమును హనుమంతుఁడు ధరించెను. ఆ భయంకరాకారముగల యా మహాబలవంతు హనుమంతుని జూచి వారు సీతాదేవితో నిట్లనిరి.

ఉ. ఎవ్వఁడె వీఁడు సీత? యిట•కేరి నిమిత్తము వచ్చినాఁడె; వీఁ
డెవ్వరివాఁడె? నీ వతఁడు•నేమియొ ముచ్చట లాడుచుంటిరే?
నివ్వెఱ పొందఁ బోకు తరు•ణీ భయకారణ మేమి లేదు, నీ
కి వ్వనచారి యిందనుక•నే మని చెప్పెను జెప్పవే యనన్. ౧౦౨

తా త్ప ర్య ము

సీతా! వీఁడెవ్వఁడే? ఎవరికోసర మిచ్చటికి వచ్చినాఁడే? ఎవ్వరివాఁడెవీఁడు? నీవు, వీఁడు ముచ్చట లేవియొ యాడుచుంటిరే, అది యేమె? భయపడవలదు. నీకు రాఁగల భయమేమియు లేదు. ఇంతవఱకు నీ క్రోఁతి నీ కేమి చెప్పెనో చెప్పుము. అని యడుగఁగా.

ఉ. మీ మటుమాయపుం బనులు•మీకె యెఱుంగఁగఁ జెల్లుఁగాక నా
కేమెయిఁ దోఁచు రాక్షసుల•కృత్యము లెల్ల యథార్థరీతిగా,
బాములకాళ్లు పాములకుఁ•బాటిలుఁ గాదె యెఱుంగ, నెవ్వఁడో
క్రోఁతి, మది నాకునుం గలఁగెఁ•గ్రూరనిశాటుఁడు కామరూపియై. ౧౦౩

అర్థములు. మటుమాయము=మాయము+మాయము = మటుమాయము= మిక్కిలి మోసము. ఏమెయిన్=ఏ విధముగ, క్రూరనిశాటుఁడు = భయంకరుఁడగు రాక్షసుఁడు, కామరూపియై=కోరిన క్రోఁతిరూపము ధరించిన వాఁడై, అలంకారము—ఛేకోక్తి, "ఛేకోక్తి ర్యదిలోకోక్తిస్స్యా దర్థాంతరగర్భితా। భుజంగ ఏవ జానీతే భుజంగ చరణం సఖే" చంద్రాలోకములోని వాడుకలోనున్న సామెతనే యర్థాంతరము గలదిగాఁ జెప్పిన ఛేకోక్తి యగును. పాములకాళ్లుపాములకే తెలియు ననఁగా నిచట మోసగాండ్ర రహస్యకృత్యములు మోసగాండ్రకే

తెలియును. రాక్షసకృత్యములు రాక్షసులగు మీకే తెలియవలయు నని భావము.

తాత్పర్యము

పాముల కాళ్ళజాడ పాములకుఁ గదా తెలియును. అట్టులే రాక్షసుల మాయలు రాక్షసులైన మీకుఁ దెలియును గాని నాకెట్లు తెలియును. నాకుఁ గూడ మనస్సు కలవరపడుచున్నది. ఏ రాక్షసుఁడే మాయరూపము ధరించెనో.

ఇచ్చట సీతాదేవి యసత్యము చెప్పె ననుట నిర్వివాద విషయము. సీతాదేవి వంటిది యెట్లసత్యమాడ సాహసించెను. అసత్యదోష మామెకుఁ గలదా, లేదాయని విచార్యము. ఎట్టిది సత్య మెట్టిది యసత్య మను విషయము పూర్ణముగఁ జర్చింప గ్రంథవిస్తర భీతి బాధించెడిని గావున సారాంశము దెలుపఁబడును. ప్రతి మనుష్యుఁడు నిత్యము ననుష్ఠింపవలసిన యమము లందు ముఖ్యమైనవి యైదు. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము. తక్కిన నాలుగింటికి అహింస తల్లి, సత్యాదులు దాని బిడ్డలు. వేదసమ్మతములైన స్మృతీతిహాసపురాణ వాక్యము లెట్లు ప్రమాణములో, వేదవిరుద్ధ స్మృతీతిహాస పురాణవాక్యము లెట్లప్రమాణములో యట్టులే అహింస ననుసరించిన సత్యాదులు గ్రాహ్యములు. తద్విరుద్ధములు త్యాజ్యములు. మన సత్యమువలన నిరపరాధికి నిష్కారణముగ హింస కలుగునట్లుండిన నట్టి సత్యము చెప్పరాదు. అసత్యమే చెప్పవలెను. దొంగతనము చేయక పోవుటచేఁ దనప్రాణము పోవునట్లుండు సమయంబున విశ్వామిత్రునివలె దొంగిలించి ప్రాణరక్షణము చేసికొనుట తప్పుగాదు. ఋతుకాలమందుఁ దన భార్యతో సంగమింపవలసిన పురుషుఁడు నిష్కారణముగ మాని భార్యకు మనః సంకటము కలిగించెనేని వాఁడు స్త్రీ హింస చేసినవాఁడే. కామక్రోధములకు దాసుఁడై యుధిష్ఠిరునివలె నసత్యమాడుట దోషము. ధనార్జనమునకై దొంగిలించుట దోషము.

> శూద్రవిట్క్షత్ర విప్రాణాం, యత్రర్తోక్తౌ భవేద్వధః
> తత్ర వక్తవ్య మనృతం, తద్ధి సత్యాద్విశిష్యతే॥ మను. ౮-౧౦౪.

సత్యము చెప్పిన యెడల నిష్కారణముగ నిరపరాధు లగు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు వధము సంప్రాప్తమగు నేని యప్పు డసత్యమే చెప్పవలయును. అది సత్యమున కంటె శ్రేష్ఠమైనది.

> 'న నర్మ యుక్తం వచనం హినస్తి, న స్త్రీషు రాజన్ నవివాహకాలే
> ప్రాణాత్యయే సర్వ ధనాపహారే పంచానృతా న్యాహు రపాతకాని.'
>
> భారతము.

> 'వివాహకాలే రతి సంప్రయోగే, ప్రాణాత్యయే సర్వ ధనాపహారే
> మిత్రస్య చార్థేఽప్యనృతం వదేయుః పంచానృతా న్యాహు రపాతకాని॥'

దురుద్దేశములేని హాస్యమునందును, స్త్రీల విషయమునందును, వివాహకాలమందును, ప్రాణాపాయము సంభవించునపుడును, తనసర్వధన మపహృత మగు

నపుడును నీ వైదు విషయంబుల నసత్య మాడుట వలనఁ బాపములేదు. సత్య మాడినచో హానికర మని తోఁచిన నసత్యమాడ వచ్చునే కాని యసత్యమే యాడవలయునను నిర్బంధము లేదు.

హనుమంతుఁడు సీతాదేవికిఁ బ్రత్యుపకార మపేక్షింపని యుపకారి. గౌరవ మిత్రుఁడు. నిరపరాధి. అట్టివానికి సత్య మాడుటచే నిష్కారణముగ హింసకలుగు నేని, సీతాదేవికిఁ బాపము వచ్చునే కాని సత్య మాడిన ఫలమురాదు. సత్యము చెప్పుటచేఁ దనకును, ప్రాణాపాయము గలదని భయపడెను. కావున నామె యస త్యమునకు నసత్యఫలము లేదు.

ఈ విధముగ రామచంద్రమూర్తియు (అయోధ్య ౧౧ ౨౩) సుగ్రీవుఁడు హనుమంతుఁడు నసత్య మాడినవారే.

—॥ రాక్షసస్త్రీ లశోకవనంబు పాడగుట రావణునకుఁ దెలుపుట ॥—

సీ. ఏ తెంచెనో? యన॥ సీతోక్తులను విని, భయపడి కొందఱు॥ పాఱి రందు
నిలిచిరి కొందఱు॥ నెవ్వడి నసురాధి, పతికిని దెలుపంగ॥ నతులు గొంద
ఱరిగి రావణుఁ గాంచి॥ యవధారు దైత్యేశ! వికట వానరరూపి॥ వీఁడొకఁడు
జనకజతోఁడుతఁ॥ జనవున ముచ్చట లాడి యశోకవ॥ నాంతరమున

ఆ. నిలిచియున్నవాఁడు॥ నిర్జరనాథుని, దూతయో కుబేరు॥ దూత యొక్కొ-
సీత నెమకుపొంటె॥ శ్రీరాముఁ డంపిన, దూతుఁ డేమొ తెలియ॥ దుర్ఘటంబు.

అర్థములు. నెవ్వడి=నెఱ+వడి=మిగుల వేగముగ, అవధారు='అవధారు- దీనికి వినుము అర్థమనియు 'అవధారణమ్' ప్రకృతి యనియు సీతారామాచార్యుల వారు 'అవధారయ' (చిత్తగింపుము) 'అవధారయతు' (చిత్తగించును గాక) అను సంస్కృత క్రియాపదములకుఁ గ్రమముగా 'అవధారసు-అవధార అని ప్రాకృత రూపములు. రెండవది రూపమునను, దొలిది యర్థమునను "అవధారునకు" చేర్పుగానున్నవి. రెండవదియే యిట్లు అర్థముతోఁ గూడి మాఱి యుండును. (సర్వంకష వ్యాఖ్య-శృంగార నైష. ౪-౯౧)

తెనుఁగునందు వర్గయుక్కులు లేవు. అయినను అవధారు-వసనాభి-జఱభి యను మూఁడు పదములందు వర్గయుక్కులు గాన నయ్యెడి.

తాత్పర్యము

రాక్షసస్త్రీలు సీతాదేవి చెప్పిన యా మాటలను విని కొందఱు భయపడి పరువెత్తిరి. కొందఱందే నిలిచిరి. కొందఱు మిగుల వేగముగ రావణాసురునికిఁ దెలుపఁబోయి రావణుఁ గాంచి రాజా! చిత్తగింపుము. భయంకరమైన వానర రూపము గల వీఁడొకఁడు సీతతో మచ్చికగా ముచ్చటలాడి యశోకవనము నందున్నవాఁడు, వాఁ డింద్రుని దూతయో, కుబేరుని దూతయో సీతను వెదకుట కొఱకు వచ్చిన శ్రీరాముఁ దూత మో తెలిసికొన శక్యము గాకున్నది.

క. అమ్మా! యెవఁ డీకపి యని, కొమ్మను మే మెంత వేఁడు•కొన్నన్ మాతో
నమ్మహిజ యెఱుఁగ నంచును, మమ్మింక గికురించె మాయ•మాటలచేతన్.

అర్థములు. కికురించెన్=మోసగించెను.

తాత్పర్యము స్పష్టము.

ఉ. పోలఁక భీమరూపుఁ గొని•పొంగుచు నీ ప్రమదావనంబు ని
ర్మూలముఁ జేసి క్రోఁతి మృగ•మోహనపక్షివితానసల్లతా
జాల నగాళి రూపు చెడ • సర్వముఁ బాడొనరించెఁ గాని తా
నేలొకొ తాఁకకుండెడు మ•హీజ వసించుప్రదేశ మొక్కఁడున్. ౧౦౨౬

అర్థములు. మృగ=మృగములయొక్కయు, మోహనపక్షివితాన=అందమైన పక్షి సమూహములయు, సల్లతాజాల=మంచి తీఁగగుంపులయు, నగ=చెట్ల యొక్క, ఆళిన్=పంక్తులను.

తాత్పర్యము

రౌద్రాకారము వహించి విజృంభించి నీ ప్రమదావనము నంతయు నిర్మూలముచేసి యా క్రోఁతి మృగములను, పక్షులను, దీఁగలను చెట్లను స్వరూపనాశము చేసెనుగాని, సీతాదేవి యుండు ప్రదేశమును మాత్రము దాఁకిన వాఁడు కాఁడు.

ఉ. ఆ సతిరక్షణార్థమొ ప్ర•యాసముచేతనొ ధారిణీసుతా
వాసతలంబునై కుసుమ•వారసమంచిత మైన శింశుపన్
గాసి యొనర్పఁబోఁడు, కనఁ•గా శ్రమ మెక్కడి దయ్య వానికిన్?
భూసుతసౌఖ్యముం దలఁచి•పోలుఁ జుమీ యది ద్రుంప కుండుటల్. ౧౦౨౭

అర్థములు. కుసుమ వార సమంచితము=పూలగుంపులచే నందమైన.

తాత్పర్యము

సీతాదేవికి రక్షణముగా నుండవలయుననియో లేక చెట్లనన్ని త్రుంచిన బడలిక చేతనో సీతాదేవి యుండు నశోకవృక్షమును విఱుగఁ దన్నినవాఁడు కాఁడు. వాని కెక్కడి దయ్యా శ్రమము? సీతాసౌఖ్యము కొఱకే దానిని నిల్పి యుండవలెను.

క. నీవనముఁ జెఱిచినందున, కా వనితం బల్కరించి•నందునకును ర
క్షోవర! వానరవరునకుఁ, గావింపుము కఠినశిక్ష•కానర మడఁగన్. ౧౦౨౮

అర్థములు. చెఱిచినందుకు=చెఱిచిన దానికై-అందు ఇది ప్రత్యయము గాదు. క్రియయుఁగాదు. అవ్యయమని యొక నిఘంటుకారుఁడు వ్రాసియున్నాఁడు. అట్లన్నను- ఎల్లశబ్దమునకు వలె దీనిపై అందుచేత అందులోపల అందునకు నను ప్రత్యయములతోడఁ గలిసి యావలి కవుల ప్రయోగములందుఁ గానఁబడు చున్నది. ఉకారాంతము గావున షష్ఠీకువర్ణకమునకు ముందు నకారాగమము ప్రాప్తించెను. ఇట్టిది కవిత్రయప్రయోగములందు లేదు. ప్రదేశార్థకమైనపుడు

లకారాగమము కానవచ్చెడి, 'అందులకు ధరణీంగ లన్నృపనందను'లని భారత ప్రయోగము కలదు.

### తాత్పర్యము

నీ వనము పాడుచేసిన దానికిని, సీతను బలుకరించిన దానికిని క్రోఁతివానికి వాని పోఁగ రడఁగునట్లు కఠిన దండము గావింపుము.

క. నీ వలచి యున్న చేడియ,తో వాసవమథన! పలికి • తోడన మెయితోఁ
బోవచ్చునె యెవఁడే? ననఁగా విని మండిపడెఁ బంక్తి • కంఠుఁడు కినుకన్.

### తాత్పర్యము

నీవు కోరియుండు నాఁడు దానితో మఱియొక పురుషుఁడు వచ్చి మాటలాడి యెవఁడైనఁగాని దేహముతో నుండవచ్చునా? యని చెప్పఁగా విని కోపముచే రావణుఁడు మండిపడెను.

— • రావణుఁడు హనుమంతునిమీఁదికిఁ గింకరులఁ బంపుట. • —

క. కోపావర్తితనేత్రుం,డౌ పంక్తిగ్రీవుకనుల • నశ్రులు రాలెన్
దీపంబునుండి మండుచుఁ, బైపయిఁ బహు తైలబిందు • పటలం బనగన్. ౧౦౩౦

అర్థములు. కోపావర్తిత నేత్రుండు=కోపముచేఁ దిరుగుచున్న కన్నులు గలవాఁడు, పటలము=సమూహము.

### తాత్పర్యము

కోపముచే గిరగిర దిరుగు గ్రుడ్లు కలవాఁడైన రావణుని కన్నులనుండి దీపము నుండి మండుచు మీఁద మీఁదఁ బడు చమురు బొట్లవలె నీళ్ళు రాలెను.

మ. తనతోఁ దుల్యులఁ గింకరాఖ్యుల మహా • దర్పాంధులన్ వాయునం
దనుఁ బట్టన్, దితిజాధినేత పనుపన్ • వారుగ్రులై కూటసా
ధనఖడ్గాదికహస్తులై వెస మహా • దంష్ట్రాకరాళోదర
స్వనరూపద్రవిణంబు లొప్పఁ గపిపై • సంగ్రామలోలాత్ములై. ౧౦౩౧

అర్థములు. దర్పాంధులన్=బలగర్వముచేఁ గన్నులు దెలియని వారిని' కూటము=సమ్మెటవంటి యాయుధము. మహాదంష్ట్రాకరాళ = పెద్దకోఱలు' మిట్టపండ్లు, ఉదర=కడుపు-స్వన=ధ్వని రూప = ఆకారము-ద్రవిణంబు=బలము-సంగ్రామలోలాత్ములై=యుద్ధమునం దాసక్తి గలవారై, తాను స్త్రీలతో విహరించు నుద్యానము పాడైన దని విని చూడనైన రావణుఁడు వచ్చునని హనుమంతుఁడు తలఁచెనుగాని యొకఁడు సముద్రముదాఁటి లంకలోఁ బ్రవేశించియంతఃపురముఁ జొచ్చి సీతతో మాటలాడి యుద్యాన వనము పాడుచేసెనని వినఁగానే యిది రామ పక్షమువారి గొప్ప యుద్ధ ప్రయత్నమునకు సూచనగాఁ దలఁచి రావణుఁడు తాను బోక సేనలను బంపెను.

తాత్పర్యము

తనతో సమానులైనవారిని కింకరులను పేరుగల వారిని మహాగర్వముచే గన్నులు గానని వారిని, జూచి మీరు పోయి యీ క్రోఁతిని బట్టుకొని రండని పంపఁగా వారు కూటములు ఖడ్గములు లోనగు నాయుధములు దీసికొని పెద్ద కోఱలు మిట్టపండ్లు-కడుపులు-కంఠధ్వనులు - ఆకారములు బలము గలవారై యుద్ధకాంక్షచే.

చ. ఎనుబదివేల దైత్యవరు♦లేకముఖంబుగఁ దోరణస్థితున్
హనుమను డాసి కాంచనక♦నత్పరిఘోగ్రకృపాణదీప్తఘో
పనిచయశూలముద్గరను♦పట్టిసతో మరశక్తి తాడితాం
గునిఁగనొనర్ప నాతఁడును♦గొండవలెన్ మెయి వెంచి క్రుద్ధుఁడై. ౧౦౩౨

అర్థములు. కాంచన కనత్=బంగారుతోఁ బ్రకాశించు

తాత్పర్యము

ఎనుబదివేలమంది రాక్షసు లొక్క-ముఖముగా వచ్చి తోఁటద్వారము మీఁదనున్న హనుమంతుని పైఁబడి బంగారుతోఁ బ్రకాశించు గండ్రగొడ్డండ్లతో, కత్తులతో మండుచున్న బాణసమూహములతో శూలములతో ఇనుప గుదియలతో అడ్డకత్తులతో చిల్లకోలలతో శక్తులచేఁ గొట్టఁగా నాయనయుఁ గోపించి కొండవలె దేహము పెంచి.

—♦ హనుమంతుని జయఘోషము ♦—

తే. వాల మల్లార్చి జాడించి♦వసుధ మోఁది, యార్భటించిన నా గర్జ♦కఖిలపురము
నిండి మార్మ్రోసెఁ బక్షులు♦నింగికెగరి, గుండెలగలంగ ధారిణిఁ♦గూలెనపుడు.

అర్థములు. అల్లార్చి=ఆడించి, మోఁది=కొట్టి, ఆర్భటించినన్=సింహనాదము చేయఁగా, మార్మ్రోసెన్=ప్రతిధ్వనులిచ్చెను, నింగికిన్=ఆకాశమునకు అగలంగన్=పగులఁగా.

తాత్పర్యము

తోఁక యాడించి జాడించి నేలపైఁ గొట్టి సింహనాదము చేయఁగా నా ధ్వనికి లంకయంతయుఁ బ్రతిధ్వని యిచ్చెను. పక్షులాకాశమున కెగసి గుండెలు పగిలి నేలవడెను.

చ. జయము జయంబు రామునకు♦సారపరాక్రమధన్యమూర్తికిన్
జయము జయంబు విద్విషద♦సహ్యతరస్వి సుమిత్రపట్టికిన్
జయము జయంబు దాశరథి♦సంపరిపాలితుఁడౌ వలీముఖో
చ్చయపతి సూర్యపుత్రునకు ♦ సాహసవిక్రమకీర్తిశాలికిన్. ౧౦౩౪

అర్థములు. సారపరాక్రమధన్యమూర్తికి=దృఢమైన పరాక్రమముచే ధన్యమైన యాకారముగలవానికి-విద్విషత్=శత్రువులకు, అసహ్య=సహింపరాని,తరస్వి=బల

శాలి-మత్వర్థీయమైన వినిచ్ ప్రత్యయము. మాయా మేధా-స్రజ్ శబ్దములకును సకారాంత శబ్దములకును జేర్పబడును. పాణిని ౫-౨-౧౨౧. స్రగ్వి-మేధావి-మాయావి తరస్వి-మనస్వి-యశస్వి లోనైనవి "అస్మాయా మేధా స్రజో వినిః" అని సూత్రము. దాశరథి=రామలక్ష్మణులచే; సంపరిపాలితుఁడు=చక్కఁగాఁ బరిపాలింపఁ బడువాఁడు, కేవల పాలితుఁడు గాక-పరిపాలితుఁడుగాక సంపరిపాలితుఁడనుటచే సేవకులవలెఁ గాక-బంధువులవలెఁ గాక యిహపరంబుల రెంటను రామచంద్రుఁడు చక్కఁగా నే లోపము లేక రక్షించువాఁడని యర్థము. వలీముఖౌఘ పతి=వానర సమూహమునకుఁ బ్రభువు. సాహస విక్రమ కీర్తిశాలికిన్=సాహసముచేతను, పరాక్రమము చేతను, కీర్తిచేతను ప్రకాశించువానికి.

తాత్పర్యము

దృఢ పరాక్రమముచే ధన్యమైన రూపముగల శ్రీరామచంద్రమూర్తికిని, శత్రువులకు సహింప రాని బలముగల లక్ష్మణునకును, రామలక్ష్మణులచేఁ జక్కఁగా రక్షింపఁబడు వానరనాథుఁడై తెంపు, పరాక్రమము, కీర్తిగల సుగ్రీవునకు జయము కలుగును గాక, జయము కలుగును గాక.

ఉ. దాసుఁడ సర్వసద్గుణవి౹తానమనోహర రామమూర్తికిన్
గోసల దేశవల్లభున౹కున్ హతశత్రుఁడ వాయుపుత్రుఁడన్
నా సరి గారు సంగరము౹నన్ దశకంఠులు వేవు రేసియున్
వాసి యడంతు తాల ద్రుమ౹పాళుల నే హనుమత్సమాఖ్యుఁడన్. ౹౹౩౯౹౹

అర్థములు. సర్వ సద్గుణవితాన=సమస్త కల్యాణగుణ సమూహముచే-మనోహర=మనస్సు నాకర్షించు-దాసుఁడన్=కింకరుఁడను. ఇట్లు చెప్పుటచే నేను జీతముఁ గోరి, బత్తెముగోరి దాసుఁడఁగా లేదనియు, శ్రీరామమూర్తియందుఁగల కల్యాణగుణములు నా మనస్సు నాకర్షించుటచే దాస్యము నా స్వరూపము గాన నాయనను సేవించు చున్నా ననియు భావము. వేవురు = వేయిమంది-లక్ష్మణు వాక్యములు స్మరించునది. (కిష్కింధ. ౧౩౯ వ. ప)

తాత్పర్యము

సమస్త కల్యాణ గుణములచే మనోహరుఁడు, కోసలదేశ ప్రభు వగురామచంద్రమూర్తికి నేను దాసుఁడను. శత్రుసంహారకుఁ డగు వాయుకుమారుఁడను. హనుమంతుఁ డను పేరుగలవాఁడను. వేయిమంది రావణులైనను యుద్ధమందు నాతో సరిగారు. తాలచేతను చెట్లచేతను, శత్రువుల సంహరింతును.

ఈ రెండు పద్యముల మూల శ్లోకములు క్షుద్రప్రయోగముల నెల్ల హరించునని యనుభవజ్ఞులు, పెద్దలు చెప్పిరి, ఎవరైన నేదైన క్షుద్రశక్తి ప్రయోగముచేసినారని భయపడు వారీ రెండు శ్లోకములను గొన్ని నాళ్ళు విడువక దిన మంతయు జపించి రేని యా ప్రయోగము చెడును.దుష్టస్వప్నములు వచ్చినను భయపడ రాదు.

క. ధ్వంసంబుఁ జేసి లంకను, హింసించి సమస్తరాక్ష♦సేంద్రుల సీతా
హంసీయానకు మ్రొక్కి ప్ర, శంసితగతిం జనెద మిడుక♦సకలసురారుల్.

తాత్పర్యము

లంకను ధ్వంసముచేసి రాక్షసుల నందఱ హింసించి సీతాదేవికి మ్రొక్కి రాక్షసు లేడ్చుచుండఁగాఁ గీర్తికరమైన విధమునఁ బోయెదను.

క. అని ఘోషించిన దనుజులు, మనమున బెగ డొంది సంజ♦మబ్బన విరివిం
గొను కపిపై నృపు నానతి, ఘనసాధనచయము వృష్టి♦గాఁ గురియంగన్.

అర్థములు. బెగడొంది=భయపడి, విరివింగొను=వెడలుపైన, వృష్టి=వర్షము.

తాత్పర్యము

ఈ ప్రకారము ధ్వనింపఁగా రాక్షసులు భయపడి సంధ్యవేళ పెద్దదిగా వ్యాపించు మబ్బువలె దేహము పెంచి యున్న వానరుని మీఁద రాజాజ్ఞ ప్రకారము వర్షముగా నాయుధములఁ బ్రయోగించిరి.

'బెగడొంది రాజు నాజ్ఞ'ననుటచే భయపడి పరువెత్తఁ దలఁచియు నూరక పోయిన రావణుఁడు ంపునే యని యుద్ధము చేయ సాహసించిరని భావము.

తే. తోరణాశ్రితమై యున్న♦దొడ్డయినుప, గుదియఁగైకొని పెనుఁబన్న♦గునిగ్రహించి
తిరుగు గరుడుని పోలికఁ♦దిరిగి తిరిగి, యసురబలముల వెస నుఱు♦మాడెఁగవిసి

అర్థములు. తోరణాశ్రితమై యున్న=తోఁడవాకిట నున్న, ఆ తలుపులు వేయునపుడు బిగించుటకై యుంచిన గ్రద్ద గడియమ్రాను.

తాత్పర్యము

ఉద్యానద్వారమునం దున్న పెద్ద యినుప గుదియను దీసికొని పెద్దపామును బట్టుకొని తిరుగు గరుత్మంతునివలెఁ దిరిగి తిరిగి యా రాక్షసుల నెల్ల నుగ్గుగాఁ గొట్టెను.

క. కింకరకాండంబుల ననిఁ, బొంకం బడఁగించి యుద్ధమునఁ బుట్టుతమిన్
శంకింపక రక్షోతిభ, యంకరుఁడై తోరణంబు♦నందుం జేరెన్. ౧౦౩౯

తాత్పర్యము

ఈ ప్రకారము కింకర సమూహముల నెల్ల జంపి యుద్ధమునం...ల కోరికతో జంకక రాక్షసులకు భయంకరుఁడై తోరణమునందు మఱలఁబోయి కూర్చుండెను.

దీనివలన నొక్క రామకింకరు నెదుట వేలకొలఁది రావణ కింకరులు శుష్క వేదాంతి రాక్షసులు నిలువఁ జాలరని యేర్పడెను.

చ. హనుమకు నోడి బెగ్గడిలి♦ప్రాణభయంబునఁ బాఱి రాక్షసేం
ద్రుని గృహమందుఁ దూఱి నుడి♦రొట్టిలఁ జచ్చిరి సర్వకింకరుల్
దనుజవరేణ్య! యన్న విని♦దారుణరోషణభీషణుండునై లో
చనములఁ ద్రిప్పి గిర్గిర న♦జయ్యునిఁ బంచెఁ బ్రహస్తపుత్రకున్. ౧౦౪౦

అర్థములు. ఓడి=పరాజయము నొంది. బెగ్గడిలి=భయపడి, నుడి తొట్రిలన్=మాట తడఁబడ, అజయ్యునిన్=జయింపశక్యముగాని వానిని.

తాత్పర్యము

హనుమంతునిచేఁ బరాజితులై భయపడి యిఁక నుండినఁ జచ్చెద మను భయమునఁ బరువెత్తి రావణు నింటిలోఁ దూఱి మాటఁ దడఁబడ రావణా, యందఱు కింకరులు చచ్చిరయ్యా యనిన విని తీవ్రకోపముచే భయంకరుఁడై గ్రుడ్లు గిరగిర ద్రిప్పుచు ప్రహస్తుని కొడుకును జయింపరాని బలముగల వానిని బంపెను.

—♦ ౪౩-వ సర్గము. హనుమంతుఁడు ప్రాసాదమును విఱుగఁ దన్నుట ♦—

ఉ. ఆ దనుజాళిఁ జంపి పవ♦నాత్మజుఁ డంతయుఁ బాఱఁ జూచి యే
లా దుము దుమ్ము చేసియు వి♦లాసవనంబును, ద్రుంప నైతిఁ బ్రా
సాద మటంచు నెంచి పెలు♦చం గనకాచలశృంగతుంగ మై
మాదిరిమీఱు నత్తలము♦మానలు నల్లలనాడ దూఁకుచున్. ౧౦౪౧

తాత్పర్యము

కింకరుల నందఱఁజంపి హనుమంతుఁడు నాలుగు ప్రక్కలఁ బాఱఁజూచి యుద్యానవనమును దుమ్ము దుమ్ముగా నేలఁగలిపి, యేల యీ మేడను పడఁగొట్టనైతి నని తలఁచి కోపించి మేరుపర్వతశిఖరముతో సమానమైన యా ప్రదేశ మందము చెడునట్లు లది యుత్తూఁత లూఁగునట్లు దానిపైకి దుమికెను.

క. ఎక్కి శిఖరంబుమీఁదను, నిక్కునఁ గూర్చుండి పా♦వనియు భాసిల్లెన్
దిక్కుల వెలుంగు తేజము, పెక్కువనుదితార్కమాఱు♦బింబంబగుచున్.

అర్థములు. ఉదితార్క మాఱుబింబము=పుట్టిన సూర్యునికి ప్రతిబింబము. ఇట్లు చెప్పుటచే నిప్పుడు సూర్యోదయ మయ్యెనని సూచన. ప్రాసాదము=లంకాధిదేవతగుడి. చూచుటకు మేడవలె నుండుటచేఁ బ్రాసాద మనఁబడెను.

తాత్పర్యము

ఆ మేడ శిఖరము మీఁద నెక్కి దిక్కుల వెలుఁగఁజేయు కాంతితో నుదయించిన సూర్య బింబమున కుద్దియై కూర్చుండెను.

క. ధ్వంసంబు చేసి సమరరి,రంసువు ప్రాసాద మెల్ల♦రాజిల్లె బలి
ష్ఠాంసములు వెలుఁగ సురలు ప్ర,శంసింపఁగఁ బారియాత్ర♦శైలాకృతియై.

అర్థములు. సమరరిరంసువు=యుద్ధక్రీడయం దాసక్తి గలవాఁడు, బలిష్ఠాంసములు=బలముగల మూఁపులు; పారియాత్రశైలాకృతియై=పారియాత్ర పర్వతము వలె.

తాత్పర్యము

యుద్ధమునఁ గ్రీడించు కోరిక గల హనుమంతుఁడు మేడయంతయు విఱుగఁ దన్ని దేవతలు స్తోత్రము చేయుచుండఁ బారియాత్రపర్వతమువలె బలముగల మూఁపులతోఁ బ్రకాశించెను.

క. దుర్భరరవరయము శ్రవో, గర్భంబులు చీల్ప నసురకాండములకుఁ బ్రా
విర్భూతామర్షంబున, నార్భటి యొనరించె రక్షకావళి స్రుక్కన్. ౧౦౪౪

అర్థములు. దుర్భర రవరయము=అధికమైన ధ్వనియొక్క వేగము; శ్రవో గర్భంబులు=చెవులగూబలు; కాండములకున్=సమూహములకు, ప్రావిర్భూతామర్షంబునన్=మిక్కిలి పుట్టిన రోషము, ఆర్భటిన్=సింహనాదము, రక్షకావళి=కావలివాండ్ర సమూహము.

తాత్పర్యము

సహింపరాని ధ్వనివేగము రాక్షస సమూహముల చెవుల గూబలుపగులఁ దీయఁగా మిగులఁ గోపంబున రాక్షసులు మూర్ఛపోవునట్లు సింహనాదముచేసెను.

చ. జయము జయంబు రామునకుసర్వమహాస్త్రవిదగ్రవర్తికిన్
జయము జయంబు విద్విషదసహ్యతిరస్వి సుమిత్రపట్టికిన్
జయము జయంబు దాశరథిసంపరిపాలితుఁ డౌ వలీముఖో
చ్చయపతి సూర్యపుత్రునకుసాహసవిక్రమకీర్తి శాలికిన్. ౧౦౪౫

అర్థములు. సర్వమహాస్త్ర విదగ్రవర్తికిన్=అన్ని మహాస్త్రములను దెలిసిన వారిలో శ్రేష్ఠునికి.

తాత్పర్యము

౧౦౩౪ వ, ప. చూచునది.

ఉ. దాసుఁడ సర్వసద్గుణవితానమనోహర రామమూర్తికిన్
గోసలదేశవల్లభునకున్ హతశత్రుఁడ వాయుపుత్రుఁడన్
నా సరి గారు సంగరమునన్ దశకంఠులు వేవు రేనియున్
వాసి యడంతు సాల ద్రుమపాళుల నే హనుమత్సమాఖ్యుఁడన్. ౧౦౪౬

తాత్పర్యము

౧౦౩౫ వ. ప. చూచునది.

క. ధ్వంసంబుఁ జేసి లంకను, హింసించి సమస్తరాక్షసేంద్రుల సీతా
హంసీయానకు మ్రొక్కి ప్రశంసితగతిఁ జనెద మిడుకసకలసురారుల్. ౧౦౪౭

తాత్పర్యము

౧౦౩౬ వ. ప. చూచునది.

— హనుమంతుఁడు చైత్యపాలకులఁ జంపుట —

మ. అని గర్జింపఁగఁ జైత్యపాలకశతంబా నాద మాలించి హృ
జ్జనితామర్షము పేర్మిఁ బట్టుకొని శస్త్రప్రాసకుంతాదులన్
హనుమంతు న్వడి నొంప గంగ సుడిగుండంబో యనం గ్రాలె నా
దనుజస్తోమము కీశవర్యుఁడును రౌద్రస్ఫూర్తి సాటోపుఁడై. ౧౦౪౮

అర్థములు. చైత్యపాలక శతంబు=దేవతగుడిని రక్షించు కావలి వారిగుంపు. హృత్+జనిత+అమర్షము = హృదయమునందుఁ బుట్టిన కోపము-ప్రాసము= ఈఁటె; కుంతము=ఈఁటె; ఈ రెంటికిని నాకారమునందుఁ గొంచెము భేదము. సాటోపుఁడై=ఆటోపముతోఁ గూడినవాఁడై.

తాత్పర్యము

అని సింహనాదము చేయఁగా నా దేవాలయము కావలి వారిగుంపు ఆధ్వని విని కోపాతిశయమునఁ జుట్టు ముట్టుకొన యీఁటెల చేతను. ఇతర సాధనముల చేతను హనుమంతుని నొప్పింప నపుడు ఆ రాక్షసుల గుంపు గంగయందలి సుడి గుండమువలె నుండెను. వానరేంద్రుఁడును ఆటోపముతోఁ గూడినవాఁడై, భయంకరుఁడై.

సీ. ప్రాసాదమునను స్తం♦భంబును బెకలించి, గిర గిర మన చూడ్కి♦కిని నగోచ
రముగ వేవిధముల♦రభసంబునను ద్రిప్పఁ, దజ్జాతశిఖిశిఖో♦త్కరము గవిసి
ప్రాసాద మెల్లను♦భస్మంబుఁ గావించె, వాయుసూనుండు దై♦తేయశతముఁ
గాలుని పురి కన్చి♦గగనంబునకు దాఁటి, యి ట్లను బిగ్గర♦నెల్ల వినఁగ
తే. వినుఁడు నావంటివారలు♦వేలకొలఁదు, లనని వర్తించు చున్నార♦లవనిజాత
నెమక సుగ్రీవవశవర్తు♦లమితబలులు, వానరేంద్రులు లంకాని♦వాసులార!

అర్థములు. రభసంబునను=వేగముగ, తజ్జాత=ఆ త్రిప్పుడు చేతఁ బుట్టిన, శిఖి శిఖోత్కరము=అగ్నిజ్వాలల సమూహము, ప్రాసాద మెల్లను=ఎల్లప్రాసాదమును, ఎల్ల శబ్దము ద్రుతాంతమైన యవ్యయము.

తాత్పర్యము

ఇదివఱకుఁ బుట్టియుండిన గుడియ చిన్నదని తోఁచుటచే దేవళమందలి ధ్వజ స్తంభమును బీకి కన్నులకుఁ గానరాకుండునట్లు వేయిమార్లు గిరగిర ద్రిప్పఁగా నా వేఁడిమి కుదయించిన యగ్నిజ్వాల లా దేవాలయమును భస్మము గావించెను. అంతట దాని కావలి రాక్షసులఁ జంపి యాకాశమున కెగిరి యందఱు వినునట్లు గట్టిగా నిట్లనియె. ఓ లంకా నివాసులారా! వినుఁడు. నావంటివారు వేలకొలఁదులు వానరులు సుగ్రీవునకు లోబడి మహాబలము గలవారు సీతాదేవిని వెదకుచున్నారు.

సీ. పదియేనుఁగుల పాటి♦బలియురు కొందఱు, కొందఱు నూ ఱేనుఁ♦గుల బలంబు
దనరినవా రిభ♦దశశతబలయుతుల్, కొందఱు వాయువే♦గులును గలరు
అప్రమేయబలాఢ్యు♦లర్కజుకడ నిట్టి దంతనఖాస్త్రసా♦ధనులఁ గపుల
నూఱులు వేలును♦నూఱువేల్ కోట్లును, బదికోట్లు నెన్నంగఁ♦బాటిగాని
తే. వారిఁగొనివచ్చు వానర♦వర్యుఁడౌన, మేయబలుఁడు సుగ్రీవుండు♦మిమ్ముఁ జంపు
రామచంద్రునితోడ వైరమును గొంటి, రింక నెచ్చటి రావణుఁ♦డెచటిలంక?

అర్థములు. ఇభదశ శతబలయుతుల్=వేయి యేనుఁగుల బలముగల

వారు, దంత-నఖ-అశ్మ సాధనుల్=దంతములు గోళ్ళు ఱాలు ఆయుధములుగఁ గలవారు.

తా త్ప ర్య ము

పది యేనుగుల బలము గలవారు కొందఱు, నూఱేనుఁగుల బలము గల వారు కొందఱు, వెయ్యి యేనుఁగుల బలము గలవారు కొందఱు, వాయువేగము గలవారు కొందఱు, కొలది చెప్పరాని బలము గలవారు కొందఱును సుగ్రీవునొద్ద నున్నారు. వీరందఱు గోళ్ళు దంతములు ఱాలు సాధనములుగఁ గలవారు. ఇట్టి కపులను నూర్లు-వేలును-లక్షలు-కోట్లు పదికోట్లు లెక్కింప సాధ్యముగాని వారినిఁ దీసికొని యమేయబలుఁడు వానరరాజు సుగ్రీవుఁడు వచ్చును. మిమ్మెఁ జంపును. నిష్కారణముగ శ్రీరామచంద్రమూర్తితో విరోధించితిరి.ఇఁక రావణుఁ డెచ్చట, లంకయెచ్చట, మీ రెచ్చట? ఋణానుబంధము తీఱిన దని తలఁపుడు.

అంతఃపురమునకు వచ్చుచుండు వారికిఁ దప్పఁ దక్కిన వారికి సీత లంకలో, నున్న దను వార్తయే తెలియదు. అంతయు రావణుఁడు రహస్యముగ నుంచెను.

—♦ ౪౪-వ సర్గము. హనుమంతుఁడు జంబుమాలిని వధించుట ♦—

ఉ. అంతట నేగుదెంచెను ప్రహస్తసుతుం డగు జంబుమాలి దే
వాంతక చోదితుం డయి మహారథసంబున రక్తమాల్యముల్
వింతగు రక్తవస్త్రములు లీలగఁ గుండలముల్ ధరించి దు
ర్దాంతబలుండు వాసవశరాసనతుల్యశరాసహస్తుఁ డై. ౧౦౫౧

అర్థములు. దేవాంతక చోదితుండు=రావణుచే నాజ్ఞాపింపఁబడిన వాఁడు మహారథసంబునన్=మిగుల వేగముగ; వాసవ శరాసన తుల్య=ఇంద్రధనుస్సుతో సమానమైన, చాపహస్తుఁడై=వింటిని చేతియందుఁ గలవాఁడై.

తా త్ప ర్య ము

హనుమంతుఁ డీ కార్యము చేయుచుండఁగా రావణుచేఁ బ్రేరింపఁబడిన జంబుమాలి యను ప్రహస్త పుత్రుఁడు మిగుల వేగముగ నెఱ్ఱని పూలదండలు, నెఱ్ఱని వస్త్రములు, కుండలములు ధరించి యింద్రచాపమువంటి చాపము చేతఁ బట్టుకొని మహాబలశాలి యగువాఁడు.

ఉ. సాయక మొండు గైకొని దిశావలయంబు వణంక జ్యాలతం
బాయక మీటుచున్ ఖరసమంచిత మైన రథంబు నెక్కి తన్
డాయఁగ వచ్చువానిని ఘనం బగు నాకృతివానిఁ గాంచి లో
వాయుజుఁ డుబ్బి యార్చె సురవైరిసమూహము పిచ్చలింపఁగన్. ౧౦౫౨

అర్థములు. దిశావలయంబు=దిక్చక్రము, జ్యాలతన్ = తీఁగెవంటి నారిని, ఖరసమంచితము=కంచరగాడిదలఁ గట్టిన, పిచ్చలింపఁగన్=భయపడునట్లు.

తా త్ప ర్య ము

బాణ మొకటి చేతఁ దీసికొని దిక్చక్రము వణఁకునటు లల్లెత్రాడు మీటుచుఁ గంచర గాడిదలు గట్టిన తేరెక్కి తన సమీపమునకు వచ్చు పెద్దదేహము గల వానిని జూచి తగినవాఁడే వచ్చుచున్నాఁడని పొంగి రాక్షసులు భయపడు నట్టులార్చెను.

క. వానరవీరునిఁ గని యా, దానవవీరుండు బాణ•దశకము వింటిన్
బూనిచి బాహులఁ గ్రుచ్చుచు, నాననమునఁ దలను మార్గ•ణావలి నాటెన్.

అర్థములు. మార్గణావళిన్=బాణపంక్తులను.

తా త్ప ర్య ము

ఆ రాక్షసవీరుఁడు వానరవీరునిఁ జూచి వింటఁ బది బాణములు సంధించి బాహువులఁ గ్రుచ్చుచు ముఖమునందుఁ, దలయందు బాణపంక్తులు నాటుకొన వేసెను.

బాహుయుద్ధము చేయువారిని బంపిన నాఁగ రని కింకరవధచేఁ దెలిసికొని దూరమునుండి కొట్టువానిగా వింటి యుద్ధము చేయువానిని రావణుఁడు పంపెను.

క. శరనిహతముఖము రక్తని,కర బిందునిషిక్త మగుచు•ఖరకరకిరణో
త్కర వికసితశరదాగమ,సరసీజాతంబు సొంపు•సంపాదించెన్. ౧౦౪౪

అర్థములు. శరనిహతి ముఖము=బాణములచేఁ గొట్టబడిన ముఖము-రక్తనికరబిందు=నెత్తుటి సమూహముయొక్క బొట్లచే, నిషిక్తము=తడిసినది, ఖరకర=సూర్యునియొక్క, కిరణోత్కర=కిరణసమూహములచే, వికసిత=వికసించిన, శరదాగమ=శరత్కాలమందలి, సరసీజాతంబు=కమలముయొక్క, సొంపు=అందము.

తా త్ప ర్య ము

బాణములచేఁ గొట్టఁబడిన హనుమంతుని ముఖము నెత్తుటి బొట్లచేఁ దడిసి సూర్యకిరణములచే వికసించిన శరత్కాలకమలమువలె నందమై యుండెను.

క. శోణిత మగు కపివదనము, శోణితబిందువుల చేత•శోభిలి మింటన్
శోణిత చందనబిందుల, రాణించెడి కోకనదము•రాణఁ దలిర్చెన్. ౧౦౪౫

అర్థములు. శోణితము=ఎఱ్ఱనిది, శోణిత బిందువుల చేత=రక్తబిందువులచే, శోణితచందనబిందులన్=రక్తచందనపు బొట్లచే, కోకనదము=ఎఱ్ఱకమలము. అనుగుణాలంకారము ఒక్కవస్తువు నందున్న గుణమే మఱియొక వస్తుసన్నిధిచే నెక్కువైనట్లు చెప్పిన ననుగుణాలంకార మగును. యమునానది యందలి నల్లకలువలన్నట్లు.

తా త్ప ర్య ము

ఎఱ్ఱని హనుమంతుని ముఖము ఎఱ్ఱని నెత్తుటి బొట్లచేత నాకాశమున నెఱ్ఱని చందనపు బొట్లుగల యెఱ్ఱతామరవలె నుండెను.

సీ. రోపాళితాఁకునఁ♦గోపించి మారుతి, డాపున నుండు బం♦డను నొకండు
గొనివైన వాఁడును♦ దునుకలు గావించెఁ, బదిబాణముల దాని♦పాటు గాంచి
కపి సాల మొక్కండు♦గ్రక్కునఁ గైకొని, త్రిప్పంగ దానిని♦దితిజవరుఁడు
నాలుగుశరముల♦లీలమై ఖండించి, యేనిట భుజముల♦నేసి వక్ష
ఆ. మునను నొకటఁ బదిట♦ స్తనదేశమును గొట్ట, దీప్తబాణవిద్ధ♦దేహుఁ డగుచు
బరిఘ మదియ త్రిప్పి♦గిరగిర మని వాని, యొమ్మునూటి చూచి♦యువ్వటయును.

అర్థములు. రోపాళి=బాణముల వరుస, సాలము=చెట్టు, ఏనిటన్=ఐదు బాణములచే, బాణవిద్ధ=బాణములచే వేధింపఁబడు.

తాత్పర్యము

బాణములు వరుసలుగఁ దాఁకుటచే హనుమంతుఁడు కోపించి సమీప మందున్న బండనెత్తి వానిమీఁద వైవఁగా వాఁడు దానినిఁ బది బాణములచేఁ దునుకలు చేసెను. అది పడిపోవుట చూచి హనుమంతుఁడు చెట్టు నొక్కటి పీఁకి గిరగిర త్రిప్పుచుండఁగా దానిని నాలుగు బాణముల నవలీలగా వాఁడు నఱకి; యైదు బాణముల భుజములను, నొక్క బాణముచే వక్షమును, పదిబాణములచే స్తన ప్రదేశమును గొట్టఁగా మండుచున్న బాణములచే వేధింపఁబడిన దేహము గలవాఁడై మునుపటి యినుపకట్ల గుండు తీసికొని గిరగిర త్రిప్పి వాని యొమ్ము గుఱి చూచి విసరికొట్టెను.

క. తల యేదో చెయి యేదో, మొల యేదో చాప, మేదో♦మోఁకాళ్ళేవో
తెలియక యుండఁగ దితిజుఁడు, నులి నులియై నేల రాలె♦నుగ్గై నూచై.

తాత్పర్యము

దాని దెబ్బచేత నిది తల, యిది మొల, యిది చేయి, యిది విల్లు, యిది మోఁకాళ్ళని గుర్తింపరాక యుండునట్లు వాఁడు పొడిపొడియై నుగ్గై నేలరాలెను.

క. స్యందనముతోడ ఘోటక, బృందముతోఁ బూనియున్న♦యిషుకాండముతో
నందము లగు భూషలతో, మ్రందెను రక్కసుఁడు ముద్ద♦మాడ్కిగ నగుచున్.

అర్థములు. స్యందనముతోడన్=తేరితో; ఘోటకబృందముతోన్ = గుఱ్ఱముల సమూహముతో, ఇక్కడఁ దేరికి గట్టిన కంచరగాడిద లని యర్థము. ఇషుకాండముతోన్=బాణసమూహముతో; భూషలతో=ఆభరణములతో.

తాత్పర్యము

తేరితోడఁ, దేరికిఁ గట్టిన కంచరగాడిదలతోడ, వాఁడు సంధించిన బాణములతోడ, వాఁడు ధరించిన సొగసైన యాభరణములతోడ, రాక్షసుఁడు ముద్దగానై పడెను.

ఆ. జంబుమాలిపాటు♦చయ్యన హతశేష, కింకరాళి దెలుపఁ♦గింక రేఁగి
పంక్తికంఠుఁ డంతఁ♦బనిచె నమాత్యపు, త్రకుల శౌర్యగర్వ♦దర్పధనుల. ౧౦౫౯

అర్థములు. హతశేష కింకరాళి=చావఁగా మిగిలిన కింకరుల గుంపు,

కింకన్=కోపముతో; అమాత్యపుత్రకులన్=మంత్రికుమారులను, ఒక విలుకాఁడు హనుమంతుని సాధింపలేఁడని పెక్కుర బంపెను.

తాత్పర్యము

చంపఁబడఁగా మిగిలిన కింకరులు జంబుమాలి చచ్చెనని తెలుపఁగా రావణుఁడు కోపించి శౌర్యదర్పముల గొప్ప వారగు మంత్రిసుతులఁ బంపెను.

—♦ ౪౫-వ సర్గము. హనుమంతుఁడు మంత్రిపుత్రుల నేడ్వురఁ జంపుట ♦—

సీ. సప్తార్చివర్చసుల్♦సప్తసంఖ్యులు వారు, వెలువడి శరచాప♦వివిధసాధ
నంబులఁ గైకొని♦జంబుమీఱఁగఁ బర,స్పరజయవాంఛులై♦భర్మజాల
కేతనమాలికా♦కీలితరథములు, నంబుదధ్వానంబు♦లట్లు మొరయఁ
జాప టంకృతుల ది♦శాభాగ మగలఁగఁ, గార్ముకుంగుల యట్లు♦గ్రాలి చనఁగ

తే. వారితల్లులు కింకర♦వార్త వినుట, కొడుకు లే మగువార లొ♦కో యటంచు
బాంధవాప్త సమేతులై♦పల్లటిలిరి, సురవిరోధులు పవమాన♦సుతుని డాసి.

అర్థములు. సప్తార్చి వర్చసుల్=అగ్నివంటి కాంతిగలవారు. సప్తార్చి వర్చసుల్-శేషాద్విభాషా (పాణిని ౫-౪-౧౫౪) ప్రకారము కవర్ణాగమ మనిత్యమగుటచే నిచ్చట వర్చస్కులని చెప్పఁబడలేదు. పరస్పర జయ వాంఛులై=ఒకరినొకరు గెలువఁ గోరికఁగలవారై, ఒకరిని మించి యొకరు హనుమంతుఁ బట్టుకొను కోరిక గలవారై, భర్మజాల=బంగారు మయములైన; కేతన మాలికా=ధ్వజముల వరుసలచే, కీలిత=కట్టఁబడిన, అగలఁగన్=పగులఁగా, కార్ముకుంగులు = తొలుకారు మెఱుఁగులు, పల్లటిలిరి=వ్యసనపడిరి.

తాత్పర్యము

అగ్నివలె మండు వారేడ్వురు గృహంబులు వదలి విండ్లు, బాణములు తక్కిన సాధనములు తీసికొని యొకరిని మించి యొక్కరు జయము నొందనలయునని కోరిక గలవారై బంగారు మయములైన ధ్వజము లెత్తిన రథములు, మేఘములుఱిమినట్లు ధ్వనింపఁగాఁ బోయిరి. వారి తల్లులు కింకరులవార్త విన్నవారగుటచే వీరే మగుదురో యని చుట్టపక్కములతో వ్యసన పడిరి. ఆ రాక్షసులు హనుమంతుని సమీపించి,

ఉ. స్యందనగర్జితస్వనము♦సాయక వృష్టియుఁ గ్రాల దేవతా
బృందవిరోధివారిధర♦మెంతయు మూఁగిన వాయుసూనుఁడున్
గొందలపాటు లేక యొక్క♦కొండన నోర్చి గరించె నింటని
ర్మందరయాన రాక్షసశ♦రంబులకున్ గుఱిగాక వేగినై. ౧౦౬౧

అర్థములు. స్యందన గర్జితస్వనము=తేరులయొక్క ధ్వని యనెడి యుఱుముల ధ్వనియు, సాయకవృష్టియు=బాణముల వర్షమనెడి వర్షము, దేవతాబృంద

విరోధివారిధరము=రాక్షసు లను మేఘము, రూపకాలంకారము. కొండలపాటు=కలఁతపడుట, కొండన=కొండయో యనునట్లు, ఉత్ప్రేక్షాలంకారము, నిర్మందర యాన=మిగుల వేగముగా వచ్చెడి, వేగియై=వేగము గలవాఁడై.

## తాత్పర్యము

రథచక్రముల ధ్వని యుఱుములుగా, బాణప్రయోగము వర్షముగా రాక్షసులనెడి మేఘము క్రమ్ముకొనఁగా హనుమంతుఁడు పర్వతమువలెఁ గలఁత పడక యతి వేగముగ వచ్చువారి బాణములకు గుఱిగాక వేగము గలవాఁడై యాకాశ ననే తిరిగెను.

క. ఇంద్రశరాసనసంయుత, సాంద్రాంబుదపంక్తి కలఁచు•శ్వసనం డనఁగా
రుంద్రప్రతాపి కపియు న,తంద్రతఁ గోదండధరుల•దైత్యులఁ గలఁచెన్.

అర్థములు. ఇంద్రశరాసనసంయుత=ఇంద్రధనుస్సుతోఁ గూడిన, సాంద్ర+అంబుద పంక్తి=దట్టమైన మేఘపంక్తులను; కలఁచు = కలఁతపడునట్లు చేయు; శ్వసనుం డనఁగా=వాయువో యనునట్లు; రుంద్రప్రతాపి=ఘనమైన ప్రతాపము గల, అతంద్రతన్=హెచ్చరికతో.

## తాత్పర్యము

ఇంద్రధనుస్సుతోఁ గూడిన మేఘముల గుంపును వాయువు కలఁచునట్లు ఘనమైన ప్రతాపము గల హనుమంతుఁడు హెచ్చరిక గలవాఁడై రాక్షసులను సంక్షోభింపఁ జేసెను.

క. కంఠారవ మారఁగఁ గపి, కంఠీరవ మపుడు గవిసి•క్రవ్యాదవధో
త్కంఠుండై తలపదనఖ, కుంఠితములఁ జేసె నేలఁ•గూల బలంబుల్. ౧౦౬౩

అర్థములు. కంఠ+ఆరవ=కంఠధ్వని; ఆరఁగన్=అతిశయింపఁగా; కంఠీరవము=సింహము; క్రవ్యాదవధ=రాక్షసుల చంపుటయందు; ఉత్కంఠుఁడై=వేగిరపాటు గలవాఁడై; తల-పద-నఖ కుంఠితములన్=అరచేత, కాల, గోళ్ళచే ధ్వంసమయిన వానిఁగా.

## తాత్పర్యము

పెద్ద సింహనాదముచేసి కపిసింహ మపుడు రాక్షసుల వధమందు వేగిరపాటు గలవాఁడై వీరితోడనా యింతసేపు యుద్ధమని తలఁచి యా సేనలను నరచేతులతోఁ గాళ్ళతోఁ గొట్టి, గోళ్ళతోఁ జీల్చివైచెను.

ఉ. కొండఱఁగేల బాఁది, మఱి•కొండఱ నేలను మోఁది, గ్రుద్దుచుం
గొండఱ, వెండి కొండఱను•గోళ్ళను జీల్చుచు, నట్టె తాఁకుచున్
గొండఱ గుండువోలె, నొక•కొండఱ దిర్దిరద్రిప్పి వైచుచున్
గొండల మందఁ గూల్చె రిపు•కోటి వనాటవిభుం డుదగ్రుఁడై. ౧౦౬౪

అర్థములు. కేలన్ బాఁది=చేతితోఁగొట్టి; మోఁది=కాళ్ళు పట్టుకొని తల నేలకు వ్రేసికొట్టి; వనాట విభుండు=వానరశ్రేష్ఠుఁడు.

తాత్పర్యము

స్పష్టము.

తే. చెవులు బీఁటలువాఱఁగ♦సింహనాద, మొనరఁజేయఁగ మఱికొంద♦ఱుర్విఁగూలఁ
గాక తక్కరు వెఱచి చీ♦కాకుపడుచుఁ, బోయినదె పోకగాఁ బాఱి♦పోయిరంత.

అర్థములు, బీఁటలు=పగుళ్ళు; తక్కరు=మిగిలినవారు; చీకాకుపడుచున్=శ్రమపడుచు.

తాత్పర్యము

చెవులు పగుళ్లు పాఱునట్లు సింహనాదము చేయఁగా, మఱి కొందఱు నేలఁబడఁగా, దక్కినవారు కష్టపడుచుఁ బోయినదే పోకగా మరల తిరిగి చూడక పరువెత్తిరి.

తే. తన్నుకొని చచ్చు గుఱ్ఱాలు ♦ ధరణిఁ గూలి
మూల్గు నేనుంగులును నేల ♦ మ్రొగ్గతిలిన
గొడుగులును డెక్కెముల్ నిండెఁ ♦ బుడమి నెత్రు
ట్టేర్లు పాఱెను లంకలో ♦ సెగసె నులివు. ౧౦౬

అర్థములు. మ్రొగ్గతిలిన=వ్రేలఁబడిన; ఉలివు=ధ్వని.

తాత్పర్యము

స్పష్టము.

క. వానర వీరుం డీ గతి, మానవభోజుల వధించి♦మసలక చని యు
ద్యానము తోరణమున నా, నీనుండై యుండె రణము ♦ నేసెడుకోర్కిన్.

అర్థములు. మానవభోజులన్=రాక్షసులను; మసలక=జాగు చేయక.

తాత్పర్యము

హనుమంతుఁ డీ విధముగ రాక్షసులఁ జంపి వెంటనేపోయి యుద్యాన తోరణమున నింకను యుద్ధము చేయు కోరికగలవాఁడై కూర్చుండెను.

—♦ ౪౬-వ సర్గము. హనుమంతుని మీఁదికి రావణుఁడు సేనానాయకుల నేవురఁ బంపుట ♦—

సీ. మంత్రితనూజుల♦మరణంబు రావణుఁ; డాలించి మఱుఁగిడి♦స్వాంతమును వి
రూపాక్ష దుర్ధర♦యూపాక్ష భాసక, ర్ణప్రఘసుల సైన్య♦నాయకులను
నేవురఁ గనుఁగొని♦యేగి మీరలు సర్వ, సైన్యంబుతో వన♦చరుని, బట్టి
తేవలయును జంపు♦తేఁకువ వలఁకువ, తప్పక కడుఁ బ్రయ♦త్నంబు చేసి

తే. కాలదేశవిరోధంబు ♦ గలుగకుండఁ
గార్య మొనరింపుఁడీ క్రోఁతి♦గాఁడు వాఁడు
జిష్ణుఁడు తపోబలంబున♦సృష్టి చేసి
యంపెఁ బెనుభూత మొండస్మ♦దర్థముగను.

అర్థములు. మఱుఁగిడి=దాఁచిపెట్టి, స్వాంతమును=మనస్సును, తేఁకువ=ధైర్యము, మెలఁకువ=హెచ్చరిక, జిష్ణుఁడు=ఇంద్రుఁడు, అస్మదర్థముగను=నా నిమిత్తమై.

తా త్ప ర్య ము

మంత్రికుమారులు చచ్చినవార్త విని విరూపాక్షుఁడు, దుర్ధరుఁడు, యూపాక్షుఁడు, భాసకర్ణుఁడు, ప్రఘసుఁడు నను సేనా నాయకు లయిదుగురఁ జూచి మీరు మీ సమస్తసేనలతోఁ బోయి క్రోఁతినిబట్టి తేవలయును జుమా. ధైర్యము హెచ్చరిక తప్పక, మిగులఁ బ్రయత్నముచేసి క్రోఁతి గదా యని యలక్ష్యము సేయక దేశకాల విరోధము లేకుండునట్లు పని సేయుఁడు. వాఁడు నిజమైన క్రోఁతి గాఁడు. ఇంద్రుఁడు తపస్సుచేసి నన్ను జయింపవలయునని పెద్దభూతమును సృష్టి చేసి పంపెను. అని తన మనస్సునఁ గలదానిని దాఁచి మోసపుమాటలనుజెప్పెను. అట్లు చెప్పినఁ గాని వారు దేవేంద్రుని శక్తియేకదా యని ధైర్యముతోఁ బని చేయరు. వాస్తవము చెప్పిన నందఱు నిందింతు రని భయము. మేము యుద్ధము చేయ మని యందు రేమో యని సందేహము.

చ. మిముఁ గొని కాదె గెల్చితిని♦మేటిబలాఢ్యుల నాగయక్ష రా
డమరమహర్షి దానవుల♦నద్భుతరీతి రణాగ్రసీమలన్
సమయము వేచి నా రిపుడు♦సల్పఁగఁ జూచెద రప్రియంబుఁ జుం
డమరవిరోధులార! యెటు♦లైనను గ్రోఁతిని బట్టి తేరుఁడీ. ౧౦౬౯

తా త్ప ర్య ము

మిమ్ము సహాయులఁగాఁ గొనికదా మిక్కిలి బలవంతులైన నాగులను, యక్షుల ప్రభు వగు కుబేరుని, దేవతలను, మహర్షులను, దానవులను యుద్ధభూమి యందు లోకులాశ్చర్యపడునట్లు గెలిచితిని. ఇది మీ రెఱింగిన విషయమే. ఆ కారణముచే వారికి మనకు విరోధ ముండుటయు మీకుఁ దెలిసినవిషయమే. ఎప్పుడు సమయము దొరకునా పగతీర్చుకొందుమా యని వారు కాచికొని యుండుటయు మీకుఁ దెలిసిన విషయమే. ఇప్పుడు వా రందఱుఁ జేరి నాకుఁ గీడుచేయ నాలోచించు చున్నారు. నావలె మీరును దేవ విరోధులే కావున వారు పంపిన యీ క్రోఁతిని మీ రెట్టులైనఁ బట్టుకొని రండు.

ఉ. నేలిగఁ జూడఁబోకుఁడు ప్ర♦కీర్తితవిక్రము నీ కపీశ్వరున్
వాలిని వాలిసోదరు న♦వార్యపరాక్రము జాంబవంతుఁ గీ
శాలిచమూపు నీలు ద్వివి ♦ దాదులఁ జూచితిఁ గాని వారి కీ
వాలినరూపు ధీగతి య♦వారిత తేజము లుల్లసిల్లెనే. ౧౦౭౦

అర్థములు. గేలిగన్=క్రోఁతిగదా యని పరిహాసముగా, కీశాలిచమూపున్=వానరసేనా నాయకుని, వాలిన=అతిశయించిన, ధీగతి=బుద్ధి మార్గము.

తాత్పర్యము

ప్రతిదినము తోఁటలలోఁ, దోఁపులలోఁ, జూచు క్రోఁతిగదా యని పరిహాసముగా నీ క్రోఁతిని జూడవలదు. ఇది మిక్కిలి కీర్తి పొందిన పరాక్రమము గలది. నేను వాలిని, సుగ్రీవుని, వారింపరాని పరాక్రమము గల జాంబవంతుని, వానరసేనానాయకుని నీలుని, ద్వివిదుఁడు లోనగువారిని జూచితినిగాని యిటువంటి గొప్ప యాకారము, బుద్ధిబలము, వారింపరాని తేజము వారి కుండెనా?

చ. ఘనతరభూత మెయ్యదియొ•కైకొని వానరరూప మీ క్రియం
బనివడి రాఁగఁ బోలును, బ్ర•మాదము మాని చరింపుఁ డాజిలో
మనుజసురాసురాదులును•మార్కొనఁ జాలరు మిమ్ము నట్లటం
చును మది నేమఱం దగము•శూరులకుం గలహంబు పట్టులన్. ౧౦౭౧

తాత్పర్యము

ఏదియో గొప్ప భూత మీప్రకారము వానర రూపముతోఁ బనిపూని వచ్చి యుండవలెను గాని, యిది నిజమైన క్రోఁతిగాదు. కాఁబట్టి యుద్ధమందు మిగుల హెచ్చరికతోఁ జరింపుఁడు. మిమ్ము మనుష్యులు, దేవతలు, రాక్షసులు యుద్ధమం దెదిరింపఁ జాలరు. అట్లున్నను మే మింతవారముగదా మా కెవ్వా రెదురని శూరు లగు వారు యుద్ధమందు హెచ్చరిక తప్పరాదు.

చ. కలన జయింతు నేనయనఁ•గాఁ దగ దేరికి, గెల్పు చంచలం
బలఘుతరప్రయత్నమున•నోఁ దన రక్ష యొనర్ప నంచుఁ దాన్
సెల విడ వార లేగిరి వి•శిష్టరథేభతురంగపంక్తితోఁ
గలకలనాదముల్ చెలఁగఁ•గాండశరాసనశస్త్రపాణులై. ౧౦౭౨

అర్థములు. కలనన్=యుద్ధమందు, చంచలము=స్థిరముకానిది; అలఘుతర=మిక్కిలి గొప్పదగు, విశిష్ట=మిగుల శ్రేష్ఠములైన, రథ ఇభ-తురంగ పంక్తితోన్=తేరులు, ఏనుఁగులు, గుఱ్ఱములు వీనియొక్క వరుసలతో—పంక్తి-ఇది సంస్కృతమున 'పఙ్క్తి' యని వ్రాయఁబడును. దీనికిఁ దత్సమమున నిదియె రూపమని యొకరనిరి. కాని యది మహాకవి సంప్రదాయానుసారముగాదు. ఇట్టి శబ్దము లెల్ల-అంకితము-మాతంగము-వాంఛ-ఈ ప్రకార మనుస్వారములు పూర్ణబిందువులుగా మార్చియే వ్రాయఁబడును.(చూ. సు. సంజ్ఞ. ౧౩. నసూ. సూచిక) 'నిండు మనంబు నవ్య నవనీత సమానము, పల్కు దారుణాఖండలశస్త్రతుల్యము జగన్నుత విప్రుల యందు నిక్క మీ. రెండును రాజులందు విపరీతముగావున విప్రుఁడోపు,నోపం డతిశాంతుఁడయ్యు నరపాలుఁడు శాపముఁగ్రమ్మరింపఁగన్' ఇది పూర్ణబిందుప్రాసమున కుదాహరణము. నాలుగు పాదము లందును నిండు

సున్నలే యుండవలెను. ఓ పండు అనునది ఓపణ్డు అని వ్రాయ వ్యాకరణము సమ్మతింపదు. ఓపఁడు అను శబ్దమున అర్థానుస్వారము, నిండుసున్న యగుటకు సూత్రము గలదుగాని యరసున్న వర్గపంచమాక్షరముగ మారు నని సూత్రము లేదు. సంప్రదాయము లేదు. అట్టులే 'సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమైనుండి, మాతంగస్ఫూర్జితయూథదర్శనసముద్యత్క్రోధమై వచ్చు నోజం గాంతారని వాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వచ్చెం గుంతీసుత మధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్॥' అనుచో సింగము తద్భవము గాన తద్భవములందు జ ఞ లు లేవు గావున సిఙ్గమని వ్రాయ రాదు. అట్లులే తెకిఁన పాదం బులం జూచునది.

తాత్పర్యము

యుద్ధమం దెంత బలశాలి యైనను నేనే జయించెదనని చెప్పఁదగదు. ఏలన గెల్పు స్థిరముగాదు. బలవంతుఁడే జయించునను నియతి లేదు. కావునఁ బ్రతి శూరుఁడు తన్ను రక్షించుకొనుటయందు మిగుల గొప్ప ప్రయత్నము సేయవల యును. అని వారి కాజ్ఞ యియ్యఁగా వారు శ్రేష్ఠము లైన రథములు, ఏనుగులు, గుఱ్ఱములు కావలసినన్ని తీసికొని కలకల ధ్వనులతో విండ్లు, బాణము, లాయుధ ములు ధరించినవారై.

—♦ హనుమంతుఁడు సేనానాయకుల నేపురఁ జంపుట ♦—

క. వీరునిఁ బ్రజ్వల దుదయ, త్సూరునివలె వెలుఁగు వాని♦శుభమతిని మహా
కారు మహావేగు మహా,ధీరు మహోత్సాహుఁ గనిరి♦దితిజ వరేణ్యుల్. ౧౦౭౩

అర్థములు. ప్రజ్వలత్ + ఉదయత్ + సూరునివలె-సూరసూర్యార్య మాదిత్య ద్వాదశాత్మ దివాకరాః॥ అమరకోశము. ఇట్లు చెప్పుటచే సూర్యబింబ మింకను ఎఱ్ఱగానే యున్నదని సూచన.

తాత్పర్యము

వీరుని, మండుచు నుదయించు సూర్యునివలెఁ బ్రకాశించు వానిని, మంచి మనస్సు గల వానిని, గొప్ప యాకారము గొప్పవేగము గొప్ప ధైర్యము గొప్ప యుత్సాహము గలవానిని, హనుమంతుని రాక్షసశ్రేష్ఠులు చూచిరి.

సీ. కనుఁగొని దుర్ధరుం♦డనుపమశితపీత, ముఖశరపంచక♦మునను హనుమ
శిరము నొప్పించిన♦హరిపరుం డుప్పర,వీథికి నెగిరి యు♦ర్వీయును దెసలు
నిండ గర్జింప న♦ఖండతేజుం డైన, దుర్ధరుం డొకనూఱు♦తూపు లూని
కపిమీఁద వర్షింపఁ♦గా నల్పమేఘుంబుఁ, దూలించు వాయువు♦లీల వాని

ఆ. మాపి పవనజుండు♦మార్గణ హతి నొచ్చి, మేను పెంచి వేగ♦మింటి కెగసి
యచటినుండి పడియె♦నాతని తేరిపైఁ, గొండమీఁదఁ బిడుగు♦పిండనంగ.

అర్థములు. అనుపమ = అసమానమైన, శిత=పదునైన; పీతముఖ= పచ్చని ముఖము గల, బంగారు గఱులు గల యని భావము. శరపంచకమున=

అయిదు బాణములచే, ఉప్పరపీదికిన్=ఆకాశమునకు, తూపులు=బాణములు, మార్గణహతిన్=బాణముల దెబ్బలచే.

తా త్ప ర్య ము

ఇట్లు చూచి యందు దుర్ధరుం డను వాఁడు అసమానమై, పదునైన పచ్చని యైదు బాణములచే హనుమంతుని తలను నొప్పింపఁగా వానరశ్రేష్ఠు డాకాశ మున కెగిరి, భూమి, దిక్కులు నిండ సింహనాదము సేయఁగా బూర్ణ తేజస్సుగల దుర్ధరుఁడు నూఱు బాణములు వానరుని మీఁద గురియింపఁగాఁ జిన్న మేఘము నెగురఁ జిమ్ము వాయువు వలె వాని నెగురఁగొట్టి హనుమంతుఁడు బాణముల దెబ్బలకు నొప్పి చెందియు దేహమును బెంచి యాకాశమున కెగిరి యచ్చటనుండి కొండ మీఁదఁ బిడుగు గుంపు పడినట్లు దబాలున వాని తేరిపైఁ బడెను.

ఆ. హయము లెనిమిదియును♦నక్షకూబరములు, సమసి విఱిగె వాఁడు♦స్యందనంబు
నుండి పడియె విడిచి♦యుసుఱు, వానిని గాంచి, తీవ్రరోషు లగుచు♦దివికినెగిరి.

అర్థములు. అక్షకూబరములు=బండికన్ను, నొగలు-క్రమాలంకారము.

తా త్ప ర్య ము

ఎనిమిది గుఱ్ఱములు చచ్చెను. బండిసన్ను నొగలు విఱిగెను. వాఁడు ప్రాణ ములు వదలి తేరిమీఁదనుండి పడెను. వానిని జూచి మిగులఁ గోపించినవారై యాకాసమున కెగసి.

రాక్షసులు వేసిన బాణములు పోవు నెత్తుకంటె నింకను నెత్తున హనుమంతుఁ డుండుచే వీరి బాణము లాయనకుఁ దగులకయె క్రిందఁ బడుచుండెను. కావున వారును నాకాశమున కెగిరిరి.

తే. అల విరూపాక్షయూపాక్షు♦లనెడివారు,కపియురస్థలి మోఁదము♦ద్గరములెత్తి
హనుమ వారల వేగంబు♦నాఁగి మఱలఁ, బృథ్వికిని డిగ్గి చెట్టొండు♦పెల్లగించి.

తా త్ప ర్య ము

మీఁదఁ జెప్పిన విరూపాక్షుఁడు, యూపాక్షుఁ డనెడివారు వానరుని ఱొమ్ము పగులఁగొట్ట ముద్గరము లెత్తుకొని రాఁగా వారివేగమును హనుమ యణఁచి తటాలున భూమిపైకి వచ్చి చెట్టొకదానిని బెల్లగించి.

ఉ. వారలఁ గొట్టి చంపఁ దమ♦వారల ముఫ్ఫురపాటుఁ గాంచి దు
ర్వారతరాగ్రహంబునను ♦ బట్టిసముం బ్రమసుఁడు వైచినన్
శూరుఁడు భాసకర్ణుఁడును ♦ శూలముఁ గైకొని గ్రుమ్మెఁ గ్రుమ్మినన్
మారుతి బాలభాస్కరుని♦మాడ్కిని మండుచు రక్తసిక్తుఁడై. ౧౦౨౨

తా త్ప ర్య ము

ఇప్పుడు రాక్షసులు మీఁద నుండిరి. హనుమంతుఁడు క్రిందవైపున నుండెను

వా రాకాశమునుండి క్రిందికి వచ్చులోపల హనుమంతుఁడు చెట్టు పీకికొని పోయి వారిని గొట్టఁగా వారి ముద్గరములు పొట్టివి, చెట్టు పొడుగాటిది యగుటచే వారి దెబ్బలు హనుమకుఁ దగుల లేదు, హనుమంతుఁడు కొట్టినది వారికిఁ దగిలెను. దానితో వారు చచ్చిరి. ఇట్లు తమవారు ముగ్గురు చావఁగా మిగులఁ గోపించి మిగిలిన యిరువురిలో ప్రఘసుం డనువాఁడు పట్టిసమును వైచెను. భాసకర్ణుఁడు శూలముతోఁ బొడిచెను. ఇట్లు పొడువఁగా నాంజనేయుఁడు నెత్తుటఁ దడిసి బాల సూర్యునివలె మండుచు.

త. తరుమృగ ఫణిసంయుత మగు,ధరణీధరశృంగమునను•దద్రాక్షసులన్
 బురుగతి వైచిన నయ్యిరు,వురు ద్రావాలిరి యపగతాసు•వు లయి ధరిత్రిన్.

అర్థములు. తరుమృగఫణిసంయుతము = చెట్లతోను, మృగములతోను, పాములతోను గూడినది. ధరణీధర శృంగము=పర్వత శిఖరము-పురుగతిన్= గొప్ప వేగముతో అపగత+అసువులు=పోయిన ప్రాణములు గలవారు. ప్రాణము పోయినవారు.

తాత్పర్యము

చెట్లతో మృగములతో పాములతో, గూడియుండిన పర్వత శిఖర మొట్లున్న దాని నట్లే తెచ్చి యా రాక్షసులపై మహావేగముతో వైవఁగా వా రిరువురు చచ్చి నేలఁ బడిరి.

క. ఏవురు దళవాయులు నిటు, చావం బెఱవారి నెల్లఁ•జక్కాడఁచెను దం
 తావళహయభటతతి దం,తావళహయభటుల నసుర•తతి నింద్రుఁ డనన్.

అర్థములు. దళవాయులు = సేనానాయకులు. దళవాహి—ప్రకృతి; చక్కాడఁచెను=చంపెను, దంతావళహయభటతతిన్=ఏనుఁగులయు, గుఱ్ఱములయు, భటులయు సమూహమును, దంతావళము- దంత + వలయు=దంతావలము-ఇచట వలప్రత్యయమునకుఁ గల యని యర్థము. మత్వర్థీయము.

తాత్పర్యము

ఏవురు సేనానాయకు లిటు చావఁగాఁ దక్కిన సేనను ఏనుఁగులతో నేనుఁగులను, గుఱ్ఱములతో గుఱ్ఱములను, భటులతో భటులను గొట్టి యింద్రుఁడు రాక్షసులఁ జంపినట్లు చంపెను.

క. చనఁ దెరువులేక యుండఁగ, ఘనగజహయభటచయంబు•క్ష్మా నెఱసిన నా
 హనుమ లయకాలుఁ డనఁగా,జని తోరణసీమఁ జేరె•శ్రాంత్యర్థ మనస్.

అర్థములు. తెరువు=త్రోవ, క్ష్మాన్=భూమియందు, లయకాలుఁడు=ప్రలయ కాలమందలి యముఁడు, శ్రాంత్యర్థము=బడలిక తీర్చుకొనుటకు.

తాత్పర్యము

పోవుటకు మార్గములేకుండునట్లు పెద్ద యేనుఁగులు, గుఱ్ఱములు, భటులసమూ

హము భూమిమీఁద నెఱపినట్లు వ్యాపింపఁగా ప్రలయకాల యమునివలె హనుమంతుఁడు బడలిక దీర్చుకొనుటకో యన్నట్లు తోరణసీమ చేరి కూర్చుండెను.

ఉత్ప్రేక్షాలంకారము. అనన్ ఇది యుత్ప్రేక్షావాచకము.

-♦ ౪౭-వ సర్గము. హనుమంతునిమీఁదికి రావణుఁ డక్షకుమారునిఁ బంపుట ♦-

సీ. దళవాయు లేవురు♦దళములతోఁ బోర, హతు లౌట విని యమ♦రారినేత
సమరోద్ధతోన్ముఖుఁ♦జండవిక్రమశాలిఁ, దన తనూభవు వక్షుఁ♦గనుఁగొనంగఁ
గనుసన్న యెఱిఁగి రా♦క్షస వీరుఁడును స్వర్ణ,చిత్రకార్ముకమును♦జేతఁ బూని
ద్విజవరుల్ వేల్వంగ♦వెస భగ్గు మని లేచు,నగ్నినా దిగ్గన♦నట్టె లేచి

తే. తపము బలమున నార్జింపఁ♦ద ప్తకనక,జాలిశోభిత మై రత్న♦జాలలసిత
కేతనాంచిత మై జవో♦పేతసైంధ,వాష్టకసుయోజితం బయి♦యమరి మఱియు.

అర్థములు. దళములతో=సేనలతో, పోరన్=రణమందు, సమర+ఉద్ధత+ఉన్ముఖున్=యుద్ధమునందు గర్వించినవాఁడు, యుద్ధమునకు సిద్ధపడి యుండువాఁడు, కనుసన్న=కంటిసంజ్ఞ, స్వర్ణచిత్రకార్ముకమున్=బంగారుచే నలంకరింపఁబడిన వింటిని, ద్విజవరుల్=బ్రాహ్మణశ్రేష్ఠులు, వేల్వంగన్=హోమము సేయఁగా, తప్తకనకజాల=పుటము వేయఁబడిన బంగారు సమూహముతో, శోభితమై=ప్రకాశించునదియై, రత్నజాలలసిత=రత్నసమూహములచేఁ బ్రకాశించు, కేతనాంచితమై=ధ్వజములచే నొప్పునదై, జవోపేత=వేగముతోఁ గూడిన, సైంధవాష్టక=ఎనిమిది గుఱ్ఱములచే, సుయోజితంబయి=చక్కఁగాఁ గట్టఁబడినదై.

## తాత్పర్యము

అయిదుగురు సేనానాయకులు సేనలతోడ యుద్ధమందు జచ్చుట విని రావణుఁడు యుద్ధగర్వముగలవాఁడును, యుద్ధమునకుఁబోవ సిద్ధపడి యుండువాఁడును, భయంకరమైన పరాక్రమము గలవాఁడును తన కొడుకు నైన యక్షు డనువానిని జూడఁగా వాఁడు తండ్రి కంటిసంజ్ఞ యెఱిఁగి బంగారుచేఁ జిత్రింపబడిన విల్లుచేతఁ బూని బ్రాహ్మణులు హోమము సేయఁగా భగ్గు మని మంట లెగయు నగ్నివలెఁ జివాలున లేచి తపముచే నార్జింపఁ బడినదియు, పుటము వేయఁబడిన బంగారుచేఁ బ్రకాశించునదియు, రత్నములచేఁ జెక్కఁబడిన కేతనములతోఁ బ్రకాశించునదియు, శీఘ్రముగఁ బోఁగల యెనిమిది గుఱ్ఱములను గట్టినదియు మఱియు,

తే. బాలభాస్కరుభంగినిఁ♦బ్రజ్వరిల్లి, యమరదానవదుర్జయ♦మై నభశ్చ
రంబు నై రత్నమయ మైన♦రథము నెక్కి,తూణ మష్టకృపాణికల్♦తోమరములు.

అర్థములు. అమరదానవ దుర్జయమై=దేవతలకు, దానవులకు జయింపరానిదై, నభశ్చరంబునై=ఆకాశమందుఁ దిరుగునదియై, తూణము=అంబులపొది, అష్ట కృపాణికల్=ఎనిమిది కత్తులు, తోమరములు=చిల్లకోలలు.

తా త్ప ర్య ము

బాలసూర్యునివలె వెలుఁగుచు, దేవదానవులకు జయింపరానిదై, యాకాశమునందు సంచరింపఁగలదై, రత్నములతో నిండిన రథమెక్కి- యంబులపొదియు, నెనిమిది కత్తులు, చిల్లకోలలు.

పూర్వపు మంత్రులు రథముల విడిచి యాకాశమున యుద్ధము చేయుటచేఁ జంపఁబడి రని విని యాకాశమందును దేరి మీఁదనుండియే యుద్ధముచేయ సాధ్య పడునట్లు ఆకాశమున సంచరింపఁగల తేరిపైఁ గూర్చుండి దూరపు యుద్ధమునకు బాణములు, ద్వంద్వ యుద్ధమునకుఁ గత్తులు నని యుభయవిధసాధనములు గ్రహించిన వాఁ డయ్యె నని భావము.

క. వెలుఁగ న్వెలువడి భువి దివి, నులివునఁ బూరించి రథగజోత్తమహయముల్
బలములు గొలువఁగఁ జని కనె, బలియునిఁ దోరణనివాసిఁబ్లవగాధీశున్.

అర్థములు. ఉలివున=కంఠధ్వనిచే, బలముల్=సేనలు.

తా త్ప ర్య ము

వెలుఁగు చుండఁగా బయలుదేఱి భూమియు, నాకాశము ధ్వనిచే నిండించి రథములు, ఉత్తమ గజములు, ఉత్తమ హయములు, కాలిబంట్లు సేవింపఁగాఁ బోయి బలవంతుఁడై తోరణమందు నున్న వానరేంద్రుని జూచెను.

చ. విలయ కృశానుతుల్యుఁ డగువీరవరున్ బహుమాన దృష్టిచేఁ
గలయఁగఁ జూచి వాని జవగర్వము నాత్మఁ దలంచి స్వీయ మా
నలవు బలంబుఁ జూపఁగ హిమాత్యయభాస్కరుఁబోలి తీవ్రుఁ డై
తలఁకక మూఁడుబాణములఁదాడితుఁ జేసి మరుత్తనూభవున్. ౧౦౪౪

అర్థములు. విలయ కృశాను తుల్యుఁడు=ప్రలయ కాలాగ్నితో సమానుఁడు; బహుమాన దృష్టిచేన్ = గౌరవముతోఁగూడిన చూపుచే, దీనిచే హనుమంతుఁడు సామాన్యవానరుఁడుకాఁడు, శత్రువైనను నుత్తముఁడని గ్రహించెననియుఁ బూర్వము వారు దానిని గ్రహింపజాలక పోయిరనియు, సూచన. దీని వలన నుత్తమ గుణములు గలవాఁడు, ఋజువాది, తనకు విరోధిపక్షమున వచ్చినను వాదమున నోడింపవలయునుగాని, యవమాన దృష్టిని జూడరాదని యేర్పడుచున్నది. కూట యోధులు గుణహీనులు, మాయావాదు లిట్టి గౌరవమునకుఁ బాత్రులుగారు. జవగర్వము=వేగముగ సంచరింపఁ గల నను పొగరు; అలవు= అస్త్రశస్త్ర విద్యయందుఁ దనకుఁ గల పరిశ్రమము. బలము=దేహబలము. హిమాత్యయ భాస్కరుఁబోలి=మంచుకాలము పోయిన నాఁటి సూర్యుఁడు-ఎండకాలపు సూర్యుఁడు. మంచుకాలమునకు, నెండకాలమునకు నడుమ వసంత మున్నను హిమ విరోధి సూర్యుఁడు కావున, నతనికాలము గ్రీష్మము కావున గ్రీష్మమునాఁటిసూర్యుఁ డని చెప్పవచ్చును. లేక చలికాలము పోఁగానే వచ్చు మాఘమాస మందలి

సూర్యుఁడని చెప్పినను జెప్పవచ్చును. మాఘ మాసమున మాడయెత్తు వేసంగి యను సామెత గలదు. అదియునుగాక "అర్జునస్య ఇమే బాణా నేమే బాణా శ్శిఖండినః,సీదంతి మమగాత్రాణి మాఘే మాసే గవా ఇవ" ఈ బాణము లర్జును నివి. శిఖండివి కావు. నా యవయవములను మాఘమాస కిరణములవలె బాధించు చున్నవి. యని యొక యర్థము గలదు. మాఘేమా=ఆఁడెంద్రకాయ, సేగవా= వాని పిల్లలు అని యర్థము.

తా త్ప ర్య ము

ప్రలయకాలాగ్నివలె నున్న యుత్తమవీరుని నాంజనేయుని సగౌరవదృష్టిఁ జూచి వానికిఁ గల వేగ గర్వము నాలోచించిఁ తన శస్త్రాస్త్రపాండిత్యము, దేహ బలము వానికిఁ జూప గ్రీష్మమందలి సూర్యునివలెఁ దీవ్రుడై యాంజనేయుని మూఁడు బాణములచేఁ గొట్టెను.

—♦ హనుమంతుఁ డక్షకుమారునిఁ జంపుట ♦—

క. వెండియుఁ బైపడి శితఖర, కాండంబుల నొంవ నక్ష♦కపినాథులకున్
భండనము చెల్లె దివిజుల, గుండెలు దిగ్దిగ్గనంగఁ♦గ్రూరం బగుచున్. ౧౦౮౫

అర్థములు. శితఖరకాండంబులన్=పదునై కఠినములైన బాణములను, భండనము=యుద్ధము.

తా త్ప ర్య ము

అంతతోఁ బోక పైపడి పదునైవకఱకు బాణంబులచే నొప్పింపఁగా నక్షు నకు హనుమంతునకు దేవతల గుండెలు దిగ్దిగ్గనఁగా క్రూరమైనయుద్ధము జరగెను.

చ. పుడమి వడంకెఁ, దేజ మఱి♦పోయె నహర్పతి, గాలి వీచుటల్
విడిచెఁ, జలించెఁ గొండలును♦విన్ను విరావ మెసంగె, క్షోభముం
బడియె సముద్రముల్ భయము♦పాటున; రాక్షసవానరేశ్వరుల్
విడివడి ఘోరభంగిఁ బురి♦విచ్చక మచ్చర మెచ్చి పోరుచోన్.

అర్థములు. అహర్పతి=సూర్యుఁడు, అఱి=క్షీణించి, విన్ను=ఆకాశము, పురి విచ్చక=సడలిపోక-దృఢముగ.

తా త్ప ర్య ము

రాక్షసుఁడు కపీశ్వరుఁడు తెగఁబడి విచ్చలవిడిగ దృఢముగ వెనుదీయక మచ్చరమున యుద్ధముసేయు సమయమున భూమి వణఁకెను. సూర్యుని కాంతి మాసెను. గాలి వీచుట మానెను. కొండలు కదలెను. ఆకాశమున ధ్వని పుట్టెను. సముద్రములు భయమునఁ గలఁతచెందెను.

ఉ. అట్టియెడం గుమారుఁడు ర♦యంబునఁ గాంచనపుంఖ బాణముల్
పట్టి విషోజ్జ్వలంబు లగు♦పాములపోలిక మూఁటి నాటినన్

దొట్టెడు నెత్తుటన్ ముఖము•తోయజబాంధవుఁబోల సోఁకురా
పట్టి శరంబులు న్వెలిఁగె•భానువు లట్టులు ప్రజరిల్లుచున్. ౧౦౪౭

అర్థములు. కాంచనపుంఖ బాణముల్=బంగారు పింజ గల బాణములు, బాణము ప్రయోగించునపుడు పట్టుకొను చివర భాగము పుంఖము. ఒక కొన ములికి, ఒకకొన పింజ. విషోజ్జ్వలంబులు=విషముచే వెలుఁగుచున్నవి. తొట్టెడు=కాఱుచున్న, సోఁకురా+పట్టి=రాక్షస రాజకుమారుఁడు, భానువులు=కిరణములు.

తాత్పర్యము

ఆ సమయమందు నా చిన్నవాఁడు వేగముగ బంగారుపింజ గల బాణములను విషముగల సర్పముల వంటి వానిని మూఁటిని నాటఁగా నెత్తురు కాఱుచుండఁగా హనుమంతుని ముఖము సూర్యబింబమువలె నుండెను. అక్షకుమారుని బాణములు కిరణములవలెఁ బ్రకాశించెను. కిరణములు సూర్యునుండి వెలికిఁ బోవును. కాని వెలినుండి సూర్యునొద్దకు రావు కావున గాయపడి నెత్తురుకాఱు హనుమంతుని ముఖము సూర్యుఁడైనపుడు అందు నాటుకొన్న నెత్తుటఁ దడిసిన బాణములు కిరణము లని గ్రహింపనగును.

సీ. అది చూచి మారుతి•యుగ్రహోదగ్రుఁడై, తన చూపుగములనె•దనుజతనయు
బలముల వాహనం•బుల దహియించెను, మందరాగ్రస్థాంశు•మాలిమాడ్కి
నక్షుండుకుపితుఁడై•యచలంబుమీఁదజీ,మూతముగతి ముల్కి•ముసురుగురిసెఁ
గపియును జంకక•గర్జించి తృణవృత,వాపిని డాసెడి•వారణంబు

ఆ. పగిదిఁ దన్నుఁ డాయు•బాలునిఁ గికురించి, మింటి కెగసె దానఁ•గంటగించి
యసుర పఱపె మార్గ•ణాసార మతనిపై, హరియుఁ దగులు వడక•యందతిరిగె.

అర్థములు. ఉగ్రహోదగ్రుఁడై=కోపముచే భయంకరుఁడై, మందరాగ్రస్థ+అంశుమాలి మాడ్కి=మందర పర్వత శిఖరమున నున్న సూర్యునివలె; భరత ఖండమున సాలగ్రామ పర్వతమున కుత్తరమున మందర పర్వతము భూమికి నట్ట నడుమఁ గలదఁట. దానిశిఖరము మీఁదికి సరిగా సూర్యుఁడు వచ్చునప్పటికి నుత్తరాయణమున మధ్యాహ్నకాల మగును. అప్పుడు సూర్యుఁడు మిగులమండు చుండును. జీమూతము=మేఘము, ముల్కి ముసురు=బాణవర్షము, తృణవృత వాపిని=గడ్డిచేఁ గప్పఁబడిన బావిని, వారణంబు=ఏనుఁగు, ఏనుగులను బట్టుటకు గుంత తీసి దానిపైఁ దడికలు వేసి, దానిపై పైరు పండునట్లు చేయుదురు. ఆ గడ్డికై వచ్చి యేనుఁగులు గుంతలోఁ బడును. కికురించి=మోసగించి, కంటగించి=రోషించి, మార్గణాసారము=బాణవర్షము.

తాత్పర్యము

అది చూచి యాంజనేయుఁడు మిగులఁ గోపించి చూపులచేతనే యక్షకుమారుని సేనలను, వాహనంబులను దహించెను. అక్షుఁడు మందర శిఖరము నందలి

సూర్యునివలెనై కోపించి కొండమీఁద మేఘము వర్షించునట్లు బాణవర్షము గురియించెను. దానికి హనుమంతుఁడు జంకక గర్జించి గడ్డికప్పిన బావికై వచ్చు నేనుఁగువలెఁ దన్నుఁబట్టుకొన వచ్చు నక్షుని మోసగించి యాకాశమున కెగసెను. తప్పించుకొని పోయెనని బాలుఁడు కోపించి యతనిపై బాణవర్షము గురియించెను. హనుమయు దానియందుఁ జిక్కుపడక సంచరించెను.

చ. తిరిగిన నీడ వోవక యొ●తీవ్రఖరాశుగజాలవర్షముల్
గురియు కుమారుఁ గాంచి కపి●కుంజరుఁ డెట్లు జయింతు వీని నం
చరయఁగ నింతలోన నమ●రాంతకసూనుఁడు శాతమార్గణో
త్కరపరివిద్ధబాహువుగఁ●ద న్నొనరింపఁగ మెచ్చి చింతిలున్. ౧౦౪౯

అర్థములు. ఈడవోవక=వెనుదీయక, తీవ్రఖర=తీవ్రములు, కఠినములు నగు, ఆశుగజాల వర్షముల్=బాణసమూహముల వానలు, శాత మార్గణ=పదునైన బాణములయొక్క, ఉత్కర=సమూహముచే, పరివిద్ధ=బాగుగ బాధింపఁబడిన, బాహువుగన్=చేతులు గలవానిఁగ, చింతిలున్=ఆలోచించెను.

తాత్పర్యము

ఇట్లు తిరిగినను అక్షకుమారుఁడు వెను దీయకయే తీక్ష్ణమైన, కఠినములయిన బాణముల వానను గురియుచుండఁగా వానిని జూచి వీని నెట్లు జయింతునా యని యాలోచించుచుండ నింతలో వాఁడు పదునైన బాణములచే బాహువులభేదించెను. దాని కాంజనేయుఁడు మెచ్చుకొని యిట్లు లాలోచించెను.

ఉ. చూడఁగఁ బిన్నగాని పటు●శూరుఁడు బాలదివాకరప్రభుం
డోడఁ డొకించుకేనియు న●నుత్తమకర్ముఁడు, వీని కక్కటా!
గోడు ఘటింపఁగా మనసు●గొల్పదు, వీని పరాక్రమంబుఁ గొం
డాడెద రెంతయున్ విబుధ●యక్షమహోహిమహర్షు లద్దిరా! ౧౦౫౦

అర్థములు, ఓడఁడు=భయపడఁడు.

తాత్పర్యము

వీఁడు వయస్సునఁ జిన్నవాఁడే కాని గొప్ప శూరుఁడు. లేతసూర్యుని కాంతి గలవాఁడు. కొంచెమైన భయపడువాఁడు కాఁడు, గొప్పపనిచేయువాఁడు. ఇటువంటి వీనికి నయ్యో యాపదగూర్ప మనస్సంగీకరింపకున్నది. వీని పరాక్రమములు దేవతలు; యక్షులు, పన్నగులు, మహర్షులు స్తోత్రముచేయు చున్నారు. ఔరా!

ఉ. చక్కఁగఁ నన్నుఁ జూచెడిని●సమ్ముఖమం దొగి నిల్చి తెంపు పెం
పెక్కెడు నంతకంతకును●నెక్కుడు నేర్పును దీర్పు నోర్పునున్
మిక్కిలి యీసు మానఁడు, స●మిన్నిపుణుండును, బాలుఁ డంచు నే
మక్కువ నూరకున్న నవ●మానము తప్పక గూర్చు నా కనిన్. ౧౦౫౧

అర్థములు. సమిత్+నిపుణుండును=యుద్ధమందు నేర్పు గలవాఁడు.

తా త్ప ర్య ము

వీఁడు దృష్టి చలించి యిటు నటు చూచునేమో మోసగింత మనిన దృష్టి చెదరనీక నన్నె చక్కఁగఁ జూచుచున్నాఁడు. నే నేదిక్కుఁ పోయిన నా దిక్కున నా కెదురు ముఖ మగుచున్నాఁడు. అంతకంతకు నేర్పు-తీర్పు-ఓర్పు అతిశయించు చున్నది కాని తగ్గుట లేదు. రోషము తగ్గించిన వాఁడు కాఁడు. యుద్ధమందు మిగుల నేర్పుగలవాఁడు. వీఁడు చిన్నవాఁడని నే నుపేక్ష చేసితినా, యుద్ధమందు నా కవమానము తప్పక కలిగించును. హనుమంతుఁడు పిల్ల రాక్షసున కోడిపోయె నను నపకీర్తి వచ్చును.

ఉ. భండనసీమ నీతని యభంగపరాక్రమ వేగ తేజముల్
గుండెలు వ్రక్కలించు సురకోటుల కేనియు, నేమి వీనికో
దండవిజృంభణంబు భుజదర్పసమగ్రత! సైఁప వచ్చునే?
ఖండితుఁ జేయఁ బూన నగుఁగా, జ్వలదగ్ని నుపేక్ష యర్హమా. ౧౯౨

అర్థములు. భండన సీమన్=యుద్ధభూమియందు, వ్రక్కలించున్=పగుల జేయుచు, జ్వల దగ్నిన్=మండుచున్న యగ్నిని- భుజ దర్ప సమగ్రత=బాహు బలము వలన గలిగిన గర్వము యొక్క- సంపూర్ణత్వము.

తా త్ప ర్య ము

యుద్ధభూమియందు భంగములేని వీని పరాక్రమము, వేగము, ప్రతాపము, దేవతాసమూహములకైనను గుండెలు పగులఁజేయును. ఔరా యేమి వీని విలు విద్య యతిశయము ఏమి వీని భుజాబలముయొక్క సంపూర్ణత్వము. దీనిని సహింప వచ్చునా? కూడదు. వీనిని జంపవలసినదే. మండుచున్న యగ్నిని నుపేక్షించిన వెనుకఁ జల్లార్ప సాధ్యపడునా? అది తెగఁగాల్పక విడుచునా?

చ. అని తన మేను పెంచి యసురార్భకుఁ ద్రుంపఁగ నెంచి స్వేచ్ఛమై
ఘనతరవేగవంతములఖప్రచరిష్ణువులైనవాజులన్
దునిమెఁ దలప్రహారములఁదోడనె తేరును గూల నేలపైఁ
దునియలు వాఱఁ దద్రథముదూఁకి కుమారుఁడు చాపహస్తుఁడై. ౧౯౩

అర్థములు. వేగవంతము లగు=మిగుల వేగముగలవి, ఖప్రచరిష్ణువులు= ఆకాశమందుఁ జక్కఁగాఁ దిరుగు స్వభావము గలవి, వాజులన్=గుఱ్ఱములను, తల ప్రహారములన్=అఱచేతి దెబ్బలచే.

తా త్ప ర్య ము

ఈ ప్రకార మాలోచించి దేహము పెంచి రాక్షసకుమారుఁ జంప నాలో చించి యిష్టానుసారము మిగుల వేగముగలవై యాకాశమునఁ దిరుగు స్వభావము గల గుఱ్ఱములను అఱచేతి దెబ్బలచేఁ జంపెను. అట్టులే తేరును నేలఁగూలఁ దన్నెను. ఇట్లు తేరు తునుకలు కాఁగా నక్షకుమారుఁడు రథమునుండి దూకి విల్లు పట్టుకొని.

చ. అనుపమయోగశక్తిని మహర్షులు దేహము వీడి స్వర్గమున్
జనియెడిభంగిఁ దీవ్రరభసంబున మింటికి దాఁటి ఖడ్గముం
గొని పవనాత్మజుం గదిసి క్రూరతఁబోరుచు నుండ నంజనా
తనయుఁడు డాసి పైపడి పదంబులు రెండును బట్టి కోపియై. ౧౯౪

అర్థములు. అనుపమ యోగిశక్తిని = అసమానయోగబలముచే, తీవ్రరభసంబున=మిగుల వేగమున, డాసి=సమీపించి.

తాత్పర్యము

మహర్షులు తమ యసమానయోగబలమున దేహము విడిచి స్వర్గమునకుఁ బోవునట్లు మిగుల వేగమున నాకసమున కెగిరి కత్తిచేతఁ బట్టుకొని హనుమంతుని సమీపించి ఘోరముగ యుద్ధము చేయుచుండఁగా నాంజనేయుఁడు సమీపించి పైపడి రెండు కాళ్ళు పట్టుకొని మిగులఁ గోపించినవాఁడై.

ఉ. అండజనేత జిహ్మగము నట్లు విదిర్చి విదిర్చి వేగతుల్
గండున నేలపై విసరి క్రచ్చఱ మోఁద శిరంబు వ్రక్కలై
కండలు నెత్తు రెమ్ములును క్ష్మాతల మంతయుఁ గప్పఁ దండ్రికిన్
గుండెలు ఝల్లనంగ సురకోటులు సమ్మద మందఁ జచ్చినన్. ౧౯౫

అర్థములు. అండజనేత=గరుత్మంతుఁడు, జిహ్మగము=పాము-వంకరగా. బోవునదని వ్యుత్పత్త్యర్థము, వేగతుల్=వేయివిధములుగ, గండునన్=బలమున, క్రచ్చరన్=శీఘ్రముగ, తండ్రికిన్=తన తండ్రికి; రావణునకు.

తాత్పర్యము

గరుత్మంతుఁడు పామునువలె వేయి విధముల నీ ప్రక్క, కా ప్రక్కకు విదిర్చి, విదిర్చి పామును దోఁక పట్టుకొని లేవనెత్తి యట్టులే యుంచిన పడగ పైకిలేచి చేతిని గఱచును, అట్లుగాక పట్టినపట్టు తోడనే గుడ్డను జాడించినట్టు జాడించి కదలించుచుఁ బట్టుకొనిన లేవలేదు. వేగముగ బలము కొలఁది నేలకు వేసి మోఁదఁగాఁ దల తునుకలై కండలు, నెత్తురు, ఎముకలు నేలయంతయు నావరింపఁగా రావణుని గుండెలు పగుల దేవతలు సంతోషింపఁ జావఁగా.

క. మునులును యక్షులుఁ బన్నగులును జక్రచరుల్ మహాత్ములును వాసవుఁడున్
వినియములు నమరవరులును, గని రచ్చెరు వొలయఁ బంక్తికంఠసుతారిన్.

అర్థములు. చక్రచరుల్=(౧) జ్యోతిర్మండలమున నుండువారు.(౨)ఆకాశ మండలమున సంచరించువారు. (3) గుంపులు గుంపులుగాఁ దిరుగువారు. వినియములు=విశేషవ్రతములు గలవారు. పంక్తికంఠసుతారిన్=అక్షకుమారుని జంపిన వానిని-హనుమంతుని.

తాత్పర్యము

మునులు, యక్షులు, పన్నగులు, చక్రచరులు, మహాత్ములు, ఇంద్రుఁడు, మహావ్రతస్థులు, దేవతలు హనుమంతునిఁజూచి యాశ్చర్యపడిరి.

క. క్షతజోపమాక్షు వాసవ,సుతసన్నిభ తేజు నక్షు♦బ్రుక్కించి మహా
త్సుతుఁ డేగి ప్రళయకాలుని;గతిఁ దోరణమందుఁ జేరె♦గాసి దొలంగన్.

అర్థములు. క్షతజ+ఉపమ+అక్షున్=నెత్తుటితో సమానమైన యెఱ్ఱని కన్నులు గలవానిని, వాసవ సుత సన్నిభ=జయంతునితో సమానమైన, తేజున్=పరాక్రమము గలవానిని.

తాత్పర్యము

నెత్తురువలె నెఱ్ఱ నగు కన్నులు గలవాఁడును, జయంతునితో సమానమైన పరాక్రమవంతుఁడును నగు నక్షుని జంపి హనుమంతుఁడు ప్రలయకాల యముని వలె బడలిక తీర్చుకొనుటకై తోరణమందుఁ జేరెను. దీనివలన నక్షుని జంపుట యందు హనుమంతునకు బడలిక గలిగె నని సూచన.

♦ ౪౫-వ సర్గము. రావణుఁ డిందజిత్తును హనుమంతుని మీఁదికిఁ బంపుట. ♦

క. వీరుఁడు తనయుం డక్షకు,మారుఁడు వానరునిచేత♦మడియుట విని కో
పారుణితలోచనుండై, ధీరత రావణుఁడు పలుకె♦దేవేంద్రజిత్తున్. ౧౦౦౪

అర్థములు. కోపారుణితలోచనుండై=కోపముచే నెఱ్ఱవాఱిన కన్నులు గలవాఁడై- దేవేంద్రజితున్=ఇంద్రజిత్తును. ధీరతన్=అక్షకుమారుఁడుకూడఁ జచ్చినాఁడనఁగానే శత్రువు బలిష్ఠుఁ డని భయపడియు భయము బయటికిఁ దెలియనీయక.

తాత్పర్యము

వీరుఁడైన తన కొడుకు నక్షకుమారుఁడు క్రోఁతిచేతఁ జచ్చె నని విని రావణుఁడు కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై యింద్రజిత్తుతో నిట్లనియె.

తన ప్రియమైన యుద్యానవనము క్రోఁతి యొకఁడు పాడు చేసె నని విన్నంతనే యింత సాహస మొక్కఁడు చేయఁజాలఁడు. నెపమునకై యొక్కని బంపిరి గాని వీనికి వెనుక ప్రాపై పెక్కురు సహాయు లుందు రని తలఁచి వీనిని దన సేవకులచేఁ బట్టి తెప్పించి యవమాన పఱుప నాలోచించి తొలుత కింకరులఁ బంపెను వారు చావఁగానే యిందఱిఁ జంపినవాఁడు మిగుల బలిష్ఠుఁడు, ద్వంద్వ యుద్ధమున నసాధ్యుడని తలఁచి దూరమున నుండి కొట్టి చంపుటకై విలువిద్య నేర్చినవాఁడైనను నొంటరివాఁడు వానరుని ముందఱ నాఁగఁ డని మంత్రిపుత్రుల నేడ్వురఁ బంపెను. ఇట్లు బాలురఁ బంపి వానరునిఁ జంప యత్నించెను గాని వాని యాలోచన విఫలమయ్యెను. పిల్లవాండ్రను బంపి లాభము లేదని తలఁచి, సేనానాయకులను బంపెను. వారును జావఁగాఁ దన నిమిత్తమై యితరులఁ జంపించుచున్నాఁ డని లోకులందు రని తలఁచి తన కుమారునే చిన్నవానిని బంపెను. వాఁడు చావఁగా

నీక నీ క్రోతి శస్త్రములకుఁ జిక్కఁడు. బాహు బలమునకు లోపడఁడు. అస్త్రములచేఁగాని సాధ్యుఁడు గాఁడని యస్త్రవిద్యయందుఁ బ్రవీణుఁడును దనకు రెండవవాఁడగు నింద్రజిత్తును బంపుచున్నాఁడు.

మత్తకోకిలము. ఈవె యస్త్రవిదగ్రగణ్యుఁడ•వీవె సర్వసుపర్వదై
త్యావలీవ్యసనప్రదాతవు•ఖ్యాత మెల్లజగంబులన్
దావకీనభుజాబలంబు, వి•ధాతఁ గొల్చి మహాస్త్రముల్
నీవు పొందితి, నీ చరిత్రలు•నిర్జరాళికి స్పష్టముల్. ౧౯౯

అర్థములు. అస్త్రవిద్+అగ్రగణ్యుఁడవు=అస్త్రములను దెలిసినవారిలో మొదల లెక్కింపఁదగిన వాఁడవు, సర్వసుపర్వ+దైత్యావళీ=ఎల్ల దేవతలకు, దైత్యుల గుంపులకు వ్యసనప్రదాతవు=శోకము గలిగించు వాఁడవు, ఖ్యాతము=ప్రసిద్ధి కెక్కినది, తావకీన భుజాబలంబు=నీ బాహుబలము.

తాత్పర్యము

అస్త్రవిద్యావంతులందు మొదటివాఁడవని లెక్కింపఁదగినవాఁడవు నీవే! నీవే సమస్త దేవదానవులకు శోకము కలిగించిన వాఁడవు. నీ భుజబల మెల్లలోకంబులఁ బ్రసిద్ధికెక్కినది. బ్రహ్మదేవునిచే మహాస్త్రములు సంపాదించితివి. నీవు చేసిన కార్యములు దేవత లందఱెఱుఁగుదురు.

క. నీ యస్త్రబలము పెంపున, నీయెదుటను నిలువ వశమె•నిర్జరులును దై
తేయులు వాసవుఁడైనను, మాయామ్నాయమున నీ స•మానులు గలరే?
అర్థములు. మాయా+ఆమ్నాయమునన్=మాయావిద్యయందు.

తాత్పర్యము

దేవదానవులు నింద్రుఁడైనను నీ యస్త్రబలముయొక్క యాధిక్యముచే నీ యెదుటనైన నిలువగలరా? ఇఁక యుద్ధము చేయ లేరను మాటయేల? మాయలు చేయుటయందు నీకు సమానులు లేరు.

ఇట్లు చెప్పుటచే హనుమంతుని న్యాయ్యమార్గమున నస్త్రములచేఁ జంపఁ జూడుము. అది సాధ్యముకాదని తోఁచెనేని మాయచేనైన వధింపుమని సూచన.

మత్తకోకిలము. యోజనం బొనరింపఁ దోఁపని•యుక్తి యొక్కఁడు లేదు నీ
కాజికేళి నసాధ్య మా పని•యైన నేదియు లేదుగా
యా జగత్త్రియి నీదు దర్ప మ•హీనని స్తుత శాస్త్రసం
యోజితాద్భుతశక్తి యెవ్వరొ•కో యెఱుంగరు ఘాతకా! ౧౧౦౧

తాత్పర్యము

ఆలోచించితివేని నీకుఁ దోఁపని యుక్తి యొక్కటియైన లేదు. అన్ని యుక్తులాలోచింపను, వానిని గొనసాగింపను నీవే నేర్తువు. యుద్ధమందు నీ కసాధ్యమైనది

లేదు. ఈ మూఁడులోకములందు నీ బలము, నీ గొప్ప యస్త్రపాండిత్యము నాయనా! తెలియనివా రెవ్వరు?

తరలము. తపము పేర్మిఁ బరాక్రమంబున♦దారుణాస్త్రబలంబునన్
విపుల శక్తిని మాదృశుండవు♦నీకు గెల్పు రణంబులో
నెపుడు నిశ్చిత మా టెఱుంగుట♦నేను జింతఁ దొఱంగి ధీ
నిపుణ! యెప్పుడు హాయి నుండుదు♦నేఁటిమాట యిదేటికిన్. ౧౧౦౨

అర్థములు. మాదృశుండవు=నాతో సమానుఁడవు. ఎప్పుడు=ఇప్పుడేకాదు, సర్వకాలములందు, హాయిన్=సుఖముగా.

తాత్పర్యము

గొప్పతనమునందు-పరాక్రమమందు- భయంకరమైన యస్త్రబలమునందు గొప్ప శక్తి యందు నాతో సమానుఁడవు. నీకు యుద్ధమందు జయ మనునది నిశ్చయింపఁ బడినదే. ఇది తెలిసిగదా నేను నిర్విచారముగా నన్నిటికి నింద్రజిత్తు గలఁడు, నా కెవరి వలన నేమి భయమని సర్వదా యున్నాను. ఇఁక నేఁటి మాట చెప్పనేల?

తరలము. నభరస గజంములు గుణములు. పండ్రెండింట యతి. తరలము నందలి మొదటి రెండు లఘువులు గురువుగా మార్చిన మత్తకోకిల యగును. మత్తకోకిల మందలి మొదటి గురువు రెండు లఘువులు చేసిన తరల మగును.

రావణాసురుఁ డింద్రజిత్తుతో మాటలాడు నపుడు వాల్మీకి అనుష్టుప్పు వృత్తము లీ ప్రకారము మార్చి మార్చి చెప్పి యున్నాఁడు. దానికిఁ గారణము శోక భయములు-అవమానము-వీనిచే రావణునకు స్వరభంగ మయ్యె నని కవి హృదయ మని, యట్లులే తెనుఁగు నందును కందము వృత్తము మార్పఁ బడెను.

క. ఓడక ని న్నెదిరిచి య,ల్లాడని వాఁ డెవఁడు? భుజత♦పోఽతిబలంబుల్
గూడి నినుఁ గాచు నెప్పుడు, వీడక మఱి దేశకాల♦వేదివి తనయా. ౧౧౦౩

తాత్పర్యము

భయపడక నిన్నెదిరించి యుద్ధము నం దల్లాడని వాఁ డెవఁడు గలఁడు? ఏలన భుజబలము, తపోబలము దానిని మించినబల మస్త్ర బలము, నిన్ను సర్వదా రక్షించుచున్నవి. అదియుఁగాక నీవు దేశము కాలము నెఱిఁగి యెప్పు డే ప్రదేశమున నెట్లు వర్తింపవలయునో యట్లు వర్తిపఁ గలవు.

ఇవన్నియుఁ జెప్పుట హనుమంతునితో యుద్ధము చేయునప్పు డిన్నియు నుపయోగింప వలసి యుండు నని హెచ్చరించుటకే.

సీ. కింకరులను గాల♦కింకరులను గూల్చె, జంబుమాలిని బట్టి♦డంబు మాల్చె
మంత్రిపుత్రుల యమ♦మందిరంబున కన్పెఁ, బంచత సైన్యేశ♦పంచకమున
కలవరించెను హయ♦నాగరథాళితో, దళముల నెల్ల వి♦దళనపరిచె
నీ ముద్దుఁదమ్ముండు♦నీల్గె నక్షకుమారుఁ డింద్రజితా! నాకు♦నెల్లయందు

తే. కంటె నీయందు విశ్వాస•ముంట నిన్నుఁ, బనుపవలసెను వానరు•బలముఁజలము
చక్కఁ బరికించి నీ బలశౌర్యములను, దదనురూపంబు సేయుము•తనయ కుత్స.

అర్థములు. కాయాకింకరులను=యమకింకరులను, డంబు=తేజము, పంచత=మరణము, ఐదవదశ-బాల్యకౌమార యౌవన జరా మరణంబులను వానిలో నైదవది. దేహమునందలి పంచభూతములు కలయిక మాని వేఱైపోవును గావున పంచత అలవరించెను=కలిగించెను. దళముల నెల్లన్=సేనల నన్నిటిని, విదళన పఱిచెన్=చీల్చివైచెను, ఎల్లయందు=ఎల్లవారి యందుకంటె, విశ్వాసము=నమ్మకము, ఇంద్రజితా=ఇంద్రజిత్తుఁడా అనుదాని సంబోధనరూపము, ఋత్విగాదులు గుణ... విభాషనగు. తత్సమ ౪౮ సూ. సు. వ్యా. ఈసూత్రప్రకారము ఇంద్రజిత్తు, ఇంద్రజిత్తుఁడని రూపంబులు. జగదింద్రజిత్తుల తకారంబునకు లోపంబు విభాషనగు. సు. వ్యా. తత్స ౯౧ ప్రకారము ఇంద్రజి-ఇంద్రజిత్తని రూపములు.

ఎల్లయందు=ఎల్లశబ్దము ద్రుతాంతంబయిన యవ్యయంబు. "సదృశంత్రిషు లింగేషు సర్వాసుచ విభక్తిషు వచనేషుచ సర్వేషు యన్నవేతి తదవ్యయ" మ్మని యవ్యయ లక్షణము. అనఁగా మూఁడు లింగములందు, అన్ని విభక్తులందు, ఎల్ల వచనంబులందు నేకవిధముగ నుండునది యవ్యయము. అట్టు లుండియు అప్పుడను నవ్యయమునకు అప్పటికి నని రూప మున్నట్లు ఎల్లయంచు నని ప్రయోగములు గలవు. 'ఎల్లయందును దా నసియించు టెల్ల' భార. ఉద్యో. ౧ ఆ. "ఎఱిఁగె సకల శాస్త్రంబుల నెల్లయందు" భార. ఆది ౨ ఆ. ఈ శబ్దము విశేష్యముగను బ్రయోగములు గలవు. "ఎల్లం జూడఁగ," భార. కర్ణ ౧ ఆ. ౧౪౬ ప. "ఎల్ల జూడ" 3 ఆ. ౧౧ ప.

## తాత్పర్యము

నాయనా! కింకరులను, జంబుమాలిని, మంత్రిపుత్రులను, సేనానాయకుల నేవురను సేనలతోడ వానరుఁడు చంపెను. అందఱికంటె నీయందు నాకు నమ్మకము మెండు. కావునఁ దక్కిన వారిని బంపిన గెలిచి వత్తురను నమ్మకము లేదు. నీవు గెలిచి వత్తు వను నమ్మకము గలదు. కావున నిన్నుఁ బంపవలసి వచ్చెను. వానరుని బలము, చలము చక్కఁగాఁ బరీక్షించి దానికిఁ దగినట్టు నీ బలశౌర్యములను జూపుము.

మత్తకోకిలము. సేన యంతయు వానరేంద్రుని•చే హతం బయి పోకమున్
వాని నస్త్రవిదగ్రగణ్యా! జ•వంబుమైఁ బరిమార్పుమీ
వానిఁ దాఁకఁగఁ బోవు ముందుగ • వానిశక్తి స్వశక్తియున్
మానసంబునఁ జక్కఁజూడు ప్ర•మాదముం బడఁబోకుమీ.

## తాత్పర్యము

వానిని జంపుటయందు నీ వెంత యాలస్యము చేసెదవో యంత మన సేన

నాశ మగును. కావున మన సేన వానిచే నాశముగాక ముందే యస్త్రములచే వా వేగముగఁ జంపుము. ఉత్తి బాణప్రయోగములఁ గాలము పుచ్చకుము. వానిపై బడి పోరము౦టే వాని శక్తియే మాత్రమో. నీశక్తి యే మాత్రమో, చక్కఁగాఁ బరీక్షింపుము, హెచ్చరిక తప్పకుము.

మత్తకోకిలము. సేన కావఁగ లేదు నిన్ననిఁ•సిద్ధ మియ్యది, సేన లె
న్నైనఁ దాఁకిన ద్రుంచు వాఁడు, మ•హాబలోపమ వేగు నై
శ్వానరాభుని డాయఁ బోకుము•వజ్రమున్ ధరియించి యెం
డేని ముష్టిరణంబు సేయఁగ•నేని మర్దిత శాత్రవా. ౧౧౦౬

అర్థములు. మహాబలోపమ వేగున్=వాయువుతో సమానమైన వేగము గలవానిని; వైశ్వానరాభునిన్=అగ్నితో సమానుని, వజ్రమున్=ఇది యింద్రుని వజ్రము కాదు. విష్ణుచక్ర మన్నట్టులిది యొక యాయుధము. చూచుటకు వజ్రము వలె నుండును. ఇది శస్త్రమె కాని యస్త్రముకాదు దీనిని సామాన్యరాక్షసులు కూడ ధరించి తిరుగుచుండి రని ౧౫౩వ పద్యమునఁ గలదు.

## తాత్పర్యము

ఇరువురు యోధులు విండ్లతో దూరముననుండి యుద్ధము చేయునపుడు సేన లక్ష్మమువచ్చి రక్షింపఁగలవు. ఈ వానరుఁ డిట్టివాఁడు కాఁడు. తటాలున నీ మీఁదనే దూఁకును అప్పుడు సేన లేమి చేయఁగలవు? కావున నీవు సేనల నమ్మి కొని పోవుట వ్యర్థము. సేన లెన్ని తాఁకినను వాఁడు చంపును. నీవు వజ్రము ధరించియైనను వాని మీఁదికిఁ బోకుము. వాఁడు వాయువువలె నలు ప్రక్కలఁ దిరుగు చుండును. ఏ మూల దూఱి నిన్నుఁ గొట్టునో? అది గాక వజ్రము కదలక యుండు దానిని గొట్టఁ గలదు. గాలినెట్లు నఱుకఁగలదు. కావున శస్త్రముల నమ్మ వలదు. అట్లు పైపడిన ముష్టితోఁ గొట్టెద నందువేమో. వాఁడగ్నివంటి వాఁడు. వాఁడు పడినచోటనెల్ల భస్మము చేయును. అగ్నిహోత్రుని ముష్టిదెబ్బ లేమిచేయఁ గలవు. కావున వానితో ముష్టియుద్ధము సేయ యత్నింపకుము.

మత్తకోకిలము. ఇంతయుం దలపోయుమీ మఱి•యేది యుక్తమొ చూడుమీ
యంత నింతను బోఁడు వాఁడు మ•హాస్త్రముల్ స్మరియింపుమీ,
స్వాంతమున్ నిజదృష్టియున్ శర•పాత మొక్కటిగాఁగ దు
ర్దాంతశక్తి రణంబు సేయుము•తాల్మి, నీకు జయం బగున్.

అర్థములు, అంతనింతన్=అల్పప్రయత్నముతో, సులభముగా, స్వాంతము= మనస్సు, శరపాతము=బాణము పడుట, తాల్మిన్=తొందరపడక, నిబ్బరముగ.

## తాత్పర్యము

ఇప్పుడు నేను జెప్పిన దంతయు నాలోచింపుము. దీనిలో నక్కడికిఁ బోయి నపు డేది యుక్తమో యది చేయుము. అల్పప్రయత్నముతో వాఁడు సాధ్యుఁడు

కాఁడు. కావున బ్రహ్మాస్త్రాది మహాస్త్రములను స్మరింపుము. మనస్సు-దృష్టి-బాణము మూఁడు నేకకాలమందు నేక ప్రదేశమందుఁ బడునట్లు యుద్ధము చేయుము. వానిని జెదర నీయకుము. తొందర పడకుము. నిబ్బరముగ మనస్సునఁ గలఁతలేక యుద్ధము చేయుము. జయము కలుగును.

క. ఖాలుని నినుఁ బంపఁగ రా, దాలమునకు నాకుఁ దెలియు నైనను ధరణీ
పాలురకు క్షత్రనీతియ, వాలాయము దాని దాఁట వచ్చునె చెపుమా. ౧౧౦౪

అర్థములు. ఆలమునకు=యుద్ధమునకుఁ క్షత్రనీతియ=రాజధర్మమే, వాలాయము=నిర్బంధము, అతిక్రమింపరానిది.

తా త్ప ర్య ము

పెద్దవా రుండఁగా యుద్ధమునకుఁ బిల్లవాండ్రను బంపుట సరిగా దని నాకుఁ దెలియును. అయినను మనము రాజులము. మనకు క్షత్రియధర్మము నిర్బంధము. తక్కిన వారివలె మనము ప్రవర్తింపరాదు. క్షత్రియ ధర్మప్రకారము రాజు ముందుగ యుద్ధమునకుఁ బోరాదు.

ఇందు క్షత్రియులగు రాజుల కిది ధర్మమని చెప్పుటచేఁ దాను క్షత్రియుఁడ నని యంగీకరించి నట్టు లాయెను. ఇదియె వాస్తవ విషయము. రావణాసురుని కంటె వానిజాతి విషయము తమకుఁ దెలిసినట్లు కొందఱు వాఁడు బ్రాహ్మణుఁ డనియు వానిని జంపుటచే రామచంద్రమూర్తికి బ్రహ్మహత్య వచ్చెననియుఁ జెప్పెదరు. బ్రహ్మహత్య విచారము యుద్ధకాండమునఁ జేయఁబడును. ఇచ్చట రావణు మాటలు సత్యమా? తక్కినవారి మాటలు సత్యమా? విచారింప వలయును. ఎట్టి వాఁడు బ్రాహ్మణుఁ డని శాస్త్రములు, వానిజాతి నిర్ణయించుచున్నవో చూతము.

శ్లో. సర్వవర్ణేషు తుల్యాసు, పత్నీ ష్వక్షతయోనిషు
ఆనులోమ్యేన సంభూతా, జాతా జ్ఞేయా స్త ఏవతే. మను.౧౦-౫.

బ్రాహ్మణాదు లగు నాలుగు జాతులవారు నాలుగు జాతులలోను శాస్త్ర విధి చొప్పునఁ బెండ్లియై వ్యభిచార దోషము లేని సవర్ణజాతి పత్నుల యందు, అనఁగా బ్రాహ్మణునకు బ్రాహ్మణి యందును, క్షత్రియునకు క్షత్రియ యందు, ని వ్విధమున నా యా జాతుల వారికి నా యా జాతుల స్త్రీల యందుఁ బుట్టిన వారు మాతాపితరుల జాతి గలిగి సజాతీయు లనఁబడుదురు. శ్లోకమున పత్నుల యందు నని ప్రయోగింపఁ బడుటచే బ్రాహ్మణునకు తాను శాస్త్రప్రకారము వివాహము చేసికొనని యన్యబ్రాహ్మణ స్త్రీయందు జనించినను వాఁడు బ్రాహ్మణుఁడు గాఁడు. ఈ విషయమున దేవలుఁ డిట్లె చెప్పెను. 'ద్వితీయేన తు యః పిత్రా సవర్ణాయాం ప్రజాయతే। అవవాట ఇతి ఖ్యాతః, శూద్రధర్మా సజాతితః। వ్రతహీనా నసంస్కార్యాః స్వతంత్రా స్వపి యే సుతాః। ఉత్పాదితా సవర్ణేన, వ్రాత్యా ఇవ బహిష్కృతాః' సవర్ణస్త్రీ యందు రెండవ తండ్రికిఁ బుట్టినవాఁడు

అవవాటుఁ డనఁబడును. వాఁడు జాతిచే శూద్రధర్మము గలవాఁడే. వానికి బ్రహ్మ చర్యాది వ్రతములు, ఉపనయనాది సంస్కారములు లేవు. వాఁడు వ్రాత్యుఁడనలె బహిష్కరింపఁబడఁ దగినవాఁడు.

'యేతు జాతా స్సమానాసు సంస్కార్యాస్తు రతోఽన్యథా' యని వ్యాసులు చెప్పెను. 'సవర్ణేభ్య స్సవర్ణాసు జాయంతే హి సజాతయః'అనియు 'విన్నాస్వేష విధిః స్మృతః' వివాహమున భార్యాభర్తలుగ నైన వారియందే యీ విధి యని యాజ్ఞ వల్క్యుఁడు చెప్పెను.

'స్త్రీష్వనంతర జాతాసు ద్విజైరుత్పాదితాన్ సుతాన్। సదృశానేవ తానాహుర్మాతృదోష విగర్హితాన్.

దీనికి వ్యాఖ్యాన మందిట్లు వ్రాయఁబడినది.

అనులోమముగా నవ్యవహిత వర్ణ జాతీయభార్యలందు నెవరు పుట్టుదురో అనఁగా బ్రాహ్మణునకు క్షత్రియ స్త్రీ యందు, క్షత్రియునకు వైశ్య స్త్రీయందు, వైశ్యునకు శూద్ర స్త్రీ యందు, పుట్టిన కొడుకులు. తల్లి యొక్క హీనజాతి వలన నిందింపఁబడిన వారై పితృసదృశు లగుదురే కాని తండ్రి జాతివారుకారు. పితృ సదృశు లని చెప్పుటచే తల్లి జాతికంటె నెక్కువవారు, తండ్రికంటె నికృష్టు లగుదురని తెలియవలయును. వరుసగా వీరికి మూర్ధాభిషిక్తుఁ డనియు, మాహి ష్యుఁడనియు కరణజాతివాఁ డనియుఁ బేర్లు వచ్చును గాని బ్రాహ్మణుఁడు, క్షత్రి యుఁడు, వైశ్యుఁడు, నను పేర్లు రావు. వీరికి వృత్తులు వేఱువేఱుగా విధింపఁ బడినవి. బ్రాహ్మణునకు వివాహిత లగు క్షత్రియ వైశ్య శూద్ర స్త్రీలయందుఁ బుట్టిన ముగ్గురు-క్షత్రియునకు వైశ్యశూద్ర స్త్రీలయందుఁ బుట్టిన యిద్దఱు, వైశ్యునకు శూద్ర స్త్రీయందుఁ బుట్టిన యొకఁడు-ఈయార్గురు అపశదు లనఁ బడు దురు. (అపశదు లనఁగా నికృష్టులు-అని మనువు)

విప్రస్య త్రిషు వర్ణేషు, నృపతే ర్వర్ణ యో ర్ద్వయోః
వైశ్యస్య వర్ణే చైకస్మిన్, షడేతేఽపశదాః స్మృతాః.

మనువు. ౧౦.౧౦.

బ్రాహ్మణేన క్షత్రియాయా ముత్పాదితః క్షత్రియ ఏవ భవతి, క్షత్రియేణ వైశ్యాయాం వైశ్య ఏవ, వైశ్యేనశూద్రాయాం శూద్ర ఏవేతి శంఖస్మరణమ్. వైద్యనాథీయము.

బ్రాహ్మణునకు వివాహిత యగు క్షత్రియస్త్రీయందుఁ బుట్టినవాఁడు క్షత్రియుఁడే; క్షత్రియునకు వైశ్య స్త్రీయందుఁ బుట్టిన వాఁడు వైశ్యుఁడే; వైశ్యు నకు శూద్ర.స్త్రీయందుఁ బుట్టినవాఁడు శూద్రుఁడే యని శంఖుఁడు.

కావున బ్రాహ్మణుఁడైన విశ్రవసునకు వివాహము చేసికొనని రాక్షస క్షత్రియ యందుఁ బుట్టిన రావణుఁడు బ్రాహ్మణ జాతివాఁ డెట్లగును? ఇఁక గుణ కర్మములఁబట్టి చూతము.

బ్రాహ్మణునకు బ్రాహ్మణ జాతి స్త్రీయందుఁ బుట్టినవాఁడైనను బ్రాహ్మణ గుణకర్మములు లేవేని వాఁడు బ్రాహ్మణుఁడు గాఁడు. వాఁడే వృత్తియం దున్నాఁడో యా జాతి వానిఁగానే యెన్నవలయును. 'బ్రాహ్మణ క్షత్రియ త్త్వంహి యాతి శస్త్రసముద్యమాత్' అని భీష్ముఁడు పరశురామునితో ననెను. బ్రాహ్మణుఁడా! నీవు శస్త్రము ధరించుటచే క్షత్రియుఁడ వైతివి. కావున నిన్నుఁగొట్టెద ననెను.

విశ్వామిత్రుని తాత కుశుఁడు, సాక్షాద్బ్రహ్మపుత్రుఁడైనను నాయన వంశము వారందఱు క్షత్రకర్మ మవలంబించుటచే క్షత్రియులైరి. కాని బ్రాహ్మణు లనబడలేదు. వ్యాసులకు శూద్రస్త్రీయందుఁబుట్టిన విదురుఁడు శూద్రుఁ డయ్యెను గాని బ్రాహ్మణుఁడు కాలేదు. ఋషుల జన్మము గుఱించి యుత్తరకాండమునఁ జర్చింపఁబడును. ఈ కారణములచే రావణుఁడు జాతి గుణకర్మములచే క్షత్రియుఁడేకాని బ్రాహ్మణుఁడు కాఁడు. అయోధ్య ౨౮౬౮ వ్యాఖ్య చూచునది.

కావున రావణుఁడు తాను క్షత్రియుఁడ నని క్షత్రియధర్మ మనుసరించి నిన్నుఁ బంపుచున్నా నని యింద్రజిత్తుతోఁ జెప్పినమాట శాస్త్రసమ్మత మైనది. రావణాసురుఁడు క్షత్రియుఁ డని చెప్పఁబడుట యిచ్చట మాత్రమే కాదు.

క. పరలోక సుఖముఁ గోరెడి, పురుషులు పెనువీకఁ బెనఁగి పొలియుదు రనిలో
ధర క్షత్రధర్మమున సం, గరమునఁ దెగువారి కేడ్వఁ గా న్యాయంబే.

యుద్ధ. ౨౮౯౯.

క. క్షత్రియ సమ్మతము పురా, ధాత్రీశాధిష్ఠితమ్ము తగుగతి యిది యా
క్షత్రియున కాహవోజ్ఝిత, గాత్రునకై కార్పరాదు కన్నీ రెందున్.

యుద్ధ, ౨౧౦ ౨.

రావణునకు జరపిన యుత్తరక్రియల విధానము పరిశీలించినను నవి బ్రాహ్మణునకుఁ జేయు కార్యములు గా వని స్పష్టపడును.

పుత్రా యేఽనంతర స్త్రీజాః, క్రమేణోక్తా ద్విజన్మనామ్
తా ననంతరనామ్న స్తు, మాతృదోషా త్ప్రచక్షతే॥

మను-౧౦-౧౮.

ద్విజులకుఁ దమ వెంబడి జాతులందుఁ బుట్టిన బిడ్డలకు వారి తల్లియొక్క హీనజాతిని బట్టి హీనజాతులందుఁ బుట్టినవారుగా నెంచఁ బడుదురు. కనుక మాతృ జాతికిఁ దగిన సంస్కారమునకు నర్హులు. మీఁద వ్రాసిన దంతయు వివాహితలైన స్త్రీలకుఁ బుట్టిన వాని విషయము. రావణుఁడు వివాహిత స్త్రీకిఁ బుట్టినవాఁడు కాఁడు. విశ్రవసుఁడు కైకసిని వివాహ మాడలేదు. దాని తండ్రి కన్యాదానమును జేయలేదు. సమీపమందుఁగూడ లేఁడు. కైకసి బిడ్డలు గోరి వచ్చెను. కావున విశ్రవసుఁడు బిడ్డల ననుగ్రహించెను. కావున నామె యుంపుడు కత్తెవంటిది. కావున ననులోమ జాతులకంటె రావణుఁడు హీనుఁ డగు చున్నాఁడు.

ఉత్త. కాం. ప. ౧౪౫-౧౪౬. భగవద్ద్వేషి యైన సుమాలియొక్క పుత్రికయగు కైకసి ప్రదోషకాలమందు విశ్రవస్సును బొందినది. కాఁబట్టి మాతృదోషము వల్ల రావణుఁడు కర్మచండాలబీజోత్పన్నుఁ డనియును జెప్పవలసి వచ్చును. అంతకు బైన భగవద్భాగవత విషయము లైన యసహ్యాపచారములవల్ల నితఁడు కర్మచండాలుఁ డనుట సహజము.

క. కావున నిన్నంపెద నా,నావిధ మహితాస్త్రముల మ♦నంబునఁ గడు సం
భావించుమఁ బోకుము పుత్రా! విజయముఁ గొమ్ము పోయి♦రమ్మా సుమతీ!

తాత్పర్యము

క్షత్రియ ధర్మమును మన మతిక్రమింపరాదు. కావున నిన్నుఁ బంపుచున్నాను. అనేక విధములైన గొప్ప యస్త్రములను మనస్సున స్మరించుచు యుద్ధము చేయుము. కుమారా! పోయి జయించి రమ్ము.

—♦ ఇంద్రజిత్తు హనుమంతుని మీఁదికి యుద్ధమునకుఁ బోవుట. ♦—

చ. అని జనకుండు వల్క విన♦యంబున నాతనికిం బ్రదక్షిణం
బొనరిచి దక్షపుత్రనిభుఁ ♦ డుద్ధతి సన్నహనంబు సేసి బం
ధునిచయపూజితుం డగుచుఁ♦దూర్ణము పర్వమువేళ వార్ధిరీ
తిని ఖగరాజవేగహరి♦దీప్తరథంబును నెక్కి వెల్వడెన్. ౧౧౧౦

అర్థములు. దక్షపుత్రనిభుఁడు=దేవతలతో సమానుఁడు, 'మనసాత్వేవ భూతాని పూర్వం దక్షోఽసృజత్తథా। దేవానృషీన్ సగంధర్వా నురగాన్ పక్షిణ స్తథా'యని వి. పురా, వాక్యము ప్రమాణము. ఉద్ధతిన్=గర్వముచే, సన్నహనంబు=దృఢప్రయత్నము. బంధునిచయ పూజితుఁడు=చుట్టముల గుంపులచే గౌరవింపఁబడినవాఁడై; తూర్ణము=వేగముగ, పర్వము-వేళ=పున్నమనాఁడు వార్ధిరీతిని=సముద్రమువలె, ఖగరాజవేగ=గరుత్మంతుని వేగము గల, హరి=గుఱ్ఱములచే, దీప్త=ప్రకాశించు, రథంబును=తేరిని.

తాత్పర్యము

ఈ ప్రకారము తండ్రి చెప్పఁగా వినయముతో నాయనకుఁ బ్రదక్షిణము చేసి దేవతలతో సమానుఁ డగు నింద్రజిత్తు గర్వించి యుద్ధమునకుఁ దగిన ప్రయత్నము చేసి బంధువు లందఱు గౌరవింపఁగా వేగముగఁ బున్నమనాఁటి సముద్రమువలెఁ బొంగి గరుడ వేగముతో సమానవేగము గల గుఱ్ఱములు కట్టిన తేరెక్కి యిల్లు వెడలెను.

ఉ. ఆ రథికోత్తముండు పవ♦నాత్మజు చక్కటి కేగ నాతఁ డా
ఘోరశతాంగనిస్స్వనము ♦ క్రూరశరాసగుణారవంబులున్
భూరితరంబు గావుటయుఁ♦బొంగి గళార్భటి నించె వ్యోమసం
చారులు నాగయక్షఋషి♦సత్తము లుబ్బున మూఁగ వేడుకన్. ౧౧౧౧

అర్థములు, ఘోరశతాంగ నిస్వనము=భయంకరమైన తేరి ధ్వని, క్రూర శరాసగుణారవంబులున్=కఠినములై యల్లెత్రాటి ధ్వనులును, గళార్భటి=కంఠధ్వని, వ్యోమ సంచారులు=ఆకాశమందుఁ దిరుగువారు, ఉబ్బునన్=సంతోషముతో.

తాత్పర్యము

రథికులందు త్తముఁడైన యా యింద్రజిత్తు హనుమంతుఁ డున్న చోటికి సరిగాఁ బోఁగా నతని రథచక్రధ్వని; అల్లెత్రాటిమ్రోఁత-మిక్కిలి యతిశయింపఁగాఁ దగిన వాఁడే వచ్చుచున్నాఁ డని హనుమంతుఁడు సంతోషించి సింహనాదము చేసెను. ఆకాశమున సంచరించువారు నాగులు, యక్షులు, ఋషిశ్రేష్ఠులు సంతోషముతో గుంపుఁగూడిరి.

చ. దరకరభూరిచాపమునఁ♦దారుణశాతశిలీముఖంబులన్
వరబలుఁ డుద్ధతింగొని జ♦వంబున సంగరకాంక్షఁ బోవ భీ
కరముగఁ గూసె సత్త్వములు♦కాంతి దొఱంగె దెసల్ విహంగమో
త్కరములు మింటఁ బెక్కులు వి♦ధంబుల నాద మొనర్చె భీతిచేన్. ౧౧౧౨

అర్థములు. దరకర=భయంకరమైన, భూరి=గొప్పదగు, చాపము=విల్లు, దారుణ శాతశిలీముఖంబులున్=భీతిని గలిగించు పదునైన బాణములు, వరబలుఁడు=ప్రశస్తమైన బలము గలవాఁడు, బ్రహ్మవరబలము గలవాఁడు; సంగరకాంక్షన్=యుద్ధమునందలి కోరికతో-సత్త్వములు=జంతువులు, విహంగమ+ఉత్కరములు=పక్షిసంఘములు.

తాత్పర్యము

భయంకరమైన పెద్దవింటిని, పదునైన బాణములను దీసికొని యుద్ధమునందలి కోరికచే వేగముగఁ బోఁగా మృగములు గూసెను. దిక్కులు కాంతి మాసెను. పక్షులు భయపడి యాకాశమున కెగసి నానావిధములఁ గూసెను.

శా. జ్యాటంకారవిపాటితాశుఁ డగుచున్♦శక్రారి నిర్వక్ర మా
నాటోపంబున బాణవర్షములతో♦నవ్వానరున్ డాయ వృ
క్షాటుం డుద్భటవైరిభీతికరగ♦ర్జాస్ఫోటితోర్వీధ్రుఁడై
యూటాడంగ ధరాతలంబు నిజవే♦గోద్ధూతజీమూతుఁడై. ౧౧౧౩

అర్థములు. జ్యాటంకార=అల్లెత్రాటి టంకారముచే, విపాటిత+ఆశుఁడు=చీల్పఁబడిన దిక్కులు గలవాఁడు, శక్రారి=ఇంద్రజిత్తు, నిర్వక్రము=వంకరలేనిది, ఆటోపంబున=వేగమున, వృక్షాటుండు=క్రోఁతి, ఉద్భట=మిక్కిలి; గర్జా=సింహనాదముచే, స్ఫోటిత=చీల్పఁబడిన, ఉర్వీధ్రుఁడై=కొండలు గలవాఁడై, ఊటాడంగన్=ఊఁగులాడఁగా-నిజ=తన, వేగ=వేగముచే-ఉద్ధూత=ఎగురఁ గొట్టఁబడిన, జీమూతుఁడై=మేఘములు గలవాఁడై.

తా త్ప ర్య ము

అల్లెత్రాటి టమ్మను ధ్వనిచే దిక్కులు పగులఁ జీల్చుచు, నింద్రజిత్తు నిండారు వేగమున బాణవర్షము గురియించుచు వానరుని జేరఁబోవ వానరుఁడు కంఠ నాదముచేఁ గొండలు బ్రద్దలు గాఁగా, భూమి కదలఁగ తన వేగమువలనఁ బుట్టిన గాలిచే మేఘములు చెదరి పోవఁ జేయుచున్నవాఁడై.

చ. విడివడి తాఁకె నిట్లు రణ♦వీరు లవారణ విక్రమంబునన్
గడుకొని దేవదానవుల♦కై వడిఁ బోరిరి బద్ధవైరులై
యెడ గొన నీక వచ్చు శర♦వృష్టిరయంబును నాఁపి కాయముం
బొడ వొనరించి తంద్రిపథ♦ముం గొని గ్రుమ్మరుచున్న మారుతిన్. ౧౧౧४

అర్థములు. విడివడి=యథేష్టముగ, అవారణ=అడ్డములేని, కడుకొని=ప్రయత్నించి, ఎడగొన నీక=సందు గలుగ నీయక, శరవృష్టిరయంబును=బాణవర్షము యొక్క వేగమును, ఆఁపి=అడ్డగించి, తంద్రిపథమున్=ఆకాశమును.

తా త్ప ర్య ము

విచ్చల విడి తాఁకెను. ఇట్లు యుద్ధమునందు వీరులగు హనుమ దింద్రజిత్తులు దేవదానవులవలె విరోధబుద్ధిచే యుద్ధము చేసిరి. అప్పుడు సందులేక వచ్చుచున్న బాణవర్షముయొక్క వేగము నడ్డగించిన వాఁడై దేహము పెంచి వాయుమార్గమునఁ జరించుచున్న యాంజనేయుని.

ఉ. ఆయత తీక్ష్ణశల్యకన♦కాంచితపుంఖశరాలి వైచెన
త్యాయతవేగ మార నసు♦రాధిపనందనుఁ డంత తూర్యముల్
పాయక భేరికాపటహా♦వారరవంబులుఁ గార్ముకధ్వనుల్
మ్రోయఁ దొడంగె దాని విని♦రోషమునం బవమాన సూతియున్. ౧౧౧౫

అర్థములు. ఆయత=నిడుపైన-తీక్ష్ణ=పదునైన, శల్య=ములికి కల, కనకాంచిత పుంఖ శరాలిన్=బంగారుచేఁ బ్రకాశించు పింజలు గల బాణ సమూహమును, అత్యాయత వేగము=మిక్కిలి యధికమైన వేగము, తూర్యముల్=వాద్యధ్వనులు, భేరికా=నగరాలయు, పటహా=తప్పెటలయు, రవంబులు=ధ్వనులు, కార్ముకధ్వనుల్=వింటి చప్పుడులు.

తా త్ప ర్య ము

నిడుపై వాఁడియగు ములుకులు గల బంగారు పింజబాణములను మిగుల వేగముగ వేసెను. దానిని జూచి వాద్యధ్వనులు, భేరులు, తప్పెటలు రాక్షసులు మ్రోయించిరి. దానికి నాంజనేయుఁడు కోపించి.

మ. కృతహస్తుం డగు వాసవారి దనపైఁ♦గీలించు బాణావళిన్
వితంగాఁ జేయుచు వాని యంతరమునన్♦వేగంబు దీపింపఁగా

ధృతి పెంపారఁ జరించు, నెట్టయెదుటన్‌ • దృగ్గోచరుండౌ. నభో
గతుఁ డౌ, వెంటనె మీఁద దూఁకుఁ, గరయు•గ్మం బడ్డగించు న్వేసన్.

అర్థములు. కృతహస్తుఁడు=బాణములు గుఱి తప్పక వేయువాఁడు, 'కృత హస్తస్సుప్రయోగ విశిఖః-కృతపుంఖవత్'. అమర. వితథా=వ్యర్థముగా, అంతరమునన్=నడుమ.

తాత్పర్యము

గుఱి సూటిగ వేయు నింద్రజిత్తు తన మీఁద వేయు బాణములను వ్యర్థపఱుచుచుఁ దనకుఁ దగులకుండఁ జేసికొనుచు నా బాణములకు నడుమ మిగుల వేగముగా దిరుగును. ఎట్ట యెదుటఁ గానవచ్చును. ఎదుట నున్నాఁడని బాణము వేయునంతలో నాకాశమున నుండును. అంతలో మీఁద దూఁకును. చేతులడ్డము పెట్టును.

ఉ. ఇద్దరు యుద్ధకర్మచణు•లిద్దఱు భూరిజవాధికోత్తముల్
పద్దుగఁ బోరి రిద్దఱు న•పారపరాక్రమ మల్లసిల్లఁగా
నద్దిర నాఁగ భూతనిచ•యంబు, పరస్పర తారతమ్య మా
యిద్ద ఱెఱుంగ రైరి యసు•రేశ్వరనందన వాయునందనుల్. ౧౧౧౭

అర్థములు. యుద్ధకర్మచణులు=యుద్ధము చేయుట యందు సమర్థులు, భూరి=గొప్ప, జవాధిక=మిక్కిలి వేగమునందు, ఉత్తముల్=గొప్పవారు.

తాత్పర్యము

ఇద్దఱు యుద్ధమందు సమర్థులు, ఇద్దఱు నతివేగము గలవారు అంతములేని పరాక్రమముతో భూతసమూహము లాశ్చర్యపడఁగా యుద్ధము చేసిరి. ఇంద్రజిత్తు-హనుమంతులు పరస్పర తారతమ్యము నెఱుఁగ లేరైరి.

చ. హనుమ యెఱుంగఁ డయ్యె నసు•రాధిపనందను నంతరంబు, నా
దనుజుఁ డెఱుంగఁ డయ్యె వసు•ధారుహచారుని యంతరంబు, నా
యనఘులు పోరుచో దృఢస•మాధిని నింద్రజి బాణముల్ వృథా
చనుటయ కాని కీశవరుఁ•జిక్కఁగ నాటవ యేమి సేయుదున్. ౧౧౧౮

అర్థములు. అంతరము=ఛిద్రము-లోపము, వసుధారుహచారుని=క్రోఁతి యొక్క, దృఢసమాధిని=గట్టి నిశ్చల మనస్సుతో, ఇంద్రజి=ఇంద్రజిత్తు, అనఘులు=యుద్ధకర్మమందు దోషములేనివారు.

తాత్పర్యము

ఇంద్రజిత్తునందలి లోపము హనుమ తెలిసికొనలేఁడయ్యె. హనుమలోపము నింద్రజిత్తు తెలిసికొనలేఁడయ్యె. ఇట్లు యుద్ధకర్మమందు లోపములేక పోరునపుడు ఇంద్రజిత్తు తనలో నిట్టు లాలోచించెను. నా బాణము లన్నియు వ్యర్థములై పోవుచున్నవి. కాని వానిలో నొకటియైన క్రోఁతిని దాఁకినది లేదే. ఏమి సేయుదును?

—♦ ఇంద్రజిత్తు హనుమంతుని బ్రహ్మాస్త్రమున బంధించుట. ♦—

ఉ. చిక్కఁడు లక్ష్యసిద్ధికిని ♦ చేవడి వీని వధింప శక్యమా
యొక్కరణిం గ్రహింప నగు ♦ నీతని నంచుఁ బితామహాస్త్రముం
గ్రక్కున వారికిం దొడిగి ♦ రావణి పావని వైచి కట్టె వీఁ
డుక్కరి యొంటఁ బోఁ డనుచు♦నుర్విపయిం బడె దానఁ గ్రోఁతియున్. ౧౧౯

అర్థములు. చేవడి=చేతి వేగముచే, పితామహాస్త్రమున్=బ్రహ్మాస్త్రమును, నారికిన్=అల్లెత్రాటికి, తొడిగి=సంధించి, ఉక్కరి=బలశాలి, ఒంటఁబోఁడు=మఱి యొక విధముగఁ జిక్కఁడు.

తాత్పర్యము

నా గుఱికి వీఁడు చిక్కుటలేదు. భుజబలముచే వీనిని జంప సాధ్యముగాదు. ఏ విధముగ వీనిని గట్టివేయ సాధ్య మగునని యాలోచించి బ్రహ్మాస్త్రమును వింట సంధించి యింద్రజిత్తు వీఁడు మఱియొక బాణమునకు సాధ్యుఁడు కాఁ డని యాంజనేయునిమీఁద వేసి కట్టెను. దానితోఁ గ్రోఁతి నేలఁబడెను.

ఉ. సోలి విచేష్టుఁ డై పవన♦సూనుఁడు బ్రహ్మవరంబు నెంచి దో
ర్లీల నడంచి నిర్జరవ♦రిష్ఠుని యానతి దాఁట శక్యమా
పాలన సేయుటే పరమ♦భవ్యము చిక్కితిఁ బో భయంబు లే
దోలిఁ బితామహుండును బి♦డౌజుఁడు వాయువు నన్నుఁ గావఁగన్. ౧౨౦

అర్థములు. సోలి=నేలఁబడి - విచేష్టుఁడై=కాలుసేతులు కదలింపనివాఁడై, దోర్లీలన్=భుజబలమును - నిర్జర వరిష్ఠుని = దేవతాజ్యేష్ఠుఁడగు బ్రహ్మయొక్క ఆనతి=ఆజ్ఞ, పితామహుండును=బ్రహ్మయు-బిడౌజుఁడును=ఇంద్రుఁడును, నాలుగవ పాదంబున వృద్ధివళి గావున బిడ + ఓజున్ లోని ఓకారముతో యతిచెల్లెను.

తాత్పర్యము

కాలు సేతులు కదలింపలేక నెలఁబడి యాంజనేయుఁడు బ్రహ్మ దనకిచ్చిన వరము స్మరించి భుజపరాక్రమము చాలించి బ్రహ్మ యాజ్ఞ దాఁటవచ్చునా? దానిని రక్షించుటే మిగుల శ్రేయస్కరము. వీరికిఁ జిక్కితిని బో నాకు వరము లిచ్చిన బ్రహ్మ యింద్రుఁడు తండ్రి యగు వాయువు నన్ను రక్షింపఁగా నాకు రాఁగల భయమేమి?

క. నను బట్టుకొనుచుఁ బోదురొ, దనుజులు పోవుదురు గాక♦దశకంధరునిం
గనుఁగొని సంభాషింపఁగఁ, జను నదియును నొక్కమేలె♦చర్చింపంగన్.

తాత్పర్యము

వీరిచేతఁ జిక్కితిని బో వీరు నన్నేమి చేయుదురు. రావణాజ్ఞ లేక వీరేమియుఁ నన్నుఁ జేయఁజాలరు. కావున వీరు నన్నుఁ బట్టుకొని రావణు నొద్దకుఁ దీసికొని

పోదురు. పోనీ రావణుతో సంభాషింపఁ గలుగుదును కావున నదియు నొక మేలే. వాని యభిప్రాయము తెలిసికొని నట్లు లగును గదా.

ఆ. అని సమీక్ష్యకారి•యా హనుమంతుఁడు, చేష్టలుడిగి యుండి•దుష్టు లతిమి
నారత్రాళ్ళఁ బెనిచి•నారచీరలుగట్ట, గూఁత లిడియెఁ గ్రోఁతి•గుణముఁ దెలుప.

అర్థములు. సమీక్ష్యకారి=ఆలోచించి కార్యము చేయువాఁడు. సమ్+ఈక్షాం+కరోతీతి సమీక్ష్యకారీ=ఈక్షించుట=చూచుట-వీనికి పర్యాయశబ్దము లకు నాలోచించుట యని యర్థము గలదు. అతిమి=అతిక్రమించి.

## తా త్ప ర్య ము

చక్కఁగా నాలోచించి కార్యముచేయు నా హనుమంతుఁడు కదలక మెదలక యూరకుండి యా దుష్టరాక్షసులు పైబడి నార త్రాళ్ళతో నార గుడ్డలు పెనవేసి తన్నుఁ గట్టుచుండఁగాఁ దన క్రోఁతి గుణము దెలుపుటకై కూఁతలు పెట్టుచుండెను.

—• రాక్షసులు హనుమంతునిఁ గట్టి రావణునొద్దకుఁ దీసికొని పోవుట. •—

చ. కనుఁగొని నిర్విచేష్టుఁ డగు•కైసరి నాశరవార మెల్లఁ గిం
కను బలితంపుఁ బగ్గములఁ•గార్యమునన్ ద్రుమచీరపాళితోఁ
గొనకొని కట్టఁగా నసుర•కుంజరుఁ డుత్కటకౌతుకంబునన్
గను నను నంచు నోర్చి కపి•కట్టులు సైఁచి యణంగి యుండఁగన్. ౫౫-౫౩

అర్థములు. నిర్విచేష్టుఁడు=ఏ చేష్టలు లేనివాఁడు, కైసరిన్=హనుమంతుని. కేసరి పుత్రుఁడు కైసరి-అపత్యార్థక తద్ధితము. ఆశరవారము=రాక్షస సమూహము. ద్రుమ చీరపాళితో=చెట్లపట్టలతోనైన వస్త్రముల సమూహముతో-కొనకొని=ప్రయత్నించి.

## తా త్ప ర్య ము

ఇట్లు హనుమంతుఁడు చేష్ట లుడిగి పడి యుండుట చూచి చూచి రాక్షసులు కోపించి, బలముగల పగ్గములను నారవస్త్రములతోఁ బెనవేసి ప్రయత్న పూర్వకముగాఁ గట్టఁగా రావణాసురుఁడు మిగులఁ గౌతుకముతోఁ దన్నుఁ జూచును గాకయని హనుమంతుఁడు కట్లు సహించి యూరకుండెను.

చ. అసురలు త్రాళ్ళఁ బగ్గముల•నా హనుమంతునిఁ గట్టినంతనే
వెస వెస నస్త్రబంధమును•వీడి చనెన్, ద్రుహిణాస్త్రబంధముల్
పస చెడి పోవు నన్య మగు•బంధచయంబులతోడఁ గూడినన్
లసదసమాస్త్ర మీగతి ఫ•లం బఱిపోవుట చూచి దీనుఁడై. ౫౫-౫౪

అర్థములు, ద్రుహిణాస్త్రబంధముల్=బ్రహ్మాస్త్రబంధములు, లసత్=దివ్య తేజస్సుతోఁ బ్రకాశించు, అసమాస్త్రము=సమానములేని యస్త్రము- ఫలంబఱి=ఫలము చెడి.

### తాత్పర్యము

రాక్షసులు త్రాళ్ళచేతను, బగ్గముల చేతను హనుమంతుని గట్టఁగానే బ్రహ్మాస్త్రబంధములు తొలఁగి పోయెను. బ్రహ్మాస్త్ర బంధములు మఱియొక బంధములతోఁ గూడదేని వ్యర్థమై పోవును. అసమానశక్తిగల యస్త్ర మీవిధముగ నిష్ఫలమై పోవుటచూచి శోకించినవాఁడై.

బ్రహ్మాస్త్ర బంధబలమునందు విశ్వాసము లేనివారై రాక్షసులు త్రాళ్ళతోఁ గట్టఁగనే యాయవమానము సహింపలేక యస్త్రబంధము లూడిపోయెను. అట్టులే ప్రపత్తి చేసినవాఁడు దానియందు విశ్వాసము లేక దానికి సాహాయ్య మని వేఱొక సాధనమును గ్రహించెనేని ప్రపత్తి చెడును ప్రపత్తి యందుండునపాయ మిదియే. ఇతరోపాయముల నది సహింపదు. ఉత్తములు నీచ సహవాసము సహింతురా.

శా. అయ్యో! యెంతటి కార్యమిట్లు విఫలం ♦ బాయెన్, సురారుల్ మహా
జయ్యం బౌ వరమంత్రశక్తి మది నెం♦చం జాలరై రకటా!
యి య్యస్త్రంబు పునఃప్రయుక్తమయి కా♦దేనిన్ మఱొం డస్త్రమేన్
గయ్యానన్ ఫలకారి కా దౌదవె, శం♦కన్ సర్వదైత్యాళికిన్. ౧౧౫౭

### తాత్పర్యము

అయ్యో! యెంత గొప్ప ప్రయత్న మిట్లు వ్యర్థమై పోయెను. ఈ రాక్షసులు జయింపరాని గొప్ప మంత్రశక్తి యందు నమ్మకము లేనివారైరి కదా. ఈ యస్త్రమును మఱలఁ బ్రయోగింపరాదు. ఇది వ్యర్థమైనచోట మఱియే యస్త్రము పనిచేయదు. ఇఁక నేమి గతి! వీనిచే రాక్షసులందఱు నాశమై పోవు కాలము వచ్చినది.

చ. తనమెయి నస్త్రబంధములు♦దాఱు టెఱుంగఁడు గాక వానరుం
డని యిటు చింత సేయఁగ సు♦రాధిపజేత, వనాటనేత బం
ధనములఁ గట్టి కట్టియలఁ♦దాఁచుచు ముష్టుల బిట్టు గ్రుద్దుచున్
గొని చని రావణాసురుని♦కొల్వున నిల్పిరి క్రూరరాక్షసుల్. ౧౧౫౮

అర్థములు. తనమెయిన్=తన దేహమునందు, తాఱుట=వదలిపోవుట, సురాధిపజేత=ఇంద్రజిత్తు.

### తాత్పర్యము

తనదేహమును గట్టిన యస్త్రబంధములు వదలిపోవుటవానరుఁ డెఱుఁగఁడు. కావుననే చిక్కుపడి యున్నాఁడు. తెలిసిన విజృంభించి యుండును. అని యింద్రజిత్తు ఆలోచించు చుండఁగా క్రోఁతిపతిని త్రాళ్ళతోఁగట్టి కట్టెలతోఁ గొట్టుచు, పిడికిళ్ళతో గ్రుద్దుచుఁ దీసికొనిపోయి కొలువుకూటమందున్న రావణాసురుని యెదుట రాక్షసులు నిలిపిరి.

ఉ. తెచ్చితి మయ్య! క్రోఁతి నని♦తెల్పిన నచ్చట నున్న వారు వీఁ
డెచ్చటనుండి వచ్చె? నితఁ♦డెవ్వఁడొ? యెవ్వఁడు పంపెఁ? దాను రా

నిచ్చటి కేమి కార్య? మిటు♦లేటికిఁ జేసె నటంచు నొండొరుల్
ముచ్చట లాడుచుండ మద♦మోహమునన్ మఱికొంద ఱుద్ధతిన్. ౹౹ ౨౮

తాత్పర్యము

తెచ్చితిమయ్య క్రోఁతిని, క్రోఁతి యని మొదటఁ జెప్పిన నింద్రజిత్తుని గూఁడ జంపెనని రావణుఁడు భయపడునని తెచ్చితి మని మొదటనే చెప్పిరి. రాజా! తెచ్చితిమి క్రోఁతినని తెలుపఁగా నా సభయందున్న వారు వీఁడెక్కడి నుండి వచ్చెను? వీఁడెవ్వఁడు? వీనిని బంపిన వాఁడెవ్వఁడు? ఏమిపని గలిగి వచ్చి నాఁడు? ఏల యిట్లు చేసెను. అని యొకరితో నొకరు ముచ్చటలాడు చుండగా మదమోహముచే దేహము తెలియని కొందఱు గర్వించి.

ఉ. కట్టుఁడి కొట్టుఁడీ యతనిఁ♦గాల్పుఁడి మ్రింగుఁ డటంచుఁ గ్రుద్ధులై
నెట్టన పల్కుచుండ విని♦నీరజబాంధవవంశ్యదూత య
ప్పట్టున రాక్షసాధిపుని♦పాదసమీపమునందు మంత్రులన్
దిట్టల వృద్ధసేవకుల♦దివ్యమణీమయగేహముం గనెన్. ౹౹ ౨౯

అర్థములు. నీరజబాంధవ వంశ్యదూత=రామదూత.

తాత్పర్యము

కట్టుఁడు, కొట్టుఁడు, కాల్చుఁడు, మ్రింగుఁ డని కోపించి రాక్షసులు పలుకు చుండగాఁ విని రామదూత రాక్షసుల వెంటఁబోయి రావణుని పాదముల యొద్ద నున్న మంత్రులను దిట్టలను వృద్ధులను సేవకులను జూచెను. మఱియు దివ్యరత్న ములతో నిండిన యా సభామంటపమును జూచెను.

క. ఇటురా యిటురా యనుచును, బటువికృతాకారదైత్య♦భటు లీడ్వఁగ ముం
దటఁ గనుఁగొనె దశముఖుఁడు, ద్భటసాధ్వస హేతు తేజు♦వాయుతనూజున్.

అర్థములు. పటువికృతాకార దైత్య భటులు=మిగుల వికారములైన యాకారములు గల రాక్షస భటులు, ఉద్భట=మిగుల-సాధ్వస హేతు=భయ కారణమైన- తేజున్=పరాక్రమము గలవానిని.

తాత్పర్యము

మిగులవికారమైన యాకారములు గల రాక్షసభటు లిటు రారా యని, యొకఁడీడువఁగా మఱియొకఁడిటురారా యని యిటు లీడ్వఁగా వచ్చి యెదుట నిలువఁబడిన మిగుల భయము గలిగించు తేజముగల హనుమంతుని రావణుఁడు చూచెను.

క. మర్కటసత్తముఁడును గనె, నర్కునివలె వెలుఁగువాని♦నతిబలతేజున్
గర్కశముఖు రాక్షసపతిఁ, దర్కింపఁగ రాని మహిమ♦దనరఁగ నతఁడున్.

తాత్పర్యము

సూర్యునివలె వెలుఁగు వానిని, మిగుల బలము, తేజము గలవానిని, గోప

ముచేఁ గఠినమైన ముఖముగలవానిని, నూహింపరాని మహిమగల రావణుని వానరుఁడును జూచెను. అప్పుడా రావణుఁడు.

చ. వికటతరాగ్రహారుణితవింశతిలోచనముల్ వెలుఁగఁగాఁ
ప్రకటమనీషులన్ సచివరాజుల సత్కులశీలవృద్ధులన్
నికటతరానువర్తుల నసెం, గపి యెవ్వఁ డెఱుంగుఁ డీరు త
త్సకల మటన్న వారు కపిసత్తముఁ గార్యముఁ బ్రశ్న సేయఁగన్. ౧౧౩౧

అర్థములు. వికటతర=మిగుల భయంకరమైన, ఆగ్రహ=కోపముచేత-అరుణిత=ఎఱుపుగల-అరుణశబ్దము తారకాది గణములోఁ జేరినది. తారకాదిగణమాకృతి గణము-తదస్య సంజాతం-తారకాదిభ్య ఇతచ్ (పాణిని ౫-౨-౩౬) వింశతి లోచనముల్=ఇరువది కన్నులు-ప్రకట మనీషులన్=ప్రసిద్ధ బుద్ధిమంతులను-మనీషా శబ్దము శకంధ్వాదులలోఁ జేరిగినది. "శకంధు రథ కర్కంధూః కుద్దాలోలక్తపర్కటీ। లాంగలీషా హలీషాచ మనీషాచ పతంజలిః। కుతీకులోష్ణీష మంజీరమస్తిషక్కులటాదయః। తథా వృకంధు సీమన్తా శకంధ్వాది గణేస్మృతాః. శకంధ్వాదిషు టేః పర రూపం వాచ్యమ్మని పీనియందు పరరూపసంధి. మనస్+ఈష-మనీష-మనీష-గలవారు-మనీషులు-సచివరాజులన్=మంత్రిశ్రేష్ఠులను-నికటతరానువర్తుల=మిగుల సమీపమందుండు వారిని.

తాత్పర్యము

మిగుల భయంకరములై యెఱ్ఱనైన యిరువది కన్నులు వెలుఁగఁగాఁ దనకు మిగుల సమీపమందుఁ గూర్చుండిన మిగుల బుద్ధిమంతులగు మంత్రిశ్రేష్ఠులతోను, కులమునందు, నాచారమందుఁ బెద్దవారితోను వీఁడెవ్వఁడో తెలిసికొనుఁడని చెప్పఁగా వారును హనుమంతునిఁ బ్రశ్నించిరి.

క. హరిలోకేశ్వరుఁ డగు నా, హరితనయుం డంప దూతనై యిచ్చటి కే
నరుదెంచితి నని వారికిఁ బరమబలోదారుఁ డొసఁగెఁ బ్రత్యుత్తరమున్. ౧౧౩౨

అర్థములు. హరి లోకేశ్వరుఁడు=వానరకోటుల ప్రభువు-హరి తనయుండు=సూర్య పుత్రుఁడగు సుగ్రీవుఁడు-పరమ బలోదారుఁడు=గొప్ప బలము గలవారిలో గొప్పవాఁడు.

తాత్పర్యము

వానర రాజగు సుగ్రీవుఁడు పంపఁగా వచ్చితి నని వారికి మహాబలుఁడగు నాంజనేయుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

ఇది వ్యాస వాక్యమునకు ముందు సంగ్రహ వాక్య మనియైన గ్రహింపవచ్చును, లేక సభ్యుల కిచ్చిన ప్రత్యుత్తరమని యైనఁ దలఁప వచ్చును.

## —♦ ౪౯-వ సర్గము. హనుమంతుఁడు రావణుని సభలోఁ జూచుట. ♦—

క. హనుమయు రావణుచర్యల,కును నబ్బురపాటు గదురఁ♦గోపారుణలో
చనుఁ డై నిర్లక్ష్యగతిం, గనుఁగొనియెం బంక్తికంఠుఁ♦గలహోత్కంఠున్.

అర్థములు. కోపారుణలోచనుఁడై=కోపముచే నెఱ్ఱనైన కన్నులు గల వాఁడై, నిర్లక్ష్య గతిన్=సరకు సేయని విధముగ, కలహోత్కంఠున్=యుద్ధమందు తహతహపాటు గలవానిని- రావణు నెట్టులైన యుద్ధమున కీడ్చి నాలుగు తన్నులు తన్నవలె నని హనుమంతుని ఆలోచన. తాను యుద్ధమునకుఁ బోకయె హనుమంతుని బట్టి తెప్పింప వలయు నని రావణు నాలోచన. వాని యాలోచనయే వాఁడు ఫలింపఁ జేసికొనియెఁ గదా యని హనుమంతుఁడు ఆశ్చర్యపడెను.

### తాత్పర్యము

రావణుఁడు చేసిన కార్యములకు హనుమంతుడు ఆశ్చర్యపడి కోపముచే నెఱ్ఱనైన కన్నులు పలవాఁడై కలహమునందు మిగులఁ గోరిక గల రావణుని సరకు సేయక చూచెను.

సీ. అతులమహార్ఘ ము♦క్తావళీవృత మయి, మెఱుఁగారు మకుటంబు♦వఱలు వాని
సంకల్పసంభూత♦జాంబూనదాభర, ణాంచిత మైన దే♦హంబువాని
క్షౌమవస్త్రిని రక్త♦చందనలిప్తుఁడై, వలపులు వెదఁగ్రమ్మ♦గాలుపువాని
దర్శనీయంబు లై ♦ తగవివృతంబు లై, దెఱపెట్టుకన్నుల♦ మెఱపువాని

తే. మెఱుఁగుఁగోఱలు వ్రేలువా♦తెఱయుఁ గలుగు
వక్త్రదశకంబుతోడ స♦వ్యాళమంద
రాద్రిశిఖరంబునకు నెన♦యైనవాని
నమరవరులకు హృచ్ఛల్య♦మైనవాని. ౧-౬

అర్థములు. అతుల=అసమానమై- మహార్ఘ=మిగుల వెలగలవైన-ముక్తావళీ= ముత్యముల వరుసలచే-వృతమయి= చుట్టఁబడినవై- మెఱుఁగారు= కాంతిచే నతిశయించు, మకుటంబు=కిరీటంబు-తలలు పది చెప్పి మకుట మొక్కటియే చెప్పుటచే నడిమి శిరస్సునకు మాత్రమే కిరీటము గలదని యేర్పడుచున్నది. సంకల్ప సంభూత= తలఁపులచేతనే కలిగిన, జాంబూనదాభరణ= బంగారు సొమ్ములచే, అంచితము= ప్రకాశించునది. మనస్సుచేఁ గల్పింపఁబడిన వనుటచే కోరిన నెల్ల లోపము లేకుండ నిర్మింపఁబడిన వని భావము. చేతితోఁ జేసిన వానియం దేదైన లోపము లుండును. క్షౌమవస్త్రినిన్=తెల్లని పట్టువస్త్రము కట్టుకొన్నవానిని, రక్తచందన లిప్తుఁడై=ఎఱ్ఱని గంధము పూసికొనిన వాఁడై, వలపులు=వాసనలు, వెదఁగ్రమ్మన్= నాలుగుప్రక్కల వ్యాపింపఁగా, దర్శనీయంబులై = చూడనందములై, వివృతంబులై=విచ్చఁబడినవై, వక్త్రదశకంబుతోడన్=పదితలలతోడ, వా+తెఱ=పెదవి,

వా + తెఱ = పెదవి, వా + తెఱపి = వా + తెరయన్నప్పుడు పండ్లకు తెరవలె నుండునది యని యర్థము. సవ్యాళ = పాములతోఁగూడిన, మందరాద్రి శిఖరమునకు = మందర పర్వతము యొక్క శిఖరమునకు, దీనివలన నడిమితల పెద్దదిగాను, దక్కినవి చిన్నవిగా నున్నవని భావము. ఎన = సమానము, హృత్ + శల్యము = గుండె గాలము.

## తాత్పర్యము

అసమానమై, గొప్పవారు ధరింపఁదగిన గొప్ప వెలగలవై ముత్యములచేఁ జుట్టబడి మెఱుఁగులు గ్రక్కుచుండు కిరీటము గలవానిని, మనస్సుచేఁ గల్పింపఁబడిన బంగారు సొమ్ములచేఁ బ్రకాశించు దేహము గలవానిని, తెల్లని పట్టువస్త్రము కట్టుకొన్నవానిని, ఎఱ్ఱని గంధము పూసికొని నలుప్రక్కల సువాసన వ్యాపింపఁ జేయువానిని, చూడఁదగినవై తెఱవబడిన భయము కలిగించు కన్నుల వానిని, మెఱయు కోఱలు, వ్రేలాడు పెదవి, పదితలలు గలిగి పాములతోడి మందర శిఖరమువలె నుండి దేవతలకు గుండెగాల మైన వానిని.

## —♦ రావణుని తలలు ♦—

వింశద్భుజం దశగ్రీవం దర్శనీయ పరిచ్ఛదమ్. అర. ౩.౨-౮
దశాస్యః కార్ముకీ బాణీ బభూవ. అరణ్యా. ౫౧-౮
స్వం రూపం కాలరూపాభం-ప్రతిపద్య స్వకం రూపమ్
క్రుద్ధస్యాగ్నినిభా స్సర్వా రేజు ర్వింశతి దృష్టయః. అరణ్య ౫౧-౧
వామబాహూ న్దశ తదా వ్యపాహర దరిందమః
సచ్ఛిన్న బాహో స్సద్యైవ బాహవ స్సహసాభవన్ అరణ్యా.౫౧-౩౯
ఏతౌ పాదౌ మయాస్నిగ్ధౌ శిరోభిః పరిపీడితౌ. అరణ్యా. ౫౫-౩౫
శిరోభి ర్దశభి ర్వీరం భ్రాజరూపం మహౌజసమ్. సుంద.౪౯-౬
బహుభి ర్బద్ధ కేయూరై శ్చందనో త్తమరూషితైః. ౪౯-౮
దశాస్యో వింశతిభుజః ప్రగృహీత శరాసనః
అదృశ్యత దశగ్రీవో మైనాక ఇవ పర్వతః. యుద్ధ. ౧౦౩-౩౪

విక్షిప్య దీర్ఘౌ నిశ్చేష్టౌ భుజావంగద భూషితౌ, అని రావణు మరణానంతరము రెండు చేతు లొక తలతోనే కానవచ్చెను. నిద్రపోవు నపుడును రెండు చేతులు ఒక తలతోనే కానవచ్చెను.

ఇట్లు రామాయణమున రెండు విధములుగఁ జెప్పి యుండుటచేతను పది తలలుండుట విపరీతము గనుకను రావణుఁ డొంటి తలవాఁడే యనియుఁ బది తలలనునవి యత్యుక్తి యని కొందఱు, బచ్చెన తల లని కొందఱు నానావిధముల వ్రాసియున్నారు.

సీతాదేవి యొద్దకు నొంటితల సన్న్యాసిగాఁ బోయి యున్నట్టుండి పదితలల వాఁ డగుటకు నీ బచ్చెన తలలును,జేతు లెందుఁ దాచి యుంచి తగిలించుకొనెనో! జటాయువు విఱుగఁదన్నినప్పు డివి యేల నేలఁబడియుండి రామలక్ష్మణులకుఁ గానరాలేదో! వానిని గూడ రావణుఁడు మూటకట్టుకొని పోయెను కాఁబోలు. ఇట్టి దురూహలకు గ్రంథమునందుఁ బ్రమాణబుద్ధి లేకుండుటయే కారణము. రావణుఁ డను పేరు రాకముందు వానిపేరేమో. నామకరణ మేమిగాఁ జేయఁబడెనో- వీ రాలోచించినవారు కారు. ఉత్తర రామాయణమున రావణుఁడు పుట్టినప్పుడే పది తలలతోఁబుట్టెనని చెప్పఁబడెను శివుఁడు రావణుఁ డను పేరు పెట్టువఱకుఁ దన పేరు దశకంఠుఁడనియే వాఁడు చెప్పుకొను చుండెను.

ఏవ ముక్తాతు సా కన్యా రామ, కాలేన కేనచిత్,
జనయామాస బీభత్సం రక్షోరూపం సుదారుణమ్।
దశగ్రీవం మహాదంష్ట్రం నీలాంజనచయోపమం
తామ్రోష్ఠం వింశతిభుజం మహాస్యం దీప్తమూర్ధజమ్॥
ఉత్తర.౯ సర్గ. ౨౮. శ్లో. ప. ౧౯౦ చూడు.

ఈ వాక్యములు రావణుఁడు పది తలలతోను, నిరువది చేతులతోను బుట్టె నని చెప్పుచున్నవి.

అథ నామాకరోత్తస్య పితామహసమః పితా
దశగ్రీవః ప్రసూతోఽయం దశగ్రీవో భవిష్యతి॥ ఉత్తర.౧౯.౩౨.ప.

దీనిచే రావణునకు దశగ్రీవుఁ డనియే నామకరణమునాఁడు దండ్రిచేఁ బేరిడఁబడెను. ఆవల దశగ్రీవుఁడు బ్రహ్మనుగూర్చి తపస్సు చేయునపుడు తొమ్మిది తలలు గోసి వేల్చినట్లు ఉత్తర రామాయణమున. ౨౦౨ వ పద్యమునఁ జెప్పఁ బడెను. ఒంటి తలవాఁడైనచో నిది యెట్లు సాధ్యము. బచ్చెనతలలు కోసి హోమము చేయఁగా దానికి బ్రహ్మ మెచ్చుకొనెను గాఁబోలు.

నీ వెవఁడవు నీ పేరేమి యని మయుఁ డడిగినప్పుడు.

అహం పౌలస్త్యతనయో దశగ్రీవశ్చ నామతః
మునే ర్విశ్రవసో యస్తు తృతీయో బ్రహ్మణోఽభవత్.
ఉత్తర. ౧౨-౧౪ పద్య. ౨౫౪:

ఇందు రావణుఁడు తనపేరు దశగ్రీవుఁ డనియె చెప్పెను. దీనివలనఁ బది తలలు సహజము లనియుఁ గృత్రిమములుగా వనియు నేర్పడెను.

పది తలల వాఁ డొంటితలవాఁడుగా నెట్లు కానవచ్చె నందు రేమో, అది బ్రహ్మవరబలముననే.

హుతాని యాని శీర్షాణి పూర్వ మగ్నౌ త్వయానఘ
పునస్తాని భవిష్యంతి తథైవ తవ రాక్షస,

ఛందత స్తవ రూపం చ మనసా యద్యదీప్సితమ్
భవిష్యంతి న సందేహో మద్వరా త్తవ రాక్షస॥ ఉత్తర ౧౦- ౨౫ప. ౨౧౭.

రావణుఁడు కోరినప్పుడు కోరినరూప మెత్తువరము బ్రహ్మయిచ్చెను గావునఁ గోరినప్పు డొంటి తలతోను, పది తలలతోను నుండఁగలఁడు.

ప్రకృతివిరుద్ధ మని ప్రకృతి రహస్య మంతయుఁ దెలిసిన సర్వజ్ఞుఁడు చెప్పఁదగినమాట. మన తెలివి లేమిచేఁ గొన్ని దినములకు ముందు ప్రకృతి విరుద్ధములని తలఁచినవి నేఁడు కన్నులారఁ జూచుచున్నాము. మూఁడుతలల వా రిరువురు, రామాయణ మందే చెప్పఁబడిరి. రెండు తలల మనుష్యుల మనము చూచి యున్నాము. ఒక తెకు నలుగురు బిడ్డలు పుట్టుట. మగవాఁ డాఁడుది యగుట, ఆఁడుది మగవాఁడగుట నేఁడు ప్రసిద్ధములైనవి. పుష్పక విమానము గుఱించియు నేఁటి పెద్దమనుష్యు లవివేకపు వ్రాఁతలు వ్రాసియున్నారు. అది యుద్ధకాండమున జర్చింపఁ బడును.

ఉ. కాటుకప్రోవుఁబోలు మెయి। గ్రాల నురంబునఁ దారహారముల్
సీటు చెలంగ నిండు నెల। నెయ్యముఁ జూపు ముఖంబుతో బలా
కాటనయుక్తవారిదము। నంగు వహించెడివానిఁ జిత్రిత
స్ఫాటిక రత్నపీఠమున। సౌరు వహించెడివాని వీరునిన్. ౧౧౩౫

అర్థములు. ప్రోవు=రాశి, బలాకాటన యుక్త వారిదము=కొంగల సంచారముతోఁగూడిన మేఘము, అంగు=అందము.

## తా త్ప ర్య ము

కాటుక కుప్పవంటి నల్లని యురంబున ముత్యాల దండలు సొగసుగాఁ గనఁబడఁ జంద్రునితో సమానమైన ముఖముతోఁ గొక్కెరలతోడి మేఘమువలె నుండు వానిని, చిత్రపుఁ బనిచేయఁబడిన స్ఫటికములు, రత్నములు చెక్కఁబడిన సింహాసనమందుఁ గూర్చుండి శోభించువానిని, వీరుని.

క. అంగద కేయూరాదిక, సంగతములు పీవరములు। చందనయుతముల్
రంగుగ నైదుశిరములభు, జంగము లనఁ దేజరిలు భు।జంబులతోడన్. ౧౧౩౬

అర్థములు. అంగదకేయూరాదికసంగతములు=రెట్టకడియములు, బాహుపురులు మొదలయిన వానితోఁ గూడినవి. పీవరములు=బలసినవి. చందనయుతముల్=గంధము పూయఁబడినవి.

## తా త్ప ర్య ము

రెట్టకడియములు, బాహుపురులు మొదలయిన వానితోఁగూడి బలసి గందపుబూఁత గలిగి యైదు తలల పామునలెఁ బ్రకాశించు భుజములతో.

సీ. కంకణఝణఝణ। తాత్కారంబు తోరంబు, గను జామరములు జ।వ్వనులు వైవ
మంత్రతత్త్వజ్ఞులో। మంత్రివరుల్ దర్థ,గుఁడు ప్రహ స్తుఁడు నికుం।భుఁడును మఱిమ

హాపార్శ్వుఁడును భువ•నాళి వార్ధిచతుష్ట,యంబు రీతిని జుట్టి•యమరు చుండ
నితరమహామాత్రు•లింద్రుని సురతతి, భంగిని భజియింపఁ•బ్రబలువాని

తే. మేరు శిఖరాగ్రగత మైన • వారి యుక్త
వారిధర మన వెలుఁగొందు • వాని రాక్ష
సేశ్వరుని రావణునిఁ జూచి•హృదయసీమఁ
బరమవిస్మయపరుఁ డయి • పవనజుండు. ౧౧౩౭

అర్థములు. తోరంబు=అధికము-స్థూలశబ్దభవము. జవ్వనులు=యౌవనవతులు; మంత్రతత్త్వజ్ఞులు=ఆలోచనల రహస్యము దెలిసినవారు; వార్ధి చతుష్టయము=నాలుగు సముద్రములు; ఇతర మహామాత్రులు=ఇతర సచివులు; మేరు శిఖరాగ్రగతము=మేరుశిఖరము కొన నుండునది, వారియుక్త=నీళ్ళతోఁ గూడిన వారిధరము=మేఘము.

తాత్పర్యము

వయస్సు పడుచులు చేతి కంకణములు ఝుణంఝుణ యని విశేషముగ మ్రోగుచుండఁ జామరములు వేయఁగా ఆలోచనములు చెప్పు మంత్రులు ప్రహస్తుఁడు, నికుంభుఁడు, దుర్ధరుఁడు, మహాపార్శ్వుఁడు ననువారు భూమిని నాలుగు సముద్రములు చుట్టుకొను నట్లు చుట్టియుండ ఇతర మంత్రులు దేవేంద్రుని దేవతల వలెఁ గొంచెము దూరమునుండి సేవింప, మేరుశిఖరము కొన నుండు నీళ్ళు గల మేఘమువలె నల్లగా నుండు వానిని, రావణుని జూచి హనుమంతుఁడు మిక్కిలి యాశ్చర్య పడెను.

శా. ఔరా రూప! మహో బలంబు! ధృతి యా•హా! తేజమా యద్దిరా!
యౌరా రాజసమస్తచిహ్నకలనం•బయ్యో యధర్మక్రియా
చారోదారుఁడు కాఁడ యేనియు బిడౌ•జస్సంయుతం బౌ మరు
ద్వారాగారము నేల లేఁడె యితఁ డు•ద్యచ్ఛక్తి సంపన్నతన్. ౧౧౩౮

అర్థములు. అధర్మక్రియాచారోదారుఁడు=అధర్మ కార్యములు చేయుట యందు గొప్పవాఁడు-బిడౌజః+సంయుతంబు=ఇంద్రునితోఁ గూడినది-మరుత్+వార+అగారము=స్వర్గము, ఉద్యత్+శక్తి+సంపన్నతన్=కలుగు చున్న శక్తి సంపత్తిచే.

తాత్పర్యము

ఏమి రూపము, ఏమి బలము, ఏమి ధైర్యము, ఏమి తేజము! ఔరా రాజుల కుండవలసిన యన్ని చిహ్నములు కలవే. ఇట్టివాఁడు ధర్మవిరుద్ధ కార్యములు చేయని వాఁడగు నేని యింద్రుని తోడి స్వర్గము నైనను దనశక్తి సంపత్తిచే బాలింప లేఁడా.

క. క్రూరుం డై భూతదయా,దూరుం డై లోక మెల్ల•దూషించు పనుల్
వారక సలుపుట గాదే, సౌ•సురసమితి లోక•చయములు వణఁకున్. ౧౧౩౯

అర్థములు. సౌర+అసుర+సమితి=దేవతల సమూహము, అసుర సమూహము.

తాత్పర్యము

కోపమనస్సుగలవాఁడై, భూతదయలేని వాఁడై, జనులందఱు దూషించు చెడుకార్యములు చేయుటఁబట్టిగదా దేవతలు దానవులుకూడ వడఁకుచున్నారు.

క. లోకంబు నెల్లఁగినుకను, నేకార్ణవముం బొనర్ప నితఁ డెంచినచో
పీకున నట్ల యొనర్పం,డే? కా దనువార లెవ్వ రీ గురుతేజున్. ౧౧౪౦

అర్థములు. ఏకార్ణవము=ఒక్కసముద్రము, పీకున=బలమున.

తాత్పర్యము

వీఁడు కోపించి, పరాక్రమించి లోకము లన్నియుఁ బ్రలయకాలమందు వలె నొక్కసముద్రముగాఁ జేయఁబూనెనేని యీ గొప్ప తేజస్సు గలవానిని నడ్డగించు వారు గలరా?

—: ౫౦ వ సర్గము. రావణుఁడు హనుమంతునిఁ జూచి యోజించుట :—

మ. అను నాలోచన నుండ రావణుఁడు పింగాక్షుం బురోదేశవ
ర్తిని గీశేశుని నట్టె చూచి మది సందేహించెఁ గైలాసమున్
ఘనశక్తిం బెకలింప శాప మిడు సాక్షాన్నందియా యేమి వ
చ్చెను నీ లంకకుఁ? గాక బాణుఁ డొకో వచ్చెం గ్రోఁతిరూపంబునన్.

అర్థములు. పింగాక్షున్=పచ్చనికన్నులు గలవానిని, పురోదేశవర్తిని= తనకు ముందు ప్రదేశమందుండు వానిని, కీశేశుని=వానరశ్రేష్ఠుని, బాణుఁడొకో= ఈ బాణుఁడు కృష్ణునినాఁటి బాణుఁడుకాఁడు. వానిపేరుగల మఱియొకఁడు. బాణుఁడు శత్రుపక్షమువాఁడుఁగాఁ జెప్పఁబడుటచే వాఁడుకూడ రావణునిశపించె నని తోఁచుచున్నది.

తాత్పర్యము

ఈ ప్రకార మాంజనేయుఁ డాలోచించుచుండఁగా గోరోచనవన్నెగల కనులు గలవానిని, దనయెదుట నున్న వానిని, వానరుని నెగాదిగ చూచి వీఁడు నేను కైలాసమును పెల్లగించినపుడు నన్ను శపించిన యా నందియే యీ రూపముతో వచ్చెనో, లేక బాణుఁడే క్రోఁతి రూపము ధరించి వచ్చెనాయని సందేహించెను.

మ. అని శంకించి సరోషతామ్రనయనుండై మంత్రివర్యుం బ్రహ
స్తుని వీక్షించి ప్రహస్త! నీ వడుగు మీ మర్కటాత్మకుం డెవ్వఁ? డే
పనికై వచ్చెనో మత్పురంబునకు? నెవ్వం డంపె? నుద్యానభం
జన మేలా యొనరించె? నేఁటికి రక్షస్స్త్రీసమాలిఁ దర్జించుటల్? ౧౧౪౧

అర్థములు. సరోషతామ్రనయనుండై=కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై, తర్జించుటల్=భయపెట్టుటలు.

### తాత్పర్యము

అని సందేహించి కోపముచేఁ గన్నుఁ లెఱ్ఱనకాఁగా ముఖ్యమంత్రి యగు ప్రహస్తుని జూచి ప్రహస్తా! యీ దుష్టాత్మకుఁ డెవ్వఁడు? మా పట్టనమున కేమి పనికై వచ్చెను? వీనినిఁ బంపినవాఁ డెవ్వఁడు? ఉద్యానవన మేల చెఱిచెను? ఏల రాక్షసస్త్రీల బెదరించెను?

ఆ. ఈ దురాత్ము వడుగు•యేటికి యుద్ధంబు, సలిపెఁ? ననఁగ నతఁడు•పలికె నిట్టు
లోరి క్రోఁతివాఁడ!•యిూఅడిల్లుము భయ,పడఁగ వలదు నీకు•భద్ర మగును.

### తాత్పర్యము

ఏల యుద్ధము చేసెను? నీ వడుగుము అనిన నతఁడు హనుమంతునిఁ జూచి యిట్టు లనెను. ఓరి క్రోఁతిజాతివాఁడా! యూరడిల్లుము. భయపడవలదు. నీకు మేలగును.

• ప్రహస్తుఁడు హనుమంతునిఁ బ్రశ్నించుట •--

చ. అకలకు నీదుచందము య•థార్థము చెప్పుము, నిక్క మాడఁ బో
విడుతుము, గాక దబ్బఱలు•ప్రేలితి వేనియు నిన్ను మేనితో
విడువము. వాసవుం డనుసు•వీటికిఁ బంపెనె నిన్నుఁ? గానిచో
విడిముడి తేని దూతవా? ర•వి ప్రభవాప్పతు లంప వచ్చితో? ౧౧౪

అర్థములు. విడిముడి తేని=కుబేరుని, విడిముడి=ధనము, రవిప్రభవ+అప్పతులు=యముఁడు, వరుణుఁడు. అప్+పతి=జలాధి దేవత-"ప్రచేతా వరుణః పాశీ యాదసాంపతి రప్పతిః' అమరము.

### తాత్పర్యము

భయపడవలదు. నిజము చెప్పితివా నిన్ను వదలిపెట్టుదుము. అసత్య మాడితివా నిన్ను దేహముతో వదలము. చెప్పుము. నిన్ను నీ రాక్షస నగరమునకు నింద్రుఁడంపెనా? కుబేరుఁడు పంపెనా! యముఁడు పంపెనా? వరుణుఁడు పంపెనా?

చ. అసురుల గెల్వఁ గోరు హరి • యంపఁగ వచ్చినదూత వేమొ, యీ
లసదసమాన తేజము బ•లంబును వానరమాత్రునందు నీ
రస నెట నేనియుం గనఁగ•రాదు, స్వరూపముచేత మాత్రమే
యెసఁగెదు వానరుండ వయి•యేటికి వచ్చితి? విన్నవింపరా. ౧౧౫

అర్థములు. లసత్+అసమాన+తేజము=ప్రకాశించు సమానములేని పరాక్రమము, రసన్=భూమియందు. "భూ-ర్భూమి రచలానంతా రసా విశ్వంభరా స్థిరా' అమర. విన్నవింపరా. గీ॥ కవులు పొగడువేళఁ గాంతలు రతివేళ సుతులు ముద్దువేళ శూరవరులు రణము సేయువేళ రాకొట్టి పిలుచుట పాడి యిదియ మిగుల భజన కెక్కు.

## తాత్పర్యము

రాక్షసుల గెల్వఁ గోరిక గల విష్ణువు పంపఁగా వచ్చిన దూతవా యేమి? ఈ యసమాన పరాక్రమము సామాన్యమగు క్రోఁతియందు నీ భూమండలమునఁ గానరాదు. నీ వాకారముచేత వానరుఁడవే కాని, వాస్తవమునఁ గావు. ఇచ్చటికి నేల మాఱువేషముతో వచ్చితివి. విన్నవింపుము.

క. విడుతుము నిను నిజ మాడిన, మెడపైఁ దల నిల్వఁబోదు♦మిథ్యలు వలుకన్
నొడువుము సర్వము సోఁకుల, కొడయనిపురి నీవు చొచ్చు♦నుద్దేశంబున్.

## తాత్పర్యము

నీవు నిజము చెప్పితివా వదలి పెట్టుదుము. అసత్యము చెప్పితివా నీ మెడ మీఁద తలనిలువదు. చచ్చుట నిజము. ఈ రాక్షస రాజు నగరము నీవు ప్రవేశించిన కారణము సర్వము చెప్పుము.

—♦ హనుమంతుఁడు రావణునకుఁ దనవృత్తాంతముఁ జెప్పుట ♦—

క. అన విని హనుమంతుఁడు త, ద్దనుజగణేశ్వరునిఁ జూచి♦తడఁబడక యనెన్
వినుమీ నా వృత్తాంతము దనుజేశ్వర! పలుకువాఁడఁ♦దథ్యము గాఁగన్.

## తాత్పర్యము

ప్రహస్తుని మాటలు విని హనుమంతుఁడు వానిని లక్ష్యము సేయక రావణుఁ జూచి జంకులేక మాట తడఁబడక యిట్లు చెప్పెను. రాక్షసేశ్వరా! నా వృత్తాంతము సత్యముగఁ జెప్పెద వినుము.

సీ. వజ్రపాణియు యమ♦వరుణులు పంపఁగా, నేను వచ్చినవాఁడఁ♦గాను జుమ్ము
శ్రీమనదున్ నాకుఁ♦జెలిమి యెప్పుడు లేదు, నను విష్ణు విలకుఁ మె♦మ్మనఁగ రాను
జాతి యిద్యదియ య♦చ్చపు వానరుండను, రాక్షసరాజద♦ర్శనము సేఁత
దుర్లభం బది నాకు♦దొరకునిమిత్తమై, ప్రమదావనం బటు♦పాడు చేసి

ఆ. నాఁడ యుద్ధకాంక్ష♦నానాసురారులు, రా మదీయ దేహ♦రక్షణార్థ
మేను బోరినాఁడ♦నింద్రాదులును నస్త్ర, పాశములను నన్నుఁ బట్టలేరు. ౧౧౪౪

## తాత్పర్యము

ఇంద్ర యమ వరుణులు పంపఁగా నేను రాలేదు. కుబేరునకు నాకు స్నేహమే నాఁడును లేదు. నన్ను విష్ణు విచ్చటికిఁ బొమ్మనుటచే రాలేదు. నేనే యాకారమునఁ గానవచ్చుచున్నానో యా జాతికిఁ జేరిన వాఁడనే. స్వచ్ఛముగ వానరుఁడను. రాక్షసరాజ దర్శనము నాకు దుర్లభము. అది దొరకు నిమిత్తమై ప్రమదావనము పాడు చేసితిని. యుద్ధముచేయు నిమిత్తమై రాక్షసులు రాఁగా నా దేహమును గాపాడుకొను నిమిత్తము యుద్ధము చేసితిని. ఇంద్రాది దిక్పాలురు కూడ నన్నస్త్రములచేఁ గట్టలేరు. నేనే కావలయునని చిక్కుపడితిని.

ఆ. బ్రహ్మవలన నిట్లు•వర మేనునుం గంటి, రాజు గనఁగ నస్త్ర•రాజమునకు
బట్టువడితిఁ ద్రాళ్ళఁ•గట్టుట రాక్షసుల్ పాసె నెల్లయస్త్ర•బంధనములు.

తా త్ప ర్య ము

బ్రహ్మచేత వరములు పొందిన వాఁడవు నీవు మాత్రమె కాదు. నేనుగూడ నిట్టి వరములు పొందిన వాఁడనే, రాజును జూడఁగోరి బ్రహ్మాస్త్రమునకుఁ బట్టి పడితిని. రాక్షసులు నన్నుఁద్రాళ్ళచేఁ గట్టుటచే నస్త్రబంధము లూడిపోయెను.

ఆ. రాక్షసేంద్ర! యొండు•రాజకార్యముకల్మి, నేను వచ్చినాఁడ•నిన్నుఁ జూడ
భూరితేజుఁ డైన•శ్రీరామచంద్రుని,బంట నాదుమేలు•పలుకు వినుము. ౧౧౫౦

తా త్ప ర్య ము

ఆయనను నిన్నుఁ జూడవలయు నని కోరి పట్టువడి వచ్చితిని. నే నొక రాజ కార్యము గలిగి నిన్నుఁజూడ వచ్చినాఁడను. గొప్ప పరాక్రమము గల శ్రీరామ చంద్రమూర్తి బంటను. నీకు క్షేమ కరమైన మాట చెప్పెద వినుము.

—• ౫౧-వ సర్గము. హనుమంతుఁడు రావణునకుఁ దాను లంకకు
వచ్చిన కారణముఁ దెల్పుట •—

సీ. సుగ్రీవునాజ్ఞ ద•శగ్రీవ! వచ్చితి, నీ పట్టనమునకు • నిన్నుఁ జూడ
నీ సోదరుండు వ•నేచరనాథుండు, నీ కుశలంబును•నెమ్మి నడిగెఁ
దమ్ముండు చెప్పిన•ధర్మోక్తి యిహపర,సౌఖ్యనిదానంబుఁ•జక్క వినుము
దశరథుం డనిగొడి•ధరణీశ్వరుఁడు చతు,రంగ బలబులుం•నమరువాఁడు

ఆ. ధరణీజనములకును•దండ్రికి మాఱట, తేజమున సురేంద్రు•దీటువాఁడు
అతని పెద్దకొడుకు • క్షితితిలరంజన, శాలి విభుఁడు రామ•చంద్రుఁ డతఁడు.

అర్థములు. నీ సోదరుండు=రావణుఁడు వాలి భ్రాతృ భావము గలవారమై యుండ మని సంధి చేసికొనినవారు. కావున వాలిసోదరుఁడు రావణ సోదరుఁడే- సౌఖ్యనిదానంబు=సౌఖ్యకారణము-క్షితితలరంజన శాలి=భూమండలమును సంతోషింపఁ జేయువాఁడు. ఆయనపేరు రామచంద్రుఁడు.

తా త్ప ర్య ము

సుగ్రీవుఁ డాజ్ఞాపింపఁగా నిన్నుఁజూచుటకై నీ పట్టనమునకు వచ్చితిని. నీ తమ్ముఁడు వానరరాజు సుగ్రీవుఁడు నీ కుశలము సంతోషముతో నడిగెను. ఆయన నీకు నిహమందు బరమందు సౌఖ్యము గలిగించు ధర్మవాక్యము చెప్పి పంపెను. దానిని వినుము. చతురంగ బలంబులుగల దశరథుఁ డను రాజు గలఁడు. ఆయన ప్రజలకుఁదండ్రివంటివాఁడు. తేజమున నింద్రుని సాటివాఁడు. అతని పెద్దకొడుకు (నీవలె భూమిజనులఁ బీడించువాఁడు కాఁడు)భూజనులను సంతోష పెట్టువాఁడు.

కీర్తిచే సర్వత్ర వ్యాపించినవాఁడు. (నీవలె నపకీర్తిచేఁ గాదు) ఆయన పేరు రామచంద్రుడు. (ప్రజల సంతోష పెట్టువాఁడు) ఏడిపించువాఁడు కాఁడు.

ఈ మాటలు నీకుఁ జెప్పఁబోవునవి సుగ్రీవుఁడు చెప్పలేదు. అయినను నుత్తమ దూత తనప్రభువు నభిప్రాయము ననుసరించి దానికి విరోధము గాకుండు నట్లు ఏమాట లైనఁ జెప్పవచ్చును. ఏకార్యమైనఁ జేయవచ్చును. అచ్చటచ్చట నేను అని చెప్పక సుగ్రీవుఁడు చెప్పె ననుటకుఁ గారణము. (౧) పేరునకుఁ గల ప్రతిష్ఠాతిశయము దెలుపుట. (౨) గర్వాతిశయముచే రాజులు తమ్ము గురించి చెప్పునపుడు అస్మదర్థకముతోఁ జెప్పక యన్యుఁడుగాఁ జెప్పిన మర్యాద కలదు. ఆ ఛాయ ననుసరించి సుగ్రీవుఁడని చెప్పఁబడెను. దశరథుం డను పదము మొదలు 'సత్యము! రాక్షసేశ్వరా'! యను పదము వఱకు రామకార్యానుకూలమగు విష యము హనుమంతుఁడు స్వయముగాఁ జెప్పిన మాటలు.

చ. జనకునియాజ్ఞఁజేసి సతి॰ జానకి తమ్ముఁడు లక్ష్మణుండునున్
దనబడి నేగుదేరఁ జని ॰ దండకఁ జొచ్చెను ధర్మశీలి, యా
తనిసతి నష్ట యయ్యె వన॰ధారిణి ధారిణికన్య, దత్సతిన్
బనిగొని రోయుచుం దనకు॰బాసటగాఁ జనుదేరఁ దమ్ముఁడున్. ౧౧౫౨

అర్థములు. తనబడి=తన వెంబడి, ధర్మశీలి=ధర్మస్వభావుఁడు, నష్టయయ్యెన్= కానరాకపోయెను, బాసటగాన్=సహాయుఁడుగా.

తాత్పర్యము

ఆ రామచంద్రమూర్తి తండ్రి యాజ్ఞప్రకారము భార్యయగు సీతయు తమ్ముఁడు లక్ష్మణుఁడు తోడరాఁగా ధర్మస్వభావుఁడుగాన దండక ప్రవేశించెను. (రాజ్యకాంక్షచేఁ దండ్రియాజ్ఞ మీఱి నీ వలె నన్నను గొట్టినవాఁడు కాఁడు.) ఆయన భార్య యీ యడవిలోఁ గానరాకపోయెను. ఆమెను వెదకుచుఁ దమ్ముఁడు తోడు రాఁగా.

ఉ. రాముఁడు ఋశ్యమూకకుధ॰రంబున సూర్యజుఁ జూడ నాతఁడున్
భూమిజ రోయఁగాఁ బ్రతిన॰పూనఁగ భానుకులుండు నల్లె శా
ఖామృగరాజ్య మిత్తు నని॰ క్రచ్చఱ వాలి వధించి యాజిలోఁ
బ్రేమను గట్టెఁబట్టము హ॰రిప్రవరుండుగ సూర్యనందనున్. ౧౧౫౩

అర్థములు. కుధరంబునన్=కొండయందు, ప్రతిన=ప్రతిజ్ఞ, శాఖామృగ రాజ్యము=వానర రాజ్యము, క్రచ్చఱన్=శీఘ్రముగా, ఆజిలోన్=యుద్ధమందు, హరిప్రవరుండుగన్=వానర రాజుగ. తాత్పర్యము

రామచంద్రమూర్తి ఋశ్యమూక పర్వతంబున సుగ్రీవునిఁ జూడరాఁగా నతఁడు సీతను వెదకింపఁ బ్రతిజ్ఞ చేసెను. రామచంద్రుడు సుగ్రీవునికి వాలిని జంపి వానర రాజ్యమిచ్చెదనని చెప్పి యుద్ధమునందు వాలిని జంపి సుగ్రీవుని వానరరాజుగఁ బట్టము కట్టెను.

ఉ. వాలిని మున్ను నీ వెఱుఁగ•వా? యతఁ డొక్కశరంబు చేతనే
కూలెను రాముచేఁ, బిదపఁ•గోమలి రోయఁగఁ గీశనాథులన్
బోలఁగ దిక్కుదిక్కులకు•బుచ్చె దివాకరసూతి నూఱులున్
వేలును వేనవేలుగను•నింగియు నేలయుఁ జూచి క్రమ్మఱన్. ౧౧౪

తా త్ప ర్య ము

వాలి యెవఁడో యెట్టివాఁడో నీవు ముందే యెఱుంగుదువు కదా. అట్టివాఁడు రాముని యొక్క బాణముచేతనే చచ్చెను. ఆ పిమ్మట సీతను వెదకి వచ్చుటకు వానరేంద్రులను నూర్లువేలు వేనవేలుగ నన్నిదిక్కులకు సుగ్రీవుఁడుపంపెను.

ఈ వృత్తాంతముఁ జెప్పుట రామచంద్రమూర్తి యసహాయుఁడు ఒంటరిగాఁడని నీవు తలఁచితివి; అది సరిగాదని తెలుపుటకై. వాలిని జంపిన వృత్తాంతముఁ జెప్పుట, నిన్ను జయించిన వాలిని నొక బాణముతోఁ జంపిన నిన్నుఁ జంపుట కదియు పనిలేదనియు రామునికి నిన్నుఁ జంపుట సులభకార్య మనియుఁ దోఁపఁజేయుటకే.

క. గరుడానిలసమ వేగులు, హరివీరులు భూరివిక్ర•మాఢ్యులు సీతా
హరిణాక్షీమణి నెల్లెడ, నరయుచు నున్నారు వారి•యందే నొకఁడన్. ౧౧౫

అర్థములు. గరుడానిల సమవేగులు=గరుత్మంతునితోను వాయువుతోను సమానమైన వేగముగలవారు, హరివీరులు=శూరులగు వానరులు.

తా త్ప ర్య ము

గరుత్మంతునితో వాయువుతో సమానముగఁ బోఁగల వేగముగలవారు, వానరవీరులు భుజబల సంపత్తిగలవారు సీతాదేవిని నన్ని ప్రదేశములందును వెదకుచు నున్నారు. వారిలో నేనొకఁడను.

సుగ్రీవు నొద్ద నా యట్టివాఁడు నే నొకఁడనే కాదు. అనేకులు గలరు. నన్నొకని జయించులే నీకు దుష్కరమైనపుడంద ఱొక్క సారిగ నిచ్చటికి వచ్చిన నీ వేమి చేయఁ గలవో యాలోచింపు మనుట.

ఉ. మారుతు నౌరసుండ, హను•మంతుఁడఁ బేరను, రాముదేవికై
యారయ నూఱుయోజనము • లాయతమౌ లవణాబ్ధి దాఁటి నేఁ
జేరితి నీ పురంబు, నిట•సీతను రోయఁగ నీ గృహంబునం
దే రమణీమణిం గనితి•నింతయు సత్యము రాక్షసేశ్వరా ౧౧౬

అర్థములు. ఔరసుండన్=కొడుకను.

తా త్ప ర్య ము

నేను వాయుపుత్రుఁడను, నా పేరు హనుమంతుఁడు. సీతాదేవి నిమిత్తమై నూఱామడ గల లవణ సముద్రమును దాఁటి నీ పురమునకు వచ్చితిని. ఇచ్చట సీతను వెదకఁగా నామెను నీ యింటనే చూచితిని, రావణా! యిది యంతయు సత్యము.

అన్ని ప్రదేశములందు వెదకి నన్లే యిచట వెదక వచ్చితిని. నీవు లంకకుఁ

బోయినపుడు మా యన్న రావణు నడుగుము. ఆయన యన్ని లోకముల వృత్తాంతము తెలిసినవాఁడు. సీత వృత్తాంతము దెలుపు నని సుగ్రీవుఁడు చెప్పియుండెను. ఆ మాట ప్రకారము నీకై వెదకు చుండఁగా సీతతో మాట్లాడుటకు ముందు సీతయే కానవచ్చెను అని భావము. నీ దర్శనము నాకు దుర్లభమని తక్కిన కార్యము చేసితిని.

హనుమంతుఁడు దూత ధర్మము ననుసరించి రాక్షసరాజా యని సగౌరవముగ సంబోధించి సామోపాయమున యత్నించువాఁడు కావున సీతను రావణుఁడు తెచ్చుట తాను జూచి యుండియు నీవు సీతను దొంగిలించితి వని చెప్పలేదు. అది పరుషము కావున సామమార్గానుసారి కాదు. దొంగసొత్తు ఎవరి యింటనున్నదో వాఁడు దొంగయని కాని దొంగకు సహాయుఁడని కాని కదా యెంచవలయును. కావున నీ రెంటిలో నేదైనను నీకుఁ దగినకార్యము కాదనివాని యోగ్యతను బొగడు చున్నాఁడు.

—♦ హనుమంతుఁడు రావణునకు బుద్ధి చెప్పుట ♦—

చ. చదివితి వెల్లధర్మములు♦శాస్త్రవిధానము చొప్పునన్, జగ
ద్విదితముగాఁ దపోధికతఁ♦దీరితి, వట్టిఁడ వయ్యు నన్యలా
ముదితల నేఁప న్యాయమె? స♦మూలవినాశనహేతు వాపదా
స్పద మగు ధర్మహీనకృతిఁ♦జల్పునొకో నినువంటి ప్రాజ్ఞుఁడున్. ౧౧౫౭

అర్థములు, ధర్మశాస్త్రములు–శాస్త్రవిధానము చొప్పునన్=శాస్త్రము లెట్లు చదువ వలయునని శాస్త్రములందుఁ జెప్పఁబడినదో యట్టుల, అనఁగా గురుల యొద్ద ‘తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా’ యన్నట్లు–అధ్యయనము–బోధము–ఆచరణము–ప్రచారణము–అను నాలుగు రీతులుగా–జగత్+విదితముగా=జగత్ప్రసిద్ధముగా, తపోధికతన్=గొప్ప తపస్సుచే. అట్టిఁడవు=అట్టివాఁడవు అన్యలు=ఇతరులను బెండ్లాడినవారు–ముదితలన్=స్త్రీలను; ఏఁపన్=బాధించుట–సమూల వినాశన హేతువు=మూల ముట్టుగ నాశము చేయునది. వంశ నాశము చేయునది–ఆపదాస్పద=విపత్తునకు నాధారము–ధర్మహీనకృతి=ధర్మము తప్పిన కార్యము–ప్రాజ్ఞుఁడున్=బుద్ధిమంతుఁడు కూడ.

తా త్ప ర్య ము

గురుసేవ చేసి యెట్లు చదువ వలయునో యట్లు ధర్మశాస్త్రములనధ్యయనము చేసితివి. ప్రపంచము పొగడునట్టి తపస్సు చేసితివి. ఇంతటి గొప్పవాఁడవయ్యు నితర పురుషుల స్త్రీలను బాధపెట్టుట ధర్మమా? అది వంశమును గూఁకటి వ్రేళ్ళతో నాశము చేయునంతటి విపత్తునకుఁ గారణము కదా. నీవంటి బుద్ధిమంతుఁ డిట్టి విపత్తు తెచ్చు కార్యము చేయవచ్చునా?

ఓయి, రాజులు పరులను బాధింపరా దంటివి. అటయిన రాజులకు సుఖ భోగము లబ్బునా! రైతులు పన్నులైన నిత్తురా? ఆహారము గొనుటకూడ నితర భూములకు బాధాకరము గాదా! యదు వేమో దానివలనఁ దనకు నెక్కువసుఖము తక్కువ కీడైనచో సహింపవచ్చునేమో కాని యెక్కువకీడు, అల్పసుఖము, గల దానిని జేయవచ్చునా? అందు నీవలె సుఖమే లేక కీడే విశేషించినపుడు దానిని బొత్తిగఁ జేయరాదు కదా. సీతాహరణమువలన నీకు సుఖలేశము లేదు. కీడు విస్తరించి నిన్ను సమూలము నాశముచేయునది యై యున్నది. కావునఁ జేయఁ దగినది కాదు. నా కెవ్వఁడు కీడు గలిగించువాఁ డందు వేమో.

క. రామాగ్రహానువర్తులు, సౌమిత్రికరోజ్ఝితములుః శరముల కెదుటన్
నేమముగ నిలుతురే నా,నామరరాక్షసులునైనఁ దనసురప్రవరా! ౧౧౫౮

అర్థములు. రామ+ఆగ్రహ+అనువర్తులు=రామచంద్రమూర్తి కోపము ననుసరించి వెడలునవి, రామునకుఁ గోప మెంత యెక్కువో బాణవేగ మంత యెక్కువగునని భావము. కోపములేక వేసిన యొకబాణమే వాలి నంతటివానిని జంపినపుడు కోపముతో వైచిన బాణముల నెవ్వరు సహింపఁగలరు? అట్లు వెలువడినవి రామచంద్రమూర్తి బాణములు మాత్రమే కావు. సౌమిత్రి కరోజ్ఝితములు=లక్ష్మణునిచే విడువఁబడినవి.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి కోపమున కనురూపముగ వెలువడు బాణములకు లక్ష్మణుని బాణములకు నెదుట నీ వొక్కఁడవు, లోకముల నుండు దేవతలు రాక్షసులు నందఱు నేకమై వచ్చినను నెదిరించి నిలువఁగలరా?

క. రామునకు గీడు చేసియు, నీ మూఁడు జగంబులందుః నెలమి సుఖింపం
గా మన నేనియు నెవనికి, సామర్థ్యము గలదొకోః విచారింపు మెదన్. ౧౧౫౯

అర్థములు. మన నేనియున్ = జీవించుటకైనను.

## తాత్పర్యము

రామచంద్రమూర్తికిఁ గీడు చేసికూడ నీ మూఁడు లోకములందు నెవ్వఁడైనఁ నెందైనఁ బ్రాణముతో నుండుటకు నైన సాధ్య మగునేమో నీవే యాలోచింపుము. యుద్ధమునందు నిన్ను నీ సేనలతోడ జయించి నిన్నుఁ గారాగృహమందుంచినవాఁడు కార్తవీర్యార్జునుఁడు. వాఁడు చక్రవర్తియై భూమండలమందలి యందఱను జయించెను, అట్టివానిని సమస్తరాజులను నిరువదియొక్కమాఱు చంపినవాఁడు పరశురాముఁడు. ఈయన యీలోకరాజులనేగాక దేవతల సేనలకు నాయకుఁడై రాక్షసుల జయించిన కుమారస్వామిని జయించినవాఁడు, అట్టిపరశురాముని నరగడియలో బాణప్రయోగము లేకయే యోడించెను. ఇఁక నెవరు రామచంద్రమూర్తి యెదుట నిలువఁగలరు. దీనిని నీవు చక్కఁగా నాలోచింపుము

ఉ. కావున ధర్మ యుక్తము త్రి॥కాలహితంబును సార్థమైన సు
గ్రీవుని వాక్యమున్ వినుము॥శ్రీనరదేవున కిమ్ము జానకిన్
మా విభుదేవి నిందుఁ గని॥నాఁడ, నదే గడు, సింక నో దశ
గ్రీవ! రఘూద్వహుండె పయి॥కృత్యము లన్నిటిఁ దీర్పఁజాలెడిన్. ౧౧౬౦

అర్థములు. త్రికాలహితము = భూతభవిష్యద్వర్తమాన కాలములందు మేలైనది. ఒకఁడు ధర్మాత్ముఁ డయ్యెనేని వానిమూలమున వాని పితరులు సుఖింతురు. వాని కిహపరముల సుఖము గలదు. వాని వంశమునఁ బుట్టబోవువారును మేలు కీర్తిగాంతురు. చచ్చినవారికిఁ బుట్టియుండు వారికిఁ బుట్టబోవువారికి మేలైనది. సార్థము=సౌఖ్యప్రయోజనములతోఁ గూడినది. ఇప్పుడు నీవు రాముఁడువచ్చునేమో యని దిగులు కూడు తినుచున్నావు. అది తొలఁగును. శ్రీ నరదేవునకు= సంపత్కరుఁడైన రాజునకు, (౨) శ్రీదేవుఁడు+నరదేవుఁడు=శ్రీ నరదేవుఁడు= లక్ష్మీదేవికిని; జీవకోటికిని దేవుఁడు, మా విభుదేవిన్=మాకు ప్రభువైన రామచంద్రమూర్తి భార్యను-(౨) మా=లక్ష్మీదేవి- విభు=నాథుఁడైన వాని-దేవిన్= భార్యను-లక్ష్మిని లక్ష్మీపతి కిచ్చుటకార్యమే కదా. రామునకు-శ్రీ నరదేవునకు- మావిభు దేవి యను పదములు భావగర్భితములు. పరత్వద్యోతకములు. గడుసు= కష్టకార్యము, రఘూద్వహుండు=రామచంద్రమూర్తి, దశగ్రీవ=రామున కొక తలయైన నాకుఁ బది తల లున్నవందు వేమో. తలల లెక్క వచ్చెనేని శ్రీ నరదేవుఁడు మావిభుఁడు రాముఁడు. 'సహస్రశీర్షా' యన్నట్లు ఆయన వెయ్యి తలలవాఁడని భావింపుము అని భావము. లేక అందఱకు నొక్క తలయుండిన నీకుఁ బదితల లున్నవే. అందఱికంటెఁ బదంతలు ఎక్కువగా నాలోచింపవలసినవాఁడవై యుండియు నొంటితలవారి కుండు నాలోచనకూడ నీకు లేదాయెఁగదా యని సూచన.

## తాత్పర్యము

ఈ కారణముచే ధర్మముతోఁగూడినది కావుననే త్రికాలములవారికి మేలు చేయునది, సుఖలాభముతోఁ గూడినది యగు సుగ్రీవునివాక్యము వినుము. అది యేదంటివా? జానకీదేవిని రామచంద్రమూర్తి కిమ్ము, ఆమె యెం దుండునది తెలిసి కొనుట కష్టమైనది. అది తెలిసినది. నేను జూచితిని. తక్కిన కార్యములు రామచంద్రమూర్తియే చక్కఁగాఁ జేయఁగలఁడు. సీతను జూచినవాఁడవు తీసికొనిపోరాదా యందువేమో తీసికొని పోఁగలను గాని, రామచంద్రమూర్తి చూచి రమ్మని చెప్పెనే కాని తీసికొని రమ్మని చెప్పలేదు. కావునఁ జూచితిని, వెళ్ళిపోవుచున్నాను. ఆవల నాయన యిష్టము వచ్చినట్లు చేసికొననీ. ఆవిచారము నాదికాదు.

ఉ. కంటిని రావణా! జనక॥కన్యక నిచ్చట, నామె నీవు వా
ల్గంటిను గాఁ గలంచితివి॥గాని యెఱుంగుము కాంచన [illegible]

కంటు వహించి యున్న పెను • గాలభుజంగిగ, దుర్విషాన్నముం
గొంట సతిన్ గ్రహించు టను • కొమ్మ్మ సురాసురకోటి కేనియున్. ౧౧౬-౧

అర్థములు, వాల్గంటియకాన్=కేవల స్త్రీ యనియే-పంచవ క్త్రియై=విశాల మైన పడగ గలదై. కంటు=పగ, కాలభుజంగిగన్=నల్లయాఁడుత్రాఁచుపామని, దుర్విషాన్నమున్=చెడ్డవిషముతోఁ గూడిన యన్నము, తీవ్రమైన విషము దినిన వాఁ డెట్లు చచ్చునో యిట్లు చచ్చునని భావము. 'తీవ్రకోపా భుజంగమా' యన్నట్లు పామునకుఁ గోపము మెండు. తన్ను బాధించినవానిఁ బగపట్టి యెన్నాళ్ళ కైనఁ గఱచి చంపక వదలదు. అట్లు సీతాదేవి నిన్నుఁ జంపక వదలదని భావము.

## తాత్పర్యము

రావణా! సీతాదేవి నిచ్చటఁ జూచితిని. ఆమెను నీవు స్త్రీ యని చూచు చున్నావు. కాని నిన్నుఁ జంపుటకై పగపట్టి వచ్చియుండు ఆఁడు త్రాఁచుపామని యెఱుఁగుము. ఆమెను సమీపించితివా నిన్నుఁ జంపును. నిన్నుఁ జంపుటకు రామ చంద్రమూర్తి రావలసిన పని లేదు. ఆమెయే చాలును. దేవదానవుల కైనను తీవ్ర విషముతోఁ గలసినయన్నము దినుట యెట్టిదో యీమెను గ్రహించుట యట్టిదను కొమ్ము. కడుపులోఁ జేరిన విష మెట్టిదో నీ యింటిలోఁ జేరిన సీత యట్టిది. నిన్నుఁ జంపక వదలదు. కావున వదలి పెట్టుము.

చ. అలఘుతపశ్శ్రమార్జితము • నాయువుఁ దేజముఁ బెంచు ధర్మస
త్ఫల మిటు పాడుచేసికొన • భావ్య మొకో? సురరాక్షసాళి నన్
గలన జయింప లే దనెడు • గర్వము మాను, మవధ్యతావరం
బులు నినుఁ గావ విప్పు, చెడి • పోదువు చ మ్మది యెట్టు లంటివేన్. ౧౧౬-౨

అర్థములు. అలఘు=గొప్పదగు, తపశ్శ్రమ=తపస్సనెడి కష్టము చేసి, ఆర్జి తము=సంపాదించినది, ధర్మ సత్ఫలము=ధర్మముయొక్క మంచిఫలము. కలనన్= యుద్ధమందు-అవధ్యతావరంబులు=చంపఁ బడకుండునట్టి వరములు.

## తాత్పర్యము

రావణా! నీకుఁ బది తల లున్నవని లెక్కయేకాని మంచి చెడ్డ యాలో చించు తలయొక్కటియు లేదు. ఎంతగొప్ప తపస్సు కష్టపడి చేసితివో, యది మఱ చితివా. ఆ ధర్మమువలనఁ గలుగు సత్ఫలములు ఆయుస్సువృద్ధి, తేజోవృద్ధిగదా ఆ రెంటిని నాశముచేయు కార్యములు నీవుచేసిన, తపస్సు వ్యర్థమె కదా. తపస్సు ఫలము దేవతలు రాక్షసులు నన్నుఁజంపకుండుటయను వరము పొందితిని, నాకేమి భయ మని గర్వింపకుము. ఆ వరములు నిన్నిపుడు రక్షింపఁ జాలవు. కావునఁ జెడిపోదువు. అదెట్టు లందువా వినుము.

క. కాఁ డసురుఁడు కాఁ డమరుఁడు, కాఁడు దనుప్రోద్భవుండు • గంధర్వుండున్
గాఁ డహి సుగ్రీవుఁడు కపి, తాఁ డెట్టులు బ్రదుకు దీ తఱిన్ రాజేంద్రా!

### తాత్పర్యము

నీవు దేవతలచేత రాక్షసులచేత దానవులచేత గంధర్వులచేత నాగులచేతఁ జావకుండఁగదా వరము పొందితివి. సుగ్రీవుఁడు అమరుడుగాఁడు - అసురుఁడు గాఁడు-గంధర్వుఁడు కాఁడు-దానవుఁడు కాఁడు-నాగులలోఁ జేరినవాఁడు కాఁడు. రాజేంద్రా! యిపుడు నీ వరములు నిన్నెట్లు రక్షింపఁగలవు? ఆ వరముల బలమున నీ వెట్లు బ్రతుకఁ గలవు. కావునఁ దపోబలము గల దను గర్వము వదలుము.

శ్లో. పాపఫలము పుణ్యాఃఫల మేకకాలమం, దనుభవింప నెప్పుఃడనువు పడదు
ధర్మఫలము వెంటఃధర్మఫలం బేగు, ధర్మమునను జెఱునఃధర్మఫలము.౧౧౨౮

### తాత్పర్యము

చీఁకటి వెలుతురు లేకకాలమున రానట్లు, పాపఫలము పుణ్యఫల మేక కాలమునందు ననుభవమునకు రావు. ఒకటి పోయిన రెండవది వచ్చును. ఒక కాంతిలోఁ మఱియొక కాంతి కలిసిపోవును గాని చీఁకటి కలియనట్లు ఎన్ని ధర్మముల ఫలము లైనను నేకకాలమున ననుభవమునకు వచ్చును గాని పుణ్యఫల మనుభవించు కాలమందుఁ బాపఫలము రాదు. కావున నేను జేసినది పాపమైన యెడల దాని ఫలము నాకేల యనుభవమునకు రాలే దనకుము. ధర్మఫల మధర్మము చెఱుచును. కావున ధర్మఫలానుభవసమయంబున నధర్మఫలము ననుభవమునకు రానీయదు. 'ధర్మేణ పాప మపనుదతి' యను శ్రుతి గలదు గదా! అధర్మఫల మిపుడేల యనుభవమునకు రాలే దందువా. చీఁకటి వెలుతురును జెఱుపఁజాలదు. వెలుతురు చీఁకటిని జెఱుచును. చీఁకటి వెలుతురును జెఱుపలేదు. కావున నధర్మ ఫలము నీ కనుభవమునకు రాలేదు. ధర్మ మధర్మమును జెఱుచు నని శ్రుతి కలదు గాని యధర్మమువలన ధర్మము చెడు నని శ్రుతి లేదు.

ఓరీ నీవు చెప్పినది సరిగాదు. అష్టైశ్వర్యము లనుభవించు వానికి రోగము రాదా? రోగము పాపఫలముగాదా? ఆరోగము పుణ్యఫలమైన ధనముచే నౌషధ రూపమున నాశమగుటలేదా. అట్టులే నేను జేసిన పాపము నా పుణ్యముచే నాశ మగును గాని నన్ను బాధింపదు. నా తపఃఫలము వలన నాకు పాపఫలము రానే రాదు. వచ్చినను దానివలన నే పరిహార మగు నందువా? అది సరిగాదు.

ఐశ్వర్యము రోగము పరస్పరవిరుద్ధములు గావు. కావుననే యేకకాలమున రావచ్చును. నీవు చేసిన తపస్సువలన దీర్ఘాయువు కావలె. నీవు చేసిన పరదార హరణమను పాపము వలన వేగిరము చావవలె. ఒకటి యాయుర్వృద్ధికరము. మఱి యొకటి యాయుర్నాశకరము. ఇట్టివి రెండెట్లు ఏకకాలమున సంభవించును? కావున నాత్మనాశక మగు పరదారహరణఫలమును, ఆత్మరక్షక మగు తపఃఫలము నశింపఁజేయు నని నమ్మకుము.

రెండవది:—అధర్మఫలము న న్నంటనే యంటకుండ నా ధర్మఫలముచేయు

నంటివి. అదియును సరిగాదు. 'తదేవ ఫల మన్వేతి ధర్మోవా ధర్మనాశనః.' ధర్మము ధర్మఫలమునే యిచ్చునుగాని యధర్మమును జెఱుప దని యర్థము అనఁగా ధర్మము తా నెంతఫల మీయవలయునో యంతే యిచ్చుట దాని కార్యముగాని, అధర్మమును జెఱుచుట దాని కార్యముగాదు. నేను దేవదానవులచేతఁ జావ కుండుట నా తపము ఫలమునఁ గదా. అట్టులే యిది నరవానరులనుండి కాపాడదా యందువేమో, కాపాడదు. నీవు తపస్సు చేసినవాఁడవు వ్రతఫలము కోరక యుండినచో నది నిన్నంకఱ నుండి కాపాడి యుండును. అటుగాక నీవు వ్రతఫలముగ దేవదానవాదులచేఁ జావు లేకుండఁ గోరితివి. కావున నీ తప మంత మాత్రమే చేయఁగలదు గాని యంత కెక్కువ చేయజాలదు. అదియునుగాక నీవు నరవానరుల నిషేధించితివి. కావున నీ తపఃఫలము వారినుండి నిన్నుఁ గాపాడఁజాలదు. 'ధర్మోరక్షతి రక్షిత' యను వాక్యము వలన నా ధర్మము నన్నుఁ గాపాడదా యందువేమొ అది యాగంతుక విపత్తుల విషయముననే కాని బుద్ధిపూర్వకమైన కర్మానుభవవిషయమునఁగాదు.

'ధర్మ శ్చాధర్మ నాశనః'యని కలదు గదా. నేను బూర్వము చేసినధర్మము నేఁటి యధర్మము నుండి కాపాడదా యందువేమో నీవు పూర్వముచేసినపుణ్యము దానికిఁ బూర్వము చేసిన పాపములనుండి రక్షింపఁగలదుగాని దానికి వెనుక నిష్పడుచేయు నధర్మముల నాశము చేయదు. నీవు నేఁడు భోజనము చేసితి వేని యంతకు ముందున్న యాఁకలిబాధను నది హరించును గాని, తేపటి యాఁకలిబాధను నది హరింపదుగదా. అధర్మమును ధర్మము నాశము చేయలేదేని ప్రాయశ్చిత్తము లేల పుట్టిన వందువేమో. ఏ పాపమున కేది ప్రాయశ్చిత్తమో యాప్రాయశ్చిత్త మా పాపమునే హరించును గాని యితర పాపముల హరింపఁజేయఁజాలదు. జ్వరమునకై నీవు సేవించు నౌషధము వ్రణమును మానుపఁజాలదు. అదియునుగాక ప్రాయశ్చిత్త మనునది వెనుకఁ జేసినదానికిఁ బరితాపము. ఇఁక ముం దిట్టివి చేయనను నిశ్చయ ముండవలెను. నీవు చేసినదానికిఁ బ్రాయశ్చిత్తము చేసిన పాపమునకు వగచి యిఁకఁజేయనని నిశ్చయించుకొని నీవు బలవంతముగఁ దెచ్చిన సీతాదిస్త్రీలను వారివారి మగవారి కప్పగింపుము. ఆ దోషము నివర్తించును.

ఆ. మున్ను నీవు సలిపి•యున్న తపోరూప,ధర్మమునఫలంబు•దానవేంద్ర
యనుభవించి తింత•దనుక న దంతయుఁ,బడయఁ గలవ నధర్మ•ఫలము వేగ.

అర్థములు. ధర్మమునఫలంబు - షష్ఠ్యర్థమున నకారాగమము - ధర్మము యొక్క ఫలము. తాత్పర్యము

నా తపఃఫలము నన్ను రక్షించు నని తలఁచెదవేమో? అది భ్రాంతి. తపఃఫలము పుణ్య మనుభవించు కొలఁది క్షీణించును గాని శాశ్వతముగాదు. కావున నీ తపఃఫల మెంత యనుభవింపవలయునో యంతయు నేఁటిదాఁక

ననుభవించితివి. ఆ ఫలము సమసినది. ఇఁక నీవు చేసిన పాపఫలము నేఁటినుండి యనుభవింపఁగలవు. దాని పూర్ణఫలము వేగముగనే గాంచఁగలవు.

క. తలఁపు జనస్థానము వధ, దలంపుము, యవ్వాలివధము•ధరణిపసుగ్రీ
 వుల చెలిమియు స్మరియింపుము, దలపోయుము యాత్మసుఖవి•ధానం బధిపా!

తా త్ప ర్య ము

నా పాపఫల మనుభవమునకు వచ్చుచున్నదని నీ కెట్లు తెలియఁగలఁ దందు వేమో, జనస్థాన మందలి నీ తమ్ములు లోనగు నీ వారందఱు చచ్చుట దాని కంకురారోపణ మనుకొనుము. తరువాత నీకు మిత్రుఁడైన వాలి చచ్చుటయు నీ మిత్రునికి విరోధియైన సుగ్రీవుఁడు రామచంద్రమూర్తితో స్నేహము సేయుటయు నివన్నియు నీ కనిష్టసూచకములు గావా. వీని నన్నిటిని నాలోచించి యేది నీకు సుఖకరమో దానిని జేయుము.

ఉ. నే నొకరుండనే కడిమి•నిర్మథనం బొనరింప నేర్తు లం
 కానగరంబు సర్వమును•గాని వచింపఁడు రాముఁ డవ్విధిం,
 దానె వధింతు నంచుఁ బ్రతి•నన్ వచియించెఁ గపీంద్రుసన్నిధిన్
 జానకిద్రోహి, నట్లగుట•సైరణ సేసితి రాక్షసేశ్వరా! ౧౧౬౭

అర్థములు. నిర్మథనము=నాశము, సైరణ చేసితిన్=సహించితిని.

తా త్ప ర్య ము

నీ యధర్మఫలమును నేఁడే నీ వనుభవింపఁజేసి నా వాక్యముల యాథార్థ్య మును బ్రత్యక్షముగ నీకుఁ జూపఁగలను. నే నొకఁడనే యీ లంకానగరమంతయు నాశము చేయఁగలను. మీ యందఱిలో నన్ను బాధింపఁగలవాఁడు లేఁడు. మీ శస్త్రాస్త్రములు నన్నేమియుఁ జేయఁజాలవు. ఇంద్రజిత్తునొద్ద నున్న బ్రహ్మాస్త్రము పని ముగిసినది. అది మఱల నుపయోగింపదు. అంత కెక్కువ యస్త్ర మతఁ డెఱుఁగఁడు. నాకుఁ గల వరముల బలముచేఁ దక్కిన యస్త్రములు నన్నే మియుఁ జేయఁజాలవు. ఇప్పుడు నేను దిరుగఁబడి తన్నఁబూనిన నతఁడు కాని మఱి యెవ్వరు కాని యడ్డగింపలేరు. కాని యట్టిపని నాకు రామచంద్రమూర్తి చెప్ప లేదు. కావున సహించితిని. జానకీదేవికి ద్రోహముచేసిన వానిని దానే వధింతు నని సుగ్రీవు సమక్షమునఁ బ్రతిజ్ఞ చేసెను. కావున నీ విషయమై నేనేమియుఁ జేయజాలక యున్నాను.

క. రామునకును సాక్షాత్సు•త్రాముఁడు నపకృతిని జేసి•రాదు సుఖింపన్
 సామాన్యుల నన నేలా? నీ మా టిఁక నేమి చెప్ప•నిర్జరవైరీ. ౧౧౬౮

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి కింద్రుఁడైనను అపకారముచేసి సుఖింపఁలేఁడు. తక్కిన వారిని నేమి చెప్పవలయును? పాపోపహతుఁడవైన నీవార్త చెప్పవలసినపని యేమి?

ఉ. నీ వశమందఁ యుండి ధరణీసుత యంచును నీవు చూచు నా
భావిని లంక నంతయును భా డొనరింపఁగఁ జేరియున్న యా
దేవిని గాళిరాత్రిఁగ మదిం దలపోయుము, నీ మెడిందు నీ
కావిధకాలపాశ మది దార్కొనెఁ జూడుము యోగ్యపద్ధతిన్. ౧౧౬౯

అర్థములు. భావిని=ఉత్తమస్త్రీ, కాళరాత్రిఁగన్=ప్రలయకాలమున సర్వము సంహారము చేయు భగవంతుని శక్తిగ-'సమీచ కాళరాత్రిశ్చ భైరవీ గణనాయికా' యను నిఘంటు ప్రకారము గణనాయిక పేరని కొందఱు-బ్రహ్మ తన్ను మధుకైటభులు బాధించి నపుడు ఈ శక్తిసాహాయ్య మపేక్షించి ప్రార్థించె నని మార్కండేయ పురాణమునఁ గలదు. ఆ పురాణమందే యీామె మోహరాత్రి, కాలరాత్రి, మహారాత్రి, నారాయణి లోనగు పేర్లు గల దనియు నీమె విష్ణుశక్తి యనియుఁ జెప్పఁబడును. త్రిగుణాత్మిక యగు ప్రకృతి భగవచ్ఛక్తియే. శక్తియే మాయయని మహామాయ యని యిత్యాది నామంబులఁ జెప్పఁబడుచుండును. "ఈశ్వరస్య మహామాయా తదాజ్ఞావశవర్తినీ-తత్సంకల్పానుసారిణీ; వివిధానంత మహాశక్తి సంసేవితా। అనంత మహామాయాజాల జననమందిరా। మహావిష్ణోః క్రీడా శరీరరూపిణీ। బ్రహ్మాదీనా మగోచరా. ఏతాం మహామాయాం తరంత్యేవ యే విష్ణుమేవ భజంతి, నాన్యే తరంతి కదాచన।వివిధోపాయైరపి॥ మహానారాయణోపనిషత్తు. భగవంతుని మహామాయ ఆయన యాజ్ఞకులోపడి వర్తించునది. ఆయన సంకల్పము ననుసరించి యుండినది. మహావిష్ణువునకుఁ గ్రీడాశరీర మైనది. బ్రహ్మాదుల కగోచరమైనది. ఎవరు విష్ణువును భజింతురో వారు మహామాయను దాఁటుదురు గాని, యితరోపాయముల నెన్నిటనైనను ఏకాలమునకైనను దాఁటలేరు ఈ విష్ణుశక్తియే జగద్రక్షాకార్యమునందు కేవల సత్త్వగుణము నంగీకరించి లక్ష్మి-శ్రీ-భూమి నీళ-రుక్మిణీ-సీతాది రూపంబుల నవతరించును. సంహారముచేయు కాలమందు తమోభూయిష్ఠయై మహాకాళి, కాళరాత్రి లోనగు నామధేయములు గలదై యుండును. ఏ కార్యమును జేయఁబూని నపుడు ఆ వేషభాషలుండుట యావశ్యకమె గదా. కావున సాత్త్వికులు శ్రీదేవిని, లక్ష్మీదేవిని, భూనీళాదులను, సీతారుక్మిణుల భజింతురు. తామసులు మహాకాళీ-కరాళీ-మహారాత్రి-దుర్గా-చండీత్యాది నామంబుల భయంకర మూర్తుల భజింతురు. ఈ తామస శక్తులలో మహాచంద్ర-యోగేశ్వరి-సిద్ధికరాళి, సిద్ధి వికరాళి-మహంత-మారి-వజ్రకపాలిని-ముండమాలిని-అట్టహాసిని-చండకపాలిని-కాలచక్రేశ్వరి-గుహ్యకాళి-కాత్యాయని-కామాక్షి-చాముండ - సిద్ధిలక్ష్మి-కుబ్జిక - మాతంగి - చండేశ్వరీ-కౌమారి-వీరు కుమారికలు-శుద్ధ-కాళిక-కలిత-మాలిని-వసుంధర-సరస్వతి-రమ-గౌరి-దుర్గ-వీరు దేవులు. రమ యనఁగ లక్ష్మి కావున నీమె యీా శివశక్తులలోఁ జేరిన దని తలంపరాదు. ఆపేరు గల శక్తి మహామాయ. కాళరాత్రి-సర్వమంగళ-

డమరుక-రాజరాజేశ్వరి-సంపత్ప్రద-భగవతి-కుమారి-వీరు దేవులు. వీరికి ఆఱుగురు శక్తులు పరిచారికలు గలరు. అనంగకుసుమ-అనంగమన్మథ-అనంగమదన-అనంగకుసుమాతుర-అనంగమదనాతుర-అనంగశిశిర-ఈ పేరులే యీ దేవతల స్వభావములు దెలుపుచున్నవి. ఈ శక్తి పూజలు కామ్యములు, నైమిత్తికములు. ఈవిషయము పూర్ణముగ మహాకాలసంహితయందుఁ జెప్పఁబడినది. సీత కాళరాత్రి యని తెలుసుకొను మని హనుమంతుడు చెప్పినమాటను బట్టి మీఁదఁ జెప్పిన తామసశక్తియే సీత యని కొందఱందురు. అది సరిగాదు. సీత గుణములందుఁ దమోగుణస్పర్శలవ మైన లేదు. ఉపమానములఁబట్టి చూచిన సీత నీపాలి కాలపాశమని కాలభుజంగి యనికూడ హనుమంతుడు చెప్పెను. దానినిబట్టియాఁడు త్రాఁచుపాముగాఁ బుట్టె ననవచ్చునా? కాళరాత్రి ప్రలయకాలమందు సంహారమెట్లు చేయునో యట్లు సీత నీ వంశము నాశము చేయు ననియే గ్రాహ్యముగాని, యుపమానములందు సర్వము యథార్థ మని గ్రహింపరాదు. పురుష సింహమన్నప్పుడు సింహమున కుండు గోళ్ళు, కోఱలు, కేసరములు పురుషున కున్న వనవచ్చునా? సాత్త్విక తామసశక్తులకుఁ గల భేద ముత్తర పీఠిక యందు వివరింపఁబడును.

ఇక్కడ సీతాదేవి సర్వసంహారక శివశక్తి యగునేని 'అక్కట కాళరాత్రి గతి నా ధరణీశుని నీవ చంపితే' యని భరతుఁడు కైక విషయమై చెప్పెఁగదా. (అయోధ్య ౧౨ -౨౧ ప) అక్కడనే కాళరాత్రి వచ్చెను. రెండు స్థలములందుపమ యని యెఱుంగ నగును. సీతావిధకాలపాశము=సీతా స్వరూపమైన యమపాశము. కాలపాశము సీతగాఁ బుట్టలేదు గదా.

### తాత్పర్యము

నీ వశమందుండి జానకి యని నీవు తలంచు నుత్తమస్త్రీ లంకయంతయును బాధ చేయఁగ వచ్చి చేరిన కాళరాత్రివలెఁ దలంపుము. కాళరాత్రి యే విధముగ లోకమును ప్రలయకాలమున నాశముచేయునో యట్లీమె యీ లంకయంతయు నాశము చేయును. ఈమె నీ మెడయందుఁ దగులుకొనిన యమపాశమని తలంపుము. కావున నీవు బ్రదికి లంకను గాపాడుకొనఁదలఁచితివేని యీమెను వదలిపెట్టుము. ఇది నీకు యోగ్యమగు మార్గము.

చ. ధరణిసుతాతపోనలసు♦దగ్ధము రాఘవకోపపీడితం
బరయుము సాట్టవప్రపుర♦మంతయు, మంత్రిహితానురక్తసో
దరసుత దారయుక్తముగఁ♦దగ్ధయు నాశన మేల యయ్యె దీ
పురమును వారిఁ గాచికొనఁ♦బోలదె చూడుము రాక్షసేశ్వరా. ౧౧౭౦

అర్థములు. ధరణిసుతా తపోనల సుదగ్ధము=జానకియొక్క తపస్సనెడి యగ్నిచే బాగుగఁ గాలినది. రాఘవ కోపపీడితంబు=రామచంద్రమూర్తి కోప

ముచే బాధింపఁబడినది. స+అట్ట+వప్ర+పురము=కోట బురుజులు ప్రాకార ముతోఁ గూడిన పట్టనము, అనురక్త=నీ యందు ప్రీతిగలవారు.

తాత్పర్యము

ఈ పట్టన మంతయు సీతాపాతివ్రత్య మను నగ్నిచేఁ గాలినదిగను రామచంద్రమూర్తి కోపముచే బాధింపఁబడినదిగాను దెలిసికొనుము. మంత్రులతో హితులతో నీయం దనురాగము గల బంధువులతో, తమ్ములతో, దారపుత్రాదులతో నేల నాశమయ్యెదవు? (భార్యలకు వైధవ్యము వచ్చుటచే వారు నాశమైన వారే) ఈ పట్టణమును దారపుత్రాదులను రక్షించు కొనరాదా?

క. వినుమీ నా వచనంబులు, దనుజేశ్వర! పలుకువాఁడఁ దథ్యము నే రా
మునిదాసుఁడ దూతుఁడ నం,దును వానరుఁడన్ శుభంబు దొరకొను నీకున్.

తాత్పర్యము

రాక్షసేశ్వరా! నీవా రాక్షసుఁడవు. రామచంద్రమూర్తియా మనుష్యుఁడు. నేను మీా యిరువుర జాతిలోఁ జేరిన వాఁడనుగాను. మధ్యవర్తిని. నేను సొమ్ము పోఁగొట్టు కొన్నవాఁడనుగాను, రాఁబట్టుకొను వాఁడనుగాను ఇందు నాకు రాఁగల లాభనష్టములు లేవు, అందు నేను రామదాసుఁడను. రామచంద్రమూర్తి సీతను జూచి రమ్మనిన మాతనై వచ్చినవాఁడను. నే ననత్యమాడవలసిన పనిలేదు; సత్యము చెప్పుచున్నాను. నా మాటలు వినుము. నీకు మేలు గలదు.

క. సచరాచరభూతజగ,న్నిచయంబుల సంహరింప నిరుపమశక్తిన్
రచియింప మఱల రాముఁడె, ఖచరేశ్వరదమన! నేర్చు ఘనయశ మెులయన్.

అర్థములు. సచరాచరభూత=చరములు, అచరములగు భూతములతోఁ గూడిన- జగత్+నిచయంబులన్=లోకసమూహములను, నిరుపమశక్తిన్=అసమాన శక్తిచే, రచియింపన్=సృజించుటకు, ఖచరేశ్వరదమన=ఇంద్రుని జయించినవాఁడా.

తాత్పర్యము

నేను మధ్యవర్తి నగుటచే నాయనబలము నే నెఱుఁగుదును. నీ బలము నే నెఱుఁగుదును,

ఇరువుర బలాబలము తెలిసి చెప్పుచున్నాను. నీ వొక యింద్రుని గెలిచితి నని గర్వించెదవు. రామచంద్రమూర్తి జంగమస్థావరములతోఁ గూడిన సమస్త ప్రపంచములను దన శక్తిచే సంహరింపఁగలఁడు. మఱల సృష్టింపఁ గలఁడు. కనుక నాయనకు నీకు నెక్కడి కెక్కడ? యుద్ధము సమానులందు శోభించును గాని దోమకు నేనుఁగునకు నెక్కడి తారతమ్యము?

హనుమంతుఁడు తొలుత నయవాక్యముల నారంభించి తన యొక్కొక మాట వలన రావణుని ముఖనయనంబులందుఁ గలుగు వికారమును గనిపెట్టి తరువాత

మాట క్రమముగా నిట్లు చెప్పుచు వాని యందుఁ బ్రసన్న భావము గానక భయ వాక్కుల నారంభించె నని తెలియ వలయును.

ఈ శ్లోకము "యతోవా ఇమాని భూతాని జాయంతే - యేనజాతాని జీవంతి-యత్ ప్రయం త్యభిసంవిశంతి-తద్బ్రహ్మేతి-యను శ్రుతి యర్థమును" బోధించుచున్నది. ఇట్లు రామచంద్రమూర్తి పరత్వము చెప్పఁబడెను. నేను సత్యము చెప్పుచున్నా ననుటచే నిది బెదరింపుమాటగాఁ దలఁప రాదు. ఘనయశో మొలయన్ అనుచో 'నతస్య శే కశ్చన తస్య నామ మహద్యశో' యను శ్రుతి వాక్యము ప్రమాణము.

ఓయీ! సృష్టించుకార్యము బ్రహ్మది. సంహరించు కార్యము రుద్రునిది కదా! ఆ కార్యములు రామకార్యములుగాఁ జెప్పనేల యనరాదు. అనేకకోటి బ్రహ్మాండముల కంతయుఁ బ్రథమకారణము, ప్రథమాధికారి భగవంతుఁడొక్కఁడే 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' యన్నట్లు పరబ్రహ్మ మొక్కఁడే కాని యాయనకు సమానుఁడు మఱియొకఁడు లేఁడు. అధికుఁడు లేఁడు. గడ్డిపోఁచ కదలుటకుఁ గూడ నాయనయే కారణము. కాని సృష్టికని యొక యధికారి, సంహారమున కని యొక యధికారి స్వతంత్రించిలేఁడు. ఆ భగవంతుఁడే బ్రహ్మయం దంతర్యామియై ప్రవేశించి సృష్టి కార్యము చేయును. ఆయనయె రుద్రునియందుఁ బ్రవేశించి సంహార కార్యము చేయును. భారత యుద్ధ మం దర్జునుఁడు నిమిత్తమైనట్లుబ్రహ్మ రుద్రులు నిమిత్తమాత్రులు. వీరు భగవంతుఁడగు నారాయణుని విభూతులు. ఈ ప్రపంచమంతయుఁ దన యేకాంశమున నిలువఁబడియున్న దని కదా శ్రీకృష్ణ భగవానుఁడు చెప్పెను. "విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్" భ.గీ. ౧౦-౪౨. "ఏ పరమేశుచే జగము లీ సచరాచరకోటిచే సము ద్దీపిత మయ్యె నే విభుని-దివ్యకళాంశజు లబ్జగర్భగౌ రీపతి ముఖ్యదేవ మునిబృందము" భాగ. ఈ యర్థమునే సమస్తగ్రంథములు చెప్పుచున్నవి.

విష్ణో స్సకాశా దుద్భూతం జగత్తత్రైవచ స్థితమ్।స్థితిసంయమకర్తాసౌ జగతోఽస్య జగచ్చ సః। యస్మాదిదం జగ దజాయత యత్ర తిష్ఠ। త్యంతే సమస్తమిద మస్త ముపైతి యత్ర।తస్మై నమ స్సదసదాదివికల్పశూన్య। చైతన్యమాత్ర వపుషే పురుషోత్తమాయ॥ సృష్టి స్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మకాం।స సంజ్ఞాం యాతి భగవానేక ఏవ జనార్దనః॥ చతుర్విభాగ సంసృష్టౌ చతుర్ధా సంస్థిత స్థితౌ। ప్రలయంచకరో త్యంతే చతుర్భేదో జనార్దనః॥ ఏకే నాంశేన బ్రహ్మాసౌ భవ త్యవ్యక్తమూర్తిమాన్॥ ఏకాంశేన స్థితో విష్ణుః కరోతి పరిపాలనమ్। ఆశ్రిత్య తమసో వృత్తి మంతకాలే తదా ప్రభుః। రుద్రరూపీ భగవా నేకాంశేన భవ త్యజః। రుద్రకాలాంతకాద్యాశ్చ సమస్తాశ్చైవ జంతవః। చతుర్ధా ప్రళయా యైతే జనార్దనవిభూతయః॥ యత్కించి త్సృజ్యతే యేన సత్త్వజాతేన వైద్విజ। తస్య సత్త్వస్య సంభూతౌ తత్సర్వం వైహరే స్తనుః। హంతి యావ త్క్వచి త్కించి ద్భూతం స్థావరజంగమమ్। జనార్దనస్య తద్రౌద్రం, మైత్రేయాం

తకరం వపుః। ఏవ మేకో జగత్స్రష్టా జగత్పాతా తథాజగత్। జగద్భక్షయితా దేవో సమస్తస్య జనార్దనః॥ వి.పు. ౧-౧-౨. భగవంతుఁడగు విష్ణువు రజోగుణము విశేషముగఁ గల జీవులయందుఁ బ్రవేశించి వారిచే సృష్టికార్యమును-తమోగుణము గలవారి యందుఁ బ్రవేశించి సంహార కార్యమును, సత్త్వగుణము గలవారి యందుఁ బ్రవేశించి రక్షణమును జేయుచుండును. కావున సమస్తమునకు వాస్తవ ప్రయోజక కర్త భగవంతుఁ డనియు నైమిత్తిక ప్రయోజ్యకర్తలు జీవులనియు నెఱుఁగ నగు.

మ. నరదేవాసురయక్షకింపురుషగంధర్వాహివిద్యాధరో
 త్కరసిద్ధామరకిన్నరావళుల విక్రాంతాద్యు విష్ణూపమున్
 నరదేవోత్తము రామునిన్ దురములోనన్ మార్కొనం జాల రె
 వ్వరు నెక్కాలమునందు నెల్లయెడ సర్వప్రాణిజాలంబులన్. ౧౧౪౩

అర్థములు. విక్రాంతాద్యున్=పరాక్రమము గలవారిలో మొదటివాఁడు, విష్ణూపమున్=విష్ణువుతో సమానుని-అవతారమూర్తి యగుట సమత్వము చెప్పఁబడెను, నరదేవోత్తము=(౧) రాజులందు శ్రేష్ఠుని-(౨) నరులందు దేవతలందు నుత్తముని-దురములోనన్=యుద్ధము నందు.

## తాత్పర్యము

మనుష్యులు-దేవతలు-అసురులు-యక్షులు-కింపురుషులు-గంధర్వులు-పన్నగులు-విద్యాధరుల సమూహములు-సిద్ధులు-తక్కిన దేవజాతులవారు-కిన్నరులు వీరల సమూహములలోఁ బరాక్రమమున మొదటివాఁడగు విష్ణుసమానుని, రాజులలో శ్రేష్ఠుని, రామచంద్రమూర్తిని యుద్ధమునందు నెవ్వరైనను నేకాలమందైనను ఎల్లప్రదేశములందును సర్వప్రాణి సమూహములం దెవ్వరైనను నెదిరింప జాలరు. అంశము పూర్ణమును నెందైన నెదిరింపఁ గలదా? సముద్రములోని యలలన్నియును గలసి సముద్రముతో విరోధించి బ్రదుకఁ గలవా?

౧౧౪౨ మొదలు ౧౧౪౫ వఱకుఁ గల పద్యములందు రామచంద్రమూర్తి 'రామపదేనాసౌ పరబ్రహ్మాభిధీయతే' యనునట్లు త్రికాల సత్యమగు పరబ్రహ్మమని హనుమంతుఁడు చెప్పుచున్నాఁడు. అటు గాదేని యీ కాలమునం దుండు రామచంద్రమూర్తిని నంతకు ముందటివారు వెనుకటివారు, నెదిరింప లేరనుట యున్మత్త ప్రలాపము లగును.

క. రామునకు రాజసింహున, కా మహనీయాత్మునకు నవికలలోక
 స్వామికి ద్రోహ మొనర్చితి, వే మెయి దుర్లభము బ్రదికి యొసఁగుట నీకున్.

అర్థములు, అవికల లోకస్వామికి=వికలముగాని సమస్తమైన లోకములను దన సొమ్ముగాఁ గల వానికి - ప్రభువునకు - ఏ మెయిన్=ఏ విధముగ నైనను.

తాత్పర్యము

రాజులందు శ్రేష్ఠుఁడు, పూజ్యస్వభావము గలవాఁడు, సమస్తలోకప్రభువు నగు రామచంద్రమూర్తికి నీవు ద్రోహము చేసితివి. కావున నీ వే విధముగ నాలోచించినను బ్రదుకఁ జాలవు.

తే. మూఁడులోకంబులకుఁ బ్రభు•ముఖ్యుఁ డైన
రామచంద్రుని రణమున•రాక్షసేంద్ర!
నాగయక్ష నిశాట గం•ధర్వ దేవ
దైత్యవిద్యాధరులు నైనఁ•దాఁకలేరు. ౧౧౭౫

తాత్పర్యము

మూఁడు లోకంబులకుఁ బ్రభువు లగు వారిలో ముఖ్యుఁడగు రామచంద్రమూర్తిని నీ వొకఁడవు కాదు,నాగయక్షరాక్షస గంధర్వ దేవ దానవ విద్యాధరులందఱు నొక్కటియై కూడ నెదిరింపలేరు.

తే. అధిప! బ్రహ్మ స్వభువు చతు•రాస్యుఁ డైనఁ
ద్ర్యంబకుఁడు రుద్రుఁ, డును బుర•హరుఁడు నైన
నింద్రుఁడు మహేంద్రుఁడును సురా•ధీశుఁ డైనఁ
గలన శ్రీరామవధ్యుని•గావ లేరు. ౧౧౭౬.

అర్థములు. సాధారణ దేవతలు రాము నెదిరింప లేకున్నను రక్షకు లని ప్రసిద్ధులైన పర(గొప్ప) దేవత లెదిరింపరాదా యనుటకు సమాధానము చెప్పుచున్నాఁడు. అధిప-యిత్యాది-ఇందలి యొక్కొక్క విశేషణమును నా యా దేవత యొక్క శక్తి పరిపూర్ణతను దెల్పును. మొదటి రెండు మూఁడు పాదములను దల క్రిందుగా నన్వయించిననే యుత్కర్షాపకర్షములు చక్కఁగ నేర్పడును గాన నట్లే యన్వయించుకొనవలెను.

"ఇది పరమైశ్వర్యే" యను ధాతువుపైఁ బుట్టిన యింద్రశబ్దము త్రిలోకాధిపతి యని యర్థమును దెల్పును. ఇంద్రుఁడు త్రిలోకాధిపతి యయ్యును నింద్రునకు శత్రులను గెల్వ సామర్థ్యము లేదేమో యని యాశంకింపరాదను చున్నది మహేంద్రుఁ డను పదము. ఇంద్రుఁడు వృత్రాసురుని జంపుటచేత గొప్ప సామర్థ్యము కలవాఁ డని ప్రసిద్ధి కలదుగదా. అట్లయ్యును రాముని దాఁకలేఁడని భావము. "మహాన్వై అయమభూ ద్యోవృత్ర మవధీ దితి, తన్మహేంద్రస్య మహేంద్రత్వ"మ్మను శ్రుతి మహేంద్ర శబ్దమునందుఁ బ్రమాణము. ఎంత సామర్థ్యము కలిగియున్నను సహాయసంపత్తి లేనిచో నేకార్యమును గాదుగదా యనుటకు సమాధానము సురాధీశుఁ డైన నను పదము. ఇంద్రుఁడు తనవలె బలశాలులైన ముప్పదిమూఁడు కోట్ల దేవతలతోఁ గూడియున్నను రామునిఁ దాఁకలేఁడని భావము.

## తాత్పర్యము

క్షుద్రుఁడైన యింద్రునకుఁ జేత గాకున్నను నుండ వచ్చును గాని సర్వసంహారకుఁడైన రుద్రునికి రాముని దాఁకునట్టి శక్తి తప్పక యుండు ననుటకుఁ జెప్పుచున్నాఁడు. రుద్రుఁ డిత్యాది (౧) ప్రళయ కాలమందు జనులను సంహరించుచు నేడ్పించువాఁడు. (౨) రుతం వేదశబ్దం బ్రహ్మణేకల్పాదౌ రాతీతి రుద్రః అని యొక వ్యుత్పత్తి. సృష్ట్యాది యందు బ్రహ్మకు సమస్త వేదములను జెప్పువాఁడు. (3) రుతా-నాదేన (సకల మిదం జగత్) ద్రావయతి - రంజయతీతి రుద్రః=నాదరూపుఁడై సకల జగంబులను సంతోషపఱుచువాఁడు. (౪) రుతా-ప్రణవస్య వేదస్య నాదేన-దాపయతి-ఇష్టం ప్రాపయ తీతి రుద్రః. ప్రణవము గాని, వేదముగాని యుచ్చరించు వారికిఁ గోరిక లీడేర్చువాఁడు. ప్రణవప్రతిపాద్యుఁ డనిగాని, వేదప్రతిపాద్యుఁడని గాని భావము. (౫) రుతం=సంసార దుఃఖం - దుఃఖహేతుం వా ద్రావయతీతి రుద్రః - సంసార దుఃఖమునో దాని కారణమునో పోఁగొట్టువాఁడు. ఇంతశక్తి గలిగియున్నను రుద్రుఁడు రాముని దాఁకలేఁడని భావము. ఇతనికి సంహారకత్వశక్తియొక కాలవిశేషమునందే, అనఁగాఁ బ్రళయకాలమునందే గాని సదా లేదేమో. కాఁబట్టియే రాముని జయింప లేఁడేమో యని శంకింప రా దనుచున్నాఁడు. త్ర్యంబకుడు-త్రి+అంబకుఁడు=మూఁడుకన్నులు గలవాఁడు నొసటనున్న మూఁడవకంటిలోని నిప్పుమంటలచేతఁ బ్రళయ భిన్న కాలమునకు మన్మథునిఁ జంపి యుండలేదా. కాఁబట్టి యిట్లా శంకింపరాదు అని భావము. ఇదియుఁ గాక తాళీయము కా దనుచున్నాఁడు. పురహరుఁడునైనను=మిక్కిలి బలవత్తరులైన త్రిపురాసురులను సంహరించిన వానికి రుద్రునికి శక్తి లోపమే లేదని భావము. ఇంతటివాఁ డయ్యును రాముని మాత్రము దాఁక లేఁడు. రుద్రునికి శక్తి లేకపోయినను బోనిమ్ము. "బ్రహ్మణః పుత్రాయ జ్యేష్ఠాయ శ్రేష్ఠాయ" యని శ్రుతి చెప్పినట్లు అంతటి రుద్రునికి జనకుఁడైన బ్రహ్మదేవునికైనను రాముని దాఁకు శక్తి యుండదా యనుటకు సమాధానము చెప్పుచున్నాఁడు. బ్రహ్మ ఇత్యాది-బృంహతీతి బ్రహ్మయని వ్యుత్పత్తి; సాటిలేని గొప్పవాఁడు బ్రహ్మ రుద్రునికిఁ దండ్రియైనను కర్మవశ్యుఁడే కదా. అయినచో నాతని కెట్టు లంత గొప్పశక్తి కలుగు ననుటకు సమాధానము. స్వభువు=కర్మపరతంత్రుఁ డయ్యును బ్రహ్మ పరులవలెఁ గాక తనకుఁ దానే జన్మించిన వాఁడు. కాన గొప్ప శక్తిమంతుఁడే యని భావము. ఎంత శక్తి యున్నను సహాయసంపత్తి లేనిచో నెట్లు కార్యము నెఱవేర్చు ననుటకు సమాధానము. చతురాస్యుఁడైనను=నాలుగు మోములచేతను సమస్త వేదములను నొక్కటేతూరి యుచ్చారణ చేయుటచేతఁ గలిగిన గొప్ప యతిశయము కలవాఁడయ్యును, ఇంతటి గొప్పవాఁడయినను బ్రహ్మ రాముని దాఁకనేలేఁడని భావము. ఈ ముగ్గురు ప్రత్యేకించి రాముని దాఁక లేరని యింతవఱకును జెప్పెను.

ముగ్గురు కలిసి వచ్చినను రాముని దాఁక లేరని క్రియాపదముపై నున్న బహువచనము సూచించును. శ్రీరామవధ్యనిన్=శ్రీరాముల వారిచే వధింపఁదగినవానిని, "స్థానవినిగ్రహస్య చ" యన్నట్లు వారి వారి కనుగుణముగానే గదా శ్రీరాముల వారు శిక్ష విధింతురు. అట్లు వారు శిక్షించునపుడు వాని నెవరు రక్షింపనేర్తురని భావము. కలనన్ గావలేరు-వీరు రామునితో యుద్ధముచేసి యా వధ్యుని సంరక్షింప శక్తిగలవారు కారు. ఇట్లు కాకపోయినను వీరు రాముని శరణుజొచ్చి యా వధ్యుని విడిపింపుమని వేడి కాపాడుటకు మాత్రము శక్తికలవారే యని కలననను పదము సారస్యము.

"హిరణ్యగర్భ స్సమవర్త తాగ్రే" యని బ్రహ్మదేవుఁడే పరదేవత యనియు, "న సన్నచాస చ్ఛివ ఏవ కేవల"యని రుద్రుఁడే పరదేవత యనియు, ఇంద్రో మాయాభిః పురురూప ఈశతే" యని యింద్రుఁడే పరదేవత యనియు వేదమున నచ్చటచ్చట నీ ముగ్గురిని బరదేవతలుగాఁ జెప్పియున్నను నా ముగ్గురి కన్నను రాముఁడే పరాత్పరుఁ డని యీ పద్యమునఁ జెప్పఁబడెను. వేదాంతమునందు సత్, బ్రహ్మ, ఆత్మ యిత్యాదులైన సామాన్యశబ్దంబులు పెక్కులున్నవి. హిరణ్యగర్భ శివేంద్రాదులైన విశేష శబ్దంబులును ననేకములున్నవి. వాని కన్నిటికిని శ్రీరాముల వారేయని పరాత్పర నిరాకరకమైన యీ పద్యములోని శ్రీరామ శబ్దము సూచించును. రక్షకులని ప్రసిద్ధిఁ గాంచిన పరదేవతలను జెప్పెడి యీ సందర్భమున నింద్ర, రుద్ర, బ్రహ్మలను మాత్రము చెప్పి విష్ణుమూర్తిని జెప్పమిచేత శ్రీరాముల వారే విష్ణుమూర్తియని పారిశేష్యమున నేర్పడును.

ఈ ప్రకారము విలోమముగఁ జెప్పినను జెప్పవచ్చును. లేక అనులోమముగ జెప్పిన జెప్పవచ్చును.

బ్రహ్మ సురజ్యేష్ఠుఁడు. అంతకంటె గొప్పవాఁడు దేవతలందు లేఁడు. నీ యందనుగ్రహించి నీకు వరము లిచ్చినవాఁడు. అట్టి వాఁడైనను నిన్నుఁ గావ లేఁడు. అట్టి బ్రహ్మయొక్క శిరస్సును దెగఁగొట్టినవాఁడు రుద్రుఁడు. నీ యందనుగ్రహించి వరములు, బిరుదములు తన యాయుధము లిచ్చిన వాఁడు. అట్టి వాఁడును నిన్ను రక్షింపలేఁడు.

ఇఁక వీరే రక్షింపజాలనప్పుడు నీచేతఁ గట్టుపడిన యింద్రుని మాట చెప్ప నేల? వా రిరువురితోఁ గలిసిన బలవంతుఁడగును గదా యనిన వారు ముగ్గురేకమైనను రామచంద్రమూర్తి చంపఁదలఁచిన వానిని గానలేరు. యుద్ధముచేసి నిన్ను రక్షింపలేరుకాని కాకాసురునివలె శరణాగతి చేయుటచే రక్షింపఁ గలరు.

"సబ్రహ్మా న శివ స్సేంద్ర" యనుచో విష్ణువును జెప్పక యాయన పరత్వము శ్రుతి సూచించు నట్టు లిచ్చట నాముగ్గురే చెప్పఁబడి రనియు వీరు ముగ్గురకు బరుఁడైన వాఁడు రామచంద్రమూర్తి యనియు సూచింపఁబడెను."సబ్రహ్మా సశివ స్సహరి స్సేంద్ర"యను నది మాయావాది కల్పిత మగు నపపాఠ మని యెఱుంగునది. ఛందోభంగము.

తాత్పర్యము

ఓయీ రాక్షసరాజా? చిల్లరదేవతల మాట యటుండనిమ్ము. నీ యందుఁ బ్రేమగలిగి వరము లిచ్చిన స్వయంభువు, నాలుగుమొగములుగల బ్రహ్మ ననుఁ, మూఁడు కనులు గలిగి త్రిపురముల నాశముచేసిన రుద్రుఁడైనను ముప్పది మూఁడు కోట్ల దేవతల కధిపతి యయి యింద్రుఁడే కాక మహేంద్రుఁడు నైన వాఁడైనను గాక వీరు ముువ్వురు కలసియైనను యుద్ధమునందు నిన్నుఁ గావలేరు. కావున నీకు రక్షకము శరణాగతియే.

క. అను హితయుత మగుకఠిన వ,చనముల ధృతి చెడక హనుమ•సభఁద న్నాడన్
విని దశవదనుఁడు కోపం, బున గ్రుడ్డులు ద్రిప్పికొనుచు•భ్రుకుటి వడంకన్.

తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు హితములైనను గఠినములైన మాటలను దన్ను సభలో నందఱు వినుచుండ ధైర్యముతోఁ జెప్పినవిని మహాకోపముతో గ్రుడ్లు గిరగిర ద్రిప్పుచుఁ గనుబొమలు ముడివడి వడఁకుచుండ—భ్రుకుటి-భ్రూకుటి.

—•౫౨-వ సర్గము. విభీషణుఁడు రావణుతో దూతను జంపరాదని చెప్పుట•—

సీ. హనుమంతుఁ జంపఁగ•నాజ్ఞ సేయగ విని, దోషజ్ఞుడైన వి•భీషణుండు
నిశ్చితార్థుండయి•నీతి నాలోచించి, తద్ధితకాంక్ష న•త్యంత హితము
వఱల నన్నను మృదు•వాక్కుల నిట్లను, క్షమియింప వయ్య రో•షంబువిడుము
దయఁ జూడు నామాట•తగవు విచారింపు, నయవిధిజ్ఞులు ధరా•నాథు లెందు

తే. దూత వధియింప నొల్లరు•దోష మగుటఁ,
గపిని జంపుట లోకవి•గర్హితంబు
రాజధర్మ విరుద్ధంబు•రాక్షసేంద్ర!
నిన్నుఁ బోఁటికిఁ దగ దిది•నిర్జరారి! ౧౧౭౮

అర్థములు. దోషజ్ఞుఁడు=పండితుఁడు, దోషములఁ దెలిసినవాఁడు. విద్వాన్విపశ్చిద్దోషజ్ఞ స్సన్ త్సుధీః కోవిదోబుధః- అమర- నిశ్చితార్థుఁడు=నిశ్చయింపఁ బడిన ప్రయోజనము గలవాఁడు. తత్ + హిత కాంక్షన్=రావణుని మేలుఁగోరి- నయవిధిజ్ఞులు=నీతిశాస్త్ర మెఱిఁగినవారు; లోకవి గర్హితంబు=జనులచే నిందింపఁ బడినది.

తద్ధితము-విభీషణుఁడు చెప్పినది రావణునకు రెండు విధముల మేలు. (౧) రాజధర్మము నీతిశాస్త్రము నతిక్రమింప కుండుట. (౨) నీతో మాటలాడుటకై కట్టుపడి వచ్చినాను గాని యీకట్లు నన్నేమియుఁ జేయఁజాలవని లంకయంతయుఁ దానొకఁడే నాశము చేయఁగల నని హనుమంతుఁడు చెప్పెను. బ్రహ్మాస్త్రమునకుఁ గట్టు పడని వానిని జంపు వారెవరు? దేహము పెంచియో కుఱుచచేసియో కట్లు

విడిపించుకొని రావణుపై దూఁకిన నడ్డపడు వారెవరు? అది యెంతటి యవమానకరము. కావున విభీషణుఁ డీ రెంటిని దప్పించెను.

తాత్పర్యము

హనుమంతుని జంపవలసిన దని యాజ్ఞ సేయఁగా విని పండితుఁ డగుటచే రావణు నాజ్ఞ రాజనీతివిరుద్ధ మని దాని యందలి దోష మెఱిఁగిన విభీషణుఁడు కార్యము నిశ్చయించి నీతి నాలోచించి రావణాసురుని మేలాలోచించి మిక్కిలి హితముగ నన్నతో మెత్తని మాటల వినయముతో నిట్లనెను. రాజా! క్షమింపుము. కోపము మానుము. వీనియందు దయచూడుము. న్యాయ మాలోచింపుము. నీతిశాస్త్ర మెఱిఁగిన రాజులు దూతను జంపుట దోషమని చెప్పరు. అందుఁ గ్రోఁతినిజంపుట లోకమువారు నిందించుకార్యము. రాజధర్మమునకు విరుద్ధమైన పని. సామాన్య రాజుల విషయమే యిట్టిదై యుండ నీవంటివాని విషయ మేమన వలెను. దేవతలను జయించిన నీవు క్రోఁతిని జంపించుటవలనఁ బేరా కీర్తియా?

తే. క్షత్రధర్మంబునందు విశారదుఁడవు, మేలు మఱవనివాఁడవు మేటి వీవు
  ధర్మవిదులందు లోకంబు తప్పు నొప్పు, దెలియుదువు పరమార్థ సుధీవరేణ్యా!

తాత్పర్యము

క్షత్రియుల ధర్మమునందుఁ బండితుఁడవు, కృతజ్ఞుఁడవు, సామాన్యధర్మములను దెలిసినవారిలో నీకు సమానులు లేరు. జనులుచేయు తప్పులను నొప్పులను దెలిసిన వాఁడవు, పరమార్థము తెలిసిన పండితులందు నీవు శ్రేష్ఠుఁడవు.

క. చదువరి యగు నీబోఁటియు, మదిఁ గింకిరిఁ బూని కానిమార్గము చనఁగాఁ
  గాదుకనిచో నన్నాళ్ళులు, చదివిన చదువులకు ఫలము శ్రమ మొకఁడెకదా.

అర్థములు. చదువు+అరి=చదువరి = పండితుఁడు, విద్యావంతుఁడు, నీబోఁటియు=నీవంటివాఁడును, కింకిరి=కోపము, కానిమార్గము=సరిగాని మార్గము చెడుమార్గము, కొదుకనిచో=సందేహింపని యెడల.

తాత్పర్యము

నీవంటి పండితుఁడును గోపమునకుఁ బాలుపడి సరిగాని మార్గమునఁ బోవ సందేహింపనియెడల నెంతో కష్టించి పెక్కు కాలము చదివిన విద్యకు ఫలముకష్టపడుట యొకటేకదా. చదివిన చదువు లందలి విషయంబు లనుష్ఠాన మందుంచుకొననివాఁడు విద్య నేర్చుటకై పడిన పాటు వ్యర్థము. మూఢుఁడు పండితుఁడు నొక్కవిధముగ వర్తించిరేని వారి కిరువుర కేమి భేదము? శ్రమపడి చదువుట యొకటియే భేదము.

క. కావున నసురేశ్వర? పరి, భావితపరిపంథి! యుచిత భంగిని మది సం
  భావించి దూతునిం దగ, వౌ విధి దండింపు మనిన నాతం డలుకన్. ౧౧౮౦

అర్థములు. పరిభావిత పరిపంథి=అవమానింపఁబడిన శత్రువులు గలవాఁడా!

తాత్పర్యము

కాఁబట్టి శత్రువుల దండించువాఁడా! ఔచిత్యము నాలోచించి దూత నే విధముగ దండింప న్యాయ్యమో యట్లు దండింపుము.

క. పాపాత్ముల వధియించుట, పాపం బగు నెట్లు శత్రు♦భంజన! కానన్
బాపచరిత్రుని వానరు, వ్యాపాదితుఁ జేయువాఁడ♦నని వచియింపన్. ౧౧౪౩

అర్థములు. వ్యాపాదితున్=చంపఁబడిన వానిని.

తాత్పర్యము

విభీషణా! పాపాత్ముల దండించుట పాపమా? కావునఁ బాపపు నడవడి గల క్రోఁతిని జంపించువాఁడను. అని చెప్పఁగా,

ఇచ్చటఁ బాపము - రాజద్రోహము-శత్రుపక్షమున వచ్చుట-రాక్షసులఁ జంపుట.

ఆ. అధికదోషయుత మ♦నార్యసమ్మతము న,ధర్మమూల మైన♦దశశిరసుఁ
పలుకు లాలకించి♦ప్రాజ్ఞుఁడైన విభీష,ణుండు పరమతత్త్వధీచణుండు పలుకు.

అర్థములు. అధిక దోష యుతము=మిక్కిలి పాపముతోఁ గూడినది. అనార్య సమ్మతము=పెద్దలు సమ్మతింపనిది. అధర్మమూలము=అధర్మము ఆధారముగాఁ గలది-పరమ తత్త్వ ధీ చణుఁడు=మిగుల సద్బుద్ధి నేర్ప సమర్థుఁడు.

తాత్పర్యము

మిక్కిలి దోషముతోఁ గూడినది, పెద్దలు సమ్మతింపనిది, కర్మ మాధారముగ లేనిది యగు రావణు మాట విని సద్బుద్ధి నేర్పఁగల సమర్థుఁడు, బుద్ధిమంతుఁడునగు విభీషణుఁ డిట్లు చెప్పెను.

పంచచామరము. క్షమింపు రాక్షసేంద్ర! ధర్మ♦సంయుతంబు నా నుడిన్
శమంబుతోడ నాలకింపు♦చంపరాదు దూతఁ గా
ర్యమున్ ఘటించువేళ నంచు♦నన్నిజాతులందునున్
సమస్తసీమలందు సూరి♦సంఘముల్ వచించెడిన్. ౧౧౪౪

తాత్పర్యము

రాక్షసరాజా! నీమాట కెదురు చెప్పుచున్నానని కోపింపకుము. నాదోషము సహింపకుము. నేను ధర్మయుక్తముగాఁ జెప్పుచున్నాను. కోపము వదలి వినుము. దూతను దూతకార్యము చేయువేళఁ జంపరాదు. ఈ మర్యాద అన్ని జాతులందు నన్ని దేశములందుఁ గల దని పండితులు చెప్పుదురు.

సుగంధి. శాత్రవుండు వీఁడు, లేదు♦సందియంబు, శిక్షకున్
బాత్రుఁడున్ మహాపకార♦వారమున్ ఘటించుటన్,
జైత్రవర్య! దూతపట్ల♦సజ్జనాళి పల్కెడిన్
గాత్రపీడనంబు నాది♦గాఁగఁ బెక్కుశిక్షలన్. ౧౧౪౫

అర్థములు. శాత్రవుండు=పగవాఁడు-మహా+అపకార వారమున్=గొప్ప యపకారముల సమూహములను, జైత్రవర్య=జయశీలురలో శ్రేష్ఠుఁడా! గాత్ర పీడనంబు=దేహమును బాధించుట.

తా త్ప ర్య ము

జయశీలురందు శ్రేష్ఠుఁడా! నిన్ను జయించువాఁ డెవ్వఁడు లేఁడు. కావున వీఁడేమో యనినాఁడని నీవు కోపింపవలసిన పనిలేదు. వీఁడు పగవాఁడే. ఆవిషయమున సందేహము లేదు. వీఁడు గొప్ప యపకారము చేసినవాఁ డగుటచే దండింపవలసినవాఁడే. అదియు నేను గాదనను. వీనిని క్షమించి విడువు మని నేను చెప్ప లేదు. నేను జెప్పునది దూతను దండింపవలసిన విధిప్రకారము దండింపు మనుచున్నాను. దూతను దండించుటయందు దేహబాధ కలిగించుట కొన్ని విధములు పెద్దలచేఁ జెప్పఁబడినవి. ఆ ప్రకారము దండింపుము.

క. తల గొఱిగించుట యంగవి, కలుఁగాఁ గావించుటయును♦కశ నడుచుటయున్
దెలియఁగ గుర్తులు వేయుట, పలుకుదు రివి దూతదండ♦పద్ధతు లనుచున్

అర్థములు. అంగవికలున్=అవయవహీనుఁగా-ముక్కు-గోయుట, చెవులు గోయుట మొదలయినవి. కశ=కొఱడా-చబుకు-దూతదండపద్ధతులు=దూతను దండించు మార్గములు.

తా త్ప ర్య ము

తల గొఱిగించుట, యవయవహీనుఁగాఁ జేయుట, కొఱడాతోఁ గొట్టించుట కఱ్ఱుగాల్చి వాఁతలువేయుట- యీ మొదలయినవి దూతను దండించు విధము లని పెద్దలు చెప్పుదురు.

ఉ. అంతియకాని దూత వధ♦కర్హుఁ డటం చన నాలకింప, నీ
యంతటిధర్మవేత్తయుచి♦తానుచితార్థ వినిశ్చితాత్ముఁడున్
శాంతిని మాని కార్యములు♦ సల్పఁ గడంగిన నింక నే ధరా
కాంతులు సత్త్వవంతులు ప్ర♦గాఢతరాగ్రహ మాఁపువారలో? ౧౧౦౭

అర్థములు. ఉచిత+అనుచిత+అర్థ+వినిశ్చిత+ఆత్ముఁడున్ = ఇదితగును ఇది తగదు అనువిషయమును నిశ్చయింప యోగ్యుఁడు-ధరాకాంతులు=రాజులు; సత్త్వవంతులు=బలవంతులు.

తా త్ప ర్య ము

ఈ విధముగ దూతను దండింపుమని పెద్దలు చెప్పుచున్నారు గాని, దూతను జంపవచ్చునని యెవరును చెప్పఁగా నేను వినలేదు. నీవంటి ధర్మము తెలిసినవాఁడు ఉచితము అనుచితము అను విషయమున నిశ్చయమైన మనస్సు గలవాఁడు, కోపముతోఁ గార్యములు ధర్మవిరుద్ధముగఁ జేయఁబూనెనేని యిఁక బలవంతు లగు నే రాజులు మిగుల దురాగ్రహమును నణఁపఁగలరు. వారికి నీవే మార్గదర్శి వగుదువు గదా.

సుగంధి. ఆరయంగ ధర్మవాద•మందుఁ గాని లౌకికా
చారమందుఁ గాని సర్వ•శాస్త్రబోధనంబునన్
ధారణన్ భవత్సముండు•దానవామరాళులన్
వీరవర్య! లేఁడు సుమ్ము•నీవె మేటి వన్నిటన్. ౧౧౮౮

అర్థములు. ఆరయంగన్=విచారింపఁగా- బోధనంబునన్=జ్ఞానమందు-ధారణన్=జ్ఞప్తియందుంచుకొనుట-భవత్సముండు=నీతో సమానుఁడు.

తాత్పర్యము

చక్కఁగా విచారించి చూచిన ధర్మముగ వాదించు విషయమందుఁ గాని, లోకవ్యవహారము నడపుట యందుఁ గాని, సర్వశాస్త్రముల జ్ఞానమందుంగాని, చదివిన దానిని జ్ఞప్తియందుంచుకొనుటయందుఁ గాని, దేవతలందుఁగాక దానవులందుఁ గాని నీతో సమానుఁడొక్కఁడును లేఁడు. ఏ విషయ మందైనను నీవే గొప్పవాఁడవు.

క. ఈకోఁతిఁ జంపితేనియు, నేకార్యము గలదు? వీని•నెవ్వం డంపెన్
వీకున నవ్వానిని శిక్షాకలితుం జేయు టొప్పు•ఖ్యాతి యెసంగన్. ౧౧౮౯

అర్థములు. శిక్షాకలితున్=దండింపఁబడిన వానిని.

తాత్పర్యము

వీనిని జంపితి వనుకో-దానివలన రాఁగల లాభమేమి? విరోధ మంతతోఁ దీఱునా? కావున వీనిని బంపిన వాఁడెవ్వఁడో వానిని దండించినఁగదా లాభము గలదు. పగ యడఁగును. కీర్తి హెచ్చును. వేరట్టులే యుంచి యేదో యొక కొమ్మను గొట్టిన లాభమేమి?

క. ఖలుఁడైన సుజనుఁడైనం గొలువునకై చిక్కి పరుల•కుం దజ్జనముల్
పలికిన పలుకుల నొం డెడఁ, బలికెడు నద్దూతఁ జంప•భావ్యం బగునే?౧౧౯౦

తాత్పర్యము

మంచివాఁడో, చెడ్డవాఁడో కడుపుకూటి నిమిత్తము పరులకు లోఁబడి వారు చెప్పిన మాటలు మఱియొకచోటఁ జెప్పెడు దూతను జంప వచ్చునా?

సీ. ఇతని నీవు వధించి•తేనియు జలనిధి, దాఁటి రాఁజాలిన•దర్పఘనుఁడు
వేఱొక్కరుఁడు లేఁడు•వీఁ డిట మడిసిన, రాజపుత్రులకు నీ•యోజఁ దెలిపి
వారిని గొనివచ్చు•వాఁడును గలుగండు, కాన యుద్ధముమాట• కలుగఁబోదు
యుద్ధప్రియుండవు•యుద్ధసముత్కంఠ, రతులు నీ భటులు దు•ర్జయులు సుమ్ము

తే. యింద్రుఁడాదిగ దేవత•లెత్తిరేని, పోర నుత్సాహ మూను టే•పురుష గుణము
గాక నీయట్టివానికిఁ•గడకుఁ ద్రోయ, కగునె దూతను జంపకు•మసురనాథ!

అర్థములు. మడిసినన్ = చచ్చినయెడల, ఓజ=విధము-యుద్ధ సము

త్కాంతరతులు=యుద్ధమునందు విశేషము ప్రీతిగలవారు, దుర్జయులు=జయింప రానివారు.

తాత్పర్యము

ఇతని నీవు చంపితివా సముద్రము దాఁటి రాఁగల బలశాలి మఱి యొక్కఁ డుండఁడు. వీఁడిక్కడఁ జచ్చెనా యీవార్త రామలక్ష్మణులకుఁ దెలిపి వారినిఁ బిలుచుకొని వచ్చువాఁడును గలుగఁడు. కావున యుద్ధప్రసక్తి లేకయేపోవును. ఇక్కడ నింత ఘోర కార్యము వీనిచే జేయించిన దానికై వారిని నీవు దండింప వలసి యున్నది. కావున యుద్ధము మానుపని చేయరాదు. నీవు యుద్ధమునందా సక్తి గలవాఁడవు. యుద్ధమనిన భయపడు వాఁడవుగావు. నీ భటులో యుద్ధ మెప్పుడెప్పుడు వచ్చునా యని యెదురు చూచుటయందుఁ బ్రీతి గలవారు. యుద్ధమునందు జయింపరానివారు. ఇఁక యుద్ధమునకు నీవు జంకనేల? కావున నింద్రుడు మొదలైన వారందఱు దండెత్తి వచ్చినను యుద్ధము చేయుట యందు త్సాహమును వహించుటే మగతనము. దానిని నీవు తప్పింపఁ జూడరాదు. కావున దూతను జంపకుము.

క. హితులు మహామతులు,సమా,హితులు కులోద్భవులుశస్త్ర•భృత్ప్రాగ్రసరుల్
జితకాశులు యోధులు సం,భృతులు భవత్సైన్యపతులు•మేటిబలాఢ్యుల్.

హితులు=నీ మేలు గోరినవారు-మహామతులు=గొప్ప యాలోచన చేయఁ గలవారు, సమాహితులు=దానమానాదుల వశపఱుచుకొనఁబడినవారు-కులోద్భవులు=గొప్ప వంశమునఁ బుట్టినవారు-శస్త్రభృత్=ఆయుధముల ధరించిన వారి యందు-ప్రాగ్రసరుల్=శ్రేష్ఠులు-జితకాశులు=యుద్ధమునందు జయము నొందు వారు-ఏకవచనము జితకాశి- సంభృతులు=నీచే యుద్ధమునకై జీతములు గొని భరింపఁబడు వారు.

తాత్పర్యము

నీ సేవానాయకులు, నీ మేలు గోరువారు, మంచి యాలోచనలు సేయు వారు జీతములు బహుమానము లిచ్చి చేర్చుకొనబడినవారు, గొప్ప వంశములఁ బుట్టినవారు, ఆయుధములు ధరించువారిలో శ్రేష్ఠులు, యుద్ధములందు జయించు స్వభావము గలవారు, చక్కఁగ యుద్ధము చేయఁగలవారు; నీచే బోషింపఁబడు వారు, గొప్ప బలసంతులు.

క. వలసినచోఁ గొందఱు తమ, బలములతో దాడివెట్టి•పార్థివపుత్రుల్
నిలిచిన చోటికిఁ జని తమ,బలములు ప్రకటించు టదియ•పౌరుష మధిపా!

తాత్పర్యము

రాజకుమారుల మీఁదఁ బగసాధింపవలె ననితలంపు గలదేని కొందఱు తమసేనలతో దండెత్తి వారున్నచోటికిఁబోయి తమశక్తిసామర్థ్యములు చూపించుట పౌరుషముగాని యొక క్రోఁతిని దండించుట పౌరుషము గాదు. మేలుగాదు.

చూడుఁడు. అని గొంతెత్తి గట్టిగా రాక్షస భటులు కేకలు వేయఁగా పిల్లలు పెద్దలు ముదుసళ్ళు గుంపులు గుంపులుగా వచ్చి తోఁక గాలుచున్న హనుమంతుని సంతోషముతో వచ్చి చూచిరి. వారిలోఁ గొందఱు రాక్షసస్త్రీలు పరువెత్తి పోయి సీతాదేవితో.

క. ఎఱ్ఱని ముఖంబుతో గుఱుగు ఱని సీతోడఁ బల్కు♦క్రోఁతిని నసురుల్
బిఱ్ఱుగఁ గట్టియుఁ దోఁకను, జుఱ్ఱనఁ గాల్చుచును బురముఁ♦జుట్టెద రనినన్.

తాత్పర్యము

జానకీ! యెవఁడో యెఱ్ఱని ముఖములో గుఱ్ఱుగుఱ్ఱని నీతో ముచ్చటలాడెనే యా క్రోఁతిని బట్టుకొని రాక్షసులు బిఱ్ఱుగఁగట్టి తోఁకను చుఱ్ఱని కాలుచుచు నూరిలోఁ ద్రిప్పుచున్నారే యని చెప్పిరి.

దీనివలన వీరు సీతాదేవి కావలికత్తె లనియు, సీతాంజనేయుల సంభాషణమును గొందఱు వినుచుండి రనియు వారి మాటలు వారి కర్థము కాలే దనియు నేర్పడెను.

—♦ సీతాదేవి యగ్నిహోత్రునిఁ బ్రార్థించుట. ♦—

తే. మంగళాత్మిక సతి యాత్మ♦మరణతుల్య
మైన వాక్కులు విని వికచాంబుజాక్షి
శోకసంతప్త యయి కపి♦శుభముఁ గోరి
హుతవహుని గూర్చి యి ట్లని♦నుతి యొనర్చె. ౧౨౦౪

అర్థములు. మంగళ+ఆత్మిక=హనుమంతుని మేలుగోరు మనస్సుగలది. ఆత్మమరణతుల్యము=తన చావుతో సమానము-హనుమంతుఁడు చచ్చెనా తాను జచ్చినట్టే యని తలఁచునది. వికచాంబుజాక్షి=వికసించిన కన్నులు గలది శోకసంతప్త=వ్యసనముచే మిగులఁ దపించినది. హుతవహునిన్=అగ్నిహోత్రుని, నుతి=స్తోత్రము.

తాత్పర్యము

హనుమంతుని మేలుగోరుచున్న పతివ్రత యగు సీతాదేవి ముందుహనుమంతుని పరాక్రమము, రాక్షసవధ విని సంతోషముతో వికసించిన కన్నులు గలదై యుండినది. ఇప్పుడీ తన మరణముతో సమానమైన వార్త విని మిగుల వ్యసనపడి యాయన మేలుగోరి యగ్నిహోత్రు నిట్లు ప్రార్థించెను.

తే. భర్తశుశ్రూష యొనరించు♦పడఁతి నేని, దపములను నిష్ఠ సలిపిన♦తరుణి నేని
నేఁ బతివ్రత నగుటయు♦నిక్కమేని, హనుమయెడ శైత్యమూనుమీ♦యగ్నిదేవ

తాత్పర్యము

నేను బతిసేవ చేయు స్త్రీనై యుంటినా, నేను దపమును నిష్ఠతో సలిపి యుంటినా, నేను నిజముగాఁ బతివ్రతనైతినా, యగ్నిహోత్రుఁడా! హనుమంతునకు శీతలుండ వగుము.

విజృంభించి మండు నగ్ని వృద్ధిచెందునట్లు తనదేహము వృద్ధిచేయఁ దొడఁగెను. వారును జెలరేఁగి తోఁకకు నిప్పంటించిరి. అది చూచి హనుమంతుఁడు బాల సూర్యునివలెనై మిగులఁ గోపించి యా తోఁకతోనే వారి నట్టె కొట్టెను. తోఁక గాలుచుండుట చూచి పిల్లలు, పెద్దలు, స్త్రీలు చాల సంతోషించిరి.

—♦ రాక్షసులు తోఁకఁ గాల్చుచుండ హనుమ యాలోచించుట ♦—

సీ. తనచుట్టు ముట్టి యా♦మనుజాశు లేపఁగఁ, దనలోన నిట్లని♦తలఁచె హనుమ
కర్తవ్య మెద్ది యి♦క్కాలంబునను నాకు, వీరు కట్టిరి గాక♦కోరినంత
నా కడ్డమే త్రెంచి♦వీకునఁ బాశముల్, గాల రాచనె వీరి♦నేలఁబెట్టి
భర్తృహితార్థమై♦పరఁగన యేనియు; రావణాసురు నాజ్ఞ♦రాక్షసులును

ఆ. నన్నుఁ గట్టి కీడు♦నా కొనరించిన,వారు గార; యిది శు♦భంబె చూడ;
రణమునందు నెల్ల♦రాకాసులను గూల్ప, నొకఁడ నేర్తునైన♦నోర్చువాఁడ.

అర్థములు. కర్తవ్యము=చేయఁదగినది.

తాత్పర్యము

ఇట్లు రాక్షసు లందఱు చుట్టుకొని బాధింపఁగా హనుమంతుఁ డిట్లు లాలో చించెను. వీరు నన్నుఁ గట్టిరి గదా! ఇప్పుడు నేను జేయఁదగిన పని యేది? నేను విడిపించుకొనవలయు ననిన వీరు నా కడ్డమా? త్రాళ్లూడఁదీసికొని వీరి నందఱను నేలఁబెట్టి కాల రాపనా? అయినను ఆక్రోశమునకు సమయముగాదు. భర్తకేది మేలో యది నే నాలోచింపవలయును. ఇంతకు వీరి నిప్పుడు నేనేల కొట్టవలె! రావణాసురు నాజ్ఞప్రకారము వీరు నన్నుఁ గట్టి నా కేమియుఁ గీడు చేసిన వారు గారు. మేలే చేయుచున్నారు. ఈ రాక్షసుల నందఱను గొట్టవచ్చును. గాని సహించు కొనెదను. ఏలననఁగా:—

తే. రాత్రివేళను దుర్గక♦ర్మంబు తెలియఁగు, సాధ్యపడ దయ్యె నెల్లను♦జక్కఁజూడ
నే నిశాక్షయమం దొప్పు♦నెల్లఁజూడ, నవనిభర్తకు నయ్యది♦హర్ష మొసఁగు.

తాత్పర్యము

కోటలు కట్టిన విధము రాత్రివేళ చక్కఁగాఁ జూడ సాధ్యపడినది గాదు. యుదయ కాలమున నంతయుఁ దిరిగి చూచితినేని రాజున కది సంతోషకరముగ నుండును.

ఉ. కావున వీరు నన్నుఁ బెడ♦కట్లను గట్టినఁ గట్టనిమ్ము, మై
కావర మెత్తి కాల్చినను♦గాల్పఁగ నిమ్మటు లిట్టు లీడ్చిరా
హావడి నీడ్వ నిమ్ము, హృద♦యవ్యథ యేమియు లేదు, దైత్యచే
ష్టావిపరీత వర్తనల♦సర్వముఁ దీర్చెద వడ్డితో వెసన్. ౧౯౯

తా త్ప ర్య ము

కాఁబట్టి నన్ను వీరు తెళ్ళలు విఱిచి కట్టిరా కట్టనిమ్ము, గర్వించి నా దేహమును గాల్చిరా కాలుపనిమ్ము. ఆ ప్రక్క కీప్రక్క కీడ్చిరా యీడ్వనిమ్ము. మనస్సున నాకేమియు బాధలేమ. వీరి విపరీత చేష్టల నన్నిటిని వడ్డితోఁ గూడ నప్పు తీర్చెదను.

ఉ. ఇప్పగిదిం దలంచు నెడ నెంతయుఁ గేరుచు రాక్షసాగ్రణుల్
దప్పక శంఖభేరినినదంబులతోఁ బురి వాడవాడలన్
ద్రిప్పిరి యొప్పి రెంతయును దిట్టిరి కొట్టిరి కొంద ఱార్చుచున్
జప్పటు లొప్పఁ గొందఱును సంభ్రమ మారఁగ వెంట నంటఁగన్. ౧౨౦౦

తా త్ప ర్య ము

హనుమంతుఁ డిట్టు లాలోచించు చుండఁగా రాక్షసులు విజృంభించి శంఖములు భేరులు వాయించుచు వాడ వాడఁ ద్రిప్పిరి. ఒప్పిరి, కట్టిరి, కొట్టిరి, తిట్టిరి. కొంద ఱఱచుచుఁ జప్పట్లు కొట్టుచుఁ గూడవచ్చిరి.

చ. హనుమ యథాసుఖంబుగను నాశరపంక్తులు వెన్నడింపఁగాఁ
గనుఁగొనెఁ దత్పురంబునను గ్రంతయుఁ గ్రంతయు సందు సందు నొ
య్యనఁ జని వాడ వాడయును నాయతవీథులు గూఢదేశముల్
ఘనగృహకాంతరంబులు నగారములున్ విలసద్విమానముల్. ౧౨౦౧

అర్థములు. ఆశరపంక్తులు=రాక్షసుల గుంపులు- వెన్నడింపఁగా=వెంటఁ రాఁగా-క్రంతయు=రచ్చ-సందు=సన్నత్రోవ, గూఢదేశముల్=రహస్యప్రదేశములు, ఘనగృహకాంతరములు=పెద్దయిండ్లకుఁ గల రహస్యపుఁ ద్రోవలు- 'ప్రచ్ఛన్న ద్వారమంతర'మ్మని వైజయంతి అగారములు=సాధారణ గృహములు విమానములు=మేడలు.

తా త్ప ర్య ము

రాక్షసులు వెంట రాఁగా హనుమంతుఁడు కష్ట మనునది లేక, యా నగరంబున సందు సందు, గొంది, గొంది, వాడ వాడ, వీథి, వీథి రహస్యప్రదేశములు, పెద్ద యిండ్లకుగల దొంగద్రోవలు, సాధారణ గృహములు, పెద్దమేడలు తిరిగి తిరిగి చూచెను.

మ. ఇతఁడే చారుఁడు చూడుఁ డోయసురు లం చెల్గెత్తి రక్షోభటుల్
వితతారావము నింప గుంపు లగుచున్ వృద్ధుల్ శిశుల్ స్త్రీలు దీ
పితలాంగూలు సమీరనందనుని సంప్రీతిం గనన్ వచ్చి, రా
వితముం గొందఱు రాక్షసాంగనలు పృథ్వీపుత్రితో జానకీ! ౧౨౦౨

అర్థములు. చారుఁడు=వేగువాఁడు, ఎల్గెత్తి=గొంతెత్తి-బిగ్గఱగా, వితతారావము=విస్తారధ్వని, దీపితలాంగూలు = మండుచున్న తోఁకగలవాని, వితమున్=విధము.

తా త్ప ర్య ము

ఓ రాక్షసులారా! వీఁడే మన యూరికి వచ్చిన వేగులవాఁడు. రండు.

చూడుఁడు. అని గొంతెత్తి గట్టిగా రాక్షస భటులు కేకలు వేయఁగా పిల్లలు పెద్దలు ముదుసళ్ళు గుంపులు గుంపులుగా వచ్చి తోఁక గాలుచున్న హనుమంతుని సంతోషముతో వచ్చి చూచిరి. వారిలోఁ గొందఱు రాక్షసస్త్రీలు పరువెత్తి పోయి సీతాదేవితో.

క. ఎఱ్ఱని ముఖంబుతో గుఱుగు ఱని సీతోడఁ బలు-క్రోఁతిని నసురుల్
బిఱ్ఱుగఁ గట్టియుఁ దోఁకను, జుఱ్ఱనఁ గాల్చుచును బురముఁజుట్టెద రనినన్.

తాత్పర్యము

జానకీ! యెవఁడో యెఱ్ఱని ముఖముతో గుఱ్ఱుగుఱ్ఱని నీతో ముచ్చటలాడెనే యా క్రోఁతిని బట్టుకొని రాక్షసులు బిఱ్ఱుగఁగట్టి తోఁకను చుఱ్ఱని కాలుచుచు నూరిలోఁ ద్రిప్పుచున్నారే యని చెప్పిరి.

దీనివలన వీరు సీతాదేవి కావలికత్తె లనియు, సీతాంజనేయుల సంభాషణమును గొందఱు వినుచుండి రనియు వారి మాటలు వారి కర్థము కాలే దనియు నేర్పడెను.

—• సీతాదేవి యగ్నిహోత్రునిఁ బ్రార్థించుట. •—

తే. మంగళాత్మిక సతి యాత్మ•మరణతుల్య
మైన వాక్కులు విని వికచాంబుజాక్షి
శోకసంతప్త యయి కపి•శుభముఁ గోరి
హుతవహుని గూర్చి యి ట్లని•నుతి యొనర్చె. ౧ ౨౦౪

అర్థములు. మంగళ+ఆత్మిక=హనుమంతుని మేలుగోరు మనస్సుగలది. ఆత్మమరణతుల్యము=తన చావుతో సమానము-హనుమంతుఁడు చచ్చెనా తాను జచ్చినట్టే యని తలఁచునది. వికచాంబుజాక్షి=వికసించిన కన్నులు గలది శోకసంతప్త=వ్యసనముచే మిగులఁ దపించినది. హుతవహునిన్=అగ్నిహోత్రుని, నుతి=స్తోత్రము.

తాత్పర్యము

హనుమంతుని మేలుగోరుచున్న పతివ్రత యగు సీతాదేవి ముందుహనుమంతుని పరాక్రమము, రాక్షసవధ విని సంతోషముతో వికసించిన కన్నులు గలదై యుండినది. ఇప్పుడీ తన మరణముతో సమానమైన వార్త విని మిగుల వ్యసనపడి యాయన మేలుగోరి యగ్నిహోత్రు నిట్లు ప్రార్థించెను.

తే. భర్తశుశ్రూష యొనరించు•పడఁతి నేని, దపములను నిష్ఠ సలిపిన•తరుణి నేని
నేఁ బతివ్రత నగుటయు•నిక్క-మేని,హనుమయెడ శైత్యమూనుమీ•యగ్నిదేవ

తాత్పర్యము

నేను బతిసేవ చేయు స్త్రీనై యుంటినా, నేను దపమును నిష్ఠతో సలిపి యుంటినా, నేను నిజముగాఁ బతివ్రతనైతినా, యగ్నిహోత్రుఁడా! హనుమంతునకు శీతలుండ వగుము.

క. ఇనకులతిలకుం డగు రా,మునకు న్నామీఁదఁ గరుణ•మొనయున యేనిన్
గన భాగ్యశేష నేనియు, హనుమయెడన్ శీతలుండ•వగుము హుతాశా!

తా త్ప ర్య ము

సూర్యవంశము వారిలో శ్రేష్ఠుఁ డగు శ్రీరామచంద్రమూర్తికి నా మీఁద దయ గలదేని, నాకింకను గొంచెము భాగ్యమనుభవించు నదృష్టము గలదేని యగ్నిదేవా? హనుమకు శీతలుండ వగుము

క. ఘనమతి రాముని కూటమి, ననవరతముఁ గోరుదాన•ననుచున్ శుభశీ
ల న టంచు నతఁడు నమ్మిన హనుమయెడన్ శీతలుండ•వగుము హుతాశా!

తా త్ప ర్య ము

గొప్ప మనస్సుగల రామచంద్రునితోడి సాంగత్యము నే నెల్ల వేళఁ గోరుచుండు దాన నని, మంచి నడవడి గలదాన నని హనుమంతుఁడు నమ్మియుండెనా యాయనకు నగ్ని దేవా శీతలుండ వగుము.

తే. సత్యసంగరుఁ డైన భా•స్కరసుతుండు
సరగ సుగ్రీవుఁ డిట వచ్చి•సతము నన్ను
ముంచు శోకాబ్ధినుండి దాఁ•టించు నేని
హనుమయెడ శైత్య మూనుమీ•యగ్నిదేవ! ౧౨౦౮

తా త్ప ర్య ము

వంచనలేక యుద్ధము చేయుసుగ్రీవుఁడు శీఘ్రముగ నిటకువచ్చి, విడువక నన్ను బాధించు నీ శోకసముద్రమునుండి దాఁటించుట సత్యమేని యగ్నిదేవా! హనుమంతుని యెడ శీతలుండ వగుము.

హనుమంతుని విషయమున నగ్నిహోత్రుఁడు చల్లవాఁడయ్యెనా యివన్నియు సత్యము లని భావము.

రామచంద్రమూర్తి బ్రహ్మాస్త్రము సంధించి నిన్ను రూపు మాపెద నని బెదరించినను సముద్రుఁడు నా స్వభావగుణము నేను విడువ నని చెప్పఁ గలిగెను గాని సీతాదేవి మాట మాత్రమునఁ దన దాహకశక్తి వదలి యగ్ని చల్లపడెను. ఎంతటి మహాత్ములకైనను బురుషులకు సాధ్యము గానిది, పతివ్రత లగు స్త్రీలకు సుసాధములని యెఱుంగ నగు.

కొంద ఱీ యశోకవనమున నుండునది యింద్రజాలపు సీత యని, యిదిమాయా రూప మని వ్రాసియున్నారు. మాయారూపములకు రావణుని భస్మము చేయఁ గల నను శక్తియు-నగ్నిహోత్రుని జల్లనగాఁ జేయు పాతివ్రత్యమహిమయుఁ గలుగునేమో పాఠకు లాలోచింపవలెను. ఈ మాయాసీత పతి శుశ్రూష చేసినది కాదు. తపము లాచరించినది లేదు. ఇటి మాయాసీత మాటలకు నగ్ని హోత్రుఁ డెట్లు చల్లపడెను. ఈ మాయాసీత భాగ్యశేష గాదు. ఏలన

నగ్నిహోత్రములోఁ బ్రవేశించినపుడు రూపులేకపోయెను. ఆనల సుఖ మనుభవించినది లేదు. కావున నీ మాయాసీత వాక్యము లెట్లు సత్యము లయ్యెను.

సుగ్రీవుఁ డీమాయా సీతను దుఃఖమునుండి దాఁటించినవాఁడు కాఁడయ్యె. కావున నీమె యథార్థసీతయే కాని మాయాసీత గాదు.

అష్టాక్షర మంత్రమందు (౧) ప్రణవము (౨) నమస్సు. (౩) చతుర్థీ విభక్తి యుక్తమైన నారాయణపదము గలవు. అందుఁ బ్రణవము జీవాత్మ పరమాత్మకే యుపకరణము, ఆయన సేవకే జీవాత్మ వినియోగపడవలయునని తెలుపును. (౨) నమస్సు, స్వాతంత్ర్య రాహిత్యమును కేవల పారతంత్ర్యమును దెలుపును. (౩) భగవత్ప్రియమైన భాగవత సేవ దెలుపును. భాగవతసేవ భగవత్ప్రీతికరము. ఈ విషయములు పూర్వకాండముల వివరింపఁబడెను. ఈ మూఁటియందు మొదటిది లక్ష్మణుఁడు, రెండవది భరతుఁడు, మూఁడవది శత్రుఘ్నుఁడు ననుష్ఠానముచే దెలిపిరి. ఈ మూఁటిని సీతాదేవియొక్కతేయే యనుష్ఠించి చూపెను. ఎట్లన "ఉర్వీజ నీవును గూడి యాడుచున్ గొండల పేటులన్ నిదుర గూరియున్నను మేలుకొన్నఁ గోదండ ధరుండనై మెలఁపు దాలిచి సర్వము నేనతీర్చెదన్" (అయోధ్య౮౧౮) అని చెప్పి యా ప్రకారము యావజ్జీవము లక్ష్మణుఁడు శుశ్రూష చేయుచుండెను. భరతుఁడు "ఈ రాజ్యము నేను రాముని విట్టగుటన్ నీవ చెప్పుమీ ధర్మగతిన్ (అయోధ్య ౧౮౫౮) అని చెప్పి కేవల పరతంత్రుఁడై రాముఁడులేనియయోధ్య యందుండ నొల్లక పల్లెటూర వానప్రస్థునివలె వసించెను.

శత్రుఘ్నుఁడు (అయోధ్య ౨) రామపరతంత్రుఁడై భాగవతుఁడైన భరతునకుఁ బ్రీతికరముగ వర్తించుచుండెను.

సీతాదేవి భర్తృశుశ్రూష నొనరించు పడఁతినేని యని తెలిపి తన రామకైంకర్యమును స్థిరపఱిచెను. రావణుని దగ్ధము చేయనని, హనుమంతుని వెంటరానని చెప్పి యట్లు చేయుటకు, దాను స్వతంత్రురాలఁగానని తెలిపి తన పారతంత్ర్యమును బ్రకటించెను. (౩) ఇప్పుడు రామదాసుఁడగు హనుమద్భాగవతునకు నపాయము లేకుండఁ జేసి భాగవతప్రీతి కనఁబఱిచెను.

ధర్మసందేహము:—"శీతో భవ" చల్లగాఁ గమ్మని యనిన మాత్రముననే యగ్నిహోత్రుఁడు చల్లనయ్యెను. అట్టులే "హతో భవ" చావుము అని చెప్పియుండిన రావణుఁడు చచ్చియుండును. ఈ నిదర్శనముఁబట్టి యంతటిశక్తి యీమెయందుఁ గలదని యంగీకరింపవలసినదే. కాని రావణుతో నిన్ను దగ్ధునిఁ జేయఁ గలను గాని నా భర్త యాజ్ఞ లేదు. కావున నాతపస్సు వ్యర్థమై పోవుట యొల్లను. కావున నిన్ను శపింపనని చెప్పెనుగదా. హనుమంతుని రక్షించుటకు మాత్రము భర్తయాజ్ఞగలదా? దీని వలనఁ దపోహాని లేదా.

పరిహారము : సీతాదేవి యీ కార్యమును దుష్టకామక్రోధ లోభములకు

వశపడి చేయలేదు. ఇది పరహింసాత్మకమైనది కాదు. స్వధర్మ విరుద్ధమైనది కాదు. కావునఁ దపోహాని లేదు. దయ యాధారముగాఁ గల పరోపకారముఁ అవశ్యకర్తవ్యమైన మిత్రభాగవత భర్తృహితలక్షణముఁ స్త్రీలకు రక్షాకార్యము స్వధర్మము. బిడ్డలను రక్షించుటయందు భర్తకుఁ గల స్వాతంత్ర్యము భార్యకుఁ గలదు. మగని నడిగి భార్యబిడ్డల కన్నము పెట్టవలసిన పనిలేదు. దానికి భర్త యాజ్ఞ యనావశ్యకము. సీత సహధర్మచారిణి కదా. దీని వలనఁ బారతంత్ర్య హాని లేదు. ఆత్మరక్షార్థము ప్రవర్తించినది కాదు గదా. పారతంత్ర్యమనునది స్వరక్షావిషయమే. నే నిట్లు చేసెదను. దీని నీ వంగీకరింపుమని భర్తకుఁ జెప్ప లేదు. భర్తచేయవలసిన కార్యము తాను చేయలేదు. భర్తచేయవలసిన పని యాయన యాజ్ఞ లేక స్వతంత్రించి తాను జేసిననే పారతంత్ర్యహాని కాని స్వధర్మ నిర్వహణమందు భర్తయాజ్ఞతోఁ బనిలేదు.

వధ స్త్రీ కార్యము గాదు పురుష కార్యము. అట్టిదానిని భర్తయనుజ్ఞ లేక తన సుఖమునకై స్వతంత్రించి చేసినఁ బారతంత్ర్యహాని. క్రోధమునకు వశపడు టచే దపోహాని. నేను విడిచి పోవుచున్నాను. నిన్ను నీవు కాపాడుకొమ్మని నలుఁడు చెప్పినట్లు రామచంద్రమూర్తి చెప్పలేదు. కావున సీతాదేవి చేసినది యకార్యముగాదు. ఇంతకు సీతాదేవి యగ్నిని బ్రార్థించెను గాని నా తపో బలముచే నీ విట్లు కమ్మని శాసింపలేదు.

—♦ అగ్ని చల్లనైనందుకు హనుమంతుఁ డాశ్చర్య పడుట. ♦—

సీ. అని వేఁడు సీతకు♦హనుమంతు సేమంబు, వచియించువిధమున♦వహ్ని సప్ర
దక్షిణశిఖుఁ డయి♦తనరెను; దేవిపై, వాలాగ్నియుతుఁ డయ్యె♦వాయువపుడ
ప్రాలేయమారుత♦ప్రాయుఁ డై వీచెను, హనుమయుఁ దనలోన♦నచ్చెరువడుచు
ధగ ధగ మండియుఁ♦దాపంబుఁ గూర్పఁడు, శీతలుం డై వహ్ని♦హేతు వేమొ
ఆ. తెలిసెఁ దెలిసె రామ♦దేవునిమహిమను, మల నొకండు వార్ధి♦మధ్యమునను
గనుచు నక్కజంబు♦గొనితి నియ్యదియును, నతనిమహిమ సంది♦యంబు లేదు.

అర్థములు. సప్రదక్షిణ శిఖుఁడయి=ప్రదక్షిణముగాఁ దిరుగుచున్న శిఖలు గలవాఁడయి-ప్రాలేయమారుత ప్రాయుఁడై =మంచు మీఁది నుండివచ్చు గాలి వంటి వాఁడై.

## తాత్పర్యము

ఈ ప్రకారము ప్రార్థించు సీతాదేవికి హనుమంతున కపాయము లేదని తెలుపు వానివలె నగ్నిశిఖలు ప్రదక్షిణముగఁ దిరుగు వాఁడయ్యెను. కాలుచున్న తోఁక మీఁదనుండి వచ్చుగాలియు వేఁడిగ రాక మంచుగాలి వచ్చునట్లు చల్లగా నామెపై వీచెను. ఇట్లు లగ్ని తన్నుఁ గాల్పక చల్లగా నుండుట చూచి హను మంతుఁ డాశ్చర్యపడి యిదియేమి యాశ్చర్యము, అగ్ని చల్లగానున్నాఁడు. దీని కేమి కారణము అని యాలోచించి తెలిసెఁ దెలిసెను. పూర్వము సముద్రము

దాఁటి వచ్చునపుడు పర్వతము, సముద్రము సాహాయ్యము చేయుట చూచితిని. అది రామదేవుని మహిమయే కదా. ఇదియును నాయన మహిమయే. ఆయన నా కిచ్చిన రామముద్రిక నా తోడ నుండి నన్ను నాపదలేకుండఁ కాపాడెను. ఇప్పుడు సీతాదేవి చూడామణి నా యొద్ద నున్నది. అది నన్నుఁ గాపాడఁగలదు.

క. జడధియు మైనాకుండును, గడుకొని శ్రీరాముపట్లఁ♦గాన్పించినకై
వడి నేల యగ్నియును దోఁడ్పడి శుభముం గూర్పకుండు♦వాఁడు దలంపన్.

తాత్పర్యము

సముద్రుఁడు మైనాకుఁడు శ్రీరామునిపట్ల కానుపించిన ప్రీతిని, నగ్ని హోత్రుఁడు మాత్ర మేల కనఁబడఁజేయకుండును. ఇదియు రామచంద్రమూర్తి మహిమయే. తన కార్యముచేయు నాకు శ్రీరామచంద్రమూర్తి యేల యపాయము రానిచ్చును. మేలే కలిగించును.

దీనివలన నిర్వంచనముగ రామకైంకర్యము చేయువారికి శ్రీరామచంద్ర మూర్తి యపాయములు రానీయఁడు. సాహాయ్యమే చేయునని భావము. ఒంటిమిట్ట శ్రీరామచంద్రుకైంకర్యము చేయు సమయంబున నిది యీ గ్రంథకర్తకు ననుభవ విదితమే. 'యత్ర రామో భయం నాత్ర నాస్తి తత్ర పరాభవ' యనుట మూఁటికి ముమ్మాటికి సత్యము.

క. సీతాసతిదయచేతను, సీతాహృదయేశు మహిమ♦స్వీయసఖు తనూ
జాతుఁడ నగుటను నాయెడఁ, బ్రీతిం గొని పావకుండు♦వేఁడిమి మానెన్.

తాత్పర్యము

పతివ్రతయగు సీతాదేవి దయచేతను, ఆమె భర్తయగు శ్రీరామచంద్ర దేవు మహిమచేతను, తన మిత్రుని కొడుక నగుటచేతను అగ్నిహోత్రుఁడు నాయందుఁ బ్రీతి గలవాఁడై వేఁడిమి చూపకున్నవాఁడు.

చ. అని తలపోసి కొంతవడి♦యార్భటులన్ దెస లెల్లనించి చి
వ్వున గిరిశృంగతుల్యమయి♦పూర్వసుపర్వ నికాయహీన మై
తనరు పురంబు వాకిటికి♦దాఁటి గిరీంద్రనికాశ దేహుఁ డా
హనుమఁడు హ్రస్వుఁ డైనను ద♦మంతట బంధము లెల్ల నూడినన్. ౧౨౧౨

అర్థములు. కొంతవడి=కొంత సేపు, ఆర్భటులన్=సింహనాదములచే-గిరిశృంగ తుల్యమయి=పర్వతశిఖరముతో సమానమయి, పూర్వసుపర్వ నికాయ హీనమై=రాక్షసుల గుంపులేనిదై, గిరీంద్ర నికాశ దేహుఁడు=పెద్దపర్వతముతో సమానమైన దేహము గలవాఁడు-హ్రస్వుఁడైనను=పొట్టివాఁడు కాఁగా.

తాత్పర్యము

ఈ ప్రకారము కొంత సే పాలోచించి సింహనాదముచేసి పర్వత శిఖరము వలె నెత్తై రాక్షసులు లేని లంకానగరద్వారము గోపురము మీఁదికి చివాలున

దాఁటి పర్వతమువలె నున్న తన దేహమును జిన్నదిగాఁ జేయఁగాఁ గట్టినకట్టులు వదులు పాఱి వా నంతట నవియే జాఱిపడిపోఁగా.

క. శ్రీమంతుఁ డాత్మ వంతుం, డౌ మారుతసంభవుం డ౯హార్యసమం బౌ
 భీమాకృతి మఱలం గొని,యీ మెయి నా మెయిని బాఱ౯వీక్షించి రుషన్.

అర్థములు. శ్రీమంతుఁడు-ఆత్మవంతుఁడు=ఇవి రెండు మారుత సంభవుఁ డను పదమునకు విశేషణములు. శ్రీమంతుఁడు=లక్ష్మీకటాక్షమునకుఁ బాత్రుఁడైన వాఁడు-ఆత్మ యనఁగా విష్ణువు-ఆయన యనుగ్రహమునకుఁ బాత్రుఁడై నవాఁడు-ఆత్మవంతుఁడు=లక్ష్మీనారాయణుల యనుగ్రహమునకు, అనఁగా సీతారాముల యనుగ్రహమునకుఁ బాత్రుఁడైన వాఁడు, మారుతసంభవుఁడు=హనుమంతుఁడు-ఆహార్యసమంబు=పర్వతముతో సమానమైనది. భీమాకృతిన్=భయంకరమైన యాకారమును-ఈమెయి నామెయి=ఈ ప్రక్క నా ప్రక్క.

తాత్పర్యము

సీతారాముల కటాక్షమునకుఁ బాత్రుడైన హనుమంతుఁ డీ ప్రక్క నా ప్రక్క చూచి పూర్వపు భయంకరాకారమును మఱలఁ గైకొని.

తే. తోరణాశ్రిత మైనట్టి౯దొడ్డ గుదియ, సరగఁ గైకొని కావలి౯సురవిరోధి
 వారములగూల్చి ప్రజ్వల౯ద్వాలుఁడగుచు, నంశుమాలినిబోలి యు౯ట్లాత్మఁదలఁచు.

అర్థములు. తోరణాశ్రితము=ద్వారము నొద్ద నుండిన, సరగన్=వేగముగ, ప్రజ్వలత్+వాలుఁడు=మండుచున్న తోఁక గలవాఁడు, అంశుమాలిని=సూర్యుని, దీనివలన సూర్యుఁడు కొంచెము పైకి వచ్చినాఁ డని సూచన.

తాత్పర్యము

ద్వారమువద్ద నున్న గడియమ్రాఁకును దీసికొని శీఘ్రముగ నందు కావలి యున్న రాక్షసులఁ జంపి తోఁక మండు చుండఁగా సూర్యునివలె నై యిట్లాలో చించెను.

—౯ ౫౪-వ సర్గము. హనుమంతుఁడు లంకఁ గాల్చుట. ౯—

క. కర్తవ్యం బెది యింకిట? మార్తురకును దుఃఖపీడ౯ మఱి మఱి కలుగన్
 వర్తింపవలయు సీతా,భర్తకుఁ గార్యంబు సుకర౯పడు నట్లైనన్. ౧౨౧౫

అర్థములు. కర్తవ్యంబు=చేయఁదగిన కార్యము, మార్తురకును=శత్రువు లకు.

తాత్పర్యము

ఇంక నేను జేయవలసిన పని యేమి? శత్రువులకు దుఃఖబాధ విశేషముగఁ గలిగింపవలయును. అట్లు చేసితినేని రామకార్యము సులభముగ నగును. లంకా పౌరులకు బాధ గలిగించితినేని యీ బాధ రావణువలనఁ గలిగి దన పౌరుని లందఱు వానిపట్ల విరోధభావము వహింతురు. అప్పుడు వారిలో

వారికి భేదము పుట్టును. సీతను మఱల నిమ్మని చెప్పువా రుందురు. వినఁడేని రాము పక్షము వహించు వా రేర్పడుదురు. కావున నీ రాక్షసులకు బాధ కలిగింపవలెను.

క. చెండితి నశోకవనమున్, ఖండించితి రాత్రిచరుల♦కాండము సేనా
దండ మొక కొంత ద్రుంచితి, గండున దుర్గాళిఁ. జెఱుచు♦కార్యమ మిగిలెన్.

తా త్ప ర్య ము

అశోకవనమును బాడు చేసితిని. ఇది రావణునకు వాని స్త్రీలకు నప్రియ కార్యము. దీనివలన స్త్రీలు రావణునకు సీత నిమ్మని యీమె వలన నీయనర్థము కలిగె నని చెప్పువారై యుందురు. కొందఱు రాక్షసులఁ జంపితిని. వారివారు రావణు దూషించు వా రగుదురు. సేనలోఁ గొంచెము భాగము నాశము చేసితిని. వీరిక స్థానమైన కోటలు, బురుజులు మిగిలి యున్నవి. వానిని జెఱుప వలయును.

ఉ. ఇంచుక యత్న మూని పుర♦మెల్లను నాశము జేయ మత్క్రియా
సంచయ మెంతయున్ ముగియు♦సార్థక మయ్యెడు మచ్ఛ్రమంబు; వా
లాంచలహవ్యవాహునకు♦నాహుతిచేయుట న్యాయ్య మీ గృహో
దంచితపత్తనం బనుచుఁ♦దద్భవనాళిపయిం జరించుచున్. ౧౨౧౭

అర్థములు. మత్క్రియాసంచయము=నేను జేయవలసిన పనులు-సార్థకము=ప్రయోజనముతోఁ గూడినది, మచ్ఛ్రమంబు=నేను పడిన కష్టము-వాలాంచల=తోఁక కొన నున్న, హవ్యవాహునకున్=అగ్నికి-గృహోదంచిత పత్తనము=ఇండ్లచేఁ బ్రకాశించు నగరము-తత్+భవనాళిపయిన్=ఆ యిండ్ల మీఁద.

తా త్ప ర్య ము

ఇంకఁ గొంచెము ప్రయత్నము చేసి యీనగరమును నాశనము చేసితి నేని నేను జేయవలసిన కార్యములన్నియు ముగియును. నేను బడిన శ్రమము ఫలించిన దగును. నాకు నుపకారముచేయు నగ్నిహోత్రునకుఁ బ్రత్యుపకారముగ నాతోఁక కొన నుండు నగ్నిహోత్రునకు నీ యిండ్లన్నియు నాహుతిగా నిచ్చుట న్యాయ్య మగును. అని యీ యిండ్ల మీఁద దిరుగ నారంభించెను.

క. శంపాయుతతోయద మనఁ, గంపింపక హనుమ లంకఁ♦గలయిల్లిల్లున్
దెంపునఁ జొచ్చుచు దాహన, లంపటుఁ డై తిరిగెఁ దోఁట♦లన్ సౌధములన్.

అర్థములు. శంపాయుత తోయదము=మెఱుపులతోడి మేఘము, కంపింపక సందేహభయములచేఁ జలింపక, దాహన లంపటుఁడై=కాల్చుటయందాసక్తి గలవాఁడై.

తా త్ప ర్య ము

మెఱుపులతోడి మేఘమువలె జలింపక హనుమంతుఁడు లంకలోఁగల యిల్లిల్లు తోఁట తోఁట మేడ మేడ, దూఱినవాఁడై సర్వము కాల్చుటయందాసక్తిగల వాఁడయ్యెను.

సీ. మంత్రిప్రహస్తుని•మందిరంబున మహా, పార్శ్వుని గృహమున•వజ్రనాభు
సదనంబునను శుక•సారణాలయముల, నింద్రజిత్తు వసించు•నింటియందు
జంబుమాలి సుమాలి•సౌధశీమంబుల, రశ్మికేతుని వాటి•రవివిరోధి
హ్రస్వకర్ణుల భవ•నాంగణంబులయందు, దంష్ట్రిరోమశమ త్త•తలములందు
తే. వలను మెఱసి యుద్ధోన్మత్తు•నిలయమందు,నల ధ్వజగ్రీవదైత్య గే•హంబునందు
ఘోరహస్తి ముఖాఖ్యుల•కూటములను, నోజ మెఱయ విద్యుజ్జిహ్వు•డున్నవీట.

అర్థములు. మందిరము- గృహము- సదనము- ఆలయము- భవనము- నిలయము- గేహము- కూటము- వీడు వాసతలము- వీని కన్నిటికి నిల్లని యర్థము. ప్రహస్తుఁడు, ముఖ్యమంత్రి గావున 'ప్రథమాం పిబతే వహ్నిః' యన్నట్లు మొదట వాని యింటికే చిచ్చుపెట్టెను.

తాత్పర్యము

ప్రహస్తుఁడు, మహాపార్శ్వుఁడు, వజ్రనాభుఁడు, శుకసారణులు, ఇంద్రజిత్తు జంబుమాలి, సుమాలి, రశ్మికేతుఁడు, సూర్యజిత్తు, హ్రస్వకర్ణుఁడు, దంష్ట్రుఁడు, రోమశుఁడు, మత్తుఁడు, యుద్ధోన్మత్తుఁడు, ధ్వజగ్రీవుఁడు, హస్తిముఖుఁడు, విద్యుజ్జిహ్వుఁడు, కరాళుఁడు, పిశాచుఁడు, శోణితాక్షుఁడు, కుంభకర్ణుఁడు, మకరాక్షుఁడు, కుంభుఁడు, బ్రహ్మశత్రువు, నికుంభుఁడు, యజ్ఞశత్రువు వీర లుండు నిండ్లకు నిప్పుపెట్టెను.

తే. సారిదిగఁ గరాళుని పిశాచు•శోణితాక్షు, కుంభకర్ణుని మకరాక్షు•కుంభుబ్రహ్మ
శత్రుని నికుంభు మఱి యజ్ఞ•శత్రు వాసతలములం దెల్ల నగ్ని ని•గాలిపెఁగవిసి.
(యీ పద్యమునకు ౧౬౧౧ పద్యమునకుఁ గలిపి తాత్పర్యములు వ్రాయఁబడినవి.)

చ. విడిచి విభీషణాలయము•వేమఱుఁ గ్రుమ్మరి యొక్కఁ డేనియున్
విడివడకుండఁదక్కఁగల•వీడుల నన్నిటిఁ గాల్చి యంతటన్
గడచి మహార్హరత్నకన•క ప్రకటోజ్జ్వలభూషణావళిన్
గడుబెడఁగైన రావణు న•గారమునన్ దహనంబుఁ గొల్పుచున్. ౧౬౧౨

అర్థములు. విడివడకుండన్=వదలి పోకుండునట్లు, మహార్హ=మిగుల వెలగల- రత్నకనక=రత్నములచే, బంగారుచే- ప్రకటోజ్జ్వల భూషణావళిన్=విస్తారముగఁ బ్రకాశించు నాభరణములచే-కడుబెడఁగు=మిగుల నందమైన.

తాత్పర్యము

సీతాపక్షమువాఁ డని విని యుండుటచేతను, తన పక్షమున ధర్మమార్గమున రావణుతో వాదించుటచే ధర్మాత్ముఁడని తెలిసి యుండిన కారణముచే విభీషణు నిల్లుమాత్రము కాల్పలేదు. తక్కిన యిండ్లన్నియుఁ దగులఁబెట్టెను. ఆ పిమ్మట మిగుల వెలగల బంగారు మణుల సొమ్ములచే నలంకరింపఁబడిన రావణు నింటికిఁ జిచ్చుపెట్టెను.

క. కల్పాంతజలదగర్జా; కల్పం బగు నాద మడరఁ•గపి రేఁగి నిజా
నల్పజవ మారఁ జిచ్చును; గొల్పెను బెనుగాలి విసర•ఘోరపుభంగిన్.

అర్థములు. కల్పాంత=ప్రలయకాలము కడపటి, జలద=మేఘములయొక్క, గర్జాకల్పము=ఉఱుములతో సరిపోలిన, కల్పప్రత్యయము కొంచెము తక్కువగా సమత్వమును దెలుపును. నిజ=తనయొక్క-అనల్ప=గొప్పదగు, జవము=వేగము, ఆరన్=అతిశయింపఁగా.

తాత్పర్యము

ప్రలయకాల మేఘ ధ్వనివంటి ధ్వని వ్యాపింపఁగా వానరుఁడు విజృంభించి సింహనాదము చేయుచు, గాలి బలముగ వీచు చుండఁగా మిగుల వేగమునఁ జిచ్చు తగిలించెను.

క. చిటులుచుఁ బేలు మనుచుం, బెటులుచుఁ బటపట మటంచు•వివిధమణితతిన్
స్ఫటికంబుల గొన బారెడి, కిటికీలును మేడ లిండ్లు•క్షితిపైఁ గూలెన్. ౧౨౨౩

తాత్పర్యము

స్పష్టము.

క. కాలి విమానంబులు ధరఁ, గూలుట చూపట్టె సుకృత•కోటులు దీఱన్
గూలెడి సిద్ధభవనముల, పోలిక నెల్లెడల నసుర•పురవరమందున్. ౧౨౨౪

అర్థములు. విమానంబులు=పెద్దమేడలు-చూపట్టెన్=కనఁబడెను, సుకృత కోటులు=పుణ్యసమూహములు, తీఱన్=క్షయింపఁగా.

తాత్పర్యము

లంకయందుఁ గాలి నేలఁబడు పెద్దమేడలు, పుణ్యము లన్నియు క్షయింపఁగా నేలఁగూలు సిద్ధుల యిండ్ల వలె నుండెను.

ఉ. మండెడు నిండ్లకై కడుపు•మండఁగఁ బర్విడి వచ్చి వేఁడిమిన్
దండను జేర లేక మసి•నాశన మయ్యెడు విత్తముల్ గనన్
గుండెలు బ్రద్దలైనను డి•గుల్ గొని యేడ్చెడివారు హా! యటం
చుం డెడివారు మొత్తుకొను•చుండెడివారు భ్రమించువారుగన్. ౧౨౨౫

అర్థములు. దండను=సమీపమందు, మసి=బూడిద, విత్తముల్=ధనములు.

తాత్పర్యము

స్పష్టము.

చ. తమతమ యిండ్లు కాచికొన•దవ్వుల నుండియుఁ బాఱువారుఁ, బెం
డ్లములును బిడ్డలున్ మఱియ•లబ్బెస లాడెడివారు, వారికై
తమకము మీఱ లోనఁ జని•తాము ను గాలెడివారు, ధూమసం
తమసమునందుఁ జిక్కి పగ•దారొక్కనువారును, నేడ్చు వారలున్. ౧౨౨౬

అర్థములు. కాచికొనన్=రక్షించుకొనుటకు, దవ్వులనుండి=దూరము నం దుండి, ఇతరులయిండ్లు కాలుచుండఁగా జూడఁబోయినవారు తమ యిండ్లు కాలుచున్న వని వార్త రాఁగానే పరువెత్తిరని భావము, లబ్బైన లాడెడివారు= లబ లబ మొత్తుకొనువారు, ధూమసంతమసము=పొగవలనఁ గలిగిన చీఁకటి.

తా త్ప ర్య ము

స్పష్టము.

క. కటకట! కపిరూపున ము,న్నటివైరముఁ దీర్చికొనఁ గ•ణంగెను దహనుం
డిటు లనియెడివారల య, ప్పటి యులివు దిగంతరాళ•భాగము నిండెన్.

అర్థములు. కణంగెను=ప్రయత్నించెను, నులివు=ధ్వని, దిగంతరాళభాగము= దిక్కులకు నడుమనుండు ప్రదేశము.

తా త్ప ర్య ము

అయ్యయ్యో! పూర్వము రావణుఁడు తన్ను పెట్టిన బాధ తీర్చుకొనుటకై యగ్నిహోత్రుఁడు నేఁడు క్రోఁతి వలె వచ్చి పగ దీర్చుకొను చున్నాఁడు. అని యనువారల ధ్వని యాకాశము నిండెను.

చ. పరువడిఁ జుట్టు ముట్టుకొనఁ•బావకకీలలు కొంద ఱంగనల్
విరిసిన కేశపాశములు•వ్రేలుచు నుండ మహాస్వనంబుతో
నురమునఁ జంటిపాపలను•నొత్తుచు మేడలనుండి కూలి రం
బరమున నుండి మబ్బులను•బాసి దొరంగు మెఱుంగులో యనన్. ౧౨౨౮

అర్థములు. పావకకీలలు=అగ్నిజ్వాలలు, విరిసిన కేశపాశములు=ఊడి పోయిన కొప్పులు, అంబరమున నుండి=ఆకాశము నుండి, దొరంగు=నేలఁబడు.

తా త్ప ర్య ము

కొందఱు స్త్రీలు త మ్మగ్నిజ్వాలలు చుట్టు ముట్టుకొనఁగా తలవెండ్రుకలు విరియఁబోసికొని పెద్దగా నేడ్చుచుఁ జంటి బిడ్డలను ఱొమ్ముల కొత్తుకొని మేడల నుండి క్రిందఁ బడుట చూడఁగా మేఘముల నుండి మెఱుపులు క్రిందఁ బడు చున్నవా యన్నట్లుండెను.

తే. వజ్రవిద్రుమవైడూర్య•వర్గములును
వెండి పైఁడియు ముత్తెముల్•వింత లైన
ధాతుభవనాళి కరఁగి యెం•తయును బాఱు
చుండఁగా నంజనానంద•నుండు గనియె. ౧౨౨౯

తా త్ప ర్య ము

అగ్ని వేఁడిమికి వజ్రములు, పగడములు, వైడూర్యములు, వెండి, బంగా రము ముత్తెములు, లోహములతోఁ జేసిన యిండ్లు కరఁగి ప్రవహించుచుండఁగా హనుమంతుఁడు చూచెను.

క. తృప్తిఁ గనఁ డనుమ గాల్పం, దృప్తిం గొనఁ డగ్ని కాష్ఠ•తృణసంఘములన్
తృప్తిఁ గన దిలయు శవసం, ప్రాప్తిన్ గాలియును వీవ•బడలక యుండెన్.

అర్థములు. కాష్ఠ=కట్టెలయొక్కయు, తృణ=గడ్డియొక్కయు, సంఘములన్=సమూహములను, శవసంప్రాప్తిన్=పీనుఁగులను బొందుటచే.

తాత్పర్యము

ఇండ్లను గాల్చుటయందు హనుమంతుఁ డిఁకఁ జాలు నని దృప్తిపడ లేదు. అగ్ని కట్టెలను, గడ్డిని గాల్చుటయందుఁ దృప్తిపడ లేదు. భూమి పీనుఁగు లెన్ని పడినను చాలు ననలేదు. గాలి యెంత విసిరినను శ్రమము పొంద లేదు.

తే. కింశుకంబుల డాలొక్క•క్రేవ శాల్మ
లీప్రసూనచయంబుల•లీల వేఱు
చోటఁ గుంకుమలోహిత•శోభ యొందు
గడను జెలువార జ్వాలలు•కాంతి మెఱసె. ౧౩౧

అర్థములు. కింశుకముల డాలు=మోదుగుపూల కాంతి, క్రేవ=ప్రక్క, శాల్మలీ ప్రసూనచయంబుల=బూరుగుపూవుల సమూహముల, లీలన్=విధముగ, కుంకుమ లోహితశోభ=కుంకుమము, నెత్తురుయొక్క కాంతి.

తాత్పర్యము

అగ్నిహోత్రుని జ్వాలలు మోదుగుపూల కాంతితో నొక్కచోటను, బూరుగుపూల విధముగ మఱియొక్క చోటను, కుంకుమము, నెత్తుటివలె వేఱొక్కచోటను నుండెను.

క. పురముల దహియించిన యా, పురహరు చందమున వాయు•పుత్రుఁడు లంకా
పుర మెల్లఁ గాల్చె మంటలు, పొరిఁ బొరిఁ ద్రికూటశైల•మున వ్యాపింపన్.

తాత్పర్యము

త్రిపురములను గాల్చిన రుద్రునివలె హనుమంతుఁడు లంకాపురమంతయుఁ గాల్పఁగా నా మంటలు వృద్ధియై త్రికూట శైలమున వ్యాపించెను.

సీ. అభ్రంలిహాదభ్ర•విభ్రమోదగ్రుఁ డై, రక్షశ్శరీరాజ్య•రాజిఁ జేసి
నాలుకల్ గ్రోయుచు•నలువంకఁ గ్రమ్ముచుఁ;బవనుండుదనకుఁదో•డ్పడుచునుండ
రేఁగి బ్రహ్మాండంబు•లోఁగొను పోలికఁ, గోటి దినేశుల•సాటి మీఱఁ
బిడుగులు రాలెడి•వడువున ధ్వనియించి, సర్వంబుఁ దానయై•పర్వ నగ్ని

ఆ. మింటి నంట నెగయు•మంటలు మోదుగు, పూలగుత్తు లనఁగ•జాలి యుండె
నగ్గి యాఱ నెగయు•నసితంపుఁ బొగలచే; మొగులు నల్లకల్వ•జిగిని దాల్చె.

అర్థములు. అభ్రం=ఆకాశమును, లిహ=నాకుచున్న - తాఁకుచున్న, అదభ్ర=అధికమైన, విభ్రమ=వ్యాపించుటచే, ఉదగ్రుఁడు=భయంకరముగ నతిశయించినవాఁడై, రక్షశ్శరీర=రాక్షస శరీరములనెడి, ఆజ్యరాశిఁజేసి= నేతి

రాశిచేత, నాలుకల్-మంటలు-జ్వాలలు; క్రోయుచున్ = హెచ్చుదక్కువలుగా వ్యాపింపఁజేయుచు, దినేశులసాటి=సూర్యులతో సమానము, వడువునన్=విధముగ, అసితంపు=నల్లని, మొగులు=మబ్బు, జిగి=కాంతి.

తా త్ప ర్య ము

అగ్నిహోత్రుఁ డాకాశమునంటు జ్వాలలచే వ్యాపించినవాఁడై రాక్షసుల శరీరము లనెడి నేయిచే జ్వాలలను గొన్ని పొట్టివిగాఁ గొన్ని పొడవుగా వ్యాపింప నాలుగు ప్రక్కల వ్యాపింపఁజేయఁగాఁ దనకు గాలి సహాయపడుచుండ విజృంభించి బ్రహ్మాండంబును మ్రింగు విధముగ కోటిసూర్యుల కాంతిఁగలిగి పిడుగుల రాలునట్లు చిటపట ధ్వనులు గలిగి యెక్కడఁ జూచినఁ దానే యై వ్యాపింపఁగా నాకాశమున కెగయు మంటలు మోదుగుపూల గుత్తులవలె నుండెను. నిప్పు చల్లారినచోట నెగయు పొగలచే నల్లపడి నల్లకలువల కాంతి గల దయ్యెను.

—• రాక్షసవిలాపము. •—

ఉ. ఈ కపి యామహేంద్రుఁడో సు•రేశ్వరుఁడో పవిహస్తుఁడో యముం
డో కుముదాప్తుఁడో దహను•ఁడో ధనదుండొ జలాధినాయకుం
డో కమలాప్తుఁడో పవను•ఁడో యలరుద్రుఁడో కాక యీతనిన్
ప్రాకృతవానరుం డనఁగ•వచ్చునె? కాదు లయాంతకుం డొకో. ౧౩౮

తా త్ప ర్య ము

ఈ వానరుఁడు ముప్పది మూఁడుకోట్ల దేవతలకుఁ బ్రభువై వజ్రము ధరించిన యింద్రుఁడా-యముఁడా-చంద్రుఁడా-అగ్నిహోత్రుఁడా - కుబేరుఁడా- వరుణుఁడా-సూర్యుఁడా-వాయుదేవుఁడా కాక, యా రుద్రుఁడా వీరిలో నెవఁడో యొకఁడై యుండవలెను గాని, సామాన్యపు క్రోఁతి యనరాదు. అటుకాక ప్రలయ కాలాంతకుఁడో-వీ రెవరు గారు-ఏలన వీ రందఱు నిదివఱకు రావణుచేఁ బీడింపఁబడి యణఁగి పడి యుండువారే కావున.

ఆ. సర్వలోకకర్త•సర్వపితామహుం, డై చతుర్ముఖుండు•నైన బ్రహ్మ
ప్రబలకోప మిట్లు•రాక్షసనాశార్థ,మరుగుదెంచెనో వ•నాటుఁ డగుచు. ౧౩౯

అర్థములు. సర్వలోకకర్త=అన్ని లోకముల సృజించువాఁడు, సర్వ పితామహుఁడు=అన్నిటికిఁ దాతయైనవాఁడు, చతుర్ముఖుండు=నాలుగుముఖములు కలవాఁడు; రాక్షసనాశార్థము=రాక్షసుల నాశము చేయుకొఱకు, వనాటుఁడు= క్రోఁతి.

తా త్ప ర్య ము

సర్వలోకముల సృజించువాఁడై ఆ కారణమున సర్వలోకముల తాతయైనాలుగు ముఖముల బ్రహ్మదేవుఁడు తా నిచ్చిన వరములచే గర్వించి చేయరాని పనులఁ

జేయు రావణుఁ గోపింపఁగా నా కోపము రాక్షసుల నాశము చేయుకొఱకు క్రోతియై వచ్చెనేమో ఇదియును గాదు. ఏలన.—బ్రహ్మ సృష్టించువాఁడే కాని చంపువాఁడు కాఁడు. కావున నీ వానరుఁడు బ్రహ్మ కాఁజాలఁడు. మునీఁడిచెట్టు నైనఁ దాఁబెట్టిన చెట్టును దానెవ్వఁడు కొట్టఁడుఁగదా,

క. అనుచు విశిష్టులు రాక్షసు, లనలశిఖాదగ్ధభూరు•హాలయవనప
క్షినికరముఖజీవ్యన్వి౦త,మును దమనగరంబుఁ గాంచి•పొక్కుఁచు మఱియున్,

అర్థములు. విశిష్టులు=జ్ఞానవంతులు, అనలశిఖా=అగ్నిజ్వాలలచే, దగ్ధ=కాల్పఁబడిన, భూరుహా=చెట్లతోను, ఆలయ=ఇండ్లతోను, వన=తోటలతోను, పక్షినికరముఖజీవి=పక్షుల గుంపులు మొదలగు ప్రాణులతోను, అన్విత=కూడిన, పొక్కుఁచున్=త్వరపడుచు. తాత్పర్యము

అని చెప్పుచు జ్ఞానులగు రాక్షసు లగ్నిజ్వాలలచే దగ్ధమైన చెట్లు-గృహములు-వనములు-పక్షులు లోనగు జీవజంతువులు గల తమ పట్టణమును జూచి దుఃఖ పడుచు నీ వానరుఁడు మీఁదఁజెప్పిన వారిలో నెవ్వఁడుగాఁడు. వారి కింత శక్తిలేదు.

తే. అకట! యవ్యక్త మేక మ•నంత మగు న,చింత్యవిష్ణుసు తేజంబు•స్వీయమాయ
వానరాకృతిఁ గైకొని•వచ్చెనేమొ, యఖిలరాక్షసకులవినా•శార్థ మనగ.

అర్థములు. అవ్యక్తము=కన్ను మొదలగు బాహ్యేంద్రియములకు గోచరింపనిది, ఏకము=ముఖ్యము, అట్టిది రెండవది లేనిది, అనంతము=మూఁడువిధములైన పరిచ్ఛేదములు లేనిది-కాలపరిచ్ఛేదము, వస్తుపరిచ్ఛేదము, దేశపరిచ్ఛేదము-అని పరిచ్ఛేదములు మూఁడు విధములు. ఒక కాలమందుండి వేఱొక కాలమందు లేకుండుట కాలపరిచ్ఛేదము. అది లేని దనఁగా నిత్యమైనది. ఒక ప్రదేశమున నుండి వేఱొక ప్రదేశమున లేకుండునది దేశపరిచ్ఛేదము. అది లేనిదనఁగా సర్వదేశవ్యాపి యని యర్థము. ఒక వస్తువు దానై మఱియొక వస్తువు తాను గాకుండునది వస్తు పరిచ్ఛేదము. అదిలేని దనఁగా సమస్త వస్తుస్వరూపమై యుండుట. ఇది వస్త్వైక్యము చేతను, అంతర్యామిత్వము చేతను, శరీరిశరీర భావముచేతను నిర్వహింప నగును. అచింత్యము=మనస్సుచే నాలోచించి తెలిసికొన సాధ్యము గానిది. విష్ణుసుతేజంబు=విష్ణువునం దున్న పూజ్య మగు పరమశక్తి, (౨) విష్ణుమూర్తియనెడి తేజస్సు-స్వీయమాయ=అచింత్యము అద్భుతమునైన తనశక్తి, అఖిల రాక్షసకుల వినాశార్థము=సకల రాక్షస వంశమును నాశముచేయు కొఱకు.

తాత్పర్యము

బ్రహ్మరుద్రాదులు, నింద్రాది దిక్పాలురు గాకున్న నెవ్వరింత కార్యము చేయఁ గలవారు అని యాలోచించి యా జ్ఞానులు బాహ్యేంద్రియ గోచరము గానిది, యసమానమైనది, ఏ విషయమందును నంతము లేనిది, ఇట్టిదని

యూహింపరానిది నగు విష్ణు మహా తేజంబు అచింత్యమై యత్యద్భుత కర్మములు చేయగల శక్తి వానర స్వరూపమును గైకొని సర్వ రాక్షస వంశములను నాశము చేయుకొఱకు వచ్చిన దని నిశ్చయించిరి. ఇందు ఏమొ యనునది సంస్కృతమున 'వా' వలె నిర్ధారణార్థమందుఁ బ్రయుక్తము. 'వా స్యాద్వికల్పోపమయో రేవార్థేచ సముచ్చయే' యని విశ్వము. దీనికి తరువాత మఱియొకటి దీని నిషేధించి చెప్ప కుండుటచే నిదియే నిశ్చయ మని గ్రహింప నగు.

క. హనుమత్ప్రేరితహుతభు, గ్ఘనకీలాదగ్ధసాశ్వ•గజరథజనప
క్షినిచయమృగవృక్షం బై, మనుజాశన నగర మపుడు•మఱిమఱియేడ్చెన్.

అర్థములు. హనుమత్ + ప్రేరిత=హనుమంతునిచేఁ బ్రేరింపఁబడిన, హుతభుక్=అగ్నిహోత్రుని, ఘనకీలా=గొప్ప మంటలచే, దగ్ధ=కాలిన-స+అశ్వ+గజ+రథ+జన+పక్షినిచయ+మృగ+వృక్షంబు=గుఱ్ఱములు-ఏనుఁగులు-తేర్లు-జనులు-పక్షుల గుంపులు-మృగములు-చెట్లతోఁ గూడినదై, మనుజాశన నగరము=రాక్షసుల పట్టణము, నగరమేడ్చె ననఁగా నగరములోని జనులేడ్చిరని లక్షణచే నర్థము గ్రహింపనగు.

తాత్పర్యము

హనుమంతునిచేఁ బ్రేరింపఁబడిన యగ్నిజ్వాలలచేఁ గాలిన గుఱ్ఱములు-ఏనుఁగులు-రథములు-జనములు-పక్షుల గుంపులు-మృగములు-వృక్షములు గల లంకానగరము విశేషముగ నేడ్చెను. ఏ మని యేడ్చె ననిన.

క. ఆయ్యో తండ్రీ! కొడుకా!, యయ్యో ప్రాణేశ! మిత్ర•మా పోయితిరే
యియ్యెడ సుఖజీవన మ,య్యయ్యో పోయె నని యంగ•లార్చిరి యసురుల్.

తాత్పర్యము

సుస్పష్టము.

చ. కెరలి ఛటచ్ఛటాకలిత•కీలల మాలలఁ గాలి కూలుచున్
బరువిడు యోధవర్గములు•ప్రాణము వాసిన వీరవర్యులై
పరఁగఁగ రోదనధ్వనులు•పావని కోపబలాభిభూత మై
ధరఁ గనుపట్టెఁ దత్పురము•తిట్టిన రూపఱుమాడ్కి దీనమై. ౧౨౪౦

అర్థములు. కెరలి=విజృంభించి, ఛటచ్ఛటా కలిత=ఛట ఛట మనుధ్వనులు గల, కీలల మాలలన్=జ్వాలల సమూహముచే, పావని కోపబలాభిభూతమై=హనుమంతుని కోపబలముచే-అభిభూతమై = చెఱుపఁబడినదై, ధరన్=భూమియందు, తిట్టినన్=శపింపఁగా, రూపఱు మాడ్కిన్=లేక పోయినవిధముగా.

తాత్పర్యము

విజృంభించి ఛట ఛట ధ్వనులతోడి జ్వాలల వరుసలచేఁ గాలి, పడుచుఁ బరువెత్తి యోధుల గుంపులు చచ్చిన వీరశ్రేష్ఠులు గలదై, యేడుపు ధ్వనులు

వ్యాపింపఁగా హనుమంతుని కోపముచేఁ జెడి యా లంక శాపముచే రూపు మాసిన దానివలె దీనమై కనఁబడెను.

తే. సంభ్రమత్రస్త సవిషణ్ణ•సౌరవైరి, పాళిచే నుజ్జ్వలజ్వాల•పావకార్చి
రంకములచేతఁ జూపట్టె•లంక కల్ప,విశ్వసృట్కోపనిహత మా•విశ్వమనఁగ.

అర్థములు. సంభ్రమ త్రస్త=తత్తఱపాటుచే భయపడిన, సవిషణ్ణ=దుఃఖముగల, సౌరవైరి పాళిచే=రాక్షసుల గుంపులతోఁగూడిన, ఉజ్జ్వలత్=మండుచున్న, జ్వాల=మంటలు గల, పావక=అగ్నియొక్క, అర్చిః+అంకములచేత=శిఖల చిహ్నములచే, కల్ప=ప్రళయ కాలమందు, విశ్వసృట్ = బ్రహ్మయొక్క, కోప=ఆగ్రహముచే, నిహతము=కొట్టఁబడిన, విశ్వము=ప్రపంచము.

తాత్పర్యము

సంభ్రమముచే భయపడి దుఃఖించు రాక్షస సమూహములచేతను మండుచున్న మంటల జ్వాలల గుర్తుల చేతను లంక ప్రళయమందు బ్రహ్మ కోపముచే నశింపు చేయఁబడిన ప్రపంచము వలె నుండెను.

ఆ. వనముఁ బాడుచేసి•మనుజాదులను జంపి, సౌధభవనములను•జదును చేసి
మండు తోఁకతోడ•మార్తండు నట్లు త్రి,కూటశిఖరిఁ జేరి•క్రోఁతి ఱేఁడు.

అర్థములు. మనుజాదులను=మనుష్యులను తిను రాక్షసులను, చదును=నేల చదరము.

తాత్పర్యము

వనము పాడుచేసి రాక్షసులఁ జంపి మేడలు మిద్దెలు నేల చదరము చేసి యింకను మండుచున్న తోఁకతో సూర్యునివలె వెలుఁగుచు వానరేంద్రుఁడు త్రికూట పర్వతము చేరి.

తే. జానకీశ్వరుఁ గనుఁగొన•జనఁగఁ దలఁచె, నతని యద్భుతకర్మంబు•నవధరించి
దేవగంధర్వమునినాగ•దివ్యులెల్ల, నిస్తులంబైన ముదమున•నివ్వటిలిరి.

తాత్పర్యము

రామచంద్రమూర్తిని జూడఁబోవఁదలఁచెను. ఆయన చేసిన యాశ్చర్యకరమైన పనిఁజూచి దేవతలు గంధర్వులు నాగులు మునులు ఆకాశ సంచారులు మిగుల సంతోషించిరి.

క. గంధవహసుతునిచే దశ,కంధరపుర మెల్ల భస్మ•కాండము గాఁగన్
గంధర్వులు సిద్ధషులు, బంధురవిస్మయముతోడఁ•బరికింపంగన్. ౧౨౪౪

తాత్పర్యము

వాయుపుత్రునిచే రావణుని పట్టణ మంతయుబూడిద రాశిగాఁగ గంధర్వులు సిద్ధషులు మిగుల నాశ్చర్యముతోఁ జూడఁగా.

క. జ్వాలామాలావృతలాం;గూలు నురుత్తనయుఁ జూచి•కూరిన భీతిన్
గాలానలుఁడో యనుచును, జాలఁగఁ గంపించె భూత•సంచయ మెల్లన్.

అర్థములు. జ్వాలా మాలావృత లాంగూలున్=మంటల సమూహముచేఁ జుట్టఁబడిన తోఁకగలవానిని, కాలానలుఁడో=ప్రలయ కాలాగ్నియో.

తాత్పర్యము

అగ్ని శిఖలచేఁ జుట్టుకొనిన తోఁకగల యాంజనేయుని చూచి భయపడి భూతముల సమూహములు ప్రలయకాలమందలి యగ్నిహోత్రుఁడిపుడే వచ్చె నేమోయని భయపడెను.

తామరసము. మునిసురపన్నగ•ముఖ్యులుయక్షుల్, గనుఁగొనిమారుతి•కార్యము నాత్మన్
ఘనమగు ప్రీతిని•గాంచిరి మేల్ మే,లనుచును మెచ్చిరి•యంజనపుత్రున్.

తాత్పర్యము

మునులు దేవతలు పన్నగులు మొదలగు వారును, యక్షులును ఆంజనేయుఁడు చేసిన కార్యమును జూచి మిగుల సంతోషించి మేలు మేలని హనుమంతునిఁ బొగడిరి.

తామరసము—దీనికేతోదక మనియుఁ బేరు. నజజయ గణములు—ఎనిమిదింటయతి.

• ౫౫-వ సర్గము హనుమంతుఁడు సీతాదేవి దగ్ధ యయ్యె నని పరితాపపడుట. •

క. అంతట హనుమంతుఁడు వా, లాంతాగ్నిని వార్ధినీట•నార్చి నగరం
బంతయును జూచి దుస్సహ, చింతారతి ప్రసక్తి నేమి•చేసితి నయ్యో.

అర్థములు. వాలాంతాగ్నిని=తోఁక కొన నున్న యగ్నిని—దీనివలన తోఁక కంతయు గుడ్డలు చుట్టలేదనియు కుచ్చుగా నొక కొనయందు మాత్రమే చుట్టఁబడె నని గ్రహింప నగు.

తాత్పర్యము

ఆవల హనుమంతుఁడు తోఁకకొన మండుచున్న యగ్నిని, తోఁకను సముద్ర జలములందు ముంచుటచేఁ జల్లార్చి పట్టనమంతయుఁ గాలియుండుటచూచి యయ్యో యేమిపని చేసితినని సహింపరాని విచారము గల వాఁడయ్యెను.

క. ఎంత యకార్యంబును నేఁ, జింతింపక లంకఁ గాల్చి•చేసితి ననుచున్
స్వాంతమున దిగులుపడి యే, కాంతంబును దన్ను దానె•గర్హించుకొనెన్.

తాత్పర్యము

లంకనంతయుఁ గాల్చి నే నెంతటి చేయరాని పని యాలోచన లేక చేసితి నని మనస్సున దిగులుపడి తన్నుఁదానె మిగుల నిందించుకొనెను.

క. దీపించు నగ్ని జలముల, రూపు చెఱుచునట్లు పెరుఁగు•రోషమును సుధీ
వ్యాపారముచే నణఁచెడు, నా పురుషుఁడెపో మహాత్ముఁ•డవు ధన్యుండున్.

తాత్పర్యము

మండుచున్న యగ్నిని నీళ్ళచేఁ జల్లార్చునట్లు వృద్ధి యగుచున్న కోపమును మంచి బుద్ధి వ్యాపారముచే నణఁచెడి వాఁడే గొప్ప మనస్సుగల ధన్యుఁడు.

క. కోపి తునుము గురువులనేన్, గోపి కడుం గఱకులాడు•గుణవంతులనేన్
గోపి యొనర్పఁగఁ జాలని, పాపం బే దైనఁ గలదె•భావింపంగన్. ౧౨౫౦

తాత్పర్యము

కోపము గలవాఁడు గురువులనైనను జంపును. గుణవంతులనైనను దిట్టును. ఆలోచింపఁగా కోపి యగువాఁడు చేయఁజాలని పాపమే లేదు.

క. ఆరయ వాచ్యావాచ్యవి,చారంబే లేదు కోపి•జనులకుఁ జేయం
గారాని కార్య మాడం, గారాని యవాచ్య మొండుఁ•గలదే చూడన్.

అర్థములు. వాచ్య-అవాచ్య-విచారంబు=ఇది చెప్ప వచ్చును. ఇది చెప్ప రాదను నాలోచన, అవాచ్యము=చెడుమాట.

తాత్పర్యము

కోపము గలవానికి వీని నీమాట యనవచ్చును, వీని నీమాట యనరాదు అను నాలోచనయే లేదు. ఎంత గొప్పవారి నైన నెంతమాటయైన మాట లాడును. కోపికిఁ జేయరాని పని, చెప్పరాని మాట లేదు.

క. వాతాశనంబు జీర్ణం, బౌ తన కుబుసంబు విడుచు•నట్టులు క్షమచే
జాతక్రోధముఁ బాఁచెడి, యాతఁడె పో పురుషుఁ డనఁగ•నర్హుఁడు జగతిన్.

అర్థములు. వాతాశనంబు=గాలి యాహారముగాఁ గలది-పాము, జీర్ణంబు= చివికినది-కుబుసము=పొర, కుప్పసము; క్షమచేతన్=ఓర్పుచే, జాతక్రోధము= పుట్టిన కోపము, ఆఁచెడి=నివారించెడి.

తాత్పర్యము

పాము చివికిన తన దేహము పొరను వదలి పెట్టునట్లు పుట్టిన కోపమును నోర్పుచే నెవఁ డడ్డగించునో వాఁడే పురుషుఁ డనఁదగిన వాఁడు.

క. ఎంతటి లజ్జాహీనుఁడ, నెంత సుదుర్బుద్ధిఁ బాప•కృత్తముఁడ నిసీ
చింతింపక శ్రీరాఘవు, కాంతను దహియించి స్వామి•ఘాతుకుఁ డైతిన్.

అర్థములు. లజ్జాహీనుఁడన్=సిగ్గులేనివాఁడను, సుదుర్బుద్ధి=మిగులఁ జెడు బుద్ధి గలవాఁడను, పాపకృత్+తముఁడన్ = పాపముచేయు వారిలో గొప్ప వాఁడను, స్వామి ఘాతుకుఁడు=స్వామిద్రోహము చేసినవాఁడను, ఉత్తమ పురుష మునకు మాఱు ప్రథమ పురుషము, పాండు భూవరునకుఁ గోడలై తివలె.

తాత్పర్యము

నే నెంతటి సిగ్గులేనివాఁడను. ఎంతటి పాడు బుద్ధిగలవాఁడను. పాపాత్ములలోఁ బాపాత్ముఁడను. ఛీ ఛీ ఆలోచన లేక శ్రీ సీతాదేవిని కాల్చి స్వామి ద్రోహము చేసినవాఁడ నైతిని.

ఉ. నిక్కము లంక యంతయును•నీఱయి పోవుట, సీత యగ్నులం
జిక్కి నశించి యుండు, నెది•సేయఁగఁ బూనితి దానిఁ దెల్ప లే

కక్కుట నేనె కీడ్పఱచుటయ్యెను, జానకిఁ గావఁ జూడమిం
గ్రక్కసకింకచేతఁ బతికార్యము నంతయుఁ బాడుచేసితిన్. ౧౨౫౪

అర్థములు. నీఱు=భస్మము, గ్రక్కసకింక=కఠినకోపము. కర్కశ భవము గ్రక్కస.

తాత్పర్యము

లంకయంతయుఁ గాలి బూడిద యగుట నిజము. ఆ మంటలలోఁ దగులుకొని సీత నశించియుండుటయు నిజము. దేనిని నేను జేయఁబూనితినో దానిని నేనే తెలివిలేక పాడుచేసితిని. జానకిని గావవలె నను నాలోచన లేనివాఁడనై క్రూరమైన కోపముచేఁ బతికార్యము నంతయు నేనే పాడు చేసితిని.

క. కొంచెపుఁబని యీపురిని దహించుట యది యెల్లఁ దీరెనేలా? నేఁ గా
వించితిఁ బని నాశము నెదఁ, గాంచక, మతి యున్నె యాత్రగానికి నెందున్?

తాత్పర్యము

ఈ పురిని దహించుట చిన్నపని. అది యంతయుఁ జేసితినిగాని యేమి ప్రయోజనము? ఆలోచనలేక నేను బాగుచేయఁదలఁచిన పనిని బాడుచేసితిని. తొందరపడి పనిచేయువానికి బుద్ధిగలదా? ఆత్రగానికి బుద్ధిమట్టు అనునది లోకోక్తి.

ఉ. ఎంతటిలోన నా శ్రమము లెల్ల వృథా చనె, రోషదూషిత
స్వాంతత స్వామి కార్యమును వఱ్ఱునఁ గల్పితి మూలమట్టుగాఁ
గొంతయుఁ దక్క కంతయును గూలె సురారిపురంబు, మైథిలీ
కాంతయు నింకఁ జిక్కి హతగా కెటుజీవము నిల్ప నోపెడిన్. ౧౨౫౬

అర్థములు. రోషదూషిత స్వాంతతన్=కోపముచే దుష్టముగాఁ జేయఁబడిన మనస్సుచే- వఱ్ఱునన్=వఱదలో.

తాత్పర్యము

అయ్యో! యెంత యల్పకాలములో నేనుజేసిన కష్టమంతయు వ్యర్థమై పోయెను. రోషముచేఁ జెడిన మనస్సుతో స్వామి కార్యమును సమూలముగల వఱదపాలు చేసితిఁగదా. రావణుని నగరము కొంచెమైన మిగులక సర్వము నాశమయ్యెను. ఈ ప్రళయములో సీతాదేవి మాత్రము చావక ప్రాణమెట్లు కాపాడుకొనఁ గలిగి యుండును. ఆమెయుఁ గాలి యుండును.

క. నా యజ్ఞానముచేతను, నా యూనినపనియె నాశనం బైననిటన్
జేయుదుఁ బ్రాణత్యాగం, బీయెడ నయ్యదియ యుచితమెటు యోజింపన్.

తాత్పర్యము

నా తెలివి తక్కువ తనముచే నేను జక్కఁజేయఁ బూనిన పనియే చెడిపోయిన యెడల నేను బ్రాణత్యాగము చేయుటయే యీ సమయమునఁ దగిన కార్యము.

క. చిచ్చుఱుకుదునో? కడలిని, మచ్ఛములకు సత్త్వములకు మై మెఱగాఁగన్
జొచ్చుదునో? బడబాగ్నికి, నిచ్చుదునో దేహ? మిప్పుడెటు మరణింతున్?

అర్థములు. చిచ్చుఱుకుదునో=చిచ్చునందుఁ బడుదునా-సప్తమ్యర్థమునఁ బ్రథమ. మచ్ఛములకున్=చేఁపలకు-మత్స్యశబ్దభవము మచ్ఛము. సత్త్వములకు=క్రూర జంతువులకు-మై=దేహము. ఎఱ=ఆహారము, బడబాగ్నికి=సముద్రమున నాఁడు గుఱ్ఱపు రూపమున నుండు నగ్నికి-శుచి-వర్ణవ్యత్యయమున తద్భవము చిచ్చు. ఇచ్చుదునో=చువర్ణంబుతోడి దుగ్ధకారంబునకు తకారంబు వైకల్పికంబు.

తా త్ప ర్య ము

అగ్నియందుఁ బడుదునా? సముద్రమందు దూఁకి మత్స్యములకు పెద్ద జంతువులకు నా దేహము నాహారముగా నిత్తునా, బడబాగ్నిపాలు సేయుదునా? ఏవిధముగ దేహము విడుచుట తగును?

ఉ. వారలకార్యముం జెఱిచి♦ప్రాణము మేన ధరించి యే మటం
చా రఘురామలక్ష్మణుల♦నా కపినాథుని మోముఁ జూచెదన్?
భూరితరాగ్రహంబు మెయి♦భూప్రథితం బగు క్రోఁతిబుద్ధి నే
నీరహిఁ జూపితిం, బ్రకృతి♦వృత్తము నాఁపఁగ నేరనైతిఁగా. ౧౨౫౯

అర్థములు. వారల=రామలక్ష్మణ సుగ్రీవుల, భూప్రథితంబు=భూలోకమున ప్రసిద్ధికెక్కిన, ఈ రహిన్=ఈవిధముగ, ప్రకృతి వృత్తము=సహజముగా వచ్చిన నడవడి, ఆఁపఁగన్=నిలుపుటకు; నేరనైతిన్=సమర్థుఁడగా నైతిని.

తా త్ప ర్య ము

రామలక్ష్మణుల సుగ్రీవుని కార్యము పాడుచేసి ప్రాణములతో వారి యెదుటికిఁ బోయి వారిముఖముల నేమని చూతును? ఏమి చెప్పుదును? మిక్కిలి గొప్పదగు కోపముచే నా స్వభావసిద్ధమైన క్రోఁతిబుద్ధిని నిలుపఁజాలనైతిని గదా.

నీది క్రోఁతి బుద్ధి యని సీతాదేవి యనిన హనుమంతునకు నది యవమానకరముగా నుండెను. కాని యిప్పుడు తన్నుఁదా ననుకొనుట తాను సుగ్రీవు ననుట బాగుగనే యున్నది.

ఆ. అనెడువారు లేమి♦నతిచంచలము రజో. భావమైనబుద్ధి♦పాడు గాను
శక్తి గలిగియుండి♦జానకిఁ గావంగఁ దలఁప నైతిఁ గినుక♦బలమిఁ జేసి. ౧౨౬౦

అర్థములు. అనెడువారు=ఏమి యిట్లు చేసితి వని దండించువారు.

తా త్ప ర్య ము

దండించు పెద్దవారు లేని కారణమున మిగులఁ జలించునది రజోగుణము గలదియైన బుద్ధి పాడైపోవును. రక్షించుటకు శక్తుఁడనై కూడ కోపాతిశయమున జానకిని రక్షింపనైతిని గదా.

సీ. భూమిజ మరణింప♦రామలక్ష్మణులును, బ్రతుకఁ రవ్వారబ♦పాటుఁ జూచి
సమయు సుగ్రీవుండు♦సహబంధుఁడై యది,విని భరతుండును♦విలయమొందు

శత్రుఘ్నుతో నిట్లు•మిత్రకులం బెల్లఁ, దీఱినఁ బ్రజలును•దీర్ఘశోక
సంతప్తు లయ్యెద•రింతకు ధర్మార్థ, హీనుఁడ భాగ్యర•హితుఁడ రోష
తే. దోషకలితాంతరంగుండ•దుర్మదుండ
నైన నే మూల మై లోక•మంత నాశ
మొందఁ గన్గొందుఁ, గల దొకో•సంశయంబు
దీన? ననుచును జింతించె•దీనుఁ డగుచు. ౧౨౬౧

అర్థములు. మిత్రకులము=సూర్యవంశము, తీఱినన్=నశింపఁగా, దీర్ఘశోక సంతప్తులు=విస్తారమైన శోకముచేఁ దపించువారు, ధర్మార్థహీనుఁడన్=ధర్మ ప్రయోజనము లేనివాఁడను-భాగ్యరహితుఁడను=సీతారాములు కూడియుండఁగా జూచు పుణ్యము లేనివాఁడను-రోషదోషకలిత+అంతరంగుఁడ=రోషమనెడి పాపముతోఁ గూడిన మనస్సుగలవాఁడను-దుర్మదుఁడన్=చెడ్డ గర్వము గలవాఁడను-మూలమై=కారణమై.

తాత్పర్యము

జానకి మరణించెనా రామలక్ష్మణులు బ్రదుకరు. వారలు మడియుటఁజూచి బంధువులతోడ సుగ్రీవుఁడు చచ్చును. ఇదంతయు విని శత్రుఘ్నునితో భరతుఁడును జచ్చును. ఈ విధముగ సూర్యవంశము నశింపఁగా ప్రజలు దీర్ఘమైన శోకముచే మిగుల తపింతురు. ఇంతటి యనర్థమునకు ధర్మము ప్రయోజనముగా లేనివాఁడను, అదృష్ట హీనుఁడను కోపమను పాపములచేఁ జెడిన మనస్సు గలవాఁడను, బలముగలదు, నాకెవ్వరడ్డమని పొగరుచే దేహము తెలియని వాఁడను, నేను కారణమై లోక మంతయు నాశమై పోవుట చూడ వలసియున్నది. ఇందు సందేహము లేదు. అని శోకము గలవాఁడై హనుమంతుఁడాలోచించెను.

—• హనుమంతుడు సీతాదేవిని నగ్ని దహింపఁజాలఁ డని నిశ్చయించుట.•—

క. ఈ విధమునఁ జింతించెడి, పావనికిం బూర్వదృష్ట•భద్రశకునముల్
వావిరి మెయిఁ దోఁపఁగఁ జే, తోవీథిం జింత సేయఁ•దొడఁగెన్ మఱలన్.

అర్థములు, పూర్వదృష్ట=పూర్వము కనఁబడిన-భద్రశకునముల్=శుభచిహ్నములు-మెయిన్=దేహమునందు-తోఁపఁగన్=కనఁబడఁగా.

దక్షిణాక్షిపరిస్పందో దక్షిణస్య భుజస్య చ
హృదయస్య ప్రసాదశ్చ సద్య స్సంసిద్ధి సూచకాః॥

మగవారికిఁ గుడి కన్ను, కుడిభుజము అదరుటయు హృదయము ప్రసన్నమై యుండుటయు నప్పుడే కార్యసిద్ధి తెలుపు శుభసూచకములు.

తాత్పర్యము

ఈ విధముగ నాలోచించు నాంజనేయునికి ముందు కనఁబడుచుండిన శుభ

శకునములు దేహమునందుఁ గానరాఁగా మఱల నిటు లాలోచించెను.

చ. అది యెటు సంభవించుఁ? గల•దా దహియింపఁగ నగ్ని నగ్ని? భూ
విదితమహాత్మ శీలవతి•స్వీయమహామహిమంబుచేత న
భ్యుదయము నొందకున్న! వర•పుణ్యచరిత్ర మహాత్ముదేవినిన్
సదమలశీలగుప్తమహి•జన్ దహనుం డెటుదాఁకఁ జాలెడిన్? ౧-౨౬-౩

అర్థములు. అది=సీతాదేవి యగ్నిచే నశించుట-భూవిదిత మహాత్మ=ప్రపంచమునఁ బ్రసిద్ధికెక్కిన గొప్ప మహిమగలది. శీలవతి=సదాచారము గలది. స్వీయ మహిమంబుచేత=తన గొప్ప పాతివ్రత్య మహిమచే- అభ్యుదయము=శుభము- సదమలశీల గుప్త=మంచి నిర్దోషమైన సదాచారముచే రక్షింపఁబడు దానిని.

తాత్పర్యము

సీతాదేవి నఁట-అగ్నియఁట-దహించు నఁట-అయ్యో! నా తెలివి తెల్లవాఱ నెటువంటి యాలోచన చేసితిని. సీతగూడ రాక్షస స్త్రీవంటి దని తలఁచితిని గదా- అయ్యో! నా పాపమా! అగ్నిని నగ్ని దహించుట యెందైనఁగలదా! ప్రపంచము నం దంతయుఁ బ్రసిద్ధికెక్కిన గొప్పమహిమ గలది.సదాచారసంపన్న తన గొప్ప మహిమముచే బాగుపడి యుండదా! గొప్ప పుణ్యపు నడవడి గల రామచంద్రమూర్తి దేవిని, మిగుల నిర్మలమైన పాతివ్రత్యముచే రక్షింపఁబడు దానిని, జానకిని నగ్నిహోత్రుఁడు దాఁకఁగలఁడా? అంతటి శక్తి యతనికిఁగలదా?

ఉ. రాము మహాత్మతన్ జనక•రాజసుతాసుకృతంబుకల్మి న
న్నా మెయిఁ గాల్పనేరని హు•తాశనుఁ డెట్టులు కైకపట్టిలో
నా ముగు రన్నదమ్ములకు•నర్చిత దేవతయై రఘూత్తము
ప్రేమకు నాకరం బయిన•ప్రేయసినిన్ దహియింపఁ జాలెడిన్? ౧-౨౬-౪

అర్థములు. సుకృతంబు=పాతివ్రత్యము-ఆమెయిన్=ముందు చెప్పిన విధముగ-అర్చిత దేవత=పూజింపఁబడు దేవత-ఆకరము=స్థానము.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి మాహాత్మ్యముచేత- సీతాదేవి పాతివ్రత్య సంపదచేత నా దేహమును గాల్ప సమర్థుఁడు గాని యగ్నిహోత్రుఁడు లక్ష్మణ భరత శత్రుఘ్నులు మహాలక్ష్మివలె నెవ్వతను బూజించు చున్నారో, ఎవతె శ్రీరామచంద్రమూర్తి ప్రేమకు స్థానమో అటువంటి శ్రీరామప్రియురాలిని యగ్నిహోత్రుఁడా గాల్పగలవాఁడు?

ఆ. అవ్యయుండు ప్రభువు•నఖిలంబు నెం దేని,గాల్చివైచు వేల్పు•గాడ్పుసఖుఁడు
పూనఁ డయ్యె నాదు•పుచ్ఛంబు దహియింప, నమ్మహానుభావ•సంతు నెట్లు?

అర్థములు. అవ్యయుండు=నాశములేనివాఁడు- పుచ్ఛంబు=తోఁక

తాత్పర్యము

నాశము లేనివాఁడు, ప్రభువు నైన యగ్నిహోత్రుఁడు రామచంద్రమూర్తి దాసుఁడనై యాయన కార్యము చేయుచున్నా నను తలంపుతో నాతోఁక కొన వెంట్రుకనైనఁ గాలుపఁ బూనని వాఁడు అటువంటి మహానుభావురాలిని నెట్లు తాఁకఁగలఁడు.

తే. ఔర! లంకకు వచ్చుచో•నీరనిధిని, నడుమఁ గన్గొంటిఁ గాదె మైనాక మనెడి
శైలమొక్కటి నన్ను నా•శ్వాసపఱుప,ననుచు వెండియుదానిని•నాత్మఁదలఁచి.

తాత్పర్యము

ఏమి యాశ్చర్యము! నేను లంకకు వచ్చునపుడు సముద్రము నడుమమైనాక పర్వతము నాకు నూఱట గలిగింప వచ్చెను గదా. ఇది యెవరి యనుగ్రహము? అనుచు నాలోచించి.

ఉ. సూనృతవాక్యసంపదను•శుద్ధతపంబునఁ బ్రాణనాయక
ధ్యానరతైకచిత్తమున•నాయమ కోరిన హవ్యవాహునే
పూని దహింపఁగాక, పువుఁ•బోఁడిని నగ్ని దహింపఁ జాలునే?
లేనికుశంక లేల యని•లేమ మహత్త్వము నెంచుచుండఁగన్. ౧౨౬౭

అర్థములు. సూనృత వాక్య సంపదను=సత్యము చెప్పుట యను సంపత్తి చేతను-శుద్ధ తపంబునన్=నిర్మలమైన పాతివ్రత్య మను తపస్సు చేతను-ప్రాణ నాయక ధ్యానరతైక చిత్తమునన్=తన భర్తనే ధ్యానించుట యందలి ప్రీతి యొక్కటియె గల మనస్సు చిత్తము చేతను-కోరినన్=ఇష్టము గల దయ్యేనేని-హవ్యవాహునే=అగ్నిహోత్రునే-కుశంకలు = పనికిమాలిన దుష్ట సందేహములు లేమ=స్త్రీ.

తాత్పర్యము

సమస్తలోకముల జయింపజాలు సత్యవాక్య సంపదచేతను, నిర్మలమైన పాతివ్రత్య మను తపస్సుచేతను, భర్తను ధ్యానించుట యందే సంతోషించు మనస్సుగల దగుటచేతను నామె కోరిన నగ్నిహోత్రునే దహింపఁగలదు. అటు వంటి స్త్రీని నగ్ని యేమి దహించువాఁడు. నాకేల యీ పనికిమాలిన కుచ్చితపు సందేహములు గలిగెనని సీతామాహాత్మ్యమును నాలోచించు చుండఁగా.

క. ఔరా! వాయుతనూజ, ప్రేరితమగు నగ్ని లంక•నెల్ల దహించెన్
దోరణవ ప్రాట్ప్రా,కారసమేతం బసాధ్య•కార్యం బిదియున్. ౧౨౬౮

తాత్పర్యము

ఆశ్చర్యమాశ్చర్యము!! హనుమంతునిచేఁ బ్రేరింపఁబడిన యగ్ని తోరణ ములతోను ప్రాకారములతోను బురుజులతోను లంకనంతయు దహించెను. ఇది యసాధ్యకార్యము.

క. స్థానములు విడిచి పరువిడ, దానవమాణవక వృద్ధ•తరుణీజనతా
నానారోదనముల లం,కానగరము గుహల నేడ్చు•కైవడిఁ దోచెన్. ౧౨౯

అర్థములు. మాణవక=బాలురు, జనతా=జనసమూహము.

తా త్ప ర్య ము

తమ తమ యిండ్లు వదలి పరువెత్తిపోయి రాక్షసబాలురు, వృద్ధులు, వయస్సు స్త్రీ సమూహము, గుహలయందుఁజేరి యేడువఁగా లంకానగరము గుహలందు నేడ్చుచున్నదా యేమి యన్నట్టు లున్నది.

క. ఏమీ చిత్రము భవన, గ్రామంబులతోడ లంక•గాలియు సకలం
బా మహికన్యక మాత్రము, సేమంబున నున్న దగ్ని•సేరదు సీతన్. ౧౨౦

అర్థములు. భవనగ్రామంబులు-ఇండ్ల సమూహము, "గ్రామః పల్ల్యాం స్వరే బృందే త్వయం శబ్దాదిపూర్వకః." నానా. ర. గ్రామ శబ్దము సమూహ వాచకమైనపుడు దీనికి ముందు శబ్దము మొదలైన దేదైన యొక శబ్దముండును. శబ్ద గ్రామము-స్వరగ్రామము-గుణగ్రామము-భూతగ్రామము మొదలైనవి.

తా త్ప ర్య ము

ఏమి యీ యాశ్చర్యము! లంక ఇండ్లసమూహములతో నంతయుఁ గాలియు సీతాదేవి మాత్రము క్షేమముగా నున్నది.ఆమెను నగ్ని సమీపింపనుగూడలేదు.

క. అని ఋషులు చారణాదులు, వినువీదిని బలుకుచుండ•వీనుల నమృతం
బును గురిసిన యట్లా నుడు,లను విని యా హనుమ పొంగి•లాఁతుఁగఁ దనలోన్.

అర్థములు. వినువీదిని=ఆకాశమున, వినునట్టి వీథి. ఆకాశము శబ్దగుణకము,-నుడులను=మాటలను-లాఁతుగన్=అధికముగ.

తా త్ప ర్య ము

ఆకాశమున ఋషులు, చారణులు మొదలగువారు చెవులలో నమృతము పోసినట్లు చెప్పుచుండఁగా నా మాటలు విని హనుమంతుఁడు మిక్కిలి యుప్పొంగి తనలో.

చ. కలిగిన సన్నినిమిత్తములఁ•గన్నులఁ జూచిన భూరికారణం
బుల, ఋషి వాక్యజాలముల•భూమిజ సేమ మెఱింగి, యాత్మలో
నలరుచుఁ గన్నులారఁగ మ•హాసతిఁ జూచి; సుఖం బెఱింగి, యా
వలఁ, బయనింపఁగాఁ దలఁచె•వాయుసుతుండు కృతార్థుఁ డంతటన్. ౧౨౨

అర్థములు. సన్నిమిత్తములన్=శుభశకునములను, కుడికన్నదరుటలోనైనవి, అలరుచున్=సంతోషించుచు.

తా త్ప ర్య ము

శుభశకునములు కలుగుటచేతను, సీతాదేవి మాహాత్మ్యము కన్నులారఁ

జూచి యుండుటచేతను, ఋషుల మాటలచేతను, సీత క్షేమముగా నున్నదని తెలిసికొని సంతోషించుచు నయినను నా మహాపతివ్రతను కన్నార దర్శించి ప్రత్యక్షముగ క్షేమముగ నుండుట చూచి తెలిసికొని పిమ్మటఁ బ్రయాణము చేయవలయునని వచ్చిన పని నిర్విఘ్నముగ సాంతముగ నెఱవేర్చిన హనుమంతుఁడు తలఁచెను. ఇట్లు తలఁచి.

—♦ ౫౬ వ సర్గము. హనుమంతుఁడు మఱలసీతాదేవిని సందర్శించుట. ♦—

ఉ. ఆ లలితాంగి యున్న యెడ♦నా పవనాత్మజుఁ డేగి శింశుపా
మూలగతావనీజఁ గని♦మ్రొక్కెడి తల్లి! మదీయభూరి పు
ణ్యాళివశంబునం గుశలి♦తా స్థిరహించెడి నిన్నుఁ గంటి, నా
యేలినవాని కార్యతతు♦లెల్లను దీరె యథోచితంబుగన్. ౧౨౭౩

అర్థములు. శింశుపామూలగతావనీజన్=శింశుపావృక్షము మొదటనుండు సీతాదేవిని, మదీయ=నా యొక్క, భూరి=గొప్పదగు, పుణ్యాళి=పుణ్యపరంపరల, వశంబునన్=కారణముచేత, కుశలితాస్థిన్=క్షేమముగా నుండు, ఏలినవాని=ప్రభువుయొక్క, యథోచితంబుగన్=తగిన రీతిని.

తాత్పర్యము

ఆ కోమలదేహ యున్న ప్రదేశమునకుఁ బోయి శింశుపావృక్షము క్రిందఁ గూర్చుండిన సీతను దర్శించి నమస్కరించి తల్లీ! నేను జేసిన గొప్పపుణ్యముల పరంపరల కారణముచే క్షేమముగా నుండు నిన్ను మఱల దర్శించు భాగ్యము కలిగెను. నా ప్రభుకార్య మేదేది యెట్లెట్లు చేయవలయునో యట్టట్టు లన్నియుఁ జేసితిని.

దీనివలన 'నీచాశ్రయం న కర్తవ్యమ్। కర్తవ్య మ్మహదాశ్రయమ్' నీచుల నాశ్రయింపరాదు. గొప్పవారినే యాశ్రయింపవలయు నన్నట్లు సీతాదేవి నాశ్రయించిన కారణమున శింశుపావృక్షము అశోకవృక్షములే గాక వాని చుట్టునుండునవి కూడ విఱిగి పడక కాలిపోక నిలిచినవి. దీనివలన సీతారాముల నాశ్రయించినవారే గాక వారి నాశ్రయించినవారు కూడఁ జెడరని యేర్పడుచున్నది. విభీషణుఁడే కాక విభీషణు వెంటవచ్చిన వారుకూడ రక్షింపఁబడిరిగదా-'పశుర్మనుష్యః పక్షీ వా యేచ వైష్ణవ సంశ్రయాః, తేనైవ తే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమంపదమ్॥ విష్ణుభక్తుల నాశ్రయించిన పశువులు మనుష్యులు పక్షులు కూడ వాని వెంట విష్ణుని పరమపదమునకుఁ బోదురు అను శ్లోక మనుసంధింపనగు.

క.అనుచుఁ బ్రయాణోన్ముఖుఁడౌ,హనుమనుమఱిమఱియుఁ గాంచి♦యవనిజయనియెన్
జెనిమిటిపైఁ గలప్రీతిన్,మునుకొని సూచించువాక్య♦ముల నిట్లనుచున్. ౧౨౭౪

అర్థములు. ప్రయాణోన్ముఖుఁడు=బయలుదేఱిపోవఁ బ్రయత్నించు వాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి బయలుదేఱి పోవఁ బ్రయత్నము చేయు హనుమంతు నితో తన భర్తపైఁ దన కుండు ప్రేమ తెలుపు వాక్యములను నిట్లని చెప్పెను.

క. నీ వొకఁడవె యీ కార్యము, పావని! సాధింప శక్తి•పరుడవు సుమ్మా
వావిరి బలోదయముచే, నివే కనియెదవు కీర్తి•నిర్దళితారీ! ౧-౨౭౫

అర్థములు. నిర్దళితారీ=చీల్పఁబడిన శత్రువులు గలవాఁడా.

తాత్పర్యము

ఆంజనేయా! నీ వొకఁడవే యీ కార్యమును నీ బలాధిక్యముచే శత్రువుల వధించి సాధింపశక్తి గలవాఁడవు సుమా. నాకంటె గొప్పవారు సుగ్రీవునొద్ద నున్నారని నీ భారము నీవు తప్పించుకొన యత్నింపకుము. ఎంద ఉన్నను ఈ కార్యసాధన భారము నీ యందే యున్నది. మఱి యెవ్వరీ కార్యమును సాధింప లేరు.

క. ప్రాకట శితరానాచా, నీకంబునఁ జలిపి లంక•నీఱుగఁ గడిమిన్
గైకొని నన్నేగినచోఁ, కాకుత్స్థున కదియె తగిన•కార్యము సుమ్మా. ౧-౨౭౬

తాత్పర్యము ౯౭౬ వ పద్యము చూచునది.

తే. పరమశూరుండు రాముండు•బవరమందు
నతని మగఁటిమి కనురూప•మైన దాని
యోజన యొనర్చి చెప్పుమీ•యోజ మీఱ
వనచరకులావతంస నీ•వనుచుఁ బలుక. ౧-౨౭౭

తాత్పర్యము. ౯౭౦ వ పద్యము చూచునది.

క. వినయము హేతుయుతంబును, ననఘార్థోపహితమైన•యీ దేవినుడుల్
విని యంజనవరతనయుం, డనియెన్ సముచితపుభంగి•నవనీసుతకున్. ౧-౨౭౮

అర్థములు. అనఘార్థోపహితము=దోషరహితమైన ప్రయోజనముతోఁ గూడినది.

తాత్పర్యము

అణకువతోను సకారణముగను దోషరహితమైన యర్థముతోఁ గూడినది గను నుండు నామె మాటలను విని యాంజనేయుఁడు తగిన రీతి నిట్లనియెను.

చ. అడలకు మమ్మ వానర బలాన్వితుఁడై వెస రామభద్రుఁ డీ
కడలిఁ దరించి రాక్షసుల•గర్వ మడంచి త్వదీయ శోకమున్
గెడపును, నమ్ము నా పలుకుఁ•గీడ్పడఁ బోకుము, రాముఁ జూడ న
య్యెడ కిదె యేఁగువాఁడ, సెల•వీయఁగదే జనయిత్రి మ్రొక్కెదన్. ౧-౨౭౯

తాత్పర్యము

తల్లీ! నీవు వ్యసనపడకుము. రామచంద్రమూర్తి వానర సేనలతోడ సముద్రము దాఁటివచ్చి రాక్షసుల పొగరణఁచి నీ శోకమును నిర్మూలము సేయును.

నా మాట నమ్ముము. నీవు సాహసముచేసి యపాయము కలుగు కార్యము చేసి కొనకుము. అనఁగా మరణింపకుము. ఇదిగో నిప్పుడే రామచంద్రమూర్తిని జూడఁ బోవుచున్నాఁడను. అమ్మా! నా కనుజ్ఞనిమ్ము, నమస్కరించెదను.

—♦ సీతాదేవిచే సెలవుగొని మరలి హనుమంతుఁ డరిష్టాద్రి నెక్కుట ♦—

మ. అని సాష్టాంగనమస్కృతుల్ సలిపి కీ♦శాధీశుఁడున్ స్వామి ద
ర్శనకౌతూహలి యై లతాబహుళభూ♦జవ్రాత మై కేసరి
స్వనగంభీరగుహాసమూహ మయి య♦క్షవ్యూహగంధర్వస
న్మునిసర్పాదినిషేవితం బగుచు స్వా♦దుస్ఫీతమూలాద్య మై. ౧౨౨౦

అర్థములు. సాష్టాంగ నమస్కృతుల్=సాష్టాంగముగ నమస్కారము' తొలుత సీతాదేవిని జూచినపుడు ప్రాకృతస్త్రీయని తలఁచి హనుమంతుఁడు సీతాదేవికి నమస్కరించినవాఁడుకాఁడు. సంభాషణానంతరము ౧౦౦౧ వ పద్యమున పతివ్రత యనియు, నూరకశిరస్సుతో నమస్కరించెను. ఇప్పుడు తల్లి యను భావముతో సాష్టాంగముగ నమస్కరించెను. యోగ్యత తెలియు కొలఁది భక్తియు హెచ్చెను, ఇప్పుడు కేవలము మాతృభావమె కాని వేఱుభావము లేదు. దీనివలన నుత్తమ పతివ్రతలకు పతిదేవతలకు మాతృభావముతో నెట్టివారైన, నెంతటి వారైన సాష్టాంగ నమస్కారము చేయవలయు నని యేర్పడు చున్నది. స్వామి దర్శన కౌతూహలి=రామచంద్రమూర్తిని దర్శించుట యందుఁ గోరిక గలవాఁడై- లతా బహుళ భూజవ్రాతమై=అనేక వృక్షములు తీఁగలు గలదై-కేసరిస్వన= సింహముల ధ్వనులు గల-గంభీర గుహా సమూహమయి=లోఁతైన గుహల సమూహములు గలది-స్వాదుస్ఫీత మూలాద్యమై = మిక్కిలి తియ్యనైన వేళ్ళు మొదలయినవి కలదై.

తా త్ప ర్య ము

ఇట్లు చెప్పి యభివాదనము చేసి యామెచే నాశీర్వదింపఁబడి వానర శ్రేష్ఠుఁడు రాముని దర్శింపఁ గోరిక కలవాఁడై విశేషముగఁ దీఁగలు చెట్లు గలిగి సింహముల ధ్వనులతోఁ గూడిన పొడుగాటి గుహలు గలదై యక్షసంఘములు, గంధర్వులు మునులు, పాములు గలదై తియ్యని కందమూలములు గలదై.

సీ. తుంగపద్మకజుష్ట♦రంగనీలోద్యాన,మాలికాహృద్యమై♦క్రాలుదాని
శృంగాంతర విలంబి♦రంగత్పయోదోత్త, రీయమై కనువిందు♦సేయుదాని
మార్తాండకరబోధ్య♦మానోన్మిషద్ధాతు, నేత్రసంజాత మై♦నెగడుదాని
నిర్ఝరచయమంద్ర♦నిస్స్వనాధ్యయనఘో, షాకలితం బయి♦యమరుదానిఁ

తే. ప్రస్రవణరావవిస్పష్ట♦రమ్యగీత, మైనదానిని దేవదా♦ర్వవనిజముల
నూర్ధ్వబాహువు నట్టుల♦నొప్పుదాని, నిలను బడు నీళ్ళనులివుల♦నేడ్చుదాని.

ఈ పద్యము దీని తరువాతి పద్యము హనుమంతుఁడు సముద్రమును దాఁటుటకై యెక్కిన యరిష్ట మను పర్వతముయొక్క వర్ణనము.

అర్థములు. తుంగ=ఎత్తైన-పద్మక=తామరరంగు గల ప్రాకులచేత-జుష్ట=కూడిన-రంగ=ప్రదేశములు గల, నీలోద్యాన=నల్లని వనముల-మాలికా=వరుసలచే-హృద్యమై=మనోహరమై, ప్రకాలుదానిన్=ప్రకాశించు దానిని, ఇది పర్వతమునకుఁ గట్టు దోవతియై యున్నదని భావము. శృంగాంతర విలంబి=శిఖరముల నడుమ ప్రేలాడుచు-రంగత్=ప్రకాశించు-పయోద=మేఘములనెడి-ఉత్తరీయమై=ఉత్తరీయము కలదానిని-మార్తాండకర=సూర్యకిరణములచే - బోధ్యమాన=మేలుకొలుపఁ బడుచున్న-ఉన్మిషత్=ఱెప్పలు దెఱచి చూచుచున్న - ధాతు=ధాతువులనెడి-నేత్రసంజాతమై=నేత్రసమూహము గలదై, నిర్ఝరచయః=సెలయేళ్ళ సమూహములయొక్క-మంద్ర=గంభీరమైన-నిస్స్వన=ధ్వని యనెడి-అధ్యయన ఘోషా కలితంబు=వేదాభ్యాసముచేయు ధ్వని కలదై, ప్రస్రవణరావ=ఊటనీళ్ళు దూఁకు చప్పుడనెడి, విస్పష్ట=మిగుల స్పష్టముగాఁ దెలియవచ్చు, రమ్య=మనోహరమైన గీతము=పాటలు గల దానిని, దేవదారు+అవనిజమూల = దేవదారు చెట్లచేత, ఊర్ధ్వబాహువులు=చేతులెత్తినవి, ఇలను=నేలమీఁద, ఉలివుల=ధ్వనులచే.

## తాత్పర్యము

ఎత్తైన తామర వర్ణము గల ప్రదేశములు గల నల్లని యుద్యానములనెడి దోవతియు, శిఖరముల నడుమ ప్రేలాడు మేఘము లనెడి యుత్తరీయము గలదై, సూర్య కిరణములచే మేలుకొలుపఁబడిన (విచ్చిన) ధాతువులనెడి నేత్రములు కలదై, సెలయేళ్ళ మంద్రధ్వను లనెడి వేదాధ్యయన ధ్వనికలదై, ఊటనీళ్ళు పడుటవలనఁ గలిగిన విస్పష్టమైన ధ్వని యనెడి సంగీతము కలదై, దేవదారు వృక్షము లనెడి చేతులనెత్తినదై నేలఁబడుచున్న నీళ్ళచప్పుడు గలదానిని.

సీ. శ్యామమై పుష్పించి♦శరదభ్రతతులచే, వార్ధకమునఁబోలె♦వణఁకుచుండ
వెదురుబొంగుల గాలి♦ వెడవెడఁ జొచ్చుచు, వెడలఁగూజిత మన♦ వెలయుచుండ
సర్పముల్ బుసగొట్టు♦సాకున హనుమపై, మల నిశ్శ్వసించిన♦మాడ్కి నుండ
నిండారఁగా మంచు♦నిండి గంభీరమై గుహలు ధ్యానించెడి♦వహి భజింప

తే. వారిధరపాదనిభ పాద♦వారములను, నడచి చనుచున్నయట్టి నా♦న్యమువహింప
సాలతాలాశ్వకర్ణవం♦శప్రకీర్ణ, మగు నరిష్టనగంబు నా♦హనుమ యెక్కె.

అర్థములు. శ్యామమై=నీలమై. శరదభ్ర తతులచే=శరత్కాలమందలి మేఘములచే; వార్ధకమునఁ బోలెను = ముసలితనము నందువలె, కూజితము=అవ్యక్త మధురధ్వని-కోకిల పంచమధ్వని-వారిధరపాద=కొండలు ప్రాకుట కను

కూలమైన, మేఘముల యవయవములతో-నిభ=సమానమైన-పాదవారము:లను=గుట్టల సమూహముల చేత-ప్రకీర్ణ=విరివియైన-వహి=విధము.

తాత్పర్యము

నలుపై-పుష్పించి శరత్కాల మేఘములచే మునలి దానివలె వణఁకుదాని, వెదురుబొంగులలో నడుమ నడుమఁ బ్రవేశించి వెడలుటచే పంచమధ్వనివలె ధ్వని గలదానిని, పాములు బుసకొట్టు నెపమున హనుమంతునిపై శ్వాసము విడుచుచున్నట్లుండు దానిని, పూర్ణముగా మంచు నిండి గంభీరమై గుహలు, ధ్యానించు విధముగ నుండు దానిని, మేఘములచేఁ గ్రాఁకఁబడు గుట్టలు గలదానిని మద్ది-తాటి-ఇనుమద్ది-వెదురు వీనిచే వ్యాపించి యుండుదానిని, అరిష్టమను పేరుగల కొండను హనుమంతుఁ డెక్కెను.

సీ. చక్కఁగాఁ బూచిన•పెక్కు తెఱంగుల, లతికలచే నలం•కృతము నగుచు
వింతవింతగ బహు•విధము లౌ మృగముల, వారంబుచే నభి•వ్యాప్త మగుచుఁ
బలుచాయ లగుధాతు•వుల వన్నె లొప్పారు, శీతలవారి భూ•షితము నగుచు
బండల గుండుల•ప్రస్రవణంబుల, దుర్గమం బగుచును•దోఁచుదాని

తే. యక్షగంధర్వ ఋషికిన్న•రాహి సేవి, తంబు నగుదాని బెబ్బులుల్•దనరుదాని
సింగములుకందరములఁ బె•లంగుదాని, రాముఁగనుఁగొనుత్వరనెక్కె•భీమబలుఁడు.

అర్థములు. లతికల చేన్=తీఁగలచే-అలంకృతము=అలంకరింపఁబడినది-అభివ్యాప్తము-మిక్కిలి వ్యాపింపఁబడినది-శీతలవారి=చల్లనినీటిచే - ప్రస్రవణంబులన్=ఊట కాల్వలచే-దుర్గమంబు=పోరానిది. కందరములన్=గుహలచే.

తాత్పర్యము స్పష్టము.

క. నిజపాదఘట్టనంబుల, రజమై శిల లఱుగ నెక్కె•రాజీవాళీ
భుజగభయదాబ్ధిఁ గని వా, తజుఁడనిలునిభంగి దాని•దాఁటఁ గడంగెన్. ౧-౨౦౪

అర్థములు. నిజపాదఘట్టనంబులన్=తన కాళ్ళత్రొక్కుడులచే-రజమై=పొడియై-అఱుగన్=క్షయింపఁగా-రాజీవాళీ=గుంపు వెంటవేసికొని తిరుగు కొలువాసము లను చేపల పంక్తులచే-రాజీవ మత్స్యే రాజీవోమృగే మత్స్యే-నానా. ర॥ భుజగ=పాములచే, భయద = భయంకరమైన-అబ్ధిన్ = సముద్రమును-వాతజుఁడు=వాయుపుత్రుఁడు-అనిలుని భంగిన్=గాలివలె-కడంగెన్=ప్రయత్నించెను.

తాత్పర్యము

తన కాలి త్రొక్కుడులచేత ఱాలు పొడి పొడి యగుచుండగా నెక్కె కొలస మీనులు పాములు గలిగి భయము కలిగించు సముద్రమును హనుమంతుఁడు దాఁటఁ బ్రయత్నించెను.

ఉ. ఉత్తరపార మేగుతమి•నొత్తెఁ బదంబుల శైలరాజమున్
దత్తఱ మందె సత్త్వములు•ధారిణి డొల్లె వరప్రసూనసం
పత్తులతో ద్రుమోత్కరము•పర్వత కందర సంస్థసింహముల్
బిత్తరపాటుతో దెసలు•పెల్లగిలన్ ధ్వని యిచ్చె హెచ్చుగన్. ౧౨౮౫

అర్థములు. ఉత్తరపారము=ఉత్తరపు గట్టు, వనప్రసూన సంపత్తులతోన్=అధికములైన యడవి పూలతో, ద్రుమోత్కరము=చెట్లసమూహము, పర్వత కందర=కొండగుహలయందు, సంస్థ=ఉన్నసింహములు, బిత్తరపాటు=భయము.

## తాత్పర్యము

సముద్రముయొక్క యుత్తరపుగట్టు చేరు కోరికతో నా పర్వతశ్రేష్ఠమును కాళ్ళచే నదుమఁగా నడవి మృగములు తత్తఱలాడెను. పూల సమూహములతో చెట్లు నేలఁబడెను, కొండ గుహలందున్న సింహములు బెదరి దిక్కులు పెల్లగిల్లు నట్లు విశేషించి ధ్వనించెను.

క. కుసుమితతరుచయములు సరభసముగ, జను నతని తొడల•పటువేగమునన్
బసచెడి వజ్రము తాఁకున, వసుమతిఁ గూలినవిధానఁ • బడె భగ్నములై.

అర్థములు. కుసుమితతరు చయములు=పూచిన చెట్లసమూహములు, సరభసముగన్=శీఘ్రముగ, భగ్నములై=విఱిగినవై.

## తాత్పర్యము

వేగముగఁ బోవు నతని తొడలు తాఁకి పూచిన పూలచెట్లు బిగువు చెడి పిడుగుపడిన విధమున విఱిగి నేలఁ బడెను.

క. గాఢప్రపట్టి జవోద్ధతిఁ, బీడిత మై గిరిమృగేంద్ర•బృందంబు గుహా
క్రోడంబులలోఁ దబ్బి, బ్బాడెను గగనంబు పగులు•నారవ మెసఁగన్.

అర్థములు. జవోద్ధతిన్=వేగాధిక్యముచే, పీడితమై=బాధింపఁబడినదై. గిరి మృగేంద్ర బృందంబు=కొండ సింహముల సమూహము, గుహాక్రోడంబులలో=గుహలందలి సందులలో, తబ్బిబ్బాడెను=తత్తఱపడెను.

## తాత్పర్యము

హనుమంతుని వేగాతిశయముచే బాధింపఁబడి కొండ సింహములు గుహలలో దూఱి యందలి సందులలోఁ దబ్బిబ్బై దిక్కులు పగులునట్లు ధ్వనించెను.

క. తూలఁగఁ జీరలు పైఁటలు, వ్రేలఁగ మెయిభూషణములు•వీడ్వడఁ గలఁగన్
శైలంబున విద్యాధర, బాలామణు లెగసి చనిరి•పటుజవయుక్తిన్. ౧౨౮౮

## తాత్పర్యము

చీరలు జాఱిపోవుచుండఁగా పైఁటలు వ్రేలాడు చుండఁగా, ఆభరణము లొక దానిలో నొకటి పెనసికొని మార్పడుచుండఁగా కలఁత చెంది యా కొండయందలి విద్యాధర స్త్రీలు మిగుల వేగముగ నెగసిపోయిరి.

సీ. అధికప్రమాణమ♦హావిషదీప్తజి,హ్వాలు దూల్లెఁ బాములు♦తలలు నలియఁ
గిన్నరోరగయక్ష♦కింపురుషాదులు, ఖగస్థు లైరి త♦న్నగము విడిచి
సనగకూటోద్దగ్ర♦శైలంబు దిగఁబడి,యారసాతల మేగె♦నద్భుతముగఁ
బదియోజనంబుల♦పఱపును ముప్పది, యోజనంబులయెత్తు♦నొప్పుచున్న

తే. గా ధరాధర మొక్క త్రుటి♦యంతలోన. నేలమట్టంబుగాఁ బోయె♦నీరనిధిఁ ద
రింప నుద్యుక్తుఁడగుచు హ♦రిప్రవీరుఁ, డిట్లు మింటికిఁ గుప్పించి♦యెగయుటయును.

అర్థములు. అధిక ప్రమాణ=మిక్కిలి గొప్పనగు, మహావిషదీప్తజిహ్వాలు=గొప్పవిషముచే జ్వలించుకోఱలు గలవి, నలియన్=నలగిపోఁగా, సనగకూటోద్దగ్ర శైలంబు=చెట్లతో శిఖరములతోఁగూడిపొడవైన పర్వతము, ఆరసాతలము=పాతాళము వఱకు, అవ్యయీభావ సమాసము. 'విభాషా అపపరిబహిరంచవః పంచమ్యాః' పాణి. II. 1-11-12 నేలమట్టంబుగాన్=నేలతో సమముగా, ఉద్యుక్తుఁడు=ప్రయత్నించినవాఁడు.

తాత్పర్యము

హనుమంతుఁడు సముద్రము దాఁటుటకై యాకాశమునకుఁ గుప్పించి యెగురఁగా మిగుల పెద్దవై చెడ్డ విషముచే జ్వలించు కోఱలు గల పాములు తలలు నలుగు నట్లు రాల సంకుల దొల్లెను. కిన్నరులు పన్నగులు యక్షులు కింపురుషులు లోనగువారు ఆ పర్వతము విడిచి యాకాశమున కెగిరిరి, చెట్లతో శిఖరంబులతో ఎత్తైన పర్వతము పాతాళము వఱకు దిగఁబడెను. పదియోజనముల వెడల్పు, ముప్పది యోజనముల యెత్తుగల యా పర్వతము నిమిషములో నేలతో సమ మయ్యెను.

—♦ ౫౭-వ సర్గము. హనుమంతుఁడు మఱల సముద్రము లంఘించుట ♦—

సీ. అర్క కారండవం♦బబ్జకువలయంబుఁ, దిష్యశ్రవణహంస♦దీపితంబు
జలధరశైవాల♦శాద్వలంబును బున, ర్వసుమహామీనవి♦రాజితంబు
నంగారక మహాగ్ర♦హంబు నైరావత, ద్వీపంబు స్వాతిహం♦సాపచితము
వాతసంఘాతసం♦జాతోర్మిచంద్రాంశు, శిశిరాంబుమంతంబు♦సిద్ధయక్ష

తే. భుజగగంధర్వఫుల్లనీ♦రజము నైన, యంబరిక్షార్ణవమున మ♦హాంబురాశి
నావ దరియించుచందాన♦నవ్యలీల, నంజనానందనుం డేగె♦నశ్రమముగ.

అర్థములు. ఆకాశమున హనుమంతుఁడు పోవుటకు సముద్రమునందుఁబోవు నావతోఁ బోల్చి చెప్పుచున్నాఁడు. అర్క కారండవము=సూర్యుఁ డనెడు నీటికోడి కలది-అబ్జకువలయంబు=చంద్రుఁడనెడి తెల్లకలువకలది-తిష్య=పుష్య నక్షత్రము-శ్రవణ=శ్రవణము అనెడి; హంస దీపితంబు=హంసలచేఁ బ్రకాశించునది-జలధర=మేఘ మనెడి-శైవాల=నాఁచు తీఁగ గలదియు-శైవాలము=పచ్చిక ప్రదేశము కలదియు-పునర్వసు=పునర్వసునక్షత్రము లనెడి, మహామీన=పెద్దచేఁపలచే

విరాజితంబు=ప్రకాశించునది-అంగారక=అంగారకుఁడను మహాగ్రహంబులు పెద్ద మొసలి గలదియు, గ్రహమే గ్రాహము-ఐరావత=ఐరావతము. అభ్రగజము కావున నది యాకాశముననే తిరుగుచుండును. కావున నైరావత మనెడి, ద్వీపంబు=దీవి గలది-స్వాతి హంసాపచితము=స్వాతి యనెడి హంసచేఁ బూజితము-వాత సంఘాత=వాయుసమూహముచే-సంజాత=పుట్టిన అల లనెడి, చంద్రాంశు=చల్లని కిరణములచే-శిశిర=చల్లనైన-అంబుమంతంబు=నీళ్ళు గల మేఘము-ఫుల్ల నీరజము=వికసించిన కమలము-అంబరిక్షార్ణవమునన్=ఆకాశమనెడి సముద్రమందు-అశ్రమముగనీ=గాసిలేక.

## తాత్పర్యము

సూర్యుఁ డనెడి నీరుకోడి, చంద్రుఁ డనెడి తెల్ల కలువ, పుష్యశ్రవణ నక్షత్రములనెడి హంసలు మేఘము లనెడి పాఁచి-పచ్చిక-పునర్వసు వనెడి మహామీనము, అంగారకుఁ డను మొసలి, ఐరావత మనెడి దీవి, స్వాతి యనెడి హంసము, గాలివలనఁ గలిగిన యల లనెడి మేఘము, సిద్ధులు యక్షులు సర్పములు గంధర్వులు ననెడి వికసించిన కమలములు నయి యాకాశ మనెడి సముద్రమున, సముద్రమును నావదాఁటునట్లు హనుమంతుఁడు ఆకాశమునఁ బోవుచుండెను. సావయవ రూపకాలంకారము. రూపకోపమానములకు తిలతండుల న్యాయ సంసృష్టము.

తే. ఆకసంబును మ్రింగునో యబ్జవైరిఁ, బట్టి గీరునొ సహ తార•భాస్కరంబు
గగనము హరించునో యనఁ•గపివరుండు,చనియె మబ్బులఁ జీల్చెడి•చందముగను.

అర్థములు. అబ్జవైరిన్=చంద్రుని, సహ తార భాస్కరంబు=నక్షత్ర సూర్యులతోఁ గూడిన, గగనమున్=ఆకాశమును.

## తాత్పర్యము స్పష్టము.

తే. తెలుపు నెఱుపును బసుపును•నలుపు నగుచుఁ,గృష్ణలోహితవర్ణంబు•నెసఁగుచుండ
నతుల తేజస్వియగు మరు•దాత్మజాతు దేహసంపర్కమున మొగుల్•తేజరిల్లె,

అర్థములు. కృష్ణలోహిత వర్ణంబు=నలుపు ఎరుపు గలసినవన్నె.

## తాత్పర్యము

మిగులఁ దేజోవంతుఁడైన హనుమంతుని దేహమును దాఁకుటచే, మేఘములు కొన్ని తెలుపుగను కొన్ని యెఱుపుగను పసుపుగను నలుపుగను ఎరుపు నలుపు గలసినవిగను నానావిధముల నొప్పుచుండెను.

క. మఱి మఱి లోనం జొచ్చుచు, మఱిమఱి వెలుపలను దోఁచి•మబ్బుల నడుమన్
మఱుఁగుచు మెఱయుచు నొప్పెడి, కఱకంఠుని శిరసుపూవు•గతిఁగపి యొప్పెన్.

అర్థములు. మఱుఁగుచున్=చాటగుచున్, మెఱయుచున్=వెలుపలఁ బ్రకాశించుచు, కఱకంఠుని=శివునియొక్క, శిరసుపూవు=తలయందలి పుష్పము

అనఁగాఁ జంద్రుఁడు, కళంకః (సు=కళ్లు) అనఁగా నలుపు, అది కంఠమునందుఁ గల వాఁడని మిశ్రబహువ్రీహి యని కొందఱ యభిప్రాయము, గరకంఠశబ్దభవ మని కొందఱ యభిప్రాయము.

తాత్పర్యము

ఒక్కొక్కసారి మేఘముల నడుమఁ బ్రవేశించి కానరాక యొక్కొక్కసారి బయల మెఱసి కానవచ్చుచు మబ్బులనడిమి చంద్రునివలె హనుమంతుఁడొప్పెను.

తే. విశదవస్త్రంబు ధరియించి•వివిధమేఘ, కాండవృతుఁడయి కనఁబడి•కానఁబడక
యంబరంబునఁ జనియెడి•యాంజనేయుఁ, డంబుజారి విధంబున•డంబు మీఱె.

అర్థములు. విశదవస్త్రంబు=తెల్లని వస్త్రంబు, దీనిచే నిందఱ రాక్షసులతోఁ బోరి వారిని చంపినను కట్టువస్త్రముపై నెత్తురు చుక్కలు పడలేదనిసూచన, మేఘకాండవృతుఁడయి=మేఘసమూహములతోఁ జుట్టఁబడి అంబుజారి= చంద్రుఁడు.

తాత్పర్యము

తెల్లని వస్త్రము ధరించి నానావిధములైన మేఘసమూహములతోఁ జుట్టఁబడి కానవచ్చి కొంతసేపు కానరాక కొంతసేపు ఆకాశమునఁ బోవు హనుమంతుఁడు చంద్రునివలె నుండెను.

తే. వారిధరనికురుంబంబు•దారితముగ, మాటి మాటికిఁ జలుపుచు•మారుతాత్మ
భవుఁడు బయలను మెఱయుచు•వైనతేయు మాడ్కిఁ దనరారె నాకాశ•మార్గమునను.

అర్థములు. వారి ధర నికురుంబంబు=మేఘసమూహము – దారితముగన్= చీల్చఁబడినదిగా–వైనతేయు మాడ్కిన్=గరుత్మంతునివలె–వినతా + ఏయ–వైనతేయ–అపత్యార్థక తద్ధితము.

తాత్పర్యము

మేఘ సమూహము నడుమఁ దూఱి చీల్చుచు నాంజనేయుఁడు బయల మెరసి గరుత్మంతుని వలె నాకాశమున నొప్పుచుండెను.

సీ. జలదనిర్ఘోషుండు•చటుల మహారావ,మున దెస లెల్లను•బూర్ణములుగ
రాక్షసప్రవరుల•రణమున వధియించి, తనపేరు నెల్లను•వినఁగఁ జేసి
పట్టనం బంతయు•వ్యాకులపడఁ జల్పి, శంక్తికంఠుఁడు వ్యథ•పడ నొనర్చి
ఘోరబలం బెల్లఁ•గూఁ పెట్టఁగాఁ గొట్టి, వైదేహికిని గడు•భక్తిమ్రొక్కి

ఆ. మహితతేజుఁ డైన•మారుతపుత్రుండు, మఱలివచ్చి జలధి•మధ్యమునను
జనుచునుండి శైల•సత్తము మైనాకు, హస్తమున స్పృశించి•యతని దాఁటి.

అర్థములు, జలదనిర్ఘోషుండు=ఉఱుమువంటి కంఠధ్వని గలవాఁడు–చటుల మహారావమున=భయంకరమైన గొప్ప ధ్వనితో–కూ పెట్టగాన్=కుయ్యోకుయ్యో యనునట్లు.

### తాత్పర్యము స్పష్టము

హనుమంతుఁడు లంకయందుఁ జేసిన కృత్యమిందు సంగ్రహింపఁబడినది. ఇందు మైనాకు స్పృశించె ననుటచేతను శ్రీరామచంద్రమూర్తి సీతాదేవితో మరలి వచ్చునపుడు మైనాకుని జూడుమని చెప్పుటచేతను మైనాకుఁడు మఱల నీళ్ళలో మునుఁగ లేదనియుఁ బైన కానవచ్చుచుండెననియు గ్రహింపనగు.

తే. జ్యాలతాముక్తనారాచమనఁగ నరిగి, వారిదాభమహేంద్రంబువలనుచూచి
దశదిశలు నిండ సింహనాదంబు సేసె, మేఘనాదంబుఁబోలె నమేయశక్తి.

అర్థములు. జ్యాలతాముక్తనారాచమనఁగన్ = తీఁగెవంటి యల్లెత్రాటి నుండి విడువఁ బడిన బాణమో యనునట్లు వారిదాభమహేంద్రంబు=మేఘముతో సమానమైన మహేంద్రపర్వతము.

### తాత్పర్యము

పరిమితి చెప్పరాని శక్తిగల హనుమంతుఁడు వింటినారినుండి విడువఁబడిన బాణమువలెఁ బోయి మేఘమువలె నుండు మహేంద్ర పర్వతముఁ జూచి పది దిక్కులు నిండున ట్లురుమువలె సింహనాదము చేసెను.

క. హితదర్శనలాలసుఁడై, వితతంబుగ నార్చి తోఁక విదుఁపఁగఁ గపి య
ద్భుతఘోషమున దివాకర,యుతగగనము బ్రద్దలైన యొప్పంగ నియెన్.

అర్థములు. హిత దర్శన లాలసుఁడై=మిత్రులను జూడవలయు నను కోరిక గలవాఁడై-వితతంబుగన్=ధ్వని విస్తరించునట్లు-ఆర్చి = ఆడించి-విదుపఁగన్= విదలింపఁగా దివాకరయుత=సూర్యునితోఁ గూడిన-దీనివలన నిదంతయు పగటి చర్య యని సూచన.

### తాత్పర్యము

మిత్రులఁజూడఁ గోరిక కలవాఁడై తోఁక జాడించి విదళింపఁగా నా యద్భుత ధ్వనికి సూర్యునితోడి యాకాశము బ్రద్దలైనట్లయ్యెను.

—— హనుమంతుని సింహనాదము కపులు విని హర్షించుట ——

ఉ. ఆయులి యూరువేగమున నావలితీరమునందు దీనులై
వాయుతనూజుఁ జూచు తమి వర్తిలు క్రోఁతులు విన్న హృష్టులై
రా యెడ ఋక్షరా జలరి యందఱఁ జేరఁగఁ జీరి యిట్లనున్
జే యని వచ్చె వాయుజుఁడు సిద్ధము కార్యము పండు చూడుఁడీ. ౧౨౯౯

అర్థములు. హనుమంతుఁడు కానవచ్చుటకు ముందే యాయన సింహనాదము వానరులకు వినవచ్చెను. ఉలివు=కంఠనాదము, ఊరువేగమున=తొడల వేగమునఁ బుట్టిన ధ్వని, దీనులై=ఏమో యేమో యను వ్యసనముచే ముఖములు వ్రేలవైచికొనినవారై, ఋక్షరాజు=జాంబవంతుఁడు, అలరి=సంతోషించి, చీరి= పిలిచి, జే=జయశబ్దభవము.

తాత్పర్యము

హనుమంతుని సింహనాదము, తొడల సందున దూతి వెడలు గాలిధ్వనిని, ఆవలియొడ్డున వ్యసనపడుచు నెప్పుడెప్పుడు హనుమంతుని జూతుమా యనుకోరిక గల క్రోఁతులు విని సంతోషించినవారైరి. అప్పుడు జాంబవంతుఁడు వారి నందఱఁ బిలిచి యిట్లనెను. వానరులారా! హనుమంతుఁడు జే యని వచ్చుచున్న వాఁడు. పోయిన కార్యము ఫలించినది చూఁడీ.

ఉ. సందియ మేమి లేదు ధ్వని•చందమ తెల్పెడిఁ గార్యసాధనం
బెందు నసాధితార్థులకు•నీ రవ మేటికిఁ గల్గు? నన్న న
య్యందఱు మిత్రదర్శనము•నాశ సముత్సుకు లౌచు నంజనా
నందను రావమున్ విను చు•నంత ముదంబున గంతు లాడుచున్. ౧౩౦౦

అర్థములు. అసాధితార్థులకు=కార్యము సాధింపనివారికి, రవము=ధ్వని.

దీనివలన శుభవార్త తాను బోకముందే తన మిత్రులకుఁ దెలిపి వారి కుందు మాన్పి సంతోషపెట్టవలయు నని సూచన-మనము పోయి చెప్పవచ్చులే యని యుండ రాదు. అంతవఱకు నిష్కారణముగా వారు వ్యసనపడునట్లు చేయుట మిత్ర ధర్మము గాదు.

తాత్పర్యము

సందేహము లేదు. హనుమంతుఁడు కార్యము సాధించెను. అది నీ కెట్లు తెలిసె నందురా? ఆయన ధ్వనియె కార్యము సాధించెనని తెలుపుచున్నది. కార్యము సాధింపని వాఁ డింత యుత్సాహముగ సింహనాదము చేయఁడు. అని చెప్పఁగా తక్కిన క్రోఁతులు హనుమంతుఁడు వచ్చుచున్నాఁడని సంతోషించెను. జాంబవంతుఁడు కార్యము సఫలము చేసికొని వచ్చుచున్నాఁడని సకారణముగఁ జెప్పెను. ఇట్లు చెప్పఁగా వా రందరు మిత్రుని దర్శించు నాశచే నాయన ధ్వని వినుచు గంతులు పెట్టుచుండిరి.

తే. ఒక్క-శిఖరంబు నుండి యొం•డొక్క- శిఖర
మునకు నొక కొమ్మనుండి స•మున్నతంపుఁ
జెట్టుకొనకొమ్మ కెగురుచు•నిట్టలంపుఁ
సమ్మదంబునఁ గ్రాలుచు•సందడించి. ౧౩౦౧

అర్థములు. సమున్నతంపు=మిగుల నెత్తైన-నిట్టలంపు=అధికమైన, నిట్టలము రూ-ఇట్టలము.

తాత్పర్యము

వచ్చుచున్న హనుమంతుని దూరము నందుండఁగనే చూచు కోరికతో నొక శిఖరమునుండి యంతకంటె నెత్తైన శిఖరమునకు, నందలి యొక చెట్టుకంటె నెత్తైన యింకొక చెట్టునకు, అందొక కొమ్మకంటె నెత్తైన యింకొక కొమ్మకు వానరులు మిగుల సంతోషముతో నెగురుచు కిలకిలాన్ఖటుల సందడి చేయుచు.

క. పట్టుగ దూరపు జనులకుఁ; బుట్టముఁ జూపించురీతిఁ•బుష్పితతరులన్
గొట్టకొనకొమ్మలన్ వెస, బెట్టుగ నాడించి యూఁచి•పేర్చిరి క్రోఁతుల్.

అర్థములు. పుష్పిత తరులన్=పూచిన చెట్ల యందలి.

తాత్పర్యము

తా మున్న స్థానము తెలుపుటకై దూరమున నుండు వారికి గుడ్డలను చేతులతో నాడించి విసరి చూపునట్లు వానరులు పూచిన కొమ్మల నాడించిరి. ఊఁగులాడించిరి.

క. గిరిగుహల దాఁగి మొరయుచు, నురువడి వెలివచ్చుగాలి•యొప్పున గర్జల్
పరఁగించుచుఁ జనుదెంచెను, సరభసముగ మారుతాత్మ•సంభవుఁ డంతన్.

అర్థములు. మొరయుచున్=ధ్వనించుచు. ఉరువడి=మిగుల వేగముతో, వెలివచ్చు=బయటికి వచ్చు-సరభసముగన్=వేగముగ.

తాత్పర్యము

కొండగుహలయందు దాఁగియుండి మిగుల వేగముతో ధ్వనించుచు వెలుపలికి వచ్చుగాలి విధమున సింహనాదములు చేయుచు వేగముగ నాంజనేయుఁడు వచ్చెను.

క. జలధరమార్గంబున న,బ్బలియుఁడు జలదోత్కరంబు•పగిదిన్ రాఁగన్
వలిముఖు లందఱు ఘటితాం,జలు లై నిలిచిరి నభంబు•చాయం గనుచున్.

అర్థములు. జలధర మార్గంబునన్=మేఘమార్గమున ఆకాశమందు-జలదోత్కరంబు=మేఘ సమూహమువలె, వలిముఖులు=వానరులు- ఘటితాంజలులై=చేతులు జోడించినవారై-నభంబు=ఆకాశము.

తాత్పర్యము

ఆకాశమార్గమున మేఘమువలె బలవంతుఁ డగు హనుమంతుఁడు రాఁగా వానరు లందఱు చేతులు జోడించుకొని యాకాశము వంకఁ జూచుచు నిలిచిరి.

—• హనుమంతుఁడు మందరాద్రిపై దిగుట •—

క. గిరినిభుఁ డగు కపిఋషభుఁడు, తరునికరాకులమహేంద్ర•ధరకూటమునన్
ద్వరితుఁ డయి దూఁకె గిరిని, ర్ఝరమునఁ బడె నిహతపక్ష•శైలం బనఁగన్.

అర్థములు. గిరినిభుఁడు = పర్వతముతో సమానుఁడు-కపి ఋషభుఁడు=వానరశ్రేష్ఠుఁడు-తరునికర=చెట్ల గుంపులచే-ఆకుల=నిండి యుండు-గిరి నిర్ఝరమునన్=కొండవంకయందు-నిహత పక్షశైలంబు=ఱెక్కలు విఱిగిన పర్వతము.

తాత్పర్యము

కొండంత దేహము గల హనుమంతుఁడు వృక్షములచే నిండియుండు మహేంద్ర పర్వత శిఖరము నందు వేగముతోఁ గూడిన వాఁడయి ఱాల మీఁద దూఁకిన

గాయపడునని కొండవంకయందు నీళ్ళలో తెక్కలు విఱిగిన పర్వతమువలె దబా లునఁ బడెను.

శ్రీరామదర్శనమునకై పోవుట యందొక నిమిష మైన జాగు కారాదని యాయన త్వర సూచించుచున్నది, లేనియెడల దూరమునుండియే వేగముతగ్గించి వచ్చియుండ వచ్చును.

క. ప్రీతమనంబునఁ గపివర, జాతంబులు గంధవాహ॰సంభవుచుట్టున్
గౌతుకమున నిలుచుండిరి, యాతనిఁ గనుఁగొనుచు మెచ్చి॰యాడుచు మిగులన్.

తాత్పర్యము

సంతోషించిన మనస్సులతో వానర శ్రేష్ఠుల సమూహంబులు వాయునం దను చుట్టుకొని యాయన యేమి చెప్పునో వినవలయు నను కోరికతో నతనిఁ జూచుచు, మెచ్చుచు నుండిరి.

మానిని. అంతట వానర పుంగవు లెల్ల ని॰రామయతం గనుపట్టు హనూ
మంతునిఁ జూచి నితాంతముదంబున॰మా నగు మూలఫలాదిక మే
కాంత ముపాయన మిచ్చి కుఱంగట॰నందఱుఁ జేరి భజింప శుభ
స్వాంతుఁడు ఋక్షధవాంగదవృద్ధుల॰కర్మిలిఁ జేసి నమస్కృతులన్.

అర్థములు. నిరామయతన్=ఒక గాయమైన లేక-నితాంత ముదంబునన్=మిగులసంతోషముతో-మూలఫలాదికము=వేళ్ళు పండ్లు మొదలైనవి-ఉపాయనము=కానుక-కుఱంగటన్=సమీపమందు, ఋక్షధవ+అంగద వృద్ధులకు=జాంబవంతునకు నంగదునకు పెద్దవారికి- అర్మిలి=ప్రేమతో-భక్తితో.

తాత్పర్యము

ఆ పిమ్మట వానర శ్రేష్ఠు లందఱు గాయమైనఁ బడక దేహబాధలేక యుండు హనుమంతుని జూచి మిగుల సంతోషించి మూలఫలంబులు కానుకగ నిచ్చి దగ్గఱఁ జేరి యుండఁగా హనుమంతుఁడందఱకు జ్ఞానవృద్ధుఁడు వయోవృద్ధుఁడు నగు జాంబవంతునకు ఆ పిమ్మట యువరాజగుటచే నంగదునకుఁ దరువాతఁ దన కంటె వయస్సునఁ బెద్దవారగు వారికి భక్తితో నమస్కరించెను. వృద్ధులనఁగా.

'దశాబ్దాఖ్యం-పౌరసఖ్యం పంచాబ్దాఖ్యం కలాభృతామ్, త్ర్యబ్దపూర్వం శ్రోత్రి యాణా మల్పేనాపి స్వయోనిషు. మను. ౨

ఒక గ్రామమందే యుండువారు తనకంటెఁ బదియేండ్లు పెద్దవారైనచో సఖులగుదురు. అంతకుఁ బైపడినవారు పెద్దవా గనిపించుకొందురు. గీతాదివిద్యలు నేర్చినవాఁడు తనకంటె నైదేండ్లు పెద్దవాఁడైనచో సఖుఁడగును. అంతకుఁ పెద్ద వాఁడు పెద్ద వాఁడనబడును, వేదములు చదివినవాఁడు మూఁడేండ్లుపెద్దవాఁడయి నచో సఖుఁడగును. అంతకుఁ బెద్దవాఁడు పెద్దవాఁడనఁబడును.తనవంశము వారిలో

నన్నలు మొదలగువారే మాత్రము వయస్సున బెద్దవారైనను సఖులగుదురు. ఆ కారణమున నధికులందఱు నభివాదనార్హులు.

మానిని-ఏడు భగణములు గురువు. పదుమూడవ స్థానంబున యతి. మానిని యందలి మొదటిగురువు రెండు లఘువులు చేసిన కవిరాజ విరాజిత మగును. కవిరాజ విరాజితమునకు వలె మానినికిని తిక్కన యతులు రెండు విధములఁ గల్పించినాఁడు.

మానిని. కూలియుఁ గాంతి యి♦గుర్వఁగఁ దేజము♦గుందక వహ్నులు♦గ్రూరశిఖా, స్త్రీ. ౨-౧౨౮.

ఇం దేడింట నేడింట నేడింట యతులు గూర్పఁబడినవి.

కావున నీ దెస నాతనికిన్ విము♦ఖత్వముఁ గల్గదు భ♦క్తిమెయిన్ స్త్రీ-౧-౯౦౫.

ఇందు పదుమూఁడవ స్థానంబున యతి గూర్పఁబడెను.

—♦ హనుమ కపులతోఁ దాను సీతాదేవిని జూచితి ననీ చెప్పుట. ♦—

సీ. చూచితి సీత నం♦చును సంగ్రహముగాఁగఁ, జెప్పి యంగదు కేలు♦చేర్చి కేల
నా మహేంద్రాద్రిర♦మ్యారామతలమున, నాసీనుఁ డై వాన♦రాళిఁ జూచి
రూక్షరాక్షససతీ♦రక్షితసీతను, జూచితి సాధ్వి న♦శోకవనిని
విభుదర్శనాసక్తిఁ♦బెనఁగొన్న కురులతోఁ, నుపవాసములఁ జిక్కి♦యున్నదనిన

తే. నమృతతుల్య మహార్థవా♦క్యములఁ గ్రోఁతు
లెగురువారును దూఁకువా♦రిందు నందుఁ
గూయువారుఁ గిలార్చుచు♦మ్రోయువారు
వాలముల నెత్తి నేలపై♦బాఁదువారు. ౧౩౦౮

అర్థములు. రూక్షరాక్షస సతీరక్షితన్=కఠినచిత్తలైన రాక్షసస్త్రీలచేఁ గావలి కాఁచఁబడుచున్న దానిని, విభుదర్శనాసక్తిన్=మగనిఁ జూచు కోరికతోఁ, అమృతతుల్య=అమృతముతో సమానమైన. మహార్థ=గొప్ప ప్రయోజనముగల, వాక్యములన్=మాటలను, సీత యుపవాస మున్నదని చెప్పుటచే కిష్కింధాకాండమున నింద్రుఁ డమృత పాయసము దినదినము దెచ్చి యిచ్చుచుండె నని కథ కల్పిత మని యేర్పడుచున్నది. చూచితి సీతన్=ఇది సుగ్రీవుని వాక్యానుసారము. కిష్కింధ. ౧౦౭౨వ పద్యము చూచునది.

## తాత్పర్యము

ఏమి చెప్పునో సీత కనఁబడెనని చెప్పునో, కానరాలేదని చెప్పునో యని తహ తహ లాడు వానరుల మనస్సు కుదుటఁబడఁ జూచితి సీత నని రెండుమాటలలో సారాంశముఁ దెలిపి యంగదు చేతిని తనచేతఁ బట్టుకొని పోయి యా మహేంద్రపర్వతమున రమ్యమైన వనప్రదేశమందు నందఱుఁ గూర్చుండుటకుననువైన చోట గూర్చుండి వానరుల నందఱిఁ జూచి దయాహీనలైన రాక్షసస్త్రీలచే

రక్షింపఁబడు సీతను జూచితిని. ఆ పతివ్రత యశోకవనమందు తన భర్తను జూచు గోరికతోఁ బేనుకొని పోయిన వెండ్రుకలతో, ఆహారములేక శుష్కించియున్నది అని చెప్పఁగానే యమృతముతో సమానమై, పోయిన తమ ప్రాణములను మఱల రప్పించినవై, మహాప్రయోజనము గల వాక్యముల విని సంతోషాతిశయమున బూర్ణముగ వినునోపిక లేక కొందఱెగుర సాగిరి. కొందఱు దూఁకిరి. కొందఱు కిల కిలార్భటులు నించిరి. కొందఱు తోఁకలెత్తి నేలకు బాదిరి.

తే. ద్విరదతుల్యులు క్రోఁతులు•తరుల నుండి
దుమికి హనుమంతుఁ బరిరంభ•ణము నొనర్చి
రంత సర్వవనాటమ•ధ్యంబునందు
వాలి తనయుండు పలుక న•వ్వాయుతనయు. ౧౩౦౯

అర్థములు. ద్విరదతుల్యులు=ఏనుగులతో సమానులు, పరిరంభణము=కౌఁగిలింత, సర్వవనాట మధ్యంబునందు=క్రోఁతుల యందఱ నడుమ.

తాత్పర్యము

అందఱు నేలఁ గూర్చుండి వినవలయుననినఁ గొందఱకు హనుమంతుఁడు దూరమగు గావునఁ గొంద ఱేనుగుల వంటివారు హనుమంతునకు సమీపమున నుండు చెట్లపైనుండి వినుచుండిన వారు హనుమంతుని మాటలు చెవినిఁ బడఁగానే చెట్లనుండి దుమికి హనుమంతుఁ బ్రతికించితివి తండ్రీ! యని కౌఁగిలించిరి. అప్పుడా క్రోఁతుల నడుమనున్న యంగదుఁడు హనుమంతునితో నిట్లనియె.

క. విస్తారం బగు వారిధి, నిస్తరణ మొనర్చి మఱలి•నెమ్మది రాఁగన్
శస్తగతి నెవ్వఁ డోపును, నిస్తులజవసత్త్వములను•నీసముఁ డేఁడీ? ౧౩౧౦

అర్థములు. విస్తరణ మొనర్చి=దాఁటిపోయి, నిస్తుల=అసమానమైన జన సత్త్వములను=వేగమునందు, బలమునందు.

తాత్పర్యము

ఇంత పెద్దసముద్రమును దాఁటి పోయి సుఖముగా మఱలి యెవ్వఁడు రాఁ గలఁడు? వేగమునందు, బలమునందు నీతో సమానుఁడు లేడు.

క. ఔరా! నీ ప్రభుభక్తియు, నౌరా! నీశక్తి ధైర్య•మరరే! హనుమా
భూరితరాదృష్టంబున, శ్రీరామునిరమణిఁ గంటి•సీతాసాధ్విన్. ౧౩౧౧

తాత్పర్యము

అవురా యేమి నీప్రభు భక్తి. నీ శక్తియేమి. ధైర్యమేమి ఔరా! ఆశ్చర్య కరము. మా యందఱ భాగ్యవశమున నీవు శ్రీరాముని భార్యను, పతివ్రతయగు సీతాదేవిని జూచితివి.

ఆ. జానకీవియోగ•సంతాపమును భూప,వర్యుఁ డిపు డదృష్ట•వశతఁ బాసె
నీదు పోక రాక•నెఱి మాకుఁ దెలియఁగఁ, బలుక వయ్య కర్ణ•పర్వముగను.

తా త్ప ర్య ము

సీతను విడిచి యుండుటవలనఁ గలిగిన శోకమును రామచంద్రమూర్తి యదృష్ట వశమున వదలెను. నీ వెట్లు పోయితివో, యేమి చేసితివో, యెట్లుచూచితివో యది యంతయు మాకుఁ బూర్ణముగ చెవుల పండువుగ వినిపింపుము.

తే. అనిన వానరులెల్ల వా♦తాత్మజాతు, జాంబవంతుని నంగదు♦సరసఁ జుట్టి
యుండి రయ్యెడఁ బెద్దవౌ♦బండలందు, హనుమ చెప్పెడి వృత్తాంత♦మాలకింప.

అర్థములు. సరసన్=సమీపమందు.

తా త్ప ర్య ము

స్పష్టము.

క. ఎటు దాఁటెనొ వారిధి దా, నెటుజొచ్చెనొ లంక సీత♦నెటు చూచెనొ య
కుటిలుని దశకంఠునిఁ దా, నెటుగాంచెనొ యంచు వినఁగ♦నెసగిన వాంఛన్.

తా త్ప ర్య ము

సముద్రము నెట్లు దాఁటెనో, లంక నెట్లు ప్రవేశించెనో, యే విధముగ సీతా దేవిని జూచెనో, కుచ్చితుఁ డగు రావణు నెటులు చూచెనో యది యంతయు వినఁ గోరిక గలవారై.

తే. అంజలి ఘటించి భజియింప♦నగచరాళి, వాలిసుతుఁడును శిఖరాగ్ర♦భాగమందు
దిశలు వెలిగించు చుండెను♦దేవవితతి, గొలువ రాణించు వాసవు♦కొమరుదోఁప.

అర్థములు. నగచరాళి=క్రోఁతుల గుంపు.

తా త్ప ర్య ము

వానరు లందఱుఁ జేతులు కట్టుకొని సేవింపఁగా నంగదుఁడు పర్వతశిఖరము కొన యందు దేవతలు గొలువఁ బ్రకాశించు నింద్రునివలె దిక్కులు ప్రకాశింపఁ జేయుచుండెను.

క. విలసితకీర్తియశస్సుల, నలరారుడు హనుమచేత♦నంగదములచే
జెలువారెడు నంగదుచే, జ్వలితం బయ్యెను మహీధ్ర♦వరకూటంబున్. ౧౬౧౬

అర్థములు. విలసిత కీర్తి యశస్సులన్=ప్రకాశించు కీర్తిచేతను యశస్సుచేతను, అలరారెడు=సంతోషించు. (౧) కీర్తియశస్సులు రెండును హనుమంతునకు విశేషణము లైనపుడు కీర్తి-బుద్ధి యతిశయమువలన వచ్చినది, యశస్సు పరాక్రమము వలన వచ్చిన ప్రఖ్యాతి. (౨) కీర్తి హనుమంతునకు యశస్సు అంగదునకు నన్వయింప వచ్చును. చూ. ప. ౬౮౪.

తా త్ప ర్య ము

ప్రకాశించు కీర్తిచేతను యశస్సుచేతను సంతోషించు హనుమంతునిచే, భుజ కీర్తులు గల యంగదుచేఁ బర్వత శిఖరము ప్రకాశించెను.

{ ౫౮-వ సర్గము. హనుమంతుఁడు తాను లంకకుఁ బోయి వచ్చిన విధం బంతయుఁ గపులకుఁ జెప్పుట }

దండకము. ఆద్యంతవృత్తాంత మాలింపఁగా నింపు పెంపార నా జాంబవంతుండు వాతాత్మజుం జూచి యో యంజనానందనా! ముందుగాఁ బొందుగాఁ దెల్పుమే రీతి నా నాతిని న్నీవు గన్గొంటి? వాల్గంటి దా నొంటి నెట్లున్న? దా యన్నుమిన్నన్ దశాస్యుండు క్రూరుండు దా నే విధిం జూచెడిన్? మీఁది కార్యంబు లేవంచునన్ సంచుగాఁ జెప్ప నా చెప్పఁగా రాని యవ్వాని భాషింపుమన్నన్, హనూమంతుఁ డత్యంతసంతుష్టుఁడై హృష్టుఁడై జానకిన్ లోన ధ్యానించి మూర్ధంబుచే మ్రొక్కి యక్కైవడిం బల్కె; వారాశియా ప్రక్కతీరంబుఁ జేరంగ లో నెంచి నే నీ నగాగ్రంబునం దుండి కుప్పించి దాఁటంగ మీరెల్లఁ గన్నారఁ గన్నార కాదే? యటే నేగ నంభోధిమధ్యంబునన్ హేమశృంగాంచితంబైన శైలంబు నాత్రోవ కడ్డంబు రా వచ్చె రా విఘ్న మం చెంచి రోషించి భేదించి పోవంగ లో నెంచి దానిన్ ఢీకీలంచు నేఁ దాఁకితిన్, దోఁకతోఁ దాచితిన్, దాఁచినన్ దాని శృంగంబు వేభంగులన్ భంగ మై రాలెఁ, దచ్ఛైలమో మామకీనాశయం బెంచి హర్షంబుగా నాయనా! నీకుఁ జిన్నప్ప నే, గాడ్పుమిత్రుండ, మైనాకుఁడన్, వార్ధిలో నుండుదున్, మున్ను పక్షంబు లుండన్ ధరాధ్రంబులెల్లన్ యథేచ్ఛంబుగాఁ గ్రుమ్మరన్ లోకభీదానదక్షంబు లౌ వాని వీక్షించి పక్షంబులం ద్రుంచె వజ్రహతిన్ శక్రుఁ, డగ్గోడు తప్పింప నీ తండ్రి నన్దెచ్చి యీ యంబుధిం ద్రోచెఁజూ, ధర్మభృద్వర్యుఁడున్ శక్రవీర్యుండు నా రాము కార్యంబున న్నాదు సాహాయ్యముం గొమ్ము నా, సమ్మతిన్ నాదు కర్జంబు చందంబు బోధించి కార్యైకసక్తాత్మతన్ శైలరాజాజ్ఞ నేఁ బోయితిన్, గ్రావమున్ మానుషాకారమున్ మాని శైలాకృతిం బూని వారాశిమధ్యంబునన్ నిల్చె, నే నెచ్చు వేగంబునం బోవఁ బోవంగ నాగాంబ వేగంబ నాకడ్డమై నిల్చి యో క్రోఁతి తేఁడా! మదాహారముం గమ్ము, వేగమ్మ రారమ్ము, దేవాళి యేర్పాటురా సుమ్ము నా; నమ్మహాదేవికిన్ మ్రొక్కి దిక్కేమియుం దోఁప కిట్లంటి నో దేవి! భూదేవి జామాత శ్రీరాముఁ డారణ్య దేశంబునన్ జానకీ లక్ష్మణాన్వీతుఁడై । క్రుమ్మరం బంక్తికంఠుండు శుంఠుండు తద్దేవినిన్ ద్రుచ్చిలించెన్, దదన్వేషణార్థంబు రామాజ్ఞచేఁ బోవుచున్నాఁడఁ, దద్దేవుదేశంబునం దుంట శ్రీరాము కార్యంబునం దోడు కారాదె? కాదేని వైదేహినిన్ రామునిం జూచి వే వచ్చి నే నిచ్చి నీ మెచ్చుగాఁ జొచ్చువాఁడన్ భవద్వక్త్రముం దన్న నయ్యన్న హా! యేటి మాటల్ బళా దాఁటి పోనీయ, నాకీ వరం బిచ్చి రా దేవతావల్లభుల్, పొల్లుగా దన్న, మే న్పెంచితిన్ యోజనంబుల్ పది న్నిడ్పు లం దర్ధవిస్తారముం గల్గనా దేవి నాయంత వాక్రంతఁ దావిచ్చె నే నంత హ్రస్వుండనై యొక్క యంగుష్ఠమాత్రంబు గాత్రంబుగాఁ జివ్వనన్ దానివక్త్రింబునం జొచ్చి వెల్వడ్డ నన్

జూచి నైజాకృతిం దాల్చి యా యంబ, యోవానరంబా! సుఖంబారఁ బో
పొమ్ము, నీకార్యముల్ చక్కనౌఁ, గూర్పుమీ సీత శ్రీరాముతోఁ, మెచ్చితిన్
నీయొషన్, భద్రమౌ నన్న నన్నంతటన్ భూతముల్ ప్రీతముల్ మేలు మేలంచు
శ్లాఘించెఁ, దర్వాత నిర్భీతిఁ బక్షీశురీతిన్ మొగుల్ త్రోవ నేఁబోవ, నా చాయ
నేదో గ్రహింపంగ నేచాయఁ గన్గొన్న నా కేమియుం దోఁప దాత్మీయ వేగంబు
సంకుంఠితం బైన నే నాత్మలో నే మహా! నా మహావేగమాచిక్కె, నే ప్రక్క నే
యొక్కరిం గాన, గార్యంబు వార్యంబుగా నోపునో? యంచు దుఃఖాకులా
త్ముండ నై క్రింద చూడంగ, మున్నీట ఘోరాకృతిం బండి రాకాసి యొక్కర్తు
నన్ జూచి గర్జించి తర్జించి పెన్నవ్వుతోఁ గ్రొవ్వుతోఁ గీడుగా నాడె, నో పెద్ద
దేహంబువాఁడా! బలే యొదురా యేగవే వేగ? నే నెన్నియో నాళ్ళుగాఁ
గూడు లేకుంట నాఁకంట నేఁ జిక్కఁ స్రుక్కంగ నింమండ నా దండిభాగ్యాన నా
కంటికిం దోఁచి తిప్పట్లు, నాకడ్పులోఁ గుడ్పుగాఁ జొచ్చి యానంద మొందింపరా
యన్నఁ గా నిమ్మటం చేయ నామేను వే దాని వాకంటె బల్ పెద్దగాఁ బెంప,
నా టక్కు నూహింపఁగా లేక నన్మ్రింగ నోర్విచ్చె, నే నో నిమేషంబునన్ గుజ్జు
వేషంబుసన్ దాని పెన్బొట్టలో దిట్టనై యట్టివేచొచ్చి ప్రేవుల్ వెసం గొంచుఁ
జివ్వాలుసం బైకి లఘించితిన్, హా స్త్రముల్ వ్రేల రాకాసి వారాశిలోఁ గూలె,
మింటన్ నభశ్చారులా చారణుల్ సింహికా రాక్షసిం ద్రుంచె సామీరి యం
చాడఁగా వింటి, నే నత్వయుం బెంచుచున్ వింటిమార్గంబునం బోయి శాఖిప్రతా
నావృతంబౌచు లంకాపురం బుండు నామొడ్డుఁ గన్గొంటి, నా పిమ్మటన్ సూర్యుఁ
డస్తాద్రిఁ జేరంగ ఘోరాసురస్తోమముల్ గాన కుండంగ లంకాపురిం జొచ్చితిం,
జొచ్చుచుండంగ నొక్కర్తు కల్పాంత ధా రా ధ రా కా రఘోరాట్టహాసాననో
పేతజాజ్వల్యమానాక్షి కేశాళితో నన్నుఁ జంపన్ సమీపింప డాకేల నేఁ బెద్ద
పెట్టొక్కటిం బెట్టితిన్, దానితో నోలుచుం గూలి, నన్ జూచి యో వీర!
లంకాపురిన్ నేను, నన్గెల్చి తీ వింక గెల్వంగ నేర్తీ సురారాతి సంఘంబుఁ
బొమ్మంచు నచ్చేడె నన్నాడె, నే నాప్రదోషంబునన్ లంకలోఁ జొచ్చి రేయెల్ల
సీతాసతిన్ రోసితిన్, దైత్యునంతః పురాంతస్థలిం గానరాదయ్యె, నే నయ్యె
డన్ శోకసంతాప మేపారఁ బ్రాకారముం దాఁటి, యుద్యానముం గాంచి,యందే
యశోకావనీజాతమొం డెక్క బంగారసంటుల్ విరాజిల్లు తోఁటొక్కటిన్ శింశు
పాభూరుహోపాంత దేశంబునన్ శ్యామనీ రేజపత్రాంబకన్ నిత్రుపాసంబులం జిక్క
యేకాంశుకాన్వీతయై, ధూళిసంలగ్న కేశాంతయై, శోకసంతాపదీనాంగియై, నాథు
ధ్యానించుచున్ బెబ్బులుల్ చుట్టఁగా లేడిచందాన దుఃఖించుచున్ భూమిపై వ్రాలి
పెన్మంచునం దమ్మివోలెన్ వివర్ణాకృతిం దాల్చి దైత్యేశభీతిన్ మృతిం జెందఁగా

గోరు సీతాసతిం గాంచు చా చెట్టుపై నుంటి, నే నింతలోఁ బంక్తికంఠాలయం
బందు ఘూళం ఘులీరావముల్ వింటి, నద్దాన నే నివ్వెఱన్ గొంటి, సంక్షిప్త
గాత్రుండనై పక్షివోలెం గుజంబందు నే నుంటి, దైత్యేశుఁ డిల్లాండ్రతో వచ్చె
నచ్చోటికిన్, జానకీ దేవియా రాక్షసాధీశునిం జూచి మోఁకాళులన్ ఱొమ్మునం
జేర్చి హస్తంబులం జుట్టి విత్రస్తయై దిక్కు లేకందు నల్దిక్కు లీక్షించుచున్
వేపమానాంగియై యుండ వాఁ డంగనం జేరి ధాత్రీస్థలిన్ వ్రాలి నన్నేలవే
గోల! యో బేల! రెన్నాల్లలో నన్నుఁ గైకోక గర్వించి తేసిన భవచ్ఛోణితం
బేను ద్రావంగ నుంకితుఁజుమ్మన్న నన్నీచువాక్యంబు లాలించి రోషంబునన్
సీత భాషించె నో నీచుఁడా! దుర్మతీ! నన్నెవ్వతెంగాఁ గనుంగొంటిరా! నీవు;
శ్రీరాము నిల్లాల, నిక్ష్వాకువంశేశ్వరుండైన యయ్యాజికిం గోడలన్, నన్నురా
నీవు నీచోక్తు లాడంగ! నీనాల్క తుత్తునకలై కూలదా? క్రూరుఁడా! శూరుఁడా
నీవు? చోరుండవై నాదు నాథుండు లేనప్డు నన్దెచ్చి ముచ్చట్లు వాక్రువ్వఁగా
వచ్చితా? రామచంద్రుండు సంగ్రామశూరుండు సత్యోక్త్యుదారుండు యజ్ఞప్రచా
రుండు నీ వా మహాభావు దాసుండుగా నైన నర్హుండవా? కావు కావన్న
నన్నాతివాక్యంబు లాలించి కోపించి యంతం, జితాస్థాగ్ని చందంబున న్మండి
పెన్గ్రిడ్డులం ద్రిప్పి నద్దేవినిం గ్రుద్ది చంపంగఁ గేలెత్తనయ్యో యయో
యయ్యయో యంచు దైత్యాంగనల్ గూయ స్త్రీమధ్యమందున్న మండోదరీ
నామ్ని దానడ్డమై శూరుఁడా! యేమి యీ సేఁత? యీ సీత నీకేల నే నుండఁగా?
లేరె యీ యక్ష దేవాంగనల్? చాలరే వీరు? లీలావిలాసంబులం దేలఁగా రాదె,
రమ్మంచు వారెల్లఁ గోపంబు చల్లార్చి యా రాక్షసుం దోడు కొంచేగి రల్లంగ
సీతాసతిం గాచు ఘోరాస్యలౌ రాక్షసస్త్రీలు తద్దేవినిం జూచి గర్జించి భర్జించి,
తర్జించి కర్ణంబుగా నెన్నియో దారుణాలాపముల్ పల్కఁగా వాని నా చానయున్
గడ్డిపోఁచం బలెం జూచె, నా యింతి స్థైర్యంబు నారక్కెసల్ గ్రక్కునం బోయి
దేవారికిం జెప్పి యా యంగనన్ లొంగఁగాఁ జేయ దుస్సాధమం చెంచి యందంద
నిద్రించిరా మైథిలీ దేవియున్ రామ! రామా! యటం చేడ్చుచుండం ద్రిజాటాఖ్య
దా నిద్దురన్ లేచి రక్షస్సతీసంఘముం గాంచి మీ రేటికే జానకిం జూచి భక్షిం
తుమా తిందుమా యంచుఁ దర్జింపఁగా? మ్రింగుఁడీ నన్ను మీరే, ధరాపుత్రి
నాశంబు గా దెన్నఁ, డా యాజికిం గోడలై రాము నిల్లాలు నా సాధ్వి
మీ చేతికా చిక్కెడిన్? దారుణంబైన స్వప్నంబునం దీ దశగ్రీవునాశంబు
శ్రీరాము గెల్పుం గనుంగొంటి, మీ తర్జనల్ చాలు, మిమ్మెల్ల నీదేవి
శ్రీరాముతోఁ జెప్పి రక్షింపఁ జాలున్, నమస్కారమాత్రప్రసన్నన్ గృపాపాల
వే వేఁడుకోరే, మదీయాశయం బిద్ది, నిక్కంబు దుఃఖంబులం బాపు నీ దేవి,
యో తల్లిరో! నీవ మా దిక్కు మా మ్రొక్కుఁ గైకొంచు రక్షింపుమన్నన్ దయా
లోల సీతామహాదేవి తా నెవ్వరిం గాచు, నన్నంత నా యింతియుం గాంతు

జేతృత్వ మాలించి లోసిగ్గునం బల్కె, మీ మాట సత్యంబ యే నట్ల రక్షింతు
నం చీ గతిం బల్క, నా కల్కి యాపద్దశం జూడ లేనైతి నాధైర్యమోవమ్మగాఁ
బోయె. నే నంత నా కాంతతో భాషణోపాయముం జక్క భావించి యిక్ష్వాకు
వంశ స్తవం బారఁగాఁ జేయ నామాట లాలించి యాదేవి కన్నీటితో వానరశ్రేష్ఠ
యెవ్వండవయ్యా! నినుం బంపె నెవ్వం డ దేలా య దేలాగునన్ వచ్చితీ విందు?
నే విందుగా వింద, శ్రీరాముతోఁ జెల్మి నీ కెట్లు చేకూరె? భాషింపవే యన్న
నా యన్నతో విన్నపం బిట్లు నేఁ జేసితిన్, దేవి! నీ నాథు మిత్రుండు మిత్రాత్మ
జుండుండు సుగ్రీవనాముండు, నే నా మహాశూరుబంటన్ హనూమంతుఁ డన్పేరి
వాఁడన్, నినుం గాన నా తేఁడు శ్రీరాముఁ డంపెంజుమీ, నీ కభిజ్ఞానమాత్మాం
గుళీయంబు దా నిచ్చెఁ గై కొమ్ము, నా కిమ్ము నీ వానతిన్, రామ సౌమిత్రులన్
డాయ ని న్గొంచు నేఁబోయెదన్ వచ్చెదే? యన్న నాగోలలన్ మిన్న యో యన్న
శ్రీరాముఁడే రావణుం జంపి నన్గొంచుఁబో వత్తు నన్నన్ సతీ! నాకుఁ జిత్తప్రమో
దావహంబైన గుర్తేమియే నిచ్చెదే?యన్నఁ గానిమ్మటం చింద మీ దివ్యచూడా
మణిం గొమ్ము, నాప్రాణనాథుండు నిద్దాని వీక్షించినంతన్ నిజం బెచ్చుగా నిన్ను
మన్నించు నం చిచ్చి తా వెండియుం గొన్ని సందేశవాక్యంబులం జెప్పె, నే
నా సతీరత్నమున్ మ్రొక్కి నే నిందురాఁ జూచు చుండంగఁ దా వెండియున్
నన్ను వీక్షించి యో యంజనానందనా! యెట్లు ప్రాకుచ్చినన్ రామసౌమిత్రి
సుగ్రీవు లిచ్చోటికిన్ వేగ రాఁ జూతురో యట్లు భాషింపు, మిం కేను మాస ద్వ
యంబే చుమీ మేనఁ బ్రాణంబులం దాల్తు నీలోన శ్రీరామచంద్రుండు న న్జూడ
రాఁడాయెనా నాయనా! నే నా యనాథాకృతిం జత్తు, మీయిష్ట మం చన్న
నా కన్నె దీనోక్తు లాలింపఁగాఁగింక యంకూర మే త్రెం జుఁడీ, యంతఁ గొండంత
దేహంబుతో యుద్ధకాంక్షన్ వనంబెల్లఁ జీకాకుగాఁ బీఁకి నిర్మూలముం జేయ
యా రద్దునన్ నిద్దురన్ లేచి యద్దైత్యకాంతల్ మదిన్ భీతి గొల్పంగ నల్దిక్కులం
బాఱి యిం దారినిం జేరి యో వైరివిద్రావణా రావణా! క్రోఁతి యొక్కండు
యున్మన్నహాశూరతాఽజ్ఞాని దుష్టాత్ముఁడై తోఁటయెల్లన్ సపాటంబుగా నేలతో
పాటు గావించె, నా క్రించు రప్పించి ఖండింపుమీ,యన్న నా రాక్షసుం డుగ్రులం
గింక రాఖ్యాతశూలాయుధాశీతిసాహస్ర సంఖ్యాకులం బంచె, నే లాడిచేఁ
ద్రుంచితిన్ వారలం జావఁగాఁ, దక్కియున్నట్టి దైత్యుల్ వెసం బాఱి దేవారితోఁ
జెప్పి, రే నింతలో నూర కేలుండఁగా నంచుఁ దోఁపంగ నాచైత్య ప్రాసాదమున్
ధ్వస్తముం జేసి యచ్చోటి రక్షస్తతిన్ స్తంభఘాతంబులం గూల్చితిన్ నూర్వురన్,
వచ్చెఁ దా నంతలోనం బ్రహస్తాత్మసంభూతుఁడౌ జంబుమాల్యాఖ్య విఖ్యాత
శూరుండు ఘోరాసురవ్యూహసంయుక్తుఁడై, వాని సేనాసమేతంబుగా లాణిచేఁ
జంపితిం, బిమ్మటం బంచె నాపై మహామాత్ర పుత్రాష్టకం బేను నద్దానవనే వారిఁ

గాలాలయావాసులం జేసితిం, బంచసంఖ్యాకసేనాను లుద్దండత న్వేండి పై రా
విదారించితిన్ సేనతో, వెనక నప్పంక్తికంఠాత్మజుం డక్షుఁ డన్వాఁడు సైన్యం
బుతో వచ్చె, నే నా కుమారున్ మహావీరు మందోదరీసూనునిన్ మింటికిన్వాఁడు
లంఘించుచోఁ గాళ్ళు లీలన్ బిగంబట్టి గిర్గిఱ్ఱునన్ నూఱు మాఱుల్ వడిం ద్రిప్పి
పెన్మద్దగాఁ జేసి ధాత్రీస్థలి న్మోఁదితిన్, వానిపా టా దశాస్యుండు నాలించి
వే ఱొండు పుత్రున్ మహాగాత్రునిన్, శక్రజిం బంపె; నవ్వాని నవ్వాహినిం
గూడఁ దేజం బఱంజేసి మోదించితిన్, వాఁడు నన్గెల్చున న్నమ్మకం బూనిరక్షో
విభుం డంపె, నన్నెట్టులుం గెల్వఁగా దంచు నూహించి వాఁ డంత బ్రహ్మాస్త్ర
పాశంబులన్ నన్ను బంధించె, రక్షోవరుల్ త్రాళ్ళతో నన్ను బంధించి కొంపోయి
దైత్యేశు మ్రోలన్ నిలంబెట్ట వాఁ డుగ్రుఁ డై యేలరా వచ్చి తీలంక! కీ వేలరా
చంపితా సోఁకులం? జెప్పరా యన్న సీతార్థమై సర్వముం జేసితిన్, నిన్నుఁ
జూడంగ నీయింటికిన్ వచ్చితిన్ రాక్షసేంద్రా! హనూమంతుఁ డన్వాఁడ, నేఁ
బావమానిన్ రఘూత్తంసుఁ డౌ రాముదూతుండ, సుగ్రీవు మంత్రిన్, ననుంబంప
రాముండు నీయొద్దకు న్వచ్చితిన్ దూతనై, సూర్యపుత్రుండు నీ సేమముం బ్రశ్న
గావించె, ధర్మార్థకామానుషక్తంబు పథ్యంబు వాక్యంబు నీకున్ వచించెంజుమీ,
ఋశ్యమూకంబునన్ రాముతో మైత్రిఁ గావించి యున్నాఁడు, తద్వీరు వాక్యంబు
లాలింపుమా, రామదేవుంపు దేవారి నా నారినిన్ ముచ్చిలించెన్ వనీభూమి,
నీ విందు సాహాయ్యముం జేయుమా. యంచు న న్వేఁడ నే నట్టులే చేయుదుం
గాని యవ్వాలినిం జంపఁగా బాసఁ గావింపుమీ యంటి, సూర్యాన్వయుం
డట్లు గావించి యవ్వాలినిన్ బాణమొక్కంటనే చంపి కీశాధిపత్యంబు
నా కిచ్చె, నే హవ్యభుక్సాక్షికం బైన స్నేహంబు గావించితిన్, రామసాహాయ్య
మే నెట్టులుం జేయుదున్, జానకీదేవి శ్రీరామభూనేత కి మ్మాయకున్నంత వీరుల్
వనాటుల్ భవచ్ఛౌర్య నిర్మూలనం బెట్లుఁ గావింతు, రెవ్వారు మావారి శౌర్యంబు
లోకంబునం గానరో? పోవరో మున్ను దేవాళికిం దోడుగా? నంచు నీతో వచిం
పన్ ననుం బంచె నన్నన్ రుషాశోణితం బైన నేత్రంబులం జూఁడున ట్లుగ్రతం
జూచి నా విక్రమం బా దురాత్ముం డవిజ్ఞాతుఁడై యంత నన్ జంప నాజ్ఞప్తి
గావింపఁగా వానితమ్ముండుధీశాలి రక్షోవరు న్నానిమిత్తంబుగా వేఁడె నో సోఁకు
ఱేఁడా! కనన్ రాజశాస్త్రవ్యపేతంబు నీ యాజ్ఞ శాస్త్రంబునం దూత వధ్యుం
డుగాఁ, డిచ్చమైఁ దథ్యముం బథ్యముం బలుకఁ వాఁ డెట్టి నేరంబు గావించినన్
రూపుమార్పన్ వికారంబుగాఁ జెల్లుగా, కెప్పుడుం జంపఁగా రా దనం, దోఁకఁ
గాల్పంగఁ బంచెన్ దశాస్యుండు, రక్షోవరుల్ వాలకవారంబులన్ జీర్ణ కార్పాస
వస్త్రంబులం దోఁకకుం జుట్టి నన్ గట్టెలం గొట్టుచున్, గింకచేఁ దిట్టుచున్,
బైపయిన్ ఱొప్పుచుం, వీథులం ద్రిప్పుచున్, బోవ సంక్షిప్తగాత్రుండనై తట్టులం

డుల్చి నే నెండియున్ ఘోరరూపంబుఁ గైకొంచుఁ బెన్ లాడిచే వారలం జంప ద్వారంబునం జేరి లంకాపురిం గొంప లన్నింటికిం జిచ్చు సంధించి యామంటలో సీతయుం గ్రుంగెనో? హా యెంగా పట్టనం బంతయుం బాషుగాఁ, దన్నిమాత్రంబు దా నెట్లు జీవించెడిన్? రామకార్యంబు నిర్మూలముం జేసితిన్ బుద్ధిహీనుండ నై యంచు శోకించుచున్ సీత భద్రంబ యం చ్రభమార్గంబునం జారణుల్ పల్కనాలించి భావించి సర్వంబునుం గాల్చు నా యాశ్రయాశుండు నాతోఁక గాల్పండ, నా చిత్తమా సంప్రహృష్టంబు, సౌరభ్య సంభారుఁ డై గంధవాహుండు నున్ వీచె, సీతామహాదేవి నా వీతిహోత్రుండు దాఁ గాల్పఁగా నోపు? నం చాత్మ మోదించి యా యించుఁబోణిన్ మఱిం గాంచి నే నామెకుం జెప్పి తత్రస్థమా నా యరిష్టంబుపై నెక్కి మిమ్మెల్ల దర్శించు పెన్మక్కువన్ గ్రక్కునన్ వారిధిం దాఁటి చంద్రార్కసంసేవితం బైన మార్గంబునన్ వచ్చితిన్, మిమ్ముఁ గన్గొంటి, శ్రీరామచంద్రప్రభావంబునన్ యుష్మదీయోరు తేజంబునన్ నేనుసుగ్రీవు కార్యంబు నీమట్టు గావించితిన్ లంకలో, నింకఁ గాఁగల్గుకార్యం బవార్యంబుగాఁ జేయ మీ రెల్ల రున్నారుగా.

ఇంతవఱకు సుందరకాండమునఁ జెప్పఁబడిన విషయమంతయు సంగ్రహముగా జెప్పఁబడెను. వక్త హనుమంతుఁడు.

అర్థములు. ఆద్యంత వృత్తాంతము, హనుమంతుఁడు జరపిన చర్య మొదటి నుండి తుదవఱకు; ఆలింపఁగా=వినఁగా; తేనంచునన్ = రామచంద్రమూర్తి యొద్ద; హనుమంతుఁడు జరిపిన సర్వవృత్తాంతము వినఁగోరి జాంబవంతుఁడు హనుమంతుని నీవు సీతాదేవి నెట్లుచూచితివి. ఆమె యెట్లున్నది. ఆమె విషయమున రావణుఁడెట్టి యభిప్రాయముగలవాఁడై యున్నాఁడు. జరిగిన దానిలో రామచంద్రమూర్తితో జెప్పఁగూడినది యేది? చెప్పరానిది యేది! ఇవన్నియుఁ జెప్పుమని ప్రశ్నింపఁగా హనుమంతుఁడు సీతాదేవిని స్మరించి యామెకు శిరస్సుతో నమస్కరించి యిట్లు చెప్పుచున్నాఁడు. హేమశృంగాంచితంబు = బంగారు శిఖరముచేఁ బ్రకాశించునది. అడ్డంబురాన్=అడ్డమురాఁగా, తాఁచితిన్=కొట్టితిని-భంగమై=విఱిగినదై-మామకీనాశయము=నా యభిప్రాయము-చిన్నప్పను=పిన్నతండ్రిని-ధరాధ్రంబు లెల్లన్=కొండలన్నియు-భీదాన దక్షంబులు=భయము నొసంగుటయందు సమర్థము లయినవి-పక్షంబులన్=ఱెక్కలను-శక్రుఁడు=ఇంద్రుఁడు-గోడు=ఆపద-ధర్మభృత్+వర్యుఁడు=(౧)కోదండము ధరించిన వారిలో శ్రేష్ఠుఁడు, (౨) ధర్మరక్షణము చేయువారిలో శ్రేష్ఠుఁడు; జామాత=అల్లుడు-కర్జంబు=కార్యము-కార్యైకసక్తాత్మతన్=కార్యమునందు మాత్రమే యాసక్తి గలిగియున్న మనస్సుతో; గ్రావము=పర్వతము; నాగాంబ=సురస-మదాహారమున్ = నా యాహారము-అన్వీతుఁడు=కూడినవాఁడు-తదన్వేషణార్థంబు = ఆమెను వెదకు

కొఱకు-ఇచ్ఛన్-ఇష్టప్రకారము-అన్ను=స్త్రీ-పొల్లు = వ్యర్థము-వాక్రంత=నోటి సందు-వెల్వడ=బయలు వెడలిన, నైజాకృతి = సహజస్వరూపము, మొగుల్ త్రోవన్=ఆకాశమందు, చాయ=నీడ, చాయ=ప్రక్క, సంకుంఠితము=మొక్క పోయినది-తగ్గినది, వార్యంబు=అడ్డగింపబడినది, మున్నీటన్=సముద్రమందు, ఆఁకంటన్=ఆఁకలిచే, కుడ్పు=ఆహారము, వాకంబెన్=నోరికంబె, టక్కు=ఉపాయము, గుజ్జు=పొట్టి, నభశ్చరులా=ఆకాశమునఁ దిరుగువారగు, సామీరి=ఆంజనేయుఁడు, అత్యాయంబు=అవశ్యము చేయవలసినదానిని, శాఖిప్రతానము=వృక్షసమూహముచే, ఆవృతము=ఆవరింపఁబడినది, కల్పాంత = ప్రలయకాల మంటలి, ధారాధరాకార=మేఘమువంటి యాకారము గలది, ఘోర+అట్టహాస+ఆనన+ఉపేత=భయంకరమైన పెద్ద నవ్వుతోడి ముఖముతోఁ గూడినది, జాజ్వల్యమాన=మండుచున్న, అగ్నికేశాలితోన్+మంటవంటి వెంద్రుకలతో, డాకేలన్=ఎడమచేతితో, పెట్టు=దెబ్బ, ఓలుచున్ = విలపించుచు, ప్రదోషంబునన్=సూర్యాస్తమానమైన తర్వాతి కాలమున, అంతఃపుర+అంతః+స్థలిన్=అంతఃపురములోపలి ప్రదేశమున అశోకావనీజాతము = అశోకవృక్షము- శింశుపాభూరుహ=శింశుపావృక్షము యొక్క, ఉపాంతదేశంబున = సమీపప్రదేశమున, శ్యామన్=నడిమి వయస్సు దానిని-నీరేజపత్రాంబకన్ తామరతేకులవంటికన్నులు గల దానిని-నిట్టుపాసంబులన్=శుష్కపవాసములచే-ఏకాంశుకాన్వితయై (౧) ఒంటివస్త్రము గలదై (౨) హరణకాలమందే చీర ధరించియుండెనో యా చీరనే ధరించినదై-ధూళిసంలగ్న=దుమ్ముతోఁగూడిన-కేశాంతయై=వెండ్రుకల కొనలు గలదై-వివర్ణ=వన్నెమాసిన, ఆకృతిన్ = ఆకారమును-సంక్షిప్తగాత్రుండనై=కుఱుచ చేయఁబడిన దేహము గలవాఁడనై-కుజంబందు=చెట్టునందు-విత్రస్తయై=మిగుల భయపడినదై; వేపమానాంగియై = వణఁకుచున్న దేహము గలదై-భవత్+శోణితంబు=నీ నెత్తురు-ఉంకింతును=ప్రయత్నింతును, ఆజికిన్=దశరథునకు సత్యోక్తిదారుఁడు=సత్యము చెప్పుటయందు గొప్పవాఁడు-చితాస్థాగ్ని=శ్మశానమున కాష్ఠమునందు నగ్ని-మందోదరీనామ్ని = మందోదరి యను పేరుగలది. ముందు ధాన్యమాలిని యను రాక్షసి యడ్డము వచ్చినట్లు చెప్పఁబడెను. ఇచ్చట మందోదరి యని హనుమంతుఁడు చెప్పెను. దీనివలన నిరువురు నడ్డము రాఁగా నొకరిచ్చట నొకరచ్చటఁ జెప్పఁబడిరని కాని హనుమంతునకు మందోదరి పేరు మాత్రమే తెలిసి యుండుటచే నామె పేరు చెప్పెనని కాని ధాన్యమాలినినే మందోదరి యని భ్రమించెనని కాని యెంచవలెను. మందోదరి- మండోదరి యని రెండు రూపములు గలవు. మందోదరి యన్నప్పుడు పలుచని కడుపు గలది యనియు, 'మాంథాల్పే పటు నిర్భాగ్యా మందాః' అమరము. మండోదరి యన్న మీఁగడ వలెఁ బలుచని కడుపు గలది యని కాని, అలంకార భూ

మైన కడుపు గలదని కాని గ్రహింప నగు మండ=మండనము-అలంకారమునకుఁ బేరు 'మడి భూషాయామ్' మ్మను ధాతువు వలనఁ గలిగినది. పచాద్యచ్ — దంభ — డిండీర — డోలికా — దాడిమ శబ్దంబు లందు వలె దడలకభేదము గ్రహించిమండోదరి-మందోదరియని గ్రహింపనగు. 'మందా స్థూలపిపీలికా' గండుచీమకు పేరు. దాని నడుమువలె సన్ననైన కడుపు గలది. మండోదరి మందోదరి యని రెండు రూపంబులు. వారెల్ల.........నేగి రనుటచే ధాన్యమాలిని, మందోదరిగాక యితరస్త్రీలు నడ్డము వచ్చిరని గ్రహింపనగు. ఘోరాస్యలు = భయంకరమైన ముఖములు గలవారు, గర్జించి=సింహనాదము చేసి, భర్జించి=సంతాపపడఁ జేసి, తర్జించి=బెదరించి, కర్జంబు = కార్యము, దారుణాలాపముల్ = భయంకరమైన మాటలు, నిద్రించిరి=రాక్షసస్త్రీలు బెదరించిన తరువాత-నిద్రపోయిరి, ఆ సమయముననే సీతాంజనేయుల సంభాషణము. త్రిజాటాఖ్య=త్రిజట యనుపేరుగల-జట-జాట రూపాంతరములు, త్రిజటా నామము దండకమునఁ గుదురదు. నమస్కార మాత్ర ప్రసన్నన్ = నమస్కరించునంత మాత్రము చేతనే సంతోషించునది, కృపావాలన్=దయకుఁబాదైన దానిని, మదీయాశయంబు=నా యభిప్రాయము-ఎవ్వారిన్=ఎట్టి వారినైనను, ఎన్ని యపరాధములు చేసిన వారినైనను, కాంతు=భర్తయొక్క, జేతృత్వమున్ = జయమును-వమ్ము=వ్యర్థము-స్తవము=స్తోత్రము-విందుగాన్=సంతోషముతో-మిత్రాత్మజుండు = సూర్యపుత్రుఁడు-అభిజ్ఞానము=గుర్తు-ఆత్మాంగుళీయంబు=తనయుంగరము-చిత్తప్రమోదావహంబు=మనస్సునకు సంతోషము గలిగించునది-కొన్ని సందేశ వాక్యంబులు=ఇవి రామచంద్ర మూర్తితో మాత్రమే చెప్పఁదగినవి కావున నిచ్చట వానరులకుఁ జెప్పలేదు. మాసద్వయంబే=రెండు పక్షములు మాత్రమే-పక్షావై మాసా యను వాక్యము ప్రకారము రెండుపక్షము లనియే గ్రహింపవలెను. చూ. ప. ౯౫౩-౧౪౦౭-౧౪౧౩. సీతాదేవి తానొక మాసమే బ్రదికి యుండెదనని హనుమంతునకుఁ జెప్పినట్లు ముందు చెప్పఁబడెను. ఇక్కడఁ దసతో రెండు మాసములు బ్రదికి యుండెదనని చెప్పినట్లు హనుమంతుఁడు చెప్పెను. ఒకమాసమనునది స్థిరపఱిచి దానికిఁగల కారణము ముందు వ్రాయఁబడెను. కొందఱు దీనిని స్థిరపఱుచుకొని ఇచ్చటి మాసమనుటకు రెండునెలలని యర్థము చెప్పెదరు. "షష్టిభిర్దివసై ర్మాసః కథితో బాదరాయణైః" అని యొక వాక్యము గలదు. అనాథాకృతిన్=దిక్కులేని దానివలె, కింక=కోపము-అంకూరము - రూ - అంకురము-మొలక - అంకూర మంకురంచ స్యా దంకురోంకూర ఇత్యపి. ద్వి॥ కో॥ రద్దు = సద్దు = ధ్వని-యుష్మత్-నీయొక్క - మహాశూరతా+అజ్ఞాని = నీ గొప్పశౌర్య మెఱుగని వాఁడు-నపాటంబుగ = మట్టముగ-రూ. నపాట-నేలతోపాటు = నేలకు సమముగా-తోపాటు అనునది పైపాటులోపము-చేపడు శబ్దంబులవలె ఏకశబ్దమే

కావున తోఁబాటు అనునది యపశబ్దము. అశీతిసాహస్ర సంఖ్యాకంబు=ఎనుబది వేలు లెక్క గలవారిని-లొడి=గుదియ-పరిఘ-చైత్యప్రాసాదమున్='త్య' లఘువే కాని యిచ్చట గురువుగా గ్రహింపరాదు. వైకల్పికము-పూర్వము చర్చితము. స్తంభ ఘాతంబులన్=స్తంభము దెబ్బలచే, ఘోరాసుర వ్యూహసంయుక్తుఁడై=భయంకరులగు రాక్షసుల గుంపులతోఁగూడిన వాఁడై-లొణి=లొడి-మహామాత్య పుత్రాష్టకంబు=మంత్రుల పుత్రుల నెనిమిది మందిని- కాలాలయావాసులన్=యమునియింటఁ గాపురముండు వారు-చచ్చినవారు-హవ్యభుక్+సాక్షికము=అగ్ని సాక్షిగాఁ గలది-వనాటుల్=క్రోఁతులు-రుషాశోణితంబు=కోపముచే నెఱ్ఱనైనది-చూఁడునట్లు=కాల్చునట్లు-విభీషణ శబ్దము దండకమునఁ గుదురదు-సోకు తేఁడా=రాక్షసరాజా-రాజశాస్త్రవ్యపేతంబు=రాజనీతికి విరుద్ధమైనది-వధ్యుండు=చంపఁ దగినవాఁడు వాల్క-వారంబులన్=నార చీరల సమూహములను జీర్ణకార్పాస వస్త్రంబులన్=మాదితో చేసిన ప్రాతవస్త్రములను, అభ్రమార్గంబునన్=ఆకాశమున-ఆశ్రయాశుండు=అగ్ని-ఆశ్రయమును ఆహారముగాఁ గలవాఁడు.సంప్రహృష్టంబు=మిగుల సంతోషముతోఁగూడినది-సౌరభ్య=మంచివాసన - గంధవహుండు=వాయువు-వీతిహోత్రుండు=అగ్ని-తత్రస్థమా = అందున్న-అరిష్టము=అరిష్టమను పర్వతము-సుగ్రీవు కార్యము = శ్రీరామచంద్రమూర్తికి సుగ్రీవుఁడు నీ భార్యను వెదకి దాని వార్త చెప్పించెదనని చెప్పెను గావున యాయనకార్యము

దండకము=ఈ దండకమున నన్నియు తగణంబులే కాని వేఱు గణము లేదు-కడపట గురువు. విద్వాంసులెల్లన్ హకారంబె కానీ నకారంబె కానీ సకారంబె కానీ వచింపం దగు న్మందుగా నిందుఁ గాదేని యాదిం దకారంబు కల్పించి యామీఁద నెల్లం దకారంబులే మెండుగా నిచ్చకున్ వచ్చు నందాఁక నిర్మించి గుర్వంతముం జేసినన్ దండకంబండ్రు-అప్ప.

## తాత్పర్యము

సుగమము.

ఓయీ యీ దండకమందు త్రిజటావాక్యముల నమ్మి రాక్షసస్త్రీలు సీతాదేవికి శరణాగతి చేసినట్లును, సీతాదేవి వారికి నభయప్రదానము గావించిన ట్లున్నదికదా.

(౧) "స్వరక్షణే ప్యశక్తస్య కో హేతుః పరరక్షణే' తన్నుఁదాను గాపాడుకొనలేని వాఁడు పరులనెట్లు కాపాడఁగలఁడను న్యాయ మనుసరించి తన చెఱ తాను దప్పించుకొనలేక యాంజనేయా నన్నెట్టులయిన రామచంద్రునితోఁ జెప్పి రక్షింపుమని హనుమంతుని బ్రార్థించునది యితరుల నెట్లు రక్షింపఁగలదు. ఏటి వెంటఁ గొట్టుకొని పోవునొకఁడు మఱియొకని రక్షింపఁగలఁడా

(౨) ఒకవేళ రక్షింపఁగలిగెనేని మగనితోఁజెప్పి రక్షింపఁగలదే కాని యా యధికారము తనకుఁగలట్లు స్వతంత్రించి యెట్లు చెప్పగలిగెను. అనఁగా సీతాదేవియందు నుపాయత్వము గలదే కాని యుపేయత్వము లేదని సందేహము.

(౧) ప్రథమ సందేహము నిరాకరము-సీతాదేవి దన్నుఁ దాను గాపాడు కొనలేక హనుమంతుని బ్రార్థించెననుట సరిగాదు.

'నేన దశాస్య నిన్నిపుడ నీఱుగఁ జేయనె నాదువల్లభుం డానతి యీమి నట్టి పనికై తపమెల్లను బొల్లుపోవఁగా మానస మొప్పకుంకుటను మానితిఁగాక' యని స్పష్టముగా సీతాదేవి చెప్పెను.

క. 'జానకి కోపమె పూనిన, మానక యొనరించు దాని మఱి దహనుండున్
బూని కరంబున నంటినఁ, దా నోనరుపఁ జాలఁ డింత తథ్యము సుండీ.' ౧౬౭౯

లంకయంతయు సీతాతపోదగ్ధమై యున్నదనియు, రామచంద్రమూర్తి నిమిత్త మాత్రమనియు హనుమంతుఁడు చెప్పెను.

శీతోభవ-హనుమ యొడ శైత్యమగుమీ యగ్నిదేవ యని యగ్ని చల్లగా నుండునట్లు చేసెను.

ఇంతటిశక్తిగలది తన్నుఁ దాను రక్షించుకొన శక్తి లేక హనుమంతుని బ్రార్థించె ననుట దుశ్శంకయే, తన్నుఁ దాను రక్షించుకొనినను హనుమంతుఁడు రక్షించినను రామచంద్రమూర్తి కపకీర్తి వచ్చునని యా ప్రయత్నము మానెను.

౨, ఇఁక రెండవ సందేహమును గుఱించి-లక్ష్మీనారాయణుల కవినాభావ సంబంధము గలదనియు ౪౬౦౪వ పద్య వ్యాఖ్యానమందు సర్వకారణత్వ-సర్వ వ్యాపకత్వ-సర్వనియంతృత్వాదు లిరువుర యందుఁ గలవనియు నిరువురు నుపేయ భూతులే యనియుఁ జెప్పబడెను.

యత్పదాంభోజ ఘటితా ప్రణతీ దుర్లభాన్యపి। పదాని పరమాం ముక్తిం సూతేతాం శ్రియ మాశ్రయే। సర్వకామప్రదాం రమ్యాం సంసారార్ణవ తారిణీమ్। క్షిప్రప్రసాదినీం లక్ష్మీం, శరణ్యా మనుచింతయేత్। అనేనైవం ప్రపన్నస్య శ్రియం దేవీం సనాతనీమ్। పాపానుషంగ స్సకల స్తత్క్షణాదేవ నశ్యతి. ఇత్యాది వాక్యములు లక్ష్మీదేవియుఁ దన యాశ్రితులను సంసారము నుండి తరింపఁ జేయఁ గలదని తెలుపుచున్నవి.

లక్ష్మీనారాయణులను సీతారాములను బరస్పరభిన్నులుగాఁ దలఁచుటచే నిట్టి కుశంకలు కలుగు చున్నవి. "లక్ష్మ్యా సహ హృషీకేశో దేవ్యా కారుణ్య రూపయా రక్షకః సర్వసిద్ధాంతే వేదాంతేపిచ గీయతే॥" యన్నట్లు లక్ష్మీదేవి భగవంతుని కరుణాశక్తియే. కృపయాపర్యపాలయత్॥ 'కరుణచేఁ గాకమును రామచంద్రమూర్తి రక్షించెనన్నప్పుడు రామచంద్రుఁడు రక్షించెనా, కరుణ రక్షించెనా యని రెండు వేఱుగా విడఁదీసి ప్రశ్నించు టెట్టిదో, లక్ష్మిరక్షించెనా

నారాయణుడు రక్షించెనా, సీత రక్షించెనా రాముడు రక్షించెనా యను ప్రశ్నయు నట్టిదే. రాముడు లేని కరుణ రక్షింపజాలదు. కరుణలేని రాముడు రక్షింపఁ జాలఁడు. కృపరక్షించె ననిన రామచంద్రమూర్తి రక్షించె నన్నట్లే. రామచంద్రమూర్తి రక్షించె ననిన కరుణ రక్షించె నన్నట్లే. సీతా–లక్ష్మీ–కరుణ–కృప–దయ–యివి పర్యాయపదములు, కావుననే భక్తులు లక్ష్మీ విశిష్టనారాయణుని సీతావిశిష్టరాముని నుపాసింపవలయు నని శాస్త్రములు చెప్పుచున్నవి. ఒకరిపేరు చెప్పినను రెండవవారుకూడ నున్నట్లే భావింపవలయునుగాని రెండవవారి యందు నిరసన భావము కూడదు. సీతతో నాకుఁ బనిలేదు, రాముఁడే చాలుననరాదు. సీతయే చాలును, రామునితోఁబనిలేదనరాదు, ఎండను విడిచి సూర్యుని, వెన్నెలను విడిచి చంద్రుని–అలలవిడిచి సముద్రుని ననుభవించుటెట్లు? "మా మేకంచ శ్రియాయుక్తం భక్తియుక్తో నరోత్తమః ద్వయేన మంత్రరత్నేన మత్ప్రియేణ భజేత్సదా। అచిరాన్మత్ప్రసాదేవ మల్లోకంచ సగచ్ఛతి"।ఇత్యాది ప్రమాణము లనేకములు గలవు.'యా సా భగవత శ్శక్తి రహంతా సర్వభావగా అపృథక్కారిణీ సత్తా మహానందమయీ పరా॥భావాభావానుగా శక్తిస్సర్వ కార్యకరీ విభోః। స్వాతంత్ర్యరూపా సా విష్ణోః ప్రస్ఫురత్తాజగన్మయీ అహంతా బ్రహ్మణ స్తస్య సాహ మస్మి సనాతని। ఆత్మా న సర్వభూతానా మహం భూతో హరిః స్మృతః। అహంతయా వినాహంహి నిరుపాఖ్యో నసిధ్యతి। అహమర్థ వినాహంతా నిరాధారా న సిధ్యతి॥ అహం భగవంతుఁడగునేని అహంత లక్ష్మీదేవి యగును. ఈప్రకారము గుణగుణులకు విశేషణవిశేష్యములకు వాగర్థములకు వలె లక్ష్మీనారాయణులకు సీతారాముల కభేదము అవినాభావసంబంధము చెప్పినను ఎండయే సూర్యుఁడయ్యెను. సూర్యుడే యెండయయ్యెను.శక్తియే శక్తుఁడయ్యెను. శక్తుఁడె శక్తియయ్యెను. అర్థమే వాక్కు–వాక్కే యర్థము. అని యిట్లు స్వరూపైక్యము చెప్పరాదు.భార్యాభర్తృన్యాయముచే సీతా లక్ష్ములను స్త్రీ స్వరూపములుగనే పూజింపవలెను. రామనారాయణులను పురుషరూపములుగనె పూజింపవలెను. సీతకు దోవతి కట్టరాదు. రామునకుఁ జీర కట్టరాదు. బిడ్డలకుఁ దల్లిదండ్రు లిరువురు సేవ్యులే, సీతకు రామచంద్రమూర్తి మాత్రమే సేవ్యుఁడు. ఎవరి సాంప్రదాయ మెట్లుండినను సీతాదేవి యనుగ్రహించిన కాక–గృధ్ర–సుగ్రీవ–విభీషణులను రామచంద్రమూర్తి యనుగ్రహించుటచే సీతాదేవి యందు దుపాయత్వము గలదనియు, హనుమంతునిచేఁ జావకుండ రాక్షస స్త్రీలఁగాపాడుటచే నుపేయత్వము (స్వతంత్ర రక్షణశక్తి) గలదనియు,రామాయణము వలన నెఱుఁగవలసిన విషయము. రామచంద్రమూర్తి యందును నీ రెండు శక్తులు గలవు. ఇది సారాంశము.

౫౯-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవిని దోడ్కొని వచ్చి
శ్రీరాముని దర్శించుట యుక్తమని చెప్పుట.

మ. అని సర్వంబు వచించి జానకి మహా॰త్యర్థ ప్రశీలంబుచే
నినసంభూతుని సంభ్రమంబు రఘువం॰శేశప్రయత్నంబు గాం
చెను సాఫల్యము, నాదు చిత్తము సదా॰చింతించెడిన్ జానకీ
వనజాతాయతలోచనాప్రవణమై॰భాషించితిన్ సత్యమున్. ౧౩౮౧౪

అర్థములు. మహా+అత్యర్థ+ప్ర+శీలంబుచే=మిక్కిలి గొప్పదై శ్రేష్ఠమైన పాతివ్రత్యముచే, ఉత్తశీలము కాదు. ప్రకృష్టశీలము కాదు అత్యర్థప్రకృష్ట శీలము గాదు. మహాత్యర్థ ప్రకృష్టశీలము-సంభ్రమము=త్వర, ఉత్సాహ మనిభావము. జానకీ వనజాయతలోచనా=కమలములవలె దీర్ఘములైన కన్నులు గల సీతాదేవి యందు, ప్రవణమై=భక్తిగలదై, ఆసక్తిగలదై-మిట్టనీళ్ళు పల్లమునకుఁ బోవు చున్నచున్నట్లుపోవునదియై, వినయముతోఁ గూడినదై-ప్రవణశబ్దమున కిన్ని యర్థములు గలవు. అన్నియు నిచ్చట నన్వయించునవియై యున్నవి. సీతాదేవి విషయమున హనుమంతుని మనస్సు ఈ విధము గలదయ్యెను. అనఁగా సీతా దాసుఁడయ్యెనని భావము.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి యనుగ్రహముచేతను, మీ తేజోవిశేషము చేతను నా వంతునకు మీరు పెట్టిన కార్యము సీతనుజూచి వచ్చుట యను దానిని లంకలో నింతమాత్రము చేసివచ్చితిని. తక్కిన కార్యము మీవంతు సుగ్రీవుని సీతాన్వేషణ మందుఁగల యుత్సాహము రామచంద్రుని ప్రయత్నము, ఈ రెండును సీతాదేవి యొక్క మహాపాతివ్రత్యమహిమాతిశయముచే ఫలించినవి. వారిరువురి కార్య ములు నెఱవేఱినవి. నామనస్సు వికసించిన కమలమును విడిచి తుమ్మెద యెట్లు రాదో యట్లు సీతాదేవిని విడిచి రాక యక్కడికే పోవుచున్నది. ఇట్లు నాజన్మము సఫలమైనది. ఉన్న దంతయు యథార్థముగాఁ జెప్పితిని.

చ. అలఁతిగ నెంచఁ బోకుఁడు సు॰రారివిభున్ దశవక్త్రునిం దపో
బలమున లోకముల్ నిలుప॰బాధతరాగ్రహ మెత్తి యన్నిటిన్
బెలుచ దహింపఁ జాలెడిఁ బ్ర॰వృద్ధుఁడు సర్వవిధాల, జానకిన్
బలిమిని దాకియుం జెడమి॰వానితపోగరిమంబునం జుఁడీ. ౧౩౮౧౫

అర్థములు. అలఁతిగన్=అల్పునిగ, బాధతరాగ్రహ మెత్తి=మిగులఁ గోపాతిశయము పూని, పెలుచన్=త్వరగా, ప్రవృద్ధుఁడు=మిగుల గొప్పవాఁడు, తపోగరిమంబునన్=తపస్సుయొక్క గొప్పతనముచే, 'గురు' శబ్దమునకు ఇమనిచ్ ప్రత్యయము చేర్పఁగా గరిమ యయ్యె.

తా త్ప ర్య ము

నేను జెప్పినదానిని బట్టి రావణుఁడల్పుఁడు, సులభసాధ్యుఁడని తలఁప వలదు. వాని తపోబలముచేత లోకముల నిలుపను, కోపించి సంహరింపను గూడ సర్వవిధాల గొప్పవాఁడు. జానకిని దాఁకి వాఁడు దగ్ధుఁడు కాక యుండుట వాని తపోబలము చేతనే సుమా.

క. జానకి కోపమె పూనిన, మానక యొనరించుదాని • మఱి దహనుండున్
బూని కరంబున నంటినఁ, దా నొనరుపఁ జాలఁ డింత•తథ్యము సుండీ! ౧౩౨౦

తా త్ప ర్య ము

ఓయీ యాంజనేయా! సీతాదేవి మహాపతివ్రత యంటివి. అట్టి పతివ్రతను బలవంతముగఁ దాఁకి రావణుఁడు తన తపోబలముచేఁ జెడక యున్నాఁ డంటివి. అయిన నామె తపోమహిమ కన్న, వాని తపోమహిమ గొప్ప దయ్యెఁ గదా. అట్టి వానిని రాముఁడేమి చేయఁగలఁడు? సుగ్రీవుఁ డేమి చేయఁగలఁ డందురేమో. అట్టి సందేహముతోఁ బనిలేదు. రావణుని దురభిప్రాయమువంటి దురభిప్రాయము గలవాఁడై మఱి యొకఁడు బలాత్కారముగఁ దాఁకి యుండెనా యామె సంకల్పము లేకయే యగ్నిని దాఁకిన మిడుతయై యుండును. వాని తపస్సుచే నట్లు గాలేదు. ఏలందురా? దాని విషయమున నప్పు డామె కోపించినది కాదు. ఆమె కోపమే తెచ్చుకొనెనా యా కోపముచేయు పనిని నగ్నిహోత్రుఁడు మనచేతితోఁ దాఁకినను జేయఁజాలఁడు. అగ్నిహోత్రుఁడు రావణాసురుని గొంపకాల్పఁ గలిగెను గాని సీతాదేవి యుండు చెట్టును గాల్పఁగలిగెనా? సీతాదేవి రావణుని దానై ప్రత్యక్షముగఁ జెఱుపరాదని సంకల్పించి యున్నది. కావున వాఁడు జీవించి యున్నాఁడు.

చ. జరిగిన దేమొ చెప్పితిని•జాంబవదాదుల సమ్మతిన్ నృపా
భరణము రామచంద్రుఁ గన•భావ్యము జానకిఁ దెచ్చి, రావణున్
బరిజనయుక్తు నే నొకఁడ•పట్టి వధింపఁగఁ జాలుదున్ వనే
చరవరులార! మీరలును•సాయము వచ్చినఁ జెప్ప నేటికిన్? ౧౩౨౧

తా త్ప ర్య ము

లంకలో జరిగిన వృత్తాంతము నంతయుఁ జెప్పితిని. ఇఁక జరుగవలసిన దేమో యాలోచింపుఁడు. నా యభిప్రాయమున జాంబవంతుఁడు మొదలగువా రంగీకరించిన యెడల సీతాదేవిని దెచ్చి రాజశ్రేష్ఠుఁడగు రామచంద్రమూర్తిని మనము చూడఁబోవుట బాగు. ఆమె యిక్కడ దుఃఖించుచుండుట, ఆవార్త చెప్పిన రామచంద్రమూర్తి యక్కడ దుఃఖించుట, దానిని మనము బేదలవలెఁ జూచుచుండుట సరిగాఁ దోపలేదు. రావణుని వాని పరివారమును నే నొకఁడ నే చంపఁగలను. ఇఁక మీరుకూడఁ దోడైతిరా చెప్పవలసిన పనియేమిలేదు. మిగుల సులభముగ

గార్యమగును. మనము రావణుని జంపి సీతను దెచ్చితిమేని రామచంద్రున కప కీర్తి రాదా యందురేమో-రాదు. సేవకులు కార్యము చేసిన ప్రభువు కీర్తి పొందును గాని, సేవకులు చేయవలసిన కార్యముకూడ ప్రభువు చేయవలయునా? సేవకులకు సాధ్యము కానిది ప్రభువు చేయవలెను. అన్నియుఁ బ్రభువే స్వయముగఁ జేసికొనునేని సేవకులతోఁ బనియేమి? ఈ కార్యము మనవలన నగునా యందు రేమో.

క. శూరులుఁ గృతాస్త్రులును గడు,వీరులుఁ గృతమతులు మఱియు•విజయైషులు దు
ర్వారబలయుతులుఁ బ్లవగులు, మీరలు బాసటఁగ లంక•మీఁటనె దివికిన్!

అర్థములు. కృతాస్త్రులు=అస్త్రములను దెలిసినవారు, కృతమతులు=చక్కని బుద్ధి యాలోచనము గలవారు-విజయైషులు=గెలుపుకొనఁ గోరిక గలవారు, దుర్వారబలయుతులు=వారింపరాని బలముతోఁ గూడినవారు, ప్లవగులు=ఈ సముద్రమును దాఁటఁగలవారు, (౨) ప్లవగులారా యని సంబోధనముగనైన గ్రహింప వచ్చును. బాసటగ=తోడుపడఁగ.

తాత్పర్యము

మీరందఱు శూరులు, అస్త్రజ్ఞానము గలవారు, మిగుల వీరులు, బుద్ధిమంతులు, జయముఁ గొనఁ గోరిక కలవారు, వారింపరాని బలముగలవారు, దాఁట శక్తిగలవారు. ఇట్టి మీరు తోడై వచ్చెదరేని లంక నాకాశమున కెగరఁజిమ్మనా.

సీ. సహపుత్రు సానుజు•సైన్యసమేతుని, రావణు నొకఁడ సం•గ్రామమునను
బొరిపుచ్చ నేర్తును•హరిహాయజిత్తుని, బ్రాహ్మమైంద్రంబును•రౌద్రవారు
ణాద్యస్త్రముల నెల్ల•హాననంబుఁ జేసెద, నందఱుఁగాని మ్మోటంటి రేని
నా కురిసెడి నిరం•తర శైలవృష్టికి, నమరులు నిల్గుదు•రసురు లెంత

ఆ. వనధి వేల దాఁటి•వచ్చిన వచ్చును, మఱియు వణఁక వణఁకు•మందరంబు
గాని జాంబవంతుఁ•గదలింప నేరదు, సంగరంబునందు•శత్రుసమితి. ౧౩-౨౩

తాత్పర్యము

రావణుని కొడుకులతోఁ దమ్ములతో సేనలతో నే నొకఁడనే యుద్ధమందుఁ జంపఁగలను. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రము-ఐంద్రాస్త్రము-రౌద్రాస్త్రము-వారుణాస్త్రము లోనగు వానినెల్ల నాశము చేసెదను. ఇట్లు చేయుటకు మీ సమ్మతి గావలెను. మీ యంగీకారము లేమిని గదా యూరక వచ్చితిని. నేను రాలవాన గురియించితి నేని దేవతలు చత్తురు. రాక్షసులేమి లెక్క? సముద్రము చెలియలి కట్టదాఁటి వచ్చిన రావచ్చును. మందరము వణఁకిన వణఁకును గాని జాంబవంతుని శత్రుసమూహము యుద్ధమునఁ గదలింప నేరదు.

సీ. అసురసంఘములఁ బేర్వైనవారిని జంపఁ,జాలు నొక్కరుఁడ యీ•వాలిసుతుడు
పనసనీలుర జవ•పటిమను సగ్గగు, మందర మాశర•బృందమెంత

మైందద్వివిదులతో♦మారొ్కనఁగలవారి, యక్షగంధర్వో♦రగాలి నైన
ద్రవే ల్వంచి యొక్కని♦వెదకి చెప్పఁడు చూత, మేనెఱింగిన యంత♦లోన లేఁడు
ఆ. బ్రహ్మవరముఁ గన్న♦పరమబలాధికు, లమృత మానినార♦లాశ్వినేయ
గౌరవార్థముగను♦కమలసంభవుఁ డవధ్యత్వ మిచ్చె వీరి♦కనఘులార! ౧౩౨౮

తా త్ప ర్య ము

ఆ రాక్షసుల గుంపులోఁ బ్రసిద్ధమైన వారి నెల్ల నీయంగదుఁ డొక్కఁడే చంపఁగలఁడు. పనసుని, నీలుని, వేగాతిశయమునకు మందరమైనను జూర్ణమగును. రాక్షసు లగుట చెప్పనేల? మైంద ద్వివిదులతో నెదిరించి పోరగలవారిని యక్షు లందు గంధర్వులందు పన్నగులందుఁ గలరేమో వెదకి చెప్పఁడు. నాకుఁ దెలిసి నంతలో లేఁడు. వీరు బ్రహ్మవరముచే బలవంతులు. అమృతమును ద్రావినారు. అశ్వినీ దేవతల గౌరవార్థము వీరికిఁ జావు లేకుండ బ్రహ్మ వర మిచ్చెను.

క. వరగర్వంబున వీరలు, సురవరసంఘముల గెల్చి♦సురఁ ద్రోలిరి యా
శరవిసరముఁ జీరికిఁ గొం,దు రె యంద ఱటుండ నిండు♦దోర్దర్పఘనుల్.

తా త్ప ర్య ము

తక్కిన బలవంతులమాట యటుండనిండు. వీరు వరగర్వముచే దేవతా సమూహముల గెల్చి యమృతమును ద్రావిరి. ఇట్టి వీరు రాక్షసులను లక్ష్య పెట్టుదురా.

క. లంకాపురమెల్ల, నిరా,తంకంబుగఁ గాల్చి బూడి♦దం జేసితి ని
శ్శంకంబుగ నామంబుల, బింకంబుగ నెల్ల యెడలఁ♦బేరొ్కంటిఁ జుఁడీ.

అర్థములు. నిరాతంకంబుగన్=నిర్భయముగ.

తా త్ప ర్య ము

నిర్భయముగ లంకాపట్టన మంతయుఁ బూడిద యగువఱకుఁ గాల్చితిని. సందేహము లేకుండ పేర్లను అన్ని తావులఁ జెప్పితిని. ఏమి చెప్పితి వందురా.

చ. జయము జయంబు రామునకు♦పారపరాక్రమధన్యమూర్తికిన్
జయము జయంబు విద్విషద♦సహ్యతరస్వి సుమిత్రపట్టికిన్
జయము జయంబు దాశరథి♦సంపరిపాలిత కీశభర్తకా
యయమతి సూర్యసూతికి మ♦హాద్భుత విక్రమ కీర్తిశాలికిన్. ౧౩౨౯

తాత్పర్యము; చూడు. ౧౦౩౮—౧౦౩౫.

క. కోసలరాజేంద్రునకున్, దాసుఁడ హనుమత్సమాఖ్యఁ♦దనరినవాఁడన్
నే సుతుఁడ మారుతున కని, వాసిగ నెల్లరును వినఁగఁ♦బలికినవాఁడన్.

తా త్ప ర్య ము

నేను శ్రీరామచంద్రమూర్తికి దాసుఁడను. నా పేరు హనుమంతుఁడు. నేను వాయుపుత్రుఁడను అని యందఱు వినునట్లు చెప్పి వచ్చినాఁడను గాని రహస్య వ్యాపార మేమియు లేదు.

—♦ హనుమంతుఁడు కపులకు సీతాదేవి స్థితిని దెలుపుట ♦—

క. అనుపమశీలవతీమణి, వనజాంబక ఖలు నశోక♦వని శింశుప నీ
 డను దుఃఖించుచు నున్నది, మన మెరియదె యామె పాటు♦మది స్మరియింపన్.

అర్థములు. అనుపమశీలవతీమణి=అసమానమైన పతివ్రతలలో శ్రేష్ఠురాలు- దీనిచే నామె గుణము చెప్పఁబడెను. వనజాంబక=కమలము వంటి కన్నులు గలది- దీనిచే నామె సౌందర్యము చెప్పఁబడెను. ఇట్లు గుణము, రూపము రెండు చెప్పఁబడెను. ఖలు=దుష్టుఁడగు రావణుని యొక్క-ఎరియదె=మండదా?

తాత్పర్యము

గుణమునందా పరమపతివ్రతలలో నాయకమణి- సౌందర్యమునందా కమలవంటి కన్నులు గలది. ఇట్లుత్తమ గుణము, ఉత్తమ రూపము గలది. శిష్టుఁడు గాఁడు. దుష్టుఁడగు వాని యొక్క మేడలలోఁ గాదు. అశోకవనములో, ఫల వృక్షము గాదు. ఇరుగుడుచెట్టునీడ దుఃఖించు చుండఁదగినదా? అది జ్ఞప్తికిఁ దెచ్చుకొనిననే నా మనస్సు మండిపోవుచున్నదే. ఇఁక మీరు చూచియుండిన నేమై యుందురో. ఎంతో రాతిగుండెవాఁడను గావున నిబ్బరించుకొనితిని. నే నింత దూర మెత్తి చెప్పుట కిది కారణము.

క. దానవతరుణీవృత మై, జానకి వారిదవిలీన♦శశిలేఖ యనన్
 దీన యయి కాంతి దొఱఁగియు, మానసమున సరకు గొనదు♦మానవభోజిన్.

అర్థములు. దానవ తరుణీవృతయై=రాక్షసస్త్రీలచేఁ జుట్టబడినదై, వారిద విలీన=మేఘముచే మఱుఁగుఁ పఱుపఁబడిన, శశిలేఖ=చంద్రరేఖ.

తాత్పర్యము

రాక్షస స్త్రీలచేఁ జుట్టుకొనఁ బడుటచే మబ్బుచే మాటువడిన చంద్రరేఖ వలెఁ గాంతిహీన యయి శోకించుచుండియు సీతాదేవి యా రావణుని మనస్సునందు లక్ష్యము సేయదు.

తే. ఆత్మనాయకునందు నే♦కాగ్రవృత్తిఁ, జిత్తమును నిల్పి నిర్జర♦సత్తముపయి
 నల పులోమజ యట్టుల♦యధికరక్త,యగుచు శ్రీరాము ధ్యానించు♦ననవరతము.

అర్థములు. నిర్జరసత్తముపయి=ఇంద్రునిమీఁద, అధికరక్త=మిక్కిలి యనురాగము గలది.

తాత్పర్యము

ఇంద్రునియందు శచీదేవివలెఁ దన భర్తయందు నేకాగ్రమైన మనోవ్యాపారముచే మనస్సును నిలిపి యనురాగము గలదై సీతాదేవి సర్వదా శ్రీరామచంద్రమూర్తిని ధ్యానించుచున్నది.

ఉ. మాసిన యొంటిచీరను దు♦మారమునం దను వెల్ల బ్రుంగ నీ
 తాసతి దుఃఖభారవశ♦తం దపియించుచుఁ బ్రాణనాథుపై

నాసను రక్కసుల్ బెదరు•లాడఁగ వ్రేలెడు నొంటివేణితో
గాసిని గుందెడిం, దలపఁ•గాఁ గడుపెల్లను మండిపోయెడిన్. ౧౩౩౨

అర్థములు. వ్రుంగన్=మునుఁగఁగ, దుఃఖభారవశతన్=అధిక దుఃఖమునకు లోపడి, రక్కసుల్=రాక్షసస్త్రీలు.

తాత్పర్యము

మాసిన యొంటి కట్టుచీరతో నుత్తరీయమైన లేక, దుమ్ములో మునిఁగి దుఃఖాతిశయముచేఁ దపించుచు సీతాదేవి భర్తను జూడఁగల నను నాశచే రాక్షస స్త్రీలు బెదరింపు మాటలను చెప్పినను వ్రేలాడు నొంటి జడతో మిగుల శ్రమపడి దుఃఖించుచున్నది. అది తలఁపునకు వచ్చిన కడుపు మండు చున్నది.

ఉ. చూడఁగ గుండె ఝల్లు మను•సోఁకు నెలంతలు భీతిగొల్పఁ ద
న్నాడఁగ, వల్లభా! యనుచు•నాతని సేమముఁ గోరి దీనయై
వాడి దురంతశోకమున•వ్రాలఁ ధరాస్థలి దుష్టరాక్షసా
క్రీడమునందుఁ గంటిఁ గలి•కిం జలికాలున తూఁడుఁ బోలగన్. ౧౩౩౩

అర్థములు. సోఁకు నెలంతలు=రాక్షసస్త్రీలు-ఆక్రీడము=ఉద్యానవనము-చలికాలునన్=మంచుకాలమందు- తూఁడనన్=తామర తూఁడువలె.

తాత్పర్యము

చూచిన మాత్రము చేతనే గుండెలు ఝల్లనిపించు వికారరూపములు గల రాక్షసస్త్రీలు తన్ను భయపెట్టు మాటలాడఁగా నాథా యనుచు నాతని సేమము గోరి దుఃఖించుచు వెలవెలఁ బారిన ముఖముతో తేజస్సు మాసి నేలఁబడి యుండఁగా రాక్షసుని యుద్యానవనమందు సీతాదేవిని మంచుకాలమునాఁటి తామరతూఁడువలె నుండు దానిని జూచితిని.

ఉ. వచ్చెడిజాడ లేదు నృప•వల్లభుఁ డీయెడ, కీ సురారినిన్
నచ్చఁగ రాదు, వానివల•నం జెడ నొల్లను, గాన నిప్పుడే
చచ్చుట మేలటంచును భృ•శంబుగ నిశ్చితచిత్తయైన యా
సచ్చరితాగ్రగణ్య కొక•చందమున న్మది నమ్మఁ బల్కితిన్. ౧౩౩౪

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిచ్చటికి వచ్చుమార్గము కనఁబడలేదు. రావణాసురుని నమ్మరాదు. ఎప్పుడు చంపునో యేమో. వానివలనఁ జచ్చుట నాకిష్టము గాదు. కావున నీ పాపాత్మునిచేతఁ జచ్చుటకంటె నా యంతట నేనే యిప్పుడే చచ్చుట మేలని దృఢ నిశ్చయముగల యాపతివ్రతా శిరోమణికి నే నేకో యొక విధముగా నమ్మఁబలికితిని.

క. మచ్చటలను సర్వార్థము, లచ్చపలాక్షికిని జెప్ప•నగచరపతితో
నచ్చపుఁ జెల్మి హృదీశున, కచ్చుపడుట కబ్జనేత్ర•హర్షం బందెన్. ౧౩౩౫

తాత్పర్యము

సీతాదేవి యనెను. సంభాషించునపుడు అన్నివిషయములు మెకుఁ జెప్పఁగా వానరరాజుతో శ్రీరామచంద్రమూర్తికి మైత్రి కుదిరిన దానికి సీతాదేవి మిగుల సంతోషించెను.

ఉ. ఆమె మహానుభావతను • నామె యతుల్య పతివ్రతంబునం
దామసుఁడైన యా యసుర • నాయకుఁ డింతకుఁ జాక తక్కుటన్
భూమి మహాత్ముఁ డే యనఁగ • బోలును, వానిని రూపు మాపఁగా
రాముఁడు సంగరస్థలిని • గాలఁ గలందు నిమిత్తమాత్ర మై. ౧౩౩౮

అర్థములు. మహానుభావతను=మాహాత్మ్యముచేత, అతుల్య పతివ్రతంబునన్=అసమానమైన పాతివ్రత్యముచేతను-తామసుఁడు = విశేషముగఁ దమోగుణము కలవాఁడు, చాక=చావక, తక్కుటన్=మిగిలియుండుటచే, నిమిత్తమాత్రము-కుమ్మరవాఁడు కుండలఁ జేయుట యందు మన్ను ఉపాదానము, కుమ్మరి నిమిత్తము - అట్లులే రావణవధయందు రామచంద్రమూర్తి నిమిత్త మగుచున్నాఁడు. ఆయనచే నా పని చేయించు కారణము సీతాదేవి యగు చున్నది. ఆమె స్వయముగా రావణుని జంపెనేని వీరపత్ని యను పేరు రాదు. అగస్త్య భ్రాత యన్నట్టు లాయనకు సీతాపతి యని పేరు వచ్చును. అది యాయనకు నవమానకరము. కావున భర్తచేతనే రావణుని జంపించి యా కీర్తి యాయనకువచ్చునట్లుచేసి యిటువంటి వాని భార్య యనిపించుకొన వలె నని యా యమ వ్రతము. కావున నామెయే చంపలేదు, గాని శక్తిలేక కాదు. దీనివలన స్త్రీలు శక్తిమతులైనను బురుషులు చేయఁదగు కార్యములు తాము చేయఁగలిగి యున్నను మగలకుఁ దోడుపడి వారిచేఁ గార్యము చేయింప వలయును. గయ్యాళి గంగమ్మలై మగవారి కపకీర్తివచ్చు విధముగ వారి సమ్మతిలేక వ్యవహరింపరాదని యేర్పడు చున్నది.

తాత్పర్యము

ఆమె మాహాత్మ్యము చేతను అసమానపాతివ్రత్యము చేతను తామసుఁడైన రావణుఁడు చచ్చి దుర్మరణము పాలుగాకుండుటచే మహానుభావుఁడే యనఁదగు. వానిని చంపుటయందుయుద్ధమున రామచంద్రమూర్తి నిమిత్తమై యన్నికార్యములాయనయే చేయఁగలఁడు. ఆ కారణముననామె వానిని శపింపక యూరకున్నది.

తే. సహజముగ సీత తన్వంగి • సాధులార!
యందుఁ దా భర్తృశోకతా • పార్దిత యయి
పాఠ్యమిని బకియించెడి • వాని చదువు
పగిదిఁ గృశియించి యున్నది • ప్రభ దొలంగి. ౧౩౩౯

అర్థములుఁ తన్వంగి=తను+అంగి=సన్నని దేహముగలది, భర్తృశోకతాప+అర్దితయయి=మగని విడిచిన శోకమువలనఁ గలిగిన తాపముచే బాధపడి,

### తాత్పర్యము

సాధులారా! సీతాదేవి సహజముగ సన్నని దేహము గలది. అం దిప్పుడు మగని విడిచి యుండుట వలనఁ గలిగిన శోకబాధచేఁ బాడ్యమినాఁడు చదువువాని చదువువలె క్షీణించి యున్నది.

తే. సీత యీ రీతి లంకలోఁ • జిక్కి నవసి
గోడు గుడుచుచు నున్నది • పాడి యరసి
దానికిని మాఱు సేయంగఁ • దలఁప రయ్యా
యనినఁ దారాతనూభవుఁ • డనియె నిట్లు, ౧౩౩౮

అర్థములు. పాడి=ధర్మము.

### తాత్పర్యము

సీతాదేవి యీ విధముగ లంకలో బాధపడుచు శుష్కించి యున్నది. దీనికి ప్రతిక్రియ యేమి చేయుట న్యాయ్యమో యాలోచింపవలసినది. అనఁగా నంగదుఁ డిట్లనియె.

-•౬౦-వ సర్గము. అంగదుఁడు సీతాదేవిని దోడ్కొని వచ్చుటకు సమ్మతించుట•-

ఉ. దంటలు మీరు శౌర్యమున • దానవ దేవభుజంగ పాళులన్
జంటలు లేరు మీకుఁ బ్లవ • నంబున, నిట్టిరు రిత్త కేల వా
ల్గంటులమిన్న లేక చనఁ • గార్యమె! రామునిఁ జేరి జానకిన్
గంటిమి, తోడితేర; మనఁ • గాఁ దగునా మిమునంతవారికిన్? ౧౩౩౯

అర్థములు. దంటలు=సమర్థులు-జంటలు = సమానులు; ప్లవనంబునన్= దాఁటుటయందు-రిత్తకేల=ఉత్తచేతులతో- వాల్గంటులమిన్న=స్త్రీరత్నము-తోడి తేరము=పిలుచుకొని వచ్చినవారము గాము.

### తాత్పర్యము

శౌర్యమునందు మీరు సమర్థులు-దానవులందు దేవతలందుఁ బన్నగులందు దాఁటుటయందు మీకు సమానులు లేరు. ఇట్టి వా రుత్త చేతులతో సీతఁ దేక పోవుట తగునా యాలోచింపుఁడు. పోయి సీతను జూచితిమి, పిలుచుకొని రాలేదని మీయంతటి వా రనవచ్చునా!

ఉ. వీరుఁడు గాడ్పుపట్టి హత • వీరముఁ జేసె సురారివారమున్
గారియ మన్య మేమి గలు • గం గల? దుర్విజుఁ డెత్త మన్న నా
వీరుని జాంబవంతుఁడు సు • విశ్రుతశౌర్య! భవత్సమూహయున్
దీ రగు, నైన రాఘవు మతిం జనఁగాఁ దలపోయుమీ యనన్. ౧౩౪౦

అర్థములు. హతవీరము=చచ్చినవీరులు గలది-కారియము = పని-భవత్స మూహయున్=నీ యాలోచన కూడ-తీరగున్ = చక్కఁగానే యున్నది.

తా త్ప ర్య ము

వీరుఁడు హనుమంతుఁడు లంకలోని వీరులఁ జంపివచ్చెను. ఇఁక మన మచ్చటికిఁ బోయి చేయఁదగిన కార్యము సీతను దెచ్చుట తప్ప మఱి యేదియు లేదు. కావున మనము పోయి సీతను దెత్తమనఁగా జాంబవంతుఁడు ప్రసిద్ధకార్యము గల యంగదా! నీ యాలోచన బాగుగనే యున్నది కాని రామచంద్రమూర్తి యభిప్రాయము తెలిసికొని యాయన యెట్లు చెప్పిన నట్లు చేయవచ్చును. ఆ విధముగ నాలోచింపుమని చెప్పఁగా.

-♦౬౧-వ సర్గము.కపులు కిష్కింధకుఁ బోవుమార్గమున మధువనంబుఁ జూచుట♦-

క. సరి సరి యని రంగదకే,సరిసూనులు నున్నవారు♦శాఖామృగముల్
పరమమతి వాయుజపుర,స్సరము మహేంద్రాద్రిఁ బాసి♦చయ్యనఁ జనగన్.

అర్థములు. ఉన్నవారు=తక్కినవారు, వాయుజపురస్సరము=హనుమంతుఁడు ముందుగాఁ గలది.

తా త్ప ర్య ము

అంగదుఁడు హనుమంతుఁడు తక్కిన వానరులు ఈ యాలోచన బాగున్నది, బాగున్నదని యంద అంగీకరించిరి. అంతట నందఱు హనుమంతుని ముందుంచుకొని మహేంద్ర పర్వతము విడిచి పోఁగా.

సీ. మేరుమందరసముల్♦భూరిగజాభులు, మార్తండపథ మెల్ల♦మాటుపఱుచు
నట్టులు వ్యాపించి♦యాంజనేయునిఁ దమ, దృష్టులచే వహి♦యించునట్లు
కనురెప్ప వెట్టక♦కాంచుచు నాతనిఁ, గొనియాడుచును స్వామి♦పనిని దీర్చి
నార మన్మదమున♦వారక ప్రియభాష,ణంబును జేయు చ♦నన్యచిత్త

ఆ. వృత్తి యుద్ధమునకు♦వేడుక సేయుచు, రామసాహ్యమునకు♦రాగపడుచు
మింటనేఁగి కనిరి♦కంటికిఁ బండువౌ,మధువనంబు మిగుల♦మంజులంబు. ౧౩౮౭

అర్థములు. భూరిగజాభులు=పెద్ద యేనుఁగులతో సమానులు-అనన్య చిత్తవృత్తి=ఇతరాలోచన లేక-మంజులంబు=అందమైనది.

తా త్ప ర్య ము

మేరుపర్వతముతోను మందరపర్వతముతోను, సమానమైన యెత్తుగలవారును, పెద్ద యేనుఁగులవలె బలిసినవారును నగు వానరులు ఆకాశమును మఱుఁగు పఱుచు నట్టులు వ్యాపించి యాంజనేయుని తమ దృష్టులచే మోచికొని పోవుచున్నారా యను నట్లు ఱెప్పలార్పక తమ చూపు లాయనమీఁదనే యుంచి యాయనను బొగడుచు స్వామికార్యమును నెఱవేర్చితి మను నధిక సంతోషమున ప్రియములైన మాటలాడుచు యుద్ధము చేయుటయందే తమ మనస్సులు నిలిపి దానికై యుత్సాహపడుచు రామచంద్రమూర్తికి నెప్పుడు సాహాయ్యము

చేయుదుమా చేయుదుమా యని దాని యందాసక్తి గలవారై యాకాశమునఁ బోవుచు మార్గమునఁ గంటికింపై యందమైన మధువనంబుఁ జూచిరి. మహేంద్ర పర్వతమునకు లంకకుఁ గల దూరమునకంటె మహేంద్రపర్వతమునకుఁ గిష్కింధకు నెక్కువ దూరము గలదు. అట్లుండియు నందఱు వానరు లాకాశమున నెగిరి వచ్చినవారే. సముద్రము దాటు విషయమున నందఱు వెనుకంజ వేసినారే. ఈ విషయము కిష్కింధా కాండమునఁ జర్చితము.

ఉ. నందనసన్నిభం బయి య•నంత ముదావహమై ద్రుమావళీ
సుందరవల్లరీనికర•శోభితమై సకలాప్రధృష్యమై
యందము మీఱఁగా దధిము•ఖాఖ్యుఁడు సూర్యజు మేనమామ దా
నందు వసించి కాచు నెపు•డర్కజముత్కర మద్ది గావునన్. ౧౩౮౩

అర్థములు. నందన సన్నిభము=ఇంద్రుని నందనోద్యానముతో సమానము-అనంతముదావహము=అపరిమిత సంతోషమును గలిగించునది. ద్రుమావళీ=చెట్ల వరుసలచేతను-సుందర వల్లరీనికర=అందమైన తీఁగల సమూహము చేతను-శోభితమై= ప్రకాశించునదియై-సకలాప్రధృష్యమై =ఎట్టివారికిఁ జెఱుపనసాధ్యమై-అర్కజముత్కరము=సుగ్రీవునకు సంతోషకరము.

తాత్పర్యము

ఇంద్రుని నందనవనముతో సమానమై-యపరిమిత సంతోషము గలిగించునదియై, చెట్లవరుసలచేతను, అందమైన తీఁగల గుంపులచేతను బ్రకాశించునదియై యెట్టివారికినిఁ జెఱుపరానిదైన యా మధువనమును సుగ్రీవుని మేనమామ దధిముఖుఁ డనువాఁడు అందే కాఁపుర ముండి సుగ్రీవున కది సంతోషకరము గావున గావలి కాచుచుండును.

క. దానిం గని క్రోఁతులు మధు, వానం దమకించి కొమరు•నంగదు వేఁడన్
లోనం జన నిమ్మన యతఁ, డౌననెఁ గపివృద్ధవిధిజు•లామోదింపన్. ౧౩౮౪

అర్థములు. మధువు=తేనె-ఆనన్=త్రాగుటకు. తమకించి=త్వరపడి-కొమరున్=కుమారుని-కపివృద్ధవిధిజులు=వానరులందుఁ బెద్దవారు జాంబవంతుఁడు; ఆమోదింపన్=అంగీకరింపఁగా.

తాత్పర్యము

ఆ వనమును జూచి క్రోఁతులు తేనెఁ ద్రావఁ దొందర గలవారై యువరాజగు నంగదుని మమ్ములోపలికిఁ బో నిమ్మని ప్రార్థింపఁగా దానిని పెద్దవానరులు, జాంబవంతుఁడు నంగీకరింపఁగా నాయన సరి పొండని చెప్పెను.

—• కపులు మధువనంబుఁ జొచ్చుట •—

క. యువరాజనుమతి సేయఁగ, నవనీరుహచారు లెల్ల•హర్షరసావే
శవివశులై నృత్యంబుల, వివిధంబులుగాఁగఁ జలిపి•వెసఁ జొచ్చి వనిన్.

అర్థములు. అవనీరుహచారులు=వానరులు-హర్ష రసావేశవివశులై=సంతోష రసము ఆవేశించుటచే దేహములు తెలియనివారై.

తాత్పర్యము

లోపలికిఁబొం డని యువరా జంగీకరింపఁగా వానరు లందఱు సంతోషముచే దేహములు దెలియక నానావిధముల నృత్యములు చేసి లోపలఁ బ్రవేశించిరి.

మానిని. ఆడెడువారును వేఁడెడువారును ♦ హాయిగఁ బాడెడివారును నై
పీడెడివారును గూడెడువారును ♦ వేడుక లాఁగులు వేసెడు వా
రోడెడువారును గూలెడివారును♦నూఁగెడివారును మీసములన్
దీడెడువారును దాఁటెడువారును♦దేఁకెడివారును నైరి కపుల్. ౧౩౪౬

తాత్పర్యము. స్పష్టము.

సీ. కొనకొమ్మనొక్కటి ♦ క్రోఁతియొక్కండూఁచి,
పెఱకొమ్మమీఁదఁగు♦ప్పించి యెగసె
శాఖ యొక్కటినుండి♦సరగున నిల దూఁకి, గొబ్బున వేఱొక్క♦కొమ్మకెగిరెఁ
బై కొమ్మపైనుండి ♦ పడుచుఁ గ్రిఁ గొమ్మను,
నొకకేల గ్రహియించి♦యూఁగునొకఁడు
కొమ్మలలోఁ డాఁగి♦క్రోఁతియొక్కఁడు సేరఁ, దటుకునఁ బైఁబడి♦తఱుమునొకఁడు

ఆ. ఒక్కఁ డెక్కిరించు ♦ నొక్కరుఁ డిగిలించు
నొకఁడు కొక్కిరించు ♦ నొకఁడు కూయు
నొకఁడు కిచకిచ మను ♦ నొక్కఁడు గికురించు
నొకఁడు లాఁగు వేయ ♦ నొకఁడు లాగు. ౧౩౪౭

అర్థములు. కికురించు=మోసగించు-ఇగిలించు=పండ్లు వెళ్ళఁబెట్టు.

తాత్పర్యము. స్పష్టము.

ఉ. పాడుచు నుండ నొక్కరుఁడు♦పైపడి నవ్వ నొకండు నవ్వచో
నేడుచు చేగు వేఱొరుఁడు♦నేడువ నొక్కఁడు వెక్కిరించుచున్
జూడఁగఁబోవు నాతనిని♦సొంపు బలే యని కొక్కిరించుచున్
గూడఁగఁబోవు నాతనిని♦గ్రోతి మఱొక్కఁడు నవ్వటాలకై. ౧౩౪౮

అర్థములు. నవ్వటాలకై=నవ్వులాటకై.

తాత్పర్యము. స్పష్టము.

క. ఈ విధి నిచ్చఁ జరించుచుఁ, ద్రావఁగఁ దేనియలు తృప్తి♦దనరనివాఁడున్
వావిరి మత్తెక్కనివాఁ, డా వనచరసైన్యసమితి♦యం దదిది గనన్. ౧౩౪౯

అర్థములు. సమితిన్=సమూహమందు.

తాత్పర్యము

ఈ ప్రకారము యథేచ్ఛముగాఁ దిరుగుచుఁ దేనెలు త్రాగి తృప్తిపడని వాఁడు, బాగుగ మత్తెక్కనివాఁడు ఆ వానర సేనలలో నొక్కఁడైన లేఁడు.

క. ఈరీతి భాతి దీఱఁగ, నారామముఁ గలఁచి డులిచి॰యచ్చటిపండుల్
గోరంబుగఁ గూలిచి ద్రుమ,వారంబులఁ జెల్లు రేఁగి॰వానరు లున్నన్. ౧౩౫౦

అర్థములు. భాతి=కాంతి, డులిచి=పడఁగొట్టి, ద్రుమవారంబులన్ = చెట్ల సమూహములను, గోరంబుగన్=కనుటకు వెగటు పుట్టునట్లు-ఘోరశబ్దభవము.

తాత్పర్యము

ఈ విధముగఁ గాంతి చెడునట్లు వనమును గలియఁబెట్టి, పండ్లు రాలఁగొట్టి చెట్ల సమూహములను చూచుటకు గోరముగ నుండునట్లు పడఁద్రోచి వానరులు చెలరేఁగి యుండఁగా.

—• దధిముఖుండు కపుల వారించుట •—

క. ఇంతకు దధిముఖవానరుఁ, డెంతయుఁ గోపించి వనము॰నెటులేఁ గావన్
జింతించి వానరావళి, యంతికమున కేగి వారి॰నాఁపఁ గడంగెన్. ౧౩౫౧

అర్థములు. ఇంతకు=ఇంతపని చేసిన దానికి-ఎటులేన్=ఏ విధముగనైనను-ఇట్లు చెప్పుటచే ముందు మంచిమాటల చేతను దరువాత జెదరింపుమాటల చేతను జెప్పిచూచెను గాని యది ప్రయోజనపడమిని దండోపాయము నాలోచించెనని భావము. అంతికమునకున్=సమీపమునకు - ఆఁపన్=అడ్డగింప-కడంగెన్=ప్రయత్నించెను.

తాత్పర్యము

వానరులింత పనిచేసిన దానికై దధిముఖుఁడు నయభయములఁ జెప్పి వ్యర్థము కాఁగాఁ గోపించి బలాత్కారముగ నైన వనమును రక్షింపఁ దలచి వారి యొద్దకుఁ బోయి నివారింప యత్నించెను.

ఇంతవఱకు దూరముగా నుండి మాటలు చెప్పి పంపె నని భావము.

క. తిట్టెను గొందఱ వెలికి, న్నెట్టెను గొందఱకుఁ బలికె॰నీతుల కేలన్
గొట్టెను గొందఱఁ గొందఱ, మొట్టెను బిడికింటఁ గినిసి॰మునుకొని కపులున్.

అర్థములు. నెట్టెను=మెడపట్టి త్రోచెను.

తాత్పర్యము

కొందఱఁ దిట్టెను. కొందఱ మెడపట్టుకొని తోఁటకు వెలుపలఁ ద్రోచెను. పెద్దవారికి నీతులు తెలిపెను. కొందఱను జేతితోఁ గొట్టెను కొందఱఁ బిడికిలితో కోపించి మొట్టెను.

క. కొట్టికిరి కొందఱు కోఁఱల, బట్టికిరి గోళ్లులను గాళ్ళ॰బడ నడిచి ధరన్
బఱబఱ యీడ్చిరి కరముల, నఱిముఱి మర్దించి విడిచి॰రా వనపాలుల్.

అర్థములు. అతిముతిన్=త్వరతో.

తాత్పర్యము

స్పష్టము.

క. కొందఱు ద్రోచిరి వానిని, గొందఱు దూషించి రధిక•కోపంబున ని
ట్లందఱు బాధించుచు వా,నిం దరుచరు లా వనంబు•నిర్మూలింపన్. ౧౩౧౫

తాత్పర్యము

స్పష్టము.

{ ౬౨-వ సర్గము. అంగద హనుమంతుల ప్రాపునఁ గపులు మధు
వనంబున నిచ్చకొలఁది సంచరించుట }

క. అంతట హనుమంతుఁడు కపి,కాంతులతో మీరు తృప్తి•గన నవ్యగ్ర
స్వాంతంబుల మధు వానుఁడు, చెంతలఁ జేరంగ నీను•సిద్ధము పగతున్. ౧౩౧౬

అర్థములు. కపికాంతులతో=ముఖ్యవానరులతో-అవ్యగ్ర స్వాంతంబులన్=చలింపని మనస్సులతో-పగతున్=పగవానిని-తమకార్యమునకు నడ్డము వచ్చుటచే. పగవాఁడని చెప్పఁబడెను.

తాత్పర్యము

దధిముఖుఁ డిట్లు వానరుల కడ్డము వచ్చుటయు వారికి వీరికిఁ గలహమందుఁ గాలము పోవుటయుఁజూచి హనుమంతుఁడు వానరముఖ్యులతో మీ రీ కలహమునకు కాలము గడుపవలసిన పని కాదు. ఈ పగవానిని మీ యొద్దకు రానీను. మీ రేకాగ్రచిత్తముల తేనె ద్రాగుఁడు.

సీ. హనుమంతుఁ డాడిన•యా మాట లాలించి, యంగదుం డి ట్లను•హరివరేణ్యు
లార!యవశ్యకా•ర్యం బకార్యం బైనఁ, గృతకృత్యుఁడగు వాయు•సుతునిపలుకు
ఇప్పలుకుఁగూర్చి నేఁ•జెప్పంగవలయునే, తేనె గ్రోలుం డాన•తీర ననిన
బళి బళీ యని మెచ్చి•బలిముఖుల్ వెల్లువ,పోలెఁ జొచ్చిరి వన•పాలకులను

తే. మొదలఁ దాఁచిరి త్రోచిరి•మొగము పగుల
ద్రోణమాత్రము మధువు సం•తోషముగను
నెల్లవారలుఁ ద్రావిరి•కొల్లగాఁగఁ
గొన్నిటిని నేలఁ బగులంగఁ•గొట్టి రపుడు. ౧౩౧౭

అర్థములు. అకార్యం బైనన్=చేయరాని పనియైనను - అవశ్యకార్యము=తప్పక చేయవలసినపని, తాఁచిరి=కొట్టిరి- ద్రోణమాత్రము=తూము కొలఁత-ద్రోణశబ్దము దేశవ్యవహారానుసారముగ తూమునకు-ఇద్దుమునకు-నలుతుమునకుఁ జేరు. 'అస్త్రీయా మాఢక ద్రోణౌ' యని యమరము.

తాత్పర్యము

హనుమంతుఁ డీ ప్రకారము చెప్పఁగా నాయన మాటలు విని యంగదుఁ

డిట్లనియె. వానరశ్రేష్ఠులారా! స్వామికార్యము నెఱవేర్చిన హనుమంతుఁడు చేయరానిపని చెప్పినను జేయఁదగినదే. ఇఁక నీ కార్యము గుఱించి యడుగనేల? మీ యాశతీరఁ దేనె ద్రాగుఁ డనిన బళ్ళబళీ యని మెచ్చి యంతకు ముందు దధిముఖుని మాటలకు తోఁట వెలుపలఁబోయిన వానరు లొక్కసారిగ వెల్లువవలె లోపలఁ బ్రవేశించి తోఁట కావలివారిని మొట్టమొదటఁ గొట్టిరి. ఆవల నేలఁబడి ముక్కుము పగులఁ ద్రోచిరి. తూము మాత్రము తేనె కొల్లలుగ ద్రావిరి. కొన్ని తేనెతెట్టలను నేలవైచి పగులఁగొట్టిరి.

క. నైసర్గికబలమునఁ బృథ్వీసుతఁ గనుఁగొనుట వార్త•వినుటను మఱి తా
రాసుతు ననుమతిఁ దేనియ, నాసలు దీరంగఁ ద్రావి•రగచరులెల్లన్. ౧౩౫౭

అర్థములు. నైసర్గిక బలమునన్=సహజముగఁ గలిగిన బలముచేత-పృథ్వీసుతఁ గనుగొనుట-వార్తవినుట. దీని నొకటిగా నైన గ్రహింపవచ్చును, రెండుగా నైన విభజింపవచ్చును. తమలో నొకఁడు సీతను జూచినను నందఱు చూచినట్లే. దక్షిణమునకుఁ బోయిన కపులు సీతనుజూచి రను పేరు వచ్చెను గదా-వార్త వినుట=ఆ వృత్తాంతము వినుట- లేక సీతాదేవిని జూచిన వార్త వినుట యని యేకముగాను గ్రహింపవచ్చును. లేక హనుమంతుఁడు చూచుట-వానరులు వినుట యని యైన గ్రహింప నగు. సంతోషము సగము బలముగావున సంతోషమువలనఁ గలిగిన బలము, నైసర్గిక బలము, యువరాజాజ్ఞ గల దను ధైర్యమునఁ గలిగిన బలము, అన్నియుఁ జేరె నని భావము.

## తాత్పర్యము

స్వభావసిద్ధ మైన బలముచేతను, సీతాదేవిని జూచుట-వార్త వినుటవలనఁ గలిగిన యుత్సాహము చేతను, అంగదుఁ డనుమతించుట చేతను, గ్రోఁతులందఱు నాశ దీరఁ దేనెఁ ద్రావిరి.

సీ. కొందఱు మధువాని•కొంత పాఱఁగ వైచి, మైనపు టుండల•మాఱుకొనిరి
కొందఱు కైపెక్కి•కొమ్మలఁ జేబూని, యూరకు సెజ్జలఁ బడి•రాద మఱచి
మత్తునఁ గడు వేఁదు•ఱెత్తినపోలికిఁ, ద్రోపు లాడిరి కొంద•ఱేపు చెలఁగఁ
గొందఱు గర్జింత్రు•కొందఱు నిద్రింత్రు, కొందఱు కిలకిల•కూయు చుందు
ఆ. రేమొ యేమొ చేసి•హిహిహి యందురు గొంద
ఱేమొ యేమొ చేసి•యెగిరి కొంద
ఱేమొ యేమొ చేసి•యెలమిఁ జెప్పిరి కొంద
ఱేమొ యేమొ చేయ•నెంచి రపుడు. ౧౩౫౮

అర్థములు. మధువు ఆని=తేనెఁద్రావి- మైనము+ఉండ=మైనపుటుండ-ఉండ=ఉంట-కైపు=మత్తు-సెజ్జ = శయ్యా శబ్దభవము. ఆదమఱచి=దేహము తెలియక- తమ్ముఁ దాము మఱచి- వేదుఱు=పిచ్చి- ఏమొ + ఏమొ=

ఆమ్రేడితము పర మగుటచే సంధి గలసి ఏమేమొ కావలసి యుండినను ఏమి-ఏమ్యాద్యాదులలోఁ జేరుటచే సంధి వైకల్పికము గావున నిచట సంధి గలుప లేదు. అచ్చున కామ్రేడితంబు పరంబగు నపుడు సంధి తఱుచుగ నగు-సు. వ్యా. సం. ౧౭. ఏమొ యేమొ యనునవి యశ్లీల మగుటచేఁ జెప్పరాని క్రోఁతిచేష్టలని గ్రహింపనగు. గర్జింత్రు=నిద్రింత్రు-రువర్ణకంబు పరంబగునపుడు సున్నమీఁది తదడల యుత్వంబునకు లోపంబు విభాషనగు. సు. వ్యా. క్రియ-౭౨ సూ. గర్జింత్రు=గర్జింత్రు — ఈ రూపములు ముందు నిండుసున్న యుండిననే యగును గాని యది లేనిచోఁగావు. ఇట్లు చెప్పుటచే మానుద్రు-చూచుద్రు. ఇత్యాది రూపముల సాధువులు.

తా త్ప ర్య ము

స్పష్టము.

ఉ. వానరవర్గముల్ పడెడి పాట్లు గనుంగొని కినుకన్ మై మధూ
ద్యానము రక్షకుల్ దధిముఖానుచరుల్ వెస రాఁగ వారలన్
జానుల ముష్టిఘాతములఁ జావఁగ మోదుచు దేవమార్గమున్
గానఁగఁ జేయ భీతిగొని క్రచ్చఱఁ బాఱిరి నేత యొద్దకున్. ౧౩౫౯

అర్థములు. మధు + ఉద్యానము=మధువనము- దధిముఖానుచరుల్ = దధిముఖుని వెంటనుండు సేవకులు- వెసన్=త్వరగ- జానులన్ = మోఁకాళ్ళ చేతను, ముష్టి ఘాతములన్=పిడికిలి గ్రుద్దుల చేతను- దేవమార్గమున్ = అపానవాయువు వెడలెడి మార్గము-ఉపనిషత్తులందు వాయులోకమును దేవలోక మని చెప్పుటచే నిచ్చట దేవశబ్దము వాయువాచి యని తెలియునది. నేత=తమప్రభువు.

తా త్ప ర్య ము

క్రోఁతుల గుంపులు చేయు చేష్టలు చూచి కోపముచే మధువనమున కావలి యుండు దధిముఖుని సేవకులు త్వరగా రాఁగా వారిని వానరులు మోఁకాళ్ళ గ్రుమ్మిరి. పిడికిళ్ళ గ్రుద్దిరి. చచ్చునట్లు కొట్టిరి. ముడ్డి చూపించిరి. ఇట్లు చేయుటచే వారు భయపడి తమ ప్రభు వగు దధిముఖు నొద్దకుఁ బరువెత్తిరి.

ఉ. ఇమ్మెయి నేగి యా దధిము ఖేశ్వరుఁ గన్గొని వాయుపుత్రు సా
యమ్మున వానరాళి వన మంతయుఁ బా డొనరించి మమ్ములన్
గ్రుమ్మిరి జానుదేశముల గ్రుద్దిరి ముష్టుల, వెండి దేవమా
ర్గమ్ములు చూపి రన్నఁ గినుకం గొని వారల నూఱడించుచున్. ౧౩౬౦

తా త్ప ర్య ము

ఈ ప్రకారము పోయి యా దధిముఖునిఁ జూచి హనుమంతుని సాహాయ్యముచేఁ గ్రోఁతులు వన మంతయుఁ బాడుచేసి మమ్ము మోఁకాళ్ళ గ్రుమ్మిరి. పిడికిళ్ళ గ్రుద్దిరి. పై పెచ్చు నాసనముల జూపిరి. అని చెప్పఁగా వాఁడు కోపించి వారల సమాధాన పఱిచి.

క్రమ్మరి-క్రుద్ధిరి-చూపిరి యనుటకు వానరాళి కర్త. మహాత్మమూహార్థక శబ్దం బమహాత్మకార్య యుక్తం బయ్యెఁ దద్విశేషణ క్రియలు మహాత్మకార్య యోగ్యంబులు విభాషనగు. (ప్రౌ. వ్యా. శబ్ద. ౧౭ వ. సూ) "పడ నడుతురు నిన్నుఁ గన్నఁ బ్రమథ గణంబుల్"-నిర్వ ర ఆ.

శా. రండీ వానరులన్ బలాంధులను క్రౌర్యం బార మర్దింత ము
చ్చండత్వంబున నంచు నాతఁ డొక భూజశ్రేష్ఠముం గొంచు రాఁ
గొండల్ గుండులు తాలుఁ జెట్లుఁ గొని సక్రోధాంతరంగంబులన్
దండన్ డాసిరి తక్కుక్రోఁతులు వెసన్ దండింపఁ గీశేశులన్. ౧౩౬౧

అర్థములు. బలాంధులను=బలముచేఁ గన్నులు గానని వారిని, ఉచ్చండ త్వంబునన్=మిగులఁగోపముచే-సక్రోధ+అంతరంగంబులన్=కోపముతోఁ గూడిన మనస్సులతో, దండన్=ప్రక్కలందు-డాసిరి=సమీపించిరి.

తా త్ప ర్య ము

బలముచేఁ గన్నులు గానని క్రోఁతులను దయమాలి కోపముతోఁజక్కఁగఁ గొట్టుదము రండు, పోద మని దధిముఖుఁడు చెట్టునొకటి పీకికొని రాఁగా, తక్కిన క్రోఁతులుఁ గోపముతోఁగూడిన మనస్సులు గలవారై కొండలు, గుండులు, తాలు, చెట్లు తీసికొని వానరుల దండింప వచ్చిరి.

— అంగదుండు దధిముఖునిఁ దన్నుట —

సీ. వానరవరు లిట్టు వచ్చి నేలను జెట్లఁ, గ్రుమ్మరు క్రోఁతుల గుంపుమీఁదఁ
గవిసిన నాతని కడఁకఁ గనుంగొని, పావని మొద లగు ప్రముఖు లెల్ల
నచటికిఁ బఱతెంచి రంగదుఁ డంతటఁ, దరుహస్తుఁ డైన యా దధిముఖుండు
మనకుఁ బూజ్యుం డని మత్తత నెఱుఁగక, కోపించి కేలిచేఁ గూలఁ దాఁచి

ఆ. నలియ గ్రుద్ది విడువ వెలవెలఁ బోవుచు, రోజుకొనుచు నెత్తురులు దొరంగ
నంగసంధి ప్రిదుల నరసావు చచ్చియు, లేచి యాఁపెఁ బెఱ వలీముఖముల.

అర్థములు. కడఁక=ప్రయత్నము-తరుహస్తుఁడు=చేతఁ జెట్టుగలవాఁడు-పూజ్యుం డని=తాత గావున గౌరవింపఁదగిన వాఁడని-మత్తతన్ = మదముచేత-అంగసంధి=అవయవముల సంధి బంధము-ప్రిదులన్=శిథిలము కాఁగా-బిగువుచెడి వదులు పడఁగా-అరసావు చచ్చియు=మూర్ఛపోయి-పెఱవలీముఖములన్=ఇతర వానరులను.

తా త్ప ర్య ము

వనపాలకు లగు వానరు లిట్లు వచ్చి భూమిమీఁదఁ జెట్లమీఁదఁ దిరుగుచున్న క్రోఁతి గుంపులమీఁదఁ బడఁగా వాఁడు బలవంతముగఁ గొట్టి వానరులఁ దఱుమఁ జూచు చున్నాఁడని తలఁచి హనుమంతుఁడు మొదలగు వానరప్రముఖు లచ్చటికి వచ్చిరి. అందంగదుఁడు చేతఁజెట్టు పట్టుకొనియున్న దధిముఖుఁడు తనకుఁదాతయని,

గౌరవింపఁబడఁదగిన వాఁడని, తేనె ద్రావిన మత్తుచే నెఱుఁగక కోపించి చేతితోఁ బడఁగొట్టి నలియ గ్రుద్ది వదిలిపెట్టఁగా వాఁడు వెలవెలఁబోయి రోఁజుచు నెత్తురు కాఱుచుండ సర్వయవసంధులు వదులుపాఱ మూర్ఛపోయి లేచి యితరవానరుల నడ్డగించెను. అరసావు-సగము చచ్చుట-మూర్ఛ

"ముగ్ధే౽ర్ధసంపత్తిః పరిశేషాత్" బ్ర॥సూ. ౩-౨-౧౦ అను బ్రహ్మసూత్రమున మూర్ఛను సగము చావుగా వ్యాసమహర్షి చెప్పెను. ఇది స్వప్న-జాగర-సుషుప్తి మరణావస్థలకంటె వేఱైనది. సర్వ ప్రాణములతోను, శరీరముతోను సంబంధము వదలిపోవుట మరణ మనఁబడును. సూక్ష్మప్రాణ దేహములతో సంబంధమును గలిగి యుండుట మూర్ఛయనఁబడును. శ్రీభాష్యము. "అతంస నీ మఱంది కరసావౌనర్చ" భార. ద్రోణ-౫౪-అరసావు చచ్చి- ఇది 'పాకం పచతి'- వంట వండుచున్నాఁడు అను ప్రయోగమువంటిది. అర. రూ. అఱ.

తే. ఎట్టులో వారు విడువంగ♦నేగుదెంచి, యేకతంబునఁ దనవారి♦నెల్లఁ గూర్చి
దధిముఖుం డిట్టు లనువీరు♦మధువనంబు, నంద యుండఁగ మన మెల్ల♦నరిగివేగ.

అర్థములు. ఏకతంబునన్=ఒంటరిపాటున-ఏకాంత శబ్దభవము.

తా త్ప ర్య ము

స్పష్టము.

ఉ. రామునితోడ నున్న కపి♦రాజును గన్గొని యొక్కయంగదుం
డే మునుకొంచు దోషముల♦నెల్ల ఘటించె నటంచుఁ జెప్పఁ బై
తామహమున్ దురాసద ము♦దాత్తము నిష్టవనంబు గావునన్
దామస మేది కీశపతి♦దండనముల్ ఘటియించు వీరికిన్. ౧౩౬౪

అర్థములు. మునుకొంచు=ముందుపడి- ముందుగా వచ్చి- పైతామహమున్=బ్రహ్మ ఋక్షరజస్సున కిచ్చినది. దురాసదము=సులభముగ దేవతలకును బొందరానిది-ఉదాత్తము=గొప్పది. ఇష్టవనంబు = ప్రియమైన వనము-తామస మేది=ఆలస్యము లేక.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తితో నుండుసమయమున సుగ్రీవునితో నంగదుఁడే ముఖ్యుఁడై ముందును నిలిచి దోషములన్నియును-వనములోఁ జొచ్చుట, తేనెలు ద్రాగుట, చెట్లు పాడుచేయుట, తమ్ము కొట్టుట, యివి యన్నియుఁ జేసె నని చెప్పితిమేని బ్రహ్మ ఋక్షరజస్సున కిచ్చినదియు, నెట్టివారైనను బ్రవేశింపరానిదియు, గొప్పదియు, ప్రియమైనదియుఁ గావున సుగ్రీవుఁ డాలస్యములేక వీరి నందఱ దండించును.

క. భూవల్లభ శాసనపరి♦ భావులు దుర్మతులు వీరిఁ♦బరిమార్పింపం
గా వలయు నంత వీరల, కావరమును దొలఁగు మనకుఁ♦గసియుం దీఱున్.

౭౦. అర్థములు. భూవల్లభ శాసన పరిభావులు=రాజాజ్ఞ నుల్లంఘించినవారు-

దుర్మతులు=దుష్ట మనస్సుగలవారు, పరిమార్పింపంగాన్=చంపింపగా, కావరము=పొగరు, కసియున్=పగయును.

తాత్పర్యము

రాజాజ్ఞ మీఱిన చెడుమనస్సు గల వీరిని చంపింప వలయును. అట్లు చేసితిమేని వీరి పొగరణఁగును. మన పగ దీఱును.

క. అని తనబడిఁ దక్కిన మధు,వనపాలకు లేగు దేర•వానరపతిపు
త్రునిఁ జూడ నాకసంబున, జని దధిముఖుఁ డొక్కత్రుటిని•సత్వరుఁడగుచున్.

అర్థములు. తనబడిన్=తన వెంబడి, సత్వరుఁడు=త్వరగలవాఁడు.

తాత్పర్యము

తన వెంటఁ దక్కిన వనపాలకులు రాఁగా సుగ్రీవునిఁజూడ దధిముఖుఁడు ఆకాశమున నిమిషములోఁ ద్వరగాఁబోయి.

ఆ. రామచంద్రవిభుని•సౌమిత్రి సుగ్రీవుఁ, గాంచి యచట డిగ్గి•కపికులాభ
రణముఁ జేర నేగి•ప్రణతిఁ గావించె న,త్యంత మార్తి మొగము•నందు వ్రేల.

తాత్పర్యము

రామలక్ష్మణ సుగ్రీవులఁ జూచి యచట దిగి సుగ్రీవు నొద్దకుఁబోయి యేడుపు గొట్టు మొగముతో నమస్కరించెను. మేనమామ యల్లునికి నమస్కరించుట ప్రభుత్వ గౌరవముం బట్టి యని తెలియవలయును.

—• ౬౩-వ సర్గము. దధిముఖాదివనపాలకులు సుగ్రీవునితోఁ
గపుల దుశ్చేష్టలు దెల్పుట •—

క. ఇమ్మెయి దీనతఁ దనపా,దమ్ములఁ బడ సూర్యసుతుఁడు•దధిముఖుఁ గని లే
లెమ్మా భయపడకుము విప,యమ్మును వినిపింపు మంచు•నాశ్వాసింపన్.

అర్థములు. దీనతన్=భయమున, లెమ్మా లెమ్మా=లే లెమ్మా, అశ్వాసింపన్=ఊఱడింపఁగా.

తాత్పర్యము

ఈ ప్రకారము భయముచే దన కాళ్ళమీఁదఁబడిన దధిముఖునిఁ జూచి సుగ్రీవుఁడు లే లెమ్ము. భయపడకుము ఏమి జరగెను. చెప్పుము. అని సమాధానపఱుపఁగా.

ఆ. అతఁడు లేచిపల్కె•నధిప! నీ జనకుని, తరమునందు నన్న•తరమునందు
నీ తరంబునన్ వ•నేచరు లావంక,మలయరాని రమ్య•మధువనంబు. ౧౩౬౯

అర్థములు. నీ జనకుని తరమునందు, నన్నతరమునందు-నీ యన్న తరంబునం దని యర్థము "కొన్ని యెడల సంబంధంబునం బూర్వ వాక్యంబు నందలి పదం బధ్యాహార్యంబగు ప్రౌ-వ్యా-వాక్య-౧౨ సూ. 'పంక్తి ముఖు నాతని తమ్మునిఁ గుంభకర్ణుని-దనయుని మేఘనాదుని, దానవేశ్వరునకుఁ దమ్మును' నిర్వ-౨ ఆ.

తాత్పర్యము

ఈ ప్రకారము సుగ్రీవుఁడు ధైర్యము చెప్పఁగా వాఁడు లేచి యిట్లు చెప్పెను. నీ తండ్రి తరమునందుఁగాని, నీ యన్నతరమునందుఁగాని, నీ తరమందుఁగాని వానరు లా ప్రక్కఁగూడఁ దిరుగరాని మధువనమును.

ఉ. ఆ వనచారు లెల్ల నిల • యం బొనరించిరి పాడు పాడుగాఁ
ద్రావిరి తేనె, లెల్ల ఫల • రాజి మెసంగిరి, తక్కు తేనెలన్
భూవివరంబులం దొలుకఁ • బోసి, రిదే మని వీర లడ్డ మై
పోవఁగఁ గొక్కిరించి కను • బొమ్మలు చూపిరి గుఱ్ఱుకొట్టుచున్. ౧౩౬౦

అర్థములు. భూ వివరంబులన్=నేల బొక్కలందు, ఒలుకఁబోసిరి=పాఱఁ బోసిరి.

తాత్పర్యము

నీవు దక్షిణమునకుఁ బంపిన క్రోఁతులు పాడుపాడు చేసిరి. తేనె ద్రావిరి. పండ్లన్నియుఁ దినిరి. త్రావఁగా మిగిలిన తేనెను నేల బొక్కలలోఁ బోసిరి. కొంత నేల నొరలించిరి. ఇదియేమి యీ యాగడ మని వీరడ్డము పోఁగా వెక్కిరించిరి. గుఱ్ఱుకొట్టిరి. కన్నుబొమ్మలు చూపిరి-స్వభావోక్తి.

ఉ. ఏపున వీర లొక్కటిగ • నేగి వని న్వెడలుం డటం చనన్
గోపముతోడ ముష్టులను • గ్రుద్దిరి, గ్రుమ్మిరి కాలుసేతులన్
జూపిరి దేవమార్గములు • శుంఠతనాన యథేచ్ఛ మిట్లు నీ
భూపతితం జెలంగి పలు • పోకలఁ బోయిరి తోఁట పాడుగన్. ౧౩౬౧

అర్థములు. ఏపున=బలముగ, నీ భూపతితన్=నీవు రాజుగా నుండఁగా.

తాత్పర్యము

బలముగా వీ రందఱు గుంపుగాఁ బోయి తోఁటలో నుండి వెడలి పొండనఁగా వారు కోపించి పిడికిళ్ళ గ్రుద్దిరి. కాలుసేతులఁ గ్రుమ్మిరి. ముడ్డులఁ జూపిరి. శుంఠలై యిట్లు నీవు రాజై యుండఁగానే వీరు పలు పోకలఁ బోయిరి. తోఁట పాడుచేసిరి.

క. అని విన్నవించు చుండఁగ, విని లక్ష్మణుఁ డనియె నో ర • విప్రభవా! యే
మనియెడి నీ వనపాలుఁడు, వన రెడి నిటు లేల యనిన • వాక్యజ్ఞుఁ డనున్.

తాత్పర్యము

అని విన్నపముచేయు సమయంబున వారి మాటలు లక్ష్మణుఁడు విని సుగ్రీవా యీ వనపాలుఁ డేమనుచున్నాఁడు. ఏల దుఃఖపడుచున్నాఁడు? అనిన మాటల యందలి నేర్పరియగు సుగ్రీవుఁ డిట్లు చెప్పెను.

• సుగ్రీవుఁడు లక్ష్మణునితో హనుమదాదులు మధువనంబున విహరించుటఁ దెల్పుట •

సీ. ఆర్య! సౌమిత్రి! యు • ద్యానపాలుఁడు వీఁడు, దధిముఖుం డనియెడి • తరుచరుండు
దక్షిణదిశ కోయఁ • దరలి పోయిన యంగదాదులు చను దెంచి • మోదమునను

మధువనంబునఁజొచ్చి•మధువంతయుంద్రావి యిచ్ఛావిహారంబు•నెలమిఁజలుపు
చున్నవారఁట యందు•నూహింపనివి యెల్ల,నకృతకృత్యుల చేఁత•లనఁగ రాదు
తే. వనముఁ జొచ్చినయప్పుడె•వారు కార్య,సాధకతఁ గ్రాలు చుండుట•సత్యమయ్యె
చూడఁబడె దేవి,సత్యంబు•సుమ్ము హనుమ,చేతనే యది యితరుల•చేతఁగాదు.

అర్థములు. అకృతకృత్యుల చేఁతలు=పనిసాధింపని వారిచేష్టలు-కార్య హాధకత=కార్యము సాధించుటచేత.

తాత్పర్యము

స్పష్టము.

క. ఈ కార్యము సాధింపఁగఁ జేరుటఁ బాపనికె యొరుల•చే నిదియానే
యా కపివరునకె శక్తియు, ధీకలిమియు శ్రుతము తెంపు•తేఁకువ గలుగున్.

అర్థములు. ధీకలిమియు=బుద్ధి సంపద-శ్రుతము=శాస్త్రజ్ఞానము, తెంపు= సాహసము, తేఁకువ=ధైర్యము.

తాత్పర్యము

స్పష్టము.

ఉ. మంతిరి జాంబవంతుఁ డఁట•మానుగ వానరకోటికిన్ హనూ
మంతుఁడు రక్షకుం డఁట, స•మానవిహీనబలాఢ్యుఁ డంగదుం
డింతకు నేలినాతఁ డఁట•యిట్టిరు పూనినకార్య మొక్కఁ- యా
వంతయు మొక్కఁ-పోనె? ఫల•వంతమ యా టది యేమి చోద్యమో? ౧౩౭౫

అర్థములు. సమాన విహీన బలాఢ్యుఁడు=బలమునందు సమానులు లేని వాఁడు, ఏలినాతఁడు=ప్రభువు, మొక్కఁ-పోనె=భంగమగునా.

ఈ దక్షిణదిశ పోయిన వానరులకు నాలోచన చెప్పువాఁడు జాంబవంతుడు. అఁట=మహత్వమును దెలుపును.

ఉ. రాజఁట ధర్మజుండు సుర•రాజసుతుండఁట ధన్వి శాస్త్రవో
ద్వేజకమైన గాండివము•విల్లఁట యుగ్రగదాధరుఁడైన భీముఁడ
య్యాజికిఁ దోఁడు వచ్చునఁట•యాపదగల్గుట కేమి చోద్యమోఁ
.... ... ... ... ... ...భాగ.

తాత్పర్యము

దక్షిణమున బోయిన వానరసేనకు నాలోచన చెప్పువాఁ డా జాంబవంతుఁడు. రక్షకుఁడా హనుమంతుఁడుఁ ప్రభువా యసమాన బలుఁ డగు నంగదుఁడు-ఇట్టి వారు పూనిన కార్యము భంగమగునా? ఫలవంత మగుట యేమి యాశ్చర్యము?

క. అంగదుఁ డాదిగఁ బ్రముఖులు, భంగించిరి మధువనంబు•వారింపంగాఁ
జెంగటి కేగిన జానుల, నంగంబుల నలియ దంచి•రఁట యీ కపులన్. ౧౩౭౬

అర్థములు. భంగించిరి=విఱిచిరి. అఁట—ఇచ్చట అఁట యనునది వృత్తాం

తమును దెలుపును. అనుట సంగ్రహరూపము. అంట చెంగటికిన్=సమీపమునకు, జానులన్=మోఁకాళ్ళతో.

తా త్ప ర్య ము

అంగదుఁడు మొదలయిన వానర ప్రముఖులు మధువనమును విఱిచి కుప్ప పెట్టిరఁట. వలదని అడ్డము పోయిన వీరిని నలియ దంచి రఁట.

చ. వనజదళాయతాక్షిఁ గని•వచ్చినవారలు వారు కానిచో
వనమును బ్రహ్మదత్తమును•వారలె కన్నుల నైనఁ జూడఁగాఁ
జనియెడివారు? నాఁగ శ్రుతి•సౌఖ్యదవాక్యము లాలకించి యా
యినకులదీపకుల్ పరమ•హృష్టతఁ దుష్టి వహించి రంతటన్. ౧౩౭౭

అర్థములు. వారలె=వారా! ఆశ్చర్యమును దెలుపును. శ్రుతి సౌఖ్యద వాక్యములు=చెవులకు సుఖము గలిగించు మాటలు, వినుట కింపయిన మాటలు.

తా త్ప ర్య ము

ఆ వానరులు సీతాదేవిని జూచి వచ్చిన వారు కానిచో బ్రహ్మదత్తమైన వనమును వారికిఁ గన్నుల నైన జూచు ధైర్యము గలదా? అనఁగా విన నింపైన యా మాటలు విని రామలక్ష్మణులు మిక్కిలి సంతోషించి గగుర్పాటు చెందిన వారైరి.

—•సుగ్రీవుఁడు కపులకుఁ ద్వరగ రం డని దధిముఖుచే వార్త బంపుట•—

చ. ఇనజుఁడు తోఁటవాని కని•యెం గపివల్లభ! నీదు వాక్యముల్
వనచరులా వనంబునను•వారక గ్రుమ్మరి రంచు వింటచే
ఘనముద మయ్యె, సాధితసు•కార్యులు మన్నన కర్హులే కదా?
గనుక క్షమించితిం గపులఁ•గానఁగ నేగుము పల్కు మిగ్విధిన్. ౧౩౭౮

అర్థములు.సాధిత సుకార్యులు=మంచికార్యము నెఱవేర్చినవారు,ఇనజుడుసుగ్రీవుఁడు

సుగ్రీవుఁ డట్లు రామలక్ష్మణులకుఁ జెప్పి తోఁట వానితో నిట్లనియె. వానర శ్రేష్ఠా! వానరులు మధువనమునందు స్వేచ్ఛావిహారము చేసిరని నీవు చెప్పుటచే మిగుల సంతోషించితిని. వారు మంచి కార్యమును సాధించిన వారు కావున మన్న నకు యోగ్యులు కదా! కావున క్షమించితిని. నీవు పోయి యా వానరులఁ జూచి యిట్లు చెప్పుము.

కిష్కింధాకాండము ౧౦౨౨ వ పద్యము చూడుఁడు. అందు సీతాదేవిని జూచితి నని చెప్పువాఁడు "మత్సమానుఁడై, వాసి చెలంగుచుండు-ఎక్కుడు దోషియుఁ జుట్ట మయ్యెడిన్" అని చెప్పెనుగదా! కావున వారిని క్షమించెను.

క. హనుమంతుఁడు లోనుగఁ గల,వనచరవర్యులచరిత్ర•వసుధాతనయం
గనుటను వారిప్రయత్నము, వినఁగోరితి నృపులతోడ•వే రండనుమా. ౧౩౭౯

తాత్పర్యము

హనుమంతుఁడు మొదలగువారు ప్రవర్తించిన విధము, సీతాదేవినిజూచుట యందు వారు చేసిన ప్రయత్నము, రామలక్ష్మణులతోడ నేను వినఁగోరితిని కావునఁ ద్వరగా రండని చెప్పుము.

క. అని చెప్పి సంప్రహృష్టుల, ఘనముత్సంఫుల్లనయన•కంజుల నృపులన్
గని పులకితగాత్రుండై, యినజుఁడు కార్యంబుసిద్ధి•కెంతయుఁ బొంగెన్.

అర్థములు. సంప్రహృష్టులన్=మిగుల సంతోషించిన వారిని, ఘనముత్= గొప్ప సంతోషముచే, సంఫుల్ల=వికసించిన, నయనకంజులన్ = నేత్రకమలములు గలవారిని, పులకితగాత్రుండై=గగ్గురు పొడిచిన దేహము గలవాఁడై, ఇనజుఁడు= సుగ్రీవుఁడు, కార్యసిద్ధికి=కార్యము సఫల మగుటకు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి మిగుల సంతోషించినవారై అధిక సంతోషముచే వికసించిన కన్నులుగల రామలక్ష్మణులఁజూచి దేహము పులకరింప సుగ్రీవుఁడు కార్యము సఫల మయ్యెఁగదా యని యుప్పొంగెను.

—• ౬౪-వ సర్గము. అంగదాదులు సుగ్రీవుకడకుఁ బోవుట •—

క. తరణికులోద్ధారకులకుఁ, దరణితనూజునకు మ్రొక్కి•దధిముఖు డెగసెన్
బరిచరయుక్తుఁడు నింగికిఁ, దరణిపథంబున యథాగ•తత్వర చనియెన్. ౧౩౪౧

అర్థములు. తరణికులోద్ధారకులకున్=సూర్యవంశము నుద్ధరించు వారికి, తరణితనూజునకున్=సుగ్రీవునికి, పరిచరయుక్తుఁడు=సేవకులతోఁ గూడినవాఁడు, నింగికిన్=ఆకాశమునకు, తరణి పథంబునన్=సూర్యుఁడుపోవు మార్గమున, ఆకాశ మున-యథా+ఆగత+త్వరన్=వచ్చినంత వేగముగ.

తాత్పర్యము

రామలక్ష్మణులకు సుగ్రీవునకు నమస్కరించి దధిముఖుఁడు పరిచారకులతో గగనంబున కెగసి యెంతవేగముగ వచ్చెనో యంత వేగముగఁ బోయెను.

సీ. మధువనంబున డిగ్గి•మధువారి మూత్రించి, కై పేది లేచిన•కపులఁ గాంచి
యంగదుఁ జేరంగ•నరిగి యంజలి మోడ్చి, రోషింపకయ్య మా•దోషమునకు
నజ్ఞానవశమున•నడ్డగించిరి వన, పాలురు మిమ్ము నృ•పాలతనయ
యువరాజ! నీవ యీ•యుద్యానమున కెల్లఁ బ్రభుఁడవు మూర్ఖత•బలిమిఁ జేసి

తే. చేసితిమి నేరమును మదిఁ•జేర్ప కీవు;మమ్ముక్షమియింపు మీరు వ•నమ్ముఁజేర
నేగుదెంచుట నీదు పి•తృవ్యునకును నేను బోయి వచించితి•మాననీయ.

అర్థములు. మధువారిన్=తేనెను-దాని కనుపానమైన నీటిని-ద్వంద్వ సమా సము కావున ఏకవద్భావము, మూత్రించి=మూత్రముగా విడిచి-తేనెతోడ నీళ్ళు త్రాగిన నది సుఖముగ, శీఘ్రముగ జీర్ణమగును. 'అనుపానం హిమంవారి యవ

గోధూమయోర్హితం। దధ్ని మధ్యే బిసే క్షౌద్రే కోష్ణం పిష్టమయేషుచ’ అని బాహటము. మూత్రము విడిచినచోఁ ద్రావిన తేనె జీర్ణమైన దని గుర్తు.-కైపేది=మత్తు విడిచి-రోషింపకయ్య=వ్యతిరేక మధ్యమ ము వర్ణంబున కెల్ల యెడల లోపంబు విభాష నగు-సు.వ్యా-సంధి ౭౧ సూ. పితృవ్యునకును=పినతండ్రికి-మాననీయ=పూజ్యుఁడా,

తాత్పర్యము

మధువనమున దిగి తేనెతోఁడఁ ద్రాగిన నీళ్ళను మూత్రము విడుచుటచే మత్తు తగ్గి, లేచిన క్రోఁతులఁజూచి యందు నంగదు సమీపించి యువరాజు గావునఁ జేతులు జోడించి యయ్యా మేముచేసిన యపరాధములకుఁ గోపింపకుము. ఈ వనపాలురు తెలివి లేనివారై మిమ్ము నడ్డగించిరి. రాజకుమారా! యువరాజా! యీ యుద్యానమునకు నీవే కదా ప్రభువు. నీ సొత్తు నీ వుపయోగింప నడ్డగింప వీరికేమి యధికారము గలదు? అజ్ఞానబలముచే నేరములు చేసితిమి. అవి నీవు మనస్సులో నుంచుకొనక క్షమింపుము. మీ రీ వనమునకు వచ్చిన వార్త నేనుబోయి మీ పినతండ్రికి చెప్పితిని.

క. దోషంబుగ నేఁ జెప్పిన, భాషణముల నాలకించి•పతి యది యేమోఁ
రోషింపఁడు మీపై సంతోషంబున వేగ రమ్మ•నుచుఁ జెప్పు మనెన్.

తాత్పర్యము

నేను మీరు దోషము చేసినట్లు చెప్పిన మాటలు విని యదియేమి కారణమో నాకుఁ దెలియదు. రోషించుటకు బదులు సంతోషించి మిమ్ముఁ ద్వరగా రండని చెప్పుమనెను. పూజ్యార్థంబున మి మ్మని బహువచనము.

ఉ. ఆ కపిమాట లెల్ల విని•యంగదుఁ డి ట్లను వానరాళితో
నీ కథ లెల్ల రాఘవకు•లేంద్రుఁడునున్ విని యుండునే కదా
ప్రాకటలీలఁ దేనియలఁ•ద్రావి శ్రమంబును దీర్చుకొంటి మిం
కే కరణీయ మిందుఁ గల•దేగఁగ నొఁ బినతండ్రిఁ జూడఁగన్. ౧౩౹౪

అర్థములు. కరణీయము=చేయదగిన కార్యము.

తాత్పర్యము

దధిముఖుఁడు చెప్పిన యామాట లన్ని విని వానరులతో నంగదుఁ డిట్లనియె. ఈ దధిముఖుఁడు చెప్పినవి సుగ్రీవుఁడు చెప్పినవి రామచంద్రమూర్తికూడ విని యుండునుగదా. మనమో కావలసినంత తేనె ద్రావితిమి. బడలిక దీర్చుకొంటిమి. ఇక్కడ నిఁకఁ జేయవలసిన పని యేమి లేదు. పిన్నతండ్రిని జూడఁ బోదమా?

క. మీరెల్ల రెట్లు చెప్పిన, నా రీతి నొనర్చువాఁడ•నగచరులారా!
యారయఁ ద్వత్పరతంత్రుఁడఁ, గారియముల సందియంబు•గలదే దీనన్.

అర్థములు. త్వత్+పరతంత్రుఁడన్=మీ కధీనపడి యుండువాఁడను, కారియములన్=పనులయందు.

తాత్పర్యము

మీ రందఱు నేది బాగని చెప్పెదరో యట్లే చేసెదను. పనులయందు నేను మీ స్వాధీనమం దుండు వాఁడను. ఇందు సందేహము లేదు.

క. యువరాజను మీ కెల్లర, కవుదునుగా కేమి దాన•నాజ్ఞాపింపన్
దవుదునె? కృతకర్ముల మిము, నవునే పీడింప రిత్త•యాజ్ఞలచేతన్? ౧౩౮౬

అర్థములు. కృతకర్ములన్=కార్యము సాధించిన వారిని.

తాత్పర్యము

నేను మీకు యువరాజ నగుదునుగాక, దానివలన నేమి ప్రయోజనము. ఆ యధికారమునుబట్టి మీ కిష్టములేని కార్యము చేయవలయు నని యాజ్ఞాపింప వచ్చునా? కార్యము సాధించిన మిమ్ము వ్యర్థము లగు నాజ్ఞలచేఁ బీడింపరాదు.

చ. అన విని వార లెల్లరుఁ బ్ర•హర్షమునం బ్రభు వెవ్వఁ డీ గతిన్
వినయము దోఁపఁ బల్కుఁ, బృథి•వీపతి నంచును భాగ్యనష్టచే
తనుఁ డయి తానె సర్వ మని•దర్పముఁ జూపును గాక యన్యుఁ డి
ట్లనునతఁ డున్నె? భావిశివ•తార్హతఁ దెల్పెడి నీ వినీతియే. ౧౩౮౭

అర్థములు. ప్రహర్షమునన్=అధిక సంతోషముచే, భాగ్యనష్ట చేతనుఁడు= సంపదచే మతి చెడినవాఁడు, దర్పము=గర్వము, భావి శివతార్హతకు=రాఁబోవు మేలునకు యోగ్యత, వినీతి=వినయము.

తాత్పర్యము

ఆ మాటలు విని వానరు లందఱు మిగుల సంతోషించి తానే రాజ నని యైశ్వర్యమదముచే మతిచెడినవాఁడై తానే సర్వము చేయువాఁడనని గర్వించును గాని ప్రభువెవ్వఁడీ విధముగ వినయముతో మాటలాడును. ఇట్టి వాఁడు మఱి యొకఁడు గలఁడా? నీ వినయమె నీవు భవిష్యత్కాలమున గొప్పమేలు చెంద నధికారివని సూచించుచున్నది.

క. నీ నిర్దేశము లేక డు, గేనియు నటుపెట్టఁ జాల•మెల్లరము నృపా
లా! నీ చెప్పినయట్టుల, వానరపతిఁ జూడఁబోవ•వల నగు ననినన్ ౧౩౮౮

అర్థములు. నిర్దేశము=ఆజ్ఞ-"అపవాదస్తు నిర్దేశో నిదేశ శ్శాసనంచ స" యని నిఘంటువు.

తాత్పర్యము

నీ యాజ్ఞలేక మే మిటునున్న యడుగెత్తియటు పెట్టఁజాలము. ఏ కారమైనను నీవు చెప్పినట్లు చేయుదుము. నీవు చెప్పినట్లు సుగ్రీవునిఁ జూడఁ బోవుటయె తగిన కార్యము అని చెప్పగా.

ఉ. మంచిది లెండటన్న విని•మానుగఁ గీశులు మింటిజాడ లం
ఘించి జవాన యంత్రమున•క్షిప్తములై చను కొండ లట్టు ల

భ్యంచితలీల వచ్చిరి మ•హాంబుదసంఘము లట్లు గర్జలన్
నించుచు, రామచంద్రుఁ డట•నీరజలోచనవార్త రామికిన్. ౧౩౮౯

అర్థములు. క్షిప్తములై=చిమ్మఁబడినవై, మహాంబుదసంఘము లట్లు=పెద్ద మేఘములవలె.

### తాత్పర్యము

మీరు చెప్పినది బాగున్నది. అయినఁ బోదము లెండు అనఁగానే, వానరు లాకాశమార్గమున వేగముగ యంత్రములచేఁ జిమ్మిన కొండ లెగిరి పోవునట్లు మేఘములవలె గర్జించుచు వచ్చిరి. ఇంతలో శ్రీరామచంద్రమూర్తి సీతాదేవి వార్త తెలియక పోవుటచే.

—•సుగ్రీవుఁడు శ్రీరామునకు ధైర్యోక్తులు చెప్పుట•—

సీ. తపియింపఁ గనుగొని•తపనతనూభవుం, డూరార్చి యిట్లను•నీరజాక్ష
వీరలు చూచిరి•వారిజాతాక్షిని, సందియం బేమియు•నొంద వలదు
గడువు దాఁటియు నన్నుఁ•గానఁగ నత్తురే, కార్యంబు సాధింప•కయ నృపాల!
యంగదుం డంతటి•యనదయే వరశౌర్య, తేజుఁడు రిత్తయే•తేరుటకును?
తే. గార్యమును జేయకయుఁ బ్లవ•గప్రవరుఁడు, తండ్రిదాతలచే రక్షి•తంబు నైన
నామధూద్యానరత్నంబు•నేమి మొగముఁ, బెట్టుకొనిచొచ్చునెదభీతిఁ•గొట్టుకొనఁగ.

### తాత్పర్యము

సంతాప పడఁగా నాయనను జూచి సుగ్రీవుఁ డిట్లనియె. కమలాక్షా! ఊరడిల్లుము. ఈ వానరులు నిస్సందేహముగా సీతను జూచివచ్చిరి. అటు చూడకుండు రేని గడువు దాఁటి కార్యము సాధింపక నా యొద్దకు వచ్చుధైర్యము వీరికిఁగలదా? కార్యము సాధింపక వ్యర్థముగా వచ్చుటకు నంగదుండంత పనికిమాలినవాఁడా! కార్యము చేయఁడేని తాత తండ్రులు రక్షించి నా కెంతో ప్రియమైన శ్రేష్ఠమైన యుద్యానమును లోపల భయముచే గుండెలు కొట్టుకొనుచుండ నేమి ముఖము పెట్టుకొని ప్రవేశింపఁగలఁడు.

ఉద్యాన రత్నము- 'రత్నంశ్రేష్ఠే. మణావపి' అని శ్రేష్ఠమను నర్థమందు మణియను నర్థమందు రత్నశబ్దము ప్రయోగింపఁబడును.'రత్నహారులు నృపతుల్,

తే. ఊఱడిల్లుము రఘువర!•యూఱడిల్లు, సంశయము మానవయ్య కౌ•సల్యతనయ
చూడఁబడె దేవి, నిక్కంబు•సుమ్ము హనుమ, చేతనే యదియితరుల•చేతఁగాదు.

### తాత్పర్యము

రఘువర-కౌసల్య తనయ-సీతాదేవి వార్త తెలియవచ్చెను. కావునఁ గార్యము నీవు సాధించినవాఁడ వగుటచే రఘువరుఁడ వైతివి. లేనియెడ మీ వంశమునకే యపకీర్తి వచ్చియుండు నని భావము.

సీతాదేవి వార్త తెలియవచ్చుటచే కౌసల్య కొడుకును గలది యయ్యెను. అది లేకయుండిన నామె పుత్రహీనయె యై యుండును. సీతావియోగము వలన రామచంద్రమూర్తి మరణించినను మరణింపక యపకీర్తి పాలయినను అట్టి కొడు కుండియు లేనివాఁడే కదా.

తాత్పర్యము. స్పష్టము.

క. ఈ కార్యము సాధింపఁగ, జేకుఱుఁ బావనికె యొరులచే నిది యానే?
యా కపి యెడఁ దేజమువలె, నీ కపియెడ శక్తి బలము ప్రేక్షయు ధ్రువమా.

అర్థములు. ఆకపి యెడన్=ఆకాశమందున్న ప్రసిద్ధుఁడైన సూర్యునియందు 'కం జలం పిబతీతి కపిః' నీళ్ళను త్రాగువాఁడు కపి సూర్యుఁడు. కపయోర్కే-భవానరౌః' నానా. "కప్యాసం పుండరీక" మను శ్రుతియందును గపి యనఁగా సూర్యుఁడనియె భాష్యకారులు వచించిరి.

తాత్పర్యము

ఈ కార్యము సాధింపఁ గలఁవాఁడు హనుమంతుఁడే, ఇతరులకిది సాధ్యము కాదు. ఆ సూర్యుని యందుఁ దేజము స్థిరమైనట్టు లీ కపియందు శక్తి, బలము, జ్ఞానము స్థిరమై యున్నవి.

ఉ. మంత్రి జాంబవంతుఁ డట మాను గ వానరకోటికిన్ హనూ
మంతుఁడు రక్షకుం డట, సమానవిహీన బలాఢ్యుఁ డంగదుం
డింతకు నేలినాతఁ డట యిట్టిరు పూనిన కార్య మెన్నఁ డా
వంతయు మొక్కపోనె? యిపు డార్తిఁ దొలంగు మతుల్యవిక్రమా. ౧౩౯౩

తాత్పర్యము చూడు ప. ౧౩౨౫

—హనుమంతుఁడు శ్రీరామునకు సీతాదేవిస్థితిఁ దెలుపుట—

సీ. ఇటు ముచ్చటింపఁగ నింతలోఁ గార్యసిద్ధిని దెల్పురీతి గర్జనము లమరఁ
గిష్కింధ కేతెంచు కీశుల కిలకిలా, శబ్దంబు మింట నాసన్నమైన
నది విని సుగ్రీవుఁ డాయతాంచితవాలుఁ, డై యుండె వానరు లంగదాంజ
నేయపురస్సరు లై యరుదెంచి రాఘవకపినాథాంతికమున డిగిరి

తే. యంత శిరమున మ్రొక్కి వాతాత్మజుండు
రామవిభునకు నియతయుఁ బ్రాణయుక్త
దేవి యన ఫలియించెఁ బో భూవరేంద్రు
కార్య మని సంతసం బందెఁ గపివిభుండు. ౧౩౯౪

అర్థములు. ముచ్చటింపఁగన్=మాటలాడు చుండఁగా, ఆసన్నమైన=సమీపింపఁగా-ఆయతాంచిత వాలుఁడై=నిడివిగాఁ జాపఁబడిన తోఁకగలవాఁడై-అంగద + ఆంజనేయ పురస్సరులై=అంగదుని నాంజనేయుని ముందుంచుకొన్నవారై-రాఘవకపి నాథాంతికమునన్=రామసుగ్రీవుల సమీపమున-నియతయు=

పాతివ్రత్య నియమము గలది-ప్రాణయుక్త=జీవించియున్నది-దేవి=సీతాదేవి-సీత ప్రాణముతో నుండియు శీలము చెడిన దయ్యేనేని చచ్చినదానితో సమానమె కావున శీలము గలదని మొదటఁజెప్పెను. ప్రాణయుక్త=శీలము గలది నిజమే, చచ్చియుండిన శీలవతి యయ్యు నేమి లాభము. కావున జీవించి యున్నదని చెప్పెను. తరువాత దేవి యని చెప్పెను. దేవీశబ్దమును సీతాదేవియందుఁ దనకుఁ గల భక్తియు గౌరవము తెలుప నుపయోగించెను. దేవుని భార్య దేవి. దేవ ఏకో నారాయణ యన్నట్లు దేవశబ్దము ముఖ్యార్థమున నారాయణునందే యన్వయము. తక్కినవారియందు గౌణము. అట్టివాని భార్య లక్ష్మి. 'దారిద్ర్య ధ్వంసినీం దేవీం సర్వోపద్రవ వారిణీ'మ్మని దేవీశబ్దము లక్ష్మి పర్యాయముగ అష్టోత్తరశతనామంబు లందుఁ బఠితము.

రామశబ్దము 'రము క్రీడాయా'మ్మను ధాతువువలనఁ గలిగినది. దేవశబ్దము 'దివు క్రీడాయా'మ్మను ధాతువువలన నుత్పన్నమైనది. కావున రామ దేవ శబ్దములు సమానార్థకములు దేవీ శబ్దము 'దివు క్రీడాయా'మ్మను ధాతువువలనఁ గలిగినదే. దేవవిభుఁడవైన నీకు ఆమె యన్ని విధములఁ దగియున్నదని భావము. అనఁగా తనకామె సాక్షాల్లక్ష్మిగాఁ దోఁచెను గాని సామాన్య స్త్రీగాఁ దోఁపలే దని భావము. ముందు దేవియని చెప్పిన భ్రష్టురాలయ్యె నని చెప్పెనో-మరణించె నని చెప్పెనో యని రెండవమాట చెప్పునంతలో రామచంద్రమూర్తి యెంత సంతాపపడునో యని ప్రాణమునకంటె శీల మెక్కువ కావున ముందు శీలవతి యని చెప్పి యావల ప్రాణవతియని చెప్పి యావల దేవి యని చెప్పెను. ప్రాణ యుక్త యనుటచే దేహమునందుఁ బ్రాణము మాత్ర మున్నది. జీవించినవారి కుండవలసిన లక్షణములు మఱి యేవి లే వని భావము.

## తాత్పర్యము

ఈ ప్రకారము రామ సుగ్రీవులు సంభాషించు సమయంబునఁ గార్యము సఫలమని తెలుపునట్లు సింహనాదములు చేయుచు వచ్చుచున్నవానరుల కిలకిలా ర్భటులు ఆకాశమున దగ్గఱగా వినరాఁగా సుగ్రీవుఁడు ప్రభువు కూర్చుండవలసిన విధముగా తోఁక పొడుగుగాఁ జాఁచి కూర్చుండెను. అంగదుని ఆంజనేయుని మఱియుం దుంచుకొని వానరులు రామసుగ్రీవులకు సమీపమున దిగిరి. అప్పుడు శ్రీ రామచంద్రమూర్తికి హనుమంతుఁడు-నియత-ప్రాణయుక్త-దేవి యనిసర్వము మూఁడు మాటలలోఁ దెలిపెను. అది విని సుగ్రీవుఁడు రామచంద్రమూర్తి కార్యము ఫలించెనని సంతోషించెను.

సీతాదేవిని వెదకించి వార్త తెప్పించెద నని చెప్పినమాట చెల్లించుకొంటి నను సంతోషముకంటె రామకార్యము ఫలించెఁ గదాయని సంతోషించె ననుటచే మిత్రలక్షణము స్ఫుటీకరింపఁబడియె.

ఆ. ప్రీతియుక్తు లగుచుఁ శ్రీరామలక్ష్మణుల్, కడుఁ బ్రియంబుఁ దెలుపు గంధవాహు
నాత్మజాతుఁ గనిరి సాదరాలోకన, పంక్తు లతనిమీఁదఁ బరఁగఁ జేసి. ౧౩౯౫

అర్థములు. సాదర+ఆలోకన+పంక్తులు=ప్రేమతోఁగూడిన చూపులవరుసలు.

తాత్పర్యము

శ్రీరామలక్ష్మణులు ప్రీతిగలవారై మిగులఁ బ్రియములైన మాటల చెప్పు హనుమంతుని ప్రేమతోఁగూడిన చూపులచే చాలసేపు చూచుచుండిరి.

౬౫-వ సర్గము.

ఉ. రాముని లక్ష్మణుం బ్లవగరాజును జేరి నమస్కరించి శా
ఖామృగపాళి భూమిసుతగాథ వచించెను లంక నామె సు
త్రామవిరోధిమందిరధరం జెఱ నుండుట, రాక్షసాంగనా
భీమబిభీషికల్ గడువు పెట్టుట, తత్పతి భర్తృభక్తియున్. ౧౩౯౬

అర్థములు. సుత్రామ విరోధి=ఇంద్రునకుఁ బగవాఁడైన రావణునియొక్క-మందిర ధరన్=గృహప్రదేశమందు-భీమ బిభీషికల్=భయంకరములైన బెదరింపు మాటలు.

తాత్పర్యము

వానరు లందఱు రామలక్ష్మణ సుగ్రీవుల యొద్దకుఁ బోయి నమస్కరించి రావణాసురుని యింట సీతాదేవి యుండుటయు, రాక్షస స్త్రీ లామెను బెదరించు చుండుటయు, రావణుఁడు గడువు పెట్టుటయు, ఆమె పతిభక్తి గుఱించియుఁ జెప్పిరి.

ఉ. జానకి సేమ మంచుఁ గపిసత్తము లాడఁగ రాఘవుం డనున్
వానరులార! సీత యెటువర్తిలు చున్నది? నా యెడాటమం
దే నియతిం జరించు! నిది యెల్లను జెప్పుఁడ టన్న నంజనా
సూనుని నీవు పల్కు సతిఁ జూచిన వాఁడవ టన్న వానరుల్. ౧౩౯౭

అర్థములు. నా యెడాటమందున్=నా విషయమందు.

తాత్పర్యము

సీతాదేవి క్షేమముగా నున్నదని వానరు లందఱుఁ జెప్పఁగా విని రామచంద్రమూర్తి యిట్లనెను. వానరులారా! సీతాదేవి యెం దున్నది! ఏమి చేయుచున్నది? నా విషయమందే నియమము గలదై యున్నది? ఇదంతయుఁ జెప్పుఁడని యడుగఁగా వానరులు హనుమంతా! చూచివచ్చిన వాఁడవు నీవే చెప్పుమనిరి.

క. హనుమంతుండును వసుధా,తనయామణి యుండు దెసకుఁ దస్త్రీమణికిన్
సనయంబుగ శిరమున వం,దన మొనరిచి యిట్టు లనియె దశరథసుతుతోన్.

తాత్పర్యము

హనుమంతుఁడు సీతాదేవి యుండు దిక్కునకును, సీతాదేవికిని వినయముతో శిరస్సు వంచి నమస్కరించి శ్రీరామచంద్రమూర్తితో నిట్టు లనెను.

ఆ. నిశ్చయించి యున్న♦నెలంత నిట్టట్టులో, యేను గాంచి యామె♦కలికపడఁగ
నెలమిఁ బొగడినాఁడ♦నిక్ష్వాకువంశవి,ఖ్యాతి దేవి నమ్మఁ♦గలుగుటకును.

అర్థములు. వేనలి=జడ-వేణీ శబ్ద భవము-అనవరతాలంబ = ఎల్లప్పుడు-త్వత్+ధ్యాన+రతాత్మయై=నిన్ను ధ్యాంచుటయందే ప్రీతిగల మనస్సుగలదై-అడజడిన్=దుఃఖముచే-నళిని=తామరతీఁగ-నవసి=చిక్కి.

## తాత్పర్యము

రావణుని యంతఃపురమందుఁ జెఱలోఁ జిక్కుకొని రాక్షసస్త్రీల గుంపులు తనపైఁ గావలి యుండఁగా వెంట్రుక లన్నియు నొక్కటిగఁ బేనుకొని పోయిన జడతో గొడ్డు నేలపైఁ గూర్చుండుటకును శక్తిలేక బండుకొని బాధపడుచు సర్వకాల సర్వావస్థల యందు నిన్ను ధ్యానించుటయందే ప్రీతి గల మనస్సు గలదై బాధపడుటచే మంచుకారునాఁటి తామర తీఁగవలె కాంతిచెడి (శుష్కించి, రావణు కోరిక యెటు లైన వ్యర్థము చేయవలయునను కోరికతోనే కాని బ్రదుకు రోసి గాదు) దేహంబు వదల నాలోచించి నిశ్చయించి యున్న యామెను నట్టి సమయంబున నేను నతిప్రయాసము మీఁదఁ జూచి నారాక యామెకుఁ దెలియు నట్లు ఇక్ష్వాకువంశరాజులయొక్క కీర్తిని నామెను నమ్మించుటకై పొగడితిని.

క. ముచ్చటలను సర్వార్థము, లచ్చపలాక్షికిని జెప్ప♦నగచరపతితో
నచ్చపుస్నేహము మీకిట, నచ్చపడుట కబ్జనేత్ర♦హర్షం బందెన్. ౧౮౦౧

తా. చూడు —౧౨౩౫ ప.

—♦ హనుమంతుఁడు శ్రీరామునితో సీతాదేవి వాక్యంబులు దెల్పుట ♦—

ఉ. నిన్ను మహానుభావ! కడు♦నిర్మలచిత్తమునన్ స్మరించుచున్
సన్నుతభక్తిశీలములు♦సాధ్విగుణంబుఁ దపంబుఁ బాయ కం
దున్నది, నేను జూచితి, ర♦ఘూత్తమ! నీకు నభిజ్ఞ చిత్రకూ
టోన్నతసీమఁ గాకికథ♦యొండు వచించియు నాకు నిట్లనెన్. ౧౮౦౨

అర్థములు. మహానుభావ=ఓ మహానుభావుఁడా యని సంబోధనముగనైనఁ జెప్పవచ్చును. మహానుభావురాలగు సీతాదేవియని యైనఁ జెప్పవచ్చును. రెండవదియె ప్రశస్తము, ప్రస్తుతము

## తాత్పర్యము

మహామహిమగల యా సీతాదేవి నిన్ను మిగుల నిర్మలమైన మనస్సుతో స్మరించుచు సత్పురుషులచేత స్తోత్రము చేయఁబడిన భక్తి-స్వభావము-పాతివ్రత్యము-తపస్సు (ఉపవాసాది) వదలక యా యశోక వనమునం దున్నది. ఇది యితరులు నాకుఁ జెప్పఁగా నేను నీకుఁ జెప్పరాలేదు. నేను కన్నులారఁ జూచి చెప్పుచున్నాను. నీవు చూచి యుండిన నీతో నేమైనఁ జెప్పెనా యందువా నీకు గుర్తుగా చిత్రకూట పర్వతమున నుత్తరు ప్రదేశమందు జరిగిన కాకి కథ జెప్పి మఱియు నిట్లనియె.

ఆ. నిశ్చయించి యున్న • నెలఁత నట్టెట్టులో, యేను గాంచి యామె • తెలియఁగ
నెలమిఁ బొగడినాఁడ • నిక్ష్వాకువంశవి, ఖ్యాతి దేవి నమ్మఁ • గలుగుటకును.

అర్థములు. వేనలి=జడ-వేణీ శబ్ద భవము-అనవరతంబు = ఎల్లప్పుడు-త్వత్+ధ్యాన+రతాత్మయై=నిన్ను ధ్యానించుటయందే ప్రీతిగల మనస్సుగలదై-అడఁజడిన్=దుఃఖముచే-నళిని=తామరతీఁగ-నవసి=చిక్కి.

తాత్పర్యము

రావణుని యంతఃపురమందుఁ జెఱిలోఁ జిక్కుకొని రాక్షసస్త్రీల గుంపులు తనపైఁ గావలి యుండఁగా వెండ్రుక లన్నియు నొక్కటిగఁ జేసుకొని పోయిన జడతో గొడ్డు నేలపైఁ గూర్చుండుటకును శక్తిలేక బండుకొని బాధపడుచు సర్వకాల సర్వావస్థల యందు నిన్ను ధ్యానించుటయందే ప్రీతి గల మనస్సు గలదై బాధపడుటచే మంచుకారునాఁటి తామర తీఁగవలె కాంతిచెడి (శుష్కించి, రావణు కోరిక యెటు లైన వ్యర్థము చేయవలయునను కోరికతోనే కాని బ్రదుకు రోసి గాదు) దేహంబు వదల నాలోచించి నిశ్చయించి యున్న యామెను నట్టి సమయంబున నేను నతిప్రయాసము మీఁదఁ జూచి నారాక యామెకుఁ దెలియునట్లు ఇక్ష్వాకువంశరాజుయొక్క కీర్తిని నామెను నమ్మించుటకై పొగడితిని.

క. ముచ్చటలను సర్వార్థము, లచ్చపలాక్షికిని జెప్ప • నగచరపతితో
నచ్చపు స్నేహము మీకిట, నచ్చపడుట కబ్జనేత్ర • హర్షం బందెన్. ౧౮౦౧

తా. చూడు —౧౩౩౫ ప.

—• హనుమంతుఁడు శ్రీరామునితో సీతాదేవి వాక్యంబులు దెల్పుట •—

ఉ. నిన్ను మహానుభావ! కడు • నిర్మలచిత్తమునన్ స్మరించుచున్
సన్నుతభక్తిశీలములు • సాధ్విగుణంబుఁ దపంబుఁ బాయకం
దున్నది, నేను జూచితి, ర • ఘూత్తమ! నీకు నభిజ్ఞ చిత్రకూ
టోన్నతసీమఁ గాకికథ • యొండు వచించియు నాకు నిట్లనెన్. ౧౮౦౨

అర్థములు. మహానుభావ=ఓ మహానుభావుఁడా యని సంబోధనముగనైనఁ జెప్పవచ్చును. మహానుభావురాలగు సీతాదేవియని యైనఁ జెప్పవచ్చును. రెండవదియె ప్రశస్తము, ప్రస్తుతము

తాత్పర్యము

మహామహిమగల యా సీతాదేవి నిన్ను మిగుల నిర్మలమైన మనస్సుతో స్మరించుచు సత్పురుషులచేత స్తోత్రము చేయఁబడిన భక్తి-స్వభావము-పాతివ్రత్యము-తపస్సు (ఉపవాసాది) వదలక యా యశోక వనమునం దున్నది. ఇది యితరులు నాకుఁ జెప్పఁగా నేను నీకుఁ జెప్పరాలేదు. నేను కన్నులారఁ జూచి చెప్పుచున్నాను. నీవు చూచి యుండిన నీతో నేమైనఁ జెప్పెనా యందువా నీకు గుర్తుగా చిత్రకూట పర్వతమున నుత్తరు ప్రదేశమందు జరిగిన కాకి కథ జెప్పి మఱియు నిట్లనియె.

క. హనుమా! యిచ్చటఁ జూచిన, దనుమా సర్వంబుఁ బురుష•హర్యక్షునితో
నినకులదీపకుతో నని, నను నాజ్ఞాపించెఁ గంజ•నయన నృపాలా. ౧౪౦౩

అర్థములు. పురుష హర్యక్షునితో=పురుష సింహముతో.

తాత్పర్యము

స్పష్టము.

క. మిక్కిలి యత్నముతో నే, నక్కఱ రక్షించితిని మ•హామణి యిది నీ
వ కాకుత్థ్సున కిమ్మా, యక్కపినాథుండు వినఁగ•నసుమా యిట్టుల్. ౧౪౦౪

అర్థములు. మిక్కిలి యత్నముతో=మిగులఁ గష్టపడి-రాక్షసులపాలు గాకుండునట్లు.

తాత్పర్యము

స్పష్టము.

ఆ. గండభాగమునను•గరఁగిపోఁ దిలకంబు, స్వేదబిందువులను•జిత్రరీతి
మణిసిలను నొకంట•మతశిలాఁగ నీవు, తిలకముంచుటయును•దలఁపవలయు

తాత్పర్యము

చూ. ప. ౯౯౩

ఉ. దాఁచితి నీజలోద్భవము•దాశరథీ! యిది నీ మనోంబుజం
బాఁచి కొనంగఁ జాలుట మ•హాత్మ! భవద్విరహానలంబు నన్
గ్రాఁచెడివేళ ని న్గనిన•కైవడి దీనిని గాంచి పొంగుదున్
సైఁచుట దోఁప దింక రఘు•చంద్రమ! యియ్యది నీకుఁ బంచితిన్. ౧౪౦౫

తాత్పర్యము. చూ.ప. ౯౯౫

క. నెల యొక్కటి యెటు లేనియు, నిలుపుదుఁ బ్రాణంబు మేన•నీరజనయనా!
నెల కావల బ్రదుకను సోఁ,కుల చేతికిఁ జిక్కి నిజము•కువలయనాథా! ౧౪౦౬

అర్థములు. సోఁకులు=రాక్షసులు.

తాత్పర్యము

స్పష్టము.

చ. అనుచుఁ గృశాంగి ధర్మరత•యాశరసౌధనిరుద్ధ ధారిణీ
తనయ మృగాక్షి పల్కెను య•థాస్థితి సర్వము నీకుఁ దెల్పితిన్
వనధిఁ దరింప బూనుము ది•వాకరవంశమణీ? యెటులేని యం
చును రతనంబుఁ జేతనిడె•సొంపుగ వారలు విశ్వసింపఁగన్. ౧౪౦౭

అర్థములు. కృశాంగి=బక్కచిక్కిన దేహము గలది-ధర్మరత=అట్లుండియు పతివ్రతా ధర్మమందే ప్రీతిగలది, ఆశర = రాక్షసుని-సౌధ = అంతఃపురము, మేడయందు-నిరుద్ధ=నిర్బంధింపఁబడినది-యథాస్థితి=ఉన్నదున్నట్లు.

## తాత్పర్యము

ఈ ప్రకారము తానెంతయో శుష్కించి వరుగై యున్నను పతివ్రతా ధర్మమునఁ బ్రీతి మాత్రము వదలక రావణు నింట నిర్బంధమునఁ జిక్కి సీతాదేవి చెప్పెను. ఉన్నది యున్నట్టు సర్వము నీకుఁ దెలిపితిని. సూర్యవంశ రత్నమా! నీవు సముద్రము నెటులైన దాఁటు నాలోచన సేయుము. అని చెప్పి వారందఱు నమ్మినట్లు రత్నమును రామచంద్రమూర్తి చేతిలో నుంచెను.

-* ౬౬-వ సర్గము. శ్రీరాముఁడు సీతాదేవిచూడామణినిఁ జూచి దుఃఖించుట *-

క. రాముఁడు తన్మణిఁ గైకొని, ప్రేమంబున నక్కుఁ జేర్చి*ప్రియసోదరుతోఁ
భామినిఁ దలంచి దుఃఖో,ద్దామతఁ బలవించి సూర్య*తనయున కనియెన్.

అర్థములు. అక్కున్=ఱొమ్ము, దుఃఖోద్ధామతన్ = దుఃఖాతిశయముచే, పలవించి=ఏడ్చి.

## తాత్పర్యము

ఆ మణిని రామచంద్రమూర్తి దీసికొని సీతాదేవియే వచ్చినట్లు తలంచి యామెను కౌఁగిలించుకొనునట్లు ఱొమ్మున కొత్తుకొని సీతను దలంచి దుఃఖాతిశయముచే లక్ష్మణుతోను సుగ్రీవునితోను నిట్లనెను.

ప్రియసోదరుతోఁదలంచి పలవించి యనుటచే దానిని జూడఁగానే లక్ష్మణుఁడును దుఃఖించె నని భావము.

సీ. సుగ్రీవ! యీ దివ్య*చూడామణిని జూడఁ, జూడ నామనము లే*దూడఁ గన్న
ధేనువు చేఁపెడు* తెఱఁగునఁ గరగెడి-త్వాత్మతనూభవకు మా*మామగారు
వఱలు ప్రేమమున ను*ద్వాహవేళను శిర, మం దిది గూర్ప న*త్యంతకాంతిఁ
దేజరిల్లుచు నుండె*దివ్యంబు సజ్జన, పూజితం బంబుసం*భూత మైన
ఆ. దీని నధ్వరమునఁ దృప్తుఁడై శక్రుండు, జనకునకు నొసంగె*నారదమును
మణిని జూచినంత*మా మామ జనకుని, నాత్మజనకుఁ గన్న*యట్టు లయ్యె.

అర్థములు. ఉద్వాహవేళను = పెండ్లిసమయమున, దివ్యంబు=దేవతా సంబంధమైనది, అంబుసంభూతంబు=జలములందుఁ బుట్టినది, అధ్వరమునన్= యజ్ఞసమయమున, శక్రుండు=ఇంద్రుడు.

## తాత్పర్యము

సుగ్రీవా! మనుష్య దుర్లభమై దేవతలు ధరించు నీ చూడామణిని జూడఁగా నామనస్సు లేఁతదూఁడ చూచినంతన యావు చేఁపు విధముఁగా గరఁగుచున్నది. దీనిని మా మామగారు సీతాదేవికిఁ బెండ్లికాలమందు శిరంబున ధరింపఁ జేయఁగా నామె మిగులఁ గాంతిగలదై ప్రకాశించెను. ఇది దివ్యము. సత్పురుషపూజితము. జలములందుఁ బుట్టినది. దీనిని మా మామగారు యజ్ఞము చేయు సమయంబున సంతోషించి

యింద్రుఁ డా యనకిచ్చెను. దీనిని జూడఁగానే మా మామ జనకరాజును, మా తండ్రిని జూచినట్లైనది. గౌరవ పద్యము చూచుచున్నది. మా మామగారును నను టచే నాయన ప్రక్కనుండిన యత్తగారును స్మృతికి వచ్చినదియే. నుకార మిా యర్థ మిచ్చుచున్నది.

క. ఆ తరుణీమణి శిరమున, భాతిం జెలువారు దీనిఁ బరికింపఁగ నా
  కో తరణిజ! భూసుతయే, ప్రీతిం జనుదెంచినట్టి రీతిగఁ దోఁచెన్. ౹౹౮౹౹

అర్థములు. భాతిన్=కాంతిచే, పరికింపఁగన్=చూడఁగా, ప్ర.పరీక్షించు.

తా త్ప ర్య ము

ఆ సీతాదేవి శిరస్సునందుఁ బ్రకాశించు దీనిని జూడఁగానే సీతాదేవియె వచ్చిన దని తోఁచెను.

ఉ. వారక దప్పిచే నలఁగు వానికి నీరము పోయురీతిగా
  సారెకు సీతవాక్యము సౌమ్యగుణా! వచియింపవయ్యు, యా
  వారిజనేత్ర లేకయును వారిజ మిా రతనంబుఁ గంటి, నా
  కారయ నింతకంటెను మహాత్తరదుఃఖము లున్నె లక్ష్మణా! ౹౹౯౹౹

తా త్ప ర్య ము

మిగుల దాహముచేఁ దపించు వానికిఁ ద్రావ నీళ్ళు పోసినట్టు లాంజనేయా! నాకు సీతాదేవి వాక్యముల వినిపింపుము. లక్ష్మణా! సీతాదేవి లేక యీ చూడా మణిని జూచితిని. నా కింతకంటె గొప్ప దుఃఖము గలదా?

చ. ఒక నెలదాఁకఁ బ్రాణమున నుండఁగఁ జాలినయేని యింక జా
  నకి చిరజీవ, నే నొకక్షణం బసితేక్షణ లేక మేనిపొం
  దిక బ్రదుకంగ నేర, సుమతీ! ననుఁ దోడ్కొని పోఁగదే ప్రియా
  నికటముఁ జేర, వార్తను వినిన్ వశమా యిట నాకు నిల్వఁగన్? ౹౹౧౦౹౹

అర్థములు. అసితేక్షణ=నల్లని కలువలవంటి కన్నులు గలది-ప్రియానికటము=ప్రియురాలి సమీపము-వినిన్=వినియును, వినియున్ అను పదములో సముచ్చయము లోపింపఁగా మిగిలిన రూపము. నుకార మర్థ విశేషంబును దెలుపును.

తా త్ప ర్య ము

నన్ను విడిచి సీతాదేవి యింక నొక నెల జీవించి యుండఁగలదేని యామె తుమర ణమే లేదు. ఎన్ని దినాలైనను బ్రదికి యుండఁగలదు. నేనో యా కాటుక కంటిని విడిచి యొకక్షణమైన బ్రతికి యుండలేను. కావున నేను బ్రతికి యుండవలెనని మిాకుఁ గోరిక గలదేని నన్నామె సమీపమునకుఁ దీసికొని పొండు. ఏలన సీత యీవిధముగ నున్నదని విని కూడ నిచ్చటఁ బ్రాణములతో నుండ నాకుసాధ్యమా?

ఇంతటి దుఃఖమందును రామచంద్రమూర్తి దన్ను సీతాదేవి యొద్దకుఁ దీసికొని పొమ్మనెనేకాని యామె నిచ్చటికేల తేలేదని కాని, యిప్పుడైనఁ దీసికొని రండనికాని యనలేదు.

మ. అకటా! యెట్లు వచించునో కదె మదీ•యాత్మేశ భీశీలయా
వికటాలాపభయంకరాస్యసురవి•ద్వేష్యాళిమధ్యంబునన్,
ప్రకటాభ్రావృతశారదేందుసమ మై•పద్మాక్షి నెమ్మోము త
న్నికటానేకపలాశనావృతము నై•నిస్తేజమై యుండదే? ౧౪౧౪

అర్థములు. మదీయాత్మేశ=తన యాత్మకు నే నీశ్వరుఁడ నని సీత చెప్పెను గాని, నా యాత్మ కామెయే యీశ్వర, యీశ్వరియు. నామనస్సు, నాప్రాణములు నాజీవుఁ డామె వశమున నున్నవి. దీనివలనఁ బరస్పర సామ్యము చెప్పఁబడెను. భీశీల=భయపడు స్వభావము గలది, వికటాలాప=విరుద్ధముగ, భయంకరముగ మాటలాడు నట్టియు, భయంకరాస్య=దిగులుపుట్టించు ముఖములు గలట్టియు, సురవిద్వేష్యాళి=రాక్షసుల, మధ్యంబునన్=నడుమ, ప్రకటాభ్రావృత=పెద్దమేఘ ముచేఁ గప్పఁబడిన, శారదేందుసమమై=శరత్కాల చంద్రునితో సమానమైన, తన్నికట=ఆమె సమీపమం దుండు, అనేక పలాశనావృతమునై=పెక్కు రాక్షస స్త్రీలచేఁ జుట్టఁబడినదై, నిస్తేజమై=కాంతిపోయినదై.

## తాత్పర్యము

నా యాత్మకు నీశ్వరయై భయపడు స్వభావముగల యాదేవి దిగులు పుట్టించు మాటలు, దిగులు పుట్టించు నాకారములు గల రాక్షసుల నడుమ యెట్లు జీవించి యున్నదో కదా. ఇది యెంతటి యసాధ్యకార్యము. ప్రాణముతో నున్నది కాని, యుండినను మేఘములచే నావరింపఁబడిన శరత్కాల చంద్రునివలెఁ గాంతి హీనమై యుండదా?

క. హనుమా! భామిని పలుకుల, ననుమా మందునను బ్రదుకు•నాతురరీతిన్
విని బ్రతుకువాఁడ న న్నే, మని మధురాలాప మధుర•యనె మచ్ఛ్యుత యై.

అర్థములు. భామిని='కోపనా సైవ భామినీ' అమరము. కోపము గలది భామిని. ఇట్లు చెప్పుటచే నాంజనేయా నేను వచ్చి తన్ను రక్షింపలేదని నా మీఁద కోపము గలదై యున్నదా యని భావము. ఆతురరీతిన్=రోగివలె, మధురాలాప=తియ్యని మాటలు గలది-ఆమె విషయమై నీవు చెప్పిన మాటలు నీ నోర వచ్చినవే యింత తియ్యగా నున్నవే, ఇఁక నామె నోరనుండి వెలువడి నవి యిం కెంత తియ్యగా నుండునో. ఏలన నామె స్వభావమున మధుర కావున. మధువు కలది మధుర. మధు వనఁగా 'మన్యతే అభిలష్యత ఇతి మధు'-జనులచే నభిలషింపఁ బడునది కావున మధు వనఁబడును. మధు వనఁగాఁ దేనె. ఆమెయే మధురయైనపు డామెమాటలు యేల మధురముగ నుండవు? ఏ మందున కై నను దేనె యనుపానము. ఆమెను గుఱించి నీవు చెప్పెడు నీ మాటలు నా కౌషధము వంటివి. ఆమె మాటలు తేనె యనుపానముతోఁ

జేర్చినట్టివి- ఇట్లగుటచే నామె నోర నే మాటలు వచ్చెనో వానినే చెప్పు మని భావము. మచ్చ్యుతయై=నాచే విడువఁబడినదై. మధుర=సుందరి, సుందరి మాటలు సుందరముగానే యుండును.

తాత్పర్యము

హనుమా! సీతాదేవి నేను వచ్చి తన దుఃఖము బాప లేదని కోపించినదా చెప్పుము. రోగి యౌషధము దిని బ్రదుకునట్లు నీ మాటలు విని బ్రదుకువాఁడను. తేనెవంటి మాటలు, తేనెవంటి గుణము స్వభావము గల యామె నేను విడుచుటచే నన్నుద్దేశించి యేమి చెప్పెనో యా మాటలే చెప్పుము.

—♦ ౬౭-వ సర్గము. హనుమంతుఁడు శ్రీరామునకుఁ గాకాసుర వృత్తాంతం బభిజ్ఞానంబుఁ దెలుపుట ♦—

క. అని రామచంద్రుఁ డడిగిన, హనుమంతుఁడు భూమికన్య♦యాడిన వెల్లన్
విని చె సతి చిత్రకూటం,బున వృత్తము గుఱుతుఁ జెప్పెఁ♦బురుషవరేణ్యా!

అర్థములు. వినిచెన్=వినునట్లుఁ జేసెను, వినిపించెను ప్రేరణార్థకమున విని చెన్; చిత్రకూటంబున వృత్తము=చిత్రకూటము నందలి చర్య.

తాత్పర్యము

అని రామచంద్రమూర్తి యడుగఁగా హనుమంతుఁడు సీతాదేవి చెప్పిన మాటలెల్ల వినిపించి పురుషశ్రేష్ఠుఁడా! చిత్రకూట పర్వతమున జరిగిన వృత్తాంతము గుఱుతుగాఁ జెప్పెను.

క. నీతోడుత నిద్రించుచు, సీతాసతి మున్నె లేవఁ♦జెచ్చెరఁ గాకం
బా తరుణీ స్తనమధ్యము, శాతనఖాగ్రమునఁ జీరె♦సహసోద్గత మై. ౧౪౧౭

అర్థములు. శాతనఖాగ్రమునన్=పదునైన గోటికొనచే-చీరెన్ = గీచెను, సహసోద్గతమై=తటాలున నెగిరి వచ్చినదై-సుప్పుపేతి సమాసము.

తాత్పర్యము

నీతోడ నిద్దుర పోవుచు సీతాదేవి ముందుగా లేవఁగా తాటాలునఁ గాకి యొకటి యెగిరి వచ్చి యామె స్తనమధ్యమునందుఁ దన వాఁడి గోళ్ళకొనలచే గీఁచెను.

క. ఆర్యజనోత్తమ! నీవును, బర్యాయంబునను నీదు♦పడఁతుకతోడ సౌ
కర్యంబుగ నిద్దుర గొన, ధైర్యంబునఁ బక్షి మఱలఁ♦దద్దయు నేఁచెన్. ౧౪౧౮

అర్థములు. పర్యాయంబునను=క్రమముగా, ఆమె లేచిన తరువాత నీవు-ఏఁచెన్=బాధించెను.

తాత్పర్యము

నిద్దురపోవు చుండినది యామె లేచి కూర్చుండఁగా నీ వామె తొడపై దల పెట్టి నిద్రించితివి. ఇట్లు నీవు సుఖముగా నిద్రించు సమయమున నా కాకి మఱల వచ్చి యామెను బాధించెను.

క. మాటికి మాటికి ముక్కున, గాటు పడం బొడువఁ బొడువ♦గాకము నీ సీ
మాటఁ దదుద్గతరక్తము, సూటిగ నీమీఁదఁ బడియె♦శుద్ధచరిత్రా! ౧౪౧౯

అర్థములు. కాటు=గాయము-సీమాటి=ఉత్తమ స్త్రీ-తత్ + ఉద్గతరక్తము= ఆమెనుండి వెలువడిన నెత్తురు, సూటిగ=సరిగా.

తాత్పర్యము

ఆ యుత్తమస్త్రీని కాకి పలుమాఱు గాయము పడునట్లు ముక్కుతోఁబొడువఁగా నామెనుండి వెలువడిన నెత్తురు సరిగా నీమీఁదఁబడెను.

ఉ. పాపపుఁబుల్గు సీత కిడు♦బాధ సహింపఁగ లేక నిద్దురన్
లేపెను గాదె రామ! నిను♦లేచి నృపాల! స్తనాంతరంబునన్
జేపడియున్న కాటుఁ గని♦చిత్తమునం గన లూని యెవ్వఁ డీ
పాపముఁ జేసెఁ జెప్పు మిఁకఁ♦బైదలి వానిని రూపు మాపెదన్.

తాత్పర్యము. చూ. ప. ౯౩౦

ఆ. రోష వేగమునను♦రోఁజెడి పంచవ, క్త్రింబుపాముతోడఁ దవిలి యెవ్వ
డాడుకొనఁగఁ జొచ్చె♦నంబుజలోచన, యనితి వపుడు నీకు♦నభిముఖముగ.

తాత్పర్యము చూ.ప. ౯౩౧

ఆ. రక్తసిక్తనఖర♦యుక్త మా కరటంబుఁ, గనితి కనినయంతఁ♦గాకిరూపుఁ
గొనినయట్టి శక్రు♦కొమరుండు గాఁడ్పనఁ, బర్వతంబు డిగ్గి♦పాఱఁ దొడఁగె.

తాత్పర్యము చూ.ప. ౯౩౨

సీ. అది చూచి నీవు భృ♦శాగ్రహావశుఁడవై, యా యరిష్టము పట్ల♦నదయుఁడగుచు
దర్భాసనంబున♦దర్భయొక్కటిఁ దీసి, బ్రహ్మమంత్రంబునఁ♦బ్రజ్వరిల్లఁ
జేసి మాకళిమీఁద♦వేసిన నదియును, నంబరపథమున♦నరుగు చున్న
బలిభుక్కు వెన్నంటి♦పఱవఁ దొడంగెను, గాకియు వెఱ మూఁడు♦లోకములను

తే. సంచరించుచుఁ బలువుర♦శరణు వేఁడెఁ, గన్నతండ్రియు సురలును♦ఘనమహర్షి
చయములును దాముగావంగ♦జాలమనగ, మఱలిచను దెంచి దేవనిన్♦శరణుఁజొచ్చె.

తాత్పర్యము. చూ.ప. ౯౩౩

సీ. శరణంచు ధరణిపై♦సాఁగిలఁ బడినట్టి, వాయసుఁ గని వాఁడు♦వధ్యుఁడయ్యుఁ
జంపక కాచితి♦పెంపారుకరుణచే, దిక్కెవ్వరును లేక♦దీనుఁ డగుచు
శరణాగతుండైన♦జాల్మునాతనిఁ జూచి, వ్యర్థంబు పోదు బ్ర♦హ్మాస్త్ర మేమి
చెప్పెద వనినను♦జేకొన నిమ్ము నా,కుడికంటి ననియె నా♦చెడుగు గాకి

ఆ. వెడిద మైన శరము♦కుడికన్ను హరియించి, చనియెఁ జనియెఁ గాకి♦చావు దప్పి
కన్ను లొట్టవోవఁ♦గాకుత్థ్సకులున కా, దశరథునకు భక్తి♦దండమిడుచు.

తాత్పర్యము. చూ.ప. ౯౩౪

క. ఈ విధమున నస్త్రకళా,కోవిదతతి మేటి సత్యగుణధాముఁడు స
ద్భావుఁడు సచ్ఛీలుం డే,లా విడువం డస్త్రమొండు•నసురావళిపై? ౧౪ ౨౫

తా త్ప ర్య ము చూ.ప. ౯౩౮

మ. నరదివ్యాస్త్రవిదుం డదేల యసుర•వ్రాతంబుపై నంపఁ డు
ద్ధురఘోరాస్త్ర మొకండు! దేవదనుజ•స్తోమాహిగంధర్వులేన్
దిరులై చూడఁగ లేరు సంగరధరి•త్రిన్ రామునిన్; నాపయిం
గరుణాలేశమె యున్నఁ బంక్తివదనున్•ఖండించుఁ గా కింకనేన్. ౧౪ ౨౬

తా త్ప ర్య ము చూ.ప. ౯౩౯

ఉ. అన్నయనుజ్ఞఁ బొంది యహి•తాంతకతుల్యుఁడు లక్ష్మణుండు నే
నన్నది యేల కావఁగ మ•నంబున నెంచఁడు? సర్వభుఙ్నిరు
త్సన్నిభు లన్నదమ్ములు న•జయ్యులు దక్షు లుపేక్షసేత కో
యన్న! నిజంబు మత్కృతమ•హత్తరపాపమ హేతు వెన్నఁగన్. ౧౪ ౨౭

తా త్ప ర్య ము చూ.ప. ౯౪౦

సీతాదేవి యే మాటలు చెప్పెనో యా మాట లన్నియు నీవు చెప్పుమని రామచంద్రమూర్తి యడుగుటచే నామె మాటలే హనుమంతుఁడు చెప్పెను.

—• సీతాదేవిని దా నూరార్చిన విధంబు హనుమంతుఁడు శ్రీరామునకుఁ దెలుపుట •—

క. అని దీనాలాపంబులఁ, గనుఁగవ బాష్పంబు లురలఁ•గళవళ పడుచున్
జనకజ పల్కిన విని యో,జనవర! యిట్లంటి సతికి•సాంత్వవచనముల్. ౧౪ ౨౮

అర్థములు. దీనాలాపంబులన్=శోకముతోఁ గూడిన మాటలు. సాంత్వవచనముల్=ఊరడింపు మాటలు. కనుఁగవన్=రెండు కన్నులనుండి.

తా త్ప ర్య ము. స్పష్టము. చూ.ప. ౯౪౧

మ. వినుమీ సత్యము జేసి పల్కెదను దే•వీ? రామభద్రుండు త్వ
జ్జనితార్తిన్ విముఖుండు సర్వమునకున్•సంతప్తుఁడై యుండెడిన్
గని యా యన్న యవస్థ లక్ష్మణుఁడు శో•కక్షుబ్ధుఁ డయ్యెం జుమీ
కనితిన్ని న్నిపు డెట్లొ కేల కిట, నిం•కం జాలి నీ కేటికిన్. ౧౪ ౨౯

తాత్పర్యము. చూ.ప. ౯౪౨

క. ఇడుమలఁ గుందెడికాలము, గడచెన్ దుఃఖాంత మిపుడ•కనియెద వాత్రం
పడుచు విభు లెదురు చూచుచుఁ, బడఁతీ! యున్నారు లంక•భస్మముసేయన్.

తాత్పర్యము. చూ.ప. ౯౪౩

క. ఆహవమున సహబాంధవు, ద్రోహిని రావణు వధించి•ద్రుతగతిని జగ
న్మోహిని నినుఁగొని పురి కు,త్సాహంబునఁ బోవు రామ•చంద్రుఁడు ప్రీతిన్.

తాత్పర్యము. చూ.ప. ౯౪౪

ఉ. రాముఁ డెఱుంగు గుర్తొకటి•రాజసుతా? యిదు మంతె చాలు నా
భామిని నాల్గు దిక్కులను•బాఱఁగఁ జూచి నిజప్రవేణికా
సీమను గూర్చి నైన మణిఁ•జీఱచెఱంగున నుండి విప్పి స
త్ప్రేమను నాదుచేత నిడ•దేవిరో నే నిఁకఁ బోయి వత్తునే. ౧౪౩౨

అర్థములు. నిజప్రవేణికాసీమను=తన జడయందు-కూర్పనైన మణిన్=కూర్పనువగు రత్నమును-సీతాదేవి కొన్ని సొమ్ములను బాఱవైచి, కొన్ని చెట్ల కొమ్మలకుఁ దగిలించెను గాని యీ జడబిళ్ళ సముద్రమునందుఁ బుట్టి యింద్రునిచే నీయఁబడిన దివ్యరత్నమగుటచే బయటఁ గానవచ్చిన రావణుఁడు హరించునేమో యని దానిని మాత్రము తలనుండి తీసి రాక్షస స్త్రీలకుఁ గూడఁ దెలియకుండ చీర కొంగున ముడివైచి చీర బొడ్డులో దోపుకొని యుండెను. దీని వలన సీతాదేవి ద్రావిడలవలె గూడకట్టుకాక యౌత్తరాహిక స్త్రీలవలెఁ గుచ్చిళ్ళు జాఱవిడిచి గోఁచి పెట్టి చీర కట్టి యుండెనని తోఁచు చున్నది. ఈ విధముగనే కదా చీరలు కట్టుకొను స్త్రీలు ధనమును సొమ్ములను నేఁటికిని దాఁచు చున్నారు.

తాత్పర్యము

అమ్మా! రాజపుత్రీ! రామచంద్రమూర్తి తెలిసికొనఁ గలిగిన గుర్తునేదైన నొకటి యిమ్ము. అంతమాత్రము చేసినఁ జాలును. అని నేను జెప్పఁగా సమీపంబున రాక్షసస్త్రీలు లేకుండునట్లు లీ ప్రక్కనా ప్రక్క నాలుగు వైపులఁజూచి వారు చూచిన రావణుతోఁ జెప్పుదురేమో యను భయముచే వారికిఁ దెలియకుండఁ దలలో ధరింప యోగ్యమైన యీ చూడామణిని చీరకొంగు ముడిఁలో నుండి తీసి నా యందలి ప్రేమచే నాచేత నుంచెను. అది తీసికొని యిఁకఁ బోయి వత్తునా యంటిని.

చ. అని నమితోత్తమాంగమున•నామె పదంబుల వ్రాలి లేవ న
య్యనఘయు నాదు వర్తనము•నంబుధి దాఁటఁగ నుత్సహించుటల్
గని కనుదోయి బాష్పములు•గ్రమ్మఁగ గద్గదకంఠయై ధరా
తనయ మదాస్యముం గనుచు•దైన్యము దోఁపఁగఁ బల్కె నీగతిన్. ౧౪౩౩

అర్థములు. నమిత+ఉత్తమాంగమునన్=వంపఁబడిన శిరస్సుచే, అనఘ=పాపమెట్టిదో యెఱుఁగనిది, గద్గదకంఠయై=డగ్గుత్తిక పడుచున్న కంఠము గలదై, మదాస్యమున్=నా ముఖమును,

తాత్పర్యము

ఇట్లు చెప్పి తల నామె పాదములపై వ్రాల్చి లేవఁగా నా పుణ్యాత్మురాలు నా ప్రయాణ సన్నాహము, సముద్రముదాఁట నుత్సహించుట చూచి రెండుకన్నుల నీళ్లుగాఱ, మాట తడబడ సీతాదేవి నా ముఖముఁజూచి శోకముతో నిట్లుపలికెను.

—♦ సీతాదేవి సందేశవాక్యములు హనుమంతుఁడు శ్రీరామునకుఁ దెలుపుట ♦—

క. హనుమా! కుశలం బడిగితి, ననుమా శ్రీరాము నతని♦యనుజు సుమిత్రా
తనయు సహామాత్యుని నిన, తనుజాతుని నందు నున్న♦తక్కినవారిన్. ౧౪౩౪

తాత్పర్యము చూ.ప. ౧౦౦౨

క. అన్నా! రాఘవుఁ డెట్టులు, నన్ను విపత్సాగరంబు♦నం జెడ కుండన్
జెన్నారఁ బ్రోచు నా గతి, మన్ననమెయిఁ బలుక వన్న♦మఱవకు మన్నా!

తాత్పర్యము చూ.ప. ౧౦౦౩

క. ఇన్నీచరాక్షసావళి, నన్ను భయము పఱచు విధము♦నానావ్యసనా
పన్నత నేఁ గుందెడి గతి, విన్నప మొనరింపు ప్రోవ♦వెలయుత శుభముల్.

తాత్పర్యము చూ. ప. ౧౦౦౪

క. ఈ విధి మీ యార్యామణి, భూవల్లభ! భృశవిషాద♦పూర్వంబుగ నీ
తావరవర్ణిని పలికెను, నీ వా సతి కుశల యనుచు♦నెఱినమ్ము మదిన్. ౧౪౩౭

అర్థములు. ఈ విధిన్=ఈప్రకారముగ, ఆర్యామణి = ఆర్యస్త్రీలయందు శ్రేష్ఠురాలగు సీతాదేవి, భృశవిషాదపూర్వంబుగ=అతిశయించిన దుఃఖముతో—వరవర్ణిని=ఉత్తమస్త్రీ "శీతే సుఖోష్ణసర్వాంగీ గ్రీష్మేతు సుఖశీతలా—భర్తృరక్తాచ యా నారీ సాతు స్యాద్వరవర్ణినీ"—రుద్రుఁడు. ఎవతె దేహము చలికాలము సుఖోష్ణముగను, ఎండకాలమందు సుఖశీతముగను నుండి భర్తయం దనురాగము గలదో యట్టి స్త్రీ వరవర్ణిని యనఁబడును. 'ఉత్తమా వరవర్ణినీ' యని యమరుఁడు.

తాత్పర్యము

ఈ విధముగ మీ యార్యామణియు, వరవర్ణిని యగు సీతాదేవి మిగుల విషాద పడుచుఁ జెప్పెను. ఆమె జీవించి యున్నదని నమ్ముము.

—♦ ౬౮-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవితోఁ దనకునైన సంభాషణముఁ దెలుపుట ♦—

క. నా పయి నీ స్నేహముచే, నీ పంపినవాఁడ ననెడి♦నెఱనమ్మికచే
భూపాలోత్తమ! జానకి, యాపోవని రక్తినిట్టు♦లనియెన్ నాతోన్. ౧౪౩౮

అర్థములు. ఆపోవని=తృప్తిలేని.

తాత్పర్యము

నాయందు నీకుఁగల స్నేహభావము చేతను నీవు పంపిన వాఁడనెడి నమ్మకము చేతను తృప్తిలేని యనురాగముతో నాతో నిట్టులనెను.

ఓయి! సీత శీలవతి యంటివే పరపురుషుఁడవైన నీతో నింత చనవుగ నెట్లు మాట్లాడెనందువా? ఆమె నాతో మాట్లాడుటకుఁ గారణము నా యోగ్యత కాదు నా యందు నీకు స్నేహభావము గలదనియు నీవు పంపిన దూతననియు నమ్మి నాతో నీ మాటలు చెప్పెను. నాయందు నీకుఁ బ్రేమలే దనియు ఏదో

కార్యార్థముగ వచ్చిన దూత యనియు తలంచి యుండెనా నాతో మాట్లాడి యుండదు. నాయందు నీకు ప్రేమయుండినను నీవు పంపిన దూత నని నమ్మకము లేకుండినను మాటలాడి యుండదు. ఈ రెంటికి నేను నిదర్శనములు చెప్పి చూపిన పిమ్మటనే నాతో మనసిచ్చి మాటలాడెను. రావణాసురునితో మాటలాడినపుడు తృణ మడ్డము వేసికొని వెనుకప్రక్క తిరిగి మాటలాడెనుగాని హనుమంతునితో సమ్ముఖమ్ముగనే మాటలాడెను. దీనివలన భర్త కాంతరంగిక స్నేహితులై భర్తచే బంపఁబడిన వారై లేని యట్టివారితోఁ బతివ్రతయు మాటలాడవచ్చును.

క. రావణు వధించి రాఘవ,భూవరుఁ డెటులో డుకొనుచుఁ•బోవునొ నన్నున్
నీ వాగతి నిట నాగతి, వావిరి వినిపింప వలయు•వాయుతనూజా! ౧౮౩౯

తాత్పర్యము. స్పష్టము. చూ.ప. ౯౨౦

క. నాపలుకు నీకు సమ్మత,మై పొనరినయేని శత్రు•హరణసమర్థా!
యీపూఁట నిలిచి మఱుఁగున, రేపటఁ బోరాదె శ్రమము•ప్రీలెడి నీకున్.

తాత్పర్యము. చూ.ప. ౯౨౧

క. ఓపావని! నీసన్నిధి,ప్రాపున ధృతిఁ గూరి యల్ప•భాగ్యను క్షణమేన్
నీపుణ్యంబున శోకము, తాపంబుఁ దొఱంగి బ్రదుకు•దానఁ గపీంద్రా! ౧౮౪౧

తాత్పర్యము. చూ.ప. ౯౨౨

ఉ. పోయెద వేని పొమ్ము రఘు•పుంగవుఁ జేరఁగ, నీవు గ్రమ్మఱన్
వాయుజ! వచ్చునందనుకఁ•బ్రాణము లుండునొ యుండవో చుమీ
యీయెడలందు సందియమ•యెంతయు వేఁగెడు నాకు నిన్నునున్
బాయుట గల్గ నేమి గని•ప్రాణము నిల్చునొ నీవ చెప్పుమా. ౧౮౪౨

తాత్పర్యము. చూ.ప. ౯౨౩

క. నీయందును నీకును దో,డై యరుదెంచిన కపీంద్రు•లందును నాకున్
బాయనిసందేహం బో,వాయుజ! నాకనుల్మోల•వర్తిలఁ దోడఁగెన్. ౧౮౪౩

తాత్పర్యము. చూ.ప. ౯౨౪

చ. హరినర! ఋక్షసైన్యములు•నాప్పపవర్యతనూజు లేని దు
స్తరజలరాశి దాఁట నెటు•చాలుదు రన్న! తలంచి చూడఁగా
గరుడుఁడు నీవు మారుతుఁడు—గాక మఱెవ్వరు భూతకోటిలో
వరజవ మొప్ప దాఁటఁ గల•వారలు గానఁగరారు మారుతీ! ౧౮౪౪

తాత్పర్యము. చూ.ప. ౯౨౫

క. కనుకోలఁది నసాధ్యం బౌ,పని యనుచుం దోఁచెఁ గార్య•పద్ధతులను నీ
కననియది లేదు దీనికి, హనుమా! నీ వనుమ విన స•మాధానంబున్. ౧౮౪౫

తాత్పర్యము. చూ.ప. ౯౨౬

క. నీ వొకఁడవె యీ కార్యము, పావని! సాధింప శక్తి•పరుఁడవు సుమ్మీ
నీ వొకఁడవె యీరీతి, చే వ్రిలసిల్లంగఁ గలవు•శిక్షితవైరీ! ౧౮౪౬

తాత్పర్యము. చూ.ప.౯౭౭

క. బలములతో నిచిటికి రఘు,కుల తిలకుఁడు వచ్చి కలనఁ గూల్చి దశాస్యున్
గెలుపొంది నన్ను దనపురి, కలవునఁ గొని చనినయేని•యశ మది గూర్చున్.

తాత్పర్యము. చూ.ప.౯౭౮

క. వనమున నే నుండఁగఁ దల,మునుకలు నగు తనదు భీతి•మ్రుచ్చిలి తెచ్చెన్
దనుజుఁడు నావిధమునఁ, గొనిపోవుట యర్హమా ర•ఘుగ్రామణికిన్?

తా త్ప ర్య ము

అడవిలో నేనుండఁగా తన ప్రాణభయమున మునిఁగి దొంగిలించి రాక్షసుఁడు నన్నుఁ దెచ్చెను. ఆ విధముగ దొంగతనముగ మరల నన్నుఁ దీసికొని పోవుట రఘువంశములోఁ బుట్టిన రాజులలో శ్రేష్ఠుఁడగు వానికిఁ దగినకార్యమా? అది తన శూరధర్మమునకు నా వీరపత్నీత్వమునకు హానికరము కాదా? కావున,

క. ప్రాకటశితనారాచా,నీకంబునఁ జలిపి లంక•నీఱుగఁ గడిమిన్
గైకొని నన్నేగినచోఁ, గాకుత్స్థున కదియె తగిన•కార్యము సుమ్మీ. ౧౮౪౯

తాత్పర్యము. చూ.ప. ౯౭౯

తే. పరమశూరుండు రాముండు•భండనమున, నతనిమగఁటిమి కనురూప•మైనదాని
యోజన యొనర్చి చెప్పుమా•యోజమీఱ,వనచరకులావతంస!నీ•వనుచుఁబలుక.

తాత్పర్యము. చూ. ౯౮౦

ఉ. దేవి! కపీంద్రభల్లుకత•తిప్రభువర్యుఁడు శౌర్యశాలి సు
గ్రీవుఁడు నీనిమిత్తము ప్ర•కృష్టబలంబులతోడఁ దోడ్పడం
గా వెస వచ్చు నాతనికిఁ•గై వస మై యసమానవిక్రముల్
దేవనిభుల్ మనోజవులు•దిగ్గగనాటులు శత్రుమర్దనుల్. ౧౮౫౧

తాత్పర్యము. చూ.ప. ౯౮౨

క. ఎంతగడుసుఁబని నైన ర,వంతయు వెత లేక సలుప•నగువారలు వి
క్రాంతిని సాబ్ధిధరావని, గంతున వలగొనెడివారు•గగనాధ్వగు లై. ౧౮౫౨

తాత్పర్యము. చూ.ప. ౯౮౩

క. నాకంటె గొప్పవారును, నాకున్ సరివారు గలరు•నగచరు లచటన్
నాకంటె హీనుఁ డగు కపి, క్ష్మాకన్యా! లేఁడు తీవ్ర•కరసుతునొద్దన్. ౧౮౫౩

తాత్పర్యము. చూ.ప. ౯౮౪

క. నేనే నినుఁ గాంచితి నఁట, యాని స్తులబలుల నేమి•యనవలయు నొకో
మానవపతి భూరిగుణా, హీనులఁ బంపండు పంపు•నితరుల మొదలన్ ౧౮౫౪

తాత్పర్యము చూ.ప. ౯౮౫

సీ. కావున నీవు శో♦కంబు మానుము దల్లి, దుఃఖకాలం బెల్లఁ♦దొలఁగి పోనె
నిదె పోయి నేఁ జెప్ప♦ముదితులై క్రోఁతులు,వచ్చెద రొకగంతు♦వైచి యిటకు
నాపీఁపుపై నెక్కి♦భూవిభుల్ శశిభాస్క,రులపోల్కి నీ్రమోల♦నిలుచువారు
ఇటవచ్చి యీలంక♦నెల్ల సాయకములఁ, దుత్తుమురుగఁ బోవఁ♦ద్రుంచువారు

ఆ. రామచంద్రవిభుఁడు♦ఁ ణరంగమం దిందు, సబలుఁ బంక్తికంఠు♦సంహరించి
నిన్నుఁ దోడుకొనుచు♦నెమ్మినయోధ్యకు, బోవువాఁడు పువ్వుఁ♦బోణిచూడు.

తాత్పర్యము. చూ. ప. ౯౮౬

క. కనెదవు నఖదంష్ట్రాయుధ, ఘనవిక్రమపరుల దేవి♦కపిసింహములన్
వినెదవు శైలాంబుదనిభ,వనచర గర్జలను లంక, వసుధాధ్రములన్. ౧౮౫౬

అర్థములు. నఖదంష్ట్రాయుధ=గోళ్ళు కోఱలు నాయుధములు గాఁ గల, ఘనవిక్రమపరులన్=గొప్ప పరాక్రమము గలవారిని-శైలాంబుద నిభ=పర్వతములతోను మేఘములతోను సమానులైన వనచర=వానరులయొక్క-గర్జలను= సింహనాదములను-వసుధాధ్రములన్=కొండలయందు.

తా త్ప ర్య ము

దేవీ! కోఱలు గోళ్ళు నాయుధములు గాఁ గల పరాక్రమ వంతుల వానరులను నీవే చూడఁగలవు. మఱి మేఘములవలెఁ బర్వతములవలె నుండు వారిసింహనాదములను లంకయందలి పర్వతములందు వినఁగలవు.

తే. కాననావాస సమయంబుఁ♦గడపి నిహత, వైరిరాముండు నీతోడ♦వనజనేత్ర!
యల యయోధ్యను వభిషేక♦మందఁగనెద,వనుచు నమ్మించి దుఃఖంబు నాపినాఁడ.

అర్థములు. కానన+ఆవాస సమయంబు=అడవులలో వసియించుకాలము-సమయము=శపథమనియుఁ జెప్ప వచ్చును. నిహతవైరి=చంపఁబడిన శత్రువులు గలవాఁడు.

తా త్ప ర్య ము

సంకేతప్రకారము వనవాసము గడపి విరోధులఁ జంపి నీతోడ నయోధ్యయందు పట్టాభిషిక్తుఁడగును. అది నీవే చూడఁగలవు. అని చెప్పి నమ్మించి దుఃఖపడకుండఁ జేసి వచ్చితిని.

తే. తతభవద్దుఃఖమునకును♦ధరణిగోత్ర, వార్థిచంద్రమ యట్లు తా♦బాధ పడుచు
శుభము నిష్టంబు నగు నాదు♦సూక్తిధృతినొ,సంగ శ్రీరామ వహించె♦శాంతిసీత.

అర్థములు. తత=విస్తారమైన, భవద్దుఃఖమునకు=నీకుఁగలిగిన కష్టమునకు వేళకాహారము, నిద్ర,సంతోషము లేకుండుటకు. అట్లు నేను ముందుచెప్పిన విధముగా, ఇట్లు చెప్పుటచే తాను సమీపమునుండి శుశ్రూష చేసి సుఖము గలిగింపకపోయిన కారణముచే నీ కిన్ని కష్టములు వచ్చెనేయని నీ దుఃఖమునకై యామె దుఃఖపడు

చున్నది. అని భావము. తరణి గోత్రవార్థి చంద్రమ=సూర్యవంశమను సముద్రమునకుఁ జంద్రునివంటి వాఁడా! సూక్తి=మంచిమాట-ధృతి=ధైర్యము.

## తాత్పర్యము

రామచంద్రదేవా! నీకు గలిగిన విస్తారదుఃఖమునకుఁ దాను బాధపడుచు శుభము ప్రియమునైన నా మంచిమాటలు విని మరల నీకు సేవచేసి సంతోష పెట్టఁగల నను ధైర్యముతో సీతాదేవి శాంతిగలదయ్యెను.

హనుమంతుఁడు రామచంద్రమూర్తికిఁ దాను బడిన కష్టములం దొకటియైనఁ జెప్పినవాఁడు కాఁడు. అట్లు తనవిషయమై చెప్పుట యాత్మశ్లాఘగా నుండును. రెండవది రామచంద్రమూర్తి ముందు తెలిసికొన వలసినది సీతా వృత్తాంతముగాని హనుమంతుని ప్రయాసములు గావు.

## ద్విపద

ఓమ్మని తత్తనియును సత్తటంచు, నిమ్మాఁడువిధముల నెసఁగుచునుండు.
బ్రహ్మనిర్దేశంబు;పరఁగెఁ దద్యుక్తి,బ్రాహ్మణుల్ శ్రుతులు నధ్వరములుపూర్వ
మట్టులు గాన నోమ్మని మున్ను పల్కి,పట్టుగ నాబ్రహ్మవాదుల విధులఁ
బలుకంబడిన తపంబు దానంబు, కలితయజ్ఞములెల్ల కాలంబు జరగు;
తత్తని ఫలకాంక్షఁ దవులక ముక్తి, హత్తఁగోరినవారు యజ్ఞముల్ తపము
వివిధ దానక్రియా విసరంబులెల్ల, నవనీశనందన! యాచరించెదరు. ద్వి. భ.గీ.

ఈ విధముగ శ్రుత్యర్థ రహస్యమును నీ మూఁడు పదములు బోధించుచున్నవి.

ఇంతవఱకు నీ వ్యాఖ్యానము పఠించినవారికి పూర్వకాండములందు జెప్పఁబడిన ప్రణవార్థమునకు ననుష్ఠాన మీ కాండమందు స్పష్టముగా గోచరించును. అదిగాక దానికి వివరణమగు నష్టాక్షరి మంత్రార్థమునకు నిం దన్వయము గలదు. ఈవ్యాఖ్యానము సూచించిన విధముగ మూలగ్రంథము సమన్వయించుకొనువారికి నీవిషయము సుబోధము. రెండవది యగు 'తత్'-అను దాని యర్థమున కన్వయము నీ కాండ బోధించుచున్నది. తరువాత రావణాసుర యని యీ కాండము తకారముతో ప్రారంభింపఁ బడి సీత యని తకారముతో సాంతము చేయఁబడెను. ఈ కడపటి పద్య మట్టిదే యై యున్నది. భగవద్గీతా వాక్యముల తత్తనుదానికిఁ జెప్పఁబడిన యర్థమునకు నిందు నన్వయము గాననగు. కావున నిది మోక్షకాములకు నవశ్య పఠనీయ మగుచున్నది. మూఁడవది యగు సత్తను దానిని మొదటి పద్యములో సీత యను పదము ఈ కడపటి పద్యమునందలి సీత యను పదము సూచించు చున్నది.

సత్పదార్థమును గీతావాక్యమే వివరించెను. దానికి నన్వయము సీతాచర్య యందుఁ గననగు. ఈ విధముగ ముముక్షువగువాని భావ మెట్లుండవలెనో చర్య

యెట్లుండవలెను. వాఁడు తెలిసికొనవలసిన విషయమేది? యను విషయము కాండము స్పష్టముగాఁ దెలుపుచున్నది. దానిని వ్యాఖ్యానమూలమునఁ దెలియ వచ్చును. మరలఁ గ్రోడీకరించుటకు గ్రంథవిస్తరభీతి బాధించుచున్నది.

ఈ విధముగ నీ కాండము ముముక్షువులకు బుభుక్షువులకు నిష్కాములకు సకాములకు స్త్రీలకుఁ బురుషులకు సేవ్యమై సార్థకనామము వహించుచున్నది. సీతారామానుగ్రహంబున నాంజనేయుఁడు సముద్రము దాఁటి రామకైంకర్యము గావించినట్లు శ్రీ సీతారామాంజనేయానుగ్రహంబున నీ వ్యాఖ్యాతయు నీకాండ మును బూర్వపుణ్యవశమున దాఁటఁగలిగెను.

## —♦ సుందరకాండాంతపద్యములు ♦—

క. యతిమానసబిసజాలయ! యతమాన జనార్థ నిర్వహణ సుసమర్థా!
నత సర్వభూతచయ! యింగితవిజ్జనవర్య! విబుధకీర్తితచర్యా! ౧౫౭౫

అర్థములు. యతిమానసబిసజ+ఆలయ=జితేంద్రియుల హృదయపద్మ మును స్థానముగాఁగలవాఁడు, జితేంద్రియులచేత ధ్యానింపఁబడువాఁడా! "యే నిర్జితేంద్రియ గ్రామా యతినో యతయశ్చతే" యని యమరుఁడు. యతమాన= ఒక్కకార్యార్థమై ప్రయత్నించు, జన=జనులయొక్క, అర్థ=కోరికను, ప్రయో జనమును, నిర్వహణ = నిర్వహించుటయందు, నెఱవేర్చుటయందు-సుసమర్థా= మిగుల సమర్థుఁడా, నత=నమస్కరించిన, సర్వభూతచయ=సమస్తప్రాణిసమూహ ములు గలవాఁడా, ఇంగితవిద్+జనవర్య=ఇంగితము నెఱుఁగువారిలో శ్రేష్ఠుఁడా, ఇంగితమనఁగా ముఖనయనాది బాహ్యవికారములచే భావము తెలుపుట. 'ఆకార స్త్వింగ ఇంగిత మ్మని యమరుఁడు. ఆకారశబ్దమునకు రెండర్థములు గలవు. ఆకృతి యని-ఇంగిత మనిఁ అభిప్రాయమును బ్రకటించుచేష్ట యింగితము. ఇది బుద్ధి పూర్వకమై యుండవలెను. అబుద్ధిపూర్వకములైన ముఖరాగాదులు వైవర్ణ్యాది శరీరవికారము. ఆకృతి-ఈ యుభయ విధచేష్టలు లేనివాఁడు కావున భగవం తుఁడు నిరాకారుఁడు. 'ఇంగితజ్ఞాశ్చ కోసలా' యని ప్రసిద్ధికదా. విబుధ=దేవతల చేతను, పండితుల చేతను, కీర్తిత=పొగడఁబడిన- చర్యా=నడవడి కలవాఁడా.

ఇట్లు చెప్పుటచే నీ గ్రంథకర్తయొక్క యభిప్రాయమును దెలిసికొని దాని నెఱవేఱ్చెసె నని భావము.

## —♦ పద్మనాభ వృత్తము ♦—

రామా! నతాంహోవిరామా! మునీంద్రాత్మారామా! దయాసత్యధామా! నిశాట
స్తోమావళీభీమసంగ్రామసీమా? విధూమత్రిధామాభ తేజస్సుధామా!
రామాంబుముగ్ధామ! నీలోత్పలశ్యామ! రాకేందుకామాభ సౌందర్యధామా!
సోమాదిముఖ్యామరారాధ్యనామా! విశుద్ధాత్మ భక్తావనోద్దామకామా! ౧౫౭౬

నతాంహస్+విరామా = నమస్కరించువారి పాపములు నశింపఁజేయువాఁడా; 'అంహో దురితమఘ్త'మ్మని యమరుఁడు విరామశబ్దము కరణార్థకఘఞన్తము. కర్తయే కరణముగా వివక్షితము. ఉతతమాదేశ మనెడి సద్విద్యాప్రకరణ శ్రుతిలోని యాదేశశబ్దము కరణార్థక ఘఞంతముగా శ్రుత ప్రకాశిక. మునీంద్రాత్మరామా = మునిశ్రేష్ఠుల యాత్మలయందుఁ గ్రీడించువాఁడా, దయాసత్యధామా=దయకు సత్యమునకు నునికి పట్టయిన వాఁడా; నిశాట స్తోమావళీ=రాక్షసుల గుంపుల వరుసలకు- భీమ=భయంకరమైన-సంగ్రామ సీమా=యుద్ధప్రదేశము గలవాఁడా; విధూమ=పొగలేని-చక్కఁగా మండెడి-త్రిధామాభ=అగ్నిహోత్రునితో సమానమైన-తేజస్=కాంతికి-సుధామా=మంచి గృహమైనవాఁడా; రామాంబుముక్=నల్లనిమేఘమువంటి-ధామా=కాంతిగలవాఁడా; ఆశ్రితార్థ ప్రదానార్థ మీ విశేషణము. 'బలే రామో నీల చారు సితే త్రిషు' అనియమరము. నీలోత్పలశ్యామ=నల్లకలువవలె చామని చాయ కలవాఁడా, ఇది యాకారవర్ణ ప్రతిపాదకము. రాకేందు కామాభ=పూర్ణచంద్రునితోను, మన్మథునితోను సమానమైన-సౌందర్య=చక్కఁదనమునకు-ధామా=స్థానమైనవాఁడా, సోమాదిముఖ్యా=స+ఉమ=సోమ=శివుఁడు మొదలగు ప్రముఖు లయిన-అమర=దేవతలచే, ఆరాధ్య=కొనియాడఁదగిన, నామా=పేరుగలవాఁడా!, విశుద్ధాత్మ=నిర్మలమనస్సుగల, భక్త=భక్తులను, అవన=రక్షించుటయందు, ఉద్దామకామా=అధికాపేక్షకలవాఁడా. రాగల యుద్ధకాండార్థ మిందు సూచితము. నతాంహో విరామా=సముద్ర గర్వభంగము, దయాసత్యధామా=శరణాగత విభీషణ రక్షణము, నిశాట.......సీమా=రాక్షసులతోడి యుద్ధము, రావణాది శత్రుమారణము, మృతవానర జీవనము, సీతాహృదయానందకరత్వము, బ్రహ్మరుద్రేంద్రాది స్తోత్రము, విభీషణ పట్టాభిషేకము సూచితము.

పద్మనాభవృత్తము-ఏడు తగణములు, గగము-పదుమూఁడింట యతి. ఈ వృత్తము గ్రంథకర్తకుఁ బ్రాణతుల్య మిత్రుఁడగు కొత్తపల్లె పద్మనాభశాస్త్రిల వారి పేర వారి జీవితకాలమందే వ్రాయఁబడినది. ఆయన మగణించి యిరువది సంవత్సరము లయినను ఎన్నఁడు కనఁబడినవాఁడు కాఁడు. దీని కర్థము వ్రాసిన రెండు దినముల కావల నాయన స్వప్నములోఁ గనబడుటచేనీ విషయము వ్రాయ వలసివచ్చెను. అటువంటి మిత్రుఁడు దుర్లభుఁడు. ఈ గ్రంథకర్తకుఁ గష్టకాలమం దనేక విధముల నాదరించెను. భగవంతుఁ డాయనకు శాశ్వతశాంతి యొసంగుఁ గాత.

—♦ అంబురుహవృత్తము ♦—

క్ష్మారమణీశరజాబ్జ భవానన♦సారసాహిత పద్యసం
వారసుశంసి నిజార్థి మహోద్భుత♦బాధధైర్య పరాక్రమా!

భూరిపయోనిధితారణ కారణ•భూతనిర్జరయానవ
చ్చారుతరాత్మ సమాఖ్యః నిజాశ్రిత•సర్వసౌఖ్య విధాయకా! ౧౪౬౧

అర్థములు. క్ష్మారమణీ=భూమి-ఇది యొకటికి సంజ్ఞ, శరజ=కుమారస్వామి యొక్కయు 'శరజన్మా షడానన'యని యమరుఁడు. అబ్జభవ=బ్రహ్మయొక్క-ఆనన=ముఖములు-కుమారస్వామికి నాఱుముఖములు, బ్రహ్మకు నాలుగు ముఖములు; సారసాహిత=చంద్రుఁడు-ఇది యొకటి సంజ్ఞ. ఇట్లు విలోమముగాఁ జూచిన 1461 యగును. వేయి నాలుగునూర్ల యఱువది యొకటి-ఈ సంఖ్యగల-పద్యసంవార=పద్యసమూహముచే, సుశంసి=బాగుగాఁ గొనియాడఁబడు, నిజార్థ=తన యాశ్రితులయొక్క, మహాద్భుత బాధ ధైర్య పరాక్రమ=మిక్కిలి యాశ్చర్యకరమైన, మిగుల ధైర్యముతోఁ గూడిన పరాక్రమము గలవాఁడా. ఇట్లు చెప్పుటచేఁ దన యాశ్రితుఁడైన హనుమంతుఁ డన్ని పద్యముల నిందుఁ గొనియాడఁ బడె నని భావము. భూరిపయోనిధి = గొప్పసముద్రమును, తారణ=దాఁటుటయందు, కారణభూత=సాధనమైనఁ భూరిపయోనిధి యనుటచేఁ దక్షిణ సముద్రములు సంసారసాగరము నంత పెద్దవి కావని భావము. నిర్జరయానవత్=దేవయానమైన విమానములవలె, చారుతర=మిగుల రమ్యమైన, ఆత్మసమాఖ్య=తనపేరు గలవాఁడా, రామనామోచ్చారణముచే సాగరజలము నంటకయే సుఖముగ విమానముమీఁదఁ బోయినట్లు, (హనుమంతుఁడు సముద్రము దాఁటినట్లు) సంసాగము సుఖముగ దాఁటవచ్చునని భావము.నిజాశ్రిత=తన్నాశ్రయించిన వారికి, సర్వసౌఖ్య విధాయకా=సమస్తసౌఖ్యములు గలిగించువాఁడా, ఇట్లనుటచే రామనామోచ్చారణముచే ముక్తు లగు వారికి భగవంతునితో సమానమైన సమస్త భోగములు కలుగునని భావము. "భోగమాత్ర సామ్యలింగాత్" అని బ్రహ్మసూత్రము చెప్పుచున్నది కదా. తారణ శబ్ద స్వారస్యముచేఁ దారక నామము వివక్షితము.

సీ. జానకీ రఘురామ•చరణ సేవాసక్త, చిత్తుఁడై తత్కృపా•సక్తి కతన
వామలూరూద్భవు•పాదముల్ దలఁదాల్చి, ప్రత్యక్ష బ్రహ్మాత్మ•భవున కెరఁగి
యభివాదనము సల్పి యాచార్యులకు నెల్ల, వ్యాఖాతలకును సాష్టాంగ మెరఁగి
పరమభక్తులును•బ్రపన్నులు ముద మొందస్వాంధ్రవాల్మీకి రా•రామాయణమున

గీ. ఘన మహార్థంబు సుందర కాండమునకు,వాసుదాసుండు రచియించి•వ్యాఖ్యదీని
మందర మనంగ శ్రీరామ•చంద్ర విభున,కర్పణముచేసె జన్మంబు•సార్థకముగ.

ఈ కాండమువలన నేర్చుకొనవలసిన విషయములు.

౧. జీవాత్మ పరమాత్మల సంబంధ మెట్టిది?

౨. జీవాత్మ తరణోపాయ మెట్టిది?

3. జీవాత్మలకు సేవ్యుఁడు నిర్విశిష్టారాముఁడా? సీతా విశిష్ట శ్రీరాముఁడా?

౪. శిష్యాచార్య లక్షణములు.

౫. ఆత్మావలోకన పరుఁడైన యోగి లక్షణము.

౬. బద్ధ జీవ తారతమ్యము.

౭. యోగికి భక్తప్రపన్నునకు భేదము.

— గద్యము —

ఇది శ్రీమద్రామచంద్రచరణారవింద మిళిందాయమాన
మానసత్వ మహావైభవాంధ్ర వాల్మీకి కవిసార్వభౌమాది బిరుదాంచిత
వావిలికొలను రామచంద్రరాయ తనూభవ సుజనవిధేయ
సుబ్బరాయ నామధేయప్రణీతం బైన మందరాఖ్య వ్యాఖ్యానసమేత
శ్రీమదాంధ్ర వాల్మీకిరామాయణ మను నిర్వచన
మహాకావ్యంబునందు సుందరకాండము.

శ్రీ రా మా ర్ప ణ మ స్తు.

శ్రీ శ్రీ శ్రీ

శ్లో॥ నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీకభవాయ తస్మై.

కం. మంతనములు సద్గతులకుఁ

బొంతనములు ఘనము లైన•పుణ్యముల కిదా

నీంతనపూర్వమహా•ఘని

కృంతనములు రామనామ•కృతిచింతనముల్,

భాగవతము.